# ఆధునిక భారతదేశం

1885-1947

సుమిత్ సర్కార్



ప్రజాశక్తి బుక్‌హౌస్

# ఆధునిక భారతదేశం

సుమిత్ సర్కార్

ప్రజాశక్తి బుక్‌హౌస్

*ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర*

*హైదరాబాద్-20. ఫోన్ : 27660013*

తెలుగు : కె. కేశవరెడ్డి


ప్రచురణ సంఖ్య : 1107

ప్రథమ ముద్రణ : నవంబర్, 2009

వెల : రు. 150/-

ప్రతులకు

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27608107

బ్రాంచీలు

హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,

హన్మకొండ, నల్గొండ, గుంటూరు

ముద్రణ

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

# విషయసూచిక


ముందుమాట 9

## అధ్యాయం 1

## ఉపోద్ఘాతం

మార్పు - అవిచ్ఛిన్నత 11

పాత, కొత్త ధోరణులు 14

## అధ్యాయం 2

## రాజకీయ ఆర్థిక నిర్మాణం 1885 - 1905

సామ్రాజ్యవాద నిర్మాణం - విధానాలు 21

- వైస్రాయిల ధోరణులు 22
- సైన్యం 23
- ఆర్థిక పాలనాపరమైన ఒత్తిడులు 24
- స్థానిక స్వపరిపాలన - చట్ట సభల సంస్కరణ 26
- విభజించి పాలించు 27
- శ్వేత జాత్యహంకారం 28

వలసవాద ఆర్థిక విధానం 30

- సంపద తరలింపు 31
- పారిశ్రామిక విచ్ఛిన్నత 34
- వ్యవసాయ పారిశ్రామికీకరణ 35
- భూ సంబంధాలు 37
- వ్యవసాయ ఉత్పత్తి 40
- విదేశీ పెట్టుబడి 41
- భారతీయ పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి 42

## అధ్యాయం 3

## సామాజిక రాజకీయఉద్యమాలు1885-1905


'దిగువ స్థాయి నుండి చరిత్ర' వైపు 45
- తెగల ఉద్యమాలు 46
- ఫడ్కే 49
- మోప్లాలు 50
- దక్కన్ దొమ్మీలు 51
- పాచ్నా 52
- శిస్తు పన్నుల వ్యతిరేక ఉద్యమాలు 53
- కులపరమైన చైతన్యం 54
- మతపరమైన చైతన్యం 58
- శ్రామికులు 59
- వ్యాపార గ్రూపులు, ఉన్నత వర్గాలు 61
- రాజాలు - జమిందారులు 62

మధ్యతరగతి చైతన్యం - రాజకీయాలు 63
- మేధావి వర్గం యొక్క సామాజిక మూలాలు 63
- హిందూ సంస్కరణ, పునరుద్ధరణ 67
- భారతీయ ఇస్లాంలోని ధోరణులు 72
- సాహిత్యంలో దేశభక్తి 77
- జాతీయ వాద ఆర్థిక సిద్ధాంతం 79
- కాంగ్రెస్ పునాదులు 81
- మితవాద కాంగ్రెస్ : లక్ష్యాలు, పద్ధతులు 82
- మితవాద రాజకీయాల దశలు 84
- తీవ్రవాద మూలాలు 86


## అధ్యాయం 4

## రాజకీయ సాంఘిక ఉద్యమాలు 1905 -1917


వైస్రాయిగా కర్జన్ 91
- విదేశాంగ విధానం 91
- పరిపాలనా సంస్కరణలు 92
- కర్జన్ - జాతీయవాదులు 94
- బెంగాల్ విభజన 95

బెంగాలులో స్వదేశీ ఉద్యమం : 1905 -1908 100

విభిన్న ధోరణులు 100
బహిష్కరణ, స్వదేశీ 103
జాతీయ విద్య 104
కార్మికుల ఆందోళన 105
సమితులు 106
హిందూ ముస్లిం సంబంధాలు 107
టెర్రరిజం వైపు మొగ్గు 109
ఇతర రాష్ట్రాలలో అతివాదం : 1905 - 1908 110
పంజాబ్ 111
మద్రాసు 114
మహారాష్ట్ర 115
కాంగ్రెస్ చీలిక 118
అణచివేత, సమాధానపరచడం, విభజించి పాలించడం : 1909-1914 120
సిమ్లా ప్రాతినిధ్యం - ముస్లిం లీగ్ 122
రివల్యూషనరీ టెర్రరిజం 125
యుద్ధం - భారతదేశ రాజకీయాలు 127
విప్లవ కార్యక్రమాలు 128
లక్నోలో ఐక్యత 130
హోంరూల్ ఆందోళన 131
దిగువ నుండి ఉద్యమాలు (1905-1917) 133
తెగల తిరుగుబాట్లు 133
రైతు ఉద్యమాలు 134
మతవాదం 136
కుల ఉద్యమాలు 137
ప్రాంతీయ భావాలు, భాషలు 140

అధ్యాయం - 5

## ప్రజా జాతీయవాదం : ఆవిర్భావం, సమస్యలు 1917-1927

యుద్ధం, సంస్కరణలు, సమీకరణ 143
మాంట్‌ఫర్డ్ సంస్కరణలు 143
యుద్ధం ప్రభావం 146
మహాత్మాగాంధీ 153
పుకార్లు నిర్వహించిన పాత్ర 155
చంపారన్, ఖేదా అహ్మదాబాద్ 157
రౌలత్ సత్యాగ్రహం 160

**1919 -20** నాయకులు - ప్రజలు **167**
గాంధీ - ఖిలాఫత్ - కాంగ్రెస్ **167**
క్రింది నుండి ఒత్తిడులు **169**
కిసాన్‌సభ డిమాండ్లు మితవాద స్వభావం గలవి **173**
**1921 -22** సహాయ నిరాకరణ - ఖిలాఫత్ **173**
అఖిల భారత ఉద్యమం **174**
సామాజిక పొందిక **175**
ప్రాంతీయ వ్యత్యాసాలు **178**
చౌరీ-చౌరా **191**
**1922 -27 :** పతనం, చీలికలు **193**
మార్పులు కోరనివారు - స్వరాజ్యవాదులు **193**
నాగపూర్, బోర్సాద్, వైకాం **194**
నిర్మాణాత్మక పనులు **196**
స్వరాజ్యవాదుల రాజకీయాలు **197**
మతవాదం **199**
నూతన శక్తుల ఆవిర్భావం **1922 -27** **202**
రాజకీయ ఆర్థిక ఉద్రిక్తతలు **202**
తెగల ప్రజల, రైతాంగ ఉద్యమాలు **204**
కుల ఉద్యమాలు **206**
శ్రామికులు **208**
కమ్యూనిస్టుల ఆవిర్భావం **211**
రివల్యూషనరీ టెర్రరిజం **214**
సుభాస్, జవహర్‌లాల్ **216**

## అధ్యాయం - 6
## జాతీయవాద పురోగతి - ఆర్థికమాంద్యం 1927-37

రాజకీయాలలో అంతర్వాహినులు **217**
ఆర్థికమాంద్యం -భారతదేశం **220**
**1928-29** సైమన్ కమిషన్ బహిష్కరణ -కార్మిక వెల్లువ **223**
సైమన్ కమిషన్ - నెహ్రూ రిపోర్టు **223**
యువజన ప్రదర్శనలు **227**
హిందూస్తాన్ రివల్యూషనరీ ఆర్మీ **228**
శ్రామిక వెల్లువ కమ్యూనిస్టులు. **229**
రైతు ఉద్యమాలు -బార్డోలి **234**
వాణిజ్య వర్గాల వైఖరులు **237**
అధినివేశ ప్రతిపత్తి నుండి పూర్ణ స్వరాజ్యం వరకు **239**
**1930 - 31** శాసనోల్లంఘనం **241**

ఉప్పు సత్యాగ్రహం దిశగా 241
చిట్టగాంగ్, పెషావర్, షోలాపూర్ 244
శాసనోల్లంఘన దశలు 246
ప్రాంతీయ అధ్యయనాలు 251
రౌండు టేబులు సమావేశం 260
గాంధీ - ఇర్విన్ ఒడంబడిక 262
మార్చి - డిసెంబర్ 1931 : పొసగని తాత్కాలిక సంధి 263
క్రింది నుండి ఒత్తిళ్ళు 266
అధికారుల వైఖరులు 269
1932-34 రెండవ శాసనోల్లంఘనోద్యమం అణచివేత - ప్రతిఘటన 271
వ్యాపార వర్గాల పునస్సమీకరణలు 275
హరిజన ప్రచారం 277
తిరిగి కౌన్సిల్ రాజకీయాలకు 279
వామపక్ష ప్రత్యామ్నాయం 280
1935 - 37 రాజ్యాంగం - కాంగ్రెస్ 285
1935 చట్టం 285
శ్రామికులు - కిసాన్ ఉద్యమాలు 287
వామపక్ష సాహిత్యం 289
లక్నో -ఫైజ్‌పూర్ 290
బలపడిన మితవాదం - వాణిజ్యవర్గాల ఒత్తిడులు 291

## అధ్యాయం - 7

## రాజకీయ ఉద్యమాలు 1937-1945 యుద్ధం

1937-39 కాంగ్రెస్ మంత్రి వర్గాలు 295
ఎన్నికలు - మంత్రి వర్గ నిర్మాణం 295
కాంగ్రెస్ ఉద్యోగిస్వామ్యం 297
మతవాద సమస్య 298
గాంధేయ సంస్కరణలు 302
పెట్టుబడిదారులు - కాంగ్రెస్ 303
కాంగ్రెస్ - కార్మికులు 305
కాంగ్రెసు -రైతులు 306
స్వదేశీ సంస్థానాల ప్రజా ఉద్యమం 309
కాంగ్రెస్‌లో వామపక్షం 313
త్రిపురి సంక్షోభం 315
1939-42 యుద్ధం -భారత రాజకీయాలు 317
మొదటిదశ 317
లీగ్ పాకిస్తాన్ 319

కాంగ్రెసులో ధోరణులు 321
ఆర్థిక పరిణామాలు 323
యుద్ధం యొక్క నూతన దశ 324
క్రిప్సు రాయబారం 325
**1942-1945** క్విట్ ఇండియా - కరువు 325
యుద్ధం చివరి దశ 325
తిరుగుబాటు మూలాలు 325
అఖిల భారత నమూనా 329
సామాజిక పొందిక 331
ప్రాంతీయ వ్యత్యాసాలు 333
తిరుగుబాటు తరువాత 336
యుద్ధం భారతదేశ ఆర్థిక వ్యవస్థ 337
కరువు, అమిత లాభాలు 337
లీగు పురోగతి 340
అజాద్ హింద్ 341
కమ్యూనిస్టులు, ప్రజాయుద్ధం 342

## అధ్యాయం - 8

## స్వాతంత్ర్యం - విభజన 1945 - 1947

**1945-46** 'అగ్నిపర్వత శిఖరం' 346
చర్చలకు పూర్వరంగం : 346
సిమ్లా సదస్సు 347
భారత జాతీయ సైన్యం - విచారణ 349
రాయల్ ఇండియన్ నేవీ (RIN) తిరుగుబాటు 353
**1946** (మార్చి - ఆగస్టు) మంత్రి వర్గరాయబారం 355
ఎన్నికలు 355
మంత్రి వర్గ రాయబార సంఘం 357
**1946-47** మతమారణ కాండ ; రైతాంగ తిరుగుబాటు 360
కలకత్తా, నౌఖాలీ బీహారు, పంజాబ్ : 360
మహాత్ముని మహోన్నత ఘడియలు 364
తెభాగ 366
పున్నప్ర వాయలార్ 367
తెలంగాణా 368
**1947** స్వతంత్రం- విభజన 371
మౌంట్‌బాటన్ పథకం 372
స్వదేశీ సంస్థానాల విలీనం 374
ఆగస్టు 15 376

# ముందుమాట

ప్రొఫెసర్ సుమిత్ సర్కార్ రచించిన ఈ 'ఆధునిక భారతదేశం 1885–1947' ప్రామాణిక భారత చరిత్ర గ్రంథాలలో ఒకటి. సాధారణంగా ఆధునిక భారతం మొఘల్ సామ్రాజ్య పతనంతోను, ప్లాసీ యుద్ధంతోను మొదలయిందని భావిస్తారు. కాని సుమిత్ సర్కార్ తన 'ఆధునిక భారతం' ఆరంభానికి 1885ను తీసుకోవడంలో ఒక కారణం ఉంది. ఆధునిక భారతం 19వ శతాబ్దం ద్వితీయార్ధం నుండి మొదలయిందని ఈయన భావిస్తారు. అప్పటికి బ్రిటిష్ వలసపాలన ఒక స్థిరమైన రూపాన్ని సంతరించుకుంది. అదే సమయంలో దానికి ప్రతిగా దేశంలో అనేక చోట్ల స్వతంత్ర ప్రజాఉద్యమాలు మొదలయ్యాయి, అలాగే మధ్యతరగతి వర్గం, లేదా మేధావి వర్గం కూడ ఒకటి తయారయి భారతదేశవ్యాపితంగా జాతీయ భావన తలెత్తడానికి కారణమయింది. సుమిత్ సర్కార్ తన రచనలో ఈ రెండు విరుద్ధ శక్తుల మధ్య సంఘర్షణ ఎలా కొనసాగి తీవ్రమయిందీ వివరించారు. చివరకు అది భారత స్వాతంత్ర సముపార్జనకు ఎలా దారితీసిందీ స్పష్టం చేశారు.

భారత చరిత్ర గురించి చాలమంది చాల రకాలుగా రాశారు. అత్యధికులు ఈ చరిత్రను సంపన్న వర్గాలు, వారి ప్రాబల్యాలు, వారి మధ్య సంఘర్షణలు– ఇలా వారి చుట్టూనే తిప్పారు. కాని అసలు చరిత్ర నిర్మాతలయిన ప్రజల పాత్రను వివరించిన వారు అరుదు. అలాంటి అరుదైన చరిత్ర రచయితల్లో సుమిత్ సర్కార్ ఒకరు. ఆయన ఈ చరిత్రను సామ్రాజ్యవాద వ్యతిరేకతను కేంద్రంగా చేసుకొని రచించారు. ఈ గ్రంథం విశిష్టత అదొక్కటే కాదు. ఆయన తాను ఈ పుస్తకరచన చేపట్టిన నాటికి ఉన్న అన్ని పరిశోధనా ఫలితాలను, లోతైన తన పరిశోధనలను జోడించి ఒక చక్కటి పాఠ్యగ్రంథం రూపంలో దీనిని మలిచారు. అందుచేతనే ఈ గ్రంథం ఆంగ్లంలో తొలుత ప్రచురించి రెండున్నర దశాబ్దాలు గడిచినప్పటికీ ఇప్పటికీ ఏ మాత్రం ప్రాధాన్యత కోల్పోలేదు. పలువురు ప్రచురణ కర్తలు పదే పదే పునర్ముద్రణలు తెస్తూనే ఉన్నారు. అలాంటి విశిష్ట గ్రంథాన్ని ఇప్పుడు మేము మొట్టమొదటిసారి తెలుగులో అందిస్తున్నాము.

సివిల్స్, ఇతర పోటీపరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు, చరిత్రను సరైన రీతిలో అవగాహన చేసుకోవాలని కోరుకునే జిజ్ఞాసపరులకు ఇది ఎంతో ఉపయోగపడే గ్రంథం. తెలుగుపాఠకులు ఎంతగానో  ఎదురు చూస్తున్న ఈ ప్రచురణను ఆదరించి, సద్వినియోగం చేసుకోగలరని ఆశిస్తున్నాము.

**హైదరాబాదు,**

**13-11-009**

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

**హైదరాబాదు.**

# అధ్యాయం 1

# ఉపోద్ఘాతం

## మార్పు - అవిచ్ఛిన్నత

1885లో భారత జాతీయ కాంగ్రెస్ స్థాపనకు 1947 ఆగస్టులో స్వతంత్ర సాధనకు మధ్య 60 సంవత్సరాలకు పైగా కాలం మన దేశ సుదీర్ఘ చరిత్రలో అత్యంత పెద్ద మార్పుని తెచ్చిన కాలం. కాని ఈ మార్పు పలు విధాలుగా అసంపూర్తిగా మిగిలిపోయింది. ఈ అసంపూర్తిని కేంద్ర బిందువుగా చేసుకొని మన అధ్యయనాన్ని ప్రారంభించడం సముచితంగా ఉంటుంది.

దేశం కరువు కాటకాల్లో చిక్కుకొన్నప్పుడు అట్టహాసంగా ఏర్పాటు చేయబడిన దర్బారులో సార్వభౌమాధికారం ప్రకటించిన 8 సంవత్సరాల తరువాత అంటే 1885లో బ్రిటిష్‌వారు భారతదేశంలో స్థిరంగా వుండిపోతామన్న భ్రమలలో వున్నారు. ధర్మకర్తృత్వ చర్చతో కలగలిపిన పితృస్వామ్య సిద్ధాంతం, స్వయం పరిపాలనకు శిక్షణలాంటివి శ్వేత నిరంకుశాధికార రాజ్యం యొక్క వాస్తవాలపై ముసుగుని కప్పాయి. రాజకీయ నిర్ణయాలు చేయడం, పై స్థాయిలో పరిపాలనా నిర్వహణ యూరోపియన్ల ప్రత్యేక హక్కులుగా ఉన్నాయి. 1880 దశాబ్దపు ప్రారంభ సంవత్సరాలలో 900కి పైగా వున్న ఇండియన్ సివిల్ సర్వీస్ ఉద్యోగులలో కేవలం 16 మంది మాత్రమే భారతీయులు. 1861లో ప్రొవెన్షియల్, సుప్రీం కౌన్సిళ్ళకు వేళ్ళ మీద లెక్కించదగినంత కొద్దిమంది భారతీయులు నామినేట్ చేయబడ్డారు. కాని వెంటనే కౌన్సిళ్ళ అధికారాలు తగ్గించబడ్డాయి. రిప్పన్ చే అట్టహాసంగా ప్రారంభించబడిన స్థానిక స్వయంపరిపాలన కూడా ఆర్థిక వికేంద్రీకరణకు అవసరమైన చర్య తప్ప మరేంకాదు. 'బెంగాలీబాబుకి తన పాఠశాలల్ని మురుగు కాలువల్ని గురించి చర్చించడానికి అవకాశం కల్పించి మేము బ్రిటిష్ సామ్రాజ్యానికి నష్టం కలిగించం' – ఆర్థిక సభ్యుడైన ఎవెలెన్ బేరింగ్

వ్యాఖ్య. కీలకమైన అంశాలలో భారతీయులకు ఎలాంటి ప్రాధాన్యత లేదు. పూచిక పుల్లలా తోసిపుచ్చారు. 1947 వరకు కూడా భారతీయ సైనికుడు బ్రిగేడియర్ స్థాయిని మించి ఎదగడానికి అవకాశం కల్పించబడలేదు.

ఇంత పెద్ద దేశం పాలనా వ్యవహారాల నిర్వహణకు అనివార్యంగా భారతీయ సహాయకులు అవసరమయ్యారు. తమ మీద ఆధారపడే సహాయకులు సులభంగా దొరకడం బ్రిటిష్‌వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. 1857 తరువాత బ్రిటిష్‌వారి స్వదేశీరాజులతో జమిందారులతో, పలురకాల పట్టణ గ్రామీణ ప్రముఖులతో సంబంధాల్ని పునరుద్ధరించుకున్నారు. ఫలితంగా ప్రత్యేకించి మొత్తం 662 మంది స్వదేశీ సంస్థానాధీశులు చివరి వరకు బ్రిటిష్ వారి కొరకు పెట్టని కోట బురుజులుగా అత్యంత విధేయతతో పనిచేశారు. రక్తంలో రంగులో భారతీయులు బ్రిటిష్‌వారికి సన్నిహితంగా వుంటే విద్యావంతులైన భారతీయుల్ని గురించి మెకాలే కన్న కల 1880 నాటికి చెదరడం మొదలయింది. మధ్యతరగతి ఆకాంక్షల మేరకు కలకత్తా బొంబాయి, పూనా, మద్రాసులలో ఏర్పడిన ప్రాంతీయ సంఘాలు కాంగ్రెస్‌గా రూపుదిద్దుకొనబోతున్నాయి. మరొక తిరుగుబాటుని నివారించేందుకు కాంగ్రెస్‌ని రక్షక కవాటంగా ఉపయోగపెట్టుకొనవచ్చునని హ్యూం అభిప్రాయపడ్డాడు. చాలా కలవరపాటుతో హ్యూం చేసిన ప్రతిపాదనని డఫరిక్ త్రోసిపుచ్చాడు. 'అతడు 'హ్యూం) తెలివైనవాడు. పెద్దమనిషి. కాని కొంత మనోవైకల్యానికి గురయినట్లుంది' – డఫరిక్ వ్యాఖ్య.

అతి సూక్ష్మమైన మైనారిటీకి మాత్రమే కాంగ్రెస్ ప్రాతినిధ్యం వహిస్తున్నది – అని వైస్రాయి 1888లో ప్రకటించాడు. సర్ ఖాన్ స్ట్రాచీ కేంబ్రిడ్జి విద్యార్థులకు యిలా హామీ యిచ్చాడు : ఇప్పుడు లేదు. గతంలోనూ భారతదేశం లేదు. భారత జాతి లేదు. భారత ప్రజలు లేరు. మనం యింతగా వింటూ వున్న పంజాబ్ ప్రజలు, బెంగాల్ ప్రజలు, వాయువ్య ప్రాంత ప్రజలు, మద్రాసు ప్రజలు – ఒక గొప్ప భారత జాతి ప్రజలుగా భావించడం అసాధ్యం' (భారతదేశం, లండన్ 1888).

ప్రచారాంశాలకు అనుకూల ఆలోచనలకు అంత విలువ వుండదు. కాని 1880 దశాబ్దంలో అలాంటి అంచనాలు పూర్తి అవాస్తవాలుగా కనిపించవు. అప్పటికి అఖిల భారత సంబంధాలు కేవలం ఇంగ్లీషు చదువులు చదివిన వృత్తిపరమైన గ్రూపులకే పరిమితమయ్యాయి. ప్రశాంతంగా జరిగే వార్షిక సదస్సులో పెద్ద మనుషుల తీర్మానాలుగా ప్రవేశపెట్టబడే కాంగ్రెస్ డిమాండ్లకు లక్షలాది రైతుల నుండి ఎలాంటి స్పందన లేదు. ప్రభుత్వానికి కాంగ్రెస్ విధేయత ప్రకటిస్తూనే వుంది. స్వతంత్ర పెట్టుబడిదారీ అభివృద్ధి దృక్పథానికి స్పష్టమైన రూపురేఖలు ఏర్పడినప్పటికీ, ఆవిర్భవిస్తున్న బూర్జువాల స్పందన అతి తక్కువ. 19వ శతాబ్దాంతానికి ప్రపంచంలో అతి పేద దేశాలలో ఒకటిగా వున్న దేశంలో క్రింది తరగతి అసంతృప్తి అంటువ్యాధిలా వ్యాపించింది. 1885కి దాదాపు 10 సంవత్సరాల ముందు తూర్పు బెంగాలులో

జమిందారీ దోపిడీకి వ్యతిరేకంగా రైతు సంఘాలు ఏర్పడ్డాయి. మహారాష్ట్ర దక్కన్‌లో వడ్డీ వ్యాపారులకు వ్యతిరేకంగా దాడులు జరిగాయి. ఆంధ్రలోని రంప ప్రాంతంలో గిరిజన తెగల తిరుగుబాటు జరిగింది. కాని అలాంటి ఉద్యమాల వాడి మొన ఎక్కడో వున్న బ్రిటిష్ చక్రవర్తిపై గాక తక్షణ దోపిడీదారునిపై గురిపెట్టబడింది. 1873లో పాబ్నా రైతులు వారు విక్టోరియా మహారాణి రైతులుగా వుండాలని కోరుకున్నారు. ఇక్కడ వర్గ ఉద్రిక్తతలతో కలగలిసిన మత ఘర్షణలతో విభజించి పాలించే పద్ధతులకు కావలసినంతగా పునాదులు ఏర్పడ్డాయి. తూర్పుబెంగాలులో హిందూ జమిందారులు, ముస్లిం రైతులు, మలబారులు మోప్లా ముస్లిం వ్యవసాయదారులు, నంబూద్రి లేక నాయుడు భూస్వాములు, యుపిలోని చాలా ప్రాంతాలలో ముస్లిం తాలూకాదార్లు, హిందూ కౌలుదారులు, పంజాబులో హిందూ వడ్డీ వ్యాపారులు, సిక్కు రైతులు.

జాతీయోద్యమం తొలినాటి కులీన మేధావుల పరిమితుల్ని అధిగమించింది. 1936 నాటికి కాంగ్రెస్ సాధారణ ప్రజలకు చెందిన పెద్ద సంస్థ అయింది. దానిలో గ్రామాలకు చెందిన సాధారణ ప్రజలు, లక్షలాది రైతులు వ్యవసాయదారులు, పారిశ్రామిక కార్మికులు సభ్యులయ్యారు. ఉద్యమం సామాజికంగా భౌగోళికంగా ఎగుడు దిగుళ్ళతో అభివృద్ధి చెందింది. ఉద్యమం ఉచ్ఛ స్థితికి చేరుకున్న కాలవ్యవధులు 1905–1908, 1912–1922, 1928–34, 1942, 1945–46. అతివాద దశలో బెంగాల్, మహారాష్ట్ర, పంజాబ్ ఉద్యమ కేంద్రాలుగా వున్నాయి. గాంధేయ దశలో కొత్త ప్రాంతాలైన గుజరాత్, బీహార్, యు.పి., ఆంధ్రులకు విస్తరించింది. నగర మేధావుల నుండి చిన్న పట్టణాల దిగువ మధ్యతరగతులకు, రైతులలోని విస్తృత సెక్షన్లలోకి, పలుకుబడి గల బూర్జువా గ్రూపులలోకి విస్తరించింది. స్వదేశీ, బహిష్కరణ, సహాయ నిరాకరణ, గాంధేయ సత్యాగ్రహం, గ్రామీణ నిర్మాణాత్మక పని – అలాగే ఆ నాయకుల ఆగ్రహానికి గురైనవి అయినప్పటికి కొన్ని సందర్భాలలో గణనీయమైన ప్రాధాన్యత గలవి అయిన రివల్యూషనరీ టెర్రరిజం, సమ్మెలు, పట్టణ అలజడులు, రైతాంగ తెగల హింసాయుత ఘటనలులాంటి కొత్త రూపాలు ఆవిర్భవించాయి. 1930ల నాటికి కిసాన్ సభలు కార్మిక సంఘాలు బలమైన శక్తిగా అభివృద్ధి చెందాయి. చాలా స్వదేశీ సంస్థానాలలో కూడా ప్రజా ఉద్యమాలు ఆవిర్భవించాయి. దిగజారుళ్ళు, పరిమితులు, వైరుధ్యాలు ఎన్ని ఉన్నప్పటికి వీటి తాత్పర్యమేమిటంటే వెనక్కి మరల్చడానికి వీలుపడని చారిత్రక వాస్తవంగా చురుకైన రాజకీయ జీవితంలోకి సాధారణ ప్రజలు ప్రవేశించారు. బ్రిటిష్ ప్రధానమంత్రి ఆ అత్యున్నత పదవి చేపట్టడానికి వచ్చింది సామ్రాజ్యవాదాన్ని రద్దు చేయడానికి కాదని ప్రకటించి 5 సంవత్సరాలు గడిచీ గడవకముందే మారిన అంతర్జాతీయ పరిస్థితులు, ప్రజల ఒత్తిడి బ్రిటిష్‌వారిని 1947లో దేశం వదిలి వెళ్ళిపోయేలా చేశాయి. ఆ వెనువెంటనే స్వదేశీ సంస్థానాల రద్దు, జమిందారీ విధానం రద్దు, ఉపఖండంలోని పెద్ద ప్రాంతంలో సార్వత్రిక ఓటింగ్ పద్ధతిపై పార్లమెంటరీ ప్రజాస్వామ్య స్థాపన వడివడిగా జరిగిపోయాయి. గణనీయమైన సామాజిక మార్పులు కూడా

జరిగాయి. సంపన్న రైతు గ్రూపుల ఆవిర్భావం, సాంప్రదాయ పెట్టుబడిదారీ అభివృద్ధి స్థాయితో పోల్చినప్పుడు బలహీనంగా ఊగిసలాటలో వున్నప్పటికీ, అత్యధిక మూడవ ప్రపంచ దేశాలతో పోల్చినప్పుడు గణనీయమైన బలం, పరిపక్వత సాధించిన బూర్జువాల ఏకీకరణ జరిగాయి.

కాని ఈ క్రమంలో మార్పుతో పాటు ఎన్నో వైరుధ్యాలు, అవిచ్ఛిన్నతలు చోటు చేసుకున్నాయి. కాంగ్రెస్ రాజ్యంతో పోరాడింది. అదే క్రమంలో రాజ్యమవుతూ వచ్చింది. పెద్ద మార్పులు లేకుండా మొత్తం నిరంకుశ ఉద్యోగి వర్గాన్ని, సైనిక చట్రాన్ని, దివి నుండి భువికి దిగివచ్చిన సివిల్ సర్వీసుని – మొత్తాన్ని తెల్లవారికి బదులుగా నల్లవారిని నియమించి స్వీకరించింది. స్వతంత్ర్యం సాధించిన రోజే ఎన్నో వైరుధ్యాలు, ఒకవైపు ప్రజల ఆనందోత్సవాలు, సామ్రాజ్యం డాబు దర్పంతో ప్రధానమంత్రి ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మౌంట్‌బాటెన్, వేరొకవైపు పంపించడానికి తన వద్ద సందేశాలేమీ లేవని తేల్చి చెప్పిన జాతిపిత, తన జీవితంలోని చివరి నెలల్లో మతహింసకు వ్యతిరేకంగా నిరాశా నిస్పృహలతో సాగిస్తున్న ఒంటరి పోరాటం. జాతీయోద్యమ లక్ష్యాల దృష్టి కోణం నుండి చూస్తే మత ఘర్షణలు, విభజన – స్పష్టమైన వైఫల్యాలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. అంతకంటే ముఖ్యమైన వాస్తవాలు : జాతీయ పోరాట కాలంలో రేకెత్తించిన ఆశలు, ఆకాంక్షలు, రైతు తనదైన రామరాజ్యంలో ప్రవేశించాలన్న గాంధీ కల, అలాగే వామపక్షవాదుల సామాజిక విప్లవం – నెరవేరకుండా మిగిలిపోయాయి. అలాగే స్వతంత్ర భారతదేశ చరిత్ర, పాకిస్తాన్ (బంగ్లాదేశ్) చరిత్ర చాలా స్పష్టంగా వ్యక్తం చేసిన విధంగా 1947 అధికార మార్పిడితో పూర్తి బూర్జువా సమాజంగా మార్పు, పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి – సమస్యలు పూర్తిగా పరిష్కరింపబడలేదు.

కాబట్టి మన ప్రధానమైన పరిశీలన, వైవిధ్యభరితమైన ఈ తరహా యొక్క మూలాలను అన్వేషించడంగా వుండాలి. ఇందుకు అవసరమైన స్పష్టతని ఆధునిక భారతదేశంలోని సంక్లిష్టమైన, ఘర్షణాయుతమైన సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాల చరిత్ర సమకూర్చుతుంది. కాని దాదాపు ముందుగా ఈ అంశంపై లభ్యమవుతున్న చారిత్రక సాహిత్యాన్ని పరిశీలిద్దాం.

## పాత, కొత్త ధోరణులు

బ్రిటిష్ పాలనకి చెందిన చివరి 60 సంవత్సరాల చరిత్ర రాయడం గతంలో కంటే చాలా కష్టతరము ఉత్తేజకరమూ అయింది. అందుకు కారణం యిటీవలి కాలంలో లభ్యమవుతున్న వివరణాత్మక అధ్యయనాలు. ప్రత్యేకించి జాతీయోద్యమంపై చాలా సాహిత్యం వెలువడింది. ఒక దశాబ్దం క్రితం వరకు వైస్రాయిలు రాసిన రాతలు, రాజ్యాంగ పరిణామాలపై రచనలు, భారతీయ నాయకుల జీవిత చరిత్రలు, జాతీయ నాయకుల రచనలు, జాతీయవాదం అభివృద్ధిపై వచ్చిన సమీక్షలు మాత్రమే లభ్యమయ్యేవి. ప్రభుత్వ పత్రాలకు అధ్యయనం చేయడానికి గల అవకాశాలు తక్కువ. ప్రైవేట్ అధ్యయనాలను సేకరించేందుకు క్రమబద్ధమైన ప్రయత్నాలు జరగలేదు. చిరోల్, సీతారామయ్య, తారాచంద్, ఆర్.సి. మజుందార్‌ల వైఖరులలో స్పష్టమైన

తేడాలు వున్నప్పటికి వారి మధ్య ఒక మేరకు ఏకాభిప్రాయం వున్నట్లు కనిపిస్తుంది. వీరు ఇంగ్లీషు పాలనలో పుట్టి పెరిగారు. మధ్యతరగతికి చెందిన ఇంగ్లీషు విద్యావంతులు. వివిధ పునరుజ్జీవన ఉద్యమాలలో పాల్గొన్నవారు. నిష్ఫలమైన వ్యక్తిగత ఆకాంక్షలు, విదేశీ పాలనకి వ్యతిరేకంగా ఏహ్యభావం, పాశ్చాత్య సంస్కృతి నుండి సంక్రమించిన దేశభక్తి ప్రజాస్వామ్యం ఆదర్శాలు – వగైరాలకే ప్రేరితులై వారి యజమానులకు వ్యతిరేకంగా నిలిచి ఆధునిక జాతీయ వాదానికి జన్మనిచ్చినవారు. సామ్రాజ్యవాదంతో అనుబంధం గల చరిత్రకారులు భారతీయ సమాజంలో నిరంతరంగా వచ్చిన విభజనలు, ముస్లింల చీలిక, దేశ విభజనలపై మొగ్గు చూపారు. మరొకవైపు భారతీయుల ప్రయోజనాలు ఎప్పుడు కూడా విదేశీ ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఉంటాయి. గనుక జాతీయవాద చరిత్రకారులకు ప్రజలలోకి చొచ్చుకుపోవడం స్వాభావికంగా కన్పించింది. కాని ఒక చరిత్ర రచనా ధోరణిగా జాతీయవాద చరిత్రకారుల రచనలు అసమగ్రంగానే వున్నాయి. భారతీయ చరిత్రకారులు 1950ల వరకు అలాంటి అంశాలకు దూరంగా ఉండిపోయారు. ప్రత్యామ్నాయంగా మొగలు పాలనకి వ్యతిరేకంగా రాజపుత్రుల, మరాఠా తిరుగుబాట్లని గురించి రాస్తూ వారి దేశభక్తిని చాటుకున్నారు. రచనలలో తరచుగా ప్రాంతీయ పరమైన, మతపరమైన వక్రీకరణలు చోటు చేసుకున్నాయి. ఉదాహరణకు స్వాతంత్రోద్యమంపై ఆర్.సి. మజుందార్ ప్రసిద్ధ గ్రంథాలలో విద్యావంతులైన బెంగాలీ హిందువుల ప్రత్యామ్నాయ సంస్కృతి ద్విజాతి సిద్ధాంతంతో మిళితం చేయబడింది. మధ్యయుగాల భారతదేశంపై కొన్ని రచనలలో లాగా హిందువులు, ముస్లింలు పరస్పరం వ్యతిరేకించే రెండు విభిన్న అస్తిత్వాలు గల మూనలుగా భావించబడ్డారు. ఈనాటి మతపరమైన ప్రతికూలాభిప్రాయాల్ని గతం నుండి త్రవ్వి వెలికి తీసే యత్నాలకు యిలాంటి రచనలు నమూనాలుగా నిలిచాయి. కాని నిజమైన జాతీయవాద చరిత్ర రచనలో కూడా ప్రజల లేక జాతి యొక్క అమూర్త సంస్కృతి కులీన ధోరణులను కొద్దిమంది గొప్ప నాయకులను విమర్శనారహితంగా ఆకాశానికెత్తడాన్ని గాని అడ్డుకొనలేకపోయింది. ఇక సామ్రాజ్యవాద చరిత్రకారులు జాతీయోద్యమం యొక్క సామాజిక ఆర్థిక మూలాలను విస్మరించారు. జాతీయవాద చరిత్రకారులు కూడా వారి వ్యాఖ్యానాలను జాతీయవాద ఆర్థికవేత్తలైన నౌరోజి, దత్తు తరం యొక్క సిద్ధాంతాలతో విలీనం చేసే ప్రయత్నాలు చేయలేదు. కులీనత, వలసవాద చట్రం పట్ల ఉపేక్ష, ఆరోపణలు మన కాలం నాటి మార్క్సిస్టు రచయితలు – ఆర్.పి. దత్, ఎం.ఎన్. రామ్, ఎ.ఆర్. దేశాయ్ మరికొందరు సోవియట్ రచయితల రచనలపై చేయడం సమంజసం కాదు కాని వీరి విశ్లేషణలలో అతిగా సాధారణీకరణలు యాంత్రికత చోటు చేసుకొనడంతో వీరు కూడా పూర్తి సంతృప్తికరమైన ప్రత్యామ్నాయాన్ని అందించడంలో విఫలమయ్యారు.

ప్రాచీన గ్రంథాలయాల, ప్రైవేట్ పరిశోధనల క్షేత్ర స్థాయి అధ్యయనాల ద్వారా ఈనాడు చరిత్ర కొత్తరూపం సంతరించుకుంటుంది. వలస పాలన కాలం నాటి మొత్తం సమాచారంతో ప్రభుత్వ ప్రాచీన గ్రంథాలయాలు అందుబాటులో వున్నాయి. న్యూఢిల్లీ నెహ్రూ

మెమోరియల్ మ్యూజియం లాంటి చోట్ల ప్రైవేట్ అధ్యయనాల పరిశోధనా పత్రాలు విరివిగా లభ్యమవుతున్నాయి. క్షేత్రస్థాయి అధ్యయనాల ఇంటర్వ్యూల విలువను చరిత్రకారులు గుర్తిస్తున్నారు. నూతన పరికల్పన నిర్వహించే పాత్ర చాలా ముఖ్యమైనది, వివాదాస్పదమైనది. కొన్ని సందర్భాలలో విశ్వసనీయమైనది కాదు. అయినప్పటికి చాలా ఉత్సుకత కలిగిస్తుంది. ఈ రంగంలో కేంబ్రిడ్జి, రచనా సంస్థ ఫలప్రదమైన కృషి సాగించింది. తొలినాటి భారత జాతీయవాదంపై అనిల్ సియోల్, బెంగాల్‌పై అమెరికా చరిత్రకారుడు బ్రూంఫీల్డ్, గాంధీ అభివృద్ధిపై జూడిత్ బ్రౌన్‌ల రచనలు జాతీయవాదాన్ని ప్రాంతీయ కులపరమైన పోటీగా, సాధారణంగా కుల ప్రాతిపదికన కులీనులు – బెంగాలీ భద్రలోక్, చిట్పవల్ బ్రాహ్మణులు, హిందీ ప్రాంతాలలో ఆంధ్రలో నూతన కులీనుల పోటీగాను, అసమాన అభివృద్ధి గాను వ్యాఖ్యానించాయి. దేశభక్తి అంటే ఉద్యోగ ఉపాధి అవకాశాలు దొరకని నిరాశా నిస్పృహలకు గురైన వారి సంకుచిత, స్వార్థపూరిత లక్ష్యాల క్రమబద్ధీకరణ తప్ప మరొకటి కాదు అనే పరికల్పన అనేకమంది ప్రభుత్వ ప్రతినిధులు వేలంటైన్ బిరోల్‌లాంటి సామ్రాజ్యవాదులు వ్యక్తీకరించిన భావానికి భిన్నమైనది కాదు. కాని చరిత్ర రచన రాష్ట్ర, కులీనపరంగా గాక స్థానిక ముఠాల పరంగా జరగాలని 1973లో కేంబ్రిడ్జి తరహా చరిత్ర రచన అట్టహాసంగా ప్రకటించింది (గల్లాఘర్, జాన్సన్, సింఘాల్ – లొకాలిటీ, ప్రావిన్స్ అండ్ నేషన్). బ్రిటిష్‌వారు భారాల్ని మోపి రాజ్యాంగ సంస్కరణల ద్వారా కొత్త సహాయకుల్ని కోరడంతో పాలనాపరమైన ఒత్తిడులు అవకాశాలు స్థానిక ప్యాట్రన్ – క్లైంటు గ్రూపుల్ని ప్రావిన్సుల లేక జాతీయ వేదికల మీద ఒకే గ్రూపుగా కలుసుకోవడాన్ని వివరిస్తాయి. వాషర్ బ్రూన్ బేకర్ దక్షిణ భారతదేశానికి, బేలీ అహమ్మదాబాద్‌కి గార్డన్ బాన్సన్ బొంబాయి మితవాదులకు, అతివాదులకు, రాబిన్సన్ యు.పి. ముస్లింలకు వర్తింపచేసి ఈ వైఖరి ఫలప్రదమైనదిగా నిరూపించారు.

అయినప్పటికి కేంబ్రిడ్జి తొలినాటి వైఖరికి మార్పు చేయబడిన వైఖరికి మధ్య కొన్ని అవిచ్ఛిన్నతలు కొనసాగుతాయి. బేలీని మినహాయిస్తే యిప్పటికి సైద్ధాంతిక పాత్రని దేశభక్తికి సన్నద్ధం చేయడాన్ని తగ్గించే వైఖరితోనే వుంది. అలాంటి వైఖరి కొన్ని సందర్భాలలో ముఖ్యంగా జాతీయవాద చరిత్ర రచనలు సాధారణంగా నాయకుల్ని అతిగా ఆరాధించే ధోరణిని సరిచేస్తుంది. అయినప్పటికి భావాల సముదాయం యొక్క ప్రాధాన్యతకి ప్రత్యేకమైన వ్యక్తులు సూత్రీకరించి ఆమోదించే స్వప్రయోజనాలకు మధ్య తార్కికమైన వ్యత్యాసం చూపవలసి వుంటుంది. ఉద్యోగ నిరాసక్తత బంకించంద్రుని చేత దేశభక్తి నవలలు రాయించి వుండవచ్చు. వుండకపోవచ్చు. కాని వాటి యొక్క ప్రభావం ఒక చారిత్రక వాస్తవంగా నిలిచిపోతుంది. వలస పాలన కాలం నాటి ఆర్థిక, జాతిపరమైన వివక్షపై ఆరోపణలు చేయడం చాలా ప్రాధాన్యత గల అంశం. దక్షిణ భారతదేశంలోని గ్రామీణ స్థానిక పెత్తందారులు వలసవాద ఆర్థిక విధానంపై రాజకీయాలపై ఆధారపడిన వర్గం అని వాష్ బ్రూక్ విశ్లేషించాడు. 'మద్రాసు గవర్నర్, ఆయన అనుయాయులు రాజకీయ విధానం యొక్క ఫలితాల్ని వారిలో వారు పంచుకుంటున్నారు'

అనే ప్రకటనకి '20 శతాబ్దం ప్రారంభంలో వైస్రాయికి 700 మంది సేవకులున్నారు. ఆయన జీతం బ్రిటిష్ ప్రధానమంత్రి జీతానికి రెట్టింపు' అనే వాస్తవానికి మధ్య చాలా వ్యత్యాసం వుంది. 1930లలో కూడా గాంధీ దండియాత్ర ప్రారంభానికి ముందు వైస్రాయి జీతం సాధారణ భారతీయుని జీతానికి 5000 రెట్లని, అలాగే శ్వేతజాతికి చెందిన బెంగాలీ జూనియర్ జైలు గవర్నర్ హుబ్లీ వద్ద రాజకీయ ఖైదీల్ని కాల్చి చంపిన తరువాత సెలవుపై వెళ్ళి ప్రపంచాన్ని చుట్టి రాగలడని గాంధీ ఇర్విన్‌కి గుర్తు చేశాడు (బేకర్ పేపర్స్, కేంబ్రిడ్జి సౌత్ ఆసియా స్టడీసెంటర్). 'ప్యాట్రన్ క్లైంట్' నమూనా అంటే అలహాబాద్‌లోని టాండన్ గ్రూపు వాణిజ్య సంస్థతో మాలవ్యాకి గల సంబంధాలు, అలాగే తూర్పు బెంగాల్‌లోని హిందూ జమిందారులకు, ముస్లిం రైతులకు మధ్య గల సంబంధాలను కొంత అతిశయించి చెప్పడంగా వుంటుంది. రాజకీయాల్ని ముఠా తత్వంతో సమానం చేయడంలో కేంబ్రిడ్జి చరిత్రకారులు 18వ శతాబ్దపు ఇంగ్లండ్ యొక్క నేమియర్ అధ్యయనాలను నమూనాలుగా స్వీకరించారు. ఉద్రిక్తతలు లేని పరిమిత సంఖ్యలో ఉన్న ప్రజల పాలన, రాజకీయాలపై వ్యాఖ్యానించారు. విస్తృత ప్రజానీకానికి చెందిన పెద్ద ఘర్షణల్ని, పోరాటాల్ని వ్యాఖ్యానించడానికి యిది సరిపోదు. నేమియరిజం పెద్ద ఉద్యమాలని పట్టించుకోకుండా తప్పుకుపోతుంది. అందుకే బేలీ అలహాబాద్‌పై చేసిన విలువైన అధ్యయనం 1920లలో హఠాత్తుగా ఆగిపోయింది. అన్నిటిని మించిన స్థానిక పరిస్థితుల చరిత్ర రచనలో కూడా కులీనత కొనసాగవచ్చు. ఉద్యమం యొక్క స్థానిక నాయకులు అంటే ఆ ఉద్యమాన్ని సృష్టించినవారు వారి ఆకాంక్షలతో ఉద్యమానికి సంబంధించిన ఉద్దేశాలు వుండే విధంగా జాగ్రత్తగా విశ్లేషణ చేయడం అవసరమవుతుంది (వాష్ బ్రూక్, యమర్జెన్సీ ఆఫ్ ప్రొవెన్సియల్ పాలిటిక్స్, పేజీ 279) ఇటీవల బేలీ, వాష్‌బ్రూక్, బేకర్‌లాంటి చరిత్ర రచయితలు పోషకులు, ముఠాల అధ్యయనం నుండి వైదొలగి గణనీయమైన ప్రాధాన్యత గల ఆర్థిక చరిత్ర, రచన పట్ల ఆసక్తిగా ఉన్నారు.

కేంబ్రిడ్జి తరహా చరిత్ర రచన గత దశాబ్దానికి చెందిన భారతదేశ, విదేశీ చరిత్రకారులపై కొంత చీకటిని వ్యాపింపచేసింది. డి.ఎ.లతో సహా ససెక్స్–కాక్‌బెర్రా చరిత్ర రచయితలు సమాచార సేకరణ విషయంలో చాలా క్రమబద్ధత పాటించారు. అంత విరివిగా రచనలు చేయలేదు. భావలలో నిష్కపటత ఎక్కువ. రౌలట్ సత్యాగ్రహంపై సంకలనాలు అలాగే యిటీవలి 'కాంగ్రెస్ – రాజ్యం' ప్రజా పోరాటాల కాల వ్యవధుల అధ్యయనానికి సంబంధించినంతవరకు సందేహాలకు అతీతంగా వున్నాయి. అందుకు విరుద్ధంగా గ్రామంలో ఆధిపత్యం వహించే గ్రూపుల లేక సంపన్న రైతుల పాత్రని గురించి కొన్ని సందర్భాలలో చేయబడినా సాధారణీకరణలు ఆమోదయోగ్యం కావచ్చు, కాకపోవచ్చు. సామ్రాజ్య విధానాల రూపకల్పన ప్రస్తుతం అంత ఆకర్షణీయంగా లేదు. కాని ఈ సందర్భంగా సామ్రాజ్యవాదం పట్ల బ్రిటిష్ కార్మికుల వైఖరులపై డి.ఎన్. గుప్తా రచనల్ని సమాఖ్య ప్రయోగం యొక్క పరిణామాలపై ఆర్.జె. మూరే, ద్వంద్వ పరిపాలనపై పీటర్ రాబ్ రచనల్ని ప్రస్తావించాలి.

అమెరికా చరిత్రకారుల నుండి ఆర్య సమాజ జాతీయవాదం, దక్షిణ భారతదేశంలో కుల రాజకీయాలు, బీహారులో రైతాంగ ఉద్యమాలు, తొలినాటి కాంగ్రెస్‌పై జె.ఆర్. మెక్లేవ్ అధ్యయనం వెలువడ్డాయి. ముస్లింల సామాజిక రాజకీయ ధోరణులపై వెలువడిన అసంఖ్యాకమైన గ్రంథాలలో ఇస్లాం అధునీకరణపై అజీజ్ అహమ్మద్, దియోబండ్‌పై జియావుల్ హసాన్ ఫరూకి, పీటర్ హార్డీ యొక్క సాధారణ విశ్లేషణ రఫీయుద్దీన్ అహమ్మద్, ముషీరుల హసాన్, గెయిల్ మినాల్ట్‌ల యిటీవలి గ్రంథాలను ప్రస్తావించవలసి వుంటుంది. సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాల్ని కించపరిచే కేంబ్రిడ్జి చరిత్రకారుల వైఖరికి భారతదేశ మార్క్సిస్టు చరిత్రకారులు తీవ్రంగానే స్పందించారు. కాని సాంప్రదాయ జాతీయవాద వైఖరికి అంతగా భిన్నమైన వైఖరిని చేపట్టలేదు. ఆర్.పి. దత్ యితర తొలినాటి రచనల స్వభావంగా వున్న పాక్షికత, జాతీయ నాయకత్వంపై ప్రతికూల అంచనాల స్థానంలో తిలక్ గాంధీ నెహ్రూ లాంటి నాయకుల ఆరాధన వచ్చి పడింది. ఊగిసలాటలో ఒక అతివాద వైఖరి మరొక అతివాద వైఖరిని పెంచి పోషిస్తుంది. కాని మార్క్సిస్టులు మితవాద ఆర్థిక సిద్ధాంతం, బెంగాల్ అస్సాంలలో రాజకీయ ఉద్యమాలు వామపక్ష ఉద్యమాలపై వివరణాత్మక అధ్యయనాలు ప్రచురించారు. మార్క్సిస్టు, మార్క్సిస్టేతర చరిత్ర రచయితలు గ్రామ స్థాయి సమాచారాన్ని సేకరించి మూలాల్లోకి వెళ్ళి అధ్యయనాలు చేస్తున్నారు. డేవిడ్ హార్డిమన్, మజిద్ సిద్దికి, కపిల్ కుమార్, జ్ఞాన్‌పాండే, స్టేఫెన్ హెన్సింగ్‌హాం, హితేష్ సన్యాల్ లాంటి వారు గుజరాత్ పటేదార్లు, యు.పి. కిసాన్లు, బీహార్ రైతులు, బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాలలో గ్రామీణ ఉద్యమాలపై పరిశోధనాత్మక అధ్యయనాలు సాగిస్తున్నారు. ఈ అధ్యయనాల వలన కులీన వైఖరులలోని వ్యత్యాసాలకు భిన్నమైన 'క్రింది నుండి పెల్లుబుకిన చరిత్ర'కి ప్రాధాన్యత పెరుగుతుంది.

అలాంటి క్షేత్రస్థాయి అధ్యయనం చరిత్ర రచయితకి సామాజిక శాస్త్ర, మానవ శాస్త్ర విద్యార్థులతో సన్నిహిత సంబంధాల్ని ప్రోత్సహిస్తుంది. భారతదేశంలో మానవశాస్త్రం చాలాకాలం వరకు తెగల జీవిత అధ్యయనంగా గుర్తింపు పొందింది. 1950 నుండి కులచట్రాల, ఉద్యమాల సంఘాల అధ్యయనాలు కొత్త ధోరణికి తెరలేపాయి. ఆధునిక చరిత్రకారుడు పరిశోధన ద్వారా సేకరించిన విలువైన సమాచారాన్ని విస్మరించలేదు. 'కులపరమైన కదలిక గుర్తింపు పొందిన చిన్న గ్రూపుల్ని పైకి లాగడానికి ప్రాతినిధ్యం వహిస్తుంది' అని ఆంద్రే బెటీల్ చేసిన హెచ్చరికని గమనంలో పెట్టుకోవాలి. 'కుల సంఘాలకు సంబంధించిన వివరణాత్మక అధ్యయనాలు కుప్పలు తెప్పలుగా వుండగా రైతుసంఘాల అధ్యయనాలు ఎందుకు తక్కువగా వున్నాయో సామాజిక శాస్త్రవేత్త ఆలోచించాలి' – రూడోల్ఫ్ యొక్క సాంప్రదాయ ఆధునీకరణలో బెంటీల్ పేర్కొన్నాడు. (భారతదేశ ఆర్థిక సామాజిక చరిత్ర సమీక్ష సెప్టెంబర్ 1970)

సామాజిక చరిత్ర భారతదేశంలో యిప్పటికీ నిరాదరణకు గురైన అంశంగా మిగిలింది. సామాజిక చరిత్ర సంఘ సంస్కరణ ప్రయత్నాలుగా భావించబడుతున్నది. వర్గాలు వర్గ చైతన్యంపై అధ్యయనం ప్రారంభ దశలోనే వుంది. ప్రాంతీయ భాషల అభివృద్ధి ఆధునిక భారతదేశ

చరిత్ర యొక్క కీలకమైన అంశాలలో ఒకటి. అలాంటివి విజ్ఞాన శాస్త్ర, చారిత్రక సామాజిక శాస్త్ర పరిశోధనాంశాలయ్యే అవకాశాలు యింకా కన్పించడం లేదు. నిరక్షరాస్యులు అత్యధికంగా వున్న దేశంలో లిఖిత సాహిత్యం కొద్ది మైనారిటీకి మాత్రమే ఆలోచనలు విలువల పరంగా మార్గదర్శకంగా ఉంటుంది. పల్లె ప్రజల మనస్సులలో ప్రవేశం పొందేందుకు వారి పాటల్ని, నృత్యాల్ని, సామెతల్ని, కథల్ని అధ్యయనం చేయవలసిన అవసరాన్ని యిటీవలి ఫ్రెంచి చరిత్రకారుడు నొక్కి చెప్పాడు (యుగిన్ వెబర్ పెజంట్స్ ఇంటు ఫ్రెంచిమెన్). అలాంటి పద్ధతులు భారతదేశంలో యింకా ఆచరణలో పెట్టవలసి వుంది.

ఆధునిక భారతదేశ చరిత్రకారులకు ఆర్థిక శాస్త్రవేత్తల సహకారం అవసరమవుతుంది. ఆర్థిక చరిత్రలో గణిత శాస్త్రానికి చెందిన ఎక్కువ విషయాల్ని చొప్పించడంతో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. వలసవాద ఆర్థిక విధానం యొక్క పని తీరుపై అవగాహనకు మనం యిప్పటికీ జాతీయవాద ఆర్థికవేత్తల వైపు చూడవలసి వస్తుంది. వారి కృషి అప్పటికి కొత్త పుంతలు తొక్కినదైనప్పటికి యిప్పటి దృష్ట్యా పాతబడింది, అసమగ్రమైనది (1930లలో బుచానన్, డి.ఆర్. గాడ్గిల్, 1940లలో ఆర్.పి. దత్‌లు అదనంగా చేర్చారు) 18వ, 19వ శతాబ్దపు వర్తకం, ఆర్థికం, రెవెన్యూ విధానాలపై వ్యవసాయ సమీక్షలపై చరిత్రకారులు గణనీయమైన కృషి చేశారు. కాని 1900 తరువాత సాపేక్షకంగా తక్కువ కృషి జరిగింది. పెరుగుతున్న సంక్లిష్టతలు గణాంక వివరాల దృష్ట్యా అలాంటి కృషికి ఆర్థిక శాస్త్రంలో కొంత సాంకేతిక శిక్షణ అవసరమయింది. థార్నర్స్ వ్యాసాలు, వ్యవసాయ ఉత్పాదకతపై జార్జి బ్లిక్ అధ్యయనం, భారతదేశంలో దేశీయ ప్రైవేట్ పెట్టుబడులపై వలస పాలకుల నియంత్రణలపై అమియా బాగ్చీ విశ్లేషణ, అలాగే 'ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ', 'ఇండియన్ ఎకనామిక్ అండ్ సోషల్ హిస్టరీ రివ్యూ' పత్రికలలో ప్రచురింపబడిన పరిశోధనా పత్రాలు – ఆర్థిక శాస్త్రవేత్తల తోడ్పాటు ఎంత విలువైనదో తెలియజేస్తున్నాయి.

ఆధునిక భారతదేశంలో గత దశాబ్దంపై ఒక్కసారిగా జరిగిన పరిశోధనల విస్తరణ ప్రస్తుతం వున్న గ్రంథాన్ని (పాఠ్య పుస్తకాల్ని) సాధారణ అధ్యయనాల్ని కాలం చెల్లిపోయినవిగా చేసింది. ఈ నూతన సమాచార సంపదని తాత్కాలికంగానైనా లేక అసమగ్రంగానైనా సమన్వయం చేయడం అవసరం. అది ఈ గ్రంథం యొక్క ప్రధానమైన లక్ష్యం. ప్రధానంగా లభ్యమైన ప్రచురింపబడిన గ్రంథాలపై ఆధారపడినప్పటికీ సమాచారంలో గాని, పద్ధతులలో గాని ఏర్పడిన అంతరాయాలని కొన్ని సందర్భాలలో స్వతంత్ర పరిశోధనతో పూరించ యత్నించాను. ఏ చరిత్రకారుడు కూడా పాక్షిక దృష్టికి అతీతుడు కాదు. చైతన్యరహితమైన పాక్షిక దృష్టి ప్రమాదకరమైనది. కాబట్టి ఈ దశలో నా ముఖ్యమైన స్వీకృత్యాలను (Assumptions) స్పష్టంగా చెప్పడం మంచిది. మొదటిది : వలసపాద దోపిడి, దానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటం, నేను పరిశీలించ ప్రయత్నించిన కాలానికి ప్రధాన వస్తువు. అదే సమయంలో జాతీయవాద చరిత్ర రచన తరచుగా చేసిన విధంగా భారతీయ సమాజంలోని చాలా అంతర్గత

ఉద్రిక్తతల్ని విస్మరించడం మంచిది కాదని, అలా విస్మరించడం దారి తప్పించడమవుతుందని భావించాను. మూడవది : ముఠాల కీచులాటలు మన కథలో కచ్చితంగా భాగమవుతాయి. అంతర్గతంగా వుండే వర్గ ఉద్రిక్తతలు కాలక్రమంలో నిర్ణయాత్మకమవుతాయి. చివరిగా అన్నిటిని మించి సాంప్రదాయ, జాతీయవాద, మతవాద, కేంబ్రిడ్జి, కొందరు మార్క్సిస్టు – చరిత్రకారులతో నాకు గల వివాదం : వారిలో వారికి స్పష్టమైన వ్యతిరేకతలు వున్నప్పటికీ – వారందరూ ఉమ్మడిగా కులీన వైఖరి చేపట్టారు. మన దేశంలో సామ్రాజ్యవాద వ్యతిరేకత కులీనుల స్థాయిలో వుంది. సాధారణ ప్రజల స్థాయిలోనూ వుంది. కాని కులీనుల స్థాయి సామ్రాజ్యవాద వ్యతిరేకతని అధ్యయనం చేయడం సులభం గనుక చరిత్రకారుడు ప్రజల స్థాయి సామ్రాజ్యవాద వ్యతిరేకతని విస్మరించరాదు. ఈ రెండు స్థాయిలలో గల సంక్లిష్టమైన సంబంధం ద్వారా చివరిగా ఈ కాలపు ప్రముఖ లక్షణంగా నేను భావిస్తున్న మార్పు ద్వారా ఈ అవిచ్ఛిన్నత ఆవిర్భవించింది.

1890లో మితవాద కాంగ్రెస్ రాజకీయాల యాచించే వైఖరి మాత్రమే అప్పటికి వున్నా, లేక వుండగలిగిన జాతీయవాదంగా కన్పించినపుడు బొంబాయి గవర్నర్ దృఢ విశ్వాసంతో వైస్రాయికి యిలా రాశాడు. "అటవీ విధానం, అబ్కారీ విధానం, ఉప్పు పన్ను, సవరణల విధానాలతో శిస్తులు పెంచడం.... అన్నీ కూడా మనల్ని ద్వేషించేలా చేస్తాయి. చదువుకొన్న భారతీయులు ఏమి కోరతారో మనకు బాగా తెలుసు. కాని చదువు రాని వారి ఆలోచనలు నాకు తెలియదని అంగీకరిస్తున్నాను' (రీయలాన్స్ డౌనేకి 1850 ఫిబ్రవరి 20) లోపల్లోపల రగులుకొంటున్న చైతన్యాన్ని కారణంగానే ఉప్పు, భూమి శిస్తు ఎక్సైజ్, అడవి హక్కులు – సమస్యలపై మహాత్మాగాంధీ 40 సం॥ల తరువాత అఖిల భారత ఉద్యమాన్ని నిర్మించగలిగాడు. పరిశోధించవలసిన లోతులు అవిచ్ఛిన్నతలు నిరీక్షిస్తున్నాయి.

# అధ్యాయము-2

# రాజకీయ ఆర్థిక నిర్మాణం 1885 - 1905

## సామ్రాజ్యవాద నిర్మాణం - విధానాలు

**2**0వ శతాబ్దంలో కొంతకాలం వరకు కూడా భారతదేశంలోని బ్రిటిషు ప్రభుత్వం ప్రధానంగా వైస్రాయి రాజ్య కార్యదర్శుల అధ్వర్యంలో నిర్మాణబద్ధమైన అధికార పరంపర పాలన సాగించిన నియంతృత్వం. విధానపరంగా బ్రిటిషు పార్లమెంటు అదుపు చేసింది. 1858 తరువాతి పరిణామాలు వైస్రాయి, రాజ్యకార్యదర్శి ద్వందం యొక్క వ్యక్తిగత పాత్రల్ని గణనీయంగా పెంచాయి. వార్తా రవాణా సౌకర్యాల విప్లవం సాధించిన ఫలితాలు జలాంతర్గత కేబుల్, సూయజ్ కెనాల్ (1865-69) వైస్రాయి రాజ్యకార్యదర్శుల సన్నిహిత సంబంధాన్ని పెంచాయి. ఈస్టిండియా కంపెనీ వ్యవహారాలు ఇంగ్లాండులో ఎప్పటికప్పుడు తెలిపే ఆర్థిక రాజకీయ అంశాలయ్యాయి. చార్టర్ చట్టాల పునరుద్ధరణపై పార్లమెంటులో తీవ్రమైన చర్చలు జరిగేవి. రాజ్య కార్యదర్శిని అదుపుచేసేందుకు లార్డ్ స్టాన్లీ చట్టంచే నియమింపబడిన "కౌన్సిల్ ఆఫ్ ఇండియా" ఎప్పుడూ ప్రాధాన్యతని సంతరించుకోలేదు. వైస్రాయికి రహస్య ఉత్తర్వులు అత్యవసర సమాచారం ఎప్పటికప్పుడు పంపిస్తూ వుండడంతో కౌన్సిల్ ఆఫ్ ఇండియా నామమాత్రమయింది. భారతదేశంలో కూడా రైల్వే, టెలిగ్రాపులు స్థానిక ప్రభుత్వాల్ని కలకత్తాకి సన్నిహితం చేశాయి. 1861 భారత శాసనసభల చట్టం (Indian Councils Act of 1861) కూడా వైస్రాయికి తన కార్యనిర్వాహక మండలిపై పట్టుని పెంచింది. ఇది కొద్దిమంది భారతీయులకు అవకాశం కల్పించింది. కాని వారు కేవలం అలంకారప్రాయంగా వుండవలసి వచ్చింది. 1892 వరకు కేవలం నామినేట్ చేయబడిన సభ్యులతో వున్న ఈ చట్ట సభలకు, ఆ సంవత్సరంలో సంస్కరణలు చేపట్టబడే వరకు బడ్జెటుపై చర్చించడానికి గాని ప్రశ్నలు అడగడానికి గాని చట్టపరమైన అధికారాలు లేవు.

ఆ విధంగా రాజకీయ చక్రం వైస్రాయి, రాజ్యకార్యదర్శి చేతుల్లో విశేషమైన అధికారాల్ని కేంద్రీకరించింది. కాబట్టి వారి వ్యక్తిగత ధోరణులు, రాజకీయ అనుబంధాలు వారి పాలనా వ్యవహారాలలో కొంతవరకు ప్రతిఫలించేవి.

## వైస్రాయిల ధోరణులు

రాజకీయంగా చైతన్యవంతులైన భారతీయులు 1885లో వైస్రాయిల మధ్యగల తేడాలను గ్రహించారు. లిట్టన్ రిప్పన్‌ల మధ్య నలుపు తెలుపుకి మధ్య వున్న తేడా వుందని గుర్తించాడు. వారు ఆ తేడాని బ్రిటిషు రాజకీయాలలో 'టోరీలకు' లిబరల్స్‌కు మధ్య ఘర్షణగా భావించారు. మితవాద కాంగ్రెస్ నాయకుడు అంబికా చరణ్ హుజుందార్ 1915 లో భారత భారతీయవాద పరిణామ చరిత్రను రాస్తూ లిట్టన్ కాలంలో ముసురుకొన్న మేఘాలు రిప్పన్ డఫరిన్‌ల కాలంలో బెదిరిపోయాయని పేర్కొన్నాడు. ఇటీవలి కాలం నాటి మరొక చరిత్రకారుడు 1869 –80 కాలం నాటి 'కన్సర్వేటివ్ హస్సంఘటన'కు 1880–88 కాలం నాటి ఉదారవాద ప్రయోగానికి గల వ్యత్యాసాన్ని వివరించారు. (యస్. గోపాల్, భారతదేశంలో బ్రిటిషు విధానం)

1880 దశాబ్దం ప్రారంభంలో భారతీయ మిత్రుల పరిధిని స్వదేశీ సంస్థానాధీశులు, జమీందారుల నుండి ఇంగ్లీషు విద్య నేర్పిన మధ్యతరగతి గ్రూపులకు విస్తరించే ప్రయత్నం జరిగింది. ఇంగ్లీషు చదువు నేర్పిన భారతీయుల్ని లిట్టన్' స్థానిక పత్రికలలో రాజద్రోహంపై వ్యాసాలు రాసేందుకు మనం చదివించిన బాబులు' అని అపహాస్యం చేశాడు. అందుకు విరుద్ధంగా రిప్పన్" నిరంతరం పెరుగుతున్న ... విద్యావంతులైన భారతీయుల్ని మన పాలనకు శత్రువులుగా చేసుకొనడం కంటె మిత్రులుగా చేసుకొనడం యొక్క అవసరాన్ని' గురించి మాట్లాడడానికి యిష్టపడ్డాడు. 'అనిల్ సియాల్, భారతజాతీయవాద ఆవిర్భావం పేజీలు 134,139) కాని 1883లో ఇల్బర్ట్ బిల్లుకి వ్యతిరేకంగా ఆంగ్లో ఇండియన్ల ఆగ్రహం ఆ ప్రయోగానికి ముగింపు పలికింది.

డఫరిన్ (1884–88) లాన్స్‌డౌనే (1888–93) ఎల్గిన్ (1893–98)లు వైస్రాయులుగా వున్న కాలంలో భారతదేశం పట్ల లిబరల్స్ టోరీల వైఖరుల మధ్య వ్యత్యాసాలు తగ్గాయి. ఎగువబర్మాని కలుపుకొనడంలో డఫరిన్ యూరపు వాణిజ్య వొత్తిడికి లొంగిపోయాడు. బెంగాలు, అవుధ్‌లలోని కౌలు చట్టాలలో భూస్వాములకు అనుకూలమైన మార్పులు తెచ్చారు.

కాని అబ్దుల్ రహమాన్ (లిట్టన్ ఎంపిక) అమీర్‌గా కొనసాగడం అనుమతించబడింది. సబ్సిడీగా దానికి బదులుగా విదేశీ విధానంపై నియంత్రణలు విధించబడ్డాయి. బ్రిటిషువాద పిషిన్, సిబిలను వుంచుకొని 1887లో బ్రిటిషు బలూచీస్తాన్‌కి మార్చారు.

డఫరిన్ కాలంలో ఆఫ్ఘన్ సరిహద్దు స్థావరం పాంజ్‌దే అక్రమణ (1885 మార్చి) తీవ్రమైన ఉద్రిక్తతకి దారి తీసింది. కాని సమస్య డెన్మార్క్ రాజు మధ్యవర్తిత్వానికి వదిలి వేయబడింది. రష్యాతో అఫ్ఘన్ సరిహద్దుకి సంబంధించిన ఒప్పందం 1887లో కుదుర్చు

కొనబడింది. 1887-1892 కాలంలో లార్డ్ రాబర్ట్స్ సైనికదళ కమాండర్‌గా వాయువ్య సరిహద్దుతో తెగలపై దురాక్రమణ విధానం చేపట్టబడింది. వ్యూహరీత్యా రైల్వేనిర్మాణాలు చేపట్టబడ్డాయి. 1893 లో ఆఫ్ఘనిస్తాన్ లోని చిత్రాల్‌ని కలుపుకొని ఆఫ్ఘన్‌పై భారత ఆఫ్ఘన్ ఒప్పందాన్ని రుద్దింది.

డఫరిన్ పాలనా కాలంలో బ్రిటిష్ ఇండియా సరిహద్దులు పెద్ద స్థాయిలో విస్తరించబడ్డాయి. ఎగువ బర్మా 1986 జనవరిలో కబళించబడింది. 1885 నవంబరులో దురాక్రమణకు బ్రిటిషు సైన్యాల్ని ముందుకు నడపాలనే నిర్ణయాన్ని రాజకీయ వాణిజ్య కారణాలు వివరిస్తాయి. పొరుగున వున్నా ఇండో చైనా నుండి ఫ్రెంచి పలుకుబడి బర్మాకి విస్తరిస్తుందని - ప్రత్యేకించి తిబారాజుతో వాణిజ్య ఒప్పందం, జూలైలో ఫ్రెంచి కంపెనీతో రైల్వే ఒప్పందం కుదుర్చుకొన్న తరువాత - అనుమానాలు వ్యక్తమయ్యాయి. బ్రిటిషు కలప వర్తక కంపెనీ మోసపూరిత చర్యలకు పాల్పడినందుకు తిబారాజు 1885 ఆగస్టులో భారీ జరిమానా విధించిన తరువాత రంగూన్‌లోని బ్రిటిషు ఛాంబర్ ఆఫ్ కామర్స్ బర్మాని కలుపుకొనడంపై ఆసక్తిగా వుంది. బ్రిటన్‌లోని పెద్ద వాణిజ్య సంఘాలు - ప్రత్యేకించి మాంచెస్టర్ బర్మాని కబళించడానికి సహాయపడతారని రాక్‌డోల్ఫ్ చర్చిల్ డఫరిన్‌కి హామీయిచ్చారు. ఉత్తరబర్మా ఆకర్షణీయంగా వుంది. అంతేగాక అది యూనాన్‌కి నైరుతిచైనాకి ముఖద్వారంగా వుంది. శాలిస్ బరీ మంత్రివర్గం చాలా ఆసక్తిగా డఫరిన్‌కి మద్దతు యిచ్చింది. కలుపుకోవాలని నిర్ణయం చేసినప్పుడు అధికారంలో వున్న గ్లాడ్‌స్టన్ మంత్రివర్గం కొంత తటపటాయించింది. అయిష్టంగానే ఒప్పుకొన్నది. ఈ కాలంలోని టోరీలకు లిబరల్స్‌కి మధ్య వున్న తేడాకి ఈ ఘటన అద్దం పడుతుంది. దుర్బలంగా వున్న మాండలే యుద్ధంతో పనిలేకుండానే పతనమయింది. కాని గెరిల్లా ప్రతిఘటనని అణచడానికి 40,000 సైన్యం ఐదు సంవత్సరాల కాలం అవసరమయ్యాయి.

## సైన్యం

అలాంటి సాహసకృత్యాలకు సైన్యంపై పెద్ద మొత్తాలు వెచ్చించాల్సి వుంటుంది. విదేశాలకు భారత సైన్యాల్ని తరలించడం - రిప్పన్ నిరసించినప్పటికి 1882 లో గ్లాడ్‌స్టన్ ప్రభుత్వం చే ఈజిప్టులో, 1855-86 మహ్ది ఉద్యమానికి వ్యతిరేకంగా సూడాన్‌లో 1900లో బాక్సర్లకు వ్యతిరేకంగా చైనాలో భారతదేశ ఖజానా వ్యయంతో భారతదేశ సైన్యం యుద్ధాలు చేశాయి. పాంజ్‌దే యుద్ధ భయం సందర్భంగా 30,000 మంది సైనికులు అదనంగా నియమించబడ్డారు. 1881-82 భారత ప్రభుత్వ బడ్జెటులో మిలిటరీ వ్యయం 41.9 శాతం. పది సంవత్సరాల తరువాత అది 45.4 శాతానికి పెరిగింది. 1904 -05 నాటికి కర్జన్ కాలానికి 51.9 శాతానికి పెరిగింది. మిలిటరీ విధానం వలస పాలన యొక్క నిజమైన స్వభావానికి చెందిన పలు అంశాల్ని తెలియజేస్తుంది. 1857 నాటి జ్ఞాపకాలు ఎప్పటికీ ప్రభావితం చేస్తూనే వుంటాయి. "బ్రిటిషువాడు 30 ఏళ్ల క్రితం నాటి భయంకరమైన అనుభవంతో నేర్చుకొన్న పాఠాలను ఎప్పుడూ గమనంలో వుంచుకోవాలి" -1888 లో డఫరిన్ వ్యాఖ్యానం.

1859, 1879 నాటి కమిషన్లు సైన్యంలో మూడవవంతు తెల్లవారుండాలి అనే అంశాన్ని నొక్కి చెప్పాయి. 1857కి ముందు కేవలం 14 శాతం మాత్రమే వుండేవారు. శతఘ్నదళంపై యూరోపియన్ల గుత్తాధిపత్యం వుండాలి. (1900 సంవత్సరం వరకు భారత సైనికులకు నాసిరకం తుపాకులు సరఫరా చేయబడ్డాయి. "జాతి, మతం, కులం స్థానిక సానుభూతి లాంటి ప్రమాదకరమైన గుర్తింపుల పెరుగుదలని నివారించేందుకు నిష్కర్షగా సైనిక విభాగాల విభజన జరగాలని సర్‌జాన్ స్ట్రాచీ వివరించారు. (ఇండియా పేజి 63), విభజించు పాలించు సూత్రాన్ని 1862 వుడ్ అసూయ కలిగించేంత స్పష్టంగా యిలా చెప్పాడు. "పోటీతత్వం గల వేర్వేరు రెజిమెట్లు వుండాలని కోరుకుంటున్నారు. అవసరమైనపుడు ముందు వెనుకలు ఆలోచించకుండా హిందువుని సిక్కుని గూర్ఖా కాల్చగలగాలి.

'మంచి సైనికులు కొన్ని ప్రత్యేక కులాల నుండి మాత్రమే రాగలరు' – అనే యుద్ధ తెగల సిద్ధాంతాన్ని ప్రత్యేకించి 1880 దశాబ్దం చివరలో లార్డ్ రాబర్ట్స్ అభివృద్ధి పరిచాడు. మతపరంగా ప్రాంతీయపరంగా తక్కువగా వుండి – అండమాన్ జాతీయవాదంచే తక్కువగా ప్రభావితమవడానికి అవకాశం గల సిక్కుల్ని గూర్ఖాల్ని సైనికులుగా నియమించుకొనడానికి సమర్థించుకొనేందుకు యుద్ధ తెగల సిద్ధాంతం ఉపమోగించుకోబడింది. జాతిపరమైన సమానత్వం, లేక భారతీయ అధిపత్యం సమస్య నివారించడానికి చేపట్టబడిన చర్య యిది. జీతాలలో కొద్ది పెరుగుదల తరువాత కాల్బలానికి చెందిన భారతీయ సైనికుని జీతం నెలకు రూ. 9. అదే ఉద్యోగం చేస్తున్న బ్రిటిషు వాని జీతం రు24లు, యింకా పలు రకాల అలవెన్సులు. 1926లో భారతీయ సంఘూర్‌కమిటీ 1952 నాటికి ఆఫీసర్ల స్థాయిలో 50 శాతం భారతీయులు వుండాలని ఆకాంక్షించింది.

## ఆర్థిక పాలనాపరమైన ఒత్తిడులు

విదేశాలపై దండయాత్రలు సైనిక విస్తరణ అంటే అనివార్యంగా ఆర్థికభారాలు పెరగడమే. 1873 నుండి బంగారంతో పోల్చితే వెండి రూపాయి విలువ వేగంగా తగ్గడం భారత ఖజానాపై భారాన్ని పెంచింది.

భారతదేశ వ్యయంలో పెద్ద భాగం స్టెర్లింగులలో చెల్లించవలసి వచ్చింది.(బ్రిటిషు సివిల్, సైనిక అధికారుల పెన్షన్లు, రాజ్యకార్యదర్శి సిబ్బంది నిర్వహణ ఖర్చులు, హోంఛార్జీల క్రిందికి వచ్చే రుణాలు యితరాలు) 1872న 2 షిల్లింగులకు సమానంగా వున్న రూపాయి విలువ 1893–94 నాటికి 1షిల్లింగు 2 పెన్నీలకు పడిపోయింది. రాజ్యం యొక్క ఆర్థిక పునాదులపై యిటీవలి సంవత్సరాలలో సవ్యసాచి భట్టాచార్య వివరణాత్మక అధ్యయనం చేశాడు. కేంబ్రిడ్జి చరిత్రకారులు ఆర్థిక సమస్యలకు పాలనాపరమైన ఒత్తిడులకు జాతీయవాద ఉద్యమాలతో గల సంబంధాలపై చాలా సమాచారాన్ని సేకరించాడు.

'స్థానిక అంశాలలో పరిపాలనాపరమైన ఏర్పాటు రాజ్యం యొక్క బలమైన జోక్యంతో దృఢంగా నొక్కబడాలి' (ప్రాంతం, రాష్ట్రం, జాతి పేజి 10) స్పష్టంగా చెప్పాలంటే పన్నుల

పాతరూపాన్ని విస్తరించేందుకు, కొత్తపన్నుల్ని విధించేందుకు ప్రయత్నాలు జరగాలి. ప్రభుత్వంపై వైవిధ్యభరితమైన శక్తులు పనిచేస్తుంటాయి. గనుక ఈ క్రమంలో చాలా సమస్యలు యిమిడి వుంటాయి.

ప్రభుత్వానికి భూమిశిస్తు ఎక్కువ ఆదాయాన్ని తెచ్చిపెట్టే వనరు, సిపాయి తిరుగుబాటుని అణచిన తరువాత శాశ్వతభూమిశిస్తు విధానం విస్తరించబడింది. దీనితో ప్రభుత్వానికి విధేయులుగా వున్న భూస్వాముల ప్రయోజనాలు పరిరక్షించాలనే విధానం విస్మరించబడింది. భూమి శిస్తుపై వచ్చే ఆదాయం 1881 -82లో 19.67 కోట్ల రూపాయలు కాగా 1890లలో విస్తారమైన కరువు కాటకాలు సంభవించినప్పటికి 1901-02 నాటికి 23.99కోట్లుకు పెరిగింది. అయినప్పటికి ప్రత్తి, చక్కెర, జనపనార, గోధుమలు యితర వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి వర్తకాన్ని అభివృద్ధి పరచాలని బ్రిటిష్‌వారు అత్యవసరంగా కోరుకుంటున్నారు. గనుక భూమిశిస్తు విపరీతంగా పెంచడం రాజకీయంగా ప్రమాదకరమైనది. ఆర్థికపరంగా తెలివైన పనికాదు. ప్రభుత్వం యొక్క మొత్తం ఆదాయంలో భూమిశిస్తు, నిష్పత్తి వాస్తవంగా తగ్గుతుంది.(పైన పేర్కొనబడిన సంవత్సరాలకు ఆదాయం వరుసగా 46.86 కోట్లు, 60.79 కోట్లు), బడ్జెటు తయారు చేయడంలో దిగుమతి సుంకాలు చాలా సహాయపడి వుండేవి. రాజకీయ చైతన్యం గల భారతీయుల్ని తృప్తి పరిచివుండేవి. కాని లాంక్‌షైర్ మరొక విధంగా ఆదేశించింది. బొంబాయి పరిశ్రమకి రక్షణ కల్పించేందుకు శాలిస్‌బరీ ప్రభుత్వం ప్రత్తిపై సుంకాలు విధించడాన్ని మాంచెస్టర్ లాబీ వ్యతిరేకించింది. 1878-79లో ఆఫ్ఘన్‌యుద్ధం జరుగుతున్నప్పటికి లిట్టన్ ఈ సుంకాన్ని తగ్గించాడు. 1882లో రిప్పన్ వీటిని పూర్తిగా రద్దు చేశాడు. పెద్ద మొత్తాలలోటు కారణంగా 1890లలో వీటి పునరుద్ధరింపబడిన సుంకంతో పాటు భారతదేశ వస్త్రాలపై ప్రతి విధాన శుల్కం విధించబడింది. 1860లో జేమ్స్ విల్సన్ నుండి వైస్రాయి సలహా మండలిలోని బ్రిటిషిండియా ఆర్థికసభ్యులు ఆదాయపు పన్ను విధింపుని (తెల్లవారు, పలుకుబడిగల భారతీయులు వ్యతిరేకించినప్పటికీ) గురించి ప్రస్తావిస్తూ వచ్చారు. పాంజ్‌దే, బర్మా ఘటనల తరువాత 1886లో డఫరిన్ దానికి క్రమబద్ధమైన శాశ్వతరూపం యిచ్చారు. రెండు సంవత్సరాల తరువాత అమ్మకం పన్ను విపరీతంగా పెంచబడింది.

1880 దశాబ్దం మధ్యభాగం పన్నుల విధింపు నిర్వహించిన పాత్ర మద్రాసు (1887) అలహాబాద్ (1888) కాంగ్రెస్ సదస్సులకు విస్తృతమైన మద్దతుని సమకూర్చింది. 1880లో మద్రాసు ప్రభుత్వ మొత్తం ఆదాయంలో 57% భూమిశిస్తు ద్వారా లభించింది. కాని 1920లో కేవలం 20% మాత్రమే భూమి శిస్తు సమకూర్చింది. అందుకు విరుద్ధంగా మద్యం పరిశ్రమపై ఎక్సైజ్ పన్నులు 1882-83లో 60 లక్షల రూపాయలు వుండగా 1920లో 5.4 కోట్లకు పెరిగింది. అటవీశాఖ ఆదాయం కూడా పెరిగింది. అంటే పేద ప్రజలకు, తెగల ప్రజలకు పచ్చిక వంటచెరుకులపై గల సాంప్రదాయ హక్కులకు ఆటంకం ఏర్పడింది. అటవీచట్టాలకు పశువుల్ని మేపుకొనడంపై విధించిన అడ్డంకులకు వ్యతిరేకంగా మద్రాసులో 1880లలో అస్సాంలో 1890లలో నిరసనలు వ్యక్తమయ్యాయి. కాంగ్రెస్ సదస్సులలో ఈ అంశాలు మాటి మాటికి ప్రస్తావించబడ్డాయి.

19 శతాబ్దం ప్రారంభంలో అంత నిర్మాణ బద్ధంగా లేని కంపెనీ పరిపాలనలో స్థానిక ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు గల క్రింది స్థాయి భారతీయ ఉద్యోగులు గణనీయమైన స్వేచ్ఛ ఆర్థిక ప్రయోజనాలు పొందారని గుంటూరులో పరిపాలనా నిర్వహణపై ఫ్రింకెన్‌బర్గ్ గ్రంథం (గుంటూరు జిల్లా 1788 –1848, ఆక్స్‌ఫర్డ్ 1765) పేర్కొన్నది. 1858 తరువాత పరిణామాలు, ఆర్థిక ఒత్తిళ్లు అలాంటి స్వేచ్ఛని తగ్గించాయి. మద్రాసుకు సంబంధించిన ఈ క్రమాన్ని వాష్‌బ్రూక్ వివరంగా విశ్లేషించారు. తూర్పు బెంగాలులోని సెల్హెట్ ప్రాంతంలో కేంద్రీకృత పరిపాలన స్థానిక ప్రాంతాలలోకి చొచ్చుకొనిపోవడంతో 'సహజ నాయకులు'గా వున్న జమీందారుల్ని లొంగదీయడం జరిగిందని బిపిన్‌చంద్ర వివరించారు (నా జీవితం, కాలం జ్ఞాపకాలు పేజీలు 11–16).

## స్థానిక స్వపరిపాలన - చట్ట సభల సంస్కరణ

ఆర్థికపరమైన ఒత్తిళ్లు, పాలనాపరంగా పట్టుబిగింపు ప్రమాదకరమైనవి కావని నిరూపించేందుకు భారతీయులకు వాటిలో స్థానం కల్పించాలి. ఎంపిక, ప్రాతినిధ్యం, ఎన్నిక – అన్నీ కూడా సామ్రాజ్యవాద లక్ష్యాల కొరకు పనిచేసే భారతీయుల్ని సమకూర్చే సాధనాలు – అనిల్ సియాల్ (ప్రాంతం, రాష్ట్రం, జాతి పేజి10) స్థానిక స్వపరిపాలన అభివృద్ధిలో ఆర్థిక రాజకీయ అంశాలు మిళితం చేయబడ్డాయి. ఈ క్రమం కన్సర్వేటివ్ పార్టీకి చెందిన మేమో అధ్వర్యంలో ప్రారంభమయింది గాని లిబరల్ పార్టీకి చెందిన రిప్పన్ అధ్వర్యంలో కాదు. ప్రధానమైన ఉద్దేశం.

ఆర్థిక యిబ్బందుల్ని పరిష్కరించేందుకు స్థానిక అవసరాలకు స్థానికంగా కొత్తపన్నులు విధించి నిధులు సమకూర్చడం ఈ దేశం యొక్క ప్రభుత్వంలో వున్న మనం స్థానికులతో కలిసిపోవాలి – మేమో, స్థానిక సంస్థలతో ఎన్నికైన సభ్యుల మెజారిటీ ఎన్నికైన ఛైర్మన్లు వుంటారని 1882 రిప్పన్ ప్రఖ్యాత తీర్మానం ప్రభుత్వం యొక్క రాజకీయ వైఖరిని ప్రకటించింది. కాని ఈ వాగ్దానం రాష్ట్రాల ఉన్నతాధికార వర్గం యొక్క ప్రతిఘటనతో నెమ్మదిగా అసంపూర్తిగా అమలు పరచబడింది. సంక్రమణ క్రమంలో ఆర్థిక అంశం ఎంత ముఖ్యమైనదో తరువాత ఉదాహరణలలో వివరించబడింది. 1919 –20లో బెంగాలులో యూనియన్ బోర్డులు స్థాపించిన వెంటనే చౌకదారు పన్ను 50 శాతం పెంచబడింది. దీనికి వ్యతిరేకంగా మిద్నాపూర్‌లో పెద్ద ఎత్తున ప్రజానిరసన వెల్లువెత్తింది.

1880 దశాబ్దం చివరి నుండి కాంగ్రెస్ అభివృద్ధి అంటే కొద్ది మోతాదులలో చట్ట సభల సంస్కరణల్ని సాధించడం ద్వారా పైస్థాయిల్లో సహకారాన్ని సాధించడంగా భావించింది. లార్డ్‌క్రాస్ యొక్క భారత చట్ట సభల చట్టం 1892 అనధికార సభ్యుల సంఖ్యని పెంచింది. (ఉదాహరణకు ఇంపీరియల్ కౌన్సిలు సభ్యులు 16 మంది అనధికార సభ్యులు). స్పష్టంగా ఎన్నికల్ని అంగీకరించనప్పటికి సభ్యుల్ని నామినేట్ చేయడంలో అనధికార సభ్యులకు స్థానిక సంస్థలు, యూనివర్శిటీ సెనేట్లు, వాణిజ్యసంస్థలు, భూస్వామ్య సంఘాలతో సంప్రదించే అవకాశం

కల్పించింది. కౌన్సిలర్లకు బడ్జెటుపై చర్చించడానికి ప్రశ్నలు అడగడానికి హక్కు లభించింది. కాని సవరణలు ప్రతిపాదించేందుకు బడ్జెటుపై ఓటు చేసేందుకు, అనుబంధ ప్రశ్నలు అడిగేందుకు హక్కులేదు.

రాజ్యాంగ సంస్కరణలు అని పిలువబడే ఈ క్రమం ప్రభుత్వ విధానం యొక్క రెండు వైఖరులతో సంబంధం కలిగివున్నది. 1) మితవాదుల్ని సమీకరించే ప్రయత్నాలు (ఈ సూత్రం మింటోది. కాని అతడికి ముందునుండే అది వున్నది) 2) విభజించి పాలించే ఎత్తుగడల్ని నిపుణతతో ఉపయోగించడం. రిప్పన్‌కి పెద్ద అకాంక్షలున్నప్పటికి మునిసిపాలిటీలకు జిల్లా బోర్డులకు నిజమైన అధికారం గాని ఆర్థిక వనరులు గాని సమకూర్చకపోవడం వలన స్థానిక స్వపరిపాలన మొదటి లక్ష్యాన్ని సాధించడంలో కూడా విజయవంతం కాలేదు. జాతీయవాదులు అలాంటి సంస్థలలో ప్రవేశించారు. వారి శక్తియుక్తుల్ని మురుగు కాలవల అభివృద్ధికి పరిమితం చేసేందుకు నిరాకరించారు. చాలామంది ప్రముఖులు ప్రావిన్షియల్ ఇంపీరియల్ కౌన్సిళ్లకు వారి మార్గాన్ని వెతుక్కొనడంలో నిమగ్నమవడంతో 1892 సంస్కరణలు కాంగ్రెస్ ఆందోళన తీవ్రతని కొద్ది సంవత్సరాల పాటు తగ్గించేందుకు దోహదపడ్డాయి. (బెంగాలులో లాల్ మోహన్ ఘోష్, డబ్ల్యుసి బెనర్జీ సురేంద్ర బెనర్జీ బొంబాయిలో ఫిరోజిషా మోహతా, గోఖలే, కొద్దికాలం పాటు తిలక్ 1894 -1900 మధ్య కాలం నాటి కాంగ్రెస్ సదస్సుల ఎజెండాలో చట్ట సభల సంస్కరణ డిమాండ్లు ప్రముఖంగా చోటు చేసుకోలేదు. అవే సంవత్సరాలలో అతివాద కదలికలు ప్రారంభమయ్యాయి. 1904 నాటికి కాంగ్రెస్ పెద్ద మోతాదుల్లో చట్ట సభల సంస్కరణల్ని డిమాండు చేసింది.

**విభజించి పాలించు**

భారతీయ కులీన గ్రూపులలో మత, కుల ప్రాంతీయ విభజనల్ని ప్రోత్సహించడం గమనించవలసిన అంశం. అలాంటి విభజనకు లోతైన మూలాలు వున్నాయి. కాని ఈ విభజనలలో బ్రిటిషు వారి ప్రత్యక్ష ఉద్దేశపూర్వక బాధ్యతని జాతీయ నాయకులు కొంత అతిశయించి చెప్పారు. ఉద్దేశపూర్వకమైన ప్రభుత్వ విధానాలతో పాటు విద్య ఉద్యోగాలలో పరిమిత వనరులు, వలసపాలనలోని వెనుకబాటు తనంలో వున్న రాజకీయ ప్రయోజనాలు - కారణంగా ఘర్షణలు వస్తుంటాయి. రాజకీయ సంస్కరణలు అలాంటి ఘర్షణల్ని తీవ్రతరం చేశాయి, విస్తరించాయి. హంటర్ యొక్క 'ఇండియన్ ముసల్మాన్', అధికార వర్గాలలో భారతీయ ముస్లింలు 'వెనుకబడిన జాతి' అనే చర్చని ప్రచారాన్ని ప్రారంభించింది. 'ఒకే విధమైన సాంఘిక మత ఆచారాలు గల 50 మిలియన్ల జాతి, ఢిల్లీ అధికారం వున్న కాలంలో హిమాలయాల నుండి కన్యాకుమారి వరకు ఒక వెలుగు వెలిగిన దినాల్ని జ్ఞప్తికి తెచ్చుకొంటుంటారు' - డఫరిన్ 1888లో ముస్లింలపై చేసిన వర్ణన (డఫరిన్ క్రాస్‌కి 1888 నవంబరు). ఇవి చారిత్రకంగా వాస్తవాలు కావు. కాని మన విదేశీ పాలకులకు రాజకీయంగా ఉపయుక్తమైనవి. మున్సిపాలిటీ ఎన్నికలు యు.పి, పంజాబులో ఉద్రిక్తతల్ని ఎలా తీవ్రతరం చేశాయో యు.పి.పై ఫ్రాన్సిస్ రాబిన్సన్, పంజాబుపై యన్.బారియల్ చేసిన వివరణాత్మక అధ్యయనాలు స్పష్టం

చేస్తున్నాయి. 1886 నాటికి ల్యాల్ పంజాబు ప్రభుత్వం హోషియాపూర్, లాహోరు, ముల్తాన్‌లలో ప్రత్యేక నియోజకవర్గాల్ని ప్రవేశపెడుతున్నారు. బారియల్ వాదిస్తున్న విధంగా ఉద్దేశం అప్పటికి వున్న ఘర్షణల్ని తగ్గించటం కావచ్చు.కాని ప్రత్యేక నియోజకవర్గాలు మతపరమైన విభజనల్ని పెంచాయి. అనుచర వర్గాల్ని తయారుచేసుకోవలిసిందిగా మత నాయకుల్ని ప్రోత్సహించాయి. ఒత్తిడి తెచ్చాయి. చట్టసభల సంస్కరణల స్థాయిలో కూడా ప్రాతినిధ్యం ప్రాంతాలు సంఖ్యలు గాక నమూనాలుగా వర్గాలుగా వుండాలని లాక్స్‌డౌనే 1893 మార్చిలో నొక్కి చెప్పాడు. ప్రత్యేక నియోజకవర్గాల డిమాండుకు ఆమోదం ఎంతో దూరంలో లేదు. హద్దుని అతిక్రమించిన మతపరమైన ఉద్రిక్తతలు, శాంతి భద్రతల సమస్యల్ని సృష్టిస్తాయి. అయినప్పటికి రాజ్యకార్యదర్శి హేమిల్టన్ 1897 మే 7న ఎల్గిన్‌కి పంపిన రహస్యలేఖ ఈ అంశంపై బ్రిటిషు ఆలోచన విధానానికి నమూనాగా వుంటుంది. వాయువ్యంలో పంజాబులో హిందువులు ముస్లింల మధ్య పెరుగుతున్న ఘర్షణలు బాధాకరం. ఆలోచనలలో కార్యాచరణలలో ఐక్యత రాజకీయంగా ప్రమాదకరం. ఆలోచనలలో వైవిధ్యం సంస్కరణలు పరిపాలనాపరంగా ఇబ్బందుల్ని తెచ్చి పెడతాయి. ఈ రెండింటిలో రెండవది ఘర్షణ ప్రాంతంలో వున్న వారిలో ఆతురతని బాధ్యతని పెంచినప్పటికి తక్కువ ప్రమాదకరం.

ఇప్పటి వరకు మనం బ్రిటిషిండియా రాజకీయ యంత్రాంగాన్ని గురించి చర్చించాం. కాని పరిపాలన రాజకీయాల్నే ప్రపంచంగా లేక సర్వస్వంగా పరిగణించడం హ్రస్వదృష్టి అవుతుంది. ఇలాంటి హ్రస్వదృష్టితోనే 1973లో సియాల్ ఒక వ్యాసంలో 'భారతదేశంలో పరాయిపాలన పాలితుల్ని ఆ పాలనకు వ్యతిరేకంగా సంఘటిత మయ్యేందుకు ఉత్తేజపరిచింది. అది మనకు సంబంధించింది కాదు' (ప్రాంతం, రాష్ట్రం, జాతి పేజీలు 5,6) అని రాశారు. ఆధునిక భారతదేశం చరిత్రని, జాతీయోద్యమాన్ని అర్థం చేసుకోవడానికి అవసరమైన రెండు అంశాలు: 1) బ్రిటిషురాజ్యం జాతిపరమైన స్వభావం గలది. 2) వలసదోపిడిని కాపాడడం లక్ష్యంగా పాలన సాగించింది. ఈ రెండు అంశాలు కేంబ్రిడ్జి విశ్లేషణలో లోపించాయి.

## శ్వేత జాత్యహంకారం

భారతదేశంలో బ్రిటిషువారికి తాము యాజమాని జాతికి చెందిన వారమనే అహంకారం వుంది. భారతీయులతో గొప్పవాడు కూడా రైలులో స్టీవరులో రిజర్వుబోగీలోకి ఎక్కినప్పుడు గాని లేక ఉద్యోగంలో వివక్షతకు గురయినప్పుడు పదోన్నతికి ఆటంకాలేర్పరిచినప్పుడు జాతి వివక్షతని గుర్తించాడు. ఇల్బర్ట్ బిల్లు తుపాను చాలా తీవ్రమైనది. కాని తెల్లవారి దురహంకారం హఠాత్పరిణామం కాదు. ఉదాహరణకు మద్రాసు హైకోర్టు జడ్జిగా ముత్తుస్వామి అయ్యర్ నియామకాన్ని మద్రాసు మెయిల్ (తెల్లవాణిజ్య వేత్తల పత్రిక) వ్యతిరేకించింది. 'దేశీయ అధికారులు అదే పరిస్థితులలో పనిచేస్తున్న తెల్లవారితో సమానవేతనం పొందకూడదు' – అనేది పత్రిక చూపిన కారణం. (ఆర్. సుందరలింగం, దక్షిణ భారతదేశంలో రాజకీయాలు, జాతీయవాద చైతన్యం 1852 –91, పేజీలు 151–2), అలజడి జాతీయవాద 'హిందూ' పత్రిక స్థాపనకి దారితీసింది. ఇక సాధారణ ప్రజలు దెబ్బలు, తన్నులు, కాల్పుల

ప్రమాదాలు, పంకా కూలీని క్రమశిక్షణలో పెట్టేందుకు సాహిబ్ క్రమశిక్షణ చర్యలు, వేటలో పొరపాటున వెంటాడి చంపడంలాంటి జాత్యహంకారం యొక్క వికృతరూపాలకు బలయ్యారు. 1880 –2000 కాలంలో 81 పైగా షూటింగు కేసులు నమోదయ్యాయి. ఇలాంటి నేరాలకు కోర్టులు హాస్యాస్పదమైన తేలికపాటి శిక్షలు విధించాయి. ఇలాంటి ఘటనలు జాతీయవాదం ఎదుగుదలకు ఎంతగా పనిచేశాయో సమకాలీన పత్రికలు తెలియజేశాయి. “యూరోపియన్లు చేసే హత్యలు నానాటికి పెరుగుతున్నాయి. సైనికులు దారుణమైన నేరస్థులు.. వారు ఏదో ఒక సాకు చూపి వదిలివేయబడుతున్నారు” –వాటా 1891 అక్టోబరు 31న నౌరోజీకి ఫిర్యాదు చేశారు. (ఆర్.పి..పట్వర్ధన్ పేజి 265). అస్సాం టీ తోటల కూలీలపట్ల చూపబడిన నిరాదరణ 1880 దశాబ్దం చివరలో ఇండియన్ అసోసియేషన్ ప్రచురణలలో వ్యక్తం చేయబడింది. వర్ణ వివక్షత కర్కశత్వం అప్పుడప్పుడు భారత సమాజంలోని అత్యున్నత స్థాయికి చెందిన వారిని ఐక్యం చేయగలిగింది. అన్యాయం మోసం క్రింది వారిని ఐక్యం చేశాయి.

మానవతావాద దూరదృష్టి గల బ్రిటిషిండియా రాజనీతిజ్ఞులు వద్ద వివక్షత కర్కశత్వాన్ని అదుపు చేయ ప్రయత్నించారు. ఈ అంశంపై రిప్పన్ పట్లనే గాక కర్జన్ పట్ల కూడా తెల్లవారిలో వ్యతిరేకత వుంది. కర్జన్ తెల్లసైనికులకు వ్యతిరేకంగా రెండు సందర్భాలలో క్రమశిక్షణా చర్యలు చేపట్టారు. 1) బర్మా యువతిపై సామూహిక మానభంగం జరిపినప్పుడు 2) తార్పుడు పనిచేయ నిరాకరించిన భారతీయ వంట మనిషి హత్య చేయబడినప్పడు, రెండవ కేసుతో సంబంధం గల రెజిమెంటుకి 1903 ఢిల్లీ దర్బారు వద్ద వీరోచిత స్వాగతం లభించింది. కాని యిలాంటి అత్యాచారాలతో పాటు వలసపాలనలో గల భారతదేశం యొక్క రాజకీయ ఆర్థిక నిర్మాణంలో శ్వేతజాతితత్వం నిర్వహించవలసిన పాత్ర వుంది. బ్రిటిషువారి దృష్టికోణం నుండి చూస్తే ‘పాలనాపరమైన, సైనిక శ్రేణులలో కీలకమైన పదవులకు వీలైనంత వరకు భారతీయుల్ని దూరంగా వుంచడం హేతురాహిత్యం కాదు”. అందుకే భారతదేశంలో కూడా ఒకేసారి ఐ.సి.యస్. పరీక్షలు నిర్వహించాలనే చాలా చిన్న డిమాండుకి 50సII కాలం వ్యతిరేకత వ్యక్తమయింది. ఎల్గిన్ 1895 జూలైలో రోజ్‌బెరీకి రాసినలేఖలో “మనది ఆధిపత్యం గల జాతిగా చెప్పుకొనడం ద్వారానే మనం పరిపాలించగలుగుతాం. ఉద్యోగాలలో భారతీయులు ప్రోత్సహించబడవలసి యున్నప్పటికీ మనం కొనసాగాలంటే అదుపు మన అధీనంలో వుంచుకొనే హద్దు వుంటుంది”.

అమియాబాగ్చీ యిటీవల ప్రస్తావించిన జాతి వివక్షతకు సంబంధించిన ఆర్థిక అంశాలు ముఖ్యమైనవి. భారతదేశంలో భారతీయ పోటీదారులకు వ్యతిరేకంగా తెల్లజాతికి చెందిన వ్యాపారుల్ని ఐక్యంగా వుంచడంలో రంగు ముఖ్యమైన పాత్ర నిర్వహించింది. తెల్లవారి వర్తక వాణిజ్య సంఘాలు జనపనార, తేయాకు గనుల ప్రయోజనాలకు సంబంధించిన సంఘాల పనివిధానం పోటీ యొక్క సుగుణాలపై ఎంత విశ్వాసం వున్న వారైనప్పటికి యూరపు వర్తకులు వాణిజ్యవేత్తలు హేతుబద్ధమైన రాజీలో పరస్పర సర్దుబాటులో చాలా విశ్వాసం గలవారని స్పష్టం చేస్తుంది. (బాగ్చీ, భారతదేశంలో ప్రైవేటు పెట్టుబడి పేజి,170). కొన్ని వివాదాలు

అరకొర విభేదాలు వున్నప్పటికి భారతదేశంలోని తెల్లవ్యాపారులు, తెల్ల అధికారుల మధ్య వ్యక్తిగత సంబంధాలు క్లబ్‌లైఫ్ సంబంధాలు వుండేవి. లార్డ్ కర్జన్ 1903లో బారకార్‌లో బ్రిటిషు గని యజమానుల నుద్దేశించి చేసిన ప్రసంగంలో ప్రభుత్వానికి వాణిజ్యానికి మధ్య వుండే సంబంధం సారాంశాన్ని యిలా వివరించాడు" నా పని పరిపాలనలో వుంది. మీది దోపిడిలో వుంది. కాని రెండూ కూడా ఒకే సమస్య, ఒకే బాధ్యత యొక్క ఆకృతులు" (జె.ఆర్.మెక్లేన్ భారతజాతీయవాదం తొలినాటి కాంగ్రెస్ పేజి 37). 'పాలకులతో గల జాతిపరమైన బాంధవ్యం నుండి లభించే సానుభూతి యూరపు వర్తకులకు వారి దేశీయ ప్రత్యర్థుల నుండి ఎదురయ్యే పోటీలో కనిపించని ఎన్నో ప్రయోజనాలు సాధించిపెడుతుంది' –1944లో ఒక భారత పారిశ్రామిక సంస్థ ఆరోపణ (బాగ్చీ పేజి 166)

పారిశ్రామిక వాణిజ్య రంగాలలో యూరోపియను వాణిజ్యవేత్తల 'సామూహిక గుత్తాధిపత్యాన్ని' భారతదేశంలో – ప్రత్యేకించి తూర్పు భారతదేశంలో పటిష్ఠపరిచేందుకు శ్వేతజాతితత్వం ఆవిధంగా సహాయపడింది.

ఈ బలమైన ఆర్థికశక్తి యొక్క మారుతున్న రూపాలు పరిణామాలవైపు మన దృష్టిని సారిద్దాం.

## వలసవాద ఆర్థిక విధానం

40 సంవత్సరాల క్రితం మొదటి ప్రచురణ పొందిన ఆర్.పి.దత్ 'ఇండియాటుడే' భారత వలసవాద ఆర్థికవిధానంపై మంచి విశ్లేషణ చేసిన గ్రంథంగా యిప్పటికీ పరిగణింపబడుతున్నది. ఈ గ్రంథం మార్క్స్ పరిశీలనలను వ్యాఖ్యాలను బ్రిటిషు దోపిడి యొక్క మూడు దశలుగా అభివృద్ధి పరిచింది. మొదటిదశ 1757 –1813 కాలం ఈస్టిండియా కంపెనీ యొక్క గుత్తాధిపత్య వర్తకం ప్రత్యక్ష దోపిడి చేసిన కాలం. ఇక్కడ చేసిన వసూళ్లతో భారతదేశంలో తయారైన వస్తువుల్ని తక్కువ ధరలకు ఇంగ్లాండు యూరపుల ఎగుమతుల కొరకు కొన్నది. ఇంగ్లాండులో వచ్చిన పారిశ్రామిక విప్లవం మొత్తం వర్తకవిధానాన్ని నాటకీయంగా మార్చివేసింది. 1813 –1858 కాలం స్వేచ్ఛా వాణిజ్యం, పారిశ్రామిక పెట్టుబడిదారీ దోపిడి సాగించిన కాలం భారతదేశాన్ని మాంచెస్టర్ చట్టాలకు మార్కెటు గాను ముడిపదార్థాల వనరుగాను మార్చిన కాలం. సాంప్రదాయ చేతివృత్తుల్ని ధ్వంసం చేసిన కాలం. ప్రత్తికి పుట్టినిల్లుని ప్రత్తితో ముంచెత్తిన కాలం' (మార్క్స్) 19వ శతాబ్దం ద్వితీయార్థం నుండి కొంత పెట్టుబడి ఎగుమతి బ్రిటిషు అదుపులో పెద్ద ఎత్తున బ్యాంకుల స్థాపన, ఎగుమతి దిగుమతి సంస్థలు, మేనేజింగు ఏజెన్సీ సంస్థల ద్వారా ఆర్థిక సామ్రాజ్యవాదం చొచ్చుకొని రావడం ప్రారంభమయింది.

కాల వ్యవధులు ఒక దానిపైకి మరొకటి విస్తరించడం, పాత దోపిడీ రూపాలు పూర్తిగా అంతరించకుండానే కొత్త దోపిడీ రూపాలలో విలీనమవ్వడం – జరిగిందనే భావనతో పరిశీలిస్తే విశ్లేషణ వాస్తవికంగాను ఉపయుక్తంగాను వుంటుంది. 1870 ల తరువాత

జాతీయవాదులు నిరంతరాయంగా ప్రస్తావించిన – సంపద తరలింపుని పరిశీలిస్తే యిది స్పష్టమవుతుంది.


**సంపద తరలింపు**

1757 వరకు భారతదేశం యొక్క నూలు సిల్కు బట్టలకు పాశ్చాత్య మార్కెట్లులో విపరీతమైన డిమాండు వున్నది. పాశ్చాత్య ఉత్పత్తులకు (బ్రిటిషు ఊలు) ఎక్కడ గిరాకీ లేదు. అందువలన పాశ్చాత్య వర్తకులు వారి దేశాలలో విమర్శల నెదుర్కొన్నప్పటికి భారతదేశానికి బంగారాన్ని తెచ్చారు. ఈ సమస్య నాటకీయంగా ప్లాసీ యుద్ధంతో పరిష్కరించబడింది. ఇప్పుడు బెంగాలు నుండి దోపిడి, పన్నులు లేకుండా లోతట్టు ప్రాంతాల వర్తకం నుండి లభించిన లాభాలు, దివాన్‌గిరి పొంది చేసిన శిస్తు వసూళ్లలోని మిగులు – వీటికే కంపెనీ పెట్టుబడులు అనిపేరు పెట్టింది.

బాహాటమైన స్పష్టమైన తరలింపు క్రమం, బెంగాలులో సైనిక విజయం యొక్క లాభాలు. ఎగుమతి కొరకు వస్తువులు బెంగాలు నుండి కొనడానికి ఉపయోగించబడ్డాయి. మాంచెస్టరు పోటీ కారణంగా సాంప్రదాయక నూలు సిల్కు ఉత్పత్తుల ఎగుమతుల తగ్గుదల– కంపెనీకీ కంపెనీ ఉద్యోగులకు, ప్రైవేటు వర్తకులకు – అందరికీ తీవ్రమైన చెల్లింపుల సమస్యని తెచ్చి పెట్టింది. చెల్లింపు సమస్య తొలుత నీలిమందు అభివృద్ధి, చైనాకు నల్లమందు ఎగుమతి ద్వారా పరిష్కరింపబడింది. 1850 ల తరువాత భారతదేశం నుండి కొత్త తరహా ఎగుమతుల విస్తరణతో – పశ్చిమ భారతదేశపు పత్తి, పంజాబు గోధుమలు, బెంగాలు జనపనార, అస్సాం టీ, దక్షిణ భారతదేశపు నూనెగింజలు, చర్మం తోళ్లు ఎగుమతులతో సమస్య పరిష్కరింపబడింది. ఆ తరువాత బ్రిటన్‌కి ఏకపక్షంగా నిధుల్ని బదిలీ చేయడం అవసరమయింది. కాలం గడిచిన కొలదీ ఆ అవసరం పెరిగింది. లండన్‌లో ఈస్టిండియా కంపెనీ ఆఫీసు నిర్వహణ వచ్చి పడింది. ఇంగ్లాండులో భారతదేశం రుణభారం కంపెనీ సైనిక చర్యల ఖర్చులు, సిపాయి తిరుగుబాటు అణచివేత ఖర్చులు, ఆ సంవత్సరం కంపెనీ షేర్‌హోల్డర్సుకి యివ్వవలసిన నష్టపరిహారం ఖర్చులు – మొత్తంగా ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. అంతేగాక బ్రిటిషిండియా అధికారులకు సైనికాధికారులకు పెన్షన్లు, ఇంగ్లాండులో మిలిటరీ యితర స్టోర్స్ కొనుగోళ్లు, సైనిక కొనుగోళ్ళు, సైనికశిక్షణ వ్యయం, భారతదేశం వెలుపల రవాణా యితర ఖర్చులు, రైల్వేపెట్టుబడులపై వడ్డీలు –వీటన్నింటిని కలిపి హోంఛార్జీలు అన్నారు. హోంచార్జీలను భారతదేశమే భరించాలి. ఉదాహరణకు 1901–02లో హోంచార్జీలు 17.3 మిలియన్ల పౌండ్లు. రైల్వే వడ్డీలు 6.4 మిలియన్లు భారతదేశ రుణంపై వడ్డీ 3 మిలియన్లు, సైనిక ఖర్చులు 43 మిలియన్లు. స్టోర్ల కొనుగోళ్ళు 1.9 మిలియన్లు, పెన్షన్లు 1.3 మిలియన్ల పౌండ్లు వీటికి యింకా భారతదేశంలోని బ్రిటిషు అధికారాల చెల్లింపులు, బ్రిటిషు ప్రైవేటు పెట్టుబడులు, భారతదేశంలో గడిచిన లాభాల్ని కలుపవలసి వుంటుంది. పౌండ్ల స్టెర్లింగుతో వెండి రూపాయి మారకం విలువ తగ్గడంతో 1870 దశాబ్దం నుండి హోంచార్జీల ప్రైవేటు చెల్లింపుల భారం మరీ పెరిగింది.

సర్‌జాన్ స్ట్రాచీ 1888లో చేసిన ఉపన్యాసంలో తరలింపు యంత్రాంగం యొక్క పని విధానాన్ని స్పష్టంగా నిష్కర్షగా వివరించాడు. భారతదేశంలోని ప్రభుత్వ ఖజానా నుండి రాజ్యకార్యదర్శి బిల్సు డ్రా చేస్తాడు.

ప్రధానంగా ప్రభుత్వ ఆదాయం నుండి భారతదేశంలో చెల్లించబడిన ఈ బిల్లుల ద్వారా వ్యాపారి భారతదేశంలో తన కవసరమైన డబ్బు పొందుతాడు. రాజ్యకార్యదర్శి తనకవసరమైన మొత్తాన్ని ఇంగ్లాండులో పొందుతాడు. (భారతదేశం పేజి115) మరొక విధంగా చెప్పాలంటే భారత ఎగుమతుల్ని కొనదలచిన బ్రిటిషు వ్యాపారులు స్టెర్లింగులు యిచ్చి రాజ్యకార్యదర్శి నుండి కౌన్సిలు బిల్సు కొనుక్కుంటారు. కౌన్సిలు బిల్లులు భారత ప్రభుత్వ ఆదాయం నుండి రూపాయలుగా మార్చుకొనబడతాయి. ఆ రూపాయలు ఎగుమతిచేసే భారతీయ వస్తువుల్ని కొనేందుకు ఉపయోగించబడతాయి. విపర్యయంగా భారతదేశంలోని బ్రిటిషు అధికారులు వ్యాపారులు రూపాయలలో వచ్చిన లాభాల్ని బ్రిటిషు యాజమాన్యంలో గల మారకపు బ్యాంకుల నుండి స్టెర్లింగు బిల్లులు కొంటారు. ఈ బ్యాంకులు లండన్ బ్రాంచీలు భారతదేశ ఎగుమతుల నుండి వచ్చే రాబడి నుండి బిల్సుకి పౌండ్లలో చెల్లిస్తాయి. ఈ మారకాలను అర్థం చేసుకోనడానికి ఈ క్రింది పటం ఉపయోగకరంగా వుండవచ్చు.



హోం చార్జీలు ప్రైవేటు చెల్లింపులు భారతీయ ఎగుమతుల ద్వారా మరల్చబడ్డాయి. నౌరోజి నుండి జాతీయవాద ఆర్థికవేత్తలు మాటిమాటికి చెప్పిన విధంగా భారతదేశం యొక్క ఎగుమతి మిగులు ద్వారా సంపద తరలించబడింది. వర్తకం ద్వారా తరలింపు స్వేచ్ఛా వాణిజ్యం ద్వారా దోపిడితోను బ్రిటిషిండియా విత్త పెట్టుబడిదారీ నిర్మాణంతోను సహకరించింది.

భారతదేశం యొక్క ఎగుమతి మిగులు 19 శతాబ్దాంతానికి బ్రిటన్ చెల్లింపుల సమతుల్యతకి కీలకమయింది. పశ్చిమ యూరపు ఆమెరికాలోని యితర అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థల చుట్టూ సుంకాల అడ్డుగోడలు లేస్తూ వున్నాయి. బ్రిటిన్‌కి యింకా భారీ ఎత్తున వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల అవసరం వుంది. మరొకవైపు బ్రిటన్ ఉత్పత్తులకు సుంకాల అడ్డుగోడల కారణంగా మార్కెట్లు దొరకడం కష్టమయింది. బ్రిటన్ లోటు సమస్యల నెదుర్కొంటుంది.

ఈ సందర్భంగా బ్రిటన్‌కి భారతదేశం రెండు విధాలుగా కీలకమయింది.

**మొదటిది :** 'ఏ యితర దేశం కంటె భారతదేశంలో స్వేచ్ఛా, వాణిజ్యం బలవంతంగా అమలు జరిగేలా చూడడం – అంటే లాంక్‌షైర్ వస్త్రాలకు భారతదేశ మార్కెటుని బందీ చేయడం.

**రెండవది :** బ్రిటన్‌కి కాకుండా యితర దేశాలకు భారతదేశం నుండి భారీఎత్తున వ్యవసాయ ఉత్పత్తులు ముడిపదార్థాల తరలింపుతో ఎగుమతి మిగులు యితర దేశాలలో బ్రిటన్ లోట్లను పూడ్చుతుంది.

తరలింపు సిద్ధాంతంపై మొదటి నుండి తీవ్రమైన విమర్శలు వున్నాయి. తరలింపుపై చేసిన జాతీయవాద సూత్రీకరణలు ఈనాడు కొంత మొరటుగా, అతిశయాలుగా కనిపిస్తాయి. భారత జాతీయాదాయంలో విదేశీవర్తకం, ఎగుమతి మిగులు చాలా చిన్న భాగమే గనుక తరలింపుని గురించి జాతీయవాదులు అతిశయించి చెప్పారనే వాదన వుంది. కాని తరలింపబడిన మొత్తం భారతదేశంలో సరియైన రంగంలో పెట్టుబడిగా పెట్టివుంటే భారత జాతీయాదాయాన్ని గణనీయంగా పెంచి వుండేదని నౌరోజీ (1895లో వెల్బీ కమిషన్ ముందు) వాదించాడు. కాని సామ్రాజ్యవాదుల సమర్థకుడు స్ట్రాచీ చెప్పిన విధం యిలా ఉంది. 'ఇంగ్లీషువాడు చేసిన సేవలకు ఇంగ్లీషువాడు పెట్టిన పెట్టుబడికి భారతదేశం నుండి ఇంగ్లాండు పొందుతున్నదేమీ లేదు'. వాదనలోని మొదటిభాగం బ్రిటిషువారు తెచ్చిపెట్టిన మంచి ప్రభుత్వం, శాంతి భద్రతల్ని గురించి ప్రస్తావిస్తుంది. దానిపై చర్చ అనవసరం. ఇక తరలింపు యొక్క ఆర్థిక అంశాలకు సమర్థనగా చేసిన వాదన. ఇంగ్లాండులో స్టోర్సు కొనడం, లండన్ మనీ మార్కెటులో అప్పులు చేయడం జరిగింది. 19 శతాబ్దపు భారతదేశంలో సాధ్యపడే రేట్ల కంటె తక్కువ కావడం వలన అక్కడ కొనడం అప్పులు చేయడం జరిగింది. ఎక్కువ చెల్లింపులు (భారతదేశంలో కొనుగోళ్లు అప్పులు చేసి వుంటే) దేశంలోనే వుండి వుండేదని జాతీయవాద ఆర్థికవేత్తలు అలా వాదించి వుండవచ్చు. కాని కీలకమైన అంశం స్ట్రాచీ సూచించిన 'ఇంగ్లీషువారు వెచ్చించిన పెట్టుబడి'లో వుంది. రైల్వేలు, ప్లాంటేషన్లు, గనులు, మిల్లులలో పెట్టిన బ్రిటిషు పెట్టుబడులు

భారతదేశాన్ని అభివృద్ధిపరిచాయి. ఆధునీకరించాయి. – అని చేసే వాదన ఆ పెట్టుబడులపై లాభాల చెల్లింపుని సమర్థించుకొనడానికి చేసిన వాదన. ప్రాథమికమైన అంశం అభివృద్ధి నమూనా. బ్రిటిషు పాలన పాశ్చాత్య దేశాలలో సాధించిన ఆధునీకరణ లాంటి ఆధునీకరణని భారతదేశంలో నెమ్మదిగా బూర్జువా పద్ధతులలో తీసుకొని వస్తుందని ఒక సాధారణ అభిప్రాయం ఒకప్పుడు వుండేది. కాని అది కూడా యిటీవల కాలంలో తీవ్రమైన విమర్శల నెదుర్కొంటున్నది.

## పారిశ్రామిక విచ్ఛిన్నత

బ్రిటిషు అధికారులు, ప్రచురణకర్తలు భారతదేశ సాంప్రదాయ చేతివృత్తులు ఉత్పత్తులు క్షీణించడాన్ని అంగీకరించారు. క్షీణించడం బాధాకరంగా అనివార్యమన్నారు. పాశ్చాత్య దేశాలలోలాగానే భారతదేశంలో యంత్రాలు చేతివృత్తులను ఓడించాయన్నారు. కాని ఇంగ్లాండ్‌లో చేతివృత్తుల క్షీణతవలన వచ్చిపడిన బాధలు, ఉపాధి, ఆదాయాల్ని తెచ్చిపెట్టిన ఫ్యాక్టరీ పరిశ్రమలతో సరిదిద్దబడ్డాయి. కాని 1850,1860 దశాబ్దాలలో భారతీయ ఫ్యాక్టరీలు అభివృద్ధి చెందినందున, ఆ తరువాత కూడా అభివృద్ధి చాలా నెమ్మదిగా జరిగినందువలన ఆరువేలమైళ్ల దూరంలో వున్న దేశం సాధించిన అభివృద్ధి భారం వలసరాజ్యంగా వున్న భారతదేశంలోని చేతివృత్తుల వారిపై మోపబడింది. ఇటీవలికాలపు అమెరికా మేధావి మోరిస్‌డి. మోరిస్ అసలు పారిశ్రామిక విచ్ఛిన్నత మిధ్య అన్నాడు.

గణాంక వివరాలు సేకరించక ముందుగాని, ఆ తరువాత గాని చేతివృత్తుల క్షీణతని గణాంక వివరాలతో నిరూపించడం సాధ్యపడదు. జాతీయవాదులు తరచుగా ఉటంకించే 1881–1931 గణాంక వివరాలలో స్పష్టత లోపించడం వలన పరిశ్రమలపై ఆధారపడిన ప్రజల నిష్పత్తి తగ్గుదల కూడా స్పష్టమైన సూచిక కాదంటాడు డేనియల్ థార్నర్.

సాంప్రదాయ భారతదేశ వస్త్రాల ఎగుమతులు పడిపోవడాన్ని లాంక్‌షైర్ దిగుమతులు వేగంగా పెరగడాన్ని సూచించే విదేశీ వర్తకానికి చెందిన గణాంక వివరాల్ని జాతీయవాదులు స్వీకరించారు. దేశీయ ఉత్పత్తుల తగ్గుదలకు యిది స్పష్టమైన నిరూపణ కాదు. చేతివృత్తుల పతనమే జాతీయవాద సాహిత్యంలో ప్రధానాంశం కాదు. చేతివృత్తుల ఉత్పత్తులలో కూడా పలురకాలు, ప్రాంతాలు, వివిధ కాలవ్యవధుల మధ్య తేడాని గుర్తించాలి. దేశీయ రాజదర్బారుల డిమాండు, విదేశీమార్కెటు డిమాండులు తగ్గుదలతో మేలిరకం సిల్కులు, డక్కా ముషీరాబాద్ నూలుబట్టలలాంటి పట్టణ విలాసవస్తువుల ఉత్పత్తులు దెబ్బతిన్నాయి. బ్రిటిషువారు మొదట చొచ్చుకువచ్చిన తూర్పు భారతదేశంలో గాక యితర ప్రాంతాలలో చేతివృత్తులు చాలాకాలం వరకు మనగలిగాయి. రైలు మార్గాల విస్తరణతో అక్కడ కూడా దెబ్బతిన్నాయి. జాజ్‌మణి విధానం గ్రామీణ వృత్తిదారులు తమ ఉత్పత్తులలో కొంతభాగం రైతులకు యిచ్చి మార్పిడి సమయంలో ధాన్యం పుచ్చుకొనే పద్ధతి ఒక మేరకు కొనసాగింది. జాజ్‌మణి విధానంపై వీజర్, బీడిల్‌మన్ లాంటి సామాజిక శాస్త్రవేత్తలు 1930ల నుండి పరిశోధనలు చేస్తున్నారు. తారాశంకర్ బందోపాధ్యాయ నవల గణదేవత 1920, 1930 దశాబ్దాల నాటి

పశ్చిమబెంగాల్‌లోని ఒక జిల్లాలోని గ్రామీణ జీవితాన్ని వర్ణిస్తూ జాజ్‌మణి విధానం తగ్గుదల నూతన పరిణామంగా పేర్కొన్నది.

అయినప్పటికి పారిశ్రామిక క్షీణతని ఖండించేందుకు మోరిస్ చేసిన వాదనలు సందేహాస్పదంగా వున్నాయి. భారతదేశంలో వస్త్రాలకు డిమాండ్ ఒక్కసారిగా పెరిగినందున లాంక్‌షైర్ నుండి పెద్ద ఎత్తున దిగుమతులు జరిగినప్పటికి దేశీయ జౌళి ఉత్పత్తి స్థిరంగా వుండేదని లేక పెరిగి వుండేదని మోరిస్ వాదించాడు. కాని డిమాండు పెరిగినట్లు ఎలాంటి సమాచారం యివ్వలేదు. దిగుమతి నూలు తక్కువరేటుకి లభించడం వలన దేశీయ నేతపనివాళ్లు లాభపడ్డారనే వాదన నేతపనివాళ్లు చితికిపోవడాన్ని, అలాగే నేసిన బట్టల ధరలు పడిపోవడాన్ని విస్మరిస్తుంది. ధరలు తగ్గించే సాంకేతికపరమైన నవీకరణ జరిగింది ఇంగ్లాండులో గాని భారతదేశంలో కాదు. నూలు వడకడంలో నేతనేయడంలో ఖర్చులు తగ్గడం వలన లాంక్‌షైరు ఉత్పత్తిదారులు లాభపడ్డారు. చౌకగా నూలు దిగుమతి కావడం వలన భారతీయ నేతపనివాళ్లు ప్రయోజనం పొంది వుండేవారు. కాని నేతఖర్చులు తగ్గలేదు. అయినప్పటికి వారు చౌకగా దిగుమతి అయ్యే వస్త్రాలతో పోటీపడవలసి వచ్చింది. ఫలితంగా వారి పరిస్థితులు మెరుగుపడకపోగా క్షీణించాయి (ఇండియన్ ఎకనామిక్ అండ్ సోషల్ హిస్టరీ రివ్యూ 1968).

పారిశ్రామిక విచ్ఛిన్నత ఒక వాస్తవం. అందుకు కావలసినంత సమాచారం జనాభా లెక్కలు, కరువుకాటకాల రిపోర్టులు, ప్రాంతీయ పారిశ్రామిక సర్వేల నుండి లభిస్తుంది. బెంగాల్ పారిశ్రామిక ఉత్పత్తిదారులపై 1890 లో కల్లిక్, 1908లో కమ్మింగ్స్ జరిపిన సర్వేలను ప్రస్తావించవలసి వుంటుంది. 1905 స్వదేశీ ఉద్యమం దేశభక్తి కారణాలతో స్వదేశీ ఉత్పత్తుల డిమాండుని విపరీతంగా పెంచిందని కమ్మింగ్స్ పేర్కొన్నారు. 19వ శతాబ్దం ప్రారంభంలో బచానన్ –హేమిల్టన్‌లు బీహారులోని అనేక జిల్లాలలో నిర్వహించిన సర్వే వివరాలను 1901 జనాభా లెక్కల వివరాలతో పోల్చి అమియాబాగ్చి అధ్యయనం చేశాడు. పరిశ్రమలపై ఆధారపడిన ప్రజల శాతం 18 నుండి 8కి పడిపోయినట్లు గమనించారు. నూలు వడికేవాళ్ళ, నేతనేసేవాళ్ళ సంఖ్య విపరీతంగా పడిపోయినట్లు గుర్తించారు. జాతీయవాద ఆర్థికవేత్తలు చెప్పింది అదే. (Deindulrialisation in Gangetic Bihar 1809-1901 in essays in honours of S.c.sarkar) పారిశ్రామిక విచ్ఛిన్నత మితవాద అతివాద గాంధేయవాద మేధావులలో దేశభక్తి భావాలను ఎలా ప్రేరేపించిందీ, అలాగే పట్టణ గ్రామీణ ప్రాంతాలలో ఏ విధంగా పలురకాల ఉద్యమాలకు కారణమయిందీ – మొత్తంగా మన కాలానికి చెందిన పలు ఉద్యమాల్ని అర్థం చేసుకోవాలంటే చేతి వృత్తుల వారి బాధల్ని గాధల్ని గమనంలో పెట్టుకోవాలి.

## వ్యవసాయ పారిశ్రామికీకరణ

రైల్వే నిర్మాణం (1859లో 432 మైళ్లు, 10సం॥ల తరువాత 5000 మైళ్లు, శతాబ్దాంతానికి దాదాపు 25000 కి.మీ) ఎగుమతులు పెరుగుదల (1860 దశాబ్దపు ప్రత్తి వ్యాపార విజృంభణ కాలంలో అమెరికా అంతర్యుద్ధం కొన్ని సంవత్సరాలపాటు, అలాగే 1880 దశాబ్దంలోను 1890 దశాబ్ద ప్రారంభంలోను లాంక్‌షైర్‌ని దక్కను ముడి ప్రత్తివైపు మరల్చింది) వ్యవసాయం పారిశ్రామికీకరణల మధ్యగల సంబంధాల క్రమాలు ఆధునీకరణ సంకేతాలుగా

ప్రశంసించబడ్డాయి. సాంప్రదాయ ఆర్థికశాస్త్రాల వ్యాపారీకరణని వ్యవసాయ ఉత్పత్తులు పోగుపడడం గాను గ్రామీణ అభివృద్ధిగాను పరిగణిస్తాయి. వ్యవసాయ పారిశ్రామికీకరణ అంటే రైతులలో వ్యత్యాసాన్ని గుర్తించి చేపట్టే పెట్టుబడిదారీ వ్యవసాయమని అది పేదరైతుల్ని బాధలకు గురిచేసినప్పటికి ఉత్పత్తిని పెంచుతుందని మరొక ధోరణి వ్యక్తమయింది. నిజమైన అభివృద్ధి లేకుండానే వ్యత్యాసాలకు దారితీసే కృత్రిమమైన బలవంతంగా రుద్దబడిన క్రమం నుండి వ్యాపారీకరణ ఆవిర్భవిస్తుంది.

వ్యాపారీకరణ నమూనా పంట పంటకి మారుతుంది. తక్కువ జనాభా ఒత్తిడి కలిగి తెల్లవారి ప్రత్యక్ష యాజమాన్యంలో ఒప్పందం ద్వారా (దాదాపు బానిసత్వానికి దగ్గరగా వుండే పరిస్థితులతో) కుదుర్చుకొన్న కూలీలతో టీ తోటల పెంపకం జరిగింది. మధ్య బెంగాలులో నీలిమందు సాగు దాదాపు రైతులే చేశారు. రైతులకు అడ్వాన్సులిప్పించి బలవంతంగా ఒప్పందాల్ని కుదిరించే స్థానికదాదాలు వుండేవారు. లాభాలు చాలా తక్కువ. అవి కూడా కచ్చితంగా వస్తాయని గ్యారంటీ ఏమీలేదు. కాని తూర్పు బెంగాలులో జనపనార సాగు వరికంటె లాభదాయకమైనది. రైతులపై ఒత్తిడి అవసరం లేదు కాని ఇలాంటి వ్యత్యాసాలునప్పటికి కొన్ని సామాన్య కారణాలు వున్నాయి.

19 శతాబ్దం ద్వితీయార్థం నాటికి విదేశీ వర్తకంపై నౌకాయానంపై ఇన్సూరెన్సులపై బ్రిటిషు వాణిజ్య సంస్థలు పూర్తి పట్టుసాధించాయి. కాబట్టి ఎగుమతి విజృంభణతో గుట్టలుగా వచ్చిపడిన లాభాలు విదేశీ సంస్థలచే స్వాయత్తం చేసుకోబడ్డాయి. అవి విదేశీ లీకేజీలుగా దేశాన్ని వదిలివెళ్లాయి. గణనీయమైన భాగం వ్యవసాయదారులకు అడ్వాన్స్‌లిప్పించి ఆ విధంగా ఉత్పత్తి అదుపు సాధించిన దళారులకు దక్కింది. అలాంటి అడ్వాన్సుల అవసరం కౌలు భారంలో ముడిబడి వుంది. ఇటీవల చెరుకు వ్యవసాయంపై గోరఖ్‌పూర్ జిల్లాలో జరిపిన సూక్ష్మ అధ్యయనంలో వ్యక్తమయింది. పెట్టుబడిదారీ విధానం చొరబాటు, అప్పటికే పాతుకుపోయిన భూస్వామ్య వడ్డీ వ్యాపారి దోపిడీ చట్రం (చక్కెర మిల్లులు స్థానిక జమిందారుల్ని రైతుల నుండి చెరుకు తోలించే కాంట్రాక్టర్లుగా నియమించడంతో) మరింత పటిష్ఠమవ్వడానికి దోహదపడింది. కొన్ని ప్రాంతాలలో –ఉదాహరణకి దక్కనులోని ప్రత్తి పండించే ప్రాంతాలలో, ఆంధ్ర తమిళనాడులోని కృష్ణా, గోదావరి కావేరి డెల్టాలలో, శతాబ్దాంతానికి పెద్ద ఎత్తున నీటిపారుదల పనులు ప్రారంభించిన పంజాబులో ఒక చిన్న సంపన్న రైతువర్గం ఆవిర్భవించడం ప్రారంభమయింది. కాని ఉత్పాదకత సాంకేతికతలో పురోగతికి వ్యతిరేకంగా అంతర్గత నిర్మాణం గల వ్యవస్థ పనిచేసింది. గొలుసుకట్టుగా వున్న దళారీల ద్వారా మాత్రమే సంబంధం గలిగి, చాలా దూరంలో తెలియని విదేశీ మార్కెటుపై ఆధారపడేలా చేయబడిన భారతీయ రైతు చాలా ఎగుడు దిగుడుల ధరల భారాన్ని కూడా మోయవలసిన స్థితికి నెట్టివేయబడ్డాడు. 1860ల నాటి ప్రత్తి విజృంభణ నాటకీయంగా కన్పించినంత త్వరగా అదృశ్యమయింది. (1859 లో బొంబాయిలో పౌను ముడిప్రత్తిధర 2 అణాల 7 పైసలు, 1864 లో 11 అణాల 5 పైసలు, 1866లో 6 అణాల 2 పైసలు). ఫలితంగా 1860లో ప్రత్తితో అభివృద్ధి చెందిన దక్కను ప్రాంతం 1870 దశాబ్దం మధ్య నాటికి అప్పులతో, కరువుకాటకాలతో వ్యవసాయ

ఘర్షణలతో కూరుకుపోయింది. 1870ల నుండి 1890 వరకు ప్రపంచ వ్యవసాయ ఉత్పత్తుల ధరల తగ్గుదల (ఉత్తర అమెరికా) అర్జెంటీనా అస్ట్రేలియా నుండి వచ్చిన సరఫరాల కారణంగా) ప్రభావం భారతదేశంలోని గోధుమ ప్రత్తి ధరలపై పడింది. 20వ శతాబ్దంలో మనం చూడబోతున్న విధంగా కృత్రిమంగా పెంచబడిన రూపాయి స్టెర్లింగు నిష్పత్తి యొక్క ప్రతికూల ప్రభావం ఆ తరువాత 1930 లలో తీవ్రమైన ఆర్థిక మాంద్యం వచ్చిపడ్డాయి.

పెద్ద ఎగుమతి సంస్థలు, భారతీయ వర్తకులు వడ్డీవ్యాపారులు ధరలు పెరిగితే లాభాలు పొందారు. ధరలు తగ్గినా లాభాలు పొందారు. కాని ఉత్పాదక పెట్టుబడి లేక నవీకరణ విపత్కరమైనవిగా భావించారు. కొంత డబ్బు కూడబెట్టగలిగిన రైతు వర్తకం, వడ్డీవ్యాపారం పట్ల ఆకర్షితుడయ్యాడు. పొలాన్ని కౌలుకి పాలికి యిచ్చాడు. పెట్టుబడిదారీ వ్యవసాయం చేపట్టడానికి బదులుగా ఉత్పాదక భారాన్ని పరాన్న భుక్కులా యితరులపైకి తోశాడు. ఇక పెద్ద మెజారిటీగా వున్న పేదరైతుల విషయానికి వస్తే పెరుగుతున్న కౌళ్లు, శిస్తులు డబ్బు రూపంలో చెల్లించవలసి రావడంతో వ్యాపారీకరణ వారిపైన బలవంతంగా రుద్దబడింది. కోయంబత్తూరు రైతులు ఒకసారి బ్రిటిషు కలెక్టరుతో తాము తినలేము గనుక ప్రత్తి పండిస్తున్నామని, ధాన్యం పండించివుంటే తిని వుండేవాళ్లమని, యిప్పుడు అర్ధాకలితో అలమటించినా కనీసం కౌళ్లు, శిస్తులు చెల్లించడానికి తగినంత డబ్బు వుండేదని చెప్పుకున్నారు. కౌళ్ళు, శిస్తుల ఒత్తిడి కారణంగా వ్యాపార పంటలకు ఎక్కువ ధర గల గోధుమ లాంటి ఆహారధాన్యాలకు మారడమంటే పేద ప్రజల ఆహారపు పంటలైన జొన్న, సజ్జ పప్పుధాన్యాల నుండి వైదొలగడమే. ఇలాంటి మార్పు కరువు సంభవించిన సంవత్సరాలలో పెద్ద వినాశనానికి దారితీసింది. అంతేగాక వ్యాపార పంటలకు ఎక్కువ పెట్టుబడులు అవసరమయ్యాయి. కనుక వడ్డీ వ్యాపారులపై ఆధారపడడం అనివార్యమయింది. ఆ విధంగా వ్యాపారీకరణ రైతులలో వ్యత్యాసాన్ని తెచ్చింది గాని నిజమైన పెరుగుదలకు తోడ్పడలేదు. చాలామంది రైతులు బాధలకు గురయ్యారు. (పెట్టుబడిదారీ ఆధునీకరణలో కూడా బాధలు పడి వుండేవారు) కాని ఏదో పొందుతామనే ఆశలు లేని బాధలను అనుభవించారు.

**భూ సంబంధాలు**

పారిశ్రామీకరణ ప్రత్యేక ఫలితాలు బ్రిటిషువారు ప్రవేశపెట్టిన లేక పటిష్ఠపరచిన భూ సంబంధాల చట్రంతో ముడిబడి వుంటాయి. జమిందారీ రైత్వారీ విధానాల పరిణామం ఈ గ్రంథ పరిధిలోకి రాదు. ప్రస్తుతం కొన్ని దీర్ఘకాలిక ధోరణుల్ని గురించి ప్రస్తావిద్దాం. ప్రధానంగా ఎక్కువ ఆదాయాన్ని రాబట్టుకొనే పేరాశ, ఎగుమతుల కొరకు కొన్ని రకాల వ్యవసాయ ఉత్పత్తుల్ని ప్రోత్సహించాలనే ఆకాంక్షలతో బ్రిటిషు వ్యవసాయ విధానాలు రూపొందించబడ్డాయి. అంతేగాక రాజకీయ మిత్రులు వున్నవారిని నిలబెట్టుకోవడం, కొత్తవారిని రాబట్టుకోవడం, పరిపాలనా పరమైన సౌలభ్యం, మారుతున్న రాజకీయ అంచనాలు – కొన్ని సందర్భాలలో గణనీయమైన పాత్ర నిర్వహించాయి. 'ఆస్తి అనే మంత్రదండం స్పర్శ... ఉత్పాదకతని పెంచుతోంది' – అనే శాశ్వత భూమి శిస్తు విధానాన్ని రూపొందించిన వారి

విశ్వాసం ఎప్పుడూ వాస్తవరూపం దాల్చలేదు. బెంగాలు జమిందారులు 18వ శతాబ్దపు బ్రిటిషు తరహా భూస్వాములుగా అభివృద్ధి చెందలేదు. కౌళ్లరూపంలో వీలైనంత ఎక్కువ మొత్తాలు రాబట్టుకొన్నారు. వ్యవసాయంలో పెట్టుబడులు పెట్టడానికి బదులుగా ఫ్యూడల్ వడ్డీవ్యాపార దోపిడీలు కొనసాగించారు. 1770 కాటకం నుండి ప్రజలు కోరుకొన్నారు గనుక కౌళ్లు పెంచడం తేలికయింది. 1885 నాటికి స్వంత యాజమాన్యంలో గల పెద్ద ఎస్టేట్లు పెరగలేదు. విభజనలతో ముక్కలు చెక్కలైన జమీందారులు పెరిగారు. (19వ శతాబ్దాంతానికి శాశ్వత శిస్తు విధానం క్రింద వున్న 110,456 బెంగాలు బీహారు ఎస్టేట్లలో 88.5 శాతం 500 ఎకరాల లోపు వున్నవే) చిన్న జమీందారులు, భూస్వాములు కూడా అంత సంపన్నులు కారు. శతాబ్దాంతానికి పెరుగుతున్న ధరలు, ప్రభుత్వ సేవలలో వృత్తులలో తగ్గిపోతున్న ఉపాధి అవకాశాలు, కౌలు పెంపుదలపై విధించబడిన కొన్ని షరతులు వారిని కృంగదీశాయి. భూమిపై ఆదాయం స్వభావరీత్యా పరాన్నభుక్కు అయింది. ఈ పరిస్థితులు సృష్టించిన రాడికలిజం సామాజిక సంక్షోభాల మిశ్రమం బెంగాలులోని జాతీయవాదాన్ని అర్థం చేసుకోవడానికి ప్రాథమిక అంశంగా తోడ్పడుతుంది.

శాశ్వత భూమి శిస్తు విధానం అమలు పరచబడిన ప్రాంతాల రైతుల విషయానికి వస్తే 1850ల తరువాత బ్రిటిషు విధానాలు వారిని ఇంగ్లీషు ఈమెన్ రైతుల నమూనాగా మార్చాలని ప్రయత్నించాయి. కాని వలసవాద పరిస్థితులు విరుద్ధమైన ఫలితానికి దారితీశాయి. మైనారిటీగా వున్న ఆక్రమణ రైతులను ఖాళీ చేయించటం, కౌలు పెంపుదల నుండి 1859, 1885లలో చట్టపరమైన రక్షణ కల్పించబడింది. ఈ రైతులు క్రమంగా భారాన్ని దిగువనున్న కౌలు రైతులు పాలికాపుల పైకి నెట్టారు.

ఆ విధంగా నిజమైన ఉత్పత్తిదారుడు మెరుగైన పద్ధతుల గురించి ఆలోచించలేనంతగా అణచివేయబడ్డాడు. ఇక పెద్ద రైతులకు భూస్వాములకు వాణిజ్యపరమైన ఆటుపోట్లను ఎదుర్కోవలసిన అవసరం లేకపోయింది. ఫలితంగా వారిలో కొత్తమార్పులు తీసుకొని వచ్చే శక్తీ ఆసక్తీ లోపించాయి.

రైత్వారీ ప్రాంతాలలోని నమూనా అంతకు భిన్నంగా లేదు. రైతులతో ప్రత్యక్షంగా పరిష్కారం అమలు జరపబడినప్పటికి ధర్మకుమార్ మాటల్లో మద్రాసు రైతు తన పొలాన్ని కౌలుకి యిచ్చాడు. ప్రత్యేకించి 1850ల తరువాత శిస్తు భారం క్రమంగా కొంతవరకు తగ్గించబడింది. (దక్షిణ భారతదేశంలో భూమి, కులం) రైత్వారీ కౌలుదారులు క్రమంగా పెరిగారు. వారు అనామకులు చట్టం చేత రక్షణ కల్పించబడనివారు. కనుక వారి బాధలు పెరిగాయి. ఇటీవలి వివరణాత్మక అధ్యయనాలు ప్రాంతీయ పరంగా వారి బాధల వ్యత్యాసాల్ని వివరించాయి. తంజావూరు రైత్వారీ భూస్వాములు వ్యవసాయ కూలీలతో సాగు చేయించారు. నీటి పారుదల సౌకర్యాలు లేని తమిళనాడులో రాయలసీమలో చెదురు మదురుగా లోతట్టులో వున్న సంపన్నభూస్వాములు వర్తకం వడ్డీ వ్యాపారాలతో సాధారణ పేదరైతులపై అధిపత్యం సాధించారు. దీనికి భిన్నంగా ఆంధ్రా డెల్టా ప్రాంతంలో మధ్య తరగతి రైతులు అభివృద్ధి చెందారు. భూసారం నీటి పారుదల సౌకర్యాలు రైతులలో ఈ వ్యత్యాసాల్ని తెచ్చాయి. బెంగాలులో

శతాబ్దాల తరబడి నదులు తూర్పు జిల్లాలలో ప్రవహించడం వలన అక్కడ తూర్పు జిల్లాలకు పశ్చిమజిల్లాలకు వ్యత్యాసం వుంది. పశ్చిమ జిల్లాలోని రైతులు సంపన్నరైతులుగా పాలికాపులుగా విడిపోయారు. సంపద్వంతమైన తూర్పు బెంగాలులో అనుకూల వాతావరణం, జనపనార నుండి లాభాల కారణంగా స్వేచ్ఛాయుతమైన చిన్న, మధ్యతరగతి రైతులు అసంఖ్యాకంగా ఎదిగారు. అలాంటి వ్యత్యాసాలు రాజకీయ పరిణామాలకు కారణాలవుతాయి.

పొలం కలిగిన రైతులకు, కౌలు రైతులకు దిగువన వ్యవసాయకార్మికులు వున్నారు. వీరంతా గిరిజన తెగలకు దిగువ కులాలకు చెందినవారు. వీరి సంఖ్య (వీరిపై ఆధారపడిన వారితో సహా) 1901లో 52.4 మిలియన్లుగా అంటే మొత్తం జనాభాలో ఐదవవంతుగా అంచనావేయబడింది. గతంలో వున్న సమసమాజ గ్రామీణ వ్యవస్థని పారిశ్రామిక విధ్వంసం – ఫలితంగా పెరిగిన భూమిపై ఒత్తిడి విచ్ఛిన్నం చేశాయని జాతీయవాదులు సిద్ధాంతీకరించారు. వలసవాద విధానాలు గ్రామీణ పేదల్ని పెంచి, వారి స్థితిగతుల్ని క్షీణింపజేసినప్పటికి, భూమి లేని పేదలు వలసవాద సృష్టికాదని ఇటీవలి అధ్యయనం స్పష్టం చేసింది. ఉదాహరణకు దక్షిణ భారతదేశంలో కేవలం కుటుంబ శ్రమతో సాగు చేయడం సాధ్యపడనంత పెద్ద భూకమతాలు గల రైతులు గణనీయంగా వున్నారు. అగ్రకులాలు శారీరక శ్రమ చేయకూడదనే నిబంధన వుండేది. అస్పృశ్యులైన మలబారు బెరుమాన్లు తమిళ పరైయాన్లచే పొలం పనులు చేయించేవారు. (ధర్మకుమార్ పొలం – కులం, అధ్యాయలు III, I౭). భూమి అదనంగా వున్న పరిస్థితులలో కూడా, కొన్ని గ్రూపులు భూమి కలిగి వుండటాన్ని అడ్డుకొనడంలో కులం ముఖ్యమైన పాత్ర పోషించింది. పై కులాలకు చెందిన రైతులు ప్రత్యేకించి నూర్పిళ్ల సమయంలో కూలీల కొరత ఏర్పడినప్పుడు సామాజిక ఒత్తిడి, వడ్డీ వ్యాపారులను ప్రయోగించి వెట్టి చాకిరి చేయించారు. సూరత్‌లో అనావిల్ బ్రాహ్మణులు దూబ్లా రుణ బానిసలపై జరిపిన క్షేత్ర స్థాయి అధ్యయనంలో జాన్ బ్రేమన్ 'సాంప్రదాయ విధానంలో దోపిడి సంక్లిష్టమైనది, సంరక్షణ సంబంధంతో శాంతపరచబడేది' అంటాడు. దూబ్లా యజమానివైపు తనకు రక్షణ కల్పించే వాడు బ్రతికించేవాడు – అనే కృతజ్ఞతా భావంతో చూస్తాడు. వలసవాదం, (వలసవాదానంతర) ఆధునీకరణ ఈ సంరక్షణ భావాన్ని తగ్గించింది. 'అప్పు షరతులపై ఒప్పందం' సంబంధంగా మార్చింది. దోపిడి ముసుగుని తొలగించింది (జాన్ బ్రేమన్, సంరక్షణ, దోపిడి పేజీలు 21, 189).

"భారతదేశ చరిత్ర యొక్క ఏ ఇతర కాల వ్యవధిలో కూడా 1790–1940 కాలంలో ఎదిగినంత పెద్ద, సువ్యవస్థిత సురక్షిత సంపన్న భూస్వాముల గ్రూపు ఎదగలేదు" – డేనియల్ థార్నర్ (భారతదేశంలో భూమి, శ్రమ – పేజీ 107) జమిందారులు సంపన్న రైతులు వ్యాపారీకరణలో గణనీయంగా భాగస్వాములయ్యారు. కాని వ్యవసాయ ఉత్పాదకతకు పెట్టుబడి పెట్టే వ్యవస్థాగత అవసరాన్ని గుర్తించలేదు. వారికి పెట్టుబడిదారీ వ్యవసాయం కంటే కౌళ్లు, వడ్డీ వర్తకం పదిలంగాను, లాభదాయకంగాను కన్పించాయి. వ్యవసాయ కార్మికుల్ని నియమించి సాగు చేయించిన పెద్ద రైతులు కూడా ఆధునికత సాంకేతిక పరిజ్ఞానం వైపు దృష్టి మరల్చలేదు. కుల కట్టుబాట్లతోనో లేక రుణభారంతోనో పనిచేసే వ్యవసాయ కార్మికులకు సాంకేతిక పరిజ్ఞానం పట్ల ఆసక్తి లేదు. వలసవాదం ఆధునికతని తెచ్చి పెట్టలేదు. అర్ధ భూస్వామ్య సంబంధాలను పటిష్టపరిచింది.

## వ్యవసాయ ఉత్పత్తి

1870ల నుండి కొన్ని వ్యవసాయ ప్రయోగ క్షేత్రాలను నెలకొల్పడం, అరకొరగా తకావి రుణాలివ్వడం తప్ప ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అంతగా చేసిందేమీ లేదు. పంజాబు పశ్చిమ యు.పి. మద్రాసులో కొన్ని ప్రాంతాలకు కాలువల ద్వారా సాగునీటి సౌకర్యం కల్పించింది. తూర్పు భారత దేశంలో సాగునీటి సౌకర్యం పూర్తిగా విస్మరించబడింది. అక్కడ వ్యవసాయాన్ని అభివృద్ధి పరిస్తే ప్రభుత్వం పొందే ప్రయోజనం అంతగా లేదు. సాగునీటి వసతి కల్పించడం పరిమితమైనదైనప్పటికి నిజమైన ప్రయోజనంగా భారతీయవాద చరిత్రకారులు గుర్తించారు.

కాని యు.పి.పై ఎలిజబెత్ విట్ కూంబే యిటీవలి అధ్యయనం బ్రిటిష్ పాలనకి సంబంధించిన ఈ అంశంపై సందేహాన్ని వ్యక్తం చేశారు. బ్రిటిష్ కాలువలు బావులలాగా స్థానిక పరిస్థితులకు సరిపడినవి కావు. అవి చిత్తడి నేలల్ని భూమిలో క్షారతని పెంచాయి. అంతేగాక నీటి ఛార్జీలు చాలా ఎక్కువగా వుండటం వలన కొద్దిమంది సంపన్న రైతులకే ఫలితాలు దక్కాయి. చెరకు ప్రత్తి, గోధుమలాంటి నీటి పారుదల పంటలకు లభించిన ప్రోత్సాహం పేదల ఆహారమైన జొన్న యితర కాయధాన్యాల ఉత్పత్తి తగ్గడానికి దారితీసింది. అదే సమయంలో పంజాబ్ లాంటి ప్రాంతాలలో బ్రిటిష్‌వారు నిర్మించిన కాలువల ద్వారా కొత్త భూములు సాగులోకి వచ్చాయి.

వలసవాద చట్రం మొత్తం భారత వ్యవసాయ ఆర్థిక విధానాన్ని క్రుంగదీసే విధంగా రూపొందించబడింది - అంటారు డేనియల్ థార్నర్. 1870 దశాబ్దం అంతటా 1890 దశాబ్దం చివరలో వరుసగా వచ్చిన వినాశకరమైన కరువులు, దానితోపాటు విస్తరించిన ప్లేగు, 20 సంవత్సరాల తర్వాత వచ్చిన ఇన్‌ఫ్లూయంజాకు లక్షలాది మంది మరణించారు. పలు కారణాల రీత్యా 1921 వరకు జనాభా పెరుగుదల నెమ్మదిగా జరిగింది (1891లో 282 మిలియన్లు, 1901లో 285 మిలియన్లు, 1911లో 303 మిలియన్లు, 1921లో 306 మిలియన్లు) భారతదేశ దారిద్ర్యానికి జనాభా పెరుగుదల కారణం కాదు.

1893-1946 వ్యవసాయ గణాంక వివరాలపై జార్జి బ్లిక్ పరిశోధనలు వ్యవసాయక పురోగతి స్తంభించినట్లు స్పష్టం చేశాయి. 1893-96ని ప్రాథమిక కాల వ్యవధిగా తీసుకుంటే ప్రతి పది సంవత్సరాల పంట సగటు ఉత్పత్తి 1936-46 కాలానికి ఆహార పంటలకు 93, వాణిజ్య పంటలకు 185, వ్యవసాయ ఉత్పత్తుల మొత్తానికి 110, కాని 1921 తరువాత తలసరి ఉత్పత్తి తగ్గడం ప్రారంభమయింది. 1936-46 నాటికి అన్ని పంటలకు 80 ఆహార ధాన్యాలకు 68. 1900-05 నుండి 1935-40 కాలానికి అమియాబాగ్చి ఎకరం సరాసరి ఉత్పత్తుల పైన చేసిన అధ్యయనాలు అదే తరహా ఫలితాలు చూపెట్టాయి. ఎకరం వాణిజ్య పంటల విలువ రు. 36.7ల నుండి రు. 37.9లకు కొద్దిగా పెరగగా ఆహార పంటల విలువ రు. 25.4ల నుండి రు. 22.7లకు తగ్గింది. అన్ని పంటల విలువ రు. 27.6 నుండి రు. 26.38కి తగ్గింది. (ఎ.కె. బాగ్చి, భారతదేశంలో ప్రైవేట్ పెట్టుబడి పేజీ 95). బ్లిన్ యొక్క గ్రేటర్ బెంగాల్ ప్రాంతం తగ్గుదల పంజాబ్, మద్రాసులలో పెరుగుదలకు మధ్య గల వ్యత్యాసం

అంతే ప్రాధాన్యత గల అంశం. బ్రిటిష్ పాలన చివరి దశాబ్దాల నాటికి తూర్పు భారతదేశం వెనుకబాటుతనం స్థిరపడిపోయింది.

### విదేశీ పెట్టుబడి

బ్రిటిషు పెట్టుబడిలో రైలు మార్గాల నిర్మాణం, ప్లాంటేషన్లు గనులు ఫ్యాక్టరీల అభివృద్ధి, పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు ఆధునిక బ్యాంకింగ్ పారిశ్రామిక యాజమాన్యం వగైరాలు ప్రవేశపెట్టడంలాంటి చర్యలతో బ్రిటిష్ పాలన ఆధునీకరణ తెచ్చిపెట్టబడిందని చెప్పబడుతున్నది. నిజమే బ్రిటిష్ వారు రైలు మార్గాలు నిర్మించారు. భారతదేశంలోని రైలు మార్గాల అల్లిక ప్రపంచంలో ఐదవ స్థానంలో వుంది. భారతదేశంలో బ్రిటిష్‌వారు అత్యధికంగా పెట్టుబడి రైల్వే నిర్మాణంపైననే పెట్టారు. కాని బ్రిటిష్‌వారు ఆ భారాన్నంతా గ్యారంటీ కల్పించబడిన వడ్డీ విధానం ద్వారా భారతీయులపైననే మోపారు. లాభాలు రాకపోయినప్పటికీ ప్రభుత్వం పెట్టుబడికి డివైడెండ్లు పరిచింది. ఆ విధంగా 1900 నాటికి 50 మిలియన్ల పౌండ్లు చెల్లించింది. ప్రైవేట్ పెట్టుబడి విధానం కారణంగా పనిలో నాణ్యత లేదని, చాలా దుబారా జరిగిందని జాతీయవాదులు పేర్కొన్నారు. నిర్మాణపు పొందిక బ్రిటిష్ వాణిజ్య వ్యూహాలకు అనుకూలంగా చేపట్టబడింది. రవాణా ఛార్జీలతో వివక్ష పాటించబడిందని భారత వాణిజ్యవేత్తలు ఆరోపించారు. అన్నిటిని మించి వలస దేశంగా వున్న భారతదేశానికి రైల్వేల వలన కలగవలసిన బహుళ ప్రయోజనాలు దక్కలేదు. రైల్వే పరికరాలన్నీ ఇంగ్లండ్ నుండి దిగుమతి చేయబడ్డాయి. అనుబంధ ఇంజనీరింగ్ పరిశ్రమలు తగినంతగా అభివృద్ధి పరచబడలేదు.

అప్పటి నుండి స్వతంత్రం వచ్చేవరకు గల మొత్తం కాలంలో భారతదేశంలో తయారు చేయబడిన రైలు ఇంజన్లు కేవలం 700 మాత్రమే. 1921 నాటికి రైల్వేలోని పై ఉద్యోగాలలో కేవలం 10% మంది మాత్రమే భారతీయులు రైల్వే ఆదాయంలోని అత్యధిక భాగం ఇంగ్లండ్‌కి తరలించబడినప్పటికీ కొత్త నిపుణతలు విస్తరణ జరగలేదు.

ప్లాంటేషన్లు గనులు జూటు మిల్లులు బ్యాంకింగ్ ఇన్స్యూరెన్స్, షిప్పింగ్, ఎగుమతి దిగుమతి సంస్థలు – వాటి ఆర్థిక వాణిజ్య పారిశ్రామిక కార్యకలాపాలు – అన్నీ కూడా పరస్పర సంబంధం గల మేనేజింగ్ సంస్థల విధానం ద్వారా ప్రోత్సహించబడ్డాయి. ఇవి భారతదేశ అభివృద్ధికి ఏ విధంగా తోడ్పడ్డాయనేది వేరే విషయం.

విదేశీ నియంత్రణలో వుండే విదేశీ పెట్టుబడిదారీ స్థావరాల్ని సృష్టించడం వాటి లక్ష్యం. ఇవి దేశీయ ఆర్థికాభివృద్ధిని అడ్డుకున్నాయి. భారతదేశం విషయంలో 'పెట్టుబడి ఎగుమతి' ప్రత్యేకమైన అర్థాన్ని సంతరించుకున్నది. ఉదాహరణకు అన్నిటిని మించి ఈ కాలమంతటా ఆర్థిక రంగంలోని నిర్ణయాత్మక సెక్షన్లపై బ్రిటిష్ నియంత్రణ ఏ విధంగా దేశీయ పెట్టుబడిదారీ విధానం పెరుగుదలని అడ్డుకొన్నదో ప్రాంతీయ వ్యత్యాసాలపై ఇటీవలి అధ్యయనాలు స్పష్టం చేశాయి.

## భారతీయ పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి

బొంబాయి, గుజరాత్‌లలో భారతీయ పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందడానికి, బెంగాల్‌లో అభివృద్ధి చెందకపోవడానికి కారణాలు బెంగాలీ కులీనులకు వాణిజ్యం పరిశ్రమల పట్ల గల విముఖత అని, అలాగే శాశ్వత శిస్తు విధానం దేశీయ పెట్టుబడిని పొలం ఆకర్షించిందని వివరణలు యిస్తుంటారు. కాని 1840 వరకు వాణిజ్యంలో బెంగాలీ అగ్రకులాల జోక్యం గణనీయంగా వుంది. 19వ శతాబ్దం అంతటా బెంగాల్‌లోని వార్తా పత్రికలు, యితర జర్నల్స్ స్వతంత్ర వ్యాపారం యొక్క ప్రయోజనాల్ని, లాభాల్ని గురించి పాఠకులకు చెప్పాయి. పార్సీల విజయానికి వారిలో వున్న పట్టుదల దీక్ష కారణాలుగా చెప్పబడ్డాయి. వాణిజ్యంలో విజయాలు సాధించిన గుజరాతీ బనియాలలో మార్వాడీలలో ఆధునిక సాంస్కృతిక విలువలు కనిపించవు. అదే సమయంలో బెంగాలీ బ్రహ్మ సమాజవాదులకు ఆధునికత ఆర్థిక విషయాలలో తోడ్పడలేదు. ఇక భూసంబంధాల విషయానికి వస్తే జమిందారీ రైత్వారీ విధానాల ప్రభావంలో తేడా లేదని మనం యింతకుముందే గమనించాం. శాశ్వత భూమి శిస్తు విధానం పట్టణ పెట్టుబడిని పొలం వైపు ఆకర్షిస్తుందనే సిద్ధాంతీకరణపై లాండ్ మార్కెట్‌పై యిటీవలి అధ్యయనం సందేహాలు కలిగిస్తుంది. మొత్తం మీద అమియాబాగ్చీ వాదించిన విధంగా ఆర్థిక విధానంపై విదేశీ సామ్రాజ్యవాద ఆధిక్యత తరతమ భేదాలతో పనిచేస్తుందనేది సులభమైన వివరణగా వుంది.

బ్రిటిష్‌వారు దేశీయ పెట్టుబడిదారీ విధానాన్ని బొంబాయి పరిశ్రమకు వ్యతిరేకంగా విధించిన విచక్షణా రహిత సుంకాలు, ఎక్సైజ్ విధానాల ద్వారానేగాక పలురకాల ఆటంకాలు కల్పించి అడ్డుకున్నారు. తెల్లజాతి వ్యాపారులకు, తెల్లజాతి అధికారులకు మధ్య గల వివిధ సామాజిక సంబంధాలను గురించి యింతకు ముందే ప్రస్తావించడం జరిగింది. స్వేచ్ఛా వాణిజ్యం అడ్డం పెట్టుకుని సాగించిన ప్రభుత్వ విధానాలు భారతీయుల పట్ల వివక్ష చూపుతూ యూరప్ వర్తకాన్ని ప్రోత్సహించాయి (గ్యారంటీ విధానం కింద రైలు మార్గాలు, అస్సాం టీ తోటల పెంపకందార్లకు విస్తారమైన ప్రాంతాలు నామమాత్రపు రేట్లకి కేటాయింపులు ఉదాహరణలు). రైలు మార్గాల అల్లిక, రవాణా ఛార్జీలు నౌకా రేవులకు సరుకుల తరలింపుని సులభతరం చేశాయి. పట్టణాలు నగరాల మధ్య అలాంటి సౌకర్యం కల్పించబడలేదు. వ్యవస్థీకృత ద్రవ్య మార్కెట్ – 1914కి ముందు రెండు భారతీయ బ్యాంకులు– పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా మినహాయించి అంతా బ్రిటిష్ వారి అధీనంలో ఉంది. అన్నిటికంటే ముఖ్యమైన అంశం : 19వ శతాబ్దపు భారతదేశ ఆర్థికాభివృద్ధి ఎగుమతి అవసరాలకు అనుగుణంగా సన్నద్ధం చేయబడింది. దేశం యొక్క విదేశీ వర్తకంలోని అత్యధిక భాగాన్ని బ్రిటిష్‌వారి మారకపు బ్యాంకుల ద్వారా, ఎగుమతి దిగుమతి సంస్థల ద్వారా, నౌకా సంస్థల ద్వారా అదుపు చేశారు.

తెల్లవారి సమిష్టి గుత్తాధిపత్యం వచ్చి తూర్పు భారతదేశంలో స్థిరపడింది. పశ్చిమ భారతదేశపు వ్యాపారులు (పార్సీలు మాత్రమే కాదు) చైనా యితర దేశాలతో వ్యాపారంపై కొంత పట్టు సాధించడంతో బ్రిటిష్‌వారు పశ్చిమ భారతదేశంపై కొంత ఆలస్యంగా అదుపు

సాధించారు. అంతేగాక పశ్చిమ భారతదేశంలో 1818లో మరాఠాల పతనం వరకు స్థానిక రాజకీయాధికారం బలంగా వుంది. ఆ తరువాత కొనసాగిన స్వదేశీ సంస్థానాలను గమనించి నప్పటికి బెంగాల్ రాజకీయ పటానికి భిన్నంగా వుంది. అంతేగాక బొంబాయి లోతట్టు ప్రాంతం రైలు మార్గాల నిర్మాణానికి ముందు చొచ్చుకుని రావడానికి అనుకూలంగా లేదు. అక్కడ బ్రిటిష్ ప్రయోజనాల తొలి లక్ష్యాలైన నీలిమందు, తేయాకు, బొగ్గు లేవు.

సాంప్రదాయ భారతీయ వ్యాపార వర్గాలు వాణిజ్య వ్యవసాయాభివృద్ధికి అవసరమైన మదుపులు పెట్టే వడ్డీ వ్యాపారులు గాను, లోతట్టు ప్రాంతాలలో బ్రిటిషు ఎగుమతి దిగుమతి సంస్థల ఏజెంట్లుగానూ ఆర్థికంగా తెగబలిశారు. 19వ శతాబ్దపు ద్వితీయార్ధంలో ఉత్తర, తూర్పు, మధ్య భారతదేశంలో మార్వాడీలు విస్తరించే క్రమం వేగవంతమయింది. అలాగే దక్షిణ భారతదేశపు చెట్టియార్ వర్తకులు వడ్డీ వ్యాపారులు బర్మాలో ఆగ్నేయాసియాలోని యితర ప్రాంతాలకు బ్రిటిష్ వారిపై ఆధారపడిన మిత్రులుగా విస్తరించారు. టింబెర్గ్ యొక్క యిటీవలి అధ్యయనం మొదటి ప్రపంచయుద్ధం వరకు మార్వాడీ కుటుంబ సంస్థలు బ్రిటిషువారిపై ఆధారపడి ఎదిగిన క్రమాన్ని చాలా వివరంగా చిత్రీకరించింది. అయిన చాలా వివరంగా అధ్యయనం చేసిన ఘనశ్యాందాస్ సంస్థ షావాలీస్ సంస్థకు ఏజెంటు సంస్థగా పనిచేసింది. అలాంటి సంబంధాలే గోయంకాలకు రేలీ బ్రదర్స్‌కి మధ్య ఝుంఝున్‌వాలాకి గ్రాహమ్స్‌కి మధ్య జటియాలకి యాండ్రూ యూల్‌కి మధ్య వున్నాయి.

పశ్చిమభారతదేశంలో – తొలుత బొంబాయిలో ఆ తరువాత అహమ్మదాబాద్‌లో దళారీ వర్తకంతో పోగుపడిన (చైనాతో వర్తకం ద్వారా) పెట్టుబడితో దేశీయ పెట్టుబడి దారీ జౌళి పరిశ్రమ స్థాపించబడింది. 1860లలో రైలు మార్గాల నిర్మాణంతో ముడిప్రత్తి సరఫరా సులభసాధ్యమయింది. బ్రిటిషు వారు మాంచెస్టర్‌కి పోటీగా ఎదిగే జౌళిపరిశ్రమలో పెట్టుబడులు పెట్టడం పట్ల ఆసక్తిగా లేరు.

బొంబాయి ఎదుగుదల 1870 దశాబ్దం మధ్యనాటికి లాంక్‌షైర్‌ని కలవరపెట్టింది. బ్రిటన్ ఒత్తిడితో అన్యాయమైన సుంకాలు, ఎక్సైజు సుంకాలు విధించడం భారత మేధావి వర్గంలో దేశభక్తి చైతన్యం పెంచడానికి ప్రేరణగా పనిచేసింది. కాని బొంబాయి లాంక్‌షైరుల మధ్య సంబంధం ఘర్షణాయుతం కాలేదు. ఆర్థికం వాణిజ్యం పరిశ్రమల్ని అనుసంధానం చేసే స్వభావం గల మేనేజింగు ఏజెన్సీ విధానం అంటే చాలా జౌళి సంస్థలకు దిగుమతి నూలు వర్తకంతో గాని బట్టల వర్తకంతో గాని సంబంధాలు వుంటాయి. బొంబాయి మిల్లులు చాలా ఎక్కువగా యూరపు సాంకేతిక పరిజ్ఞానం పైన పూర్తిగా దిగుమతి యంత్రాలపైన ఆధారపడ్డాయి. 20వ శతాబ్దపు తొలి దశాబ్దాలకు పూర్వం పలుకారణాల రీత్యా బొంబాయి మాంచెస్టర్‌ల మధ్య ఘర్షణలు లేవు. 1870ల వరకు బొంబాయి వస్త్రాలపైనగాక దూదిబేళ్లు నూలుపై కేంద్రీకరించింది. దూది, నూలు దూర ప్రాబల్యానికి ఎగుమతి చేయబడ్డాయి లేక దేశంలోని చేనేత మగ్గాలకు సరఫరా చేయబడ్డాయి. అంతేగాక భారతదేశంలోని మిల్లు నూలు, ముతక నూలు, 24వ నవంబరులోపుది. 1893–94లో కూడా బొంబాయికి దిగుమతి అయ్యేనూలులో కేవలం 18శాతం మాత్రమే ఈ కోవకి చెందింది. దేశీయ మార్కెటులోని బట్టల పోటీ ముతక మధ్యతరహాలకే పరిమితమయింది. మేలిరకం బట్టల విషయంలో దేశీయ మిల్లులు 1905 తరువాత వరకు కూడా పోటీ పడలేకపోయాయి. 20వ శతాబ్దం ప్రారంభానికి

చైనాలో యుద్ధం, బొంబాయిలో ప్లేగు కారణంగా దూర ప్రాబల్యానికి దూది, నూలు ఎగుమతులు ఒక్కసారిగా పడిపోయాయి. ఆ తరువాత జపాన్‌పోటీ కారణంగా ఎగుమతులు క్రమంగా క్షీణించాయి. ఫలితంగా నూలు వడకడం నుండి బట్టలు నేయడానికి ప్రాధాన్యత యివ్వవలసివచ్చింది. ఈ మార్పు అహమ్మదాబాద్‌లో ముందుగా వచ్చింది.

బట్టల తయారీ దేశీయ మార్కెటు అవసరాల కనుగుణంగా చేయబడింది. మేలిరకం నూలు వాడకం కారణంగా లాంక్‌షైరుతో ఘర్షణ పడవలసివచ్చింది. జాతీయోద్యమంలో అహమ్మదాబాద్ ఎక్కువగా మమేకమవడానికి గాంధీ నాయకుడిగా ఉద్యమ సత్ఫలితాలు యిచ్చే అవకాశాలు వుండడానికి ఆర్థికపరమైన మూలాలు వున్నాయి.

19 శతాబ్దాంతానికి పారిశ్రామిక బూర్జువాలతో పాటు కార్మికవర్గం అవతరించింది. కార్మికవర్గం ఎదుగుదల చాలా నెమ్మదిగా సాగింది. 1911 నాటికి 303 మిలియన్ల జనాభాలో పరిశ్రమలలో పనిచేసే కార్మికులు 2.1 మిలియన్లు మాత్రమే (ప్లాంటేషన్లలో పనిచేసే 8 లక్షలతో సహా), కాని చాలా యితర దేశాలలో వలెనే బొంబాయి కలకత్తా లాంటి పెద్ద నగరాలలో కేంద్రీకరణ కార్మికవర్గానికి (1920 నుండి) సమ్మె చేసే శక్తినిచ్చింది. బ్రిటిషు పరిశ్రమలలో అలాగే భారతీయుల యాజమాన్యంలో గల పరిశ్రమలలో కూడా తొలినాటి పెట్టుబడిదారీ పారిశ్రామికీకరణ నాటి దోపిడి అణచివేతలకు పెట్టుబడిదారీ విధానం ముందునాటి అవశేషాలు కూడా తోడయ్యాయి. అస్సాంటీ తోటలు, కూలీలు, అలాగే ఫిజీ మారిషస్, నటాల్, వెస్టిండీస్‌లకు భారత వలస కూలీలు వేతన కూలీలుగా గాక బానిస విధానాన్ని పోలిన ఇండెంచర్ విధానంతో నియమించబడ్డారు. ఇతర చోట్లలాగానే యిక్కడ కూడా పెట్టుబడిదారీ విధానానికి ముందుకాలం నాటి రూపాలను సామ్రాజ్యవాదం ప్రోత్సహించింది. గనులలో, రైల్వే కూలీల నియామకం దళారీల ద్వారా, కాంట్రాక్టర్ల ద్వారా జరిగింది. దళారీల దోపిడి కార్మికుల్ని క్రుంగదీసింది. తూర్పు భారతదేశపు ప్లాంటేషన్ల గనులు ఫ్యాక్టరీలకు కూలీలకు తూర్పు యు.పి., బీహారు, మద్రాసు ప్రెసిడెన్సీలు సరఫరా చేశాయి. ఆ విధంగా కలకత్తా పారిశ్రామిక ప్రాంతంలోని కార్మికులలో బెంగాలీయేతరులు ఎక్కువ. దీనికి విరుద్ధంగా అహమ్మదాబాద్ బొంబాయిలో కార్మికుల్ని పొరుగు ప్రాంతాల నుండి – గుజరాత్ గ్రామాల నుండి మహారాష్ట్ర లోతట్టు ప్రాంతం నుండి (ప్రత్యేకించి కొంకణలోని రత్నగిరి జిల్లా నుండి) రాబట్టుకొన్నాయి. ఈ తేడా కార్మిక సంఘాన్ని రాజకీయ పరిణామాల్ని కొంత ప్రభావితం చేసింది.

ఆధునిక రంగంలో పెరుగుదల సంకేతాలు వున్నప్పటికి వలసవాద ఆర్థికవిధానంలో ప్రధానంగా కొనసాగింది పేదరికం. తొలినాటి తలసరి వార్షిక ఆదాయాన్ని గణించడానికి సరియైన సమాచారం లేదు. ఏవో కొన్ని అంచనాలు వుండేవి. వాటిపై జాతీయవాదులకు బ్రిటిషు పాలనని సమర్థించే వారికి మధ్య రాజకీయ చర్చలు జరిగేవి. అంచనాలలో చాలా వ్యత్యాసాలు వుండేవి. 1899 తలసరి వార్షిక ఆదాయంగా ఇండోఫిలే దిగ్బీ అంచనా రు 18లు. 1895 లో అట్కిన్సర్ అంచనా రు39.50లు. అట్కిన్సర్ అంచనాని తీసుకొన్నప్పటికి అది కేవలం 2పౌనుల 13 షిల్లింగులు మాత్రమే. 1910లో బ్రిటన్ సరాసరి ఆదాయం 52 పౌనులు. ఆధునిక భారతదేశం యొక్క సామాజిక, ఆర్థిక సాంస్కృతిక వెనుకబాటు తనానికి ప్రజల పేదరికం పూర్వరంగంగా పనిచేసింది.

# అధ్యాయము-3

# సామాజిక రాజకీయ ఉద్యమాలు

# 1885-1905

## 'దిగువ స్థాయి నుండి చరిత్ర' వైపు

మనం యిప్పటి వరకు వలసవాద రాజకీయ ఆర్థిక నిర్మాణం యొక్క ఆధిక్యతపై జరిపిన పరిశీలనలు సామ్రాజ్యవాదానికి భారత ప్రజలలోని చాలా సెక్షన్లకి మధ్య, అలాగే భారత సమాజంలోని వివిధ గ్రూపుల లేక వర్గాల మధ్య ఘర్షణలకు మూలాలు వున్నాయని గమనించాం. ఈ వైవిధ్యాలు మన ప్రజల జీవితంలో, ఆలోచనలు, కార్యక్రమాలలో ఏ విధంగా పెల్లుబికాయనేది మనం అన్వేషించాలి. సంఖ్యరీత్యా చాలా తక్కువ అయినప్పటికి చాలా కీలకమైన గ్రూపు అయిన ఇంగ్లీసు చదువు చదివిన మేధావుల్ని గురించి చాలా సాహిత్యం వెలువడింది. అలాగే మానవ శాస్త్ర, సామాజిక శాస్త్రాలకు చెందిన సాహిత్యం – ప్రత్యేకమైన తెగల గ్రామాల, కులాలపై అధ్యయనాల రూపంలో గణనీయంగా లభ్యమవుతుంది. కాని కనీసం ప్రాంతీయ స్థాయిలోనైనా పెద్ద సామాజిక గ్రూపులపై అధ్యయనం జరగలేదు. జమీందారుల లేక రైతుల, వ్యవసాయ కార్మికుల లేక చేతి వృత్తుల, పారిశ్రామిక కార్మికుల లేక బూర్జువాల జీవన విధానంలో వారి చైతన్యంలో వచ్చిన మార్పుల్ని విశ్లేషిస్తూ వెలువడిన అధ్యయనాలు అంతగా లేవు. ఈ కీలకమైన అంతరం రాజకీయ ఉద్యమాల – ప్రత్యేకించి జాతీయ వాద చరిత్రలో శూన్యాన్ని మిగుల్చుతుంది. అలాంటి శూన్యం చరిత్రని పై నుండి కిందికి అధ్యయనం చేసే ధోరణిని పెంచుతుంది. మితవాదులకు, అతివాదులకు మధ్య కలహాలకు ముందు బిర్సా ముండా తెగల తిరుగుబాటుని ప్రస్తావించిన దిగువ నుండి చరిత్ర ప్రస్తుతం ఆ ప్రధానమైనదిగా కనిపించవచ్చు. కాని ఆ దిశలో చేసే ప్రయత్నం అప్రస్తుతం కాదు.

ప్రజల అలజడులు ఆందోళనలపై గడిచిన 20 సంవత్సరాలకు పైగా చేసిన అధ్యయనం బ్రిటిష ప్రపంచాధిపత్యం వాస్తవం కాదని తేల్చింది. భారత దేశంలో ప్లాసీ యుద్ధం తరువాత ఒక దశాబ్దం వరకు దేశంలోకి అత్యధిక ప్రాంతాలలో మాటి మాటికి

సాంప్రదాయ పెద్దల (తొలగించబడిన స్థానిక పెద్దలు, జమీందారులు, మత పెద్దల) చేత ప్రధానంగా దిగువ వర్గానికి చెందిన ప్రజలచేత విచ్ఛిన్నం చేయబడింది.

మానవ శాస్త్రవేత్త కేథలిక్ గేఫ్ బ్రిటిషు పాలనా కాలంలో జరిగిన 77 హింసాయుత తిరుగుబాట్ల జాబితాల్ని యిటీవల సంకలనం చేశాడు. వాటిని 5 రకాలుగా వర్గీకరించాడు. అవి పాతని పునరుద్ధరించే స్వభావం గలవి, మత పరమైనవి, సామాజిక బందిపోట్ల తరహావి, తీవ్రవాద ప్రతీకార స్వభావం గలవి, సాయుధ తిరుగుబాట్లు. రాజ్యాలు కోల్పోయిన రాజుల, యితరుల నాయకత్వంలో తమ రాజ్యాల్ని తిరిగి పొందేందుకు పాత తరహాలో జరిగిన బ్రిటిషు వ్యతిరేక ప్రతిఘటనలకు 1857 తిరుగుబాటు పరాకష్ట. శతాబ్దాంతానికి తిరుగుబాట్లు తగ్గిపోయాయి. తగ్గుదలకు కారణాలు: 1857 తిరుగుబాటు తరువాత బ్రిటిషు వారు రాజులతో జమీందారులతో సంబంధాల్ని పటిష్టపరచుకొనడం, వార్తా రవాణా సౌకర్యాల్ని మిలిటరీ పరిపాలనా చట్టాన్ని అభివృద్ధి పరచుకోవడం, 1870, 1890 దశాబ్దంలో మాటి మాటికి కరువులు సంభవించడం. అయినప్పటికీ చెదురు మదురు తిరుగుబాట్లు ఆ తరువాత కూడా జరిగాయి. కాని వీటి రూపాలు మారాయి.

**తెగల ఉద్యమాలు**

గతంలో గాని ఆ తరువాత కాలంలో గాని తెగల ప్రజల తిరుగుబాట్లు అత్యంత సమరశీలమైన తిరుగుబాట్లు. ఇటీవలి పండితుని మాటల్లో 'తెగలు భారతదేశంలోని రైతులతో సహా మరెవరూ చేయనంతగా చాలా తరచుగా తిరుగుబాట్లు చేశారు. చాలా హింసాయుతంగా చేశారు.'(కె.సురేష్‌సింగ్) భారత ప్రధాన జీవన స్రవంతి నుండి విడివడని ప్రజల సముదాయం తెగ. వాస్తవంగా ఆహార సేకరణకి పరిమితమైన కొద్దిమంది ఉన్నప్పటికీ అత్యధిక తెగల ప్రజలు పోడు వ్యవసాయంతో జీవనం సాగిస్తున్న అత్యంత దిగువస్థాయి రైతులుగా, వ్యవసాయ కూలీలుగా, దూర ప్రాంతాల ప్లాంటేషన్లలో, గనులలో, ఫ్యాక్టరీలలో కూలీలుగా, భారతీయ సమూహంలో భాగంగా జీవనం సాగిస్తున్నారు. అప్పటికే మైదాన ప్రాంతాలవారు, బయటి వారు వడ్డీ వ్యాపారులుగా, వర్తకులుగా, కబ్జాదారులుగా, కాంట్రాక్టర్లుగా, చేస్తున్న చొరబాట్లకు, బ్రిటీషు పాలన దానితోపాటు వచ్చిన వ్యాపారీకరణ బలాన్ని చేకూర్చాయి. ప్రైవేట్ ఆస్తికి చెందిన బ్రిటీష్ చట్టపరమైన భావనలు (ఛోటా నాగపూర్‌లోని కుంట్ కట్టిలాంటి) సమిష్టి యాజమాన్య సాంప్రదాయాల్ని తుడిచి పెట్టాయి. తెగల సమాజంలో, ఉద్రిక్తల్ని తీవ్రతరం చేశాయి. చాలా తెగల ప్రాంతాలలో ప్రత్యేకించి బీహర్, అస్సాం కొండ ప్రాంతాలలో క్రైస్తవ మిషన్లు చురుకుగా పని చేశాయి. తరచుగా చాలా ఆసక్తికరమైన భ్రమల్ని కల్పిస్తూ కొంత మంది క్రైస్తవ కౌలుదారుల్ని విదేశీ విధానాలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టాయి. 1870,1880 లో చాలా ముఖ్యమైన ఆసక్తికరమైన అంశం. ఆదాయం పెంచుకునేందుకు వలసవాద ప్రభుత్వం అటవీ ప్రాంతాలపై ఆక్యుపెన్సీ పటిష్టం చేసింది. గ్రామీణ నిరుపేదల బతుకు తెరువుకు

అత్యవసరమైన అరక, ఎద్దులు అవసరం లేని పోడు వ్యవసాయాన్ని నిషేధించింది. కట్టెపుల్లలు, పశువుల మేత సౌకర్యాలపై ఆంక్షలు విధించి అటవీ సంపదపై ప్రభుత్వానికి గుత్తాధిపత్యం కల్పించే యత్నాలు చేసింది.

తెగల ప్రజలు తరచుగా హింసాయుతమైన తిరుగుబాట్లు చేశారు. సంఘ సంస్కరణ ఉద్యమాలు చేపట్టారు. క్రైస్తవ, హిందూ మతాల నుండి కొన్ని అంశాలను అరువు తెచ్చుకున్న అలాంటి ఉద్యమాలు ఒక్కసారిగా అద్భుతాలు సృష్టిస్తామని, స్వర్ణయుగంలోకి తీసుకు వెళ్ళతాయని వాగ్దానాలు చేశాయి. సాంప్రదాయ తెగల పెద్దల నాయకత్వంలో జరిగిన తిరుగుబాట్లలో పరాజయం పాలైన తరువాత అంటే 1860-1820 కాలంలో ఇలాంటి భ్రమలు పెరిగాయి.

ఆ విధంగా సంతాల్ తిరుగుబాటు (1855) ఆ తరువాత 1870 దశాబ్దంలో వచ్చిన ఖేర్వార్ లేక సఫాహర్ ఉద్యమం తొలుత ఏకేశ్వరోపాసన సంఘ సంస్కరణలలో ప్రారంభమై ఆ తరువాత ఉద్యమం అణచడానికి ముందు పన్నుల నిరాకరణ రూపం దాల్చింది. త్వరలో రానున్నదని భ్రమలు కల్పించిన స్వర్ణయుగం హింసాయుత రూపాలు దాల్చింది. గుజరాత్‌లోని నైక్డా అటవీక తెగ ధర్మ రాజ్య స్థాపనకై 1868లో పోలీస్‌స్టేషన్లపై దాడి చేసింది. శంభుదాన్ అనే మాంత్రికుడు తన మంత్ర శక్తి వలన శత్రువుల తూటాలు తన అనుచరులకు ఎలాంటి హానీ కలిగించవని ఉద్బోధించాడు. 1882లో కచార్‌కి చెందిన నాగాలు తెల్లవారిపై దాడి చేశారు. పాత జిల్లా అధికార పత్రాలు, మానవ శాస్త్రం అధ్యయనంపై జరిపిన సర్వేలు ఆశ్చర్య చకితుల్ని చేసే చాలా విషయాలు వెల్లడించాయి. ఉదాహరణకు 1900 సంవత్సరంలో విశాఖపట్నం ఏజెన్సీకి చెందిన కొర్ర మల్లయ్య అనే కొండదొర తనకి అద్భుత శక్తులున్నాయన్నాడు. 4,5 వేల మందిని పోగు చేసుకున్నాడు. తన కొడుకు కృష్ణుడు అన్నాడు. తను పాండవ సోదరులలో ఒకరి అవతారమన్నాడు. ఇంగ్లీషు వారిని దేశం నుండి పారద్రోలి తానే పరిపాలిస్తానన్నాడు. అందుకు తన అనుచరులకు వెదురుబొంగుల గడలు ఆయుధాలుగా సమకూర్చుకున్నాడు. అవి తన మంత్ర శక్తులతో తుపాకులుగా మారతాయన్నాడు. పాలకుల ఆయుధాలు నిష్ప్రయోజనాలవుతాయన్నాడు. ఫలితం ఎలా వుంటుందో ఊహించవచ్చు. పోలీసులు 11 మందిని కాల్చి చంపారు. 60 మందిపై విచారణలు జరిపారు. ఇద్దరు ఉరి తీయించబడ్డారు. (థర్‌స్టన్, రంగాచారి; దక్షిణ భారత దేశంలోని కులాలు, తెగలు వాల్యూం-3 మద్రాసు 1909, పేజీ 353).

గోదావరి ఏజెన్సీ కొండ ప్రాంతాలలో 1879-80లలో బలమైన తిరుగుబాటు చెలరేగింది. తిరుగుబాటు ప్రధాన కేంద్రం చోడవరంలోని 'రంప' అక్కడ కోయ కొండ దొరల నాయకులు (బ్రిటిషు వారితో 1813లో అవగాహనకు వచ్చిన) బ్రిటీష్ వారికి 1813 నుండి సుబేదారులుగా పని చేస్తున్న మునసబు దారీ నవాబుపై 1840, 1845, 1858, 1861, 1862లలో తిరుగుబాట్లు చేశారు. 1879 నాటి పెద్ద తిరుగుబాటుకు కారణాలు; కలప, పుల్లరిపై మునసబుదారీ పన్నులు పెంచడానికి చేసిన యత్నం. పోలీసుల నిర్బంధ వసూళ్ళు తాటికల్లుపై కొత్తగా విధించిన నిబంధనలు, క్రిందిస్థాయి వర్తకుల వడ్డీ వ్యాపారం, దోపిడీ,

అడవుల్లో పోడు వ్యవసాయంపై నిబంధనలు, తిరుగుబాటు తీవ్ర దశలో 5000 చదరపు మైళ్ళకు వ్యాపించింది. తిరుగుబాటు 1880 నవంబరులో మద్రాసు కాల్బలానికి చెందిన 6 రెజిమెంట్ల సైన్యంలో అణచివేయబడింది. 1886లో అదే ప్రాంతంలో జరిగిన మరొక తిరుగుబాటులో తిరుగుబాటుదారులు తమని తాము "రామదండు"గా పేర్కొన్నారు. వారి నాయకులలో ఒకరైన రాజని అనంతయ్య దేపూర్ మహరాజుకి జాతీయవాద తరహాలో విజ్ఞప్తి చేశారు. ఇంగ్లీషువారు మన దేశంలో ఉండటం మంచిదా? మనం ఇంగ్లీషువారితో యుద్ధం చేయాలి. రష్యన్లు కూడా ఇంగ్లీషు వారితో పోరాడుతున్నారు. ప్రజలు నావెంట వచ్చి ఆయుధాలు సరఫరా చేస్తే నేను రాముని పాత్ర నిర్వహిస్తాను. (డేవిడ్ ఆర్నాల్డ్, 1860–1940 మద్రాసు గ్రామీణ ప్రాంతాలలో నేరాలు, దొమ్మీలు).

తెగల తిరుగుబాట్లలో పేరెన్నిక గన్నది రాంచికి దక్షిణాన 1899–1900లో బిర్సా ముండా జరిపిన తిరుగుబాటు. దీనిపై యిటీవల ప్రముఖ మానవ శాస్త్రవేత్త, చరిత్రకారుడు కె. సురేష్ సింగ్ లోతైన అధ్యయనం చేశారు. 19వ శతాబ్దంలో ముండాల సాంప్రదాయ "కుంటకట్టి" (సమిష్టి) వ్యవసాయ  పద్ధతి ఉత్తర ప్రాంత మైదానాల నుండి వర్తకులుగా, వడ్డీ వ్యాపారులుగా వచ్చిన జాగీర్దారులచే, అధికార్లచే తుడిచి పెట్టబడింది. ఆ ప్రాంతం కాంట్రాక్టర్లకు షరతులతో పని వాళ్ళను లొంగ దీసుకునే వేట స్థలమయ్యింది. లూథరన్, ఆంగ్లికన్ కేథలిన్ మిషనరీలు సహాయం చేస్తామని ముందుకు వచ్చాయి. కాని ఆచరణలో ప్రధానమైన భూమి సమస్యపై చేసిందేమీలేదు. 1890 దశాబ్దం తొలి సంవత్సరాలలో తెగల నాయకులు (సర్దార్లు) మైదాన ప్రాంతాల నుండి వచ్చిన భూస్వాములకు వ్యతిరేకంగా వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా కలకత్తాలో వుండే ఆంగ్లో ఇండియన్ లాయరు ద్వారా న్యాయస్థానాలలో పోరాడే ప్రయత్నం చేశారు. కానీ వారిని న్యాయవాది మోసం చేశాడు. తెగల పెద్దలు తమతో ఇలా మొరపెట్టుకున్నట్లు ఒక మిషనరీ పేర్కొంది. "మా కష్టాలీడేర్చమని ప్రభుత్వంతో మొరపెట్టుకున్నాం ఫలితంలేదు. మత సంస్థలకు చెప్పుకున్నాం. అవి చేసిందేమీలేదు. మా కష్టాల్ని కడతీర్చే సంరక్షకుడిని మాలోనే వెతుక్కోవడం తప్ప దారిలేదు".

ముండా సంరక్షణకు బిర్సా రూపంలో (1874–1900) ముందుకు వచ్చాడు. అతడు ఒక పాలికాపు కొడుకు. మిషనరీలలో కొద్దిగా చదువుకున్నాడు. అతడిపై వైష్ణవ మత ప్రభావం పడింది. 1893–94లో గ్రామానికి చెందిన బంజరు భూమిని అటవీశాఖ స్వాధీనం చేసుకోవడానికి వ్యతిరేకంగా జరిపిన ఉద్యమాలలో పాల్గొన్నాడు. 1895లో అతనికి దేవుడు సాక్షాత్కరించాడట. అప్పుడు అద్భుత శక్తులు సంక్రమించాయని చెప్పుకున్నాడు. రానున్న ప్రమాదాన్ని గురించి బిర్సా మాటలు వినేందుకు వేలాది మంది అతడి చుట్టూ చేరారు. బిర్సా ఏదో కుట్ర చేస్తున్నాడని భ్రమపడిన బ్రిటీషువాళ్ళు 1895లో రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించారు. జైలు నుండి తీవ్రవాదిగా బయటకు వచ్చాడు. 1898–99 కాలంలో అడవిలో సమావేశాలు నిర్వహించాడు. అధికారుల్ని, జాగీర్దారుల్ని, రాజుల్ని, రాజకీయాల్ని, క్రైస్తవుల్ని చంపమని ఉద్బోధించాడు. తుపాకులు, తూటాలు ఏమీ చేయలేవని నమ్మబలికాడు. బ్రిటీషు రాజ్యం దిష్టిబొమ్మలు తగులబెట్ట బడ్డాయి.

కటాంగ్ బాబా కటాంగ్....

సాహెబ్ కటాంగ్,

రారి కటాంగ్ కటాంగ్ (ఓ తండ్రీ యూరోపియన్లను హతమార్చు, ఇతర కులాల్ని చంపు.... చంపు....) లాంటి పాటలకు ముండాలు స్పందించారు. స్వరం కలిపారు.

1899 క్రిస్మస్ నాడు బిర్సా అనుచరులు విల్లమ్ములతో బయలు దేరారు. రాంచి, సింగ్భం జిల్లాల పరిధిలో గల 6 పోలీసుస్టేషన్లను తగులబెట్ట యత్నించారు. 1900లో బిర్సా అనుచరులు పోలీసుల్ని లక్ష్యాలుగా ఎంచుకున్నారు. రాంచీలో భయాందోళనలు అలుముకున్నాయి. జనవరి 9న తిరుగుబాటుదారులు సెయిల్ రాకబ్ పర్వతం సమీపాన అణచివేయబడ్డారు. తరువాత మూడు వారాలకు బిర్సా పట్టుబడ్డాడు. జైలులో చనిపోయాడు. దాదాపు 350 మంది ముండాలపై విచారణలు జరిగాయి. ముగ్గురు ఉరి తీయబడ్డారు. 44 మందికి ద్వీపాంతర వాస శిక్ష విధించబడింది. 1902-10 కాలంలో కొన్ని సమస్యలు పరిష్కరించబడ్డాయి. 1908లో ఛోటానాగపూర్ కౌలుదారీ చట్టం, కొంత ఆలస్యంగానైనా కుంట కట్టి హక్కుల గుర్తింపు, వెట్టిచాకిరి రద్దు తిరుగుబాటు సాధించిన విజయాలు. ఛోటానాగపూర్ తెగల ప్రజలు బీహార్ రైతాంగం కంటే ఒక తరం ముందుగా వారి భూమిపై ఒక మేరకు చట్టపరమైన రక్షణ పొందగలిగారు. హింసాయుత ఉద్యమాలు ఎల్లప్పుడు విఫలంకావు. ఒక చిన్న మత పరమైన విభాగానికి ధర్మదూతగా తెగల ప్రజల్ని ఆకట్టుకునే పాటల రూపంలో బిర్సా ముండా కలకాలం ప్రజల హృదయాలలో బతికే వుంటాడు. అంతేకాక బిర్సా ముండా పరస్పర విరుద్ధమైన కారణాల రీత్యా- పరిపూర్ణమైన జాతీయ వాదిగా, ప్రత్యేక జార్ఖండ్ ప్రవక్తగా తీవ్రవాద నాయకుడిగా ఆరాధింపబడుతున్నాడు. బిర్సాకి అఖిల భారత జాతీయ చైతన్యాన్ని ఆపాదించడం అతిశయం తప్ప వాస్తవం కాదు. చొరబాటు దారులకు వ్యతిరేకంగా అతడి ఆలోచనలు, పోరాటాలు తెగల ప్రాంతానికి పరిమితమయ్యాయి.

**ఫడ్కే**

వాసుదేవ్ బల్వంత్ ఫడ్కే మేధావులలో జాతీయవాద చైతన్యం సాధారణ ప్రజల సమరశీలతల మధ్య ఏకీభావాన్ని సాధించగలిగారు. ఇది కొద్ది కాలం పాటే మనగల్గింది. ఫడ్కే చిట్ పవన్ బ్రాహ్మణుడు. కొద్ది పాటి ఇంగ్లీషు చదువు చదివినవాడు. సైన్య సరఫరా శాఖలో గుమస్తాగా పని చేశాడు.

అతడు సంపద తరలింపుపై చేసిన ఉపన్యాసాలతోనూ 1876-77 కాలంలో సంభవించిన దక్కన్ కరువు ప్రభావంతోనూ పూనా బ్రాహ్మణులలో పెరుగుతున్న పునరుజ్జీవ భావజాలంతోనూ ప్రభావితుడయ్యాడు. అతను పోలీసులకు చిక్కకుండా వుండేందుకు ఒక దేవాలయంలో తలదాచుకున్నప్పుడు స్వీయ అనుభవాల్ని గురించి వ్రాసుకున్నాడు. కొద్దిపాటి సైన్యాన్ని సమీకరించుకోవాలని, లూటీలు చేసి అవసరమైన డబ్బు సేకరించాలని, సమాచార

సాధనాల్ని ధ్వసం చేసి సాయుధ తిరుగుబాటు చేయాలని తద్వారా హిందూ రాజ్యం స్థాపించాలని ఆశిస్తున్నట్లు వ్రాశాడు. "ప్రజలలో చాలా అసంతృప్తి ఉంది. కొద్ది మంది ప్రారంభిస్తే బాధితులు తరువాత వచ్చి చేరతారు". ఆ తరువాత రానున్న విప్లవాత్మక తీవ్రవాదానికి ఇది ఒక సూచిక. గమనించవలసిన అంశంమేమంటే ఫడ్కే దళంలోకి 40 మందిలో చాలా కొద్ది మంది మాత్రమే బ్రాహ్మణ యువకులు. ఎక్కువ మంది నిమ్న కులాలకు చెందిన రామోషీలు, ధన్ గార్లు. రైతుల ఆశ్రయం పొంది సామూహిక బందిపోట్లు జరిపారు. ఫడ్కే పట్టుబడి జీవితకాలం శిక్ష విధింపబడిన తరువాత బీలత రామోషీ దళం1883 వరకు చురుకుగా దొమ్మీలు సాగించింది. దాదాపు అదే సమయంలో కోలే తెగ గ్రూపు 7 నెలల్లో 28 బందిపోట్లు సాగించింది. తరువాత అదీ ధ్వంసం చేయబడింది. కోలేలు, యితర తెగల ప్రజల లాగానే వారి వారసత్వ భూముల నుండి నెట్టి వేయబడ్డారు.

## మోప్లాలు

మలబార్‌కి చెందిన మోప్లాల చరిత్ర భారత పరిస్థితులలోని సంక్లిష్టతల యొక్క మరొక కోణాన్ని – భూస్వామ్య వ్యతిరేక, విదేశీ వ్యతిరేక అసంతృప్తి వ్యక్తీకరణకు, మతతత్వ వాదం ఏ విధంగా పని చేసిందీ తెలియజేస్తుంది. మలబారు ముస్లింలలోని కొన్ని సెక్షన్లకు తెల్లవాళ్ళపై వ్యతిరేకత 1498 నుండి అంటే 1998లో పోర్చుగీసులు సుగంధ ద్రవ్యాల వర్తకాన్ని చేసుకొనేందుకు, ఒక చేతితో ఖడ్గం మరొక చేతితో కాగడా పట్టుకొని వచ్చినప్పటి నుండి ప్రారంభమైంది. పవిత్ర యుద్ధంలో అసువులు బాసిన వారిని కీర్తిస్తూ చేసిన రచనలలోని జానపద గీతాలలో యిది స్పష్టంగా వ్యక్తమయ్యింది. భూస్వామ్య హక్కులకు ప్రాధాన్యతనిచ్చిన బ్రిటిషు పాలన హిందూ అగ్ర వర్ణాలకు చెందిన నంబూద్రి, నాయర్ల సామాజిక స్థాయిని పటిష్టపరిచింది. అదే సమయంలో స్థానికంగా మోప్లాలుగా పిలువబడే ముస్లిం కౌలుదారు (కనందార్లు) రైతుల (వెరం పట్టందార్ల) స్థితిగతుల్ని క్షీణింపచేసింది. ఫలితంగా మతపరమైన సంక్షోభావం పెరిగింది. 1831లో 637 గా ఉన్న మసీదులు 1851 నాటికి 1058కి పెరిగాయి. తిరురంగాడి సమీపంలోని మాంబరం తంగాలులు మోప్లా సమాజానికి మతపరమైన, రాజకీయ పరమైన నాయకులుగా గుర్తింపు పొందారు. అస్పృశ్యులుగా ఉన్న చెరుమార్లను పెద్ద ఎత్తున మతంలోకి ఆహ్వానించారు. ఇది చెరుమార్లకు తాము ముస్లింలతో సమానులమనే గాక సామాజికంగా ఎదిగామన్న భావనని కలిగించింది. దక్షిణ మలబారులోని ఎర్నాడ్, వల్లువనాడ్ తాలూకాలలో తిరుగుబాట్లు సర్వ సాధారణమయ్యాయి. 1836–1854 మధ్య కాలంలో 22,1882–85 కాలంలోను 1896 లోను యింకా విస్తృతమైన తిరుగుబాట్లు జరిగాయి. జన్మి ఆస్తుల, దేవాలయాల విధ్వంసం లక్ష్యాలుగా దాడులు జరిగాయి. చిన్న పాటి దళాలుగా ఉన్న మోప్లాలు పోలీసుల తూటాలకు సామూహికంగా చావడానికి సిద్ధపడ్డారు. షాయిద్‌లుగా నేరుగా స్వర్గానికి పోతామనే దృఢ విశ్వాసంలో చావుకి సంసిద్ధులయ్యారు. మోప్లా తిరుగుబాటులో సమరశీల కార్యకర్తల సంఖ్య చాలా పరిమితమే. 1836 నుండి 1919 వరకు జరిగిన 28 తిరుగుబాట్లలో పాల్గొన్న సమరశీల కార్యకర్తలు కేవలం 349 మంది మాత్రమే. చెల్లా చెదురుగా

ఉన్న ఇళ్ళు సమాచార సంబంధాలకు అవకాశాలు, అంతంత మాత్రంగా ఉన్న దక్షిణ మలబారులో సామూహిక ప్రజా ప్రతిఘటన కష్ట సాధ్యమే. మోప్లా తిరుగుబాట్లు ప్రత్యేక తరహా గ్రామీణ తీవ్రవాదం పెరిగిన జన్మి అధికారాన్ని ప్రతిఘటించిన తిరుగుబాట్లు-తిరుగుబాటులో పాల్గొనని మోప్లాల కొరకు ఆత్మాహుతికి పాల్పడ్డ తిరుగుబాట్లు. 1919లో మోప్లా తిరుగుబాటు దార్ల దాడులకు గురయిన 82 మంది బాధితులలో 62 మంది అగ్రవర్ణాలకు చెందినవారు వర్గ రీత్యా గమనిస్తే సమాచారం లభించిన మేరకు 70 మంది బాధితులలో 58 మంది జన్మీలు లేక వడ్డీ వ్యాపారులు. మోప్లా మృతవీరులలో అత్యధికులు పేద రైతులు, వ్యవసాయ కార్మికులు. కాని వీరికి కాస్త సంపన్నులయిన కనందార్ల, చిన్న వ్యాపారుల మద్దతు లభించింది. మోప్లా అసంతృప్తి మూలాలు స్పష్టంగా వ్యవసాయపరమైనవి. 1862-80 కాలంలో దక్షిణ మలబారు తాలూకాలలో కౌలు రేట్లు 244 శాతం పెరిగాయి. రైతుల్ని భూముల నుండి ఖాళీ చేయించే డిక్రీలు 441 శాతం పెరిగాయి. హిందూ రైతులు కూడా బాధలకు గురయ్యారు. కాని వారి ప్రతిఘటన వేరే విధంగా ఉంది. 1860, 1870 దశాబ్దాలలో హిందూ బందిపోట్లు తమ కార్యకలాపాలు సాగించారు. ఇస్లాం నాయకులు భ్రమలు గొల్పిన స్వర్ణయుగం సిద్ధాంతం లేనందున హిందూ రైతుల అసంతృప్తి బందిపోట్ల స్థాయిని దాటి ముందుకు పోలేదు.

### దక్కన్ దొమ్మీలు

ఇప్పటి వరకు మనం భారత సమాజపు అట్టడుగున వున్న తెగల పేద రైతులు సమూలమైన మార్పులు లక్ష్యంగా చేసిన తిరుగుబాట్లను గురించి తరచుగా మతపరమైన, స్వర్ణయుగం లాంటి అతిశయాలతోకూడిన తిరుగుబాట్లు గురించి, (సామాజిక మార్పు కొరకు ఆధునిక రెగ్యులర్ సిద్ధాంతం లేనప్పుడు యిది స్వాభావికమే) చర్చించాం. గ్రామీణ ప్రాంతాలలో ప్రత్యేకమైన సమస్యలతో పరిమిత లక్ష్యాలతో చెలరేగిన మరొక రకమైన గ్రామీణ నిరసనల సాంప్రదాయం కూడా వున్నది. ఇలాంటి నిరసనలకు పోరాటాలకు కాస్త సంపన్న రైతు సెక్షన్ల నుండి మద్దతు లభించింది. ఉదాహరణకు మహారాష్ట్ర దక్కన్‌లు 1860 దశాబ్దంలో పత్తి పంట, ధరలు బాగా వున్నప్పుడు రైతులు ఆర్థికంగా పుంజుకున్నారు. కాని ఆ తరువాత దశాబ్దంలో పత్తి ధరలు పడిపోవడం 1867 నుంచి భూమి శిస్తుల్ని ఒక్కసారిగా విపరీతంగా పెంచడం రైతుల్ని క్రుంగదీశాయి. రైతులు అప్పుల్లో కూరుకుపోయారు. రైతుల ఆగ్రహానికి వడ్డీ వ్యాపారులు లక్ష్యమయ్యారు. 1875 మే- సెప్టెంబర్ పూనా అహమ్మద్ నగర్‌లలోని 6 తాలూకాలలో 33 చోట్ల దక్కన్ రైతులు దొమ్మీలు చేశారు. కోపోద్రిక్తులైన రైతులు గ్రామ పెద్దల నాయకత్వంలో దౌర్జన్యంగా రుణ పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. వడ్డీ వ్యాపారులు బయటి వారు గాక స్థానిక వడ్డీ వ్యాపారులుగా మారిన భూస్వాములైన సందర్భాలలో (రత్నగిరిలోని భాట్ల లాగా) దొమ్మీలు అంతగా జరగలేదు. ఈ అలజడులు జరిగిన నాలుగేళ్ళ తరువాత దక్కన్ వ్యవసాయదారుల ఉపశమన చట్టం 1879 న్యాయపరమైన విధానాల్ని అమలు జరపడంతో సంపన్న రైతులకు పరిమితమైన రక్షణ కల్పించింది.

**పాచ్నా**

బెంగాల్‌లో వడ్డీ వ్యాపారికి వ్యతిరేకంగా జరిగిన దొమ్మీలు (తెగల ప్రాంతాలలో మినహాయించి) చాలా తక్కువ. కారణం యిక్కడ స్థానిక పెద్ద రైతులే (జాగీర్‌దార్లు) వడ్డీ వ్యాపారులు. రుణ సౌకర్యం లేనిదే ఉత్పత్తి జరగదు. జమిందారుకి వాస్తవంగా ఉత్పత్తిలో భాగస్వామ్యం లేదు. జమిందార్లు శిస్తురేట్లు పెంచారు. తూర్పు బెంగాల్‌లోని చాలా ప్రాంతాలలో 1870 దశాబ్దంలో 1880 దశాబ్దంలోని తొలి సంవత్సరాలలో రైతులు ప్రతిఘటించారు. ప్రతిఘటనా కేంద్రం పాచ్నా. జిల్లాలో అభివృద్ధి చెందుతున్న ప్రాంతం సంవత్సరానికి రెండు పంటలు పండే ప్రాంతం. జనపనార పరిశ్రమ అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. జిల్లాలో 50% పైగా రైతులు 1859 చట్టం 10 క్రింద స్వాధీన హక్కులు జయప్రదంగా సాధించగలిగారు. అయినప్పటికీ 1793-1872 కాలంలో శిస్తులు 7 రెట్లు పెరిగాయి. అంతేకాక 1860 దశాబ్దంలో 1870 దశాబ్దం తొలి సంవత్సరాలలో వివిధ సెస్సులు విధించి, కొలమానాలు తగ్గించి సాగులోకి వచ్చిన ప్రాంతాన్ని ఎక్కువగా చూపించి రైతుల వద్ద నుండి అధికారికంగా రాబట్టడానికి జమిందారులు కలిసికట్టుగా తీవ్ర ప్రయత్నాలు చేశారు. రైతులు సాధించిన కొత్త హక్కులు పై దాడులు సాగించారు. 1873లో పాచ్నాకి చెందిన యూసుఫ్‌షాహి పరగణా రైతులు వ్యవసాయ సంఘాన్ని స్థాపించారు. కోర్టు ఖర్చుల నిమిత్తం నిధి వసూలు చేశారు. పెద్ద ఎత్తున రైతుల సమావేశాలు నిర్వహించారు. అప్పుడప్పుడు పన్నులు చెల్లించడం ఆపివేశారు. తరువాత దశాబ్దంలో పొరుగున ఉన్న తూర్పు బెంగాల్‌లోని చాలా జిల్లాలలో (డక్కా, మెమన్ సింగ్, త్రిపుర, బీకల్‌గంజ్, ఫరీద్ హర్, బోగుర, రాజ్‌షాహీ) అలాంటి ఉద్యమాలు చేపట్టబడ్డాయి. రైతుల తిరుగుబాటు హింసని గురించి కలకత్తా జమిందారీ వర్గాలలో భయాందోళనలతో చర్చలు జరిగినప్పటికీ పాచ్నాలో చెదురుమదురు ఘటనలు మినహాయించి రైతాంగ ప్రతిఘటన శాంతియుతంగా చట్ట పరిమితులలోనే జరిగింది. ఉద్యమ లక్ష్యాలు కూడా చాలా పరిమితమైనవే. తప్పుడు పరికరాలతో పొలాల్ని కొలవడం, చట్ట విరుద్ధమైన సెస్సుల రద్దు, శిస్తుల తగ్గింపు లాంటి కొన్ని ప్రత్యేకమైన డిమాండ్లు సాధించుకొనడానికి మాత్రమే రైతులు శిస్తుల చెల్లింపు ఆపివేశారు. పాచ్నా ఉద్యమం బ్రిటీషు పాలనకి వ్యతిరేకంగా చేపట్టబడిన ఉద్యమం కాదు. వాస్తవానికి రైతు నాయకుల నినాదమేమంటే ఇక రైతులు బ్రిటీషు రాణి రైతులుగా ఉంటారుగాని మరొకరి రైతులుగా కాదు. అణచివేత దారులకి వ్యతిరేకంగా పాలకులకు విన్నవించుకోవడం రైతు ఉద్యమాలలో సర్వసాధారణమే. హింసని ఖండిస్తూనే రైతులు సమీకృతులవడాన్ని ప్రోత్సహించే 1873 జూలైలో లెఫ్టినెంట్ గవర్నర్ ప్రకటన లాంటి అధికారుల ప్రకటనలు కూడా పాచ్నా రైతులకు ప్రోత్సాహకరంగా పని చేశాయి.

పాచ్నా ఉద్యమం, యితర జిల్లాలలో అలాంటి ఉద్యమాలకు బెంగాల్ మేధావులలో పలు రకాలుగా స్పందించారు. జమిందారీ ఆధిపత్యంలో గల బ్రిటీష్ ఇండియన్ అసోసియేషన్ ఉద్యమాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. అసోషియేషన్ పత్రిక హిందూ పేట్రియాట్ పాచ్నా మతపరమైన ఉద్యమమని, ముస్లిం రైతులు హిందూ భూస్వాములకు వ్యతిరేకంగా చేపట్టిన

ఉద్యమంగా చిత్రించ యత్నించింది. వాస్తవంగా పాచ్నా రైతులలో ముస్లింలు, జమీందారులలో హిందువులు అత్యధికులైనప్పటికి ఆ ఉద్యమంలో మతపరమైన అంశాలులేనేలేవు. రైతు సంఘం ముఖ్య నాయకులు ఇషాన్ చంద్రరాయ్, మధ్య తరగతి రైతు గ్రామ పెద్ద శంభూపాల్ (ఇరువురు సవర్ణ హిందువులు) ముస్లిం జోతేదార్ ఖోడిముల్లా. జమిందారులలో ఒకరైన ద్విచేంద్రనాథ్ ఠాగూర్ (రవీంద్రనాథ్ ఠాగూర్ అన్న) శాంతి భద్రతలను పరిరక్షించవలసినదిగా 1873 జూలైలో ప్రభుత్వాన్ని అర్థించాడు. పెద్ద జమిందారులతో తక్కువ సంబంధాలు గల గ్రూపులు ఉద్యమం పట్ల సానుభూతి వ్యక్తం చేశాయి. కౌలుదారుల హక్కుల రక్షణ కొరకు పని చేశాయి. 1885 కౌలుదారీ చట్టానికి ముందుగా రైతు సదస్సులలో పాల్గొన్నాయి. రైతుల సంక్రమణ హక్కులు పరిరక్షించబడ్డాయి. ఆ తరువాత చట్టంలో రైతులకు మరికొన్ని హక్కులు సంక్రమించాయి. మరొక ముఖ్యమైనది, గమనించాల్సిన అంశం పాచ్నా ఉద్యమంలో గాని, ఆ తరువాత ఇండియన్ అసోసియేషన్ ఆందోళనలో గాని, లేక ప్రభుత్వం చట్టంలో గాని సంక్రమణ హక్కులు పొందని రైతులు, పాలికాపుతో లేక వ్యవసాయ కూలీల ప్రసక్తేలేదు. హక్కులు సంక్రమించిన రైతులు వారి పొలాల్ని చిన్న రైతులకు కౌళ్లకిచ్చారు. వాస్తవంగా వ్యవసాయం చేసే ఈ చిన్న రైతులకు ఎలాంటి రక్షణ కల్పించబడలేదు. బెంగాలులో వ్యవసాయ అశాంతి ఫలితంగా వచ్చిన కౌలుదారీ చట్టం జోతేదార్ల గ్రూపుల్ని పెంచి పోషించింది. జోతేదార్లు కూడా జమీందార్ల లాగానే దోపిడీదారులు, పరాన్నభుక్తులు.

### శిస్తు పన్నుల వ్యతిరేక ఉద్యమాలు

రైత్వారీ విధానం అమలులో ఉన్న ప్రాంతాలలో బ్రిటిషు వారు శిస్తులు పన్నులు పెంచడానికి చేసిన ప్రయత్నాలు మరొక తరహా ప్రతిఘటన నెదుర్కొన్నాయి. గ్రామీణ ప్రజలు ఐక్యతతో ప్రతిఘటించారు. వారికి గ్రామ పెద్దల నుండి మేధావుల నుండి మద్దతు లభించింది. ఉదాహరణకు అస్సాంలోని కామ్‌రూప్, దర్రాంగ్ జిల్లాలలో 1893–94లో 50 నుండి 70 శాతం పెంచబడిన శిస్తుల్ని గ్రామీణ కులీనుల (బ్రాహ్మణుల, గోసైన్ల, దోలీయిల) నాయకత్వంలో గ్రామ దర్బారులు నిర్వహించి ప్రతిఘటించారు. ప్రజాభిప్రాయానికి భిన్నంగా ప్రభుత్వానికి లొంగి పన్నులు చెల్లించిన వారిని సంఘ బహిష్కరణ చేయాలని దర్బారులు నిర్ణయించాయి. ఆ విధంగా పాలకులకు వ్యతిరేకంగా కులపరమైన కట్టుబాటు ఆయుధంగా ప్రయోగింపబడింది. బజార్లను లూటీ చేసిన ఘటనలు 1894 జనవరిలో రంగీయ, పాతర్‌ఘాట్‌ల వద్ద పోలీసు కాల్పుల ఘటనలు జరిగాయి. శిస్తు తగ్గింపు డిమాండుకు జోర్హాత్ సార్వ జనిక సభ మద్దతు తెలిపింది. ఈ సమస్యని బెంగాలు మితవాద కాంగ్రెస్ నాయకుడు రాష్‌బిహారీ ఘోష్ ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిలులో ప్రస్తావించాడు. తరువాత కూడా ప్రతిఘటన కొనసాగింది. బొంబాయి ప్రెసిడెన్సీలోని సెంట్రల్ డివిజనులో శిస్తులు చెల్లించనందుకు చరాస్తులపై జప్తులు చేసిన కేసులు 1892–97 కాలంలో వార్షిక సరాసరి 26 కాగా 1897–98లో 194 కి, 1898–99లో 2269కి పెరిగాయి. 1899–1900 కరువు తరువాత సూరత్, నాసిక్, ఖేదా, అహమ్మదాబాద్ జిల్లాల నుండి సంపన్న రైతులు వడ్డీ వ్యాపారులు శిస్తు వ్యతిరేక ఉద్యమాలకు

నాయకత్వం వహించినట్లు రిపోర్టులు అందాయి. అప్పటికి పూనా సార్వజనక ఉద్యమం వెనుకపట్టు పట్టింది.

మనం యిప్పటి వరకు అధ్యయనం చేసిన విధంగానే అన్ని ముఖ్యమైన పోరాటాలు జరిగివుంటే–దికూల, వడ్డీ వ్యాపారుల జమీందార్ల లేక వలసరాజ్యం యొక్క దోపిడికి వ్యతిరేకంగా ప్రత్యక్ష ప్రతిఘటన ఉద్యమాలు జరిగివుంటే ఆధునిక భారత దేశ చరిత్ర చాలా సరళంగా వుండి ఉండేది. కాని అత్యధిక భారతీయులు వర్గ వ్యత్యాసాల్ని అధిగమించి కులమత పరంగా కొట్టుకోపోయారు. దానినే ఆధునీకరణ శక్తి అన్నారు. వలసవాదం అలాంటి పాక్షికధోరణుల్ని పలు విధాల ప్రోత్సహించింది.

### కులపరమైన చైతన్యం

వర్ణాలు సంస్కృత గ్రంథాలలో వర్ణించిన విధంగా అర్థవంతమైన సామాజిక భాగాలు కావని వృతిపరమైన గుర్తింపు ఉమ్మడి ఆచార వ్యవహారాల, ఆహార, వైవాహిక సంబంధాలలో పాటించే విధి నిషేధాలు మొదలగు వాటికి సంబంధించి తరతమ భేదాలలో సమైక్యమైన విభిన్నమైన స్థానిక జాతులని ఇటీవలి సామాజిక శాస్త్ర అధ్యయనాలు స్పష్టం చేశాయి.

కుల వ్యవస్థ ఎలాంటి మార్పులు లేకుండా హెచ్చు తగ్గులు లేకుండా కొనసాగుతుందనే భావన కూడా తిరస్కరించబడింది. సంస్కృతీకరణ ధోరణులు– సామాజికంగా, సాంప్రదాయకంగా ఉన్నతమైన స్థాయిలో ఉన్న జాతుల జాతులు ఆచార వ్యవహారాలు విధి విధానాల్ని తక్కువ స్థాయిలో వున్న జాతులు అరువు తెచ్చుకొని సంస్కృతీకరణ చెందినట్లు యం.యన్.శ్రీనివాస్ లాంటి సామాజిక శాస్త్రవేత్తలు జరిపిన అధ్యయనాలు స్పష్టంచేశాయి. బ్రిటీష్‌వారు భారత దేశానికి రాక ముందు అస్థిర రాజకీయ వ్యవస్థల మిగులు భూముల కారణంగా వివిధ కులాల వారు ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతాన్ని వలస పోతూ ఉండేవారు. ఉదాహరణకు మధ్యయుగాల నాటి బెంగాల్‌కు చెందిన సద్గోపులు తొలుత పశుకాపరులైన గోపజాతికి చెందిన వారు. బెంగాల్, బీహార్ సరిహద్దు ప్రాంతాలకు వెళ్ళి కొత్త భూముల్ని సాగులోకి తెచ్చారు. వలస పాలన ఈ అవకాశాలకు తెరదించింది. కాని కొత్త అవకాశాలకు తావిచ్చింది. ఇప్పుడు కొత్త రాజ్యాల స్థాపన అసాధ్యమైంది. కొత్త వ్యవసాయ ప్రాంతాలు నానాటికి కుచించుకుపోయాయి. కాని అభివృద్ధి చెందిన రవాణా సమాచార సౌకర్యాలు కొత్త అవకాశాలు కల్పించాయి. ఇంగ్లీషు చదువు మైనారిటీలు సామాజికంగా ఎదగడానికి కొత్త నిచ్చెన వేసింది. వలస దోపిడీ విధానం కొన్ని గ్రూపులను దెబ్బతీసి కొన్ని గ్రూపులకు ప్రయోజనాలు చేకూర్చే పద్ధతి అనుసరించింది. 1901 జనాభా లెక్కల సేకరణ నుండి ప్రతీ పది సంవత్సరాలకు స్థానిక ప్రజాభిప్రాయాన్ని అనుసరించి కులాన్ని వర్గీకరించే పద్ధతి చేపట్టింది. ఇది వివిధ కులాల నాయకులు తమ కులం గొప్పదంటే కాదు తమ కులం గొప్పదని వాదులాడుకోవడాన్ని ప్రోత్సహించింది. కుల పెద్దలు (నాయకులు) కుల సంఘాలు నిర్వహించారు. కులాల ఆధిక్యతకు పురాణ ఇతిహాసాలనుండి ఆధారాలు సేకరించారు. నూతన

పరిస్థితి కుల ఐక్యతని కనీసం రెండు రకాలుగా ప్రోత్సహించింది. కుల నాయకులు వారి స్వప్రయోజనాల కొరకు సామాజిక గుర్తింపు కొరకు, ఉద్యోగాల కొరకు రాజకీయ అవకాశాల కొరకు తమ కులం మద్దతుని కూడగట్టడం ప్రయోజనకరంగా కనిపించింది. అంతేగాక 1880 దశాబ్దం నుండి క్రమంగా ఎన్నికల రాజకీయాలు ప్రవేశపెట్టబడ్డాయి. అస్తవ్యస్తంగా ఉన్న సమాజంలో పేదలు మనుగడ సాగించేందుకు అప్పటికే పైస్థాయికి ఎదిగిన కుల నాయకుల అండదండలు, ప్రోత్సాహం అవసరమయ్యాయి.

కుల చైతన్యానికి సంబంధించిన ఒక రకమైన తప్పుడు చైతన్యం ద్వారా, కుల వైషమ్యం ద్వారా, సంస్కృతీకరణ ఉద్యమాల ద్వారా సామాజిక ఆర్థిక ఉద్రిక్తతలు వ్యక్తమయ్యాయి. ఉదాహరణకు బెర్నాడ్ కాన్ జాక్‌పూచ్ (తూర్పు యు.పి.) గ్రామంపై జరిపిన అధ్యయనం బీహర్‌లో (రాబ్‌పెట్ ఠాగూర్ భూస్వాములు ఆధిపత్యం క్రింద పని చేసే అత్యధికంగా రైతులు లేక భూమిలేని శ్రామికులు) శివనారాయణ తత్వంలో స్వాతనం పొంది ఆవు మాంసం తినకూడదని బ్రాహ్మణ సాంప్రదాయాన్ని అనుకరించి వారి సామాజిక స్థాయిని పెంచుకొన యత్నించారు. అలాగే దేశం యొక్క మరొక అంచున ఉన్న కేరళకు చెందిన అస్పృశ్యులైన యజవాలు నామ అసాన్ (శ్రీనారాయణ గురు 1854-19=8)చే ప్రభావితులయ్యారు. బ్రాహ్మణాధిక్యతపై దాడి చేశారు. దేవాలయ ప్రవేశాన్ని డిమాండ్ చేశారు. వారి ఆచార వ్యవహారాలను సంస్కృతీకరించుకున్నారు. ఆ తరువాత కాలంలో యజవాలు కమ్యూనిస్టులకు బలమైన మద్దతుదారులయ్యారు. కొన్ని సందర్భాలలో ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా రైతులు పోరాడిన మొదటి సంఘటిత రూపాలు ఈ కుల సంఘాలు అన్నారు. ఇ.ఎం.యస్. నంబూద్రిపాద్ అయినప్పటికీ ఈ కుల సంఘాల్ని ఒక వర్గంగా సంఘటిత పరచాలంటే రైతాంగంపై వీటికి గల పట్టుని బద్దలుకొట్టాలి. (కేరళ, బొంబాయిలలో జాతీయ సమస్య 1952)

దక్షిణ తమిళనాడులో నాడార్లు అభివృద్ధి చెందిన క్రమంపై హర్డ్‌గ్రేవ్ చేసిన అధ్యయనం తొలుత తాటికల్లు గీత, వ్యవసాయ కూలీలుగా పని చేసే అస్పృశ్యులుగా పరిగణింపబడే షానార్లు ఆ తరువాత వర్తక వ్యాపారాలు చేపట్టి 1901 జనాభా లెక్కల సేకరణ నాటికి తమకు క్షత్రియుల స్థాయి కల్పించాలని కోరారు. వారి దేవాలయ ప్రవేశ హక్కులపై 1899లో తిరునల్వేలిలో ఘర్షణలు జరిగాయి. అదే విధంగా ఉత్తర తమిళనాడుకు చెందిన పల్లీలు 1871 నుండి తమ పుట్టు పూర్వోత్తరాలు క్షత్రియ వంశంతో ముడిబడి ఉన్నాయన్నారు. తాము వన్ని కుల క్షత్రియులమని ప్రకటించుకున్నారు. బ్రాహ్మణులను అనుకరిస్తూ వితంతువులు పెళ్ళాడరాదని నిషేధాలు విధించుకున్నారు. ఆ తరువాత కాలంలో అంబేద్కర్ ఉద్యమానికి వెన్నుముకగా నిలిచిన మహారాష్ట్ర మహర్లు 19వ శతాబ్దంలో మాజీ సైనికోద్యోగి గోపాల్ బాబా వాలంగ్‌కర్ నాయకత్వంలో సంఘటితమవడం ప్రారంభించారు. 1894లో వాలంగ్‌కర్ తయారు చేసిన విజ్ఞప్తితో తమ కులానికి మూలాలు క్షత్రియ వంశంలో ఉన్నాయన్నాడు. సైన్యంతో తమకు ఎక్కువ ఉద్యోగాలు యిప్పించమన్నాడు. అప్పటికీ

అస్పృశ్యులుగా పరిగణింపబడుతూ తక్కువ స్థాయి గ్రామ సేవకులుగా, కాపలాదార్లు, వార్తాహరులు, ఖాయిదాదార్లు, ఊడ్చేవాళ్ళుగా పని చేస్తున్నారు. కాని బ్రిటీషు పాలన వారి సాంప్రదాయక వృత్తులు రద్దయ్యే ప్రమాదం తెచ్చిపెట్టింది. అదే సమయంలో సైన్యంలో ఉద్యోగాల రూపంలో కొత్త అవకాశాలు తెచ్చిపెట్టింది. సైన్యంలో నియామకాలు సైనిక జాతుల నుండి తీసుకోవాలనే బ్రిటీష్ నిర్ణయంలో మహర్లు సంఘటితమవడానికి ఉత్తేజాన్నిచ్చింది.

బ్రాహ్మణులకు దిగువన, అస్పృశ్యులకు పైన వుండే మధ్యస్థ కులాలు సంఘటితమవడం ప్రారంభమైంది. ఈ కులాలలో భూస్వాములు, సంపన్న రైతులు ఉన్నారు. పట్టణాల్లో విద్యావంతుల గ్రూపుల్ని తయారు చేయగల శక్తి వీటికే వుంది. శతాబ్దాంతానికి మహారాష్ట్ర, మద్రాసులలో ఉద్యోగాలు, సాధారణ సాంస్కృతిక జీవితంపై బ్రాహ్మణులతో గల స్పష్టమైన ఆధిక్యత బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాలకు దారితీసింది. మొట్ట మొదటి సారిగా మహారాష్ట్రకు చెందిన జ్యోతీబాపూలే "గులాంగిరి" గ్రంథం (1872) ద్వారా తన సంస్థ సత్యశోధక సమాజ్(1873) ద్వారా బ్రాహ్మణ వ్యతిరేక సంకేతాలను వ్యక్తం చేశాడు.

గులాంగిరి, సత్యశోథక్ సంస్థలు బ్రాహ్మణుల కపటతనం నుండి వారి అవకాశ వాద పవిత్ర గ్రంథాలనుండి దిగువ కులాల్ని రక్షించుకోవలసిన అవసరాన్ని చాటి చెప్పాయి. మాలి కులానికి చెంది, పట్టణంలో చదువుకున్న జ్యోతిబాపూలే ప్రారంభించిన ఈ ఉద్యమం ఆ తరువాత ప్రధానంగా మరాఠీ రైతాంగ కులాలలో ఒక మేరకు వేళ్ళనుకుంది. సత్యశౌథక్ సమాజంలో ఒకవైపు ఉన్నత స్థాయికి చెందిన కులీన ధోరణి, మరొక వైపు ప్రజా పునాది గల సంస్కరణ వాదం ద్వంద్వ వైఖరి కలదని గెయిల్ ఓమ్‌వెట్ జరిపిన ఇటీవల అధ్యయనం (వలస సమాజంలో సాంస్కృతిక తిరుగుబాటు పశ్చిమ భారతదేశంలో బ్రాహ్మణేతర ఉద్యమం 1873–1930) నొక్కి చెప్పింది. మొదటిది మితవాద సంస్కృతీకరణ పద్ధతిలో అభివృద్ధి చెందింది. తరచుగా మరాఠీలు క్షత్రియ కులానికి చెందిన వారని చెప్పుకున్నారు. 1890 నుండి కోల్హాపూర్ మహారాజా ప్రాపకం పొందారు. ఉద్యమం విధేయతా స్వభావం గలది. రాజకీయంగా విభజించే స్వభావం గలది. బ్రిటీష్‌వారు తిలక్‌కి వ్యతిరేకంగా కోల్హాపూర్‌ని, 1919 తరువాత కాంగ్రెస్‌కి వ్యతిరేకంగా భాస్కరరావు జాదవ్ బ్రాహ్మణేతర పార్టీని ప్రోత్సహిస్తూ వచ్చారు. అంతేకాక దీనికి (ఉద్యమానికి) మరొక స్వభావం వుంది. 19వ శతాబ్దపు సంఘ సంస్కరణ ఉద్యమాలకు భిన్నంగా పట్టణాలలో కంటే పల్లెల్లో పని చేసింది. ఇంగ్లీష్ కంటే దేశీయ మరాఠీ భాషని ఉపయోగించింది. సమాజంలో ఉన్నత స్థాయిని కోరడం కంటే కుల వ్యవస్థని ఎదుర్కొన్నది బ్రాహ్మణులకు వడ్డీ వ్యాపారులకు వ్యతిరేకంగా బహుజన సమాజం పక్షాన నిలచి పోరాడతానన్నది 1919–21లలో రైతాంగ తిరుగుబాట్లను ప్రోత్సహించింది.

మహారాష్ట్ర గ్రామీణ ప్రాంతాలలో గాంధేయ కాంగ్రెస్ పునరుజ్జీవానికి తోడ్పడింది. ఆ తరువాత మద్రాసు ప్రెసిడెన్సీలు విద్య ఉద్యోగాలతో బ్రాహ్మణాధిక్యతని (ప్రెసిడెన్సీలో బ్రాహ్మణుల శాతం 3,2, కాని 1870–1919 కాలంలో మద్రాసు యూనివర్సిటీ పట్టభద్రులు 70%) తమిళవెల్లలాలు, తెలుగు రెడ్లు, కమ్మవారు, మళయాళీ నాయర్లు సవాల్ చేసినప్పుడు

దాదాపు అవే పరిస్థితులు పునరావృతం అయ్యాయి. జమిందారులు, భూస్వాములు పెద్ద రైతులతో సహా పన్నులు చెల్లించే వారితో అత్యధికులు బ్రాహ్మణేతరులేనని 1916 నాటి బ్రాహ్మణేతర మేనిఫెస్టోలో తరచుగా పేర్కొనడం ఈ ఉద్యమం యొక్క కులీన స్వభావాన్ని వ్యక్తం చేస్తుంది. ద్రావిడులు లేక తమిళుల ప్రత్యేకవాద స్వరూపం తీసుకున్న ఈ ఉద్యమానికి బ్రిటీష్‌వారి ప్రోత్సాహం ముందనడానికి కావలసినన్ని సాక్ష్యాధారాలు ఇర్ష్‌చిక్ అధ్యయనంలో లభ్యమవుతున్నాయి. 1920,1930 దశాబ్దాలలో జస్టిస్ పార్టీ కార్యాకలాపాలు వీటినే ధృవపరుస్తున్నాయి. కాని 1886 లోనే మద్రాసు గవర్నరు స్నాతకోత్సవంతో పేర్కొన్న ఈ అంశాలు ఆసక్తికరమైనది. మీది స్వచ్ఛమైన ద్రవిడజాతి. సంస్కృత భాష కంటే ప్రాచీన సంస్కృతి మీది... ఇంగ్లీషు వారమైన మాకు సంస్కృతంతో ఉన్న సంబంధం మీకు లేదు. యూరోపియన్లు కొన్ని సందర్భాలలో భారతీయుల్ని మొరటుగా “నిగ్గర్లు” అని ప్రస్తావిస్తారని విన్నాను. కాని వారు సంస్కృత భాషాభిమానులు రచయితల లాగా దక్షణాది ప్రజల్ని కోతిమూకలని ఈసడించలేదు”. నిజమైన సమస్యల్ని ప్రక్కదారి పట్టించేందుకు ప్రజలలో కుల, మత ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచి పోషించడం సామ్రాజ్యవాదులకు వెన్నతో పెట్టిన విద్య. అదే సమయంలో మహారాష్ట్రలోలాగా తమిళనాడులో సామాజికంగా పెనుమార్పులకు అవకాశాలు లేకపోలేదు. 1920 దశాబ్దంలో వచ్చిన నాస్తిక వాద, ఆత్మగౌరవ ఉద్యమాలు అలాంటివే. కుల ఉద్యమాలన్నింటికీ సంస్కృతీకరణ ముద్రవేయడం సరియైనది కాదు. కొన్ని ఉద్యమాలు కొన్ని సందర్భాలలో కులం పునాదులనే సవాలు చేశాయి.

ఉత్తర, తూర్పు భారతదేశంలో బ్రాహ్మణాధిక్యత అంత స్పష్టంగా వ్యక్తం కాలేదు. అక్కడ ఇతర అగ్ర కులాల గ్రూపులు (యు.పి., బీహార్‌లలో రాజపుట్ కాయస్థ, బెంగాల్‌లో వైద్య లాంటివి) మధ్యస్థ కులాలుగా ఉన్నాయి. అక్కడ కుల సమీకరణలు ఆ తరువాత కాలంలో జరిగాయి. కాని కాయస్థలు వారి అంతరాష్ట్ర వృత్తి సంబంధాల కారణంగా 1900 నాటికే అఖిల భారత సంఘాన్ని స్థాపించుకొన్నారు. అలహాబాద్ కేంద్రంగా ‘కాయస్థ సమాచర్’ పత్రికని ప్రారంభించారు. బెంగాల్‌లో దిగువ కులాల సంఘాలు 20వ శతాబ్దపు మొదటి దశాబ్దంలో ప్రాధాన్యతని సంతరించుకున్నాయి. మిడ్నాపూర్‌కి చెందిన సంపన్నులైన ‘కైవర్తాలు’ స్థానిక జమిందారుల, కలకత్తాకు చెందిన కొందరు న్యాయవాదుల వర్తకుల నాయకత్వంలో తమను తాము ‘మహిష్యాలు’ గా ప్రకటించుకొన్నారు. 1897లో “జాతి నిర్ధారిణి సభ’ ని ప్రారంభించారు. 1901 జనాభా లెక్కల సేకరణ సమయంలో కేంద్రీయ మహిష్యా సమితిని స్థాపించారు. ఆ తరువాత కాలంలో మిడ్నాపూర్ మహిష్యాలు జాతీయ ఉద్యమాలలో ప్రధానమైన పాత్ర నిర్వహించారు. కాని 1901 తరువాత కొద్దిమంది విద్యావంతుల మిషనరీల ప్రోత్సాహలతో కుల సంఘాలు స్థాపించిన ఫరీద్‌పూచ్ నామ శూద్రులతో బ్రిటీష్‌వారి విభజించి పాలించే ఎత్తుగడలు బాగా పనిచేశాయి. మిడ్నాపూర్ మహిష్యాలు స్థానికంగా ఆధిపత్యం సాధించిన కులం. దీనిలో చిన్న భూస్వాములు, ధనిక రైతులతో పాటు గణనీయులైన సంఖ్యలో పేదలు ఉన్నారు. అస్పృశ్యులు పేద రైతులు అయిన నామ శూద్రులకు ఎక్కడో దూరంగా ఉన్న బ్రిటీష్ పాలకులకంటే అగ్రవర్ణ సంపన్నుల దోపిడి ప్రక్కనే పోంచి ఉన్న ప్రమాదంగా కన్పించింది.

### మతపరమైన చైతన్యం

వలసవాదం పాక్షిక చైతన్యాన్ని పెంచి పోషించి మతపరమైన విభజన– హిందూ, ముస్లిం మతతత్వాన్ని తెచ్చిపెట్టింది. క్లిష్టమైన అంశంపై స్పష్టమైన అవగాహనకు రెండు విరుద్ధమైన ఆలోచనా ధోరణులు అడ్డుపడుతున్నాయి. ఒకటి : హిందువులు, ముస్లింలు రెండు వేర్వేరు మూసలలో తయారయిన జాతులు మధ్య యుగాలనుండి పరస్పరం ఘర్షణ పడుతూ ప్రతికూలంగా ఉన్నాయి.

రెండవది : హిందువులు, ముస్లింలు పరిపూర్ణమైన ఐక్యతతో వర్ధిల్లిన స్వర్ణయుగాన్ని బ్రిటీషువారి విభజించే రాజనీతి విచ్ఛిన్నం చేసింది. 19వ శతాబ్దం ఉత్తరార్ధం వరకు ఈ రెండు ఆలోచనా ధోరణులకు దేశ వ్యాప్తంగా సమర్థన, మద్దతు కూడగట్టడం సాధ్యపడలేదు. వాస్తవంగా భారత జాతీయ వాదం, హిందూ, ముస్లిం మతతత్వ వాదులు ఆధునిక భావజాలం ఈనాటి షియా–సున్నీ ఘర్షణలు. కుల ఘర్షణల లాగానే గడచిన శతాబ్దాలలో కూడా కొన్ని సందర్భాలలో హిందువులు ముస్లింలు మధ్య స్థానిక ఘర్షణలు జరిగిన ఘటనలు వున్నాయి. కాని 1880 దశాబ్దానికి ముందు మత ఘర్షణలు చాలా అరుదుగా జరిగాయి. సామ్రాజ్యవాద సంబంధాలు గల మేధావి కూప్‌లేండ్ 1809లో జరిగిన ఒక ముఖ్యమైన ఘటన (హిందువులు 13 మసీదుల్ని ధ్వంసం చేశారు)ని పేర్కొన్నారు. అతడికి సమస్యని తగ్గించి చెప్పనవసరంలేదు. (హిందూ ముస్లిం సమస్యకి బ్రిటీషు పాలన కొనసాగింపే కారణమని స్పష్టంగా పేర్కొన్నారు) ఆ తరువాత 1871–72 లోనూ 1885 తరువాత నుండి తరచుగా ఘర్షణలు జరిగాయి. (ఆర్. గూడ్‌వేండ్: భారతదేశంలో రాజ్యాంగ సమస్య పేజి 29)

ఉద్యోగాల కొరకు, రాజకీయ ప్రయోజనాల కొరకు కులీనుల మధ్య జరిగే ఘర్షణల నుండి మతతత్వ వాదం పుట్టింది. ఇది ప్రత్యక్ష సత్యం. పండితులు సమస్యని ఈ కోణం నుండే అధ్యయనం చేశారు. యు.పి. ముస్లింలపై ఫ్రాన్సిస్ రాబిన్సన్ చేసిన వివరణాత్మక అధ్యయనంలో రాజకీయాలలో కులీన గ్రూపులపై కేంద్రీకరించానని ప్రజల ఘర్షణల్ని తన పరిశీలన నుండి మినహాయించానని స్పష్టంగా పేర్కొన్నాడు. (భారత ముస్లింలలో వేర్పాటు వాదం పేజి. 6) కులీన మత తత్వవాదం యొక్క మూలాలను గురించి తరువాత అధ్యాయాలలో సమకాలీన చారిత్రక పరిస్థితులు, మేధావుల లేక మధ్యతరగతి జాతీయ వాదంతో పాటు చర్చిద్దాం. కాని మతవాదం చాలా కాలం క్రితమే అప్పటి విద్యావంతుల ద్వారానే విస్తృత ప్రజానీకంలోకి చొచ్చుకుపోయిందనే బాధకరమైన వాస్తవాన్ని అంగీకరించక తప్పదు. పాచ్నా ఘర్షణలు లేక మోప్లా తిరుగుబాట్లకు మతతత్వ స్వభావం మన కాలంలో అభివృద్ధి చెందలేదు. అందుకు కారణాలు వేర్పాటు వాద మేధావుల నాయకత్వం బెంగాల్, మలబార్‌లలో లేకపోవడం కావచ్చు. యు.పి. పంజాబ్‌లలో హిందువులు, ముస్లింలు యించుమించు సమానంగా విద్యావంతులవడం కావచ్చు. కాని ఈ ప్రాంతాలలో 1880 తరువాత మత ఘర్షణలు సర్వసాధారణమయ్యాయి. అప్పటి సామాజిక ఆర్థిక ఉద్రిక్తతలు పాక్షికంగా కారణమై వుండవచ్చు.

అవధ్, అలీఘర్, బులంద్‌షాలలోని విస్తృత ప్రాంతాలలో హిందూ రైతులు ముస్లిం తాలూకాదార్లను భూస్వాములను ఎదుర్కొన్నారు. యు.పి. నగర ప్రాంతాలలోని ముస్లింలలో అత్యధికులు చేతి వృత్తుల వారు, చిన్న షాపుల యజమానులు, చిల్లర వ్యాపారులు. కాని పెద్ద వ్యాపారులు బ్యాంకర్లు హిందువులు పంజాబులో హిందూ వర్తకులకు, వడ్డీ వ్యాపారులకు ముస్లిం రైతుల నుండి ప్రజా ప్రతిఘటన ఎదురయ్యింది. కానీ ఆర్థిక సమస్యలకు సంబంధంలేని అంశాలపై కూడా ఘర్షణలు జరిగాయి. ఒక ఉద్యమం ప్రారంభ దశలోనే ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాలలో గోవధ సమస్యపై ఘర్షణలు జరిగాయి. 1883–91 కాలంలో పంజాబులో యిలాంటి పెద్ద ఘర్షణలు చెలరేగాయని గెరాల్డ్ బారియన్ పేర్కొన్నారు. 1888–93 కాలంలో తూర్పు యు.పి., బీహార్‌లలో ఈ అలజడులు పతాక స్థాయికి చేరుకొన్నాయి. ఘర్షణల ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాలు – బాలియా, బనారస్, అజాంఘర్, గోరక్‌పూర్, అర్రా, షరాన్, గయ, పాట్నాలు 1893–95 కాలంలో బొంబాయిలోను మహారాష్ట్రలోని చాలా పట్టణాలలో తీవ్రమైన ఘర్షణలు చెలరేగాయి. ఒక గుజరాతు మిల్లు యజమాని బొంబాయిలో 1893లోగా సంరక్షణ సంఘాన్ని స్థాపించారు. తిలక్ గణపతి ఉత్సవాలను సార్వజనిక లేక మత ప్రాతిపదికన చేపట్టాడు. గణపతి ఉత్సవాలకు రాయబడిన పాటలు మొహరంని బహిష్కరించమని పిలుపునిచ్చాయి. అంతకు ముందు హిందువులు, ముస్లింలు సమిష్టిగా మొహరం పండగ జరుపుకొనేవారు. గణపతి ఉత్సవాల కంటే మొహరం జాతీయ పండుగ అని 1898లో సుధారక్ అనే సంస్కరణవాద పత్రిక పేర్కొన్నది. అల్లా అనుగ్రహం మేరకే నీవు ముస్లింగా పుట్టావు. పరాయి మతంతో స్నేహ సహకారాలు కూడదు' 'గోవు మన తల్లి. తల్లిని మరచిపోవద్దు' (ఆర్.కాష్మన్. ది వింత్ ఆఫ్ లోక మాన్య పేజి 78) – లాంటి ఉద్రిక్తతలు చోటు చేసుకొన్నాయి. కలకత్తా పరిసర పారిశ్రామిక ప్రాంతాలలో మొదటి ఘర్షణ 1891లో జరిగింది. ఆ తరువాత 1896 బక్రీద్ సందర్భంగా టిలూఘర్ గార్డెన్ రిచ్‌లలో అలజడులు చెలరేగాయి. 1897లో ఉత్తర కలకత్తాలో విస్తృత స్థాయి ఘర్షణ జరిగింది.

**శ్రామికులు**

1890 దశాబ్దం నాటి కలకత్తా జనపనార మిల్లు ఘర్షణలు తొలిసారిగా శ్రామిక చైతన్యాన్ని కలిగించామని దీపేష్ చక్రవర్తి పేర్కొన్నారు. 1819 దశాబ్దం నాటికి బొంబాయి పత్తి మిల్లుల్లో కలకత్తా జనపనార మిల్లుల్లో గణనీయమైన కార్మిక వర్గ కేంద్రీకరణ జరిగింది. కార్మికుల జీవన పరిస్థితులు ప్రపంచంలో ఇతర ప్రాంతాలలో పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందుతున్న ఇలాంటి దశలలో ఎంత అధ్వాన్నంగా వున్నవో అంత అధ్వాన్నంగా వున్నాయి. 1881,1891 ఫ్యాక్టరీ చట్టాల మేరకు స్త్రీలను, పిల్లల్ని కూలీలుగా నియమించరాదన్న చట్టాన్ని అరకొరగా పాటించారు. (అది కూడా బొంబాయి బట్టల మిల్లుపై లాంక్‌షైర్ బట్టల మిల్లు ఒత్తిడి మేరకు) రోజుకి 15,16 లేక 18 గంటలు పని చేయడం సర్వసాధారణమయింది. బొంబాయిలో కార్మికుల పని పరిస్థితుల మెరుగు కొరకు మానవతా దృష్టిలో ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. వాటికి ఆధ్యుడు యన్.యం. లొఖండే (పూలే

సహచరుడు) 1880లలో 'ధీనబంధం' అనే వార్తా పత్రిక ప్రారంభించారు. 1884లో పని గంటల తగ్గింపు కొరకు సమావేశాలు నిర్వహించారు. 1890లో బొంబాయి మిల్లు కార్మికుల సంఘాన్ని ప్రారంభించాడు. వాస్తవంగా కార్మిక వర్గ సంఘం కాదు. లొఖండే తన కార్యాలయంలో ఉండేవాడు. తన దగ్గరికి వచ్చిన వారికి సలహాలిచ్చేవాడు. అలాంటి కార్యకలాపాలు కలకత్తాలో కూడా ప్రారంభమయ్యాయి. కలకత్తా పరిసరాలలోని బారంగోర్ బెంగాలీ జూట్ మిల్లు కార్మికుల కొరకు బ్రహ్మ సమాజ సంస్కర్త శశిపద బెనర్జీ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టారు. రాత్రి బడులు, క్లబ్బులు, ఆత్మ సంయమన సంఘాలు, భారత శ్రమజీవి అనే పత్రిక అన్నీ కూడా కార్మికులకు మిత వ్యయం, నమ్రత, స్వయం సహాయకత లాంటి మధ్యతరగతి నీతి నియమాలను అలవాటు చేసేందుకు యత్నించాయి. శశిబాబు పాఠశాలల్లో చదివే కార్మికులు క్రమశిక్షణాయుతంగా కష్టించి పని చేస్తున్నారని యూరప్ మిల్లు యజమానులు హర్షం వ్యక్తం చేశారు. బెనర్జీ కార్యకలాపాన్ని ప్రోత్సహించి పోషించినవారిలో బారంగార్ జూట్ మిల్లుల మేనేజర్ డబ్ల్యు అలెగ్జాండర్ ముఖ్యుడు. కాని తూర్పు యు.పి., బీహరుల నుండి వలసలు వచ్చిన వారిని బెంగాలీ కార్మికుల్ని తొలగించి నియమించడంలో 1890 దశాబ్దంలో ఈ మధ్యతరగతి మానవతా వాదం కూడా అంతరించింది. బీహరు బెంగాల్ గనులలో, అస్సాం టీ తోటలలో కూలీలు వారి స్వగృహలు నుండి తరిమి వేయబడి వందలాది మైళ్ళ దూరంలో కాంట్రాక్టు ఒప్పందాలకు లోబడి అయిన వారికి దూరంగా కొత్త వాతావరణంలో భయం భయంగా బతుకుయీడుస్తున్న వలస కూలీలు ద్వారకానాథ్ గంగూలీ లాంటి బెంగాలీ మేధావులు దయనీయమైన కూలీల స్థితిగతులకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించారు. కానీ కూలీల్ని సంఘటిత పరచే ప్రయత్నాలు చేయలేదు.

కూలీలు వారి స్వంత పద్ధతులలో కొన్ని పోరాటాలు చేశారు. పని చేయించే సూపర్వైజర్లపై దాడులు చేశారు. చెదురు మదురు ఘర్షణలకు తలపడ్డారు. చిన్న చిన్న సమ్మెలు చేశారు. 1882-90 కాలంలో బొంబాయి మద్రాసులలో 25 ముఖ్యమైన సమ్మెలు జరిగినట్లు నమోదయింది. 1892-93, 1901 సంవత్సరాలలో బొంబాయిలో చాలా పెద్ద సమ్మెలు జరిగాయి. 1890 దశాబ్ద మధ్య కాలంలో కలకత్తా జూట్ కార్మికులలో సమరశీలత యొక్క నూతన స్వరం వ్యక్తమైంది. మిల్లు యజమానులు దాడులనరికట్టేందుకు అదనపు పోలీసు పర్యవేక్షణ అవసరమని భారత జూట్ మిల్స్ అసోసియేషన్ 1895 ఏప్రిల్‌లో బెంగాల్ ప్రభుత్వాన్ని అర్థించింది. ప్రాథమిక దశలో ఉన్న కార్మిక నిరసనలు వర్గ చైతన్యానికి బదులుగా మతతత్వ చైతన్య రూపాన్ని తీసుకునే అవకాశాలు వుంటాయి. ముస్లిం కార్మికులు మొహరం పండుగకు సెలవు కావాలని డిమాండ్ చేశారు. హిందువులు రథయాత్రకి కావాలన్నారు. గోవధ సమస్య వివాదస్పదమైన స్థలాల్లో ప్రార్థనాలయాన్ని నిర్మించడం లాంటి సమస్యలపై పోట్లాడుకొన్నారు. 1860-97లో కలకత్తా పరిసరాలలో యిలాంటి ఘర్షణలు జరిగాయి. గో సంరక్షణ సమస్యపై ఘర్షణలు ఎక్కువగా జరిగిన యు.పి., బీహార్ నుండి వలసలు వచ్చిన కార్మికుల దృక్పథం జూట్ మిల్లు కార్మికుల్ని ప్రభావితం చేసింది. 17వ శతాబ్దం నాటి ఇంగ్లీషు బూర్జువా విప్లవం యొక్క ప్రజాస్వామ్య అంశాల్ని పరిరక్షించి విస్తరింపచేసిన చేతి వృత్తులలో

సమూలమైన మార్పులు కోరే విధానం ఇంగ్లీషు కార్మిక వర్గం రూపు దిద్దుకోవడానికి తోడ్పడితే పేదరికంలోకి నెట్టి వేయబడిన భారతీయ రైతు, చేతి వృత్తులవారు ఫ్యాక్టరీలలోకి పీల్చబడి కుల మత బంధాలను ఆసరా చేసుకునే వైపు మొగ్గారు. నూతన పట్టణ వాతావరణం పాత విధేయతలకు బలాన్ని చేకూర్చింది. వలస కూలీలలో ఉద్యోగాల కొరకు పోటీ పెరిగింది. ఉద్యోగాల కొరకు సాధారణంగా స్థానిక సర్దారుల్ని ఆశ్రయించవలసి వచ్చింది. సర్దారులు, వారికంటే సామాజికంగా ఉన్నతుల వేర్పాటువాద సిద్ధాంతానికి వాహకులుగా పని చేశారు. 1896 నాటికి రీష్రా జూట్ మిల్లు ముస్లిం కార్మికులకు స్థానిక ఇనాం ద్వారా ముస్లిం తీవ్రవాద సంస్థలో చురుకుగా పని చేస్తున్న కలకత్తాకి చెందిన ముస్లింల వ్యాపార వేత్త హాజీ నూర్ మహమ్మద్ జకారియాతో సంబంధాలు ఏర్పరచబడ్డాయని చక్రవర్తి పరిశోధనా పత్రం చెబుతుంది. కలకత్తా పారిశ్రామిక ప్రాంతంలో మొదటిగా 1895లో స్థాపించబడిన కార్మిక సంఘం కంకినారాకి చెందిన మహమ్మదీయ సంఘం. ఈ సంఘం సభ్యులకు రోగాలు రోస్టులు వస్తే ఆదుకోవడానికి విరాళాలు సేకరించింది.

ఇతర ప్రాంతాల కూలీలు వలసలు రావడం, ఆహారధాన్యాల ధరలు విపరీతంగా పెరగడం విద్యుద్దీపాలు రావడంతో పని గంటలు పెంచడం – 1850 దశాబ్దం మధ్య భాగంలో కలకత్తా జూట్ మిల్లు కార్మికులతో ఉద్రిక్తల్ని పెంచాయి. కార్మికులు యాజమాన్యంపై విరుచుకుపడ్డారు. మత ఘర్షణలకు పాల్పడ్డారు. మొదటి తరహా సంఘటనల కంటే రెండవ తరహా సంఘటనలు ఎక్కువ జరిగాయన్న చక్రవర్తి వాదనని లోతుగా అధ్యయనం చేసిన రంజిత్ దాస్‌గుప్తా తిరస్కరించారు. మత, వర్గ, జాతీయ చైతన్యాన్ని కలగా పులగంగా ఒకదానినొకటి ప్రభావితం చేసుకుంటున్న 20వ శతాబ్దపు భారత దేశ చరిత్రలో అలాంటి అస్థిర పరిస్థితి కొనసాగుతుంది. వ్యవసాయ అలజడులు తరచుగా మత ఘర్షణల రూపం తీసుకున్నాయి. గోసంరక్షణకు కంకణం కట్టుకున్నవారు లేక ఇస్లాం ఆందోళనాకారులు కార్మిక కర్షక నాయకులయ్యారు. ఇందులో విపరీతం మేంలేదు. ఇక్కడ మాత్రమే జరిగిందికాదు. “ ఒక రకమైన సమరశీలత సులభంగా మరొక రూపం తీసుకొంటుంది. అని పారిశ్రామిక విప్లవానికి ముందునాటి ప్రజల గుంపుల్ని గురించి జార్జిరూడ్ చేసిన వాఖ్యలు; అలాగే ‘శాఖాపరమైన (పాక్షిక) చైతన్యం వర్గ చైతన్యంగా అభివృద్ధి చెందవచ్చు. లేక వర్గ చైతన్యం శాఖాపరమైన (పాక్షిక) చైతన్యంగా మారవచ్చు’ అని ఇంగ్లీషు పారిశ్రామిక విప్లవంలో వర్గ పోరాటం అధ్యయనం చేసిన జాన్ ఫాస్టర్ వాఖ్యలు గమనార్హాలు.

### వ్యాపార గ్రూపులు, ఉన్నత వర్గాలు

భారత దేశంలో నూతన కార్మిక వర్గం ఆధునిక సిద్ధాంతాన్ని అందిపుచ్చుకొని ముందుకు తీసుకుపోలేక పోయింది. ఈ వాఖ్య అప్పుడే అభివృద్ధి చెందుతున్న భారత పెట్టుబడిదారీ వర్గానికి అంతకంటే ఎక్కువగా వర్తిస్తుంది. వ్యాపార సమూహాలలో బొంబాయికి చెందిన పార్సీలు తొలుత పాశ్చాత్యీకరణ చెందారనే ఖ్యాతి వుంది. కాని యిందులో కూడా పెద్ద వ్యాపారుల (షెటియాల) కంటే ఎల్ఫిన్ స్టన్ కాలేజి పట్టభద్రులు ముందున్నారు. ఇందుకు

విరుద్ధంగా గుజరాతి వనియాలు మార్వాడీలు సామాజిక, మత పరమైన విషయాలలో పూర్తి సాంప్రదాయ వాదులుగా వుండిపోయారు. బెంగాలులో సంఘసంస్కరణ ఉద్యమం వచ్చి రెండు తరాలు గడిచిన తరువాత గాని కలకత్తా మార్వాడీలలో అలాంటి ఉద్యమం రాలేదు. ఉమ్మడి కుటుంబం, బలమైన కుల బంధాలు మార్యాడీలు వ్యాపార పరంగా అభివృద్ధి చెందడంలో సానుకూలమైన పాత్రని నిర్వహించాయని టింబర్గ్ లాంటి చరిత్రకారులు నొక్కిచెప్పారు. వలస వచ్చిన మార్వాడీని స్థానిక మార్వాడీలు స్వాగతించారు. అంతేకాక 19వ శతాబ్దపు మత సంఘ సంస్కరణ ఉద్యమాలన్నింటిలో ఒక్క ఆర్య సమాజం మాత్రమే వ్యాపార గ్రూపుల నుండి కొంత మద్దతు పొందగలిగింది. జాతీయ బూర్జువాల అభివృద్ధికి వలస వాద రాజకీయ ఆర్థిక నిర్మాణానికి మధ్య దీర్ఘకాలిక వైరుధ్యాలున్నప్పటికీ, యింతకు ముందు గమనించిన విధంగా ఆర్థిక కారణాలరీత్యా భారత వ్యాపార గ్రూపులు 1920 దశాబ్దం వరకు విధేయులుగా ఉండిపోయారు.

### రాజాలు - జమిందారులు

స్వదేశీ సంస్థానాధీశులు జమిందారులు నాయకత్వం వహించే స్థితిలో లేరు. 1857 తరువాత బ్రిటీష్ విధానం ఫ్యూడల్ శక్తులతో క్రమంగా మైత్రికొరకు పావులు కదపడం ప్రారంభించింది. సిపాయిల తిరుగుబాటు కాలంలోనూ ఇలాంటి ఘటనలు జరిగినట్లు కానింగ్ పేర్కొన్నారు. కొత్త విధానం రాజ్య సంక్రమణ విధానాన్ని (Doctrine of lapse) ని వదలివేసింది. 1881లో అంటే 50 సంవత్సరాల తరువాత మైసూరుని హిందూ పాలక కుటుంబానికి అప్పగించింది. లిట్టన్ ఆధ్వర్యంలో దర్బారు ఉత్సవం, డఫరిన్ ఆధ్వర్యంలో సామ్రాజ్యవాద పటాలాలు, సంస్థానాధీశుల బిడ్డలకు పబ్లిక్ స్కూలు తరహా విద్య కొరకు అజ్మీర్‌లో మేయో కాలేజీ స్థాపన, అవధ్ తాలూకాదార్ల బిడ్డల కొరకు లక్నోలో కాల్విన్ కాలేజీ స్థాపన అన్ని చకచకా జరిగిపోయాయి. బ్రిటీషు సార్వభౌమాధికారం దృఢంగా పాదుకొల్పబడింది. బ్రిటీష్ రాజ ప్రతినిధుల ద్వారా బలవంతంగా అమలు పరచబడింది. ఈ గొడుగు క్రింద స్వదేశీ పాలన పేరుతో 3వ వంతు భారత దేశంలో ఫ్యూడల్ నియంతృత్వ అభివృద్ధి ప్రోత్సహించబడింది. వలసవాదానికి నిజమైన ఆధునీకరణతో పనేమిటి? అయినప్పటికీ కొన్ని స్వదేశీ సంస్థానాలు బ్రిటీష్ ఇండియాతో సమానమైన పాలనా పరమైన ప్రమాణాల్ని పాటించగలిగాయి. మైసూరు, బరోడా సంస్థానాలు సంఘ సంస్కరణల్ని చురుకుగా చేపట్టాయి. (స్వాతంత్ర్యం సాధించే వరకు బ్రిటిషిండియా కంటే బరోడాలో వివాహ చట్టం అభివృద్ధికరంగా వుంది) తిరువాన్కూరు అత్యంత ఎక్కువ అక్షరాస్యతా రేటుని సాధించింది. బరోడా వివిధ సందర్భాలలో నౌరోజి, ఆర్.సి. దత్, అరవిందఘోష్ లాంటి నాయకులతో సంబంధాలు పెట్టుకొని వారి సేవల్ని వినియోగించుకున్నది. రాజులకు, జమిందారులకు యిచ్చిన ప్రోత్సాహం సాంప్రదాయ భారతీయ సంస్కృతిలోని విలువైన అంశాల్ని (ఉదాహరణకు సాంప్రదాయ సంగీత వారసత్వాన్ని) పరిరక్షించుకోవడానికి దోహదపడింది. కాని అత్యధిక స్వదేశీ సంస్థానాలు సామాజికంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా నిలువనీరులా ఉండిపోయాయి. చిన్న చిన్న నియంతృత్వ

రాజ్యాలు బ్రిటిషిండియాలో అట్టహాసంగా అభివృద్ధి పరచబడిన చట్టాలు పౌరహక్కుల లాంటి వాటిని పట్టించుకోలేదు. 1930 దశాబ్దం నుండి ప్రారంభమైన స్వదేశీ సంస్థానాల ప్రజా ఉద్యమం మాత్రమే కృత్రిమంగా వేరు చేయబడిన ఈ ద్వీపాలకు భారత ఉపఖండ ప్రధాన స్రవంతిలో కలవగలిగింది. బ్రిటీషువారు భారత దేశాన్ని ఏకీకృతం చేశారని చెప్పుకోవడం కూడా వట్టిమాటలే. ఇక జమీందారుల విషయానికి వస్తే కలకత్తాకి చెందిన బ్రిటీషిండియన్ అసోసియేషన్ లాంటి భూస్వాముల ఆధిపత్యంలో గల సంస్థలు ఆ తరువాత కాలంలో మితవాద కాంగ్రెస్ నాయకుల డిమాండ్లను 1850 లోనే ప్రస్తావించాయి. కాని 1870 దశాబ్దం నుండి మధ్య తరగతి సంస్థలు అభివృద్ధి చెందడంతో ఇవి బ్రిటీషు ప్రభుత్వ విధేయ సంఘాలుగా ఎలాంటి కార్యకలాపాలు లేని ముఠాలుగా విచ్ఛిన్నమయ్యాయి.

1886 కలకత్తా సదస్సుకు హజరైన ప్రతినిధులని విశ్లేషించిన భారత జాతీయ కాంగ్రెస్ రిపోర్టు "ప్రజలకు స్వాభావిక నాయకులుగా చెప్పబడ్డ కులీన వర్గం (Aristocracy) నుండి ఎవరూ హాజరు కాలేదు" అని పేర్కొన్నారు.

"రైతులు, వ్యవసాయ వర్గాల నుండి తగినంత ప్రాతినిధ్యంలేదు". "చిన్న వడ్డీ వ్యాపారులు, షాపుల యజమానుల నుండి ఎవరూ రాలేదు. ఉన్నత స్థాయి వాణిజ్య వర్గాలు, బ్యాంకర్లు, వర్తకుల ప్రాతినిధ్యం ఎక్కువగా ఉందని పేర్కొన్నప్పటికీ దాదాపు 130 మంది ఏదో ఒక రకమైన భూమి యజమానులు కాంగ్రెస్ యొక్క తొలి తరం నాయకత్వం 'విద్యావంతులైన మధ్యతరగతి', 'ఇంగ్లీషు విద్య నేర్చిన కులీనులు' లేక మేధావి వర్గంతో మమేకమయ్యిందని చరిత్రకారులు వర్ణించారు. అలహబాద్ కాంగ్రెస్(1888)కి 1200 కి పైగా హాజరైన ప్రతినిధులలో 455 మంది లాయర్లు, 59 మంది ఉపాధ్యాయులు, 73 మంది పత్రికా రచయితలు. ఇప్పుడు మనం ఈ మేధావి వర్గం యొక్క సామాజిక మూలాలు, సిద్ధాంతం, రాజకీయ కార్యకలాపాన్ని గురించి చర్చిద్దాం.

## మధ్యతరగతి చైతన్యం - రాజకీయాలు

### మేధావి వర్గం యొక్క సామాజిక మూలాలు

మెట్రిక్యులేషన్‌ని సూచికగా తీసుకుంటే 1880 దశాబ్దం నాటికి ఇంగ్లీషు చదువు చదివిన భారతీయుల సంఖ్య దాదాపు 50,000కి చేరుకొన్నది. (బి.ఎ. డిగ్రీ పొందిన వారు మాత్రం కేవలం 5000 మంది మాత్రమే) ఇంగ్లీషు చదువుకొంటున్న వారి సంఖ్య 1887లో 2,98,000 కాగా 1907 నాటికి 50,5,000 కి పెరిగింది. ఇంగ్లీషు వార్తా పత్రికల సర్క్యులేషన్ 1885లో 90,000 వుండగా 1905 నాటికి 2,76,000 కి పెరిగింది. (జె.ఆర్.మెక్లేన్, భారతీయ జాతీయవాదులు. తొలినాటి కాంగ్రెస్ పేజి 4) బ్రిటీషు వారు మాటిమాటికి ప్రస్తావించే విధంగా అత్యంత సూక్ష్మమైన మైనార్టీ (1901లో అక్షరాశ్యులు, ఇంగ్లీషు చదువులో 1 శాతం, ప్రాంతీయ భాషలలో 6 శాతం) గ్రూపు దాని పరిమాణానికి మించిన ప్రాముఖ్యతను పొందింది. ఇంగ్లీషు చదువు దేశ వ్యాప్తంగా సంబంధాలు పెట్టుకునే సమర్థతని కల్పించింది. ఇంగ్లీషు

చదువు చదివిన ప్రభుత్వ ఉద్యోగులు, లాయర్లు, టీచర్లు, జర్నలిస్టులు, డాక్టర్లు వారి ప్రాంతాలకు వెలుపల దూరంగా వుండి బాగా పని చేయగల్గారు. 1870 దశాబ్దం నాటికి ఉత్తర భారతదేశంలోని చాలా పట్టణాలలో విద్యావంతులైన బెంగాలీల కాలనీలు ఉన్నాయి. సురేంద్రనాథ్ బెనర్జీ, రాజకీయ పర్యటనలు చేశారు. బెంగాల్ వెలుపల 'ఇండియన్ అసోసియేషన్'కు పెద్ద సంఖ్యలో శాఖల్ని స్థాపించారు. అన్నింటిని మించి ఇంగ్లీషు చదువు తనతోపాటు ప్రపంచ పోకడల సిద్ధాంతాల చైతన్యాన్ని తెచ్చి పెట్టింది. అది లేకపోతే చైతన్యయుతమైన జాతీయవాద సిద్ధాంతాలు రూపొందించడం కష్టసాధ్యమయ్యేది. అదే సమయంలో విదేశీ మాధ్యమంలో చదివిన చదువు ప్రారంభం నుండి పరాయీకరణ, విభజన ధోరణుల్ని తెచ్చిపెట్టింది. ఈ ధోరణులు సమాజంలో యిప్పటికీ కొనసాగుతున్నాయి. 1883-84లో బెంగాల్‌లో వార్షికాదాయం రు. 200 లు లోపు గల కుటుంబాల నుండి కాలేజి చదువులు చదువుతున్నవారు 9 శాతం. కారణం 1820 నుండే కలకత్తా హిందూ కాలేజీలో ట్యూషన్ ఫీజు నెలకు రు. 5/-లు . ఇంగ్లీషు చదువు మంచి ఉద్యోగాలకు గల ఏకైక మార్గం గనుక ప్రాంతీయ విభేదాలు ప్రాంతీయ ఉద్రిక్తతలకు దారి తీసింది. 1886-87 నాటి పబ్లిక్ సర్వీసు కమీషన్ రిపోర్టు ననుసరించి, ఇంగ్లీషు చదువు చదివినవారు మద్రాసులో 18,390, బెంగాల్‌లో 16,639, బొంబాయిలో 7196 యునైటెడ్ ప్రావిన్స్‌లో 3200, పంజాబ్‌లో 1944, సెంట్రల్ ప్రావిన్స్‌లో 608, అస్సాంలో 274.

అనీల్ సిమాల్, జాన్ బ్రూమ్ ఫీల్డ్ జరిపిన తొలినాటి పరిశోధన ఇంగ్లీషు చదువు చదివిన వారిని ఉన్నత వర్గంగా పేర్కొన్నది. ఉన్నతం అనేది ఇక్కడ అగ్రవర్ణ స్థాయిని నిర్వచించింది. సాంప్రదాయకంగా చదువుకున్న కులాలు ఈ కొత్త చదువు పట్ల కూడా ఆసక్తి కనపరచాయి. 1883-84లో బెంగాల్ హిందూ కాలేజీ విద్యార్థులలో 84.7 శాతం విద్యార్థులు బ్రాహ్మణ, కాయస్థ, వైద్య అనే మూడు భద్రలోక్ కులాలకు చెందినవారే మద్రాసు, బొంబాయి లేక పూనాలో బ్రాహ్మణ విద్యార్థులెక్కువ. యు.పి.లో కాయస్థుల ప్రాబల్యం అధికం. కాని నేడు ఈ వైఖరిలోని సమంజసత్వం పెద్ద సవాల్ నెదుర్కొంటుంది. సియాల్ 1973లో ఆత్మవిమర్శలో "రాజ్యం యొక్క ప్రత్యక్ష సత్యాలు చరిత్రకారులకు పిడివాదాలవుతాయి" అన్నారు. బెంగాల్ బ్రాహ్మణులంతా భద్రలోక్ ప్రజలు కారు. (ఉదాహరణకు బ్రాహ్మణ వంటవాళ్ళు, పౌరోహితులు, కర్మకాండలు నిర్వహించేవారు.) 1864 లో బొంబాయిలో అధికృత గల ఉన్నత వర్గంగా పరిగణింపబడే చిట్‌పవన్లు, సరస్వత్ బ్రాహ్మణులలో 10,000 మంది బిచ్చగాళ్లు, 1880 మంది ఇంటి పనివాళ్ళుగా ఉన్నారు. ఈ సందర్భంలో ఉన్నత వర్గం అనే పదం తెల్లవారికే వర్తిస్తుంది. ఇంగ్లీషు చదివిన వారి విధానం వారి హక్కుల పరిరక్షణ. ఇది నిజమైన ఉన్నత వర్గం నుండి ఎవరైనా ఆశించేది. భారత దేశంలో వున్న ఇంగ్లీషు వారు అదే చేస్తున్నారు. ఇంగ్లీషు చదువు చదివిన వారు సంఘ సంస్కరణ ఉద్యమాలలో గణనీయమైన వ్యక్తిగత త్యాగాలు చేసిన వారున్నారు. వీరు అగ్రకులాల విశేషాధికారాలకు వ్యతిరేకంగా సంస్కరణలు చేపట్టారు. ఇంకా పలువురు వారి గ్రామాలలో పట్టణాలలో పాఠశాలలు, కళశాలలు ప్రారంభించి విద్యా వ్యాప్తికి కృషి చేశారు. హంటర్ కమీషన్ (1882) సిఫారసుల ననుసరించి ప్రభుత్వ

సహకారం తగ్గించిన సందర్భంలో వీరు విద్యా వ్యాప్తికి కృషి చేశారు. ప్రైవేటు సంస్థల కృషి కారణంగానే ప్రధానంగా భారతదేశంలో విద్యావ్యాప్తి జరిగింది. 1881-82 నాటికి ప్రైవేటు అన్ ఎయిడెడ్ కాలేజీలు 11 ఉండగా 1901-02 నాటికి ఈ సంఖ్య 53 కి పెరిగింది. మొదటి నిర్బంధ ప్రాథమిక విద్యా బిల్లు (నెల సరి ఆదాయం రూ. 10 లు లోపుగా ఉన్న కుటుంబాలకు) గోపాల కృష్ణ గోఖలే చే 1911లో ఇంపీరియల్ కౌన్సిల్‌లో ప్రవేశపెట్టబడింది. కాని బిల్లు తిరస్కరించబడింది. బొంబాయి గవర్నరు వైస్రాయికి వ్రాసిన వ్యక్తిగత లేఖలో అసలు కారణం బయట పెట్టారు. ప్రతి రైతు చదవగల్గితే అసంతృప్తిని రెచ్చగొట్టే శక్తి జాతీయ వాద శక్తికి విపరీతంగా పెరుగుతుంది. (బి.ఆర్.నందా, గోఖలే పేజి 392)

మేధావి వర్గం యొక్క ఆలోచనలకు దాని యొక్క సామాజిక ఆర్థిక మూలాల్ని ఒకేసారి విశ్లేషించడం ద్వారా మేధావి వర్గాన్ని సరియైన కోణం నుండి అధ్యయనం చేయడం సాధ్యపడుతుంది. పాశ్చాత్య దేశాలలో సమకాలీన పరిణామాలు చైతన్యం నుండి గ్రహించబడిన బూర్జువా ఆదర్శాలకు బూర్జువాయేతర సామాజిక పునాదికి మధ్యగల తేడాని ఈ అధ్యయనం తెలియజేస్తుంది. ఈ తేడా బెంగాల్‌లో స్పష్టంగా కన్పించింది. జమిందారులకు దిగువన, శ్రామికులకు పైన గల 19వ శతాబ్దపు మేధావి వర్గం మధ్య తరగతి బురఖాని ధరించింది. యూరప్ మధ్య తరగతిని నమూనాగా ఎంచుకొన్నది. పునరుజ్జీవనం, సంస్కరణ, ప్రజాస్వామ్య విప్లవాల లాంటి ఉద్యమాలు మధ్యయుగాన్ని ఆధునిక యుగంగా పరివర్తన చెందించడాన్ని ఇంగ్లీషు చదువు ద్వారా నేర్చుకున్నది. అయినప్పటికీ దాని సామాజిక మూలాలు బ్రిటీషు మేనేజింగ్ ఏజెన్సీ సంస్థలు. వాటి మార్వాడీ విధేయులచే నియంత్రించబడిన వాణిజ్యం, పరిశ్రమలలో లేవు. ఈ వర్గంలో చాలా మంది ప్రభుత్వ ఉద్యోగులుగా వున్నారు. ఇంకా న్యాయవాదులు ఉపాధ్యాయులు, జర్నలిస్టులు, డాక్టర్లుగా పని చేస్తున్నారు. వీరిలో చాలా మందికి గ్రామీణ ప్రాంతాలలో కొద్దిపాటి భూములు ఉన్నాయి. 1869 డిసెంబర్ 9 'అమృత బజార్' పత్రిక ఈ వర్గం యొక్క ద్వంద్వ స్వభావాన్ని సవివరంగా వర్ణించింది. ఏ సమాజంలోనైనా మధ్య తరగతి ప్రజలు అత్యంత ప్రయోజనకరమైన గ్రూపుగా పరిగణించబడతారు. మన దేశ సంక్షేమం చాలా వరకు ఈ వర్గంపై ఆధారపడి వుంటుంది. ఏదైనా సామాజిక విప్లవం ఈ వర్గం ద్వారానే వస్తుంది. దేశంలో ఈనాడు మనం చూస్తున్న ప్రయోజనకరమైన సంస్థల్ని కార్యక్రమాల్ని ప్రారంభించింది. ఈ సంస్థలే మధ్య తరగతికి జీవన భృతి సేవల నుండి భూమి నుండి లభిస్తుంది.

బెంగాలీ మేధావులు వ్యాపారానికి దూరంగా వుండడానికి కారణం కులీనులకు వ్యాపారం పట్ల గల ప్రతికూల వైఖరి వలన కాదు. 19వ శతాబ్ద మంతటా మధ్యతరగతి పత్రికలు స్వతంత్రంగా పరిశ్రమలు వ్యాపారం చేపట్టమని కోరాయి. భూస్వామ్య విధానంతోగల సంబంధం బూర్జువా ఆకాంక్షల్ని నివారించలేదు. కాని వ్యవసాయ సమస్యలపై సమూలమైన మార్పులు కోరే ఆలోచనలను కార్యాచరణను అడ్డుకున్నది.

ఇతర ప్రావిన్సులలో కూడా కొన్ని ఆసక్తికరమైన ప్రాంతీయమైన మార్పులతో ఇలాంటి నమూనాలు చూడవచ్చు. అదే విధంగా మద్రాసులో 1850 దశాబ్దంలో మద్రాసు నేటివ్ అసోసియేషన్‌లో ముఖ్యడైన లక్ష్మీనరసు చెట్టి లాంటి ప్రముఖ వాణిజ్య వేత్తలతో కులీన వ్యాపార వర్గం ప్రాధాన్యత గురించి పాలనాపరమైన, వృత్తి పరమైన కులీనులకు అవకాశం కల్పించడాన్ని గురించి సుందరలింగం మాట్లాడాడు. కాని అందుకు కారణాలను వివరించలేకపోయాడు. పాశ్చాత్యదేశాలలో (విద్య) నార్జించిన వారు తరచుగా భూస్వామ్య సంబంధాలు కలిగి వున్నారు. 1880 దశాబ్దపు మహాజన సభ కార్యకలాపాలలో నిర్వహించిన తెర వెనుక పాత్రని, దానిచే నిర్వహింపబడిన కాంగ్రెస్ గురించి, ఆర్థికంగా పోషకులుగా ఉన్న మద్రాసు చెట్టీలు, ఆంధ్ర డెల్టా ప్రాంతానికి చెందిన కోమటి వ్యాపారులు, పెద్ద జమీందారులు లాంటి అభివృద్ధి చెందుతున్న వ్యాపార గ్రూపుల గురించి వాష్‌బ్రూక్ నొక్కిచెప్పారు.

మహారాష్ట్రలో పారిశ్రామిక పరమైన, వాణిజ్యపరమైన ప్రాధాన్యత లేని పట్టణం పూనా అక్కడ మేధావులకు స్వదేశీ ఆకాంక్ష తప్ప వ్యాపారంలో అంతగా సంబంధంలేదు. కాని వార్షిక పారిశ్రామిక సదస్సును ప్రారంభించటంలో పూనా తీసుకున్న చొరవపై వ్యాఖ్యానిస్తూ తిలక్ పత్రిక మరాఠీ 1891 సెప్టెంబరు 6న ఆసక్తికరమైన ముఖ్యమైన వైరుధ్యాన్ని ప్రచురించింది. “పూనా పారిశ్రామిక ఉత్పత్తి కేంద్రం గాని, వాణిజ్య కేంద్రం గాని కాదు. రాజకీయ సాంప్రదాయాలలో ప్రఖ్యాతిగాంచింది. బొంబాయి పూనా కంటే సంపద్వంతమైనది. కాని బొంబాయి వాణిజ్యవేత్తల దృష్టి, సమయం వ్యాపార కార్యకలాపాలకే పరిమితమైంది. ఫలితంగా వాణిజ్య పునరుజ్జీవన పథకం ఇతరులు రూపొందించవలసి వుంది”. భూమి శిస్తు వసూలు చేసే ఖోటీ హక్కులు మహారాష్ట్రలో ప్రత్యేకించి చాలా ఎక్కువ మంది మేధావుల్ని సరఫరా చేసిన రత్నగిరి (తిలక్, గోఖలే ఈ ఇరువురు రత్నగిరిలోని ఖోటీ హక్కులు గల కుటుంబాలకు చెందిన వారే) జిల్లాలో అమలులో ఉన్నాయి. బెంగాల్‌లో లాగా సామాజిక పునాది సిద్ధాంతాన్ని నిర్ణయించలేదు. కాని అది కొన్ని పరిమితుల్ని విధించింది. రైతుల భూముల్ని వడ్డీ వ్యాపారులను మార్పు చేయటాన్ని అడ్డుకునేందుకు బొంబాయి ప్రభుత్వం 1901లో చేసిన ప్రతిపాదనని తిలక్, గోఖలే ఇరువురూ వ్యతిరేకించారు. తిలక్ ఈ క్రింది ప్రకటన కూడా చేశాడు. “వడ్డీ వ్యాపారిని దోచుకొని అతడి సంపదని పేదలకు పంచే హక్కు ప్రభుత్వానికి లేదు. అదే విధంగా పన్నులు వసూలు చేసే వాడి హక్కును అడ్డుకొని, అతడికి రావలసిన ఆదాయాన్ని రైతులకు పంచే హక్కులేదు. ఇది హక్కుల సమస్య గాని మానవతా సమస్యకాదు. (భగవత్ మరియు ప్రధాన్, లోకమాన్య తిలక్ 134).

బొంబాయి నగరంలో బూర్జువా సంబంధాలకు ప్రాధాన్యత ఎక్కువ. షెటియా వర్తకులకు బొంబాయి యువ మేధావులకు మధ్య సంబంధాలు అంతంత మాత్రంగానే వున్నాయి. కొన్ని సందర్భాలలో ప్రతికూలంగా కూడా వున్నాయి. కాని 1880,1890 దశాబ్దాలలో లాంక్‌షైర్ నూలు బట్టలపై దిగుమతి పన్నుల రద్దు లాంటి సమస్యలపై ఆందోళనల ద్వారా మేధావి వర్గ (ఫిరజ్‌షామెహత, కె.టి. తెలాంగ్, బద్రుద్దీన్ త్యాబ్జిత్రయం) నాయకత్వానికి మిల్లు

యజమానులకు మధ్య స్థిరమైన సంబంధాలు ఏర్పడ్డాయి. ఈ సంబంధాలకు దీన్‌షా వాచా జీవితం ప్రతీకగా నిలుస్తుంది. దీన్‌షా నౌరోజీకి బొంబాయితో సంబంధాలు కల్పించాడు. ఇంకా ఇతడు బొంబాయి ప్రెసిడెన్సీ అసోసియేషన్ (1885–1915) కి సెక్రటరీ, కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ (1896–1913), బొంబాయి మిల్లు యజమానుల సంఘానికి 38 సం॥ల పాటు కార్యవర్గ సభ్యుడు. పలు బట్టల మిల్లులకు యజమాన్య ప్రతినిధి. అయినప్పటికీ వాచా నౌరోజికి వ్రాసిన ఉత్తరాలలో యజమానుల పిసినారి తనంపై ఫిర్యాదులు చేసేవాడు. ఉదాహరణకు 1889లో జె.యస్. తాటా నుండి రు. 500 ల స్వల్ప మొత్తం కాంగ్రెస్‌కి విరాళంగా యిప్పించడం చాలా కష్ట సాధ్యమైంది. భారతీయ పెట్టుబడిదారులు జాతీయవాదులకు కాస్త ఉదారంగా విరాళాలు ఒక తరం తరువాత, మొదటి ప్రపంచ యుద్ధం తరువాత గాంధీ జాతీయవాద నాయకుడిగా గుర్తింపు పొందిన తర్వాత ఇవ్వడం ప్రారంభించారు.

ఉత్తర భారత దేశంలో అలహాబాద్‌పై బాలీ చేసిన అధ్యయనం వృత్తిపరమైన గ్రూపులకు చిన్న భూస్వామ్య విధానానికి మధ్యగల సంబంధాలను వివరించింది. అంతేగాక మదన మోహన మాలవ్యలాంటి రాజకీయ వేత్తలకు ఖత్రి అగర్వాల్ లాంటి బ్యాంకింగ్ వాణిజ్య కుటుంబాలకు మధ్యగల సంబంధాల్ని ప్రధానంగా ఆర్య సమాజం హిందూ పునరుజ్జీవన సాంస్కృతిక మత కార్యకలాపాల మధ్య వర్తిత్వం ద్వారా ఏర్పడు సంబంధాల్ని గురించి నొక్కి చెప్పారు.

మేధావుల ఆలోచనలు, కార్యకలాపాల విధానాన్ని గురించి 19వ శతాబ్దం చివరి పాదంలో సాధారణంగా రెండు ప్రకటనలు చేయబడ్డాయి. 1870 దశాబ్దం వరకు చాలా ప్రఖ్యాతిగా ఉన్న సంఘ, మత సంస్కరణ ఉద్యమాలు ఉవ్వెత్తున లేచిన పునరుద్ధరణ వాదంచే తుంగలో తొక్క బడ్డాయి. పునరుద్ధరణ వాదం పలు రకాల జాతీయ తీవ్రవాదం. పైకి రావడంతో ముడిపడి వుంది.

## హిందూ సంస్కరణ, పునరుద్ధరణ

1870 దశాబ్దం తరువాత బ్రహ్మ సమాజం అంతః కలహాలతో ముక్కలు చెక్కలయ్యింది. ఈశ్వర చంద్ర విద్యాసాగర్ విషాదకరమైన ఒంటరితనంలో వుండిపోయాడు. బెంగాల్‌లో సంస్కరణ ఉద్యమాలు వెనుక పట్టు పట్టాయి. కానీ పశ్చిమ భారతదేశంలో పరిస్థితి భిన్నంగా వుంది. యం.జి.రనడే 1901లో ఆయన తుది శ్వాస విడిచే వరకు మేధావి వర్గాన్ని ప్రభావితం చేయగల్గాడు. తన మిత్రుడు కె.టి.తెలాంగ్ (ప్రార్థనా సమాజవాది, సంస్కర్త, తొలినాటి కాంగ్రెస్ మూల స్థంభాలలో ఒకడు)తో కలిసి సంఘ సంస్కరణకు అతి తక్కువ ప్రతిఘటన ఎదురయ్యే పద్ధతినవలంబించారు. కాని ఈ పద్ధతిని కూడా ఆర్.జి. భండార్కల్, యస్.సి. చండావార్కల్ ప్రతిఘటించారు. దక్షిణాదిన కూడా సంస్కరణ ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. వితంతు పునర్వివాహాలు ప్రధాన లక్ష్యంగా కందుకూరి వీరేశలింగం పంతులుగారు 1878లో రాజమండ్రి సంఘ సంస్కరణ సంఘాన్ని స్థాపించారు. కె.యన్. నటరాజన్ 1890లో భారతీయ సంఘ సంస్కర్తని సాధించాడు. యంగ్ మద్రాస్ పార్టీ 1892లో

హిందూ సంఘ సంస్కరణ సంఘాన్ని స్థాపించింది. దానికి అనుబంధంగా పత్రికల్ని నడిపారు. రనడే అఖిల భారత సంఘ సంస్కరణ ఉద్యమాన్ని స్థాపించి 1887 నుండి కాంగ్రెస్ సభా ప్రాంగణంలోనే వార్షికంగా జాతీయ సామాజిక సదస్సు నిర్వహిస్తూ వచ్చాడు. 1895లో తిలక్ పూనాలో కాంగ్రెస్ సభా ప్రాంగణం నుండి సంఘ సంస్కరణ ఉద్యమకారుల్ని గెంటించి వేశారు బాల్య వివాహాలు. తద్వారా బలవంతంగా రుద్దబడుతున్న వైధవ్యాన్ని గురించి బెహరాంజి మలబారీ 1884లో వివరణాత్మక పత్రాన్ని తయారు చేశారు. దీనిపై దేశ వ్యాప్తంగా మేధావులు చర్చలు జరిపారు. బెహరాంజి సామాజిక ప్రచారం వివాహ వయస్సు చట్టం 1891 చేసేలా ప్రభుత్వంపై నిరంతరంగా ఒత్తిడి తెచ్చింది. 1856 నాటికి వితంతు పునర్వివాహ చట్టం తరువాత అతి ముఖ్యమైన సంఘ సంస్కరణ చట్టం ఇది.

కాని వివాహ వయస్సుపై చెలరేగిన తుఫాను విద్యావంతుల ఆలోచనా ధోరణిలో 1860 నుండి ఎలాంటి మార్పు వచ్చిందీ వ్యక్తం చేసింది. 1860లో 10 సం॥లోపు బాలికలు సంభోగం జరపడాన్ని బలాత్కారంగా పరిగణించాలని చేసిన ఉత్తర్వుకి ఎవరి నుండీ అంతగా నిరసన వ్యక్తం కాలేదు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా మలబారీ చాలా ప్రతిపాదనలు చేశాడు. కాని ప్రభుత్వం వాటిలో వివాహ వయస్సుని 10 నుండి 12 కు పెంచడాన్ని మాత్రమే అంగీకరించింది. ఈ చిన్న మార్పుకే బెంగాల్, మహారాష్ట్ర నుండి చాలా తీవ్రమైన ప్రతిఘటన ఎదురైంది. విదేశీ పాలనకు మత సాంఘిక సాంప్రదాయాలలో జోక్యం చేసుకునే హక్కు లేదని జాతీయ వాదులు ముఖ్యంగా తిలక్ వాదించాడు. వాదనలు సాంప్రదాయవాద సంరక్షకుల అభివృద్ధి నిరోధకుల భావాలు కలగలసి ఉన్నాయి. ఇది పైకి న్యాయ సమ్మతంగా ఉన్నట్లే కనిపిస్తుంది. కానీ అదే సమయంలో గోవధను నిషేధిస్తూ చట్టం చేయమని హిందూ సనాతన గ్రూపులు ప్రభుత్వాన్ని కోరేందుకు ఏ మాత్రం వెనుకాడలేదు. అలాంటి చట్టం చేయడం అంటే భారతీయ సమాజంలోని ఒక పెద్ద భాగం (ముస్లింల) యొక్క సాంఘిక మతపరమైన సాంప్రదాయాలలో జోక్యం చేసుకోవడమే అవుతుంది. కలకత్తా మైదానంలో పెద్ద సభలు, కాళీఘాట్‌లు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు, బహిష్కరణ పిలుపులు, స్వదేశీ వ్యాపార సంస్థల్ని సంఘటిత పరిచే ప్రయత్నాలు లాంటి కార్యకలాపాల్ని సమర్థిస్తూ పెద్ద ఎత్తున స్వదేశీ ఉద్యమం ప్రారంభం కానున్నదని 'వంగవాసి' వార్తా పత్రిక అంచనా వేసింది. అప్పుడు ప్రజల ఆలోచనలు కూడా సంస్కరణ వాదం కంటే సాంప్రదాయ వాదానికి అనుకూలంగా వున్నాయి. (బ్రహ్మ సమాజ సంస్కరణ వాద పత్రిక సర్క్యులేషన్ కేవలం 4000 సాంప్రదాయవాద పత్రిక 'వంగవాసి' సర్క్యులేషన్ 20,000)

బెంగాల్‌లో 1870 దశాబ్దం నుండి పలు ప్రభావాల రీత్యా మేధావులు ఆలోచనా ధోరణి మారుతూ వచ్చింది. ప్రాచీన కావ్యాల ఔన్నత్యాన్ని మాక్స్ ముల్లర్ లాంటి పండితుల పునరావిష్కరణ, పశ్చిమదేశాలలో విలక్షణ ప్రాచ్య సంస్కృతిపై కాల్పనిక ధోరణులు అల్కాట్ బ్లావట్స్కీల దివ్యజ్ఞాన సమాజ ఉద్యమం వగైరాల ప్రభావకారణంగా హిందూ సాంప్రదాయాల పరిరక్షణ గౌరవ ప్రదంగా మారింది. 1880,1890 దశాబ్దంలలో జోగేంద్ర చంద్రఘోష్

నాయకత్వంలో చిన్నదే అయినప్పటికీ పలుకుబడిగల్గిన గ్రూపు, సాంప్రదాయ విశ్వాసాన్ని కోల్పోయి సమాజాన్ని యధాతథంగా వుంచాలని కోరుకునే మేధావుల కొరకు మధ్యే మార్గాన్ని రూపొందించేందుకు కామ్టే పాజిటివిజంను ఉపయోగించుకున్నది. 1880 దశాబ్దంలో పురాణ పురుషుడైన కృష్ణుని ఆదర్శ మానవునిగా, సాంస్కృతిక నాయకునిగా, జాతి నిర్మాతగా వ్యాఖ్యనించి బకించంద్ర పునరుద్ధరణ వాదానికి నగిషీలు చెక్కాడు. ఇక తారక చూడామణి, కృష్ణ ప్రసన్నసేన్ లాంటి వారు ఆధునిక పాశ్చాత్య విజ్ఞాన శాస్త్ర ఆవిష్కరణలన్నీ వేదాలలో వున్నాయన్నారు. కానీ పునరుద్ధరణ వాదం ఆలోచనలను గిలగొట్టడం కంటే ఉద్రిక్తతల్ని రెచ్చగొడుతుంది. బంకించంద్రుడు ఆదర్శీకరించిన కృష్ణుని కంటే అమృత బజారు పత్రిక ప్రచారం చేసిన నాయా వైష్ణవవాదం, అన్నిటిని మించి తన నిరాడంబరతతో కలకత్తా మేధావుల్ని మంత్రముగ్ధుల్ని చేసిన దక్షిణేశ్వర కాళీమాత పూజారి రామకృష్ణ పరమహంస బోధనలు ప్రజల్ని ఆకట్టుకున్నాయి. 1890 దశాబ్దంలో ఆయన శిష్యుడు వివేకానంద చికాగోలో జరిగిన ప్రపంచ మతాల మహాసభలో పాల్గొని ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపుని పొందాడు. వివేకానందుడు అభివృద్ధి నిరోధకుడు (జ్ఞానవిరోధి) కాదు. పునరుద్ధరణవాది కాడు. సంఘసంస్కరణ పై వర్గాలకు చెందిందని, విదేశీ నమూనాలతో ప్రేరణ పొందిందని వివేకానందుడు వివరించాడు. ఫలితంగా సంఘసంస్కరణ ఉద్యమాలు వెనుకపట్టు పట్టాయి. సంఘ సంస్కరణను బదులుగా సంఘసేవ చేపట్టాలన్నారు. 1897లో రామకృష్ణ మిషన్ స్థాపించాడు. రామకృష్ణ మిషన్ సమాజంలో సమూలమైన మార్పులు తెస్తానని ప్రకటించుకోలేదు. అది పరోపకార సంస్థగా పని చేసింది. అయినప్పటికీ సమకాలీన విచ్ఛిన్నకర విధానాలపై తీవ్రమైన దాడులు చేశారు. ఆర్యుల సంస్కృతిని హిందూ మతాల ఔన్నత్యాన్ని (ప్రత్యేకించి విదేశీ సభలలో మాట్లాడే సందర్భాలలో) కీర్తించారు. "మన మతం వంట ఇంట్లో ఉంది. మన దేవుడు వంటపాత్ర" 'బాలికని 12 లేక 13 ఏళ్ళకు తల్లిని చేయడం మతాచారం' – వివాహ వయస్సుపై ఆయన వాఖ్య. వివేకానందుడు ఐహిక తరహా మతాన్ని గురించి ప్రచారం చేశాడు. స్వయం సహాయాన్ని గురించి నొక్కి చెప్పాడు. శారీరక దృఢత్వం పెంచుకోవాలన్నాడు. 'దేశానికి ఈనాడు కావలసింది ఇనుప కండరాలు, ఉక్కు నరాలు' అలాగే వివేకానందుడు దరిద్ర నారాయణుల, శూద్రుల, అస్పృశ్యుల దయనీయస్థితిపై ఆందోళన చెందారు. వారి ఆధిక్యతని గురించి అస్పష్టమైన ఊహాగానాలు చేసేవాడు. రానున్న సామాజిక విప్లవానికి, సోషలిజం, అనార్కిజం, నిహిలిజం లాంటివి చోదక శక్తులుగా పని చేస్తాయని భావించే వాడు. 'క్రింది తరగతుల వారు, వీధులు చిమ్మేవారు. అందరూ మీ రక్తమాంసాలు, మీ సోదరులని మరువకండి' అనేది ఆయన విజ్ఞప్తి. కానీ ఇలాంటి పదజాలం ఉపయోగించినప్పటికీ నిర్దిష్ట సామాజిక ఆర్థిక కార్యక్రమాలపట్ల, ప్రజలలో సంబంధాలు పెట్టుకునే పద్ధతుల పట్ల, రాజకీయ లక్ష్యాల పట్ల స్పష్టతలేదు. కాని వివేకానందుని విజ్ఞప్తితో బలమంతా ఆయన మత సార సంగ్రహ ప్రబోధంలో వుంది. పురుష లక్షణాలు, అస్పష్టమైన ప్రజాదరణ, ప్రాచీన హిందూ మత ఔన్నత్యం కొరకు పిలుపు రానున్న స్వదేశీ కాలానికి ఉత్తేజాన్ని అందచేశాయి.

మహారాష్ట్రలో పూనా పునరుద్ధరణ వాద కేంద్రం. ఇక్కడ పునరుద్ధరణ వాదం బెంగాల్‌లో బ్రాహ్మణ స్వభావాన్ని సంతరించుకున్నది. బ్రిటీష్ పాలనలో సాంప్రదాయ శాస్త్రాలు చదివిన వారి ప్రాధాన్యత తగ్గింది. వారికి దక్షిణలు ఇతర ఆదాయ వనరులు క్రమంగా తగ్గిపోయాయి. కోల్పోయిన హిందూ, బ్రాహ్మణ, మరాఠాల ప్రాభవం పునరుద్ధరణ కొరకు యిచ్చిన పిలుపుకి ఇంగ్లీషు చదువు చదివిన విద్యావంతుల మద్దతు అధికారికంగా లభించింది. విద్యావంతుల్ని విష్ణు కృష్ణ బప్లాంకర్ యొక్క నిబంధనల వ్యాసాలు (1874–81) ప్రభావితం చేశాయి. 1890 దశాబ్దంలో వివాహ వయస్సుకి సంబంధించిన బిల్లుకి వ్యతిరేకత ద్వారా పూనా పునరుద్ధరణ వాద నాయకులకు తిలక్‌కు ఏర్పడిన సంబంధం, గణపతి ఉత్సవాల ప్రారంభం, 1895 లో కాంగ్రెస్ సభా ప్రాంగణంలో జాతీయ సంఘ సంస్కరణ వాదుల సదస్సు నిర్వహించడానికి రనడే తిరస్కరింపబడడం. అప్పటికీ వున్న వాస్తవికత రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించు కొనబడింది. వ్యక్తిగతంగా ఆయన అభివృద్ధి నిరోధకుడు కానప్పటికీ 1890 దశాబ్దంలో మహిళా విద్యని, వివాహ వయస్సుని పెంచడం లాంటి అంశాల్ని రనడేతో కలిసి ప్రోత్సహించాడు. సంస్కరణ లేక పునరుద్ధరణ వాద ఉద్యమాలు బలహీనంగా ఉన్న దక్షిణ భారత దేశంలో 1882 లో అడయార్‌లో స్థాపించబడిన దివ్యజ్ఞాన సమాజం. ప్రత్యేకించి 1893లో అనిబిసెంట్ వచ్చిన తరువాత ఇంగ్లీషు చదువు చదివిన వారిని గణనీయంగా ప్రభావితుల్ని చేసింది. 1890 దశాబ్దంలో అనిబిసెంట్ పలుమార్లు సంఘ సంస్కరణ ఉద్యమాలపై విమర్శల దాడులు చేశారు. హిందూ మత సాంప్రదాయాల్ని కీర్తించారు. ఆ తరువాత ఆమె అభిప్రాయాలు ఈ అంశంపైనే గాక ఇతర అంశాలపై కూడా నాటకీయంగా మారాయి. కథియవాడ్‌కి చెందిన సన్యాసి దయానంద సరస్వతి (1824–83) ఆర్యసమాజ్ స్థాపించాడు. ఈ ఉద్యమం 1880,1890 దశాబ్దాలలో అద్భుతమైన పురోగతి సాధించింది. ఈ ఉద్యమానికి ఉత్తర భారతదేశం (పంజాబ్, పశ్చిమ యు.పి.) ప్రధాన స్థావరంగా వుంది. దయానంద సందేశం బహుశా దాని అస్పష్టత కారణంగా విజయం సాధించింది. దయానంద సందేశం ఒకవైపు అప్పటికీ ఆచరణలోవున్న హిందూ సాంప్రదాయాలను (విగ్రహారాధనని, బహుదేవతారాధనని, బాల్య వివాహాల్ని, వితంతు పునర్వివాహాలు, విదేశీ ప్రమాణాలపై నిషేధాన్ని, బ్రాహ్మణాధిక్యతని, పుట్టుకతో సంక్రమించే కులవ్యవస్థని) తీవ్రంగా విమర్శించింది. మరొక వైపు వేదాల ప్రాతిపదికన శుద్ధి చేయబడిన హిందూ మతం ఇతర మతాలైన క్రైస్తవ, మహమ్మదీయ, సిక్కు మతాల కంటే అత్యంత సంపన్నమైనదని నొక్కి వక్కాణించింది. సంఘ సంస్కర్తల ప్రత్యేక లక్ష్యాలు తీవ్రవాద హిందూమత పునరుద్ధరణ చట్రంలో యిముడ్చుకోబడ్డాయి. ఆర్య సమాజం బ్రహ్మ సమాజంపై ఆధిక్యత సాధించింది. అందుకు కారణాలు అనేకం. బ్రహ్మ సమాజవాద బెంగాలీలు, వలస వచ్చిన వారు, ఇంగ్లీషు చదువు చదివిన బెంగాలీలు ఉత్తరాది అంతటా పాలనాపరమైన వృత్తిపరమైన ఉద్యోగాలు ఆక్రమించి వున్నారు. వారి పట్ల ఉత్తర భారత దేశానికి చెందిన విద్యావంతులైన సంస్కరణ భావాలు గల యువకులలో వ్యతిరేకత పెరిగింది. ఆర్య సమాజ వాదులు వ్యాపార కులాలలో పట్టు సాధించారు. పంజాబ్ నుండి తొలుత వచ్చిన నాయకులు గురుదత్, లాల్ హన్స్‌రాజ్, లాలాలజపతిరాయ్, లాలా మున్షీరాం

(స్వామి శ్రద్ధానంద)– అందరూ ఖత్రి, అరోర, లేక అగర్వాల్ కుటుంబాలకు చెందినవారు. పంజాబ్‌లోని నాలుగు ప్రధాన స్థావరాలలో (పెషావర్–రావల్పిండి, ముల్తాన్, రోహ్‌తక్–హిస్సార్, జలంధర్) వ్యాపార వర్గాల మద్దతు కారణంగానే ఆర్య సమాజం ప్రాబల్యం పెరిగింది. 1900 నుండి పెద్ద ఎత్తున శుద్ధి కార్యక్రమాలు చేపట్టి రాహతిమా – ఓఢ్‌లు, మొఘ, జాట్– లాంటి క్రింది కులాలకు చెందిన వారిని హిందూ మతంలోకి రప్పించారు. ఆ విధంగా ఆర్య సమాజం 'సంస్కృతీకరణ' క్రమానికి మార్గాన్ని ఏర్పరచింది. ఫలితంగా ఆర్య సమాజం సభ్యత్వం విపరీతంగా పెరిగింది. 1891లో 40,000, 1901లో 92,000, 1921 లో అర్థ మిలియన్. 1893లో రెండు సమస్యలు కారణంగా ఆర్య సమాజం చీలిపోయింది. (1) శాకాహారం – మాంసాహారం, (2) ఇంగ్లీషు ప్రాతిపదికగా గల విద్య – సంస్కృతం ప్రాతిపదికగా గల విద్య. హన్స్‌రాజ్, లజపతిరాయ్‌ల నాయకత్వంలోని మితవాద శాఖ (Moderate 'College' Faction) దయానంద ఆంగ్లో వేదిక్ కాలేజీలపై కేంద్రీకరించింది. కాంగ్రెస్ రాజకీయంపై ఆసక్తి పెంచుకున్నది. స్వదేశీ వాణిజ్యంలో జోక్యం చేసుకున్నది. ఇక లేఖ్‌రాం, మున్సీరాంల నాయకత్వంలోని పునరుద్ధరణ వాద సమరశీల 'గురుకుల' విభాగం 1902 'హరిద్వార్ గురుకులాన్ని (ప్రభుత్వ విద్యా విధానంతో సంబంధం లేదు. బ్రహ్మచర్య, వేదాలలో శిక్షణ సూత్రాలతో పని చేసింది) ప్రారంభించింది. శుద్ధి కార్యక్రమాల ద్వారా ప్రచారకుల ద్వారా మత మార్పిడులు చేయించడంపై కేంద్రీకరించింది. రెండు గ్రూపుల ఉమ్మడి లక్ష్యాలు ఆర్యధర్మాన్ని హిందూ చైతన్యంగా మార్చడం, ముస్లిం వ్యతిరేక హిందూ చైతన్యాన్ని పెంచడం, (కెన్నల్ జాన్స్) అహమ్మదీయ ముస్లిం శాఖలో లేఖ్‌రాంకి గల తీవ్రమైన వివాదం 1897లో ఆయన హత్యకి దారి తీసింది. 1909లో లజపతి సహచరుడు లాలా లాల్‌చంద్ తర్వాత రానున్న హిందూ మహాసభ, ఆర్.యస్.యస్. సిద్ధాంతాన్ని తన 'రాజకీయాలలో ఆత్మ త్యాగం' అనే వ్యాసంతో స్పష్టంగా అంచనా వేయగలిగాడు. హిందువుల ప్రత్యేక సమస్యల్ని డిమాండ్లను విస్మరిస్తున్నందుకు లాల్‌చంద్ కాంగ్రెస్‌ని తీవ్రంగా విమర్శించాడు. ప్రతి హిందువు హృదయంలో తాను కేవలం భారతీయుడనని గాక హిందువుననే చైతన్యం పెరగాలి. కాబట్టి 'కాంగ్రెస్ కమిటీల స్థానంలో హిందూ సభల్ని స్థాపించాలి. కాంగ్రెస్ ప్రచురణాలయాల స్థానంలో హిందూ ప్రచురణాలయాలు నేలకొల్పాలి. హిందూ రక్షణ నిధిని వసూలు చేయాలి. సక్రమ నిర్వహణకు ఆఫీసు, యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి". తొలుత కొంత వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ (దయానంద హత్యకు కుట్రలు జరిగినప్పటికీ) ఆర్య సమాజం ఆచరణలో సనాతన హిందూ మతానికి అత్యంత చేరువైంది. హరి సభలు, సనాతన ధర్మసభలు, కుంభమేళా వద్ద సదస్సులు, భారత ధర్మ మహా మండలి పేరుతో 1900లో ఢిల్లీలో మహా సదస్సు లాంటివి జరిపి ఆర్య సమాజం నిర్మాణ బద్ధమవడానికి విశేష కృషి చేసింది.

ఆ విధంగా పునరుద్ధరణ వాదం హిందూ మత గుర్తింపును నొక్కి చెప్పడానికి తోడ్పడింది. సంస్కరణవాద ఉద్యమాలు విధాన పరంగా విభేదించలేదు. తరతమ భేదాలతో అదే పని చేశాయి. ఆధునిక ధోరణిలో గల బ్రహ్మ సమాజం. ప్రార్థనా సమాజం, అంతకంటే రెగ్యులర్ ఉద్యమాలుగా భావింపబడిన యంగ్ బెంగాల్, విద్యాసాగర్ ఉద్యమాలు కూడా కొద్ది

మినహాయింపులతో హిందూ ఉద్యమాలే. అవి కూడా 'ముస్లిం నిరంకుశత్వం' 'మధ్యయుగాల చీకటి కాలం' లాంటి భావనలతోనే పని చేశాయి. బ్రిటీష్ పాలనలో వచ్చిన పునరుజ్జీవనం లేక జాగృతి ముస్లిం నిరంకుశత్వం నుండి మధ్యయుగాల అంధకారం నుండి విమోచన కల్పించినట్లు భావించబడింది. ఇది ముస్లిం మేధావులకు చేయదగిన విజ్ఞప్తి కాదు. ఇది హిందూ మతాన్ని సమాజాన్ని ప్రాచీన ఔన్నత్యం పేరుతో మధ్యయుగాల నాటి మొరటు తనాల నుండి మూఢ విశ్వాసాల నుండి శుద్ధి చేయడానికి చేపట్టిన యత్నాలు. ఈ క్రమంలోనే హిందూ ముస్లిం రెండు మతాలు ఉమ్మడిగా పాటించే ఆచారాలు సాంప్రదాయాలు, చారిత్రక సమ్మేళనాలపై దాడులు జరిగాయి. అదే కాలంలో భారతీయ ఇస్లాం మతంలో కూడా అలాంటి ఉద్యమాలు అభివృద్ధి చెందుతూ వచ్చాయి. రెండు మతాల మధ్య దూరం పెరిగింది.

## భారతీయ ఇస్లాంలోని ధోరణులు

19వ శతాబ్దాంతంలో సంస్కరణ వాదులు, పునరుద్ధరణ వాదుల మధ్య ఘర్షణ మొదలైంది. సంస్కరణ వాదం బ్రిటీష్ పాలన పట్ల విధేయతా ధోరణినవలంభించితే పునరుద్ధరణ వాదం బ్రిటీష్ వ్యతిరేక ధోరణిని చేపట్టింది. సంస్కరణ వాదానికి సర్ సయ్యద్ అహమ్మద్ ఖాన్ యొక్క అలీఘర్ ఉద్యమం ప్రాతినిధ్యం వహించింది. పునరుద్ధరణ వాదానికి దియోబండ్ దార్–ఉల్–ఉలుం లేక యిరువురు సైనిక తిరుగుబాటు ప్రముఖులు మహమ్మద్ ఖాసిం నానౌటవి. రషీద్ అహమ్మద్, గంగోహి స్థాపించిన ఉపాధ్యాయ శిక్షణా కేంద్రం ప్రాతినిధ్యం వహించింది. సయ్యద్ అహమ్మద్ శాస్త్రీయ సమాజం (1864) ఆధునిక ఉర్దూ పత్రిక " తాజీబ్ అల్–క్లగ్" (1870) అలీఘర్ ఆంగ్లో మహమ్మద్ ఒరియంటల్ కాలేజీ (1875) ల ద్వారా పై స్థాయికి చెందిన పశ్చిమ యు.పి. ముస్లింలకు ఇంగ్లీషు చదువు ప్రయోజనాలను అందజేయాలనుకొన్నారు. ఆయన స్వేచ్ఛగా దర్యాప్తు జరిపి న్యాయబద్ధతను తెలుసుకోవడానికి వీలైన మతం ఇస్లాం అని పేర్కొన్నాడు. ఆధునిక శాస్త్ర విజ్ఞానం కనుగొన్న ప్రకృతి సూత్రాలకు ఖురాన్‌లోని దివ్య వాక్యాలకు మధ్య పోలికలున్నాయన్నాడు. అయినప్పటికీ అలీఘర్‌లోని ఇస్లాం ధర్మశాస్త్ర తరగతులు సనాతన ముల్లాల నిర్దేశకత్వంలోనే నిర్వహింపబడేవి. ముస్లింలలో ఐక్యత సాధించేందుకు ముస్లింలలోని పై వర్గాలకు ఇంగ్లీషు చదువు అందజేయాల్సిన అవసరాన్ని సయ్యద్ అహమ్మద్ నొక్కి చెప్పేవారు. 1871లో మేయోచి నియమించిన హంటర్ కమీషన్ భారతీయ ముస్లింల కొరకు రూపొందించబడిన బ్రిటీష్ విధానం లక్ష్యాలను అహమ్మద్ వివరించి చెప్పాడు. బ్రిటీష్ వారు పాశ్చాత్య విధానాన్ని అందించి మహమ్మదీయుల అభివృద్ధికి తోడ్పడాలి. ఫలితంగా అలీఘర్‌కి వైస్రాయి లార్ద్‌నార్త్‌బ్రూక్ వ్యక్తిగత విరాళం రు. 10,000లతో పాటు అసాధారణ రీతిలో బ్రిటీష్ వారి ప్రోత్సాహం లభించింది." సయ్యద్ అహమ్మద్ ఖాన్ మతపరమైన విశ్వాసాలు ఆచారాలు అంతగా పాటించని వాడైనప్పటికీ, తోటి మతస్థులు మత విశ్వాసాలు లేని వ్యక్తిగా అతడిపై ముద్ర వేసినప్పటికీ బ్రిటీష్ వారి ప్రోత్సాహం కారణంగా అతడు ముస్లింల ప్రతినిధిగా గుర్తింపు పొందాడని" ఫ్రాన్సిస్ రాబిన్సన్ పేర్కొన్నాడు. (భారతీయ ముస్లిం వేర్పాటువాదం పేజి 131) సయ్యద్ అహమ్మద్‌కి సామాజిక స్థాయిని యు.పి. ముస్లిం భూస్వామ్య కుటుంబాలు

(అలీఘర్ బులిందర్ షా ప్రాంతంలో ముస్లిం భూస్వాములు చాలా మంది ఉన్నారు. అవధ్‌లో గల తాలూక్‌దార్ కుటుంబాలలో 76% ముస్లింలు) సాంప్రదాయకంగా ఉద్యోగాలు చేసే కుటుంబాలు కల్పించాయి. ఉద్యోగాలు చేసే కుటుంబాలు గతంలో చాలా ప్రత్యేక సౌకర్యాలు గల గ్రూపు ఈ గ్రూపు క్రమంగా గతవైభవాన్ని కోల్పోతున్నది. 1857లో 63.9 శాతం న్యాయ కార్యనిర్వాహక శాఖలలో ఉద్యోగాలు చేసేవారు. కాని ఇది 1886-87 నాటికి 45.1 శాతానికి 1913 నాటికి (1886-87) తో వాయవ్యరాష్ట్రాలు. అవధ్ ప్రాంతాలలో గల మొత్తం జనాభాలో ముస్లింల శాతం కేవలం 13.4 శాతం మాత్రమే) 34.7 శాతానికి తగ్గిపోయింది. వేర్పాటు వాదం అభివృద్ధి చెందడానికి కారణం వెనుకబాటు తనం కాదని, అంతకంతకు హిందూ వర్తకులు, వడ్డీ వ్యాపారులు, వృత్తిపరమైన గ్రూపులు భూములుకొని మున్సిపాలిటీల్ని పట్టుకొని ఉద్యోగాలు పొందడం సాంప్రదాయ ముస్లిం కులీనుల్ని కలవర పరచిందని ఈ కలవరపాటు నుండి వేర్పాటువాదం  పుట్టిందని బ్రిటీష్ అధికారులు, ముస్లిం నాయకులు భావించారు. అలాంటి ఘటనే – కాని వ్యతిరేక దిశలో పంజాబులో చూడవచ్చు. ఖత్రి, అరోరా, బాడియా కుటుంబాలలో వాణిజ్యం, వృత్తులలో ముస్లింలకు ఎదురైన సవాలు కారణంగానే ఆర్య సమాజం పునరుద్ధరణ వాదాన్ని ముందుకు తెచ్చింది అంటాడు కెన్నెత్ జోన్స్.

అలీఘర్ ఉద్యమానికి తొలుత బ్రిటీష్ వారు మద్దతు యివ్వడానికి కారణం కాంగ్రెస్ తరహా జాతీయ వాదాన్ని అడ్డుకొనవలసిన అవసరముండడం కాదు. అప్పటికి కాంగ్రెస్ బలమైన శక్తిగా ఎదగలేదు. భారతీయ ఇస్లాంలోని ఇతర ధోరణులను చూపి బ్రిటీష్ వారు కలత చెందారు. కొందరు మత నాయకులు మత మౌఢ్యాన్ని విదేశీ వ్యతిరేకతను ప్రజలకు నూరిపోశారు. "చిన్న రైతులు, గ్రామీణ పట్టణ ముల్లాలు, ఉపాధ్యాయులు, పుస్తక దుకాణాదారులు, చిల్లర వ్యాపారులు, చిన్న ఉద్యోగులు, చేతి వృత్తుల నిపుణులు ప్రాంతీయ భాషలలో కొద్దిపాటి చదువు చదివిన వారు పారిశ్రామిక విప్లవానికి ముందుండే మత మౌఢ్యం వలలో సులభంగా బందీలవుతారు" (బ్రిటీష్ ఇండియాతో ముస్లింలు పేజి 58) హిందువులలోని అలాంటి గ్రూపులే 19వ శతాబ్దం చివరలో పునరుద్ధరణ వాదం వైపు, జాతీయ తీవ్రవాదం వైపు ఆకర్షితులయ్యారు. అలాంటి ఉద్యమాలకు రెండు వైపులా పదునుంటుంది. కొన్ని సందర్భాలలో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడతారు. అంతర్గత ఘర్షణలలో అంతే ఉద్వేగంతో పాల్గొంటారు. అలాంటి కోవకు చెందిందే సిక్కులలోని 'కూకా' తెగ . వారు 1872 లో బ్రిటీష్ తుపాకులకెదురొడ్డి పోరాడినప్పుడు స్వాతంత్ర సమరవీరులుగా కీర్తించబడ్డారు. కాని గోవధ సమస్యపై ఇస్లాంపై దాడులు చేయడం పట్ల వారి కార్యకలాపాలు కేంద్రీకరించారు. ఫలితంగా 1871లో అమృత్‌సర్, లూథియానాలలో కొందరు ముస్లిం కసాయివాళ్లను హత్యలు చేశారు.

1867లో దియోబండ్ వద్ద ప్రారంభించిన మత సదస్సు స్పష్టంగా వ్యక్తం చేయక పోయినప్పటికి బ్రిటీష్ వ్యతిరేకతని పెంచింది. వహ్హాబీల లాగా గాక పూర్తి సనాతనాచారాలకు

కట్టుబడి, సయ్యద్ అహమ్మద్ మత ధర్మాల వక్రీకరణలకు, రాజకీయ విధేయతకు ప్రతికూలంగా నిలిచి దియోబండ్ ఇంగ్లీషు చదువు చదవలేని పేద విద్యార్థుల నాకర్షించింది. అది తయారు చేసిన మదర్సా ఉపాధ్యాయుల ద్వారా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకొన్నది. 20 వ శతాబ్దంలో కాంగ్రెస్ నిరంతరాయంగా మద్దతు నందజేసింది. కాని బ్రిటీష్ వారిని యిటీవల కలతపరచిన అంశమేమంటే 1876–78 నాటి బాల్కన్ యుద్ధం 1896–97 నాటి గ్రీసు టర్కీ యుద్ధం కాలాలలో అట్టవలాన్ సుల్తాన్ ఖలీషా పేరుతో ముందుకు వచ్చిన 'అఖిల ముస్లిం ప్రపంచం" భావాలు ఆధునిక అఖిల ముస్లిం ప్రపంచ వాద సంస్థాపకుడు జమాల్ అల్–దిన్–అల్–అఫ్గాని. ఆయన 1879–1882 కాలంలో రచనలు చేస్తూ ఉపన్యాసాలు ఇస్తూ హైదరాబాద్ కలకత్తాలో వున్నారు. భౌతిక వాదుల్ని ఖండిస్తూ జలాల్ అల్–డిన్ సయ్యద్ అహమ్మద్‌ని తీవ్రంగా విమర్శించాడు. కాని అతడి అసలు వైరానికి కారణం సయ్యద్ అహమ్మద్ బ్రిటీష్ వారికి విధేయుడిగా వుండమని యిటీవల అధ్యయనం స్పష్టం చేసింది. అల్–అఫ్గాని మత భావాలలో వైరుధ్యం వుంది. కలకత్తా విద్యార్థులకు హిందూ ముస్లిం ఐక్యతను గురించి భావోద్వేగపూరితంగా ఉపన్యాసం ఇచ్చాడు. దానికి స్పందన అంతంత మాత్రంగా వుంది. దానితో పూర్తిగా అస్పష్టమైన కొత్త ధోరణి మొదలైంది. 1890 దశాబ్దాంతానికి సుల్తాన్‌ని సంరక్షకుడిగా ఆరాధించాలని కలకత్తా జూట్ మిల్లులోని ముస్లిం కార్మికులకు బోధించినట్లుగా సాక్ష్యాధారాలున్నాయి. 1897 నాటి కలకత్తా ఘర్షణలలో అఖిల ముస్లిం ప్రపంచ వాదం పాత్ర వుంది. కాని 20 సం॥ల తరువాత ఖిలాఫత్ ఉద్యమ కాలంలో అది బలమైన సామ్రాజ్య వాద వ్యతిరేక శక్తి అయింది.

19వ శతాబ్దం చివరలో భారతీయ సమాజంలో చెలరేగిన వివాదాలు అంతగా హిందూ, ముస్లిం మతాల మధ్య వచ్చిన వివాదాలు ఘర్షణలు కావు. హిందూ మతంలో లేక ఇస్లాం మతంలో కొత్తగా వచ్చిన వివిధ ధోరణుల వలన వచ్చినవి. కాని 1880,1890 దశాబ్దాలలో మత తత్వం అఖిల భారత పరిమాణాన్ని సంతరించుకోవడం ప్రారంభమైంది. రెండు ప్రధానమైన సమస్యలు. ఉర్దూ–దేవనాగరలిపి, గోసంరక్షణ. దేవనాగరలిపిని వాడాలని బనారస్ హిందువులు 1868లో డిమాండ్ చేశారు. 1900 లో లెఫ్టినెంట్ గవర్నర్ మెక్డోన్నెల్ అనుమతి యిచ్చారు. ఈ డిమాండ్ యు.పి.లో గలిపాత కొత్త కులీనుల మధ్య ఉద్రిక్తతలతో ముడిపడిన డిమాండ్ చాలా ఆసక్తికరమైన విషమేమంటే సయ్యద్ అహమ్మద్ మొట్ట మొదటిసారిగా 1869లో ముస్లింల ప్రత్యేక అస్తిత్వాన్ని గురించి మాట్లాడడం. ఇక లిపి వివాదానికి వస్తే ఆయన శాస్త్రీయ సమాజం (Scientific Society) లో ముస్లిం సభ్యుల కంటే హిందూ సభ్యులు ఎక్కువ మంది వున్నారు. ఇంకా ముఖ్యమైన అంశమేమంటే గోసంరక్షణ సమస్య. మెక్లేన్ ఇటీవల ప్రచురించిన అధ్యయనంలో పేర్కొన్న విధంగా ఇది కులీన, సాధారణ ప్రజల మతతత్వాన్ని కలిపే గొలుసులోని కొక్కెంగా పని చేసింది. హిందూ గో సంరక్షణ వాదులు ఆందోళన చేశారు. చట్టం చేయాలన్నారు. యు.పి.లోని కొన్ని మున్సిపాల్టీలు పారిశుధ్య కారణాలతో గోవధశాలలు, మాంస విక్రయశాలల్ని పరిమితం చేస్తూ అదనపు చట్టాలు చేశాయి. ఎన్నికలు పెట్టడంతో మెజార్టీ సాధించగల హిందువులు ముస్లింలపై మరిన్ని ఆంక్షలు విధిస్తారని

ముస్లిం రాజకీయవేత్తలు ఆందోళన చెందారు. దయానంద 1881 లో 'గోకరుణా నిధి' పేరుతో కరపత్రం ప్రచురించారు. 1880 దశాబ్దంలో చివరి సంవత్సరాలలో ఉత్తర భారత దేశంలోని పలు ప్రాంతాలలో లాయర్లు, జమీందార్లు సాధు సన్యాసుల అండదండలతో ప్రోత్సాహంతో గోసంరక్షణ సభలు పుట్టుకురావడం ప్రారంభమైంది. గోవు అనాదిగా వస్తున్న మతపరమైన ప్రతీక మాత్రమే కాదు. రైతుకు భూమితోపాటు ఆస్తిలో భాగం. గోసంరక్షణ భారతీయుల ఆరోగ్యాన్ని ఐశ్వర్యాన్ని పెంచుతుందనే వాదనతో విద్యావంతులైన హిందువులు ఆకర్షితులయ్యారు. గోసంరక్షణ సభలు 1892-93 తరువాత సమరశీలమవుతూ వచ్చాయి. అందుకు కారణం అంతకు ముందు సంవత్సరంలో వివాహ వయస్సుపై చట్టం చేయడంపట్ల సనాతనులలో వెల్లువెత్తిన నిరసన కావచ్చు. గోవుల్ని కసాయి వాళ్ళకు అమ్మడంలో జోక్యం చేసుకొని, సభలు జరిపి, అమ్మిన వారికి జరిమానాలు, సామాజిక బహిష్కరణలు విధించినట్లు కూడా రిపోర్టులు అందాయి. అదే సమయంలో ఇస్లాం పునరుద్ధరణ వాదులు బక్రీద్‌కి ఆవుల్ని బలులివ్వవలసిన అవసరాన్ని నొక్కి చెప్పడంతో 1893 జూన్, జూలై నెలల్లో విస్తృత స్థాయిలో ఘర్షణలకు రంగం సిద్ధం చేయబడింది. పెద్ద ముస్లిం గుంపుపై ఘాజీపూర్, బీలియా జిల్లాల నుండి వచ్చిన గుంపులు దాడి చేయడంతో అజాంఘర్‌లోని 'మౌ' వద్ద ఘర్షణలు ప్రారంభమయ్యాయి. బాలియాలో దొమ్మీలు పథకం ప్రకారం జరిగాయి. అచట రాజపుట్ జమీందారు ప్రోత్సాహం చాలా ఎక్కువగా వుంది. సరన్, గయా, పాట్నాలలో విస్తృతంగా దొమ్మీలు జరిగాయి. బొంబాయిలో తీవ్రమైన హింసారూపం తీసుకున్నాయి. 80 మంది చంపబడ్డారు. మసీదుల ముందుగా హిందువులు మేళతాళాలతో పోవచ్చా? అనే అంశం నిప్పురవ్వగా పని చేసింది. ఇంకా జానాఘద్‌లో చాలా దూర ప్రాంతమైన రంజాన్‌లో కూడా ఘర్షణలు జరిగాయి. ఊహించని విధంగా దేశ వ్యాప్తంగా మతమౌఢ్యం బుసలు కొట్టింది. అప్పుడప్పుడు ముందుకడుగేయనున్న ఆధునిక జాతీయ ఉద్యమానికి ఇది శుభ సూచన కాదు.

పునరుద్ధరణ వాదానికి, జాతీయ తీవ్ర వాదానికి మధ్యగల సంబంధం విశ్వసనీయమైనది కాదు. పునరుద్ధరణ వాదం ఘర్షణలు దొమ్మీలకు దారి తీసింది. భారత ప్రజల్ని సమైక్యపరిచి చేపట్టబోయే కాంగ్రెస్ ఆందోళన యొక్క వేళ్ళను ఈ ఘర్షణలు నరికివేశాయి కనుక అప్పటి సెక్రటరీ ఆఫ్ స్టేట్ కింబర్లే ఈ పరిణామాలను ఆహ్వానించారు. (కింబర్లే లేండ్స్ డౌనేకి 25 ఆగస్టు 1893) అంతే గాక 1905 ముందు జాతీయ వాదానికి అందించిన అత్యంత పెద్ద తోడ్పాటు ఆధునిక సంస్కర్తలతో సంబంధాలున్న దాదాభాయ్ నౌరోజి, రనడే, బి.వి. జోషి, ఆర్.సి. దత్ లాంటి వారు బ్రిటీష్ పాలన సాగించిన ఆర్థిక దోపిడీపై 'సంపద తరలింపు సిద్దాంతం' ద్వారా క్రమబద్ధమైన విమర్శకి రూపకల్పన చేయడం. 1876లో బ్రహ్మ సమాజ నాయకుడు శివనాథ శాస్త్రి యువకుల గ్రూపులతో (బిపిన్ చంద్రపాల్‌తో సహా) ప్రభుత్వ సర్వీసులను నిరాకరించాలని, ప్రమాణం చేయించారు. తిలక్ జి.బి. అగార్కర్‌తో కలిసి దక్కన్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రారంభించారు. కేసరి, మరాఠా పత్రికలను నడిపారు. తరువాత విభేదించి తిలక్ సామాజిక రాజకీయ వ్యవహారాలలో అతి వాదిగా గుర్తింపు పొందాడు. సంస్కరణ వాద పత్రిక సుధారక్ సంపాదకుడైన అగార్కర్ అకాల మరణంతో 1895లో

పట్వర్ధన్ ఆ పత్రిక సంపాదకుడయ్యాడు. 1897 లో పూనాలోని ప్లేగు అలజడుల సమయంలో రాజద్రోహ ఆరోపణల బెదిరింపులు వచ్చాయి. అలాగని సనాతన వాదాన్ని పునరుద్ధరణ వాదాన్ని సమర్థించే వారందరూ రాజకీయ అతి వాదులు కారు. 1892లో 10,000 మందితో సాగిన సనాతన వాదుల ప్రదర్శన విక్టోరియా రాణికి అభినందనలతో ముగిసింది. అనిబిసెంటు సంఘ సంస్కరణ చేపట్టిన తర్వాతనే రాజకీయాలలో చురుకుగా పాల్గొన్నారు. ఆర్య సమాజంలోని గురుకుల సెక్షన్ లజపతి కాలేజి విభాగంలో గాక జాతీయ వాద రాజకీయాలకు దూరంగా వుండి పోయింది. 1913లో కూడా గురుకుల సెక్షన్ లెఫ్టినెంట్ గవర్నర్ మెస్టన్‌కి ఆడంబర పూర్వకమైన స్వాగతం చెప్పడం ద్వారా తన విధేయతను ప్రదర్శించుకున్నది.

1870 నుండి జాతీయ వాదం యొక్క విభిన్న రూపాలలో మేధావుల ప్రసంగాలలో చర్యలలో – క్రమబద్ధమైనది, అసంపూర్ణమైనది, తరచుగా పరస్పర విరుద్ధమైనది అయినప్పటికీ చాలా ముఖ్యమైన మార్పు జరుగుతూ వచ్చింది. ఈ మార్పు చాలా మంది సంస్కర్తల్ని, పునరుద్ధరణ వాదుల్ని ప్రభావితుల్ని చేసింది. విద్యావంతులలో పెరుగుతున్న నిరుద్యోగం ఈ మార్పుకి కారణంగా చెప్పడం పూర్తి సంతృప్తికరంగా లేదు. భారతీయ వార్తా పత్రికలు అలాగే ప్రభుత్వ రిపోర్టులు గ్రాడ్యుయేట్లకు కుంచించుకుపోతున్న ఉద్యోగావకాశాల్ని గురించి మాటిమాటికి ప్రస్తావించాయి. అయినప్పటికి ఉద్యోగాల కొరకు పోటీ ప్రాంతీయ కుల మత చైతన్యాలకు దారి తీయవచ్చు. యు.పి. హిందూ ముస్లిం విద్యావంతుల మధ్య విభేదాలను గురించి, ఉత్తర భారత దేశంలోని పలు ప్రాంతాలలో బెంగాలీలు ప్రజాదరణ కోల్పోవడాన్ని గురించి ఉదాహరణలు ఇంతకు ముందు గమనించాం. తొలినాటి కాంగ్రెస్ నాయకులలో కాంగ్రెస్ కార్యకలాపాలలో పాల్గొన్న వారిలో అత్యధికులు నిరుద్యోగ యువకులు కారు. వారి వారి వృత్తులలో రాణించినవారు. ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నవారు. ఇంకా ముఖ్యమైన అంశం జాతి వివక్ష (ఇల్బర్టు బిల్లు– వివాదం ఒక అభివ్యక్తి లేక వ్యక్తీకరణ మాత్రమే) బ్రిటీషు విధానాలకు దేశం యొక్క పేదరికానికి, (1870, 1890 దశాబ్దంలో సంభవించిన కరువు కాటకాలు) మధ్యగల సంబంధం పట్ల పెరుగుతున్న చైతన్యం. న్యాయవాదులుగా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్న తొలినాటి కాంగ్రెస్ నాయకులు కూడా తెల్లవారు కల్పించే ఆటంకాలను అధ్యయనం చేయవలసి వచ్చింది. ఉదాహరణకు ఫిరోజ్‌షా మెహతా 1883లో బొంబాయిలో బ్రిటీషు వారి న్యాయ విరుద్ధమైన పోటీపై ఫిర్యాదు చేసిన తరువాత నగర పరిసర ప్రాంతాల ప్రాక్టీసుపై కేంద్రీకరించాలని నిర్ణయించుకొన్నాడు. 1881 లో స్టాండింగ్ కౌన్సిల్ నియామకంలో డబ్ల్యు.సి.బెనర్జీ ఉపేక్షించబడ్డారు. మద్రాసు కలకత్తాలలోని వకీళ్లు తెల్లవారికి జూనియర్లుగా పని చేసేందుకు తిరస్కరించిన తరువాతనే హైకోర్టులలో వారి కేసుల్ని వారు వాదించుకునే హక్కు పొందారు. రాణిగంజ్ వద్ద శ్వేతజాతి గని యజమానుల అణచివేతకు గురయిన భారతీయుల పక్షాన జోక్యం చేసుకున్నందుకు, తన పై అధికారి జాన్ భీమ్స్ ఆకాంక్షలకు వ్యతిరేకంగా ఇల్బర్టు బిల్లుని సమర్థిస్తూ వాదించినందుకు పదోన్నతి విషయంలో బ్రిజేంద్రనాథ్‌డే వివక్షతకు గురయ్యాడు.

**సాహిత్యంలో దేశభక్తి**

తొలుత మేధావులు వారి దేశభక్తిని ప్రాంతీయ భాషలతో వ్యక్తం చేశారు. వివిధ భారతీయ భాషలలో ఆధునిక సాహిత్యం (ప్రత్యేకించి 19వ శతాబ్దానికి ముందు వచనం అభివృద్ధి కాలేదు.) సంఘ సంస్కరణ ఉద్యమాలతో సన్నిహిత సంబంధం కలిగి అభివృద్ధి చెందింది. (ఉదాహరణకు బెంగాలీ వచనం అభివృద్ధిలో రామ్మోహనరాయ్. విద్యాసాగర్ నిర్వహించిన పాత్ర) 1860, 1870 దశాబ్దాలలో దేశం యొక్క దుస్థితిని చేతి వృత్తుల పతనాన్ని చిత్రిస్తూ బెంగాల్ అసంఖ్యాకమైన కవితల్ని పాటల్ని ప్రచురించింది. వీటిలో అత్యధికం ఠాగూర్ కుటుంబ ప్రోత్సాహంతో నవగోపాల్ మిత్ర చే నిర్వహించబడిన 'హిందూమేళా' కొరకు రాయబడ్డాయి. కొత్తగా స్థాపించబడిన నాటక రంగం బ్రిటీషు వ్యతిరేక వైఖరి చేపట్టింది. దీనబంధు మిత్ర నీల్ దర్పణ్ (1860) నీలి మందు తోటలో పని చేసే కార్మికుల దయనీయ బతుకుల్ని కళ్ళకు కట్టినట్లు చిత్రించింది. 1870లలో వచ్చిన నాటకాలు 1876లో లిట్టన్ నాటకాల ప్రదర్శన చట్టానికి దారి తీశాయి. బంకించంద్ర చారిత్రక నవలలు సాహిత్యాన్ని చాలా ప్రభావితం చేశాయి. వాటిలో వందేమాతర గీతం గల 'ఆనంద్ మఠ్' అత్యున్నతమైనది. బంకించంద్ర తన వ్యాసాలు నవలల ద్వారా దేశ చరిత్రలో కొత్త అభిరుచిని కలిగించ యత్నించారు. కాని 1880, 1890 దశాబ్దాలలో బెంగాల్‌లో హిందూ పునరుద్ధరణ వాదం అత్యున్నత దశలో వున్నప్పుడు రాజకీయ ప్రయోజనాలలో గణణీయమైన తగ్గుదల కన్పించింది. సమకాలీన రాజకీయాలతో సంబంధంలేని పురాణ యితి వృత్తాలు కథా వస్తువులుగా గిరీష్‌చంద్ర ఘోష్ నాటకాలు ఆధిపత్యం సాధించాయి. 'ఇల్బర్ట్ బిల్లు వాటి నుండి మతం పట్ల గల ఆసక్తితో రాజకీయాలు నిర్లక్ష్యం చేయబడ్డాయి. ఫలితంగా పాత దేశభక్తి గీతాల స్థానంలో మతపరమైన పాటలు వచ్చాయి' అని 1903లో బిపిన్ చంద్రపాల్ వ్యాఖ్యానించారు. (న్యూ ఇండియా మార్చి 1903) .

దేశంలోని యితర ప్రాంతాలలో కూడా జాతీయవాదానికి ప్రాంతీయ భాషలలో సాహిత్యాభివృద్ధికి అలాంటి సంబంధమే వున్నట్లు కనిపిస్తుంది. మరాఠీ సాహిత్యం అభివృద్ధిపై యం.జి. రనడే (1898) యిచ్చిన వివరణ మరాఠా ప్రచురణలు వేగంగా అభివృద్ధి చెందడాన్ని (1818-27 కాలంలో 3,1847-57 కాలంలో 102,1865-74 కాలంలో 1530, 1885-96 కాలంలో 3824) 1840 నుండి మధ్యయుగాల మరాఠీ భక్తి కవుల కవితా సంకలనాలను ప్రచురించడాన్ని నొక్కి చెప్పింది. ఆ తరువాత వచ్చిన ప్రాచీన మరాఠీ రచనలు, రనడే, చారిత్రక రచనలు వ్యాసాలతో ఒక విధంగా శివాజీ ఆరాధన ప్రారంభమైంది. ఈ శివాజీ ఆరాధన 1895 నుండి తిలక్ అంది పుచ్చుకున్నాడు. కాని రనడే 17వ శతాబ్దపు పునరుద్ధరణ వాదాన్ని కులభేదాల్ని అతిక్రమించ ప్రయత్నించిన భక్తి కవుల ప్రేరణతో ఒక రకమైన తిరుగుబాటు ఉద్యమంగా చిత్రించ యత్నించారు. ఆయన తరువాత కాలం నాటి పీష్వా సనాతన సాంప్రదాయం మరాఠా పతనానికి పాక్షికంగా బాధ్యత వహించిందని భావించారు. 1890 నుండి తిలక్, కేల్కర్, రాజ్‌వాడేలు ప్రతిపాదించిన సమరశీల హిందూ మతం ధర్మ దూతగా

శివాజీ పరువైన రామదాసు పాత్రని చిత్రించి శివాజీని పూర్తిగా భిన్నమైన కోణం నుండి చూపించారు. ఇరుపక్షాలు సమకాలీన భిన్నాభిప్రాయాల కోణాల నుండి గతాన్ని చూపించ యత్నించాయి. మూడవ కోణం నుండి జ్యోతి బాఫూలే చెప్పినట్లు శివాజీని శూద్రరాజుగా పేర్కొంటూ 1869లో రచించిన జానపద కవిత్వం వుంది. పరస్పర విరుద్ధమైన వివిధ కోణాల నుండి చూపెడుతూ శివాజీపై అనేక రచనలు వెలువడ్డాయి. గోపాల్‌హరి దేశ్‌ముఖ్ 'లోకహిత వాది' పత్రికలో ప్రచురించిన 'శతపత్ర' శీర్షికన ప్రచురించిన రచనలలో సంఘ సంస్కరణలు జరగాలన్నాడు. దేశీయ వ్యాపారాభివృద్ధిని కాంక్షించారు. బ్రిటీషు పరిపాలనని స్వాగతించారు. ఒకతరం తరువాత వచ్చిన విష్ణు కృష్ణ చిప్లూంకర్ పత్రిక నిబంధమాల (1874-81) పునరుద్ధరణ వాదాన్ని బ్రిటీషు వ్యతిరేక వైఖరిని చేపట్టింది. కానీ బెంగాలి మరాఠీ ఉదాహరణలు స్పష్టం చేసిన విధంగా వివిధ భారతీయ భాషలలో అభివృద్ధి చెందిన దేశభక్తి సాహిత్యంలో కొన్ని అస్పష్టతలు వున్నాయి. దేశభక్తి సాహిత్యం జాతీయ, ప్రాంతీయ మత పరమైన చైతన్యాలను పెంచేందుకు దోహదపడింది. బంకీంచంద్ర ప్రధానంగా బెంగాల్ చరిత్రకు పరిమితమయ్యారు. బెంగాల్ స్వాతంత్ర్యాన్ని కోల్పోయింది. బాక్తియార్ ఖిల్జీ యుద్ధంలోగాని ప్లాసీ యుద్ధంలో కాదని పలుమార్లు నొక్కి చెప్పారు. మొగలు చక్రవర్తుల కేంద్రీకరణ విధానాలు ప్రాంతీయ జీవితంపై చాలా దుష్ప్రభావాలను కలిగించిందన్నారు. తరువాత చారిత్రక నవలలు (ప్రత్యేకించి ఆనందమఠ్, దేవీ చౌధురాణి, నీలూరాంలలో) ముస్లింలను దూషించారు. ముస్లిం దండయాత్రలకు వ్యతిరేకంగా రాజపుత్రుల ధైర్యసహసాలు బెంగాలీ కవిత్వం, నాటకం, నవలకేగాక, బాలసాహిత్యానికి కూడా కథా వస్తువులయ్యాయి. 1740 నాటి బార్లీదాడులతో ఏర్పడిన బెంగాలీ మరాఠీల సంబంధాలతో శివాజీ ఆరాధనని దిగుమతి చేయడం జరిగింది. బ్రిటీషు పాలనకి వ్యతిరేకంగా బాహాటంగా వ్రాయడం ప్రమాదకరం (బంకించంద్ర ప్రభుత్వ ఉద్యోగి కనుక) కాబట్టి హిందువుల ఐక్యతకి కృషి చేయడానికి అదే ప్రత్యామ్నాయ జాతీయవాదం అని బిపిన్ చంద్ర పేర్కొన్నారు. బకించంద్ర స్వదేశీ హిందూ యువకులకు ప్రత్యేకించి 1905 తరువాత ఆరాధ్యుడయ్యాడు. కాని జాతీయవాదం పట్ల సానుభూతితో వున్న ముసల్‌మాన్ లాంటి పత్రికలు కూడా ఆయన తన నవలల్లో ముస్లింలను దూషించడాన్ని ఆక్షేపించాయి. ముస్లిం మేధావులు కూడా హిందువులచే దూషింపబడిన చారిత్రక కాలాల్ని వ్యక్తుల్ని (ఉదాహరణకు ఔరంగజేబ్‌ని) ఆకాశానికి ఎత్తారు. ప్రపంచ వ్యాప్తంగా ఇస్లాం కోల్పోయిన గత వైభవాన్ని తవ్విపైకి తీశారు. ముస్లింలు వారి తరహా ప్రత్యామ్నాయ జాతీయ వాదాన్ని అభివృద్ధిపరచ యత్నించారు. ఈ తరహా జాతీయవాదాన్ని ఉర్దూ కవులు అల్తాఫ్ హుస్సేన్ ఆలి, షిబ్లీనొ మానీలు ప్రత్యేకించి బెంగాలీలో కైకోబాద్ వ్యాప్తి చేయ యత్నించారు.

రెండు పెద్ద ప్రాంతాలలో తమిళనాడు, ఈనాడు హిందీ బెల్ట్‌గా పిలువబడే ప్రాంతాలలో పరిస్థితులు క్లిష్ట రూపం దాల్చాయి. తమిళుల చరిత్ర, ప్రాచీన తమిళ సాహిత్యం కొరకు యిచ్చిన పిలుపు రాబర్ట్ కాల్డ్‌వెల్, జె.హెచ్. నెల్సన్ లాంటి పండితుల ప్రోత్సాహంతో 20 వ శతాబ్దం ప్రారంభం నాటికి బ్రాహ్మణ వ్యతిరేక, ఉత్తర భారతదేశ ఆర్యులు వ్యతిరేక రూపాన్ని సంతరించుకున్నది. ఈ పరిణామం 1886 లో గవర్నర్ గ్రాంట్ డఫ్ లాంటి బ్రిటీష్

అధికారులచే ప్రోత్సహించబడింది. హిందూ పునరుద్ధరణ వాద ఉద్యమాల సన్నిహిత సంబంధాలతో సాహిత్య భాషగా హిందీ కృత్రిమంగా సృష్టించబడింది. ఆధునిక హిందీ సాహిత్య పితామహునిగా పరిగణింపబడిన భరతేందుహరిశ్చంద్ర తన నాటకాలు, కవిత్వం, జర్నలిజంలలో స్వదేశీ వస్తు వినియోగాన్ని మేళవించాడు. కోర్టు భాషగా ఉర్దూ స్థానంలో హిందీని ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశాడు. గోవధను నిషేధించాలన్నారు. రాజకీయాలలో విధేయుడుగా ఉండిపోయాడు. 18వ శతాబ్దాంతంలోనూ 19వ శతాబ్దంలో చాలా కాలం వరకు ఉత్తర దేశంలోని పెద్ద ప్రాంతాలలో ముస్లింలే గాక హిందువులు కూడా ఉర్దూను అత్యంత సంస్కృతీ సాంప్రదాయాలు గల భాషగా పరిగణించేవారు. 1890-91 దశాబ్దంలో ఉర్దూలో 4380 పుస్తకాలు ప్రచురింపబడగా హిందీలో 2793 పుస్తకాలు మాత్రమే ప్రచురింపబడ్డాయి. ఉర్దూ వార్తా పత్రికల సర్క్యులేషన్ 16,256 కాగా హిందీ వార్తా పత్రికల సర్క్యులేషన్ 8002; ప్రచురణ కర్తలు లభ్యం కాకపోవడంతో ప్రేమచంద్ కూడా 1915 వరకు ఉర్దూలోనే రచనలు చేశారు. పర్షియన్ ప్రభావం అధికంగా వున్న ఉర్దూ సమాజంలోని ఉన్నత వర్గాల భాషగా వున్నది. గనుక హిందీ లిపి దేవనాగర లిపిగా వుండాలని ఆర్య సమాజవాదులు సనాతన వాదులు చేసిన విజ్ఞప్తి ప్రజాదరణ పొందింది. కాని హిందీలో సంస్కృత పదాలు అధికాధికంగా చేర్చి దానిని సంస్కృతమయం చేశారు. కొందరు దీనిని జాతీయ భాషగా చేయాలన్నారు. కాని సంస్కృతీకరింపబడిన హిందీ ఉత్తర భారత దేశంలోని ప్రాంతీయ భాషలకు (పంజాబి, హరియాని, పహారి, రాజస్తాని, అవధి, భోజ్‌పూరి, మైథిలి, మగధ లాంటి భాషలకు) చాలా దూరం చేయబడింది. అంతేగాక, లిపి భాషల విషయంలో వచ్చిన విభేదాలు మతంతో మమేకం చేయబడ్డాయి. ప్రజల చైతన్యంలో మత బీజాలు నాటబడ్డాయి. ఆ విధంగా ఉత్తర భారత దేశంలోనే గాక దక్షిణ భారత దేశంలో కూడా కొత్త సమస్యలు ఉత్పన్నమయ్యాయి. అవి స్వతంత్ర భారత దేశంలో ఇప్పటికీ సమస్యలుగానే ఉండి పోయాయి.

## జాతీయ వాద ఆర్థిక సిద్ధాంతం

జాతీయ వాద భావ వ్యక్తీకరణకు మరొక రూపం విదేశీ పాలన తెచ్చిపెట్టిన ఆర్థిక విధానంపై విమర్శ. దీనినే సంక్షిప్తంగా 'సంపద తరలింపు' అంటారు. 1870 కి ముందు నాటి భారతీయ మేధావులకు ఆ తరువాత కాలం నాటి మేధావులకు మధ్య 'సంపద తరలింపు' సిద్ధాంతం విభజన రేఖగా నిలుస్తుంది. రామ్మోహన్ 1831 నాటి హౌస్ ఆఫ్ కామన్స్ సెలెక్టు కమిటీ ఎదుటి సాక్ష్యమిస్తూ తరలింపును గురించి ప్రస్తావించడమే గాక తరలింపబడుతున్న మొత్తాన్ని కూడా అంచనా వేయ యత్నించారు. భారత దేశాన్ని యూరపు వలస రాజ్యంగా మార్చడం పరిష్కారమని సూచించారు. అప్పుడు తెల్లవాళ్ళు గడించే లాభాలు దేశాన్ని వదలిపోవు. నౌరోజితో ప్రారంభమై 1870 దశాబ్దం నుండి జాతీయ వాద ఆర్థిక విధానం అభివృద్ధి చెందుతూ వచ్చింది. ఈ అంశంపై ఉపన్యాసాలు, పత్రికలలో వ్యాసాలు, పుస్తకాలు వెలువడ్డాయి. వీటినాధారంగా చేసుకొని బిపిన్‌చంద్ర సాధికారిక గ్రంథాన్ని రచించారు.

భారత దేశంలో పేదరికం బ్రిటీషు పాలకులు అనుసరిస్తున్న కొన్ని విధానాల కారణంగా పెరుగుతుందని, కృత్రిమంగా అదనపు ఎగుమతులు, చేతివృత్తుల విధ్వంసం, భారతదేశ పారిశ్రామికీకరణకు ఆటంకాలు, శిస్తు, పన్నుల రూపంలో విపరీతమైన భారాలు మోపడం - అనేవి ఆర్.సి. దత్ యొక్క భారతదేశ ఆర్థిక చరిత్ర (1901-03) కి ప్రధానాంశాలు. ఈ విధానాలను వెనక్కి తీసుకోవడం, పారిశ్రామికీకరణ చేపట్టడం. విరుగుడులుగా పేర్కొన్నారు. తొలినాటి జాతీయవాదులు పెట్టుబడిదారీ పంథాలో స్వతంత్రంగా అభివృద్ధి చెందేందుకు పథకాన్ని కూడా రూపొందించారు. 1873లోనే బోలానాథ్ చంద్ర పరిశ్రమల్ని స్థాపించకపోవడాన్ని విమర్శించినవాడు, బ్రిటిష్ వస్తువుల్ని, వినిమయాన్ని వ్యతిరేకించినవారు) పరిశ్రమల స్థాపన అనేది ప్రజల ఆలోచనా స్రవంతులకు సముద్రంలా వుండాలని చెప్పాడు. 20 సంవత్సరాల తరువాత రనడే పారిశ్రామికీకరణ దేశం యొక్క సాంప్రదాయం కావాలని ఈ ప్రాచీన దేశంలో ఆధునిక స్ఫూర్తి విజయం సాధించాలని ఆకాంక్షించారు. మనం పెట్టుబడిదారులం, వాణిజ్యవేత్తలం. యంత్రాల ఉత్పత్తిదారులం, అమ్మకందారులం కావాలి," (13 ఫిబ్రవరి, 1881)

ఇటీవలి పరిశోధనల వెలుగులో చూస్తే జాతీయవాద విమర్శకు కొన్ని పరిమితులున్నట్లు స్పష్టమవుతుంది. బ్రిటన్ యొక్క మొత్తం సామ్రాజ్యవాద విధానంలో భారతదేశం నిర్వహించే కీలకమైన పాత్రపై స్పష్టమైన అవగాహన లేదు. బ్రిటిష్ పాలకులు బ్రిటిష్ విధానాలకు భిన్నమైన వాటిని అమలు పరచడం ద్వారా దేశం కష్టాల్ని ఎదుర్కొంటుందని నచ్చచెప్పడం ద్వారా, ఒత్తిడి ద్వారా ఆ విధానాలు వెనక్కి తీసుకొనేలా చేయవచ్చునని నౌరోజిలాంటి వారు భావించారు. ప్రభుత్వ విధానాలపై కేంద్రీకరణ బ్రిటిష్ ప్రైవేట్ పెట్టుబడుల పాత్రను ఉపేక్షించడానికి దారితీసింది. అన్నిటినీ మించి భారత సమాజంలోని ఉద్రిక్తతల్ని వ్యక్తం చేయడంలో అస్పష్టత వుంది. రైతులు తమ ఉత్పత్తుల్ని బలవంతంగా అమ్ముకోవలసి వచ్చిందని, తరలింపుకి అవసరమైన ఎగుమతి నిల్వల్ని నిలబెట్టేందుకు వాటిని విదేశీ ఎగుమతి ఏజెన్సీల ద్వారా మరలించడం జరిగిందని నౌరోజి, ఆర్.సి. దత్ వాదించారు. ప్రభుత్వం విధించిన శిస్తులు పన్నుల భారం మోయడమే గాక ప్రజలు భారతీయ జమిందారుల వడ్డీ వ్యాపారుల దోపిడీతో కూడా క్రుంగిపోయినారు. సంపన్న వర్గాలకు చెందిన భారతీయులు కూడా వలసవాద దోపిడీ ఏజెంట్లుగా పనిచేసి ప్రయోజనాలు పొందారు. జాతీయవాదులు దీనిని విస్మరించారు. జాతీయవాదులు భారతీయుల యాజమాన్యంలో గల ఫ్యాక్టరీలలో పనిచేసే పేదల దురవస్థల గురించి పట్టించుకోలేదు. విదేశీ కంపెనీలలో పనిచేసే పేదల పరిస్థితిని మానవతావాదంతో పరిశీలించాలన్నారు. ఫ్యాక్టరీ చట్టాలు, మహిళలు, బాలల నియామకం అమలుపై షరతులు విధించిన ఫ్యాక్టరీ చట్టాలు, బొంబాయి పోటీ కారణంగా లాంక్షైర్ ప్రేరణతో చేయబడిన చట్టాలు - ఈ చట్టాల్ని జాతీయవాద వార్తా పత్రికలు అత్యధికం వ్యతిరేకించాయి.

కొన్ని పరిమితులున్నప్పటికీ మితవాద ఆర్థిక ఆలోచన జాతీయవాదంపై తనదైన ముద్రని వేయగలిగింది. జాతీయవాదం యొక్క తరువాత దశలలో – అతివాద, రివల్యూషనరీ టెర్రరిస్ట్, గాంధేయ, సోషలిస్టు దశలలో విదేశీ పాలనని భారతీయ దృష్టి కోణం నుండి విమర్శించేందుకు సారాన్ని అందించింది. సంపద తరలింపు సిద్ధాంతం, వలసవాద దోపిడీ వెనుక దాగి వున్న వాస్తవాల్ని అంచనా వేయగలిగింది. సంపద తరలింపు తర్కం కాంగ్రెస్ యొక్క డిమాండ్‌ను కార్యకలాపాలకు అవసరమైన సైద్ధాంతిక పునాదిని సమకూర్చింది.

**కాంగ్రెస్ పునాదులు**

కాంగ్రెస్ యొక్క ముఖ్య నాయకత్వం 1860, 1870 దశాబ్దాలలో లండన్‌లో ఐసిఎస్ లేక బారిస్టర్ చదవడానికి వెళ్ళిన ఫిరోజ్‌షా మెహతా, బ్రదుద్దీన్ త్యాబ్జి, డబ్ల్యు.సి. బెనర్జీ, మన్‌మోహన్, లాల్‌మోహన్ ఘోష్, సురేంద్రనాథ్ బెనర్జీ, ఆనందమోహన్ బోస్, రమేష్ చంద్ర దత్ లాంటి వారితో ఏర్పడింది. వీరందరిపై అప్పటికే ఇంగ్లండ్‌లో వ్యాపారిగా, ప్రచురణ కర్తగా స్థిరపడిన దాదాబాయ్ నౌరోజి ప్రభావం వుంది. ఈ గ్రూపులో సివిల్ సర్వీసులో చేరిన వారు (లేక దాని నుండి నెట్టివేయబడిన సురేంద్రనాథ్ లాంటి వారు) కలకత్తాలోని ద్వారకానాథ గంగూలీ నాయకత్వంలోని సాధారణ బ్రహ్మ సమాజ గ్రూపుకి చెందినవాళ్ళు పూనాలో రనడే, జి.వి. జోషి, బొంబాయిలోని కె.టి. తెలాంగ్, ఆ తరువాత కొద్ది కాలానికి మద్రాసులోని జి. సుబ్రమణ్య అయ్యర్, పౌర రాఘవాచారి, ఆనందాచారిలాంటి వారు పలు స్థానిక సంస్థల్ని స్థాపించారు. వీరు జమిందారులు కాదు. మధ్యతరగతి వృత్తిదారులు.

ఈ సంఘాలలో ముఖ్యమైనవి పూనా సార్వజనిక సభ (1878) సివిల్ సర్వీస్, ప్రెస్ చట్టం సమస్యలపై 1877 – 78లో అఖిల భారత స్థాయి ఆందోళనలు నిర్వహించిన ఇండియన్ అసోసియేషన్ (1870), మద్రాసు మహజన్ సభ (1884) బొంబాయి ప్రెసిడెన్సీ అసోసియేషన్ (1885), 1880 దశాబ్దం ప్రారంభం నుండి అలాంటి గ్రూపులన్నింటినీ అఖిల భారత స్థాయిలో సంఘటిత పరిచే ప్రయత్నాలు జరిగాయి. ఇండియన్ అసోసియేషన్ 1883, 1885లలో కలకత్తాలో జాతీయ సదస్సులు నిర్వహించింది. కాని చివరికి అక్టేవియన్ హ్యూం చొరవతో చేపట్టిన ప్రయత్నం జయప్రదమయింది. 1885 డిసెంబర్‌లో బొంబాయిలో జరిగిన భారతీయ జాతీయ కాంగ్రెస్ మొదటి సదస్సుకి తమని తాము ప్రతినిధులుగా ప్రకటించుకొని 72 మంది హాజరయ్యారు.

డఫరిన్ ప్రత్యక్ష సలహా మేరకు హ్యూం పని చేస్తున్నారని 1898లో డబ్ల్యు.సి. బెనర్జీ చేసిన ప్రకటనతో అనవసర వివాదం చెలరేగింది. ప్రజల ప్రతిఘటనని నివారించేందుకు విద్యావంతులైన భారతీయులకు కొన్ని రాయితీలు కల్పించాలని అధికారులకు హ్యూం పలుమార్లు విజ్ఞప్తి చేయడంతో ఈ చర్యకి విస్తృత ప్రచారం లభించింది. ప్రజల అసంతృప్తికి రక్షక కవాటంగా పనిచేసేందుకు బ్రిటిష్ వైస్రాయి ఒక మాజీ సివిల్ అధికారి ద్వారా కాంగ్రెస్ సంస్థాపన జరిపాడని ఆర్.పి. దత్ లాంటి కాంగ్రెస్ విమర్శకులు ఒక సిద్ధాంతాన్ని తయారు

చేశారు. ప్రజల అసంతృప్తి విషయమై హ్యూం చేసిన ప్రకటనలను ఏ అధికారి కూడా అంతగా పట్టించుకోలేదు. వైస్రాయ్ డఫరిన్‌ను హ్యూం సిమ్లాలో 1885లో కలిశాడు. కాని ప్రతినిధుల రాజకీయ సదస్సుకు దూరంగా వుండమని వైస్రాయి బొంబాయి గవర్నర్‌ని ఆదేశించాడు. (డఫరిన్ రియాకి 17 మే 1885) మొత్తం మీద హ్యూం నిర్వహించిన పాత్రని అతిశయించి చెప్పడం జరిగింది. జాతీయ స్థాయిలో ఒక సంస్థని స్థాపించాలనే ఆలోచనలు చాలా కాలం నుండి వున్నాయి. అప్పటికే సృష్టించబడిన వాతావరణాన్ని హ్యూం ఉపయోగించుకొన్నారు. అతడికి ప్రాంతీయపరమైన విధేయతలు, ఆకాంక్షలు లేవు గనుక అందరికీ ఆమోదయోగ్యుడుగా వుంటాడని అతణ్ణి ఒప్పించి వుండవచ్చు. అధికార వర్గాలలో హ్యూం చాల పలుకుబడి వుందనే భ్రమలు భారతీయులకు వుండవచ్చు. వాటిని హ్యూం తొలగించలేదు.

**మితవాద కాంగ్రెస్ : లక్ష్యాలు, పద్ధతులు**

కాంగ్రెస్ చరిత్రలో మొదటి 20 సంవత్సరాల కాలాన్ని మితవాద దశ అంటాము. ఈ కాలమంతటా కాంగ్రెస్ కార్యకలాపాలు లక్ష్యాలు, పద్ధతులు యించుమించు ఒకే మాదిరిగా వున్నాయి. ప్రతీ సంవత్సరం మూడు రోజుల పాటు కాంగ్రెస్ సమావేశాలు జరుగుతాయి. అధ్యక్షుని సుదీర్ఘోపన్యాసం వుంటుంది. చాలామంది ఉపన్యసిస్తారు. సభ్యులు వింటారు. చప్పట్లు కొట్టి అభినందిస్తారు. ఆర్థిక, రాజకీయ పాలనాపరమైన అంశాలపై ప్రతి ఏటా ఒకే రకమైన తీర్మానాలు చేస్తారు. సభలు ముగుస్తాయి. ప్రధానమైన రాజకీయ డిమాండ్లు : తమకు ఎక్కువ అధికారాలు (బడ్జెట్ చర్చలో పాల్గొనడం, ప్రశ్నలడిగే హక్కు) కల్పించడం, స్థానిక సంస్థలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్, యూనివర్శిటీల నుండి చట్ట సభలకు ఎన్నికయ్యే వారితో తమకు ప్రాతినిధ్యం కల్పించడం. అప్పటికీ స్వయం పరిపాలన, ప్రజాస్వామ్యం వారి లక్ష్యాలు కావు. 1905లో గోఖలే అధ్యక్షోపన్యాసంలో విద్యావంతులు ప్రజలకు సహజంగా నాయకులన్నారు. ప్రజలందరికీ గాక బాధ్యతలు నిర్వర్తించగల విద్యావంతులకు హక్కులు కావాలని డిమాండ్ చేశారు. స్వతంత్రం బ్రిటిష్ నమూనాలో క్రమక్రమంగా విస్తరిస్తుందని, నౌరోజీ 1906లో వర్ణించిన విధంగా బ్రిటన్ వలసలలో వున్నటువంటి స్వయం పరిపాలన లేక స్వరాజ్యం సిద్ధిస్తుందని అంచనాలు వున్నాయి. ఇక పరిపాలనా పరమైన డిమాండ్లకు వస్తే ఇంగ్లండ్‌లో ఇండియాలో ఒకేసారి ఐ.సి.ఎస్. పరీక్షలు జరిపి, సేవల్ని భారతీయాకరణ చేయాలన్నది ముఖ్యమైన డిమాండ్. చాలామంది తరచుగా వాదించే విధంగా ఇండియన్ సివిల్ సర్వీసులో చేరదలచుకొన్న అతికొద్దిమంది సంపన్నుల్ని సంతృప్తి పరచేందుకు చేసిన డిమాండ్ కాదు. పాలకులు జాత్యహంకారంపై దెబ్బ తీసేందుకు భారతీయాకరణకు ప్రచారం యివ్వబడింది. అంతేగాక బ్రిటిష్ అధికారులకు పెద్ద మొత్తంలో జీతాలు, పెన్షన్లు చెల్లింపుల రూపంలో సంపద తరలింపును తగ్గిస్తుంది. పరిపాలన భారతీయ అవసరాలకు ప్రతిస్పందనగా వుండేందుకు దోహదపడుతుంది. పాలనాపరమైన యితర డిమాండ్లు : న్యాయ వ్యవస్థని వేరుచేయాలి. న్యాయ విచారణని విస్తరించాలి. ఆయుధ చట్టాన్ని రద్దు చేయాలి. సైన్యంలో భారతీయులకు ఉన్నతోద్యోగాలు యివ్వాలి. ఆర్థిక సమస్యలన్ని 'భారతదేశ పేదరికం – సంపద తరలింపుకి

సంబంధించిన భారతదేశంలో పెరుగుతున్న పేదరికం, కరువు కాటకాలపై విచారణ జరిపించాలి, ప్రభుత్వ నిర్వహణ, మిలటరీ వ్యయం తగ్గించాలి. భారతీయ పరిశ్రమల ప్రోత్సాహానికి అవసరమైన సాంకేతిక విద్యకి ఎక్కువ నిధులు కేటాయించాలి. అనుచితమైన పన్నుల విధానాన్ని రద్దు చేయాలి. తొలినాటి కాంగ్రెస్ విద్యనార్జించిన వృత్తిదారులు, జమిందారులు, పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కొరకు మాత్రమే పనిచేయలేదు. ఉప్పు పన్ను, విదేశాలలో వున్న భారతీయ కూలీల సమస్యలు, అటవీ శాఖ వలస ఉత్పన్నమైన సమస్యలు – వగైరాలపై కాంగ్రెస్ పలు తీర్మానాలు చేసింది. 1891–95 మధ్య కాలంలో ప్రతీ సంవత్సరం అటవీ చట్టాలను కాంక్షిస్తూ తీర్మానాలు చేయబడ్డాయి. అంతేగాక 1880 దశాబ్దం చివరలో అస్సాం టీ తోటల పనివారి, ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం మేరకు పనిచేసే కూలీల దయనీయ పరిస్థితిని బహిర్గతం చేస్తూ ఇండియన్ అసోసియేషన్ ప్రచార కార్యక్రమం చేపట్టింది. ఆ సంఘం కార్యదర్శి ద్వారకానాథ్ గంగూలి, తన భద్రతకి ముప్పు వాటిల్లే ప్రమాదమున్నప్పటికీ అస్సాం టీ తోటల కూలీల దయనీయ పరిస్థితులను అధ్యయనం చేసేందుకు వెళ్ళారు. స్థానిక సమస్య అనే నెపంతో కాంగ్రెస్ దీనిని చేపట్టలేదు.

మితవాద కాంగ్రెస్ లక్ష్యాల పరంగా గాక అది అనుసరించిన పద్ధతులు, దాని పని విధానం కారణంగా విమర్శలకు గురయింది. దాని మూలసూత్రం నౌరోజీ మాటల్లో చెప్పాలంటే "బ్రిటిష్ పాలనకు భిన్నమైన పాలన". తొలినాటి కాంగ్రెస్ పిటిషన్లు, ఉపన్యాసాలు, వ్యాసాలు, యితర రచనల తార్కిక వాదనల ద్వారా కాబ్డెన్, బ్రైట్, యెల్, గ్లాడస్టన్ లాంటి ఉదారవాద భావాలు గల ఇంగ్లండ్ ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడానికి యత్నించింది. మితవాదులకు రాజకీయాలంటే తీరిక వేళల్లో చేసే పనిలాంటిది – కాంగ్రెస్ రాజకీయ పార్టీ కాదు. వార్షికంగా 3 రోజులు సదస్సు జరుపుతుంది. ఒకరిద్దరు కార్యదర్శులుంటారు. కొద్దిమంది లాయర్లతో వుండే స్థానిక సంఘాలు సమావేశాలు జరిపి ఆ సంవత్సరానికి కాంగ్రెస్ ప్రతినిధుల్ని ఎన్నుకుంటాయి. కొన్ని తక్షణ సమస్యలపై తీర్మానాలు చేస్తుంటాయి. ఆ తరువాత దీర్ఘ నిద్రలో కూరుకుపోతాయి.

ఇది అందరికీ తెలిసిందే. కాని యిలా ఎందుకు జరుగుతుంది? దీనికి జవాబు తొలినాటి కాంగ్రెస్ నాయకులు, భాగస్వాముల స్వభావం, సామాజిక కూర్పులలో బహుశా దొరకవచ్చు. మితవాద నాయకులు వారి వ్యక్తిగత జీవితాలలో ఇంగ్లీషు వారిని అనుకరించేవారు. వారి వారి వృత్తులలో బాగా పైకి వచ్చినవారు. వారికి రాజకీయ కలాపాలు నిర్వహించేందుకు సమయం మిగలలేదు. వాచా 1887 సెప్టెంబర్ 18న నౌరోజీకి యిలా తన అసంతృప్తిని వెల్లడి చేశారు. "ఫిరోజ్‌షా ఇటీవల తన వృత్తి పనిలో తీరిక లేకుండా వున్నారు. వారు యిప్పటికే సంపన్నులు. తెలాంగ్ కూడా తీరిక లేకుండా వున్నారు. అందరూ డబ్బు పోగు చేసుకొనడంలో నిమగ్నమైతే దేశం ఎలా పురోగమిస్తుంది? వృత్తిలో విజయం ఉదాశీనతను పెంచుతుంది. 1892 కౌన్సిల్ చట్టంలాంటి కొన్ని రాయితీలు సాధించబడ్డాయి గనుక. క్రమంగా పరిస్థితులు మెరుగుపడతాయనే విశ్వాసం కలుగుతుంది. అన్నిటినీ మించి కాంగ్రెస్‌లో పై

స్థాయికి చెందినవారు విలాసవంతమైన జీవిత సరళి అలవరచుకొన్నారు (మెహతా ప్రత్యేక రైల్వే బోగీలో ప్రయాణం చేశారు. జి. ఘోషాల్ 1901లో కలకత్తా కాంగ్రెస్ సదస్సులో తన చొక్కా బొత్తాన్ని పెట్టమని గాంధీని అడిగినట్లు గాంధీ జ్ఞాపకం చేసుకున్నారు. అంతగా ఆంగ్లీకరణ చెందని రనడే కూడా 1886లో 25 మంది సేవకులతో సిమ్లా సందర్శించాడు) ఇలాంటి ధోరణిని క్రింది శ్రేణులు తిరస్కరిస్తాయని భయాందోళనలు వ్యక్తమయ్యాయి. 1890 దశాబ్దం నాటి పునరుద్ధరణ వాద వీరావేశాలు, మత ఘర్షణలు, శాంతి భద్రతల పరిరక్షణ కొరకు బ్రిటిష్ వారిపై ఆధారపడవలసిన పరిస్థితిని కల్పించాయి.

**మితవాద రాజకీయాల దశలు**

ఇప్పటి వరకు ఒకే తరహాలో వున్న విషయాలను గురించి చర్చిస్తూ వచ్చాం. కాని కాలక్రమంలో వివిధ ప్రాంతాలలో ఆసక్తికరమైన మార్పులు సంభవించినట్లు ఆధునిక పరిశోధన స్పష్టం చేస్తుంది. మొత్తం మీద కాంగ్రెస్ తీర్మానాలు గతంలో లాగానే కొనసాగాయి. 1892-1904 మధ్య చేసిన తీర్మానాలలో కౌన్సిల్ సంస్కరణలు చోటుచేసుకోలేదు. కొన్ని రాయితీలు సాధించబడ్డాయి. స్థానిక, సామ్రాజ్యవాద చట్ట సభలలో కాంగ్రెస్ నాయకులు ఎన్నుకోబడ్డారు. ఆర్థికపరమైన విషయాలలో మాటిమాటికీ వచ్చిన కరువులపై ప్రత్తిపై, పన్ను సమస్యపై దృష్టి కేంద్రీకరించబడింది. మొట్టమొదటిసారిగా సామ్రాజ్యవాద చట్టసభలో 1901 బడ్జెట్‌పై గోఖలే ఉపన్యాసం జాతీయవాద ఆర్థిక సిద్ధాంతాన్ని వివరించింది. ప్రజల పరిస్థితులు మెరుగుపడటానికి మారుగా నానాటికీ దిగజారుతున్న ఆ సమయంలో సంపద తరలింపు సిద్ధాంతం బలమైన శక్తిగా పనిచేసిందని బిపిన్ చంద్ర స్పష్టం చేశారు. నౌరోజి కురువృద్ధుడు. వయస్సుతో ఆయన అతివాద భావాలు బలపడ్డాయి. హెచ్.ఎం. హిండ్‌మన్‌లాంటి బ్రిటిష్ సోషలిస్టులతో ఆయన సంబంధాలు పెంచుకున్నారు. రైతుల్ని బుజ్జగించేందుకు ప్రజల్ని ప్రభుత్వం తల్లిదండ్రులలాగా సంరక్షిస్తుందనే భావం పెంచేందుకు వ్యవసాయ తెగలకు వెలుపల వున్న తెగలకు భూమి బదలాయించడాన్ని నిరోధించి ప్రభుత్వం చేపట్టిన పంజాబ్ భూమి పరాధీన చట్టం (1901) లాంటి చర్యలు జటిలమైన భూసంబంధాల సమస్యని కాంగ్రెస్ నాయకులలో కొందరిని పునరాలోచించేలా చేశాయి. హిందూ పట్టణ వ్యాపార వర్గాల ఆధిపత్యంలో గల పంజాబ్ కాంగ్రెస్ ఈ చట్టాల్ని తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ ఈ అంశంపై లాహోర్ సదస్సు తీర్మానం చేయలేదు. అంతేగాక శాశ్వత కౌలు విధానం (Permanent Settlement) అంటే దాదాపు జమిందారులతో ఒక అంగీకారానికి రావడమేనని వాదించి తొలుత తీర్మానాన్ని ప్రతిపాదించిన వారు. అలాగే 1890 దశాబ్దంలో ఆర్.సి. దత్ అధ్యక్షత వహించిన 1899 నాటి సదస్సు రైత్వారీ ప్రాంతాలలో శాశ్వత భూమి శిస్తు విధించాలని, జమిందారి ఆదాయంపై సీలింగ్ విధించాలని తీర్మానం చేసింది. బ్రిటిష్‌వారి రైతాంగ అనుకూల విధానం మాయాజాలమని వెంక్లేన్ యొక్క వివరణాత్మక అధ్యయనం తెలియజేస్తుంది. 1895 బెంగాల్ కౌలుదారి చట్టంలోని కొన్ని జమిందారీ అనుకూల మార్పులకు 1898లో సురేంద్రనాథ్ వ్యతిరేకత కారణంగా కౌన్సిల్ సీటు మునిసిపాలిటీల నుండి జమిదార్లకు మార్చబడింది.

కాంగ్రెస్ నిర్మాణం కార్యకలాపాల విషయానికి వస్తే మితవాద యుగంలో మూడు విస్తృతమైన దశల్ని గమనించవచ్చు. 1892 వరకు హ్యూం జనరల్ సెక్రటరీగా పూర్తి కాలపు ఏకైక చురుకైన కార్యకర్తగా కాంగ్రెస్ కార్యకలాపాలపై ఆధిపత్యం కలిగి వున్న కాలం. హ్యూం కాంగ్రెస్‌కి క్రియాశీలతని అందించారు. ఆ తరువాత సంవత్సరాలలో అది అదృశ్యమయింది. మొదటి ఐదు సదస్సులలో కాంగ్రెస్ హాజరు క్రమంగా పెరిగింది. 1885లో 72 వుండగా 1889 నాటికి 2000కి పెరిగింది. 1887 (మద్రాసు) 1888 (అలహాబాద్) కాంగ్రెస్ సదస్సులు 1890 దశాబ్దపు సదస్సుల కంటే విస్తృత ప్రాతిపదికన జరిగాయని, ప్రజలలో ఆసక్తి పెంచామని వాష్‌బ్రూక్, బేలీల అధ్యయనాలు స్పష్టం చేశాయి. ఉదాహరణకు మద్రాసు కాంగ్రెస్‌కి నిధులు ఒకటి నుండి 8 అణాల లోపు 8000 మంది యివ్వగా వసూలైన మొత్తం రూ. 5,500, రూ. 2ల నుండి 30లలోపు విరాళాలలో వసూలైన మొత్తం రూ. 8000 కౌన్సిళ్ళ ఎన్నికల కొరకు పరీక్షల ద్వారా ఉద్యోగుల నియామకాలు లాంటి కాంగ్రెస్ డిమాండ్లు సయ్యద్ అహమ్మద్‌కు వ్యతిరేకంగా బద్రుద్దీన్ త్యాబ్జితో గల వ్యక్తిగత సంబంధాల్ని ఉపయోగించుకొని 1887–88లో హ్యూం ముస్లిం మద్ధతుని కూడగట్ట యత్నించారు. ఏ మతం వారైనా మెజారిటీ తిరస్కరిస్తే తీర్మానం తిరస్కరింపబడుతుందని 1887 కాంగ్రెస్ సదస్సుచే ఒక సూత్రీకరణ చేయించారు. 1887లో రైతుల మద్దతుని కూడగట్టేందుకు రెండు కరపత్రాల్ని తయారుచేసి 12 ప్రాంతీయ భాషల్లోకి అనువదింప చేశారు. ఒకటి హ్యూం స్వయంగా రాశారు. గ్రామాలలోని పాలనా వ్యవహారాల్ని బహిర్గతం చేస్తూ రాసిన ఊహాజనితమైన సంభాషణ. రెండవది అప్పటి చట్టసభల బూటకంపై వీర రాఘవాచారి రాసిన కరపత్రం 30,000 కరపత్రాలు కాపీలు అమ్ముడుపోయాయి. 1905 వరకు అలాంటి ప్రయత్నాలు జరగలేదు.

కాని అలాంటి ప్రయత్నాలు తాత్కాలికమైనవి. అంతగా జయప్రదం కాలేదు. అలీఘర్ ముస్లిం కులీనులు ఎన్నికల ద్వారా ఏర్పడే కౌన్సిళ్ళ వలన తాము చాలా నష్టపోయామని, కౌన్సిళ్ళలో హిందూ ఆధిపత్యం సాగుతుందని, ఇంగ్లీషు చదువులో హిందువులు ముందుండటం వలన పోటీ పరీక్షల ద్వారా ఉద్యోగాల నియామకాలు వారికి అనుకూలంగా వుంటాయని భావించారు. 1893 దొమ్మీలు ముస్లింల పరాయీకరణకి బలాన్ని చేకూర్చాయి. 1885, 1892 మధ్య కాలంలో కాంగ్రెస్‌లో ముస్లిం ప్రతినిధుల శాతం 13.5 శాతం వుండగా 1893–95 కాలానికి 7.1 శాతానికి తగ్గింది. ఈ 7.1 శాతం కూడా లక్నో సదస్సుకి (1899) స్థానిక ముస్లింలు ఎక్కువగా రప్పించడం వలన సాధ్యమయింది. కానీ పోటీగా ముస్లిం రాజకీయ సంస్థగా స్థాపించబడలేదు గనుక కాంగ్రెస్ నాయకులు ఆందోళన చెందలేదు. థియోడర్ బెక్ స్థాపించిన మహమ్మదన్ ఆంగ్లో ఓరియంటల్ డిఫెన్స్ అసోసియేషన్ (1893) కొద్ది కాలమే మనగలిగింది. 1887–88 తరువాత ముస్లింల్ని బుజ్జగించడానికి ప్రత్యేక ప్రయత్నం జరిగినట్లు లేదు. అధికారుల అనుమానాలు ప్రతికూలత కారణంగా హ్యూం రైతాంగ ఎత్తుగడ కూడా వెంటనే వదిలి వేయబడింది. ఉత్తరప్రదేశ్ లెఫ్టినెంట్ గవర్నర్ అక్లాండ్ కాల్విన్ అలహాబాద్ సదస్సు జరగకుండా ఆటంకపరిచే యత్నాలు చేశాడు. 1888 నవంబర్‌లో డఫరిన్ తన ప్రఖ్యాతమైన ఉపన్యాసంలో కాంగ్రెస్‌ని అత్యంత మైనారిటీ సంస్థగా నిరసించారు. నిస్సందేహంగా

అప్పటికి కాంగ్రెస్ యింకా క్షీణించే దశలో వుంది. భయవిహ్వలతక లోనైన కాంగ్రెస్ నాయకత్వం హ్యూంని త్రోసివేసింది. ప్రజలతో సంబంధాల ప్రయత్నం విడనాడింది.

నిస్పృహ చెందిన హ్యూం అనివార్యంగా రైతాంగ విప్లవం వస్తుందని (కాంగ్రెస్ శక్తివంతంగా ఎదగకపోతే బ్రిటిష్‌వారు బాధ్యతాయుతంగా వ్యవహరించకపోతే) జోస్యం చెప్పారు. 1892 భారతదేశం వదిలి ఇంగ్లాండ్ వెళ్ళారు. అధికారులు హ్యూం జోస్యాన్ని ఆకతాయితనంగా కొట్టిపారేశారు. కాంగ్రెస్ నాయకులు దీనితో తమకెలాంటి సంబంధం లేదని త్రోసిపుచ్చారు. 1890 దశాబ్దంలో కాంగ్రెస్‌ని మందకొడితనం ఆవరించింది. సురేంద్రనాథ్, డబ్ల్యు.సి. బెనర్జీ, ఆనందాచార్లు, ఫిరోషా మెహతాలతో కూడిన ముఠా నిర్ణయాలు చేసింది. తెర వెనుక రనడే సలహాదారుడిగా వున్నాడు. 1899 నుండి కాంగ్రెస్‌లో మెహతా చురుకైన పాత్ర నిర్వహించాలని నిర్ణయించుకొని తన ఆధిక్యతను చాటుకొనేవారకు సమర్ధవంతమైన నాయకత్వం ముందుకు రాలేదు. ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయం లేకపోవడంతో దేశం వదిలివెళ్ళి పోయినప్పటికీ జనరల్ సెక్రటరీగా హ్యూం కొనసాగారు. వెడర్‌బరన్, హ్యూం నౌరోజీల నాయకత్వంలోని కాంగ్రెస్ బ్రిటిష్ కమిటీ తన పత్రిక 'ఇండియా' ద్వారా ఇంగ్లండ్‌లో ప్రచారం సాగించింది. అంతంత మాత్రంగా వసూలయ్యే కాంగ్రెస్ నిధులు (వార్షికంగా 32,000) లండన్ కమిటీకి పంపించబడేవి. 1895 నుండి దీన్‌షా మెహతాని జాయింట్ సెక్రటరీగా నియమించినప్పటికీ ఆయనకు నామమాత్రంగా డబ్బు కేటాయించబడింది. అయినప్పటికి ఇంగ్లండ్‌లో కూడా 1892 చట్టం ద్వారా కల్పించబడిన ఆశలు, 1893లో ఒకేసారి పరీక్ష జరపడాన్ని బలపరుస్తూ కామన్స్ సభ చేసిన తీర్మానం ప్రత్యేకించి టోరీలు అధికారంలోకి రావడం, 1895 ఎన్నికలలో నౌరోజీ సీటు కోల్పోవడంతో చెల్లా చెదురయ్యాయి. ఈ కాలంలో కాంగ్రెస్‌పై గల ఆసక్తి బలహీనపడింది. సదస్సులకు ప్రతినిధుల సంఖ్యని తగ్గకుండా చూసేందుకు స్థానిక ప్రతినిధుల శాతాన్ని పెంచడం జరిగింది. స్థానిక ప్రతినిధుల శాతం 1885-93లో 43.5 నుండి 59.5 శాతం వుండగా 1894-1903 కాలంలో యిది 64.7 నుండి 88.6 శాతానికి పెరిగింది. అంతేగాక ఇండియా అసోసియేషన్ పూనా సార్వజనిక సభ, మద్రాసు మహజన సభ లాంటి స్థానిక ప్రాంతీయ సంస్థల కార్యకలాపాలు కూడా 1890 దశాబ్దం చివరలో తగ్గుముఖం పట్టాయి. ఆ స్థితిలో మితవాదులతో కొత్త ఊపిరులూదేందుకు కర్జన్ రెచ్చగొట్టే విధానాలు, ఆకర్షణీయమైన వ్యక్తిత్వం, యువకుడు (తిలక్ కంటే 10 సం॥లు చిన్నవాడు), పూర్తికాలం ప్రజా సేవకు వినియోగించగల నిస్సందేహస్పదమైన ఆత్మత్యాగం, అంకితభావం గల కొత్త నాయకుడు గోఖలే ముందుకి రావడం అవసరమయ్యాయి.

### తీవ్రవాద మూలాలు

కాంగ్రెస్ కుప్పకూలనున్నదని కర్జన్ 1900 నవంబర్‌లో (సెక్రటరీ ఆఫ్ స్టేట్ హేమిల్టన్‌కి కర్జన్ 1900 నవంబర్ 18న రాసిన లేఖ) అంచనా వేశాడు. అందుకు ఆయనకి కన్పించిన కారణం - మితవాద కాంగ్రెస్ జాతీయవాద భావాలలోని కొద్ది భాగానికి మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నది. కాని బ్రిటిష్‌వారి అప్రతిష్ట కరువు కాటకాలతో, కర్జన్ దుందుడుకు

చర్యలతో పెరిగింది. రాజకీయ కార్యకలాపాల పునాది త్వర త్వరగా విస్తృతమయింది. దేశభాషల వార్తా పత్రికల సర్క్యులేషన్ 1885లో 2,99,000 వుండగా అది 1905 నాటికి 8,17,000కి పెరిగింది. పలు కారణాల రీత్యా కాంగ్రెస్‌ని విమర్శించే కలకత్తా వంగవాసి, పూనాకి చెందిన కేసరి కల్ లాంటి పత్రికలు ప్రజాదరణ పొందడం గమనార్హం. తీవ్రవాదం పెరగడానికి పరిస్థితులు పరిపక్వమయ్యాయి.

కాంగ్రెస్‌ని అదుపులో వుంచుకొనేందుకు కాంగ్రెస్‌లోకి వచ్చేవారు, పోయేవారి మధ్య ముఠా తగాదాలు తీవ్రవాదం పుట్టడానికి ప్రధాన కారణమని, ఇటీవలి కాలంలో కేంబ్రిడ్జి చరిత్రకారులు నిరూపించ యత్నిస్తున్నారు. 1890 దశాబ్దంలో కాంగ్రెస్‌లో ముఠా తగాదాలకు కొరత లేదు. బెంగాల్‌లో సురేంద్రనాథ్ ఇండియన్ అసోసియేషన్ 1875-76లో ఇండియన్ లీగ్‌పై ఆధిక్యత సాధించినప్పటి నుండి సురేంద్రనాథ్, ఆయన పత్రిక వంగవాసి మోతీలాల్ ఘోష్‌కి చెందిన అమృత బజార్ పత్రికలపై నిరంతరం కత్తులు దూస్తూనే వున్నాయి. ప్రత్యేకించి పంజాబులో ముఠా కీచులాటలు మరీ ఎక్కువ లాహోర్ బ్రహ్మ సమాజంలోని మూడు గ్రూపులు, ఆర్య సమాజంలోని పెద్ద చీలిక లాలా హరికృష్ణలాల్, లాలాలజపతిరాయ్ మధ్య ఘర్షణలతో పంజాబ్ కాంగ్రెస్ ముఠా తగాదాలతో కునారిల్లుతున్నది. మద్రాసు రాజకీయాలు మూడు గ్రూపుల ఘర్షణగా వున్నాయని వాష్ బ్రూక్ పేర్కొన్నారు. అవి (1) మైలాపూర్ గ్రూపు (1880లో వి. భాష్యం అయ్యంగార్, ఎస్. సుబ్రమణ్య అయ్యర్, తరువాత వచ్చి చేరిన వి. కృష్ణస్వామి అయ్యర్ గ్రూపు) (2) ఎగ్మోర్ ప్రత్యర్థులు (3) మద్రాసు నగరానికి చెందినవారు (సి. శంకరన్ నాయర్, కస్తూరి రంగ అయ్యంగార్). మద్రాసుకి వెలుపల కోస్తా ఆంధ్రకి చెందిన టి. ప్రకాశం, కృష్ణారావు, ట్యుటికోరన్‌కి చెందిన చిదంబరం పిళ్ళై, పూనాలో కూడా 1880 దశాబ్దం చివరలో అగార్కర్, గోఖలేలతో తిలక్ వైరానికి కారణం దక్కన్ ఎడ్యుకేషన్ సొసైటీపై ఆధిపత్యం కొరకు గాని, రాజకీయ సంఘ సంస్కరణ సమస్యలపై విభేదాలు కావని కేంబ్రిడ్జి చరిత్రకారులు వాదిస్తున్నారు.

కాంగ్రెస్ నిధుల కొరత వేధిస్తున్నది. వార్షిక సమావేశాలు జరుపుకొంటున్నవి. అధికారం, అవకాశాలు గల రాజకీయ పార్టీ కూడా కాదు. మరి అసంతృప్తివాదులు కాంగ్రెస్‌ని కైవసం చేసుకోవాలని ఎందుకు ఆరాటపడినట్లు? దానికి ఆచరణలో పెట్టదగిన ప్రత్యామ్నాయ విధానాలు, ఆదర్శాలు వున్నాయి. గనుకనే అలా చేసింది. అన్నిటినీ మించి 1890 దశాబ్దంలో ముందుకు వస్తున్న మితవాద రాజకీయాలపై ప్రత్యేకించి, ఆ తరువాత తీవ్రవాద స్థావరాలుగా ఎదిగిన బెంగాల్, పంజాబ్, మహారాష్ట్రాలపై క్రమబద్ధమైన విమర్శ చేయడంలో కేంబ్రిడ్జి చరిత్రకారులు విఫలమయ్యారు.

ఈ నూతన వైఖరి (కేంబ్రిడ్జి) మితవాద కాంగ్రెస్‌ని రెండు రకాలుగా విమర్శించింది. బ్రిటిష్ ప్రజాభిప్రాయాన్ని అనుకూలంగా మార్చుకొనడానికి చేసే ప్రయత్నం నిష్ఫలం, గౌరవప్రదమైనది కాదు. ఇది సాధారణ ప్రజల నుండి దూరం చేయబడిన ఇంగ్లీషు చదువు చదివిన వారి ఉద్యమం తప్ప మరొకటి కాదు. ప్రార్థనలు, విజ్ఞప్తులకు బదులుగా స్వావలంబన

నిర్మాణాత్మకమైన పని, కొత్త నినాదాలయ్యాయి. స్వదేశీ పరిశ్రమల ప్రారంభం, జాతీయ విద్యను బోధించుట, గ్రామాలలో నిర్దిష్టమైన పని యొక్క అవసరాన్ని నొక్కి చెప్పటం. స్వయం సహాయం, దేశీయ భాషల వాడకం, గ్రామ సంతలు, మేళాలు లాంటి సాంప్రదాయ ఆచార వ్యవహారాల్ని పాటించడం, హిందూ పునరుద్ధరణ వాద ధోరణులు – విద్యావంతులకు సాధారణ ప్రజలకు మధ్య గల అగాధాన్ని పూడ్చగల పద్ధతులుగా భావించబడ్డాయి. మితవాద ఆందోళనకు వ్యతిరేకంగా వచ్చిన స్పందన మూడు రూపాలు తీసుకొన్నది. ఇవి 1905 తరువాత స్పష్టంగా వ్యక్తమయ్యాయి. కాని 1890ల నుండి అవి బీజ రూపాలలో కనిపించాయి. నిర్మాణాత్మకమైన పని ద్వారా స్వీయాభివృద్ధి, విదేశీ పాలనని ఎదుర్కొనడానికి మారుగా విస్మరించడం, రాజకీయ అతివాదం, కొత్త పద్ధతుల ద్వారా స్వరాజ్యం కొరకు ప్రజల్ని సమీకరించే ప్రయత్నాలు, వ్యక్తిగత హింస, కుట్రల ద్వారా స్వతంత్ర సాధనకు దగ్గరదారులు వెతికే విప్లవాత్మక టెర్రరిజం.

మితవాద రాజకీయాలపై మొదట క్రమబద్ధమైన విమర్శ చేసినవాడు అరవింద ఘోష్. ఆయన 1893 –94 కాలంలో "పాత దీపాలకు బదులు కొత్త దీపాలు" శీర్షికను వరుసగా వ్యాసాలు ప్రచురించాడు. అప్పుడు బరోడాలో నివసించారు. ఇంగ్లీషు ఆచార సాంప్రదాయాలతో పెంచబడి ఇంగ్లాండు నుండి తిరిగి వచ్చారు. ఇంగ్లీషు పద్ధతులను వ్యతిరేకంగా తీవ్రంగా స్పందించారు. మితవాదులు అభిమానించిన ఇంగ్లీషు రాజ్యాంగ పద్ధతులలో నెమ్మదిగా సాగే అభివృద్ధి నమూనాని అరవింద తిరస్కరించారు. కాంగ్రెస్ పై దాడి చేశారు. యూరపు అనుభవం నుండి స్వీకరించిన వర్గ చైతన్యాన్ని ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రాతినిధ్యం వహిస్తున్న మధ్యతరగతికి శ్రామిక వర్గానికి మధ్య సంబంధాలు ఏర్పరచడం అన్నిటికంటె కీలకమన్నారు. The only policy that has any chance of eventful success is to base his collge upon an adrorit management of the proletaiate కాని అరవింద అభిప్రాయాన్ని అనుసరించి కార్మికవర్గం అంటే పట్టణ గ్రామీణ ప్రాంతాలకు చెందిన సాధారణ ప్రజలు. అరవింద హిందు పునరుద్ధరణ వాదాన్ని సమర్థించాడు. ఇది తీవ్రవాదుల్ని ఆకర్షించింది. శతాబ్దాంతానికి అరవింద రహస్య సంస్థల్ని స్థాపించే ప్రయత్నాలు ప్రారంభించారు. జోగేంద్రబెనర్జీ, బృందాకుమార్ ఘోష్‌లను రాయబారులుగా (emissories) బెంగాల్ పంపించారు. బెంగాల్ విభజన వ్యతిరేక ఉద్యమం విస్తృతరూపం తీసుకొంటున్న తరుణంలో ఆయన విస్తృత ప్రజా ప్రతిఘటనోద్యమానికి రూపకల్పన చేయ యత్నించారు. ఇలాంటి ఊగిసలాట ధోరణులు యితర తీవ్రవాద నాయకులలో కూడా చూడవచ్చు.

బెంగాల్‌లో కాంగ్రెస్‌పై భ్రమలు తొలగిపోయినట్లు అశ్వనీకుమార్‌దత్ ప్రకటించాడు. 1897 అమరావతి సదస్సుకి మూడు రోజుల తమాషాగా అభివర్ణించారు. దత్ బారిసాల్ పాఠశాల ఉపాధ్యాయుడు. జిల్లాలో చేపట్టిన సామాజిక కార్యకలాపాలతో విస్తృతమైన అనుచరవర్గాన్ని తయారు చేసుకొన్నారు. 1905 నాటి స్వదేశీ ఉద్యమానికి ఆ ప్రాంతాన్ని బలమైన స్థావరంగా చేయగలిగాడు. బెంగాల్ గ్రామీణ ప్రాంతాల అందచందాలకు, ప్రజల జీవితాన్ని వర్ణిస్తూ, కాంగ్రెస్‌ని Mendicouncy విమర్శిస్తూ స్వదేశీ పరిశ్రమల ద్వారా

స్వావలంబన, జాతీయ విద్య మేళాలు, జాతాలు ద్వారా ప్రజలతో సంబంధాలు, మాతృభాషలో విద్యా రాజకీయ కార్యకలాపాలు కొరకు పిలుపునిస్తూ, దేశభక్తిని ప్రబోధిస్తూ కథలు, కవితలు రాస్తూ బెంగాలీ సాహిత్య కారులలో అగ్రగామిగా పనిచేశారు. 20వ శతాబ్దపు తొలి సంవత్సరాలలో వివేకానందుని శిష్యురాలు సిస్టర్ నివేదిత (మార్గరెట్ నోబుల్) తన ఐర్లాండు యితర యూరపు దేశాల విప్లవోద్యమాలతో గల అనుభవాలలో వివేకానందుని సందేశాన్ని రాజకీయంగా వ్యాఖ్యానించింది. బెంగాలీ కులీనుల దృష్టి స్వదేశీ పరిశ్రమల స్థాపన వైపు మరలింది. ప్రముఖ శాస్త్రవేత్త ప్రపుల్ల చంద్రరాయ్ 1893లో బెంగాల్ కెమికల్స్ ప్రారంభించారు. సతీష్ ముఖర్జీ తన డాన్ సొసైటీ ద్వారా రవీంద్రనాథ్ తన శాంతినికేతన్ ఆశ్రమం ద్వారా దేశీయ నియంత్రణలో విద్యారంగంలో కొత్త పోకడలపై ప్రయోగాలు చేశారు. సురేంద్రనాథ్, మోతీలాల్ ఘోష్‌ల ముఠా కీచులాటల కంటే పైన చెప్పిన అంశాలన్నీ బెంగాలీ అతివాదానికి దోహదపడ్డాయి.

పంజాబులో హరికిషన్‌లాల్ (పంజాబ్ నేషనల్ బ్యాంకు స్థాపకుడు) ఆర్య సమాజవాదులు 1890 దశాబ్దంలో స్వదేశీ పరిశ్రమల కొరకు చురుకుగా పనిచేశారు. 1893 నుండి పంజాబు కాంగ్రెస్ ప్రతినిధులు కాంగ్రెస్ సంస్థపై బొంబాయి బెంగాలీ ఆధిపత్యం తగ్గించేందుకు కాంగ్రెస్‌కి నిబంధనావళి రాజ్యాంగం కొరకు పట్టుబడుతూ వచ్చారు. 1899 సదస్సులో భారత కాంగ్రెస్ కమిటీని ఏర్పాటు చేయగలిగారు. కాని రెండు సంవత్సరాల తరువాత ఫిరోజ్‌షా మెహతా ముఠా ఈ కమిటీని విచ్ఛిన్నం చేసింది. ఇంగ్లీషు చదువు చదివిన కొద్దిమంది కాంగ్రెస్ సంస్థపేరుతో వార్షిక సదస్సులు జరుపుకొనడానికి బదులుగా సాంకేతిక విద్య, పారిశ్రామిక స్వావలంబన కొరకు కృషి చేయాలని లజపతిరాయ్ 1901 లో కాయస్థ సమాచార్ పత్రికకు రాసిన రెండు వ్యాసాలలో స్పష్టం చేశారు. కాంగ్రెస్ బాహాటంగా ధైర్యంగా హిందువులపై ఆధారపడాలని ముస్లింలతో ఐక్యత కేవలం భ్రమ అని వాదించారు.

అతివాదాన్ని ప్రజ్వలింపచేసినవాడు బాలగంగాధర తిలక్, సనాతన మత సాంప్రదాయాల్ని ప్రజలతో సంబంధాల కొరకు ఒక పద్ధతిగా ప్రవేశపెట్టడం (వివాహ వయస్సు సమస్యపై సంస్కర్తలతో విభేదించారు. 1894 నుండి గణపతి ఉత్సవాలను ప్రారంభించారు.) దేశభక్తియుత చారిత్రక సంప్రదాయాల్ని జాతీయవాద ప్రతీకగా అభివృద్ధి పరచాడు. (1896 నుండి శివాజీ ఉత్సవాలు నిర్వహించారు) 1896 -97లో శిస్తు చెల్లింపు నిరాకరణ ప్రయోగశీలంగా ప్రారంభించారు. 1896 లో విధించిన ప్రతీకార పత్తి ఎక్సైజ్ సుంకాలపై పశ్చిమ భారతదేశం తీవ్రంగా స్పందించింది. తిలక్ బహిష్కరణ ఉద్యమం ప్రయోగాత్మకంగా చేపట్టాడు. 1905 తరువాత జాతీయ పోరాటంలో అది ప్రధాన భారమయింది. 'సంవత్సరానికోక మారు కప్పలాగా బెక బెక లాడితే మనం విజయం సాధించలేం' అని తిలక్ స్పష్టంగా ప్రకటించారు. తిలక్ సహాయ నిరాకరణ, శాసనోల్లంఘనం లాంటి పద్ధతుల్ని గురించి ఆలోచనలు చేస్తున్నారు. 1902లో ఒక ఉపన్యాసంలో తిలక్ ఎలా చెప్పాడు. "అణచివేతకు

నిరాదరణకు గురయినప్పటికీ మీరు తలచుకొంటే పాలనా వ్యవస్థని స్తంభింపచేయగల శక్తి మాకు వుందని గ్రహించాలి. రైలు మార్గాలు, టెలిగ్రాములు నిర్వహణ మాదే, పన్నులు వసూలుచేసేది మీదే..”

1905 ముందు, ఆ తరువాత ప్రజల భాగస్వామ్యానికి అవకాశాలు తగ్గినప్పుడు మితవాద పద్ధతులకు ప్రత్యామ్నాయంగా వ్యక్తిగత హింసావాదం ముందుకి వచ్చింది. రాజ్యాంగ బద్ధమైన ఆందోళన, టెర్రరిజం విభిన్న ధృవాలు. కాని ఈ రెండూ కూడా జాతీయవాదుల కార్యకలాపాల ఉమ్మడి పునాదిలో కలగలసివున్నాయి. నిజమైన ప్రజా ఉద్యమం దిశగా ముందుకు సాగడం కంటే ఒకదాని నుండి మరొకదానికి మార్పుచెందడం సులభం. సామాజికంగా తక్కువ ప్రమాదకరమైనది. కాబట్టి 1897 పూనా ప్లేగు పరిస్థితి పట్ల బ్రిటీషు పాలకులు వ్యవహరించిన విధానం ప్రజా ఉద్యమానికి దారితీయక విప్లవాత్మక టెర్రరిజానికి దారితీసింది. ర్యాండో, అయరెస్ట్‌ఎ చాపేకర్ సోదరులచే హత్య చేయబడ్డారు. దామోదర్ చాపేకర్ ఆలోచనలు దేశభక్తి, బ్రాహ్మణ పునరుజ్జీవవాదం, సంఘసంస్కర్తల పట్ల ద్వేషంలాంటి వాటితో కలగాపులగంగా వున్నాయి.

బీజాపూర్ సైన్యాధికారి అఫ్జల్‌ఖాన్‌ని శివాజీ హత్య చేయడాన్ని సమర్థిస్తూ తిలక్ కేసరి పత్రికలో వ్యాసం రాసినందుకు బ్రిటిషుపాలకులు తిలక్‌పై రాజద్రోహం నేరం బనాయించారు. తిలక్‌కి రెండు సంవత్సరాల జైలుశిక్ష విధించబడింది. కాంగ్రెస్, ప్రజలు నిరసించారు. పౌరహక్కులు పత్రికాస్వేచ్ఛ ప్రమాదంలో పడిందని గుర్తించారు. మహారాష్ట్రలో రాజకీయాల పురోగమనం మందగించింది. మరలా కర్జన్ దుందుడుకుతనంతో 1905లో బెంగాల్ విభజన చేసిన తరువాత భారతదేశంలోని గణనీయమైన భాగంతో పాటు మహారాష్ట్ర రాజకీయాలు ఊపందుకొన్నాయి.

## అధ్యాయము - 4

# రాజకీయ సాంఘిక ఉద్యమాలు 1905 -1917

### వైస్రాయిగా కర్జన్

వెల్కార్ కర్జన్ పరిపాలన అంటే సామర్థ్యానికి ప్రతీకగా పేరుగాంచింది. "పరిపాలనా సామర్థ్యం నా దృష్టిలో పాలితుల సంతృప్తికి పర్యాయపదం." వైస్రాయి 1904 బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. ఫలితంగా బెంగాల్ విభజన వ్యతిరేక పోరాటంతో భారత జాతీయవాద చరిత్రలో నూతనదశ ప్రారంభమయింది.

బిపిన్ చంద్రపాల్ 'నూతన భారతదేశం' కర్జన్ విధానాలపై ఈ క్రింది సమకాలీన విశ్లేషణ చేసింది. "భారతదేశ ప్రజలకు అంచెలంచెలుగా స్వయం ప్రతిపత్తిని సాధించడం రిప్పన్ ఆదర్శం. భారత ప్రభుత్వానికి స్వయం ప్రతిపత్తిని సాధించడం కర్జన్ ఆదర్శం."(ఆగష్టు20, 1903) రెండు సంవత్సరాల తరువాత అదే పత్రిక ప్రజల సుహృద్భావాన్ని పొందడానికి, సాధారణ ప్రజలు, విద్యావంతులైన మధ్యతరగతుల మధ్య శక్తివంతమైన కలయికను నిరోధించడానికి కర్జన్ చర్యలు చేపట్టాడని ప్రచురించింది. కర్జన్ తాను తీసుకొన్న నిర్ణయాలకు సెక్రటరీ ఆఫ్ స్టేట్‌నే గాక మంత్రి వర్గాన్ని కూడ బాధ్యులుగా చేయగలిగారు.

**విదేశాంగ విధానం**

విదేశీ సంబంధాల విషయంలో కర్జన్ భారతదేశం నుండి విధానాల రూపకల్పన చేసి ఆదేశించేవారు. 1907లో ఇంగ్లాండు, ఫ్రాన్స్, రష్యాల మధ్య సుహృద్భావం పెంపొందించుకొనేందుకు త్రైపాక్షిక చర్యలు జరిపి తొలి చర్యలు చేపట్టిన సమయంలో కర్జన్ రష్యా పట్ల తనకు గల తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేసి బ్రిటిష్ ప్రభుత్వాలను ఇరకాటంలో పెట్టాడు. పర్షియన్ గల్ఫ్, సేస్టాకలలో బ్రిటన్ ప్రయోజనాలను కాపాడే ప్రాంతాలను నెలకొల్పాలనే ఆకాంక్ష పలుమార్లు వ్యక్తం చేశారు. లండన్ చాలా సంశయించిన మీదట యితర శక్తుల్ని

హెచ్చరిస్తూ గల్ఫ్‌కి సంబంధించినంతవరకు మన్రో సిద్ధాంతం తరహాలో ప్రకటన చేయడానికి అంగీకరించింది. ఆ ప్రాంతంలో జెండా ఊపే బాధ్యత కర్జన్‌కు అప్పచెప్పింది. 20వ శతాబ్దపు ఇంధన రాజకీయాల రీత్యా కువాయిట్, బహ్రైన్‌లపై బ్రిటిష్ ప్రభావ విస్తరణ చాలా కీలకమైనది. నూతన ఆఫ్ఘన్ అమీర్ హబీబుల్లా పాత ఆయుధాలపై సబ్సిడీలపై ఒత్తిడి తెచ్చినప్పుడు వైస్రాయి ఆశించిన విధంగా డ్యురాండ్ సరిహద్దు ఒప్పందంపై తిరిగి చర్చలు జరపకుండా కర్జన్ ఖాందహార్‌పై సైనికచర్య ప్రతిపాదన చేశారు. కలతచెందిన ఛాంబర్లేన్ కర్జన్ వివాదంలోకి లాగుతాడని ఆందోళన చెందాడు. 1904 లో కాబూల్‌కి రాయబారానికి వెళ్ళిన లూయిస్ డానే పాత ఒప్పందాన్ని దృఢపరచుకొని తిరిగి వచ్చాడు. మాటిమాటికి మంత్రివర్గం చేసిన హెచ్చరికల్ని పెడచెవినబెట్టి టిబెట్‌పై యంగ్‌హస్బెండ్ దాడి (1903–04) లాషా వరకు చొచ్చుకుపోయింది. రష్యాకి చెందిన రెండు తుపాకులు మాత్రం లభ్యమయ్యాయి. పెద్ద మొత్తంలో నష్టపరిహారం చెల్లించాలని చుంబీలోయ 75సం॥లు తన అధీనంలో ఉండాలని ఒత్తిడి తెచ్చారు.

యితర విదేశీ ప్రభావం టిబెట్‌పై పడకూడదని షరతులు విధిస్తూ ఒక వాణిజ్య ఒప్పందం మెడ మీద కత్తిపెట్టి సాధించాయి. కాని మంత్రివర్గం నష్టపరిహారాన్ని చుంబీలోయ ఆక్రమణ కాలాన్ని తగ్గించింది.

**పరిపాలనా సంస్కరణలు**

అవినీతిని తగ్గించి పాలనా సామర్థ్యాన్ని పెంచేందుకు అట్టహాసంగా ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. కాని ఆచరణలో కార్యాలయ సామగ్రి ఖర్చు రెట్టింపయింది. కర్జన్ తన కింది వారిపై అధికారిక ప్రకటనలలోను ప్రైవేటు ఉత్తరాలలోను కటువైన వాఖ్యలు చేసేవాడు. ఈనాటికీ చరిత్రకారులు వాటిని ఆస్తకికరంగా చదువుతుంటారు. ఫలితంగా మనస్ఫూర్తిగా పనిచేసే అధికార బృందం అభివృద్ధి చెందలేదు. వైస్రాయి కార్యనిర్వాహక బృందంలో మిలిటరీ సప్లై మెంబరు యొక్క స్థాయి, ఎంపికపైకి బేనర్‌తో వచ్చిన చాలా చిన్న వివాదం కారణంగా కర్జన్ 1905 ఆగష్టులో రాజీనామా చేశాడు. అనవసరమైన వివాదాలు కొనితెచ్చుకోవడం కర్జన్‌కు అలవాటు. స్వదేశీ సంస్థానాదీశులు విదేశాలు వెళ్ళేందుకు అనుమతి పొందాలని షరతు విధించాడు. బరోడా గైక్వాడ్ సర్.సి. దత్తును నియమించి వైస్రాయికి కోపం తెప్పించాడు. విదేశాలకు అనుమతి పొందకుండా వెళ్ళాడు. ఈ వ్యవహారంలో ప్రభుత్వమే వెనకడుగు వేయవలసి వచ్చింది.

వరుసగా వచ్చిన కరువుకాటకాల చివరలో కర్జన్ పాలన ప్రారంభమయింది. వాటిలో చివరిది 1899 –1900 లో సంభవించింది. (ప్లేగువ్యాధి కొనసాగించి, 1904 లో ప్లేగు వ్యాధితో పదిలక్షలకు పైగా ప్రజలు చనిపోయారు). పరిపాలన మొదట సాగించి నాణేల ముద్రణపై నియంత్రణ విధించడంతో వెండి రూపాయి విలువ తగ్గడం ఆగిపోయింది. రూపాయి విలువ తగ్గడం వలన హోంఛార్జీలు అదనపు భారంగా లేవు. పన్నులపై రాయితీలు గూడా సాధ్యమయింది. 1899 –1900 కరువు తరువాత భూమిశిస్తు మాఫీ చేయించింది. కాని కర్జన్ కరువు కాటకాలకు కారణం వాతావరణ పరిస్థితులు కాని అదనపు పన్నులు కాదని

వాదించి శాశ్వత కౌలు విధానం కొరకు కాంగ్రెస్ చేసిన విజ్ఞప్తులను తిరస్కరించారు. ఉప్పు పన్ను తగ్గించబడింది. ఆదాయపు పన్ను చెల్లింపు పరిమితి రు. 500ల నుండి రు. 1000లకు పెంచబడింది. ప్రభుత్వం రైలు మార్గాల నిర్మాణం త్వరితం చేసింది. రైల్వేబోర్డును స్థాపించింది. 6100 మైళ్ళ రైలు మార్గాలను నిర్మించింది. (ఏ వైస్రాయి కాలంలోనూ జరగనంత రైలు మార్గాల విస్తరణ జరిగింది) 1901 –1903 నీటి పారుదల కమిషన్ ద్వారా నీటి పారుదలపై ఎక్కువ శ్రద్ధ వహించింది. 1905లో వాణిజ్య పరిశ్రమల శాఖని ప్రారంభించడం, వ్యవసాయ పరిశోధన కొరకు పరిశోధనా సంస్థ ఏర్పాటు – కర్జన్‌కు ఆర్థిక అంశాలపై గల ఆసక్తికి ఉదాహరణలు. వీటన్నింటిలోనూ తెల్లవాళ్ళు, ఎంపికచేయించిన కొద్దిమంది భారతీయులు ప్రయోజనాలు పొందారు. ఉదాహరణకు కొత్త రైలు మార్గాలు అంటే ఇంగ్లాడులో గాని భారతదేశంలో గాని బ్రిటిషు సంస్థలకు ఇంజనీరింగు కాంట్రాక్టులు లభించడం. భారతదేశంలో ఆదాయపు పన్ను చెల్లించేవారిలో ఇంగ్లీషు వారు ముఖ్యమైన భాగంగా వుంటారు. 1899లో యూరోపియన్ బీట్‌షుగర్‌పై దిగుమతి సుంకంపై విధించి స్వేచ్ఛా వాణిజ్య విధానాల నుండి వైదొలగడం కూడా మారిషస్ పెంపకం దార్లకు బెగ్‌సూదర్‌లేండ్, కంపెనీ చక్కెర ఫ్యాక్టరీల బ్రిటిష్ యజమానులకు లాభాలు తెచ్చిపెట్టింది. రైతుల ఆస్తులు పట్టణ వ్యాపారులకు బదిలీ చేయడాన్ని అదుపుచేసే పంజాబు భూమి పరాయికరణ చట్టం (1901) రైతు రుణాల కొరకు సహకార పరపతి సంఘాల్ని ప్రోత్సహిస్తూ 1904లో చేసిన చట్టం – ప్రజల కొరకు పాలికుడు పితృవాత్సల్యంతో చేపట్టిన చర్యలకు ప్రాతినిధ్యం వహిస్తాయి.

పంజాబు రైతులలో అత్యధికులు ముస్లింలు లేక సిక్కులు. పట్టణ వ్యాపారులలో అత్యధికులు హిందువులు. కాంగ్రెస్ నాయకులకు పట్టణ హిందూ వ్యాపారులతో సంబంధాలున్నాయి. కాబట్టి పంజాబు భూమి పరాయీకరణ చట్టం కాంగ్రెస్‌ని కొంత కలవరపరిచింది. రెండు చర్యలు కూడా సంపన్న రైతులకు ప్రయోజనకారిగా వున్నాయి. సంపన్నరైతులే వడ్డీ వ్యాపారులుగా మారి సహకార సంఘాలపై కూడా ఆధిపత్యం సాధించారు.

కర్జన్‌కి భారతదేశ ప్రాచీన శిల్పాలపట్ల ఆసక్తి ఎక్కువ. వాటి పరిరక్షణ కొరకు ఒక ముఖ్యమైన చట్టం చేశాడు. కలకత్తాలో విక్టోరియా స్మారక చిహ్నం కొరకు చేపట్టిన బృహత్పథకాలు అభినందించదగినవి కావు. ఇక 1902 ఏడవ ఎడ్వర్డు దర్బారు ఏర్పాట్లకు 2 మిలియన్లకు పైగా ఖర్చుపెట్టడం కేవలం వృధా వ్యయమే. సంవత్సరాలలో రంగూన్‌లో సామూహిక మానభంగం చేసిన తెల్ల సైనికుల్ని శిక్షించడం (1899),

కోటలో భారతీయ వంటవాడ్ని కొట్టి చంపిన సైనికులపై క్రమశిక్షణా చర్యలు చేపట్టడం (1902), ఒక కూలీని అస్సాం టీ తోటల యజమాని చంపిన కేసు (బ్రెయిన్ కేసు 1904) క్రింది కోర్టు కేవలం 6నెలలు శిక్ష విధించగా దానిని పునఃసమీక్షించమని హైకోర్టుకు ఆదేశాలు జారీ చేయడం లాంటి చర్యలు భారతీయులలో కర్జన్‌కి మంచి పేరు తెచ్చిపెట్టాయి. అవే ఆంగ్లో ఇండియన్లకు కోపం తెప్పించాయి. కాని కర్జన్ మరొక ఇల్బర్ట్ బిల్ వివాదం లాంటి విపత్తు కోరుకోలేదు. అందుకే బహుళజాతుల కేసులలో బ్రిటిష్ జడ్జీలచే న్యాయ విచారణకు

అంతం పలకడం లాంటి అసలైన పరిష్కారానికి పూనుకోలేదు. అతడు ఇతరుల లాగానే జాతివివక్ష గలవాడే. అతడు భారతీయుల పట్ల చూపించింది. పెంపుడు జంతువుల పట్ల చూపించే దయ సానుభూతి మాత్రమే.

(యస్. గోపాల్, భారతదేశంలో బ్రిటిషు విధానం పేజి 227) 1900 ఏప్రిల్ 23న సెక్రటరీ ఆఫ్ స్టేట్ హెమిల్టన్‌కి రాసిన లేఖలోయూరోపియన్లకు మాత్రమే రిజర్వు చేయవలసిన పై స్థాయి నుండి ఉద్యోగాలు భారతీయ మేధావులు అపహరించుకొని పోవడం"పట్ల ఆందోళన వ్యక్తం చేశాడు. అతడు ప్రభుత్వ ప్రకటనలలో కూడా కొన్నిసార్లు అనవసరంగా భారతీయుల్ని అవమానపరచాడు. 'సత్యం యొక్క నిజమైన ఆదర్శం పాశ్చాత్య భావనలోనే వుంది' (కలకత్తా యూనివర్శిటీ స్నాతకోత్సవ ఉపన్యాసం 1905).

విద్యావంతులైన భారతీయుల ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్ పట్ల కర్జన్ పాలన నిరంతరంగా ప్రతికూల వైఖరి నవలబించింది. కర్జన్ రాజ్యాధికారాన్ని బలంగా అమలు జరపాలని నిర్ణయించుకొన్నారు. కాంగ్రెస్‌ని 'అంటరానిదిగా భావించి గుర్తించ నిరాకరించారు'. అమాయకంగా వున్నంత కాలం కాంగ్రెస్ అనవసరమయింది! ప్రభుత్వానికి ప్రతికూలంగా వున్నప్పుడు అది దేశద్రోహపూరితమైనది. అది సహజ శత్రువు' (కర్జన్ ఆంప్ట్‌హిల్‌కి 1903 జూన్ 15). ఆయన పథకాలలో పోలీస్ సంస్కరణలను, అలాగే రక్షణని పటిష్ఠం చేసే అధికారాల రహస్య చట్టానికి (1904) ప్రముఖ స్థానం లభించడం ఆశ్చర్యజనకం కాదు. ఆండ్రూ ఫ్రేజర్ చైర్మన్‌గా పోలీస్ కమీషన్ (1902 –03) చేసిన సిఫార్సులు వార్షికంగా 1.5 కోట్ల రూపాయల వ్యయంతో పోలీసులు సంఖ్యను, జీతాలను గణనీయంగా పెంచాయి. థగ్గుల –బందిపోటుల శాఖ స్థానంలో రాజకీయ కార్యకలాపాలను అదుపు చేసే ప్రత్యేకమైన క్రిమినల్ ఇంటిలిజెన్స్ శాఖ నెలకొల్పబడింది.

## కర్జన్ - జాతీయవాదులు

కర్జన్‌కు జాతీయవాద మేధావులకు మధ్య ప్రతిఘటన వరుసగా కర్జన్ తీసుకొన్న మూడు చర్యల కారణంగా ఏర్పడింది. అవి 1) కలకత్తా కార్పొరేషన్‌లో 1899లో చేపట్టిన మార్పులు, 2) 1904 యూనివర్శిటీల చట్టం (3) 1905లో చేసిన బెంగాల్ విభజన. మొదటిది ఎన్నికయ్యే భారతీయ సభ్యుల సంఖ్యని తగ్గించింది. ఇది కలకత్తాలో గల యూరోపియన్ వ్యాపార వర్గాల ప్రయోజనాలతో ప్రత్యేక సంబంధం గలది. ఇది వ్యాపార వర్గాలు తమకు లైసెన్సులు, ఇతర సానుకూలమైన చర్యలు చేపట్టడంలో జాప్యం జరుగుతుందని ఫిర్యాదు చేయడంతో చేపట్టిన చర్య. కర్జన్‌తో పాటు ఈ మార్పులకు ప్రధాన కారకుడు అప్పటి బెంగాల్ లెఫ్టినెంట్ గవర్నర్ అలెగ్జాండర్ మెకంజీ, బరన్స్ కంపెనీ భాగస్వామి మరియు బెంగాల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ యొక్క లెజిస్లేటివ్ కౌన్సిల్ ప్రతినిధి మెకంజీ సోదరుడు. యూనివర్శిటీల సంస్కరణ తెల్లవాళ్ళు రహస్యంగా సిమ్లాలో 1901 సెప్టెంబరులో జరుపుకొన్న సదస్సులో యూనివర్శిటీల కమీషన్ చే రూపొందించబడింది. దానిలో వున్న ఒకే ఒక భారతీయ సభ్యుడు గురుదాస్ బెనర్జీ. ఆయన కమిషన్ సిఫార్సుల్ని తీవ్రంగా విభేదించారు. విద్యాస్థాయి పెంచేందుకు

ప్రచారార్భాటంతో కర్జన్ చేపట్టిన విద్యాచట్టం ఎన్నికయ్యే సెనేట్ సభ్యుల సంఖ్యని తగ్గించింది. కాలేజీల అనుబంధం, పాఠశాలల గుర్తింపుల విషయంలో తుది నిర్ణయాధికారం ప్రభుత్వాధికారులకు బదిలీ చేసింది. వసూలు చేయవలసిన కాలేజీ ఫీజుల్ని నిర్ణయించింది. చట్టం ప్రజాస్వామ్య విరుద్ధమైనదిగా షరతులు విధించేదిగాను వున్నందున భారతీయ మేధావులు వ్యతిరేకించారు. విద్యాభివృద్ధి ప్రధానమైన లక్ష్యం అని ప్రకటించినప్పటికీ కేటాయించిన నిధులు అందుకనుగుణంగా లేవని చెప్పారు. 1903 –1904 లో విద్యకి కేటాయించిన మొత్తం 20.46 మిలియన్లు కాగా 1905–06లో 24.45 మిలియన్లు. ఇది పోలీసు వ్యయంలో పెరుగుదల కంటె కొద్దిగ ఎక్కువగానున్నప్పటికీ మొత్తం బడ్జెటులో 2.5 శాతం మాత్రమే. యూనివర్శిటీలు కేవలం పరీక్ష నిర్వహణా సంస్థలుగాక, పోస్టు గ్రాడ్యుయేట్ శిక్షణా కేంద్రాలుగా పనిచేయాలని చేసిన సిఫార్సు అమలు జరిపిన చోట్ల ప్రత్యేకించి దూరదృష్టి గల అశుతోష్ ముఖర్జీ  వైస్ ఛాన్సలర్‌గా గల కలకత్తాలో సత్ఫలితాలనిచ్చింది. కాని అనుబంధం, గ్రాంట్స్ యిన్‌ఎయిడ్ విషయాలలో కొత్తగా ప్రభుత్వ నియంత్రణలు తీవతరమయ్యాయి. 1905 తరువాత విద్యార్థుల సమరశీలతని అణచివేసేందుకు ఈ నిబంధనలు విశృంఖలంగా ప్రయోగించబడ్డాయి. కాబట్టి పెరుగుతున్న జాతీయోధ్యమ వెల్లువను అడ్డుకొనేందుకు ప్రభుత్వం పోలీస్ కమీషన్‌తో పాటు యూనివర్శిటీల చట్టం తీసుకొని రావడం గమనార్హం.

## బెంగాల్ విభజన

కర్జన్ చేపట్టిన చర్య – బెంగాల్ విభజన చరిత్రకారులలో చాలా వివాదాన్ని సృష్టించింది. పాలనాపరమైన సౌలభ్యం కోసమే విభజన చేపట్టడం జరిగిందంటారు సమర్థించేవారు. కాని సమకాలీన ఆ తరువాత కాలం నాటి జాతీయవాదులు విభజించి పాలించేందుకు విభజన జరిగిందంటారు. 1903 వరకు పరిపాలనా పరిశీలనలే ప్రభుత్వం ప్రధానాంశంగా పెట్టుకొన్నది. బెంగాల్ పరిణామం వివిధ కాలాల్ల చాలామందిని ఆందోళనకు గురిచేసింది. (1860 నుండి బెంగాల్ ప్రెసిడెన్సీ పరిణామాన్ని తగ్గించమని అడపా దడపా ప్రతిపాదనలు వచ్చాయి). 1874 అస్సాం సిల్హెట్‌ల విభజన, 1896 –97లో చిటగాంగ్ ప్రాంతం డక్కా, మెమెన్‌సింగ్‌లను తన ప్రొవిన్స్‌కి కలపమని అస్సాం చీఫ్ కమిషనర్ విలియం వార్డ్ ప్రతిపాదన అస్సాంని ప్రొవిన్స్‌గా అభివృద్ధిపరచాలనే ఆసక్తి పెరిగింది. వార్డ్ ప్రతిపాదన బెంగాల్ కొత్త లెఫ్టినెంట్ గవర్నర్ ఆండ్రూఫ్రేజర్ చే 1903 మార్చి 28న పునరుద్ధరించబడిందని కర్జన్ భారతదేశ ప్రాదేశిక పునర్విభజనపై జారీ చేసిన ఆదేశంలో (1903 జూన్ 1) అంగీకరించారు. 1903 డిసెంబర్ 3న హోం సెక్రటరీ లేఖ ద్వారా మొదటిసారిగా ప్రకటించబడింది. బదిలీ సమర్థనగా రిస్లీ చెప్పిన రెండు కారణాలు చూపారు. 1) బెంగాల్‌కి ఉపశమనం 2) అస్సాం అభివృద్ధి కాని పరిపాలనా సౌలభ్యం అనేది నిష్పాక్షికమైన కారణం కాదు. అది బ్రిటిష్ పాలనకు, బ్రిటిష్ వ్యాపార వర్గాల ప్రయోజనాలతో ముడిబడినట్టిది. అస్సాం విస్తరణ పాలనాధికారుకు విస్తృతమైన కార్యక్షేత్రాన్ని సమకూర్చడానికి తేయాకు, చమురు, బొగ్గు, పరిశ్రమల్ని అభివృద్ధి పరిచే నావికాయానానికి రూపురేఖలు కల్పించడానికి అవసరం అంటారు రిస్లీ.

1903 డిసెంబర్‌కి ప్రకటన వెలువడిన 1905 జూలై 19కి మధ్యకాలంలో బదిలీ పథకం ఫ్రేజర్, రిస్లీ, కర్జన్‌లచే పూర్తిస్థాయి విభజన పథకంగా మార్చబడింది. ఫలితంగా చిటగాంగ్, డక్కా, రాజస్థాన్ డివిజన్లతో కూడిన 'తూర్పు బెంగాల్ – అస్సాం ప్రొవిన్సు విభజనని హిందూ ముస్లిం ఉద్రిక్తతల్ని పెంచే బాహాటమైన ప్రోత్సాహమని జాతీయవాదులు చేసిన అభియోగానికి ఆధారాలు కర్జన్ 1904 ఫిబ్రవరిలో డక్కాలో చేసిన ప్రసంగంలో లభిస్తాయి. ఆ ఉపనాస్యంలో కర్జన్ పాత ముస్లిం రాజులు పరిపాలించే కాలం నుండి సాధ్యపడని ఐక్యత – బెంగాల్ విభజన తూర్పు బెంగాల్ ముస్లింలకు కల్పించింది అన్నారు. కాని ఈ కాలంలో నిజమైన ముఖ్యమైన రాజకీయ ప్రయోజనం తూర్పు పశ్చిమబెంగాల్‌లో అధిపత్యం వహిస్తున్న రాజకీయ నాయకులలో విభజన తీసుకొని రావడం. విభజనపై విమర్శకుల వాదనల్ని విశ్లేషిస్తూ హోం సెక్రటరీ రిస్లీ 1904 ఫిబ్రవరి 7 డిసెంబరున చేసిన రెండు ప్రకటనలలో సారాంశాన్ని యిలా వివరించారు. "బెంగాల్ కలసివుంటేనే శక్తి. విభజింపబడిన బెంగాల్ ముక్కలు చెక్కలవుతుంది. ఇది పూర్తిగా వాస్తవం. పథకం ప్రయోజనాలలో ఇది ముఖ్యమైనది."

తప్పనిసరిగా ప్రచురించబడే ఒక ప్రకటనలో వాస్తవాన్ని దాచకుండా జవాబు చెప్పడం అంత సులభంకాదు. బేరార్‌ని సెంట్రల్ ప్రొవిన్స్‌కి కలపడంలాంటిది కాదిది. మన ప్రధాన లక్ష్యాలలో ఒకటి విభజించడం, మన పాలనకి వ్యతిరేకంగా సంఘటితంగా వుండే వారిని చీల్చి బలహీనపరచడం. మరాఠీ మాట్లాడే బేరార్ 1902లో క్రొత్తగా నిజాం నుండి శాశ్వత కౌలు పద్ధతి బ్రిటిష్ వారు పొందారు. కాని అది బొంబాయిలో కలుపబడలేదు. అందుకు కారణం కర్జన్ మాటల్లో "మనం శివాజీని గురించి ఇప్పటికే చాలా విని వున్నాం. కార్యనిర్వాహక కౌన్సిల్ ఏర్పరచడం ద్వారా లేక భాషాపరంగా వేరుగా వున్న బీహార్, ఒరిస్సాలను విడగొట్టడం ద్వారా గాని (1911లో చివరికి లభించిన పరిష్కారం) బెంగాల్ పరిపాలనా భారాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ పథకాలకు రాజకీయ కారణాల రీత్యా పలుమార్లు కర్జన్ త్రోసిపుచ్చాడు.

బీహార్ ఒరిస్సాలను విడగొట్టే ప్రతిపాదనపై ఆలోచిస్తున్న సెక్రటరీ ఆఫ్ స్టేట్‌కి కర్జన్ యిలా టెలిగ్రామ్ పంపారు. ఆ ప్రతిపాదన ప్రకారం బయటవారిని (బీహార్, ఒరిస్సా) విడగొట్టడం జరిగితే బెంగాల్‌లు ఐక్యమవడానికి తోడ్పడుతుంది. మనం దేనినైతే తొలగించుకుందామని అనుకుంటున్నామో అదే ఫలితం దక్కుతుంది." మన ప్రతిపాదన యొక్క రాజకీయ ప్రయోజనం ఏమిటంటే కాంగ్రెస్ దానిని తిరస్కరించడం.

రిస్లీ లాంటి ఉన్నతాధికారులు కేంబ్రిడ్జి చరిత్రకారులు విభజన వ్యతిరేకతకు గల కారణాలను కులీన గ్రూపుల ప్రయోజనాల దృష్టికోణం నుంచి అంచనా వేశారు. విక్రంపూర్ బాబూలు తమ గుమాస్తా ఉద్యోగాల గురించి ఆందోళన చెందారు. తూర్పు బెంగాల్, పశ్చిమబెంగాల్‌లో ఎస్టేట్లు ఉన్న జమీందారులు రెండు చోట్ల ఏజెంట్లను, ప్లీడర్లను పెట్టుకోవలసి ఉంటుందని విభజనను వ్యతిరేకించారు. కలకత్తా సమీపంలో ముడి జనపనార, బియ్యం వ్యాపార ప్రయోజనాలుగా గల భాగ్యకుల 'కుటుంబం చిట్టగాంగ్ అభివృద్ధి జెందే అవకాశం వుందని అసూయ చెందారు. కొత్త ప్రొవిన్సు ఏర్పడితే క్రొత్తగా మరొక హైకోర్టు వస్తుందని

దానిలో తమ ప్రాక్టీసు తగ్గుతుందని భయపడ్డారు. తూర్పు బెంగాల్ రాజకీయ పెద్దలు చట్ట సభలలో కూర్చునే అవకాశం కోల్పోతామని భయపడ్డారు. (తొలి దశలో బెంగాల్‌లో కొన్ని భాగాలు ఛీఫ్ కమీషనర్ అధీనంలో వుండే అస్సాం ప్రావిన్స్‌కి బదిలీ చేయబడతాయి. అక్కడ ఎన్నుకొనబడే శాసనసభ్యులు వుండరు) కలకత్తా రాజకీయ నాయకులు వారి పలుకుబడి చాలావరకు పరిమితం చేయబడుతుందని ఆందోళన చెందారు.

రిస్లీ 1904 ఫిబ్రవరి 7న తన పత్రంలో ప్రస్తావించిన అంశాలు అతడు స్వయంగా కనుగొన్నవి కావు. అవి అన్నీ కూడ లార్డ్‌కర్జన్‌కి బహిరంగ లేఖ (డక్కా, 1904 ఏప్రిల్) బెంగాల్ విభజనను గురించిన వివరాలు (కలకత్తా 1905 సెప్టెంబర్) లాంటి కరపత్రాలలో చాలాసార్లు ప్రస్తావించబడినవే. కాని నిరసనలు త్వరగా సద్దుమణుగుతాయని గతంలో లాగానే మీటింగులకు పిటిషన్లకు పరిమితం అవుతాయని భావించిన ఉన్నతాధికార వర్గ అంచనాలు బెంగాల్ కొన్ని యితర ప్రావిన్సులలో జరిగిన ఘటనలతో తలక్రిందులయ్యాయి. జూలై 1905 తరువాత ఆశ్చర్యకరమైన వేగంతో ఉద్యమం సాంప్రదాయ మార్గం నుండి వైదొలగింది. పలురకాల నూతన సమరశీల పద్ధతులలో అభివృద్ధి చెందింది. గతంలో కంటె ఎక్కువమందిని ఆకర్షించింది. స్వరాజ్యం కొరకు పోరాటంగా విస్తరించింది.

బ్రిటిష్ వారు బెంగాలీల ఐక్యతను గురించి తక్కువగా అంచనా వేశారు. సుదీర్ఘకాల వ్యవధులలో ప్రాంతీయ స్వాతంత్ర్యాన్ని అనుభవించిన చరిత్ర బెంగాలీలకు ఉంది. 19వ శతాబ్దపు సాంస్కృతిక పరిణామాలు బెంగాలీలలో – ప్రత్యేకించి విద్యావంతులైన బెంగాలీలలో ఐక్యతను పెంచాయి. విద్యావంతులైన బెంగాలీ కులీనులకు (భద్రలోక్) కలకత్తా మహా నగరమయింది. అన్ని జిల్లాల నుండి విద్యార్థులనాకర్షించింది. ఉపాధ్యాయుల్ని, ప్లీడర్లని, డాక్టర్లని, గుమస్తాలని ప్రావిన్సు అంతటికీ వెలుపలికి పంపించింది. బెంగాలీ భాషని పాశ్చాత్య భాషగా, ఆధునిక భాషగా అభివృద్ధి పరిచి, అధిక సంఖ్యలో రచనలు చేయించి, పత్రికల్ని నడిపించి, బెంగాలీల ఆత్మగౌరవాన్ని పెంపొందించిన నగరం. ఆధునిక భాషలో రచనలు చేసిన రవీంద్రనాథ్ ఠాగూరు ప్రపంచ గుర్తింపు పొందే దశలో ఎదిగారు. అంతేగాక ముందుగా ఇంగ్లీషు విద్యనేర్చిన బెంగాలీలు వివిధ వృత్తులలో, ప్రభుత్వ సర్వీసులలో, రాజకీయాలలో అగ్రభాగాన వున్నారు. ఇది బెంగాలీల ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఈ విశ్వాసాన్ని వివేకానందుడు నమూనాగా పెంచబడిన హిందూ పునరుద్ధరణ వాద వైఖరి మరికొంత ప్రేరణగా పనిచేసింది. అంతర్జాతీయ పరిణామాలు కూడ తగు పాత్ర నిర్వహించాయి. బోయరు యుద్ధంలో బ్రిటిష్ పరాజయాలతో ఆసియాకి గర్వంతో గగుర్పాటు కలిగింది. బెంగాల్ పత్రికల ప్రశంసలు పొందిన (పిల్లలకు జపాన్ నాయకులైన టోగో, నోగి పేర్లు పెట్టడానికి కారణమైన) 1904–05 నాటి రష్యాపై జపాన్ విజయం.

వలస చట్టాలకు నిరసనగా అమెరికా వస్తువుల్ని బహిష్కరించిన చైనా, రష్యాలో నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ప్రజా విప్లవం ఈకాలం నాటి ముఖ్యమైన అంతర్జాతీయ పరిణామాలు.

దృఢమైన ప్రాంతీయ ఐక్యత, ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం పెరిగిన ఈ వాతావరణంలో తెర వెనుక నాటకాలతో విభజన నిర్ణయం (1904 ఫిబ్రవరి 1905 జూలైల మధ్య విభజనను గురించి బాహాటంగా ఏమీ చెప్పకుండా)తో కర్జన్ రెచ్చగొట్టే చర్యలు జాతిని అవమానపరచడంగా భావించబడ్డాయి. అది అనివార్యంగా చాలా పరిమితంగా ప్రభావితుల్ని చేసిన 20 సంవత్సరాల మితవాదులు సాధించిన అరకొర ఫలితాల పైనేగాక జాతి వివక్ష తెల్లవారి అహంకారం వలన విస్తృతంగా ప్రజలు అనుభవించిన మానసిక గ్లానితో అనుభవించిన నిరాశా నిస్పృహలకు తోడయింది.

జ్ఞానచంద్రబెనర్జీ డైరీ దీనిని వివరంగా ప్రతిఫలిస్తుంది. మున్సిఫ్ జీతం కేవలం రు.200లు కాగా, తెల్లజాతి జిల్లా జడ్జి నెలకు రు.2000 జీతం పొందుతున్నాడు. విదేశీ స్టీమర్లలో, రైళ్ళలో అనుభవించిన జాతి వివక్షకు చెందిన జ్ఞాపకాలు అతడి మదిలో మెదలాడుతున్నాయి. జాతి పునరుజ్జీవం పొందుతున్న సంకేతాలతో, శాస్త్రవేత్త జగదీష్ చంద్రబోస్ సాధించిన విజయాలలో, ప్రపంచశక్తిగా జపాన్ ఎదగడంలో అతడు ఊరట చెందాడు.

భారతదేశంలో పెరుగుతున్న పేదరికాన్ని ఉటంకిస్తూ బెనర్జీ తన పత్రిక (1904 అక్టోబరు) ని ప్రారంభించారు. కరువు, ప్లేగు బెంగాల్ కులీనునిపై ప్రత్యక్షంగా అంతగా దుష్ప్రభావం చూపనప్పటికీ 1850 దశాబ్దం నాటి విధ్వంసాలు అతడ్ని కలిచివేశాయి. బ్రిటిష్‌వాళ్ళు అన్నీ సమకూరుస్తారనే విశ్వాసం సడలిపోయింది. భారతీయ పేదరికంపై మితవాదులు యిస్తున్న సంపద తరలింపు వివరణపై కూడా విశ్వాసం తగ్గిపోయింది. ప్రత్యక్షంగా ఎదుర్కొంటున్న ఆర్థిక బాధలు కూడా బహుశా పాత్ర నిర్వహించి ఉండవచ్చు. ఉదారవాద వృత్తుల రద్దీ పెరిగింది. (ఒక్క తూర్పు బెంగాల్ సబ్‌డివిజన్‌గా వున్న మాదరీపూర్‌లోనే 80 మంది ప్లీడర్లు పనిచేస్తున్నారని స్వదేశీ కరపత్రం పేర్కొన్నది.) కులీనులు (వృత్తిదారులు) జమీందారులపైన, మధ్యతరహా భూస్వాములపై ఆధారపడవలసి వచ్చింది. వారసత్వంగా సంక్రమించేది కుటుంబ విభజన కారణంగా తగ్గిపోయింది. ధరలు ఒక్కసారిగా పైపైకి ఎగబాకాయి. 1890 -94 కాలంలో 100 పాయింట్లుగా ఉన్న ధరల సూచిక 1904కి 106, 1905 నాటికి 116, 1906 నాటికి 129, 1908 నాటికి 143కి పెరిగింది. రాజకీయ అశాంతి అత్యధికంగా వున్న 1905 -1908 కాలంలో ధరలు అత్యధికంగా పెరిగాయి.

తూర్పుబెంగాల్‌లో బకర్‌గంజ్, మాదరిపూర్, కిషోర్‌గంజ్ గ్రామీణ ప్రాంతాలు బలమైన స్వదేశీ స్థావరాలు. ఇవి హిందూ కులీనులు ఎక్కువగా వున్న ప్రాంతాలు. మధ్యతరహా కౌలుదారులు ఎక్కువగా వుండి గణనీయంగా ఇంగ్లీషు చదువు (ఫలితంగా వృత్తుల రద్దీ, జాతీయవాద సిద్ధాంత వ్యాప్తి) వ్యాప్తి జరిగిన ప్రాంతాలు. అలాంటి గ్రూపులలో, ప్రాంతాలలో పెరుగుతున్న ధరలు బహుశా జాతీయవాదాన్ని ప్రేరేపించి వుండవచ్చు. 1905 రోజులలో తరచుగా విస్మరింపబడిన పారిశ్రామిక కార్మికులు ద్రవ్యోల్బణం కారణంగా సమ్మెలు చేశాయి. కాని తూర్పు బెంగాల్‌లో ఆర్థికపరమైన అసంతృప్తి తక్షణ అణచివేత దారునికి వ్యతిరేకంగా (హిందూ) భూస్వామికి వడ్డీ వ్యాపారికి లేక వర్తకునికి వ్యతిరేకంగా మరలింది. ఫలితంగా

మత ఘర్షణలకు తోడ్పడింది. బెంగాల్‌లోని స్వదేశీ మేధావులు అంతకంతకూ హిందూ పునరుద్ధరణ వాదంలో చిక్కుకొని సమస్యలను పెంచారు. శూద్రులు కోరే వ్యవసాయ కార్యక్రమాన్ని అభివృద్ధిపరచడంలో విఫలమయ్యారు. అధిక ధరలు, ఉద్యోగాలు పొందడంలోని సమస్యలు వారిని కౌలుపై ఆదాయాన్ని (కొద్దిపాటిదే అయినప్పటికీ) అంటిపెట్టుకొని వుండేలా చేసింది. జ్ఞాన్‌చంద్ బెనర్జీకి విక్రంపూర్‌లో వారసత్వంగా సంక్రమించిన కొద్ది పొలం వుంది. అయినప్పటికీ 1885 కౌలుదారీ వ్యవసాయ సంబంధాలకు కీడు చేస్తుందని డైరీలో రాసుకొన్నాడు. బెంగాల్ భూమి సంబంధాలపై 1904 లో రాయబడిన ఒక కరపత్రం తమని తాము మధ్యతరగతిగా చెప్పుకొనే దళారీ కౌలుదారులు ఆర్యుల కాలం నుండి వున్నారని పేర్కొంది. వారు ఒకవైపు పెద్ద జమీందారుల చేత (ముస్లింలు బ్రిటిష్ వారిచే సృష్టించబడిన అపవార్తలచే) మరొక వైపు కౌలుదారుల చట్టంతో పొగరెక్కిన రైతులచేత పీల్చిపిప్పి చేయబడ్డారని ఆరోపించింది. (అమృతలాల్‌పాల్ బంగర్ భూమి రాజస్య ఓ ప్రాచీన ఆర్యసమితి, కలకత్తా 1904). కర్జన్‌కి బహిరంగ లేఖ (1904) పేరుతో మరొక కరపత్రం ఎడ్మర్డ్ బర్క్‌ని ఉటంకిస్తూ ప్రజాభిప్రాయాన్ని మరీ దిగువ స్థాయి ఆలోచనలపై ఆధారపడని అభిప్రాయంగా పరిగణించి “విద్యావంతులైన వర్గాలదదు” సాధారణ ప్రజలకు సహజ నాయకులుగా వుంటారని స్పష్టం చేసింది. కులీనులకు రైతాంగానికి మధ్యగల దూరానికి కేవలం శారీరక శ్రమపట్ల కులీనుల విముఖత మాత్రమే గాక స్పష్టమైన వర్గమూలాలు వున్నాయి.

బెంగాలులో గాని యితర ప్రాంతాలలో గాని అతివాద మేధావులు జాతీయవాద నినాదాన్ని రైతుల తక్షణ ఆర్థిక సమస్యలతో ప్రజలతో సంబంధాలు పెంచుకొనేందుకు మతపరమైన విజ్ఞప్తులు దగ్గరదారిగా కన్పించాయి. ముస్లింలకు సంబంధించినంతవరకు ఈ ప్రయత్నాలు ప్రమాదకరమైన ఫలితాలకు దారితీశాయి. అనుసంధానం చేయడంలో విఫలమయ్యారు. అంతేగాక క్రింది నుండి వచ్చే ఒత్తిళ్లు కూడా కొంత తగ్గాయి. దేశంలోని పలు ప్రాంతాలలో కరువుకాటకాలు ప్రజల్ని క్రుంగదీశాయి. చాలామందిని పొట్టన పెట్టుకొన్నాయి. జనాభా తగ్గుదల కూడా వ్యవసాయ ఉద్రిక్తతల్ని తగ్గించి ఉండవచ్చు. 1970, 1880 దశాబ్దాల గ్రామీణ అలజడుల తరువాత –బొంబాయి పంజాబులకు చెందిన సంపన్నుల చేతుల్లోకి భూమి బదిలీకాకుండా చేసిన బెంగాలీ కౌలుహక్కుల చట్టం – వడ్డీ వ్యాపారులతో భూస్వాములతో ఘర్షణలు పడే రైతుల్ని కొంతవరకు శాంతింపజేసింది. ధరల పెరుగుదలకు వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులతో సన్నిహిత సంబంధం వుంటుంది. ఉత్పత్తుల ఎగుమతులతో ధరలు పెరుగుతాయి. ద్రవ్యోల్బణానికి మరొక కారణం నోట్ల ముమ్మరం. అదనపు ఎగుమతుల కారణంగా దేశంలోకి వచ్చిపడిన బంగారం వెండితో నోట్ల ముమ్మరం హడావుడి వుంటుంది. వ్యాపార విజృంభణతో బ్రిటిషు ఎగుమతి ఏజెన్సీలు, భారతీయ వాణిజ్యదళారులు చాలా లాభాలార్జించారు. రైతులలోని కొన్ని సెక్షన్లు (ఉదాహరణకు తూర్పు బెంగాలు జనపనార సాగుచేసే రైతులు) పరిమితంగా లాభాలు పొంది తొలి దశాబ్దంలో తలసరి జాతీయాదాయంలో కూడా పెరుగుదల వుంది. 1938 –39 ధరల ప్రాతిపదికగా 1900–01లో రు.49.4గా వున్న తలసరి 1916–17 నాటి రు. 60.4కి పెరిగింది. (1900–01 నుండి 1946–47

వరకు జాతీయాదాయం, ఢిల్లీ యూనివర్శిటీ మిమియోగ్రాఫ్, 1965) ఇదంతా భారత జాతీయవాద, అతివాద దశలో జాతీయ సామాజిక అసంతృప్తిని ప్రక్కన పెట్టడానికి తోడ్పడింది.

## బెంగాలులో స్వదేశీ ఉద్యమం : 1905 -1908

1905 జూలై వరకు విభజన పథకాన్ని పత్రికల ద్వారా ప్రచారం, సభలు సమావేశాలు విజ్ఞప్తులు యిలాంటి మితవాద సాంప్రదాయ పద్ధతుల ప్రత్యేకించి (డక్కా, మెమెన్‌సింగ్ జిల్లాలలో) ద్వారా అడ్డుకొనడం జరిగింది. 1904 మార్చి 1905 జూలైలలో కలకత్తా టౌనుహాలులో పెద్ద సదస్సులు జరిగాయి. ఈ ప్రయత్నాలు విఫలమవ్వడంలో బ్రిటిషు వస్తువుల బహిష్కరణ (మొదట కృష్ణకుమార్ మిత్రా వారపత్రిక 1905 జూలై 13న సూచించింది. ఆగష్టు 7 టౌనుహాలు మీటింగులో కొంత ఊగిసలాట తరువాత సురేంద్రనాథ్ బెనర్జీలాంటి ప్రముఖ నాయకుల ఆమోదం పొందింది. రవీంద్రనాథ్ ఠాగూర్ రాఖీబంధన్ లాంటి విజ్ఞప్తులు చేశాడు. విభజన దినాన (అక్టోబరు 16న) సోదరభావానికి సంకేతంగా పరస్పరం రాఖీలు కట్టుకొన్నారు. విచార సూచకంగా ఇళ్లలో పొయ్యిలు రాజేయలేదు. పికెటింగు చేస్తున్న విద్యార్థులకు గ్రాంట్లు, స్కాలర్‌షిప్పులు, జాతీయవాదుల ప్రాబల్యం గల పాఠశాలలకు గుర్తింపు నిలుపుదల చేస్తూ ప్రభుత్వం కార్లైల్ సర్క్యులర్ విడుదల చేయడం లాంటి చర్యలు చేపట్టింది. ఈచర్య ప్రభుత్వ పాఠశాలల బహిష్కరణకు జాతీయ పాఠశాలల స్థాపనకు దారితీసింది. సుబోధ్‌మల్లిక్ నవంబరు 9న యిచ్చిన లక్ష రూపాయల భూమి విరాళం జాతీయ పాఠశాలల స్థాపనని ప్రోత్సహించింది. అణచివేత చర్యలు (బారిస్వాల్‌లో గూర్ఖాల నియామకం, 1906 ఏప్రిల్ ప్రాంతీయ సమావేశాన్ని భగ్నం చేయడం, పికెటింగు చేస్తున్న వారిపై అసంఖ్యాకమైన కేసులు పెట్టడం) ఉద్రిక్తతల్ని పెంచాయి. బెంగాల్ ఉద్యమంలో అంతర్గతంగా విభేదాలు తలెత్తాయి. కొందరి దృష్టిలో కొత్త పద్ధతులు కొత్త వ్యూహాలకు బహిష్కరణ ప్రారంభం మాత్రమే. రాజకీయ లక్ష్యాలలో బెంగాలు విభజన అతి స్వల్పమైనది మాత్రమే. స్వరాజ్యానికి లేక పూర్తి స్వతంత్ర సాధనకు యిది ఒక మెట్టు మాత్రమే. (అరవింద ఘోష్ 1907 ఏప్రిల్). ఇది మాంచెస్టర్‌పై దెబ్బతీస్తుంది. మితవాద నాయకులు ప్రభుత్వ పాఠశాలలు బహిష్కరణ 1905 నవంబరు నాటికి విరమించారు.

ఉదారవాదిగా పేరుబడ్డ మోర్లేని రాజ్యకార్యదర్శిగా నియమించడాన్ని అవకాశంగా తీసుకొని పోరాటాన్ని విడనాడి అర్థించే ధోరణి చేపట్టారు.

### విభిన్న ధోరణులు

సైద్ధాంతిక స్థాయిలో 1905 –08 మధ్య కాలంలో సుస్థాపితమైన మితవాద సాంప్రదాయంతో పాటు బెంగాలు రాజకీయ జీవితంలో మూడు ప్రధానమైన ధోరణులు వ్యక్తమయ్యాయి. మొదటిది నిర్మాణాత్మక స్వదేశీ. ఈ ధోరణి స్వదేశీ పరిశ్రమలు, జాతీయపాఠశాలలు, గ్రామీణాభివృద్ధి ప్రయత్నాలకు అనుకూలంగా నిరర్థకమైన ఆత్మన్యూనతా భావంతో కూడిన యాచించే రాజకీయాల్ని తిరస్కరించింది. ఇది ప్రఫుల్ల చంద్రరాయ్ లేక నీల్‌రతన్ సర్కార్ వ్యాపార పెట్టుబడుల ద్వారా వ్యక్తమయింది. అలాగే సతీష్‌చంద్రముఖర్జీ

పత్రిక "డాన్", అలాగే ఆయన స్థాపించిన 'డాన్ సొసైటీ' లలో కూడా వ్యక్తమయ్యాయి. ఇవి జాతీయ విద్యా ఉద్యమంలో కీలకపాత్ర నిర్వహించాయి. అన్నిటిని మించి రవీంద్రనాథ్ ఠాగూర్ తన 'స్వదేశీ సమాజ్' (1904)లో సాంప్రదాయ హిందూ సమాజాన్ని పునరుద్ధరించడం ద్వారా గ్రామాలలో నిర్మాణాత్మక పని నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేశాడు. బారిసాల్‌లో గల అశ్వనీకుమార్‌దత్ యొక్క స్వదేశీ బాంధవ్ సమితి (బకర్‌గంజ్) తన మొదటి వార్షిక రిపోర్టు (1906 సెప్టెంబరు)లో 89 సమన్వయ కమిటీల ద్వారా 523 గ్రామాల వివాదాలను పరిష్కరించినట్లు ప్రకటించింది. 1907 ఏప్రిల్ వేయి గ్రామ సమితులు పనిచేస్తున్నట్లు ప్రకటించింది. వీటిలో తరువాత కాలం నాటి స్వదేశీ జాతీయపాఠశాలలు, నిర్మాణాత్మక గ్రామీణ పని లాంటి గాంధేయ కార్యక్రమంలోని అంశాలకు స్పష్టమైన సూచికలు కన్పిస్తున్నాయి.

రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రవచించిన నెమ్మదియైన ఆడంబర రహితమైన ఆత్మశక్తి దృక్పథం బెంగాలీ యువకుల్ని ఆకర్షించలేకపోయింది. యువకులు రాజకీయ తీవ్రవాదం వైపు ఆకర్షితులయ్యారు. బిపిన్‌పాల్ యొక్క న్యూఇండియా, అరవింద్ ఘోష్ యొక్క వందేమాతరం, బ్రహ్మో బాంధవ ఉపాధ్యాయ యొక్క సంధ్య బరీంద్రకుమార్ ఘోష్ బృందం యొక్క యుగాంతర్ లాంటి పత్రికలు 1906 నుండి స్వరాజ్య సాధనకు పోరాటాలు చేపట్టమని పిలుపిచ్చాయి. ఆచరణలో తరువాతి ఘటనలు స్పష్టం చేసిన విధంగా చాలామంది అతివాద నాయకులు తాము డిమాండు చేసిన వాడికంటె తక్కువ ఫలితాలకే రాజీపడ్డారు. ఉదాహరణకు సరియైన సమయంలో పూర్తి రొట్టె సాధించే లక్ష్యంతో, ప్రస్తుతం అసలులేని దానికంటె సగం రొట్టె తనకు అంగీకారమే అన్నారు. తిలక్ 1907లో, కాబట్టి ప్రధానమైన తేడా అనుసరించే పద్ధతులలో వుంది. దీనిని అరవిందఘోష్ 1907 ఏప్రిల్‌లో వందేమాతరం పత్రికకు రాసిన వ్యాసాలలోని ప్రకటన స్పష్టం చేస్తుంది. ఈ వ్యాసాలు తరువాత 'సత్యాగ్రహసిద్ధాంతం' పేరుతో పునర్ముద్రింపబడ్డాయి. ఆయన ప్రశాంత ఆశ్రమాలు, స్వదేశీ విధానం, స్వయం సహాయం వగైరాలను అపహాస్యం చేస్తూ బ్రిటిషు వస్తువుల్ని, ప్రభుత్వ విద్యని, న్యాయాన్ని పాలనా వ్యవహారాన్ని క్రమబద్ధంగా అవిశ్రాంతంగా బహిష్కరించే కార్యక్రమానికి తన దార్శనిక దృష్టితో రూపకల్పన చేశాడు. అంతేగాక అన్యాయాల చట్టాల పట్ల శాసనోల్లంఘన, బ్రిటిషువారికి అనుకూలంగా వుండేవారి పట్ల సామాజిక బహిష్కరణ – యింకా బ్రిటిషు అణిచివేత విధానాలు ప్రజల సహనపు హద్దుల్ని అతిక్రమిస్తే సాయుధ పోరాటం చేపట్టాలన్నారు. నవంబరు 21 'సంధ్య' పత్రిక యిలాంటి ఆలోచనలనే ప్రచురించింది. "చౌకీదారు, కానిస్టేబుల్, డిప్యూటీ మున్సిఫ్ గుమాస్తా, సిపాయి వారివారి కార్యకలాపాలు చేయడం ఆపివేస్తే 'ఫిరంగిరాజ్యం' తక్షణం అంతమవుతుంది." అరవిందఘోష్ తన 1907 వ్యాసాలలో భవిష్యత్ గాంధేయ రాజకీయ కార్యక్రమంలోని అహింస, పన్నుల శిస్తుల ఎగవేతలను మినహాయించి మిగిలిన అంశాల్ని చెప్పాడు. దేశభక్తియుతంగా వున్న బెంగాలీ జమీందారులకు వీటిని అరవిందఘోష్ మినహాయించారు.

అచరణలో బెంగాల్ తీవ్రవాదం కాంగ్రెస్ అంతర్గత వివాదాలపై తనశక్తి యుక్తుల్ని చాలా వరకు వెచ్చించింది. జిల్లా స్థాయి నుండి దిగువ వరకు సంస్థల నిర్మాణంలో చాలా కృషి

చేసింది. కార్మికుల సమస్యలకు నూతన రాజకీయ నాయకత్వాన్ని సమకూర్చింది. కాని 1907 నాటికి తీవ్రవాద పిలుపులతో అంతర్గత శ్రేణుల నుండి ప్రజా ఉద్యమ దృక్పథానికి సవాలు ఎదురయింది. "ప్రతి జిల్లాలో ఇంగ్లీషు అధికారుల సంఖ్య ఎంత? దృఢమైన నిశ్చయంతో ఇంగ్లీషు పరిపాలనని ఒక్క రోజులో అంతం చేయవచ్చు. ప్రజలంతా నిరాశా నిస్పృహలో కూరుకుపోయేదాకా మనం సోమరులుగా కూర్చుని తటపటాయిస్తుంటే మనం ఎప్పటికీ సోమరులుగా మిగిలిపోతాం... ఓ దేశభక్తులారా రక్తం చిందకుండా దేశం మేల్కొంటుందా'? (యుగాంతర్ మార్చి 3, ఆగష్టు 26, 1907)

రాజకీయ పద్ధతులు లక్ష్యాలకు సంబంధించిన చర్చతోపాటు, ఆధునికవాదులు హిందూ పునరుద్ధరణ వాదుల మధ్య సాంస్క ృతిక ఆదర్శాలు లక్ష్యాల్ని గురించి మరొక వైరుధ్యం వుంది. సాధారణంగా స్వదేశీ ధోరణి రాజకీయాల్ని మత పునరుద్ధరణ వాదలతో కలగలిపే ప్రయత్నాలకు దగ్గరి సంబంధం కలిగి వుంది. ఇది చురుకైన కార్యకర్తల నైతిక స్థైర్యాన్ని పెంచేందుకు ప్రజలతో సంబంధాల్ని పెంచుకొనేందుకు ప్రధాన సాధనంగా ఉపయోగించుకోబడింది. మొట్టమొదటిసారిగా స్వదేశీ ఉద్యమ ప్రమాణాన్ని దేవాలయాలలో చేయించినవారు సురేంద్రనాథ్. జాతీయ విద్యా పథకాలలో బలమైన పునరుద్ధరణవాద అంశాలు చోటు చేసుకొన్నాయి.

సాంప్రదాయ కులాచారాల్ని ఆధారంగా చేసుకొని బహిష్కరణ చేపట్టబడింది. 1906 మేలో అతివాద నాయకులు శివాజీ ఉత్సవాన్ని విగ్రహారాధనతో జరపాలని పట్టుబట్టారు. అతివాద రాజకీయాలు, హిందూ దుందుడుకువాదం వందేమాతరం సంధ్య యుగాంతర్ పత్రికల నిండా పరుచుకొని వున్నాయి. కాని ప్రతి గ్రూపులో అసమ్మతివాదులు వుంటూ వచ్చారు. బ్రహ్మ సమాజవాదులు సంపాదకులుగా వున్న సంజీవని, ప్రవాసి లాంటి పత్రికలు మత ఛాందసవాదాన్ని విమర్శించాయి. 'మన గతం వైభవోపేతమైన ఆదర్శమని దానిని అభివృద్ధి పరచవలసిన అవసరాన్ని తిరస్కరించే దేశభక్తి ఒక జబ్బు' అని స్పష్టంగా ప్రకటించాయి (ప్రివాసిలో శివనాథశాస్త్రి జయస్థ 1313/1906). మహమ్మదీయులు, వారి సానుభూతిపరులు ఎక్కువగా వున్న కృష్ణకుమార్ మిత్రా యొక్క యాంటీ సర్క్యులర్ సొసైటీ శివాజీ ఉత్సవాలను బహిష్కరించింది. హేమచంద్ర కనుంగో లాంటి కొందరు రివల్యూషనరీ టెర్రరిస్టులు కూడా పెచ్చు పెరుగుతున్న మతధోరణుల్ని తీవ్రంగా నిరసించారు. ఆసక్తికరమైన విషయమేమంటే రవీంద్రనాథ్ ఠాగూర్ తొలుత కొన్ని సంవత్సరాల పాటు పునరుద్ధరణవాదంతో ఊగిసలాడారు. అప్పుడు జరిగిన మత కలహాల ప్రభావంతో నిశితంగా ఆలోచించి మత పునరుద్ధరణవాదం నుండి 1907లో విడివడ్డారు. ఆనాటి ఉద్రిక్తతల్ని సందిగ్ధతల్ని చిత్రిస్తూ 'గోరా' (1907–09) 'ఘరే బైరే' (1914) అనే రెండు గొప్ప నవలల్ని రాశారు.

గాంధేయ నిర్మాణాత్మకమైన పని. మాకుమ్మడి సత్యాగ్రహాలు కొద్దికాలం పాటే మనగలిగాయి. 1908 సంవత్సరాంతానికి బెంగాల్ రాజకీయాలు మితవాదానికి వ్యక్తిగత హింసావాదానికి పరిమితమయ్యాయి. ఎందుకిలా జరిగింది? – అనేది చారిత్రక సమస్య.

బ్రిటిషు పాలకుల అణచివేత అనేది సంతృప్తికరమైన సమాధానం కాజాలదు. పోలీసుల క్రౌర్యాన్ని మృతసేవల్ని గురించి జాతీయవాదులు చాలా చెప్పినప్పటికి 1909 వరకు బెంగాలులో ఉద్యమకారులపై పెట్టిన కేసులు 10, న్యూప్రావిన్సెస్‌లో 105 మాత్రమే. నిందితులకు విధించిన శిక్షలు రెండువారాల నుండి ఒక సంవత్సరం వరకు మాత్రమే. కాల్పులు జరిపిన ఘటనలు రెండు మాత్రమే. ఒకటి: సమ్మె చేసిన జమల్‌పూర్ రైల్వేకార్మికులపైన (1906 ఆగష్టు) రెండు: షేర్‌పూర్‌లో దొమ్మి జరిపిన ముస్లింలపైన (1907 సెప్టెంబరు). ఈ కాలంలో స్వదేశీ ఉద్యమకారులపై కాల్పులు జరపలేదు. కాబట్టి 1905–08 ఉద్యమంలో ప్రధానభాగాలుగా వున్న బహిష్కరణ, స్వదేశీ జాతీయ విద్య కార్మిక సంఘాలు– వీటి యొక్క బలం బలహీనతల్ని పరిమితుల్ని నిశితంగా పరిశీలించి అధ్యయనం చేయవలసివుంది.

## బహిష్కరణ, స్వదేశీ

బెంగాలులోని 'స్వదేశీ' బహిష్కరణ చరిత్ర బూర్జువా ఆకాంక్షలు గలిగి నిజమైన బూర్జువాల మద్దతులేని మేధావివర్గ ఉద్యమం యొక్క పరిమితుల్ని స్పష్టం చేస్తున్నది. బహిష్కరణ తొలుత కొన్ని ఫలితాలు సాధించింది. ఎగుమతులు దిగుమతులపై పన్ను విధించే కలకత్తా కలెక్టరు 1905 ఆగష్టుతో పోలిస్తే 1906 సెప్టెంబరులో నూలు వస్త్రాలలో 22% నూలుదారం 44% ఉప్పు 11% సిగిరెట్లు 55% బూట్లు, చెప్పులు 68% దిగుమతులు తగ్గినట్లు ప్రకటించాడు. మాంచెస్టరు బట్టల అమ్మకంలో తగ్గుదల బ్రిటిషు ఉత్పత్తిదారులకు కలకత్తా మార్వాడీ డీలర్లకు మధ్యగల వాణిజ్య షరతులపై చాలా ప్రభావం చూపింది. ఫలితంగా వాణిజ్య ఒప్పందాల సంఖ్య 1905 అక్టోబరు నాటికి ఒక్కసారిగా 32000 నుండి 2500కి పడిపోయింది. ఈ వివాదం పరిష్కారం కాగానే మార్వాడీలు తిరిగి దళారీ వ్యాపారానికి వెళ్ళిపోయారు. కాని జిల్లాలలో ప్రధానంగా సహా తెగకి చెందిన వర్తకులు దేశభక్తికి లాభాల్ని పణంగా పెట్టడానికి సంసిద్ధం కాకపోవడంతో సామాజిక బహిష్కరణకు గురయ్యారు.

బెంగాలు చాలా విజ్ఞప్తులు చేసినప్పటికి దీనిని అవకాశంగా తీసుకొని బొంబాయి మిల్లు యాజమానులు ధరలు పెంచారు. మాంచెస్టరు నుండి దిగుమతి అయ్యే సన్నని నాజూకు దారాలు, వస్త్రాలు అప్పటికి బొంబాయి ఉత్పత్తి చేయగల స్థితిలో లేదు. కాబట్టి వారు బహిష్కరణ ఉద్యమం పట్ల అంత ఆసక్తిగా లేదు. బూట్లు, చెప్పులు, సిగరెట్లు దిగుమతులు విపరీతంగా పడిపోవడం గమనార్హం. వీటిని కొనేవారు భారతీయ మధ్యతరగతికి చెందిన గుమాస్తాలు, ప్లీడర్లు లాంటివారని కలెక్టరు పేర్కొన్నారు.

స్వదేశీభావజాలం చేనేత సాంప్రదాయ చేతిపనుల వృత్తుల గణనీయ పునరుద్ధరణకు తోడ్పడింది. ఈ వాస్తవాన్ని 1908లో జరిపిన రెండు అధికారిక పారిశ్రామిక సర్వేలు ధృవపరిచాయి. చేతివృత్తులు భారతీయ సంస్కృతి చిహ్నాలని, యివి పెద్ద పరిశ్రమల వలన కలిగే చెడులకు దూరంగా వుంచుతాయని మేధావులు ప్రచారం చేశారు.

ఉదాహరణకు 1900లో సతీష్‌చంద్ర ముఖర్జీ పారిశ్రామిక విప్లవం తెచ్చిపెట్టిన భయోత్పాతాన్ని వివరించేందుకు 'ఎంగెల్స్'ని ఉటంకించారు. అనివార్యమైన పరిస్థితులలోనే పెద్ద పరిశ్రమల్ని కోరాలి అన్నాడు. కులపరమైన కుటుంబ కుటీర పరిశ్రమలకు ప్రాధాన్యత నివ్వాలన్నాడు. మితవాద ఆర్థిక విధానాల నుండి సిద్ధాంతపరంగా (పునరుద్ధరణ వాదాన్ని కలుపుకొని) వైదొలగడం ఆధునిక పరిశ్రమ స్థాపనకు ఆటంకపరచలేదు. విద్యార్థులకు విదేశాలలో (జపాన్‌లో) సాంకేతిక శిక్షణ యిప్పించేందుకు నిధుల్ని సమకూర్చేందుకు జోగేంద్రచంద్రఘోష్ ఒక సంఘాన్ని స్థాపించాడు. 1906 ఆగస్టులో వంగలక్ష్మీ కాటన్‌మిల్స్ అట్టహాసంగా ప్రారంభించబడింది. యంత్రపరికరాలు అప్పటికే వున్న సిరాంపూర్ మిల్లు నుండి తరలించబడ్డాయి. పింగాణి (కలకత్తా పాటరీవర్క్స్ 1906) తోళ్లశుద్ధి, సబ్బులు, అగ్గిపెట్టెలు, సిగరెట్లు పరిశ్రమల స్థాపన ప్రయత్నాలు జయప్రదమయ్యాయి. కాసింబజారు, మణీంద్రనంది లాంటి పెద్ద జమీందార్లు ప్రోత్సాహకులుగా వున్నారు. తగినంత పెట్టుబడి లేకపోవడం పరిశ్రమల స్థాపనకు పరిమితుల్ని విధించింది. 'పరిశ్రమలలో పెట్టుబడులు పెట్టడం కంటె విదేశీ దిగుమతి వస్తువుల ఏజెంటుగా సంపాదించడం చాలా సులభం'– ఇది ఆనాటి వాణిజ్యవేత్తల అభిప్రాయం. బెంగాల్ ఆర్థిక విధానంలోని కీలక రంగాలపై బ్రిటిషువారి పట్టుని స్వదేశీ సడలించలేకపోయింది.

## జాతీయ విద్య

ఇతర రంగాలలో లాగానే జాతీయ విద్యా ప్రయత్నాలలో గణనీయమైన వైవిధ్యాన్ని గమనించవచ్చు. ఒకవైపు ప్రాంతీయభాషా మాధ్యమాల ద్వారా ఎక్కువ సాంకేతిక శిక్షణ కొరకు విజ్ఞప్తులు, మరొకవైపు సాంప్రదాయాన్ని ఆధునికతని మిళితం చేసి ఎంపిక చేయబడిన కొద్దిమందికి ఉన్నత సంస్కారం క్రింద జేసేందుకు రవీంద్రనాథ్ ఠాగూర్ శాంతినికేతన్, సతీష్ ముఖర్జీ, డాన్ సొసైటీ పథకాలు. ఉపాధి అవకాశాలు కల్పించలేని జాతీయవిద్య విద్యార్థులలో అత్యధికుల్ని ఆకర్షించడంలో విఫలమయింది. రెండు సం॥ల తరువాత జాతీయవాద విద్యాసంస్థలు చాలా పరిమిత సంఖ్యలో మనగలిగాయి. 1. బెంగాల్ నేషనల్ కాలేజి (1906 లో స్థాపించబడిన జాతీయ విద్యామండలి. దీనిని యూనివర్శిటీగా అభివృద్ధిపరచాలని ప్రణాళిక సిద్ధం చేయబడింది. కాని దీనికి అనుబంధంగా వుండే కాలేజీలు కొరవడ్డాయి) 2. మితవాదలతో సంబంధాలు కలిగి విడిపోయిన గ్రూపుచే స్థాపించబడిన బెంగాల్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ 3. పశ్చిమ బెంగాల్ బీహార్‌లలో 12 జాతీయ పాఠశాలలు 4. తూర్పుబెంగాల్ జిల్లాలలో గణనీయమైన సంఖ్యలో గల జాతీయ పాఠశాలలు. మెమెన్‌సింగ్, ఫరీద్‌పూర్ బకర్‌గంజ్‌లలోని పాఠశాలల్లో ముస్లిం విద్యార్థులు దిగువ తరగతికి చెందిన నామశూద్ర కులానికి చెందిన విద్యార్థులు ఎక్కువగా వున్నారు. జాతీయ పాఠశాలల్ని గ్రామాలకు విస్తరించడం ద్వారా ప్రాథమిక విద్యపై పట్టు సాధించడం జరుగుతుందని ప్రభుత్వవర్గాలు కొంత కలవరపడ్డాయి. కలకత్తా స్థావరంగా చేసుకొని పనిచేసిన నేషనల్ కౌన్సిల్ అలాంటి గ్రామీణ పాఠశాలల్ని విస్మరించింది. (1908 లో కేటాయించిన 1,25000 బడ్జెటులో కేవలం 12000 మాత్రమే ఈ పాఠశాలపై వెచ్చించింది). ప్రజా ఉద్యమాలలో వీటి పాత్ర తగ్గిపోయింది.

తూర్పు బెంగాలులో చాలా పరిమితమైన పాఠశాలలే మనగలిగాయి. అవి రివల్యూషనరీలను ఎంపిక చేసుకోనే కేంద్రాలయ్యాయి. అలాంటి వాటిలో డక్కా సమీపంలోని సోనారంగ్ జాతీయ పాఠశాల ప్రఖ్యాతిగాంచింది.

**కార్మికుల ఆందోళన**

1905 –08 కాలంలో ఆంద్రూ ఫేజర్ హయాంలో బెంగాల్ పరిపాలన' అనే అంశంపై జరిపిన అధికారిక సర్వే ఈ కాలంలో పారిశ్రామిక అశాంతి గమనించదగిందని, వృత్తిపరమైన ఆందోళనా కారుల పాత్ర నూతనధోరణి అని పేర్కొన్నది. తెల్లవారి అదుపులో వున్న పరిశ్రమలలో (బెంగాలులోని చాలా పరిశ్రమలు వారి అదుపులోనే వున్నాయి) పెరుగుతున్న ధరలు, తరచుగా జాతిపరమైన అవమానాలు, వార్తాపత్రికల ద్వారా జాతీయవాదుల సానుభూతి, ఆర్థిక సహాయం, కార్మికసంఘాల స్థాపన –సమ్మెలు చెలరేగడానికి కారణాలుగా పేర్కొన్నది. తొలి కార్మిక నాయకులుగా ముఖ్యంగా నలుగురిని పేర్కొనవచ్చు. వారు బారిస్టర్లు అశ్వనీకుమార్ బెనర్జీ, ప్రభాత్ కుసుమ్, రాయ్ చౌదరి, అధనాసియస్, అపూర్వకుమార్ ఘోష్ ఉత్తర కలకత్తాలోని ఒక చిన్న ముద్రణాలయం యాజమాని ప్రేమతోష్ బోస్? 1905 సెప్టెంబరులో హౌరాలోని బరక్‌కంపెనీ నుండి 247 మంది గుమాస్తాలు కొత్తగా ప్రవేశపెట్టిన పనివిధానం. అవమానకరంగా వుందని భావించి వాకౌట్ చేశారు. వారిని స్వదేశీవాదులు అభినందించారు. ఆ తరువాత నెలలో కలకత్తాలో ట్రాంబండ్ల సమ్మె జరిగింది. అక్టోబరు 16 రిపోర్టులననుసరించి చాలా ఆఫీసులు మూతబడ్డాయి. వాహనాలు రోడ్లపైకి రాలేదు. కొన్ని జూట్ మిల్లులలో రైల్వే వర్కుషాపులలో సమ్మెలు చేశారు. మొత్తం మీద బంద్ వాతావరణం నెలకొన్నది. బెనర్జీ ఘోష్‌ల ప్రయత్నాలతో సమ్మె పరిష్కరించబడింది.

ప్రభుత్వ ప్రెస్‌లలో తీవ్రమైన సమ్మె జరుగుతున్నప్పుడు అక్టోబరు 21న ప్రింటర్స్ యూనియన్ స్థాపించబడింది. 1906 జూలైలో ఈస్టిండియన్ రైల్వే గుమాస్తాల సమ్మె రైల్వే కార్మిక సంఘ స్థాపనకు దారితీసింది. అసన్సోల్ రాణిగంజ్, జబల్పూర్ మీటింగులలో కార్మికులను సమీకరించడం జరిగింది.ఎ.సి.బెనర్జీ, ఎ.కె. ఘోష్, ప్రేమతోస్‌లతో పాటు బిపిన్‌పాల్ శ్యాంసుందర్ చక్రవర్తి లియాకత్ హుస్సేన్ లాంటి స్వదేశీ నాయకులు ప్రసంగించారు. జమాల్‌పూర్ వద్ద ఆగష్టు 27న కాల్పులుకు దారితీసిన ఘటనలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాని సమ్మె విఫలమయింది. కార్మిక సంఘం కూడా విచ్ఛిన్నమయింది. 1905 –08 మధ్య కాలంలో తరచుగా జూట్‌మిల్లుల్లో సమ్మెలు జరిగాయి. 18 నుండి 37 మిల్లుల్లో సమ్మెల ప్రభావం తీవ్రంగా కన్పించింది. 1906 ఆగష్టులో బడ్జ్ బడ్జ్ వద్ద కార్మిక సంఘం స్థాపించబడింది. కార్మికులతో సంబంధాలు అనివార్యంగా బాబూస్ (గుమాస్తాల) ద్వారా సర్దార్ల ద్వారా పెట్టుకోవలసి వచ్చేది. అలాంటివారు తరచుగా లంచగొండులు, పూజపేరుతో డబ్బు వసూలు చేసే చిన్నతరహా దోపిడీ దారులని 28 నుండి బడ్జ్ బడ్జ్ జూట్‌మిల్లు కార్మికులు సమర్పించిన విజ్ఞాపన పత్రం తెలియజేసింది.

కార్మిక ఉద్యమం అత్యున్నత స్థాయిలో వున్నప్పుడు ఆంగ్లో ఇండియన్ పత్రిక 'పయనీర్' 1906 ఆగష్టు 27న రాజకీయ నాయకుల విభజనకి అనుకూలంగా గాని ప్రతికూలంగా గాని ఆందోళన చేయవచ్చు. కాని కార్మికులలో అసంతృప్తి బీజాలు నాటి దేశ సంక్షేమానికి భంగం వాటిల్లజేస్తే చట్టబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వం శాంతి భద్రతల్ని కాపాడవలసి వుంటుంది" అని హెచ్చరించింది. కొన్ని అతివాద పత్రికలు రష్యన్ తరహా రాజకీయ సాధారణ సమ్మెని గురించి ఊహించాయి. 'ఈనాటి రష్యన్ కార్మికులు అణచివేత కాలంలో తీవ్రమైన నిరసన ఎలా వ్యక్తం చేయాలో బోధిస్తున్నారు. భారతీయ కార్మికులు వారి నుండి నేర్చుకొనరా?' (నవశక్తి 1907 సెప్టెంబరు 14, పాల్‌ని నిర్బంధించిన తరువాత, కాని యివన్నీ ఊహాలు ఆలోచనలుగానే మిగిలిపోయాయి. రాజకీయ సమ్మెలో (తిలక్‌ని విచారిస్తున్న సమయంలో బొంబాయిలో జరిగిన సమ్మెలాంటివి) జరగలేదు. ప్లాంటేషన్ గని కార్మికులపై ఎలాంటి ప్రభావం లేదు. స్వదేశీ సంబంధాలు ప్రధానంగా గుమస్తాలకు మహా అయితే బెంగాల్ జూట్‌మిల్ కార్మికులకు పరిమితమయ్యాయి. కార్మికులలో జాతీయవాద భావాలు 1908 వేసవి కాలం తరువాత ఒక్కసారిగా పూర్తిగా పడిపోయాయి. 1919–22కి ముందు పునరుద్ధరింపబడలేదు.

**సమితులు**

స్వదేశీ ఉద్యమకాలంలో జాతీయవాద స్వచ్ఛందసేవకుల ఉద్యమ ఆవిర్భావం లేక సమితుల స్థాపన ప్రధానంగా చెప్పుకోదగింది. వెనుకచూపు అలాంటి సంస్థల్ని తొలినాటి టెర్రరిస్టు సంస్థలుగా చూడటానికి దారితీయలేదు. 1908 వేసవికాలం వరకు సమితులు పలురకాల కార్యక్రమాలలో నిమగ్నమైన స్వచ్ఛంద సంస్థలు, సభ్యులకు శారీరక మానసిక శిక్షణ యివ్వడం, కరువుకాటకాలు అంటువ్యాధులు సంభవించినప్పుడు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం, చేతివృత్తుల శిక్షణ పాఠశాలల గ్రామసభల నిర్వహణ, మధ్యవర్తిత్వం నెరపే కోర్టుల నిర్వహణ, సహాయ నిరాకరణలోని మెలకువల్ని అమలుపరచడం – లాంటివి సమితుల కార్యకలాపాలుగా వుండేవి. కలకత్తాతో పాటు 19 సమితులు పనిచేస్తున్నట్లు పోలీసు రిపోర్టు పేర్కొన్నది. ఉద్యమానికి ప్రధానమైన బలం తూర్పు బెంగాల్. బకర్‌గంజ్ ఫరీద్‌పూర్, డక్కా, మెమెన్‌సింగ్ జిల్లాలు (ఐదు ముఖ్యమైన సమితులు స్థాపించబడ్డాయి. స్వదేశీ బాంధవ్, బ్రాతి, డక్కా అనుశీలక్, సుహ్రిద్, సాధన – అనే ఐదు సంస్థలు 1990 జనవరిలో నిషేధించబడ్డాయి) బలమైన స్థావరాలుగా వున్నాయి. ఇంకా రంగపూర్, తిప్పెర, గోపాల్‌పుర, గారో పర్వతాలు మినహాయించి అన్ని జిల్లాలలోని కొన్ని సంస్థలు ఉద్యమానికి ఊపు నిచ్చిన ప్రాంతాలు. తూర్పు బెంగాలులో 8485 స్వచ్ఛంద సేవకులు పనిచేస్తున్నట్లు 1907జూన్ పోలీసు రిపోర్టు పేర్కొన్నది. బకర్‌గంజ్, డక్కాలు ఒక్కొక్క దానిలో 2600 మంది స్వచ్ఛందసేవకులు గలిగి అగ్రస్థానంలో వున్నాయి. సమితి ఉద్యమంలో కూడా చాలా వైవిధ్యం వుంది. కలకత్తా కేంద్రంగా పనిచేసిన యాంటీ సర్కులర్ సొసైటీ సెక్యులర్ విధానాలు లక్ష్యంగా పనిచేసింది. (లియాకత్ హుస్సేన్, అబ్దుల్‌హుస్సేన్, దాదర్ బక్స్, అబ్దుల్‌గఫూర్ లాంటి ప్రముఖులు ఈ సమితిలో సభ్యులుగా పనిచేశారు) బాదిసాల్ స్వదేశీ బాంధవ్ సమితి బలమైన ప్రజాపునాది కలిగి వుంది. 1909లో దీనికి 175 గ్రామ శాఖలు వున్నాయి. (1906లో

దాదాపు కరువు పరిస్థితులు నెలకొన్నప్పుడు) ఈ సమితి మానవతా దృక్పథంతో నిలకడగా పనిచేసింది. ఈ సమితి నాయకుడు అశ్వనీకుమార్‌దత్ జిల్లాలోని రైతులలో – హిందువులలో ముస్లింలలో గణనీయమైన పలుకుబడి సాధించారు. పులిన్‌దాస్‌చే స్థాపించబడిన డక్కా అనుశీలక సమితి దీనికి పూర్తి భిన్నంగా ప్రారంభం నుండి శ్రేణులకు హిందూ మతంతో ముడిబడిన ప్రమాణాలు చేయించి శారీరక శిక్షణ యిప్పించింది. 1908 వరకు ఈ సమితులన్ని సాగించిన కార్యకలాపాలలో ప్రజా సంబంధాలు ప్రధాన సూత్రంగా పనిచేశాయి. ప్రాంతీయభాషలలో కరపత్రాలు పత్రికలు ప్రచురించాయి. ఉపన్యాసాలిప్పించాయి. దేశభక్తి గీతాలకు ప్రచారమిచ్చాయి. నాటికలు నాటకాలు లాంటి కళారూపాలు ప్రదర్శించాయి, జాతాలు నిర్వహించాయి. సాంప్రదాయ హిందూ విధానాలకు ప్రచారమిచ్చాయి. ప్రజల భావజాలాన్ని తమ కనుకూలంగా మలుచుకోడానికి, భయపెట్టడానికి (ఉదాహరణకు ప్రభుత్వ విధేయుల్ని కులపరమైన కట్టుబాట్లతో సామాజిక బహిష్కరణని (ప్రయోగించి) హిందూ మతాన్ని వాడుకొన్నాయి.

కాని 1908–09 కాలంలో ప్రభుత్వం మొదటి దఫా అణచివేత. ప్రారంభించగానే బాహాటంగా పనిచేసే సమితి అదృశ్యమయింది. (స్వదేశీ బాంధవ్‌లాగా) లేక రహస్య సంస్థగా మారిపోయింది. అశ్వనీకుమార్ దత్ సంస్థ కూడా గ్రామాలలోని కులీనుల సంఘాలయ్యాయి. ఉదాహరణకు సరూప్‌బాటి (బకూర్‌గంజ్ జిల్లాలలోని) స్వచ్ఛంద సేవకులలో సగం మంది కౌలుదారులు స్వదేశీవాదులపై పెట్టిన కేసులు జమీందారీ అధికారులు ముస్లిం అమ్మకం దార్లకు మధ్య వివాదాలకు సంబంధించినవి. భూస్వామి గ్రామస్తుల్ని మూసివేయించడం ప్రధాన బహిష్కరణ విధానమయింది. జమీందారులు భూస్వాములు కౌలుదార్లపై పాలికాపులపై ఒత్తిడి తీసుకొనిరావడం సామాజిక బహిష్కరణ రూపమయింది. హరీష్‌కుంద్‌లో అణచివేతదారుడైన జమీందారు స్వదేశీ హీరోగా మారడాన్ని రవీంద్రనాథ్ ఠాగూర్ తన 'ఘూరే బైరే' నవలలో చిత్రించాడు. ఇది కల్పన కాదని తంగైల్ (మైమెన్‌సింగ్ జిల్లా)లో 1907 నవంబరు ఘటన స్పష్టం చేసింది. అక్కడ ముస్లిం పాలికాపు కౌలురద్దు చేసుకొని తనంతట తాను వెళ్లిపోయే విధంగా భయోత్పాతం సృష్టించేందుకు హిందూ జమీందారు పాలికాపు యొక్క మాంచెస్టరు బట్టలు తగులబెట్టించాడు.

**హిందూ ముస్లిం సంబంధాలు**

బ్రిటిషువారి 'విభజించి పాలించు' విధానాలకు అనుకూలంగా పరిస్థితులు మార్చబడ్డాయి. నగర ప్రాంతాలకు చెందిన పేదల్ని సమీకరించి పోలీసులు ఉత్తర కలకత్తాలోని స్వదేశీ సానుభూతి పరుల్ని అక్టోబరు 1907లో కొట్టించారు. ఈ ఘటనపై నియమించబడిన విచారణ కమిటీ కొట్టినవారు ధంగార్లు, స్వీపర్లు లాంటి పరమ మూర్ఖులైన అట్టడుగు కులాలవారని పలుమార్లు ప్రకటించింది. ఇలాంటి ఘటనలవలన ప్రత్యేకవాదం వేగంగా పెరిగింది. మతపరమైన ఐక్యత కొరకు పిలుపులిచ్చినప్పటికి, గొప్ప ప్రదర్శనలు (1905 సెప్టెంబరు 23న 10,000 మందితో విద్యార్థులు ఉమ్మడి ప్రదర్శన నిర్వహించారు) చురుకైన చిత్తశుద్ధి గల స్వదేశీ ఆందోళనకారుల గ్రూపు (ఘజ్నావి, రసూలు, దిన్ మహమ్మద్, దేదర్

బర్స్, మోని రుబ్జారుక్, ఇస్మాయిల్ హుస్సేన్ సిరాబి, అబుల్ హుస్సేన్, అబ్దుల్ గఫార్, లియాకత్ హుస్సేన్ లాంటివారు – వీరిలో అత్యధికులు 1907 మేలో రాజద్రోహ నేరం కింద అరెస్టు చేయడానికి సిద్ధం చేయబడిన జాబితాలో వున్నారు) వున్నప్పటికీ – కొత్త ప్రావిన్స్ వస్తే ముస్లింలకు చాలా ఉద్యోగాలు వస్తాయని బ్రిటిష్‌వారు చేసిన ప్రచారం స్వదేశీ ఉద్యమానికి వ్యతిరేకంగా ఎగువ మధ్యతరగతి ముస్లింల్ని ప్రభావితం చేయడంలో గణనీయమైన విజయం సాధించింది. సలీముల్లా గ్రూపు ముస్లిం లీగు (1906 అక్టోబర్‌లో ఢక్కాలో స్థాపించబడింది)ల కులీన రాజకీయాల్ని గురించి తర్వాత చర్చిద్దాం. ప్రస్తుతం తూర్పు బెంగాల్‌లోని మెమెన్‌సింగ్ జిల్లాలోని ఈశ్వర్‌గంజ్ (1906 మే) కొమిల్లా (1907 మార్చి) జమాల్‌పూర్, దివాన్‌గంజ్, బక్షీగంజ్, మెమెన్‌సింగ్ అంతటా (1907 ఏప్రిల్, మే) జరిగిన మత కలహాలకు పరిమితమవుదాం. కొమిల్లా పట్టణాలలో జరిగిన క్రింది తరగతికి చెందిన సాధారణ ముస్లింలు ప్రధాన పాత్రధారులు. మెమెన్‌సింగ్ ఘర్షణలకు వ్యవసాయ సంబంధాలు కారణం. హిందూ జమిందారులు, మహాజనులు లక్ష్యాలుగా దాడులు జరిగాయి. వీరిలో కొందరు యిటీవల 'ఈశ్వర్ బ్రిత్తి' హిందూ దేవాలయాల నిర్వహణకు వసూళ్లు ప్రారంభించారు. చాలాచోట్ల ప్రామిసరీ నోట్లు కౌన్సిల్ చేయబడ్డాయి. కొన్ని చోట్ల 'ధనికుల్ని దోచి పేదలకు పంచే' పేరుతో దాడులు జరిగాయి. వీటిలో హిందూ వ్యవసాయదాడులు కూడ చేశారు. బ్రిటిష్‌వారు ఢక్కా నవాబు సలీముల్లాకు అధికార బాధ్యతలు అప్పజెప్పనున్నారని మౌల్వీలు వదంతులు వ్యాపింపచేశారు. కరపత్రాలలో నవాబుని మహా పురుషునిగా కీర్తించారు. అలాంటి మత నాయకులకు జనపనారతో అభివృద్ధి చెందుతున్న సంపన్న రైతులతో సంబంధాలు వున్నాయి. రెడ్ పాంప్లెట్ (1907), ఆ తరువాత కృషిక్ బంధు (1910)లాంటి ప్రచార సాహిత్యం పెట్టుబడిదారీ వ్యవసాయ అభివృద్ధి జరుగుతుందని, అదే సమయంలో హిందూ జమిందారు దోపిడీదారుడవుతాడని అంచనా వేసింది.

ఘర్షణలకు బ్రిటిష్‌వారిని నిందించడం సరియైన వైఖరి కాదని రవీంద్రనాథ్ ఠాగూర్ 1907–08 కాలంలో రాసిన వ్యాసాలలోను, పబ్నా ప్రాంతీయ సదస్సు అధ్యక్షోపన్యాసంలోను స్పష్టం చేశాడు. ఏదో దోషం కనిపించేంత వరకు సైతాన్ కూడా ప్రవేశించలేదు. "కొద్దిమంది విద్యావంతులుగా వున్న మనల్ని దేశంలోని లక్షలాది మంది నుండి ఒక మహాసముద్రం వేరు చేస్తున్నది" – ఇది కీలకమైన సమస్య. ఈ అగాధం పూడ్చబడేవరకు టెర్రరిస్టు చర్యలు లాంటి దగ్గరి దారులు వెతకడం నిష్ప్రయోజనం కాని ఠాకూర్ ప్రత్యామ్నాయం – గ్రామాలలో ఓపికతో కూడిన నిర్మాణాత్మక పని. ఈ పనిలో జమిందారులు పితృవాత్సల్యంతో చొరవ తీసుకోవాలని (తాను తన ఎస్టేట్‌లో చేస్తున్న విధంగా) ఆశించాడు. బ్రిటిష్‌వారి అణచివేతతో రెచ్చగొట్టబడిన యువకులపై రవీంద్రుని విజ్ఞప్తి ఎలాంటి ప్రభావం చూపలేకపోయింది. రవీంద్రుని వద్ద కూడా ప్రజల్ని సమీకరించేందుకు నిర్దిష్టమైన సామాజిక ఆర్థిక కార్యక్రమం లేదు. ఆయన విజ్ఞప్తి ఎడారిలో వేసిన పొలికేక అయింది. 'ఘరే బైరే' నవలలో నాయకుడు ఉదాత్తుడు అయినప్పటికీ ప్రజల్ని ప్రభావితం చేయలేక ఒంటరివాడవుతాడు. ఇది అంతకుముందు ఆశావాదంతో ముగించిన గోరా నవలకు భిన్నమైన వైఖరి.

అత్యధిక జాతీయవాదుల దృష్టిలో ముస్లింలు బ్రిటిష్‌వారి కిరాయి ఏజెంట్లు. వందేమాతరంలో ప్రస్తావించినట్లు వీరు 'రష్యన్ ప్రతీఘాత విప్లవంలోని బ్లాక్ హండ్రెడ్స్'. 1907 ఘర్షణలతో స్వచ్ఛంద సంస్థలు ఉద్రిక్తతకు లోనయ్యాయి. అతివాదుల ప్రచారం దుందుడుకు హిందూ మతతత్వం రంగును పులుముకున్నది. టెర్రరిజం దిశగా తప్పుదారి పట్టింది. ఇది అనివార్యమైన పరిణామం.

**టెర్రరిజం వైపు మొగ్గు**

మొదటి రివల్యూషనరీ గ్రూపులు 1902లో మిడ్నాపూర్‌లో (జ్ఞానేంద్రనాథ్ బసు చేత) కలకత్తాలో ప్రమోద్ మిట్టర్ చేత బరోడా నుండి వచ్చిన అరవింద ఘోష్ దూతలైన జతీంద్రనాథ్ బెనర్జీ, బరీంద్ర కుమార్ ఘోష్‌ల చేత ప్రారంభింపబడ్డాయి. వాటి కార్యకలాపాలు సభ్యుల శారీరక మానసిక శిక్షణకు పరిమితమయ్యాయి. వీటికి 1907, 1908 వరకు అంతగా గుర్తింపు లేదు. బరీంద్రనాథ్ ఘోష్, భూపేంద్రనాథ్ దత్తాలు అరవిందుని సలహా మేరకు కలకత్తా అనుశీలక సమితి ముఖ్యులతో కలిసి 1906 ఏప్రిల్‌లో 'యుగాంతర్' వారపత్రికని ప్రారంభించారు. అదే సంవత్సరం వేసవిలో ఒకటి రెండు ఫలించని చర్యలకు (తూర్పు బెంగాల్ లెఫ్టినెంట్ గవర్నరుని హత్య చేయాలనే పథకం లాంటివి) ప్రయత్నించారు. మొదటి తరం విప్లవకారులలో ఎన్నదగిన హేమచంద్ర కమంగో మిలిటరీ (కొంత రాజకీయ) శిక్షణ పొందేందుకు విదేశాలకు వెళ్ళారు. అతడు పారిస్‌లో ప్రవాస జీవితం గడుపుతున్న రష్యన్ల వద్ద శిక్షణ పొందారు. కనుంగో 1908లో తిరిగి వచ్చిన తరువాత కలకత్తా పరిసరాలలోని మానిక్‌టాలలోని గార్డెన్ హౌస్‌లో మతపరమైన పాఠశాల మరియు బాంబు ఫ్యాక్టరీ ప్రారంభించారు. కాని ఖుదీరాం బసు ప్రఫుల్ల చకీల ప్రత్యేకించి బరేంద్ర కుమార్ ఘోష్‌ల నిర్లక్ష్యం అరవిందతో సహా మొత్తం నాయకత్వం అరెస్టుకు దారితీసింది. కాని అసలు లక్ష్యంగా పెట్టుకున్న బ్రిటిష్ మేజిస్ట్రేట్ కింగ్స్‌ఫోర్డు నిరపాయంగా తప్పించుకోగలిగారు. ఈ కాలంలోనే తూర్పు బెంగాల్‌లోని డక్కా అనుశీలన సమితి సమర్ధవంతంగా టెర్రరిస్టు చర్యలు చేపట్టింది. బారా బంది పోటు (1908 జూన్ 2) అది చేపట్టిన మొదటి చర్య.

దేశభక్తి గీతాలు సాంస్కృతిక విజయాలతో పాటు (ప్రాంతీయ స్థానిక జానపద సాంప్రదాయాల చరిత్ర, జె.పి. బోస్, పి.పి.రేల శాస్త్ర పరిశోధనలు, అబనీంద్ర ఠాగూర్‌చే కలకత్తా తరహా చిత్రలేఖనం) స్వదేశీ బెంగాల్ వారసత్వంలో రివల్యూషనరీ టెర్రరిజం భాగమయింది. విద్యావంతులైన ఒక తరానికి చెందిన యువతరంపై తీవ్ర ప్రభావం చూపింది. రివల్యూషనరీ ఉద్యమం నిరంకుశ అధికారుల దేశద్రోహుల హత్యకు, బ్రిటన్ శత్రువుల నుండి సహాయం పొందే అంచనాలతో మిలిటరీ కుట్రల రూపాలుగా సాగింది. ఉద్యమం పట్టణ నగర ప్రాంతాలలో తిరుగుబాటు లేక గ్రామీణ ప్రాంతాలలో గెరిల్లా స్థావరాల స్థాయికి ఎదగలేదు.

విద్యావంతుల రివల్యూషనరీ జాతీయ పోరాటానికి గణనీయంగా తోడ్పడింది. బ్రిటిష్‌వారు భయకంపితులయ్యారు. సంపూర్ణ స్వతంత్ర సాధన (కాంగ్రెస్ సూత్రప్రాయంగా 1930లో అంగీకరించిన తీర్మానం) లక్ష్యం కొరకు ప్రాణాల్ని సైతం లెక్కపెట్టకుండా పోరాడిన

అరుదైన ఘటనలు జరిగాయి. ఆయుధాల కొరకు, ఆశ్రయం కొరకు ప్రపంచవ్యాప్తంగా పెట్టుకొన్న సంబంధాలు కొన్ని ముఖ్యమైన సైద్ధాంతిక పరిణామాలకు దారితీశాయి. ఉదాహరణకు హేమచంద్ర కనుంగో పారిస్ నుండి నాస్తికుడిగా కమ్యూనిజం పట్ల కొంత ఆసక్తిని పెంచుకొని తిరిగి వచ్చాడు. టెర్రరిజం పట్ల విద్యావంతులైన యువకులు ఆకర్షితులయ్యారు. కొన్ని సందర్భాలలో యితరులు కూడా ఉదాహరణకు ఖుదీరాం ఉరితీయబడిన చాలా దశాబ్దాల వరకు కూడా ఒక వీధి బిచ్చగాడు వ్యక్తీకరించిన ఆందోళన బెంగాల్‌లో మారుమోగింది. కాని బ్రిటిష్ పరిపాలన కూలిపోయేంత ప్రమాదంలో పడలేదు. తొలినాటి మత సంస్థల తీవ్రమైన మతతత్వం ముస్లింలను వేరుగా లేక ప్రతికూలంగా వుంచడానికి తోడ్పడింది. హేమచంద్ర తరువాత స్పష్టం చేసినట్లు మతంలో యితర ప్రతికూల అంశాలు కూడా వున్నాయి. తరచుగా ఉటంకించబడే గీత నిష్కామకర్మ సిద్ధాంతం. ఆత్మ త్యాగం నిర్దిష్టమైన లక్ష్యం కొరకు గాక ప్రతిఫలాపేక్ష లేకుండా చేయమని చెప్పింది. "తల్లి మనల్ని పథకాలు ప్లానులు పద్ధతుల్ని గురించి అడగదు. తనంతట తానే వాటిని రూపొందిస్తుంది..." (1908 ఏప్రిల్లో అరవింద ఘోష్) గౌరవప్రదంగా వెనుకడుగు వేయడానికి మతం రాచమార్గం అయింది. అరవిందుడు పాండిచ్చేరి చేరి స్థిరపడ్డాడు. జతీంద్రనాథ్ బందోపాధ్యాయ రామకృష్ణ మిషన్ స్వామీజీగా మారాడు.

విద్యావంతుల చర్య ప్రజాసమూహాలకు చురుకైన రాజకీయ పోరాటంలోకి సమీకరించే ప్రయత్నాలను అడ్డుకొన్నది. జాతీయ సమస్యల్ని సరియైన కార్యక్రమం ద్వారా సామాజిక ఆర్థిక సమస్యలతో అనుసంధానం చేయడాన్ని వెనక్కి నెట్టేసింది. బెంగాల్ రివల్యూషనరీ టెర్రరిజం యొక్క సామాజిక పరిమితులు చాలా స్పష్టమే : 1918 ప్రభుత్వ రికార్డుల ననుసరించి చంపబడిన లేక శిక్షలు విధించబడిన 186 మంది రివల్యూషనరీలలో 165 మంది మూడు అగ్రకులాలలో – బ్రాహ్మణ, కాయస్థ, వైశ్య కులాలకు చెందినవారు.

## ఇతర రాష్ట్రాలలో అతివాదం : 1905 - 1908

ఇప్పటి వరకు బెంగాల్‌ని కేంద్రీకరించి పరిస్థితుల్ని పరిశీలించాం. ఇతర రాష్ట్రాలలో అతివాద ధోరణులు ఎలా అభివృద్ధి చెందాయి? అఖిల భారత స్థాయిలో అతివాదులు మితవాదుల్ని ఎలా ఎదుర్కొన్నారు? అంశాల్ని పరిశీలిద్దాం.

కర్జన్ చర్యలు, ప్రత్యేకించి బెంగాల్ విభజన దేశవ్యాప్తంగా గల విద్యావంతులలో తీవ్రమైన అసంతృప్తికి కారణమయింది. స్పందనల స్వభావం, విస్తృతి ప్రాంతీయ స్థానిక అంశాలపై ఆధారపడి వుంటుంది. ఉదాహరణకు బీహారు ఒరిస్సా అస్సాంలలో విద్యావంతులైన బెంగాలీలు ఉద్యోగాలలో, వృత్తులలో ఆధిపత్య స్థానంలో వుండటం వలన ఆదరాభిమానాలు కోల్పోయారు. విద్యావ్యాప్తితో కులీన వ్యతిరేక ఉద్యమాలు అభివృద్ధి చెందాయి. బీహారు, ఒరిస్సాలు ప్రత్యేక రాష్ట్రాలుగా విడిపోవాలనే డిమాండ్ ముందుకు వచ్చింది.

యునైటెడ్ ప్రావిన్సుని ప్రభావితం చేయడంలో కూడా అతివాదం విఫలమయింది. 1880 దశాబ్దం చివరలో కాంగ్రెస్ ప్రారంభమైన తొలినాటి ఊపు ఉత్సాహం తగ్గిపోయాయి. కాంగ్రెస్ కార్యకలాపాలు మందగించాయి. హిందువుల వైపు మొగ్గు చూపుతున్న మెర్‌డొనెల్ ప్రొవిన్షియల్ ప్రభుత్వానికి సహకరించడం ద్వారా గణనీయమైన స్థానిక ప్రయోజనాలు పొందవచ్చునని మదన్ మోహన్ మాలవ్యా మోతీలాల్ నెహ్రూ లాంటి నాయకులు భావించారని బెయిలీ అలహాబాద్‌పై చేసిన అధ్యయనంలో పేర్కొన్నారు. కోర్టులలో హిందీకి ఉర్దూతో సమాన స్థాయి కల్పించేందుకు చేయబడిన 'నాగరి' తీర్మానం (1900) నాగరి ప్రచారణ సభకు ప్రభుత్వ నిధులు, బనారస్‌లో హిందూ యూనివర్శిటీ ప్రతిపాదనలకు సానుకూల వైఖరి – వీటితో మాలవ్యా తృప్తి చెందారు. బ్రిటిష్‌వారు కూడా ప్రత్యేకించి యు.పి. చెక్కెరకి రక్షణ కల్పించడం లాంటి రాజకీయేతర స్వదేశీ వైఖరి పట్ల సానుకూలంగా వున్నట్లు కన్పించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో 1907లో నైనిటాల్‌లో జరిగిన పారిశ్రామిక సదస్సుకు ప్రభుత్వం మాలవ్యా చింతామణిలను ఆహ్వానించింది. 1907లో తిలక్ యు.పి. పర్యటన విద్యార్థులలో కదలిక తెచ్చింది. కాని ముఖ్యమైన రాజకీయ నాయకుల కార్యక్రమాలకు దూరంగా వుండిపోయారు. మాలవ్యా అప్పటికే హిందీ భాష ఉద్వేగపరుల్ని, హిందూ పునరుద్ధరణవాదుల్ని తన తరహా రాజకీయాల్లో కలుపుకున్నాడు. అలా చేసి వుండకపోతే వారు అతివాదులకు చేరువై వుండేవారు. 1917 వరకు మేధావి వర్గానికి చెందిన ఏ గ్రూపు కూడా రైతులతో సంబంధాల కొరకు ప్రయత్నాలు చేయలేదు. బనారస్‌లో అతివాదం మరాఠీ బెంగాలీలతో కలిసి గణనీయమైన శక్తిగా ఎదిగింది. రివల్యూషనరీ గ్రూపు ఆవిర్భవించింది. మొఖారచంద్ర సహధ్యాయ్ (1907 డిసెంబర్‌లో సంధ్య సంపాదకుడు బ్రహ్మోబాంధవ మరణానంతరం) ద్వారా కలకత్తాతో సంబంధాలు పెట్టుకొన్నది. సచీంద్రనాథ్ సన్యాల్ అనే ప్రముఖ నాయకుడిని తయారు చేసుకొన్నది. ప్రజా బాహుళ్యానికి చెందిన రాజకీయాలకు అంతగా లేకపోవడం వలన సుందర్‌లాల్ లాంటి విద్యార్థి నాయకులు టెర్రరిజం పట్ల ఆకర్షితులయ్యారు. రాష్ట్రం ప్రత్యేకించి బనారస్ భౌగోళిక ఉనికి రీత్యా బెంగాల్ పంజాబ్ రివల్యూషనరీ గ్రూపులకు స్థావరమయింది.

బొంబాయి ప్రెసిడెన్సీలోని గుజరాతీ భాష మాట్లాడే జిల్లాలలో అతివాదం విఫలమయింది. 1907లో ఫిరోజ్ షా మెహతా నాగపూర్‌లో జరగవలసిన కాంగ్రెస్ సదస్సుని మతవాదులకు బలమైన స్థావరంగా వున్న సూరత్‌కి మార్పించాడు. కున్వర్జీ కళ్యాంజీ మెహతాలు సంపన్న గుజరాతీ రైతు సోదరులు సదస్సుకి హాజరయ్యారు. లాల్, బాల్, పాల్ త్రయంచే ప్రభావితులయ్యారు. పతీదార్ యువక మండల్ ద్వారా సంస్థాగత కార్యకలాపాలు ప్రారంభించారు. వీరి కృషి 1920 దశాబ్దంలో గాంధేయ బార్డోలీ విజయగాథకు కారణమయింది.

**పంజాబ్**

సువ్యవస్థిత వాణిజ్య కుటుంబాలతో (ప్రధానంగా ఖత్రి, అగర్వాల్, ఆరోరాలతో) పంజాబ్‌లో బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ విద్యారంగాలలో స్వదేశీ నిర్మాణాత్మక కార్యకలాపాలకు మూలాలు 1890 దశాబ్దంలోనే పడ్డాయి. 1895 ప్రతి విధాన శుల్కం తరువాత విదేశీ

వస్త్రాల్ని బహిష్కరించాలనే ప్రతిపాదనలు వచ్చాయి. ట్రిబ్యూన్ పత్రిక నడిపిన హరికృష్ణలాల్ నాయకత్వాన గల పోటీ బ్రహ్మ సమాజ గ్రూపుతో పాటు 'కాలేజీ గ్రూపు'తో సంబంధాలు గల ఆర్య సమాజవాదులు స్వయం సహాయక ప్రయత్నాలు చేశారు. ఆర్య సమాజవాదులు (ఒక మేరకు పంజాబీ బ్రహ్మ సమాజవాదులు) స్వదేశీ నిర్మాణాత్మక కార్యకలాపాల్ని సమరశీల హిందూ చైతన్యంతో మిళితం చేశారు. లజపతిరాయ్ స్వీయచరిత్ర స్పష్టం చేస్తున్న విధంగా 1880 దశాబ్దం నాటి హిందీ ఉర్దూ వివాదం ఆయన్ని హిందూ జాతీయ వాదానికి కట్టుబడి వుండేలా చేసింది. లజపతి బాల్యంపై అధికంగా గల ఇస్లాం ప్రభావాన్ని ముస్లిం నిరంకుశ పాలనని వర్ణించే ప్రభుత్వ పాఠశాలల పాఠ్య పుస్తకాలు చెరిపివేశాయి. దేవ నాగర లిపి అక్షరాలు నేర్చుకొనకముందే హిందీ అనుకూల ఉపన్యాసాలు యివ్వడం ప్రారంభించాడు (ఆనాటి ఉత్తర భారత మేధావులకు భావ వ్యక్తీకరణకు ఉర్దూ అతి సన్నిహితంగా వుండేది) కాంగ్రెస్‌తో ఈ పంజాబీ గ్రూపుకి గల సంబంధాలు పాశ్చాత్యీకరణ చెందినవిగా లేక సెక్యులర్‌గా వున్నట్లు భావించబడేవి.

1904 – 1907 మధ్య పంజాబ్ అతివాదం వైపు మొగ్గడానికి కారణం అచటి గ్రూపుల మధ్య విభేదాలు కావచ్చు. లజపతి, హన్స్‌రాజ్‌కి చెందిన ఆర్య సమాజ గ్రూపు పంజాబ్ నేషనల్ బ్యాంక్, భారత ఇన్స్యూరెన్స్ యాజమాన్యం విషయంపై లాలా హరికిషన్ లాల్ గ్రూపుతో తీవ్రంగా పోట్లాడింది. ట్రిబ్యూన్‌కి పోటీగా పంజాబీకి (స్వయం సహాయక లక్ష్యంతో) 1904 అక్టోబర్‌లో ప్రారంభించారు. కాని 1906 వరకు పంజాబీ తరహా అతివాదం ఆచరణలో బహిష్కరణకు బదులుగా నిర్మాణాత్మక పనిపై కేంద్రీకరించి మితవాద కాంగ్రెస్ నాయకులతోను, అలాగే మహమ్మద్ షఫీ ఫజల్–ఇ–హస్సేన్ నాయకత్వంలో గల ఉమ్మడి వేదుకల్ని కోరుతూ బెంగాలీ అతివాదం కంటే చాలా మందకొండిగా వుంది.

బ్రిటిష్‌వారి కవ్వింపు చర్యలు 1907 సంవత్సరంలోని కొన్ని నెలల్లో పంజాబ్ పరిస్థితిని పూర్తిగా మార్చి వేశాయి. భారతీయుల్ని తీవ్రంగా దూషిస్తూ సివిల్ మిలిటరీ గెజెట్‌లో అడ్డమైన రచనలు వస్తున్న సందర్భంలో తెగల పరమైన వివక్షతను గురించి రాసిన ఒక పంజాబీ రచయితపై విచారణ సాగించడానికి పంజాబీ మేధావులు ఆగ్రహోదగ్రులయ్యారు. పంజాబీ ఎడిటర్‌పై సాగించిన విచారణ 1907 ఫిబ్రవరిలో ఆ తరువాత మేలో లాహోర్ ప్రదర్శనలకు తెల్లవారిపై దాడులకు దారితీసింది. భూమి పరాయీకరణ చట్టాన్ని (Land Alienation Act) కఠినతరం చేయాలన్న ప్రతిపాదనలు నగర హిందూ వాణిజ్య వృత్తిపరమైన గ్రూపులకు ఆగ్రహం తెప్పించాయి. కాని కొన్ని ప్రాంతాలలో రైతాంగంలోని అసంతృప్తి సమరశీలత బ్రిటిష్ వారిని భయకంపితుల్ని చేసింది. అంతేగాక పంజాబ్ బ్రిటిషిండియాకి మూడవవంతున సైన్యాన్ని సమకూర్చుతుంది. బ్రిటిష్‌వారి నీటి పారుదల సౌకర్యాలచే సారవంతం చేయబడిన లైలాపూర్ కేంద్రంగా గల చీనాబ్ కెనాల్ ప్రాంతంలో వలస వచ్చిన రైతులకు, మాజీ సైనికులకు, పెద్ద పెట్టుబడిదార్లకు (వీరి ఎస్టేట్లు కొన్ని సందర్భాలలో 2500 ఎకరాలకు మించి వున్నాయి.) కేటాయించబడ్డాయి. ఆ ప్రాంతం మొత్తం వలస అధికారుల (వారి ఉత్తర్వుల్ని అతిక్రమించినవారిపై పెద్ద మొత్తాలు జరిమానాలు విధించబడ్డాయి) నిరంకుశ ఉత్తర్వులచే

అదుపు చేయబడింది. 1906 అక్టోబర్‌లో చీనాబ్ కాలనీస్ బిల్లు ప్రవేశపెట్టి విధానాన్ని కఠినతరం చేయాలని నిర్ణయం చేయబడింది. సిరాజుద్దీన్ అహమ్మద్ తన పత్రిక జమిందార్‌తో 1903 నుండి నిరసన ఉద్యమం చేపట్టారు. 1907 ప్రారంభానికి చీనాబ్ వలసదారులు (ముస్లింలు, సిక్కులు, హిందువులు మతపరమైన ఐక్యతతో) విస్తృత రాజకీయ నాయకత్వం కొరకు ఎదురుచూస్తున్నారు. ఈ మధ్యకాలంలో 1906 నవంబర్‌లో బావిదోయబ్ ప్రాంతం (ప్రధానంగా సిక్కు రైతులు నివసించే అమృత్‌సర్, గురుదాస్‌పూర్, లాహోర్ జిల్లాలలో)లో నీటి పన్ను 25%, కొన్ని చోట్ల 50శాతం పెంచబడింది. రావల్పిండి జిల్లాలో కూడా భూమి శిస్తు పెంచబడింది. ప్లేగు, ధరల పెరుగుదల ప్రజల అసంతృప్తిని పెంచాయి. రెవెన్యూ సిబ్బంది చాలా సమ్మెలు చేశారు. 1907 ప్రారంభంలో వాయవ్య రాష్ట్రంలో జరిగిన రైల్వే (వాయవ్య రాష్ట్ర రైలు మార్గం చీనాబ్ కాలనీ మధ్యగా పోతుంది) సమ్మె పంజాబ్ లెఫ్టినెంట్ గవర్నర్ డెన్జిల్ ఇబెట్సన్ వెన్నులో చలి పుట్టించింది.

రైతుల్ని రెచ్చగొట్టాడన్న నేరారోపణపై లజపతిరాయ్‌కి దేశ బహిష్కరణ శిక్ష విధింపబడినప్పటికి ఆయన తన స్వీయ చరిత్రలో దానిలో తన పాత్ర పరిమితమైనదేనని పేర్కొన్నాడు. ఆయన 1907 ఫిబ్రవరిలో చీనాబ్ కాలనీవాసుల్ని ఉద్దేశించి ప్రసంగించడానికి రెండుసార్లు లైలాపూర్ వెళ్ళాడు. ఆయన తన కార్యక్రమాలలో చాలా సంయమనం పాటించారు. కాని వాస్తవంగా లాహోర్‌లో అజిత్‌సింగ్ (భగత్‌సింగ్ చిన్నాన్న) ఆధ్వర్యంలో నిర్వహించబడిన 'అంజుమన్ ఇ మొహిబ్బన్–ఇ–వతన్' అనే తీవ్రవాద సంస్థ 'భారతమాత' (హిందూ పత్రిక, మహమ్మదీయ సంస్థ) ఇబ్బట్సన్‌కి వణుకు పుట్టించాయి. చాలా బెంగాల్ సమితుల లాగానే అజిత్‌సింగ్ గ్రూపు కూడా టెర్రరిజం మార్గం పట్టింది. కాని 1907లో చీనాబ్ కాలనీ, బారిడోయబ్ రైతులలో శిస్తులు నీటి తీరువాలు చెల్లించవద్దని చురుకుగా ప్రచారం చేసింది. శిస్తు నీటి పన్ను యితర పన్నులు చెల్లించకుండా ఆపడం చాలా ప్రమాదకరమని, అలాంటి వారిపై తీవ్రమైన చర్యలు చేపట్టబడతాయని 1907 ఏప్రిల్ 30న ఇబ్బట్సన్ ప్రకటించాడు. విద్రోహకరమైన సమావేశాలకు సిపాయిలు హాజరయినట్లు సమాచారం అందింది. అజిత్‌సింగ్ మీడియాకు సహకరించినందుకు ఐదుగురు ప్రముఖ లాయర్లని కోర్టు నుండి బహిష్కరించినందుకు ప్రజలు ఆగ్రహించారు. లాహోరు నగరంలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. రైల్వే ఇంజనీరింగ్ కార్మికులు, ఆయుధాగార కార్మికులు సమ్మెలు చేశారు. బ్రిటిష్‌వారి బంగళాలపై దాడులు చేశారు.

కాని త్వరలోనే అతివాదం తగ్గుముఖం పట్టింది. 1907లో ప్రభుత్వం రాజకీయ సభలపై నిషేధం విధించింది. లజపతిరాయ్ అజిత్సింగ్‌లకు దేశ బహిష్కరణ శిక్ష విధించింది. కాని అణచివేత చర్యల్ని తక్కువగా చూపేందుకు ప్రభుత్వం కొన్ని రాయితీలు ప్రకటించింది. రాయితీలు : చీనాబ్ కాలనీస్ బిల్లుకు వైస్రాయి వీటో, నీటి పన్నులలో తగ్గింపులు, దేశ బహిష్కరణ శిక్ష విధించిన వారిని 1907 సెప్టెంబర్‌లో విడుదల చేయుట. 1908–09లో చాలా జిల్లాలలో నిష్క్రియాపరంగా వున్న కాంగ్రెస్ సంస్థల స్థానంలో హిందూ సభలు పుట్టుకొచ్చాయి. దీనికి పూర్తి విరుద్ధంగా భాయి పరమానందలాంటి కొద్దిమంది ఆర్య

సమాజవాదులు హర్‌దయాళ్‌లాంటి ప్రతిభావంతులైన విద్యార్థులతో పాటు అజిత్సింగ్ (యు.పి.లోని సూఫి అంబిప్రసాద్ అభ్యుదయ కవి లాల్‌చంద్ ఫలక్‌లాంటి) ఆయన అత్యంత సన్నిహితులు పూర్తి స్థాయి రివల్యూషనరీ టెర్రరిస్టులుగా ఎదిగారు.

## మద్రాసు

మద్రాసు ప్రెసిడెన్సీలో అతివాద భావాలు రెండు వేర్వేరు ప్రాంతాలలో ఆంధ్ర డెల్టా ప్రాంతం, దక్షిణాది చివర గల తిరునల్వేలి జిల్లాలో గణనీయమైన ప్రాచుర్యం పొందాయి. ఇందుకు ముఠా తగాదాలు కారణం అంటారు వాష్‌బ్రూక్. ఈ సమయంలో అప్పటికి ఆధిపత్య స్థానంలో వున్న వి. కృష్ణస్వామి అయ్యర్ నాయకత్వంలోని మైలాపూర్ గ్రూపుని ఎగ్మోర్ గ్రూపు నాయకులు (1880లలో ప్రముఖంగా వుండి ఆ తరువాత వెనక్కి నెట్టివేయబడిన జి. సుబ్రమణ్య అయ్యర్) గ్రామీణ ప్రాంతాలకు చెందిన గ్రూపులు (రాజమండ్రికి చెందిన టి. ప్రకాశం, మచిలీపట్నానికి చెందిన ఎం. కృష్ణారావు, తిరునల్వేలి జిల్లాలోని టూటికోరన్‌కి చెందిన వి.ఓ. చిదంబరం) సవాలు చేశాయి. మద్రాసుకి చెందిన ప్రముఖ హిందూ పత్రిక ఎగ్మూరు గ్రూపు ఆధిపత్యం కింద వుంది. ప్రకాశం, కృష్ణారావు 1904లో మచిలీపట్నం నుండి కృష్ణాపత్రిక ప్రారంభించారు.

బెంగాల్ ఉద్యమానికి సానుభూతిగా 1906 నుండి రాజమండ్రి కాకినాడ మచిలీపట్నం లాంటి ఆంధ్రా డెల్టా జిల్లాలలో సభలు, సమావేశాలు నిర్వహించబడ్డాయి. ఎం. కృష్ణారావు ఆహ్వానం మేరకు 1907 ఏప్రిల్‌లో బిపిన్‌పాల్ జరిపిన పర్యటనకు వందేమాతరం ఉద్యమం పేరుతో మంచి ప్రోత్సాహం లభించింది. వందేమాతరం బాడ్జీలు ధరించి పాల్ సభలకు హాజరైన రాజమండ్రి విద్యార్థులపై చేపట్టిన అణచివేత చర్యలు విద్యార్థుల సమ్మెకు దారితీశాయి. ఆ తరువాత ఆంధ్రాలో జాతీయ పాఠశాలల స్థాపన ప్రారంభమయింది. వందేమాతరమని నినదించిన ఒక బాలుని చెవులు మెలిపెట్టి శిక్షించిన యూరోపియన్ దుశ్చర్యకు నిరసనగా కోపంతో రెచ్చిపోయిన ప్రజా సమూహం 1907 మే 31న కాకినాడ యూరోపియన్ క్లబ్బుపై దాడి చేసింది. స్వదేశీ వాతావరణం తెలుగు భాషా సంస్కృతి, చరిత్రల పట్ల ఆసక్తిని పెంచింది (ఆంధ్రుల చరిత్ర 1910లో ప్రచురించబడింది). అతివాదం వెనుకపట్టు పట్టిన తరువాత తెలుగు మాట్లాడే ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ప్రకాశం, కొండా వెంకటప్పయ్య, పట్టాభి సీతారామయ్యలు 'ఆంధ్ర మహాసభ' నిర్వహణ ప్రారంభించారు.

టూటికొరన్ రేవు పట్టణం కేంద్రంగా తిరునల్వేలి జిల్లాలో ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలు ప్రభుత్వాన్ని కలవరపరిచాయి. మద్రాసులో తిరునల్వేలి జిల్లాలో మాత్రమే బ్రిటిష్ వ్యతిరేక భావాలు ప్రచారమవుతున్నట్లు 1906 డిసెంబర్ అధికార రిపోర్టు పేర్కొన్నది. బి. సుబ్రమణ్య అయ్యర్ 1906-07లో జిల్లాలో చాలాసార్లు పర్యటించారు. టూటికోరన్‌కి చెందిన వకీలు వి.ఒ. చిదంబరం పిళ్ళె ముఖ్యమైన అతివాద నాయకుడిగా ఎదిగాడు. స్టీమర్లను కొలంబో వరకు నడిపేందుకు 1906లో స్వదేశీ స్టీం నేవిగేషన్ కంపెనీ ప్రారంభించబడింది. ఈ స్వదేశీ వాణిజ్య సంస్థపై బ్రిటిషిండియా నేవిగేషన్ కంపెనీ చేపట్టిన శత్రువైఖరి టూటికోరన్‌లో

విదేశీ వ్యతిరేక భావాల్ని తీవ్రతరం చేసింది. 1908 జనవరిలో మధుర నుండి సుబ్రమణ్య శివ అనే ఆందోళనకారుడు టూటికోరన్ వచ్చాడు. అతడు చిదంబరం పిళ్లైతో కలిసి టూటికోరన్ బీచిలో స్వరాజ్య సందేశాన్ని, బహిష్కరణను (పోలీసు రిపోర్టులు నమ్మదగినవైతే) హింసాయుత పద్ధతుల్ని ప్రచారం చేశాడు. ఫిబ్రవరి మాసాంతానికి వారు కార్మికులకు నేరుగా ఒక సందేశాన్ని పంపగలిగారు : కూలీలు అదనపు వేతనాల కొరకు గట్టిగా నిలబడితే భారతదేశంలో విదేశీ మిల్లులు తమ ఉనికిని కోల్పోతాయి (ఫిబ్రవరి 26న శివ). అతడే ఫిబ్రవరి 26న "రష్యన్ విప్లవం ప్రజలకు ప్రయోజనం చేకూర్చింది. విప్లవాలు ఎంతో మేలు చేశాయి" ప్రకటించాడు. అలాంటి ఉపన్యాసాల ఫలితంగా విదేశీ యాజమాన్యంలోని కోరల్ కాటన్‌మిల్లు కార్మికులు సమ్మె చేశారు. మార్చి మొదటివారంలో 50 శాతం వేతనాలు పెంచుకున్నారు. అలాంటి సభల్ని నివారించేందుకు శివ, పిళ్లేలను అరెస్టు చేసేందుకు బ్రిటిష్‌వారి ప్రయత్నాలతో షాపులు మూతబడ్డాయి. మున్సిపల్ కార్మికులు, డ్రైవర్లు టూటికోరన్‌లో నిరసన సమ్మెలు చేశారు. తిరునల్వేలిలో మున్సిపల్ ఆఫీసులు, కోర్టులు, పోలీస్ స్టేషన్లపై దాడులు జరిగాయి. 1908 మార్చి 11-13 కాలంలో రెండు పట్టణాలలో కాల్పులు జరిగాయి. టూటికోరక్ ఘటనలు విద్యావంతులు సాధారణ ప్రజల మధ్య బంధాన్ని సృష్టిస్తున్నాయని, ఈ బంధం స్వరాజ్యానికి మెట్టని... భారత శ్రామికులకు లభించే విజయం జాతికి లభించే విజయం' అని మార్చి 13న కలకత్తా వందేమాతరం ప్రశంసించింది. బెంగాల్‌లో లాగానే ఈ మొదటి గొప్ప ముందడుగు అతివాదానికి అందుబాటులో లేకుండా పోయింది. శివ, పిళ్లేలను తొలగించిన తరువాత తిరునల్వేలి రాడికల్స్ స్తబ్ధతగా వుండిపోయారు లేక చిన్న టెర్రరిస్టు గ్రూపుగా ఏర్పడ్డారు. ఈ గ్రూపు 1911 జూన్‌లో జిల్లా మేజిస్ట్రేట్ ఆషేని హత్యచేసింది. తమిళ రివల్యూషనరీలకు చెందిన ఒక చిన్న గ్రూపులో కులతత్వాన్ని తీవ్రంగా విమర్శించిన తిరునల్వేలి బ్రాహ్మణుడు జాతీయ వాదానికి విలువైన సాహిత్యాన్ని సమకూర్చిన సుబ్రమణ్య భారతి పనిచేశాడు. 1910 నుండి రాజకీయ ప్రవాసిగా వుంటూ తన సహ ప్రవాసి హిందూ పునరుద్ధరణ మీద సావర్కార్‌కి శిష్యుడు అయిన వి.వి.ఎస్. అయ్యర్ కంటే పూర్తిగా భిన్నమైన మార్గం పట్టారు. భారతి 1921లో తన అకాల మరణానికి ముందు 1917 రష్యన్ విప్లవాన్ని ప్రశంసిస్తూ కవితలు రాయడం ప్రారంభించాడు.

### మహారాష్ట్ర

తిలక్ జీవిత చరిత్రకి సంబంధించిన సాహిత్యం గణనీయంగా లభ్యమవుతున్నప్పటికి 1905-08 మధ్య ఉద్యమానికి సంబంధించి పూర్తి వివరాలు లభ్యం కావడం లేదు. స్వదేశీ ఉద్యమం పత్రికల అభివృద్ధికి దారితీసింది. 1907 నాటికి కేసరి సర్క్యులేషన్ 20000కి చేరింది. స్వరాజ్య, బహిష్కరణ, సత్యాగ్రహాల్ని తిలక్ ఆయన సన్నిహిత సహచరులు (ఖపర్డే, ముంజేలాంటివారు) మహారాష్ట్రలోను, యితర రాష్ట్రాలలోను ప్రచారంచేశారు. పాల్ మద్రాసు ఉపన్యాసాలు, అరవింద ఘోష్ వందేమాతరం వ్యాసాలతో పాటు కొత్త పార్టీ సూత్రాలపై తిలక్ ఉపన్యాసాలు (కలకత్తా, 1970 జనవరి) ప్రామాణికాలుగా నిలుస్తాయి. తిలక్ 1890

దశాబ్దంలో ప్రారంభించిన మత రాజకీయ ఉత్సవాలు (గణపతి, శివాజి, రామదాసు) పునరుద్ధరించబడ్డాయి. విదేశీ వస్త్రాలు బహిరంగ ప్రదేశాలలో పూనాలో 1905 అక్టోబర్ 8న) తగులబెట్టబడ్డాయి. బొంబాయిలో స్వదేశీ వస్తు ప్రచారిణి సభ స్థాపించబడింది. మనం ఇంతకుముందు గమనించినట్లు బొంబాయి పారిశ్రామికవేత్తలు (అత్యధికులు పార్సీలు లేక గుజరాతీలు – 1908 నాటికి ఒక మహారాష్ట్ర మిల్లు యజమాని మాత్రం వున్నారు) నామమాత్రం మద్దతుదారులుగా వున్నారు. 1906 సెప్టెంబర్‌లో, ఆ తరువాత అతివాద నాయకులు దీన్‌షా వాటా ద్వారా దోతీలను తక్కువ ధరలకు అమ్మించవలసిందిగా చేసిన ప్రయత్నానికి 'మార్కెట్ రేట్ల కంటే తక్కువకి అమ్మబడవని' జవాబు వచ్చింది. కాని దేశీయ వస్త్రాలకు స్వదేశీ ఉద్యమం యిచ్చిన ప్రచారం 1905–06 కాలంలో, బొంబాయి అహమ్మదాబాద్ మిల్లు యజమానులకు విపరీతమైన లాభాలు తెచ్చిపెట్టింది (సమకాలీన అంచనా ప్రకారం బొంబాయి మిల్లు యజమానులు 3.25 కోట్ల రూపాయలు లాభాలు పొందారు. వేతనాల బిల్లు 1.68 కోట్లు) చైనా నూలు దిగుమతుల్ని అడ్డుకొంటూ జపనీయుల పోటీ ప్రారంభమైనప్పుడు మాంద్యాన్ని నివారించడంలో కూడా మిల్లు యజమానులు లాభాలార్జించారు. 1907 ఆగస్టులో టాటా ఐరన్ అండ్ స్టీలు ఫ్యాక్టరీ సేకరించదలచిన షేర్ కేపిటల్ (రు. 2.5 కోట్ల మొత్తం మూడు వారాలలో ప్రధానంగా బొంబాయి సమకూర్చింది) సమకూర్చడం కూడా బహుశా రాజకీయ పరిణామాలు సమకూర్చిన ఆత్మవిశ్వాసం దేశభక్తి వలన కావచ్చు.

తిలక్ తరహా కార్యక్రమాలకు సంబంధించిన ప్రథమ ప్రయత్నాలు మహారాష్ట్రలో, బొంబాయి నగరంలో 1907 చివర, 1908 ప్రారంభంలోను మొదలయ్యాయి. ఒకటి : మద్యం దుకాణాల వద్ద పికెటింగ్‌లు, రెండు : బొంబాయిలో ముఖ్యంగా మరాఠీ కార్మిక వర్గంలో సంబంధాలు పెంచుకొనడం. మొదటి దాని వలన రెండు ప్రయోజనాలు వున్నాయి. (1) ప్రభుత్వ ఎక్సైజ్ ఆదాయాన్ని తగ్గించడం (2) క్రింది కులాల్లో బ్రాహ్మణ ఆచార వ్యవహారాల్ని అనుకరించే ధోరణి అలవరచడం. రెండవ దానిని సాధించడం కలకత్తాలో కంటే బొంబాయిలో సులభం. కారణం కలకత్తాలోని ఫ్యాక్టరీ కార్మికులలో అత్యధికులు బెంగాలీయేతరులు. కాని 1911లో బొంబాయి మిల్లు కార్మికులలో 49.16 శాతం తిలక్ స్వంత జిల్లా రత్నగిరికి చెందిన వారు. 1880లలో పరోపకార బుద్ధితో కార్మికులతో కొన్ని కార్యక్రమాలు ప్రారంభించ బడ్డాయి. కాని అందుకు చొరవ బ్రాహ్మణ జాతీయవాద మేధావుల నుండి గాక పూలే యొక్క బ్రాహ్మణ వ్యతిరేక సత్యశోధక సమాజ ఉద్యమంతో సంబంధాలు గల ఎన్.ఎం. లొఖండేలాంటి వారి నుండి లభించింది. అంతకంటే ముఖ్యమైనది సమరశీల సాంప్రదాయం ముందుకు వచ్చింది. బొంబాయి కార్మికులు (1893లో లాగా) మతపరమైన కలహాలలో మునిగి తేలినప్పటికి అదే సమయంలో 1892–93లో అలాగే 1901లో వేతన తగ్గుదలకు వ్యతిరేకంగాను, 1905 సెప్టెంబర్ అక్టోబర్‌లో మిల్లు కార్మికులు ఎలక్ట్రిక్ రైళ్ళ ద్వారా ప్రవేశపెట్ట యత్నించిన 15, 16 గంటల సుదీర్ఘమైన పని దినానికి వ్యతిరేకంగాను పెద్ద సమ్మెలు కూడా చేశారు.

జాతీయవాదులు విదేశీ పరిశ్రమలలో వలె గాక భారతీయ యాజమాన్యంలో గల శ్రామికుల స్థితిగతుల్ని పట్టించుకొన నిరాకరించారు. 1881లో మొదటి ఫ్యాక్టరీ చట్టాన్ని

(బొంబాయిలో కూలీలు తక్కువ వేతనాలకు లభిస్తారనే అసూయతో లాంక్‌షైర్ ఒత్తిడి మేరకు ప్రవేశపెట్టబడిన) రనడే త్రైమాసిక పత్రిక, తిలక్ మరాఠా పత్రిక తీవ్రంగా వ్యతిరేకించాయి. 1907-08లో తిలక్ కార్యక్రమాలు కొన్నిసార్లు ఊహించిన విధంగా భిన్నంగా లేవు. ఆయన 1907 డిసెంబర్‌లో, 1908 జూన్‌లో బొంబాయి పారిశ్రామిక ప్రాంతంలో జరిపిన కార్మిక సమావేశాలలో వర్గ పోరాటానికి అతీతంగా సాగాయి. విదేశీ వస్తువుల్ని, మద్యాన్ని బహిష్కరించమనడం ప్రధానాంశంగా వుంది. స్వదేశీని గురించి చెబుతూ "మిల్లుల్లో పని పెరుగుతుంది. ఉద్యోగులు ప్రయోజనాలు పొందుతారు. కార్మికుల స్థితిగతులకు ప్రజలు గ్రామాలు వదిలిపెట్టి వెళ్ళేలా ఒత్తిడి చేసే పరిస్థితులకు సంబంధం వుంటుంది. తిలక్ మిల్లుల్లోని మేస్త్రీలకు, సూపర్‌వైజర్లకు మిల్లు కార్మికుల కమిటీల నేర్పాటు చేయవలసిందిగా సలహా ఇచ్చాడు. మేస్త్రీలు కూలీల్ని పనిలోకి తెచ్చే ఏజెంట్లు కనుక కూలీలలో వారికి మంచి పలుకుబడి వుంటుంది. సాధారణంగా కూలీలు కూడా మేస్త్రీ కులానికి, ప్రాంతానికి చెందినవారై వుంటారు. క్రింది స్థాయి దోపిడీదారులైన మేస్త్రీలకు పార్సీలు లేక బ్రిటిష్ మేనేజర్లు లేక సీనియర్ ఫోర్‌మన్లతో విభేదాలుంటాయి. ప్రతి మిల్లులో బ్రాహ్మణ గుమస్తాలున్నారని, వారికి మేస్త్రీలలో మంచి పలుకుబడి వుందని పోలీసు రిపోర్టులు కూడా పేర్కొన్నాయి. అలాంటి గుమస్తాల గ్రూపులు అతివాద ప్రభావానికి లోనయ్యాయి. తరువాతి బొంబాయి కార్మిక సంఘాలలో కూడా, ముఖ్యంగా పాత పద్ధతుల నుండి 1928లో కమ్యూనిస్టుల నాయకత్వంలోని గిర్నీ కామ్‌గార్ పూర్తిగా విడగొట్టుకునే ప్రయత్నాలు చేసేవరకు మేస్త్రీలు కీలకమైన పాత్ర నిర్వహించారు.

అతివాద నాయకత్వానికి స్పష్టమైన పరిమితులున్నాయి. తిలక్‌పై 1908 జూలైలో విచారణ జరిపి (బెంగాల్ టెర్రరిజంపై కేసరిలో వ్యాసాలు రాసినందుకు) ఆరు సంవత్సరాల జైలు శిక్ష విధించినప్పుడు కార్మికుల ఆగ్రహం పెల్లుబుకడం చరిత్రలో చిరస్మరణీయ అంశంగా మిగులుతుంది. జాతీయవాదులు పలు సభలలో ఉపన్యసించారు. కరపత్రాలు పంచారు. దుర్భరమైన జీవన పరిస్థితులు, పని పరిస్థితులతో కొట్టుమిట్టాడుతున్న కార్మికులు పూర్తిగా ఆర్థిక కారణాల రీత్యా చేసిన సమ్మెలు మాటి మాటికి పోలీసుల జోక్యంతో అణచివేయబడ్డాయి. 1905 అక్టోబర్ ఫోనిక్స్ మిల్లు సమ్మెని పోలీసు కమిషనర్ స్వయంగా నాయకత్వం వహించి అణచడాన్ని కార్మికులు గమనించారు. కార్మికులు స్వీయానుభవంతో పోలీసుల్ని, ఉన్నతాధికారుల్ని తమ సహజ శత్రువులుగా గుర్తించారు. తిలక్‌పై విచారణ ప్రారంభమైన జూలై13 నుండి చెదురు మదురుగా సమ్మెలు, రాళ్ళు రువ్వడం, పోలీసులతో ఘర్షణలు ప్రారంభమయ్యాయి. సైన్యం రంగంలోకి దించబడింది. జూలై 22న తిలక్‌కి శిక్ష విధించబడినప్పుడు మూల్జి, జెతా మార్కెట్ వస్త్ర వ్యాపారులు 6 రోజుల హర్తాళ్‌కి పిలుపిచ్చారు. బొంబాయి కార్మిక వర్గం జూలై 28 వరకు హర్తాళ్ పాటించి పిలుపుని అక్షరాలా అమలు జరిపింది. 85 బట్టల మిల్లుల్లో 76 మిల్లులపై పారెల్ రైల్వే వర్క్‌షాపుపై (గతంలో1907 మేలో, 1908 జనవరి పెద్ద ఆర్థిక సమ్మెలు జరిగాయి) సమ్మె ప్రభావం తీవ్రంగా వుంది. పోలీసులు సైన్యం పలుమార్లు కాల్పులు జరిపారు. అధికారిక ప్రకటన మేరకు 16 మంది కాల్పులలో హతులయ్యారు. 43 మంది గాయపడ్డారు.

తిలక్‌కి జైలు శిక్ష విధించబడిన తరువాత జూలై 29న యాత్రా కేంద్రమైన పంధకపూర్ (షోలాపూర్ జిల్లా)లో పెద్ద దొమ్మీ జరిగింది. దీనిలో పాల్గొన్నవారు, నిర్వహించిన వారు క్రింది కులాలకు చెందిన వారని అధికార రిపోర్టు పేర్కొన్నది. మహారాష్ట్రలో అతివాదం ఇక ఏమాత్రం చిట్పవన్ కుట్ర కాబోదు. కాని యితర రాష్ట్రాలలోలాగానే ప్రజలతో సంబంధాలు ప్రజలతో భాగస్వామ్యం ఎక్కువ కాలం కొనసాగలేదు. తిలక్‌ని తొలగించిన తరువాత మహారాష్ట్రలో అతివాదం వ్యక్తిగత హింసావాద మార్గం చేపట్టింది. నాసిక్ స్థావరంగా గల అభినవ భారత్ గ్రూపు చాలా ప్రముఖమైనదిగా గుర్తింపు పొందింది. ఇది సావర్కర్ సోదరులు 1899లో స్థాపించిన మిత్ర మేళా స్ఫూర్తితో 1907లో ఆవిర్భవించింది. గ్వాలియర్‌లో యిలాంటి నవ భారత గ్రూపు మరొకటి వుంది. సింధియా నిరంకుశత్వం క్రింద పని చేసిన వారికి విప్లవం పట్ల భ్రమలు తొలగిపోయాయి. స్వదేశీ సంస్థానాధీశులు అందరూ కేవలం కీలుబొమ్మలు గనుక నవ భారత సొసైటీ స్వయం పరిపాలన తన లక్ష్యంగా ప్రకటించింది. కాని మహారాష్ట్రలో టెర్రరిజం ఎప్పుడూ బెంగాల్‌లో లాగా బలవత్తరమైన శక్తిగా ఎదగలేదు. 1909–10 నాటి నాసిక్ గ్వాలియర్ కుట్ర కేసుల తరువాత మహారాష్ట్రలో టెర్రరిజం సద్దు మణిగింది.

**కాంగ్రెస్ చీలిక**

1905 నుండి 1907 వరకు జాతీయోద్యమంలోని వివిధ ధోరణుల మధ్య ఘర్షణలు జరిగాయి. వీటి పర్యవసానంగా 1907 డిసెంబర్‌లో సూరత్‌లో కాంగ్రెస్ చీలిపోయింది. దీనిని అతివాదం యొక్క స్పష్టమైన రూపమని, వారి వారి స్వస్థలాల్లో ఎదుర్కొన్న పరాజయాల్ని కప్పి పుచ్చుకునేందుకు అఖిల భారత స్థాయిలో జరిగిన అసమ్మతివాదుల కలయికగా గాని సూత్రీకరించడం అంత విశ్వసనీయంగా కన్పించడం లేదు. కాంగ్రెస్ అప్పటికి వార్షిక సమావేశాలు జరుపుకొనే సంస్థ మాత్రమే. అచట జరిగే వాదోపవాదాలకు అతిశయంతో కూడిన ప్రాధాన్యతతో ప్రచారాలు జరిగేవి. అప్పటికి అధికారం స్వాధీనం చేసుకోవాలని ఆకాంక్షించేటంత రాజకీయ సంస్థగా కాంగ్రెస్ ఎదగలేదు. 1907–08 వరకు అతివాదులు వారి ప్రాంతీయ స్థావరాలైన బెంగాల్, పంజాబ్‌లోను, మహారాష్ట్రలోని కొన్ని భాగాలలోనూ ఓడింపబడలేదు. ఈ కాలంలో కాంగ్రెస్‌కి గణనీయమైన స్థానాన్ని, రూపాన్ని చేకూర్చాలని కొన్ని ప్రయత్నాలు జరిగాయి. నిరంతరంగా రాజకీయ కార్యకలాపాలు సాగించేందుకు కలకత్తా కాంగ్రెస్ (1906) జిల్లా సంఘాల్ని నిర్మించాలని తీర్మానించింది. 1907లో 1908 ప్రారంభంలో అతివాదుల చొరవతో అనేక జిల్లా సదస్సులు నిర్వహించబడ్డాయి. కొందరు మితవాద నాయకులు కూడా కొత్త వాతావరణానికి అనుకూలంగా సర్దుబాటు చేసుకొనేందుకు ప్రయత్నించారు. 1905 డిసెంబర్ నుండి కాంగ్రెస్ మహాసభలతో పాటు సమరశీలేతర స్వదేశీ విధానాన్ని ప్రోత్సహించేందుకు పారిశ్రామిక సదస్సులు నిర్వహించబడ్డాయి. ఆత్మత్యాగం, స్వచ్ఛమైన నైతికత, నెలకు రూ. 65లు మించని వేతనంతో పూర్తికాలం కార్యకర్తలుగా పనిచేయాలనే మితవాద లక్ష్యాలతో 1905లో గోఖలే 'సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ' స్థాపించాడు. కాని 1909 సం౹౹ నాటికి కూడా సొసైటీ 20 మంది కార్యకర్తల్ని మాత్రమే నియమించుకోగలిగింది.

ఇతర అంశాలలో కాంగ్రెస్ గతంలో లాగానే వుండిపోయింది. అతివాద తీర్మానాల్ని ఆమోదించాలని ఒప్పించడం అంటే మంచి ప్రచారం, అదనంగా పేరు ప్రతిష్టలు సంపాదించడం మాత్రమే.

1905 డిసెంబర్‌లో బనారస్‌లో అతివాదులు విసిరిన సవాలు మరీ బలహీనంగా వుంది. గోఖలే అధ్యక్షోపన్యాసంతో పాటు ప్రత్యేక తీర్మానం కూడా బెంగాల్ విభజనని, అణచివేత చర్యల్ని ఖండించింది. బహిష్కరణకి సంబంధించిన ప్రస్తావన భాష అర్ధమనస్కతతో వున్నాయి. "వారికి మిగిలిన రాజకీయపరమైన విధానం ప్రజల్ని ఆకర్షించడం మాత్రమే..." (తీర్మానం XIII సురేంద్రనాథ్ మాలవ్యాలచే ప్రతిపాదించబడింది) వేల్సు యువరాజు సందర్శనని నమ్రతగా, గౌరవప్రదంగా ఆహ్వానించిన తీర్మానాన్ని తిలక్, లజపతి, మోతీలాల్ ఘోష్ సబ్జెక్ట్స్ కమిటీలో వ్యతిరేకించారు. కాని చివరికి రాజీమార్గంగా వారు, వారి అనుచరులు ప్రారంభ సదస్సుకి దూరంగా వుండిపోయారు. తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించబడింది.

1906 డిసెంబర్ నాటికి అతివాదం గణనీయంగా ముందంజ వేసింది. ఒక మేరకు అంతర్రాష్ట్ర సంబంధాల్ని (1906 జూన్‌లో తిలక్ కలకత్తా సందర్శనలాంటి ప్రయత్నాలతో) పెంచుకున్నది. రానున్న కలకత్తా సదస్సులో తిలక్ లేక లజపతిని అధ్యక్షుని చేసే ప్రయత్నాలకు బొంబాయి ముఠా (ఫిరోజ్‌షా మెహతా, వాచా, గోఖలే) కురువృద్ధుడు అందరికీ ఆమోదయోగ్యమైన నౌరోజీని ముందుకు తెచ్చి అడ్డుకున్నది. కలకత్తా సదస్సులో బహిష్కరణ, స్వదేశీ, జాతీయ విద్య, స్వయం పరిపాలనలపై తీర్మానాలతో కాంగ్రెస్‌పై అతివాద ప్రభావం (భాషలో తరచుగా సందిగ్ధత చోటు చేసుకొన్నప్పటికి) స్పష్టంగా కనిపించింది. నౌరోజీ ఉద్దేశపూర్వకంగానే కాంగ్రెస్ లక్ష్యాన్ని అస్పష్టమైన పదజాలంతో పునర్నిర్వచించాడు. 'బ్రిటన్‌లో లేక వలసలలో వున్న స్వయం పరిపాలన లేక స్వరాజ్యం' – బ్రిటన్ వలసల మధ్య రాజకీయ వ్యవస్థలలో గణనీయమైన తేడా కనీసం వెస్ట్ మినిస్టర్ చట్టం 1926 వరకు కొనసాగింది.

బహిష్కరణని యితర రాష్ట్రాలకు విస్తరించడానికి, బిరుదుల్ని, విదేశీ వస్తువుల్ని బహిష్కరించడానికి బిపిన్‌లాల్ చేసిన ప్రయత్నాల్ని మాలవ్యా, గోఖలేలు అడ్డుకున్నారు. 1907 సంవత్సరమంతా నాలుగు ప్రధానమైన తీర్మానాలకు వేర్వేరు వ్యాఖ్యానాలు చేయబడ్డాయి.

తరువాతి కాంగ్రెస్ సదస్సుని నాగపూర్ నుండి సూరత్‌కి మార్చడంలో మెహతా సఫలీకృతుడయ్యాడు. సాంప్రదాయం ప్రకారం స్థానిక ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నుకోబడతాడు. మితవాది రాష్ బిహారీ బోస్ ఎన్నిక ధృవపడింది. ఇరుపక్షాలు ఘర్షణకి సిద్ధపడి వచ్చాయి. సదస్సు ప్రారంభ దినాన కలకత్తా నాలుగు తీర్మానాలు వదిలి వేయబడుతున్నాయని వదంతులు వ్యాపించాయి. డిసెంబర్ 27న తిలక్ సదస్సు వాయిదా తీర్మానం కొరకు విఫల ప్రయత్నం చేశాడు. (ఆహ్వానసంఘ అధ్యక్షుడు తిరస్కరించాడు). కోపోద్రిక్తులైన మరాఠీలు చెప్పులు విసిరారు. గందరగోళంతో సభ అర్ధాంతరంగా రద్దయింది. ఘర్షణలకు బాధ్యత ఎవరిదనేది వివాదాస్పదంగా మిగిలిపోయింది (అతివాదులు చాలామంది లాఠీలతో వచ్చిన మాట నిజమే). కాని కవ్వింపులకు పాల్పడింది మితవాదులే. సూరత్ కాంగ్రెస్

తరువాత చాలా నెలల పాటు లజపతిరాయ్, తిలక్ – ఆయన బెంగాలీ మిత్రులు కాంగ్రెస్ పునరేకీకరణ కొరకు ప్రయత్నించారు. బొంబాయి మితవాద గ్రూపు రాజీకి సిద్ధపడలేదు. కఠినంగా వ్యవహరించింది. అలహాబాద్ కాంగ్రెస్ (1908 ఏప్రిల్) చీలిక అంతిమ నిర్ణయమని స్పష్టం చేసింది. కాంగ్రెస్ విధానాలు ఖచ్చితంగా రాజ్యాంగబద్ధమైనవని, అప్పటికి వున్న పాలనా విధానంలో క్రమబద్ధమైన సంస్కరణలు తెచ్చేందుకు పరిమితమవుతుందని, అన్నింటిని మించి మూడు సంవత్సరాలకు పైగా పనిచేసే గుర్తింపు గల సంస్థల్ని ప్రతినిధులు మాత్రమే ఎన్నుకోవాలని నిబంధనావళిని రూపొందించింది. భవిష్యత్తులో జరగనున్న సదస్సులకు అతివాదులు రాకుండా వెలివేయడానికి చేయగలిగిన ప్రయత్నాలన్నీ చేసింది. మితవాద నాయకత్వం అంత పట్టు విడుపూ లేని వైఖరి అవలబించడానికి ముఖ్య కారణం : అప్పుడు ఇంగ్లండ్‌లో లిబరల్స్ అధికారంలో ఉండటం, లిబరల్ రాజకీయవేత్త జాన్ మోర్లే రాజ్య కార్యదర్శిగా వుండటంతో ప్రభుత్వ సంస్కరణలు చేపడుతుందని మితవాద నాయకత్వానికి గల గట్టి నమ్మకం. కాబట్టి బ్రిటిష్ విధానాలలో వచ్చిన పరిణామానికి అనుగుణంగా మారడం అవసరమనుకున్నది.

## అణచివేత, సమాధానపరచడం, విభజించి పాలించడం : 1909-1914

బ్రిటిషిండియా ప్రభుత్వంలో ఫలానా చర్య చేపట్టడానికి కారకులు వైస్రాయా లేక రాజ్య కార్యదర్శా ? – అనే అంశంపై చాలా చర్చ జరిగింది. చాలా సాహిత్యం వెలువడింది. మనం గమనించబోతున్నట్లుగా ఉదారవాద ప్రముఖుడుగా పేరుగాంచిన మోర్లేకి వైస్రాయికి మౌలిక అంశాలపైన విభేదాలున్నట్లు వారి మధ్య నడిచిన ఉత్తర ప్రత్యుత్తరాలలోని కొన్ని భాగాలు మాజీ రాజ్య కార్యదర్శి ఆయన భార్య ప్రచురించిన విభాగాల ద్వారా స్పష్టమయింది. కాని భారతదేశంలోని రాజకీయ అశాంతిని పరిష్కరించేందుకు వారు యితర అధికారులతో కలిసి రూపొందించిన విధానాల రూపకల్పన, ఆ తరువాత బ్రిటిష్ పరిపాలన కొనసాగినంత కాలం వాటి ప్రామాణికత – ముఖ్యంగా గమనించవలసిన అంశం. ఈ విధానాల్ని మూడు ముఖ్యమైన భాగాలుగా విభజించవచ్చు. బాహాటమైన అణచివేత, మితవాదుల్ని సమీకరించేందుకు రాయితీలు, రెండవ దానితో సంబంధం గలదే అయినప్పటికీ మూడవ అంశంగా పేర్కొనదగినది విభజించి పాలించడం. విభజించి పాలించే విధానానికి ప్రత్యేక నియోజకవర్గాల విధానం స్పష్టమైన ఉదాహరణ.

1906 తరువాత అణచివేత చర్యలు కొంత బెరుకుతో చేపట్టబడ్డాయి. కారణం అణచివేత చర్యలు విద్యావంతులైన భారతీయులపై చేపట్టబడ్డాయి. వీరు గిరిజన తెగలకు చెందిన వారు కాదు. రైతాంగ తిరుగుబాటుదారులు కాదు. సమ్మె చేసే కార్మికులు కాదు. వీరిని సంతృప్తి పరచేందుకు పౌర హక్కులు, చట్టబద్ధ పాలన – ఒక వాస్తవంగా, సైద్ధాంతిక సాధనంగా చూపెట్టబడింది. కొత్తగా ఏర్పడిన తూర్పు బెంగాల్ – అస్సాం ప్రావిన్సు లెఫ్టినెంట్ గవర్నర్ బాంఫిల్డ్ ఫుల్లర్ అణచివేత చర్యల్ని మొట్టమొదట బారిసాల్ గూర్ఖాలపై ప్రయోగించాడు. వందేమాతరం నినాదాన్ని నిషేధించాడు. రాజకీయాలలో పాల్గొన్నందుకు పాఠశాలల అనుబద్ధత

రద్దు చేయ యత్నించాడు. మింటో, అంతకంటే మోర్లే కలవరపడ్డారు. పాఠశాలల అనుబద్ధతపై చెలరేగిన వివాదం సమస్యపై ఫుల్లర్ రాజీనామా వెంటనే ఆమోదించబడింది. పంజాబ్ ఘటనలు బెంగాల్ బాంబు ఘటనల తరువాత అంటే 1907-08లో తీవ్రమైన, క్రమబద్ధమైన అణచివేత ప్రారంభమయింది. ప్రత్యేకమైన ప్రాంతాలలో విద్రోహకర సమావేశాలు నిషేధించబడ్డాయి (1907 మే, నవంబర్) వార్తా పత్రికల చట్టాలతో ముద్రణాలయాల స్వాధీనం (1908 జూన్, 1910 ఫిబ్రవరి) చేసుకోబడ్డాయి. నేర చట్టాల సవరణతో 1908 డిసెంబర్‌లో బెంగాల్ సమితులలో నిషేధం విధించబడింది. 1907 మేలో లజపతిరాయ్ అజిత్ సింగ్‌లకు 1908 డిసెంబర్‌లో బెంగాల్ నాయకులకు ద్వీపాంతరవాస శిక్షలు విధించబడ్డాయి. మోర్లే తరచుగా మితవాద మంత్రం జపించాడు కాని ద్వీపాంతర వాస శిక్షల గడువుని కొద్దిగా తగ్గించడం తప్ప చేయగలిగిందీ, చేసిందీ ఏమీ లేదు. 1910 తరువాత హార్డింగ్ హయాంలో ప్రభుత్వ కఠిన వైఖరి కొనసాగింది. యుద్ధకాలంలో భారతదేశ రక్షణ చట్టం 1915తో అది పరాకాష్టకి చేరింది.

గోఖలేతో చాలా సమావేశాలు జరిపిన మోర్లే బెంగాల్ విభజనతో చెలరేగిన ప్రజా విద్వేషాన్ని కొన్ని సంస్కరణలతో తగ్గించేందుకు మింటోకి నచ్చచెప్పే ప్రయత్నం చేశాడు. పోత ఇనుములాంటి ఉన్నతాధికార వర్గ పాలన సాగించడం అంత మంచిది కాదు. చట్టసభల్లో ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్ళలో భారతీయులకు మరికొంత అవకాశం కల్పించాలి. బడ్జెట్ చర్చలలో మరికొంత సమయం కేటాయించాలి. సవరణలు చేసేందుకు అనుమతించాలి. అధికారులు మెజారిటీగా ఎలాగూ వుంటారు గనుక భారతదేశంలో ఇంగ్లీషు రాజకీయ సంస్థల్ని ప్రవేశపెట్టే సమస్యే లేదు (మింటోకి లేఖలు 1906 జూన్ 1, జూన్ 15) కాని సంస్కరణ ప్రతిపాదనలు కలకత్తా నుండి వస్తున్నాయని మింటో, యితర అధికారుల నిశ్చితాభిప్రాయం. మోర్లే ప్రతిపాదనలను తృణీకరించకుండా పార్లమెంటరీ కమిషన్‌కి నివేదించాలని నిర్ణయించారు. సంస్కరణల ముసాయిదా పథకాన్ని తయారు చేయడానికి చాలా సమయం తీసుకొన్న తరువాత తుదకు 1908 అక్టోబర్ 1న పంపించారు. ఎలాంటి తరహా మితవాదుల్ని సమీకరించాలనే అంశంపై కూడా విభేదించారు. మోర్లే గోఖలే తరహా కాంగ్రెస్ మితవాదులతో సర్దుబాట్లు చేసుకోవాలన్నాడు. వైస్రాయి కాంగ్రెస్ వెలుపల వున్న విధేయుల్ని మితవాదులుగా భావించాడు. ఆయన తొలుత స్వదేశీ సంస్థానాధీశుల బృందాన్ని సూచించాడు. వెనువెంటనే సమతుల్యత సాధించేందుకు ఉన్నత వర్గానికి చెందిన ముస్లింలు కూడా వుండాలన్నారు. మింటో, ఆయన రాజకీయ కార్యదర్శి హార్‌కోర్ట్ బట్లర్ స్వదేశీ సంస్థానాల పట్ల బ్రిటిష్ వైఖరి నుండి వైదొలగడానికి శ్రీకారం చుట్టారు. 1909 ఉదయపూర్ ప్రసంగంలో స్వదేశీ సంస్థానాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోకూడదనేది తమ విధానమని చెప్పారు. రాజద్రోహానికి వ్యతిరేకంగా స్వదేశీరాజులు సమిష్టిగా పనిచేయడం బ్రిటిషు సింహాసనం పట్ల వారికి గల స్వామిభక్తికి, విధేయతకు ఉదాహరణగా పేర్కొన్నాడు. ఆ విధంగా సిపాయిల తిరుగుబాటు తరువాత జమిందారులు పెద్ద భూస్వాములతో అవలంబించిన మైత్రీ విధానం జాతీయవాద ప్రమాదాన్ని ఎదుర్కొనడానికి అనుసరించబడింది. సామర్థ్యాన్ని పెంచడానికి స్వదేశీ సంస్థానాలలో జోక్యంచేసుకోవాలనే కర్జన్ విధానం వదలినేయబడింది.

భారతదేశ చట్ట సభల చట్టం 1909 చట్టసభల సభ్యులకు బడ్జెటుపై చర్చలో పాల్గోనేందుకు, ప్రశ్నలు అడిగేందుకు, తీర్మానాలు ప్రదిపాదించేందుకు అవకాశాలు కల్పించింది. మొట్టమొదటిసారిగా ఎన్నికల విధానాన్ని ప్రవేశపెట్టింది. సీట్ల కేటాయింపు, అభ్యర్ధుల అర్హతలు స్ధానిక ప్రభుత్వాల సిపాయిలకు వదలివేయబడ్డాయి. సంస్కరణల్ని తగ్గించడానికి కోత పెట్టడానికి ఉన్నతాధికార వర్గానికి వలసినన్ని అవకాశాలు కల్పించబడ్డాయి. సంపన్న వర్గాలకు, భూస్వాములకు, మహమ్మదీయులకు యూరపు వాణిజ్యవేత్తలకు భారతీయ వాణిజ్యవేత్తలకు ప్రత్యేకమైన అవకాశాలు కల్పించబడ్డాయి. సామ్రాజ్యవాద చట్ట సభలలో ప్రభుత్వ మెజారిటీకి హామీ (మొత్తం 60 మంది సభ్యులలో ఎన్నికయ్యే సభ్యులు 27 మంది మాత్రమే) కల్పించబడింది. ప్రొవెన్షియల్ కౌన్సిళ్ళలో కొంతమంది నామినేటెడ్ సభ్యులుంటారు గనుక వాటిలో అధికార మెజారిటీ భ్రమలు కల్పించడానికి ఉద్దేశించబడిందే. రాజకీయంగా ప్రమాదకారులుగా భావించిన సభ్యుల్ని తిరస్కరించే అధికారం ప్రభుత్వానికి వుంటుంది. అంతేగాక ఇంపీరియల్ కౌన్సిల్‌లో ఎన్నికయ్యే 27 సీట్లలో 8కి తక్కువగాకుండ ముస్లిం ప్రత్యేక నియోజక వర్గాలకు రిజర్వు చేయబడ్డాయి. (1910 ఎన్నికలలో జనరల్ సీట్లలో మూడింటిని వారు కైవశం చేసుకున్నారు) ఎన్నికల నియమాలు కూడా పరస్పర విద్వేషాన్ని పెంచే విధంగా రూపొందించబడ్డాయి. హిందువుల కంటె తక్కువ ఆదాయం గల ముస్లింలకు ఓటుహక్కు కల్పించబడింది. అంతేగాక అధికారులు ముస్లిం నాయకులు సమాజం మొత్తాన్ని గురించి మాట్లాడినప్పటికీ ముస్లింలలో కూడా కులీన వర్గాలకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడం ప్రభుత్వ విధానమయింది. 1916లో యు.పి. స్ధానిక సంస్ధలకు ప్రత్యేక నియోజకవర్గాలు విస్తరించబడినప్పుడు ప్రభుత్వానికి అంతగా విశ్వసనీయులుగా కనిపించని లాయర్లు, డాక్టర్లు లాంటి వృత్తిదారులు, ముస్లింలలోని ఉలేమాల కంటే ప్రభుత్వ ఉద్యోగులు పెన్షనర్లు భూస్వాములకు ఎక్కువగా ఓటు హక్కు అవకాశం కల్పించబడింది.

## సిమ్లా ప్రాతినిధ్యం - ముస్లిం లీగ్

యు.పి., అలీఘర్ ముస్లిం కులీన గ్రూపులు ముస్లింలకు ప్రత్యేక నియోజక వర్గాలు కావాలని, ముస్లింలు సామ్రాజ్య రక్షణకు చేస్తున్న సేవలకు ప్రతిఫలంగా వారి సంఖ్యకు మించి ప్రాతినిధ్యం కల్పించాలని 1906 అక్టోబర్ 1న మింటోకు సిమ్లాలో ప్రాతినిధ్యం చేశాయి. అవే గ్రూపులు ఢాకాలో 1906 డిసెంబర్‌లో సలీముల్లా ప్రారంభించిన ముస్లిం లీగును కైవసం చేసుకున్నాయి. బ్రిటిష్ వారి కనుసన్నలలో వారి ఆదేశాల మేరకు నడపబడుతున్న ఉద్యమంగా జాతీయ నాయకులు (హిందూ మతవాదులు) ఆరోపణలను ముస్లిం లీగు అభిమానులు ఖండించారు. 1890 నుండి ముస్లింలకు నామినేషన్ ద్వారా ప్రాతినిధ్యం కల్పించాలని సయ్యద్ అహమ్మద్ గ్రూపు అర్ధిస్తూ వుంది. ఎన్నికలు అనివార్యమయ్యేటప్పటికి ప్రత్యేక నియోజకవర్గాల డిమాండ్ ముందుకు వచ్చింది. రాజకీయ చైతన్యం గల ముస్లింలలో అంతర్గత విభేదాలు తలెత్తాయి. యువకులు, విద్యావంతులైన ముస్లిం యువకులు కాంగ్రెస్ వైపు ఆకర్షితులయినారు గనుక చురుకైన రాజకీయ పంథా అవసరమని సయ్యద్ అహమ్మద్ రాజకీయ వారసుడు మొసిన్ ఉల్-ముల్క్ 1906 ఆగస్టు 4న ప్రిన్సిపాల్ ఆర్చ్ బోల్డ్‌కు నివేదించాడు. అలీఘర్‌ని

దౌలత్ హస్రత్ మొహ్రా లేక మహమ్మదాలీ లేక లాహోర్ జమిందారు పత్రిక సంపాదకుడు జఫర్ ఆలీఖాన్ లాంటి వారిని దృష్టిలో పెట్టుకొని ఈ విజ్ఞప్తి చేసి ఉండవచ్చు. హిందూ ముస్లిం రాజకీయ సమైక్యతని సమర్ధిస్తూ 1906 మేలో అలీఘర్ విద్యార్థి సంఘం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. సర్ సయ్యద్ అహ్మద్ విధానం గాని, నా విధానంగాని ముస్లింలకు ఎలాంటి మేలు చేయడం లేదని విద్యార్థులు ప్రచారం చేస్తున్నారు గనుక ఆర్ట్ బోల్డ్ తొలి ముసాయిదా పత్రంలోని రాజకీయ ఆందోళనలకు దూరంగా ఉంటామని ప్రమాణం చేస్తున్నట్లు పేర్కొన్న వాక్యాన్ని తొలగించాలని మొహిసిన్–ఉల్–ముల్క్ పట్టుబట్టాడు.

అయినప్పటికీ మతపరమైన విభజనని బ్రిటిష్‌వారు ప్రోత్సహించడం ఒక చారిత్రక వాస్తవం. కొత్తగా ఏర్పడిన ప్రోవిన్స్‌లో రెండు మతాలకు చెందిన ప్రజల్ని పుల్లర్ రెచ్చగొడుతున్నాడని మింటో 1906 ఆగస్టు 15న మోర్లేకి రాసిన లేఖలో స్పష్టంగా పేర్కొన్నాడు. అతని వారసుడు కొత్త ఉద్యోగాలలో ముస్లింలకు అనుకూలంగా వ్యవహరించడం కొనసాగించాడు. అతడు రాజకీయ ప్రాధాన్యత గల అంశంగా పేర్కొని ఢక్కా నవాబు సలీముల్లాకు 14 లక్షల రూపాయలు అప్పు మంజూరు చేయించవలసినదిగా మింటోపై ఒత్తిడి తెచ్చారు. మొహిసిన్–ఉల్–ముల్క్ ఇతర ముస్లిం నాయకులు ప్రిన్సిపాల్ ఆర్ట్ బోల్డ్ ద్వారా వైస్రాయి ప్రైవేట్ సెక్రటరీ డన్‌లప్ స్మిత్‌తోను, లక్నో కమిషనర్ హార్ కోర్ట్ బట్లర్‌లాంటి అధికారులతోను సన్నిహిత సంబంధాలు కలిగి వున్నారనడానికి కావలసినన్ని సాక్ష్యాధారాలు వున్నాయి. ముస్లింలీగ్‌ను నడుపుతూనే ఆగాఖాన్ చేపట్టబోయే ఏ చర్యకైనా ప్రభుత్వ ఆమోదం ఉందో లేదో తెలుసుకొని అడుగు ముందుకేయాలని, తాను మొహిసిన్–ఉల్–ముల్క్‌ను ఆదేశించానని 1906 అక్టోబర్ 29న డన్‌లప్ స్మిత్‌కు హామీ ఇచ్చారు.

ప్రత్యేక ప్రోత్సాహం కంటే చాలా ముఖ్యమైన విషయమేమంటే ఆ తరువాత దశాబ్దాలలో పలుమార్లు వ్యక్తమైన విధంగా అటు అధికార వర్గానికి, ఇటు హిందూ, ముస్లిం, కులీన మతవాదుల ప్రయోజనాల మధ్య సారూప్యత ఉంది. 1906 డిసెంబర్‌లో భారత ధర్మ మహామండల్ సమావేశంలో హిందువుల విధేయత లేక రాజభక్తి మతంలో ఒక భాగం అని దర్భాంగా మహారాజా ప్రకటించాడు. అతి బాల్యావస్థలో వుండి చాలా బలహీనంగా వున్న ముస్లిం లీగ్ (1907 డిసెంబర్‌లో కేవలం 400 సభ్యత్వము, రూ. 25/–లకు తక్కువగాని వార్షిక చందా, కనీసార్హత, వార్షిక ఆదాయం రు. 500/– గల) తొలినాటి కాంగ్రెస్‌లాంటి అర్థించే విధానాలు గల ముస్లిం లీగు స్థాపించిన మూడు సంవత్సరాల లోపల అంత ఉన్నత స్థాయికి ఎలా ఎదగగలిగింది అనే ప్రశ్నకు సరైన జవాబు, వివరణ లేవు. 1909 ప్రారంభంలో అమీర్ ఆలీ ఆధ్వర్యంలో చేయబడిన ఒక ప్రాతినిధ్యం మోర్లే చేత ప్రత్యేక నియోజకవర్గాన్ని ఉమ్మడి నియోజకవర్గాలుగా మార్పించగలిగింది. టోరీలతో అది ఏర్పరచుకున్న సంబంధాలు, అంతర్గత సంస్కరణలపై తీవ్రమైన కలహాలతో కూరుకుపోయిన లిబరల్ పాలక వర్గాన్ని కలవరపరిచాయి. వారు (ముస్లింలు) వారికి ఇప్పుడు కేటాయించబడుతున్న సీట్లకు అర్హులు కారు" – మింటో 1909 నవంబర్ 11న ప్రైవేట్ సంభాషణలో మోర్లేకు చెప్పారు. కాని వారిలో ఏ ఒక్కరూ తమ కర్తవ్యాన్ని నిర్వహించాలని భావించలేదు. కొత్తగా ఏర్పాటు చేయబడిన

తూర్పు బెంగాల్ అస్సాం ప్రోవిన్స్‌ను 1911 డిసెంబర్‌లో ముస్లిం లీగు తీవ్ర నిరసనల్ని పట్టించుకోకుండా ప్రభుత్వం రద్దు చేయడంతో ముస్లిం లీగు యొక్క అసలు బలహీనత వెల్లడయింది.

బ్రిటిష్‌వారు భారతదేశంలో చేసిన ప్రయోగాలన్నింటిలో భారత చట్ట సభల చట్టం 1909 (The Indian Councils ConAct of 1909) చాలా కొద్దికాలం మాత్రమే మనగలిగింది. 9 సం॥ల లోపుగానే అంటే 1918 నాటికి మాంటేగ్ – ఛెమ్స్ ఫోర్డ్ సంస్కరణలతో సమూలంగా సవరించబడినది. అది మితవాదులను సమీకరించుకొనడంలోను రాజకీయంగా ఒకటైన హిందువులు, ముస్లింలని వేరుగా ఉంచడంలోను విఫలమయింది. మద్రాసు కాంగ్రెస్ (1908)లో ప్రతిపాదిత సంస్కరణలు విస్తృతమైనవిగా, ఉదారమైనవిగా భావించి మితవాదులు ఆహ్వానించారు. కాని 1909 నాటికి సంస్కరణల్ని నిశితంగా పరిశీలించిన మాలవ్య వంటి వారు ముస్లిం లీగ్‌కు విపరీతమైన రాయితీలు యివ్వడాన్ని విమర్శించారు. అలహాబాద్‌పై చేసిన నిశిత అధ్యయనంలో బెయిలీ పరిశీలించిన విధంగా అతివాదుల్ని అణచివేసి పౌర హక్కులను నిరాకరించడంతో కలిగిన అసౌకర్యం స్థానిక సంస్థలకు ప్రత్యేక నియోజక వర్గాల విస్తరణలాంటి పరిణామాలు వృద్ధ మితవాద నాయకత్వాన్ని 1915–16 నాటికి సమరశీల పోరాటాల వైపు నెట్టి వేశాయి. కాని అప్పటికి కాంగ్రెస్ రాజకీయాలు యుద్ధానికి ముందు సం॥లలో చాలా స్తబ్ధతగా (జవహర్‌లాల్ నెహ్రూ తన ఆత్మకథలో జ్ఞప్తికి తెచ్చుకున్న విధంగా) ఉండిపోయాయి. కాంగ్రెస్ సదస్సులలో హాజరు విపరీతంగా పడిపోయింది. మితవాదులు గంభీరమైన ఉపన్యాసాలు మాత్రం చేయగలిగారు. గోఖలే ఇంపీరియల్ కౌన్సిల్‌లో సార్వత్రిక ప్రాథమిక విద్యను ఆర్థిస్తూ అణచివేత విధానాన్ని ఖండిస్తూ, కార్మికుల దురవస్థపై ప్రజలకు వివరిస్తూ దక్షిణాఫ్రికాలో భారతీయుల స్థితిగతుల్ని వివరిస్తూ సమర్థవంతంగా ఉపన్యసించారు.

జార్జి V ఢిల్లీ దర్బారులో 1911 డిసెంబర్‌లో చేసిన విభజన రద్దు ప్రకటన ముస్లిం రాజకీయ కులీన వర్గాన్ని తీవ్రమైన విభ్రాంతికి గురిచేసింది. 1905–06లో వేల్స్ యువరాజు భారతదేశాన్ని సందర్శించినపుడు బెంగాలీ ఆందోళనని స్వయంగా చూశాడు. జార్జి V విభజన రద్దును భారత ప్రజలకిచ్చే వరంగా భావించాడు. కొద్ది తటపటాయింపుల తరువాత వైస్రాయి హార్డింగ్, సెక్రటరీ ఆఫ్ స్టేట్ క్రేవే ఈ వరంతో అదనపు ఆర్థిక భారం లేదు గనుక స్వాగతించారు. బెంగాల్‌లో కొనసాగుతున్న రివల్యూషనరీ టెర్రరిజంతో కలత జెందిన హోం మెంబర్ జెస్కిన్స్ విభజన పుండు నయం కాకపోతే మనకు శాంతి ఉండదని విభజన రద్దు పట్ల హర్షం వెలిబుచ్చారు. గవర్నర్ ఇన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో బెంగాల్ పునరేకీకరణ జరగాలని, రాజధానిని ఢిల్లీకి మార్చాలని 1911 ఆగస్టు 25న భారత ప్రభుత్వ ఆదేశాలు జారీ అయ్యాయి. రాజధాని ఢిల్లీకి మార్చడం ముస్లిం మనోభావాలు గాయపడకుండా ఊరట కల్పించినట్లయింది. ప్రావిన్సులలో స్వయం పరిపాలన అనివార్యం గనుక ప్రోవిన్సుల ఒత్తిడి నుండి వైస్రాయికి రక్షణ కవచం ఏర్పాటు చేసినట్లవుతుందనే దూరదృష్టి ఈ మార్పులో ఇమిడి వుంది.

మొగలు కీర్తి ప్రతిష్టల కేంద్రమైన ఢిల్లీకి రాజధానిని మార్చడంలో ముస్లింల నుండి ఆశించిన సానుకూలత వ్యక్తం కాలేదు. ఇటలీ, బాల్కన్ యుద్ధాలలో (1911-12) బ్రిటన్, టర్కీకి సహాయ నిరాకరణ చేయడంలో ముస్లింలు మరికొంత దూరమయ్యారు. 1912 ఆగస్టులో అలీఘర్‌లో ముస్లిం యూనివర్శిటీ స్థాపనకు హార్డింగ్ తిరస్కారం 1913 ఆగస్టులో మసీదు ప్రక్కనే వున్న వేదికను కూల్చిన సందర్భంగా జరిగిన ఘర్షణలాంటి ఘటనలతో ముస్లింల మనోభావాలు బాగా దెబ్బతిన్నాయి. 1912లో ముస్లిం లీగును స్వాధీనం చేసుకొన్న చిన్న పార్టీ జాతీయవాద హిందువులతో ఒకరకమైన సర్దుబాటు మతతత్వ వాదాన్ని పెంచుకుంటూ సమరశీలతతో ముందుకు సాగింది. యుపిలో వజీర్ హస్సాన్, టి.ఎ.కె. షేర్వాని, ఆలీ సోదరులు (మహమ్మద్, షౌకత్), హస్రత్ మొహాని, పంజాబ్‌లో జాఫర్ ఆలీఖాన్, బెంగాల్‌లో ఫజల్ హక్ ఈ పార్టీకి నాయకులు. సలీముల్లా, నవాబ్ ఆలీ చౌదురి షాన్సుల్ హుదా లేక యు.పి.లో మొహిసిన్-ఉల్-ముల్క్ లాంటి పాత పార్టీ నాయకులలో గాక వీరు జమిందారు బిరుదులు పొందినవారు. యుపిలో ఈ పార్టీ పొలం నుండి కొద్దిపాటి ఆదాయం పొందుతూ జరుగుబాటు కొరకు ప్రభుత్వోద్యోగాల కొరకు వెతుకుతున్న వర్గానికి చెందినది, సామాజిక పొందికలో అది హిందూ జాతీయవాదులతో పోలికలు వున్న పార్టీ. మహమ్మదాలీ యొక్క 'కామ్రేడ్' (కలకత్తా) అబుల్ కలాం ఆజాద్ యొక్క 'అల్ హి లాల్' (కలకత్తా), జాఫర్ ఆలీఖాన్ యొక్క 'జమిందార్' (లాహోర్) లాంటి పత్రికలు అఖిల ఇస్లాం మతవాదం కారణం గాను బ్రిటిష్ వ్యతిరేక వైఖరి కారణంగాను పోలీసుల దృష్టిలో పడ్డాయి. ఆలీ సోదరులు 1913లో ముస్లిం పవిత్ర స్థలాల్ని కాపాడేందుకు నిధులు సమకూర్చ యత్నించారు. 1912-13లో అన్సారి, జాఫర్ ఆలీఖాన్‌లు బాల్కన్ యుద్ధాలలో టర్కీకి సహాయపడేందుకు వైద్య బృందానికి నాయకత్వం వహించారు. ముస్లిం లీగు నూతన కార్యదర్శి వజీర్ హస్సాన్ 1913 మార్చిలో కాంగ్రెస్ కోరుతున్న విధంగా రాజ్యాంగ పద్ధతుల ద్వారా వలసవాద స్వయం పరిపాలన సాధించడం ముస్లిం లీగ్ లక్ష్యంగా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఖిలాఫత్ ఉద్యమానికి, హిందూ - ముస్లిం ఐక్యతకు రంగం సిద్ధం చేయబడింది.

## రివల్యూషనరీ టెర్రరిజం

1911 డిసెంబర్‌లో ప్రకటించిన బెంగాల్ విభజన రద్దుతో రివల్యూషనరీ టెర్రరిజం తగ్గుముఖం పట్టలేదు. ప్రావిన్సు వ్యాప్తంగాను, వెలుపల శాఖలు గల డక్కా అనుశీలన్ స్వదేశీ దాడులకు, అధికారుల, దేశద్రోహుల హత్యలకు నిధులు సమకూర్చడంపై దృష్టి కేంద్రీకరించింది. వివిధ గ్రూపుల సమాఖ్యకి ప్రాతినిధ్యం వహిస్తున్న జతీంద్రనాథ్ ముఖర్జీ నాయకత్వంలోని యుగాంతర్ పార్టీ సరియైన సమయంలో మిలటరీ కుట్ర జరిపేందుకు అంతర్జాతీయ సంబంధాలలో నిమగ్నమయింది. రాష్ బిహారీబోస్, సచీంద్రనాథ్ సన్యాల్ పంజాబ్, ఢిల్లీ, యుపి కేంద్రాలుగా రహస్య సంస్థ నిర్వహిస్తున్నారు. 1912 డిసెంబర్ 23న నూతన రాజధానిలో అధికారికంగా ప్రవేశించనున్న హార్డింగ్‌పై అద్భుతమైన బాంబు దాడి చేశారు.

ఆశ్రయం, విప్లవ సాహిత్య ప్రచురణ, ఆయుధాల సేకరణలాంటి అవసరాల రీత్యా విదేశాలకు వెళ్ళారు. శ్యామ్జీ కృష్ణవర్మ 1905లో భారతీయ విద్యార్థుల కొరకు ఒక కేంద్రాన్ని

(ఇండియా హౌస్) పత్రిక (ఇండియన్ సోషియాలజిస్ట్) ఇండియన్ హోమ్‌రూల్ సొసైటీ స్థాపించారు. కొద్దికాలం తరువాత భారతదేశం నుండి మెరికల్లాంటి యువకుల్ని రప్పించేందుకు 'స్కాలర్‌షిప్' పథకాన్ని ప్రవేశపెట్టాడు. కృష్ణవర్మ సమరశీలత సిద్ధాంతపరమైనది. ప్రధానంగా ప్రతిఘటన సాత్విక నిరోధానికి పరిమితమైనది. ఆయన పత్రిక ఇండియన్ సోషియాలజిస్ట్ పత్రిక దీనినే ప్రతిపాదించింది. కాని 1907 నుండి ఆయన ఇండియా హౌస్‌కి నాసిక్‌కు చెందిన వి.డి. సావర్కార్ విప్లవ గ్రూపు స్వాధీనం చేసుకున్నది. ఈ గ్రూపుకు చెందిన మదన్‌లాల్ ఢింగ్రా 1909 జూలైలో ఇండియా ఆఫీసు అధికారి కర్జన్ విల్లీని హత్య చేసి నిరంతరం స్మరింపదగిన ఒక దేశభక్తితో జ్వలించే ప్రకటన చేసి స్కాఫోల్డ్ వెళ్ళారు. "ధనికుడ్ని కాదు, సమర్థుడ్ని కాదు, నాలాంటి పేద భారతీయుడు మాతృదేశ విమోచనం కొరకు బలిపీఠంపై రక్తతర్పణం చేయడం కంటే మరేమీ చేయగలడు? నేను మరలా మరలా పుడితే దేశ దాస్య విముక్తి సాధించే వరకు ప్రాణాలర్పిస్తూనే వుంటాను. లండన్‌లో ప్రత్యేకించి సావర్కార్‌కి 1910లో నాసిక్ కుట్ర కేసులో జీవితకాల ద్వీపాంతరవాస శిక్ష విధించిన తరువాత విప్లవ కార్యక్రమాలు కొనసాగించడానికి వీలుపడని పరిస్థితులేర్పడ్డాయి. యూరప్‌లో కొత్త కేంద్రాలు ఏర్పరచుకొన్నారు. మేడమ్ కామా, పార్సీ విప్లవకారిణి జీన లాగ్వెట్‌లాంటి సోషలిస్టులతో సంబంధాలు ఏర్పరచుకొని పారిస్, జెనీవాల నుండి వందేమాతరం పత్రిక నడిపారు. మరీ ముఖ్యంగా ఆంగ్లో-జర్మన్ సంబంధాలు క్షీణించడంతో వీరేంద్రనాథ్ ఛటోపాధ్యాయ 1909 నుండి బెర్లిన్‌ను స్థావరంగా ఎంపిక చేసుకున్నారు.

బ్రిటన్, యూరప్‌లలో గల భారతీయులు చెల్లాచెదురుగా వున్న వలస గ్రూపులుగా లేరు. బ్రిటిష్ కొలంబియా, అమెరికాలోని పశ్చిమ తీర రాష్ట్రాలలో మొదటిసారిగా ప్రజా పునాదిని ఏర్పాటుచేసుకోగలిగాయి. 1914 నాటికి సిక్కులు అత్యధికులుగా గల 15000 మంది భారతీయులు గల ఒక కాలనీ ఏర్పడింది. దీనిలో సంపన్నులైన వర్తకులు, కార్మికులు వున్నారు. వీరంతా జాతి వివక్షతకు గురై బాధలు పడుతున్నారు. బ్రిటిష్ ప్రభుత్వం వీరికి చేసిందేమీ లేదు. సోహన్‌సింగ్ భాక్నాచే శాన్ ఫ్రాన్సిస్కోలో 1913లో గదర్ పార్టీ స్థాపించబడింది. ఈ పార్టీ తొలి నాయకులలో ఢిల్లీ సెయింట్ స్టీఫెన్స్ కాలేజీకి చెందిన హర్‌దయాళ్ లాంటి మేధావులున్నారు. గదర్ అనే వారపత్రిక పేరును ఈ పార్టీ స్వీకరించింది. గదర్ పత్రిక 1913లో నవంబర్ 1 నుండి ఉర్దూ, గురుముఖి (సంస్కృతి) భాషలలో ఆ తరువాత చాలా ఇతర భారతీయ భాషలలో వెలువడింది. గదర్ మొదటి సంచిక ఈ క్రింది మాటలతో ప్రారంభ మయింది. "మన పేరేమిటి?" గదర్ (విప్లవం) మన పనేమిటి? తిరుగుబాటుని తీసుకొని రావడం, తిరుగుబాటు ఎక్కడ వస్తుంది? భారతదేశంలో, ఎప్పుడు వస్తుంది? "కొద్ది సంవత్సరాలలో" ఈ కాలంలో విదేశాలలో ఉన్న భారతీయ వలసలు భారత స్వాతంత్ర్య పోరాటానికి అందించిన రెండు తోడ్పాటులలో గదర్ పార్టీ ఒకదానికి ప్రాతినిధ్యం వహించింది. రెండవదైన దక్షిణాఫ్రికా సత్యాగ్రహ అనుభవాన్ని మహాత్మాగాంధీ గురించి వివరించేటప్పుడు ప్రస్తావిద్దాం.

విదేశాలలో భారత విప్లవకారుల కార్యకలాపాలు మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో కొద్ది సంవత్సరాల పాటు బ్రిటిష్ పాలనని కలవరపెట్టడంతో పాటు, తీవ్రమైన హిందూ మత ధోరణుల్ని, ప్రాంతీయ తత్వాన్ని, తొలినాటి సమరశీల జాతీయ వాదం సామాజిక దృక్పథం యొక్క సంకుచిత పరిమితుల్ని అధిగమించడానికి తోడ్పడ్డాయి. అరవిందఘోష్ (1905) యొక్క 'హిందూ భవానీ మందిర్' కరపత్రం ప్రపంచాన్ని ఆర్యుల సిద్ధాంత విధానాలలో ప్రభావితం చేయాలని ఉద్బోధించింది. అన్ని వర్గాలను మత భావనలతో సమైక్య పరచాలన్నది జమిందారులకు, రైతులకు మధ్య గల విభేదాలను పరిష్కరించేందుకు, సామరస్యాన్ని పెంచాలన్నది. లండన్ గ్రూపు విప్లవకారులు ప్రచురించిన 'ఓ! మృతవీరులారా' (1907) కరపత్రంలో హిందువులు, ముస్లింలు కలిసికట్టుగా తీసుకొని వచ్చిన 1857 విప్లవాన్ని జ్ఞప్తికి తెచ్చింది.

"ఫిరంగి పాలన ఎలా ఛిన్నాభిన్నం చేయబడింది. "హిందువుల, ముస్లింల సమ్మతితో స్వదేశీ సింహాసనాలు ఎలా ప్రతిష్టించబడ్డాయి" అంతర్జాతీయ సామ్రాజ్యవాద వ్యతిరేక యుద్ధ దృశ్యం కళ్ళ ముందు కదలాడింది. "ధింగ్రా పేల్చిన తుపాకి శబ్దం ఒంటరిగా నిస్సహాయంగా వున్న ఐరిష్ రైతు కూలీకి విన్పించింది. పొలంలో పని చేస్తున్న ఈజిప్టు రైతుకి విన్పించింది. చీకటి గదిలో పనిచేస్తున్న జూలూ శ్రామికునికి విన్పించింది (వందేమాతరం, లండన్ 1909). వీరికి ఐరిష్ విప్లవకారులతో సన్నిహిత సంబంధాలున్నాయి. ఉదాహరణకు భారత ప్రభుత్వ కస్టమ్స్ అధికారులు 'ఇండియన్ సోషియాలజిస్ట్' వందేమాతరం ఛటోపాధ్యాయ 'తల్వార్' (బెర్లిన్) తారాకాంత్ దాస్ 'ఫ్రీ హిందూస్తాన్' (వాంకూవర్), 'గదర్' లాంటి పత్రికలను న్యూయార్క్ జర్నలిస్టు జి.ఎఫ్. ఫ్రీమన్ నుండి స్వాధీనం చేసుకున్నారు. అంతర్జాతీయ సోషలిస్టు ఉద్యమంలో కూడా సంబంధాలు అభివృద్ధిపరచుకొనబడ్డాయి. బ్రిటిష్ మార్క్సిస్టు సోషల్ డెమోక్రటిక్ ఫెడరేషన్‌కు చెందిన హిండ్‌మన్ కృష్ణవర్మ ఇండియా హౌస్‌లో చాలాసార్లు ప్రసంగించాడు. స్టట్‌గార్డ్‌లో 1907 ఆగస్టులో సెకండ్ ఇంటర్నేషనల్ కాంగ్రెస్ సందర్భంగా మేడం కామా స్వతంత్ర భారతదేశ జెండాని ఎగురవేశారు. ప్రపంచ పారిశ్రామిక కార్మికుల యొక్క శాన్‌ఫ్రాన్సిస్కో విభాగానికి హరదయాళ్ కార్యదర్శిగా పనిచేశారు. 1912 మార్చి మోడరన్ రివ్యూ (కలకత్తా) పత్రిక కారల్‌మార్క్స్‌పై తొలి వ్యాసం రాసింది ఆయనే. రష్యాలో అక్టోబర్ విప్లవం నేపథ్యం నుండి యుగాంతర్ నాయకుడు నరేన్ భట్టాచార్జి (ఎం.ఎన్. రాయ్), వీరేంద్రనాథ్ ఛటోపాధ్యాయ, అబని ముఖర్జీ మరికొందరు గదర్ ప్రముఖుల లాంటి మొదటి కమ్యూనిస్టులు ఆవిర్భవించడం యాదృచ్ఛికం కాదు.

## యుద్ధం - భారతదేశ రాజకీయాలు

మొదటి ప్రపంచ యుద్ధం (1914-18) భారతదేశం యొక్క రాజకీయ జీవితంలోను, సామాజిక ఆర్థిక పరిస్థితులలోను కీలకమైన మార్పులు తీసుకొని వచ్చింది. ముఖ్యమైన పరిణామాల్ని తరువాత చర్చకు వదిలివేస్తూ యుద్ధం పట్ల అప్పటికే చురుకుగా పనిచేస్తున్న భారత రాజకీయ గ్రూపుల యొక్క స్పందనలపై కేంద్రీకరిద్దాం.

**విప్లవ కార్యక్రమాలు**

తక్షణమే సంపూర్ణ స్వాతంత్ర్యం సాధించాలని పోరాడుతున్న విప్లవకారులకు యుద్ధం ఊహించని వరంగా మారింది. దేశంలోని సైనికులు (ఒక్కసారిగా 1500 మంది బ్రిటిష్ సైనికులు) తరలించబడ్డారు. బ్రిటన్‌కి శత్రువులైన జర్మనీ, టర్కీల నుండి ఆర్థిక, మిలటరీ సహాయం పొందే అవకాశం లభించింది. బ్రిటన్‌కి వ్యతిరేకంగా సైనిక కుట్ర జరపడానికి అవకాశమేర్పడింది. టర్కీ (మొత్తం ముస్లింల రాజకీయ మతపరమైన నాయకత్వ స్థానం ఖలీఫా)తో బ్రిటన్ యుద్ధం హిందూ జాతీయవాదుల సమరశీల అఖిల ముస్లిం ప్రపంచవాదుల, గదర్ పార్టీకి చెందిన బర్కతుల్లా, విప్లవ నాయకులను మహమ్మద్ హస్సాన్ ఒబైదుల్లా సింధీలాంటి దియోబంద్ నాయకుల మధ్య సన్నిహిత సంబంధాలు పెంచింది.

1914 ఆగస్టులో బెంగాలులో విప్లవకారులు కలకత్తాలోని రొడ్డా సంస్థ నుండి 50 మాసర్ పిస్టళ్ళు, 46000 రౌండ్ల పేలుడు సామాగ్రి ఒక సానుభూతిపరుడైన ఉద్యోగి ద్వారా సమకూర్చుకొనే ఒప్పందంలో విజయం సాధించారు. రాజకీయ దొమ్మీలు, హత్యలు 1914–15లో 12, 7;, 1915–16లో 23, 9 – గతంలో ఎన్నడూ లేనంతగా జరిగాయి. బెంగాల్‌లోని అత్యధిక గ్రూపులు జతిన్ ముఖర్జీ (మారుపేరు బాఘా జతిన్) నాయకత్వంలో సమైక్యమై రైలు మార్గాలను ధ్వంసం చేసేందుకు కలకత్తాలోని విలియం ఫోర్డుని (అక్కడ స్థావరం చేసిన 16వ రాజపుట్ రైఫిల్స్‌తో సంబంధాలు ఏర్పరచుకొనబడ్డాయి) స్వాధీనం చేసుకొనేందుకు, జర్మనీ ఆయుధాలను సంపాదించేందుకు (ఈ ఏర్పాటుకై నిరేన్ భట్టాచార్జీని జావా పంపించడం జరిగింది) పథకాలు సిద్ధం చేయబడ్డాయి. కాని సమన్వయ లోపంతో బృహత్పథకాలు విఫలమయ్యాయి. స్థానిక గ్రామస్తుల సహాయంతో పోలీసులు జతిన్‌ను వెంబడించి పట్టుకున్నారు. జతిన్ ఒరిస్సా తీరంలోని బాలాసోర్ వద్ద 1915 సెప్టెంబర్‌లో వీర మరణం చెందాడు. బెంగాల్ విప్లవకారులు ప్రజల నుండి వేరుపడటం వలన సంభవించిన విషాదాంతం ఇది.

రాష్ బిహారీ బోస్, సచిన్ సన్యాల్, పంజాబ్‌కి తిరిగి వచ్చిన గదర్ వీరులు సమిష్టిగా రూపొందించిన పెద్ద కుట్రలో భాగమే బెంగాల్ పథకాలు. యుద్ధం ప్రారంభమైన తరువాత గదర్ పార్టీ వారు దేశ స్వాతంత్ర్యం కొరకు పోరాడేందుకు వేల సంఖ్యలో రావడం ప్రారంభించారు. ఒక ఓడనిండా గల సిక్కులు పంజాబ్ ముస్లిం వలసదారులు కెనడా వలస అధికారుల చేత వాంకూవర్ నుండి వెనక్కి పంపించబడ్డారు. తిరిగి వస్తుండగా కలకత్తాలోని బడ్జ్‌బడ్జ్ వద్ద పోలీసులు చుట్టుముట్టారు. కాల్పులు జరిపారు. 22 మంది విప్లవకారులు హతులయ్యారు. 1914 తరువాత తిరిగి వచ్చిన పంజాబీలను బ్రిటిష్‌వారు చుట్టుముట్టారు (1916 నాటికి మొత్తం 8000 మందిలో 2500 మంది ప్రవాసితులుగా పంపబడ్డారు. 400 మంది జైళ్ళలో కుక్కబడ్డారు). 1915 ఫిబ్రవరి 21న ఫిరోజ్‌పూర్, లాహోర్, రావల్పిండి సైనిక శిబిరాలపై సమన్వయంతో చేయ తలపెట్టిన దాడులు చివరి నిమిషంలో విశ్వాసఘాతుకం కారణంగా భగ్నం చేయబడింది. రాష్ బిహారీ బోస్ జపాన్‌కి పారిపోవలసి వచ్చింది. బనారస్ దానాపూర్

సైనిక స్థావరాలను మట్టుబెట్ట యత్నించిన సచిన్ సన్యాల్‌కు యావజ్జీవ ద్వీపాంతర వాస శిక్ష విధించబడింది. అఖిల భారత స్థాయి తిరుగుబాటు ఘోరంగా విఫలమైనప్పటికీ దాని నాయకులు ప్రత్యేకించి గదర్ పార్టీ వారు విప్లవ భావాలను సైన్యంలోకి, రైతాంగంలోకి తీసుకొని పోవడంలో అగ్రగాములుగా వున్నారు. ఆ తరువాత చెదురు మదురుగా కొన్ని తిరుగుబాట్లు జరిగాయి. 1915 ఫిబ్రవరి 15న సింగపూర్‌లో చేసిన తిరుగుబాటు అలాగే జమేదార్ చిస్టిఖాన్, జమేదార్ అబ్దుల్ ఘని, సుబేదార్ దాడ్ ఖాన్ నాయకత్వంలో పంజాబీ ముస్లిం లైట్ ఇన్ ఫాంట్రీ 36వ సిక్కుల బెటాలియన్ తిరుగుబాట్లు ప్రత్యేకంగా పేర్కొనదగినవి. తిరుగుబాటు అణచివేసిన తరువాత 37 మంది ఉరితీయబడ్డారు. 41 మందికి ద్వీపాంతరవాస శిక్ష విధించబడింది. 1915 జనవరి – ఫిబ్రవరిలో పంజాబ్ రాజకీయ దాడులలో ఒక సందర్భం, సామాజిక ప్రయోజనం ఇమిడి వున్నాయి. ప్రధానమైన 5 దాడులలో మూడింటి లక్ష్యం వడ్డీ వ్యాపారులు. డబ్బు తీసుకొని వెళ్ళే ముందు రుణపత్రాల్ని కాల్చివేశారు. చరిత్ర పుటలలో బెంగాల్ కులీనులకు కల్పించబడిన స్థానం గదర్ రైతాంగ వీరులకు, సిపాయి వీరులకు లభించలేదు. పునర్జన్మ వుంటే ప్రతిసారి దేశం కొరకే ప్రాణాలర్పిస్తానని మృత్యుముఖంలో చెప్పగలిగిన 19 సంవత్సరాల కర్తార్‌సింగ్‌లాంటి వీరులు పంజాబ్ సైనిక స్థావరానికి చెందినవారు చాలామంది వున్నారు. అంబాలా వద్ద ఉరితీయబడిన తిరుగుబాటు చేసిన సిపాయిల గ్రూపులో వున్న ఒకే ఒక ముస్లిం అబ్దుల్లా. ముస్లిమేతరులైన సహచరులకు ద్రోహం చేయమని ప్రలోభ పెట్టినపుడు వాటిని తీవ్రంగా తిరస్కరిస్తూ చెప్పిన ఈ క్రింది మాటలు కలకాలం గుర్తుంటాయి. "వీరితో మాత్రమే నాకు స్వర్గ ద్వారాలు తెరుచుకుంటాయి."

విదేశాల నుండి విప్లవకారులకు సహాయం చేసే ప్రయత్నాలు యుద్ధ కాలంలో బెర్లిన్‌లో కేంద్రీకరింపబడ్డాయి. జిమ్మర్‌మన్ పథకం ప్రకారం జర్మనీ విదేశీ కార్యాలయం సహకారంతో వీరేంద్ర ఛటోపాధ్యాయ, భూపేన్ గుప్తా, హర్‌దయాళ్ మరికొందరి నాయకత్వంలో బెర్లిన్‌లో భారత స్వతంత్ర పోరాట కమిటీ ఏర్పాటు చేయబడింది. భారత్, ఇరాన్ సరిహద్దు సమీపంలో తెగల ప్రజలలో బ్రిటిష్ వ్యతిరేక భావాలు రెచ్చగొట్టేందుకు భారత్, జర్మనీ, టర్కీలు సంయుక్తంగా ప్రచార దళాన్ని ఏర్పాటు చేశాయి. 1915 డిసెంబర్‌లో మహేంద్ర ప్రతాప్ బర్కతుల్లా, ఒబైదుల్లా సింధీలు యువరాజు అమానుల్లా మద్దతుతో కాబూల్ వద్ద తాత్కాలిక స్వతంత్ర భారత ప్రభుత్వాన్ని స్థాపించారు.

యు.ఎస్.ఎ. మూడవ కేంద్రం రామచంద్ర, చంద్ర చక్రవర్తి నాయకత్వంలోని బెర్లిన్ కమిటీకి చెందిన న్యూయార్క్ ఏజెంట్లులాంటి మిగిలిన గదర్ నాయకులకు గణనీయంగా జర్మనీ నిధులు అందాయి. కాని వారిలో వారు కలహించుకున్నారు. యుద్ధంలో అమెరికా ప్రవేశించిన తరువాత 'హిందూ కుట్ర కేసు (1919) లాంటి కార్యకలాపాలకు తెరపడింది. దూర ప్రాచ్యంలోని జర్మనీ రాయబార కార్యాలయం నుండి కూడా నిధులందాయి. 1915 తరువాత రాష్ బిహారీ బోస్, అబనీ ముఖర్జీ జపాన్ నుండి ఆయుధాలు పంపించేందుకు చాలా ప్రయత్నాలు చేశారు. ఆయుధాలు చేరవేసే ప్రయత్నాలు విఫలమయ్యాయి. 1915 ప్రారంభంలో సాయుధ తిరుగుబాటు అవకాశం మెరుపులాగా వచ్చింది. అంతలోనే అంతర్ధానమయింది.

యుద్ధ కాలంలో ఎదురైన పరిస్థితిని ఎదుర్కొనేందుకు బ్రిటిష్‌వారు తీవ్రమైన అణచివేత చర్యలు చేపట్టారు. ప్రధానంగా గదర్ ఉద్యమాన్ని అణచివేసేందుకు 1915 మార్చిలో భారతదేశ రక్షణ చట్టాన్ని చేశారు. అనుమానితులు పెద్ద సంఖ్యలో ఎలాంటి విచారణలు లేకుండా బెంగాల్, పంజాబ్ జైళ్ళలో కుక్కబడ్డారు. ప్రత్యేక కోర్టులు కఠినమైన శిక్షలు విధించాయి. అనేకమంది సైనికులకు కోర్టు మార్షల్ శిక్షలు విధించడంగాక 46 మంది ఉరితీయబడ్డారు. 64 మందికి జీవిత కాల శిక్షలు విధించబడ్డాయి. బెంగాల్ టెర్రరిస్టులు, పంజాబ్ గదర్ పార్టీ వారేగాక అఖిల ముస్లిం ప్రపంచవాదులు కూడా అణచివేతకు గురయ్యారు. యుద్ధ కాలంలోను, కొన్ని సందర్భాలలో ఆ తరువాత కూడా అలీ సోదరులు ఆజాద్, హస్రత్ మొహాని సంవత్సరాల తరబడి గృహ నిర్బాంధాలకు గురయ్యారు.

## లక్నోలో ఐక్యత

రివల్యూషనరీలు కాని భారత రాజకీయ నాయకులు యుద్ధ ప్రయత్నాలకు మద్దతిచ్చారు. తిలక్, గాంధీలు గ్రామాలకు వెళ్ళి యుద్ధానికి సైనికుల్ని, ధనాన్ని సమకూర్చ యత్నించే వరకు ముందుకు పోయారు. అలాంటి విధేయత వలన పాలకులు పెద్ద రాజకీయ సంస్కరణలు చేపడతారని భ్రమలతో వున్నారు. 'యుద్ధ పత్రాలను కొనండి. వాటిని హోంరూల్‌కు హామీ పత్రంలా పరిగణించండి" – అనేది 1918లో తిలక్ నినాదం. ఈ లక్ష్యంతో మితవాదులు, అతివాదుల ఉమ్మడి వేదిక ఏర్పడింది. అలాగే ముస్లిం లీగ్ కూడా రాజ్యాంగ సంస్కరణలు సాధించడంతో పాటు యుద్ధానికి మద్దతు ఇవ్వడం ద్వారా తమకనుకూలంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొని వచ్చే వ్యూహంతో పనిచేసింది. 1914లో మాండలే జైలు నుండి విడుదలైన తిలక్ తన పాత కాంగ్రెస్ విరోధులతో కలిసి పని చేసేందుకు చాలా ఆసక్తిగా వున్నారు. కాని ఫిరోజ్ షా మెహతా 1915లో చనిపోయే వరకు పట్టు విడుపులు లేకుండా కఠినంగా వ్యవహరించాడు. కలకత్తాకి చెందిన భూపేంద్రనాథ్ బోస్‌లాంటి ఇతర మితవాద నాయకులు కాంగ్రెస్‌ని అప్పటి రొంపిలో నుండి బయటికి లాగేందుకు దేనికైనా సంసిద్ధతను వ్యక్తం చేశారు (గోఖలేకి లేఖ 1914 నవంబర్). 1914 నుండి దివ్య జ్ఞాన సమాజ నాయకురాలు అనిబిసెంట్‌కి రాజకీయ ప్రాధాన్యత పెరగడం, కాంగ్రెస్ పునరేకీకరణ క్రమానికి దోహదపడింది. అనిబిసెంట్ నికరమైన సామ్రాజ్యవాద వ్యతిరేకి కాదు. ఆమె భారత, బ్రిటిష్ స్నేహ సంబంధానికి ఒక మేరకు స్వయం పరిపాలన అవసరమని భావించారు. అందుకు బ్రిటిష్ రాడికల్స్ ఐర్లండ్ హోంరూల్ తరహాలో దేశవ్యాప్త ఉద్యమాలు అవసరమని భావించారు.

1915లో కాంగ్రెస్‌లో పునః ప్రవేశానికి తిలక్ గ్రూపుకి అనుమతి లభించింది. బొంబాయిలో ఒకేసారి సదస్సులు జరుపుకున్న కాంగ్రెస్, ముస్లిం లీగ్‌లు పరస్పర సంప్రదింపుల ద్వారా కనీస రాజ్యాంగ డిమాండ్లను రూపొందించే కమిటీలను నియమించాయి. ఇంపీరియల్ కౌన్సిల్ సభ్యులు 19 మంది భారతదేశానికి స్వయం ప్రతిపత్తి గల ప్రాతినిధ్య ప్రభుత్వాన్ని కోరుతూ 1916 అక్టోబర్‌న వైస్రాయికి విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు. కౌన్సిళ్ళలో ఎన్నికయ్యే సభ్యులు మెజారిటీగా వుండాలని 1916 డిసెంబర్‌లో లక్నోలో కాంగ్రెస్, ముస్లింలీగులు

ఉమ్మడిగా డిమాండ్ చేశాయి. హిందూ, ముస్లిం రాజకీయ విభేదాలు లక్నో ఒప్పందం ప్రకారం పరిష్కరించుకోవాలని తీర్మానించాయి. ప్రత్యేక నియోజకవర్గాల్ని కాంగ్రెస్ అంగీకరించింది. సీట్ల పంపకంపై ఒప్పందం కుదిరింది. ముస్లిం మెజారిటీ ప్రాంతాలలో (దామాషా ప్రకారం గాక) తక్కువ సీట్లకు ముస్లిం నాయకులు అంగీకరించారు. (ఉదాహరణకు బెంగాల్‌లో 40% సీట్లు) అందుకు ప్రతిఫలంగా బొంబాయి, యునైటెడ్ ప్రావిన్సులాంటి రాష్ట్రాలలో (30 శాతం కల్పించబడాలి) ఎక్కువ ప్రాతినిధ్యానికి కాంగ్రెస్ నాయకులు అంగీకరించారు. ఒప్పందం యుపికి చెందిన వజీర్ హస్సాన్, మహముదా బాబ్ నాయకత్వం వహిస్తున్న ముస్లిం లీగు ప్రయోజనాలకు అనుకూలంగా వుంది. ఫజుల్ హక్ మద్దతు ఇచ్చినప్పటికీ బెంగాల్‌లో కొంత అసంతృప్తి వ్యక్తమయింది.

**హోంరూల్ ఆందోళన**

కాంగ్రెస్ చర్చోపచర్చలు చేసే సంస్థగా వున్నది. నిరంతరం ఆందోళనలు చేసే సంస్థగా అది సన్నద్ధం చేయబడలేదు. కాంగ్రెస్ నిజమైన పార్టీగా మార్చడానికి మొదటి చర్యగా సంఘటితమైన వర్కింగ్ కమిటీని ఏర్పాటు చేయమని లక్నోలో తిలక్ చేసిన ప్రతిపాదనని అధ్యక్షుడు త్రోసిపుచ్చారు. కాబట్టి ఆందోళనా కార్యక్రమాలు రెండు హోంరూలు సంస్థల ద్వారా అనగా తిలక్‌హోం రూల్, అనిబిసెంట్ హోంరూల్ సంస్థల ద్వారా చేపట్టవలసి వచ్చింది. అనిబిసెంట్ 1915 సెప్టెంబర్‌లో తన హోంరూలు పథకాలని ప్రకటించారు. తన మద్రాసు వార్తా పత్రికలైన న్యూఇండియా, కామన్‌వీల్ పత్రికల ద్వారా కార్యకలాపాలు సాగించారు. ఆ తరువాత 1916లో బొంబాయి, యంగ్ ఇండియా ప్రారంభించారు. తిలక్ తన మహారాష్ట్ర స్థావరాలను నిలబెట్టుకొనేందుకు 1916 ఏప్రిల్‌లో హోంరూల్ లీగ్‌ను ప్రారంభించాడు. ఇది మహారాష్ట్ర, కర్ణాటకలకు పరిమితమయింది. 1917 ఏప్రిల్ నాటికి 17000, 1918 ప్రారంభానికి 32000 సభ్యత్వం ఉన్నట్లు చెప్పుకున్నారు. అనిబిసెంట్ హోంరూల్ ఒక మేరకు అఖిల భారత స్వరూపం గలదైనప్పటికి ప్రధానంగా దివ్య జ్ఞాన సంబంధాలపై ఆధారపడిన సంస్థ. తిలక్, కేల్కర్ ప్రధానంగా పూనా కేంద్రం నుండి సంస్థని నడప యత్నించారు. అడయార్ (మద్రాసు) ప్రధాన కేంద్రంగా పనిచేసిన అనిబిసెంట్ లీగుకు 200కి పైగా ఉన్న శాఖలపై (మద్రాసు ప్రెసిడెన్సీలో) పర్యవేక్షణ అంతంత మాత్రంగా వుంది. అనిబిసెంట్ హోంరూలు లీగు అత్యున్నత దశలో వున్న 1917లో దాని సభ్యత్వం 27000.

నగరాలలో గ్రూపు చర్చలు, రీడింగ్ రూముల నిర్వహణ, పెద్ద ఎత్తున కరపత్రాల అమ్మకం, ఉపన్యాసాలు, పర్యటనలు – హోంరూలు లీగు కార్యకలాపాలు. ఇవేవీ మితవాద రాజకీయాలకు భిన్నమైనవి కావు. కాని గమనించదగిన కొత్తదనం తీవ్రతలో, విస్తృతిలో వుంది. తిలక్ లీగు మొదటి సంవత్సరంలో మరాఠీ, ఇంగ్లీషు కరపత్రాలు 47000 కాపీలు అమ్మి వుంది. బీసెంట్ సంస్థ 26000 ఇంగ్లీషు కరపత్రాలు 1916 సెప్టెంబర్ నాటికి 30వేల కాపీలు అమ్మింది. 1917 జూన్‌లో బిసెంట్, ఆమె దివ్యజ్ఞాన ముఖ్య సహచరులు అరండేల్ వాడియాల పర్యటనలపై నిషేధం విధించబడినప్పుడు సాత్విక నిరోధం కాక సత్యాగ్రహం

ప్రస్తావన కూడా వచ్చింది. హోంరూలు ప్రచారంలో అత్యధికం అస్పష్టత, మేధోపరమైన భావనల చుట్టూ పరిభ్రమించినప్పటికీ తిలక్ ఉపన్యాసాలలో తరువాత గాంధేయ విధానాలుగా చెప్పబడే అంశాలు, నిర్దిష్టమైన, స్పష్టమైన ప్రజాసమస్యల్ని హోంరూలు లక్ష్యానికి అనుసంధానం చేయడంలాంటి ఆసక్తికరమైన విషయాలు వ్యక్తమయ్యాయి. "అటవీశాఖ మాపై జులుం చెలాయించింది. అబ్కారీ శాఖ మద్యపానాన్ని పెంచింది" (1916 మే 1న బెల్గాంలో తిలక్ ఉపన్యాసం) రెవెన్యూ శాఖ ఒత్తిడులు, ఉప్పు పన్నులకు కూడా తిలక్ ప్రస్తావించాడు. తిలక్ ఉద్యమం బిట్టవన్ బ్రాహ్మణులకు పరిమితమైనది కాదు. హోంరూలు లీగు సభ్యులలో పూనాలోని బ్రాహ్మణేతర వర్తకులు గణనీయంగా వున్నారు. ఖాండేష్ లాంటి ఖిల్లాల సభ్యులలో గుల్జారులు, మరాఠీలు, బ్రాహ్మణుల కంటే ఎక్కువగా వున్నారు. హోంరూలు లీగుకు చెందిన బి.పి. వాడియాలాంటి వారు మద్రాసు నగర శ్రామికవర్గంలో కాస్త తక్కువ స్థాయిలో అయినప్పటికీ కార్మిక వర్గ కార్యకలాపాల్ని ప్రారంభించారు.

హోంరూలు ఆందోళన, ప్రత్యేకించి బీసెంట్ లీగు ఆందోళన యొక్క నిజమైన ప్రాధాన్యత కొత్త ప్రాంతాలకు, కొత్త గ్రూపులకు, కొత్త తరానికి విస్తరింప చేయడంలో వున్నది. మద్రాసునలా వుంచితే మిగిలిన రెండు తీవ్రవవాద స్థావరాలు ప్రశాంతంగా వున్నాయి. యుద్ధ కాలంలో బ్రిటిష్ అణచివేతకు బెంగాల్, పంజాబ్ ప్రధాన లక్ష్యాలుగా వున్నాయి. ఎలాంటి బాహాటమైన ఆందోళన చేపట్టడం అసాధ్యమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. కాని బెంగాల్‌లో భవానీపూర్ ప్రొవెన్సియల్ సదస్సు చిత్తరంజన్‌దాస్ అనే నూతన నాయకుడిని చురుకైన రాజకీయాలలోకి ప్రవేశపెట్టింది. బీసెంట్ లీగుకు మద్రాసు నగరం పరిసర పట్టణాలకు చెందిన తమిళ బ్రాహ్మణుల నుండి యునైటెడ్ ప్రావెన్సులలో పట్టణ వృత్తిదారుల గ్రూపులు (కాయస్తులు, కాశ్మీరీ బ్రాహ్మణులు, కొందరు ముస్లింలు) సింధులో హిందూ అమిత మైనారిటీల నుండి బొంబాయి నగరం, గుజరాత్‌లో యువ గుజరాత్ పారిశ్రామికవేత్తల, వర్తకుల, లాయర్ల నుండి మద్దతు లభించింది. దివ్య జ్ఞాన సమాజం కొద్దిపాటి సంఘ సంస్కరణల కలయికతో, ప్రాచీన హిందూ విజ్ఞాన వైభవాల సిద్ధాంతాలతో, ఆధునిక పాశ్చాత్య దేశాలు సాధించిన ఫలితాలన్నీ ప్రాచీన కాలంలో రుషులు ఊహించినవేనన్న భ్రమలతో అలాంటి ఆలోచనా ధోరణులు గల గ్రూపుల నుండి కొంతమంది కార్యకర్తల్ని సమకూర్చుకొనగలిగింది. బహుశా అందుకు కారణం బ్రహ్మ సమాజం, ఆర్య సమాజంలాంటి సంస్కరణవాద, పునరుద్ధరణవాద ఉద్యమాలు వారికి బాగా అందుబాటులోకి రాకపోవడం కావచ్చు. అంతేగాక బొంబాయి, మద్రాసు నగరాలను మినహాయించితే మిగిలిన ప్రాంతాలలో అతివాద, మితవాద రాజకీయ సాంప్రదాయాలు బలంగా వేరూనలేదు. అందువలన అక్కడ రాజకీయ శూన్యత ఆవరించింది. అనిబిసెంట్ మద్రాసులో అతి సన్నిహితులు (వాడియా, అరండేల్, సి.పి. రామస్వామి అయ్యర్. అయ్యర్ తదనంతర కాలంలో తిరువాన్కూర్ సంస్థానంలో నిరంకుశాధికార సాంప్రదాయవాద సంరక్షకుడైన అధికారి అయ్యాడు) సమూలమైన మార్పులు గోరే రాజకీయాలతో తీవ్రంగా విభేదించారు. హోంరూల్ ఉద్యమంతో ప్రేరితులైన అనేకులు 1920 నుండి భారత రాజకీయాలలో భవిష్యత్తు నాయకులయ్యారు. మద్రాసులో సత్యమూర్తి, కలకత్తాలో జితేంద్రలాల్

బెనర్జీ అలహాబాద్, లక్నోలలో జవహర్‌లాల్ నెహ్రూ, ఖలీకుజ్జామన్‌లు, బొంబాయి, గుజరాత్‌లలో సంపన్నుడైన అద్దకం రంగుల దిగుమతిదారుడు బిమన్‌దాస్, ద్వారకాదాస్, పారిశ్రామికవేత్త ఉమర్ శొంభాని, ఇందూలాల్ యాజ్ఞిక్ వీరిలో ప్రత్యేకంగా ప్రస్తావించవలసిన ప్రముఖులు, బొంబాయి నగరంలో బిసెంట్ లీగుకి 2600 మంది సభ్యులున్నారు. ప్రభుత్వోద్యోగులు, పారిశ్రామికవేత్తలు నివసించే శాంతారాం చౌక్ వద్ద 10, 12 వేల మందితో సభలు నిర్వహించింది. గాంధేయ జాతీయ వాదానికి వెన్నెముకగా నిలవనున్న భవిష్యత్ సూచికలైన గుజరాత్, యుపిలో చాలా ప్రాంతాలు మొదటిసారిగా ప్రేరణ పొందాయి.

బిసెంట్ 1917 చివరలో పిల్లి మొగ్గలేశారు. బాధ్యతాయుత ప్రభుత్వంపై మాంటేగు వాగ్దానం ఒక్కసారిగా ఆమెని దాదాపు విధేయురాలిగా మార్చి వేసింది. వలంటైన్ చిరోల్‌కి వ్యతిరేకంగా నమోదైన అభియోగపత్రంపై వాదించేందుకు 1918 సెప్టెంబర్‌లో తిలక్ లండన్ వెళ్ళారు. 1917-18 కాలంలో చంపారన్, ఖేదా, అహ్మదాబాద్‌లలో విజయాలు సాధించిన గాంధీ రాజకీయ రంగంలో ముందుకు దూసుకు వచ్చారు. రాజ్యాంగ సవరణల అంతస్సంబంధాలని గురించి చర్చించే ముందు గాంధీయిజం ప్రారంభం, భారతీయ జీవితంపై యుద్ధం యొక్క విస్తృత ప్రభావం, 1905-17 కాలంలో భారత రాజకీయాలలో దిగువ స్థాయిలో వున్నప్పటికీ 1919 తరువాత రాజకీయాల్ని బాగా ప్రభావితం చేసిన తెగల, రైతుల ఉద్యమాలు, దిగువ తరగతుల మతవాదం, కులసంఘాలు, ప్రాంతాల ప్రజల మనోభావాల పరిణామం లాంటి అంశాల్ని సంక్షిప్తంగా పరిశీలిద్దాం.

## దిగువ నుండి ఉద్యమాలు (1905-1917)

### తెగల తిరుగుబాట్లు

19వ శతాబ్దంలో లాగానే తెగల తిరుగుబాట్లు 20వ శతాబ్దం ప్రారంభంలో కూడా కొనసాగాయి. కడప, నెల్లూరు, నల్లమల కొండలలో ఆహార సేకరణ చేసుకొనే చెంచు తెగ అటవీ ఉత్పత్తులపై తమకు సాంప్రదాయకంగా గల హక్కులకు 1898 నుండి ప్రభుత్వం ఆటంకాలు కల్పించడం తీవ్రతరమయింది. అణచివేత తీవ్రతరం చేస్తే అడవులను పూర్తిగా తగులబెడతారని ప్రభుత్వం భయపడింది. అటవీ సంరక్షణ, ఆదాయాల కొరకు ప్రభుత్వం 1913లో కఠిన నిబంధనల్ని అమలు పరచడం సహాయ నిరాకరణ ఉద్యమ కాలంలో అటవీ సత్యాగ్రహానికి దారితీసింది. గోదావరి కొండ ప్రాంతమైన రంపలో 1916లో తిరుగుబాటు చెలరేగి ఆ తరువాత 1922-24 కాలంలో అల్లూరి సీతారామరాజు నాయకత్వంలోని పెద్ద తిరుగుబాటుకి నాందిగా నిలబడింది. 1910లో బస్తర్ రాజుకి వ్యతిరేకంగా జరిగిన జగదల్‌పూర్‌లో జరిగిన తిరుగుబాటుని బ్రిటిష్ సైన్యాలు అణచివేశాయి. వారసత్వ వివాదం తిరుగుబాటుకి సాంఘిక కారణమైనప్పటికీ పోడు వ్యవసాయాన్నీ, అటవీ ఉత్పత్తులను స్వేచ్ఛగా వినియోగపరచుకొనడాన్ని నిషేధిస్తూ చేసిన నిబంధనల్ని అమలు పరచడం ప్రధానమైన కారణం. తిరుగుబాటుదారులు సమాచార వ్యవస్థకి అంతరాయం కల్గించారు. పోలీసు స్టేషన్లపై దాడులు చేశారు. పాఠశాలల్ని (తెగల నుండి బలవంతపు వసూళ్ళతో, వెట్టి చాకిరితో కట్టబడిన)

తగులబెట్టారు. జగదల్‌పూర్ పట్టణాన్ని పట్టుకొన ప్రయత్నించారు. ఒరిస్సాలోని దాస్ పల్లా సంస్థానంలో వారసత్వ వివాదం సమస్యలపై 1914లో గోండులు తిరుగుబాటు చేశారు. యుద్ధం ప్రారంభమయిందని, అతి త్వరలో జమిందారులు, జాగీర్‌దారులు ఉండబోరని, గోండుల్ని గోండులే పరిపాలించుకుంటారని పుకార్లు వ్యాపించడంతో తిరుగుబాటు వేరే రూపం తీసుకున్నది. గోండుల తిరుగుబాటు జ్వాలలు ప్రవేశ సౌలభ్యం లేని పర్వత మార్గాల ద్వారా తూర్పు కనుమల నుండి కలహండి బస్తర్‌ల వరకు వ్యాపిస్తాయని బ్రిటిష్‌వారు భయపడ్డారు. గోండుల గ్రామాల్ని తగులబెట్టారు. (హోం పోలీసు మార్చి 1915 పేజీ 153) యుద్ధ వార్తలు గోండులకు పొరుగున వున్న ఛోటా నాగపూర్, ఒరయన్లకు అలాంటి ఫలితాలనే తెచ్చిపెట్టాయి. ఏకేశ్వరోపాసన పాటించాలని, మద్య మాంసాలకు, తెగల నృత్యాలకు దూరంగా వుండాలని పిలుపునిస్తూ జాత్రా భగత్ 1914లో ఉద్యమం ప్రారంభించాడు. బిర్సా లేక కైజరు బాబా సంరక్షకుడుగా వస్తాడని వదంతులు వ్యాపించాయి. తరువాత సంవత్సరంలో తెగల ప్రజలు పెద్ద ఎత్తున పోడు వ్యవసాయం ప్రారంభించాడు. తీవ్రమైన అణచివేత చర్యలు ఉద్యమాన్ని తుడిచిపెట్టాయి. అంతకంటే సర్దుబాటు ధోరణి గల తానా భగత్ ఉద్యమం ఒరయన్‌లలో మనగలిగింది. 1920ల నుండి గాంధేయ జాతీయవాదంతో సంబంధాలు పెంచుకున్నది. 1917లో పశ్చిమ కనుమల తెగల శ్రామికుల్ని నీచమైన పనులకు నియమించే యత్నాల నుండి మయూర్ భంజ్‌లో సంతాల్ తిరుగుబాటు మణిపూర్‌లో థర్డే కుకీలలో తిరుగుబాట్లు చెలరేగాయి. పోడు వ్యవసాయాన్ని ఆపివేయించేందుకు ప్రభుత్వ ప్రయత్నాలు పొతాంగ్ (అధికారుల సరుకు, సామాగ్రి కూలినాలి లేకుండా మోయించడం) లాంటి సమస్యలు తోడయ్యాయి. రెండు సంవత్సరాల పాటు గెరిల్లా యుద్ధం కొనసాగింది. ఈ కాలంలో దక్షిణ రాజస్థాన్‌లోని బాన్స్‌వాడ, సుంత్, దున్నార్‌పూర్ భిల్లులు గోవింద గురు నాయకత్వంలోని సంస్కరణ ఉద్యమంతో ప్రేరితులై కార్యాచరణకు దిగారు. ఇది ఆత్మ సంయమనం శుద్ధి ఉద్యమంగా ప్రారంభమయింది. 1913 చివరికి భిల్లు రాజ్య స్థాపన లక్ష్యంగా పరిణితి చెందింది. 4000 మంది భిల్లులు మంగాడ్ కొండపై సమావేశమయ్యారు. భిల్లులు గణనీయంగా ప్రతిఘటించినప్పటికీ బ్రిటిష్‌వారు చెదరగొట్టారు. ప్రతిఘటనలో 12 మంది భిల్లులు హతులయ్యారు. 900 మంది ఖైదీలుగా పట్టుబడ్డారు (హోం పోలీసు బి. 1913 డిసెంబర్)

**రైతు ఉద్యమాలు**

చాలా ముఖ్యమైన రైతు ఉద్యమాలకు మేవార్ రంగస్థలమయింది. ఉద్యమాలు 1905లో ప్రారంభమయ్యాయి. అప్పుడు ఆర్.పి. దత్, డి.ఎల్. రామ్, అభినేంద్రనాథ్ ఠాగూర్, రవీంద్రనాథ్ లాంటి బెంగాలీ దేశభక్తియుత మేధావులు మధ్యయుగాల నాటి చిత్తూరు రాణాల శౌర్య ప్రతాపాల నుగ్గడిస్తూ నవలలు, నాటకాలు, కథలు, కవితలు రాస్తూ వుండటం యాదృచ్ఛికమే అయినప్పటికీ ఆసక్తికరం. కాని రాణాల ఆధునిక వారసులు బ్రిటిష్‌వారి అడుగులకు మడుగులొత్తుతూ రైతులపై పలు రకాల ఫ్యూడల్ దోపిడీ కొనసాగించారు. బిజోలియాలో సర్కార్ రాజ్‌పుట్ అధీనంలో పెద్ద మేవార్ జాగీరు వుంది. అతను రైతులపై 86 రకాల పన్నులు విధించాడు. 1905లో మరలా 1913లో రైతులు సమిష్టిగా పొలాల్ని

సాగుచేయ నిరాకరించారు. పొరుగు ప్రాంతాలకు వలస పోయేందుకు ప్రయత్నించారు. 1913 ఆందోళనకు సీతారాం దాసు అనే సాధువు నాయకత్వం వహించాడు. సచిన్ సన్యాల్ గ్రూపుతో సంబంధం గల బోప్‌సింగ్ అలియాస్ విజయ్‌సింగ్ పథిక్ ప్రవాసంలో వుండి 1915 నాటికి రైతు నాయకుడుగా పరిణితి చెందాడు. 1916లో ఉదయ్‌పూర్ మహారాణాకి వ్యతిరేకంగా పన్నుల రద్దు ఉద్యమానికి తనతో పాటు నాయకత్వం వహించవలసినదిగా ప్రభుత్వ అధికారి మాణిక్‌లాల్ వర్మని ఒప్పించాడు. యుద్ధ రుణాలకు రైతులు నిరాకరించడం బిజోలియా ఉద్యమంలోని మరొక ప్రత్యేకత. బిజోలియా ఉద్యమం గాంధేయ ఉద్యమాలతో సంబంధం పెంచుకొని 1920 దశాబ్దంలో కొనసాగింది. ఆ తరువాత పథిక్, వర్మలు రాజస్థాన్‌లో ముఖ్యమైన కాంగ్రెస్ నాయకులయ్యారు.

గాంధేయ జాతీయవాదం ఆవిర్భావానికి రైతు ఉద్యమాలు ప్రత్యక్షంగా గణనీయంగా రెండు ప్రాంతాలలో తోడ్పడ్డాయి. నైరుతి బీహారులోని చంపారన్, గుజరాత్‌లోని ఖేదా, స్థానిక సమస్యల్ని అఖిల భారత స్థాయికి తెచ్చేందుకు గాంధీ జోక్యం అనివార్యమయింది. గాంధీ రాకకు ముందే ఈ రెండు ప్రాంతాలలో అసంతృప్తి, నిరసనలు వెల్లువెత్తాయి. చంపారన్‌లో రైతులు 'టింకాలియా' విధానాన్ని 1860 నుండి చెదురు మదురుగా ప్రతిఘటిస్తూ వచ్చారు. రాంనగర్, బెటియా, మధువన్ జమిందారుల నుండి నీలిమందు తోటల పెంపకం కొరకు కౌలుకు తీసుకొన్న యూరోపియన్ ప్లాంటర్లు రైతుల స్వంత పొలాల్లోని కొంత భాగాలలో గిట్టుబాటు కాని ధరలకు నీలిమందు సాగు చేయవలసినదిగా రైతులు నిర్బంధించారు. 1900 సం॥ల నుండి రసాయనపు అద్దకాల పోటీ కారణంగా నీలిమందు కొట్లు పడిపోయాయి. ప్లాంటర్లు నష్టాల్ని రైతుల నుండి రాబట్టేందుకు కౌలు రేట్లు పెంచారు. నీలిమందు తోటలు పెంచమని నిర్బంధించినందుకు పెద్ద మొత్తాలు చెల్లించవలసినదిగా ఒత్తిడి తెచ్చారు. 1905–08 మధ్య కాలంలో మోతిహరి – బెటియా ప్రాంతంలో రైతులు ప్రతిఘటించారు. ప్రతిఘటన ప్రభావం 400 చ.మైళ్ళపై పడింది. హింస చెలరేగింది. (ఫ్యాక్టరీ మేనేజర్ బ్లూం ఫీల్డ్ హత్య చేయబడ్డాడు). 57 కేసులు పెట్టబడ్డాయి. 277 మందికి శిక్షలు విధించబడ్డాయి. సంపన్న రైతులు పిటిషన్లు, బీహార్ కాంగ్రెస్ నాయకులతో, జర్నలిస్టులతో సంబంధాల ద్వారా దశాబ్ద కాలం పాటు పోరాటం కొనసాగించారు. దీనిలో భాగంగా సంపన్న రైతు వడ్డీ వ్యాపారియైన రాజ్‌కుమార్ శుక్లా 1916 లక్నో కాంగ్రెస్ సదస్సులో గాంధీకి పరిస్థితిని నివేదించాడు. ఖేదాలో కూడా గాంధీ రాకకు ముదే రైతులు సమిష్టిగా పన్నులు చెల్లించ నిరాకరించారు. 19వ శతాబ్దాంతానికి పొగాకుకి పాల ఉత్పత్తులకు మార్కెట్లు విస్తరించడంతో సంపన్న వర్గంగా ఎదుగుతున్న రైతాంగాన్ని 1898 – 1906 మధ్య కాలములో ప్లేగు, కరువు కాటకాలు, శిస్తుల పెంపుదల భారాలు క్రుంగదీశాయి. గుజరాత్‌లో గాంధేయ కార్యకలాపాలకు మరొక కేంద్రమైన సూరత్ జిల్లాలోని బార్డోలిలో 1908 నుండి కున్వరాజ్ మెహతాచే స్థాపించబడిన పతీదార్ యీజన్ మండల్‌చే కులపరమైన విభజనతో సంఘ నిర్మాణ కార్యకలాపాలు ప్రారంభించబడ్డాయి.

**మతవాదం**

గత అధ్యాయంలో గమనించిన విధంగా దిగువ తరగతి అసంతృప్తి స్పష్టమైన క్రమంలో గాక కులపరమైన, మతపరమైన, ప్రాంతీయ పరమైన అస్పష్ట రూపాలలో వ్యక్తమయింది. ఉదాహరణకు మెమర్ సింగ్‌లోని జమాల్‌పూర్ సబ్ డివిజన్‌లోని కమరియార్చ్యాత్ వద్ద 1914లో ప్రజా సదస్సు ఈ క్రింది డిమాండ్ల పత్రాన్ని రూపొందించింది. కౌలు తగ్గింపు, పన్నుల రద్దు, అప్పులపై రాయితీలు, జమిందార్లకు రుసుము చెల్లించకుండా చెట్లు నాటే హక్కు, చెరువులు తవ్వుకొనే హక్కు, హిందూ జమిందారు కోర్టుతో, ముస్లిం కౌలుదారుల్ని గౌరవంగా చూడటం. సదస్సు చౌదురి ఖోస్ మహమ్మద్ సర్కార్ అనే సంపన్న ముస్లిం రైతులచే నిర్వహించబడింది. సదస్సు పాటికాపుల సమస్యలపై నోరు విప్పలేదు. సదస్సుకు ఫజలుల్‌హక్ అక్రం ఖాన్, అబుల్ ఖాశింలాంటి బెంగాల్ రాజకీయ నాయకులు హాజరయ్యారు. వ్యవసాయదారుల (సంపన్న రైతుల జోతేదార్ల) అసంతృప్తిని ప్రతిఫలిస్తూ 1920–30 దశాబ్దాలలో బెంగాల్ రాజకీయాలు ముఖ్యమైన పాత్ర నిర్వహించవలసిన ప్రచార ఉద్యమానికి ఇది ఆరంభం. తుదకు ముస్లిం వేర్పాటువాదానికి దోహదపడిన హిందూ ఆధిపత్యంలో గల బెంగాలీ కాంగ్రెస్ యొక్క తప్పులు పరిమితులు కారణంగానే యిలా జరిగింది. కులీనుల మతవాదానికి పూర్తిగా భిన్నమైన సాధారణ ప్రజలకు చెందిన హిందూ మతవాదం లేక ముస్లిం మతవాదం యొక్క మూలాలపై ఈనాటికి సమగ్రమైన అధ్యయనం జరగలేదు. 1917 అక్టోబర్‌లో దాదాపు 50,000 మంది హిందువులు షాబాద్‌లోని 124, గయలోని 24, పాట్నాలోని 2 గ్రామాలలో గల ముస్లింలపై దాడులు జరపడానికి గల సామాజిక మూలాలను పరిమితులను తెలుసుకోవాలని ఎవరైనా ఆకాంక్షిస్తారు. అప్పటికప్పుడు బయటికి కనిపించే తక్షణ సమస్య గోసంరక్షణ అయినప్పటికి బ్రిటిష్ పాలన కుప్పకూలుతుందని వదంతులు వ్యాపించాయి. దాడులలో పాల్గొన్న ప్రజలు 'అంగ్రేజీ కా రాజ్ ఉఠే గయా', 'జర్మనీకి జై' నినాదాలు మారుమోగాయి. వర్గ ఉద్రిక్తతలకు భయకంపితులైన ఉన్నత కులాలకు చెందిన భూస్వాములు స్థానిక నాయకత్వాన్ని తిరిగి పొందేందుకు మతతత్వాన్ని ఉపయోగించుకున్నారు. సనాతన ధర్మ సభకి, ఆర్య సమాజానికి చెందిన ఆందోళనకారులు దొమ్మీలను రెచ్చగొట్టడంలో ముఖ్యమైన పాత్ర వహించారు. యుపిలోని అలహాబాద్ ప్రాంతానికి చెందిన ప్రముఖ సనాతన ధర్మ కార్యకర్త మాలవ్యా ఆశ్రితుడు ఇంద్ర నారాయణ ద్వివేది లాంటి వారు మత ఉపన్యాసాన్ని, హిందీ ప్రచారాన్ని హోంరూలు రాజకీయాలలోను 1917 కిసాన్ సభల ప్రారంభంలోను కలగలపడం అప్పటి రైతాంగ సమస్యల పట్ల రైతుల్ని సమీకరించడంలో గల అనిశ్చిత పరిస్థితికి సూచిక. 1918 సెప్టెంబర్‌లో కలకత్తాలో జరిగిన ఘటనలలో పరిసరాలు, పేద ముస్లింలు బుర్రా బజారు వ్యాపారులపై దొమ్మీలు చేశారని ఈ అంశంపై వివరంగా అధ్యయనం చేసిన జెహెబ్ బ్రూం ఫీల్డ్ పేర్కొన్నారు. పేద ముస్లింలు, అఖిల ముస్లిం ప్రపంచ ప్రచారంతో బెంగాలీయేతర ఆందోళనకారుల (హబీబ్ షా, ఫజులార్ రహమాన్, కలామి)చే రెచ్చగొట్టబడ్డాయి. హిందూ పునరుద్ధరణ వాదం, అఖిల ముస్లిం ప్రపంచవాదం – రెండూ కూడా దిగువ తరగతి అసంతృప్తి మతోన్మాదానికి, సామ్రాజ్యవాద రాజకీయాలకు మధ్య ఊగిసలాటకు వ్యక్తీకరణలుగా నిలిచాయి.

**కుల ఉద్యమాలు**

20వ శతాబ్దపు తొలి దశాబ్దాలలో ముఖ్యంగా చెప్పుకోదగిన పరిణామం కుల సదస్సులు, కుల సంఘాలు, కుల ఉద్యమాలు పెరుగుట. ఈ సంఘాల నిర్మాణం సాధారణంగా భిన్న గ్రూపులుగా వున్న మధ్య కులాల విద్యావంతులు లేక దిగువ కులాల విద్యావంతులు చేపట్టారు. ప్రభుత్వ ఉద్యోగాల పరుగు పందెంలో బ్రాహ్మణులు ఇతర అగ్రవర్ణాల ఇంగ్లీషు చదువు చదివి కొంత ముందున్నారు. పరుగుపందెంలో బ్రాహ్మణులు ఇతర అగ్రవర్ణాల ఇంగ్లీషు చదువు చదివి కొంత ముందున్నారు. పరుగుపందెంలో ఆలస్యంగా చేరిన వారు ముందున్న వారి ఆధిక్యతని ప్రశ్నించి తమ ప్రయోజనాలు సాధించుకునేందుకు కులం ప్రయోజనకరమైన సాధనమయింది. కొన్ని జాతులు లేక కులాలు సంస్కృతీకరణ ద్వారా పైకి ఎదిగేందుకు కుల ఉద్యమాలు పనిచేస్తున్నాయని, కుల ఉద్యమాలు సాంప్రదాయానికి, ఆధునికతకు మధ్య విలువైన సంబంధాల్ని నెలకొల్పుతాయని కొందరు సామాజిక శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. మహారాష్ట్రలో బ్రాహ్మణేతర ఉద్యమాలపై అధ్యయనం చేసిన గెయిల్ ఆమ్ నెట్ ఇలా చెబుతున్నారు.

సామాజిక, ఆర్థిక, వర్గ ఉద్రిక్తతలకు కుల ఘర్షణలు వర్గీకరింపబడినప్పటికీ చాలా ముఖ్యమైన వ్యక్తీకరణలు మహారాష్ట్రలోని సత్యశోధన్ సమాజ్‌లాంటి కుల వ్యతిరేక ప్రజా ఉద్యమాలు లేక తమిళనాడులోని ఆత్మగౌరవ ఆందోళనల ఆవిర్భావాల్ని సంస్కృతీకరణ వివరించలేదు. గనుక సంస్కృతీకరణ భావన చాలా సంకుచితమైన భావన.

బెంగాల్‌లాంటి ప్రావిన్సులలో కూడా కులసంఘాలు (1908 తరువాత జాతీయ ఉద్యమం తగ్గుదలతో) కొంత బలపడ్డాయి. అవి దక్షిణ భారత దేశంలో, మహారాష్ట్రలో గొప్ప సామాజిక రాజకీయ ప్రాధాన్యతని సంతరించుకున్నాయి. ఈ ప్రాంతాలలో బ్రాహ్మణాధిక్యత ఎక్కువ. కఠినమైన కుల కట్టుబాట్లు ఎక్కువ. దక్షిణ తమిళనాడులోని రామనాథ్ ఖిల్లాకు చెందిన పట్టణాలలో 19వ శతాబ్దాంతానికి నాడార్లలోని ఒకగ్రూపు వర్తకులుగా అభివృద్ధి చెందారు. విద్య సామాజిక సంక్షేమ కార్యకలాపాలకు నిధులు సేకరించింది. అగ్రకులాల ఆచార సాంప్రదాయాలను అనుకరించింది. 1910లో నాడార్ మహాజన సంఘాన్ని స్థాపించింది. సంస్కృతీకరణకి ఇది ఉదాహరణగా కనిపిస్తుంది. కాని ఇలాంటి పైకి ఎదుగుదల ప్రభావం తిరునల్వేలి ప్రాంతంలోని కల్లు గీత వారిపై పడలేదు. వారు ఇంకా కులం పేరుతో షానార్లు అని పిలువబడుతున్నారు. కాని రామనాథ్ జిల్లాలోని వారి సోదరులు పరువు ప్రతిష్టలు గల నాడార్లుగా పిలవబడుతున్నారు. ఇంతకంటే రాజకీయ ప్రాధాన్యత కలది 'జస్టిస్ ఉద్యమం' ఇది సి.ఎన్. మొదలియార్, టి.ఎం. నాయర్, పి. త్యాగరాజు చెట్టీలచే మధ్యతరహా కులాల (తమిళ వెల్లిలు మొదలియార్, చెట్టియార్, వెలుగు రెడ్డి, కమ్మ, బలిజ నాయుడు, మళయాళీ నాయర్) తరఫున 1915-16లలో మద్రాసులో స్థాపించబడింది. వీరిలో పెద్ద భూస్వాములు, వ్యాపారులు వున్నారు. విద్యా ఉద్యోగాలు రాజకీయాలలో బ్రాహ్మణాధికత్య పట్ల వీరికి చాలా ద్వేషం. 1912లో మద్రాసు ప్రెసిడెన్సీ జనాభాలో కేవలం 3.2 శాతం వున్న బ్రాహ్మణులు

55% డిప్యూటీ కలెక్టరు, 72.6% డిస్ట్రిక్ట్ మున్సిఫ్ ఉద్యోగాలలో వున్నారు. బ్రాహ్మణులలో పెద్ద భూస్వాములు ప్రత్యేకించి తంజావూరు జిల్లాలో వున్నారు. వ్యవసాయపు పనులకు దూరంగా వుండాలనే కులపరమైన నిషేధం, పట్టణాలలో వృత్తిపరమైన పనులు వారికి వ్యవసాయానికి దూరంగా వుంచాయి. బ్రాహ్మణాధిక్యత గల అనిబిసెంట్ హోంరూలు లీగు ఆందోళన భయాందోళనలు కలిగించింది. మద్రాసులోని బ్రిటిష్ అధికారులు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తలు వాటిని వినియోగించుకున్నారు. మద్రాసు మెయిల్ మెయిల్ పత్రిక సంపాదకుడు మరియు మద్రాసు నగరంలో బ్రిటిష్ వ్యాపార ప్రయోజనాల ప్రతినిధియైన టి. ఇయెర్లీ వెల్బీ మాంటేగు బాధ్యతాయుత ప్రభుత్వ వాగ్దానాన్ని తీవ్రంగా విమర్శించాడు. (ఇంగ్లండ్ కంఠధ్వని, అది ఇక మీదట సింహానిది కాదని తెలుసు, కాబోతుందది యూదు దేశదిమ్మరి గుసగుసలు – మద్రాసు మెయిల్ 1917 సెప్టెంబర్ 19) జస్టిస్ పార్టీ ఆవిర్భావాన్ని ప్రోత్సహించారు. ఎక్కువ ఉద్యోగాలు, కొత్త చట్టసభలలో ప్రత్యేక ప్రాతినిధ్యం – ఆశలతో జస్టిస్ పార్టీ ప్రభుత్వానికి విధేయతని ప్రదర్శించింది. 1916 డిసెంబర్ 20 నాటి బ్రాహ్మణేతర మేనిఫెస్టో బ్రిటిష్ పాలకుల పలుకుబడిని, అధికారాన్ని తగ్గించే ఎలాంటి ప్రతిపాదనలకైనా వ్యతిరేకత వ్యక్తం చేసింది. 'బ్రిటిష్ పాలకులు మాత్రమే సంప్రదాయానికి, వర్గానికి మధ్య సమతుల్యత సాధించగలరు'. జస్టిస్ పార్టీ పూర్తిగా కులీన వర్గానికి చెందినది. ఆర్థికంగా భూస్వాములపై ఆధారపడిన పార్టీ కాని జాతీయవాద అనుకూల మద్రాసు ప్రెసిడెన్సీ సంఘం వ్యక్తం చేసిన విధంగా బ్రాహ్మణేతరుల సమస్యలు వాస్తవమైనవి. ఈ సంఘం కూడా ప్రత్యేక ప్రాతినిధ్యాన్ని డిమాండ్ చేసింది. 1920 దశాబ్దం చివరలో సమూల మార్పులుగోరే ప్రజాదరణ పొందిన బ్రాహ్మణ వ్యతిరేక, కుల వ్యతిరేక ఉద్యమం, తమిళనాడులో ఇ.వి. రామస్వామి నాయకత్వంలో ఆవిర్భవించింది.

మైసూరు స్వదేశీ సంస్థానంలో మొత్తం జనాభాలో 3.8 శాతంగా వున్న పట్టణాలకు చెందిన బ్రాహ్మణులు 65 శాతం గెజిటెడ్ ఆఫీసర్లుగా వున్నారు. వక్కలిగులు, లింగాయత్‌లు గ్రామాలలో ఆధిక్యత గల గ్రూపులుగా వున్నారు. 1905–06లో లింగాయత్ విద్యా నిధి సంఘం, వక్కలిగసంఘం ఆవిర్భవించాయి. 1917లో మైసూరు మహారాజా కళాశాలలో బోధిస్తున్న మద్రాసుకు చెందిన బ్రాహ్మణేతర రాజకీయవేత్త సి.ఆర్. రెడ్డి బ్రాహ్మణేతర వేదికగా ప్రజామిత్ర మండలి అనే మొదటి రాజకీయ సంస్థని స్థాపించారు. కాని ఈ సంస్థలు వ్యక్తిగత సంబంధాల ద్వారా కోర్టు రాజకీయాల్ని ప్రభావితం చేసేందుకు ప్రయత్నించాయి.

తిరువాన్కూరు సంస్థానంలో కొద్ది మంది కులీనులుగా వున్న నంబూద్రి బ్రాహ్మణులు (జనాభాలో 1% కంటే తక్కువ) శిస్తులు చెల్లించనవసరం లేని పెద్ద పెద్ద ఎస్టేట్లు కలిగి వున్నారు. వీరు విద్య ఉద్యోగాల పరుగు పందేనికి దూరంగా ఉండిపోయారు. కాని మళయాళీయేతర (మరాఠీ దేశస్థ, తమిళ మూలాలు గల) బ్రాహ్మణులకు పాలనా వ్యవహారాలలో కీలక స్థానాలు లభించాయి. స్థానిక ఆధిపత్యం గల నాయర్లకు ఎన్ని ఉద్యోగాలు వున్నాయో వీరికి అన్ని ఉద్యోగాలు వున్నాయి. నాయర్ల జనాభా అర్ధ మిలియన్ కాగా బ్రాహ్మణ జనాభా కేవలం 28000 మాత్రమే. తిరువాన్కూర్ సంస్థానంలో అక్షరాస్యతా శాతం ఎక్కువ. క్రైస్తవ కేంద్రంగా వున్న తిరువాన్కూర్‌లోని ఎజావా ఇతర నిమ్న కులాలలో మిషనరీ కార్యకలాపాల

కారణంగా అక్షరాస్యత పెరిగింది. దివాని మాధవరావు (1860-72) కృషి ఫలితంగా అగ్రవర్ణాలలో విద్యావ్యాప్తి జరిగింది. 1901లో తిరువాన్కూరులోని పట్టణ ప్రాంతాల అక్షరాస్యత 36%. ఇది కలకత్తా అక్షరాస్యతా శాతం కంటే ఎక్కువ. నాయర్లు, మళయాళీయేతర బ్రాహ్మణులచే వెలివేయబడినట్లు భావించారు. సిరియన్ క్రైస్తవుల్ని (వీరిలో పెద్ద భూస్వాములు, వర్తకులు వున్నారు. వీరు ఆధునిక జర్నలిజంలో కూడా అగ్రగాములుగా వున్నారు) చూసి ఆందోళన చెందారు. ఎజావాల పెరుగుదల ప్రారంభాన్ని చూసి కలవరపడ్డారు. నాయర్లకు అంతర్గతంగా కూడా చాలా సమస్యలు వున్నాయి. నాయర్ల మాతృస్వామ్య కుటుంబాల సాంప్రదాయం ఆధునిక ఆర్థిక పరిస్థితులకు సరిపడనిదిగా భావించబడింది. చాలా కుటుంబాలకు చాలా కొద్దిపాటి పొలం మాత్రమే వుంది. పెరిగిన ధరలతో కుటుంబాలు క్రుంగిపోయాయి. నంబూద్రిలకు నాయర్ మహిళలు అచ్ఛాదన లేని రొమ్ములతో కనిపించాలి. వారితో తాత్కాలికంగా శారీరక సంబంధాలకు అంగీకరించాలి. ఇలాంటి సాంప్రదాయాలు తిరోగమనమైనవని పాశ్చాత్య విద్య చూపెట్టింది.

ఫలితంగా సంఘ సంస్కరణ, బ్రాహ్మణ వ్యతిరేకత, దేశభక్తి భావాలు ఆవిర్భవించాయి. కేరళ మొదటి నవల చంద్రమీనన్ యొక్క ఇందు లేఖ (1889) నంబూద్రిల సామాజిక ఆధిపత్యంపైన, కాల్పనిక ప్రేమపైన మాతృస్వామ్య కుటుంబం యొక్క కఠినమైన నిబంధనల పైన తీవ్రంగా దాడి చేసింది. సి.వి. రామన్ పిళ్ళై యొక్క చారిత్రక నవల మార్తాండవర్మ (1891) కోల్పోయిన నాయర్ల సైనిక పరమైన కీర్తి ప్రతిష్టల పునరుజ్జీవనానికి నవలలోని నాయకుడైన అనంత పద్మనాభన్ ద్వారా పిలుపునిప్పించింది. ప్రభుత్వోద్యోగాలలో బ్రాహ్మణాధిక్యతను ఎదుర్కొనేందుకు 1891 మళయాళీ మెమోరియల్‌లో నిర్వహించిన వారిలో రామన్ పిళ్ళై ముఖ్యుడు. క్రిస్టియన్లకు ఎజిరాలు సహకరించినప్పటికీ ఇది ప్రధానంగా నాయర్ల ఉద్యమం. 1890 దశాబ్దాంతానికి రామన్ పిళ్ళై గ్రూపుకి అధికార కులీన వర్గం కొన్ని అవకాశాలు కల్పించి తనలో విలీనం చేసుకున్నది. 1900 సం॥ల తరువాత కె. రామకృష్ణ పిళ్ళై, మన్నత్ పద్మనాభ పిళ్ళై నాయకత్వంలో శక్తివంతమైన నాయర్ల నాయకత్వం ఆవిర్భవించింది. నాయర్ల డిమాండ్లను సంఘ సంస్కరణ చర్యలతో కలగలిపి 1914లో పద్మనాభ పిళ్ళై నాయర్ సర్వీసు సొసైటీని స్థాపించాడు. అది ఇప్పటికీ కొనసాగుతుంది. రామకృష్ణ పిళ్ళై 1906 నుండి 1910 వరకు "దేశాభిమాని" పత్రికకి ఎడిటర్‌గా పనిచేశాడు. పత్రిక కోర్టులపై దాడి చేసింది. రాజకీయ హక్కుల్ని డిమాండ్ చేసింది. ఫలితంగా రామకృష్ణ పిళ్ళై తిరువాన్కూరు నుండి బహిష్కరింపబడ్డాడు. రామకృష్ణ పిళ్ళైకి, టి.ఎం. నాయర్ జస్టిస్ ఉద్యమంతో సంబంధాలున్నాయి. రామకృష్ణ పిళ్ళై 1916లో అకాల మరణం చెందడానికి ముందు మళయాళంలో కారల్‌మార్క్స్ జీవిత చరిత్రను ప్రచురించాడు.

ఇలాంటి వివిధ కార్యక్రమాలు చేపట్టడం నాయర్ల గుత్తాధిపత్యం కాదు. కొబ్బరి పీచు, నారల పనులు చేసుకొనే ఎజావాలు, కొబ్బరి ఉత్పత్తులన్నింటి రేటు పెరగడంతో ఆర్థికంగా కొంత పుంజుకున్నారు. చైతన్యవంతులయ్యారు. ఆధ్యాత్మిక గురువైన నారాయణగురు (1855-1928) యొక్క అరువిపురం ఆలయం కేంద్రంగా కార్యకలాపాలు ప్రారంభించారు.

నారాయణగురు 1902–03లో శ్రీనారాయణ ధర్మ పరిపాలన యోగం స్థాపించారు. ఎజావాలలో మొదటి పట్టభద్రుడు డాక్టర్ పాల్పు. యన్. కుమరన్ అస్సాన్ గొప్ప మళయాళీ కవి. నారాయణ గురు సంస్థ క్విలన్‌లో (1905 జనవరిలో) పారిశ్రామిక ప్రదర్శన నిర్వహించింది. ఆ వెనువెంటనే నాయర్, ఎజావాల ఘర్షణలు జరిగాయి. టి.కె. మాధవన్ నాయకత్వంలో 1920లలో శ్రీ నారాయణ ధర్మపరిపాలన యోగం, గాంధేయ జాతీయ నినాదంతో ముఖ్యమైన సంబంధాలు ఏర్పరచుకొన్నది. ఆ తరువాతి తరం ఎజావాలు, కమ్యూనిస్టుల వైపు నిర్ణయాత్మకంగా మొగ్గారు. కుల సమీకరణ, సంఘ సంస్కరణ, సమూలమైన మార్పులు కోరే రాజకీయాలు ఈ కేరళ జీవితంలో పునరావృతమవుతున్నది. ఆ క్రమం ఇది. ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్ కూడా 1920లలో నంబూద్రి సంక్షేమ సంఘం కార్యకర్తగా తన రాజకీయ జీవితం ప్రారంభించాడు.

కుల ఉద్యమాలన్నింటిలో మహారాష్ట్రలోని సత్యశోధక్ సమాజ్ చాలా ఆసక్తికరమైనది. దానికి రెండు విభిన్నమైన వైఖరులున్నాయని గెయిల్ ఆమెవెట్ పరిశోధన స్పష్టం చేసింది. మొదటిది మద్రాసులోని జస్టిస్ ఉద్యమంతో చాలా పోలికలున్న వైఖరి. కొల్హాపూర్ రాజాసాహు (ఆయన రాజాస్థానంలోని బ్రాహ్మణులతో వివాదాలు వున్నాయి) పోషణపై ఎక్కువగా ఆధారపడింది. కులీనులకు ఎక్కువ ఉద్యోగాలు రాజకీయ సానుకూలతపై కేంద్రీకరించింది. అదే సమయంలో పూజారి వర్గానికి, సంపన్నులకు వ్యతిరేకంగా ప్రజానుకూలమైన, సమూలమైన మార్పులు కోరే వైఖరి వుంది. 1910 నుండి తన స్వంత గ్రామమైన తారావడి నుండి సత్యశోధక్ పత్రిక 'దీన్ మిత్రా' పత్రిక నడిపిన ముకుందరావు పాటిల్‌లాంటి నాయకుల ఆధ్వర్యంలో మహారాష్ట్ర దక్కన్, విదర్భ, నాగపూర్ ప్రాంతాల గ్రామీణ పునాదిని సత్యశోధక్ సమాజం ఏర్పరచుకొనగలిగింది. సత్యశోధక సాహిత్యం అంతా మరాఠీలో వెలువడింది గానీ ఇంగ్లీషులో కాదు. సాధారణ ప్రజల మన్నన పొందడానికి ఇదొక ప్రబల కారణం. 1917 వార్షిక సదస్సులో 14 జిల్లాలకు వ్యాపించిన 49 శాఖల నుండి రిపోర్టులు వచ్చాయి. వీటిలో 30 రిపోర్టులు 2000 లోపు జనాభా గల గ్రామాల నుండి వచ్చినవి. సత్యశోధక్ కులపరమైన అణచివేతను తిరస్కరించింది. ప్రస్తుత చట్రంలో పై స్థాయి కొరకు సంస్కృతీకరణ డిమాండ్ చేయలేదు. సత్యశోధక సామాజిక పునాది సంపన్న రైతులే. కాని ఈ కాలంలో అగ్రవర్ణాల భూస్వాములకు వ్యతిరేకంగా మొత్తం రైతులకు కొన్ని ఉమ్మడి ప్రయోజనాలు వున్నాయి. సత్యశోధక్ సందేశం గ్రామీణ ప్రాంతాలలో జానపద నాటక రూపంలో (ఇండియన్ పీపుల్ థియేటర్ ద్వారా 1940లలో కమ్యూనిస్టులు అనుసరించిన పద్ధతి ఉండేవి. జానపద నాటకాలు ప్రదర్శించే గ్రూపులు చురుకుగా పనిచేసిన సతారాలో 1919లో స్థానిక సత్యశోధక్ నాయకుల ఆధ్వర్యంలో రైతుల తిరుగుబాటు జరిగింది.

### ప్రాంతీయ భావాలు, భాషలు

భాషల పరంగా ప్రాంతీయ భావాలు అభివృద్ధి చెందడం ఇటీవలి పరిణామం. వివిధ ప్రాంతీయ భాషలలో సాహిత్య కళారూపాలు అభివృద్ధి చెందాయి. మద్రాసు ప్రావిన్సులోని ఆంధ్ర జిల్లాల్లో 1911 నుండి ప్రత్యేక రాష్ట్రం కొరకు ఉద్యమం ప్రారంభమయింది. గుంటూరుకి

చెందిన దేశాభిమాని లాంటి పత్రికలు ఆంధ్రులకు ఉద్యోగాలలో తగిన ప్రాతినిధ్యం లేదని ఆందోళన వ్యక్తం చేశాయి. ఆంధ్రుల చరిత్రములాంటి రచనలు ప్రత్యేక రాష్ట్రం వాదనకి ప్రేరణనిచ్చాయి. 1913 నుండి వార్షిక ఆంధ్రుల సదస్సులు (తరువాత ఆంధ్ర మహాసభలని పిలువబడ్డాయి) నిర్వహింపబడ్డాయి. మాతృభాష బోధనాభాషగా వుండాలని తీర్మానాలు చేయబడ్డాయి. ఉద్యమానికి కృష్ణ, గోదావరి డెల్టా ప్రాంతం నుండి ప్రధానంగా మద్దతు లభించింది. ఈ ప్రాంతంలో మద్రాసు ప్రావిన్సులో మరెక్కడా లేనంతగా పట్టణ సంపన్న వర్గానికి మధ్యతరగతి రైతాంగంలో సన్నిహిత సంబంధాలున్నాయి. కొండా వేంకటప్పయ్య, పట్టాభి సీతారామయ్యలాంటి జాతీయవాద నాయకులు ఆంధ్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. కాంగ్రెస్ సంస్థలో ప్రత్యేక ఆంధ్ర సర్కిల్ డిమాండ్ 1918లో కాంగ్రెస్ ఆమోదించింది.

భాషా ప్రాతిపదికన రాష్ట్రం కావాలన్న డిమాండ్ ఆంధ్ర నుండి మాత్రమే వచ్చింది. కాని ప్రాంతీయ భాషల అభివృద్ధి కారణంగా పలు రకాల విరుద్ధమైన రాజకీయ ధోరణులు ముందుకు వచ్చాయి. మళయాళం సంఘ సంస్కరణకు, దేశభక్తికి శక్తివంతమైన వాహకం అయింది. "ఓ తల్లీ బానిసత్వమే నీ గమ్యమా! నీ బిడ్డలు కులం మత్తులో కూరుకుపోయి కలహించుకుంటున్నారు. చంపుకుంటున్నారు. స్వతంత్రం ఎందుకొరకు?" అని ప్రశ్నించాడు, 1908లో ఎజావా కవి కుమరన్ అసాన్. 1920లలో వలతోల్ కవిత్వం కేరళలో గాంధేయ ఆదర్శాలకు, ప్రచారానికి ప్రధానమైన శక్తి అయింది. తమిళనాడులో బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాలకు తమిళ సంగమాల ఏర్పాటుకు సన్నిహిత సంబంధం వుంది. మధుర, మద్రాసు ఇతర పట్టణాలలో తమిళ సంగమాలు ఏర్పడ్డాయి. ఇవి దక్షిణ భారతదేశంలోని సంస్కృతానికి ముందు గల ఆర్యేతర ద్రావిడ వారసత్వానికి చెందిన ప్రాచీన తమిళ ప్రామాణిక గ్రంథాలపై ఆసక్తిని ప్రేరేపించాయి. రాముడ్ని తగ్గించి రావణుడ్ని పెంచి రామాయణం తిరిగి రాయబడింది. మహారాష్ట్రలో అస్పృశ్యుడైన శంభూకుడైన బాలుడు రామునిచే హత్య చేయబడిన ఉదంతాన్ని పురస్కరించుకొని రాయబడిన శోకగీతాలు సత్యశోధక ప్రచారంలో చేర్చబడ్డాయి. మరాఠా రైతాంగ సంస్కృతి సుగ్రీవుడు, రాముడు కలిసి వాటిని చంపడాన్ని ఖండించింది. 1869లో పూలే శివాజీని శూద్ర రాజుగా ప్రశంసిస్తూ వీరగాథ రాశాడు. అప్పటి నుండి బ్రాహ్మణేతరులు శివాజీ వ్యక్తిత్వాన్ని, నాయకత్వాన్ని తిలక్, రనడేలకు పూర్తిగా భిన్నమైన దృష్టి కోణం నుండి చూపించారు. బ్రాహ్మణుల్ని రక్షించమని రామదాసు చేసిన బోధలతో ప్రేరితుడైన శివాజీ సాంప్రదాయ ముస్లిం వ్యతిరేక నాయకుడు కాదని లేక భక్తి ద్వారా అగ్ర, నిమ్న కులాల ఉదార ఐక్యతావాది కాదని, కుల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన తిరుగుబాటుదారుడని చిత్రించాడు. శివాజీ సాధించిన విజయాలని తరువాతవచ్చిన బ్రాహ్మణ పీష్వాలచే ధ్వంసం చేయబడ్డాయి.

బెంగాల్‌లో 1905లో ప్రాంతీయ భావాలు వేళ్ళూనుకొన్నాయి. సి.ఆర్. దాస్ 1917లో భవానీపూర్‌లో చేసిన ఉపన్యాసంలో "బెంగాలీ హిందువు కావచ్చు, ముస్లిం కావచ్చు, క్రైస్తవుడు కావచ్చు. కానీ అతను ఎప్పుడు బెంగాలీగానే వుంటాడు" అని స్పష్టం చేశాడు. విద్యావంతులైన

బెంగాలీల సాంస్కృతిక ప్రపంచంపై ఠాగూర్ ఆధిపత్యం (ప్రత్యేకించి 1913లో నోబెల్ ప్రైజ్ సాధించిన తరువాత) సాధించాడు. సాహిత్యంలో వ్యవహారిక భాష యొక్క ప్రాధాన్యతని ముందుగా ఠాకూర్ గుర్తించాడు. కాని చొరవ తీసుకోలేదు. ఆ కర్తవ్యాన్ని 1915లో సాబూజ్ పత్ర సాహిత్య గ్రూపు చేపట్టింది. రాజకీయంగా 1908 తరువాత ఠాగూర్ జాతీయవాదం నుండి విడివడ్డాడు. జాతీయవాదాన్ని పరిమితులున్న పునరుద్ధరణ వాదంగా భావించాడు. ఆయన విస్తృతమైన విశ్వమానవతా వాదాన్ని బోధించాడు. కాని ఆయన విమర్శకులు (ఉదాహరణకు సి.ఆర్. దాస్) అది అవాస్తవమైనదని భావించారు.

విద్యావంతులైన బెంగాలీలు వృత్తులలో, ఉద్యోగాలలో ముందంజ వేశారు. ఇది ఇరుగుపొరుగు వారి ఈర్ష్య అసూయలకు కారణమయింది. బీహారులో సచ్చిదానంద సిన్హా నాయకత్వంలో యూనివర్శిటీ, హైకోర్టులో ప్రత్యేకమైన ప్రావిన్సు కొరకు ఉద్యమం చేపట్టబడింది. 1911లో బీహారు ఒరిస్సా ప్రావిన్సు ఏర్పడింది. ఉత్తర భారతదేశంలో ఉర్దూ ప్రధాన సాహిత్య భాషగా వుంది. ఉన్నతమైన ఉర్దూ సాహిత్య సాంప్రదాయ ప్రతినిధిగా మహమ్మద్ ఇక్బాల్ వున్నారు. హిందూ పునరుద్ధరణ వాద శక్తులు ముందుకు వస్తున్నాయి. కాని సాహిత్యపరమైన హిందీపైన సంస్కృత భాష ప్రభావం ఎక్కువ హిందీ ప్రచారం మతపరమైన ఐక్యతకు విఘాతం కలిగించింది. ప్రేమ్‌చంద్ కూడా తన సాహిత్య జీవితాన్ని ఉర్దూలోనే ప్రారంభించాడు. 1915 తరువాత ప్రచురణ కర్తలు దొరకనందున హిందీలోకి మారాడు. ఆయన తొలి రచనలు అప్పటికి స్పష్టమైన రాజకీయ అవగాహన కలవి. సోజివతన్ (1908) కథల సంపుటిలోని పీఠికలో బెంగాల్ విభజన ప్రజల హృదయాలలో తిరుగుబాటు భావాలను మేల్కొలిపింది. వివేకానందుని నమూనాగా తీసుకొని జల్వాయ్–ఇ–ఐజక్ (1912) నవలలో నాయకునికి రూపకల్పన చేశాడు.

భారతీయ సమాజం, రాజకీయాలు పూర్తిగా సంక్లిష్టతల వైరుధ్యాలమయంగా వున్నాయి. 1919 నుండి గాంధీ నాయకత్వంలో జాతీయవాదం తరతమ భేదాలతో కూడిన విజయాలు సాధిస్తూ సంక్లిష్టతలు, వైరుధ్యాలను అధిగమించ యత్నించింది.

# అధ్యాయం-5

# ప్రజా జాతీయవాదం : ఆవిర్భావం, సమస్యలు 1917-1927

## యుద్ధం, సంస్కరణలు, సమీకరణ

### మాంట్‌ఫర్డ్ సంస్కరణలు

**యు**ద్ధం, యుద్ధానంతర సంవత్సరాలలో భారతీయ జీవితంలో నాటకీయమైన మార్పులు జరిగాయి. మూడు ముఖ్యమైన మార్పులు, రాజ్యాంగ సంస్కరణలు (1917 ఆగస్టు 20న భారత రాజ్యకార్యదర్శి మాంటేగ్ ప్రకటన, వెనువెంటనే వెలువడిన మాంటేగ్ చెమ్స్‌ఫర్డ్ రిపోర్టు 1918, భారత ప్రభుత్వ చట్టం 1919) గుణాత్మకమైన నూతన అఖిల భారత జాతీయవాద ప్రజా నాయకుడుగా గాంధీ ఆవిర్భావం, భారతదేశం యొక్క వలసవాద ఆర్థిక విధానంలో ముఖ్యమైన మార్పులు. కాని ఈ నూతనాంశాల యొక్క స్వభావం ప్రాధాన్యతలు – వాటి పరస్పర సంబంధాలపై గణనీయమైన అభిప్రాయభేదాలు వున్నాయి.

మాంట్‌ఫర్డ్ సంస్కరణలు బ్రిటిషు వారి సదుద్దేశాలకు మచ్చుతునక అని ఉదారవాద సామ్రాజ్యవాద పండితులు అమితానందం వ్యక్తం చేశారు. "బ్రిటిషు సామ్రాజ్యంలో అవిచ్ఛిన్న భాగంగా భారతదేశంలో బాధ్యతాయుత ప్రభుత్వ స్థాపన లక్ష్యంగా యిప్పటి నుండి స్వయం పరిపాలనా సంస్థల్ని అభివృద్ధి పరచడం భారతదేశంలో బ్రిటిషు విధానమ'ని మాంటేగ్ ఆగస్టు 20న కామన్స్‌సభలో ప్రకటించాడు. అప్పటి వరకు బ్రిటిషు విధానంగా వున్న 'బాధ్యతాయుత ప్రభుత్వం' (కార్యనిర్వాహక వర్గంపై ఎలాంటి అదుపులేని మెజారిటీ శాసన సభ్యుల ఎన్నికలు) తో పోల్చితే యిది స్పష్టమైన ముందుడుగా కన్పిస్తుంది. ప్రావిన్సుల స్వయం ప్రతిపత్తి, ద్వంద్వ ప్రభుత్వం, శాసనసభాధన శాఖలకు కొన్ని బాధ్యతలు (విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, స్థానిక సంస్థలు) బదిలీ, మిగిలినవి రిజర్వుడు శాఖలు – వగైరా సమస్యల్ని 1919 లో బాధ్యతాయుత ప్రభుత్వాలు నిర్వహించాయి. మోర్లే –మింటో సంస్కరణల విషయంలో లండన్ –ఢిల్లీ అలాగే రాజ్యకార్యదర్శి – వైస్రాయి నిర్వహించవలసిన బాధ్యతలపరంగా కొంత వైరుధ్యం వుంది.

కాని మాంటేగ్ ప్రచార సాధనాలతో మంచి సంబంధాలు పెట్టుకొనడంతో తానే గొప్ప సంస్కర్తగా ప్రచారం పొందాడు.

సంస్కరణల క్రమాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే యిదేమీ కొత్తది కాదు. స్థానిక ఖర్చులు స్థానికంగా వసూలు చేసిన పన్నులతో చేపట్టే పద్ధతిని మేయో, రిప్పన్‌లు ప్రతిపాదించారు. ఈ సమస్యలపై 1907లో వికేంద్రీకరణ కమిషన్ నియమింపబడింది. ప్రావిన్సుల స్వయం పరిపాలన స్వయం ప్రతిపత్తి రాజకీయ రాయితీలుగా వుండాలని 1925 ఆగస్టు 25న హార్డింగు కమిటీ సిఫార్సు చేసింది. కాని అప్పటి రాజ్య కార్యదర్శి క్రేవే భారత స్వయం పరిపాలన ఆలోచనని పూర్తిగా త్రోసి పుచ్చాడు. యుద్ధ ఒత్తిడులు పునరాలోచన అవకాశం కల్పించాయి. చెమ్స్‌ఫర్డ్ పరిపాలన భారత ప్రజాభిప్రాయానికి చాలా రాయితీలను ప్రకటించింది. ఈ రాయితీలు పాలనాయంత్రానికి కందెనగా పనిచేశాయని తరువాత మాంటేగ్ వర్ణించాడు. యుద్ధ కాల ఆర్థిక పరిస్థితి రీత్యా నూలు వస్త్రాలపై దిగుమతి పన్నులు పెంచవలసి వచ్చింది. సమతుల్యత కాపాడేందుకు భారతీయ వస్త్రాలపై పన్నులు విధించకుండానే 1917 మార్చిలో దిగుమతి పన్ను 3 1/2 నుండి 7 1/2 శాతానికి పెంచబడింది. కూలీలను కాంట్రాక్టు పద్ధతిపై ఎగుమతి చేయడాన్ని భారతీయులు నిరసించారు. విదేశాలలోని యుద్ధాలకు భారతీయ సైనికుల నియామకంపై నిషేధాన్ని కోరారు. చెమ్స్‌ఫర్డ్ 1917లో డిమాండుని అంగీకరించారు. సంస్కరణల లక్ష్యాన్ని ప్రకటించవలసిందిగా వైస్రాయి రాజ్యకార్యదర్శి (ఆస్టిక్ చాంబర్లేన్) ని అర్థించాడు. 1917 మార్చిలో జారిస్టు నిరంకుశ ప్రభుత్వం కూల్చివేత ప్రభావం భారతదేశంపై పడుతుందని సంశయాన్ని వ్యక్తం చేశారు. 1917 జూలైలో చాంబర్లేన్ స్థానంలో మాంటేగ్ రాజ్యకార్యదర్శిగా నియమింపబడ్డాడు. అంతకుముందే చేపట్టబడిన సంస్కరణల క్రమం వేగవంతం చేయబడింది.

1916 నవంబరు 24 భారత ప్రభుత్వ ప్రకటన ప్రావిన్సులలో ఎలాంటి కార్యనిర్వాహక బాధ్యతలు లేని మెజారిటీ సభ్యుల ఎన్నికకు అవకాశం కల్పించింది.

కాని మోర్లేమింటో సంస్కరణల్ని అలా విస్తరించడం వలన చట్ట సభలలో బలమైన ప్రతిపక్షం సృష్టించబడుతుందని భావించబడింది. ఇక్కడ చాలా పలుకుబడిగల లండన్ జర్నల్ రౌండు టేబులు గ్రూపు (లియోనల్ కర్టిస్, ఫిలిప్ కెర్, విలియం డ్యూక్ యితరులు) చాలా ముఖ్యమైన పాత్ర పోషించింది. ఒక మేరకైనా కార్యనిర్వాహక బాధ్యతలు లేని అనధికార సభ్యులు మెజారిటీగా ఎన్నికయ్యే అవకాశం కల్పించడం ప్రమాదకరమని భావించి ప్రావిన్సులలో ద్వంద్వ పరిపాలన ఆలోచనని ముందుకు తెచ్చింది.

భారత ప్రభుత్వ చట్టం 1919 కేంద్రంలో రెండు సభల విధానాన్ని ప్రవేశపెట్టింది. ఎన్నికైన సభ్యులు మెజారిటీగా గల కౌన్సిల్ ఆఫ్ స్టేట్, లెజిస్లేటివ్ అసెంబ్లీ కాని మంత్రుల పైన వైస్రాయి వీటోపైన, తిరస్కరింపబడిన బిల్లుల్ని పాస్ చేయించుకొనే సర్టిఫికెట్ విధానంపైన ఎలాంటి నియంత్రణ లేదు. ఓటర్ల సంఖ్యని ప్రావిన్సులలో 5 1/2 మిలియన్లకు కేంద్ర అసెంబ్లీకి 1 1/2 మిలియన్లకు పెంచింది.

తక్కువ రాజకీయ ప్రాధాన్యత గల తక్కువ నిధులు కేటాయించబడే శాఖలు ప్రావిన్సుల చట్ట సభలకు బాధ్యత వహించే మంత్రులకు బదిలి చేయబడ్డాయి. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం స్థానిక సంస్థల శాఖల యొక్క నిజమైన అభివృద్ధికి ఎక్కువ నిధులు అవసరమవుతాయి. కాని ఆశాఖలకు అరకొర నిధులు కేటాయించి భారత రాజకీయ నాయకుల్ని అపఖ్యాతి పాలు చేయడం కూడా విధానంలో భాగమే. శాంతి భద్రతలు ఆర్థికం లాంటి కీలకమైన శాఖలు అధికారుల నియంత్రణలో వుంటాయి. రాష్ట్ర గవర్నర్లకు కూడా వీటో సర్టిఫికెట్ అధికారాలు కల్పించబడ్డాయి. ఆదాయ వనరులు కూడా కేంద్రం, ప్రావిన్సుల మధ్య విభజింపబడ్డాయి. ఉదాహరణకు భూమి శిస్తు ప్రావిన్సులకు, ఆదాయపు పన్ను కేంద్రానికి మోంటెగు చెమ్స్‌ఫర్డ్ రిపోర్టు ప్రత్యేక నియోజక వర్గాలపై విమర్శలు చేసినప్పటికి మతపరమైన ప్రాతినిధ్యం రిజర్వేషన్లు అలాగే వుంచబడడమే గాక విస్తరించబడ్డాయి. మద్రాసులో బ్రాహ్మణేతరులకు రిజర్వేషన్లు కల్పించాలని చేసిన జస్టిస్ పార్టీ డిమాండుని బ్రిటిషువారు ఆమోదించారు.

ఆర్థిక వికేంద్రీకరణ, సహకరించే భారతీయ మిత్రుల్ని విస్తృతంగా పెంచుకొనడం –అనే రెండు సామ్రాజ్యవాద అవసరాల్ని దృష్టిలో పెట్టుకొని 1919 సంస్కరణలు చేపట్టబడ్డాయని యిటీవలి కేంబ్రిడ్జి చరిత్రకారుల అధ్యయనం స్పష్టం చేసింది. కాని అంతకంటె వివాదాస్పదమైన అంశం సంస్కరణలకు ప్రజా రాజకీయాల ఆవిర్భావానికి గల కార్యకారణ సంబంధాన్ని నిరూపించే ప్రయత్నం. 1919 చట్టం నియోజక వర్గాలను విస్తృత పరిచింది గనుక రాజకీయ నాయకులు ప్రజాస్వామ్య పద్ధతిని అలవరచుకొనేలా ఒత్తిడి చేసిందనే వాదన వుందని కేంబ్రిడ్జి చరిత్రకారులు చెపుతున్నారు. కేంబ్రిడ్జి చరిత్రకారుల వాదన తప్పుకాదు. కాని అసమగ్రంగా వుంది. అది కొన్ని తరహాల రాజకీయాల్ని రాజకీయవేత్తల్ని నివారించవచ్చు. కాని యుద్ధానంతర ప్రజా చైతన్యాన్ని నివారించలేదు. మద్రాసులో జస్టిస్‌పార్టీ లేక మహారాష్ట్రలోని బ్రాహ్మణేతర (కొద్దికాలం తరువాత) అణగారిన వర్గాల ఉద్యమాలు నిస్సందేహంగా ప్రత్యేక రిజర్వేషన్ల అవకాశం వలన ప్రేరణ పొందాయి. జాతీయవాదులలో కూడా మాలవ్య శిష్యుడు ఇంద్రనారాయణ ద్వివేది అల్హాబాద్ హోంరూలు నిధులతో 1918 ఫిబ్రవరిలో ఎన్నికల ప్రయోజనం కొరకు యు.పి. కిసాన్ సభ ప్రారంభించారు. జవహర్‌లాల్ నెహ్రూ రైతులతో సంబంధాలు పెంచుకోవడం వలన ఎన్నికల అవకాశాలు మెరుగుపడతాయని ఆశించి 1920 జూన్‌లో ఆయన తండ్రి ప్రోత్సహించాడు. కాని అందుకు ప్రతికూలమైన ఉదాహరణ కూడా యు.పి నుండి లభిస్తుంది. 1920లో బాబా రామచంద్ర ఆధ్వర్యంలో ప్రతాప్ ఘర్ రాయ్‌బెరేలిలలో స్వతంత్ర ప్రతిపత్తి గల క్రింది స్థాయిలో మూలాలు గల కిసాన్‌సభ ఆవిర్భవించి కొన్ని సంవత్సరాల పాటు గాంధేయ నాయకత్వంలోని భారత రాజకీయ నాయకులలో గణనీయమైన భాగం ఎన్నికలని బహిష్కరించింది. 1919 –22 నాటి సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజా ఉద్యమాన్ని ఓటింగు హక్కుల విస్తరణతో అదీ వయోజనులలో 1నుండి 3 శాతానికి గల ఓటింగు హక్కుతో వివరించడం సాధ్యపడదు.

## యుద్ధం ప్రభావం

ఇంతకుముందు అధ్యాయంలో చర్చించిన భారతీయ బ్రిటిషు ప్రయోజనాల మధ్య గల వైరుధ్యాలు – సంపద తరలింపు, చేతివృత్తుల క్షీణత, ఆర్థిక ఒత్తిళ్లు, దేశీయ పెట్టుబడిదారీ అభివృద్ధికి ఆటంకాలు లాంటివి. మొదటి ప్రపంచ యుద్ధకాలం నాటి ఆర్థిక సామాజిక పరిణామాల రీత్యా తీవ్రతరమయ్యాయి. యుద్ధకాలంలో సైన్యంలో విస్తృత స్థాయిలో భారతీయ నియామకాలు, పన్నులభారం, యుద్ధ రుణాలు, ధరలలో విపరీతమైన పెరుగుదల – రైతులు వ్యాపారులలోని గణనీయమైన సెక్షన్లు ఆ తరువాత కాలంలో గాంధేయ నాయకత్వంలోని జాతీయోద్యమం వైపు ఆకర్షితులవడానికి కారణాలయ్యాయి. అలాగే యుద్ధానంతర సంవత్సరాలలో పారిశ్రామిక కార్మికులు జాతీయ రంగంలోకి ప్రవేశించారు. యుద్ధం భారత ప్రజలలోని వివిధ సెక్షన్లను పలు విధాలుగా కొన్ని సందర్భాలలో పరస్పర విరుద్ధమైన విధాలుగా ప్రభావితం చేసింది. అదే సమయంలో భారతీయ సమాజంలోని ఉద్రిక్తతల్ని తీవ్రతరం చేసింది.

యుద్ధ సంవత్సరాలలో 'సంపద తరలింపు' భారతీయ మానవ వనరుల్ని భౌతిక వనరుల్ని దోచుకునే స్వభావాన్ని సంతరించుకొన్నది. భారతీయ సైన్యం 1.2 మిలియన్లకి పెంచబడింది. వేలాదిమంది భారతీయులు ఎక్కడికి ఎందుకు పంపించబడుతున్నారో తెలియకుండానే చంపబడ్డారు. సైనికుల నియామకాలు స్వచ్ఛందమని చెప్పబడినప్పటికి, నిర్బంధ నియామకాలు జరిగాయి. ప్రత్యేకించి పంజాబులో లెఫ్టినెంట్ గవర్నరు ఒ డయ్యర్ ఆధ్వర్యంలో జరిగాయి. 1919 అలజడుల తర్వాత కాంగ్రెస్ జరిపిన సర్వేలో లంబార్దార్ల (గ్రామ పెద్దల) ఒత్తిడితో నియామకాలు జరిగినట్లు స్పష్టమయింది. ఒక్క పంజాబు నుండి 355000 మంది సైనికులుగా నియమింపబడ్డారు. రౌలత్ చట్టం అలజడుల కాలంలో సమరశీలంగా వున్న గుర్జన్ వాలాలవల్ల 150 : గా వున్న ప్రజల సైనికుల నిష్పత్తి ఒక సంవత్సరంలో 44 :1కి పెంచబడిందని 1918 ఆగష్టులో ఒ డయ్యర్ ఘనంగా ప్రకటించుకొన్నాడు. సైనిక అవసరాలకు ఆహారధాన్యాలు ముడి వనరులు తరలించబడ్డాయి.

రక్షణ వ్యయంలో 300% పెరుగుదల అంటే కేవలం యుద్ధ రుణాలు మాత్రమే కాదు. పన్నులలో విపరీతమైన పెరుగుదల, మొత్తం ఆర్థిక చట్రంలో పెద్దమార్పులు. భూమిశిస్తు అప్పటికే భారంగా వుంది. సైనికుల్ని అత్యధికంగా సరఫరా చేసే రైతువర్గాన్ని బ్రిటిషువారు దూరం చేసుకోదలచుకోలేదు. అందువలన మొట్టమొదటిసారిగా వర్తకం పరిశ్రమలపై వేటు వేసింది. 1913 –14, 1920 –21 మధ్య కాలంలో భారత ప్రభుత్వం యొక్క మొత్తం ఆదాయంలో వాణిజ్య సుంకాల వాటా 8.9% నుండి 14.8% కి పెంచబడింది. 1917 లో నూలు వస్త్రాలపై 7 1/2 కి దిగుమతి సుంకాల్ని పెంచడంపై లాంక్‌షైర్ వ్యక్తం చేసిన నిరసనలు విస్మరించబడ్డాయి. అంతకంటె ప్రాధాన్యత గల అంశం మొత్తం ప్రభుత్వ ఆదాయంలో 1911 –12లో 2% గా వున్న ఆదాయపు పన్ను 1919 –20లో 11.75% కి పెంచటం. 1917 –18లో మొదటిసారిగా వ్యక్తిగత ఆదాయ వివరాలు తెలియజేయాలని ప్రభుత్వం కోరింది. ఈ విధంగా భారతదేశ వ్యాపారులు పెద్ద సంఖ్యలో ఆదాయపు పన్ను పరిధిలోకి

లాగబడ్డారు. అదే సంవత్సరం పెద్ద కంపెనీల మీద అవిభక్త హిందూ వ్యాపార కుటుంబాల మీద సూపర్‌టాక్స్ విధించబడింది. 1919 తాత్కాలిక అధిక లాభాలపై పన్ను విధించబడింది.

యుద్ధ వ్యయం, రవాణా ఆటంకాలు (మిలటరీ యేతర అవసరాలకు లభ్యమయ్యే నౌకల తగ్గుదల కారణంగా దిగుమతుల పతనం) పెద్ద ఎత్తున ధరల పెరుగుదలకి దారితీసింది. అఖిల భారత స్థాయిలో ధరలపై ప్రభుత్వ గణాంక వివరాలు యిలా ఉన్నాయి (1873 =100)

| 1913 | 1914 | 1915 | 1916 | 1917 | 1918 | 1919 | 1920 | 1921 | 1922 | 1923 |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 143 | 147 | 152 | 184 | 196 | 225 | 276 | 281 | 136 | 232 | 215 |

(జూత్ బ్రౌక్, గాంధీస్ రైజ్‌టు పవర్ 1915–1922 పేజి 125)

పెరుగుదల కంటె పెరుగుదల స్వభావం ప్రాధాన్యత గల అంశం. పారిశ్రామిక వస్తువుల ధరలు యుద్ధం డిమాండుతో (కృత్రిమంగా) పెంచబడ్డాయి. దిగుమతి అయిన పారిశ్రామిక వస్తువుల ధరలు కూడా నౌకల కొరత కారణంగాను, యూరపు పరిశ్రమల్ని మిలిటరీ అవసరాలకు మరల్చడం వలననూ విపరీతంగా పెరిగాయి. ప్రపంచ ఆర్థిక సంబంధాలలో అస్తవ్యస్తత కారణంగా భారత వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి ధరలు (ప్రత్యేకించి జనపనార ధరలు) అదే నిష్పత్తిలో పెరగలేదు. ఉదాహరణకు చంపారన్‌లో రైతు బట్టలకు ఉప్పుకి కిరోసిన్‌కి చాలా ఎక్కువ చెల్లించవలసి వచ్చింది. తన జిల్లా వ్యవసాయ ఉత్పత్తులైన నీలిమందు బియ్యం లాంటి వాటికి ఆ విధంగా పెరగలేదు. పరిశ్రమలకు పెరిగిన ఈ ప్రాధాన్యత మార్కెటు కొరకు ఉత్పత్తి చేసే సంపన్న రైతులపై ప్రతికూల ప్రభావం చూపింది. ధరలు ఎక్కువగా వుండే వరి, గోధుమ లాంటి ధాన్యాలకంటె పేద రైతులు వ్యవసాయ కార్మికులు తినే జొన్న సజ్జలాంటి ముతక ఆహారధాన్యాల ధరలు మరీ పెరిగాయి. ఇది పేదల్ని మరీ క్రుంగదీసింది. ఇది ఎక్కువ ధరలు గల పంటల్ని ఎక్కువ ఎకరాలలో పండించే వ్యాపారీకరణ ధోరణిని పెంచింది. ఉదాహరణకు గాంధేయ స్థావరంగా వున్న అహమ్మదాబాద్‌లో 1873=100 గా తీసుకొంటే గోధుమ ధర 1914లో 166 1918 లో 259, సజ్జల విలువ 220, 410 యు.పి.లోని ధరలలో కూడా యిలాంటి ధోరణే కన్పిస్తుంది. ఆ విధంగా 1861 –65 మరియు 1917–21 మధ్య కాలంలో గోధుమ ధర 250% పెరగగా బార్లీ 300% ఎర్‌హర్ 400% పెరిగాయి.

యుద్ధం అంటే అత్యధిక భారతీయులకు బాధలు జీవన ప్రమాణాల తగ్గుదల అయింది. (ఉదాహరణకు బట్టల వినియోగం 1913 –14 లో 5102 మిలియన్ల గజాలు కాగా 1919 - 20 నాటికి 2899 మిలియన్ల గజాలకు తగ్గింది) యుద్ధ డిమాండు (ఉదాహరణకు సైనికుల యూనిఫారం) ని అవకాశంగా తీసుకొన్న వ్యాపార గ్రూపులకు విదేశీ పోటీ తగ్గుదల, వ్యవసాయ ముడి వనరులు ప్రత్తి, జనపనారకి పారిశ్రామిక ఉత్పత్తుల మధ్య ధరల వ్యత్యాసం నిజవేతనాల ప్రతిష్టంభన లేక తగ్గుదల – కారణంగా విపరీతమైన లాభాలు వచ్చిపడ్డాయి. ఆ విధంగా వచ్చిన లాభాలు అధిక డివిడెండ్ల రూపంలోచెల్లాచెదురయ్యాయి.

అయినప్పటికి గణనీయమైన పారిశ్రామిక విస్తరణకి కూడా తోడ్పడ్డాయి. తూర్పు భారతదేశంలో లాభాలు ప్రధానంగా బ్రిటిషు జూటుమిల్లు వ్యాపార వేత్తలకు దక్కాయి. యుద్ధ అవసరాలు జూటు పారిశ్రామిక వస్తువుల ధరల్ని (ఉదాహరణకు శాండ్ బ్యాగ్స్, కాన్వాసు) విపరీతంగా పెంచాయి. అభివృద్ధి చెందుతున్న మార్వాడీ వడ్డీ వ్యాపారులు జనపనార వర్తకంలో స్పెక్యులేషన్ ద్వారా గణనీయమైన సంపద పోగు చేసుకొన్నారు. జి.డి. బిర్లా, స్వరూపచంద్ హుకుంచంద్ కలకత్తా పరిసరాలలో భారతీయ యాజమాన్యంలో జూటు మిల్లులు ప్రారంభించారు. కాని అంతకంటె నిర్ణయాత్మకమైన మార్పు బొంబాయి అహమ్మదాబాద్, జౌళి పరిశ్రమలలో వచ్చింది. లాంక్‌షైర్ పోటీ తగ్గడంతో భారతీయ పెట్టుబడి దావాలు ఈ రంగంలో ముందుకు పోగలిగారు.

ప్రభుత్వ ఆర్థిక అవసరాల రీత్యా (1917 నాటి 7 1/2% దిగుమతి సుంకం, భారత వస్త్ర పరిశ్రమపై 3 1/2% సుంకం) యుద్ధం పరిశ్రమలకు ఆర్థికపరమైన రక్షణ కల్పించింది. విదేశీ నూలు, బట్టల దిగుమతులు బాగా పడిపోయాయి. భారత జౌళి మిల్లుల ఉత్పత్తి పెరిగింది. చేనేత క్షీణించింది. (అధికంగా వున్న దిగుమతి దారం విలువ మరియు భారతీయ ఫ్యాక్టరీల పోటీ కారణంగా) ఆ తరువాత జపాన్ బట్టలు భారతీయ మార్కెట్లను ముంచెత్తడం ప్రారంభమయింది. అమియా బాగ్చి యిచ్చిన ఈ గణాంక వివరాలను పరిశీలించండి (భారతదేశంలో ప్రైవేటు పెట్టుబడులు పేజీలు 226-7,238)

**(అన్ని అంకెలు మిలియన్లలో)**

| | **యు.కె నుండి కాటన్ ఉత్పత్తుల దిగుమతి** | **జపాన్ నుండి కాటన్ ఉత్పత్తుల దిగుమతి** | **భారత చేనేత ఉత్పత్తులు** | **భారత మిల్లుల బట్ట ఉత్పత్తి** |
|---|---|---|---|---|
| 1913-14 | 3104 | 9 | 1018.8 | 1171.1 |
| 1914-15 | 2378 | 16 | 1136.0 | 1175.9 |
| 1915-16 | 2049 | 39 | 943.2 | 1496.1 |
| 1916-17 | 1786 | 100 | 645.6 | 1606.1 |
| 1917-18 | 1430 | 95 | 741.2 | 1615.6 |
| 1918-19 | 867 | 238 | 890.0 | 1481.8 |
| 1919-20 | 976 | 76 | 506.0 | 1630.0 |
| 1920-21 | 1292 | 170 | 931.2 | 1563.1 |
| 1921-22 | 955 | 90 | 938.0 | 1716.0 |
| 1922-23 | 1453 | 108 | 1084.0 | 1720.8 |

యుద్ధ సంవత్సరాలలో ఆర్థిక డిమాండ్లరీత్యాను కనీస స్వావలంబనని వ్యూహరీత్యా అవసరంగా గుర్తించడం వలననూ భారత పారిశ్రామికాభివృద్ధి కొరకు బ్రిటిషిండియా ప్రభుత్వ విధానంలో కొన్ని మార్పులు చేయబడ్డాయి. 1916లో థామస్‌హోలెండ్ ఆధ్వర్యంలో భారత పారిశ్రామిక కమిషన్ నియమించబడింది. మాంట్‌ఫర్డ్ రిపోర్టుతోపాటు ఆర్థిక స్వయంప్రతిపత్తి సదస్సు నిర్వహించబడింది. భారతదేశ ప్రభుత్వం నూతన చట్టసభ ఆమోదించిన భారతదేశ ఆర్థిక నిర్ణయాలను లండన్ తిరస్కరించకూడదని జాయింటు పార్లమెంటరీ కమిటీ సిఫార్సు చేసింది. ఇది విధానాల మార్పుకి ప్రాతినిధ్యం వహిస్తాయి. ఆల్ఫ్రెడ్ భాయిర్టక్ (మద్రాసు పారిశ్రామికవేత్త ప్రభుత్వ ప్రోత్సాహంతో అల్యూమినియం మరియు పరిశ్రమల్ని స్థాపించ యత్నించాడు)

ప్రయత్నాల్ని మోర్లే 1910లో స్వేచ్ఛావాణిజ్య సూత్రాన్ని వల్లించి అడ్డుకొన్నారు. కాబట్టి విధానాల మార్పుని అతిశయించి చెప్పడం చారిత్రక విరుద్ధమవుతుంది. ఆ తరువాత ఛాటర్టన్ మైసూరు సంస్థానంలో పారిశ్రామిక శాఖ అధిపతిగా పూర్తిగా ఆధారపడే చట్రాన్ని మౌలికంగా ప్రభావితం చేయని విధంగా కొన్ని చిన్న పరిశ్రమల్ని అభివృద్ధి పరచాలని కోరాడు దీనికి పూర్తి విరుద్ధంగా మైసూరు సంస్థానం దివాన్ విశ్వేశ్వరయ్య (1911 –18) తన కృష్ణసాగర్ డాం, భద్రావతి ఐరన్ వర్క్స్ ప్రాజెక్టుల ద్వారా సమూలమైన మార్పుల కొరకు ప్రయత్నించాడు. 1918లో బ్రిటిషు వారి ఒత్తిడి కారణంగా విశ్వేశ్వరయ్య రాజీనామా చేశాడు. అతిగా ప్రచారం చేయబడిన స్వయంప్రతిపత్తి విషయానికివస్తే వైస్రాయి, చట్టసభల మధ్య ఏకాభిప్రాయం వుండాలన్న షరతు వైస్రాయి బ్రిటిషు అధికారి గనుక దాని విలువను హరించింది.

భారతదేశ పెట్టుబడిదారి విధానం దేశవ్యాప్త సంబంధాల అభివృద్ధి ప్రత్యేకించి మార్వాడీలతో బలం పుంజుకుంటున్న తరుణంలో యుద్ధ పన్నుకి సంబంధించిన సమస్యలు, రూపాయి –స్టెర్లింగు మారకపు విలువ నిష్పత్తిలో ఎగుడు దిగుళ్లు వచ్చిపడ్డాయి. బొంబాయి జాతీయవాద లాయరు భూలాభాయ్‌దేశాయ్ సాంప్రదాయ పద్ధతులలో వ్యాపారం చేసే చిన్న వర్తకులు నిర్బంధంగా ఆదాయపు పన్ను పత్రాలు సమర్పించాలన్న నిబంధనకు వ్యతిరేకంగా 1918 లో ఒక విజ్ఞాపన పత్రం సమర్పించాడు. మారకపు విలువ ఎగుడు దిగుళ్లకు గురయింది. 1919 డిసెంబరులో 2షి 4పెన్నీలుగా వున్న రూపాయి మారకపు విలువ 1926 నాటి హిల్టర్ యంగ్ కమిషన్ 1షి 6 పెన్నీలుగా స్థిరీకరించడానికి ముందు 1షిల్లింగుకు పడిపోయింది. హోంచార్జీలపైన ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించుకొనేందుకు, పెన్షన్లను లాభాల్ని స్వదేశానికి పంపించుకోవడం పట్ల ఆసక్తి గల బ్రిటిషు వారి ప్రయోజనాలకు, ధరల్ని తగ్గించడం ద్వారా లాంక్‌షైర్ వస్తువుల దిగుమతిని ప్రోత్సహించేందుకు అనుకూలంగా వుంటుంది గనుక మారకపు నిష్పత్తిని ఎక్కువగా వుంచేందుకు బ్రిటిషువారు పలుమార్లు ప్రయత్నించారు. దానికి విరుద్ధంగా భారతదేశ వ్యాపార గ్రూపులు దిగుమతుల్ని ప్రియం చేసేందుకు, భారతదేశ వస్త్రపరిశ్రమ ఉత్పత్తుల, వ్యవసాయ ముడి వనరుల ఎగుమతుల్ని పెంచేందుకు 1920, 1930 దశాబ్దాలలో రూపాయి మారకపు విలువ 1షి 4 పెన్నీలుగా వుండాలని డిమాండు చేశారు. 1919 –21

కాలంలో మారకపు నిష్పత్తిలో అస్థిరత బ్రిటిషు ఎగుమతి సంస్థలలో కాంట్రాక్టుల్ని నిలబెట్టుకొనడం కష్టతరం చేస్తుంది గనుక మారకపు నిష్పత్తిలోని ఎగుడు దిగుళ్లని నిరసించారు. ఈ అంశంపై 1920 డిసెంబరు కాంగ్రెస్ సదస్సు ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించింది.

వ్యాపార వర్గాలలో వారి ప్రయోజనాల కనుగుణంగా జాతీయవాదంలో జోక్యం చేసుకొన్నారు. మనం ముందు గమనించబోయే విధంగా గాంధేయ ఉద్యమాలలో వారి జోక్యం మొదట నుండి ఒక ముఖ్యమైన అంశంగా వుంటూ వచ్చింది. సబర్మతి ఆశ్రమం, అహమ్మదాబాద్ మిల్లు యాజమాని అంబాలాల్ సారాభాయ్‌నుండి గణనీయమైన ఆర్థిక మద్దతు పొందింది. 1919 మార్చి గాంధేయ సత్యాగ్రహ యాత్రకి మద్దతు తెలుపుతూ బొంబాయిలో సంతకాలు చేసిన 680 మందిలో 74% మంది వ్యాపారులు 1921 తిలక్ స్వరాజ్యనిధి వసూలు చేసిన కోటిరూపాయల నిధిలో 37 1/2 లక్షలకు పైగా బొంబాయి నుండి వసూలయింది. విదేశీ వస్తువుల కొరకు ఆర్డర్లు పంపకూడదని వ్యాపారులు సమిష్టిగా ప్రమాణం చేయడం, బహిష్కరణ ఉద్యమంలో (స్వదేశీ బెంగాలీకి పూర్తి భిన్నంగా) ప్రధానమైన అంశమయింది. అయినప్పటికి వ్యాపారుల మద్ధతులో తరతమ భేదాలు వున్నాయి. చిన్న మధ్యతరగతి వ్యాపారులు పెద్ద వ్యాపారుల కంటె (1919 –22 లో అలాగే శాసనోల్లంఘన కాలంలో కూడా) జాతీయవాదానికి అనుకూలంగా వున్నారు. 1918 –1933 మధ్యకాలం నాటి బొంబాయి వ్యాపారంపై ఎ.డి.గోవర్థన్ జరిపిన సూక్ష్మ అధ్యయనంలో యుద్ధానంతర సంవత్సరాలలో మిల్లు యజమానులు, ప్రత్తి ఎగుమతి దారులు ప్రభుత్వ సంబంధాలను ఉపయోగించుకొన్న సంక్లిష్టమైన విధానాన్ని స్పష్టం చేస్తున్నది. ప్రముఖ వ్యాపారవేత్త ప్రత్తి ఎగుమతిదారుడు అయిన పురుషోత్తం దాస్ ఠాకూర్‌దాస్ సహాయ నిరాకరణ వ్యతిరేక ఉద్యమాన్ని నిర్మిస్తున్నప్పుడు బొంబాయి నగరానికి ప్రత్తిని తీసుకొని వచ్చే సాంప్రదాయ వ్యాపారులు జాతీయవాదానికి మద్దతుగా తమ నిరసన తెలియజేశారు.

కార్మిక అశాంతికి వ్యతిరేకంగా ప్రభుత్వం మద్దతు అవసరం గనుక పెద్ద పారిశ్రామిక వేత్తలలో అత్యధికులు ప్రభుత్వానికి విధేయులుగా వున్నారు. కార్మికవర్గం సంఖ్య రీత్యా గణనీయంగా పెరిగింది. యాజమానులు విపరీతమైన లాభాలార్జిస్తున్నప్పటికీ ధరలు పెరిగినా కార్మికుల వేతనాలు మాత్రం చాలా తక్కువగా వున్నాయి. యుద్ధానంతర సంవత్సరాలలో కార్మికుల కొరత (త్వరితంగా పరిశ్రమల విస్తరణ, 1919 అంటు వ్యాధులు ప్రబలడంతో పట్టణాలకు వలస తగ్గుదల కారణంగా) కొద్దికాలం పాటు వారి బేరమాడేశక్తిని పెంచింది. ఫలితంగా 1920లో చెమ్స్‌ఫర్డ్‌లు పేర్కొన్నట్లుగా కార్మికులకు 'సమ్మె జ్వరం అనే అంటువ్యాధి' సోకింది. పెద్ద సమ్మె 1919 లో జరిగింది. దానిని గురించి తరువాత చర్చిద్దాం. దానికి ముందుగా 1918 మార్చిలో గాంధీ నాయకత్వంలో అహమ్మదాబాద్ సమ్మె 1919 జనవరిలో బొంబాయిలో జౌళి కార్మికుల సమ్మె జరిగాయి. రవీందర్ కుమార్ బొంబాయిలో సమ్మెపై జరిపిన వివరణాత్మక అధ్యయనం సమ్మె యొక్క ఆకస్మిక స్వభావాన్ని నొక్కి చెప్పింది. 1908లో కార్మికుల్ని సంఘటిత పరచడానికి కొంత ప్రయత్నం జరిగింది. వేతనాలు 25% పెంచాలని,

ఒక నెల జీతం బోనస్‌గా యివ్వాలని డిమాండు చేస్తూ సి.యన్. వాడియా సెంచరీ మిల్లు కార్మికులు డిసెంబరు 31 నుండి సమ్మె చేశారు. 1914-18 కాలంలో ఆహారధాన్యాల ధరలు 80-100% పెరగగా కార్మికుల వేతనాలు కేవలం 15% మాత్రమే పెంచబడ్డాయి. మరొకవైపు 1918 వాడియా వ్యాపార సంస్థ కేవలం 20.5 లక్షల రూపాయల పెట్టుబడితో 22.5 లక్షల లాభాలార్జించింది. సెంచరీ మిల్లు కార్మికులు పరేల్ పారిశ్రామిక ప్రాంతంలోని కార్మికుల్ని కూడా తమతో కావలసిందిగా అర్థించారు. ఫలితంగా మొత్తం 1,00,000 మంది జౌళి కార్మికులు వీధినపడ్డారు. 83 మిల్లులు మూతబడ్డాయి. సమ్మె వ్యాపార సంస్థల గుమాస్తాలకు రాయల్ ఇండియన్ మెరైన్ నౌకా కార్మికులకు, పరేల్ రైల్వే ఇంజనీరింగు కార్మికులకు విస్తరించింది. తమకు నాయకత్వం వహించవలసిందిగా కార్మికులు కొందరు లాయర్లను హోంరూలు లీగు నాయకుల్ని (హెచ్.బి.మాండావాలే, కాంజి ద్వారకాదస్, ఉమర్ శాకభాని) కోరారు. వారు కార్మికుల సభలకు వచ్చి ప్రసంగించారు. 1909 నుండి బ్రాహ్మణేతర కార్మికుల్ని కూడగట్టడానికి ప్రయత్నాలు చేస్తూ వున్న యస్.కె. బోలే యొక్క కామ్‌గార్ హితవర్ధక సభ నాయకులు ప్రసంగించారు. అలాంటి కానున్న నాయకులు జరిపిన మధ్యవర్తిత్వాన్ని కార్మికులు తిరస్కరించారు. చివరికి పోలీసు కమిషనర్ సి.ఎ. విన్సెంట్ యాజమాన్యంతో చర్చలు జరిపి 20% వేతనం పెంపుదల, ప్రత్యేక బోనస్ యిప్పించడంతో సమ్మె జనవరి 21న విరమించబడింది.

యుద్ధం యుద్ధానంతర సంవత్సరాలలో నిజమైన కార్మికోద్యమం ప్రారంభమయింది. క్రమబద్ధమైన సభ్యత్వ జాబితాలు విరాళాలతో బిసెంటు సహచరుడు బి.పి.వాడియా ఆధ్వర్యంలో అనిబిసెంట్ న్యూఇండియాకి చెందిన యిద్దరు యువకుల (జి. రామాంజనేయులు నాయుడు, జి. చెల్వపతి చెట్టి)చే 1918 ఏప్రిల్‌లో ప్రారంభించబడింది. దీనిలో బ్రాహ్మణేతర జాతీయవాద నాయకుడు, మద్రాసు నగర కాంగ్రెస్ నాయకుడు, తమిళ సాహితీవేత్త అయిన టి.వి. కళ్యాణ సుందర్ మొదలయార్ (తిరువికాగా ప్రసిద్ధుడు) ప్రముఖ పాత్ర నిర్వహించాడు. బాప్టిస్టా లాంటి హోంలీగు నాయకులు, బి.జి. హార్నిమన్ యొక్క బాంబె క్రానికల్ కూడా బొంబాయిలో కార్మిక సంఘాల ప్రారంభానికి తోడ్పడ్డారు. 1920లో కార్మిక సంఘాలు ప్రవాహంగా వచ్చిపడ్డాయి. 1920 నవంబరులో అఖిల భారత కార్మిక సంఘ (ఎ.ఐ.టి.యు.సి) సదస్సు నిర్వహించే నాటికి 125 కార్మిక సంఘాలు నమోదు చేసుకొన్నాయి. 1919 జనవరి నాటికి బొంబాయిలో లాగానే సమరశీలత కొరకు ఒత్తిళ్ళు క్రింద నుండి వచ్చాయి. ఇది అంతకు ముందు సంఘాల్ని అదుపు చేసే వైఖరికి భిన్నమైనది. తొలినాటి మధ్యతరగతి కార్మిక నాయకులు మహా అయితే జాతీయవాదంచే ప్రేరితులైనవారు బొంబాయిలో యన్.యం.జోషి, కలకత్తాలో కె.సి. రాయ్‌చౌదురి లాగా ప్రభుత్వానికి విధేయులు. కార్మికుల పోరాటాన్ని ఆటంకపరిచే వైఖరిని అహమ్మదాబాద్ గాంధేయ జౌళి కార్మిక సంఘం (మజూర్ మహాజన్), అలాగే సైనికులకు యూనిఫారం అవసరమనే సాకుతో బిన్నీ సమ్మెను వ్యతిరేకించిన వాడియాలోనూ చూడవచ్చు.

1918-19లో పెరిగిన ధరలు, తగ్గిన పంటల దిగుబడి, ఆహార ధాన్యాల కొరత, అంటు వ్యాధుల వ్యాప్తి, చేతివృత్తుల వారిలో పెరిగిన నిరుద్యోగిత లాంటి కారణాలతో ప్రజలలో

పెల్లుబికిన అసంతృప్తి ఆందోళనల వ్యక్తీకరణకు సమ్మె ఒక రకమైన రూపం మాత్రమే. అంతకంటె ప్రాథమిక రూపాలు ఆకలిదాడులు చిన్న పట్టణ మార్కెట్లను, నగరంలోని ధాన్యపు గిడ్డంగుల్ని లూటీ చేయడం, రుణ పత్రాన్ని స్వాధీనం చేసుకొనడం. 1918 ప్రారంభంలో బొంబాయిలోని మిల్లు ఏరియాలో 115 ధాన్యపు షాపులు లూటీ చేయబడ్డాయి. రైల్వేకార్మికులు మార్వాడీల ఖాతా పుస్తకాన్ని స్వాధీనం చేసుకొన్నారు. 1918 మేలో కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతంలో ఆకలిదాడులు జరిగాయి. సెప్టెంబరులో మద్రాసు నగరంలో మూడు రోజులు తీవ్రమైన దాడులు జరిగాయి. వీటిలో రైల్వే, జౌళి కార్మికులు చురుకుగా పాల్గొన్నారు. బెంగాలులోని నౌఖాలీ, చిటగాంగ్, రంగపూర్, దినాజ్‌పూర్, ఖుల్నా 24 పరగణాలు, జెస్సోర్ జిల్లాలలో 38 లూటీకేసులు నమోదయ్యాయి. 859 మందికి శిక్షలు పడ్డాయి.

యుద్ధానంతరం ప్రజాచైతన్యం వెల్లువెత్తడానికి కేవలం కొన్ని ఆర్థికపరమైన అంశాలు మాత్రమే కారణం కాదు. ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాలలో పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగాను, వలస అర్ధవలస దేశాలలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగాను వెల్లువెత్తిన పోరాటాలలో భాగంగానే భారతదేశంలోని అలజడులు ఆందోళనలు జరుగుతున్నాయని గమనించాలి. విదేశాల నుండి తిరిగివచ్చిన భారత సైనికులు తమతోపాటు విప్లవ వాతావరణాన్ని తీసుకొని వచ్చారు. బెంగాలుకి చెందిన కాజి నజ్రుల్ ఇస్లాంని మిలిటరీ సర్వీసు స్పష్టమైన సోషలిస్టు భావాలు గల కవిగా మార్చింది.

1917 నవంబరు బోల్షివిక్ విప్లవం భారత రాజకీయాలపై తీవ్రమైన ప్రభావం చూపింది. దీనిపై బ్రిటిషువారి ఆందోళనలు అతిశయించి చెప్పబడ్డాయి. ఫ్రెంచి విప్లవం నాటి భయాందోళనలు జ్ఞప్తికి రావడంతో బ్రిటిష్ అధికారులకు బోల్షివిక్ ఆలోచనలు బోల్షివిక్ ఏజెంట్లు వున్నట్లు కనిపించాయి. కొన్ని సందర్భాలలో గాంధీ సి.ఆర్.దాస్ లాంటి వారిని కూడా అనుమానించారు. ('మర్యాదస్తుడు కాని బోల్షివిక్ – అందువలన ప్రమాదకారి' – గాంధీని గురించి బొంబాయి గవర్నరు విల్లింగ్డన్ 1918 మే 5న చేసిన వ్యాఖ్య) రెండు ఉదాహరణలు : 1921 ఫిబ్రవరితో కిసాన్ ఆందోళనపై సి.ఐ.డి. రిపోర్టు ఆందోళనలో స్పష్టమైన బోల్షివిక్ వాసన పసిగట్టింది. మేవార్ రైతు ఉద్యమంపై విల్కిన్సన్ రిపోర్టు జార్‌కి పట్టినగతే మహారాణాకి పడుతుందని రైతులు వ్యాఖ్యానించారని పేర్కొన్నది. సంబంధాల్ని గురించి స్పష్టమైన సమాచారం లేనప్పటికి 1917 గురించి వదంతులు భారత ప్రజలలోని విస్తృత సెక్షన్లలో వ్యాపించడంతో సామ్రాజ్యవాదులు ఆందోళన చెందారు. మహేంద్ర ప్రతాప్, యం. యన్.రాయ్ అబనీముఖర్జీ, వీరేంద్రనాథ్ చటోపాధ్యాయ, భూపేన్‌దత్ రష్యాని సందర్శించారు. బ్రిటిషు పాలకులు రష్యాని ద్వేషిస్తున్నారని రష్యా విప్లవం ఆలోచనలతో భయపడుతున్నారని గమనించిన విద్యావంతులైన భారత జాతీయవాదులు రష్యాపట్ల ఆసక్తి చూపారు. సానుకూలంగా స్పందించారు. లెనిక్ ట్రాట్స్కీల ఆధ్వర్యంలోని తొలినాటి సోవియట్ విదేశాంగ విధానం యొక్క ఆదర్శం అంతర్జాతీయ దృక్పథం తీవ్ర ప్రభావం చూపింది. ఆక్రమణలు, నష్టపరిహారాలు లేకుండా తక్షణమే శాంతి కొరకు యిచ్చిన పిలుపు, జాతులు స్వయం నిర్ణయాధికారం కలిగివుంటాయనే ప్రకటన ఫిన్లాండు విషయంలో వెంటనే అమలు

జరుపబడింది. రష్యన్ విశాలమైన భూభాగాలను ప్రత్యేక హక్కుల్ని సంక్రమింపజేసే రహస్య ఒప్పందాలు (కాన్‌స్టాంటు నోపిల్‌తో సహా) బోల్షివికులు అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే రద్దు చేయబడ్డాయి. రష్యాలో జరుగుతున్న అంతర్గత పరిణామాలు స్పష్టంగా బయటికి రాన్నప్పుడు అక్కడ సమూలమైన మార్పులు జరుగుతున్నట్లు వార్తలు వ్యాపించాయి.

ఈ నేపథ్యంలో 1915 లో దక్షిణాఫ్రికా నుండి తిరిగి వచ్చిన మహాత్మాగాంధీ భారత రాజకీయాలకు ఒక విధంగా బయటివాడుగా వున్న గాంధీ 1920 నాటికి అధినాయకుడుగా ఎదగడాన్ని పరిశీలించాలి.

## మహాత్మాగాంధీ

గాంధేయ సిద్ధాంతం విధానాలు, అలాగే ఆయన భారతదేశంలో సాధించిన విజయాలు పునాదులకు దక్షిణాఫ్రికా అనుభవం (1893 –1914) పలు విధాలుగా తోడ్పడింది. 1906 వరకు గాంధీ నటాల్‌లో భారతీయుల వర్ణ వివక్షతా వ్యతిరేక పోరాటంలో విజ్ఞప్తులు అర్జీల లాంటి మితవాద పద్ధతులనే అనుసరించాడు. ఆయన ఉద్యమం ప్రధానంగా వర్తకులకు లాయర్లకు పరిమితమైనది. 1907 –08, 1908–11, 1913 –14 – ఈ మూడు సందర్భాలలో చేపట్టిన సాత్విక నిరోధ (1907 లో సత్యాగ్రహంగా సూత్రీకరించాడు) ప్రచారాలతో పాతపద్ధతుల నుండి వైదొలగడం ప్రారంభమయింది.

**సమస్యలు :** నిర్బంధ నమోదుపై 1906 ట్రాన్స్‌వాల్ ఆర్డినెన్స్, భారతీయులకు పాస్‌లు, 1913 వలసల ఆంక్షలు, కొత్తగా వచ్చిన వారి కేసులు విచారణ సందర్భంగా క్రైస్తవేతర భారతీయ వివాహాల్ని గుర్తించకపోవడం, గతంలో ఒప్పందంపై కుదుర్చుకున్న శ్రామికులపై మూడు పౌండ్ల పన్ను విధింపు, హిందువులు ముస్లింలు, పార్సీలు, క్రైస్తవులు, గుజరాతీలు, దక్షిణ భారతీయులు, పై వర్గానికి చెందిన వర్తకులు లాయర్లు, న్యూకేజిల్ గని కార్మికులు –లాంటి పలు కులాల మతాల వర్గాల ప్రజలు కలిసి జయప్రదంగా ఉద్యమం నడపడానికి దక్షిణాఫ్రికా ప్రత్యేక పరిస్థితులు అవకాశం కల్పించాయి. ఈ అనుభవం గాంధీకి అఖిల భారత స్థాయి ఖ్యాతిని తెచ్చిపెట్టింది. అప్పటివరకు వున్న తిలక్, లజపతి, పాల్ లాంటి రాజకీయవేత్తలు ప్రధానంగా ప్రాంతీయ నాయకులే. హిందూ ముస్లిం ఐక్యత గుర్తింపు కూడా గాంధీకి దక్షిణాఫ్రికా ఉద్యమాల నుండి గ్రహించిందే. ఆ ఉద్యమంలో ముస్లిం వర్తకులు చాలా చురుకుగా పాల్గొన్నారు. దక్షిణాఫ్రికా పోరాటాలు గాంధీకి అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టాయి. దక్షిణాఫ్రికాలో వున్న భారతీయులు వివిధ ప్రాంతాలకు చెందిన వారవడం, వారికి వారి స్వంత ప్రాంతాలతో సంబంధాలు వుండడం కూడా గాంధీపేరు దేశవ్యాప్తంగా విస్తరించడానికి తోడ్పడ్డాయి. సబర్మతీ ఆశ్రమంలో మొత్తం 25 మంది అంటే వాసులలో 13 మంది తమిళనాడుకి చెందినవారు.

గాంధేయ విధానానికి దక్షిణాఫ్రికాలో 1906 తరువాత రూపకల్పన జరిగింది. క్రమశిక్షణాయుతమైన శ్రేణులకు శిక్షణ ఇవ్వడం ((ఫోనిక్) సెటిల్‌మెంటు, టాల్‌స్టాయి ఫారమ్)

ప్రత్యేకమైన చట్టాన్ని (నిర్బంధ రిజిస్ట్రేషన్, ఎంట్రీ పర్మిట్లు, ట్రేడ్ లైసెన్సులు లాంటి) శాంతియుతంగా ఉల్లంఘించడంతో, కూడిన అహింసాయుత సత్యాగ్రహం, మాకుమ్మడిగా అరెస్టులకు సిద్ధపడడం, ఆందోళనలు, ప్రదర్శనలు, నిర్మాణపరమైన ఆర్థికపరమైన వివరాలపై అత్యంత శ్రద్ధ, చర్చలకు ఒప్పందానికి సంసిద్ధత, ప్రజావివాదం పొందని పరిస్థితులలో ఏకపడే విరమణ, (స్మట్స్ నుండి మౌఖికవాగ్దానం మొదటి సత్యాగ్రహం 1908 జనవరిలో విరమణ, త్వరలోనే దాని ఉల్లంఘన ఊహించని వెనుకడుగు తరువాత కోపోద్రిక్తుడైన పరాక్ గాంధీపై చేయిచేసుకొన్నాడు) శిష్యులుకానివారు గాంధేయం వేలం వెర్రిగా భావించే వాటిని (శాకాహారం, ప్రకృతి వైద్యం, ఇంద్రియ నిగ్రహం) అలవరచుకొనడం.

ఎమర్సన్, థోరో, టాల్‌స్టాయ్ లాగానే అహింస సత్యాగ్రహాలు అలవరచుకొన్న తాత్వికధోరణులు, అహింస సత్యాగ్రహాలపై గాంధీ ముద్ర వుంది. సత్యాన్వేషణ మానవజీవిత లక్ష్యం. లక్ష్యాన్ని సాధించడం సాధ్యం కాదు గనుక సత్యంపై తనకు గల పాక్షిక అవగాహనను అమలు జరిపేందుకు హింసని ప్రయోగించడం పాపం. సన్యాసిగా గాక రాజకీయవేత్తగా గాంధీ ఆచరణలో అహింస విషయంలో (యుద్ధానంతర రాజకీయ రాయితీలను పొందే ఆశతో 1918 లో సైనికుల నియామకం కొరకు ప్రచారం చేపట్టాడు). అన్యాయానికి పిరికిగా లొంగిపోవడం కంటె హింసా ప్రయోగమే మేలని చాలాసార్లు చెప్పాడు. ఇలాంటి వాటిని వ్యాఖ్యానించడంలో సున్నితమైన సమస్యలు ఉత్పన్నమయ్యాయి. కాని వ్యక్తిగత తాత్విక చింతన కంటె చారిత్రకంగా చాలా ప్రాధాన్యత గల అంశం (పరిమితమైన శిష్యబృందం చేత మాత్రమే ఆమోదం పొందింది). నియంత్రించబడిన ప్రజల భాగస్వామ్యం యొక్క దృష్టికోణం ఆచరణలో భారత ప్రజలలోని సామాజికంగా నిర్ణయాత్మక సెక్షన్లు ఆలోచనలు ఆకాంక్షలతో ఒదిగిపోయిన విధానమయింది. మనం యింతకు ముందు గమనించినట్లు గాంధీకి ముందుగల రాజకీయ నాయకులకు నియంత్రణ లేని ప్రజా ఉద్యమాలపై సరియైన అవగాహన లేకపోవడంతో మితవాద అభ్యర్థనలు వ్యక్తిగత హింసావాదం మధ్య ఊగిసలాడారు. రాజకీయ పోరాటం ఊహించని విధంగా హింసాయుత విప్లవంగా పరిణామం జెందితే, కొంత నష్టపోవడానికి సిద్ధంగా వున్న వ్యాపార గ్రూపులకు అలాగే స్థానికంగా ఆధిపత్యం గల రైతాంగానికి గాంధేయ నమూనా ఆమోదయోగ్యమయింది. మనం ముందు గమనించ విధంగా గాంధీ గాంధేయ కాంగ్రెస్ అంతర్గత సామాజిక ఘర్షణలకు మధ్య వర్తిత్వం వహిస్తూ, విదేశీ పాలనకు వ్యతిరేకంగా సమిష్టి జాతీయ పోరాటానికి తోడ్పడుతూ, తరచుగా వెనుకంజవేస్తూ, ఎదురుదెబ్బలు తింటూ అహింసా సిద్ధాంతం ద్వారా సమైక్య పరచి అందరిని ఒకే గొడుగు క్రిందికి తెచ్చే ప్రయత్నాలు చేసింది.

మూడవది, చాలా ముఖ్యమైనది ఎలాంటి సందిగ్ధతని అవకాశం లేకుండా స్పష్టంగా 'హింద్ స్వరాజ్' (1909) లో వ్యక్తం చేసిన సామాజిక ఆదర్శాలు ఈ కరపత్రంలోని కీలకమైన అంశం. నిజమైన శత్రువు ఆధునిక పారిశ్రామిక నాగరికత గాని బ్రిటిషు రాజకీయాధిపత్యం కాదు. 19వ శతాబ్దం మధ్యనాటి కార్లైల్‌రస్కిన్ లాంటి ఇంగ్లీషు రచయితలచే అభివృద్ధిపరచబడిన

పారిశ్రామికీకరణపై విమర్శలచే (ఆన్ టు హిజ్ లాస్ట్ గాంధీ అభిమాన రచన) ప్రభావితుడైన గాంధీ దృష్టిలో కేవలం రాజకీయ స్వరాజ్యం అంటే ఇంగ్లీషులో ప్రజలు లేని ఇంగ్లీషు పాలన అలాగే అమెరికా రాక్‌ఫెల్లర్ కంటె ఇండియా రాక్‌ఫెల్లర్ మేలనుకోవడం మూర్ఖత్వం – రైల్వేలు, లాయర్లు, డాక్టర్లు దేశాన్ని దారిద్ర్యంలోకి నెట్టివేశారు. రైల్వేలు, ప్లేగుని వ్యాపింపజేశాయి. ఆహారధాన్యాల్ని రవాణా చేసి కరువుల్ని సృష్టించాయి. డబ్బు చేసుకోవడానికి లాయర్లు వివాదాల్ని పెంచారు (లా కోర్టులకు అవసరమైన ఉద్యోగుల్ని సరఫరా చేసి బ్రిటిషు సామ్రాజ్య నిర్వహణకు తోడ్పడ్డారు). పాశ్చాత్యవైద్యం ఖర్చుతో కూడుకున్నది. ప్రకృతి సిద్ధమైన ఆరోగ్య విధానాన్ని నాశనం చేసింది. కరపత్రంలో యింకా యిలా వుంది. గత 50సం॥లుగా నేర్చుకొన్న దానిని వదలి వేయడంలో భారతదేశ అభివృద్ధి యిమిడి వుంది. రైలుమార్గాలు, టెలిగ్రాఫ్‌లు, ఆస్పత్రులు, లాయర్లు, డాక్టర్లు లాంటి వన్నీపోవాలి. పై వర్గానికి చెందినవారు మతపరమైన భావాలతో రైతు లాంటి సాధారణ జీవితం గడపాలి.

హింద్ స్వరాజ్‌లో వివరించిన గాంధేయ సామాజిక ఊహాస్వర్గం నిస్సందేహంగా అవాస్తవమైనది. అభివృద్ధి నిరోధకమైనది. పట్టణ నాగరికత గ్రూపుల్ని ఆకట్టుకోలేకపోయింది. 1930, 1940 దశాబ్దాలలో పారిశ్రామికాభివృద్ధి పునాదిగా గల పెట్టుబడిదారీ విధానం లేక సోషలిస్టు విధానం పరిష్కార మార్గాలుగా కనిపించాయి. కాని ఆధునికీకరణ యొక్క అన్యాక్రాంత ఫలితాలకు ప్రత్యేకించి వలసవాద పరిస్థితులలో స్పందించారు. ఫ్యాక్టరీ పరిశ్రమలతో చేతివృత్తుల వారు ధ్వంసం చేయబడ్డారు. రైతులకు లా కోర్టులు వినాశకరమైన బోనులయ్యాయి. నగరాలలో ఆసుపత్రులకు పోవడం ఖరీదైన శాసనం అయింది. కాని గ్రామాలలో, చిన్న పట్టణాలలో చదువుకొన్న వారికి విద్య కొన్ని భౌతిక ప్రయోజనాల్ని చేకూర్చింది. పారిశ్రామిక వ్యతిరేక విధానం కనీసం కొంతకాలం పాటు ఆకర్షణగా నిలిచింది. భారతదేశానికి తిరిగి వచ్చిన తరువాత గాంధీ ఖాదీ (గ్రామపునర్నిర్మాణం మరికొంతకాలం తర్వాత) హరిజన సంక్షేమ కార్యక్రమాల ద్వారా తన సందేశానికి నిర్దిష్ట రూపమిచ్చాడు. కాని ఇవేవీ కూడా సామాజిక ఆర్థిక సంబంధాన్ని మార్చలేదు. సమస్యల్ని పరిష్కరించలేవు. కాని చిత్తశుద్ధితో ఓపికగా పనిచేసిన గాంధేయ కార్యకర్తలు అత్యధికంగా వున్న గ్రామీణ పేదలకు చాలా పరిమితంగా మేలు చేయగలిగాడు. స్వదేశీ ఉద్యమం నాటి స్వావలంబన, స్వయం సహాయం సందేశానికి విస్తృత ప్రచారం లభించింది. ఆయన రాజకీయ విధానం మూడవ తరగతిలో ప్రయాణం చేయడం అతిసాధారణమైన హిందూస్తానీలో మాట్లాడటం 1921 నుండి మోకాళ్ళ పైకి ధోవతి కట్టడం ఉత్తర భారతదేశ గ్రామీణ ప్రజానీకంలో బలంగా నాటుకుపోయిన తులసీదాస్ రామాయణంలోని దృష్టాంతాలను ఉపదేశించడం (ఇలాంటి ముస్లింలపరంగా కొన్ని సమస్యలు తెచ్చిపెట్టాయి. అవి తరువాత)

## పుకార్లు నిర్వహించిన పాత్ర

గాంధేయ ఉద్యమాల విస్తృతిని ప్రభావాన్ని గాంధీ యొక్క వ్యక్తిగత ఆలోచనలతోను, ఆయన చేతులతోను వివరించడం సాధ్యపడదు. మనం ఇక్కడ గమనించవలసిన విషయం

మరొకటి వుంది. నిరక్షరాస్య సమాజం కష్టాలతో, కడగండ్లతో ఉక్కిరి బిక్కిరవుతున్న కాలంలో వదంతులు, పుకార్లు నిర్వహించే పాత్ర. బాధల్లో వున్న భారత ప్రజానీకం గాంధీని వేరు వేరు విధాలుగా చూశారు. ప్రజల్లో రాకముందే ఎక్కడో దూరాన వున్న గాంధీని జానపద కథలోని అద్భుత శక్తులు గల మాంత్రికునిగా ఊహించుకొన్నారు. జమీందారీ దోపిడిని గాంధీని అంతం చేస్తాడని ఊహించారు రైతులు. ఉత్తరప్రదేశ్‌లోని వ్యవసాయ కార్మికులు తమకు భూవసతి కల్పిస్తాడనుకొన్నారు. వైస్రాయ్, రీడింగు సెక్రటరీ ఆఫ్ స్టేటుకి 1921 అక్టోబరు 13 రీడింగ్ కలెక్షన్) అస్సాం టీ తోటల కూలీలు తాము గాంధీ ఆదేశాల్ని పాటిస్తున్నామని చెప్పి 1921 మేలో మూకుమ్మడిగా తోటల్ని వదిలివేసి వచ్చారు. అల్హాబాద్ జిల్లాలోని కిసాన్ ఉద్యమంపై సి.ఐ.డి. రిపోర్టు 1921 జనవరిలో ఈ అంశాన్నే ఇలా వివరించింది. గాంధీపేరు మారు మూల గ్రామాలలో కూడా ప్రచారం పొందడం ఆశ్చర్యజనకంగా వుంది. ఎవరతడు ‘ఏం చేస్తాడని ఎవరికీ తెలిసినట్లు లేదు. కాని అతడు చెప్పేది వేదం అతడు ఆదేశాలు పాటించి తీరుతారు. అతడొక మహాత్ముడు, సాధువు, ఒక పండితుడు. అతడిపేరు యొక్క నిజమైన శక్తి బహుశా ప్రతాప్‌ఘర్‌లో బేదఖలీ ఆపి వేయించడంతో ప్రారంభమయింది. గాంధీ ప్రభుత్వానికి గాక జమీందారులకు వ్యతిరేకంగా భావింపబడ్డాడు. మేము గాంధీకి, ప్రభుత్వానికి అనుకూలురం (హోం పొలిటికల్ డిపాజిట్ –1921 ఫిబ్రవరి నెం.13) బలమైన మతభావాలు గల గాంధీ తరహా నాయకత్వం ఈ కాలంలో ఒక చారిత్రక అవసరం అని సూచించబడినది. 1920 దశాబ్దం తొలి సంవత్సరాలలో అలాంటి ప్రాంతీయ, స్థానిక నాయకులు ఆవిర్భవించడం చూడవచ్చు. బెంగాల్, బీహార్, గనులు తవ్వే వారిలో స్వామి విశ్వానంద, స్వామి దర్శనానంద ఉత్తర బీహార్‌లో స్వామి విద్యానాథ్, ప్రతాప్ ఘర్‌లో బాబా రామచంద్ర, రాజస్థాన్‌లో స్వామి కుమారానంద, మహారాష్ట్రలో ఆనందస్వామి, ఆంధ్ర రంప తెగల వారిలో అల్లూరి సీతారామరాజు నాయకత్వం పట్ల ఆరాధనా భావం కల్పించడంలోని ద్వంద స్వభావాన్ని అర్థం చేసుకోవాలి. అల్హాబాద్ సి.ఐ.డి. రిపోర్టు సూచించిన విధంగా గాంధీ జమీందారి వ్యతిరేకి అని వదంతులు రైతులు పుట్టించారు. అదే సమయంలో బాబా రామచంద్ర లాంటి స్థానిక నాయకుల ఆధ్వర్యంలో ప్రతాప్‌ఘర్‌లో బేదఖల్ పరిమితం చేయడం లాంటి విజయాలను గాంధీకి ఆపాదించారు. గాంధీకి గాని, కాంగ్రెసు నాయకత్వానికి గాని ప్రత్యక్షంగా దీనితో ఎలాంటి సంబంధం లేదు. 1922 తరువాత మాటిమాటికి గాంధీ వెనుకంజ వేయమని ఆదేశించారు. ప్రజలు ఆదేశాలను పాటించారు. రైతులు యింకా పైనున్న ఒక రక్షకుడు దిగివచ్చి పాత్రినిధ్యం వహించాలని కోరుకొన్నాడు. ఈ వైఖరిని ఇటీవలి పండితులు తక్కువగా అంచనా వేస్తున్నారు. వీరు సాంప్రదాయ చారిత్రక రచనా విధానాన్ని వ్యతిరేకిస్తూ గ్రామీణ ప్రజల విప్లవ శక్తిని అతిశయించి చెప్పడం పట్ల మొగ్గు చూపుతున్నారు. భవిష్యదర్శనం కాలక్రమంలో మసకబారి పోయింది.

గాంధేయ ఉద్యమాలలో పునరావృతమయ్యే ఈ వైఖరి సంస్థాపరమైన శక్తికి, హింసాయుతమైన తిరుగబాట్లకు మధ్య ఒక తరహా విలోమ సంబంధం.

## చంపారన్, ఖేదా అహ్మదాబాద్

1915లో గాంధీ దక్షిణాఫ్రికాలో పాక్షిక విజయం సాధించి వచ్చారు. 1914 జూన్ స్మట్స్ ఇండియన్ రిలీఫ్ చట్టం 3 పౌనుల పన్నుని రద్దు చేసింది. వివక్ష అంతంగానప్పటికి భారతీయ వివాహాలను గుర్తించింది. భారతీయులపై ఆఫ్రికా వారిపై తెల్లవారి దోపిడీ ప్రస్తావనకు రాలేదు. తరువాత 3 సంవత్సరాలు స్థానికంగా సమస్యల్ని (చంపారన్ నీలిమందు రైతులు, అహ్మదాబాద్ బట్టల కార్మికులు, ఖైదా రైతులు) చేపట్టేవారికి స్పష్టంగా పనిచేసి చూపెట్టేవానిగా గుర్తింపు పొందారు. ఇది కాంగ్రెసు (మరియు హోంరూల్ లీగు) లాగా అస్పష్టమైన అఖిల భారత సమస్యల్ని , కార్యక్రమాల్ని చేపట్టి పై నుండి దిగువకు పనిచేసే తరహాకి పూర్తిగా భిన్నమైనది. ఈ తొలినాటి ఉద్యమాల ప్రాధాన్యత చంపారన్‌లో రాజేంద్రప్రసాద్ అనుగ్రహ నారాయణ సిన్హా, జె.బి. కృపలానీలను గుజరాత్‌లోని రెండో ఉద్యమాలలో వల్లభాయ్‌పటేల్, మహదేవ్ దేశాయ్, ఇందూలాల్ యాజ్ఞిక్, శంకర్‌లాల్ బేంకర్ లాంటి జీవితకాలం గాంధీకి అనుచరులుగా వుండే సబ్ కాంట్రాక్టర్లని నియమించుకొనడంలో వుందని జూడిత బ్రౌన్ వాదించారు. కాని ఆమె అభిప్రాయం ఇంకా లభ్యమైన సమాచారం ఇతర ముఖ్యమైన కోణాలను వ్యక్తం చేస్తుంది.

మనం ఇంతకు ముందు గమనించిన విధంగా చంపారన్ ప్లాంటర్లకు వ్యతిరేకంగా అలజడి, ఆందోళనలు చేసిన చరిత్ర ఉంది. రైతుల్ని సమీకరించడంలో కీలకమైన పాత్ర చిన్న పట్టణాల నుండి గాంధేయవాదులుగా మారిన మేధావులు (రాజేంద్రప్రసాద్, ఎ.ఎన్. సిన్హా, బ్రజ్ కిషోర్ ప్రసాద్, ముజుఫర్ పూర్ కాలేజి అధ్యాపకాలు జె.బి. కృపలానీ జాడిత్ బ్రేస్ సబ్ కాంట్రాక్టర్లు గాక సంపన్న, మధ్య తరగతి రైతులు (గాంధీని ఆహ్వానించడానికి వెళ్ళిన రాజ్‌కుమార్ శుక్లా, సంత్‌రాత్, ఖెందార్ రాజ్) వడ్డీ వ్యాపారంలో, వర్తకంలో ప్లాంటర్ల పోటీపై ఆగ్రహం చెందిన స్థానిక పెత్తందార్లు, వర్తకులు, పాఠశాల ఉపాధ్యాయులు (పీర్ మహమ్మద్, హర్బాన్స్ సహాయ్) వహించారని జాక్స్ పాచప్‌దాస్ వివరణాత్మక విశ్లేషణ స్పష్టం చేస్తుంది.

మొదట గాంధీ నిర్వహించిన పాత్ర (1917 జూలైలో బహిరంగ విచారణ జరిపించడానికి, స్థానికంగా ఆయన ప్రవేశంపై విధించిబడిన నిషేధాన్ని సత్యాగ్రహం బెదిరింపులో పై అధికారులు రద్దు చేసిన తరువాత) చంపారన్ నీలిమందు సాగుదారులు సమస్యలకు అఖిల భారత స్థాయిలో ప్రచారమిచ్చేందుకు పరిమితమయింది. ఈ విచారణ ప్రచారం తింకాటియా రద్దుకు దారితీసింది. గాంధీజీ చేపట్టిన చర్యలకంటె ఆయన ప్రజల మనస్సులపై వేసిన ముద్ర చాల బలమైనది. ఆయన రామరాజ్యాన్ని స్థాపించే మహాపురుషునిగా అమాయక ప్రజలు ఊహించారు' -1917 ఏప్రిల్ 29న బెట్టియా యస్.డి.డి రిపోర్టు చేశారు. ఒకరైతు విచారణ కమిటీ ఎదుట సాక్ష్యం చెపుతూ గాంధీని శ్రీరామునితో పోల్చి ప్లాంటర్లకు, రాక్షసులకు కౌలు రైతులు భయపడరు అన్నారు. స్థానిక అధికారుల్ని ప్లాంటర్లను తోసిపుచ్చేందుకు గాంధీ వైస్రాయి లేక బ్రిటిష రాజుచే పంపించబడ్డాడని, కొద్దినెలల్లో బ్రిటిషువారు చంపారన్ వదిలి వెళతారని వదంతులు వ్యాపించాయి. గాంధేయ పరిమితులు దాటి నీలిమందు ఫ్యాక్టరీలపై

దాడులు జరిగాయి. 1917 సంవత్సరాంతానికి గాంధేయ ఒప్పందం మేరకు తగ్గించబడిన 'షారాభేషి'ని చెల్లించడానికి కూడా కొన్నిసార్లు రైతులు తిరస్కరించారు. గ్రామ పునర్నిర్మాణ పనులు చేపట్టేందుకు గాంధీ 15 మంది కార్యకర్తల్ని నియమించారు. రైతులకు చదువుచెప్పడం, వారికి ప్లాంటర్లకు మధ్య నిరంతరం మధ్య వర్తిత్వం నెరపడం నిజమైన పరిష్కారమని గాంధీ, రాజేంద్రప్రసాద్‌కి చెప్పాడు. కాని అలాంటి ప్రయత్నాలు చంపారన్‌లో జయప్రదం కాలేదు. 1918 నాటికి అక్కడ కేవలం ముగ్గురే గ్రామస్థాయి కార్యకర్తలు మిగిలారు.

గుజరాత్‌లోని ఖేదా జిల్లాలో గాంధీ జోక్యం ఫలప్రదమయింది. అక్కడి నాబి - ఫతేదార్ సంపన్న రైతులు ఆహారధాన్యాలు, ప్రతి, పొగాకు, వగైరాలు అహమ్మదాబాద్‌కి సరఫరా చేస్తుంటారు. (చంపారన్‌లో లాగా పెద్ద జమీందారులు, ప్లాంటర్లకు కాదు) చాలామంది పతేదార్లు వర్తకులుగా దక్షిణాఫ్రికా వెళ్ళారు. వారిలో ప్రాథమిక విద్య బాగా వ్యాప్తి చెంది వుంది. ఖేదాపై ఇటీవల జరిపిన అధ్యయనంలో డేవిడ్ హార్డిమన్ పేర్కొన్నట్లుగా 19వ శతాబ్దపు చివరి 'స్వర్ణయుగం' తరువాత 1899 తరువాత వచ్చిన కరువు కాటకాలు, ప్లేగు కారణంగా రైతులు, శిస్తులు కూడా చెల్లించలేని స్థితికి నెట్టివేయబడ్డారు. పేద ఫతేదార్లు వారి పిల్లలకు పెళ్ళిచేయడం కూడా కష్టంగా పరిణమించింది. సంపన్న ఫతేదార్లు కట్నకానుకల రూపంలో డబ్బు పోగుచేసుకోగలిగారు. దగ్గరలో వున్న బరోడాలో సివిల్ సర్వీసు ఉద్యోగాలు పొందగలిగారు. తరువాత కాలంలో మొదటి తరహా పతేదారుల్లో గ్రూపు గాంధేయ జాతీయ వాదానికి శాశ్వత మద్దతు ఇచ్చింది. 1917-18లో పంటల దిగుబడి బాగా తగ్గింది. బట్టలు, ఉప్పు, కిరోసిన్ లాంటి నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. ఖేదా ఫతేదార్ల వ్యవసాయ కూలీలుగా పెట్టుకొన్న నిమ్నకులస్థులైన బరైయాలు కూలీపెంచక తప్పని పరిస్థితి కల్పించారు. 'గతంలో మూడణాలు ఇచ్చే కూలీకి ఇప్పుడు ఆరణాలు ఇవ్వక తప్పడం లేదు' - ఒక ఫతేదారు 1918 ఏప్రిల్‌లో ఆందోళన వ్యక్తం చేశాడు. శిస్తు రద్దుకై చొరవ గాంధీ నుండి గాని అహమ్మదాబాద్ రాజకీయవేత్తల నుండి గాని రాలేదు. ఖేదాజిల్లాకి చెందిన కపద్వంజి తాలూకాకి చెందిన మదన్‌లాల్‌పాండ్య లాంటి స్థానిక గ్రామ నాయకుల నుండి 1917 నవంబరులో వచ్చింది. గాంధీ చాలా తట పటాయించిన మీదట 1918 మార్చి 22న ఈ సమస్య చేపట్టారు. ఆలస్యం నిష్ప్రయోజనకరంగా నిరూపితమయింది. అప్పటికే అధికారులు పేదరైతుల గోళ్ళుడగొట్టి మరీ శిస్తు వసూలు చేశారు. రబీ పంట బాగుండడంతో శిస్తు రద్దు డిమాండు బలహీనపడింది. ఫలితంగా భారతదేశంలో మొట్ట మొదటి గాంధేయ రైతాంగ సత్యాగ్రహం అతుకుల బొంతయింది. 559 గ్రామాలకు గాను కేవలం 70 గ్రామాలపై దీని ప్రభావం పడింది. నామమాత్రపు రాయితీలతో జూన్‌లో సత్యాగ్రహం విరమించబడింది. కాని సంవత్సరాల పాటు సాగించిన గ్రామీణ కార్యక్రమాలు గుజరాత్‌లో ప్రత్యేకించి ఖేదాలో పొగాకు పాడి పరిశ్రమలకు నెలవుగా వున్న ఆనంద్, బోర్సాద్ తాలూకాల్లో సూరత్‌కి చెందిన బార్డోలీ తాలూకాలో (కున్వర్జీమెహతా యొక్క పతేదార్ యువక మండల్‌చే ప్రారంభించబడిన నిర్మాణాత్మక కార్యక్రమాలతో గాంధేయులు సంబంధాలు పెట్టుకొన్నచోట్ల) గాంధేయ వాదానికి బలమైన పునాదులు ఏర్పడ్డాయి. గాంధేయ అహింసావాదంపై ఫతేదార్ల విశ్వాసానికి కారణం సాంప్రదాయ వైష్ణవభక్తి ప్రభావాలు

కాదు. 'ఆస్తి యజమానులుగా వారు హింసాయుత విప్లవాన్ని కోరుకొనుక పోవడమే' ఖేదా సత్యాగ్రహం తరువాత బరైయిలు ఫతేదార్ల ఇళ్ళపై చాలా దొమ్మిట చేశారు. గుజరాతు రైతులకు వారి ఆలోచనలు వారికున్నాయి. జూడిత్‌బ్రౌన్ ఊహించిన విధంగా రైతులు గాంధీ యొక్క సబ్ కాంట్రాక్టర్లు ఆశించినట్లు ఆడే కీలుబొమ్మలు కాదు. ఈ వాస్తవం 1918 వేసవి కాలంలో గాంధీ, గాంధీ అనుచరులు యుద్ధకాల నియామకాలు కొరకు ఖేదాలో ప్రచారం చేపట్టినపుడు స్పష్టమయింది. గతంలో పూలదండలతో స్వాగతం పలికిన గ్రామస్తులు కనీసం అన్నంపెట్ట నిరాకరించారు (ఉటంకింపులు ఖేదా జిల్లాలో రైతాంగ ఆందోళనలు, 1917 - 1934 హోర్డిమన్, సస్సెక్స్ థీసిస్ 1975 పేజీలు 113, 158, 151)

నీలిమందు తోటల యజమానులు రెవిన్యూ అధికారులకు వ్యతిరేకంగా జరిగిన చంపారన్ ఖేదా ఉద్యమాలలో వలెగాక 1918 ఫిబ్రవరి -మార్చిలో అహ్మదాబాద్‌లో మిల్లు యాజమానులకు, కార్మికులకు మధ్య వివాదంలో గాంధీ జోక్యం చేసుకొన్నారు. వస్త్ర పారిశ్రామిక ప్రముఖుడు అంబాలాల్ సారాభాయ్ సబర్మతి ఆశ్రమానికి నిధులు సమకూర్చిన వారిలో ముందున్నాడు. ఆయన సోదరి అనసూయాబెన్ గాంధీ శిష్యురాలు. సత్యాగ్రహ కాలంలో ఖేదాని సందర్శించింది. మిల్లు కార్మికుల కొరకు రాత్రి పాఠశాలలు నడిపింది. ధరలు పెరుగుతున్న కాలంలో 1917 ప్లేగు బోనస్ ఆపివేయాలని మిల్లర్లు యత్నించారు. కార్మికుల ప్లేగు బోనస్‌తో పాటు 50% వేతనాలు పెంచాలని డిమాండు చేశారు. గాంధీ సలహా మేరకు 35% పెరుగుదల డిమాండు చేశారు. యజమానులు 20% పెంచుతామన్నారు. 1918 మార్చిలో గాంధీ నాయకత్వంలో జరిగిన సమ్మెకి ఒక ప్రత్యేకత ఉన్నది. ఈ సందర్భంగా మొట్ట మొదటి సారిగా నిరాహారదీక్ష మార్చి 15 నుండి ప్రయోగించాడు. పికెటింగులకు గాంధీ వ్యతిరేకి. పికెటింగ్‌కి ప్రత్యామ్నాయంగా, ఊగిసలాడే కార్మికుల్ని సమీకరించేందుకు నిరాహారదీక్ష జయప్రదమైన ప్రయత్నంగా వర్ణించబడింది. జూడిత్ బ్రౌన్ ఉటంకించిన జిల్లా మేజిస్ట్రేట్ రిపోర్టు మరొక విధంగా వుంది. "మాకు అందిన సమాచారం మేరకు గాంధీమిల్లు యజమానుల మిత్రుడని, వారి కార్లలో విహరిస్తుంటాడని కార్మికుల కడుపులు ఆకలితో అలమటిస్తుంటే, వారితో తృప్తిగా భోంచేస్తుంటారని తీవ్రంగా ఆక్షేపించారు. ఈ నిందలకు వ్యథ చెంది గాంధీ నిరాహారదీక్షకి ఉపక్రమించారు. ఉద్దేశాలేమైనప్పటికీ నిరాహారదీక్ష కార్మికుల వేతనాన్ని 35% పెంచింది. వివాదాలకు శాంతియుత మధ్య వర్తిత్వం, పెట్టుబడి, శ్రమ పరస్పర ఆధారితం, యజమానులు, కార్మికులు ధర్మకర్తలు అనే తాత్విక చింతన భూమికగా గాంధీ యొక్క పలుకుబడి 1920 జౌళి కార్మిక సంఘం స్థాపనతో అహ్మదాబాద్ కార్మికులలో పెరిగింది. గాంధీకి మిల్లు యజమానులతో, కార్మికులతోను గల మంచి వ్యక్తిగత సంబంధాలు విజయాన్ని చేకూర్చాయి. కాని ఇక్కడ గమనించవలసిన అంశమేమంటే వర్గపోరాట పంథాలో రాజకీయీకరణనే గాక సమరశీల ఆర్థిక పోరాటాలను తిరస్కరించిన గాంధేయ నమూనా ఎప్పుడు కూడా అహ్మదాబాద్‌ని దాటి విస్తరించలేదు. ఎ.ఐ.టి.యు.సి.లో కమ్యూనిస్టులు ముఖ్యులు కాకముందు కూడా, ఇతర రాజకీయ నాయకుల లాగా కాక గాంధీ ప్రారంభం నుండి ఎఐటియుసికి దూరంగా వున్నారు. గ్రామీణ ప్రాంతాలలో దోపిడీ పరంపరాగతంగా

జరుగుతుండడం, భూమి శిస్తు, ఉప్పుపన్ను, లాంటి సమస్యలు అందరినీ కలిపి వుంచే సమస్యలవడంతో వర్గశాంతి, పరస్పర సర్దుబాటు అనే గాంధేయ సందేశం కార్మికులలో కంటే రైతాంగంలో పనిచేసింది.

1919 ప్రారంభం వరకు అఖిల భారత రాజకీయాలలో గాంధీ జోక్యం చాలా తక్కువగా వుంది. అనిబిసెంట్ నిర్బంధానికి వ్యతిరేకంగా నిరసనలకు ఆలీ సోదరుల విడుదల కొరకు విజ్ఞప్తులకు (దాని ద్వారా లక్నోకి చెందిన అబ్దుల్ బాకి లాంటి ముస్లిం మత నాయకులతో సంబంధాలు పెంచుకొనుట ప్రారంభించారు.) పరిమితమయ్యారు. అత్యధిక రాజకీయ నాయకులు పాలనాపరమైన సంస్కరణలలో నిమగ్నమైనప్పుడు గాంధీ వాటిపై అంతగా ఆసక్తి చూపలేదు. 1919 ఫిబ్రవరిలో చేసిన రెచ్చగొట్టే రౌలత్‌చట్టం మొదటిసారిగా గాంధీని, అఖిల భారత సత్యాగ్రహ ప్రచారానికి సన్నద్ధం చేసింది.

## రౌలత్ సత్యాగ్రహం

రౌలత్‌చట్టం (జస్టిస్ రౌలత్ నాయకత్వంలో చేసిన సిఫార్సుల మేరకు చేసిన రూపకల్పన) అనధికార భారతీయ సభ్యులందరు సమైక్యంగా వ్యతిరేకించినప్పటికి ఇంపీరియల్ లెజిస్లేటివ్ 1919 ఫిబ్రవరి 6 మార్చి 18 మధ్య కాలంలో ఆమోదించబడింది. ఇది పౌర హక్కులపై స్పెషల్ కోర్టులు, విచారణలు లేకుండా రెండు సంవత్సరాలు వరకు నిర్బంధం రాజద్రోహపూరితమైనవని ప్రకటించిన పుస్తకాలు కలిగి వుండటం లాంటి చర్యలకు కూడా వర్తింపు చేస్తూ) యుద్ధ కాలపు నిర్బంధాలను విధించేందుకు చేపట్టిన చర్య ఇది. మాంటేగు ఉదారవాద వాగ్దానాల పట్ల ద్వంద్వపరిపాలన ఆగ్రహించిన తెల్లవారిని సమాధానపరచడానికి చేపట్టిన చర్య కావచ్చు. రానున్న సంస్కరణల వలన సివిల్ సర్వీసు, బ్రిటిషు వాణిజ్య ప్రయోజనాల భంగం వాటిల్లదని వైస్రాయి హామీ ఇచ్చారు. భారతీయులు దృష్టికోణం నుండి చూస్తే రౌలత్ చట్టం యొక్క ప్రభావం చురుకైన రాజకీయ వేత్తల పైనే పడుతుంది. కాని ప్రతిచోట క్రింది స్థాయిలో అణచివేత దారులుగా పోలీసులు వ్యవహరించే తీరువలన వారికి అదనపు అధికారాలు కట్టబెట్టడం ఎవరికైనా ఆందోళన కలిగిస్తుంది.

అన్ని సెక్షన్ల భారత రాజకీయాభిప్రాయం రౌలత్‌చట్టాన్ని తీవ్రంగా నిరసించింది. కేవలం విజ్ఞప్తులకే పరిమితం కాకుండా అదే సమయంలో అదుపు చేయలేని హింసకు దారితీయకుండా ప్రజల నిరసనని వ్యక్తం చేసే పద్ధతి సూచించడం గాంధీకి వదిలివేయబడింది. నిషేధించబడిన కరపత్రాల్ని, పుస్తకాల్ని, వలంటీర్లు బాహాటంగా అమ్ముతూ అరెస్టుకి సిద్ధపడడం మొదటి పథకం. కాని మార్చి 30 వ తేదీన (తరువాత ఏప్రిల్ 6 కి వాయిదా వేయబడింది) అఖిల భారతస్థాయిలో హర్తాళ్ జరపాలని సూచించారు. కాని మొదటి నుండి అనుకున్న దానికి బ్రేకులు పడుతూనే ఉన్నాయి. హర్తాళ్ ఆదివారం పాటించాలని ఉద్దేశపూర్వకంగా నిర్ణయించబడింది."ఆదివారం కూడా పనిచేయవలసిన వారు వారి యజమానుల నుండి ముందుగా సెలవు మంజూరు చేయించుకొని పని మానుకోవాలి" – గాంధీ స్పష్టంగా ప్రకటించారు. శిస్తు చెల్లించవద్దని పిలుపివ్వాలని ఆర్య సమాజ నాయకుడు స్వామి శ్రద్ధానంద

చేసిన సూచనని గాంధీ తిరస్కరించాడు. ("భాయిసాబ్ సత్యాగ్రహం వ్యవహారంలోనే నేను చాలా నిపుణుడునని నీవు గురిస్తావు") "ఎదుగుతున్న తరం విజ్ఞప్తులతో తృప్తిచెందరు. టెర్రరిజాన్ని ఆపడానికి సత్యాగ్రహం ఒక్కటే మార్గమని నాకనిపిస్తుంది. (వాచాకి లేఖ 1919 ఫిబ్రవరి 25) అని ఆర్థిస్తూ మితవాద నాయకుడు వాచాకి లేఖ రాశాడు.

తన సత్యాగ్రహాన్ని నిర్వహించేందుకు గాంధీ  మూడు రకాల రాజకీయ అల్లికల్ని, హోంరూల్ లీగుల్ని కొన్ని అఖిల ముస్లిం ప్రపంచవాద గ్రూపుల్ని, గాంధీ స్వయంగా ఫిబ్రవరి 24న బొంబాయిలో ప్రారంభించిన సత్యాగ్రహ సభను ఉపయోగించుకొన యత్నించాడు. బిసెంటు ఒక్కసారిగా మితవాదిగా మారిపోవడం (ఆమె మాంట్ -ఫర్డ్ సంస్కరణల్ని బలపరచినందుకు 1918 ఢిల్లీ కాంగ్రెసులో ఆమెను మాట్లాడనీయకుండా సభ్యులు కేకలేసి అడ్డుకున్నారు, తిలక్ 1918 లో లండన్ వెళ్ళిపోవడం వలన రెండు లీగులకు చెందిన యువకులకు నాయకుడు అవసరమయ్యాడు. జమిన్‌దాస్, ద్వారకాదాస్, శంకర్‌లాల్ బాంకర్, ఉమర్ శోభని, బి.జి. హార్నిమన్ లాంటి బీసెంటు హోంరూలు సభ్యులు సత్యాగ్రహసభకి కావలసిన జనాన్ని ఆర్థిక వనరుల్ని సమకూర్చారు. తిలక్ యువ అనుచరులు కూడా గాంధీని అనుసరించాడు. కాని యన్.సి.కేల్కర్, జి.ఎస్.కపర్దే లాంటి ముఖ్య అనుచరులు దూరంగా ఉండిపోయారు. గాంధీ అప్పటికే ముస్లిం నాయకులతో ప్రత్యేకించి లక్నో ఫిరంగి మహల్ ఉలామా గ్రూపుకి చెందిన అబ్దుల్ బారి లాంటి వారితో మంచి సంబంధాలు ఏర్పరచుకొన్నారు. ఒట్టమాన్ టర్కీ పరాజయం, విజయం సాధించిన మిత్ర పక్షాలు చాలా కటువైన శాంతి షరతులు విధించారన్న వదంతులు వ్యాప్తి చెందడంతో భారతీయ ముస్లిములు సుల్తాన్ ఖలీఫా భవిష్యత్తు పట్ల ఆందోళన చెందారు. ముస్లింలీగు ఢిల్లీ సదస్సు (1918 డిసెంబరు) నాయకత్వంలో ఏ ముఖ్యమైన మార్పు చేసింది. మాంట్‌ఫర్డ్ సంస్కరణాల్ని ఆమోదించాలని కోరుకునే మితవాద సెక్షన్‌ని (వజీర్ హసాన్, మహముదాబాద్‌లను) మార్పులు గోరే అన్సారీ మరియు అబ్దుల్‌బారి తీసుకొని వచ్చిన పెద్ద ఉలామా గ్రూపు తొలగించింది. ఈ సదస్సులో అన్సారీ "గాంధీని" భయంలేని నాయకుడని, హిందువుకు ఎంత ప్రీతి పాత్రుడో, ముస్లింలకు అంతే ప్రీతి పాత్రమయిన నాయకుడని" ప్రశంసించాడు. 1919 మార్చిలో గాంధీతో సమావేశమైన తరువాత రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా చేపట్టే సత్యాగ్రహానికి మద్దతు తెలిపారు. ఉద్యమం కొరకు ప్రారంభించబడిన సత్యాగ్రహ సభ ప్రచార సాహిత్యాన్ని ప్రచురించడంపై కేంద్రీకరించింది. గాంధీ మార్చి, ఏప్రిల్ తొలిరోజులలో బొంబాయి, ఢిల్లీ, అల్హా ఒక పర్యటనలో నిమగ్నమయ్యాడు. రంగంలో కాంగ్రెసు దాదాపు లేనేలేదు. అప్పటికి దేశంలోని చాలా ప్రాంతాలలో ఆందోళనా రాజకీయాలకు అవసరమైన యంత్రాంగం కాంగ్రెస్‌కి లేదు. అతివాద సంబంధాలలో కొద్దిపాటి యంత్రాంగం గల బెంగాల్, మహారాష్ట్రలలో గాంధీకి బలమైన ప్రతిఘటన ఎదురయింది.

1857 నుండి బ్రిటిష్ వ్యతిరేకత ఉప్పెనలా ఇంతగా ఎప్పుడూ పెల్లుబకలేదు. కాంగ్రెసు సంస్థాగత సన్నద్ధం చాలా పరిమితం. మార్చి నాటికి పెల్లుబికిన ఉప్పెనకి, మార్చినాటికి పెల్లుబికిన ఉప్పెనకి, దానిని ఎదుర్కొనడానికి గల సంసిద్ధతకు ఎక్కడా పోలిక లేదు. మార్చి

నాటికి సత్యాగ్రహ ప్రమాణంపై సంతకాలు చేసిన వారు కేవలం 982 మంది. బొంబాయి నగరంలో 397 మంది, గుజరాత్‌లో 400 మంది, సింధ్‌లో 101 మంది, బొంబాయి ప్రెసిడెన్సీ వెలుపల 84 మంది. ఈ చట్టం తీవ్ర ప్రభావం చూపే పంజాబులో హోంరూలు లీగు సంబంధాలు చాలా బలహీనంగా వున్నాయి. (యుద్ధ కాల నిబంధనల కారణంగా) ఈ ఉపద్రవానికి ముందు పంజాబు సందర్శించడానికి గాంధీకి సమయం చాలా లేదు.

ఇది యుద్ధానంతర ఆర్థిక సమస్యలు గాంధీని గురించి అస్పష్టమైన వదంతులు, ఆర్థిక సమస్యలు, అణచివేతల కలయికతో రాజుకొన్న తిరుగుబాటని హంటర్ కమిషన్, కాంగ్రెసు పంజాబు విచారణ కమిటీ రిపోర్టులు (1920), రవీందర్ కుమార్‌చే ప్రచురించబడిన విలువైన పరిశోధనా పత్రాలు వివరిస్తున్నాయి. ఉద్యమం దాదాపు పట్టణాలకు పరిమితమైనది. దీనిలో పారిశ్రామిక కార్మికుల కంటె దిగువ మధ్య తరగతి గ్రూపులు చేతి వృత్తుల వారు ఎక్కువగా పాల్గొన్నారు. మార్చి 30న, ఏప్రిల్ 6న భారతదేశంలోని చాలా పట్టణాలలో హర్తాల్ జరిగినప్పటికీ అలజడుల ప్రభావం, చాలా ఎక్కువగా వున్న ప్రాంతాలు: అమృత్‌సర్, లాహోర్, గుర్జన్‌వాలా, పంజాబులోని చాలా చిన్న పట్టణాలు, గుజరాతులోని అహ్మదాబాద్, వీరాంగామ్, నాదియాడ్, ఢిల్లీ, బొంబాయి (చాలా తక్కువగా) కలకత్తా.

యుద్ధ కాలంలో నిర్బంధ నియామకాలు, వసూళ్ళు 1915 గదర్ తిరుగుబాట్లు తరువాత తీవ్రమైన అణచివేత, విద్యావంతుల్ని దూషిస్తూ సమయం సందర్భం లేని ఉపన్యాసాలు (కాంగ్రెసు వారు ప్రజలకు సహజమైన నాయకులనే భావంతో ఈ అంశం కాంగ్రెస్ విచారణా కమిటీ రిపోర్టులో అతిశయించి చెప్పబడింది.(పేజి24) లాంటి కారణాలతో లెఫ్టినెంటు గవర్నరు ఒ డయ్యర్ పంజాబు పరిపాలన ప్రజాదరణకి కోల్పోయింది. లాహోర్‌పై రవీందర్‌కుమార్ అధ్యయనం మరికొన్ని ప్రత్యేకమైన అంశాలను పేర్కొన్నది. 1917–19 కాలంలో ఆహార ధాన్యాల ధరలు 100 శాతం పెరగగా చేతి వృత్తుల వారి వేతనాలు కేవలం 20–25 శాతం మాత్రమే పెరిగాయి. పంజాబు పీపుల్స్ బ్యాంక్‌కి చెందిన స్వదేశీ వర్తకుడు హరికిషన్ లాల్ పతనం ఒ డయ్యర్ రహస్య సమ్మతితో జరిగింది. ఈ పతనం ప్రధానంగా లాహోరులోని హిందు వర్తకుల ఆర్థిక ప్రయోజనాలకు పెద్ద ఎదురు దెబ్బ. ముకుందలాల్ పూనారీ, గోకుల్‌చంద్ నారాగ (అలాగే పాత అతివాదులైన రాంభుజదత్, సనాతన్ ధర్మ సభ పోషకుడు రాంశరణ్ దాస్) లాంటి వారితో వ్యాపార సంబంధాలు గల ఆర్య సమాజ్ బారిష్టర్లు బ్రిటిష్ వ్యతిరేక రాజకీయ భావాలను ప్రచారం చేయడం, జర్నలిస్టు జాఫర్ అలీఖాన్ రచనలతో జాతీయవాదం, మొదటి జాతీయ వాద దశలో ఇక్బాల్ కవిత్వంతో (హిందూస్థాన్ హమారదేశభక్తి గీతం రాస్తూ పూజారులు మంత్రాలు వల్లించే కేకలు పెట్టే, ముల్లాలు కేకలు పెట్టే మీ దేవాలయాలు మసీదులు –నాకు చిరాకు కలిగిస్తాయి... నాదేశం మట్టే నాకు దేవుడు' అని ప్రకటించిన తరుణంలో) ప్రేరేపించబడిన ముస్లింల చైతన్యం.

అంతకు ముందు ఆ తరువాత హిందూ ముస్లిం విభజనకు పేరు పడ్డ రాష్ట్రంలో 1919 సంవత్సరం ప్రారంభంలో నెలకొన్న హిందూ ముస్లిం సిక్కుల ఐక్యత ఒడయ్యర్‌ని

ఇతర బ్రిటిషు అధికారుల్ని తీవ్రంగా కలవరపరిచింది. అమృతసర్‌లో మార్చి 30, ఏప్రిల్ 6 హర్తాళ్ళు శాంతియుతంగా జరిగాయి. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఏప్రిల్ 9న జరిగిన రామనవమి ఊరేగింపుని గురించి హంటర్ కమీషన్ వర్ణిస్తూ మహ్మదీయులు చాలా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హిందూ ముస్లిం ఐక్యత పెరుగుదలకు కళ్ళకు గట్టిన ప్రదర్శన. వివిధ మతాలు, కులాలకు చెందిన ప్రజలు ఒకే కప్పులలో త్రాగారు అని పేర్కొన్నారు. అనే రోజు సాయంత్రం అమృత్‌సర్ జిల్లా సత్యపాల్‌కి చెందిన స్థానిక నాయకులకు ద్వీపాంతర వాస శిక్షలు విధించబడ్డాయి. ఢిల్లీ, పంజాబులల్లో గాంధీ ప్రవేశాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేయబడ్డాయి. ఏప్రిల్ 10న అమృత్‌సర్‌లోని హాల్ బ్రిడ్జి సమీపంలో శాంతియుతంగా జరిగిన ప్రదర్శన పై కాల్పులు జరిగాయి. వెంటనే ప్రభుత్వం అధికార చిహ్నాలుగా భావించబడే బ్యాంకులు, పోస్టాఫీసులు, రైల్వేస్టేషను, టౌనుహాలుపై దాడులు జరిగాయి. జనరల్ డయ్యర్ అధ్వర్యంలో ఏప్రిల్ 11 న పట్టణంలో మార్షల్ చట్టం విధించబడినది. ఏప్రిల్ 13న శాంతియుతంగా వున్న ప్రజలు – వారిలో అత్యధికులు గ్రామాల నుండి సంతకి వచ్చినవారు– సమావేశాలపై నిషేధం ఉందని తెలియని ప్రజలు –అన్ని వైపుల గోడలచే మూసివేయబడిన స్థలం జలియన్‌వాలాబాగ్ – ఆ స్థలములో ఆ అమాయక ప్రజలపై ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా డయ్యర్ దాడి చేశాడు. అధికార అంచనాల ప్రకారం 379 మంది చంపబడ్డారు. అనధికార అంచనాలు చాలా రెట్లు ఎక్కువ. డయ్యర్ కూడ హంటర్ కమీషన్ ముందు విచారం వెలిబుచ్చాడు. ప్రజల్ని దారుణంగా చంపినందుకు కాదు. తూటాలు అయిపోయి కాల్చలేని పరిస్థితి ఏర్పడినందుకు, అంతేగాదు ఇరుకుగా వున్న సందుల గుండా ఆయుధాల శకటాన్ని లోపలకి తెప్పించడం సాధ్యపడనందుకు అక్కడి సమస్య ప్రజల్ని చెదరగొట్టడం కాదు. భారత ప్రజల్ని భయ భ్రాంతుల్ని చేయడం. ఈ ఘటన జరిగిన తరువాత వారాలలో లెఫ్టినెంట్ జనరల్ పూర్తి మద్ధతుతో ముందుకు సాగాడు. విచక్షణా రహితంగా అరెస్టులు చేశాడు. చిత్ర హింసలు చేశాడు. బహిరంగంగా కొరడాలతో కొట్టించాడు. లాయర్లచే హీనమైన పనులు చేయించేందుకు స్పెషల్ కానిస్టేబుల్స్‌ని నియమించాడు. స్థానికులచే తెల్లవారికి సలాములు చేయించాడు. ఇంగ్లీషు మహిళ అవమానింపబడిన కుచాకేబయాన్‌వాలా సందులో భారతీయుల్ని మోకాళ్ళు, మోచేతులపై ప్రాకించారు.

లాహోరులో ఏప్రిల్ 6–9 తేదీలలో నిర్వహింపబడిన హర్తాళ్ళు, ప్రదర్శనలు హిందూ ముస్లింల ఐక్యతను చాటిచెప్పాయి. గాంధీ జూనిశిలిజీళీలిదీశి వదంతులు, అమృత్‌సర్ ఘటనలు నగరానికి చేరడంతో ఏప్రిల్ 10న పోలీసులతో హింసాయుత ఘర్షణలు జరిగాయి. ముస్లిం చేతివృత్తులవారు, కార్మికులు సమరశీలంగా ఆందోళనలు, ఘర్షణలలో పాల్గొన్నారు. రాం భుజదత్ లాంటి నాయకులు గుంపుల్ని అదుపు చేసేందుకు వ్యర్థ ప్రయత్నాలు చేశారు. 'ఏప్రిల్ 11న 12000 మంది కార్మికులు పనిచేస్తున్న ముగల్‌పురా రైల్వే వర్క్‌షాపులోను ఇంకా చాలా ఫ్యాక్టరీలలో సమ్మెలు జరిగాయి. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో బ్రిటిషువారు నగరం నుండి వెనక్కి తగ్గి కంటోన్మెంటు ప్రాంతానికి చేరుకొన్నారు. బాద్‌షాహి మసీదు వద్ద పెద్ద సంఖ్యలో వున్న ప్రదర్శకులు పీపుల్స్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఏప్రిల్ 11

నుండి 14 వరకు నగరాన్ని తన అదుపులో ఉంచుకొన్నది. కాని మధ్యతరగతి రాజకీయవేత్తలతో గల ఈ కమిటీని ప్రజలు హటాత్తుగా తమ చేతుల్లో పెట్టిన అధికారాన్ని ఏం చేసుకోవాలో తెలియలేదు. ఒత్తిడి తెచ్చే రాజకీయాలకు అలవాటుపడిన వేరు విప్లవానికి సన్నద్ధం కాలేదు. హర్తాళ్ సమయంలో ఆహారం సరఫరా చేసేందుకు కొన్ని వంటశాలల్ని ఏర్పాటు చేయడం మినహా చేసిందేమీ లేదు. ఏప్రిల్ 13న టౌన్‌హాల్ వద్ద హర్తాళ్ విరమించడానికి చేసిన ప్రయత్నం కూడా ప్రజల ఆగ్రహానికి గురయింది. తాత్కాలికమైన ప్రత్యామ్నాయ సూచనలు ముందుకు వచ్చాయి. ఇంకా సమరశీలమైన నాయకత్వం చమన్‌దిన్ నాయకత్వంలో 40 మంది సభ్యుల దండాఫౌజ్ లాఠీలతో, బొమ్మ తుపాకులతో వీధులలో కవాతు చేసింది. ఓ హిందూ, ముసల్మాన్, సిక్కు సోదరులారా! వెంటనే దండాసైన్యంలో చేరండి, ఇంగ్లీషు కోతులకు వ్యతిరేకంగా పోరాడండి, ఇంగ్లీషు వారితో గల లావాదేవీలు వదులుకోండి. ఆఫీసులు, వర్కుషాపులు మూయండి. పోరాడండి. ఇది మహాత్మాగాంధీ ఆదేశం. బ్రిటిష్‌వారు ఏప్రిల్ 14న సాయుధ బలగాలతో వచ్చారు. పీపుల్స్ కమిటీ నాయకులు దేశ బహిష్కరణ చేయబడ్డారు. ప్రజాఉద్యమం మార్షల్ చట్టాలతో అణచివేయబడింది.

రౌలత్ చట్టం కారణంగా పంజాబులోని 5 జిల్లాల్లో అలబడుల ప్రభావం ఎక్కువగా పడింది. అవి, అమృత్‌సర్, లాహోర్, గుర్జన్‌వాలా, గుజరాత్, లైలాపూర్, సమ్మె జరగనప్పటికీ గుజరాత్, గుర్జన్‌వాలా, లాహోర్, అమృతసర్‌లను ఢిల్లీకి కలిపే వాయువ్య రైల్వే సమ్మె బెదిరింపు బ్రిటిషు వారిని తీవ్ర ఆందోళనకు గురిచేసింది. పట్టణ ప్రాంతాలలోని క్రింది స్థాయి ప్రజల నుండి రైల్వేస్టాఫ్‌కి 'రోగక్రిములు' వ్యాపించాయని హంటర్ కమిషన్ కనుగొన్నది. విస్తృత ప్రజానీకంగా వున్న రైతాంగం పై అలజడుల ప్రభావం లేదని కాంగ్రెసు కమిటీ ఇచ్చిన రిపోర్టుతో హంటర్ కమీషన్ ఏకీభవించింది. అలజడుల స్వభావం అన్నిచోట్ల ఒకే విధంగా వుంది. ప్రభుత్వ భవనాలమీద ప్రసార సాధనాల మీద చెదురు మదురుగా దాడులు జరిగాయి. (ఏప్రిల్ 10–12 తేదీల మధ్య టెలిగ్రాఫ్ లైన్లకు అంతరాయం కలిగించిన ఘటనలు 54) ఆ తరువాత క్రూరమైన, పాశవికమైన అణచివేత చేపట్టబడింది. ఏప్రిల్ 14న గుర్జన్‌వాలా ఆ పరిసర గ్రామాలలో విమానాల నుండి బాంబులు వేయబడ్డాయి. మార్షల్ చట్టం మేరకు నియమించబడిన కోర్టులు 258 మందిని కొరడాలతో కొట్టించాయి. ముక్కుల్ని నేలపై రుద్ధించడం, ప్రజలందరినీ నిప్పులు చెరిగే మండుటెండలో రోజంతా నిలబెట్టడం లాంటి పైశాచికానందం పొందే శిక్షలు విధించబడ్డాయి. మే 1న 11సం॥ల బాలుడు బ్రిటిషురాజు పై యుద్ధానికి కాలు దువ్వాడనే ఆరోపణతో) ప్రజల హింసకి, ప్రభుత్వ హింసకి పోలికే లేదని కాంగ్రెసు రిపోర్టు స్పష్టం చేసింది. ఆ రిపోర్టు ననుసరించి పంజాబు అంతటా నలుగురు తెల్లవారు చంపబడ్డారు. ప్రభుత్వ హింసలో 1200 మంది భారతీయులు చంపబడ్డారు. 3600 మంది తీవ్రంగా గాయపరచబడ్డారు.

1912లో రాజధానిని ఢిల్లీకి మార్చిన తరువాత ఢిల్లీలో రాజకీయ చైతన్యం పెరిగింది. 1917 ఫిబ్రవరి నుండి అన్సారీ నాయకత్వంలో హోంరూలు లీగు శాఖ చురుకుగా పనిచేయడం

ప్రారంభించింది. నగరం అఖిల ముస్లిం ప్రపంచవాద కార్యకలాపాలకు కేంద్రమయింది. దిగువ మధ్యతరగతి హిందువులపై శ్రద్ధానంద పలుకుబడి పెరిగింది. 1918 నవంబరు, 1919 ఫిబ్రవరి మధ్య కాలంలో ప్రాంతీయ భాషలలో మూడు వార్తాపత్రికలు ప్రారంభించ బడ్డాయి. ఈ పత్రికల సంపాదకులు (కాంగ్రెసు, ఇంక్విలాబ్‌లకు చెందిన ఇంద్ర విజయ, అసిఫ్ హుస్సేన్ హాస్వి, ఖయూమ్ ఎడిటర్ ఖాజి అబ్బాస్ హుస్సేన్) అప్పటికే నాయకులుగా గుర్తింపు పొందిన అన్సారీ హకీం అజ్మల్‌ఖాన్‌ల కంటె 1919 ఏప్రిల్‌లో చాలా ముఖ్యమైన పాత్ర నిర్వహించారు. డి.ఎఫ్. ఫెర్రిల్ అధ్యయనం ఆర్థిక అంశాల ప్రాధాన్యతను గూడ గుర్తించింది. ఇక ఫ్లూయంజను విషజ్వరం 7000 మంది ప్రాణాలు బలిగొంది. ఉప్పు ధర 1914 ధరకి నాలుగు రెట్లయింది. కిరసనాయిలు అసలు మార్కెటు నుండి అదృశ్యమయింది. హిందూ వర్తకులు యుద్ధ పన్నులతో విసిగి వేసారి పోయారు. చేతివృత్తుల వారి (ప్రధానంగా ముస్లింలు) పనులకు గిరాకీ తగ్గింది. ఉదాహరణకు లేస్ అండ్ ఎంబ్రాయిడరీ వర్తకంలో 1911లో 18000 మంది పనిచేస్తుండగా 1921 నాటికి వారి సంఖ్య 4000కి పడిపోయింది. రౌలత్ ఉద్యమం ఢిల్లీలో మూడు దశలుగా సాగింది. మార్చి 30 హర్తాళ్ సందర్భంగా రైల్వేస్టేషన్, చాందినీ చౌక్‌వద్ద పోలీసు కాల్పులు జరిగాయి. తరువాత కాస్త స్తబ్ధత చోటు చేసుకుంది. ఈ కాలంలో జమామశీదు వద్ద పెద్ద ప్రదర్శన (ఏప్రిల్ 4న) జరిగింది. అక్కడ ముస్లిమ్‌లు హిందువులు స్వామి శ్రద్ధానంద పాదాలు స్పృశించి ముద్దాడారు. గాంధీజీ అరెస్టు వార్తతో ఏప్రిల్ 10 నుండి 18 వరకు నిరంతరాయమైన హర్తాళ్ కొనసాగింది. బ్యాంకు గుమాస్తాలు, సమ్మె చేశారు. ఏప్రిల్ 13న రైల్వే సమ్మె ప్రయత్నం జరిగింది. లాహోర్‌లో లాగానే దిగువ తరగతి సమరశీలత నాయకుల్ని జర్నలిస్టుల్ని కలవరపరచింది. భయభ్రాంతుల్ని చేసింది. మధ్యతరగతి, దిగువతరగతి ప్రజలమధ్య ఎంత త్వరగా అసాధారణ మైత్రి ఏర్పడిందో అంత త్వరగా నీరు కారిపోయింది. (ఫెర్రెల్) ఏప్రిల్ 17 చాందినీ చౌక్‌వద్ద మరోసారి కాల్పులు జరిగిన తర్వాత నగరం సాధారణ స్థితికి చేరుకొంది.

గాంధీపై చర్య వార్తతో ఏప్రిల్ 11న అహ్మదాబాద్‌లో హింసాయుత తిరుగుబాటు చెలరేగింది. మూకలు ప్రధానంగా జౌళి కార్మికులు 51 ప్రభుత్వ భవనాల్ని తగులబెట్టారు. తరువాత మార్షల్ చట్టంతో ప్రభుత్వం చేపట్టిన అణచివేతలో 28 మంది చనిపోయారు. 123 మందికి గాయాలయ్యాయి. ఏప్రిల్ 12న మిల్లు కార్మికులు, వీరాంగామ్ పట్టణంలో కూడ విధ్వంసం కొనసాగించారు. బొంబాయిలో ఏప్రిల్ 10, 11 రెండు రోజులు వరుసగా జరిపిన హర్తాళ్ ఇంచుమించు శాంతియుతంగా జరిగింది. పారిశ్రామిక కార్మికుల కంటే గుజరాత్ వర్తకులు, వృత్తిపరమైన గ్రూపులు చురుకుగా పాల్గొన్నారు. (ప్రదర్శనలు, కార్మికుల కేంద్రమైన డరేల్ గాక దక్షిణ మధ్య బొంబాయి (వార్డులు సి, డి) ప్రదర్శనల కేంద్రమయింది. గాంధీ అక్కడ ఉండడం వలన ప్రదర్శనలు అదుపులో వున్నాయి. ఖేదా జిల్లాలోని 'నాదియాడ్'లో అహ్మదాబాద్ నుండి ఏప్రిల్ 11న వచ్చిన గాంధీ అనుచరుని విజ్ఞప్తి కారణంగా హింస నివారించబడింది. (హంటర్ రిపోర్టు) బొంబాయి ప్రభుత్వం కూడ పంజాబులో కాకుండా ఆచితూచి స్పందించింది.

కలకత్తాలో ఏప్రిల్ 6–11 తేదీలలో హర్తాళ్ళు జరిగాయి. ఏప్రిల్ 11న నాఖోజ మసీదు వద్ద పెద్ద హిందూ ముస్లింల ఉమ్మడి ప్రదర్శన నిర్వహించబడింది. ఏప్రిల్ 12న హారిసన్ రోడ్డులో చిత్పూర్ –ఘర్షణలు జరిగాయి. బ్రిటిషు సైనికులు మర తుపాకులు ప్రయోగించి 9 మందిని చంపారు. కలకత్తా ప్రదర్శనలలో స్వదేశీ ఉద్యమకాలంలో పాల్గొన్నట్లు బెంగాలీ విద్యార్థులు అంతగా పాల్గొనలేదు. గ్రామీణ ప్రాంతాలనుండి వచ్చిన హిందువులు, మార్వాడీలు, ముస్లింలు పాల్గొన్నారు. మద్రాసు నగరంలో నిరసన శాంతియుతంగా జరిగింది కానీ బీచ్‌లో చాలాపెద్ద ఎత్తున కార్మికుల బహిరంగ సభలు జరిగాయి. ఈ సభలలో 'మద్రాసు కార్మిక సంఘం 1918' నిర్మాతలలో ముఖ్యుడు, కాంగ్రెసు వాది అయిన టి.వి. కళ్యాణ సుందర మొదలియార్ (తిరువిక) 1908 టుటికోరిన్ సమ్మెకి నాయకత్వం వహించిన అతివాద ప్రముఖుడు సుబ్రమణ్యశివ లాంటి ప్రముఖులు ప్రసంగించారు. దేశంలోని ఇతర ప్రాంతాలలో స్పందన అంతంత మాత్రంగా వుంది. ఉదాహరణకు సెంట్రల్ ప్రావిన్సులో హర్తాళ్‌తో పూర్తిగా గాని, పాక్షికంగాని ప్రభావితమైన ప్రాంతాలు ఛింద్వానా, అకోలా, అమరావతి మాత్రమే.

గతంలో ఎన్నడూ లేనంతగా చేపట్టిన అణచివేత కొంతకాలం పాటు రాజకీయ వేత్తలలో చాలామందిని భయభ్రాంతుల్ని చేసినట్లుంది. ఉదాహరణకు కలకత్తాలో బహిరంగ నిరసన సమావేశం జరపడం అసాధ్యమయింది. నైట్‌హుడ్‌ని త్యజిస్తూ లేఖ రాయడం ద్వారా (1919 మే 30) జాతి యొక్క ఆందోళన ఆగ్రహావేశాలు వ్యక్తీకరించడం రవీంధ్రనాథ్ ఠాగూర్‌కు వదిలివేయబడింది. పంజాబు భయోత్పాతానికి కాంగ్రెసు స్పందనగా విచారణ కమిటీని నియమించమని అర్థించడానికి పరిమితమయింది. ఇక గాంధీ విషయానికి వస్తే విస్తృతమైన స్థాయిలో హింస ప్రత్యేకించి తన స్వస్థలమైన అహ్మదాబాద్‌లో జరగడం అత్యంత పెద్ద తప్పిదంగా (ఏప్రిల్ 18) అంగీకరించడానికి దారితీసింది. గాంధీ వెంటనే సత్యాగ్రహాన్ని విరమించాడు. అప్పటి నుండి గాంధీ తగిన సంస్థాగతమైన, సిద్ధాంతపరమైన సన్నద్ధత, అదుపు సాధించి ఉద్యమాలు నడపడంలో చాలా జాగ్రత్త వహించాడు.

హింసాయుత కార్యక్రమాలలో పాల్గొన్నవారు గాక ఇతర ఖైదీలకు విడుదల కలిగించిన తాత్కాలిక ఆశలతో పాటు 1919 డిశంబరు సంస్కరణలకు ఆమోదం తెలపడం – అదే నెలలో అమృత్‌సర్ కాంగ్రెస్‌లో ఆశ్చర్యకరమైన పొందికల్ని వివరిస్తుంది. గత ఏడాది ఢిల్లీ సదస్సులో కాంగ్రెసు మాంట్‌ఫర్డు సంస్కరణల్ని తిరస్కరించాలని నిర్ణయించింది. మితవాదులు కాంగ్రెసు నుండి చీలిపోయి సప్రూజయకర్, చింతామణి నాయకత్వంలో నేషనల్ లిబరల్ అసోసియేషన్ స్థాపించారు. కాని అమృత్‌సర్‌లో మాంటేగ్‌కి ధన్యవాదాలు తెలుపుతూ కొత్త కౌన్సిళ్ళలో పనిచేయడంలో సహకరిస్తామని చేసిన తీర్మానానికి గాంధీ పూర్తి మద్ధతు తెలిపాడు. గాంధీ వ్యతిరేకించినప్పటికి, సి.ఆర్.దాస్, తిలక్, రాంభుజ్‌దత్ చౌదురి, హర్సత్ మోహానిల ఒత్తిడి మేరకు చట్టం నిరాశాజనకంగా వుందని వర్ణించిన క్లాజు చేర్చి తీర్మానం ఆమోదించబడింది. కౌన్సిలు బహిష్కరణ, సహాయ నిరాకరణ గాంధీ ఒత్తిడి చేయడం, దాస్, తిలక్ అనుచరులు వెనక్కు తగ్గడం, ఖిలాపత్ ఉద్యమం ద్వారా గాంధీ కాంగ్రెస్‌ని, మొత్తం

జాతీయ రాజకీయాల్ని శాసించే స్థితికి చేరుకోవడం – లాంటి పరిణామాలతో 1920 నాటికి సమీకరణలు పూర్తిగా మారిపోయాయి.

## 1919 -20 నాయకులు - ప్రజలు

### గాంధీ - ఖిలాఫత్ - కాంగ్రెస్

1919 –20 కాలంలో గాంధీ జాతీయ నాయకత్వాన్ని తన అధీనంలోకి తెచ్చుకొనే క్రమం మొత్తాన్ని నిపుణతతో గూడిన పైస్థాయి రాజకీయ చదరంగంలా చెప్పడానికి ప్రాధాన్యతనిస్తూ రిచార్ గోర్డన్, జూడిత్ బ్రౌన్‌చర్డ్ ఫ్రాన్సిస్ రాబిన్‌సన్‌ల ఇటీవల రచనలు చాలా వివరంగా వర్ణించాయి.

ఓడిపోయిన ఒట్టమాన్ సామ్రాజ్యంపై కఠినమైన షరతులతో శాంతి ఒప్పందాన్ని రుద్దనున్నారనే వదంతులు వాస్తవరూపం దాల్చుతుండడంతో 1919 –20లో ఖిలాఫత్ ఉద్యమం వేగం పుంజుకొన్నది దాని మూడు ప్రధానమైన డిమాండ్లను మహమ్మదాలి 1920 మార్చిలో దౌత్య నీతిజ్ఞులకు నివేదించారు.

**అవి :** ముస్లిం పవిత్ర స్థలాలపై టర్కీ సుల్తాన్ ఖలీఫాకు అదుపు ఉండాలి. ఇస్లాం మత విశ్వాసాలను పరిరక్షించడానికి టర్కీ సుల్తాన్‌కు తగినంత భౌగోళిక ప్రాంతం వదిలి వేయబడాలి. జజిరత్ – ఉల్ –అరబ్ (అరేబియా, సిరియా, ఇరాక్, పాలస్తీనా) ముస్లిం సార్వభౌమాధికారంలో వుండాలి. ఊహించిన విధంగానే ఉద్యమం మితవాద, అతివాద పద్ధతులలో అభివృద్ధి చెందింది. మొదటి వైఖరి ఛోటాని లాంటి సంపన్న బొంబాయి వర్తకులచే కేంద్రీకరించింది. రెండవ వైఖరికి చెందిన (అతివాద) వారిలో దిగువ మధ్యతరగతి జర్నలిస్టులు యునైటెడ్ ప్రావిన్సెస్, బెంగాల్, సింధు, మలబారులలోని చిన్న పట్టణాలపై, గ్రామాలపై పలుకుబడి గల ఉలేమాలు, బొంబాయి నాయకులు (ఉద్యమం ప్రజలలో విస్తరించి, నిధులు వసూలు చేయగలిగే వరకు అదుపు తమ చేతుల్లో పెట్టుకొనగలిగిన వారు) ఆందోళనలకు, సభలు, సమావేశాలకు, విజ్ఞప్తులకు, ప్రాతినిధ్యాలకు పరిమితం చేయాలని ఆశించారు. 1920 ప్రారంభంలో నిర్బంధం నుండి విడుదలైన ఆలీ సోదరుల నాయకత్వంలోని ఖిలాఫత్ ఉద్యమకారులు దేశ వ్యాప్తంగా హర్తాళ్‌కి పిలుపివ్వాలని (1919 అక్టోబరు 17, 1920 మార్చి 19లోగా) ఒత్తిడి తెచ్చారు. ఈ గ్రూప్ 1919 నవంబరు 22–23 లలో అఖిల భారత ఖిలాఫత్ ఢిల్లీ సదస్సులో మొట్టమొదటి సారిగా సహాయ నిరాకరణ పిలుపునిచ్చింది

మధ్యవర్తిత్వ పాత్ర నిర్వహిస్తూ గాంధీ రెండు గ్రూపులకు కీలకమైన వ్యక్తి అయ్యాడని జూడిత్ బ్రౌన్ పేర్కొన్నారు. హిందూ రాజకీయవేత్తలతో ఆయనకు సన్నిహిత సంబంధాలున్నాయి. ఖిలాఫత్ నాయకులు హిందూ ముస్లిం ఐక్యత పట్ల చాలా ఆతురతగా వున్నారు. ఐక్యత సాధించలేకపోతే కౌన్సిళ్ళ బహిష్కరణతో కూడిన సహాయ నిరాకరణ అసాధ్యమవుతుంది. వారి ఆత్రుత బక్రీద్ పండుగ సందర్భంగా ఆవుల్ని చంపరాదని డిసెంబరు 1919 ముస్లింలీగు తీర్మానంలో స్పష్టంగా వ్యక్తమయింది. మేళ తాళాలు వాయించడం హిందు మతం నుండి

విడదీయరాని మతాచారం కాదు. బక్రీదు మతపరమైన పండుగ. అయినప్పటికీ అప్పుడు గాని ఆ తరువాత గాని హిందూ నాయకులు మసీదుల ఎదుట మేళ తాళాలు ఆపివేస్తామని ఎప్పుడూ ప్రకటించలేదు. 1920 మే వరకు గాంధీ బొంబాయి గ్రూపుని బలపరిచాడు. 1919 నవంబరు ఖిలాఫత్ సదస్సులో బ్రిటిషు వాస్తవ్యుల్ని బహిష్కరించమని హస్రత్ మొహానీ పిలుపుని వ్యతిరేకించారు. (బొంబాయి ముస్లిం వరకుల్తలలోని అత్యధికులు బ్రిటిషు వస్తువుల, దిగుమతి దారులు, చిల్లర వర్తకులు) 1920 మే 14న టర్కీ ఒప్పందంలోని కఠినమైన షరతుల ప్రచురణ, ఆ తరువాత పంజాబు అలజడులపై మే 28న హంటర్ కమిషన్ రిపోర్టు ప్రచురణ – ఘటనలతో గాంధీ తన వైఖరిని మార్చుకొన్నారు. భారత దేశ ప్రభుత్వం అప్పటికే తన అధికారుల్ని చట్టంతో రక్షణ కల్పించింది. ఒ డయ్యర్ ఆరోపణల నుండి విముక్తుడయ్యాడు. డయ్యర్ పై మందలింపును హౌస్ ఆఫ్ లార్డ్స్ (పెద్దల సభ) త్రోసిపుచ్చింది. జలియన్ వాలాబాగ్ నరహంతకునికి 'మార్నింగ్ పోస్టు' 26000 పౌనుల పర్సుని బహూకరించింది.

అల్హాబాద్‌లో జరిగిన సెంట్రల్ ఖిలాఫత్ కమిటీ సమావేశానికి (1920 జూన్ 1–3) చాలామంది జాతీయవాద హిందూ నాయకులు హాజరయ్యారు. (దీనిలో గాంధీ మద్దతు పొందిన రాడికల్స్ విజయం సాధించారు) నాలుగు దశలు గల సహాయ నిరాకరణ కార్యక్రమం ప్రకటించబడింది. (బిరుదుల బహిష్కరణ, సివిల్ సర్వీసు బహిష్కరణ, పోలీసు బహిష్కరణ, చివరగా పన్నుల చెల్లింపు నిరాకరణ) పంజాబ్ తప్పిదం, ఖిలాఫత్ తప్పిదం, స్వరాజ్యం – అనే మూడు సమస్యలపై ప్రచారం నిర్వహించవలసినదిగా గాంధీ కాంగ్రెసుపై ఒత్తిడి చేశాడు. స్వరాజ్యాన్ని నిర్వచించడం ఉద్దేశపూర్వకంగా వదిలి వేయబడింది. తొలుత పూర్తి మద్ధతు గుజరాతు, బీహారుల నుండి మాత్రమే లభించింది. మోతీలాల్ నెహ్రూ, (తన కొడుకులా గాక) కీలకమైన కౌన్సిలు ఎన్నికల (1920 నవంబరులో జరుగుచున్న) బహిష్కరణ సమస్యపై మొదట ఊగిసలాడాడు

సిఆర్ దాసు, తిలక్ అనుచరులు తీవ్రంగా వ్యతిరేకించారు. 1920 సెప్టెంబరు – డిశంబరు మధ్య కాలంలో గాంధీ కార్యక్రమానికి అనుకూలంగా సువ్యవస్థితులైన నాయకుల నాటకీయ మార్పుని గోర్డన్, బ్రౌన్ ఎన్నికలలో విజయావకాశాల పరంగా వివరించారు. జూన్ మధ్యలో ప్రకటించిన పంజాబు ఎన్నికల నిబంధనలు ప్రకారం పట్టణ హిందూ పునాదిగా గల కాంగ్రెసు గెలుపు అవకాశాలు అంతగా లేనందున లజపతిరాయ్ ఎన్నికల బహిష్కరణని జూన్ 25న బలపరిచాడు. దీనికి భిన్నంగా ఎన్నికయ్యే అవకాశాలు బాగా వున్న గతములో అతివాద స్థావరాలుగా వున్న బెంగాల్, మహారాష్ట్రలలో కౌన్సిలు బహిష్కరణకు వ్యతిరేకత బలంగా వున్నది. యు.పి. కాంగ్రెసు సంస్థాపరంగా ఎన్నికలకు సన్నద్ధంగా లేదని మోతీలాల్ గుర్తించాడు. ఆయన మద్ధతు కలకత్తా స్పెషల్ కాంగ్రెసు (1920 సెప్టెంబరు 4–9) లో నిర్ణయాత్మకంగా మారింది. కలకత్తా కాంగ్రెసు బిరుదుల్ని త్యజించడం మూడు రకాల బహిష్కరణ (పాఠశాల, కోర్టులు, కౌన్సిళ్లు) విదేశీ వస్తువులు బహిష్కరణ, మధ్యవర్తిత్వం నడిపే కోర్టులు ఖాదీ ప్రచారం – కార్యక్రమాన్ని 144–132 ఓట్లతో పరిమిత కమిటీ ఇంకా ఎక్కువ తేడాతో సాధారణ సదస్సు ఆమోదించాయి. కాని ఇక్కడ పోలీసు, సైన్యం – ఇతర ఉద్యోగాల నుండి

రాజీనామాల ప్రసక్తి, పన్ను నిరాకరణ సమస్యగాని ప్రస్తావనకి రాలేదు. నాగపూర్ కాంగ్రెస్‌లో (1920 డిశంబరు) సి.ఆర్.దాస్ వైఖరి నాటకీయంగా మారిపోయింది. బెంగాల్ నుండి పెద్ద ప్రతికూల ప్రాతినిధ్యం చేసేందుకు రు 36000/- లు ఖర్చు పెట్టిన సి.ఆర్.దాస్ అహింసాయుత సహాయ నిరాకరణ పథకం మొత్తాన్ని గాని దానిలో కొంత భాగాన్ని గాని అమలు జరపడాన్ని స్వచ్ఛందంగా ప్రభుత్వంతో సహకరించే పద్ధతిని విడనాడడం, మరొకవైపు పన్నుల చెల్లింపు నిరాకరణ భారత జాతీయ కాంగ్రెసు లేక ఎ.ఐ.సి.సి. నిర్ణయించిన సమయంలో చేపట్టడాన్ని అంగీకరించవలసినదిగా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఏమైతేనేం కౌన్సిలు ఎన్నికలు జరిగాయి. సంవత్సరంలో స్వరాజ్యం అన్న గాంధీ వాగ్దానం (మొదటిసారిగా సెప్టెంబరు 22 యంగ్ ఇండియా వ్యాసంలో చేయబడింది) లో ఇమిడి ఉన్న అర్థం. నిర్థిష్ట కాలంలో సహాయ నిరాకరణ ద్వారా స్వరాజ్యం రాకపోతే మొత్తం సమస్యని తిరగతోడతాం అని చెప్పడం కావచ్చు) మొట్ట మొదటిసారిగా కాంగ్రెస్ మొత్తం గాంధీ పాదాల వద్ద మోకరిల్లింది. 'అన్ని చట్టబద్ధమైన శాంతియుత విధానాల ద్వారా స్వరాజ్య సాధన అని సాంప్రదాయం మార్చబడింది. స్వరాజ్యానికి అర్థం వివరణ లేకుండా అస్పష్టంగా వదిలివేయబడింది. మొట్ట మొదటిసారిగా కాంగ్రెస్‌ని నిజమైన ప్రజల రాజకీయ పార్టీగా చేసేందుకు కాంగ్రెస్ సంస్థలో గాంధీ పట్టుదల కారణంగా కీలకమైన మార్పులు చేయబడ్డాయి. అవి. క్రమబద్ధమైన నాలుగణాల సభ్యత్వం గ్రామ-తాలూకా- జిల్లా లేక పట్టణ కమిటీల శ్రేణి, జనాభా నిష్పత్తితో ప్రతినిధుల్ని నిర్ణయించే పద్ధతిలో భాషా ప్రాతిపదికన పి.సి.సి.ల పునర్నిర్మాణం, కార్యనిర్వాహక బాధ్యతలు నిర్వహించేందుకు 15 మందితో వర్కింగ్ కమిటీ నిర్మాణం.

## క్రింది నుండి ఒత్తిడులు

నాయకులు సహాయ నిరాకరణకు ఆమోదం తెలపడం ఎన్నికల అంచనాలు కొంతపాత్ర నిర్వహించి వుండవచ్చు. కాని ఇక్కడ కూడా ఖిలాఫత్ పంజాబు సమస్యలు కలిగించిన భావోద్రేకాల్ని ఆగ్రహావేశాల్ని తక్కువగా అంచనావేయకూడదు. "నీవు పంపిన హంటర్ రిపోర్టు చదివినప్పటి నుండి నా రక్తం సలసల కాగుతుంది. మనం కాంగ్రెస్ సమావేశాన్ని జరిపి నీచులకు అసలైన నరకం చూపాలి. (మోతీలాల్ నెహ్రూ, జవహర్‌లాల్‌కి 1920 జూన్ 27) అట్టడుగు ప్రజలు ఉప్పొంగే తీవ్రమైన చర్యలు చేపట్టక తప్పని పరిస్థితులు ఖిలాఫత్ కాంగ్రెస్‌కు కల్పించాయని సాక్ష్యాధారాలు చూపించారు. 1920 ఆగష్టులో భాగల్పూర్‌లో జరిగిన బీహారు ప్రొవిన్షియల్ సదస్సుకు 180 మంది రైతు ప్రతినిధులు హాజరయి సహాయ నిరాకరణ తీర్మానం ఆమోదం పొందడానికి కారకులయ్యారు. కలకత్తాలో సబ్జక్ట్స్ కమిటీ (సాధారణ సభ) లో ఓట్ల సంఖ్యలో వచ్చిన విపరీతమైన భేదం, కాంగ్రెస్ చరిత్రలో ఎన్నడూ లేనంత సంఖ్యలో నాగపూర్ కాంగ్రెస్‌కి 14,582 మంది ప్రతినిధులు హాజరు కావడం కలకత్తా, నాగపూర్‌లలో గాంధీకి కీలకమైన మద్దతు, దేశ వ్యాప్తంగా మార్వాడీ వర్తకుల నుండి, ముస్లిం ఖిలాఫత్‌వాదుల నుండి, భాషల ప్రాతిపదికన రాష్ట్రాల పునర్నిర్మాణం జరగాలని చేస్తున్న ఆంధ్రుల డిమాండుని చేపట్టి నాగపూర్‌లో కాంగ్రెస్ నూతన నిబంధనావళిలో ఆ అంశాన్ని

చేర్పించడంతో ఆంధ్రుల నుండి మద్ధతు లభించింది. ఎక్కడో దూరాన వున్న అవాస్తమైన ఖిలాఫత్ సమస్య క్రింది స్థాయిలో చేయబడిన వివిధ వ్యాఖ్యానాలతో ప్రజల్ని కదిలించ గలిగింది. యు.పి.లోని దిగువ తరగతి ముస్లింలు ఖిలాఫత్‌కి ఉర్దూ మాట అయిన ఖిలాప్ (వ్యతిరేకంగా) తో సంబంధం గల మాటగా భావించి అధికారానికి వ్యతిరేకంగా సాధారణ తిరుగుబాటుకి సంకేతంగా ఉపయోగించుకొన్నారు. మలబార్‌లో ప్రశాంత జీవితం గడిపే మోప్లాలు భూస్వామ్య వ్యతిరేక తిరుగుబాటుకి సంకేతంగా మారారు.

ముస్లిం భావోద్రేకాల్ని రెచ్చగొట్టిన, ఆకాంక్షల్ని ఆకట్టుకొన్న మరొక అంశం అఫ్ఘనిస్తాన్ అమీర్ అమానుల్లా ఖాన్ యొక్క బ్రిటిషు వ్యతిరేక వైఖరి. అమానుల్లా ఖాన్ బ్రిటిషిండియాతో 1919 మే, జూన్‌లో యుద్ధంచేశారు. బోల్షివిక్ రష్యాతో సంబంధాలు పెంచుకొన్నారు. 1920 జూన్‌లో 20,000 మందికి పైగా ముస్లిముహాజిర్లు ఖలీఫాని అగౌరవపరిచిన ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు సింధు నుండి వాయువ్య సరిహద్దు రాష్ట్రం నుండి ఆఫ్ఘనిస్తాన్‌లోకి చొచ్చుకుపోయారు.

1920 ఆగష్టులో 'జమీందార్' సంపాదకుడు జాఫర్ ఆలీఖాన్ ప్రసంగిస్తూ 'ఇస్లాం రక్షకుడు అవతరించే సమయమిది' అని ప్రకటించినందుకు ఐదేళ్ళ ద్వీపాంతర వాసశిక్ష విధించబడింది. 'సంవత్సరంలో స్వరాజ్యం అనే గాంధీ వాగ్దానం కూడా స్వర్ణయుగపు ఆశలను పెంచాయి. అన్నింటిని మించి 1919, 1920 సంవత్సరాలు, కార్మికులు, అశాంతి, కార్మిక సంఘాల నిర్మాణం, రైతుల చైతన్యం – పెరిగిన సంవత్సరాలు. ఈ అంశాల్ని కేంబ్రిడ్జి పండితులు పూర్తిగా విస్మరించారు.

సమకాలీన అధ్యయనాలు 1919 సంవత్సరాంతంలో 1920 ప్రారంభంలో ఉవ్వెత్తుగా లేచిన సమ్మె కెరటాల జాబితా యిది. 1919 నవంబరు 4 నుండి డిశంబరు 2 వరకు కాన్పూర్ ఊలుమిల్లు నుండి 7000 మంది వీధుల్లోకి వచ్చారు. యన్.యల్ హాల్దార్, బింకేష్ చక్రవర్తిలచే స్థాపించబడిన జంషెడ్‌పూర్ కార్మిక సంఘం 1920 ఫిబ్రవరి సమ్మె కాలంలో టాటా కార్మికులకు సర్దుబాటు వైఖరితో గూడిన తప్పుడు మార్గదర్శకత్వాన్ని ఇచ్చింది. తొలినాటి కార్మిక నాయకుల తరపున ఎక్కువగా మాట్లాడినవాడు బాప్టిస్టా. బాప్టిస్టా వైస్ ప్రెసిడెంటు, దివాన్ చమన్‌లాల్ రు 500/– లు వేతనంతో కార్యదర్శి బొంబాయి ఎఐటియుసి ప్రారంభ సదస్సులో 1920 అక్టోబర్ 31న కార్మికుల స్థాయిని పెంచుతూ మాట్లాడుతూ "ఉన్నతమైన భాగస్వామ్యమనే ఆలోచన... వారు (కార్మికులు, యజమానులు) భాగస్వాములు, సహకార్మికులు, శ్రమని అమ్మేవాళ్ళు, కొనేవాళ్ళు కాదు అన్నారు. కాని అప్పటికే కొద్ది మంది వ్యక్తుల గ్రూపులో మార్క్సిజం వైపు మొగ్గు చూపడం ప్రారంభించారు. బొంబాయి యువ విద్యార్థి తిలక్ అనుచరుడిగా రాజకీయాలలో ప్రవేశించి 1920 –21 నాటికి లెనిన్ అనుచరుడుగా మారాడు. అలాగే మద్రాస్‌కు చెందిన లాయర్ సింగారు వేలు చెట్టియార్ మొట్ట మొదటి ఎ.ఐ.టి.యు.సి సదస్సుకి లాలాలజపతిరాయ్ అధ్యక్షత వహించి, భారత రాజకీయ నాయకులలో అగ్రగణ్యులు (మోతీలాల్ నెహ్రూ, వల్లభాయ్‌పటేల్, అనిబిసెంటు, జిన్నా) హాజరయినప్పటికీ గాంధీ మాత్రం

కనీసం ఒక సందేశం కూడా పంపించకుండా దూరంగా వుండడం గమనించవలసిన అంశం. ఆయన అహ్మదాబాద్, హుజూర్ మహాజన్ సంఘం పూర్తి మితవాద గ్రూపులు అదుపులో వున్నప్పుడు కూడా ఎ.ఐ.టి.యు.సి.తో అనుబంధాన్ని కోరలేదు. అహింసాయుత రాజకీయ సాధారణ సమ్మె అస్త్రాన్ని ఎప్పుడూ కూడా సహాయ నిరాకరణ ఆయుధాగారంలో ప్రవేశించడానికి అనుమతించలేదు.

రాజకీయంగా వెనుకబడిన రాజస్థాన్‌లో శతాబ్దం ప్రారంభం నుండి కొనసాగుతున్నది. ఫ్యూడల్ వ్యతిరేక రాజకీయ అలజడి 1920 లలో కొత్త శిఖరాలకు చేరింది. విల్కిన్సన్ యొక్క 'రాజపుటానా ఏజన్సీ రిపోర్టు 1925 అశాంతికి మేవార్ స్థావరమయిందని వర్ణించింది. 'ప్రజలందరూ సమానులని' రాజద్రోహులు బోధిస్తున్నారు. భూమి రాజ్యానిది కాదు, భూస్వాములది కాదు. ప్రజలది, 'క్రామేడ్' అనే మాటను వారి ప్రాంతీయ భాషలలోకి తర్జుమా చేసుకొని వాడవలసినదిగా ప్రజలకు బోధిస్తున్నారు. ఉద్యమం తొలుత మహారాణాకి వ్యతిరేకంగా ప్రారంభమయింది. త్వరలో అది బ్రిటిషు వ్యతిరేక రూపం దాల్చి ప్రక్కనున్న బ్రిటిషు ప్రాంతాలకు విస్తరించవచ్చు. దీనిలో కొంత అతిశయోక్తులుండవచ్చు. కాని విజయ్‌సింగ్ పథక్, మాణిక్‌లాల్ వర్మలు పాత స్థావరమైన బిజోలియా చుట్టూ శక్తివంతమైన కిసాన్ ఉద్యమాన్ని నిర్మించారు. పన్నులు వెట్టిచాకిరి తగ్గింపు లాంటి కొన్ని రాయితీలకు 1922 లో జాగీర్దారు నుండి పొందారు. ఈ కాలంలోనే మోతీలాల్ తేజావత్ అనే చిన్న వ్యాపారి గాంధీ శిష్యునిగా ప్రకటించుకొని భిల్లు తెగల వారిని నిర్మాణబద్ధం చేయడం ప్రారంభించారు. మార్వార్‌లో జయనారాయణ్ వ్యాస్ శిస్తు పన్నుల రద్దు ప్రచారం చేపట్టారు. బిజోలియా ఉద్యమానికి కాన్పూరు ప్రాంతంలో ప్రచారం ఇచ్చిన యు.పి. కాంగ్రెసు నాయకుడు గణేశ్ శంకర్ విద్యార్థితో పాధిక్ సన్నిహిత సంబంధాలు పెంచుకొన్నాడు. మేవాడ ప్రభుత్వాన్ని మందలించవలసిందిగా 1921 కాంగ్రెస్‌లో చేసిన ప్రతిపాదనని మదనమోహన్ మాలవ్యా అడ్డుకొన్నాడు. ఉదయ్‌పూర్ మహా రాణా తన స్నేహితుడని, రైతులకు రాయితీలు ఇవ్వవలసినదిగా తాను నచ్చచెప్పగలనన్నాడు.

ఉత్తర బీహారులో దర్భాంగా, ముజఫర్‌పూర్, భాగల్పూర్, పూర్ణియా, మోంఘీర్ జిల్లాలకు వ్యాపించిన దర్భాంగా రాజ్ విస్తృతమైన ఎస్టేట్లలో 1919 -20లో అభివృద్ధి చెందిన శక్తివంతమైన రైతాంగ ఉద్యమాన్ని స్టీఫెన్ హెమింగ్వే రాసిన ఇటీవలి వ్యాసం విశ్లేషించింది. ఆహారాన్ని మొత్తంగా గాని, కొంత భాగాన్ని గాని కొనవలసిన వారిపై పై చిన్న (కౌలుదారులు, పాలికాపులు, వ్యవసాయ కూలీలు) పెరిగిన ధరలు తీవ్ర ప్రభావం చూపాయి. దీనికి తోడు జనాభా ఒత్తిడి, భూమి, బీళ్ళు, కలప సమస్యలు ఘర్షణలకు దారితీశాయి. దర్భాంగా ఎస్టేటు పాత పబ్లిక్ బీళ్ళను, కౌళ్ళకిచ్చినా చెట్లపై హక్కులు తనవేనన్నది. ఎస్టేటు చిన్న జమీందారుల్ని ఏజెంట్లుగా నియమించింది. ఏజెంట్ల దోపిడితో రైతుల ఆర్థిక భారాలు పెరిగాయి. రైతుల సమస్యల పై సమావేశాలు 1919 వేసవి నుండి ప్రారంభమయ్యాయి. ఉత్తర దర్భాంగా డివిజన్‌లోని మధువనిలో నారార్ గ్రామం వద్ద జూన్ 26-30 పెద్ద ప్రదర్శనతో ఆందోళన ప్రారంభమయింది. సరన్‌లో 30 భాగాల కౌలురైతుకి కుమారుడైన విష్ణువరణ్ ప్రసాద్ నుండి రైతులు ప్రేరణ పొందారు. గాంధీ చంపారన్ ఉద్యమంలో ప్రేరితుడైన (విష్ణు చరణ్ తాను

గాంధీ శిష్యుణ్ణిని చెప్పుకొంటాడు. తన పేరు స్వామి విద్యానంద్‌గా మార్చుకొన్నాడు. ప్రస్తావించిన డిమాండ్లు, బలవంతపు వసూళ్ళు, ఆర్థికంగా కాస్త బాగా వున్న కౌలురైతుల సాంప్రదాయ హక్కులు (ఉదా: మధుబనికి చెందిన భూమి హార్ (బాహ్మణ ఆక్రమణ హక్కులు) నైరుతి దర్భాంగాలోని పాలికాపులు కౌలుని నగదు రూపంలో చెల్లించాలని డిమాండు చేసేందుకు విద్యానంద్‌చే ప్రేరితులయ్యారు. (ధాన్యం ధరలు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో సహజంగా డబ్బు రూపంలో కౌలు చెల్లించడానికి ఇష్టపడతాడు) దిగువ కులాలైన యాదవ, తెలీల నుండి నెయ్యి, నూనెలు నిర్బంధంగా రాబట్టడం జరుగుతుందని రైతులు నారాంగ్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఉద్యమం కొన్ని పరిమితులలో శాంతియుతంగా సాగింది. 1920 జనవరిలో సంపన్న కౌలుదారులకు కొన్ని రాయితీలు యిచ్చి పరిస్థితిని నీరు గార్చారు. 1920 సంవత్సరాంతంలో విద్యానాథ్ ఎన్నికల రాజకీయాలు వైపు మరల్చబడ్డారు. (ఉత్తర దర్భాంగా, ఉత్తర భాగల్పూర్‌లో ఐదుగురు కిసాన్ అభ్యర్థులు జమీందారీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పోటీచేసి గెలిచారు. సంవత్సరాంతానికి ఉద్యమం సద్దుమణిగింది. (రైతులకు) మద్ధతు కొరకు విద్యానంద్ చేసిన విజ్ఞప్తుల్ని మాటిమాటికి త్రోసిపుచ్చి బీహార్ కాంగ్రెస్ నాయకత్వం దర్భాంగా రాజాకి చాలా సహాయం చేసింది. దర్భాంగా కౌలు రైతుల సమస్యలపై విచారణ జరపవలసినదిగా చేసిన విజ్ఞప్తిని గూడ రాజేంద్రప్రసాద్ ఒత్తిడి మేరకు అటకెక్కించింది. (భావరా ఘటన తర్వాత కాంగ్రెస్ నాయకులు హసాన్ ఇమాం, మజహరుల్ హక్, రాజేంద్రప్రసాద్) బీహార్ ప్రభుత్వ రహస్య నివేదిక ప్రకారం తిర్హత్ డివిజన్‌లోని భారతీయ జమీందారులలో హెచ్చరిక విస్తృతంగా వ్యాపించింది. జమీందారీ వర్గంపై చాలా ప్రమాదకరమైన దాడిగా భావించి వారు నీలిమందు తోటల యజమానులతో చేతులు కలపడానికి సిద్ధపడ్డారు. జమీందార్ల ప్రతినిధి వర్గం కాంగ్రెస్ నాయకుడు హసాన్ ఇమామ్‌తో విన్నవించుకొనేందుకు పాట్నా వచ్చింది.

యు.పి.లోని అవధ్ ప్రాంతానికి చెందిన ప్రతాప్ ఘర్, రాయ్‌బరేలి, సుల్తాన్ పూర్, ఫైజాబాద్ జిల్లాలలో 1920 –21 లో అభివృద్ధి చెందిన, రైతు ఉద్యమాన్ని గురించి ఇటీవల మజిద్ సిద్ధిఖి, కపిల్‌కుమార్ వివరణాత్మక అధ్యయనం చేశారు. అవధ్ తాలూకాదార్లని తమవైపు తిప్పకోడానికి బ్రిటిషువారు హార్ కోర్టు బట్లర్ (1920లలో యు.పి. లెఫ్టినెంట్ గవర్నరు) ద్వారా చేయవలసిందంతా చేశారు. బట్లర్ దానిని సానుభూతి విధానం అన్నారు. అంటే తాలూకా దార్లకు కౌలుదార్లని దోచుకోవడానికి కల్పించబడిన పూర్తి స్వేచ్ఛ (ఆగ్రా ప్రావిన్సులో వున్న ఆక్రమణ హక్కులు అవధ్‌లో లేవు) నిరంతరం పెరిగే రెవిన్యూ డిమాండుని కౌలు అధిగమించవచ్చు. (1921 –22లో అవధ్‌లో తలసరి లాండ్ రెవిన్యూ శాశ్వత శిస్తు విధానం వున్న బెంగాలులో కంటె 4రెట్లు) కౌలుకిచ్చిన కాలపరిమితి 7 సం॥లుగా వుండాలని, కౌలు పెంపుదల 6 1/4%కి మించరాదని పేర్కొన్న అవుధ్ కౌలుచట్టం 1886 ఆచరణలో కౌలుదారులకు రక్షణ కల్పించలేదు. కౌలు పునరుద్ధరించుకోవాలంటే భూస్వాములు నజరానాలు (కానుకలు) కోరారు (కొన్ని సందర్భాలలో ఈ నజరానాలు కౌలు పైకం కంటె ఎక్కువ) లేక పొలం ఖాళీ చేసి వెళ్లాలన్నారు. రైతులు పలు రకాల పన్నులు చెల్లించవలసి వచ్చింది. ఉచితంగా సేవలు చేయవలసివచ్చింది. వర్గాధిపత్యానికి కులం కూడా తోడవడంతో జాజ్‌మణి విధానం బలమైన దోపిడి సాధనమయింది. పై కులాలకు చెందిన భూస్వాములకు, సంపన్న రైతులకు

క్రింది కులాలవారు నెయ్యి, బట్టలు, చెప్పులు లాంటివి ఉచితంగా లేక మార్కెటు రేటు కంటె తక్కువకు అందజేయాలి. పెరుగుతున్న ధరలు సాంప్రదాయక వసూళ్ళు రైతుల్ని కుంగదీశాయి. ఇవి చాలవన్నట్లు యుద్ధ సంవత్సరాలలో తాలూకాదార్లు యుద్ధ చందాలు వసూలు చేశారు.

మనం యింతకు ముందు గమనించిన విధంగా మాలవ్యా అనుచరుడు ఇంద్రనారాయణ్ ద్వివేదిచే 1918లో కిసాన్ సభ ప్రారంభించబడింది. ప్రధానంగా ఆగ్రా ప్రావిన్సులు అల్హాబాద్ హోంరూలు, కాంగ్రెస్ నాయకుల చొరవతో 450 శాఖలు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ ఉద్యమం కౌన్సిల్ బహిష్కరణ సమస్యపై 1920 లో చీలిపోయింది. ద్వివేది కిసాన్ ఓట్లను ఉదారవాద అభ్యర్థులకు వేయించే ప్రయత్నంలో నిమగ్నమయ్యాడు. ఆయన అనుచరుడు గౌరీ శంకర్ మిశ్రా సహాయ నిరాకరణలో చేరి అప్పుడే రాయ్‌బరేలి ప్రతాపఘర్ ప్రాంతంలో ఆవిర్భవించిన క్రిందిస్థాయి రైతాంగ ఉద్యమంతో సంబంధాలేర్పరచుకొన్నాడు. ఈ ఉద్యమాన్ని ఝుంగూరి సింగ్, బాబా రాంచంద్రలు స్థాపించారు. బాబారాంచంద్ర, రైతుల్ని సంఘటిత పరచడానికి రామాయణాన్ని కుల నినాదాన్ని గణనీయంగా ఉపయోగించుకొన్నాడు. మొదటి కిసాన్‌సభ ప్రతాప్‌ఘర్‌లోని 'రూర్' అనే గ్రామం (తులసీదాసు గ్రంథంలో ఆ పేరు ప్రస్తావించబడింది గనుక)లో నిర్వహించబడింది.

### కిసాన్‌సభ డిమాండ్లు మితవాద స్వభావం గలవి

**డిమాండ్లు :** పన్నుల, వెట్టిచాకరి రద్దు (సాధారణంగా తగ్గింపు భేదఖలు భూముల సాగు నిరాకరణ, అణిచివేతకు పాల్పడే భూస్వాముల్ని పంచాయితీల ద్వారా బహిష్కరణ. దొంగతనం ఆరోపణలో బాబూరాంచంద్ర అరెస్టు చేయబడినప్పుడు 1920 సెప్టెంబరులో నిర్వహించబడిన శాంతియుత రైతాంగ ప్రదర్శన ఆయనను విడుదల చేయించడంతో ఉద్యమం స్పష్టంగా వ్యక్తమయింది. బాబూ రాంచంద్ర వందలాది మంది రైతులతో కలిసి, 1920 జూన్‌లో అల్హాబాద్ వెళ్లి గౌరీశంకర్ మిశ్రా జవహరలాల్‌నెహ్రూతో సంబంధాలు ఏర్పరచుకొన్నారు. నెహ్రూ రైతులతో కలిసి మెలిసి పనిచేసి వారితో సంబంధాలు పెంచుకొన్నాడు. ఈ అంశాల్ని వివరంగా నెహ్రూ తన స్వీయ చరిత్రలో పొందుపరిచారు.

1920 అక్టోబరు నాటికి నెహ్రూ, మిశ్రా, రాంచంద్రల అధ్వర్యంలో అవుధ్ కిసాన్ సభ స్థాపన ప్రతాప్‌ఘర్, రాయబరేలి, సుల్తాన్‌పూర్, ఫైజాబాద్‌లలో 330 శాఖల నిర్మాణంతో) యు.పి. కిసాన్ ఉద్యమంపై గాంధేయ కాంగ్రెస్ తన అధిపత్యాన్ని సాధించే దిశలో ముందుకు సాగింది. కాని రైతు దృష్టికోణం నుండి చూస్తే ఫలితాలు అంతటా ఒకే రకమైన ఆశావహ ప్రయోజనాలు సాధించలేదు.

## 1921 -22 సహాయ నిరాకరణ - ఖిలాఫత్

1921 –22 కాలం నాటి సహాయ నిరాకరణ ఉద్యమం పట్ల సరియైన అవగాహన మూడు స్థాయిల్లో విశ్లేషణ అవసరం. 1. గాంధేయ కాంగ్రెస్ నాయకత్వంచే నిర్ణయించబడిన

అఖిలభారత ఉద్యమం యొక్క దశలు 2. విలక్షణమైన సామాజిక గ్రూపులు, వర్గాల పాత్ర 3. ప్రాంతీయ స్థానిక వ్యత్యాసాలు వీటిలో మూడవది చాలా ఆసక్తికరమైనది.

**అఖిల భారత ఉద్యమం**

వర్కింగ్ కమిటి లేక ఎఐసిసి పిలుపుల మేరకు స్పందనలు నాలుగు దశలుగా గుర్తించవచ్చు. 1921 జనవరి నుండి మార్చి వరకు ఉద్యమం దృష్టి ప్రభుత్వం ఆధ్వర్యం లోని పాఠశాలల, కళాశాలల నుండి విద్యార్థుల్ని బయటికి రప్పించడం, లాయర్ల ప్రాక్టీసు మాన్పించడం, చరఖా మొదటి మేధావుల కార్యక్రమంగా ఉంది. విద్యార్థులు గ్రామీణ విద్యావంతులు, గ్రామీణ ప్రజలతో మమేకమవడానికి ఇది ప్రతీకగా వుంది. స్వదేశీ పంథాని అనుసరించడానికి అందరూ నూలు వడకాలి. పెద్ద ఎత్తున కలకత్తా లాహోరులలో విద్యార్థుల సమ్మెలు, సి.ఆర్.దాస్, మోతీలాల్ నెహ్రూ లాంటి లాయర్లు ప్రాక్టీసు మానివేయడం లాంటి చర్యలతో అట్టహాసంగా ప్రారంభమైన తరువాత కేవలం మేధావులకు పరిమితమైన ఈ ఉద్యమం త్వరలో క్షీణించే సూచనలు కన్పించడం ప్రారంభమయింది.

శాసనోల్లంఘనం చేపట్టేందుకు తగినంతగా దేశం క్రమశిక్షణాయుతంగా, నిర్మాణబద్ధంగా, పరిపక్వత సాధించలేదని ఏప్రిల్‌లో ఎఐసిసి విజయవాడ సదస్సు నిర్ధారణకు వచ్చింది. కాబట్టి జూన్ 30 నాటికి తిలక్ స్వరాజ్యనిధికి కోటిరూపాయలు సేకరించడంపైన, కాంగ్రెస్ సభ్యులుగా కోటిమందిని నమోదు చేయించడంపైన, 20 లక్షలు చరఖాలు ప్రారంభించడంపైన కేంద్రీకరించాలని నిర్ణయించింది. క్రింది స్థాయి ఒత్తిడులు ఎక్కువ కావడంతో జూలై 28 –30 బొంబాయి ఎఐసిసి సమావేశం విదేశీ వస్త్రాల్ని బహిష్కరించాలని, నవంబరులో రానున్న వేల్సు యువరాజు సందర్శనను బహిష్కరించాలనే మరికాస్త సమరశీల వైఖరిని చేపట్టింది. కాని పన్నులు చెల్లించకుండ పూర్తిస్థాయి శాసనోల్లంఘన చేపట్టడం మరలా వాయిదా వేయబడింది. గాంధీ వరదలా వచ్చి జైళ్లను నింపాలని వలంటీర్లకు పిలుపునిచ్చారు. “గొర్రెలు, మేకలు కబేళాలపై తోలబడినట్లు వేలాదిమందిని జైళ్ళకు తరలించబడడంతో మనకు విజయం లభిస్తుంది” అన్నారు గాంధీ. వలంటీర్ల దళాల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వబడింది. పెద్ద స్థాయిలో వలంటీర్ల నియామకం, పికెటింగు, వేలాది మంది అరెస్టులకు సిద్ధపడడం అనే వ్యూహంలోని ప్రాధాన్యతని వైస్రాయి రీడింగు గుర్తించారు.

“ఇప్పటి వరకు మేధావులకు విజ్ఞప్తి చేస్తూ వచ్చిన గాంధీ సాధారణ ప్రజలకు చేయడంలో వచ్చిన మార్పు పరిస్థితిని మార్చివేసింది. కాని దీనిలో మేధావుల్ని, ఆస్తి పాస్తులున్న సంపన్నుల్ని మనకు సన్నిహితులుగా చేసే సానుకూలత వుంది” (సెక్రటరీ ఆఫ్ స్టేట్‌కి టెలిగ్రాం, 1921 అక్టోబర్ 15 రీడింగ్ కలక్షన్స్), వేల్సు యువరాజు రాక సందర్భంగా దేశ వ్యాప్తంగా నవంబరు 17న హర్తాళ్ళు జరిగాయి. బొంబాయిలో హింసాయుత ఘర్షణలు జరిగాయి. బొంబాయిలో హింసాయుత ఘర్షణలు జరిగాయి. ‘స్వరాజ్యం నసాళానికి అంటిందన్నారు. శాసనోల్లంఘన దేశవ్యాప్తంగా గాక బర్డోలి తాలూకాకి పరిమితం చేయాలన్నారు. ఎన్ని

ఆటంకాలెదురైనా 1921 నవంబరు 1922 ఫిబ్రవరి మధ్యకాలంనాటి నాల్గవ దశలోని పరిణామాలు ప్రభుత్వాన్ని దాదాపు సాగిలపడేలా చేశాయి.

నవంబరులో అలీ సోదరుల్ని జైలులో నిర్బంధించడము పట్ల ఆగ్రహించిన హస్రత్ మొహానీ లాంటి ఖిలాపత్ నాయకులు అహింసా పిడివాదాన్ని విడనాడి సంపూర్ణ స్వరాజ్యం కొరకు డిమాండ్ చేయాలన్నారు.

ఉదారవాదుల్ని ఉద్యమానికి దూరం చేసేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున అరెస్టులు, సమావేశాలపై వలంటీరు గ్రూపులపై నిషేధాలతో బెదిరింపులకు దిగింది. దేశం బలమైన తిరుగుబాటు అంచున వున్నట్లుంది.

ఖైదీలను విడుదల చేయడమే గాక, రౌండ్‌టేబుల్ సమావేశం జరపాలని, ఇటీవలనే అమలు పరచిన సంస్కరణల్ని పునసమీక్ష చేయాలని రీడింగు 1921 డిశంబర్ మాంటేగుకి పంపిన టెలిగ్రాంలో కోరాడు. (టెలిగ్రాంలు 15,17,18) గాంధీ చివరకు బార్డోలిలో పన్ను చెల్లింపు నిరాకరణతో పాటు వాక్సభా, పత్రికాస్వేచ్ఛలపై 1922 ఫిబ్రవరి రెండవ వారం నుండి ప్రచారం చేపట్టాలని నిర్ణయించారు. కాని బార్డోలిలోని కార్యక్రమాలతోపాటు దేశ వ్యాప్తంగా గల మొత్తం ఉద్యమం గాంధీ పట్టు పట్టడంతో ఒక్కసారిగా ఫిబ్రవరి 11 న విరమించబడింది. 1922 ఫిబ్రవరి 5న ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ జిల్లా చౌరీచౌరా వద్ద ఆగ్రహించిన రైతులు 22 మంది పోలీసుల్ని సజీవ దహనం చేశారన్న వార్త వెలువడటంతో గాంధీ ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు.

**సామాజిక పొందిక**

సహాయ నిరాకరణ ప్రభావానికి సంబంధించి లభ్యమైన సమాచారం వివిధ సామాజిక గ్రూపుల స్పందనలోని వైవిధ్యాన్ని తెలియజేస్తుంది. ఉన్నత మధ్యతరగతికి చెందిన వారు స్వార్ధ త్యాగానికై చేసిన విజ్ఞప్తి జయప్రదం కాలేదు. మొత్తం 5186 బిరుదులకు గాను 24 మాత్రమే త్యజించబడ్డాయి. 1921 మార్చి నాటికి 180 మంది లాయర్లు మాత్రమే ప్రాక్టీసు మానేశారు. 1920 నవంబరు ఎన్నికలలో పోలింగు చాల తక్కువగా జరిగింది. బొంబాయిలో 8 శాతానికి లాహోరులో 5 శాతానికి తగ్గింది. 637 సీట్లకుగా 6 సీట్లలో మాత్రమే అభ్యర్ధులు విరమించుకొన్నారు. కౌన్సిల్ పనికి అంతరాయం కలగలేదు. విద్యాపరమైన బహిష్కరణ – ప్రత్యేకించి బెంగాలులో కొంత ప్రభావం చూపింది. 1921 ఏప్రిల్ వరకు ప్రతినెల 20 మంది ప్రధానోపాధ్యాయులు లేక ఉపాధ్యాయులు రాజీనామాలు చేశారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని 1,03,107 మంది విద్యార్ధులతో 11,157 మంది బయటికి వచ్చారు. సహాయనిరాకరణ, ఖిలాఫత్ ఉద్యమాలు చరిత్రకై ఇంటిలిజెన్స్ అధికారి (బాంపోర్డ్ పేజి 103) సేకరించిన వివరాలు బహిష్కరణ ప్రభావం కాలేజీలపై గణనీయంగా ఉందని, ప్రాథమిక విద్యపై అంతగా లేదని స్పష్టం చేస్తున్నాయి.

**విద్యార్థుల సంఖ్య**

| | ఆర్ట్స్ కాలేజీలు | సెంకడరీ స్కూల్స్ | ప్రైమరీ స్కూల్స్ |
|---|---|---|---|
| 1919–20 | 52,482 | 1,281,810 | 6,133,521 |
| 1921–22 | 45,933 | 1,239,524 | 6,310,451 |

(బాంఫోర్డ్, పేజి. 103)

గణనీయమైన సంఖ్యలో జాతీయ పాఠశాలలు కళాశాలలు (జామియా మిల్లియ ఇస్లామియా అలీఘర్‌లో, ఆ తరువాత ఢిల్లీకి మార్చబడింది. బనారస్‌లో కాశీ విద్యాపీఠ్, గుజరాత్ విద్యాపీఠ్ లాంటివి) స్థాపించబడ్డాయి. బీహార్, ఒరిస్సాలలో 442, బెంగాల్‌లో 190, బొంబాయిలో 189, యు.పి.లో137 స్థాపించబడ్డాయి. స్వరాజ్యం సంవత్సరకాలంలో రాకపోవడం, డిగ్రీలకు ఉద్యోగాలకు గల సంబంధం కారణంగా జాతీయ విద్యా సంస్థలలో అత్యధికం కొద్దికాలం మాత్రమే పనిచేయగలిగాయి. కొన్ని మాత్రమే విలువైన జాతీయవాదానికి ప్రతీకలుగా నిలిచాయి.

ఆర్థిక బహిష్కరణ 1905 –08 కాలం నాటి కంటె ఎక్కువ జయప్రదమయింది. 1920 –21 లో 102 కోట్ల రూపాయలుగా ఉన్న విదేశీ వస్త్ర దిగుమతుల విలువ 1921 –22 నాటికి 57 కోట్లకి పడిపోయింది. బ్రిటిషు వస్త్రాలు 1920 –21 లో 1292 మిలియన్ల గజాలు దిగుమతి కాగా 1921 –22 నకు 955 మిలియన్ల గజాలకు పడిపోయింది. నిర్ధిష్టకాలం వరకు బట్టల కొరకు ఆర్డర్లు పంపించమని వర్తకులు ప్రతిజ్ఞ చేశారు. 1921 లో జాతీయవాదం వాణిజ్య స్వల్పకాలిక ప్రయోజనాలకు అనుగుణంగా ఉంది. 1921 చివరికి రూపాయి స్టెర్లింగు మారకపు నిష్పత్తి 2 షిల్లింగుల నుండి షిల్లింగు 4 పెన్నీలకు పడిపోయింది. బ్రిటిషు వస్తువులకు ముందుగా కుదుర్చుకున్న కాంట్రాక్టు కంటె ఎక్కువ చెల్లించవలసిందిగా భారతీయ వర్తకుల్ని కోరడం జరిగింది. చరఖాపట్ల పారిశ్రామిక ప్రతికూలత తగ్గించబడాలని గాంధీ యంగ్ ఇండియాలో పలు వ్యాసాలు రాశాడు. ప్రస్తుతం తన ఉద్యమం మిల్లుల ద్వారా దారం, బట్ట ఉత్పత్తికి సహకరించాలని కోరుతుందన్నారు. (యంగ్ ఇండియా 1921 జనవరి 19) అదే వ్యాసంలో గాంధీకి ప్రస్తుతం యాంత్రీకరణ పథకాలు లేవని ప్రకటించింది.

కాంగ్రెస్ నిధుల విషయంలో గణనీయమైన మార్పుని తీసుకొని రావడంలో వ్యాపారస్థుల మద్ధతు నిర్ణయాత్మకమైనది. 1920 లో ఎఐసిసివద్ద రు. 43000 నిల్వ మాత్రమే ఉంది. 1921 –23 కాలంలో రు.130 లక్షల వసూలు చేయగలిగింది. తిలక్ స్వరాజ్యనిధి రు. కోటిలో 37/1/2 లక్షలు బొంబాయి నగరం నుంచే వచ్చాయి.

వ్యాపార వర్గాలు సహాయ నిరాకరణకు మద్ధతు ఇస్తాయని బ్రిటిషు వారికి గల ఆందోళన: భారతదేశ పరిశ్రమలకు సుంకాల రక్షణ సమస్యని చర్చించేందుకు 1921 అక్టోబరులో భారత ప్రతినిధులతో ఆర్థిక కమిషన్ ఏర్పాటుచేయడం బహుశ కారణమై

ఉండవచ్చు. కాని పెద్ద వ్యాపారులలోని గణనీయమైన భాగం ఇంకా ప్రతికూలంగా ఉంది. పురుషోత్తమ ఠాకూర్‌దాస్, జమ్నీదాస్, ద్వారకాదాస్, కొవాజ్జీ జహాషీర్, ఫిరోజ్‌షెత్నా, సెతల్‌వార్‌లు 1920 లో సహాయ నిరాకరణ వ్యతిరేక సంఘాన్ని స్థాపించారు. జాతీయవాద స్వదేశీ ఉద్యమం వస్త్ర పరిశ్రమకు సహాయపడింది. (1921 అక్టోబరులో కాటన్‌మిల్లు షేర్ల ధరలు 275, 1913 లో 100గా తీసుకుంటే సాధారణ షేర్ల విలువ సగటు మాత్రమే 248). బహుశా కార్మికుల ఆందోళనలు పారిశ్రామికవేత్తల్ని కలవరపరచి ఉంటాయి. కలకత్తాలోని బ్రిటిషు వ్యాపార పత్రిక 'ఆర్గాన్' ఈ అంశాన్ని 1922 జూలై 13న స్పష్టంగా చెప్పింది. జాతీయవాద రాజకీయాలు మిల్లు యజమానుల పలుకుబడిని వారి వస్తువుల అమ్మకాల్ని పెంచింది. కాని కార్మికుల అశాంతిని పెంచింది. (సవ్యసాచి భట్టాచార్జీ' నూలు మిల్లులు నూలు వడికే చక్రాలు, స్వదేశీ మరియు భారతపెట్టుబడిదారీ వర్గం 1920 –22' ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ 1976 నవంబరు 26)

కార్మిక అశాంతి 1921 సంవత్సరమంతా కొనసాగింది. 396 సమ్మెలు జరిగాయి. 600,351 మంది కార్మికులు పాల్గొన్నారు. 6,994,426 పనిదినాల నష్టం జరిగింది. 1920 సంవత్సరం మధ్య కాలానికి యుద్ధానంతర వ్యాపార విజృంభణ తరువాత కలకత్తా జూట్ పరిశ్రమలో మాంద్యం ఏర్పడింది. మిల్లు యజమానులు వారానికి 4 రోజుల పనిదినాలతో ఉత్పత్తిని తగ్గించ యత్నించారు. కార్మికుల పోరాటాలకు దిగారు. 1921 లో బెంగాల్ జూట్ మిల్లులలో 137 సమ్మెలు జరిగాయి. 186,479 మంది కార్మికులు పాల్గొన్నారు. స్వామి విశ్వానంద్, స్వామిదర్శనానంద్‌లు యూరపు ఆధిపత్యంలో పోరాడుతున్న భారతీయ గనుల, యజమానుల సహాయంతో రాణిగంజ్, ఝరియా, బొగ్గు గని కార్మికుల్ని నిర్మాణబద్ధం చేయ యత్నించారు. 1921 డిశంబర్ ఎఐటియుసి ఝరియా సదస్సులో కార్మికుల భాగస్వామ్యం గణనీయంగా ఉంది. 1922 నుండి కొన్ని సంవత్సరాలపాటు కార్మికులు ఎఐటియుసి సదస్సులలో పాల్గొనలేదు. సమ్మెలలో ప్రాంతీయ కాంగ్రెస్ నాయకులు – ప్రత్యేకించి బెంగాల్, మద్రాసులతో చాలా బాగా పనిచేశారు. కాని సమ్మెల పట్ల గాంధి వైఖరి చాలా స్పష్టంగా ఉంది. 'అహింసాయత సహాయ నిరాకరణలో సమ్మెలకు స్థానం లేదు. (సమ్మెలు. యంగ్ ఇండియా 1921 ఫిబ్రవరి 16)" భారతదేశంలో రాజకీయ సమ్మెల్ని మనం కోరుకొనం. అరాచకమైన శక్తులపై మనం అదుపు సాధించాలి. మనం పెట్టుబడిని, పెట్టుబడిదారుల్ని ధ్వంసం చేయాలని కోరుకొనం. పెట్టుబడిని మీకనుగుణంగా మచ్చిక చేసుకోవాలని కోరుకుంటాం. సానుభూతి, సమ్మెలను ప్రోత్సహించటం తప్పవుతుంది." (అస్సాం గుణపాఠం, యంగ్ ఇండియా 1921 జూన్ 15).

రైతుకి గాంధీ సైద్ధాంతికంగా ప్రాధాన్యత ఇచ్చారు. రాట్నం, చేనేత (చరఖా, ఖైదీ)ల ద్వారా ఆర్థికాభివృద్ధి, పంచాయితీలు లేదా మధ్యవర్తిత్వం నెరిపే కోర్టులు, జాతీయ పాఠశాలలు, హిందూ– ముస్లిం ఐక్యత కొరకు, మద్యం, అస్పృశ్యతకు వ్యతిరేకంగా ప్రచారం –గ్రామ పునర్నిర్మాణానికి గాంధీ రూపొందించిన కార్యక్రమం. బీహారు, ఒరిస్సాలలో పంచాయితీలు చాలా ప్రజాదరణ పొందాయి. 1921 ఫిబ్రవరి ఏప్రిల్ మధ్య కాలంలో బెంగాలులో 866

తగవులు పరిష్కరించే కోర్టులు స్థాపించబడ్డాయి. 1921 ఆగష్టులో అవి అత్యున్నత దశలో ఉన్నప్పుడు అవి ప్రభుత్వ కోర్టుల కంటే ఎక్కువగా ఉన్నాయి. (బెంగాలులో సహాయ నిరాకరణ చరిత్ర –బెంగాల్ ప్రభుత్వం, పొలిటికల్ కాన్ఫిడెన్షియల్ 395/1924)

మద్యపాన వ్యతిరేక ఉద్యమం చాలా జయప్రదమయింది. అందులో క్రింది కులాలవారు సంస్కృతీకరణ ద్వారా సామాజికంగా ఎదుగుదల సాధించడానికి గల అవకాశం ఒక కారణం కావచ్చు. ఎక్సైజు ఆదాయం 1921 –22 లో పంజాబులో 33 లక్షలు తగ్గింది. ఎక్సైజు ఆదాయం తరుగుదల కారణంగా మద్రాసులో 65 లక్షల లోటు బడ్జెట్ రూపొందింపబడింది. చరఖా ప్రచార ప్రభావం తెలియజేసే స్పష్టమైన గణాంక సమాచారం లభ్యం కాలేదు. కాని 1920 –1923 కాలంలో చేనేత బట్టల ఉత్పత్తి బాగా పెరిగింది. ఖిలాఫత్ మైత్రి తాత్కాలికంగా ఐనప్పటికి హిందూ –ముస్లింల మధ్య బలమైన ఐక్యత నెలకొన్నది. అస్పృశ్య నివారణలో సాధించిన అభివృద్ధి అంతగా లేదు. కాని గాంధీ మొట్టమొదటిసారిగా ఈ సమస్యని జాతీయ రాజకీయాలలో ప్రముఖమైనదిగా ముందుకు తీసుకొని రాగలిగాడు. తన స్వంత గుజరాత్‌లో కూడా అంత్యజుల్ని డిబార్ చేసే విద్యాసంస్థల్ని జాతీయ పాఠశాలలుగా గుర్తించరాదనే నిర్ణయం 1920 చివరలో దాదాపు సంక్షోభాన్ని సృష్టించింది. (యంగ్ ఇండియా 1920 నవంబరు 24) ఒక సంవత్సరం తరువాత బార్డోలి గ్రామంలో గాంధీ కొరకు నిరీక్షిస్తున్న అస్పృశ్యుల్ని అగ్రవర్ణాల వారు అల్లంత దూరంలో నిలబెట్టారు. అలా చేసినందుకు అగ్ర వర్ణాలవారిని కళ్యాణ్ జీ మెహతా మందలించారు. (కృష్ణదాస్, మహాత్మాగాంధీతో ఏడు నెలలు. రెండవ భాగం పేజి. 37)

సమస్యల్ని మిళితం చేయడం లేక వర్గ విభజనల్ని సమాధాన పరచడం పై గాంధేయ విధానం ఎక్కువ శ్రద్ధ చూపింది. 1921 ప్రారంభంలో యు.పి.లో జరిగిన వ్యవసాయ ఘర్షణల తర్వాత గాంధీ ఫైజాబాద్‌లో ఉపన్యసిస్తూ భూస్వాములు కౌలుదార్ల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాల్ని నిందించారు. అందరూ అన్ని శక్తులు కూడగట్టుకొని పెద్ద జమీందారైన ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలి గనుక, కౌలుదారులు రైతులపై పోరాడటం కంటె బాధల్ని భరించడం మంచిదని సలహా ఇచ్చారు. ఒక నెల తరువాత కిసాన్ నాయకుల్ని అరెస్టు చేస్తే అలజడులు జరుగుతాయని ఊహించిన గాంధి రైతులకు యిలా అదేశించారు." మనం ప్రభుత్వానికి పన్నులు భూస్వామికి కౌలు చెల్లించకుండా ఆపివేయలేకపోవచ్చు... జమీందారుల్ని స్నేహితులుగా మార్చుకొనడం లక్ష్యం – అనే అవగాహన మనకు ఉండాలి. (యంగ్ ఇండియా 1921 మార్చి 9)

## ప్రాంతీయ వ్యత్యాసాలు

సహాయ నిరాకరణ యొక్క వ్యత్యాసాలకు, వైవిధ్యాలను ప్రాంతీయ స్థానిక అధ్యయనాల ద్వారా అర్థం చేసుకోగలుగుతాము. అందుకు ఇటీవలి పరిశోధనలు తోడ్పడతాయి.

1921 జనవరిలో లజపతిరాయ్‌చే ప్రేరితులైన లాహోర్ విద్యార్థులు తరగతుల్ని

బహిష్కరించడంతో పంజాబులో సహాయ నిరాకరణ జయప్రదంగా ప్రారంభమయింది. కాని 1919 ఏప్రిల్‌లో వలెగాక ఉద్యమం నగరాలలో బలహీనంగా ఉంది. అందుకు కారణం విచక్షణా రహితమైన బ్రిటిషు అణిచివేతల జ్ఞాపకాలు యింకా ప్రజల మనస్సుల్లో మెదలాడు తుండడం కావచ్చు. తొలుత మత సంస్కరణ ఉద్యమంగా ప్రారంభమైన శక్తివంతమైన అకాలీ తిరుగుబాటు సిక్కులు అధికంగా వున్న మధ్య పంజాబు గ్రామీణ ప్రాంతాల్ని కుదిపివేసింది. అకాలీ ఉద్యమం కొంతకాలం పాటు సహాయ నిరాకరణతో దాదాపు మమేకమయింది. గురుద్వారాలపై అవినీతి మొహంతాలకు గల అదుపుని తాము సాధించేందుకు అకాలీలు పోట్లాడుతున్నారు. మొహంతాలు బ్రిటిష్ అధికారులు పరస్పర ప్రయోజనకరమైన సంబంధాలు కలిగి వున్నారు. అమృత్‌సర్ స్వర్ణ దేవాలయానికి ప్రభుత్వంచే మేనేజరుగా నియమింపబడిన అమార్‌సింగ్ జనరల్ డయ్యర్‌ని 'గౌరవ సిక్కు'గా మారవలసిందిగా ఆహ్వానించాడు. నికల్సేయన్ సాహెబ్ (1857లో ఢిల్లీ కిరాతకుడు నికల్సన్) 'సిక్కు అయ్యాడు'. 1921 ఫిబ్రవరి 20 నాన్కానా విషాద ఘటన తరువాత ఉద్రికత్తలు పెరిగాయి. అక్కడ 100 మంది అకాలీలు మహంత్‌చే ఊచకోత కోయబడ్డారు. లాహోర్ డివిజనల్ కమిషనర్ ప్రేరణతో, అతడి సహాకారంతో ఈ ఘటన జరిగిందని సిక్కులు అనుమానించారు. 1921 నవంబరులో బ్రిటిష్‌వారు స్వర్ణదేవాలయం నిధి తాళాలు యిచ్చేందుకు నిరాకరించడం ప్రత్యేక ఘర్షణకు దారి తీసింది. సిక్కులు మూకుమ్మడి అరెస్టులకు సిద్ధపడ్డారు. అప్పుడు సహాయ నిరాకరణ ఉద్యమం అత్యున్నత దశకి చేరడం బ్రిటిషువారు వెనుకడుగు వేయటానికి దారి తీసింది. 1922 జనవరి మధ్య నాటికి ఖైదీలు విడుదల చేయబడ్డారు. 1922 జనవరి ప్రభుత్వ రిపోర్టులోని 15,506 మంది అకాలీ వలంటీర్లు జాట్ సిక్కు రైతాంగానికి – ప్రత్యేకించి జలంధర్, హోసియార్‌పూర్, అమృత్‌సర్, శాయిక్‌పురా, లైలాపూర్ జిల్లాలకు చెందినవారు. శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ పూర్తిగా అహింసా పద్ధతులకు కట్టుబడి వుంది. కాని కిషన్‌సింగ్, మోటాసింగ్‌ల నాయకత్వంలో జలంధర్, హోషియాపూర్‌లలో 1921 మార్చిలో అసమ్మతి గ్రూపు – బబ్బర్ అకాలీ గ్రూపు ఆవిర్భవించింది. ఈ గ్రూపు శిస్తు రద్దు ఉద్యమాలకు పిలుపిచ్చింది. ప్రభుత్వ విధేయులకు వడ్డీ వ్యాపారులకు వ్యతిరేకంగా టెర్రరిస్టు పద్ధతులు చేపట్టింది." సిక్కు గురుద్వారాల పవిత్రస్థలాల చట్టం నవంబరు, 1923" మేరకు గురుద్వారాలపై సిక్కు గురుద్వార్ ప్రబంధక్ కమిటీ అదుపు సాధించే వరకు అకాలీల పోరాటం కొనసాగింది. కాని 1922 తరువాత క్రమంగా విస్తృతమైన జాతీయ ఉద్యమంతోను, 1921 నాటి – మత సమైక్యత తాను గల సంబంధాలు బలహీన పడ్డాయి. కలవరపడిన వైస్రాయ్ వర్ణించిన "ఖిలాపత్", కాంగ్రెస్ కమిటీలు, వివిధ సిక్కు సంస్థల మధ్య సంబంధాలు" బలహీనపడ్డాయి. (సెక్రటరీ ఆఫ్ స్టేట్స్ టెలిగ్రాం 1921 నవంబరు 9 రీడింగ్ కలెక్షన్).

రాజస్థాన్ లోని ఫ్యూడల్ సంస్థానాలలోని శక్తివంతమైన రైతాంగ ఉద్యమాలు, ఆ తరువాత 1920 లో రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో ఆవిర్భవించిన పట్టణ జాతీయవాదానికి తోడ్పడ్డాయి.

మనం ఇంతకుముందు గమనించినట్లుగా మేవార్ లోని బిజోలియా ఉద్యమం 1922లో పాక్షిక విజయం సాధించింది. ఉదయపూర్ మహారాణా ఖలీసా భూములపై పన్నులు, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ఆందోళన 1921 మేలో మాత్రికుండియా సంతవద్ద జరిగిన ప్రదర్శనతో ప్రారంభమయింది. బిజోరియా నాయకుడు మాణిక్‌లాల్‌వర్మ తరువాత చాలాకాలానికి 1938 ఏప్రిల్ జాతీయవాద మేవార్ ప్రజామండల్ స్థాపించాడు. మోతీలాల్ తేజావత్ నాయకత్వంతో భిల్లు తెగల సమరశీల ఉద్యమం 1921 –22లో ప్రారంభమయింది. 1921 డిశంబర్‌లో అల్వార్ నుండి మేవాడ్ పొరుగున వున్న గుర్‌గావ్ జిల్లాలోని పోలీసుస్టేషన్‌పై దాడి చేశారు. బ్రిటిషిండియా పోలీసులు అల్వార్ సంస్థానపు బలగాలు సమిష్టిగా తిరుగుబాటుని అణచివేశాయి.

బొంబాయి ప్రెసిడెన్సీలో ముస్లిం వర్తకులు సింధు రైతులు ఖిలాపత్ ఉద్యమంతో ఉత్తేజితులయ్యారు. హిందూ మైనారిటి ఇరువురు నాయకుల్ని తయారు చేసింది. వారు జైరాందాస్ దౌలత్‌రామ్, స్వామి గోవిందానంద, జైరాందాస్ దౌలత్‌రామ్ గాంధికి సన్నిహిత సహచరుడు. స్వామి గోవిందానంద్‌కు 1921 మేలో రాజద్రోహనేరంపై 5 సంవత్సరాలు జైలుశిక్ష విధించబడింది. ఆ తరువాత కాంగ్రెస్ సాంప్రదాయక ధోరణుల్ని తీవ్రంగా విమర్శించారు.

గాంధేయ ఉద్యమం సహజంగా అన్నిచోట్ల కంటె గుజరాత్‌లో బలంగా ఉంది. మహత్ముడితో కలసి బార్డోలీ తాలూకాలో జరిపిన 'పరిశీలనా పర్యటన' లో కృష్ణదాస్ క్రమ శిక్షణాయుతమైన రైతుల చైతన్యాన్ని సవివరంగా వర్ణించాడు. (మహాత్మాగాంధీతో ఏడు మాసాలు, వాల్యూం 2 పేజి 27–40) అహింసకు చెందిన క్రమశిక్షణ ఫతేదార్ ధనిక రైతుల ప్రయోజనాలు కాపాడేదిగా వుంది. నిరాఘాటంగా సాగే ఉద్యమం క్రింది కులాల లేక తెగల వ్యవసాయ కూలీల, గ్రామసేవకులపై అదుపుకి సంబంధించి సమస్యల్ని సృష్టించి వుండేది. ఖేదాలోని ఆనంద్, బర్సాద్‌లు ముఖ్యమైన స్థావరాలుగా వున్నప్పటికి సహాయ నిరాకరణ కేంద్రంగా గాంధీ బార్డోలీకి ప్రాధాన్యత నిచ్చాడు. అందుకు కారణం బరైయాల కంటె కలిపరాజ్ కులస్థులు సాధుస్వభావులని భావించటం వలన కావచ్చు. బరైయాలు, ఖేదాలు 1921 లో 70 బందిపోట్లకు పాల్పడ్డారు. క్రింది కులాలచే జానపద నాయకుడిగా భావించబడిన బాబర్ దేవా నాయకత్వంతో ఈ బందిపోట్లు జరిగాయి. (హర్దిమిన్, రైతు ఆందోళనలు, పేజి 201, 206)

బొంబాయి నగరంలో పరిస్థితులు సంక్లిష్టంగా వున్నాయి. వ్యాపారులు, వృత్తిదారులు, గుమాస్తాల గ్రూపుల నుండి ఉత్సాహపూరితమైన మద్దతు లభించినప్పటికి, తిలక్ పట్ల ఆరాధానా భావం గల మహా రాష్ట్రీయులు (1920 ఆగష్టు 1 తిలక్ అంత్యక్రియలకు 20 లక్షలకు పైగా హాజరయ్యారు). గాంధి పట్ల కొంత సంశయాస్పదం గానే వున్నారు. అంతేగాక పారిశ్రామిక కార్మికుల్ని, క్రిందిస్థాయి ముస్లిముల్ని అదుపు చేయడం కూడా తీవ్ర సమస్యగా ఉంది. 1921 నవంబరు 7న చేపట్టిన హర్తాళ్ పెద్ద ఎత్తున దొమ్మీలుగా పరిణామం చెందింది. అలీ సోదరుల్ని జైలులో నిర్బంధించడంతో రెచ్చిపోయిన మహారాష్ట్ర మిల్లు కార్మికులు, ముస్లింలు తెల్లవారిపై క్రైస్తవులపై, ఆంగ్లేయీకరణ చెందిన పార్శీలపై – కొన్ని సందర్భాలలో యూరపు దుస్తులు

ధరించిన ఎవరిపైన అయినా దాడులు చేశారు. 20 మంది చంపబడ్డారు. నిరాహార దీక్ష చేపట్టాలన్న గాంధీ నిర్ణయంతో నవంబరు 23కి దాడులు ఆగిపోవడం ఆయనకు కొంత ఉపశమనం కలిగించింది. 1921లోనే యస్.ఎ.డాంగె, ఆర్–యస్.నింబ్‌కార్, వి.డి. సథాయ్, ఆర్.వి. నాడ్కర్ని (తరువాత యస్.వి. దేశ్‌పాండే, కె.యన్. బోగ్లేకర్ కలిశారు) నాయకత్వంలో విద్యార్థి గ్రూపు ఆవిర్భవించడం దీర్ఘకాలిక ప్రాధాన్యత గల అంశం. ఈ గ్రూపు సహాయ నిరాకరణలో చురుకుగా పాల్గొన్నది. గాంధిపట్ల విమర్శనావైఖరి పెంచుకొన్నది. సోషలిస్టు భావాలు గల ఆర్.బి. లొత్వాల్లా సరఫరా చేసిన సాహిత్యం ద్వారా మార్క్సిజం పట్ల ఆసక్తిని పెంచుకొన్నది. 1921 ఏప్రిల్‌లో డాంగే రాసిన 'గాంధీ వర్సెస్ లెనిన్"లో గాంధి –లెనిన్‌ల తాత్వికతలలోని ఒక్కొక్క అంశాన్ని పోల్చి చూపించే ప్రయత్నం చేశాడు. పెద్ద ఫ్యాక్టరీలను జాతీయం చేసే, సంపదపై గరిష్ఠ పరిమితిని విధించే జమీందారీ భూముల్ని రైతులకు పంచే స్వరాజ్యాన్ని ఊహించారు. అహింసని సమర్థవంతమైన ఎత్తుగడగా అంగీకరిస్తూనే కరపత్రం– పన్నుల నిరాకరణ – రాజకీయ సాధారణ సమ్మె – ఆయుధాల అవసరాన్ని నొక్కి చెప్పింది. "మనం విజయం సాధిస్తే, కార్మిక వర్గం సహాయంతోనే అంటే శ్రామికుల, రైతాంగం సహాయంతోనే సాధిస్తాం"..

సహాయ నిరాకరణ మహారాష్ట్రలో కొంత బలహీనంగా ఉంది. తిలక్ అనుచరులుగా గుర్తింపు పొందిన నాయకత్వం గాంధి పట్ల అంత ఆసక్తి చూపలేదు. బ్రాహ్మణేతరులు 1930 వరకు కాంగ్రెస్‌ను చిట్టవన్ నాయకత్వంలోని సంస్థగా భావించారు. ఇతర చోట్ల లాగానే గాంధి అదుపు అంతగా లేని ప్రాంతాలలో చెదురు మదురుగా స్థానిక తిరుగుబాట్లు జరిగాయి. నాసిక్ జిల్లాలోని ముస్లిం ప్రాంతమైన మాలేగావ్‌లో ఖిలాపత్ గ్రూపు 1921 ఏప్రిల్ 25న వారి నాయకుల్ని కొందరిని అరెస్టు చేసిన తరువాత ముగ్గురు పోలీసుల్ని సజీవ దహనం చేసింది. తాతా హైడ్రో ఎలక్ట్రిక్ పాజెక్టు కొరకు ప్రభుత్వం మద్దతుతో భూమి సేకరించ యత్నించారు. పూనా సమీపంలోని ముల్షీపేట రైతులు తమ భూముల్ని కాపాడుకునేందుకు సత్యాగ్రహ పద్ధతులు పాటించారు. పూనా కాంగ్రెసు 1921 ఏప్రిల్ లో రైతుల పక్షాన నిలబడింది. పోరాటం సంవత్సరాల పాటు కొనసాగింది.

సహాయ నిరాకరణ – ఖిలాపత్ ఉద్యమం దక్షిణాదికి చొచ్చుకొని పోవడంతో దానికి అఖిల భారత స్వభావం చేకూరింది. దక్షిణ భారతదేశంలో గల నాలుగు భాషా ప్రాంతాలలో కర్నాటక పై మాత్రం ఉద్యమ ప్రభావం అంతగా లేదు. కర్నాటకలో రాజకీయ చైతన్యం 1930 లలో వచ్చింది. ఇతర ప్రాంతాలలో లాగానే ఉన్నత, మధ్యతరగతి, వృత్తి గ్రూపులకు చేసిన విజ్ఞప్తికి మద్రాసు ప్రెసిడెన్సీలో పరిమితమైన స్పందన మాత్రమే లభించింది. 682 మందిలో కేవలం 6 మంది మాత్రమే బిరుదుల్ని త్యజించారు. 36 మంది తమిళులు, 103 మంది ఆంధ్రులు లాయర్లుగా ప్రాక్టీసు మానుకొన్నారు. 5000 మంది విద్యార్థులలో 92 జాతీయ పాఠశాలలు స్థాపించబడ్డాయి. మద్రాసు నగరంలోని ఉద్యమం ప్రత్యేకత తెల్లవారి యాజమాన్యంలో గల బకింగ్‌హోమ్ కర్నాటక బట్టల మిల్లులలో 1921 జూలై నుండి అక్టోబరు

వరకు అంటే 4 నెలల సుదీర్ఘకాలం సమ్మె జరిగింది. ఈ సమ్మెకు తిరువిక లాంటి సహాయ నిరాకరణ నాయకుల పూర్తి మద్దతు వుంది. ప్రభుత్వం (1921 ఎన్నికల తర్వాత బ్రాహ్మణ వ్యతిరేక జస్టిస్ పార్టీ మంత్రుల్ని నియమించింది) సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు అగ్రకులాలకు చెందిన సమ్మె చేసే వారికి వ్యతిరేకంగా అస్పృశ్యులైన ఆదివాసుల్ని నిలబెట్టే ప్రయత్నం చేసింది. ఇక జాతీయ వాద నాయకత్వం సమ్మె నిధికి బదులుగా చరఖాలను పంపిణీ చేసి గాంధీయ వ్యూహంతో శ్రామిక ఉద్యమానికి ముడిబెట్టే అసాధారణ వైఖరి చేపట్టింది. జాతీయవాదాన్ని శ్రామిక ఉద్యమంతో కలగలపడానికి చేసిన ప్రయత్నం మద్రాసు లాయరైన సింగారవేలు చెట్టియార్‌ని దక్షిణ భారతదేశంలో మొదటి కమ్యూనిష్టుని చేసింది.

1921 మే 5న సింగారవేలు గాంధీకి రాసిన బహిరంగలేఖలో "కిసాన్ ఉద్యమాలకు బ్రేకులు వేయడాన్ని ఖండించారు. అహింసా యుత సహాయ నిరాకరణ పెట్టుబడిదారీ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ప్రయోగించాలని కోరాడు. చరఖా ద్వారా ప్రతి కుటుంబం స్వతంత్రంగా జీవించాలని, కుటుంబానికి కొద్ది పాటి పొలమైనా వుండాలని అర్థించాడు.

సనాతన బ్రాహ్మణ భావజాలం నాడార్ల, సౌరాష్ట్రం కోమట్‌ల లాంటి బ్రాహ్మణేతర కులాల సంస్కృతీకరణ ఆకాంక్షలు, లైసెన్సు రేట్లని పెంచడం ద్వారా ప్రభుత్వాదాయాన్ని పెంచేందుకు చేస్తున్న ప్రభుత్వ ప్రయత్నాలకు వ్యతిరేకంగా మద్యం డీలర్ల అసంతృప్తి – అన్నీ కలిసి కోస్తా ఆంధ్రలో, తమిళనాడులోని గ్రామీణ ప్రాంతాలలో మద్యం షాపుల ఎదుట పికెటింగ్ చేయడాన్ని జయప్రదమైన సహాయ నిరాకరణ రూపం చేశాయి. 1920 దశాబ్దం తొలి సంవత్సరాలలో మద్రాసు ప్రభుత్వానికి ఎక్సైజు శాఖ నుండి 20 శాతానికి పైగా ఆదాయం వస్తుంది. అలాంటి ఉద్యమాలు తమిళనాడు గ్రామీణ ప్రాంతాలు స్థావరాలుగా రాజగోపాలాచారి లాంటి కొత్త నాయకత్వాన్ని ముందుకు తెచ్చాయి. రాజగోపాలాచారి 1921లో ప్రాక్టీసు మానుకొన్న సేలం లాయరు, సత్యమూర్తి కస్తూరిరంగ అయ్యంగార్ లాంటి మద్రాసు నగరానికి చెందిన జాతీయ వాదులు మహారాష్ట్రలో తిలక్ అనుచరులు లాగా బెంగాల్‌లో సి.ఆర్.దాస్ అనుచరులు లాగా సహాయనిరాకరణని అర్థమనస్కతతో పాటించారు.

కొండా వెంకటప్పయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు, టంగుటూరు ప్రకాశం, పట్టాభి సీతారామయ్య లాంటి ముఖ్య నాయకులు, వ్యాపారుల గణనీయమైన మద్దతుతో (ఉదాహరణకు ఏలూరుకు చెందిన మోతీ కుటుంబం నుండి, స్థానిక సహాయ నిరాకరణ కమిటీగా పనిచేసిన రాజమండ్రి ఛాంబర్ ఆఫ్ కామర్స్ నుండి) తమిళనాడు మెట్ట ప్రాంతాలలాగాకాక మధ్యతరగతి రైతాంగం మద్ధతుతో ఆంధ్రాడెల్టా ప్రాంతంలో సహాయ నిరాకరణ చాలా బలాన్ని పొందింది. 1921 నాటి ఆంధ్ర రాజకీయ చైతన్యం, దాని విస్తృతి, అంతర్గత ఉద్రిక్తతలు ఉన్నవ లక్ష్మీనారాయణ తెలుగు నవల మాలపల్లిలో వివరంగా చిత్రించబడ్డాయి (1922). అగ్రవర్ణ హిందూ భూస్వాములకు అస్పృశ్యులకు మధ్యగల ఉద్రిక్తతల్ని గాంధేయ పద్ధతుల ద్వారా పరిష్కరించుకోవాలని నవలా నాయకుడు వాదిస్తుంటాడు. కాని అతడి సోదరుడు అంతర్జాతీయ శ్రామిక ఐక్యతని ప్రస్తావించి ప్రజలతో సమానత్వాన్ని సాధించాలని కవిత్వం రాసి ప్రచారం చేస్తుంటాడు.

గుంటూరు జిల్లాలోని చీరాల –పేరాల అనే చిన్న పట్టణాల్ని మున్సిపాలిటి చేయాలనే ప్రభుత్వ ప్రతిపాదనకి స్థానిక పన్నుల్ని 4000 నుండి 30000 లకు పెంచడం దానిలోని ఆంతర్యం. దీనిపై వెల్లువెత్తిన ప్రతిఘటన ప్రత్యేకంగా పేర్కొనదగినది.

దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నాయకత్వంలో 15000 మంది నివాసితులు. పన్నులు చెల్లించ నిరాకరించి 11 నెలలు వలసపోయారు. కొత్తగా స్థిరపడ్డ ప్రాంతానికి రాంనగర్ అని పేరు పెట్టుకొన్నారు. భూమి శిస్తు చెల్లింపును నిరాకరిస్తూ 1921 డిశంబరు 1922 ఫిబ్రవరి మధ్య కాలంలో బలమైన ఉద్యమం సాగింది. గ్రామాధికారుల ప్రత్యేక హక్కుల్ని పరిమితం చేయనున్న ప్రభుత్వ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా గ్రామాధికారులు మూకుమ్మడి రాజీనామాలు చేశారు. వర్షాభావంతో రైతుల కడగండ్లు, గాంధీ స్వరాజ్యం రానున్నది. పన్నుల చెల్లించనవసరం లేదు అనే భావం ప్రజలలో బలపడడం కూడా వారి రాజీనామాలని ప్రోత్సహించింది. (యం.వెంకట రంగయ్య ఆంధ్రప్రదేశ్‌లో స్వతంత్ర పోరాటం, వాల్యూం 3 పేజి. 276). గుంటూరుకు సమీపంలోని బాపట్ల సబ్ డివిజనులోని పెదనందిపాడు, రాజమండ్రి సమీపంలోని రఘుదేవపురం ఫిర్కాలో ఉద్యమం అత్యున్నత శిఖరాలకు చేరుకున్నది. గాంధి ఒత్తిడి మేరకు కాంగ్రెస్ నాయకులు ఉద్యమం విరమించడానికి ముందు 1922 జనవరి నాటికి శిస్తు వసూళ్ళు 14.73 లక్షల రూపాయలు నుండి 4 లక్షలకు పడిపోయాయి.

1921 –22లో అడవి నిబంధనలకు వ్యతిరేకంగా తెగల పేదరైతుల సమస్యల్ని జాతీయవాదంతో అనుసంధానం చేయబడినాయి. కడప జిల్లాలో రాయచోటిలోను గుంటూరు జిల్లాలోని పల్నాడు తాలూకాలోను 'అటవీ సత్యా గ్రహాలు జరిగాయి. అడవులలో పశువుల మేతపై విధించిన పన్నును వ్యతిరేకిస్తూ చేపట్టిన పోరాటాలని వివరిస్తూ కోస్తా ప్రాంతానికి చెందిన సంపన్నులైన పశువుల కాపరులు ఈ పోరాటాల సమరశీలతని తగ్గించటానికి యత్నించారు. కేంబ్రిడ్జి చరిత్రకారులు సి.జె.బేకర్.

కాని తెగల ప్రజలు, పేద రైతులు ఈ పుల్లరి వ్యతిరేక పోరాటాలు చేశారనడానికి కావలసినన్ని సాక్ష్యాధారాలున్నాయి.

1921 సెప్టెంబర్‌లో కడపలో గాంధీని గ్రామస్థులు పెద్ద పెద్ద గుంపులుగా తరలివచ్చి పన్నులు తగ్గించేలా చూడమని, అటవీ చట్టాల్ని రద్దు చేయించమని అభ్యర్థించారు. అటవీశాఖ అధికారుల బహిష్కరణకు ఉద్యమాన్ని పరిమితం చేయడానికి వెంకటప్పయ్య లాంటి కాంగ్రెస్ నాయకులు ప్రయత్నించగా, రైతులు పుల్లరి చెల్లించకుండా తమ పశువుల్ని అడవులలోనికి తోలడం ప్రారంభించారు. పల్నాడులోని అడవి ప్రక్కనున్న గ్రామాలు స్వరాజ్యాన్ని ప్రకటించుకొన్నాయి. పోలీసులపై దాడులు చేశాయి. "గాంధీ రాజ్యం అమలులో వుంది లేక రానున్నది. అడవులు ప్రజలవి. ప్రజలు వారి యిష్టానుసారం అడవుల్ని ఉపయోగించుకోవచ్చు" – లాంటి ఆలోచనలతో పేదలు ప్రేరేపితులయ్యారు. పల్నాడులో, రాయచోటిలో అటవీశాఖ పాలనా కార్యకలాపాలు స్తంభించాయి.(మద్రాసు అటవీ నిర్వహణ శాఖ రిపోర్టు. 1921 – 22 పేజి –30) ఇలాంటి వదంతులు 1921 –22లో ప్రేరకాలుగా పనిచేశాయి. ఉదాహరణకు

1921 మేలో తిరుచినాపల్లిలో జైలు గోడల్ని పగలకొట్టడం - బ్రిటిషు పాలన స్థానంలో గాంధి స్వరాజ్యం త్వరలో రానున్నదనే విశ్వాసంపై ఆధారపడి జరిగింది. (సెక్రటరీ ఆఫ్ స్టేట్ కి వైస్రాయ్ 1921 జూన్ 20 రీడింగ్ కలక్షన్).

ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే మలబార్, మోప్లాల్లో స్వర్ణయుగపు ఆకాంక్షలు హింసాయుతమైన తిరుగుబాట్లకి దారితీసాయి. గతంలో జరిగిన మోప్లా తిరుగుబాట్లు సాంప్రదాయ స్వభావం గలవి. చాలాకొద్ది మంది మాత్రమే పాల్గొన్నారు. బ్రిటిష్ అధికారం అనివార్యంగా కుప్పకూలిపోతుందనే పుకార్లు దీర్ఘకాలంగా వున్న నిరసని ప్రజా విప్లవంగా మార్చాయి. హిందూ జన్మీలు, ముస్లిం కౌలుదారుల్ని వ్యవసాయదారుల్ని దోపిడీ చేస్తున్న సందర్భంలో తిరుగుబాటు అనివార్యంగా మతపరమైన అంశంగా కనిపిస్తుంది. కాని విషయాలు అతిశయించి చెప్పబడ్డాయి. కౌలుహక్కుల ఆందోళన మలబారులో 1916 నుండి అభివృద్ధి చెందుతూ వచ్చింది. 1920 ఏప్రిల్ మంజేరి సదస్సు తరువాత ఖిలాపత్ ఉద్యమం ఈ సమస్యని చేపట్టింది. ఖిలాపత్ సమావేశాలలో రైతుల సమస్యలు చెప్పుకోడానికి తగ్గిన ప్రోత్సాహం లభించింది. రానున్న ముస్లిం రాజ్యంలో "ఖర్చులతో కూడిన కోర్టు వ్యాజ్యాలు వుండవు. ఎవరికైనా అతడికి కావలసిన దానికంటె ఎక్కువ వుండదు... ప్రస్తుత పోలీసు వ్యవస్థ మనం కోరుకొనం..." కె. మాధవన్ నాయర్, యు.గోపాలమీనన్, యాకూబ్ హసన్, పి. మొయిద్దీన్‌కోయ -లాంటి సుపరిచితులైన కాంగ్రెస్ ఖిలాపత్ నాయకులు 1921 ఫిబ్రవరిలో నిర్బంధించబడడంతో స్వర్ణయుగంపై భ్రమలు కల్పించే నాయకులు ముందుకు వచ్చారు. 1921 ఆగష్టు 20న తిరురంగాడి మసీదులో ఆయుధాలున్నాయని అనుమానంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడి పెద్ద తిరుగుబాటుకి దారితీసింది. పోలీసు స్టేషన్లమీద, ప్రభుత్వ కార్యాలయాల మీద, సమాచార కేంద్రాల మీద, అణచివేసే భూస్వాముల ఇళ్ళమీద విస్తృతంగా దాడులు జరిగాయి. చాలా నెలల వరకు దక్షిణ మలబార్‌లోని ఎర్నార్, వల్లువానాడ్, తాలూకాలపై బ్రిటిషువారి అదుపు లేకుండా పోయింది. కున్అహ్మద్, కలైతింగల్ మహ్మద్, ఆలి ముజలియార్, సీథికోయ తంగల్, ఇంబిబికోయ తంగల్‌ల ఆధ్వర్యంలో చాలాచోట్ల ఖిలాపత్ రిపబ్లిక్కులు స్థాపించబడ్డాయి. "ఇప్పటి పరిస్థితి నిజమైన యుద్ధ పరిస్థితి" అని బ్రిటిష్ అధికారి సెప్టెంబర్ 26 నివేదిక మోప్లా ప్రతిఘటన గొరిల్లా యుద్ధ పద్ధతులలో నిర్మించబడి--- బలాన్ని పుంజుకొంటుంది --- సాయుధులైన తిరుగుబాటుదారుల మొత్తం 10,000 --- (సెక్రటరీ ఆఫ్ స్టేట్ వైస్రాయికి 1921 సెప్టెంబర్ 28, రీడింగ్ కలక్షన్).

మోప్లాలను మత తీవ్రవాదులని హిందువులు ఖండించారు. 600 మంది హిందువులు హతులయ్యారు. 2500 మంది బలవంతంగా మతమార్పిడికి గురయ్యారు.(ఆర్యసమాజ్ సమాచారం మేరకు). అణచివేతదారులైన భూస్వాములు, వడ్డీ వ్యాపారులు బ్రిటిషువారితో కుమ్మక్కయిన వారితో సహా 4 లక్షలమంది హిందువులు నివసించే ప్రాంతం ఈ మత త్రీవవాదులు అధీనంలో వుండడాన్ని బట్టి పైన చెప్పబడిన అంకెలు తక్కువై వుండవచ్చు. మొట్ట మొదటి మత మార్పిడి సెప్టెంబర్ 10న జరిగింది. కె.యన్. ఫణిక్కర్ హిందూ ప్రాంతంలో

--- కుటుంబానికి గాని మరెవరికి గాని కీడు తలపెట్టకుండ కేవలం అణచివేతదారులైన భూస్వాముల రికార్డులు ధ్వంసం చేసేందుకు మోప్లాలు 23 మైళ్ళ దూరం ప్రదర్శన నిర్వహించారని కె.యన్. ఫణిక్కర్ యిటీవలి వ్యాసంలో పేర్కొన్నారు. ఇంకా ఆసక్తికరమైన అంశమేమంటే మోప్లా ఖైదీల మొదటి జట్టులో ఒక నంబూద్రి, నలుగురు నాయర్లు ఉన్నారు. (వైస్రాయ్‌కి సెక్రటరీ ఆఫ్ స్టేట్ 1921 నవంబరు 3, కోయంబత్తూరు జిల్లా జడ్జిలేఖను జతపరుస్తూ). అసలు వాస్తవం మోప్లా తిరుగుబాటు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా చేపట్టిన పెద్ద సాయుధ తిరుగుబాటు. తిరుగుబాటు క్రూరంగా అణచివేయబడింది. 2337 మంది తిరుగుబాటు దారులు చంపబడ్డారు. 1652 మంది గాయపరచబడ్డారు. 45,404 మంది జైళ్ళలో కుక్కబడ్డారు. 1857 లేక 1919 లో లాగానే బ్రిటిష్ వారి ఉదారవాద ముసుగు పూర్తిగా తొలగిపోయింది.– నిజ స్వరూపం బట్టబయలయింది. ఒక రైల్వే గూడ్స్ వేగన్‌లో కుక్కబడడంతో శ్వాస అందక చనిపోయిన 66 మోప్లా ఖైదీల మృతదేహాలు నవంబరు 20న కనుగొనబడ్డాయి. ప్రతి ఇంగ్లీషు పాఠశాల విద్యార్థికి చాలా అతిశయించి చెప్పబడిన సిరాజుద్దౌలా బ్లాక్ హోల్ కథ తెలుసు.

కాని స్వతంత్ర భారతదేశంలో చాలాకొద్ది మందికి మాత్రమే వాస్తవంగా జరిగిన "పొదనూర్ బ్లాక్‌హోల్" ఘటనని విని వుండడం ఆశ్చర్యకరం.

జాతీయ ఉద్యమం యొక్క తరువాత దశ ఏదీ దానితో సమానం కాలేనంతగా సుర్మా లోయలోని టీ తోటలలో చార్గోలా వద్ద 1921 మేలో కూలీలు 'గాంధీ మహరాజ్‌కీజై' నినాదాలు చేస్తూ పెద్ద మొత్తంగా కూలీ పెంచమని డిమాండు చేసారు. అలా చేయమని గాంధీ ఆదేశించారని చెపుతూ 8000 మంది (కార్మికులలో 52%) పెద్ద ప్రదర్శన జరిపారు. ఎక్కడ నుండి వారి భూములు బలవంతంగా మోసపూరితంగా లాగివేయబడ్డాయో ఆ గ్రామాలలోని భూమిని యిప్పించే గాంధి రాజ్యం వస్తుందని పుకార్లు వ్యాపించాయి. చార్గోలా లోయలోని కూలీలలోని అత్యధికులు సహాయ నిరాకరణ చాలా బలంగా వున్న తూర్పు యు.పి.లోని బస్తి, గోరఖ్‌పూర్ జిల్లాల నుండి వచ్చిన వారు. మరలా డిశంబరులో డారంగ్, శివసాగర్ జిల్లాలలోని టీ తోటలలో చెదురు మదురుగా సమ్మెలు జరిగినట్లు రిపోర్టులు వచ్చాయి.

సహాయ నిరాకరణ ఉద్యమంలో టీ తోటల కార్మికులు చురుకుగా పనిచేస్తున్నట్లు అధికారులు చాలాసార్లు ఫిర్యాదు చేశారు. చాలామంది అస్సాం కాంగ్రెస్ నాయకులకు తోటలలో సమ్మెల పట్ల ఎలాంటి ఆసక్తి లేదు. కారణం వారిలో కొందరు (యస్.సి.బాల్దాలోయ్‌లాగా) తోటల యజమానులు గనుక. ఒక రాత్రి కొంతమంది కార్మికులు సమ్మె ప్రతిపాదనతో తన దగ్గరికి వచ్చినపుడు గుండె ఆగిపోయినంత పనయిందని ఒక కాంగ్రెస్ కార్యకర్త తన జ్ఞాపకాలలో రాసుకున్నాడు. (పి. బార్తాకూర్, స్వాధీనతా రాణార్ గుమ్స్ పరిషత్, ప్లాంటర్ రాజ్ టు స్వరాజ్ అనే గ్రంథంలో అమలేందు గుహ ఉటంకించారు). రైతులలో పన్ను చెల్లింపుని నిరాకరించే సూచనలు కూడా కన్పించాయి. బార్డోలిలో గాంధి వెనుకంజ వేసిన తరువాత

కూడా టీ తోటల కూలీలకు హెచ్చరికగా వుండేందుకు శివసాగర్‌లో అస్సాం రైఫిల్స్ కవాతు జరిపింది. (సెక్రటరీ ఆఫ్ స్టేట్ వైస్రాయ్, 1922 ఫిబ్రవరి 20) 1921 దినాలలో అంబికా గిరిరాయ్ చౌదరి కవిత్వం 'అస్సాంకేసరి' అలాగే వైష్ణవ గీతాలలో కృష్ణుని స్థానంలో గాంధీని చొప్పించిన అనేక జానపదగీతాలు అస్సాం సాహిత్యంపై చెరగని ముద్రవేశాయి.

1921-22 కాలం నాటి సహాయ నిరాకరణ ఖిలాఫత్ మైత్రి బెంగాల్‌లో జాతీయోద్యమానికి అత్యంత బలాన్ని ఐక్యతని సాధించి పెట్టింది. నాగపూర్‌లో సి.ఆర్. దాస్‌లో వచ్చిన మార్పు తరువాత చాలామంది బెంగాలీ రాజకీయ నాయకులు గాంధి నాయకత్వాన్ని అంగీకరించారు. టెర్రరిస్టులు కూడా గాంధేయ పద్ధతుల పని విధానాన్ని పరిశీలించేందుకు ఒక సంవత్సరకాలం గడువు ఇచ్చేందుకు అంగీకరించారు. కలకత్తా మేధావులు కొన్ని గాంధేయ విధానాలపట్ల ఆసక్తి, ఎప్పుడూ చూపలేదు. రవీంద్రనాథ్ రాగూర్ తన 'నిజానికి పిలుపు' (మోడరన్ రివ్యూ 1921 అక్టోబరు) తో ఒక వివాదానికి తెరలేపారు. లక్షలాది నిరుపేద ప్రజల్ని కదిలించడంలో మహాత్ముడు సాధించిన విజయాన్ని ఆయన ప్రశంసించాడు. కాని చరఖా సంస్కృతిలోని పరిమితిని, అభివృద్ధి నిరోధకతని, అనాలోచిత అనుసరణని తీవ్రంగా విమర్శించారు. 1905 స్వదేశీ ఉద్యమం రోజులతోపోల్చితే సహాయ నిరాకరణపై బెంగాల్‌లో వెలువడ్డ సాహిత్యం బహుతక్కువ. 1920, 1930 దశాబ్దాలలో కూడా, జాతీయవాదులు స్వదేశీ గీతాలనే పాడుకొనవలసి వచ్చింది. మతపరమైన ఐక్యత హిందువులు, ముస్లింలు యించుమించు సరిసమానంగా వున్న బెంగాల్‌లోని సి.ఆర్.దాస్, ఆయన యువ సేనానులు ముగ్గురు (మిడ్నాపూర్‌లో వీరేంద్రనాథ్ సాస్మల్, చిటగాంగ్‌లో జె.యం.సేన్‌గుప్త, కలకత్తాలో సుభాష్ బోస్) అందించిన సమర్థవంతమైన నాయకత్వం – అన్నిటిని మించి పట్టణ గ్రామీణ ప్రాంతాలలోని సాధారణ ప్రజల చైతన్యం – అరకొర లోపాలకు విస్మరించేలా చేశాయి.

1921 ప్రారంభంలో వెల్లువెత్తిన విద్యార్థి ఉద్యమం తరువాత గుర్ఖాదళాలు అస్సాంటీ తోటలలో పనిచేస్తున్న బెంగాలీ కూలీలపై మే 20,21 లలో దాడిచేసి తూర్పు బెంగాల్‌లోని చాంద్‌పూర్‌కి తరిమివేయడంతో సహాయ నిరాకరణ రెండవసారి అత్యున్నత దశకి చేరింది. కొద్ది సమయంలోనే తూర్పు బెంగాల్ ఉద్రిక్తమయిందని 1924 లో అధికార సమాచారం పేర్కొన్నది. హర్తాళ్ళతో వెనువెంటనే జె.యం.సేన్‌గుప్తా నాయకత్వంలో జరిగిన రైల్వే, స్టీమరు సర్వీసుల సమ్మెలతో స్తంభించింది. స్టీమరు సమ్మె జూలై ప్రారంభం వరకు, అస్సాం – బెంగాల్ రైల్వే సమ్మె సెప్టెంబరు వరకు కొనసాగాయి. ఈ సమ్మెలపై కలకత్తాలోని మార్వారీ వ్యాపారవర్గాలు, గాంధీ తమ పూర్తి అయిష్టతని వ్యక్తం చేశారు. జూలై నుండి అక్టోబరు వరకు స్తబ్ధత నెలకొన్నది. కాని జాతీయవాదులు ఈ కాలాన్ని వలంటీర్ల గ్రూపులను నిర్మించడంపైన, తగవులు తీర్చే కోర్టుల్ని నిర్వహించడం పైన సమావేశాల్ని (జూన్ –నవంబరు మధ్య కాలం నాటికి 4,265 సమావేశాలు) జరపడంపైన కేంద్రీకరించి సద్వినియోగం చేసుకొన్నారు. మూడవది అత్యంత పెద్ద ఉద్యమ వెల్లువ వేల్సు యువరాజు రాకతో నవంబరులో ప్రారంభమై, 1922 ఫిబ్రవరి వరకూ, యింకా ఆ తరువాత కొనసాగింది. కలకత్తాలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నవంబరు 17హర్తాళ్‌ని జయప్రదం చేశారు. వీధులపై అదుపు వలంటీర్ల

హస్తగతమయింది. కొద్దిమంది పోలీసులు రాజీనామాలు చేశారు. ఒక పోలీసు అధికారి 1921 డిశంబర్‌లో ఏడు జిల్లాల పోలీసులలో అసంతృప్తి నెలకొని ఉందని రిపోర్టు చేశాడు. అణచివేత మూకుమ్మడి అరెస్టులతో ఎదుర్కొనబడింది. (కలకత్తాలో సంవత్సరాంతానికి 3000 మందికి పైగా జైళ్ళకి వెళ్ళారు). జైళ్ళకి పోయిన వలంటీర్లలో మొదటిసారిగా పై తరగతికి చెందిన మహిళలు (సి.ఆర్.దాస్ భార్య వాసంతి దేవి ననుసరించి) పెద్ద సంఖ్యలో మిల్లు కార్మికులు (ప్రధానంగా ముస్లింలు) వున్నారు. మహమ్మద్ ఉస్మాన్ లాంటి ఖిలాపత్ ఆందోళనకారులు, కలకత్తా పరిసర పరిశ్రమలలోని ముస్లింలు చురుకుగా పనిచేయడమే గాక 1921 ప్రారంభం నుండి వలంటీరు గ్రూపుల, కార్మిక సంఘాల నిర్మాణం చేపట్టారు. 1922 జనవరి మొదటివారంలో అరెస్టు చేయబడిన 349 మంది వలంటీర్లలో 123 మంది మిల్లు కార్మికులు, గణనీయమైన సంఖ్యలో క్రింది తరగతి ముస్లింలు 39 మంది విద్యార్థులు – సామాజిక పొందిక – స్వదేశీ రోజుల కంటె పూర్తిగా భిన్నంగా వుంది. బొంబాయి మద్రాసులలో లాగా, 1921 అనుభవం ఆ తరువాత తొలగిన భ్రమలు 1921 చివరలో యం.యన్.రాయ్ దూతయైన నళినీ గుప్తతో సంబంధాలు పెట్టుకొని ముజఫర్ అహమ్మద్ కలకత్తాలో తొలి కమ్యూనిస్టు గ్రూపుల ఏర్పాటుకు దారితీసింది.

1921 ఫిబ్రవరిలో సహాయ నిరాకరణ వాదులు జూట్‌ని బహిష్కరించ యత్నించారు. జూట్ సేద్యాన్ని వదిలిపెట్టమని, జూట్‌కి బదులుగా వరి, ప్రత్తి, సాగుచేయమని రైతుల్ని అర్థించారు. ఈ ప్రయత్నం బ్రిటిషు యాజమాన్యంలో వున్న జూటుమిల్లుల్ని దెబ్బతీసేందుకు ఆహారధాన్యాల ధరలు తగ్గించేందుకు, ఖద్దరును ప్రోత్సహించేందుకు ఉద్దేశించబడింది. జూట్ లాభసాటిగా వున్నది గనుక రైతుల నుండి అంతగా స్పందన రాలేదు కాని నీలి మందు సాగుకి వ్యతిరేకంగా పోరాడుతున్న రైతులకు కలకత్తా విద్యార్థి సోమేశ్వర్ ప్రసాద్ చౌదురి సమర్థవంతమైన మార్గదర్శకత్వం వహించడంతో రాజషాహి, నాడియాపాబ్నా –తషీరాబాద్ సరిహద్దుల్లో తెల్లవారి యాజమాన్యంలో గల జమీందారీ, మిద్నాపూర్ జమీందారీ కంపెనీకి వ్యతిరేకంగా చేపట్టిన ప్రచారం కొంత ఫలప్రదమయింది. చౌదరి తరువాత తన స్వీయ చరిత్రలో దాస్ తనని ప్రోత్సహించారని, కాంగ్రెస్ అధికారికంగా శిస్తు పన్నుల చెల్లింపు నిరాకరణని బలపరచరాదని హెచ్చరించారని రాసుకొన్నారు.

మిద్నాపూర్‌లోని కాంటై, లూమెలుక్, సబ్ డివిజన్లలో వీరేంద్రనాథ్ సాస్మల్ నాయకత్వంలో యూనియన్ బోర్డు వ్యతిరేక ఆందోళన చేపట్టబడింది. కొత్తగా ప్రవేశపెట్టబడిన యూనియన్ బోర్డు అంటే స్థానిక పన్నులలో విపరీతమైన పెరుగుదల, మిద్నాపూర్‌కి చెందిన ప్రధానంగా మాహిష్యాలలో 1921 నవంబర్ –డిసెంబర్ కాలంలో పన్ను నిరాకరణ ఉద్యమాన్ని సస్మాల్ సమర్థవంతంగా నడపగలిగారు. ఫలితంగా ప్రభుత్వం జిల్లా నుండి కొత్త శాసనాన్ని వెనక్కి తీసుకుంది. 1921 –22 చలికాలంలో పాబ్నా, బోగ్రాలలో ప్రత్యేకించి జితేంద్రలాల్ బెనర్జీ నాయకత్వం వహించిన బీర్భం యొక్క సబ్ డివిజన్ రాంపుర్హట్‌లో రైతులు సెటిల్‌మెంట్ ఆపరేషన్స్‌ని ప్రతి ఘటించారు.

ఇవి స్థానిక లాయర్లు రాజకీయవేత్తలచే నడపబడిన సాపేక్షికంగా సంపన్న రైతుల ఉద్యమాలు. క్రింది స్థాయి ఉద్యమాలు చెలరేగే సంకేతాలు స్పష్టంగా వెలువడ్డాయి. 1921 మార్చి 24న 669 మందికి పైగా ఖైదీలు గాంధీ స్వరాజ్యం వచ్చిందని ప్రకటించి పారిపోయారు. 1922 ప్రారంభంలో 'చట్టరాహిత్యం పెల్లుబికిందని" అధికార రిపోర్టు పేర్కొన్నది... "ఉద్యమం నాయకుల అదుపు తప్పింది... అహింసా ప్రవృత్తి, అన్ని రకాల అధికారం పట్ల తిరస్కారం... నాయకులది కాదు, ప్రజలది". ఉద్యమం నిర్మాణ బద్ధంగా వున్న మిడ్నాపూర్‌లో కూడా యూనియన్ బోర్డు రద్దు చేయబడిన (1921 డిసెంబర్‌లో) తరువాత చౌకీదారు పన్నులు చెల్లించవలసిందిగా జిల్లా నాయకులు చేసిన విజ్ఞప్తుల్ని ప్రజలు పట్టించుకోలేదు. ఝూర్గం సబ్ డివిజనులోని  సంతాలులు జమీందారు యాజమాన్యంలో గల అడవుల్ని లూటీ చేశారు. 1922 ఫిబ్రవరిలో జల్పాయిగురిలో గాంధీ టోపీలు ధరించిన సంతాలులు పోలీసులపై దాడులు చేశారు. గాంధీ టోపీలు ధరిస్తే తూటాలు తమనేమీ చేయలేవని చెప్పుకొన్నారు. పొరుగున ఉన్న ఉత్తర బెంగాలు జిల్లా –రంగాపూర్‌లో చౌకీదారు పన్ను చెల్లింపు నిరాకరణ, కౌలు చెల్లింపు నిరాకరణగా అభివృద్ధి చెందింది. నీల్ఫామారికి చెందిన ముస్లిం రైతులు 'గాంధీ దరోగ" ఆధ్వర్యంలో "స్వరాజ్యతాణా"ని స్థాపించారు. చిటగాంగ్‌లో రిజర్వు ఫారెస్టులపై దాడులు చేసి లూటీ చేశారు." ఈ పని వలంటీర్లు కాదు, సాధారణ ప్రజలు వారి అవసరాల రీత్యా చేశారు." తిప్పెరలోని చౌదాగ్రాం సబ్ డివిజనులో 1921 నవంబరు నుండి గ్రామ మోతాదులు పని నిలిపివేశారు. "పన్నులు చెల్లించబడలేదు.... రైతులు ప్రభుత్వానికి గాని, ప్రైవేట్ భూస్వాములకు గాని కౌలు చెల్లించలేదు. ఆందోళన పూర్తిగా మహమ్మదీయులది, కానీ మతపరమైన ఆందోళన కాదు. ప్రజలు తమ సత్తా ఏమిటో చాటి చెప్పాలనుకొన్నారు. (బెంగాలు ప్రభుత్వం, రాజకీయ రహస్య సమాచారం, బెంగాలులో సహాయ నిరాకరణ ఖిలాపత్ ఉద్యమాలు చరిత్ర. రంగపూర్, చిట్టగాంగ్, తిప్పెర, కాస్త వెలుపలగా వున్న జిల్లాలు. పై స్థాయి నాయకులు తరచుగా చూడని జిల్లాలు. స్థానిక వలంటీర్లు, నాయకులు ప్రజల్ని అదుపు చేయ యత్నించి విఫలమైనారని రిపోర్టులు పలుమార్లు స్పష్టం చేశాయి. "సబ్ కాంట్రాక్టర్ల' సిద్ధాంతం లేక కులీన రాజకీయవేత్తల ప్రేరణ– వగైరాలు యిక్కడ అర్థం లేని మాటలు.

బెంగాల్ గాంధేయ పరిమితుల్ని చాలాసార్లు అతిక్రమించింది. సహాయ నిరాకరణ సందర్భంగా నిర్మాణాత్మకంగా పనిచేసిన ప్రావిన్సుగా బీహారు గాంధి ప్రశంసలు అందుకొన్నది. "బీహారు నాయకులు అహింస యొక్క నిజమైన స్ఫూర్తిని అర్థం చేసుకొన్నారు".... (యంగ్ ఇండియా, 1921 మార్చి 2). 1922 జూన్ నాటికి 41 జాతీయ ఉన్నత పాఠశాలలు, 600 జాతీయ ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలు. 21,500 మంది విద్యార్థులు చేయబడినారు. దూది చరఖాలను పంపిణీ చేసేందుకు 11 జిల్లాలలో 48 కేంద్రాలు నెలకొల్పబడ్డాయి. 3,00,000 చరఖాలు 8,900 చే మగ్గాలతో నెలకు 95,000 గజాల బట్టల ఉత్పత్తి జరుగుతున్నట్లు 1922 ఆగష్టులో బీహారు నుండి వచ్చిన సమాచారం. ఖాదీ ఖరీదైనది గనుక అంతగా ప్రజాదరణ పొందలేదని, కేవలం 1 శాతం ప్రజలు మాత్రమే ఖద్దరు ధరిస్తున్నారని నాయకులు అంగీకరించారు. మద్యం బహిష్కరణ గణనీయంగా ప్రజాదరణ పొందింది. ఛోటా

నాగపూర్ తెగలతో ప్రత్యేకించి తానా భాగత్‌తెగతో సంబంధాలు ఏర్పడ్డాయి. కాని అక్కడ గూడా చెదురుమదురుగా హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. 1921 జనవరిలో ముజఫర్‌పూర్, భాగల్పూర్, మొంఘిన్, పూర్ణియాలలో 35 అక్రమంగా నిధులు వసూలు చేసిన కేసులు (గాంధీ శిష్యులుగా చెప్పుకొన్న కొందరు న్యాయమైన ధరల్ని అమలు జరుప యత్నించారు) నమోదయ్యాయి. 1921 ఏప్రిల్ 25న ఖిలాపత్ వలంటీర్ల అరెస్టుతో గిరిధీపై దాడి, ఫలితంగా కాల్పులు జరిగాయి. సాంప్రదాయకంగా గ్రామాలకు చెందిన పచ్చిక బయళ్ళను జమీందారులు, నీలిమందు తోటల పెంపకందార్లు ఆక్రమించడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. 1921 జనవరిలో భాగల్పూరులోని సోన్‌పార్సా గ్రామానికి చెందిన భూమిహార్లు యూరపుకి చెందిన భూస్వామి క్రింద పనిచేసే గూర్ఖాలపై దాడి చేశారు. పచ్చిక మేపుకునే హక్కులకు సంబంధించిన వివాదం 1921 నవంబరులో చంపారన్ మోతిహారి సమీపంలోని చౌతేర్వా నీలిమందు ఫ్యాక్టరీ తగులబెట్టడానికి దారితీసింది. 1922 జనవరిలో పన్ను చెల్లింపు నిరాకరణ ఉద్యమాన్ని అణచివేసేందుకు పోలీసుల్ని పంపడంతో ముజఫర్‌లో సీతామార్చి సబ్ డివిజన్ అలజడికి కేంద్రమయింది. 1920లో దర్భాంగా ఎస్టేటుని ఊపివేసిన జమీందారీ వ్యతిరేక రైతాంగ ఉద్యమం పునరుద్ధరింపబడలేదు. బీహారు కాంగ్రెస్ నాయకత్వం ఈ ఉద్యమంతో సంబంధాలు తెంచుకొని దూరంగా ఉండిపోయింది. కార్మికులు పనిచేసే ప్రాంతాలలో సహాయ నిరాకరణ ప్రచారం, స్వామి విశ్వానంద (ఝురియాలో రామ్జాస్ అగర్వాలా లాంటి మార్వాడి గని యజమానుల మద్దతు పొందిన) కార్యకలాపాలు కలసి అస్సాం తరహాలో కార్మికులు గనుల నుండి పెద్ద ఎత్తున వలసపోయేలా చేస్తాయని 1921 వేసవిలో చోట నాగపూర్ ప్రాంతపు బొగ్గుగని యజమానులలోని తెల్లవారు ఆందోళన వ్యక్తం చేశారు. గిరిధి వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు ప్రవేశించక ముందే మిల్లు యజమానులు కార్మిక సంఘాన్ని ప్రారంభించారు. (హోం పొలిటికల్ 43/1921)

సహాయ నిరాకరణ కాలంలో యునైటెడ్ ప్రావిన్సెస్ కాంగ్రెస్‌కి అత్యంత బలమైన స్థావరాలలో ఒకటయింది. 1921 జూలైలో కాంగ్రెస్ సభ్యత్వం 3,28,966 (బీహార్ తరువాత స్థానం దీనిది. బీహారు సభ్యత్వం 3,50,000). అప్పటి నుండి యు.పి. జాతీయ రాజకీయాలలో నాయకత్వ స్థానాన్ని పొందింది. ఇప్పటికీ కొనసాగుతుంది. 1920-21 ప్రముఖ జాతీయవాదులు – జవహర్‌లాల్ నెహ్రూ, పురుషోత్తమదాస్ టాండన్, గణేశ్ శంకర్ విద్యార్థి, గోవింద వల్లభపంత్, లాల్ బహుదూర్ శాస్త్రి – లాంటి ప్రముఖుల రాజకీయ జీవితం ప్రారంభించిన సంవత్సరం. 1922 ప్రారంభానికి 9,00,000 మంది వలంటీర్లు నమోదు చేయబడ్డారు. అలాగే ఖిలాపత్ స్వచ్ఛంద సంస్థలలో కూడా విపరీతమైన పెరుగుదల ఉంది. 1921 జూలై నాటికి ప్రావిన్సులో 137 జాతీయ విద్యా సంస్థలు స్థాపించబడ్డాయి. వాటిలో అత్యంత ప్రముఖమైనది కాశీ విద్యాపీఠ్. యు.పి మేధావులపై గాంధేయవాద ప్రభావం, ప్రేమ్‌చంద్ నవలలో చాలా స్పష్టముగా ప్రతిఫలించింది. గోరఖ్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ప్రేమ్‌చంద్ 1921 ఫిబ్రవరిలో జాతీయవాద పత్రిక “ఆజ్”లో, కాశీ విద్యాపీఠ్‌లో పనిచేసేందుకు రాజీనామా చేశాడు. ఆయన

'ప్రేమాశ్రమం' (1921) గాంధేయ భావాలపై ఆసక్తి గల ఒక భూస్వామిని చిత్రిస్తుంది. 'రంగభూమి' (1925)లో కథా నాయకుడు గుడ్డి బిచ్చగాడు పేద సూరదాసు. గ్రామ పచ్చిక బయళ్ళని ఒక ఆంగ్లోయిండియన్ సిగరెట్ ఫ్యాక్టరీ స్వాధీనం చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ కథానాయకుడు చేసిన పోరాటాన్ని చిత్రిస్తుంది. తరువాత నవలలో రెండు పాత్రలు వినయ్‌సింగ్, సోఫియాలు విప్లవకారులుగా మారడం చిత్రీకరించింది.

ఇతర ప్రాంతాలలో లాగానే సహాయ నిరాకరణ నిర్వహణ, నగరాల చిన్నపట్టణాల పనయింది. కానీ గ్రామీణ ప్రాంతాలలోని ప్రాథమిక ఉద్యమాలు కూడా అంతే ప్రాధాన్యతను సంతరించుకొన్నాయి. యు.పి కాంగ్రెస్ నాయకత్వం బీహార్ కంటె రైతు పోరాటాల పట్ల కాస్త ఎక్కువగా స్పందించింది. అందుకు కారణం అవధ్ తాలూకా వారు బ్రిటిష్ ప్రభుత్వానికి ఎక్కువ విధేయులుగా వుండడం కావచ్చు. దక్షిణ, ఎస్.ఇ. అవధ్‌లో రైతు పోరాటాలు బాబా రామచంద్ర పోరాటాల కలయికతో 1921 జనవరి –మార్చి మధ్య కాలంలో రాయ్‌బరేలీ, ప్రతాప్‌ఘర్, ఫైబాబాద్, సుల్తాన్‌పూర్‌లలో విస్తృతంగా రైతుల దొమ్మీలు జరిగాయి. దాడుల లక్ష్యాలు యిళ్ళు, పంటలే గాక విపణి వీధులు, వర్తకుల ఆస్తిపాస్తులు కూడా ఉదాహరణకు రాయ్‌బరేలీలోని పుర్‌సత్‌గంజ్ బజారుపై జనవరి 6న 10,000 మంది దాడి చేశారు. ఆహారధాన్యాలు, బట్టలు ప్రియమై పోయాయని ఆరోపణ. గుడ్డ గజం 4 అణాలకు, పిండి రూపాయకు 8 శేర్లు అమ్మేటట్లు ఆదేశాలు జారీ చేయబడాలని డిమాండు చేశారు. ఇది ధరల్ని ప్రజలు నిర్ణయించే ప్రయత్నం. ఇది ఫ్రెంచి విప్లవ కాలంలో విప్లవానికి ముందు ప్రజలు చేపట్టిన హింసాయుతమైన ఆందోళనని స్ఫురణకు తెస్తుంది.

పోలీసులతో హింసాయుత ఘర్షణలు జరిగాయి. ప్రజాకోర్టులు తీర్పులు చెప్పాయి. సామాన్యులు తమకు తాముగా రాజులమని ప్రకటించుకొన్నట్లయింది. ఫైజాబాద్‌లో 'రామచంద్రుడు' అవతరించాడు, పన్నులు – శిస్తులు చెల్లించవద్దని, పొలం లేని వారికి పొలాలు పంచుతామని బోధించారు. అంతా గాంధీ పేరుతో.

సాధారణ ప్రజల తిరుగుబాటుని గాంధీ ఖండించడాన్ని గురించి యింతకు ముందు ప్రస్తావించబడింది. 1921 లో నెహ్రూ వైఖరి కూడా దీనికి భిన్నంగా లేదు. హింసకు పాల్పడిన వారికి పోలీసులు జైళ్ళలో నిర్బంధిస్తారని తెలిసి కూడా హింసాయుత కార్యక్రమాలలో పాల్గొనడం వలన ప్రయోజనం లేదని ప్రజలకు నచ్చచెపుతూ తాను ఫైజాబాద్‌లోని సభలో ప్రసంగించినట్లు నెహ్రూ స్వీయ చరిత్రలో జ్ఞప్తికి తెచ్చుకున్నారు. బాబారామచంద్రని ఆ ప్రాంతానికి దూరంగా వుండమని ఖిలాపత్ వాదులు, కాంగ్రెస్ నాయకులు చెప్పారు. బాబారామచంద్ర ఫిబ్రవరి 10న అరెస్టు చేయబడ్డాడు. మోతీలాల్ నెహ్రూ, గౌరీశంకర్ మిశ్రాలు ఒక కరపత్రంలో యిలా పేర్కొన్నారు.

"ఈ ఘటన పట్ల అసంతృప్తి చెందగూడదు. కనీసం అతడి విడుదల కొరకు ప్రయత్నించనూ కూడదు."

1930లలో రామచంద్ర రాసుకొన్న స్వీయ చరిత్రలో కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని ఖండించాడు. కాని 1921లో మాత్రం జాతీయవాద నాయకుల మార్గాన్ని తనకు తరచుగా యిష్టపడే అనుసరించాడు.

1921 వేసవి నాటికి సహాయ నిరాకరణ రైతు ఉద్యమాన్ని దాదాపు కబళించింది. రైతుల ప్రత్యేక డిమాండ్లు వెనక్కి నెట్టబడ్డాయి. కాని కలత చెందిన యు.పి. ప్రభుత్వం "అవుధ్ కౌలు చట్టం 1921" పేరుతో కొన్ని రాయితీలు ఇచ్చే విధంగా తాలూకాదార్లను ఒప్పించింది. (ఏడు సంవత్సరాల కౌలు కాల వ్యవధికి బదులుగా జీవితకాలం కౌలు వ్యవధిలాంటి) కాని 1921 చివరలో 1922 ప్రారంభంలో వాయువ్య అవధ్‌లో (హార్డోయ్, ఒచ్‌రాయిచ్, బారాబంకి, సీతాపూర్ జిల్లాలలో) పరిస్థితులు చేజారిపోయే పరిస్థితి వచ్చింది. స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రారంభించిన 'ఏకా' ఉద్యమం మరింత సమరశీల మదారిపాసి వశమయింది. 'కౌలు పంట రూపంలో గాక డబ్బు రూపంలో వుండాలి' అప్పటి ప్రధానమైన డిమాండు. రేట్లు విపరీతముగా పెరుగుతున్నాయి గనుక రైతులకిది లాభదాయకం. 1922 జూన్‌లో పోలీసులు ఉద్యమాన్ని అణచివేసి 'మదారి పాసి'ని అరెస్టు చేశారు.

సామాజికంగా దిగువన వున్న ప్రజలలో అసంతృప్తి సంకేతాలు గమనించి యుపిలోని బ్రిటిష్‌వారు కలవరపడ్డారు. 1921 వేసవిలో కొండ తెగలు కుమవన్ డివిజన్‌లోని వేలాది ఎకరాల రిజర్వుడు ఫారెస్టులను తగులబెట్టాయి (సెక్రటరీ ఆఫ్ స్టేట్‌కి వైస్రాయి 1921 జూలై 10, రీడింగ్ కలెక్షన్). "అవుధ్, అవుధ్ గ్రామీణ ప్రాంతంలో సభలకు హాజరయ్యే వారిలో అత్యధికులు పొలాలు పోగొట్టుకొన్న వారు గాంధీ తమ పొలాల్ని తమకు సాధించి పెడతాడని విశ్వసించేవారు. తాము కౌలుకి చేసుకునేందుకు పొలాలు గాంధీ యిప్పిస్తాడని నమ్మే క్రింది తరగతికి చెందిన కూలీలు". అని 1921 అక్టోబరులో రీడింగ్ ఆందోళన వ్యక్తం చేశాడు.

**చౌరీ-చౌరా**

గాంధీకి చివరి సమిధగా ఉపయోగపడిన చౌరీ-చౌరా ఘటన గోరఖ్‌పూర్ గ్రామంలో జరిగింది. దీనిపై కిసాన్ సభ 'ఏకా' ఆందోళనల ప్రభావం లేదు. మద్యం అమ్మకాలకు, ఆహార ధాన్యాల అధిక ధరలకు వ్యతిరేకంగా సుశిక్షుతులైన వలంటీర్ల బృందం పికెటింగు ప్రారంభించింది. ఉద్యమకారులు విపరీతంగా రెచ్చగొట్టబడ్డారని గాంధీ స్వయముగా అంగీకరించారు. పోలీసులు వలంటీర్ నాయకుడిని (భగవాన్ అహీర్ ఆర్మీ ఫించనుదారుడు) చితకబాదారు. పోలీసు స్టేషను ఎదుట నిరసన తెలిపేందుకు వచ్చిన గుంపుపై కాల్పులు జరిపారు. చౌరీ చౌరా నిందితులైన 225 మందిలో 172 మందికి సెషను కోర్టు మరణశిక్ష విధించడంలో ఈ ఘటన వల్ల బ్రిటిషు పాలకుల భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. (ఆ తరువాత 19 మంది ఉరితీయబడ్డారు. మిగిలిన వారికి ద్వీపాంతర వాస శిక్ష విధింపబడింది.) 22 మంది పోలీసులు చంపబడినందుకు కసిగా 172 మంది ప్రాణాలు బలిగొనడానికి నిరసనగా జాతీయ స్థాయిలో ఎలాంటి నిరసనలు వ్యక్తం కాకపోవటం నిజంగా

సిగ్గు చేటు. నమోదయిన నిరసన యం.యన్.రాయ్ యొక్క ప్రవాస పత్రిక వేన్‌గార్డు' నుండి, అలాగే కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ నిరసన వ్యక్తం చేసింది. ఈ నాటికి చౌరీ చౌరా వద్ద పోలీసు స్మృతి చిహ్నం వుంది. రైతు మృతవీరుల గౌరవార్థం ఎలాంటి చిహ్నం లేదు.

'చౌరీ చౌరా ఘటన తరువాత మొత్తం ఉద్యమాన్ని ఆపివేయాలని గాంధీ ఆకస్మికంగా ఏకపక్షంగా తీసుకొన్న నిర్ణయం దాదాపు ప్రముఖ కాంగ్రెస్ నాయకులందరి యొక్క తీవ్ర నిరసనకు గురయింది. సహజంగా అంతకంటే ఎక్కువగా యువకుల నిరసనకు గురయిందని నెహ్రూ రాశాడు. (స్వీయ చరిత్ర పేజి 82) గాంధీ తన సమర్థనకు 1922 ఫిబ్రవరి 'యంగ్ ఇండియా' లో ప్రస్తావించిన విధంగా రెండు వాదనలను ఉపయోగించుకొన్నాడు. 1. అహింసా సిద్ధాంతంపై ఆవేశపూరిత పునరుద్ఘాటన. (ఉద్యమం హింసాయుతం కాకుండా నివారించేందుకు నేను ఎలాంటి అవమాన్నైనా, చిత్రహింసలకైనా ఎలాంటి వెలివేతనైనా చివరికి మరణాన్నైనా సహిస్తాను). దానితో పాటు ఈ క్రింది విస్పష్టమైన ప్రకటన కూడా చేశాడు. "బార్డోలి అహింసాయుత ధిక్కారం జయప్రదం అయ్యేలా భగవంతుడు ఆమోదం తెలిపాడనుకోండి. అప్పుడు విజేతల కనుకూలంగా భారతదేశ ప్రభుత్వం పాలనా బాధ్యతలను త్యజించి వుంటే ఈ అరాచక శక్తుల్ని అదుపు చేసేదెవరు...?" వామపక్ష విమర్శగా ఆర్.పి.దత్ ప్రస్తావించినట్లు ఫిబ్రవరి 12న వర్కింగ్ కమిటీ విరమణని ఆమోదిస్తూ బార్డోలీ తీర్మానంలో వున్న 7 క్లాజులలో రెండింటిని నొక్కి చెప్పింది. జమీందారులకు కౌలు (రెంట్) చెల్లింపుని ఆపివేయటం కాంగ్రెస్ తీర్మానాలకు విరుద్ధం. (నెం.6) వారి చట్టబద్ధమైన హక్కులపై దాడి చేయడం కాంగ్రెస్ ఉద్యమం ఉద్దేశం కాదు... (నెం.7) (ఇండియా టుడే. పే. 290) అయినప్పటికి చౌరీ చౌరా ఘటనతో కౌలుకి సంబంధం లేదు. కౌలు చెల్లించకపోవడం గూడా అనివార్యంగా వస్త్రాలు, మద్యం సమస్యలపై పికెటింగ్ చేయడం కంటె హింసాయుతమైన చర్యకాదు.

గాంధీ పట్ల గౌరవభావంతో ఆయన ప్రత్యేక తరహా గల అదుపులో ఉండే ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించడానికి సన్నద్ధమై వున్నాడని, ఆ మేరకు పలుమార్లు హెచ్చరికలు చేశాడని, ఆయనకు వర్గపోరాటం లేక సామాజిక విప్లవం పట్ల ఆసక్తి లేదని వాదించవచ్చు. గాంధీ విరమణ పిలుపుతో ఉద్యమం మొత్తం కుప్పకూలిందన్న వాస్తవం కూడా దాని ప్రాథమిక బలహీనతల్ని తెలియజేస్తుంది. 1919 -22 కాలంలో భారతదేశంలో ఉవ్వెత్తుగా లేవడానికి చాలా అనుకూలమైన పరిస్థితులు వున్నాయి. కొన్ని సందర్భాలలోని విప్లవ పరిస్థితులు కూడా వున్నాయి. ప్రత్యామ్నాయ విప్లవ నాయకత్వ మార్గానికి అడ్డుగూడా లేదు. ప్రజలు గాంధీ రాజ్యం అనే అస్పష్టమైన స్వప్నంతో ప్రేరేపింపబడి వున్నారు. గాంధీ రాజ్యంపై వారి వారి వైవిధ్యభరితమైన వ్యాఖ్యానాలు - కొన్నిసార్లు విప్లవ మార్గాలకు దగ్గరగా - చేసుకొని వున్నారు. కాని నాయకత్వం కొరకు గాంధీ వైపు మాత్రమే చూశారు. అప్పటికి జైలులో వుండి బార్డోలి వెనుకంజ పట్ల అయిష్టతని ప్రకటించిన మోతీలాల్‌నెహ్రూ, లజపతిరాయ్, సి.ఆర్.దాస్ లాంటి కాంగ్రెస్ నాయకులు ఏ విధంగానూ సమూలమైన మార్పులు కోరేవారు కాదు. గాంధీ కంటే సామాజికంగా తక్కువ అడ్డుకొనే వారు కాదు. విభేదం తగిన సమయమా కాదా అనే సమస్యపై

ఎత్తుగడకి సంబంధించింది మాత్రమే. వేల్సు యువరాజు 1921 డిశంబరు భారతదేశ సందర్శన సందర్భంగా బ్రిటిషువారు పంపిన శాంతి సామరస్య పూర్వకమైన సందేశాలకు అంగీకారం తెలిపితే, రాజ్యాంగ సంస్కరణల రూపంలో నిర్దిష్టమైన ప్రయోజనాలు చేకూరి వుండేవని మోతీలాల్ నెహ్రూ, సి.ఆర్.దాస్‌లు భావించారు. గాంధీ అప్పుడు ఎలాంటి రాజీ కుదరదని తిరస్కరించారు. కాని ఇప్పుడు ఎలాంటి ప్రతిఫలం లేకుండా శాసనోల్లంఘనని విరమించాడు.

ముఖ్యమైన కాంగ్రెసు నాయకులందరినీ అరెస్టు చేస్తూ కూడా గాంధీని అంటుకోవడానికి సాహసించని బ్రిటిషువారు ధైర్యాన్ని పుంజుకొని 1922 మార్చి 10న అరెస్టు చేసి 6 సంవత్సరాల కారాగారవాస శిక్ష విధించారు. గాంధీ కలిగించిన భయానికి కసి తీర్చుకొన్నారు. గాంధీ కోర్టులో ఇచ్చిన ఉదాత్తమైన ఉపన్యాసంతో ఈ సందర్భాన్ని కలకాలం గుర్తుండేలా చేశారు. 'చట్టరీత్యా బాహాటమైన నేరానికి అత్యంత కఠినమైన శిక్ష విధించడాన్ని నేను సంతోషంగా ఆహ్వానిస్తున్నాను. నా దృష్టిలో యిది పౌరుడుగా నిర్వర్తించవలసిన అత్యున్నతమైన బాధ్యత" గాంధీ జైలుకి వెళ్ళారు. కాని దేశంలో ఎక్కడా చిన్న నిరసనలు కూడా చెలరేగలేదు.

## 1922 -27 : పతనం, చీలికలు

1920 లో గాంధీ 'సంవత్సరంలో స్వరాజ్యం' వాగ్దానం ఎన్నో ఆశల్ని రేకెత్తించింది. కాని స్వరాజ్యం రాలేదు. చౌరీ చౌరా ఘటనతో ఉద్యమం విరమించబడింది. గాంధీ జైలుకు పంపబడ్డాడు. నాటికి కాంగ్రెస్ సభ్యత్వం (ఎఐసిసికి 20కి గాను 16 ప్రావిన్సులు పంపించిన రిపోర్టుల ప్రకారం) 1,06,046 కి అంటే 2 సంవత్సరాల క్రితం ఒక్క యు.పిలో మూడవ వంతు సభ్యత్వం కంటె తక్కువకి పడిపోయింది. మార్పు కోరని వారు, స్వరాజ్యవాదుల వివాదం జాతీయ ఉద్యమాన్ని చీల్చే పరిస్థితి తెచ్చిపెట్టింది.

1919 –22 కాలం నాటి హిందూ – ముస్లిం ఐక్యత స్థానంలో మునుపెన్నడూలేనంత తీవ్ర స్థాయిలో మతఘర్షణలు చెలరేగాయి. కాని ఉపరితలం దిగువన ఇతర శక్తులు బలాన్ని కూడగట్టుకుంటున్నాయి. 1927 నవంబరులో సభ్యులందరూ తెల్లవారుగా గల సైమన్ కమిషన్ ప్రకటనతో పెల్లుబికిన జాతీయ పునరుజ్జీవం సహాయ నిరాకరణగా పరిణమించింది,. 1922 –27 కాలాన్ని పరిశీలించేటప్పుడు మనం ఉద్యమం క్షీణతని, పునరుద్ధరణ ప్రారంభ సూచికల్ని – రెండు అంశాల్ని అధ్యయనం చేయాలి.

### మార్పులు కోరనివారు - స్వరాజ్యవాదులు

భవిష్యత్ కార్యక్రమాన్ని సిఫార్సు చేసేందుకు ఎఐసిసిచే 1922 జూన్‌లో నియమించబడిన శాసనోల్లంఘన విచారణ కమిటీలో అన్సారీ, రాజగోపాలాచారి, కస్తూరి రంగ అయ్యంగార్లు, గాంధేయ గ్రామీణ నిర్మాణాత్మక కార్యక్రమాలపై కేంద్రీకరించాలని సూచించారు. ఇక మోతీలాల్ నెహ్రూ, విఠల్ బాయ్ పటేల్, హకీం అజ్మల్ ఖాన్‌లు మారిన

పరిస్థితులలో కౌన్సిల్ ఎన్నికలలో కాంగ్రెస్ భాగస్వామ్యం వహించాలని వాదించారు. వల్లభాయ్‌పటేల్, రాజేంద్రప్రసాద్ లాంటి సిసలైన గాంధేయవాదులు మొదటి వైఖరిని బలపరిచారు. గయ కాంగ్రెస్ (1922 డిశంబరు) అధ్యక్షుడు సి.ఆర్.దాస్ కౌన్సిలులో కాంగ్రెస్ ప్రవేశాన్ని సమర్థిస్తూ చాలా బలంగా వాదించారు. కౌన్సిల్ కార్యకలాపాల్ని ఆటంకపరచి, స్తంభింపజేయడం వలన బ్రిటిషువారు మరికొన్ని సంస్కరణల్ని ఆమోదించేలా ఒత్తిడి చేయడం జరుగుతుందని, అందువలన కాంగ్రెస్ కౌన్సిల్‌లో ప్రవేశించాలని సి.ఆర్.దాస్ వాదించారు. గయ కాంగ్రెస్‌కి రెండు నెలల ముందు యు.పి. కాంగ్రెస్ సదస్సులో స్వరాజ్యం కులీనులకు మాత్రమే కాదని ప్రజలకని సి.ఆర్.దాస్ విస్పష్టంగా ప్రకటించారు. కౌన్సిల్‌లో ప్రవేశాన్ని గయ కాంగ్రెస్ 1740 - 890 ఓట్లతో తిరస్కరించింది. కాని నవంబరులో జరుగనున్న ఎన్నికలలో పోటీ చేసేందుకు దాస్, మోతీలాల్ నెహ్రూలు 1923 మార్చిలో స్వరాజ్య పార్టీని ప్రారంభించారు. ఢిల్లీ మధ్యంతర కాంగ్రెస్ సదస్సు (సెప్టెంబర్ -1923), కాకినాడ వార్షిక సదస్సు (డిశంబరు 1923)లలో ఒక రాజీ ప్రతిపాదన ఆమోదం పొందింది. దీని ననుసరించి కాంగ్రెస్ వాదులు నిర్మాణాత్మక కార్యక్రమాలపై విశ్వాసాన్ని పునరుద్ఘాటిస్తూ ఎన్నికలలో పోటీ చేయవచ్చు. కాంగ్రెస్ అనుబంధ సంస్థగా అఖిల భారత ఖాదీ బోర్డు స్థాపించబడింది. 1924 ఫిబ్రవరిలో జైలు నుంచి గాంధీ విడుదలతో మరొక మారు మార్పులు కోరని వారివైపు కాంగ్రెస్ మొగ్గు చూపనున్నట్లు కనిపించింది. 1924 జూన్‌లో అహమ్మదాబాద్‌లో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ సదస్సులో కాంగ్రెస్ సభ్యత్వానికి నూలు వడకడం కనీస అర్హతగా వుండాలని, కౌన్సిలులో ప్రవేశించిన వారిని కాంగ్రెస్ అధికార పదవుల నుండి తొలగించాలని, యిటీవల బెంగాల్ టెర్రరిస్టు ఘటనని పూర్తిగా ఖండించాలని గాంధీ పట్టుబట్టారు. మొదటి రెండు తీర్మానాలు ఓడింపబడ్డాయి. గోపీనాథ్ సహనిపై ఖండన తీర్మానాన్ని సి.ఆర్.పి.దాస్, అత్యధిక బెంగాలీ ప్రతినిధులు తీవ్రంగా వ్యతిరేకించారు. తీర్మానం 78-70 ఓట్లతో ఆమోదం పొందింది. గాంధీ తాను పరాజితుడైనట్లు ప్రకటించాడు. (యంగ్ ఇండియా 1924 జూలై 3) సి.ఆర్.దాస్, మోతీలాల్ నెహ్రూలతో 1924 నవంబరులో ఒక అంగీకారానికి వచ్చారు. అంగీకారం వివరాలు: స్వరాజ్యం పొందుట కాంగ్రెస్‌లో అంతర్భాగంగా వుంటూనే కౌన్సిళ్ళలో పనిచేయవచ్చును. కాంగ్రెస్ సభ్యత్వానికి నూలు వడకడం అర్హతగా ప్రవేశపెట్టాలి. (స్వయంగా గాని మరొకరిని పెట్టుకొని గాని 2000 గజాలు నూలు తీయాలి). ఆ తరువాత సంవత్సరం కాంగ్రెస్ సంస్థాగత యంత్రాంగం మొత్తాన్ని స్వరాజ్యవాదుల చేతుల్లో పెట్టాలని, తన ఆదర్శాలను అమలు జరిపేందుకు అఖిల భారత నూలు వడికేవారి సంఘాన్ని స్థాపించాలని గాంధీ నిర్ణయించారు. 1926 వ సంవత్సరం తాను మౌనం పాటించే సంవత్సరమని గాంధీ చేసిన ప్రకటన గాంధీ రాజకీయాల నుండి విరమించుకుంటున్నారనే వదంతులకు దారితీసింది.

## నాగపూర్, బోర్సాడ్, వైకాం

పెద్ద ఆందోళనలు నిర్వహించగల కాంగ్రెస్ సమర్థతని అంతర్గత ఘర్షణలు అనివార్యంగా తగ్గించాయి. నగరంలో కొన్ని ప్రాంతాలలో కాంగ్రెస్ జెండా ఉపయోగించరాదని

యివ్వబడిన స్థానిక ఆదేశానికి వ్యతిరేకంగా 1923 మధ్యలో నాగపూర్ జెండా సత్యాగ్రహం ప్రారంభమయింది. గుజరాత్ నుండి వల్లభాయ్‌పటేల్ నాయకత్వంలో పెద్ద సంఖ్యలో వలంటీర్లను పంపి తన సంస్థాగత బలాన్ని నిరూపించుకొన్నది. అయినప్పటికి సత్యాగ్రహం రాజీగా ముగిసింది. కొనసాగుతున్న అకాలీ ఆందోళనపై జవహర్‌లాల్ లాంటి నాయకులు కొద్ది కాలం తమ దృష్టి కేంద్రీకరించారు. తొలగించబడిన మొహంత్, యస్.జి.పి.సి కొత్త యాజమాన్యం మధ్య వివాదంలో వున్న స్థలంలో చెట్టుకొట్టడంపై మొదలయిన చిన్న వివాదం నుండి 'గురు –కె – బాగ్ సత్యాగ్రహం' (ఆగష్టు 1922 ఏప్రిల్ 1923) ప్రారంభమయింది. కాని పూర్తి శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వేలాది మంది అకాలీ వలంటీర్లను పోలీసులు అతి దారుణంగా కొట్టడం ఈ వివాదం దేశవ్యాప్త సానుభూతిని చూరగొన్నది. ఆ మరుసటి సంవత్సరం అకాలీ ఉద్యమానికి ముఖ్య పోషకుడు నాభాకి చెందిన రిపుదమన్ సింగ్ బ్రిటిష ఒత్తిడి మేరకు చేసిన పదవీ త్యాగం జైటోలో సత్యాగ్రహానికి దారి తీసింది. ఆ తరువాత వచ్చిన పంజాబు గవర్నర్ మాల్కంహేలీ సిక్కు మత కేంద్రాలపై యస్.జి.పి.సి అదుపును ఆమోదిస్తూ సిక్కు గురుద్వారాలు పవిత్ర స్థలాల చట్టం 1925 చేయడం ద్వారా అకాలీ సమస్య మొత్తాన్ని పరిష్కరించగలిగారు.

ఈ కాలంలో రెండు చాలా ప్రాధాన్యతగల సత్యాగ్రహాలు జరిగాయి. అవి: బార్సద్ వద్ద (ఖేదా జిల్లాలో) 1923 –24 లో వల్లభాయ్‌పటేల్ యొక్క బార్సద్ ఉద్యమం గ్రామీణ గుజరాత్‌లో "మొదటి నిజమైన జయప్రదమైన గాంధేయ సత్యాగ్రహం" అని హార్డిమాన్ వర్ణించాడు. బందిపోట్ల అణచివేతకు పోలీసు ఖర్చులకు గాను బర్సాద్‌లోని ప్రతి పౌరునిపై విధించబడిన రు.2–7–0 పాలిటిక్స్‌కి వ్యతిరేకంగా ఈ ఉద్యమం చేపట్టబడింది. (ఈ బందిపోట్లు క్రింది కులం వారైన బరైయాలు సాగించారు. కాంగ్రెస్‌కి మద్ధతినిచ్చినందుకు ఈ జరిమానాలు విధించబడ్డాయని ఫతేదార్లు భావించారు.) డిశంబరులో మొత్తం 104 బాధిత గ్రామాలు పన్ను చెల్లించ నిరాకరించాయి. 1924 జనవరి 7న పన్ను రద్దు చేయక తప్పలేదు. 1922 ఫిబ్రవరిలో ఉద్యమం ఆకస్మికంగా విరమించబడడంతో ఒక మేరకు దిగజారిన గాంధేయ కాంగ్రెస్ ప్రతిష్ఠ ఈ విజయంతో పునరుద్ధరించబడింది. గాంధేయ ఉద్యమాన్ని స్వదేశీ సంస్థానానికి విస్తరించడానికి చేసిన ప్రయత్నం 1924లో బరోడాలోని పెట్లాడ్ తాలూకా (ఖేదా ప్రక్కనే వున్న) లో ఇటీవల పెంచిన పన్నుకు వ్యతిరేకంగా పన్ను చెల్లింపు నిరాకరణ ఉద్యమం విఫలమయింది. బరోడా సంస్థానం అధికారులు పట్టు విడుపు వైఖరితో కొన్ని రాయితీలు కల్పించారు. వైకాం సత్యాగ్రహం దేవాలయ ప్రవేశం కొరకు చేపట్టబడిన మొదటి ఉద్యమం. దిగువ కులానికి చెందిన ఎజవాలు, అస్పృశ్యులు తిరువాన్కూరు దేవాలయం సమీపంలోని రోడ్లను ఉపయోగించుకొనే హక్కు కొరకు చేపట్టబడిన ఉద్యమం. ఎజవా కాంగ్రెస్ నాయకుడు టి.కె. మాధవన్‌తో పాటు కె. కేలప్పన్, కె.పి. కేశవ్ మీనన్ లాంటి నాయర్ కాంగ్రెస్ నాయకులు ఉద్యమానికి నాయకత్వం వహించారు. నాయర్ కుల సంఘ నాయకులు మన్నాత్ పద్మనాభ పిళ్ళై భాగస్వామ్యంతో ఉద్యమానికి పలు కులాల మద్దతు లభించినట్లయింది. కాని హిందువులకు సంబంధించిన వ్యవహారానికి దూరంగా ఉండమని గాంధి కోరడంతో

క్రైస్తవులు వెలివేయబడ్డారు. గాంధీ 1925 మార్చిలో వైకాం సందర్శించారు. అస్పృశ్యులు కొరకు ప్రభుత్వం చాలా ప్రక్కదారులు నిర్మించడంతో 20 నెలల తరువాత ఉద్యమం క్రమంగా క్షీణించింది.

**నిర్మాణాత్మక పనులు**

స్థానిక సమస్యలపై అప్పుడప్పుడు చేసే సత్యాగ్రహాలతో పాటు ఈ కాలంలో గాంధేయవాదులు (మార్పులు, కోరని వారు) గ్రామాలలో నిర్మాణాత్మక కార్యక్రమాలపై కేంద్రీకరించారు. వరదల లాంటి అత్యవసర పరిస్థితులలో (1922 బెంగాల్‌లో, 1927 గుజరాత్‌లో) సహాయక చర్యలు, జాతీయ పాఠశాలలు, ఖాదీ యితర కుటీర పరిశ్రమల ప్రోత్సాహం, మద్యవ్యతిరేక ప్రచారం, దిగువ కులాల, అస్పృశ్యుల సంఘసేవ లాంటి పనులు చేపట్టారు. గ్రామీణ భారతదేశం యొక్క సాంఘిక ఆర్థిక సమస్యల పరిష్కారం దృష్టితో ఆలోచిస్తే ఈ కార్యక్రమం స్పష్టమైన వైఫల్యం. 1905 నుండి వివిధ ప్రయత్నాల అనుభవం ప్రకారం జాతీయ పాఠశాలలు రాజకీయ ఉద్రిక్తతలు వున్న కొద్ది కాల వ్యవధులలో మాత్రమే అభివృద్ధి చెందాయి. సాధారణ సమయాలలో డిగ్రీలు– ఉద్యోగాల ఆకర్షణని అధిగమించలేకపోయాయి. ఖాదీ నిర్వహణ చాలా కష్టసాధ్యమైనదిగా గాంధీ 1927 లో మోతీలాల్ నెహ్రూ వద్ద అంగీకరించారు. (మోతీలాల్ – జవహర్ లాల్ నెహ్రూకి 1927 ఆగష్టు 11) అది యిప్పటికే దిగుమతి వస్త్రాల కంటె, భారత దేశ మిల్లు వస్త్రాల కంటె చాలా ఖరీదైనది. 1932 తరువాత రాజకీయ  కారణాల రీత్యా విపరీతంగా విస్తరించబడిన హరిజన సంక్షేమం అస్పృశ్యులలో అత్యధికంగా గల భూమిలేని పేదల, అర్ధబానిసల లాంటి వ్యవసాయ కార్మికుల యొక్క ప్రాథమిక ఆర్థిక సమస్యని చేపట్టలేదు. హరిజనోద్ధరణ సంఘ సంస్కరణ చర్యగా ముందుకు సాగేందుకు కూడా గాంధీ కులవ్యవస్థని ఖండించేందుకు సూత్రరీత్యా నిరాకరించడం ఆటంకమయింది. 1925లో గాంధీ తిరువాన్కూరు శ్రీ నారాయణగురు యొక్క సమూలమైన మార్పులు కోరే కుల వ్యతిరేక భావాలపట్ల తన అంగీకారాన్ని విస్పష్టంగా ప్రకటించారు. 1927 లో మద్రాసులో గాంధీ వర్ణాశ్రమ ధర్మాల్ని సమర్థిస్తూ చేసిన ఉపన్యాసాలు తమిళనాడులోని నాయకర్ లాంటి బ్రాహ్మణేతర సమరశీల కార్యకర్తల్ని తీవ్రమైన నిరుత్సాహానికి గురిచేశాయి.

అయినప్పటికి కాంగ్రెస్‌కి గ్రామీణ మద్దతు సమకూర్చడంలో అన్నిటిని మించి క్రింది కులాలపై, అస్పృశ్యులపైన కాంగ్రెస్ అధిపత్యాన్ని సుస్థాపితం చేయడంలోను గాంధేయ నింత్మాణాత్మక కార్యక్రమం నిర్వహించిన రాజకీయ ప్రాధాన్యతని యిటీవలి వివరణాత్మక పరిశోధనలు (ఉదా: బెంగాల్‌పై హితేష్ సన్యాల్, యు.పి.పై జ్ఞాన్‌పాండే, ఖేదాపై డేవిడ్ హార్డిమన్) వివరిస్తున్నాయి. జాతీయ పాఠశాలలు, ఖద్దరు భాండాగారాలు, సామాజిక సేవా సంఘాలు (పంజాబులో, యు.పి.లో చురుకుగా పనిచేసిన లజపతిరాయ్ యొక్క లోక్‌సేవక్ మండల్ లాంటివి) గణనీయమైన సంఖ్యలో పూర్తికాలం పనిచేసే కాంగ్రెస్ కార్యకర్తలకు శిక్షణ యిచ్చి ఆర్థికంగా అండగా నిలిచాయి. జాతీయ విద్యా ప్రధానంగా పట్టణ దిగువ మధ్యతరగతికి సంపన్న రైతు గ్రూపులకు సేవలు చేస్తే (అలాంటి పాఠశాలల నుండి యు.పి.లో

1920 దశాబ్దంలో అస్పృశ్యుల నుండి ఒక్క కార్యకర్త కూడా తయారవలేదు). ఖాదీ గ్రామీణ పేదలకు కొంత ఉపశమనం కలిగించింది. గాంధీ యేతరమైనదిగా పేరుబడ్డ బెంగాల్ ప్రావిన్సులో కూడా సతీష్‌దాస్ గుప్తా యొక్క సోలేపూర్ ఖాదీ ప్రతిష్ఠాన్, సురేష్ బెనర్జీ యొక్క కొమిల్లా ఖాదీ ఆశ్రమం లాంటి సంస్థలు కొన్ని ప్రయోజనకరమైన పనులు సాధించాయి. వెనుకబడిన, పేదరికంలో మ్రగ్గిన హుగ్లీ జిల్లాలోని ఆరాంబాగ్ ప్రాంతంలో ప్రఫుల్లసేన్ లాంటి వారు 1922 నుండి నిరంతర కార్యక్రమాలు సాగించారని హితేష్ సన్యాల్ తన పరిశోధనలో నొక్కి చెప్పారు. నిర్మాణాత్మక కార్యక్రమం గుజరాత్‌లో ప్రత్యేకించి చాలా ఆశ్రమాలు, అధిక సంఖ్యలో అంకిత భావం గల గ్రామ సేవకులు గల ఖేదా, బార్డోలిలాలో విజయవంతమయింది. క్రింది పటేదార్లలో స్థావరమేర్పరచుకున్న గాంధేయ పలుకుబడి నిర్మాణాత్మక కార్యక్రమాల కారణంగా విస్తరించింది. అరాచక శక్తులుగా ఉన్న బార్డోలి కాలిపరాజ్‌లను, ఖేదా బరైయాలను మచ్చిక చేసికొనడం ద్వారా ఒక మేరకు అభివృద్ధి సాధ్యమయింది. రవిశంకర్ మహరాజ్ సాధువుగా, సంఘసంస్కర్తగా బరైయా గ్రామాలలో జరిపిన పర్యటనలు బోర్సాడ్ తాలూకాలో 1921లో జరిగిన 20 బందిపోట్ల నుండి 1927–29 నాటికి 1కి తగ్గించాయి. నిర్మాణాత్మక కార్యక్రమం కేంద్రాలు 1930 నాటి శాసనోల్లంఘనకు తొలి స్థావరాలుగా పనిచేశాయి. దండియాత్ర సందర్భంగా బోర్సార్ తాలూకాలోని 14 గ్రామాలు పన్ను చెల్లింపు నిరాకరణని స్వయంగా చేపట్టడం ఖేదా రైతులలో జాతీయవాదం బలంగా వేళ్ళూను కొనడాన్ని తెలియజేస్తుంది. ఆ సంవత్సరం పంటలు బాగాపండాయి. శిస్తులు, పన్నులు పెంపుదల లేదు. 1930 చివరలో పడిపోయిన వ్యవసాయ ఉత్పత్తుల ధరలు ముందు గూడా కొనసాగే సూచనలు వున్నాయి. సంకుచితమైన ప్రయోజనాలు భారత జాతీయవాద పనివిధానాన్ని ఎప్పుడూ కూడా పూర్తిగా వివరించలేవు.

## స్వరాజ్యవాదుల రాజకీయాలు

స్వరాజ్యవాదుల ఎన్నికల కౌన్సిల్ కార్యకలాపాలు బయటికి అద్భుతంగా కనిపించాయి. కాని వాటికి దీర్ఘకాలిక ప్రాధాన్యత లేదు. స్వరాజ్యవాదులు 1923 ఎన్నికలలో సెంట్రల్ ప్రావిన్సెస్‌లో మెజారిటీ సాధించారు. సహాయ నిరాకరణ పట్ల అంతగా ఆసక్తి చూపని యన్.సి. కేల్కర్ లాంటి తిలక్ మహారాష్ట్ర అనుచరులు మోతీలాల్, సి.ఆర్.దాస్‌ల వెనుక చేరారు. పార్టీ బెంగాల్‌లో కూడా మంచి ఫలితాలు సాధించింది. గతంలో 1921 లో మంత్రిగా పనిచేసిన సురేంద్రనాథ్ బెనర్జీని స్వరాజ్యపార్టీ అభ్యర్థి బి.సి.రాయ్ ఓడించారు. 21 ముస్లిం నియోజక వర్గాలతో సహా 85 హిందూ, ముస్లింల జనరల్ సీట్లలో 47 సీట్లను కైవశం చేసుకున్నది. బెంగాల్ విజయం దేశబంధు చిత్తరంజన్‌దాస్ సమర్థవంతమైన నాయకత్వం కారణంగా సాధ్యపడింది. ఆయన 1925 లో మరణించే వరకు కూడా కలకత్తా రాజకీయవేత్తల, వీరేంద్రనాథ్ సస్మాల్ లాంటి – ప్రజలతో సంబంధాలు గల జిల్లా నాయకుల, విప్లవకారుల (1924 నాటికి 24 మంది మాజీ విప్లవ ఖైదీలు తీసికొనబడ్డారు). అన్నిటిని మించి ముస్లిం నాయకుల మధ్య ఐక్యతని పరిరక్షించగలిగాడు. బెంగాల్ ఒప్పందం (డిశంబర్ 1923) తో ముస్లింలను

ఆకట్టుకొన్నారు. స్వరాజ్యం సాధించిన తరువాత పాలనాపరమైన ఉద్యోగులలో 55 శాతం ముస్లింలకు కేటాయించాలని మసీదులు ఎదుట హిందువుల వాద్యాలను ఆపివేయాలని బక్రీద్ సందర్భంగా గోవధలో జోక్యం చేసుకోకూడదని ఒప్పందం వాగ్దానం చేసింది. ఇక కౌన్సిళ్ళలో ప్రవేశించి వాటి డొల్లతాన్ని బహిరంగ పరిచే కార్యక్రమానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సెంట్రల్ ప్రావిన్సెస్ బెంగాల్ ద్వంద్వ ప్రభుత్వాలలోని మంత్రులకు జీతాలు చెల్లించ నిరాకరించి వారి రాజీనామాలకై ప్రభుత్వం ఒత్తిడి చేసింది. గవర్నర్లు వారికి గల 'సర్టిఫికెట్' అధికారాలతో శాసనాలు చేయాలని ఒత్తిడి చేసింది. ఆ విధంగా ద్వంద్వ ప్రభుత్వం నిజమైన రాజ్యాంగ పురోగతిని సాధించలేదని బహిర్గతమయింది. బాధ్యతాయుత ప్రభుత్వానికి దారితీసే సంస్కరణలపై చర్చించేందుకు రౌండ్‌టేబుల్ సమావేశం జరపాలని స్వరాజ్యవాదుల చొరవతో సెంట్రల్ అసెంబ్లీలో 1924 ఫిబ్రవరిలో ఒక తీర్మానం ఆమోదించబడింది. మోతీలాల్ నెహ్రూ, విఠల్‌భాయ్ పటేలు పార్లమెంటేరియన్‌లుగా గణనీయమైన ప్రతిభను కనపరచారు. భారతీయ వ్యాపార గ్రూపులు, స్వరాజ్యవాదుల మధ్య మంచి సంబంధాలు ఏర్పడ్డాయి. 1921 ఆర్థిక కమిషన్ ప్రకటించిన "వివక్షాత్మక రక్షణ" విధానం క్రింద తాతాస్టీలు పరిశ్రమకి రక్షణ కల్పించడంలో స్వరాజ్యవాదులు చాలా సహాయపడ్డారు. ఈ కాలంలో కాంగ్రెసు దేశవ్యాప్తంగా గల స్థానిక సంస్థల్ని, మున్సిపాలిటీలను, మరీ ముఖ్యంగా దాస్, సుభాస్ బోస్‌ల ఆధ్వర్యంలో కలకత్తాని, జవహర్‌లాల్ ఆధ్వర్యంలో అల్హాబాద్‌ని, వల్లభాయ్‌పటేల్ ఆధ్వర్యంలో అహమ్మదాబాద్‌ని కైవశం చేసుకున్నది. ఇవి పరిమిత సంక్షేమ కార్యలకలాపాలకు రంగస్థలాలయ్యాయి. మరీ ముఖ్యంగా కాంగ్రెస్‌ని ప్రోత్సహించడానికి నిధుల వసూళ్ళకు వనరులయ్యాయి.

కాని చాలా కొద్ది కాలంలోనే కౌన్సిల్ రాజకీయాలు చాలా సమస్యల్ని అంతర్గత విభజనల్ని తెచ్చిపెట్టాయి. ద్వంద్వ పరిపాలన బూటకమని నిరూపితమయింది. వైస్రాయి, గవర్నర్లు వారి కిష్టమయిన వాటిని 'సర్టిఫికెట్' అధికారంతో చట్టాలు చేసుకోగలుగుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఏమి చేయాలి – అనేది సమస్య. ఉదాహరణకు యుద్ధకాల ఇండియా రక్షణ నిబంధనల లాంటి ఆర్డినెన్సును 1925 ఏప్రిల్‌లో సర్టిఫికెట్ అధికారాలతో చట్టం చేసి టెర్రరిస్టు సంబంధాలు గల 80 మంది అనుమానితులతో బాటు సుభాస్‌బోసు 1924 అక్టోబరులో ఎలాంటి విచారణ లేకుండా నిర్బంధింపబడినప్పుడు బెంగాల్ స్వరాజ్యవాదులు ఏమీ చేయలేకపోయారు. ద్వంద్వ ప్రభుత్వంలో ఎన్నికైన మంత్రులకు నిజమైన అధికారం దాదాపు లేదు. కాని అధికారంలో వున్న పెద్ద చేపలకు ఎరల్నివేసే సాన్నిహిత్యం వుంది. ఇది పాలనాపరమైన ఉద్యోగాల్ని అంగీకరించి లేక యిప్పించి 'బాధ్యతయుతమైన సహకారాన్ని" అందించే ధోరణిని ప్రోత్సహించింది. సి.ఆర్.దాస్ లాంటి నాయకులు కూడా మరణానికి ముందు ఇలాంటి ఆలోచనలలో పడ్డట్టు కనిపిస్తుంది. 1925 అక్టోబర్‌లో ఫరీద్‌పూర్ సదస్సులో చేసిన ఉపన్యాసంలో దాస్ – ఖైదీల విడుదల, రాజ్యాంగ సంస్కరణలపై చర్యలకు ప్రభుత్వం అంగీకరిస్తే సహకారం అందిస్తామని చెప్పారు. 1925 అక్టోబర్‌లో ఎస్.బి. తాంబే సెంట్రల్

ప్రావిన్సెస్ మంత్రి పదవిని ఆమోదించాడు. మోతీలాల్ నెహ్రూ తాంబే చర్యని తీవ్రంగా నిరసించారు. కాని ఎన్.సి. కేల్కర్, బి.ఎస్. మూన్జే, ఎం.ఆర్. జయకర్‌లాంటి మహారాష్ట్ర, బొంబాయి స్వరాజ్యవాదులు మద్దతు తెలిపారు. పార్టీలో, స్థానిక సంస్థల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రోత్సాహక అవకాశాలు మరింత వైరాల్ని పెంచాయి. బెంగాల్‌లో సి.ఆర్. దాస్ మరణం తరువాత నాయకత్వం స్థానం కొరకు పోట్లాడుకున్నారు. 1927లో జె.ఎం.సేన్ గుప్తా, వీరేంద్రనాథ్ సస్మాల్‌ని తొలగించారు. సుభాష్ బోస్ జైలు నుండి విడుదల కాగానే సస్మాల్‌ని తొలగించడాన్ని సవాల్ చేశారు. 1926 ఎన్నికల ముందు మోతీలాల్ ప్రత్యర్థియైన మదన్‌మోహన్ మాలవ్యా, లజపతిరాయ్‌తో బాధ్యతాయుత సహకారవాదులతో కలిసి రాజకీయ మితవాదాన్ని, హిందూ మతవాదాన్ని కలగలిపిన కార్యక్రమంతో స్వతంత్ర కాంగ్రెస్ పార్టీని స్థాపించారు.

### మతవాదం

ఈ కాలంలో గతంలో ఎన్నడూ లేనంత తీవ్రంగా హిందూ - ముస్లిం మతవాదం పెరగడం ఒక ప్రతికూల పరిణామం, వాయవ్య సరిహద్దు రాష్ట్రంలోని కోహట్ వద్ద 1924 సెప్టెంబర్‌లో పెద్ద ఎత్తున హిందూ వ్యతిరేక హింస చెలరేగింది. 155 మంది చంపబడ్డారు. కలకత్తాలో 1926 ఏప్రిల్ - జూలైల మధ్య మూడుసార్లు హింసాకాండ చెలరేగింది. 138 మంది చంపబడ్డారు. అదే సంవత్సరంలో ఢాకా, పాట్నా, రావల్పిండి, ఢిల్లీలో ఘర్షణలు జరిగాయి. 1923-27 కాలంలో మత ఘర్షణలతో అట్టుడికిన రాష్ట్రం యు.పి., అక్కడ 91కి పైగా మత కలహాలు చెలరేగాయి. బయటికి చెప్పే కారణాలు మసీదుల ఎదుట వాద్యాలు మోగించవద్దని ముస్లింల డిమాండ్. గోవధను నిషేధించమని హిందువుల ఒత్తిళ్ళు. మత సంస్థలు, పుట్ట గొడుగుల్లా పుట్టుకొచ్చాయి. రాజకీయ కలయికలు కూడా మత ప్రాతిపదికన ఏర్పాటు చేయబడ్డాయి.

హిందూ ముస్లిం సోదర భావం అత్యున్నత దశలో వున్న 1919-22 కాలంలో కూడా కాంగ్రెస్, ఖిలాపత్ వేరు వేరు సంస్థలుగానే ఉన్నాయి. నాయకుల మధ్య మైత్రి గనుక కలిసి వున్నాయి. నాయకులు పోట్లాడుకున్నప్పుడు అంతర్గతంగా విభజనలు ఉన్నాయి. ఖిలాపత్ - మత సాంప్రదాయవాదులైన ముల్లాల్ని పెద్ద ఎత్తున రాజకీయాల్లోకి తీసుకొని వచ్చింది. జమియత్-అల్-ఉలామా-యి-హింద్ యొక్క 1921 డిసెంబర్ కార్యక్రమం స్వతంత్ర భారతదేశాన్ని వివిధ మతాల సమాఖ్యగా ఊహించింది. కాంగ్రెస్ ప్రచారం ప్రత్యేకించి దిగువ స్థాయిల్లో సెక్యులర్ భావాలకు చాలా దూరంగా వుంది. రామరాజ్య భావన ముస్లింలకు అర్థవంతమైనదిగా ఆకర్షణీయంగా లేదు. కాంగ్రెస్ ఖిలాపత్ నాయకుల మధ్య మైత్రి 1922 ఫిబ్రవరి నాటి గాంధీ యొక్క ఏకపక్ష విరమణతో బలహీనపరచబడింది. 1925 ప్రారంభం వరకు అంతంత మాత్రంగా కొనసాగింది. 1923 డిసెంబర్‌లో కాకినాడ కాంగ్రెస్ సదస్సు అధ్యక్షత వహించిన మహమ్మదాలీ మాటిమాటికి మత కలహాలు జరగడంతో గాంధీతో విభేదించాడు. కమాల్ అట్టాటర్క్ 1924లో అట్టమాన్ కాలిఫైట్‌ని రద్దు చేయడంతో ఖిలాపత్‌వాదుల ప్రధానమైన సమస్య నీరుగార్చబడింది.

రాజకీయవాదుల, విద్యావంతులైన ప్రజలలో విభేదాల విషయానికి వస్తే, 1920లలో మతవాదం పెరుగుదల వెనుక వున్న కీలకమైన అంశం, 1919 తరువాతి రాజకీయ నిర్మాణంలో భాగస్వామ్యం వహించిన తర్కంలో ఇమిడి వుంది. మౌంట్–ఫర్డ్ సంస్కరణలు ఓటు హక్కుని విస్తృతపరిచింది. ప్రత్యేక నియోజకవర్గాన్ని పరిరక్షించడమే గాక పెంచింది. కాబట్టి రాజకీయవాదులు అనుచరుల్ని సమీకరించుకోవడం, వారి మత, ప్రాంత, కుల గ్రూపులకు వాగ్దానాలిచ్చి ప్రలోభపెట్టడం ఆ వ్యవస్థలో యిమిడి వున్న అంతర్గత లక్షణం. దీనికి సంబంధించిన మరొక అంశం ఏమిటంటే, 1920 లలో గణనీయంగా విద్యావ్యాప్తి జరిగింది. కాని దాని కనుగుణంగా ఉపాధి అవకాశాలలో పెరుగుదల లేదు. "విద్యావంతుల అంచనాల మేరకు అవకాశాలు లేకపోవడంతో నిరసనలు తీవ్రమయ్యాయి." (పిహార్డీ బ్రిటిషు ఇండియాలో ముస్లింలు, పేజి–204). ఈ క్రమం 1880లలో ప్రారంభమయింది. ఈ కాలం నాటికి మరింత విస్తృతి చెందింది. అంతంత మాత్రంగా వున్న వనరుల కొరకు జరిగిన తొక్కిసలాట మత విద్వేషాల్ని పెంచింది. సామాజికంగా క్రింది స్థాయిలోని ఆర్థిక సామాజిక ఉద్రిక్తతలు వక్రీకరింపబడిన మత విద్వేషాల రూపాలుగా మార్చబడతాయి ఉదాహరణకు కాన్పూరు లాంటి నగరంలో 1931 మార్చి మూకుమ్మడి ఘర్షణలకు నేపథ్యం పాక్షికంగా 1920 లలో హిందూ వర్తకులు, పారిశ్రామికవేత్తలు అభివృద్ధి చెందుతుండగా ముస్లింల్లో చేనేతకు గిరాకీ లేక పతనమయింది. హిందూ భూస్వాములకు మహమ్మదీయ తాలూకాదార్లకు మధ్యగల ఆర్థిక శత్రుత్వం కారణంగా మెమెన్‌సింగ్ గ్రామీణ ప్రాంతంలో మతపరమైన ఉద్రికత్తలు చెలరేగాయని 1926 నాటి బెంగాల్ ప్రభుత్వ రిపోర్టు పేర్కొన్నది. కౌలు సవరణపై కొద్ది కొద్ది విరామాలతో 1923 నుండి 1928 వరకు సాగిన చర్యలలో వామపక్ష వాది సుభాష్‌బోస్‌తో సహా బెంగాల్‌లోని మొత్తం స్వరాజ్యవాద నాయకత్వం జమీందారీ అనుకూలమైన వైఖరి చేపట్టారు. ఆ విధంగా ముస్లింలు దూరమవడానికి ప్రత్యక్షంగా చాలా ఎక్కువగా కారకులయ్యారు.

త్వరితగతిని అభివృద్ధి చెందిన మత సంస్థలు సిద్ధాంతాలు పై స్థాయి ప్రజలకు, సాధారణ ప్రజలకు మధ్య సంబంధాన్ని సమకూర్చాయి. 1923 నుండి ముస్లిం మత సంస్థల తాబ్లింగ్ (ప్రచారం), తాంజిమ్ (సంస్థ)ల వ్యాప్తి, 1924 కోహట్ ఘర్షణలు, ఖిలాఫత్ సంస్థలు క్షీణించగా ముస్లిం లీగు పునరుద్ధరణ, 1926లో స్వామి శ్రద్ధానంద హత్య – ముస్లిం మతవాదాన్ని పెంచాయి. జిన్నా అధ్యక్షత వహించిన 1924 లాహోరు సదస్సు (1918 నుండి కాంగ్రెస్‌తో గాక వేరుగా జరిపిన మొదటి సదస్సు). ముస్లిం లీగు ప్రత్యేక నియోజక వర్గాలతోపాటు ముస్లిం మెజారిటీ ప్రాంతాలకు హిందూ ఆధిక్యత ప్రమాదం నుండి సంరక్షించుకునేందుకు రాష్ట్రాల స్వయం ప్రతిపత్తితో కూడిన సమాఖ్య డిమాండును ప్రస్తావించింది. ప్రత్యేక నియోజక వర్గాల నినాదం ముస్లిం లీగుకి ప్రారంభం నుండి 1940 పాకిస్తాన్ కొరకు డిమాండ్ చేసే వరకు మూలసూత్రంగా వున్న నినాదం. దీనిని ఈ కాలంలో వేగంగా విస్తరిస్తున్న హిందూ మతవాదానికి ప్రతిస్పందనగా చేపట్టిన చర్యగా గమనించాలి. తాలిఫ్ (ప్రచారం) తాంజిమ్ (నిర్మాణం)లు ఆర్య సమాజం యొక్క శుద్ధ, సంఘటనలకు స్పందనలు. శుద్ధి, సంఘటనలు మోప్లాల బలవంతపు మత మార్పిడుల తరువాత ప్రారంభమయ్యాయి. 1923 లో శ్రద్ధానంద

పశ్చిమ యు.పి.కి శుద్ధి, సంఘటనలను విస్తరింప చేశారు. ఇస్లాం మతంలోకి మారిన మల్కానా రాజ్‌పుట్, గుజార్, బనియాలను మరలా హిందూ మతంలోకి మార్చాలనే కృత నిశ్చయంతో వీటిని విస్తరింపచేశారు. మదన్ మోహన్ మాలవ్యా యితర పంజాబు నాయకులతో కలసి 1915 లో హరిద్వారా కుంభమేళా వద్ద ప్రారంభించిన 'హిందూ మహాసభ' సహాయ నిరాకరణ సంవత్సరాలలో కార్యకలాపాలు లేక స్తబ్ధతగా వుండిపోయింది. 1922 –23 లో పునరుద్ధరణ ప్రారంభమయింది. 1923 ఆగష్టు సదస్సు శుద్ధి కార్యక్రమాన్ని చేర్చింది. హిందూ రక్షణ దళాల కొరకు పిలుపు నిచ్చింది. ఆర్య సమాజ సంస్కర్తలు, సనాతన ధర్మ సభ సాంప్రదాయ వాదులు కలసి మాలవ్యా అధ్యక్షుడుగా హిందూ మత సంఘటన ఏర్పాటు చేశారు. మహాసభ ప్రచారంలో హిందూ –హిందీకి గల సంబంధాన్ని నొక్కి చెప్పడం వలన ప్రచారం ప్రధానంగా ఉత్తర భారతదేశానికే (1923 సదస్సులోని ప్రతినిధులలో 86 శాతం యు.పి., ఢిల్లీ, పంజాబు, బీహారులకు చెందిన వారు. ఇక బెంగాల్, బొంబాయి, మద్రాసుల ప్రతినిధులు కలిపి కేవలం 6.6%) పరిమితమయింది. ఆ తరువాత చాలా ప్రాధాన్యత గల పరిణామం సంభవించింది. తిలక్ పాత అనుచరుడైన మూన్జే సహచరుడైన కె.బి.హేడ్గేవార్ చే 1925 లో నాగపూర్‌లో రాష్ట్రీయ స్వయం సేవక సంఘం స్థాపించబడింది.

సిద్ధాంత పరంగా సెక్యులరిస్టులైనప్పటికి, మార్పులు కోరనివారు, అలాగే స్వరాజ్యవాదులు – హిందూ మతవాదాన్ని అడ్డుకోవడంలో విఫలమయ్యారు. అంతేగాక మతపరమైన సంస్థలను సిద్ధాంతానికి మమేకం కాకుండా దూరంగా వుంచడంలో కూడా విఫలమయ్యారు. కోహట్ ఘర్షణల తరువాత 1924 సెప్టెంబరులో మహమ్మదాలీ యొక్క ఢిల్లీ నివాసంలో వుంటూ గాంధీ 21 రోజుల నిరాహార దీక్ష బూనారు. నాయకుల ఐక్యతా సదస్సు ద్వారా ఉద్రిక్తతని తాత్కాలికంగా తగ్గించాడు. ఒక ఆవు ప్రాణం కొరకు తోటి మానవుల ప్రాణాల్ని బలిగొన్న పాశవిక తప్పిదాన్ని తీవ్రమైన పదజాలంతో ఖండించాడు. (యంగ్ ఇండియా 1924 మే 29). ఐనప్పటికి యు.పి.కి చెందిన పురుషోత్తం దాస్ టాండన్ లాంటివారు మాలవ్యాతో సన్నిహిత సంబంధాలు పెట్టుకొన్నారు. గాంధి కూడా మాలవ్యాతో సంబంధాలు కొనసాగించారు. బనారస్ లాంటి ప్రదేశాలలో స్వరాజ్యపార్టీ, హిందూ సభ ఒకే సంస్థగా పనిచేశాయి. మోతీలాల్ నెహ్రూతో గల వైరంతో మాలవ్యా 1925 నుండి హిందూ మతవాదుల్ని సమర్థవంతంగా ఉపయోగించుకొన్నారు. లజపతిరాయ్ సహకారంతో స్వతంత్ర కాంగ్రెస్ పార్టీని నడిపారు. ఎన్నికల సన్నాహాలలో భాగంగా 1925–26లో అల్హాబాద్‌లో లాగా హిందూ మతవాదానికి అనుకూలంగా శత్రుత్వాన్ని ప్రోత్సహించడం జరిగింది. అల్హాబాద్‌లో ముస్లింలు మసీదుల ఎదుట వాద్యపరికరాలు కనీసం ప్రార్థన జరుపుకొనే ఐదు, పది నిమిషాలైనా మ్రోగించవద్దని మరీ మరీ కోరారు. వారి విజ్ఞప్తి తిరస్కరించబడింది. బెంగాల్‌లో సి.ఆర్.దాస్ యొక్క హిందు – ముస్లిం ఒప్పందం 1926 లో రద్దు చేయబడింది. ఒప్పందాన్ని పరిరక్షించడానికి ప్రయత్నించిన సస్మాల్ ఆ తరువాతి సంవత్సరం మిడ్నాపూర్ ఎన్నికలలో "హిందూ మతం ప్రమాదంలో పడింద'నే నినాదాన్ని అందుకొన్న కాంగ్రెస్ సహచరులచే ఓడింపబడ్డాడు. 1926 ఎన్నికల ముందు "మోతీలాల్ నెహ్రూ" ముస్లిం అనుకూలుడు. గోమాంస

భక్షకుడు" అనే ప్రచారాన్ని త్రిప్పికొట్టేందుకు, హిందూ మహాసభ గ్రూపుల్ని ఆకట్టుకునేందుకు కొన్నిసార్లు మతపరమైన విజ్ఞప్తులు చేశారు.

1926 ఎన్నికలలో హిందూ మహాసభ, బాధ్యతాయుత సహకారవాదులు కలసి పోటీ చేయడంతో స్వరాజ్యవాదుల బలం ఒక్క మద్రాసులో తప్ప మిగిలిన చోట్ల తగ్గిపోయింది. బెంగాలులో స్వరాజ్యవాదులు 47 హిందూ సీట్లలో 35 గెలిచారు. కాని 39 ముస్లిం సీట్లలో ఒక్కటి మాత్రమే గెలవగలిగారు. 1920 దశాబ్దపు మధ్యకాలం నాటి జ్ఞాపకాలు తరువాత 1930–34 దగ్గరగుచున్న ముస్లింలను దూరం చేశాయి. నిజమైన విజేత బ్రిటిషు సామ్రాజ్యవాదం. బ్రిటిషు పాలనకు సాయపడడంలో హిందూ మతవాద నాయకత్వం ముస్లిం లీగు కంటె తక్కువేం కాదు. హిందీ– హిందూ ధర్మదూతగా పేరుగాంచి 1921 లో సహాయ నిరాకరణని తీవ్రంగా వ్యతిరేకించిన మదన్‌మోహన్ మాలవ్యా నుండి, బ్రిటిషు పాలకులు క్విట్ ఇండియా ఉద్యమాన్ని రక్తపుటేర్లలో ముంచుతున్నా 1942 ఆగష్టులో బెంగాల్ మంత్రిగా పనిచేసి ఆ తరువాత 'జనసంఘ్'ని స్థాపించిన శ్యాంప్రసాద్ ముఖర్జీ వరకు బ్రిటిషు సామ్రాజ్య వాదానికి తమశక్తి మేరకు సేవలు చేసిన వారే.

## నూతన శక్తుల ఆవిర్భావం 1922 -27

నిరాశ నిస్పృహలకు గురయిన మోతీలాల్ నెహ్రూ1927 మార్చి 30న తన కుమారునికిలా రాస్తున్నాడు. "భారతదేశంలో పరిస్థితులు దిగజారుతున్నాయి. 1922 –23లో ప్రారంభించిన సహాయ నిరాకరణ ఉద్యమం ప్రజా కార్యకలాపాల్ని నెమ్మదిగా క్షీణింపజేస్తున్నది. మతపరమైన ద్వేషం ప్రజలకు విద్యగా అందుతున్నది". ప్రభుత్వ అనుగ్రహం పొందేందుకు కాంగ్రెస్ వారు ఒకరితో మరొకరు పోటీ పడుతున్నారు. ఐనప్పటికి 1927 సంవత్సరాంతం జాతీయోద్యమంలో కొత్త ఊపుకి నాంది కానున్నది. ఈ దశలో నాటకీయమైన ఎదురు దెబ్బల నేపథ్యంలో పరిస్థితుల్ని పరిశీలిద్దాం.

### రాజకీయ ఆర్థిక ఉద్రిక్తతలు

బ్రిటిషు రాజకీయ ఆర్థిక అధిపత్యానికి అత్యధిక భారతీయ వర్గాల ప్రజానీకానికి మధ్యగల వైరుధ్యాలు, బ్రిటిషు పాలకులతో రాజీ సహకారం కొరకు జరిగే ప్రయత్నాలు కొనసాగడాన్ని అసాధ్యం చేశాయి. 1920 దశాబ్దం మధ్యకాలంలో వ్యక్తమైన సూచికలతో అన్ని రకాల రాజకీయ నాయకులు అంతకంతకూ నిరాశ నిస్పృహలకు గురవుతూ వచ్చారు. యుద్ధానంతర సామ్రాజ్యవాద వ్యతిరేక వెల్లువ అణగిపోయింది. భారతదేశంలో బ్రిటిషు విధానం కఠినతరమవుతూ వుంది. లియడ్ బార్డ్ 1922 ఆగష్టులో తన ప్రఖ్యాత 'ఇనుప చట్రం' ఉపన్యాసంలో ప్రకటించారు. "ఒక వ్యవస్థ దాని బాధ్యతల్ని ప్రత్యేక హక్కుల్ని మనం తగ్గించలేము. అది భారతదేశంలో బ్రిటిషు సివిలు సర్వీసు" దీనిలో ఇమిడి వున్న అంతరార్థాన్ని 1924 రాయల్ కమిషన్, 1926 సాంధూర్సు కమిటీలు స్పష్టం చేశాయి. ఐ.సి.యస్ భారతీయా కరణ 15 సంవత్సరాల తరువాత, పోలీసు సైన్యం భారతీయాకరణ 25సం॥ల తరువాత

(అంటే 1952లో) జరుగుతుంది. 1920–30 దశాబ్దం నాటి సంవత్సరాలు తెల్ల అధినివేశ రాజ్యాలు పూర్తి స్వతంత్రాన్ని సాధిస్తున్న సంవత్సరాలు. స్వతంత్రం పొందే క్రమం 1931 వెస్ట్ మినిస్టర్ శాసనంతో పరిపూర్తి అయింది. 1924 ఫిబ్రవరిలో హోంమెంబరు మాల్కం హెయిర్ లాంటి ప్రభుత్వ ప్రతినిధులు "భారత ప్రభుత్వ చట్టం 1919 లక్ష్యం పూర్తి అధినివేశ ప్రతిపత్తికాదు. బాధ్యతాయుత ప్రభుత్వమే" అని వివరణ ఇచ్చారు. లిట్టన్ లేక కర్జన్ ల కాలం నుండి మారిందేమీ లేదని 1925 లో టోరీ సెక్రటరీ ఆఫ్ స్టేట్ బర్కిన్ హెడ్ స్పష్టం చేశారు. వేగం అందుకోవడానికి (స్వరాజ్యవాదులు డిమాండ్ చేస్తున్నట్లు సంస్కరణల కొరకు) తలుపు తెరవబడలేదు అని 1925 జూలై 7న హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో ఉద్ఘాటించారు. భారతదేశ అస్తిత్వాన్ని గురించి ప్రస్తావించడం అసంభవం," అలాంటి జాతి (దేశం) ఎప్పుడూ లేదు... మనం రేపు భారతదేశం నుండి వెనక్కి వస్తే తక్షణ పరిణామాలు హిందూ – ముస్లిం ప్రజల మధ్య భీకరమైన పోరాటం".

కొద్దికాలంపాటు పరిశ్రమలకు రాయితీలు యిచ్చిన తరువాత (1921 ఆర్థిక కమిషన్, 1924లో ఉక్కురక్షణ) 1920 దశాబ్దం మధ్యకాలం నుండి ఆర్థిక వైరుధ్యాలు తీవ్రమవుతున్నాయి. వివక్షతతో కూడిన రక్షణవిధానం అంటే ఆచరణలో వాయిదాలు వేయడం. భారత పరిశ్రమలపై టారిఫ్ బోర్డులు చర్చించాయి. ఎక్కువ దిగుమతి సుంకాల సిఫార్సుల్ని అమలు జరపడం ప్రభుత్వం ఆపివేసింది. తూర్పు భారత దేశంలో సురక్షితంగా వున్న బ్రిటిషు జనపనార మిల్లుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా బిర్లా గ్రూపు ముందుకుపోవడానికి ప్రయత్నిస్తుంది. బొంబాయిలో లార్డ్ ఇంచ్‌కేఫ్ ఆధ్వర్యంలోని బ్రిటిషు షిప్పింగు ప్రయోజనాల నుండి వాల్‌చంద్ హీరాచంద్, లాల్జీ నారాయణ్జీల సింధియా స్టీం నేవిగేషన్ తీవ్రమైన ప్రతిఘటన నెదుర్కొంటుంది. 1926 హిల్టన్ – యంగ్ కమిషన్ స్ప్టెర్లింగు – రూపాయి మారకం విలువ 1షి.6 పెన్నీలుగా నిర్ధారించడం మొత్తం పారిశ్రామిక వాణిజ్యవేత్తల సమస్య అయింది. 1921లో ప్రభుత్వానికి విధేయుడుగా వున్న పురుషోత్తం దాస్ ఠాకూర్‌దాస్ ఈ సమస్యపై భారత వాణిజ్యవేత్తల పక్షాన చేసే పోరాటంలో వస్తుందన్నారు. ఈ మారకపు విలువ (విలువ పెంచబడిన రూపాయి) భారత జౌళి పరిశ్రమని పణంగా పెట్టి దిగుమతుల్ని ప్రోత్సహించింది. ముడివనరుల ధరల్ని పెంచింది. ఆ విధంగా భారత వ్యవసాయదారులకు మార్కెటుని తగ్గించింది. (ఠాకూర్‌దాస్ ప్రధానమైన వాణిజ్య ప్రయోజనం ముడి ప్రత్తిని ఎగుమతిని చేయటం) కరెన్సీ తగ్గించే చర్యలకు దారితీసింది. పెట్టుబడి అవకాశాల్ని తగ్గించింది . 1షి 6 పెన్నీల నిష్పత్తి అంటే బ్రిటిషు అధికారులు వ్యాపారులు వారి జీతాల్ని లాభాల్ని స్వదేశానికి పంపించడానికి బోనస్‌గా పనిచేసింది. ఈ కాలంలో భారత పెట్టుబడిదారీ విధానం బలం పుంజుకొని దేశ వ్యాప్తంగా సంఘటితపడే ప్రయత్నాలు ప్రారంభించింది. గనుక మారకపు విలువపై నిరసనలు ఎక్కువయ్యాయి. 1923 డిసెంబరు 7న బిర్లా ఠాకూర్‌దాస్‌కి యిలా రాశాడు. "నేను అసోసియేటెడ్ ఛాంబర్స్ (1920 లో స్థాపించబడిన బ్రిటిషు పెట్టుబడి దారుల అఖిల భారత సంఘటిత కార్యకలాపాల్ని గత కొన్ని సంవత్సరాల నుండి నిశితంగా పరిశీలిస్తున్నాను. అలాంటి భారతీయుల సంఘాన్ని స్థాపించేందుకు వెంటనే చర్యలు చేపట్టకపోతే భారతీయుల

ప్రయోజనాలకు చాలా హానికరమని భావిస్తున్నాను.” (ఠాకూర్‌దాస్ పత్రాలు ఎఫ్.ఎన్. 42 (III)) బిర్లా ఠాకూర్‌దాస్‌లు 1927 భారత వాణిజ్య పారిశ్రామిక వేత్తల సమాఖ్య (ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, ఫిక్కీ) స్థాపించారు. టాటాలు ప్రభుత్వంపై ఆధారపడవలసిన స్థితిలో వున్నారు గనుక సమాఖ్యలో చేరలేదు. బొంబాయి మిల్లు యజమానులు కూడా చాలావరకు సమాఖ్యకి దూరంగా వున్నారు. కాని కొద్ది సంవత్సరాలలో ఫిక్కీ, భారతీయ బూర్జువాలలోని నిర్ణయాత్మక విభాగం యొక్క వర్గ ప్రయోజనాల నియమిత ప్రతినిధి అయింది.

1920 దశాబ్దంలో సాధారణ ప్రజల జీవన పరిస్థితులలో తగ్గుదల తప్ప ఎలాంటి అభివృద్ధి లేదు. 1921 జనాభా లెక్కల తరువాత భారత జనాభా పెరిగింది. పంజాబులో కొద్దిగా మద్రాసులో తప్ప దేశ వ్యాప్తంగా వ్యవసాయ ఉత్పాదకతలో పెరుగుదల లేదు. 1920–21 నుండి 1924 – 25 వరకు గల కాలవ్యవధికి 1938–39 ధరల ప్రకారం ఎకరం సరాసరి ఉత్పాదకత రు 26.50 లు వుండగా అది 1925–26 నుండి 1929 –30 కాల వ్యవధికి రు. 25.70 లకు పడిపోయింది. (అమియాబాగ్చి పేజి 95) 1920 దశాబ్దంలో రైత్వారీ పద్ధతి ననుసరించి బొంబాయి, మద్రాసు పలు ప్రాంతాలు భూమి శిస్తులు సవరించవలసి వచ్చింది. కార్మికవర్గం జౌళి జూట్ రైల్వే వర్కు షాపులలో క్రమబద్ధీకరణలో ఉపాధి కోల్పోవడం, వేతనాలలో కోతలు ఎదుర్కొంటున్న కాలం. భారత వస్త్ర పరిశ్రమ మరలా లాంకోషైర్ జపానుల నుండి పోటీ ఎదుర్కొంటున్నది. (1921 –22 లో 1090 మిలియన్ల గజాల తానులు దిగుమతి కాగా 1927–28 నాటికి 1973 మిలియన్ల గజాల తానులు దిగుమతి అయ్యాయి. బాగ్చీ పేజి 238)

1930ల నాటి మహా ఆర్థిక మాంద్యానికి ముందుగానే జూటు ఎగుమతులు ఆగిపోయాయి. భారత, బ్రిటిషు పెట్టుబడిదారులు ఒకే రకంగా ఈ భారాన్నంతా కార్మికుల పైకి నెట్టివేయ యత్నించారు. 1926లో ప్రభుత్వం నియమించిన కమిటీ రైల్వే వర్కుషాపుల నుండి 75,000 మంది కార్మికుల్ని తొలగించింది.

**తెగల ప్రజల, రైతాంగ ఉద్యమాలు**

సహాయ నిరాకరణతో ప్రారంభమైన క్రింది స్థాయి తిరుగుబాట్లు బార్డోలి తిరోగమనంతో ఆగిపోలేదు ఉదాహరణకు ఏకా ఉద్యమంతో బారాబంకి 1922 మార్చిలో కూడా యు.పి.ని కలవరపెడుతూనే ఉంది. జూలై వరకు బెంగాలులోని తిప్పేరా, చిట్టగాంగ్ జిల్లాలలో శాంతి భద్రతలు నెలకొల్పబడలేదు. సీతారామరాజు నాయకత్వంలో గోదావరికి ఉత్తరానగల రంప ప్రాంతంలో 1922 ఆగస్టు నుండి 1924 మే వరకు గెరిల్లా యుద్ధానికి రంగస్థలమైనది. ఇతర ప్రాంతాల ప్రజలకు అంతగా తెలియకపోయినప్పటికి అల్లూరి సీతారామరాజు ఆంధ్రలో జానపద నాయకుడు. 1924 అధికార రిపోర్టులో నమోదు చేయబడిన సమస్యలు అన్నీ పాతవే.

**సమస్యలు :** వడ్డీ వ్యాపారుల దోపిడీ, పోడు వ్యవసాయాన్ని పరిమితం చేసే అటవీ చట్టాలు, అడవుల్లో పశువులి మేపుకొనే హక్కు.

కాని, ఈసారి నాయకత్వం తెగల ప్రజల నుండి రాలేదు. 1915 నుండి వారితో కలసి మెలసి తిరిగే బయటి వ్యక్తి నాయకుడైనాడు. అతడికి అద్భుత శక్తులున్నాయని కూడా ప్రచారం జరిగింది. సీతారామరాజు సహాయ నిరాకరణ ఉద్యమంతో ప్రేరితుడై గ్రామ పంచాయితీలను ప్రారంభించాడు. మద్యపాన వ్యతిరేక ప్రచారం చేపట్టాడు. సీతారామరాజు ఉద్యమం అటవిక తిరుగుబాటుని ఆధునిక జాతీయవాదంతో అనుసంధానం చేసిన ఉద్యమం అని హాబ్సబామ్ పేర్కొన్నాడు. రాజు తనను తుపాకులు, తూటాలు ఏమీ చేయలేవని చెప్పుకొన్నాడు. విప్లవ కాలంలో స్థానిక అధికారులతో జరిగిన సమావేశాలలో సీతారామరాజు గాంధీని గురించి చాలా గొప్పగా మాట్లాడాడు. కాని, హింస అవసరమని భావించాడు. యూరోపియన్ల చుట్టు ఎప్పుడూ భారతీయులు ఉండటం వలన వారిని కాల్చి చంపలేకపోయినందుకు విచారం వ్యక్తం చేశాడు. 1922 సెప్టెంబరు 24న తిరుగుబాటు దారులు దామరపల్లి వద్ద చేసిన ఆకస్మిక దాడి సందర్భంగా బ్రిటిష్ ఆఫీసర్ల ముందుపోతున్న భారతీయుల్ని అనుమతించి యిద్దరు బ్రిటిష్ అధికారుల్ని కాల్చి చంపారు. రాజు 'గెరిల్లా యుద్ధ తంత్రంలో నిపుణుడని బ్రిటిష్ వారి గౌరవంతో కూడిన ప్రదర్శనలు అందుకొన్నాడు. పోలీస్‌స్టేషన్‌లపై జయప్రదంగా దాడులు జరిపి తన అనుచరులకు ఆయుధాలు సమకూర్చాడు. రాజు అనుచరులుగా ఉన్న దాదాపు 100 మంది విప్లవకారులు నీటిలో చేపలుగా మెలుగుతూ "25000 చదరపు మైళ్ళ ప్రాంతంలోని అత్యధిక ప్రజల సానుభూతి, గౌరవం పొందారు." మలబారు స్పెషల్ పోలీసు, అస్సాం రైఫిల్స్ సహాయంతో మద్రాసు ప్రభుత్వం విప్లవాన్ని అణచటానికి 15 లక్షలు వెచ్చించింది. రాజు 1924 మే 6న పట్టుబడ్డాడు. కాని పారిపోతుంటే కాల్చి చంపినట్లు ప్రభుత్వం అలవాటు ప్రకారం ప్రకటించింది. 1924 సెప్టెంబరు నాటికి ప్రతిఘటన పూర్తిగా అణచివేయబడింది.

1920 లలో ఫ్యూడల్ వ్యతిరేక రైతు ఉద్యమాలకు రాజస్థాన్ కేంద్రంగా మారింది. మోతీలాల్ ఓరా చే ప్రేరితమైన భిల్లు ఉద్యమాన్ని అణచివేసే ప్రయత్నంలో భాగంగా 1922 మేలో మేవార్ పోలీసులు రెండు గ్రామాల్ని పూర్తిగా తగలబెట్టారు. 1927 నుండి బిజోలియా పోరాటాలలో అగ్రభాగాన ఉన్నది. విజయ్‌సింగ్ పాఠిక్, మాణిక్‌లాల్ వర్మ, హరిభావు ఉపాధ్యాయుల నాయకత్వంలో కొత్త పన్నులకు, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా రైతులు సత్యాగ్రహ పద్ధతులలో పోరాటాలు చేశారు. 50% భూమిశిస్తు పెంపుదలని నిరసిస్తూ 1925లో అల్వార్ స్వదేశీ సంస్థానంలోని 'నీమూచన' వద్ద రైతులు ఉద్యమం చేపట్టారు. పైశాచికంగా పోలీసులు విరుచుకుపడ్డారు, 156 మందిని చంపారు, 600 మందిని గాయపరిచారు. జాతీయవాద భావాలతో పట్టణ మధ్యతరగతి ప్రజా పరిషత్తులు ఆవిర్భవించటం ప్రారంభమైనప్పటికే (మొదటిది బరోడాలో 1917 లో ఆ తరువాత కఠియవాడ ప్రాంతంలో 1921లో, రెండూ గుజరాత్‌కి అందుబాటులో ఉన్నాయి). కాంగ్రెస్ స్వదేశీ సంస్థానంలో జరిగే ఏ ఉద్యమంలో కూడా జోక్యం చేసుకొన నిరాకరించింది. ( ఈ విధానం 1938 హరిపుర కాంగ్రెస్‌లో మార్చుకొనబడింది)

1923 నుండి స్వదేశీ సంస్థాన ప్రజా సదస్సులు వార్షికంగా జరిగాయి. మేవార్ లాంటి సంస్థానాలలో పట్టణ జాతీయవాదం కంటె రైతు చైతన్యమే ముందున్నది.

రైతు సమస్యలు చేపట్టడంలో కాంగ్రెస్ వైఫల్యంతో భ్రమలు తొలగిపోయిన రైతాంగ కార్యకర్తలు 1920 దశాబ్దం మధ్య కాలం నాటికి కొత్తదారులు వెతకటం ప్రారంభించారు. 1922లో స్వామి విద్యానంద జమీందారీ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశాడు. బాబా రామచంద్ర 1925 నవంబర్‌లో లెనిన్‌ను ప్రస్తావిస్తూ 'లెనిన్ రైతులకు ప్రియతమ నాయకుడు... రష్యాలో తప్ప రైతులు యిప్పటికీ బానిసలే'. (ప్రతాప్ 1925 నవంబర్ 23న మజిద్ సిద్ధికి ఉత్తర భారతదేశంలో వ్యవసాయ అశాంతి పేజి 195 నుండి ఉటంకించబడింది)

కౌలు తగ్గింపు, బెంగాల్ బీహార్ యు.పి.లలో పంటలో న్యాయమైన వాటా కోరుతున్న పాలికాపుల ప్రయత్నాలు లాంటి రైతుల సమస్యలు చేపట్టేందుకు కాంగ్రెస్ వారికి (స్వరాజ్యవాదులు లేక మార్పులు కోరనివారు) జమీందారులతో, ధనిక రైతులతో గల బలమైన సంబంధాలు అడ్డుగా ఉన్నాయి. 1920 నుండి పాలికాపుల వ్యవసాయం విస్తరించింది. ఇక్కడ స్వరాజ్యవాదులు పాలికాపులకు కౌలుదారుల హోదా కల్పించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. 1920 దశాబ్దం మధ్యకాలంలో మైమెన్‌సింగ్ డాకా, పాబ్నా, ఖుల్నా, నాడియా లాంటి జిల్లాలలోని అనేక వామశూద్ర ముస్లిం బర్గాదార్ ఉద్యమాల పట్ల ఎలాంటి సానుభూతి వ్యక్తం చేయలేదు. యు.పి. కాంగ్రెస్ కొంత రైతాంగ అనుకూల వైఖరి ప్రదర్శించింది. జమీందారీ అనుకూల అంశాలలో కొన్నింటి మార్పు కొరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు 1924లో యు.పి కిసాన్ సంఘాన్ని ప్రారంభించింది. కాని, సంఘం యొక్క విధానం జమీందారుల్ని వ్యతిరేకించటం కాదని స్పష్టంగా చెప్పింది.

రైత్వారి విధానం అమలులో ఉన్న ప్రాంతాలలో శిస్తు పెంపుదలని మాత్రం కాంగ్రెస్ వ్యతిరేకించింది. 1923 -24 లో తంజావూరులో పెంపుదలని వ్యతిరేకించి ఒక మేరకు విజయం సాధించింది. కోస్తా జిల్లాలకు యన్.జి.రంగా 1923లో గుంటూరులో మొదటి రైతు సంఘాన్ని స్థాపించి ధనిక రైతుల కొరకు పనిచేయడం ప్రారంభించారు. 1927 లో కృష్ణా, గోదావరి డెల్టాలో శిస్తు 18.75 శాతానికి పెంచటం కోస్తా ఆంధ్రాలో బలమైన రైతు ఉద్యమానికి దారితీసింది. స్థానిక కాంగ్రెస్ నాయకులు తూర్పు గోదావరి లో వెన్నేటి సత్యనారాయణ, పశ్చిమగోదావరిలో దండు నారాయణ రాజులాంటి వారు అలాగే టి. ప్రకాశం, కొండా వెంకటప్పయ్య, లాంటి ప్రసిద్ధ జాతీయ నాయకులు ఉద్యమాన్ని చేపట్టారు. 1928 నుండి యిలాంటి ఉద్యమాలను వల్లభాయ్ పటేల్ నాయకత్వంలోని బార్డోలి ఉద్యమం ప్రేరణగా నిలిచింది.

**కుల ఉద్యమాలు**

భారతీయ సమాజంలోని వివిధ వైరుద్యాల నుండి కుల సంఘాల ఉద్యమాలు పుట్టుకొచ్చాయి. ఇవి మౌలికంగా సంప్రదాయాల్ని పరిరక్షించేవి, ప్రజలను విడగొట్టేవి. కాని కొన్ని సందర్భాలలో మార్పులను కోరేవి. మద్రాసులోని బ్రాహ్మణ వ్యతిరేక జస్టిస్ పార్టీ బ్రిటిష్ పాలకుల అభిప్రాయాల ప్రకారం ప్రభుత్వం పట్ల విధేయతగలది. ఆ రాష్ట్రంలో ద్వంద్వ పరిపాలనను జయప్రదం చేసింది. అధికారులకు, ఎన్నికైన మంత్రులకు మధ్య సామరస్య

పూర్వక సహకారానికి మరొక ఉదాహరణ పంజాబు, ఫజల్ హుస్సేన్ యొక్క యూనియనిస్టు పార్టీ పట్టణ జాతీయ వాదానికి వ్యతిరేకంగా జాట్‌లు, ముస్లింల్ని కలిపి శక్తివంతమైన వ్యవసాయక (భూస్వాములు, ధనిక రైతులు) లాబీని నిర్మించగలిగింది. మహారాష్ట్రలోని భాస్కరరావు జాదవ్ యొక్క బ్రాహ్మణేతర పార్టీ అలాంటి విధేయత గల పాత్రనే నిర్వహించ యత్నించింది. కాంగ్రెస్, బ్రాహ్మణులు ఆకాంక్షలకు ముసుగని ఆరోపించింది. తిలక్ సిద్ధాంతంలోని కొన్ని అంశాలు ఈ ఆరోపణకు బలాన్ని చేకూర్చాయి.

జస్టిస్‌పార్టీ, జాదవ్ లాంటి బ్రాహ్మణేతర నాయకులు ఆచరణలో ఉద్యోగాలలో రిజర్వేషన్ల పట్ల పై కులాలను అనుకరించే సంస్కృతీకరణాల పట్ల ఆసక్తి చూపరు కాని, ఈ కాలంలో సమూలమైన మార్పులు కోరే ప్రజా ఉద్యమాలు కూడా ఆవిర్భవించాయి.

పాట్నా, మోంఘీర్, దర్భాంగా, ముజఫర్‌పూర్ జిల్లాలకు చెందిన యాదవులు వారి కులం యొక్క సామాజిక స్థాయిని పెంచాలని ఆందోళన చేస్తున్నారని జంధ్యాలు ధరించి గతంలో వారి భూస్వాములకు చేసిన సేవలు చేయ నిరాకరిస్తున్నారని 1925 'మే' నాడు బీహారు గవర్నమెంటు రిపోర్టు పేర్కొన్నది. ఆ తరువాత దశాబ్దంలో అఖిల భారత కిసాన్ నాయకుడైన స్వామి సహజానంద సరస్వతి 1920 లలో పాట్నా జిల్లాలో బీహ్‌తా వద్ద ఆశ్రమంలో భూమిహార్ బ్రాహ్మణ సభని నిర్వహణతో తన కార్యక్రమాలు ప్రారంభించారు.

మహారాష్ట్రలో సత్యశోధన ఉద్యమాన్ని గురించి యింతకు ముందు ప్రస్తావించాము. సత్యశోధన గ్రామీణ ఆందోళనకారులు 1919 –21 కాలంలో సతారా జిల్లాలో భూస్వాములకు వడ్డీ వ్యాపారులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. తిరుగుబాటు ప్రభావం 30 గ్రామాలపై పడింది. కొన్ని హింసాయుత ఘర్షణలు జరిగాయి. 1920 దశాబ్దపు మధ్యకాలం నుండి కేశవరావు జోధ్, దినకరరావు జావల్కర్‌లు, కొత్త తరహా బాహ్మ్రణేతర ఉద్యమానికి పూనా నుండి నాయకత్వం అందించారు. బ్రాహ్మణ అధిపత్యం గల తిలక్ కాంగ్రెస్ లాగానే వీరు కూడా బ్రిటిష్ వ్యతిరేక వైఖరి గలవారే. కాని తరువాత దశాబ్దంలో మహారాష్ట్ర కాంగ్రెస్ వీరితో సంబంధాలు పెట్టుకొని, వీరిని యిముడ్చుకొనగలిగింది. ఫలితంగా 1942 నాటికి బొంబాయిలో జాతీయవాదానికి సతారా బలమైన స్థావరమైనది.

మరాఠి భూస్వామ్య రైతాంగం జాతీయవాదంలో యిముడ్చుకొనబడగా, అస్పృశ్యులైన మహర్లు 1920ల నుండి అంబేద్కర్ నాయకత్వంలో స్వతంత్ర ప్రతిపత్తి గల ఉద్యమాన్ని అభివృద్ధి పరిచారు. వారి డిమాండ్లు: ప్రత్యేక ప్రాతినిధ్యం, చెరువులు, బావులు ఉపయోగించుకొనటానికి, దేవాలయ ప్రవేశానికి హక్కు, మహర్‌వతన్ (గ్రామాధికారులకు సాంప్రదాయక సేవలు) రద్దు. మొదటి మహర్ల రాజకీయ సదస్సు జరుపుకొన్న 1927 నాటికి హిందుత్వం నుండి వైదొలగటానికి సంకేతంగా అంబేద్కర్ అనుచరులు మనుస్మృతిని తగలబెట్టడం ప్రారంభించారు.

తమిళనాడు కాంగ్రెస్ నాయకత్వం మహారాష్ట్ర కంటే తక్కువ సర్దుబాటు వైఖరిని ప్రదర్శించింది. సహాయ నిరాకరణలో చురుకుగా పనిచేసిన పెరియార్ ఇ.వి. రామస్వామి నాయకర్ జస్టిస్ పార్టీ కులీన ధోరణులకు భిన్నంగా ప్రజాదరణ పొందే సమూల మార్పులు కోరే ప్రత్యామ్నాయాన్ని అభివృద్ధి చేసేందుకు 1920 దశాబ్దం మధ్య భాగంలో కాంగ్రెస్‌తో తెగతెంపులు చేసుకొన్నారు. పదునైన తమిళ భాషలో వెలువరించిన ఆయన 'పత్రికుడి అరసు' (1924), ఆ తరువాత సంవత్సరంలో స్థాపించిన 'ఆత్మ గౌరవ ఉద్యమం' – బ్రాహ్మణ పురోహితులు లేకుండా వివాహాలు జరిపి, దేవాలయ ప్రవేశాలు జరిపించి మనుస్మృతిని తగులబెట్టి, కొన్ని సందర్భాలలో నిరీశ్వరవాదాన్ని ప్రచారం చేసి ప్రజాదరణ పొందాయి.

కేరళలో జరిపిన సౌమ్యమైన సత్యాగ్రహం యజవా నాయకుడైన శ్రీ నారాయణ గురుని సంతృప్తి పరచలేకపోయింది. సత్యాగ్రహాలు, బారికేడ్లను అధిగమించి నిషిద్ధ రహదారులలో నడవాలని, అన్ని దేవాలయాల్లో ప్రవేశించాలని కోరారు. టి.కె. మాధవన్ యొక్క సంస్కృతీకరణ మరియు గాంధేయ తరహా నాయకత్వాన్ని కె. అయ్యప్పన్, సి. కేశవ్ లాంటి యజవా నాయకులు తీవ్రంగా ప్రతిఘటించారు.

ఈ అన్ని ప్రాంతాలలో కూడా సమరశీలమైన దిగువ తరగతి ఉద్యమాలు వామపక్ష ధోరణుల ఆవిర్భావానికి తోడ్పడటం గమనించవలసిన అంశం. సహజానంద సోషలిస్టులతో, ఆ తరువాత కమ్యూనిస్టులతో కలిశారు. 1919 –21 లో సతారాలో సత్యశోధక ఉద్యమాలలో పాల్గొన్న నానాపాటిల్ 1942 లో సమాంతర ప్రభుత్వాన్ని నడిపాడు. ఆ తరువాత మహారాష్ట్రలో ప్రముఖ కమ్యూనిస్టు రైతు నాయకుడైనాడు. సింగారవేలు, పి. జీవానందన్ లాంటి తొలి తమిళ కమ్యూనిస్టులు 1930 దశాబ్దం ప్రారంభంలో కొద్ది కాలం పాటు పెరియార్‌కి సహకరించారు. అయ్యప్పన్, కేశవన్‌లు కమ్యూనిస్టు పార్టీలో చేరినప్పటికి కేరళలో చాలామంది యజవాలను కమ్యూనిస్టు పార్టీ బాట పట్టించారు.

**శ్రామికులు**

శ్రామికోద్యమ చరిత్రలో 1922 నుండి 1927 వరకు ఉద్యమం క్షీణించిన సంవత్సరాలుగా కనిపిస్తాయి. రాయల్ కమిషన్ ఆఫ్ లేబర్ (1931) అందించిన సమాచారం మేరకు 1921 లో అత్యధికంగా 376 సమ్మెలు జరుగగా 1924–27 కాలంలో వార్షికంగా 130 సమ్మెలు మాత్రమే జరిగాయి. 183 అనుబంధ సంఘాలతో ఎ.ఐ.టి.యు.సి సభ్యత్వం పెరిగినప్పటికి నాయకత్వం ఉదారవాద లేక కాంగ్రెస్ మితవాద స్వభావం కలిగి ఉంది. 1921 ఝరియా సదస్సులో స్ఫూర్తి, కార్మిక శ్రేణుల భాగస్వామ్యం లోపించాయి. ఈ కాలంలో సమ్మెలు సంఖ్య రీత్యా తక్కువ జరగటమే కాదు యజమానులు దురుసుగా వ్యవహరించారు.

1921 లో కోల్పోయిన పని దినాల సంఖ్య 70 లక్షలు. 1924 నుండి ఆ సంఖ్య పెరుగుతూ వచ్చింది. 1927 వాస్తవంగా కార్మిక సమ్మెలు వెల్లువెత్తిన సంవత్సరం. నష్టపోయిన పనిదినాల సంఖ్య 202 లక్షలు.

1924 కొన్ని కేంద్రాలలో కమ్యూనిస్టు నాయకత్వం ఆవిర్భవించిన సంవత్సరం. 1926 లో మొదటిసారిగా కార్మిక సంఘాలకు చట్టం ద్వారా కొంత చట్టపరమైన రక్షణ లభించింది. లేకపోతే శ్రామిక ప్రయోజనాలకు చాలా నష్టం వాటిల్లి ఉండేది. రిజిస్టరు చేయించుకొనబడని సంఘాలు, నిధులు వసూలు చేయటం చట్ట విరుద్ధంగా ప్రకటించబడింది. సంఘ కార్యవర్గాలలో బయటివారు. 50% మించరాదని గరిష్ఠ పరిమితి విధించబడినది. పౌర రాజకీయ ప్రయోజనాల కొరకు సంఘ నిధులు ఉపయోగించటంపై నిషేధం ప్రకటించబడింది.

(ఇది ఇంగ్లాండులో అమలులో ఉన్న దానికి పూర్తిగా విరుద్ధం. అక్కడ కార్మిక సంఘాలు లేబరు పార్టీకి పెద్ద ఎత్తున ఆర్థిక వనరులు సమకూరుస్తాయి).

సహాయ నిరాకరణ చివరి రోజులలో 1922 ఫిబ్రవరి నుండి ఏప్రిల్ వరకు జరిగిన చాలా శక్తివంతమైన ఈస్టిండియన్ రైల్వే సమ్మెకి దర్శనానంద, విశ్వానందలు నాయకత్వం వహించారు.

ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేందుకు ఈ ఉద్యమాన్ని ఉపయోగించుకోవాలనే ఆలోచన ఏ కాంగ్రెస్ నాయకుడికి రాకపోవటం గమనార్హం, యస్.యస్ హాల్దార్ లాంటి బెంగాలు కాంగ్రెసు నాయకులచే 1920 సమ్మెకాలంలో స్థాపించబడిన జంషెడ్‌పూర్ కార్మిక సంఘం కార్మికుల్ని అడ్డుకొనే శక్తిగా ఉంది కాని స్ఫూర్తి నిచ్చేదిగా లేదు.

1922 సెప్టెంబరులో టాటా సమ్మె కార్మికవర్గం ఒత్తిడి మేరకు అప్పటికప్పుడు పెల్లుబికిన సమ్మె అని యిటీవలి వివరణాత్మక అధ్యయనం స్పష్టం చేసింది. కార్మికసంఘం కార్మికుల డిమాండ్లను దాదాపు ప్రక్కకునెట్టి, సమ్మెని సంఘం గుర్తింపు కొరకు ఉపయోగించుకునేందుకు ప్రయత్నించింది.

ఉక్కురక్షణపై 1924 అసెంబ్లీలో చర్చ జరుగుతున్న సందర్భంలో, రక్షణకు స్వరాజ్యవాదుల మద్దతు అవసరం గనుక, కాంగ్రెసులో మంచి సంబంధాలున్న జంషెడ్‌పూర్ కార్మిక సంఘం (జె.యల్.ఎ) ఒత్తిడి తెచ్చి సి.ఆర్.దాస్, సి.యఫ్ అండ్రూస్ నాయకత్వంలో కార్మిక సమస్యల్ని పరిష్కరించే కమిటీని నియమించగలిగి వుండేది.

సి.ఎఫ్. అండ్రూస్ ఆ సంఘం అధ్యక్షుడైన తరువాత 1924 ఆగస్టులో సంఘానికి గుర్తింపు లభించింది. గాంధి, జంషెడ్పూరు సందర్శించినపుడు యాజమాన్యం ఘనంగా స్వాగతం పలికించి, గాంధీ, పెట్టుబడికి – కార్మికులకు మధ్య సామరస్యం యొక్క అవసరాన్ని నొక్కి చెప్పి కృతజ్ఞతలు చెల్లించుకొన్నారు. యాజమాన్యం కార్మిక సంఘం అప్పుల్ని కార్మికుల జీతాల నుండి మినహాయించి జమ చేసుకొన్నది. 1928 నాటికి ఆండ్రూస్ నాయకత్వంలోని జంషెడ్‌పూర్ కార్మిక సంఘాన్ని యాజమానుల సంఘంగా కార్మికులు వర్ణించడంలో విపరీతమేమీ లేదు. 1923 ఏప్రిల్‌లో జీతాలలో 20% కొరతని వ్యతిరేకిస్తూ అలహాబాద్ బట్టల మిల్లు కార్మికులు సమ్మెకు దిగారు. 64 మిల్లులలో 56 మిల్లులు మూతబడ్డాయి. ఆ సమయంలో

గాంధి జైలులో ఉన్నారు. బయట వుండి ఉంటే ఆ తరువాత 1929 లో లాగా వర్తక మాంద్యం కాలంలో యాజమానుల్ని చిక్కుల్లో పెట్టవద్దని కార్మికులకు ఉద్బోధించి ఉండేవారు.

'విశ్వాసపాత్రులైన సేవకులు జీతాలు లేకుండా యజమానులకు సేవలు చేస్తారు'. కార్మిక ఉద్యమం కల్పించబడిన ఆటంకాలతో తడబడుతూ వుంది. మద్రాసు నగరం ముఖ్యమైన కార్మిక కేంద్రం. 1922 –23లో బకింగ్‌హోం కర్నాటక మిల్లులలో 4 సమ్మెలు జరిగాయి. సింగారవేలు ఆధ్వర్యంలో 1923లో మద్రాసు బీచ్‌వద్ద మొదటి మేడే ఘనంగా నిర్వహించబడింది. కార్మిక నాయకుడిని తొలగించటంలో మొదలై 1925 ఏప్రిల్ నుండి జూన్ వరకు జరిగిన వాయువ్య రైల్వే సమ్మె లాహోరులో కార్మికులు తమరక్తంతో తడిపిన ఎర్రజెండాల ప్రదర్శనతో చిరస్మరణీయమైనది. బొంబాయి బట్టల మిల్లుల్లు 1924 జనవరి –మార్చి మరల, 1925 సెప్టెంబర్ – డిసెంబర్ కాలాల్లో జరిగిన సమ్మెలు, అన్నిటికంటె పెద్ద స్థాయి సమ్మెలు 1,50,000 మంది కార్మికుల 1924 సమ్మె బోనస్ (గడచిన 4 సంవత్సరాలు చెల్లింపబడింది) చెల్లింపు నిరాకరణకు వ్యతిరేకంగా జరిగింది. ప్రభుత్వం విచారణ కమిటీని (బోనస్ వాయిదా వేయబడిన జీతంలో భాగంగా పరిగణించడం కాక లాభాలతో ముడిపెట్టి కమిటి కార్మిక వ్యతరేక నిర్ణయం తీసికొన్నది). నియమించిన తరువాత బాప్టిస్టా, యన్.యం జోషీలు సమ్మె విరమించమని కార్మికులకు సలహా యిచ్చారు. కార్మికులు పోలీసు అణచివేతని, కాల్పులను ఎదిరించి రెండు నెలల పాటు సమ్మె కొనసాగించారు. చివరికి ఆకలి బాధ కార్మికులను ఓడించింది. జాతీయోద్యమం నుండి ఎలాంటి సహాయమూ అందలేదు. ఆ మరుసటి సంవత్సరం వస్త్ర పరిశ్రమలో సంక్షోభం నెలకొన్నదన్న నెపంతో జీతంలో 11.5 శాతం కోత విధించటం సెప్టెంబర్‌లో మూకుమ్మడి సమ్మెకు దారితీసింది. ప్రభుత్వం 3 1/2 శాతం ఎక్సైజు పన్నుని రద్దు చేయకపోతే కోత ఎత్తివేయడం సాధ్యపడదని బొంబాయి మిల్లు యజమానులు వాదించారు.

లాంక్‌షైర్ బట్టల మిల్లులకు సహాయపడేందుకు 1894 లో విధించబడిన ఈ ఎక్సైజ్ పన్నుని గురించి జాతీయ వాదులు చాలా కాలం నుండి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమ్మె విరమించే సూచనలు లేక పోవటంతో 1929 డిసెంబర్ 1న ప్రభుత్వం ఎక్సైజు పన్నుని రద్దు చేసింది. ఆ తరువాత మిల్లు యాజమానులు వేతనాల్లో తగ్గించిన మొత్తాన్ని కార్మికులకు యిచ్చారు. బొంబాయి కార్మిక వర్గం 30 సంవత్సరాలుగా జాతీయ వాదులు చేస్తున్న డిమాండుని దేశం కొరకు సాధించి పెట్టారు. 1925 సెప్టెంబరులోనే ఎక్సైజ్ పన్ను రద్దుపై అసెంబ్లీలో స్వరాజ్యవాదులు తీర్మానం చేశారు. వైస్రాయి దానిని వీటో అధికారంతో త్రోసి పుచ్చాడు.

1928 నాటి గొప్ప సమ్మెకు ముందే బొంబాయి బట్టల మిల్లు కార్మికుల సమరశీలత, నిర్మాణం బ్రిటిష్ వారి అధిపత్యంలో గల కలకత్తా జూట్‌మిల్లు కార్మికుల కంటే ఎక్కువ జీతాన్ని సాధించుకొనగలిగింది. బొంబాయి, కలకత్తాలో కార్మికులు సరాసరి జీతాలు 1919 లో రు. 24–75లు, రు. 16–40లు. 1927లో 34–56 లు రు.19–60లు. (బాగ్చి పేజీ 126) గుర్తింపు పొందిన బొంబాయి వస్త్ర కార్మిక సంఘం (1926 లో రిజిష్టరు చేయించబడింది.

కొత్త చట్టం క్రింద అలా చేసిన మొదటి సంఘం) ఉదార, మానవతావాది అయిన యన్.యం. జోషి చే నడుపబడింది.

బొంబాయిలో క్రింది స్థాయి నుండి స్వయం ప్రతిపత్తిగల కార్మిక ఉద్యమం స్వయంగా మిల్లు కార్మికులుగా వున్న ఏఏ ఆల్వే, బి.ఆర్. కాస్లేలచే 1923 స్థాపించబడిన గిర్నికామ్‌గార్ మహామండల్‌తో ప్రారంభమయింది. ఈ వైఖరిని కమ్యూనిస్టులు స్వీకరించి కార్మిక సంఘాన్ని 1928లో ప్రఖ్యాత గిర్నీకామ్‌గార్ యూనియన్‌గా మార్చారు.

## కమ్యూనిస్టుల ఆవిర్భావం

కమ్యూనిస్టు ఉద్యమం మొత్తం మాస్కో నుండి నిర్వహించబడిన కుట్ర తప్ప మరేమీ కాదని బ్రిటిష్ అధికారులు, ఆ తరువాత కాలం నాటి కొందరు పండితులు అభియోగాలు చేశారు. భ్రమల నుండి బయట పడ్డ విప్లవకారులు, సహాయ నిరాకరణవాదులు, ఖిలాపత్ వాదులు యింకా కార్మిక రైతాంగ కార్యకర్తలు సామాజిక రాజకీయ విముక్తికొరకు కొత్తదారులు వెతికారు. ఫలితంగా భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం జాతీయోద్యమ మూలాల నుండి ఆవిర్భవించింది. ఉద్యమ సంస్థాపకుడు ప్రముఖ యుగాంతర విప్లవకారుడు నరేన్ భట్టాచార్‌జీ (మౌనవేంద్ర నాథ్ రాయ్) ఆయన 1919 లో మెక్సికోలో బోల్షివిక్ మిఖైల్ బోరోడిల్‌తో సంబంధాలు పెట్టుకొన్నారు. అక్కడ కమ్యూనిస్టు పార్టీ స్థాపనకు సహాయపడ్డాడు. ఆ తరువాత 1920 వేసవిలో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ రెండవ కాంగ్రెస్‌కు హాజరయ్యేందుకు రష్యా వెళ్ళారు. అక్కడ వలసవాద ప్రపంచంలో కమ్యూనిస్టులు అనుసరించవలసిన వ్యూహం విషయమై లెనిన్‌తో విభేదించారు.

వలస, అర్థవలస రాజ్యాలలో ప్రధానంగా బూర్జువా నాయకత్వంలోని జాతీయ ఉద్యమాలకు విస్తృతమైన మద్దతు యివ్వవలసిన అవసరముందని లెనిన్ చెప్పాడు. కాని, రాయ్ భారత్ ప్రజలకు అప్పటికీ గాంధి లాంటి బూర్జువా జాతీయవాద నాయకుల పట్ల భ్రమలు తొలగిపోయాయని, వారు బూర్జువా జాతీయవాద ఉద్యమంతో సంబంధం లేకుండా స్వతంత్రంగా విప్లవం దిశగా ముందుకు సాగుతున్నారని వాదించాడు. జాతీయ బూర్జువాల పట్ల జాతీయవాద ప్రధాన స్రవంతి పట్ల వైఖరి కమ్యూనిస్టు వైరుధ్యాలలో ప్రధానమైన అంశంగా భారత దేశంలోనూ, యితర దేశాలలోనూ స్వతంత్రం వచ్చే వరకే కాక, ఆ తరువాత కాలంలో కూడా కొనసాగుతూ వచ్చింది.

1920 అక్టోబరులో యం.యన్.రాయ్ అబనీ ముఖర్జీ (కమ్యూనిస్టుగా మారిన మరొక మాజీ టెర్రరిస్టు, తరువాత కాలంలో 'రాయ్'తో తీవ్రంగా విభేదించారు). మహమ్మద్ ఆలి, మహమ్మద్ షాఫిక్ లాంటి కొందరు మహజర్లు (ఖిలాపత్ వాదులు 1920లలో హ్రజత్‌లో చేరి ఆఫ్ఘనిస్తాన్ గుండా సోవియట్‌లో ప్రవేశించారు. భారత్‌లో కమ్యూనిస్టు పార్టీని తాష్కెంటులో స్థాపించాడు.

1921 ప్రారంభంలో ఆఫ్ఘనిస్తాన్ ద్వారా భారతదేశంలోకి చొరబడే ఆశలు అడుగంటడంతో కమ్యూనిస్టు పార్టీలో కొత్తగా చేరినవారు తూర్పు మాస్కోలోని శ్రామిక కమ్యూనిస్టు యూనివర్శిటీలో చేరారు. 1922లో రాయ్ తన ప్రధాన కార్యాలయాన్ని బెర్లిన్‌కి మార్చాడు. అక్కడ నుండి వేన్‌గార్డు ఆఫ్ ఇండియన్ ఇండిపెండెన్స్ అనే పక్ష పత్రికని (అబనీ ముఖర్జీతో కలసి) 'పరివర్తనలో భారతదేశం' ప్రచురణలను ప్రారంభించారు.

ఇది భారత ఆర్థిక, సామాజిక పరిస్థితుల్ని మార్క్సిస్టు కోణం నుండి విశ్లేషించిన మొదటి ప్రయత్నం. ఈ కాలంలో వలసపోయిన యితర భారత రివల్యూషనరీ గ్రూపులు ప్రధానంగా వీరేంద్రనాధ్ ఛటోపాధ్యాయ, భూపేంద్రనాధ్ దత్, బర్కతుల్లాల నాయకత్వంలోని పాత బెర్లిన్ గ్రూపు మార్క్సిజం వైపు మరలాయి. సోవియట్ మద్దతు పొందటానికి 1921 లో వీరు చేసిన ప్రయత్నాలను ముతా ప్రయోజనాల రీత్యా రాయ్ అడ్డుకొన్నారు. వీరు ఆ తరువాత సంవత్సరం బెర్లిన్‌లో ఇండియా ఇండిపెండెన్స్ పార్టీని ప్రారంభించారు.

1920 దశాబ్దం మధ్య కాలానికి ప్రవాసంలో ఉన్న గదర్ ఉద్యమంలోని ముఖ్యమైన సెక్షన్ రతన్‌సింగ్, సంతోష్‌సింగ్, తేజ్‌సింగ్ స్వతంత్రుల నాయకత్వంలో కమ్యూనిస్టులయ్యారు.

1922 సంవత్సరానికి నళినీ గుప్తా (మాజీ టెర్రరిస్టు) షౌకత్ ఉస్మానీ (మహజిక) లాంటి రహస్య దూతల ద్వారా రాయ్ సహాయ నిరాకరణ ఖిలాఫత్ అనుభవాల నుండి అప్పుడే రూపు దాల్చుతున్న కమ్యూనిస్టు గ్రూపులతో – బొంబాయిలో (యస్.ఎ.డాంగే) కలకత్తా (ముజఫర్ అహ్మద్) మద్రాస్ (సింగార వేలు) లాహోర్ (గులాం హుస్సేన్) తో సంబంధాలు పెట్టుకొన్నాడు. అబనీ ముఖర్జీ ఛటోపాధ్యాయ గ్రూపు పక్షాన యిలాంటి ప్రయత్నాలే చేశాడు. కాని అవి అంతగా జయప్రదం కాలేదు. కలకత్తాలో ఆత్మశక్తి ధూమకేతు, గుంటూరు లో నవయుగ లాంటి వామపక్ష జాతీయవాద పత్రికలు లెనిన్, రష్యాలను ప్రశంసిస్తూ వ్యాసాలు – కొన్ని సందర్భాలలో 'వేన్‌గార్డు'లో ప్రచురితమైన వాటి వ్యాఖ్యానాలు ప్రచురించడం ప్రారంభించాయి.

డాంగే బొంబాయి నుండి – భారతదేశంలో ప్రచురించబడిన మొదటి కమ్యూనిస్టు పత్రిక 'సోషలిస్టు' వారపత్రిక ప్రచురణ ప్రారంభించారు. 1922 నవంబరు 2న, డాంగేకి రాసిన లేఖలో కార్మిక కర్షకుల ప్రయోజనాల కొరకు కమ్యూనిస్టు పార్టీ చట్టబద్ధంగా – చట్ట విరుద్ధంగా రెండు విధాల పని విధానానికి సంబంధించిన పథకాన్ని వివరించాడు. సెప్టెంబరు 'సోషలిస్టు' కూడా 'సోషలిస్టు' లేబర్ పార్టీ ఆఫ్ ఇండియన్ నేషనల్ కాంగ్రెస్'ని ప్రతిపాదిస్తూ అలాంటి సూచనే చేసింది. సింగారవేలు 'లేబర్ కిసాన్ పార్టీ' స్థాపించినట్లు 1923 మేలో ప్రకటించాడు. సింగారవేలు గయ కాంగ్రెస్ (1922 డిసెంబర్)లో ప్రపంచ కమ్యూనిస్టుల పక్షాన మాట్లాడుతున్నానని, బార్డోలి వెనుకంజ ఒక దుర్ఘటన అని, సహాయ నిరాకరణని జాతీయ సమ్మెతో మమేకం చేయవలసిన అవసరం ఉందని నొక్కి చెప్పి సంచలనాన్ని సృష్టించాడు.

1928 వరకు భారతదేశంలోని కమ్యూనిస్టు గ్రూపులు సామ్రాజ్యవాదంతో కాంగ్రెస్ పలు అంశాలతో రాజీ పడుతుందని విమర్శిస్తూనే జాతీయవాద ప్రధాన స్రవంతిలో పనిచేసేందుకే ప్రయత్నించారు. కాంగ్రెస్ వార్షిక సదస్సులో ప్రతినిధులకు పంచేందుకు రాయ్ క్రమం తప్పకుండా కార్యక్రమ ప్రకటనలు తయారు చేసేవాడు.

'వేన్‌గార్డు' తొలి సంచికలలో (మే, జూన్ 1922) గాంధీపై చేసిన విశ్లేషణలో తీవ్రమైన విమర్శలు ఉన్నప్పటికి 1928 తరువాత "గాంధీ బూర్జువాల ముసుగు" లాంటి విమర్శలు లేవు. బాధితులైన దేశ ప్రజల పట్ల గాంధీజీకి గల ప్రగాఢమైన ప్రేమని అభినందించింది. ప్రేమ ఉదాత్తమైనదే కాని, ఎత్తుగడలు రీత్యా తప్పులు జరిగాయన్నది. 'గాంధీ బలాన్ని యుద్ధ నౌకలు భరించలేవు. మరతుపాకులు అణచలేవు' అని ప్రశంసించింది. (జి. అధికారి, భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్ర పత్రాలు, 458, 438).

భారతదేశంలో కొన్ని చిన్న కమ్యూనిస్టు గ్రూపుల ఆవిర్భావం బ్రిటిష్ పాలకులకు కలిగించిన భయాందోళనలు – 1920లలో హోం పొలిటికల్ ఫైల్స్ అన్నింటినీ ఆవహించిన బోల్షివిక్ భూతం – అప్పటి కార్యకలాపాల తక్షణ ప్రాధాన్యతని అతిశయించాయి.

ప్రపంచవ్యాప్తంగా గల పాలక వర్గాల గుండెల్లో గుబులు పుట్టించింది. 1917 విప్లవం. భారతదేశంలో ప్రవేశించ యత్నించిన ముహాజిర్లపై 1922–27 సం॥ల మధ్య వరుసగా ఐదు పెషావర్ కుట్ర కేసులు మోపబడ్డాయి. 1924లో బోల్షివిక్ కుట్ర కేసులో ముజఫర్ అహ్మద్ ఎస్.ఎ. డాంగే, షౌకత్ ఉస్మాని, నళినీ గుప్తాలకు జైలు శిక్షలు విధించబడ్డాయి. అలాంటి అణచివేత చర్యలతో తగిలిన ఎదురు దెబ్బ తాత్కాలికమైనదే. బాహాటమైన భారత కమ్యూనిస్టు సదస్సు హజ్రత్ మొహాని ఆహ్వానసంఘ అధ్యక్షుడిగా, సింగార్‌వేలు అధ్యక్షుడిగా 1925 డిసెంబర్‌లో కాన్పూరులో నిర్వహించబడింది. చట్టపరంగా పని చేయడానికి వీలుగా చాలా గ్రూపులు కొమింటర్న్‌తో సంబంధాలు లేకుండా స్వతంత్రంగా పని చేస్తున్నట్లు ప్రకటించాయి. ఈ సదస్సు స్థాపించిన సంస్థ బొంబాయికి చెందిన ఎస్.వి. ఘాటే లాంటి దృఢమైన కమ్యూనిస్టుల సాధనమయింది. 1925 సదస్సులో పార్టీ స్థాపన జరిగినట్లు ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ 1959లో స్పష్టం చేసింది.

1925–27 కాలంలో చాలా సంస్థలు స్థాపించబడినప్పటికి చట్టపరమైన రక్షణ కల్పించుకొనేందుకు 1922–23లో విశాల వేదికగా కార్మిక, కర్షక పార్టీ స్థాపించాలనే ఆలోచన ఆచరణాత్మక ప్రాముఖ్యత కలది.

బెంగాల్‌లో లేబర్ స్వరాజ్యపార్టీ పెజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీగా మార్చబడింది. ఇది 1925–26లో ముజఫర్ అహమ్మద్, ప్రముఖ కవి నజ్రుల్ ఇస్లాం కుతుబుద్దీన్ అహమ్మద్, సి.ఆర్. దాస్, సెక్రటరీగా ఉన్న హేమంత్‌కుమార్ సర్కార్‌లచే స్థాపించబడింది. 1927లో గోపేన్ చక్రవర్తి, ధరణి గోస్వామిల నాయకత్వంలోని మాజీ అనుశీలక కార్యకర్తల గ్రూపు పార్టీలో చేరారు. పార్టీ 'రాంగావ్', 'గణావని' అనే పత్రికలను నడిపింది. పంజాబ్‌లో గదర్

ప్రముఖుడు సంతోష్ సింగ్ సంపాదకీయంలో కీర్తి పత్రిక ఒక గ్రూపుని సమీకరించింది. బబ్బర్ అకాలీ ఉద్యమంలోని కొందరు కార్యకర్తలను ఆకర్షించింది. సోహన్‌సింగ్ జోష్ నాయకత్వంలోని కీర్తి కిసాన్ పార్టీ స్థాపించబడింది.

బొంబాయిలో ఎస్.ఎస్. మిరాజ్ కర్, కె.ఎన్. జోగ్లేకర్, ఎస్.వి. ఘాటేలు మరాఠీ పత్రిక 'క్రాంతితో పాటు 1927లో వర్కర్స్ అండ్ ప్రెజెంట్ పార్టీని స్థాపించారు. అన్నింటికంటే ముఖ్యమైన అంశం, కమ్యూనిస్టులు శ్రామిక వర్గంతో నిజమైన సంబంధాలు పెంచుకోగలిగారు. 1927 ఫిబ్రవరి - సెప్టెంబర్‌లో ఖరగ్‌పూర్ రైల్వే వర్కు షాపు సమ్మెలలో కమ్యూనిస్టులు ప్రముఖంగా పనిచేశారు. వి.వి. గిరి, ఆండ్రూస్‌ల మితవాద నాయకత్వానికి వ్యతిరేకంగా కార్మికులకు గల అసంతృప్తిని వ్యక్తీకరించగలిగారు. ఖరగ్‌పూర్ సమ్మెని లిల్లుయా లాంటి యితర వర్క్‌షాపులకు విస్తరింపచేయాలని కమ్యూనిస్టులు చేసిన అర్ధవంతమైన సూచనను ఆండ్రూస్ వ్యతిరేకించాడు. ప్రక్కకు తిప్పి దారి మళ్ళించేందుకు కార్మిక సంఘ హ్యూమ్‌లా వ్యవహరిస్తున్నావని ఆండ్రూస్‌పై డాంగే విరుచుకుపడ్డాడు. "కార్మికులు వారి గమ్యాన్ని నిర్ణయించుకొనే యజమానులు' అన్నాడు. 1926 నుండి బొంబాయి వస్త్ర కార్మికులపై కమ్యూనిస్టు పార్టీ ప్రభావం త్వరత్వరగా పెరిగింది.

బ్రిటిష్ పార్లమెంట్‌లో కమ్యూనిస్టు సభ్యుడు, భారతీయుడు అయిన షాపూర్జి షక్లత్‌వాలా సందర్శన సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో గల మున్సిపాలిటీలు పౌర సన్మానాలు చేయటం, గాంధీ కూడా అతనితో కలిసి స్నేహపూర్వకమైన చర్చ జరపడం - కమ్యూనిజం పట్ల ఆసక్తిని పెంచాయి. కామ్రేడ్ "షక్లత్‌వాలా యొక్క పారదర్శకమైన చిత్తశుద్ధిని" గాంధీ అభినందించాడు. రైతాంగం పట్ల కమ్యూనిస్టు అశ్రద్ధని విమర్శించారు. "మనం ప్రస్తుతం ఎదురెదురు దిశల్లో పోతున్నప్పటికి మనం ఏదో ఒక రోజు కలుస్తాం" అని ఆశాభావం వ్యక్తం చేశాడు. సిద్ధాంతపరంగా నగర కార్మికవర్గ కార్యకలాపాలకు ప్రాధాన్యత యివ్వాల్సిన అవసరాన్ని ఊహించి 1920లో కార్యకర్తల కొరత కారణంగా గ్రామాలలోకి పంపించడం కమ్యూనిస్టులకు అంతగా సాధ్యపడలేదు.

కమ్యూనిస్టు కార్యక్రమ పత్రాలు మొదటి నుండి జమిందారీ విధానం రద్దు, భూమి పంపకం డిమాండ్ చేశాయి. కాంగ్రెస్ ఈ అంశాలను 1930 దశాబ్దం మధ్య కాలం నుండి చాలా సందేహంగా తటపటాయింపుతో ప్రస్తావించడం ప్రారంభించాయి.

## రివల్యూషనరీ టెర్రరిజం

కాంగ్రెస్ నాయకులపై భ్రమలు తొలగిపోయిన 1922 తరువాత పరిస్థితి బెంగాల్, యుపి, పంజాబ్‌లోని విద్యావంతులైన యువకుల్ని రివల్యూషనరీ టెర్రరిజం పద్ధతుల పట్ల ఆకర్షణకు దారితీసింది. 1922 తరువాత నుండి మాజీ రాజకీయ ఖైదీల సంపాదకత్వంలో ప్రచురించబడిన ఆత్మశక్తి, సారథి, బిజోలిలాంటి బెంగాలీ పత్రికలు పాత రివల్యూషనరీల ఆత్మ త్యాగాన్ని ప్రశంసిస్తూ వ్యాసాలు ప్రచురించాయి. హిందీ, గురుముఖి భాషలలో కూడా

ప్రచురించబడిన సచిన్ సన్యాల్ యొక్క “వంది – జీవన్” యువతరాన్ని విపరీతంగా ప్రభావితం చేసింది. అత్యంత ప్రజాదరణ పొందిన బెంగాలీ నవలాకారుడు శరత్‌చంద్ర ఛటర్జీ పట్టణ మధ్య తరగతి హింసాయుత విప్లవాన్ని ప్రశంసిస్తూ రచించిన “పధేర్ దాబీ” నవలని 1926లో ప్రచురించాడు. శరత్ నవలపై ప్రభుత్వం విధించిన నిషేధం నవల యొక్క ప్రజాదరణని యింకా పెంచింది. 1923–24లో బెంగాల్‌లో పునరుద్ధరింపబడిన టెర్రరిజం 1924 జనవరిలో గోపీనాథ్ సాహా ‘దే’ అనే ఇంగ్లీషు వ్యక్తిని హత్య చేయడంతో టెర్రరిజం తీవ్ర స్థాయికి పెరిగింది. (లక్ష్యం కలకత్తా పోలీస్ కమిషనర్ టిగార్ట్) హత్యానంతరం ‘బెంగాల్ ఆర్డినెన్స్ అక్టోబర్ 1924’ క్రింది పెద్ద ఎత్తున అరెస్టులు జరిగాయి. ఆలోచనల వ్యాప్తికి భిన్నంగా – రాజకీయ ఖైదీలు 1927–28లో విడుదల అయ్యే వరకు రివల్యూషనరీ కార్యకలాపాలు ఆగిపోయాయి. ఈ కాలంలో యుపిలో నివసిస్తున్న బెంగాలీలు – సచిన్ సన్యాల్, జోగేష్ చంద్ర ఛటర్జీలు “హిందూస్తాన్ రిపబ్లికన్ అసోసియేషన్” స్థాపించి బందిపోట్ల ద్వారా నిధులు సమకూర్చడం ప్రారంభించారు. 1925 ఆగస్టులో కాకోరి రైలు నిలిపివేత తరువాత ఈ సంఘానికి చెందిన అత్యధిక సభ్యులు అరెస్టు చేయబడ్డారు. మిగిలినవారు కొత్త సభ్యుల్ని (తరువాత కాలంలో భారత కమ్యూనిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ అయిన అజయ్ ఘోష్‌తో సహా) ఆకర్షించి మేధావి, యువ విద్యార్థి భగత్‌సింగ్ నాయకత్వంలో ఆవిర్భవిస్తున్న పంజాబ్ గ్రూపుతో సంబంధాలు పెట్టుకొని 1928 సెప్టెంబరులో ప్రఖ్యాత హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ ఆర్మీని నిర్మించాడు.

1920 దశాబ్దపు మధ్యకాలం నాటి టెర్రరిస్టు కార్యకలాపాల్ని, యుద్ధకాలం కార్యకలాపాలతోనూ, ఉద్యమం యొక్క అత్యంత తీవ్ర దశకు చేరుకొన్న 1930–34 కాలం నాటి కార్యకలాపాలతోను పోల్చడం సాధ్యపడదు. కాని కొన్ని రివల్యూషనరీ గ్రూపులలోని పునరాలోచనని, పరిణామ క్రమాన్ని – ప్రాధాన్యత గల అంశాలుగా గుర్తించాలి. బెంగాల్‌లో చిరకాలానుభవం గల ప్రముఖులు గత కాలంలో బతుకుతూ యుగాంతక అనుశీలన్ మధ్య గల పాతకాలం నాటి వైరాలతో ఘర్షణలలో కూరుకుపోయారు. వారు కార్మిక సంఘాల ద్వారా కాంగ్రెస్ ముఠా రాజకీయాలలో జోక్యం అంతకంతకూ పెంచుకొన్నారు. తక్షణ నాటకీయ పరిణామాల పట్ల ఆసక్తి, ఆతురత గల సూర్యసేన్ నాయకత్వంలోని చిట్టగాంగ్ విప్లవకారులలాంటి యువకుల దృష్టిలో విశ్వసనీయత కోల్పోయారు. కాని హిందూ మతతత్వం, వ్యక్తిగత హింస వ్యక్తులుగా కొద్దిమంది యొక్క వీరోచిత ఆత్మత్యాగం లాంటి అంశాలపై నిశితమైన పునరాలోచనని టెర్రరిస్టు సాంప్రదాయం యింకా అడ్డుకొంటున్నది. 1905–08 కాలం నాటి యిద్దరు ప్రముఖులు హేమచంద్ర కనుంగో, భూపేంద్రనాథ్ దత్తాలు పాత సాంప్రదాయాలలోని చాలా అంశాల్ని విమర్శిస్తూ 1920ల నాటి ముఖ్యమైన జ్ఞాపకాలను రాశాడు. హిందూస్తాన్ రిపబ్లిక్ అసోసియేషన్ పక్షాన బహుశా 1925లో సచిన్ సన్యాల్ రాసిన కరపత్రంలో ‘అరాచకత్వం నూతన సృష్టికి అవసరమనే వాదనతో వ్యక్తిగత హింసావాదాన్ని యింకా సమర్ధిస్తూ మనిషిని మనిషి దోచుకొనటాన్ని సాధ్యం చేసే అన్ని సంస్థల రద్దు అంతిమ లక్ష్యంగానూ ప్రకటించారు. కార్మిక, రైతు సంఘాల్ని ప్రారంభించవలసిన అవసరాన్ని ప్రస్తావించారు.

భగత్‌సింగ్ పునరాలోచన హేతుబద్ధమైన ఆలోచనా విధానం స్పష్టమైన సోషలిస్టు లక్ష్యాల వైపు సాగింది.

**సుభాస్, జవహర్‌లాల్**

స్పష్టమైన కమ్యూనిస్టు టెర్రరిస్టు ధోరణులతో పాటు 1920 దశాబ్దంలోని మధ్య చివరి నాటి స్తబ్దత నుండి పలు రకాల విద్యార్థి యువజన ఉద్యమాలు ఆవిర్భవించాయి. ఈ ఉద్యమాలు స్వరాజ్యవాదుల్ని, మార్పులు కోరని వారిని విమర్శిస్తూ, పూర్ణ స్వరాజ్య నినాదంతో నిలకడయైన సామ్రాజ్యవాద వ్యతిరేకత చేపట్టాలని, అంతర్జాతీయ పరిణామాల అవగాహనతో జాతీయవాదాన్ని సామాజిక న్యాయంతో మిళితం చేయాలని డిమాండ్ చేశాయి. 1927లో జైలు నుండి విడుదలైన సుభాస్ బోసు ఒక మేరకు ప్రాంతీయ భావాల్ని ప్రోత్సహించడం ద్వారా బెంగాలీ పట్టణ యువకులలో పెరుగుతున్న ఆదరణతో ఒక మేరకు అలాంటి భావాలను వ్యక్తం చేశాడు. మరొక అభివృద్ధి చెందుతున్న యువ నాయకుడు జవహర్‌లాల్ నెహ్రూ యొక్క 1926–27 యూరప్ పర్యటన నిర్ణయాత్మక ప్రాధాన్యత గలది. మతం జయింపబడకపోతే భారతదేశంలో మతం భారతదేశాన్ని దేశ ప్రజల్ని నిర్వీర్యం చేస్తుందనే నిశ్చితాభిప్రాయానికి వచ్చాడు. 1927 జనవరిలో వలసవాద అణచివేత సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగిన బ్రజిల్స్ సదస్సులో చురుకైన భాగస్వామ్యంతో జవహర్‌లాల్ యొక్క మానసిక అభివృద్ధిలో మూల మలుపు అని ఎస్. గోపాల్ నొక్కి చెప్పాడు. ఆ సదస్సులో పాల్గొనడం ద్వారా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సోషలిస్టు మరియు మూడవ ప్రపంచ జాతీయవాద శక్తుల్ని సంఘటితపరచాలనే నిశ్చితాభిప్రాయానికి వచ్చారు నెహ్రూ. ఈ అభిప్రాయాన్ని నెహ్రూ పూర్తిగా త్యజించలేదు. పూర్తిగా కట్టుబడిలేదు. బ్రసెల్స్‌లో ప్రారంభించబడిన సామ్రాజ్యవాద వ్యతిరేక స్వతంత్రతా సదస్సుకి నెహ్రూ గౌరవాధ్యక్షునిగా నియమింపబడ్డారు. 1927 నవంబర్‌లో నెహ్రూ, నెహ్రూ తండ్రి సోవియట్ రష్యాకి ఆహ్వానించబడ్డారు. సోవియట్ రష్యా సందర్శనపై ఆయన హిందూ పత్రికకి రాసిన వ్యాసాలు 'పాలనాధికారంలో కార్మిక కర్షకులున్న సుత్తి కొడవలి దేశం' ఆయనపై కలిగించిన ప్రభావాన్ని స్పష్టంగా వ్యక్తం చేశాయి. ఈ వ్యాసాలు 'సోవియట్ రష్యా' పేరుతో 1928లో ప్రచురింపబడ్డాయి. పుస్తకం కవర్ పేజీపై ఫ్రెంచి విప్లవంపై వర్డ్స్ వర్త్ కవితలోని 'ఆ ఉదయాన బ్రతికి వుండటం ఒక వరం. యువకుడిగా వుండటం స్వర్గమే మరి' ముద్రింపబడింది.

1927 నవంబర్‌లో అందరూ తెల్లవారు సభ్యులుగా వున్న సైమన్ కమిషన్ ప్రకటనతో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట వెల్లువకు శక్తుల్ని సమకూర్చుకొనడం ప్రారంభమయింది.

## అధ్యాయం - 6

# జాతీయవాద పురోగతి - ఆర్థికమాంద్యం 1927-37

### రాజకీయాలలో అంతర్వాహినులు

సైమన్ కమిషన్ నియామకం జరిగిన 1927 నవంబరు, మంత్రివర్గాల ఏర్పాటు జరిగిన 1937 జూలై మధ్యగల తొమ్మిదిన్నర సంవత్సరాలు సంక్లిష్టమైన, పరస్పర విరుద్ధమైన రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్న సంవత్సరాలు. తరువాత దఫా రాజ్యాంగపరమైన మార్పులను పరిశీలించేందుకు అంతా తెల్లవారు సభ్యులుగా గల సైమన్ కమిషన్ నియామకాన్ని తిరస్కరించి జాతీయోద్యమం 1931 లో గాంధీ ఇర్విన్ ఒప్పందం వరకు మొదటి శాసనోల్లంఘనోద్యమ ప్రచారంతో ముందుకు సాగింది. ఆ తరువాత విల్లింగ్డన్, రామ్సే మేక్డోనాల్డ్ ఆధ్వర్యంలోని జాతీయ ప్రభుత్వం ఆధ్వర్యంలో బ్రిటిషు ఎదురుదాడికి దిగింది. ఈ ఎదురుదాడి 1933-34లో కాంగ్రెస్‌ను దాదాపు ధ్వంసం చేసినంత పనిచేసింది. కాని 1937 మార్చిలో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ ఘన విజయం సాధించడంతో బ్రిటిషువారి దుందుడుకు తనానికి కళ్లెం పడింది. ఇది మొదటిసారిగా జాతీయోద్యమానికి ప్రభుత్వయంత్రాంగంపై పాక్షికమైనదైనప్పటికి నిజమైన అదుపు సాధించి పెట్టింది.

ఎగుడు దిగుళ్లతో నైనప్పటికి భారత జాతీయవాదం విశేషమైన పురోగతి సాధించింది. కాని యిది వైవిధ్య భరితమైన పురోగతి. ఈ వైరుధ్యాలను జ్ఞాన్‌పాండే యు.పి.పై జరిపిన యిటీవలి అధ్యయనం వెలుగులోకి తెచ్చింది.(యు.పి.లో కాంగ్రెస్ ఎదుగుదల 1926-34). 1919 -22 కాలంలో అస్పష్టంగా వున్న పురోగతి క్రమం 1930లలో స్పష్టతదాల్చింది. కాంగ్రెస్ సంస్థ పురోగతి అభివృద్ధి అంటే క్రింది స్థాయి ప్రజలలో గల విభేదాల్ని అలజడుల్ని అణచివేసి వారిని సంస్థలో యిముడ్చుకొనడం. ఈ గ్రంథం ప్రారంభంలో ప్రస్తావించిన విధంగా కాంగ్రెస్ రాజ్యంతో పోట్లాడుతూ అప్పటికి అసంపూర్తిగా వున్న 1947 పరిణామాన్ని గమనంలో పెట్టుకొని తాను రాజ్యం అవుతూ వుంది. ఇది క్రింది స్థాయి నోరు నొక్కుతూ పార్టీ నిర్మాణాన్ని

చేపడుతున్న సమస్య మాత్రమే కాదు. జాతీయోద్యమంపై బూర్జువాల సంపన్న రైతు గ్రూపుల యొక్క ఆధిపత్యాన్ని క్రమక్రమంగా స్థాపించుకొనడం యిందులో యిమిడి వుంది. కాంగ్రెస్ నెరవేర్చలేని ఆశల్ని ఆకాంక్షల్ని పలుమార్లు ప్రజలలో రేకెత్తించింది. ఫలితంగా కిసాన్ సభలు విద్యార్థి సంఘాలు, కాంగ్రెస్ సోషలిస్టులు, కమ్యూనిస్టులు, కాంగ్రెస్‌లోనే రైటు –లెఫ్టు ప్రతి ఘటనలు 1930 నుండి దేశ జీవితంలో ముఖ్యమైన భాగాలయ్యాయి. గాంధేయ నిబంధనల పట్ల మధ్యతరగతి యువకులలో తొలగిపోయిన భ్రమల కారణంగా బెంగాలు పంజాబులలో 1928 –34 కాలంలో టెర్రరిజం పెల్లుబికింది. రివల్యూషనరీలు వ్యక్తిగత హింసావాదాన్ని విడనాడి ప్రజాపోరాటాల్ని మార్క్సిజాన్ని అనుసరించడంతో వామపక్షాలు బలపడ్డాయి.

గతంలో లాగానే రాజకీయ చైతన్యం విభజన రూపాల్ని చేపట్టింది. క్లిష్టపరిస్థితులలోకి నెట్టవేయబడిన బ్రిటిషు ప్రభుత్వం వీటిని గతంలో ఎన్నడూ లేనంతగా ఉపయోగించుకొనే ప్రయత్నం చేసింది. ఆ విధంగా 'భారతీయ ఐక్యతకు ప్రమాదం' ఏర్పడింది. దశలవారీగా అధికారాన్ని సంప్రాప్తింపజేయడం అనే బ్రిటిషు వ్యూహానికి ఐక్యతా ప్రమాదానికి గల సంబంధాన్ని ఆర్.జి. మూరే తన 'భారతీయ ఐక్యతకు సంక్షోభం' అనే గ్రంథంలో వివరించాడు. 1857 తరువాత స్వదేశీ రాజుల్ని జాతీయవాదానికి వ్యతిరేకంగా ఉపయోగించుకొనడం యొక్క తార్కిక ముగింపు 1930ల నాటి సమాఖ్య ప్రతిపాదనలో వ్యక్తమయింది. కేంద్రంలో బాధ్యతాయుత ప్రభుత్వం ప్రతిపాదన, సెంట్రల్ అసెంబ్లీలో నామినేట్ చేయబడే స్వదేశీ సంస్థాన ప్రతినిధులతో దృఢంగా ముడివేయబడింది. హిందూ ఆధిక్యత పట్ల ముస్లింలలో భయాందోళనలు రెచ్చగొట్టబడ్డాయి. స్వతంత్రం కొరకు జాతీయవాదుల డిమాండ్లకు ఎదురుగా అంబేద్కర్ ఉద్యమం రూపంలో వ్యక్తమైన అస్పృశ్యుల న్యాయబద్ధమైన నిరసనలు చూపబడ్డాయి. ఛోటా నాగపూర్ లాంటి ప్రాంతాలలో తెగల వేర్పాటు వాదాన్ని ప్రోత్సహించడం వలసవాద వ్యూహంలోని మరొక అంశం. వెనుకబడిన తెగల పాలనా వ్యవహారలపై మంత్రి వర్గాలతో సంప్రదించకుండా 1935 చట్టం గవర్నర్లు తమ విచక్షణాధికారాలను ఉపయోగించే అధికారం కల్పించింది.

జాతీయోద్యమం అలాంటి విభజించి పాలించే ఎత్తుగడల్ని ఎదుర్కొని తరతమ విజయాలు సాధించింది. స్వదేశీ రాజుల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా బాహాటమైన మద్ధతు యివ్వడానికి కాంగ్రెస్ నాయకత్వం (ప్రత్యేకించి గాంధీ) చాలాకాలం సందేహించినప్పటికి సంస్థానాల ప్రజా ఉద్యమాలు ఊపందుకొన్నాయి. అంబేద్కర్ ఉద్యమాన్ని యిముడ్చుకొనడం సాధ్యపడలేదు. 1932 నుండి గాంధీ హరిజనులలో పనిచేసేందుకు ఎక్కువ సమయాన్ని కేటాయించారు. 1930లలో కాంగ్రెస్ మహారాష్ట్ర మైసూరు (కాస్త తక్కువగా) తమిళనాడులో బ్రాహ్మణేతర మధ్యస్థకుల ఉద్యమాలకు తనవైపు సమీకరించుకొనడంలో జయప్రదమయింది. సంక్షేమ కార్యక్రమాల ద్వారా కాంగ్రెస్ తెగల మద్ధతు పొందాలనుకొన్నది. అటవీ సత్యాగ్రహాలు, శాసనోల్లంఘనోద్యమంలో ముఖ్యమైన భాగమయ్యాయి. గత వైభవం పట్ల గల అవగాహన ముస్లింలను 1928–29 నెహ్రూ రిపోర్టుపై చర్చలకు దూరం చేసింది. వాయువ్య రాష్ట్రంలో మినహాయించి ముస్లింలు శాసనోల్లంఘనకు దూరంగా వుండిపోయారు.

1937 ఎన్నికలలో మొత్తం 482 ముస్లిం సీట్లకు గాను జిన్నా ముస్లింలీగు 109 సీట్లు మాత్రమే గెలువగలిగింది. మనం తరువాత గమనించబోయే విధంగా జిన్నా కూడా మూన్జే, జయకర్, మాలవ్యా లాంటి దుందుడుకు హిందూ మతవాదుల తిరస్కారాలు, తోసివేతల తరువాతనే రాజీపడని మతవాది అయ్యాడు. కీలకమైన ముస్లిం మెజారిటీ రాష్ట్రాలైన బెంగాలు, పంజాబులలో లీగు కాంగ్రెస్ చేతిలో ఓడిపోలేదు. రైతుల కొరకు భూస్వాములతో, పట్టణ వ్యాపారులతో వడ్డీ వ్యాపారులతో పోరాడతానని చెప్పుకొన్న ముస్లిం ప్రాంతీయ పార్టీల (కృషక్ ప్రజా, యూనియనిస్టు) చేతిలో ఓడిపోయింది. రెండు రాష్ట్రాలలో సమూలమైన మార్పులు తెచ్చే వ్యవసాయక కార్యక్రమాల్ని అభివృద్ధి పరచడంలోని కాంగ్రెస్ వైఫల్యం దీర్ఘకాలికంగా చూస్తే దేశ ఐక్యతకు ప్రమాదాన్ని తెచ్చిపెట్టిందని నిరూపితమయింది.

ఇటీవలీ సంవత్సరాలలో కేంబ్రిడ్జి చరిత్ర రచన విభాగం 'బ్రిటిషు విధానాలు, జాతీయోద్యమం యొక్క ఎగుడుదిగుళ్ల నేపథ్యంలో 1930లలో రాజ్యాంగ నిర్మాణ క్రమంపై పరిశోధనని ప్రోత్సహించింది. జూడిత్ బ్రౌన్ తన యిటీవలి గ్రంథం (గ్రాంధీ – శాసనోల్లంఘనం 1977, పేజి 12) లలో 'బ్రిటిషు ప్రభుత్వం నుండి గాంధీ పొందిన ఆదరణతోనే ఆయన పలుకుబాటలో మార్పులు వచ్చాయి.' అనే విల్లింగ్డన్ అంచనాని ఉటంకిస్తూ అఖిల భారతస్థాయిలో గాంధీ కార్యకలాపాల్ని బ్రిటిషువారే సాధ్యపడేలా చేశారు అని వాదించాడు. సైమన్ కమిషన్ రాజ్యాంగ సంస్కరణలు తక్షణ జాతీయ సమస్య అయిన తరువాత కాంగ్రెస్ పునరుజ్జీవం పొందింది. ఇర్విన్ తన సమానస్థాయిగల వ్యక్తితో మాట్లాడినట్లు గాంధీతో చర్చలు జరపడం గాంధీ స్థాయిని పెంచింది. బ్రిటిషువారు అంబేద్కర్ని ఉపయోగించుకొనడం గాంధీ హరిజనులపై నిర్దిష్టమైన కృషిని ప్రేరేపించింది. కాంగ్రెస్తో ఏ రకమైన చర్యలైనా జరిపేందుకు విల్లింగ్డన్ నిరాకరణ 1932–33లో జాతీయవాదం తగ్గుముఖం పట్టడానికి దారితీసింది. అయినప్పటికి మాంట్ఫర్డ్ సంస్కరణలకు 1919 –22 వెల్లువకు ఆరోపిత సంబంధం లాగానే నిశితమైన పరిశీలన ఈ మొత్తం పరిశోధనపై సందేహాల్ని రేకెత్తిస్తుంది. జాతీయవాద ఒత్తిళ్లకు బ్రిటిషు పోలీసు స్పందనలో మార్పులున్నాయి. అంతేగాని పోలీసుల స్పందనని బట్టి జాతీయవాద ఒత్తిళ్లు మారలేదు. జాతీయవాదం ఎగుడు దిగుళ్లలో వున్న కాలంలో కేవలం తెల్లవారు మాత్రమే సభ్యులుగా నియమింపబడిన సైమన్ కమిషన్ మాంటేగ్ ఉదారవాదం నుండి చాలా అంశాలలో వెనక్కి లాగాలని పథకం వేసింది. 1928 తరువాత జాతీయవాదం పొందిన పునరుజ్జీవం, ఇర్విన్కి 1929 అక్టోబర్ 31 ప్రతిపాదన చేయక తప్పని పరిస్థితి కల్పించింది. అలాగే రామ్సే మ్రే మెక్డొనాల్డ్ కేంద్రంలో 1931 జనవరిలో బాధ్యతాయుత ప్రభుత్వవాగ్దానాన్ని నిలబెట్టుకొనేలా చేసింది. రౌండు టేబుల్ సదస్సు, శాసనోల్లంఘనంలో పాల్గొన్న లక్షలాది సాధారణ ప్రజలకు రౌండ్టేబులు సదస్సులో చర్చించబడే సున్నితమైన అంశాలపైన అవగాహన గాని ఆసక్తిగాని వుండి వుండవు. అయినప్పటికి వారి ఒత్తిడి అన్నిటిని మించి వారి ఆత్మత్యాగం ఇర్విన్ని గాంధీతో చర్చించేలా చేసింది. 1932 –33లో పరాజయం పాలైన కాంగ్రెసుకు 1937లో అఖండ విజయాన్ని సాధించిపెట్టింది. చరిత్ర నిర్మించేది – పైస్థాయికి చెందిన బ్రిటిషు లేక భారత రాజకీయ నాయకులు కాదు, సాధారణ ప్రజలు.

## ఆర్థికమాంద్యం -భారతదేశం

1930ల నాటి ప్రజాందోళనలకు నిర్ణయాత్మకమైన ఆర్థిక మార్పులకు సన్నిహిత సంబంధం వుంది. 1929 చివర నుండి ప్రారంభమైన ప్రపంచ వ్యాప్త మాంద్యం భారతదేశాన్ని రెండు విధాలుగా ప్రభావితం చేసింది. ధరలు ప్రత్యేకించి వ్యవసాయక ఉత్పత్తుల ధరలు పడిపోవడం ద్వారా, ఎగుమతి ఆధారిత వలసవాద ఆర్థిక విధానంలో పెద్ద సంక్షోభాన్ని తెచ్చిపెట్టడం ద్వారా అఖిల భారత సాధారణ ధరల సూచిక (1873=100) 1929లో 203, వుండగా 1930లో 171కి 1931లో 127, 1932లో 126, 1933లో 121కి 1934లో 119కి పడిపోయింది. తరువాత కొద్దిగా పెరిగింది. 1937 లో స్థిరంగా 136 వద్ద వుంది. వ్యవసాయక ధరలు 1926 నుండి తగ్గడం ప్రారంభమయింది. కాని భారతదేశంలో సరాసరి ప్రత్తి ధర (1873=100) 1929లో 133గా వున్న ధర 1931కి 70కి పడిపోయింది. బెంగాలులో చలికాలపు వరిధర (1929=100), 1932 లో 45.98కి పడిపోయింది. జూట్ ధర 1934 నాటికి 43.5కి తగ్గింది. యు.పి.లో హోల్‌సేల్ ధరలు (1901 -05 =100) 1929లో 218 నుండి 1930లో 162కి 1931లో 112, 1934లో 103కి పడిపోయాయి. (సి.జె.బేకర్, దక్షిణ భారతదేశ రాజకీయాలు 1920 -37, పేజి 174: బి.బి. చౌదురి, ది ప్రాసెస్ ఆఫ్ డిపెజెంటైజేషన్ ఇక బెంగాల్ అండ్ బీహార్, ఇండియన్ హిస్టారికల్ రివ్యూ జూలై 1975, పేజి 117, జి. పాండే పేజి 160). మాంద్యం రెవిన్యూ కౌలు వడ్డీ చెల్లింపుల భారాల్ని విపరీతంగా పెంచింది. అమ్ముకోడానికి మిగులు పంటలు గల మధ్యతరగతి రైతులపై మాంద్యం ప్రభావం విపరీతంగా పడింది. 1930లలో ఒక సమీకరణ పద్ధతులు అప్పటి ఆర్థిక పరిస్థితుల కనుగుణంగా జరిగాయి. కాంగ్రెస్ (కొద్దికాలం తరువాత కొన్ని ప్రాంతాలలో వామపక్షాల పట్ల మొగ్గు గల కిసాన్ సభలు) శిస్తు తగ్గింపు, నీటిపన్ను, కౌలు రుణ భారాలు, జమీందారీ విధానం రద్దు లాంటి సమస్యలపై రైతుల్ని కౌలుదారుల్ని (పాలికాపుల్ని, వ్యవసాయ కూలీల్ని కాదు) సమీకరించింది. ఉద్యమం గ్రామ ప్రాంతాలకు సహాయనిరాకరణ కంటె వేగంగా విస్తరించింది. సంఘాల్ని నిర్మించుకొన్నది. 1919 -22 నాటి చెదురు మదురుగా కల్పించబడిన స్వర్ణయుగం రాబోతుందన్న భ్రమలు లేవు. రైతుల ప్రత్యేక డిమాండ్ల విషయంలో కాంగ్రెస్ మద్ధతుకి భూస్వామ్య సంబంధాలు అడ్డుపడేవి. హార్డియన్ ప్రస్తావించిన విధంగా 1930 దశాబ్దం మధ్య నాటికి గుజరాతు లాంటి ప్రాంతాలలో సంపన్నరైతులలో పెరిగిన కులీనధోరణి బార్డోలి నాయకుడైన వల్లభాయ్‌పటేల్‌ని కాంగ్రెస్ మితవాద నాయక ప్రముఖుని చేసింది.

భారతదేశంలోని బ్రిటిషు వలసవాద దోపిడిని మొదటి ప్రపంచయుద్ధం కొంత బలహీనపరిచినప్పటికి, అది 1929 వరకు ప్రాధమికమైన మార్పులు లేకుండా కొనసాగింది. 1920 దశాబ్దం చివరి వరకు బ్రిటిషు ఎగుమతులలో దాదాపు 11 శాతం (28 శాతానికి తక్కువగాని లాంక్‌షైర్ బట్టలతో సహా బ్రిటన్‌కే గాక యితరదేశాలకు భారతదేశం చేసే వ్యవసాయ, యితర ముడిపదార్థాల ఎగుమతులలోని మిగులు బ్రిటన్ చెల్లింపుల సమతుల్యతకు

కీలకం. ఎగుమతి పరిశ్రమలు (గనులు, టీ, జూట్) లో బ్రిటన్ పెట్టుబడులకు భారతదేశం ప్రధానమైనదిగా వుంది. 1929–30లో 311కోట్ల రూపాయలుగా వున్న భారతదేశ ఎగుమతుల విలువ మాంద్యం కారణంగా 1932 –33 (ఈ కాల వ్యవధిలో దిగుమతులు 241 నుండి 133 కోట్లకు పడిపోయాయి) లో 132 కోట్లకు పడిపోయాయి. లాంక్‌షైర్ వర్తకం సంక్షోభంలో పడింది. బ్రిటన్ నుండి నూలు బట్టల ముక్కల దిగుమతులు 1929 –30లో 1248 మిలియన్ల గజాలు వుండగా 1931 –32 నాటికి 376 మిలియన్ల గజాలకు పడిపోయింది. కొద్దిగా పుంజుకొన్న మీదట 1939 –40లలో 145 మిలియన్ల గజాలకు చేరుకొన్నది. (అమియా బాగ్చి పేజి 238)

పరిస్థితిని సరిదిద్దడానికి బ్రిటిషు – ప్రత్యేకించి లాంక్‌షైర్ ప్రయత్నాలు 1932 నుండి జాతీయ ప్రభుత్వం ఎదురుదాడి, ఫలితంగా సాధ్యపడలేదు. భారత ప్రభుత్వం ఆర్థిక యిబ్బందుల రీత్యా భారత పారిశ్రామికాభివృద్ధికి గణనీయంగా ప్రయోజనాలు చేకూర్చే విధంగా మరికొన్ని రక్షణ సుంకాల్ని  (ప్రత్తి, కాగితం, చక్కెర) విధించింది. ఈ పరిస్థితి భారతదేశం 1947కి చాలాముందే నిజమైన ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించడానికి దృష్టాంతరమని కొందరు వ్యాఖ్యానించారు. “లండన్ భారతదేశంలో ఎన్నికైన చట్ట సభలకు అధికారాన్ని అప్పజెప్పనప్పటికి, అది భారత దేశ ప్రభుత్వానికి అధికారాల్ని అప్పజెప్పింది”. (బి.ఆర్,. టామిల్సన్ ‘ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అండ్ రాజ్’ 1929 –42 పేజీ 30) వాస్తవ పరిస్థితులు పైకి కనిపించేటంత సాదాసీదాగా లేవు. చాలా సంక్లిష్టంగా వున్నాయి. రక్షణ సుంకాలు బ్రిటిషు సామ్రాజ్యవాద ప్రాధాన్యతలతో ముడివేయబడి వున్నాయి. ఏ విధంగానైనా లాంక్‌షైర్ బ్రిటిషు పెట్టుబడిదారీ వలసవాద వ్యవస్థకి ప్రతినిధిగా పనిచేస్తున్నది. 1935–36 నాటికి ఎలక్ట్రికల్ వస్తువులు, టెలికమ్యూనికేషన్, వైర్‌లెస్ పరికరాలు, చక్కెర పరిశ్రమ యంత్రాలు విలువ రీత్యా బ్రిటన్ భారతదేశానికి ఎగుమతి చేసే వస్త్రాలకు సమానస్థాయికి చేరుకొన్నాయి. భారతదేశంలో సుంకాల గోడల వెనుక విదేశీ కంపెనీలు (1933 లో లివర్ బ్రదర్స్ అండ్ మెటల్‌బాక్స్ 1936–37 నాటికి డన్‌లప్ అండ్ ఇంపీరియల్ కెమికల్స్) సహాయక పారిశ్రామిక యూనిట్లు స్థాపించడంతో పాటు విదేశీ నియంత్రణలో ఇండియా లిమిటెడ్ గ్రూపుల విధానాన్ని కూడా ప్రవేశపెట్టాయి. ఇవి సామ్రాజ్యవాద ప్రయోజనాన్ని కాపాడతాయి. ఒకవైపు భారత వాణిజ్య గ్రూపులతో సహకారం ద్వారా పరోక్షంగా ఆర్థిక అదుపు కొరకు ప్రతిపాదనలు మరొకవైపు రాజ్యాంగ సంస్కరణల ప్రయత్నాలు ఒకే సమయంలో జరుగుతూ వచ్చాయి. వాణిజ్యపరమైన అధిక్యత కొంత తగ్గినప్పటికి ఆర్థిక నియంత్రణలు పరిరక్షించబడ్డాయి. రూపాయి మారకపు విలువ 1 షిల్లింగు 6 పెన్నీలుగా నిర్ణయించబడింది. రిజర్వుబ్యాంకు చట్టాల ప్రభావానికి అతీతంగా వుంచబడింది. 1935 చట్టం వైస్రాయిని ‘ఆర్థిక రిజర్వేషన్లు’ ‘రక్షణల’తో సాయుధం చేసింది. వాసుదేవ చటర్జీ యిటీవలి అధ్యయనంలో వెల్లడించిన విధంగా బ్రిటిషువారి కనిపించని సంపాదనలలో 1922లో 16.31%, 1931లో 14.77%, 1936లో 15.75% ఇంగ్లాండుకి భారతదేశం యొక్క కనిపించని చెల్లింపులు (హోంచార్జీలు, ప్రైవేటు కేపిటల్ పెట్టుబడులపై లాభాలు, ఇన్సూరెన్సు) బ్యాంకు చెల్లింపులు, విమాన చార్జీలు, రాయల్టీలు – మరొక విధంగా చెప్పాలంటే

భారతీయవాదులు స్పష్టంగా పేర్కొన్న 'సంపద తరలింపు' ద్వారా లభించినవే. (లాంక్‌షైర్ కాటన్‌ట్రేడ్ అండ్ బ్రిటిష్‌పాలసీ ఇన్ ఇండియా, పేజి 27)

ఆర్థికమాంద్యం చాలా సమస్యల్ని సృష్టించినప్పటికి వలసవాద ఆర్థిక నిబంధనలలో పాతరూపాల్ని సడలించడమంటే ఒక్కసారిగా ముందుకు పోవడానికి అవకాశాలు కల్పించడంగా భావించాడు బూర్జువాలు, భారతీయ మిల్లులు 1929 –30లో 2356.5 మిలియన్ల గజాల తానుల్ని ఉత్పత్తి చేయగా 1932 –33 నాటికి 2982.7 మిలియన్లు, 1938–39 నాటికి లాంక్‌షైర్ దిగుమతుల్ని అధిగమించి 3905.3 మిలియన్ల గజాల ఉత్పత్తి చేయగలిగాయి. 1930లలో చక్కెర, సిమెంటు, పేపరు పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందాయి. ఉక్కు పరిశ్రమ 1934 తరువాత రక్షణ అవసరం లేనంతగా బలపడింది. భారతీయ పెట్టుబడిదారీ విధాన పురోగతి బొంబాయి అహమ్మదాబాద్ ప్రాంతాలకే పరిమితం కాలేదు. 1930లలో కలకత్తాలో యు.పి.లో దక్షిణ భారతదేశంలోనే గాక (ఉదాహరణ మద్రాసు ప్రావిన్సులో 1932లో కేవలం 26 వుండగా కాటన్ మిల్లులు 1937లో 37కి పెరిగాయి) స్వదేశీ సంస్థానాలలో (బరోడా, మైసూరు, భోపాల్ మొదలగు చోట్ల) అభివృద్ధి చెందింది. లాంక్‌షైర్ సంక్షోభం, ప్రభుత్వ సుంకాలతో కల్పించబడిన మార్కెటు రక్షణతో పాటు పారిశ్రామిక వస్తువుల కంటె వ్యవసాయక ధరల తగ్గుదల వలన కూడా భారతీయ పరిశ్రమ లాభపడింది. వాణిజ్య గ్రామీణ మాంద్యం పెట్టుబడిని వర్తకం, వడ్డీ వ్యాపారం, భూముల కొనుగోలు నుండి పరిశ్రమలకు మరల్చడానికి దారితీసింది.

భారతీయ పెట్టుబడిదారీ గ్రూపుల పెరుగుతున్న బలం యొక్క రాజకీయ పరిణామాలు – వాటి వైఖరులలో స్వల్పకాలిక దీర్ఘకాలిక ప్రయోజనాల మధ్య మాటిమాటికి తలెత్తే ఘర్షణలలో గణనీయమైన ప్రాంతీయ వ్యత్యాసాలున్నాయి. అయినప్పటికి బూర్జువా గ్రూపుల బలం 1930 దశాబ్దపు జాతీయ రాజకీయాలలో శాసనోల్లంఘనం, రాజ్యాంగచర్చలు, మంత్రివర్గ నిర్మాణాలు వగైరాలలో నిర్ణయాత్మకంగా పనిచేసింది.

వలసవాదం బలహీనపడుతున్న పరిస్థితులలోని పెట్టుబడిదారీ అభివృద్ధి, అప్పటికి బలంగా వున్న వలసవాద ప్రభుత్వాధికారం, ప్రపంచ వ్యాప్త మాంద్యం –అన్నీ కార్మికవర్గం భారాల్ని పెంచాయి. దారుణమైన పని పరిస్థితులు (1928–29, 1934 తరువాత) మాటిమాటికి చేపట్టబడిన వేతనాల్లో కోతలు లేఆఫ్‌లు క్రమబద్ధీకరణ చర్యలతో మరింత దారుణం చేయబడ్డాయి. కార్మిక అశాంతి 1928–29లో విపరీతంగా పెరిగిపోయింది. (1928లో 5,06,851 మంది కార్మికుల ప్రమేయం గల 208 సమ్మెలు లాకౌట్లు, నష్టపోయిన పనిదినాలు 31,647,404) అణచివేత (1929–33 మీరట్ కుట్రకేసు విచారణ) చీలికలతో అశాంతి తగ్గుదల, 1930 దశాబ్దం మధ్యకాలంలో మరలా పుంజుకొన్న అశాంతి (647801 మంది కార్మికుల జోక్యం గల 379 సమ్మెలు లాకౌట్లు). 1919 –22 కాలంలో లాగానే యిప్పుడు కూడా శ్రామిక సమరశీలత, జాతీయవాద వెల్లువ – రెండు ఎప్పుడూ కూడా కలసికట్టుగా పనిచేయలేదు.

బ్రిటన్‌తోను, పెట్టుబడిదారీ ప్రపంచంతోను సంబంధాలు బలహీనపడడం ఒకమేరకు దేశీయ పారిశ్రామిక అభివృద్ధికి దారితీసింది. కాని తీవ్రమైన వ్యవసాయ మాంద్యం దేశాన్ని క్రుంగదీసింది. 1930లలో తలసరి జాతీయాదాయం పడిపోయింది. 1920ల నుండి జనాభా పెరుగుదల పరిస్థితిని తీవ్రతరం చేసింది. 1920 –21 కాలంలో 284 నుండి 306 మిలియన్లకు – అంటే 20 మిలియన్ల కంటె కొంచెం ఎక్కువగా పెరిగింది. కాని 1931–41 కాలంలో 338 నుండి 389 మిలియన్లకు – అంటే అదే కాల వ్యవధిలో 50 మిలియన్లు పెరిగింది.

ఆర్థిక స్తబ్ధత పేదరికం వలసపాలన చివరి కాలంలో ప్రధానాంశాలుగా వుండిపోయాయి. 1916 –17లో తలసరి జాతీయాదాయం రు 60.4లు, 1946–47లో తలసరి జాతీయాదాయం రు. 60.7లు.

## 1928-29 సైమన్ కమిషన్ బహిష్కరణ -కార్మిక వెల్లువ

### సైమన్ కమిషన్ - నెహ్రూ రిపోర్టు

అందరూ తెల్లవారే సభ్యులుగా గల సైమన్ కమిషన్ (1927 నవంబరు 8) ప్రకటన భారత రాజకీయాలపై రెండు రకాల పరస్పర విరుద్ధ ప్రభావం చూపింది. బాహాటమైన అవమానంతో (ఆచరణీయ రాజకీయ చట్రాన్ని ఆమోదించలేని అసమర్థులు భారతీయులు అని బర్కన్‌హెడ్ ఎత్తిపొడువు తోడుకాగా) సప్రూలాంటి ఉదారవాద రాజకీయ నాయకులు జిన్నా ఆధ్వర్యంలో ముస్లిం నాయకులు అధినివేశ ప్రతిపత్తి రాజ్యాంగాన్ని రూపొందించేందుకు కాంగ్రెస్‌తో చేతులు కలిపారు. అదే సమయంలో సైమన్ బహిష్కరణ ఉద్యమం సంపూర్ణ స్వరాజ్యమే గాక సోషలిస్టు దిశలో పలు రకాల సామాజిక ఆర్థిక మార్పులను డిమాండు చేసే యువ శక్తుల పెరుగుదలకు ప్రేరణనిచ్చింది.

అన్ని రాజకీయ గ్రూపులు (మద్రాసులో జస్టిస్‌పార్టీ, పంజాబు యూనియనిస్టులు మినహాయించి) సైమన్ కమిషన్‌ని బహిష్కరించాలని నిర్ణయించి రాజ్యాంగాన్ని రూపొందించేందుకు అఖిలపక్ష సదస్సుకి సన్నద్ధమయ్యారు. అప్పటికే 1927 మార్చిలో ఢిల్లీ సదస్సులో జిన్నా రాజీ సూత్రంతో ముందుకు రావాలని ముస్లిం నాయకుల్ని ఒప్పించాడు. 1906 నుండి ముస్లిం కార్యక్రమాల ప్రధాన లక్ష్యమైన ప్రత్యేక నియోజక వర్గాల డిమాండుని ముస్లింలీగు వదులుకొంటుంది. మైనారిటీలకు రిజర్వుడు సీట్లతో ఉమ్మడి నియోజకవర్గాల్ని ఆమోదించింది. సెంట్రల్ అసెంబ్లీలో ముస్లింలకు మూడవవంతు ప్రాతినిధ్యం కల్పించబడాలి. పంజాబు, బెంగాలు యింకా మూడు మెజారిటీ ప్రావిన్సులలో (సింధు,బెలూచిస్తాన్, వాయువ్య సరిహద్దు రాష్ట్రం) జనాభా దామాషాని బట్టి ప్రాతినిధ్యం కల్పించబడాలి. ఈ ప్రతిపాదన 1927 డిసెంబరు ముస్లింలీగు సదస్సులో చేయబడింది. మహమ్మద్ షఫి ఆధ్వర్యంలో చీలిపోయి లాహోరులో సదస్సు జరుపుకొన్న ముస్లింలీగు ప్రత్యేక నియోజక వర్గాల్ని వదులుకొన నిరాకరించాలి. కమిషన్‌కి సహకరించాలని నిర్ణయించింది.

1927 మే లో ఎఐసిసి అలాగే 1927 డిసెంబరు మద్రాసు కాంగ్రెస్ సదస్సు జిన్నా ప్రతిపాదనని ఆమోదించినప్పటికి, పంజాబు, మహారాష్ట్రలో హిందూ మతవాద ఒత్తిడితో కాంగ్రెస్ వెనుకడుగు వేసింది. 1928 ఫిబ్రవరిలో ఢిల్లీలో, మేలో బొంబాయిలో జరిగిన అఖిల పక్ష సదస్సులు చివరికి ఆగష్టులో లక్నోవద్ద నెహ్రూ రిపోర్టు (మోతీలాల్ నెహ్రూ, తేజ్‌బహద్దూర్ సప్రూలచే రూపొందించబడింది). తుదిరూపమిచ్చాయి. మతపరమైన ప్రాతినిధ్య సమస్యలపై చర్చలు జరిపాయి. వాదులాడుకొన్నాయి. యికే.సి.కేల్కర్ ఆధ్వర్యంలో హిందూ మహాసభ జబల్పూర్ సదస్సు (1928 ఏప్రిల్) హిందూ యేతరుల మతమార్పిడి చేయించాలని కయ్యానికి కాలు దువ్వే తీర్మానాల్ని ఆమోదించింది. కొత్త ముస్లిం మెజారిటీ రాష్ట్రాల ఏర్పాటుని, పంజాబు, బెంగాలులో మెజారిటీలకు సీట్లు రిజర్వేషన్‌ని హిందూ మతవాదులు తీవ్రంగా వ్యతిరేకించారు. 1930 –31లో రౌండుటేబులు సదస్సుకి నమూనాగా వుండే ఏకకేంద్రక నిర్మాణాన్ని (unitary structure) డిమాండు చేశారు. నెహ్రూ రిపోర్టు హిందూ మహాసభకి చాలా రాయితీలు ప్రకటించింది. ఉమ్మడి నియోజకవర్గాలు అంతటా వుండగా రిజర్వుడు సీట్లు ముస్లిం మైనారిటీ ప్రావిన్సులకే (పంజాబు బెంగాలులకు కాదు) వర్తిస్తాయని చెప్పింది.

భారతదేశం అధినివేశ ప్రతిపత్తి సాధించిన తరువాత సింధు బొంబాయి నుండి విడగొట్టబడి ప్రత్యేక ప్రావిన్సుగా చేయబడుతుందన్నది. అప్పుడు కూడా అక్కడ వున్న హిందూ మైనారిటీలకు ప్రత్యేక ప్రాధాన్యతలు కల్పించబడతాయన్నది. శేషాధికారాలు కేంద్రం వద్ద వుంచుతూ రాజకీయ నిర్మాణం ఏకకేంద్రకంగా వుంటుందన్నది. ఉమ్మడి నియోజకవర్గాల సమస్యపై పంజాబు షఫీ ఫజత్ హుస్సేన్ గ్రూపుతో విభేదించిన జిన్నా, 1927 వాగ్దానాల నుండి వెనక్కి వెళ్ళారు. కాంగ్రెస్ నాయకుల్ని నిందించగల జిన్నా, 1928 డిసెంబర్ చివరలో కలకత్తా అఖిల పక్ష సదస్సులో ఐక్యత కొరకు విఫల ప్రయత్నం చేశాడు. సింధు తక్షణ ఏర్పాటు, రాష్ట్రాలకు శేషాధికారాలు, సెంట్రల్ అసెంబ్లీలో ముస్లింలకు మూడవవంతు సీట్లు, వయోజన ఓటు హక్కు కల్పింపబడే వరకు పంజాబు సింధులలో సీట్ల రిజర్వేషన్ వుండాలని వాదించి "మనందరం ఈ దేశం బిడ్డలం. మనం కలిసి బ్రతకాలి... నన్ను నమ్మండి. హిందువులు, ముస్లింలు సమైక్యంగా వుండకపోతే భారతదేశం అభివృద్ధి చెందదు...." (ఉమా కౌర్, ముస్లింలు మరియు భారత జాతీయవాదం, ఢిల్లీ 1977 పేజీ 45) అని చెప్పి ఐక్యత కొరకు భావోద్రేకపూరితమైన విజ్ఞప్తి చేసి ముగించాడు. రాజీ కొరకు చేసిన అలాంటి విజ్ఞప్తులన్నింటిని మహాసభ నాయకుడు ఎం.ఆర్. జయకర్ త్రోసిపుచ్చాడు. ఫలితంగా జిన్నా 1929 మార్చిలో జిన్నా షఫీ గ్రూపులో చేరి '14 అంశాల్ని' ప్రస్తావించాడు. వీటిలో కొత్త ప్రావిన్సుల డిమాండ్, కేంద్రంలో మూడవవంతు సీట్లు, ప్రావిన్సుల స్వయం ప్రతిపత్తితో సమాఖ్య, యితర అంశాలు హిందువుల ఆమోదం పొందేవరకు ప్రత్యేక నియోజక వర్గాల కొనసాగింపు వున్నాయి.

జయకర్ వైఖరిని అఖిల పక్ష సదస్సు ఆమోదించడంతో దారులు వేరయ్యాయని తరువాత జిన్నా పేర్కొన్నాడు. ఇక్కడ కొంత అతిశయోక్తి వుండవచ్చు. 1927 ప్రతిపాదన ప్రాతిపదికపై రాజకీయ నాయకుల ఆమోదం మత ఘర్షణల యొక్క లోతైన సామాజిక ఆర్థిక

సైద్ధాంతిక మూలాల్ని స్పృశించి వుండకపోవచ్చు. అలాగే ఐదు ముస్లిం ప్రాంతాలలో ప్రత్యేక నియోజకవర్గాల ఏర్పాటుకు ఆమోదం కూడా ప్రత్యేక ముస్లిం రాజకీయ గుర్తింపు భావనని తొలగించి వుండేది కాదు. కనీసం బలహీనపరచి వుండేది కాదు కాని 1928 నాటి వేరుకుంపట్లు రెండు సంవత్సరాల తరువాత చేపట్టబడిన శాసనోల్లంఘనకు అత్యధిక ముస్లిం నాయకులు దూరంగా వుండటానికి, కొన్ని చోట్ల శత్రుత్వ వైఖరి చేపట్టడానికి కారణాలయ్యాయి. హిందూ మతవాదం సామ్రాజ్య వ్యతిరేక జాతీయవాద ప్రయోజనాల్ని చాలా కీలకమైన సమయంలో గణనీయంగా బలహీనపరచింది. హిందూ మతవాదం అలా చేయడం అదే మొదటిసారి కాదు, చివరి సారి కాదు.

మత ప్రాతినిధ్య సమస్యని పరిష్కరించడంలో వైఫల్యాన్ని అలా వుంచితే నెహ్రూ రిపోర్టు – కేంద్ర రాష్ట్ర అంశాల జాబితాలు, ప్రాథమిక హక్కులు వగైరాలతో రాజ్యాంగ చట్ర రూపకల్పనకు జరిగిన మొదటి భారతీయ ప్రయత్నంగా కలకాలం గుర్తుంచుకోదగింది. అఖిల పక్ష సదస్సులాంటి మితవాద సంస్థ స్వభావానికి అనుగుణంగా అత్యంత ప్రముఖుడుగా ముందుకు వస్తున్న మోతీలాల్ కుమారుడితో పాటు, అత్యుత్సాహంతో ఉవ్వెత్తుగా లేస్తున్న యువతకు ఆశాభంగం కలిగిస్తూ రిపోర్టు కేంద్రంలో, ప్రావిన్సులలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూనే అధినివేశ ప్రతిపత్తిని కోరింది గాని సంపూర్ణ స్వరాజ్యాన్ని కాదు. కాని 1947 వరకు బ్రిటిష్‌వారు భారతదేశం కొరకు రూపొందించిన ఏ రాజ్యాంగంలోనూ ఎప్పుడూ అంగీకరించని స్త్రీ పురుషుల ఓటింగ్ హక్కు కొరకు రిపోర్టు డిమాండ్ చేసింది. 'భారత జాతీయవాదులు కులీన రాజకీయవేత్తలు, కాని బ్రిటిష్ పాలకులు సాధారణ ప్రజల ప్రయోజనాల్ని పరిరక్షించడానికి కోరువారు' – అని బ్రిటిష్ పాలకులు పలుమార్లు చేసిన వ్యాఖ్యానం ఈ సందర్భంగా గమనార్హం.

రాజ్యాంగ రూపకల్పన సహజంగానే స్వదేశీ సంస్థానాల భవిష్యత్తు సమస్యని ముందుకు తెచ్చింది. ఈ సమస్యని కాంగ్రెస్ చాలా కాలం నుండి దాటవేస్తూ వచ్చింది. మింటో, ఆ తరువాతి బ్రిటిష్ పాలకులు స్వదేశీ రాజులతో స్నేహ సంబంధాల్ని జాతీయ వాదులకు వ్యతిరేకంగా బురుజులుగా పటిష్టపరచుకొన యత్నించారు. మౌంట్‌ఫర్డ్ సంస్కరణలు బికనీర్ పాటియాలా లాంటి మధ్య తరహా స్వదేశీ సంస్థానాలు న్యూఢిల్లీతో సంప్రదింపులు జరిపేందుకు 'కన్సల్టేటివ్ ఛాంబర్ ఆఫ్ ప్రిన్సెస్' అనే వేదికను (1921 ఫిబ్రవరి) ప్రారంభించాయి. స్వతంత్రంగా న్యూఢిల్లీతో సంప్రదింపులు జరపడం స్థాయిగా వుంటుందనుకొన్న పెద్ద సంస్థానాలు (హైదరాబాద్, మైసూరు, తిరువాన్కూరు, బరోడాలు) దీనికి దూరంగా వున్నాయి. 1922లో సహాయ నిరాకరణోద్యమం ముమ్మరంగా సాగుతుంది. అఖిల భారత స్థాయిలో రాజకీయ వ్యవస్థ ప్రజాస్వామ్య దిశగా పరివర్తన చెందుతున్న సూచనలు కన్పిస్తున్నాయి. స్వదేశీ సంస్థానాధీశులు కలవరపడ్డారు. ఐర్లాండులో విధేయులకు పట్టిన దుర్గతి తమకు పట్టకుండా నివారించుకునేందుకు కొన్ని హక్కులు తగ్గించుకోవలసిందిగా సార్వభౌమాధికారాన్ని తమ వేదికయైన ఛాంబర్ ఆఫ్ ప్రెన్సెస్ ద్వారా అర్థించారు. కాని 1920 దశాబ్దం మధ్యకాలానికి కాంగ్రెస్ బలహీనపడటంతో బ్రిటిష్‌వారికి స్వదేశీ రాజుల్ని సమాధానపరచవలసిన అవసరం అంతగా కన్పించలేదు. బేరార్‌ని హైదరాబాద్‌కి తిరిగి యిప్పించే సమస్యపై స్వతంత్ర ట్రిబ్యునల్

నియమించాలని నవాబు చేసిన డిమాండ్‌ని 1926లో తిరస్కరించడంతో రీడింగ్ స్వదేశీ రాజులకు ఒక విధమైన హెచ్చరిక జారీ చేసినట్లయింది. సార్వభౌమాధికారం ఒడంబడికలపై ఆధారపడింది కాదని వాటికి అతీతంగా వుంటుందని రీడింగ్ వాదించాడు. దేశ భద్రతని కాపాడవలసిన బాధ్యత బ్రిటిష్‌వారిపై వుంది గనుక స్వదేశీ రాజుల ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకొనే హక్కు వారికుంటుందని చెప్పాడు. 1927-28లో జాతీయవాద పునరుద్ధరణతో బ్రిటిష్ వారికి సార్వభౌమాధికారం యొక్క పరిమితులపై స్వదేశీ రాజుల డిమాండ్లను పరిశీలించి వారిని సమాధానపరచవలసి వచ్చింది. నెహ్రూ రిపోర్టు స్వదేశీ సంస్థానాలలో తక్షణ అంతర్గత మార్పుల కొరకు ఎలాంటి సిఫార్సులు చేయనప్పటికి సార్వభౌమాధికారాన్ని భవిష్యత్ ప్రజాస్వామిక కేంద్రానికి మార్చవలసి వుంటుందని చెప్పింది. అఖిల భారత స్వదేశీ సంస్థానాల మొదటి సదస్సు (బొంబాయి 1927 డిసెంబర్) కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులైన నాయకులు నిర్వహించి బాధ్యతాయుత ప్రభుత్వాలను స్వదేశీ సంస్థానాలకు విస్తరింపచేయాలని డిమాండ్ చేశారు. సార్వభౌమాధికార సమస్యని అధ్యయనం చేసేందుకు ఇర్విన్ అదే నెలలో హార్ కోర్ట్ బట్లర్ (యుపిలో తాలూకాదార్ల అనుకూల విధానాలతో ప్రసిద్ధుడు) అధ్యక్షతన కమిటీని నియమించాడు. బట్లర్ రిపోర్టు (1929 మార్చి) సార్వభౌమాధికారం సార్వభౌమాధికారంగానే వుండాలని పునరుద్ఘాటించింది. అది భవిష్యత్‌లో అధినివేశ ప్రతిపత్తి గల స్వయం పరిపాలనా కేంద్రానికి బదిలీ చేయబడేది కాదు. సార్వభౌమాధికారం వైస్రాయికి వుంటుంది గాని గవర్నర్ జనరల్‌కి కాదు. ఇది భవిష్యత్‌లో కాంగ్రెస్ ఆధిపత్యంలో ఏర్పడనున్న కేంద్ర ప్రభుత్వ పరిధి నుండి స్వదేశీ సంస్థానాలను దూరంగా వుంచడానికి చేసిన స్పష్టమైన ప్రయత్నం.

ప్రైవేట్ వ్యక్తిగత ఆస్తి హక్కుకి గ్యారంటీ కల్పిస్తూ మాలవ్యాచే ప్రవేశపెట్టబడిన సవరణకు 1928 ఆగస్టులో నెహ్రూ రిపోర్టు నిర్మాతల ఆమోదం లభించడం ఆ నిర్మాతల కులీనతని వ్యక్తం చేసింది. కలకత్తా అఖిల పక్ష సదస్సులో యుపి కిసాన్ సభ సభ్యుడు బాబు రామచంద్ర దీనిని వ్యతిరేకించాడు. బెంగాల్ ప్రతినిధులు నరేష్ సేన్ గుప్తా, జె.ఎన్. బెనర్జీలు బెంగాల్ నూతన ప్రభుత్వం నిర్వర్తించే మొదటి బాధ్యతలతో శాశ్వత పరిష్కారాన్ని (Permanent Settlement) రద్దు చేయడం ఒకటిగా వుండాలని డిమాండ్ చేశారు. కాని మాలవ్యా తన పనిని సులభంగా సాధించుకున్నాడు (ఇండియన్ యాన్యువల్ రిజిష్టర్ 1928) సైమన్ రాక పట్ల భారతీయుల స్పందన కేవలం రాజ్యాంగ చర్చలకు పరిమితం కాలేదు. కమిషన్ పర్యటన సందర్భంగా 'సైమన్ వెనక్కి వెళ్ళిపో' ప్రదర్శనలు, నల్లజెండాల నిరసనలు హర్తాళ్ళు నగరాలను ఊపివేశాయి. బ్రిటిష్ వస్తువుల బహిష్కరణ ఉద్యమం 1928లో పునరుద్ధరించబడింది. సైమన్ వ్యతిరేక ప్రచారంలో ఫిబ్రవరి 3 దేశవ్యాప్త హర్తాళ్, సైమన్ రాగానే ఫిబ్రవరి 19న కలకత్తాలో పెద్ద ఎత్తున ప్రజా ప్రదర్శనలు, మార్చి 1న బ్రిటిష్ వస్తువుల బహిష్కరణకు పిలుపునిచ్చి కలకత్తాలోని 32 వార్డులలో సమావేశాల నిర్వహణ, అక్టోబర్ 30న లాహోరులో పోలీసులతో పెద్ద ఘర్షణ (తీవ్రంగా గాయపరచబడ్డ లజపతిరాయ్ నవంబర్ 17న మరణించాడు) నవంబర్ 28 - 30లలో పెద్ద ఎత్తున లక్నోలో నిరసన ప్రదర్శనలు, కమిషన్‌కి స్వాగత సత్కారాలకై తాలూకాదారు ఏర్పాటు చేసిన కైజర్‌బాగ్ వద్ద

ఖలీకుజ్జమన్ 'సైమన్ గోబ్యాక్' నినాదాలు గల బెలూన్లు, గాలిపటాల ఎగురవేత, జవహర్‌లాల్ నెహ్రూ, గోవింద వల్లభ పంత్‌లకు పోలీసుల లాఠీదెబ్బలు – కొన్ని ముఖ్యమైన ఘట్టాలు.

**యువజన ప్రదర్శనలు**

పట్టణాలలో జరిగిన ప్రదర్శనలతో మధ్యతరగతి విద్యార్థులు, యువకులు చాలా ఎక్కువగా పాల్గొన్నారు. సంపూర్ణ స్వతంత్రం సామాజిక ఆర్థిక మార్పుల్ని డిమాండ్ చేస్తూ 1928, 1929 సంవత్సరాలలో యువకులు విరివిగా సదస్సులు నిర్వహించారు. విద్యావంతులలో ప్రబలిన నిరుద్యోగం యువజన అశాంతికి కొంత కారణమై వుండవచ్చు. ద్వంద్వ ప్రభుత్వంలో విద్యారంగాన్ని ఎన్నికైన మంత్రివర్గాలకు మార్పు చేయడం విద్యార్థుల సంఖ్య పెరుగుదలకు దారితీసింది. (సైమన్ రిపోర్టు ప్రకారం 1922లో జనాభాలో 5.04%గా వున్న విద్యార్థులు 1927 నాటికి 6.91%కి పెరిగారు). గతంలో కంటె ఉద్యోగావకాశాలు స్వల్పంగా మెరుగుపడ్డాయి. 1929లో 'ఫిక్కీ', బిర్లా ఆధిపత్యంలో గల 'ఛాంబర్ ఆఫ్ కామర్స్' ఈ అసాధారణ ఘటన పట్ల ఆందోళన వ్యక్తం చేశాయి. 1920లలో కర్ణాటకకి చెందిన ఎన్.జి. హార్డీకర్‌చే ప్రారంభింపబడిన హిందూస్తాన్ సేవాదళ్ ద్వారా కాంగ్రెస్ యువకులను సమీకరించ యత్నించింది. 1928, 1929లలో జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ బోస్‌లు దేశంలోని పలు ప్రాంతాలలో యువజన సదస్సులలో ప్రసంగాలు చేశారు. 'కమ్యూనిస్టు సమాజానికి స్వతంత్ర సాధన ప్రాథమిక చర్య' అని పిలుపునిచ్చిన సోషలిస్టు యూత్ కాంగ్రెస్ సదస్సుకి కలకత్తాలో 1928 డిసెంబర్‌లో నెహ్రూ అధ్యక్షత వహించారు. సుభాస్ బోస్ మరొక యూత్ కాంగ్రెస్ సదస్సులో ప్రసంగిస్తూ జర్మనీ, ఇటలీ, రష్యా, చైనాల యువజనోత్సవాలను విచక్షణా రహితంగా ప్రశంసిస్తూ స్పష్టతలేని ప్రసంగం చేశారు. అభివృద్ధిలోకి వస్తున్న ఇరువురు నాయకుల మధ్య వ్యక్తిగతమైన పోటీ అసూయల కారణంగా సంబంధాలు అప్పటికే దెబ్బతిన్నాయి.

అంతకు ఒక సంవత్సరం ముందు మద్రాసులో జవహర్‌లాల్ రిపబ్లికన్ కాంగ్రెస్ అధ్యక్షుడయ్యాడు. రిపబ్లికన్ కాంగ్రెస్ సంపూర్ణ స్వరాజ్యాన్ని డిమాండ్ చేసింది. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తమతో సత్సంబంధాల కొరకు పిలుపునిచ్చింది. అల్లూరి సీతారామరాజుతో పాటు శాకో, వాన్జెట్టి (అమెరికాకి చెందిన ఇటలీ కార్మిక మృతవీరులు)లను ప్రశంసిస్తూ తీర్మానాలు చేసింది. గాంధీ హాజరు కాని మద్రాసు కాంగ్రెస్ సదస్సు (1927 డిసెంబర్)లో నెహ్రూ సంపూర్ణ స్వతంత్రం కొరకు హడావిడిగా తీర్మానాన్ని ప్రవేశపెట్టించాడు. బ్రిటిష్‌వారు పాలనా బాధ్యతల నుండి తక్షణం వైదొలగడంగా స్వరాజ్యాన్ని సూత్రీకరించిన అనుబంధ క్లాజుల్ని ప్రతినిధులు తిరస్కరించారు. నిర్వచించబడని స్వరాజ్యం కాంగ్రెస్ సంప్రదాయంగా కొనసాగింది. 'చాలా వేగంగా పోతున్నావని' గాంధీ మందలించాడు. నెహ్రూ వెనక్కి తగ్గాడు. "రాజకీయాలలో బహుశా కర్తవ్యశూరుణ్ణి తప్పుచేసినవాణ్ణి అయినప్పటికి నేను మీ పిల్లవాణ్ణి కాదా?" (నెహ్రూ గాంధీకి జనవరి 23 – గోపాల్ పేజి 112). నెహ్రూ రిపోర్టు అధినివేశ ప్రతిపత్తిని ఎంపిక చేసినప్పుడు సంపూర్ణ స్వరాజ్యం లక్ష్యాల ఆమోదం కొరకు ప్రచారం

సాగించేందుకు జవహర్‌లాల్ సుభాష్ బోస్‌లు కాంగ్రెస్ లోపల ఒత్తిడి పెంచే గ్రూపుగా 'ఇండిపెండెన్స్ ఇండియా లీగ్' సంస్థని నడిపారు. సంపూర్ణ స్వతంత్ర్యాన్ని లీగుకి చెందిన యుపి శాఖ 1929 ఏప్రిల్ యిలా వర్ణించింది. "ఉత్పత్తి పంపిణీ సాధనాలపై రాజ్యం అదుపుతో అభివృద్ధి చెందడానికి ప్రతి వ్యక్తికి అన్ని అవకాశాలు వుండే.... సోషలిస్టు ప్రజాస్వామ్య రాజ్యం" కాంగ్రెస్‌లోని వామపక్షవాదులు సిద్ధాంతాన్ని వల్లె వేశారు గాని దాని నిర్దిష్టమైన కార్యాచరణ నిర్మాణ రూపం యివ్వడంలో విఫలమయ్యారు. 1929 జూలైలో నెహ్రూ 'ఇండిపెండెన్స్ ఫర్ ఇండియా లీగ్' పూర్తిగా విఫలమయిందని గాంధీ ఎదుట అంగీకరించాడు. "గ్రూపులు పార్టీలు ఏర్పాటు చేసేందుకు వుండవలసిన రాజకీయ నాయకుని అభిరుచి నాకు లేదు" (సెలెక్టడ్ వర్క్స్ ।జ, 156).

## హిందూస్తాన్ రివల్యూషనరీ ఆర్మీ

మాటలతో అసంతృప్తి చెందిన విద్యావంతులైన పట్టణ యువకులు రివల్యూషనరీ టెర్రరిజం దారి పట్టారు. బెంగాల్‌లో పెద్దలైన "అనుశీలన్", "యుగాంతర్" దాదాలు ఓపికతో సన్నాహాలు చేసుకోమన్నారు. తక్షణ చర్యల్ని నిరుత్సాహపరిచారు. వారు మాత్రం కాంగ్రెస్ ముఠా తగవులలో నిమగ్నమయ్యారు. బోస్ విడుదలైన తరువాత 1928 నుండి పెరుగుతూ వచ్చిన పోరాటంలో యుగాంతర్ బోస్‌కు మద్దతు ఇచ్చింది. అనుశీలక సేన్ గుప్తాకి మద్దతు ఇచ్చింది. పెద్దల సలహాలు పాటించకుండా యువక తిరుగుబాటు గ్రూపులు ఆవిర్భవించాయి. అలాంటి ఒక గ్రూపు 1929 డిసెంబర్‌తో మేచుయా బజార్ బాంబు కేసులో ధ్వంసం చేయబడింది. చిట్టగాంగ్‌కి చెందిన సూర్యసేన్ నాయకత్వంలో బలమైన గ్రూపు నాటకీయమైన చర్యకి సన్నాహాలతో ముందుకు సాగింది. బెంగాల్‌లో రివల్యూషనరీ టెర్రరిస్టు సాంప్రదాయం విస్తృతమైన సామాజిక లక్ష్యాలూ, పద్ధతులపై పునరాలోచనని అడ్డుకొన్నది. మేచుయా బజారు గ్రూపు ప్రచురించిన కరపత్రం 'బెంగాల్ యువత' యింకా కొద్దిమంది యువకుల వీరోచిత ఆత్మత్యాగాన్నే ఆశ్రయించి యున్నది. "రక్తం బలిగోరే ఇంగ్లీషు నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఒంటరిగా ఒక్కరిగా నిలబడవలసి రావటం గర్వకారణం" – దానిలో సామాజిక ఆర్థిక కార్యక్రమ సూచనలే లేవు.

దీనికి పూర్తి విరుద్ధంగా హిందూస్తాకన్ సోషలిస్టు రిపబ్లికన్ ఆర్మీ నాయకులలో కొందరు కొత్త ఆలోచనల్ని స్వీకరించారు. హిందూస్తాన్ సోషలిస్టు రిపబ్లిక్ ఆర్మీ (హెచ్‌ఎస్ఆర్ఎ) 1928 సెప్టెంబర్‌లో ఫిరోజిషా కోట్ల శిథిలాలలో జరిగిన సమావేశంలో భగత్‌సింగ్ ఆయన పంజాబ్ గ్రూపు సచిన్ సన్యాల్ సోదరుడు జితేంద్రనాథ్ యుపి నుండి అజయ్‌ఘోష్, బీహారు నుండి ఫణీంద్రనాథ్ ఘోష్‌లచే స్థాపించబడింది. భగత్సింగ్‌కి మార్క్సిస్టు సోషలిజం పట్ల నిబద్ధత క్రమంగా పెరిగింది. భగత్‌సింగ్ హేతువాది. హెచ్.ఎస్.ఆర్.ఎ. చేపట్టిన చర్యలు : లజపతిరాయ్‌పై జరిగిన దాడికి ప్రతీకారంగా 1928 డిసెంబర్‌లో లాహోర్‌లో శాండర్స్ హత్య, భగత్‌సింగ్, బటుకేశ్వర్‌దత్తాలు 1929 ఏప్రిల్ 8న లెజిస్లేటివ్ అసెంబ్లీలో బాంబులు వేయుట, 1929 డిసెంబర్‌లో ఢిల్లీ సమీపంలో ఇర్విన్ రైలుని పేల్చి వేసే ప్రయత్నం, 1930లో

పంజాబ్, యుపి పట్టణాలలో వరుసగా జరిపిన టెర్రరిస్టు చర్యలు (ఒక్క పంజాబ్‌లో ఆ సంవత్సరంలో 26 ఘటనలు నమోదు చేయబడ్డాయి) కార్యక్రమాలు సాంప్రదాయక, టెర్రరిస్టు చర్యలుగా కనిపించవచ్చు. హెచ్.ఎస్.ఆర్.ఎ. దాని పలుకుబడిలో పనిచేసిన బహిరంగ యువ సంఘం, నౌజవాన్ భారత్ సభ – చాలా విశాలమైన దృక్పథం గలవి. విచారణలో భగత్‌సింగ్ వివరణ యిచ్చినట్లుగా తన దృష్టిలో 'విప్లవం (రివల్యూషన్) అంటే బాంబు పిస్టల్ సంస్కృతి కాదు.' విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారీ విధానాల్ని నిర్మూలించి కార్మికవర్గం నియంతృత్వాన్ని స్థాపించే సమాజం యొక్క సమూలమైన మార్పు "విప్లవం మానవత నుండి విడదీయించి హక్కు. స్వేచ్ఛ అందరియొక్క జన్మ హక్కు. శ్రామికుడు నిజమైన సమాజ పోషకుడు. విప్లవ బలిపీఠానికి మన యువత సౌరభాన్ని సమకూర్చింది. ఇంత అద్భుతమైన లక్ష్యం కొరకు ఏ త్యాగం కూడా పెద్దది కాదు. మేము తృప్తిగా వున్నాం. విప్లవం రాక కొరకు మేము నిరీక్షిస్తూ వుంటాం. "ఇంక్విలాబ్ జిందాబాద్" అసెంబ్లీ బాంబులు ప్రదర్శనాత్మకమైనవి. సందర్భం కార్మిక వ్యతిరేక వర్తక వివాదాల బిల్లు. శాండర్స్ హత్య సందర్భంగా ఉరిశిక్ష కొరకు నిరీక్షిస్తూ 23 సం॥ల యువకుడు మార్క్సిజం క్రమబద్ధమైన అధ్యయనాన్ని ప్రారంభించాడు. మానవ గౌరవం ప్రాతిపదికగా మత తిరస్కరణని సమర్థించుకుంటూ హేతుబద్ధమైన తర్కంతో నేనెందుకు నిరీశ్వరవాదిని? అనే రచన చేశారు. భగత్‌సింగ్ సన్నిహిత అనుచరులలో ఒకరైన అజయ్‌ఘోష్ తరువాతి కాలంలో భారత కమ్యూనిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ అయ్యారు.

హెచ్.ఎస్.ఆర్.ఎ. నాయకులు, మృతవీరులు ప్రజాదరణ పొందారు. జైళ్ళలో రాజకీయ ఖైదీల స్థితిగతుల మెరుగుదల కొరకు నిరాహార దీక్ష చేపట్టి 64వ రోజున మరణించిన జతిన్ దాసు అంతిమయాత్ర సందర్భంగా రెండు మైళ్ళకు పైగా ప్రదర్శనగా ప్రజలు కదిలి నివాళులు అర్పించారు. భగత్‌సింగ్ పంజాబ్‌లో ఉత్తర భారతదేశంలో గల ఆశ్చర్యకరమైన ప్రజాదరణని జవహర్‌లాల్ తన స్వీయ చరిత్రలో పొందుపరిచారు.

'భగత్‌సింగ్ గాంధీ కంటే ఎక్కువగా ప్రజాదరణ పొందిన నాయకుడు – ఇంటెలిజన్స్ బ్యూరో రహస్య నివేదిక' టెర్రరిజం ఇన్ ఇండియా (1917 – 36) పేర్కొన్నది.

**శ్రామిక వెల్లువ కమ్యూనిస్టులు.**

భగత్‌సింగ్ మార్క్సిజానికి మార్పు చెందడం 1928–29 నాటి ముఖ్య పరిణామం. శ్రామిక ప్రజా వెల్లువ (రైల్వేలో, జౌళి, జూట్ పరిశ్రమలలో)తో పాటు ఈ కాలంలోనే కమ్యూనిస్టులు గణనీయంగా కార్మిక సంఘాలలో చొచ్చుకొనిపోవడం జరిగింది.

బెంగాల్‌లోని 1927 నాటి ఖరగ్‌పూర్ సమ్మెల తరువాత గోపేన్ చక్రవర్తి, ధరణి గోస్వామి (ఇరువురూ కమ్యూనిస్టులు), కిరణ్‌మిత్రా, శివనాథ్ బెనర్జీల నాయకత్వంలో లిల్లోయా రైల్వే వర్క్‌షాపులు సుదీర్ఘ తీవ్ర పోరాటం (1928 జనవరి – జూలై) జరిగింది. దానిలోని ముఖ్యాంశాలు. బామున్ గాచి వద్ద పోలీసు కాల్పులు (మార్చి 28) కలకత్తా పారిశ్రామిక పరిసరాలలో అద్భుతమైన కార్మిక ప్రదర్శనలు, కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో గల (వర్కర్స్

అండ్ పెజెంట్స్ పార్టీ కార్యకర్తలు 1928 నాటి కలకత్తా కార్పొరేషన్ పాకీ పనివారి సమ్మె, చెంగైల్‌లో, బేరియాలలోని జూట్ మిల్లుల సమ్మెల కాలంలో ప్రభావం దాస్ గుప్తాలాంటి స్వతంత్ర కార్మిక నాయకులలోను బంకిం ముఖర్జీ, రాధా రమణ మిత్రాలాంటి కమ్యూనిస్టుల పట్ల సానుభూతి పెంచుకొంటున్న కాంగ్రెస్ నాయకులతోను కలిసి చురుకుగా పనిచేయుట. బెంగాల్‌లోని పారిశ్రామికవేత్తలు బ్రిటిష్‌వారు లేక బెంగాలీయేతరులు అవడం వలన యితర ప్రాంతాలలో కంటే జాతీయ నాయకుల మద్దతు సులభంగా లభించింది. బెంగాల్ కాంగ్రెస్ అగ్రనాయకుల జోక్యం అరకొరగా వుంది. ఉదాహరణకు బౌరియా సమ్మె సహాయ నిధికి విరాళాల కోసం జవహర్‌లాల్ నెహ్రూ ద్వారా సుభాస్ బోస్‌ని అర్థించవలసి వచ్చింది (నెహ్రూ సుభాస్‌కి 1924 జనవరి 24 – సెలక్టెడ్ వర్క్స్ వాల్యూం 4).

1928 డిసెంబర్‌లో కలకత్తా కార్మికవర్గం తన రాజకీయ జోక్యాన్ని పరిణతిని వ్యక్తం చేసే పెద్ద ప్రదర్శన నిర్వహించింది. వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ నాయకత్వంలో సాగిన వేలాది మంది కార్మికుల కాంగ్రెస్ సదస్సులోకి ప్రవేశించారు. సభా ప్రాంగణాన్ని రెండు గంటల పాటు ఆక్రమించారు. పూర్ణ స్వరాజ్యాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానాలు చేశారు. సభా నిర్వాహకులు కలత జెందారు. సుభాస్ బోస్ వలంటీరు పోలీసుల జోక్యాన్ని కోరాలనుకున్నారు. కాని తుదకు ఘర్షణ నివారించబడింది.

జంషెడ్పూర్ కార్మిక ఉద్యమం పట్ల బోస్ చాలా ఆసక్తిని కనబరిచారు. సి.ఎఫ్. ఆండ్రూస్ మితవాద నాయకత్వం పట్ల అసంతృప్తి చెందిన జంషెడ్పూర్ కార్మిక సంఘం కార్మికులు 1928 సంవత్సరంలో పలుమార్లు పాక్షిక సమ్మెలు చేశారు. ఈ పరిస్థితిని తాతా మాణిక్ హోమీలపై ద్వేషం గల స్థానిక లాయర్‌తో పాటు బోస్ కూడా ఉపయోగించు కోవాలనుకున్నాడు. ఫలితంగా వచ్చిన ముఠా శతృత్వం ఉద్యమ పరాజయానికి దారితీసింది. భారతీయ యాజమాన్యంలో గల పరిశ్రమలలోని కార్మిక పోరాటంలో జాతీయవాద జోక్యం పరిమితుల్ని జి.డి. బిర్లా, పురుషోత్తమ దాస్ ఠాకూర్ దాసుకి రాసిన లేఖ (1929 జూలై 16).

“బోస్ పరిస్థితిని సరిగా ఉపయోగించుకోలేదు. తాతా ఐరన్ స్టీలు వర్క్సుకి సహాయ పడటంలో బోస్‌ని విశ్వసించవచ్చు. మనం వారితో వ్యవహరించేటప్పుడు వారి సైకాలజీని అధ్యయనం చేయాలి. (ఠాకూర్ దాస్ పేపర్స్ ఎఫ్.ఎన్. 42).

1928 జూలైలో దక్షిణ భారత రైల్వేలో కార్మికులు సమ్మె చేశారు. తీవ్రమైన అణచివేత చర్యలతో సమ్మె విచ్ఛిన్నం చేయబడింది. నాయకులు సింగార్‌వేలు, ముకుందలాల్ సర్కార్‌లకు జైలుశిక్ష విధించబడింది. సమరశీల కార్మికుడు పెరుమాళ్ళు ద్వీపాంతరవాస శిక్షపై అండమాన్ దీవులకు పంపబడ్డారు. 1928 ఏప్రిల్ నుండి అక్టోబర్‌లో జరిగిన బొంబాయి జౌళి కార్మికుల సమ్మె అన్నిటికంటే ప్రఖ్యాతమైనది. 1920 దశాబ్దపు చివరి సం॥ల నుండి లాంక్‌షైర్, జపాన్‌లకు వ్యతిరేకంగా సుంకాల రక్షణ కల్పించేందుకు ప్రభుత్వ నిరాకరణ కారణంగా పరిశ్రమపై పడిన భారాలను జౌళి పారిశ్రామికవేత్తలు కార్మికులపై నెట్టే ప్రయత్నాలు చేస్తూ వచ్చాయి. వేతనాల కోతలో కూడిన క్రమబద్ధీకరణకు వ్యతిరేకంగా 1928 సమ్మె చేపట్టబడింది. క్రింది

స్థాయి కార్మికుల అదుపు ప్రాతిపదికగా గల ఈ యూనియన్ నాయకులైన ఎ.ఎ. ఆల్వే, జి.ఆర్. కాస్లే 1926-27 నుండి జోగ్లేకర్, మిరాజ్కర్, డాంగేలాంటి బొంబాయి కమ్యూనిస్టులతో సంబంధాలు పెట్టుకున్నారు. సంఘాన్ని ఎన్నికైన 42 మిల్లు కమిటీలు నడిపాయి. ఈ సంఘం చేపట్టిన 1928 సమ్మె సంపూర్ణం, ప్రశాంతం. "కార్మికుల వైఖరి ఆశ్చర్యాన్ని కలిగించింది. మిల్లు యజమానులు వారి మనుషుల్ని విడగొట్టాలని చాలా సార్లు యత్నించారు. కావలసినంత పోలీసు రక్షణ కల్పించినప్పటికి ఒక్కరు కూడా పనిలోకి రాలేదు" అని బొంబాయి గవర్నర్ సెక్రటరీ ఆఫ్ స్టేట్‌కి ఆగస్టు 16న రాసిన రహస్య లేఖలో అంగీకరించారు. మిల్లు యజమానులు 1927 నాటి వేతనాలు పునరుద్ధరించడానికి అంగీకరించిన మీదటనే సమ్మె ముగిసింది. గిర్నీ కాంగార్ అత్యున్నత స్థాయిలో వున్నపుడు దాని సభ్యత్వం 60000. ఎన్.యు. జోషి నాయకత్వంలోని ప్రత్యర్థి సంఘ సభ్యత్వం 9800. సువ్యవస్థితమైన గాంధేయ అహమ్మదాబాద్ జౌళి కార్మిక సంఘ సభ్యత్వం 27000 మాత్రమే. 1928 సంవత్సరాంతానికి బొంబాయిలో ప్రత్యేకించి  జిఐపి రైల్వే కార్మికులలో, ఆయిల్ డిపో ఉద్యోగులలో కమ్యూనిస్టు పలుకుబడి విస్తరిస్తూ వుంది.

ఈ పరిస్థితుల్ని గమనించి కలవరపడిన పెట్టుబడిదారులు ప్రభుత్వం ఎదురుదాడికి దిగారు. బొంబాయిలో సమ్మె విచ్ఛిన్నం చేసేందుకు పఠానుల్ని నియమించారు. ఫలితంగా బొంబాయిలో 1929లో పెద్ద మత ఘర్షణ జరిగింది. బ్రాహ్మణేతరుడైన మంత్రి భాస్కరరావు జాదవ్ దిగువ కులాలకు చెందిన జౌళి కార్మికులలో బ్రాహ్మణ వ్యతిరేక భావాన్ని రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారు. (అప్పుడు కమ్యూనిస్టు నాయకులు ప్రధానంగా బ్రాహ్మణులు) కాస్లేని లొంగదీసుకోగలిగారు. ప్రచారానికి కావలసిన మొత్తాలు బొంబాయి మిల్లు యజమానుల సంఘం అధ్యక్షుడు హోమీబాబా నుండి అందాయని పుకార్లు వ్యాపించాయి. బెంగాల్ గవర్నర్ జాక్సన్, బొంబాయి గవర్నర్లు విల్సన్, సైక్స్‌ల మధ్య 1928-29 కాలంలో సాగిన ఉత్తర ప్రత్యుత్తరాలు అప్పటి బ్రిటిష్ పాలక వర్గాల భయాందోళనల్ని వ్యక్తం చేస్తున్నాయి. సుంకాల రక్షణ రూపాయి - స్టెర్లింగ్ నిష్పత్తి లాంటి సమస్యలపై భారతదేశ పెట్టుబడిదార్లను బ్రిటిష్ పాలకుల నుండి ఎలాంటి మద్దతు లభించలేదు. కాని భారతీయ కార్మికులకు వ్యతిరేకంగా భారతీయ పెట్టుబడిదార్లకు బ్రిటిష్ పాలకుల నుండి పూర్తి మద్దతు లభించింది. విల్సన్ 1928 ఆగస్టు 22న తాను మిల్లు యజమానులతో ప్రతి ఒక్కరిని కలుసుకున్నానని, వారికి అవకాశం యిస్తే కలిగే ప్రమాదాన్ని గురించి హెచ్చరిస్తున్నానని ఇర్విన్‌కి సమాచారం పంపారు. బెంగాల్, బొంబాయి కార్మికుల సంఘ నిర్మాణంలో సహాయ పడుతున్న బ్రిటిష్ కమ్యూనిస్టులు ఫిలిప్ స్ప్రాట్, బెన్‌బ్రాడ్లేల దేశ బహిష్కరణకు అధికారం కల్పించే 'పబ్లిక్ సేఫ్టీ బిల్లు' కొరకు ప్రభుత్వం ఒత్తిడి తెచ్చింది. 1929 నాటి వర్తక వివాదం చట్టం ట్రిబ్యునల్స్ వ్యవస్థని రుద్దింది. 'వర్తక వివాదాలకు సహాయ పడటం తప్ప ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు, సమాజంపై భారాన్ని మోపేందుకు ఉద్దేశించబడిన' సమ్మెల్ని నిషేధించ యత్నించింది. కాంగ్రెస్ రెండు బిల్లుల్నీ వ్యతిరేకించింది. కాని పబ్లిక్ సేఫ్టీ బిల్లుపై చర్చ జరిగే సందర్భంలో కాంగ్రెస్ సభ్యులు అసాధారణ రీతిలో పెద్ద సంఖ్యలో గైరు హాజరయినట్లు "ఇండియన్ క్వార్టర్లీ రిజిష్టరు' పేర్కొన్నది.

1931 మార్చి 20న ప్రభుత్వం కార్మిక నాయకుల్ని (అత్యధికులు కమ్యూనిస్టులు) నిర్బంధించింది. నిర్బంధింపబడిన వారిలో బొంబాయి నుండి డాంగే, మిరాజ్‌కర్, ఘాటే, జోగ్లేకర్, అధికారి, నింబోకార్, ఆల్వే, కాస్లేలు కలకత్తా నుండి ముజఫర్ అహమ్మద్, కిషోరిలాల్ ఘోష్, ధరణి గోస్వామి, గోపెన్ చక్రవర్తి, రాధా రమణ మిత్రా, గోపాల్ బసాక్, శివనాథ బెనర్జీ, పంజాబ్ నుండి సోహన్‌సింగ్ జోష్, యుపి నుండి పిసి జోషి, విశ్వనాథ ముఖర్జీ అలాగే ముగ్గురు ఇంగ్లీషువారు బ్రాడ్లీ, స్ప్రాట్, హబన్యాక్‌లు వున్నారు. కుట్ర విచారణ న్యాయస్థానానికి అప్పచెప్పే అవకాశాన్ని నివారించేందుకు మీరట్‌లో జరపాలి. ఈ అంశాన్ని హోం మెంబర్ హెచ్.జి. హేగ్ 1929 ఫిబ్రవరి 20న రహస్య నివేదికలో పేర్కొన్నారు. కమ్యూనిస్టుల సిద్ధాంతాన్ని ప్రచారం చేసుకొనేందుకు వినియోగించుకోవాలనుకోవడంలో విచారణ కొంత ప్రతికూల ఫలితాన్ని యిచ్చింది. విచారణ నాలుగు సంవత్సరాలు కొనసాగింది. 1933 జనవరిలో కఠిన శిక్షలు విధించబడ్డాయి (అపీలుపైన, గణనీయమైన అంతర్జాతీయ ఆందోళన కారణంగా శిక్షలు బాగా తగ్గించబడ్డాయి) 1930 దశాబ్దపు ప్రారంభ సంవత్సరాలలో చురుకైన అనుభవజ్ఞులైన కార్మిక నాయకులు జైళ్ళలో వున్నారు. జాతీయోద్యమం మీరట్ అభియోగాన్ని ఖండించింది. మీరట్ కుట్ర కేసులో 8 మంది ఎఐసిసి సభ్యులు కూడా నిందితులుగా వున్నారు.

మీరట్ కుట్ర కేసు కార్మిక సమరశీలతని లొంగదీయలేకపోయింది. ఫాసెట్ కమిటీ రిపోర్టు కార్మికులకు ప్రతికూలంగా వచ్చింది. వాడియాలు పెద్ద ఎత్తున కార్మికుల్ని తొలగించడం ప్రారంభించారు. దేశ్‌పాండే, బి.టి. రణదివేల నాయకత్వంలోని గిర్నీకామ్ గార్ రెండవ సాధారణ సమ్మె (1929 ఏప్రిల్ – ఆగస్టు) చేసింది. మిల్లు కమిటీలు గతంలో కంటే సమరశీలంగా వున్నాయి. కాని విచారణ కమిటీ అనుభవం లేనివారు, నిరక్షరాస్యులు అయిన యువకుల గందరగోళాల్ని ఖండించింది. కాని సమ్మె అనాలోచితంగా పొడిగించబడింది. సమ్మె వైఫల్యం గిర్నీ కామ్ గార్ యూనియన్ (జికెయు)ని బలహీనపరిచింది. జూట్ మిల్లుల్లో మొదటి సాధారణ సమ్మె 1929 జూలై ఆగస్టులో కమ్యూనిస్టుల ప్రాబల్యం గల బెంగాల్ జూట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగింది. వారం పనిగంటల్ని 54 నుండి 60కి పెంచాలన్న యజమానుల ప్రయత్నాల్ని సమ్మె తిప్పికొట్టింది. 1929 డిసెంబర్ నాగపూర్ సదస్సులో ఎఐటియుసిపై కమ్యూనిస్టుల ప్రభావం గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగింది. ఎన్.యు. జోషి నాయకత్వంలోని ఉదారవాద గ్రూపు ఆలిండియా ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ వాకౌట్ చేయడం, నెహ్రూ అక్కడే వుండి మిగిలి వున్నవారు జరుపుకొన్న సదస్సుకు అధ్యక్షత వహించడంతో 1929 నవంబర్ నాగపూర్ సదస్సులో ఎఐటియుసిపై కమ్యూనిస్టుల పలుకుబడి విపరీతంగా పెరిగింది. ఎఐసిసి 1929లో ఒకార్ ఆలీ మీర్జా ఆధ్వర్యంలో శ్రామిక పరిశోధనా శాఖ (Labour Research Department)ని ప్రారంభించింది.

కలకత్తాలో బోస్, బొంబాయిలో భూలాభాయ్‌దేశాయ్ లాంటి కాంగ్రెస్ నాయకులు కమ్యూనిస్టు కార్మిక సంఘ నాయకుల్ని తొలగించి కార్మికుల్లో తమ పలుకుబడిని పెంచుకొనేందుకు ఇదొక సూచనగా భావించబడింది. ఉదాహరణకు, జంషెడ్పూర్ సమీపంలో

గోల్మూర్ టిన్‌ప్లేట్ సమ్మె పట్ల కాంగ్రెస్ చాలా శ్రద్ధ వహించింది. అది స్వరాజ్యవాదుల రక్షణ విజ్ఞప్తులతో చాలా ప్రయోజనాలు పొందిన విదేశీ సంస్థ. బోస్, బడ్జ్ బడ్జ్ వద్ద సానుభూతి సమ్మెని నిర్వహించారు. రాజేంద్ర ప్రసాద్ కూడా గోత్మాలిని సందర్శించారు.

కాంగ్రెస్ – కార్మిక సంబంధాల పట్ల బ్రిటిష్ అధికారులు కలవరపడ్డారు. కాని కాంగ్రెస్ ప్రయత్నాలు కార్మికులలోని గణనీయమైన పలుకుబడి గల కమ్యూనిస్టు నాయకుల నుండి ప్రతిఘటన ఎదుర్కొంటుందనే ఆలోచన వారికి కొంత ఊరట కల్పించింది.

1930 ఫిబ్రవరి – మార్చిలో కమ్యూనిస్టుల నాయకత్వంలోని జిఐపి రైల్వే సమ్మె విఫలమయింది. సాయంత్రం వస్తువుల రవాణా నిషేధానికి వ్యతిరేకంగా కలకత్తాలో చాలా జయప్రదమైన క్వార్టర్స్ సమ్మెకి యువ కమ్యూనిస్టు అబ్దుల్ మొమిన్ నాయకత్వం వహించారు. నగర రవాణాని స్తంభింపచేసే విధంగా బండ్లను బారికేడ్లుగా ఉపయోగించే ఎత్తుగడని అవలంబించారు. పోలీసులతో హింసాయుత ఘర్షణలు జరిగాయి. యువ జాతీయవాదులు బండ్లవారితో కలిశారు. ఆమోదయోగ్యమైన పరిష్కారానికి రావలసిందిగా పోలీసు కమిషనర్ ట్రెగ్రటో ప్రభుత్వం ఒత్తిడి తెచ్చారు. కాని 1930 నాటికి మొత్తం కార్మికోద్యమం వేగంగా క్షీణిస్తున్న సూచనలు కన్పించాయి. కమ్యూనిస్టులు కేవలం అణచివేత (అప్పటి కమ్యూనిస్టుల సంఖ్య చాలా పరిమితం. గనుక అణచివేత ఒక కారణమే) తోనే గాక వారి వ్యూహంలో పెద్ద మార్పు కారణంగా బలహీనపడ్డారు. కమ్యూనిస్టులు 1928 చివరి వరకు కాంగ్రెస్‌తో 'ఐక్యత – పోరాటం' విధానాన్ని పాటించారు. కాంగ్రెస్ పరిమితులను విమర్శించారు. సామ్రాజ్యవాద వ్యతిరేక కూటమి నిర్మించ యత్నించారు. "స్పష్టంగా నిర్వచింపబడిన ప్రత్యేక సమస్యలపైనే కాంగ్రెస్‌ని వ్యతిరేకించింది. లేకపోతే మనం కాంగ్రెస్ వ్యతిరేకులమని, జాతి వ్యతిరేకులమని కార్మికుల పాక్షిక ప్రయోజనాల కొరకు పాటుపడే వారమని విమర్శించేందుకు ప్రత్యర్థులకు అవకాశం యిచ్చిన వారమవుతాము" అని 1927–28 వార్షిక నివేదికలోని బెంగాల్ పెజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ కార్యవర్గం పేర్కొన్నది. కాని 1928 డిసెంబర్‌లో ఆరవ కొమింటర్న్ కాంగ్రెస్ ఒక్కసారిగా ఎడమ వైపుకు తిరిగింది. భారతీయ కమ్యూనిస్టులు జాతీయవాద ప్రధాన స్రవంతికి దూరంగా వుండటం ప్రారంభించారు. "రోడ్డు మధ్య వుండే వారిపై కేంద్రీకరించే" స్టాలిన్ విధానాన్ని అనుసరించారు. కాంగ్రెస్‌లో వామపక్ష భావాలు గల నెహ్రూ (1930లో సామ్రాజ్యవాద వ్యతిరేక లీగు నుండి బహిష్కరించబడ్డారు) లాంటి వారిపై దాడి ప్రారంభించారు. కార్మిక సమస్యలపై కాంగ్రెస్‌కి గల ఆసక్తి చాలా పరిమితమైనది. శాసనోల్లంఘన ప్రారంభ మవడంతో గాంధేయ నాయకత్వం పట్టు బిగిసింది. సాధారణ సమ్మెల్ని విచ్ఛిన్నకర ప్రమాదకర ఆయుధాలుగా భావించింది. గాంధేయ కాంగ్రెస్ కాబట్టి ఆ ఆయుధాన్ని ప్రయోగించే ఉద్దేశమే లేదు. అన్నిటిని మించి ఆర్థిక పరిస్థితి కార్మిక ఉద్యమాలకు ప్రతికూలంగా మారుతూ వుంది.

మాంద్యం అడుగుపెట్టడంతో నిరుద్యోగం పెరిగింది, ధరలు తగ్గాయి, కార్మికుల బేరమాడే శక్తి బలహీనపడింది.

**రైతు ఉద్యమాలు -బార్డోలి**

కార్మిక కర్షకపార్టీలు సిద్ధాంతపరంగా భూస్వామ్య రైతాంగ కార్యక్రమాల్ని ప్రచారం చేసినప్పటికి వాటికి వున్న కొద్దిమంది కార్యకర్తలు కార్మిక సంఘ కార్యక్రమాలో నిమగ్నం గ్రామీణ ప్రాంతాలలోకి అంతగా చొచ్చుకుపోలేకపోయాయి.

కానీ బెంగాల్ పార్టీ కిషోర్‌గంజ్ ముస్లిం రైతులలో కొంత పలుకుబడి సాధించింది. భగత్‌సింగ్ హెచ్ఎస్ఆర్ఎ కార్మికవర్గ నియంతృత్వాన్ని గురించి ప్రస్తావించింది. కాని రైతు సమస్యలపై అస్పష్టంగా వుండిపోయింది. వ్యవసాయక ఉత్పత్తుల ధరలు స్తబ్దంగా వుండటం లేక క్రమంగా తగ్గిపోగా రైత్వారీ ప్రాంతాలలో శిస్తులు పన్నులు తిరిగి నిర్ధారించే ప్రక్రియ చేపట్టబడలేదు. దేశంలోని పలు ప్రాంతాలలో అసంతృప్తి పెరుగుతూ వుంది.

రైతుల డిమాండ్ల పట్ల కాంగ్రెస్ వైఖరులలో తీవ్రమైన వ్యత్యాసాలున్నాయి. బెంగాల్ అన్ని సెక్షన్ల స్వరాజ్యవాదులు (సుభాస్‌బోస్ అలాగేసేన్‌గుప్తా) రైతుల, పాలికాపుల ప్రయోజనాల్ని కాపాడడంలో ఘోరంగా విఫలమయ్యారు. బెంగాలు కౌలుదారీ సవరణ బిల్లుపై చర్చ (1928 ఆగష్టు – సెప్టెంబరు) సందర్భంగా జితేంద్రలాల్ బెనర్జీ జమిందారులకు వ్యతిరేకంగా రైతులకు కొన్ని అదనపు హక్కులుండాలని సమర్థించారు. కాని అతడు కూడా పాలికాపులకు కౌలు హక్కు యిచ్చి జోతేదార్ల ఆధిపత్యాన్ని తగ్గించే సవరణని వ్యతిరేకించారు. 1926 ఆగష్టు 26న జరిగిన ఒక మత కలహంలో హిందూ జోతేదార్లు, ముస్లిం పాలికాపులు, ఘర్షణపడ్డారు. కలకత్తా హిందూ పత్రిక దీనిని వర్గ యుద్ధంగా ప్రకటించింది. 1928లో చాలామంది ముస్లిం జమీందారులు కూడా పాలికాపుల క్లాజుని వ్యతిరేకించినప్పటికి ముస్లిం కౌన్సిల్ సభ్యులు రైతు అనుకూల వైఖరి చేపట్టారు. కౌలుదారీ బిల్లు సమస్య (1929 లో అక్రంఖాన్, అబ్దుల్‌రహీం, ఫజుల్లాహక్ ఆధ్వర్యంలో) ప్రజాపార్టీ స్థాపనకు అవకాశం కల్పించింది. ఈ పార్టీలో మొదట సమూలమైన మార్పులు కోరే హిందువులు (జితేంద్రలాల్ బెనర్జీ, నరేష్‌సేన్‌గుప్తా, అలాల్‌గుప్తా) వున్నారు కాని అది ప్రధానంగా ముస్లింల నాయకత్వంలో ముస్లిం జోతేదార్ల మద్దతు గల పార్టీ.

పట్టణ వడ్డీ వ్యాపారుల నుండి వ్యవసాయదారులకు రక్షణ కల్పించేందుకు చేసిన ఫజల్ – ఇ– హుస్సేన్ ప్రయత్నాలకు కాంగ్రెస్, హిందూ, మహాసభ ఉమ్మడిగా వ్యతిరేకించాయి. యూనియనిస్టులు ప్రధానంగా ముస్లింలయినప్పటికి (1926 ఎన్నికలలో ఎన్నికైన సభ్యులు 36 మందిలో 33 మంది యూనియన్ పార్టీ వారు) కొంతకాలం పాటు హర్యానా జూట్ ల మద్దతు పొందగలిగారు. ప్రజాపార్టీ, యూనియనిస్టు పార్టీ, ఈ రెండు పార్టీల రైతు అనుకూల వైఖరికి కొన్ని పరిమితులువున్నాయి. ఆచరణలో ఇవి చిన్న రైతుల పాలికాపులు వ్యవసాయ కూలీల కంటె సంపన్న రైతుల పట్ల మొగ్గు చూపే పార్టీలు. ఇక హిందూ మతవాదులలో చేతులు కలపడం కనీసం. మితవాద వ్యవసాయ సంస్కరణల కార్యక్రమాన్ని కూడా రూపొందించకపోవడం, కారణాలతో కాంగ్రెస్ రెండు ప్రావిన్సులలో ప్రజా మద్దతు కోల్పోతూ వున్నది. సిక్కు రైతులు ప్రబలంగా వున్న తూర్పు పంజాబులో 1923లో నాభా పాలకుడైన

రిపుద మాన్‌సింగ్ అపహరణకు బాధ్యుడుగా అనుమానింపబడిన పాటియాల మహారాజాభూపేందర్ సింగుతో అకాలీలు (1920 దశాబ్దం చివరి సంవత్సరాలలో) పోరాటంలో నిమగ్నమయ్యారు. పాటియాలో అకాలీ కార్యకర్త సేవాసింగ్ ధిక్రివాలా యొక్క నిరవధిక నిర్భంధం పెద్ద సమస్యగా పోరాటానికి అవకాశం కల్పించింది. మతాలపరమైన సంస్థానపరమైన అంశాలున్నప్పటికి మార్పు పంజాబు స్వదేశీ సంస్థానాలలో పౌర రాజకీయ హక్కుల కొరకు, వ్యవసాయ సంస్కరణల కొరకు చేపట్టబడిన ఉద్యమం యిది ప్రాచుర్యం పొందింది. అకాలీ నాయకుడైన భగత్‌సింగ్ యొక్క పాటియాల పర్యటన సందర్భంగా 1928 జూలైలో మాన్యా వద్ద స్థాపించబడిన పంజాబు రియాస్తి ప్రజామండల్ ఈ క్రింది డిమాండ్లు చేసింది. 1926 లో పెంచబడిన 19% భూమిశిస్తు తగ్గించాలి. మహారాజాకి రిజర్వు చేయబడిన షికారు భూముల్ని (అక్కడ వున్న క్రూర జంతువులు ప్రజలకు ప్రమాదకరంగా వున్నాయి) రద్దు చేయాలి. 1929 ఆగష్టులో ధిక్రేవాలా విడుదల తరువాత భూపేందర్ సింగ్ నుండి వస్తున్న మైత్రిభాషణకి కొందరు అకాలీలు స్పందించడం ప్రారంభించారు. రియాస్తి ప్రజాభంగర్‌లోని చాలామంది చురుకైన కార్యకర్తలు మార్క్సిజం వైపు మరలారు. అలా వచ్చిన వారిలో ఆ తరువాత పంజాబు కమ్యూనిస్టు రైతు నాయకులు జాగీర్‌సింగ్ జోగా మాస్టర్ హరిసింగ్ వున్నారు.

శాశ్వత భూమిశిస్తు విధానం అమలులో వున్న బీహారులో కాంగ్రెస్‌పై జమీందారీ జోక్యం బలంగానే వుంది. కాని వ్యవసాయ వర్గ వ్యత్యాసాలతో మతపరమైన విభజన ఏకీభవించలేదు. కులపరమైన కట్టుబాట్లు చాలవరకు మధ్యతరహా, చిన్న తరహా జమీందార్లను ధనిక రైతులతో కలిపి వుంచగలిగాయి. 1947 ముందునాట బ్రిటిషిండియాలో అత్యంత పెద్దదిగా ఎదిగిన కిసాన్ ఉద్యమం యొక్క మూలాలు 1920లో స్వామి సహజానంద సరస్వతి కార్యకలాపాలలో వున్నాయి. ఘాజేపూర్‌కి చెందిన చిన్న జమీందారీ కుటుంబంలో జన్మించిన సహజానంద 1907 లో సన్యాసి అయ్యాడు. సహాయనిరాకరణ కాలంలో కాంగ్రెస్ రాజకీయాలలో చురుకుగా పనిచేశారు. భూమి హోదాల సామాజిక స్థాయిని పెంచేందుకు 1927లో బీహ్తా (పాట్నాజిల్లా) వద్ద ఆశ్రమాన్ని ప్రారంభించారు. రైతు సంఘ నిర్మాణ కార్యక్రమాలు చేపట్టారు. 1929 నవంబరులో బీహార్ కిసాన్‌సభ (కాంగ్రెస్ కౌన్సిల్ నాయకుడు శ్రీ కృష్ణ సిన్హా దాని మొదటి సెక్రటరీ) స్థాపించాడు.

రైత్వారీ ప్రాంతాలలో శిస్తు, పన్నుల పెంపుదల ప్రజల్ని ఐక్యం చేసేందుకు అవకాశం కల్పించింది. గనుక రైతు ఉద్యమాలకు కాంగ్రెసు మద్దతు విషయంలో అంతగా ఆటంకాలు ఎదురుకాలేదు. రెవిన్యూ రేట్లకు 18.75 శాతం పెంచేందుకు1927 లో మద్రాసు ప్రభుత్వం చేసిన ప్రతిపాదన, సంపన్న మధ్యతరగతి రైతులు ఎక్కువగా వున్న కోస్తా ఆంధ్రాలో 1928–29లో చాలాశక్తివంతమైన ఆందోళనకు దారితీసింది. పశ్చిమగోదావరిలో టి. ప్రకాశం, దండు నారాయణ, తూర్పుగోదావరిలో కొండా వెంకటప్పయ్య, పెన్నేటి సత్యనారాయణ గుంటూరులో ఉన్నవ లక్ష్మీనారాయణ (ప్రఖ్యాత నవల మాలపల్లి రచయిత లాంటి నాయకులు శాసనోల్లంఘన నాటిక బలమైన రైతు పునాదిని నిర్మించారు. శిస్తు పన్నులచెల్లింపు నిరాకరణకు ఒత్తిడి తెచ్చారు. చాలా యితర ప్రావిన్సులలోని పలుచోట్ల నిరంతరముగా సాగించిన గ్రామీణ నిర్మాణ

కార్యక్రమాల ద్వారా గాంధేయవాదులు నెమ్మదిగా గ్రామీణ స్థావరాన్ని నిర్మించారు. ప్రపుల్ల సేన్ ఆధ్వర్యంలో బెంగాల్ హుగ్లీ జిల్లాలో ఆరామ్‌బాగ్, బాబా రాఘవదాస్ ఆధ్వర్యంలో తూర్పు యు.పి.లోని గోరఖ్‌పూర్‌లు ఉదాహరణలు. ప్రపుల్లసేన్, రాఘవదాస్‌లు ప్రాంతీయ గాంధీలుగా ప్రసిద్ధి చెందారు.

గాంధేయ పద్ధతులలో గ్రామీణ నిర్మాణం, ఆందోళనలు 1928లో బార్డోలి (గుజరాతులోని సూరత్ జిల్లా) విజయగాథలో ప్రారంభమయ్యాయి. 137 గ్రామాలు 87000 జనాభా గల ఈ తాలూకాలో గాంధేయ నిర్మాణాత్మక కార్యక్రమాల కేంద్రాలు 1922 నుండి పని చేయడం ప్రారంభించాయి. కున్వర్జీ కళ్యాన్జీ మెహతాలు లాంటి స్థానిక నాయకులు సంపన్న రైతులకు చెందిన కాన్బీ పటేదార్లు కుల సంఘాన్ని పటేదార్ యువ కమాండర్ నే సంఘం పటేల్ బంధు పత్రిక పటేదార్ ఆశ్రమం సూరత్‌లో నడుపుతున్న విద్యార్థి హాస్టల్ ద్వారా 1908 నుండి నిర్మాణబద్ధం చేస్తూ వస్తున్నారు. పటేదార్లు తమ పొలాల్ని కాలిపరాజ్ (నల్ల ప్రజలు) గా పిలువబడే దుబ్లా తెగలవారిచే సాగుచేయించేవారు. బార్డోలి జనాభాలో 50% కాలిపరాజ్‌లు. వీరు చాలా వెనుకబడినవారు. గాంధీ సెక్రటరీ మహాదేవ్ దేశాయ్ తన 'స్టోరీ ఆఫ్‌బార్డోలి' (1929)లో వీరిని కల్లాకపటం తెలియనివారు, ప్రమాదకారులు కానివారు, చట్టానికి కట్టుబడి వుండేవారుగానూ ప్రశంసించాడు. కాలిపరాజ్ వెల్పు చాకిరికి పటేదార్లు కనీస ఆహార వస్త్రాలు సమకూర్చే హామీ కల్పించాడు. దోపిడి వాస్తవాలకు సాంప్రదాయ అన్యోన్యత ముసుగు కప్పబడేది. గాంధేయ నిర్మాణ కార్యకర్తలు కాలిపరాజ్‌లో (వారిని రాణిపరాడ్‌లనే వారు 'నల్ల ప్రజల'కు బదులుగా ఆటవిక వాసులు అనేవారు) 1920ల నుండి పని చేయడం ప్రారంభించారు.

ప్రత్తి ధరలు తగ్గుతు వున్నప్పటికి బొంబాయి ప్రభుత్వం 1927లో బార్డోలిలో శిస్తుని 27% పెంచినప్పుడు మెహతా సోదరులు, వల్లభాయ్‌పటేల్‌ని శిస్తు చెల్లింపు నిరాకరణ ప్రచారాన్ని చేపట్టవలసిందిగా నచ్చజెప్పాడు. పశువుల, పొలాల జప్తులకు కూడా రైతులు లొంగలేదు. సులభ పరపతులపై పొలాలు యిస్తామని ప్రభుత్వ అధికారులు విసిరిన ఎరలను కావిపరాజ్‌లు తిరస్కరించారు. పటేల్ యితర స్థానిక నాయకులు కుల సంఘాల్ని సామాజిక బహిష్కరణ, మతపరమైన విజ్ఞప్తుల్ని, భజనల్ని, భక్తి గీతాల్ని చాలా తెలివిగా ఉపయోగించుకొన్నారు. తెగల ప్రజలు దేవతలు సిరియా, సిమాలియాలు చాలా పెద్దవారైపోయారని, తెగల ప్రజల సంరక్షణ కొరకు వారు (దేవతలు) గాంధీని దూతగా పంపారని తెగల ప్రజలకు చెప్పారు. మహాత్ముడు వారిలాగా కౌపేనం ధరించడం లేదా? ఖర్చుతో కూడుకున్న గేదెపాలకు బదులుగా మేకపాలు తాగడం లేదా (ఘనశ్యాంషా, సాంప్రదాయ సమాజం, రాజకీయ సమీకరణ భారతీయ సామాజిక శాస్త్రానికి తోడ్పాటు 1974) రైతులు గ్రామీణ శ్రామికులు సంపద ఉత్పత్తి దారులని – రాజ్యానికి రెండు మూల స్తంభాలలాంటి వారిని ఉపన్యాసాలు, సత్యాగ్రహం దినపత్రిక (సూరత్ నుండి 10 వేల కాపీలతో వెలువడుతుంది). పదే పదే ప్రచారాలు సాగించాయి. గ్రామీణ వర్గ ఐక్యత, సాంప్రదాయ అన్యోన్యతలను గురించి మరిమరి నొక్కిచెప్పాడు. "షావుకారు, వడ్డీవ్యాపారి కౌలుదారులతో నీళ్లలో పాలులాగా కలిసిపోతాయి. వారిని విడదీయడం సాధ్యం కాదు. (పటేల్

ఉపన్యాసం, మహదేవ్ దేశాయ్ నుండి ఉటంకించబడింది పేజీ 169) బార్డోలి త్వరలోనే జాతీయ సమస్య అయింది. అహమ్మదాబాద్ కార్మికులు ఒక అణావసూళ్ల ద్వారా రు. 1300లు వసూలు చేశారు. జూలై మధ్యవర్తిత్వంలో బొంబాయి వర్తక ప్రయోజనాలు విఫలమైనప్పుడు అందుకు నిరసనగా బొంబాయి కౌన్సిలులో ఇండియన్ మర్చంట్స్ ఛాంబరు ప్రతినిధి లాల్జీనా రాన్జీ తన సభ్యత్వానికి రాజీనామా చేశారు. బార్డోలి ఉద్యమానికి అదే సమయంలో కమ్యూనిస్టులు నాయకత్వంలో జరుగుతున్న గిర్నీకామ్ గార్ సమ్మె నాయకత్వంలోను సిద్ధాంతంలోను చాలా తేడా వుంది. అయినప్పటికి వాలు మధ్య సంబంధాన్ని గురించి గవర్నర్ విల్సన్, సెక్రటరీ ఆఫ్ స్టేట్ బర్కిన్ హెడ్‌తో జరిపిన రహస్య ఉత్తర ప్రత్యుత్తరాలు బ్రిటిషువారు భయాన్ని వ్యక్తంచేశాయి. బార్డోలికి సాయుధ పోలీసుల్ని, సైన్యాన్ని పంపించాలని జూలై చివరలో రూపొందించిన పథకాలు ఆగష్టు మొదటివారంలో రద్దు చేయబడ్డాయి. న్యాయ విచారణ జరిపించడం స్వాధీనం చేసుకొన్న పొలాల్ని తిరిగి యిచ్చివేయడం ప్రాతిపదికన పరిష్కారం కుదిరింది. "ప్రభుత్వం ఇక్కడ చర్య తీసుకుంటే, కమ్యూనిస్టులు బార్డోలీ పరిస్థితిని వినియోగించుకొని బి.బి.సి.ఐ, జి.ఐ.పి (రైల్వేలు)లో సాధారణ సమ్మెకు పిలుస్తారని పోలీసు అధికారుల సమాచారం పంపించారు. (బర్కిన్‌హెడ్‌కి విల్సన్, 1928 ఆగష్టు 7, బర్కిన్‌హెడ్ కలెక్షన్) బార్డోలిలో శిస్తుల్ని పెంచడం (ప్రావిన్సులోని యితర ప్రాంతాలలో కూడా) లోపభూయిష్టంగా వుందని మెక్సివెల్– బ్రూమ్‌ఫేల్డ్ విచారణ కమిటీ అంగీకరించింది. బార్డోలిలో పెంచిన రు.1,87,492లను 48,648లకు తగ్గించారు. గుజరాత్ మహారాష్ట్రాలలో శిస్తు సవరణ వ్యతిరేక ప్రచారం చేపట్టారు. పటేల్ సిద్ధం చేసిన పథకంతోను బొంబాయి ప్రెసిడెన్సీ లేండ్ లీగు స్థాపనతోను ప్రభుత్వం అప్పటి రాజ్యాంగ సంస్కరణపై చర్చలు పూర్తయ్యేవరకు శిస్తు సవరణల్ని విరమించుకోవాలని 1929 జూలై 16న నిర్ణయించింది. ఖేదాలో 1890 నాటి పన్నులు 1940 ల వరకు మార్చకుండా అలాగే వున్నాయి. గాంధీయ జాతీయవాదం గుజరాతులో స్వంతభూమి గల రైతులకు స్పష్టమైన ప్రయోజనాల్ని సాధించింది.

## వాణిజ్య వర్గాల వైఖరులు

1928, 29 సంవత్సరాలు విద్యావంతులైన పట్టణ యువకుల, కార్మికుల కర్షకుల సమరశీలత పెరిగిన సంవత్సరాలు. భారత వాణిజ్య గ్రూపుల్ని కూడా అసహనంలోకి నెట్టివేసిన సంవత్సరాలు. 1షి 6పెన్నీల మారకపు నిష్పత్తి సమస్యతోపాటు జపాన్, లాంక్ షైర్‌లు పోటీ వున్న కారణంగా దిగుమతి సుంకాన్ని 11% నుండి 15% శాతానికి పెంచాలన్న కాటన్ టారిఫ్ బోర్డు ప్రతిపాదనల్ని ప్రభుత్వం 1927 జూన్‌లో తిరస్కరించింది. 1928 జనవరిలో సైమన్ బహిష్కరణ పిలుపుకి బొంబాయి ఇండియన్ మర్చంట్స్ చాంబరు నాయకులు పురుషోత్తమదాస్, ఠాకూర్‌దాసు, లాల్జీ, నారాన్జీలు సహాయ నిరాకరణని తీవ్రంగా వ్యతిరేకించారు. వాల్‌చంద్, హీరాచంద్, లాల్జీ, నారాన్జీల సింధియా, స్టీంనేవిగేషన్ కంపెనీ లార్డ్ ఇంచ్ కేప్ ఆధ్వర్యంలోని బ్రిటిషు నౌకయన కంపెనీ ప్రయోజనాలతో తీవ్రమైన పోరాటం చేస్తున్నది. కోస్తా నౌకాయానాన్ని దేశీయ కంపెనీలకు రిజర్వు చేయాలని ఇండియన్ మర్కండైల్ మెర్దిన్

కమిటీ చేసిన సిఫార్సుల్ని ప్రభుత్వం తిరస్కరించింది. ఈ అంశంపై హాజీ ప్రవేశపెట్టిన బిల్లుని (మార్చి 1928) తెల్లవారు, ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించారు. కలకత్తా మార్వాడి వ్యాపార గ్రూపులకు, సురక్షితంగా వున్న బ్రిటిషు జూట్‌మిల్లు దారులకు మధ్య పెరుగుతున్న ఘర్షణని ఠాగూర్‌దాస్‌కి జి.డి.బిర్లా రాసిన లేఖలు, ఎడ్వర్డ్ బెంతాల్ బ్రర్డ్ కంపెనీ అధినేత రహస్య పత్రాలు స్పష్టంగా వ్యక్తం చేస్తున్నాయి. మేము కలకత్తాలు భారతీయ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాం. కొత్తగా ఏర్పడిన అన్ని వ్యాపార సంఘాలు "ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కి అనుబంధ సంఘాలవుతున్నాయి. ఇది చూసి యూరోపియన్లు చాలా అసూయ చెందుతున్నారు. కొన్ని సందర్భాలలో  ఇంపీరియల్ బ్యాంకు సరిగా వ్యవహరించడం లేదు. (ఠాహోర్‌దాస్‌కి బిర్లా 1928 మే 2న) ఇంపీరియల్ మరియు ఎక్చేంజ్ బ్యాంకుల ద్వారా బ్రిటిషువారు సాగిస్తున్న ఆర్థిక నియంత్రణ – భారతీయ పెట్టుబడిదారులకు మరొక పెద్ద సమస్య. ఇండియన్ బ్యాకింగ్ ఎంక్వయిరీ కమిటీ రిపోర్టుకి పంపిన అసమ్మతి పత్రంలో ఠాకూర్‌దాస్ ఎక్చేంజి బ్యాంకుల గుత్తాధిపత్యాన్ని తీవ్రంగా విమర్శించారు.

అయినప్పటికి భారత వాణిజ్య వర్గాలలో అంతగా కదలిక రాలేదు. కార్మికుల సమరశీలత బొంబాయి మిల్లు యాఃయజమానులు ప్రభుత్వ మద్దతుపై ఆధారపడేలా చేసింది. బొంబాయి మిల్లు యజమానుల సంఘానికి 1929 మార్చిలో ఆ సంఘం చైర్మన్ హోమీ మీదే వచ్చిన వార్షికనివేదికలో మారకపు నిష్పత్తి, సుంకాల రక్షణ లేకపోవడం లాంటి సమస్యల్ని ప్రస్తావించారు. కాని కేంద్రీకరణ అంతా 'అంతగాముందు జరుగని సాధారణ సమ్మె'పై పడింది. అతడు సహజంగానే వర్తక వివాదాల బిల్లుకు మద్దతు తెలిపారు. పికెటింగ్ పై పూర్తి నిషేధం విధించాలని కోరాడు. – శాంతి యుతమైన పికెటింగ్ వాస్తవంగా వుండదు. (జాతీయావాద రాజకీయాలకు చాలా ఆసక్తికరమైన చిక్కులు తెచ్చిపెట్టే అంశం). బొంబాయి జౌళి పరిశ్రమకి లాంక్‌షైరు దిగుమతుల కంటె (నాణ్యమైన ప్రత్తి రకాల అహమ్మదాబాద్‌తో పోటీ పడగల) జపాన్ చౌక వస్తువుల వలన ప్రమాదం ఏర్పడింది. ఉక్కులాంటి పరిశ్రమ ప్రధానంగా ప్రభుత్వ కాంట్రాక్టులపైన ప్రోత్సాహంపై ఆధారపడింది. 1924 నుండి సుంకాల రక్షణ పొందింది గనుక భారత పారిశ్రామిక గ్రూపు తుల్లాలు కూడా చాలా విధేయులుగా వున్నారు. 1929 లో గిర్నీకామ్‌గార్ సృష్టించిన ఎరుపు భయంతో దొరాబ్జీతాతా, కవస్జీ జహంగీర్ ఇబ్రహీం రహం తాత్నాలు కాంగ్రెస్‌కి భిన్నమైన పెట్టుబడిదారీ సంస్థని స్థాపింప యత్నించారు.  ఎరుపు నాయకుల విచ్ఛిన్నానికి వ్యతిరేకంగా, బాహాటంగా యూరోపియన్ యాజమాన్యాలతో చేతులు కలిపారు. (తాతాలకు చెందిన యన్‌యన్ మాజోందార్ ఠాకూర్‌దాస్‌కి 1929 మే 22) హెచ్.పి. మోడీ, నస్లవాడియా, లాల్జీ నారాలాడే యంఆర్ జయకర్ (పెట్టుబడీ దారీ సంబంధాలు గల ఉదారవాది, లాయర్)లు పెట్టుబడికి శ్రమకి మధ్య అవగాహన కల్పించే మంచి వాతావరణాన్ని సృష్టించడానికి బొంబాయి మరాఠీ పత్రికకి ఆర్థిక వనరులు సమకూర్చే అంశాన్ని తీవ్రంగా పరిశీలించారు. (లాల్జీ నారాంజీ జయకర్‌కి, 1929 అక్టోబరు 18, జయకర్ పత్రాలు) బొంబాయి గవర్నరు ఆరు నెలల ముందు అలాంటి ఆలోచన జేశారు. భారతీయ డైలీ మిర్రర్ పత్రికకు పెట్టుబడిదారుల్ని ప్రోత్సహించాలన్నాడు. (ఇర్విన్‌కి సైక్స్ 1929 మే 22, సైక్స్ కలెక్షన్)

బిర్లా దూరదృష్టితో జాతీయవాద దృక్పథంలో భిన్నమైన వ్యూహాల్ని అనుసరించారు. ప్రత్యేక పెట్టుబడిదారీ పార్టీకి మద్దతు యివ్వాలనే తాతా ఆలోచనకు భిన్నంగా బిర్లా 1929 లో మాలవ్యా (మాలవ్యా 1726 ఎన్నికలలో బలపరిచారు) మోతీలాల్ మధ్య వర్తిత్వం నెరపడం ద్వారా కౌన్సిల్‌లో స్వరాజవాదులకు బలాన్ని చేకూర్చయత్నించాడు. బిర్లా, ఠాకూర్‌దాస్‌లు యిరువురు తాతా ప్రతిపాదనని తీవ్రంగా వ్యతిరేకించారు. "కమ్యూనిజంకి వ్యతిరేకంగా బలవత్తరమైన పోరాటం చేసే చివరి సంస్థ పెట్టుబడిదారీ సంస్థ అనడంలో నాకెలాంటి సందేహం లేదు. మనం పెట్టుబడిదారులం ఏం చేయగలం! రాజ్యాంగ పద్ధతుల ద్వారా ప్రభుత్వాన్ని జాతీయ ప్రభుత్వంగా మార్చాలని కోరే వారికి సహకరించాలి (ఠాకూర్‌దాస్‌కి బిర్లా, 1929 జూలై 30) అయినప్పటికి పెట్టుబడిదారుల మధ్య విభేదాల్ని అతిశయించడం గాని తగ్గించడం గాని చేయకూడదు. 1929 మేలో బిర్లాలో వ్యక్తిగతంగా మాట్లాడిన తరువాత బెంతాల్ "మార్కెట్లో తన స్థానాన్ని పదిలపరుచుకొన్న తరువాత భవిష్యత్తులో అతడు (బిర్లా) తక్కువ దుందుడుకుతనంతో కూడిన ఎత్తుగడల్ని అనుసరించడం మనం గమనించవచ్చు" అనే ఆశాభావాన్ని వ్యక్తం చేసాడు. (బెంతాల్ డైరీ, 1929 మే 15) యన్.యం. ముజుందార్‌కి ఠాహర్‌దాస్ లేఖ (1929 జూన్ 7) తాతా ప్రతిపాదనని తిరస్కరిస్తూ వ్యక్తీకరించిన విధానం నిశితంగా పరిశీలించదగింది.

మనం ముందు భారతీయులం, ఆ తరువాతనే వ్యాపారులం, పారిశ్రామికవేత్తలమని యూరపు వర్తక సమాజంలో చెప్పకుండా వారితో చేతులు కలిపేందుకు ప్రయత్నించడం కంటె జాతీయవాదులతో సంబంధాలను నిలబెట్టుకోవడం అనవసరమని ఠాకూర్‌దాస్ నొక్కి చెప్పాడు. కాని అతడి తరువాత వాక్యం యిలా వుంది. "మనం కొద్ది కాలం తరువాత యిప్పటి కంటె మెరుగైన షరతుల మీద చేతులు కలపడం మంచిదని నేను విశ్వసిస్తున్నాను"

### అధినివేశ ప్రతిపత్తి నుండి పూర్ణ స్వరాజ్యం వరకు

సంపూర్ణ స్వరాజ్యం లక్ష్యంగా మరొక దఫా అఖిల భారత ప్రజాపోరాటానికై పెరుగుతున్న ఒత్తిడికి 1928, 1929 సంవత్సరాల కాలమంతటా గాంధీ అడ్డుగా నిలిచాడు. తాను హాజరు కాని మద్రాసు కాంగ్రెస్ సదస్సు (1927) ఆమోదించిన నెహ్రూ యొక్క స్వతంత్ర తీర్మానాన్ని తీవ్రంగా నిరాకరించారు. తరువాత సంవత్సరం కలకత్తా కాంగ్రెస్ రాజీ సూత్రంగా నెహ్రూ రిపోర్టులోని అధినివేశ ప్రతిపత్తి లక్ష్యాన్ని – అదీ 1929 సంవత్సరానికి బ్రిటిషువారు మంజూరు చేస్తే సాధించాలని తీర్మానించింది. విఫలమైతే శాసనోల్లంఘనంలో పూర్ణ స్వరాజ్యం సాధించడానికి ముందుకు పోతుంది. సంపూర్ణ స్వరాజ్య లక్ష్యం పునరుద్ఘాటన కొరకు బోస్ ప్రవేశపెట్టిన సవరణని జవహర్‌లాల్ నెహ్రూ తమిళనాడుకు చెందిన సత్యమూర్తి బెంగాల్ ప్రతినిధులలోని అత్యధికులు, బొంబాయి కమ్యూనిస్టులు నింబ్‌కార్ –జోగ్లేకరులు సమర్థించారు. సవరణ 1350 –973 ఓట్లతో తిరస్కరించబడింది. 1929లో గాంధీ గ్రామాలలోని నిర్మాణాత్మకమైన పని, మద్యనిషేదం, బ్రిటిష్ వస్తువుల బహిష్కరణ, బార్డోలి తరహాలో ప్రత్యేక సమస్యల పరిష్కారం వగైరాలకు కాంగ్రెస్ కార్యకలాపాలకు పరిమితం చేయ యత్నించారు.

విదేశీ వస్త్రాల్ని బహిరంగంగా తగులబెట్టడాన్ని (అందుకు కలకత్తాలో మార్చిలో అరెస్టయ్యాడు. నామమాత్రపు జరిమానా విధించబడింది) ప్రోత్సహించారు. ఖాదీ కొరకు నిధులు సేకరిస్తూ దేశవ్యాప్తంగా పర్యటించాడు. పూర్తి స్థాయి పోరాటం కొరకు వచ్చిన ఒత్తిళ్లకు మాట మాటికి తిరస్కరించాడు.

1928 –29 కాలంలో గాంధీ సంయమనం పాటించాడు. అదే కాలంలో బూర్జువాలు సందేహాలతో సందిగ్ధతలో వున్నారు. ఈ కాలంలో ప్రముఖంగా ముందుకు వచ్చిన ప్రాంతాలు, సామాజిక గ్రూపులు (బెంగాలు, పంజాబు, బొంబాయిలలో విద్యావంతులైన పట్టణ యువకులు, బొంబాయి కలకత్తాలో పారిశ్రామిక కార్మికులు)పై గాంధీకి గల పలుకుబడి, అదుపు అత్యంత తక్కువగా వుండడం. ఆయన సంయమనానికి కారణమై వుండవచ్చు., 1929 జూలైలో ఆయన చాలా స్పష్టంగా ప్రకటించాడు. "శాసనోల్లంఘనకు సమాయత్తమైన ప్రజల్ని నా షరతుల మీద ఎలా నడపాలో నాకు బాగా తెలుసు. అలాంటి (సమాయత్తమైన) సూచన కనుచూపు మేరలో కనిపించడంలేదు" ఆయన సందేహానికి మరొక కారణం కాంగ్రెస్ సంస్థ నిర్మాణ పరిస్థితి 1929 మే నాటికి కాంగ్రెస్ సభ్యత్వం 56000కి పడిపోయింది. (నెహ్రూ నాయకత్వంలో చురుకుగా చేపట్టిన ప్రయత్నంలో ఆ తరువాత 6 నెలలకు అర్థ మిలియన్‌కి చేరింది) నిర్ణయింపబడిన కోటాల మేరకు చాలా ప్రావిన్సులలో యింకా సభ్యత్వం నమోదు, నిధుల వసూళ్లు జరుగలేదు. విభజన, తిరుగుబాటు శక్తులపై ఆధిపత్యం సాధించగల గాంధీ సామర్థ్యాన్ని వ్యక్తం చేసే ఘటన ఆ నెలలోనే జరిగింది. అత్యధిక పి.సి.సిల (10 గాంధీ కావాలని కోరుకున్నాయి. 5 వల్లభాయ్‌పటేల్‌లు 3 నెహ్రూ చాలా తీవ్రంగా వ్యతిరేకించినప్పటికిని నెహ్రూ కూడా కొంత విముఖంగా వున్నప్పటికి జవహర్‌లాల్ నెహ్రూ రానున్న కాంగ్రెస్ సదస్సులో అధ్యక్షుణ్ణి చేయాలని గాంధీ పట్టుబడ్డాడు. 11 జవహర్‌లాల్ నిస్సందేహంగా తీవ్రవాది. పరిసరాల్ని అధిగమించి ఆలోచింపగలడు. కాని అతడు వినయశీలి తీగతేగే దాకా లాగాలని కోరని ఆచరణ వాది. నిర్బంధించడానికి అవకాశం కల్పించబడినప్పుడే ఆవిరి గొప్పశక్తి అవుతుంది. అలాగే దేశంలోని యువత, తరగని వారిశక్తి నిర్బదింపబడడానికి, అదుపు చేయబడడానికి అవసరమైన మేరకు విడుదల చేయబడడానికి యిష్టపూర్తిగా ఆమోదించాలి. (1929 సెప్టెంబర్ యంగ్ ఇండియా).

కలకత్తా కాంగ్రెస్‌తో సంవత్సరం గడువు పూర్తి కావస్తున్నది గనుక పరిస్థితులు ప్రతిఘటన వైపు సాగుతున్నాయనడానికి జవహర్‌లాల్ ఎంపిక ఒక సూచిక. 1929 అక్టోబర్ 31 నాట ఇర్విన్ ప్రతిపాదనతో పరిస్థితులు సంక్లిష్టం చేయబడ్డాయి. (భారత రాజ్యాంగ క్రమంలో "అధినివేశ ప్రతిపత్తి" సహజమైన సమస్య అని, సైమన్ రిపోర్టు ప్రకటింపబడిన తరువాత రౌండుటేబుల్ సదస్సు జరిపిస్తామని వైస్రాయి ప్రకటించారు. సైమన్ బహిష్కరణ సందర్భంగా వ్యక్తమైన బలాన్ని బట్టి అలాంటి ఎరవేయవలసిన అవసరాన్ని గురించి వైస్రాయి 1928 డిసెంబర్ నుండి వ్యక్తిగతంగా అర్థిస్తూ వచ్చాడు. కొత్తలేబరు గవర్నమెంటు (1929 జూన్) వైస్రాయి ప్రతిపాదనని ఆమోదించింది.

ఉదారవాదులతో పాటు నవంబరు 2న గాంధీ, మోతీలాల్ మాలవ్యాలు ప్రతిపాదనని నాలుగు షరతులపై ఆమోదించారు. బ్రిటిషువారు ఆమోదించే ప్రాథమిక సూత్రాన్ని గాక రౌండు టేబుల్ సదస్సు అధినివేశ ప్రతిపత్తికి సంబంధించిన వివరాల్ని చర్చించాలి. సదస్సులో కాంగ్రెస్‌కి మెజారిటీ ప్రాతినిధ్యం కల్పించాలి. ఖైదీలను విడుదల చేయాలి. సాధారణ అంగీకారాన్ని పొందే విధానాన్ని అనుసరించాలి. బోస్ ఈ ఢిల్లీ ప్రకటనపై సంతకం చేయనిరాకరించాడు. నెహ్రూ సంతకం చేశాడు. తరువాత చాలా బలమైన సందేహాలు వచ్చాయి. రాజీనామా చేయాలని కోరాడు. గాంధీ ఇర్విన్‌ని డిసెంబరు 23న కలిశాడు. కాంగ్రెస్ షరతుల్ని వైస్రాయి నిర్ద్వంద్వం తిరస్కరించాడు. చర్చలు విఫలమయ్యాయి. 'స్వాతంత్ర్య ఉద్యమాన్ని నూతన అంతర్జాతీయ సమూలమైన మార్పులు గోరే సామాజిక దృష్టి కోణం నుండి అప్పటివరకు కొద్దిమంది వామపక్ష వాదులకే పరిమితమైన దృష్టి కోణం నుండి సంగ్రహంగా వర్ణించి జవహర్‌లాల్ తన మొదట అధ్యక్షోపన్యాసంలో లాహోరు కాంగ్రెస్ (1929 డిసెంబరు)ని ఊపివేశాడు. నేనొక సోషలిస్టుని, గణతంత్రవాదిని రాజులు యువరాజులపై విశ్వాసం లేనివాణ్ణి. ఆధునిక పారిశ్రామిక ప్రభుత్వాన్ని తయారుచేసే (ఉత్పత్తి చేసే) వ్యవస్థ మీద విశ్వాసం లేనివాణ్ణి...." జమీందారీ రైతులు, పెట్టుబడిదారీ – శ్రామిక ఘర్షణల విషయంలో గాంధీకి ప్రీతి పాత్రమైన ధర్మకర్తృత్వ పరిష్కారాన్ని విమర్శించాడు. "చాలామంది ఇంగ్లీషువారు భారతదేశానికి తామే ధర్మ కర్తలమని భావించారు. ఈ ధర్మకర్తలు దేశాన్ని ఎలాంటి దుస్థితికి తెచ్చారు!" అయినప్పటికి సదస్సు కార్యక్రమాలల్లో గాంధీ ఆదేశాల మేరకే జరిగాయి. 'పన్నుల చెల్లింపు నిరాకరణ'. ఎప్పుడు ఎక్కడ సాధ్యపడితే అక్కడ సాధారణ సమ్మెలు 'సమానాంతర ప్రభుత్వం' కొరకు బోస్ చేసిన ప్రత్యామ్నాయ ప్రతిపాదన తిరస్కరించబడింది. ఇర్విన్ రైలుపై జరిగిన దాడిని ఖండించే తీర్మానంపై గాంధీ పట్టుబట్టాడు. స్వల్ప మెజారిటీ 942 –794 తో ఆమోదింపబడింది.) ప్రధాన తీర్మానం (ఇర్విన్ పట్ల స్నేహపూర్వక ప్రస్తావన, ఇర్విన్ ప్రతిపాదన పట్ల వర్కింగుకమిటీ తొలివైఖరి, భవిష్యత్ చర్చలకు తలుపులు పూర్తిగా మూసివేయకుండ వుండడం). – ప్రతినిధులు పూర్తిగా ఆమోదించాలి లేక పూర్తిగా తిరస్కరించాలి. అనేవాదనతో ఆమోదం పొందింది. అన్నిటినిమించి నెహ్రూ, బోసస్‌లు శాసనోల్లంఘనం సాధారణ సమ్మెలుగా పతాకస్థాయికి చేరుకోవాలని ఆశించినప్పటికి, కార్యాచరణ పథకం యొక్క వివరాల రూపకల్పన ఎ.ఐ.సిసి.కి అంటే ఆచరణలో గాంధీకి వదిలివేయబడింది. అయినప్పటికి నూతన సంవత్సరంలోకి అడుగిడనున్న అర్థరాత్రి కాంగ్రెస్ ఎట్టకేలకు సంపూర్ణ స్వరాజ్యాన్ని ఆమోదించడం, జాతీయ త్రివర్ణ పతాకం, వందేమాతరం నినాదాలతో గాక ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదాలతో ఎగురవేయబడడంతో ప్రపంచంలో అత్యంత పెద్ద వలసలోని సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం నూతన దశలోకి ప్రవేశించిందని చెప్పక తప్పదు.

## 1930 - 31 శాసనోల్లంఘనం

### ఉప్పు సత్యాగ్రహం దిశగా

సంపూర్ణ స్వరాజ్యం కొరకు జరుగునున్న అహింసాయుత పోరాటంలో గాంధీ నిర్ణయించబోయే నిర్దిష్టమైన పద్ధతుల కొరకు ఇటుదేశం అటు ప్రభుత్వం నిరీక్షించాయి.

నిరీక్షణలో రెండు నెలలు స్తబ్ధతగా గడిచిపోయాయి. భారతదేశాన్ని ఆర్థికంగా రాజకీయంగా, సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా ధ్వంసం చేయటాన్ని నిరసిస్తూ, అలాంటి పాలనని యిక మీదట సహించడం మానవునికి దేవునికి వ్యతిరేకంగా చేసిన నేరమని ఉద్ఘాటిస్తూ, పన్నుల చెల్లింపు నిరాకరణతో సహా శాసనోల్లంఘన సన్నాహాలకు పిలుపునిస్తూ జనవరి 26న దేశ వ్యాప్తంగా అసంఖ్యాకమైన సభలు సమావేశాలు జరిపి స్వతంత్ర ప్రమాణం చేయబడింది,. జనవరి 6న కాంగ్రెస్ శాసనసభ్యులు రాజీనామా చేయాలని ఆదేశించబడింది. ఆదేశం ఏకగ్రీవంగా అమలు జరుపబడలేదు,. యన్.పి. కేల్కర్, సత్యమూర్తి, అన్సారీ లాంటి కాంగ్రెస్ నాయకులు నెహ్రూ రిపోర్టుపై చర్చలు విఫలమైన తరువాత ఏదో ఒక రకమైన, మత పరమైన ఒప్పందం లేకుండా మరొక దపా జాతీయ పోరాటం చేపట్టడానికి సిద్ధం కాలేదు) అసమ్మతివాదులుగా వుండిపోయాడు,. ఇతర విషయాలకు వస్తే కమ్యూనిస్టు నాయకత్వాన బొంబాయి, నాగపూర్ స్థావరాలుగా శక్తివంతమైన జి.ఐ.పి రైల్వే సమ్మె జరిగింది. 1930 ఫిబ్రవరిలో పరాజయం పాలయింది. గాంధీ జనవరి 31న ఇర్విన్‌కి యిచ్చిన 11 అంశాల అల్టిమేటం రాజకీయ నిర్మాణపరంగా ఎలాంటి మార్పు కొరకు డిమాండు చేయలేదు. చివరికి అధినివేశ ప్రతిపత్తిని కూడా డిమాండు చేయలేదు.అందుకే చాలామంది 11 అంశాల అల్టిమేటం, సంపూర్ణ స్వరాజ్య తీర్మానం నుండి దిగజారుడుగా భావించారు. ఉప్పుని ప్రధాన సమస్యగా ఎంపిక చేయడం కూడా మొదట చాలా అసాధారణంగా కన్పించింది. నెహ్రూ దిగ్భ్రాంతిచెందినట్లుగా తన స్వీయ చరిత్రలో రాశాడు. నెహ్రూ స్వీయ చరిత్ర పేజీ 210) "ప్రస్తుతం ఉప్పు ప్రచారం కారణంగా రాత్రిళ్లు నిద్రపోతున్నాను" 1930 ఫిబ్రవరి 20న ఇర్విన్ సెక్రటరీ ఆఫ్టట్ వెడ్జివుడ్ బెక్‌కి రాశారు.

అంచనాలు తప్పని ఘటనలు నిరూపించాయి. 11 అంశాలు ఒక రకమైన వెనుకడుగు అయితే, మరొకరకంగా అవి జాతీయ డిమాండుని పటిష్టపరిచాయి. జాతీయ డిమాండు ప్రత్యేక సమస్యలతో సంబంధం కల్పించాయి. ఇర్విన్‌కి రాసిన లేఖలో సాధారణ ప్రయోజనాలకు సంబంధించినవి (సైన్యం, ఖర్చులు, సివిలు సర్వీసు జీతాలలో 50% కోత సి.ఐ.డి. సంస్కరణ, మారణాయుధాలపై లైసెన్సుల మంజురుపై ప్రజల నియంత్రణకు అనుమతిస్తూ ఆయుధాల చట్టంలో మార్పులు) మూడు ప్రత్యేకంగా బూర్జువాల డిమాండ్లు (రూపాయి స్టెర్లింగ్ మారకపు నిష్పత్తిని 1షి 4 పెన్నీలకు తగ్గింపు, జౌళి రక్షణ, కోస్తా నౌకాయానాన్ని భారతీయులకు రిజర్వు చేయడం) రెండు రైతు సమస్యలు – భూమి శిస్తుపై 50% తగ్గింపు, ఉప్పు పన్ను, ఉప్పుపై ప్రభుత్వగుత్తాధిపత్యం రద్దు వున్నాయి. 1930లో జరిగిన వాణిజ్య నౌకాదళ సదస్సు బ్రిటీషు నౌకాయాన ప్రయోజనాలకు వాల్‌చంద్, హీరాచంద్, లాల్జీనారాన్జీ, సింధియా స్టీం నేరిగేషన్‌కి మధ్యగల వివాదాన్ని పరిష్కరించడంలో విఫలమయింది. బొంబాయి మిల్లు యాజమానుల సంఘం యొక్క 1930 మార్చి వార్షిక నివేదిక బ్రిటిషు, జపానులకు వ్యతిరేకంగా రక్షణ పరిశ్రమకు చావు బ్రతుకుల సమస్య అయిందని ప్రకటించింది. 1930 మార్చిలో బట్టల తానులపై పన్ను 15% బ్రిటిషేతర దిగుమతులపై 20% పన్నుల్ని పెంచాయి. బొంబాయి జౌళి పారిశ్రామికవేత్తల్ని విడగొట్టడంలో ప్రభుత్వం ఒక మేరకు విజయాన్ని సాధించాయి.

కాని బొంబాయి వెలుపలి భారత పారిశ్రామిక నాయకులు సామ్రాజ్యవాద ప్రాధాన్యతని తీవ్రంగా నిరసించారు. లెజిస్లేటివ్ అసెంబ్లీలో బిల్లుని వ్యతిరేకిస్తూ జరిపిన వాకౌట్‌లో బిర్లా కలిశారు. "సామ్రాజ్యవాద ప్రాధాన్యత ద్వారా జపాన్ నెట్టివేయబడితే భవిష్యత్తులో ఏదైనా రక్షణ కావాలంటే మిల్లు యాజమానులు తలల్ని రాతిగోడకేసి కొట్టుకోవలసిందేనని మిల్లు యాజమానుల్ని హెచ్చరించాడు. (జి.డి.బిర్లా, అభివృద్ధి పథం పేజి 193) మారకపు రేటు 1షి 6 పెన్నీల నిష్పత్తిని నిరసిస్తూ 1930 ఫిబ్రవరి 14న ఫిక్కీ వార్షిక సమావేశంలో పురుషోత్తమదాసు ప్రవేశపెట్టారు. అదే సమావేశానికి అధ్యక్షత వహించిన జి.డి.బిర్లా బ్రిటీషు పెట్టుబడిదారి భారత ఆర్థిక వ్యవస్థని ఉక్కిరిబిక్కిరి చేయడంపై ధ్వజమెత్తారు. బ్రిటీషు ఆర్థిక విధానాలు గాక విచక్షణాత్మక స్వేచ్ఛా వాణిజ్య విధానాలని చెప్పాడు. బిర్లా సన్నిహిత సహచరుడు డి.పి. ఖైతాన్ కలకత్తా ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రత్యేక సమావేశంలో "భారతదేశం స్వయం పరిపాలనని సాధించకపోతే ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచుకోవడం చాలా కష్టం అనే కటువైన వాస్తవాన్ని యిప్పటికైనా గ్రహిస్తున్నాయని అని స్పష్టం చేశారు.

"నా ఉద్దేశం ప్రకారం జమీందారీ వర్గం అవసరమైనది" ఫిబ్రవరి 26న యు.పి. పి.సి.సి సమావేశంలో భూస్వామ్య దళారీల రద్దు కొరకు పిలుపునిచ్చిన జవహర్‌లాల్ తీర్మానం బుట్టదాఖలయ్యింది. కాని 1930 జనవరి, ఫిబ్రవరిలో గాంధీ ఉపన్యాసాలు వ్యాసాలు రైతుల కడగండ్లను గురించి నొక్కి చెప్పాడు. ఉప్పు ఒక్కసారిగా గ్రామీణ ప్రజల యొక్క అత్యంత నిర్దిష్టమైన సార్వత్రికమైన సమస్యగా చూపెట్టబడింది. (కౌలురద్దు లాగా గాక సామాజిక విభజనకి అవకాశం లేనిది) స్వర్యాజ్య ఆదర్శాలలో అనుసంధానం చేయబడింది. ఖాదీ లాగా యిది కూడా చాలా స్వల్పమైన సమస్యగా కనిపించవచ్చు. మానసికంగారైతులకు స్వయం సహాయంలో అదనపు ఆదాయం సమకూర్చుకునే వనరుగా కనిపిస్తుంది. ఖాదీలాగానే ఉప్పుకూడా పట్టణ వాసులకు ప్రజల బాధలతో ప్రతీకాత్మకంగా మమేకమయ్యే అవకాశాల్ని కల్పిస్తుంది. "ఉప్పు సమస్య చుట్టూ మంచి వ్యూహాన్నే రచించావు" ఇర్విన్ 1931 ఫిబ్రవరిలో అంగీకరించారు.

భారతదేశం యొక్క అన్ని ప్రాంతాలకు చెందిన 71 మంది ఆశ్రమ సభ్యులతో సబర్మతి నుండి (మార్చి 12 నుండి ఏప్రిల్ 16 వరకు) గుజరాతు మధ్య గుండా సముద్రం వరకు సాగిన గాంధీ దండియాత్ర యావద్భారతదేశం యొక్క దృష్టినే గాక ప్రపంచ దృష్టిని కూడా ఆకర్షించింది. దండివద్ద తాను చట్టాన్ని ఉల్లఘించిన తరువాత పెద్ద ఎత్తున ఉప్పు తయారీ అమ్మకం ప్రారంభమవుతుందని, వెనువెంటనే విదేశీ వస్త్రాలు, మద్యం బహిష్కరింపబడతాయని గాంధీ మార్చి 11న ప్రకటించారు. తన అరెస్టు తరువాత ప్రతి ఒక్కరికి సత్యం, అహింస ప్రమాణాలకు లోబడి స్వేచ్ఛ వుంటుందన్నారు. స్థానిక నాయకుల్ని గౌరవించాలన్నాడు. యాత్ర పారంభం నుండి క్రింది నుండి ఒత్తిడులు వున్నట్లు స్పష్టమయింది. యాత్రా మార్గంలోని గ్రామాధికారులు రాజీనామా చేశారు. మార్చి 19న దాస్ (ఖిదా జిల్లాలలోని బోర్సాద్ తాలూకాలోని) పటేదార్లు శిస్తులు చెల్లింపు నిరాకరణకు అనుమతి యివ్వాలని డిమాండు చేశారు. కొంత విముఖత వ్యక్తం చేసినప్పటికీ అంగీకరించారు. మేనెలలో గాంధీ అరెస్ట్ తరువాత వర్కింగు కమిటీ రైత్వారీ విధానం అమలులో ఉన్న ప్రావిన్సులలో శిస్తు చెల్లింపు

నిరాకరణకు జమిందారీ రాష్ట్రాలలో చౌకీదారుపన్ను చెల్లింపుని నిరాకరణ ప్రచారానికి సెంట్రల్ ప్రావిన్సులలో అటవీ చట్టాల అతిక్రమణకు అనుమతి యిచ్చింది.

## చిట్టగాంగ్, పెషావర్, షోలాపూర్

పటేలు మార్చి 6న, జవహర్‌లాల్ ఏప్రిల్ 14న అరెస్టు చేయబడ్డారు. కరాచీ, కలకత్తా, మద్రాసులలో పోలీసులకు  ప్రజలకు మధ్య హింసాయుత ఘర్షణలు జరిగాయి. అయినప్పటికి ఏప్రియల్ చివరి వరకు బ్రిటిషు ప్రతిచర్యలు పరిమితంగానే ఉన్నాయి.

గాంధేయ శాసనోల్లంఘున పరిమితుల్ని అతిక్రమించి చిటగాంగ్ పెషావర్ షోలాపూర్‌లలో జరిగిన మూడు పెద్ద విస్ఫోటనాలతో పరిస్థితులు నాటకీయంగా మారాయి. సూర్యసేన్ నాయకత్వంలోని చిటగాంగ్ విప్లవ గ్రూపు ఏప్రిల్ 18న స్థానిక ఆయుధాగారాన్ని కైవశం చేసుకొన్నది. ఇండియన్ రిపబ్లిక్ ఆర్మీ పేరుతో స్వతంత్రాన్ని ప్రకటించింది. జలాలాబాద్ పర్వతంపై ఏప్రిల్ 22న వీరోచిత పోరాటం చేసింది. 12 మంది విప్లవకారులు హతులయ్యారు. గాంధేయ పద్ధతులు పాటించనప్పటికి విప్లవకారులు ఆయుధాగారాన్ని కైవశం చేసుకోగానే 'గాంధేయ రాజ్యం వచ్చింది' అని ప్రకటించారు. చిటగాంగ్ బెంగాలులో టెర్రరిజానికి తెరలేపింది. కలకత్తాలోని ప్రభుత్వ ప్రధాన కార్యాలయమైన రైటర్స్ బిల్డింగుపై డిసెంబరు 8న జరిగిన దాడితో సహా ఒక్క 1930లోనే 56 టెర్రరిస్టుదాడులు జరిగాయి. (1919 –29 దశాబ్దం మొత్తంలో జరిగిన టెర్రరిస్టు దాడులు 47 మాత్రమే). హిందుస్తాన్ రివల్యూషనరీ ఆర్మీ 1930లో పంజాబులో కూడా 26 దాడులు చేసింది.

వాయువ్య సరిహద్దు ప్రావిన్సులోని పెషావర్‌లో పెల్లుబికిన ప్రజావెల్లువ బ్రిటిషువారిని చాలా కలవరపరచింది. పెషావర్ సమీపంలోని ఉట్మాన్‌జాయ్ గ్రామపెద్ద యొక్క కుమారుడు అబ్దుల్ గఫార్‌ఖాన్, అతడు దియోబండ్ ముస్లీం జాతీయవాద గ్రూపు నుండి, ఖిలాపత్ ఉద్యమం నుండి, అమీర్ అమాగుల్లా (అభివృద్ధికరమైన సోవియట్ అనుకూల విధానాలు అతడి పతనానికి దారి తీశాయి) ఆధునిక సంస్కరణల నుండి ప్రేరణ పొంది, 1912 నుండి పఠానులలో విద్య, సామాజిక సంస్కరణ కార్యకలాపాలు చేపట్టారు. 1920 దశాబ్దం మధ్యకాలం నాటికి బాదుషాఖాన్‌గా ప్రసిద్ధికెక్కిన గఫార్‌ఖాన్ 1928 మేలో ఫక్తూన్ అనే రాజకీయ మాసపత్రిక ప్రారంభించాడు. అ మరుసటి సంవత్సరం ఖుదాయ్ సిద్మగార్ అనే స్వచ్ఛంద సేవాదళాన్ని స్థాపించాడు. దళ సభ్యులు ఎర్రచొక్కాలు ధరించేవారు. 1929 నాటికి గఫార్‌ఖాన్ గాంధీకి అత్యంత ప్రీతిపాత్రుడైన శిష్యుడయ్యాడు. గాంధీ అహింసావాదం పఠానుల్లోని ఖుదాయ్ ఖిద్మగార్లలో చిన్న, మధ్యతరగతి భూస్వాములు కౌలురైతులు, పేదరైతులు వ్యవసాయ కూలీలు వున్నారు) సామాజిక ఉద్రికత్తల్ని తగ్గించింది. చాలామంది పఠానులతో గఫార్‌ఖాన్ లాహోరు కాంగ్రెస్‌కి హాజరైన తరువాత ఆరునెలల్లో ఖుదాయ్ ఖిద్మగార్  సభ్యత్వం 500 నుండి 50,000 కి పెరిగింది. పెషావరు పరిసర గ్రామాలలో నౌజవాన్ భారత సభ స్థానికశాఖ కమ్యూనిస్టు కార్యకలాపాలు చేపట్టినట్లు 1930 మేలో ప్రభుత్వ ప్రకటన ఆరోపించింది. బాదుషాఖాన్‌తో సహా యితర నాయకుల అరెస్టుతో పెషావరులో ప్రజలు కిస్సాకహాని బజారులో కాల్పుల్ని

లెక్కపెట్టకుండా ఒక్కసారిగా తిరగబడ్డారు. ప్రభుత్వ ప్రకటన మేరకు కాల్పులలో 30 మంది హతులయ్యారు. ప్రభుత్వేతర అంచనాల మేరకు హతుల సంఖ్య 200 –250. హిందూ సైనికుల దళమైన గర్వాల్ రైఫిల్ దళం ముస్లిం గుంపులపై కాల్పులు జరప నిరాకరించింది. "నిరాయుధులైన మా సోదరులపై మేం కాల్పులు జరపం. భారతదేశ సైన్యం భారతదేశ శత్రువులతో పోట్లాడడానికి వుంది. కావాలంటే మమ్మల్ని కాల్చండి" – కోర్టు మార్షల్ ఎదుట సైనికులు స్పష్టంగా ప్రకటించారు. బ్రిటిషువారు వాయువ్య సరిహద్దు ప్రావిన్సు అంతటా తీవ్రమైన భయోత్పాతాన్ని సృష్టించి, సైనిక చట్టాన్ని అమలు జరిపి పదిరోజుల తరువాత అంటే మే 4 నాటికి పరిస్థితుల్ని అదుపులోకి తీసుకురాగలిగారు. 92 శాతం జనాభా గల ప్రావిన్సులో చెలరేగిన బ్రిటిష్ వ్యతిరేక వెల్లువ ప్రభుత్వ అంచనాల్ని తలక్రిందులు చేసిందని, అక్కడి చీఫ్ కమిషనర్ మానసికంగా క్రుంగిపోయాడని ఇర్విన్ వెడ్జి వుడ్ బెన్‌కి రిపోర్టు చేశాడు. గఫార్‌ఖాన్ ఉద్యమం పెషావర్, కోహట్ బన్ను, డెరా ఇస్మాయిల్‌ఖాన్, హజీరాలకు పరిమితమైనదైనప్పటికీ 1930 దశాబ్దం చివరి సంవత్సరాలలో తెగల ప్రజలు ఉద్యమంలోకి చొచ్చుకువచ్చారు. వారిపై బ్రిటిష్‌వారు తరచుగా విమానాల నుండి బాంబులు కురిపించారు. తెగల ప్రజలు గ్రామాన్ని దోచుకోలేదు. అహింసాయుతంగా బాదుషాఖాన్‌ని, మలాంగ్‌బాబాని (దిగంబర్ పకీర్ – గాంధీజీ) ఇంక్విలాబ్‌ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. (వారు ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదం విన్నారు. ఇంక్విలాబ్ జైలులో వున్న మరొక ప్రముఖ వ్యక్తి అనుకున్నారు).

గాంధీ అరెస్టు వార్త మహారాష్ట్రలోని పారిశ్రామిక నగరం షోలాపూర్‌లో మే 7 నుండి జౌళి కార్మిక సమ్మెకు దారితీసింది. మిల్లు కార్మికులు మద్యం షాపుల్ని తగులబెట్టారు. పోలీసు ఠాణాలపై, రోడ్డులపై, మున్సిపల్ కార్యాలయంపై, రైల్వేస్టేషన్‌పై దాడులు చేశారు. ప్రభుత్వం సైనిక చట్టం అమలు జరిపి మే 16 తరువాత పరిస్థితిని అదుపులోకి తీసుకు రాగలిగింది. మద్యం షాపుల్ని ధ్వంసం చేసినప్పటికి ఎవరూ తాగలేదు. అంతకు రెండు రోజుల ముందు ముగ్గురు ముస్లిం పోలీసులు సజీవ దహనానికి గురయినప్పటికి పాలకులు ఊహించని విధంగా మే 10న ప్రజలు బక్రీద్ పండుగ ప్రశాంతంగా జరుపుకున్నారు. కొద్దిరోజుల పాటు సమానాంతర ప్రభుత్వం నడిచింది. "కాంగ్రెస్ వలంటీర్లు ట్రాఫిక్ నియంత్రించారు. డిస్ట్రిక్టు మేజిస్ట్రేట్ నుండి క్రింది స్థాయి వరకు అధికారుల శ్రేణి నియామకం జరిగినట్లు సమాచారం అందింది." మే 13న షోలాపూర్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ రిపోర్టు. షోలాపూర్ పోరాటంలో ప్రధాన పాత్ర వహించిన కార్మికవర్గం శాసనోల్లంఘన తొలి రోజులలో యితర చోట్ల కూడా – కరాచీ ఓడరేవు కార్మికులు, మద్రాసులోని చోళై మిల్లు కార్మికుల సమ్మె చేశారు. కలకత్తా రవాణా కార్మికులు నెహ్రూ ఏప్రిల్ మధ్యలో గాంధీని మే 4న అరెస్టు చేసినప్పుడు పోలీసులతో ఘర్షణకు దిగారు. కాంగ్రెస్ 11 అంశాలలో కార్మికవర్గ సమస్యల్ని విస్మరించినప్పటికి, కమ్యూనిస్టులు శాసనోల్లంఘనకి దూరంగా వున్నప్పటికి అలాంటి ఘటనలు జరిగాయి.

## శాసనోల్లంఘన దశలు

చౌరీ చౌరా తరువాత జరిగిన దానికి పూర్తి విరుద్ధంగా చిట్టగాంగ్, పెషావర్, షోలాపూర్‌లో హింసాయుత ఘటనలు జరిగినప్పటికి ఉద్యమ విరమణకు గాంధీ ఎలాంటి ప్రతిపాదన చేయలేదు. 1930 ఫిబ్రవరి 27న 'యంగ్ ఇండియా'లోని వ్యాసంలో తనకు యిప్పుడు దారి తెలుసునని, బార్డోలి ఉద్యమ సమయంలో లాగా వెనుకడుగు వేయడం, కొన్ని చెదురు మదురు ఘటనలు జరిగినప్పటికి అహింసామార్గంలో ముందుకు పోతానని హామీ ఇచ్చాడు. 'శాసనోల్లంఘన ప్రారంభమైన తరువాత దానిని ఆపేది లేదు, ఆపకూడదు...' 1930 ఉద్యమం 1921–22 నాటి ఉద్యమం కంటే చాలా రకాలుగా భిన్నమైనది. ఇప్పటి లక్ష్యం సంపూర్ణ స్వరాజ్యం. రెండు తప్పుల్ని సరిదిద్దుకొనడం, అస్పష్టమైన స్వరాజ్యం కాదు. విదేశీ పాలనకి సహాయ నిరాకరణ గాక ఉద్యమం ప్రారంభం నుండి బాహాటంగా చట్టాన్ని ఉల్లంఘించే పద్ధతులు అనుసరించబడ్డాయి. జైళ్ళకి వెళ్ళిన వారి సంఖ్య 1921–22 కాలం నాటి కంటే 3 రెట్లు. జవహర్‌లాల్ నెహ్రూ జైళ్ళకు వెళ్ళిన వారి సంఖ్య 92,124 (ఎఐసిసి, జిఐ / 1931)గా ప్రకటించాడు. బెంగాల్ (15000), బీహార్ (14,251), యుపి (12,651), పంజాబ్ (12000) వాయవ్య సరిహద్దు ప్రావిన్సు (5000), బొంబాయి నగరం (4,700), ఢిల్లీ (4,500), గుజరాత్ (3,549), తమిళనాడు (2,991), ఆంధ్ర (2878), సి.పి. హిందూస్తాని (2,255) భయపడిన ప్రభుత్వం మే నుండి శాంతియుత సత్యాగ్రహులపై కూడా తీవ్రమైన నిర్బంధకాండ ప్రయోగించింది. కనుక ఉద్యమంలో పాల్గొనడం 1921–22 నాటికంటే కష్ట సాధ్యమయింది. పోలీసులు మహిళల్ని, పది పన్నెండేళ్ళ పిల్లల్ని కొట్టడాన్ని ఠాకూర్‌దాస్ తీవ్రంగా నిరసించాడు. అంతంత మాత్రంగా వున్న పేదల ఆస్తిపాస్తులకు చాలా ప్రమాదం వచ్చి పడింది. భూమి శిస్తు చౌకీదారు పన్ను కట్టకపోతే యిళ్ళల్లోని చెంబు తపేళాలు, సామాన్లు బయటపడేశారు. పొలం జప్తు చేశారు. అయినప్పటికి మహిళలు, యువకులు వెనుకంజ వేయలేదు. 1930 నవంబర్ 15 నాటి 29,054 మంది ఖైదీలలో 2,050 మంది 17 సం॥లు లోపువారు. 359 మంది మహిళలు. భారతీయ మహిళా విముక్తిలో శాసనోల్లంఘనం ఒక పెద్ద ముందడుగు. ఈ అంశాన్ని అంగీకరించిన పోలీసు అధికారి పురుషాధిక్యతా ధోరణిలో చేసిన వ్యక్తీకరణ : "భారతీయ మహిళ గృహ సంబంధమైన జాతీయపరమైన విమోచన కొరకు పోరాడుతుంది. అదే సమయంలో ఒక మహిళగా ఆమె డిమాండ్లు, అనుసరించే పద్ధతులు హేతుబద్ధంగా తర్కబద్ధంగా లేవు. స్త్రీగా ఆమె మగవారిపై చాలా ప్రభావం చూపగలదు. పోలీసాఫీసర్లతో సహా చాలామంది విధేయులైన అధికారులు వారి మహిళా బంధువుల నుండి చాలా ఎత్తిపొడుపు మాటలు, తిట్లు చీవాట్లు ఎదుర్కొంటున్నారు. (పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్ డాడ్, 1930 సెప్టెంబర్ 3, హోం పొలిటికల్ 249/1930)

అయినప్పటికి సహాయ నిరాకరణ కంటే శాసనోల్లంఘనం అన్ని విధాలా ముందడుగనడం అతిశయించి చెప్పడమే అవుతుంది. 1919–22 నాటి హిందూ ముస్లిం

ఐక్యత 1930 నాటికి గతకాలపు జ్ఞాపకంగా మిగిలింది. ఈ రెండు ఉద్యమాల మధ్యకాలంలో నెహ్రూ రిపోర్టుపై చర్చలు విఫలం కావడమే గాక ఒక దశాబ్దం పాటు రెండు మతాల మధ్య ఘర్షణాయుత వాతావరణం నెలకొని వుంది. వాయువ్య సరిహద్దు ప్రావిన్సు వెలుపల ఢిల్లీలాంటి పరిమిత ప్రాంతాలలో దిగువ తరగతికి ముస్లింల్ని ఆకట్టుకొనడంలో కాంగ్రెస్ గణనీయమైన విజయాన్ని సాధించిందని 1930 సెప్టెంబర్ అధికార రిపోర్టు పేర్కొన్నది. (హోం పొలిటికల్ 18/X/1930). అయినప్పటికి శాసనోల్లంఘన కారణంగా ముస్లింల భాగస్వామ్యం చాలా తక్కువగా వుంది. ఉదాహరణకు 1921-22లో కాంగ్రెస్ ఖిలపత్ మైత్రి దృఢంగా వున్న యుపిలోని అలహాబాద్‌లో శాసనోల్లంఘన సందర్భంగా అరెస్టయిన 679 మందిలో కేవలం 9 మంది మాత్రమే ముస్లింలు (జ్ఞాన్‌పాండే పేజి 162) సహాయ నిరాకరణ కాలంలో లాగా శాసనోల్లంఘన కాలంలో పెద్ద కార్మిక పోరాటాలు జరగలేదు. "ప్రస్తుతం బొంబాయి నగరంలోని సంతృప్తికరమైన అంశమేమంటే మిల్లు కార్మికులపై ఉద్యమ ప్రభావం లేదు. గత సంవత్సర సమ్మె ఫలితాల్ని వారు మరచిపోలేదు." 1930 జూన్ రిపోర్టు (హోం పొలిటికల్ 257/X/1930) మరొక అంశం : లాయర్లు ప్రాక్టీసు మానివేయడం, విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్ని, కళాశాలల్ని బహిష్కరించి జాతీయ పాఠశాలలు, కళాశాలలు ప్రారంభించడం లాంటి మేధావుల నిరసన రూపాలు యిప్పుడు లేవు. లాహోరు కాంగ్రెస్‌లో గాంధీ కోర్టుల పాఠశాలల బహిష్కరణ ఆచరణ సాధ్యం కానిదిగా తిరస్కరించాడు. 'అలాంటి బహిష్కరణకి అనుకూలమైన వాతావరణం వుందని నేననుకోవడం లేదు' - గాంధీ. 'లాయర్ల నుండి, విద్యార్థుల నుండి ఎలాంటి స్పందన లేదు' - 1930 జూలైలో బీహారు కాంగ్రెస్ రిపోర్టు (ఎఐసిసి, ఎఫ్ఎన్‌జి/80/1930).

కార్మికులు, పట్టణ మేధావులు వెనుకబడటం కారణంగా ఉద్యమానికి కలిగిన లోపాన్ని వాణిజ్య వర్గాల నుండి రైతుల నుండి వచ్చిన స్పందన పూరించింది. వివిధ ప్రాంతాలలో కొంత కాల వ్యవధులలో ఈ రెండు సామాజిక వర్గాల భాగస్వామ్యానికి సంబంధించిన శాసనోల్లంఘనోద్యమ చరిత్ర యింకా రాయవలసి వుంది. సంస్థాపరంగా కాంగ్రెస్ 1921-22 నాటి కంటే వివిధ ప్రాంతాలలో బలపడింది. సంస్థాపరమైన క్రమశిక్షణ బలం ఎంపిక చేయబడిన ప్రత్యేక సమస్యలపై ఉద్యమాన్ని సమర్థవంతంగా నడిపేలా చేశాయి. సమూలమైన మార్పులు కోరుతూ ప్రజలు ఉవ్వెత్తుగా పాల్గొనడాన్ని అడ్డుకున్నాయి. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్ని కాల వ్యవధుల్ని పరిశీలించడం అవసరం. సహాయ నిరాకరణ అంతగా చొచ్చుకుపోని సెంట్రల్ ప్రావిన్సెస్ మహారాష్ట్ర కర్ణాటక మధ్య భారతదేశంలోని తెగల ప్రాంతాలలాంటి చోట్ల గాంధేయ ఆదర్శాలు, అద్భుతాలు సృష్టిస్తాయనే భ్రమలు వున్నాయి. గుజరాత్, యుపి, బీహార్, కోస్తా ఆంధ్రా లాంటి బలమైన గాంధేయ స్థావరాలలో అలాంటి భ్రమలు లేవు. అయినప్పటికి అరెస్టులు కోరే గాంధేయ వ్యూహం అంటే ప్రముఖ నాయకులు శ్రేణులు రంగం మీది నుండి తొలగింపబడతారు. ఇది క్రింది నుండి వచ్చే ఒత్తిడుల కారణంగా చెదురు మదురుగా సమరశీల ఉద్యమాలకు అవకాశం కల్పించింది. ప్రత్యేకించి 1930 నుండి వ్యవసాయక ఉత్పత్తుల ధరలు మాంద్యంలో చిక్కుకొన్న తరుణంలో గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన ఒత్తిడి ఉద్యమానికి బలాన్ని చేకూర్చింది.

శాసనోల్లంఘనం యొక్క రెండు దశలకు 1930 సెప్టెంబర్ – అక్టోబర్ కాలాన్ని విభజన రేఖగా పరిగణించవచ్చు. మొదటి దశలో పట్టణాలలో వున్న బూర్జువా భాగస్వామ్యం ఎక్కువగా వుంది. అలాగే గాంధేయ నాయకత్వంచే ఎంపిక చేయబడిన సమస్యలపై (ఉప్పు, పన్నుల నిరాకరణ, మద్యం షాపుల పికెటింగ్, చౌకీదారు పన్ను చెల్లింపు నిరాకరణ) గ్రామాలలో అదుపులో వున్న రైతుల సమీకరణ జరిగింది. 'బొంబాయిలోని వ్యాపార గ్రూపులు గాంధీని ఒక మేరకు బలపరిచాయి. 1921–22 సహాయ నిరాకరణ ఉద్యమం యొక్క తరువాత దశలకు మద్దతును యిచ్చేందుకు నిరాకరించాయి.' ఇర్విన్ 1930 ఏప్రిల్ 24న వెడ్జి వుడ్ బెన్‌కి రిపోర్టు చేశారు. బ్రిటిష్ ఇంటెలిజెన్స్ అధికారుల అంచనాల మేరకు ప్రముఖ వ్యాపారవేత్త జి.డి. బిర్లా ఉద్యమానికి ఒకటి నుండి 5 లక్షల వరకు విరాళం యిచ్చాడు. విదేశీ వస్త్రాల్ని దిగుమతి చేసుకుంటున్న కలకత్తా మార్వాడీ వ్యాపారస్తుల్ని అహమ్మదాబాద్ బొంబాయి బట్టల మిల్లులతో సంబంధాలు పెట్టుకోవలసిందిగా నచ్చచెప్ప యత్నించినట్లు ఠాకూర్‌దాస్ పత్రాలు స్పష్టం చేస్తున్నాయి. పెట్టుబడిదారులలో జమన్‌లాల్ బజాజ్ పూర్తికాలం కార్యకర్తగా (ఎఐసిసి కోశాధికారిగా చాలా ఏళ్ళు పనిచేశాడు. 1930లో జైలుకి వెళ్ళాడు) పనిచేశాడు. వాల్‌చంద్, హీరాచంద్ 1930 ఏప్రిల్‌లో ఫిక్కీకి రాసిన లేఖలో 'గోడ మీది పిల్లి వైఖరి'ని విడనాడవలసిందిగా కోరాడు. "ప్రభుత్వం భారత వాణిజ్యవేత్తల అభిప్రాయాల్ని పట్టించుకోకపోతే స్వరాజ్యం కొరకు ప్రభుత్వంతో పోరాడే పక్షం మనం వహించాల్సి వుంటుంది." (వాల్‌చంద్ హీరాచంద్ పత్రాలు ఎస్.ఎన్. 8 (1)). గాంధీ వెలుపల వున్నంత వరకు, అధినివేశ ప్రతిపత్తిపై వైస్రాయి విస్పష్ట ప్రకటన చేసేవరకు రౌండ్ టేబుల్ సమావేశాన్ని బహిష్కరించాలని 1930 మేలో ఫిక్కీ నిర్ణయించింది. 1921 నాటి విధేయులు లాల్జీ నారాంజీ, ఠాకూర్‌దాస్ ఫిక్కీ నిరసనపై సంతకాలు చేశారు. ఠాకూర్‌దాస్ అధికారులతో సన్నిహిత సంబంధాలు కొనసాగించాడు. ఆర్థికం, కరెన్సీ, విత్త విధానం, రైల్వేలపై అదుపు పూర్తిగా భారతీయులకు వుండాలని 1930 మే నుండి ఇర్విన్‌ని డిమాండ్ చేస్తూ వున్నాడు. (ఠాకూర్‌దాస్ పత్రాలు ఎఫ్.ఎన్. 99/1930). విదేశీ దారం వాడకం, 1930 ఆగస్టు నుండి 24 బొంబాయి మిల్లుల్ని స్వదేశీయేతర మిట్టలుగా పరిగణించడం లాంటి సమస్యల కారణంగా బొంబాయి మిల్లు యజమానులతో కాంగ్రెస్ సంబంధాలు దెబ్బతిన్నాయి. అహమ్మదాబాద్ మిల్లు యజమానులు అంబాలాల్ సారాబాయ్, కస్తూరిబాయ్, లాలాబాయ్‌లు ఇబ్బందుల్ని తొలగించడానికి మోతీలాల్ నెహ్రూకి సహకరించినప్పటికి చిన్న వ్యాపారులు (1921లోలాగా) పారిశ్రామికవేత్తలకంటే చిన్న వ్యాపారులు జాతీయోద్యమానికి ఆసక్తికరమైన మద్దతుదారులుగా ముందుకి వచ్చారు. బొంబాయి, అమృతసర్, ఢిల్లీ, కలకత్తాలలో విదేశీ వస్తువుల దిగుమతులకు ఆర్డర్లు పంపకూడదని వర్తకులు ప్రమాణాలు చేశారు. (మార్వాడీ దిగుమతిదారులు అలాంటి ప్రమాణాన్ని ఏప్రిల్ 30న చేశారు). ప్రపంచ మాంద్యం కారణంగా ధరలు పడిపోవడం, కొన్ని సందర్భాలలో దిగుమతి ఆర్డర్లను రద్దు చేయడం ప్రయోజనకరంగా వుంది, దేశభక్తియుతంగా వుంది. "బొంబాయి వర్తకులు భారత ప్రభుత్వం చాలాకాలంగా అనుసరిస్తూ వస్తున్న ఆర్థిక విధానం పట్ల అసంతృప్తితో వున్నారు." వారు కోరుకుంటున్న ఆర్థిక స్వయ ప్రతిపత్తిని సాధించిన పెట్టేవయితే

అభినందించదగిన త్యాగాలు చేయడం సమంజసమని భావిస్తున్నారు." (హెచ్.జి. హేగ్ 1930 జూన్ 13, హోం పొలిటికల్ ఎఫ్.ఎన్. 457/V/1930). "చాలామంది సాధారణ వ్యాపారులు దివాళాకి చేరువలో వున్నప్పటికి ఉద్యమం కొనసాగింపుకి సన్నద్ధులై వున్నారు." (పెట్రీ 1930 ఆగస్టు 20, హోం పొలిటికల్ ఎఫ్.ఎన్. 504/1930)

ఫలితంగా బ్రిటిష్ వస్త్ర దిగుమతులు గణనీయంగా తగ్గాయి. 1929లో 26 మిలియన్ల పౌండ్ల దిగుమతులు జరగగా 1930కి 13.7 మిలియన్ల పౌండ్లకి పడిపోయాయి. 1929–30లో 1248 మిలియన్ల గజాల బట్టలు దిగుమతి కాగా 1930–31కి 523 మిలియన్ల గజాలు బట్టలు మాత్రమే దిగుమతి అయ్యాయి. మాంద్యం కారణంగా ప్రపంచ స్థాయిలోనే వర్తకం కుచించుకు పోవడం వాస్తవమే. కాని 1931 మార్చిలో మిల్లు యజమానుల సంఘ సదస్సులో హోమీ మోడ్ చేసిన అధ్యక్షోపన్యాసం ప్రత్యేకంగా గమనించదగింది. "స్వదేశీ ఉద్యమం... నిస్సందేహంగా చాలా కష్టకాలంలో (భారత్) పరిశ్రమకి సహాయపడింది. భవిష్యత్ ఆశావహంగా వుంటుందని ఆశించవచ్చు." బ్రిటిష్‌వారి యితర దిగుమతులు కూడా పడిపోయాయి. 1930 మే నుండి ఆగస్టు వరకు బ్రిటిష్ ట్రేడ్ కమిషనర్ ఆఫీసుకి 'ఇంపీరియల్ టొబాకో', 'డన్‌లప్' యింకా ఇతర తెల్లవారి వ్యాపార సంస్థల నుండి రిపోర్టులు, అభియోగాలు కుప్ప తెప్పలుగా వచ్చిపడ్డాయి.

గ్రామీణ ప్రాంతాలలో స్థానికంగా ఆశ్రమాలు స్థాపించి గాంధేయ నిర్మాణాత్మక కార్యకలాపాలు చేపట్టిన ప్రాంతాలు – గుజరాత్‌లో బార్డోలి, ఖేదా బెంగాలులో బంకూరా, ఆరాంబాగ్, బీహారులో బిహపూర్ లాంటివి శాసనోల్లంఘనం ప్రారంభించడానికి బలమైన స్థావరాలుగా పనిచేశాయి. ఉప్పు తొలి ఉత్ప్రేరకంగా పనిచేసింది. కాని వర్షాకాలం రావడంతో చట్టవిరుద్ధంగా ఉప్పు తయారు చేయడం సాధ్యపడలేదు. కాని బొంబాయి ప్రావిన్సులోని తీర ప్రాంతాలలో, అలాగే ఒరిస్సాలోని బాలాసోర్, బెంగాల్‌లోని మిడ్నాపూర్‌లలో ప్రచారానికి ఉప్పు ప్రధానాంశమయింది. చిన్న పట్టణాలలో, గ్రామాలలో మద్యం షాపుల మద్యం లైసెన్సుల వేలం పాటల పికెటింగ్ ముఖ్యమైన ఆందోళనా రూపమయింది. ప్రభుత్వం పాలకులకు ఆస్తుల జప్తులకు పాల్పడినప్పటికి చాలా ప్రాంతాలలో రైతులు (ఉదాహరణకు ఉత్తర మధ్య బీహారు జిల్లాలలో, మిడ్నాపూర్‌లో) చౌకీదారు పన్ను చెల్లించ నిరాకరించారు. గ్రామాధికారులు పెద్ద ఎత్తున రాజీనామాలు చేయడంతో గ్రామీణ పరిపాలన స్తంభించింది. ఖేదాలో జూన్ 21 నాటికి 655 ముఖీలలో 224 మంది రాజీనామా చేశారు. ఖేదా జిల్లాలోని ఆనంద్, బోరాబద్, నాదియాడ్ తాలూకాలు, సూరత్‌లోని బార్డోలి శిస్తు చెల్లింపు నిరాకరణకు ప్రధాన కేంద్రాలయ్యాయి. పటేదార్లు పొరుగున వున్న బరోడాలో ఆశ్రయం పొందారు. గాంధీ ఇర్విన్ ఒప్పందంపై సంతకాలు జరిగే నాటికి బార్డోలిలో వసూలు కావలసిన రూ. 3,97,000ల శిస్తుకు గాను కేవలం రూ. 20,000లు మాత్రమే వసూలయింది. అటవీ చట్టాలకు సంబంధించిన పేద రైతుల తెగల ప్రజల సమస్యల్ని సెంట్రల్ ప్రావిన్సెస్, మహారాష్ట్ర, కర్ణాటకలలో కాంగ్రెస్ నాయకత్వం చాలా పరిమితమైన పద్ధతులలో ఉపయోగించుకొన్నది. అటవీ సత్యాగ్రహులకు శిక్షణా తరగతులు (అహమ్మద్ నగర్ జిల్లాలో సంగమర్ వద్ద) నిర్వహించింది.

సత్యాగ్రహ కేంద్రాన్ని (జూలై – సెప్టెంబర్‌ల మధ్య బేరార్‌లో 106) ఎంపిక చేసింది. అటవీ శాఖ వేలం పాటల్ని అడ్డుకొన్నది. పశువుల్ని మేపుకొనడంపై వున్న నిషిద్ధాల్ని అతిక్రమించింది.

1930 జూలై – ఆగస్టు కాలంలో సప్రూ జయకర్‌లు మధ్యవర్తులుగా జరిపిన యరవాడ జైలు చర్చలు విఫలమవడం జాతీయ నాయకత్వం శాసనోల్లంఘనోద్యమ తొలి దశలో చేపట్టిన దృఢ వైఖరిని స్పష్టం చేసింది. గాంధీ మొదట కొద్దిగ ఊగిసలాడాడు. కాని నెహ్రూదే తుది నిర్ణయమన్నాడు. యరవాడ జైలు నుండి ఆగస్టు 15న గాంధీ – నెహ్రూలు పంపిన ఉమ్మడి లేఖ – విడిపోయే హక్కు, రక్షణ ఆర్థిక రంగాలపై నియంత్రణ గల పూర్తి జాతీయ ప్రభుత్వం, బ్రిటిష్ ఆర్థిక ప్రయోజనాల్ని పరిరక్షించేందుకు ట్రిబ్యునల్ ఏర్పాటుని పునరుద్ఘాటించింది. ఈ దశలో చర్చలు విఫలం కావడం ఆశ్చర్యజనకం కాదు. 1930 సెప్టెంబర్ నాటి లెజిస్లేటివ్ ఎన్నికల్ని జయప్రదంగా బహిష్కరించడం కూడా ఉద్యమం యొక్క బలాన్ని స్పష్టం చేసింది. బొంబాయి నగరంలో హిందూ నియోజకవర్గాలలో కేవలం 8 శాతం ఓటింగ్‌లో పాల్గొన్నారు. అఖిల భారత స్థాయిలో సరాసరి ఓటింగ్ 1926లో 48.07 శాతం కాగా యిప్పుడది కేవలం 26.1 శాతం మాత్రమే.

ఆరు నెలల తరువాత ఢిల్లీలో 1930 ఫిబ్రవరి – మార్చిలో ఇర్విన్‌తో జరిపిన చర్చలలో గాంధీ మితవాద వైఖరిని చేపట్టవలసి వచ్చింది. అందుకు కారణం శాసనోల్లంఘనోద్యమంలో వచ్చిన మార్పులు.

1930 సెప్టెంబర్ నుండి ఉద్యమానికి పట్టణ వర్తకుల మద్దతు తగ్గనారంభించింది. విదేశీ బట్టల అమ్మకాలపై కాంగ్రెస్ నియామకాల్ని బనారస్ వర్తకులు ఉల్లంఘించారు. అమృతసర్ వర్తకులు ఫజిల్కా వద్ద రహస్య అమ్మకాలు ప్రారంభించారు. బొంబాయిలో కూడా వర్తకులు గత సంవత్సరం నుండి గుట్టలుగా పేరుకుపోయిన నిల్వల అమ్మకాలకు సమాయత్తమయ్యారు. (హోం పొలిటికల్ 18/ని/1930) వర్తకులు పునరాలోచన చేశారు గాని మిల్లు యజమానులు ఉద్యమం పట్ల ఎప్పుడూ అంత ఆసక్తి చూపలేదు. స్వదేశీ డిమాండ్‌తో వచ్చిన లాభాలు హోమీ మోడీ 1931 మార్చిలో వర్ణించిన విధంగా ఆ తరువాత కాలంలో జరిగిన హర్తాళ్ళతో కొట్టుకుపోయాయి.

"తరచుగా జరిపిన హర్తాళ్ళు పరిశ్రమ వర్తకాన్ని అస్తవ్యస్తం చేశాయి." ఒక విధమైన అస్తవ్యస్త పరిస్థితిని సృష్టించాయి. గాంధీ వైఖరికి యరవాడ వద్ద బిర్లా మద్దతు తెలిపినప్పటికి (ఠాకూర్‌దాస్‌కి లేఖ, సెప్టెంబర్ 6) కొద్ది రోజుల తరువాత రౌండ్ టేబుల్ సదస్సుని బహిష్కరించాలని ఫిక్కీ మేలో తీసుకొన్న నిర్ణయాన్ని పునరాలోచించవలసిందిగా లాలా శ్రీరాం కోరాడు. 'వర్తక సంఘం సహనశక్తి పరిమితుల్ని చేరుకొంటుంది' అని ఠాకూర్‌దాస్ లాల్జీ నారాంజీ ద్వారా మోతీలాల్‌ని హెచ్చరించాడు. (ఠాకూర్‌దాస్ పత్రాలు ఎఫ్.ఎన్. 104/1930) ఠాకూర్‌దాస్ అదే అంశాన్ని బిర్లా సన్నిహిత సహచరుడైన దేవీ ప్రసాద్ ఖైతాన్‌కి అక్టోబర్ 8న ఒక లేఖ ద్వారా పునరుద్ఘాటించారు. "ప్రయాణంలో నాకు వచ్చిన అనుభవం ఏమిటంటే బట్టల దిగుమతిదారులు డీలర్లు పికెటింగ్‌లతో విసిగిపోతున్నారు. నష్టాలలో

కూరుకుపోతున్నారు. బొంబాయి మినహాయించి దేశమంతటా అదుపులో వుంది. కొద్దికాలంలో ఉద్యమం క్షీణిస్తుంది... కాంగ్రెస్ ఎదురుదెబ్బ తింటుంది. దేశం నష్టపోతుంది (ఠాకూర్‌దాస్ పత్రాలు ఎఫ్.ఎన్. 99/1930).

రాజీ కొరకు వాణిజ్య గ్రూపుల నుండి వచ్చిన హెచ్చరికలు, వాటికి వచ్చిన జాతీయవాద స్పందన గ్రామీణ ప్రాంతాల పరిణామాలతో ముడిపడి వుంటాయి. సాపేక్షకంగా సంపన్న రైతుల్ని దృష్టిలో పెట్టుకొని రూపొందించిన గాంధేయ పోరాట రూపాలు విచక్షణా రహితమైన బ్రిటిష్ అణచివేత విధానాల కారణంగా కొంత బలహీనపడ్డాయి. అదే సమయంలో శిస్తు చెల్లింపు నిరాకరణ, తెగల తిరుగుబాటు లాంటి అదుపు చేయలేని సామాజికంగా ప్రమాదకరమైన పోరాట రూపాలు ముందుకు వచ్చే సంకేతాలు కన్పించాయి. చానక్‌పూచ్ (నాసిక్ జిల్లా)లోని కోలి తెగల ప్రజలు అక్టోబర్ 22న బ్రిటిష్ రాజ్యం స్థానంలో గాంధీ రాజ్యం వచ్చిందని కథలు విని బాకులు, బళ్ళాలు, కత్తులు యితర ఆయుధాలు పట్టుకొని కాంగ్రెస్ నినాదాలు చేస్తూ చెల్లాచెదురు కాకుండా పోలీసు కాల్పుల్ని ఎదుర్కొన్నారు. (హోం పొలిటికల్ 18/xI18/XII/1930). పశ్చిమ కనుమల కోలీలు, సెంట్రల్ ప్రావిన్స్‌కి చెందిన గోండులు జరిపిన సత్యాగ్రహం గాంధేయ పరిమితుల్ని అధిగమించింది. ఆందోళనకారుల పోలీసు ఠాణాలపై దాడులు చేశారు. విచక్షణా రహితంగా పెద్ద ఎత్తున చెట్లను నరికివేశారు. నాయకులు అరెస్టుల్ని ఆస్తుల స్వాధీనాన్ని ప్రతిఘటిస్తూ రైతులు తిరగబడిన ఘటనలు దేశవ్యాప్తంగా జరిగాయి. ధరలు పడిపోవడంతో శిస్తు పన్నుల నిరాకరణకై క్రింది నుండి ఒత్తిడులు పెరిగాయి. 1930 అక్టోబర్‌లో యుపి కాంగ్రెస్ అనివార్యంగా ఒత్తిడికి తలొగ్గి ఆమోదించవలసి వచ్చింది.

## ప్రాంతీయ అధ్యయనాలు

ఇప్పటి వరకు ఒక అఖిల భారత ఉద్యమంగా శాసనోల్లంఘనాన్ని గురించి చర్చించాం. కాని గాంధీ – ఇర్విన్ ఒప్పందానికి దారితీసిన పరస్పర విరుద్ధమైన పరిణామాల్ని అంతర్గత ఉద్రిక్తతల్ని వివరించేందుకు ప్రాంతీయ వ్యత్యాసాలపై సంక్షిప్త అధ్యయనం అవసరం.

1930 సంవత్సరమంతా బొంబాయి నగరం శాసనోల్లంఘనకు దుర్గంగా పనిచేసింది. హోం మెంబర్ హెచ్.జి. హేగ్ చాలా కలవరపాటుతో జూన్ 13న ఇలా రిపోర్టు చేశారు. “బజార్లు అంతటా గాంధీ టోపీలే! ఖద్దరు యూనిఫారం ధరించిన వలంటీర్లు పికెటింగ్ చేయడానికి నియమింపబడ్డారు. వారు పోలీసు కానిస్టేబుళ్ళలాగా క్రమబద్ధంగా, క్రమశిక్షణాయుతంగా వ్యవహరిస్తున్నారు. పెద్ద ప్రజాప్రదర్శనలు (వాటిలో ఒకటి 20కి పైగా భారత వాణిజ్య సంస్థల చేత మే 23న నిర్వహించబడింది) ట్రాఫిక్‌ని నియంత్రించే పోలీసు విధులను ప్రక్కకు నెట్టి వేశాయి. ముస్లింలు చాలావరకు దూరంగా ఉండిపోయినారు. 1929 సమ్మె పరాజయం, ధరల్ని తగ్గించి ఉపాధి అవకాశాల్ని దెబ్బతీసిన ఆర్థిక మాంద్యం, కమ్యూనిస్టుల అసాధారణ విధానాలు – అన్నీ కలిపి అత్యధిక కార్మికుల్ని దూరంగా వుంచాయి. కానీ శాసనోల్లంఘనకు బొంబాయిలో పెద్ద సంఖ్యలో వున్న గుజరాతీలు ప్రధానంగా వాణిజ్యవేత్తల

అధికారుల మద్దతు వుంది గనుక బొంబాయి నగరంలోని ఉద్యమాన్ని పరిమితమైన రాజకీయ గ్రూపుతో వ్యవహరించినట్లు వ్యవహరించి అదుపు చేయడం సాధ్యపడదని బొంబాయి గవర్నర్ అంగీకరించారు.

నగరంలో సాంప్రదాయ గాంధేయ వాద నాయకత్వానికి జమ్నాలాల్ బజాజ్, పటేల్ ఆశ్రితుడు (ఎస్.కె. పాటిల్) ప్రతినిధులుగా వున్నారు. తరువాత కాలంలో ప్రముఖ సోషలిస్టు నాయకులు కానున్న కె.ఎఫ్. నారిమన్ యూసుఫ్ మెహర్ యువతరం కాంగ్రెస్‌కి ప్రాతినిధ్యం వహించారు. మిల్లు, రేవులలోని కార్మికుల్ని సమీకరించేందుకు కాంగ్రెస్ వలంటీర్లు తీవ్ర ప్రయత్నాలు ప్రారంభించారు. బొంబాయి సత్యాగ్రహ కమిటీ ఠాకూర్‌దాస్ లాంటి వర్తక నాయకుల్ని తీవ్రంగా విమర్శిస్తూ ప్రకటనల్ని వెలువరించింది.

గాంధేయవాద అదుపులో వున్న ప్రజా ఉద్యమానికి గతంలో లాగానే గుజరాత్ - యింకా స్పష్టంగా చెప్పాలంటే ఖేదాలోని ఆనంద్, బోర్సాద్, నాదియాడ్ తాలూకాలు, బ్రోచ్‌లోని జంబుసర, సూరత్‌లోని బార్డోలి - కేంద్రాలుగా వున్నాయి. ఈ ప్రాంతాలలో 1930-31 నాటి రాజకీయ కారణాల రీత్యా రెవెన్యూ వసూళ్ళలో బకాయిలు వున్నాయి. 1931 ప్రారంభంలో పెద్ద ఎత్తున భూమిని జప్తు చేయడంతో ఖేదాలో కూడా కొందరు పటేదార్లు అహింస నుండి హింసా మార్గానికి మార్పు చెందే దశకి చేరుకున్నారు. రైతులు కొన్ని సందర్భాలలో డప్పులు వాయించడం ద్వారా ప్రక్క గ్రామాల సాయం ఆర్థించి వారి నాయకులు అరెస్టును అడ్డుకున్నారు. బోర్సాద్‌లో గ్రామాధికారి రాజీనామా చేయ నిరాకరించినందుకు క్రింది కులానికి చెందిన 'ధారుల'చే హత్య చేయబడిన ఘటన జరిగింది.

ఉప్పు సత్యాగ్రహాల కేసు విచారణ సందర్భంగా కరాచీలో ప్రజల గుంపు పోలీసుల మధ్య ఘర్షణ జరిగినప్పటికి, అక్కడ స్వామి గోవిందానంద లాంటి యువ నాయకులున్నప్పటికి ముస్లింలు (గ్రామాలలో 90% వున్నారు) ఉద్యమానికి దూరంగా వుండటం వలన శాసనోల్లంఘన సింధులో చాలా బలహీనంగా వుంది.

మహారాష్ట్రలో చిట్‌పవన్ బ్రాహ్మణ పార్టీగా పేరుబడ్డ కాంగ్రెస్ ఆ దశని అధిగమించింది. యన్.వి.గాడ్గిల్ (సోషలిస్టులతో సంబంధాలున్నాయి) నాయకత్వంలోని కొత్తతరం 1929 లో దేవాలయ ప్రవేశం ఉద్యమానికి మద్దతు యివ్వడం ద్వారా పూనాకు చెందిన కేశవరావు జేధే లాంటి బ్రాహ్మణేతర సత్యశోధక సమాజం నాయకులతో సంబంధాలు పెంచుకొన్నారు. కేల్కర్, మూంజే లాంటి తిలక్ అనుచరులు జాతీయవాద ప్రధాన స్రవంతి నుండి విడివడి హిందూ మహాసభ నాయకులయ్యారు. కాని కాంగ్రెస్ అప్పుడే ఎదుగుతున్న అస్పృశ్యమహర్ల రాజకీయ ఉద్యమాన్ని తనవైపు తిప్పుకోవడంలో విఫలమయ్యింది. ఆ ఉద్యమ నాయకుడు బి.ఆర్. అంబేద్కర్ 1930లో రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరయ్యాడు. ప్రత్యేక నియోజక వర్గాల డిమాండ్‌ని ప్రస్తావించారు.

సెంట్రల్ ప్రావిన్సెస్‌లో అలాంటి నమూనానే చూడవచ్చు. శాసనోల్లంఘన బొంబాయి నుండి బీరారు, మరాఠా, గ్రామీణ ప్రాంతాలలోకి చొచ్చుకు పోతుందని గవర్నరు రిపోర్టు చేశారు. శాసనోల్లంఘనని సగం మతపరమైనదిగాను, ఒకమేరకు వ్యక్తిగత నష్టాల్ని పరిగణనలోకి

తీసుకొననిది గాను ప్రజలు భావించారు. (సైన్స్ పత్రాలు) మహారాష్ట్ర, సెంట్రల్ ప్రావిన్సెస్, కర్నాటక (సహాయ నిరాకరణ ప్రభావం దాదాపు లేని ప్రాంతాలు) లలో అటవీ సత్యాగ్రహం, శాసనోల్లంఘనం యొక్క విస్తృతమైన సమరశీల రూపంగా వ్యాపించింది. అహమ్మద్‌నగర్‌లోని సంగమ్నర్ వద్ద 100000 మంది (జూలై 22) నాసిక్‌లో బగలాన్ వద్ద 70,000 మంది (ఆగష్టు 5) సతారాజిల్లాలో 32 చోట్ల (ఆగస్టు 28న) సామూహికంగా అటవీ చట్టాల్ని ఉల్లంఘించారు. (జి. 148/1930) సెంట్రల్ ప్రావిన్సెస్‌లోని విస్తృత ప్రాంతాలు (చాందా, అమరావతి, బేతుల్, రాయపూర్, భాండార్, సియోని జిల్లాలతో సహా) యింకా ఉత్తర కెనరా తాలుకాలైన సిర్సి, సిద్దపూర్‌లు అలజడి కేంద్రాలయ్యాయి. బేతుల్‌లో గోండుల నుండి గంజన్ కోర్కులాగా తెగల నుండి నాయకులు ఆవిర్భవించించడంతో ప్రతిచోట గూడ అటవీ ఉద్యమం చేయిదాటిపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రాంతాలన్నింటిలో ఫారెస్టు గార్డుల మీద పోలీసు బృందాల మీద దాడులు సర్వసాధారణమయ్యాయి. కాంగ్రెస్ హింసపై వెలువడిన అధికార జాబితా ప్రకారం సెంట్రల్ ప్రావిన్సిస్‌లో 1930 జూలై, అక్టోబరుల మధ్య 10 హింసాయుత ఘటనలు బొంబాయి ప్రెసిడెన్సీలు మే, అక్టోబరుల మధ్య 20 ఘటనలు జరిగాయి. (హోం పొలిటికల్ 14/14,14/19/1931) 1931 ప్రారంభంలో కొన్ని కర్నాటక జిల్లాలలో పన్ను చెల్లింపు నిరాకరణకు సన్నాహాలు పూర్తి అయ్యాయి. ఈ ప్రజాందోళనల ప్రభావం స్వదేశీ సంస్థానాలపై కూడా కొద్దిగా పడింది. కనరా ఉద్యమంలో మైసూరుకు చెందిన వలంటీర్లు పాల్గొన్నారు. బందేల్‌ఖండ్‌లోని చాలుర్‌పూర్ సంస్థానంలో అక్టోబరు డిసెంబర్‌ల మధ్య పన్ను చెల్లింపు నిరాకరణ ప్రచారం తీవ్రస్థాయిలో జరిగింది. ఆసక్తికరమైన విషయమేమిటంటే ఈ ప్రచారానికి నాయకత్వం వహించింది 'మంగళ్‌సింగ్' అనే ప్రముఖ బందిపోటు. అతడు భూమిశిస్తు తగ్గింపుని డిమాండ్ చేశాడు. "తనకు స్వంత రాజ్యాన్ని కూడా ఏర్పాటు చేసుకొనే ఆలోచనలు చేశాడు. "తనకు స్వంత రాజ్యాన్ని కూడా ఏర్పాటు చేసుకొనే ఆలోచనలు చేశాడు. డిసెంబరు 30న తుపాకులతో సాయుధమైన 1000 మందితో సహా 20000 మంది ప్రజా సమూహాన్ని బ్రిటిషిండియా సమయానికి వచ్చిన మిలిటరీ చెదరగొట్టింది. లేకపోతే భాటర్‌పూర్ బీహార్ రాజాపై ఒత్తిడి చేసి అన్ని డిమాండ్లు సాధించుకొని వుండేవారు (హోం పొలిటికల్ 18/x/1-18/x 111/1930)

తమిళనాడులో శాసనోల్లంఘనం ప్రారంభంలో గాంధేయనాయకుడు సి. రాజగోపాలాచారి (1925లో సేలా జిల్లాలోని తిరుచెంగోడు ఆశ్రమాన్ని ప్రధాన స్థావరంగా ఏర్పాటు చేసుకొన్నారు. మద్రాసు నగరం స్థావరంగా గల స్వరాజ్యవాద ప్రత్యర్థులైన సత్యమూర్తి, శ్రీనివాసరయ్యంగార్లను ప్రొవిన్షియల్ కాంగ్రెసు నాయకత్వం నుండి 1930 మార్చిలో తొలగించడానికి అవకాశం కల్పించింది.

రాజాజీ ఉప్పుచట్టాన్ని ఉల్లంఘించడానికి తిరుచునాపల్లి నుండి తంజావూరు తీరానగల వేద రాజాయం వరకు 1930 ఏప్రియల్‌లో పాదయాత్ర చేపట్టారు. ఆ తరువాత విస్తృతంగా విదేశీ బట్టల షాపుల వద్ద పికెటింగ్‌లు నిర్వహించారు. 1921లో లాగా మద్యపాన వ్యతిరేక

ప్రచారం తమిళనాడు లోతట్టు ప్రాంతంలోని కోయంబత్తూరు, మధురై, నిరూద్‌నగర్ (నాడారుల యొక్క జస్టిస్ పార్టీ రాజకీయాల నుండి విడివడి కామరాజు తన రాజకీయ జీవితాన్ని (ప్రారంభించిన చోటు) పట్టణాలలో గణనీయమైన శక్తిని కూడగట్టింది. రాజాజీ శాసనోల్లంఘనని అహింసాయుతంగా, పూర్తిగా అదుపులో వుండే వ్యవహారంగా వుంచేందుకు చేయగలిగిందంతా చేశారు. క్రింది కులానికి చెందిన పేద రైతులు, కార్మికులు కల్లార్లు వుండే ప్రాంతాలు తన పాదయాత్ర మార్గంలో తటస్థపడకుండా జాగ్రత్తపడ్డాడు. కాని యితర చోట్లలాగానే తమిళనాడులో కూడా శాసనోల్లంఘన ప్రజల హింసాయుత విస్ఫోటనం, పోలీసుల హింసాయుత అణచివేతలతోనే వృద్ధి చెందింది. ("కాంగ్రెస్ రాజ్యంలో ఆర్నాల్డ్‌పేజి 265) ఇవి పెద్ద ఎత్తున మద్రాసు బీచ్‌లో జరిగిన ఘర్షణలతో ప్రారంభమయ్యాయి. (ఏప్రిల్ 27) సత్యాగ్రహాలపై పోలీసు చర్యలు, చోళైమిల్లుల సమ్మెని విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వ ప్రయత్నాలు ఘర్షణలకు కారణాలు. ఉపాధి దొరకని నేత పనివాళ్లు మద్యం షాపులపైన ఉత్తర ఆర్కాటులోని గుడియాట్టం వద్ద పోలీసు పికెట్లపైన జూలైలో దాడులు చేశారు. ధరలు పడిపోవటంతో ఇబ్బందులకు గురయిన రైతులు మధురలోని బోడినాయకనూల్ వద్ద ఆగస్టులో దొమ్మీకి దిగారు. మాంద్యానికి అసంతృప్తికి మధ్యగల సంబంధం మధుర పట్టణంలో స్పష్టంగా వ్యక్తమయింది. అక్కడ వ్యాపారులు సౌరాష్ట్రానికి చెందిననేత పనివాళ్ల మద్దతుతో ఉద్యమం గణనీయమైన బలాన్ని పుంజుకొన్నది. వారి జోక్యం కేవలం మునిసిపాలిటీని పట్టుకొనేందుకు బీకర్ యిచ్చిన వివరణ అసమగ్రంగా వుంది. (దక్షిణ భారతదేశ రాజకీయాలు పేజీ179) మలబార్‌లో 1920 లో వైకం దేవాలయ ప్రవేశ సత్యాగ్రహంతో క్రింది కులమైన యజవాలతో సంబంధాలు పెట్టుకొన్న నాయర్ కాంగ్రెసు నాయకుడు కేలప్పన్ ఉప్పు యాత్రలను నిర్వహించారు. 1930 నవంబర్ 11న కాలికట్ బీచ్‌లో పోలీసుల లాఠీచార్జీని ఎదుర్కొని జాతీయ జెండాని సమున్నతంగా నిలబెట్టిన రాజకీయ నాయకుడు, ఆ తరువాత కాలంలో కేరళ కమ్యూనిస్టు పార్టీ స్థాపకుడు అయిన పి. కృష్ణపిళ్లై కూడా ఉప్పు సత్యాగ్రహానికి నాయకత్వం వహించారు.

మద్రాసు ప్రెసిడెన్సీలో కాంగ్రెసుకి సంస్థాపరంగా బలమైన స్థావరం కోస్తా ఆంధ్ర. అక్కడ కాంగ్రెసులో మార్పులు కోరనివారికి స్వరాజ్యవాదులతో మధ్య వివాదం మద్రాసులో కంటె తక్కువ. అక్కడ 1927 నుండి శిస్తు పెంపుదలకు వ్యతిరేకంగా ఆందోళన కొనసాగుతుంది. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలలో ఉప్పు యాత్రలు నిర్వహించబడ్డాయి. కాంగ్రెసు నిధికి వ్యాపారులు విరాళాలిచ్చి సహకరించారు. పశ్చిమగోదావరిలో 1420 ఎకరాలకు సాగునీటి నిలుపుదలని వ్యతిరేకిస్తూ కమ్మ- రాజు లాంటి అగ్రకులాలకు చెందిన వ్యవసాయదారులు అణచివేత చర్యల్ని ఎదుర్కొన్ని పోరాడారు (కాంగ్రెస్ ప్రభుత్వం స్టాడర్ట్ పేజీ 120) బలమైన నిర్మాణం వున్నప్పటికి కోస్తా ఆంధ్రాలో 1921-22 నాటి ఉత్సుకత కొరవడింది. నెల్లూరుకి చెందిన ఒక గ్రామంలో మాత్రమే రైతులు శిస్తు చెల్లించనిరాకరించారు. ఆంధ్రలో వర్గ ప్రాతిపదికన శక్తివంతమైన కిసాన్ ఉద్యమం అభివృద్ధి చెందింది. కాని శాసనోల్లంఘన కాలంలో గాక శాసనోల్లంఘనోద్యమం ఆపివేయబడిన తరువాత 1931 లోను 1934 నుండి అభివృద్ధి చెందింది. విజయనగరం ఏజెన్సీ ప్రాంతంలోని

కళ్యాణసింగపూర్ వద్ద 1931 జనవరి 22న పోలీసు బృందంపై దాడి జరిగింది. కాని కాంగ్రెస్ అటవీ ఉద్యమాన్ని పునరుద్ధించడానికి ఎలాంటి ప్రయత్నం చేయలేదు. శాసనోల్లంఘన సందర్భంగా 1930 లో ఆంధ్రలో శిక్షలు విధింపబడినవారు 2878 తమిళనాడులో 2991 మంది. రెండు ప్రాంతాలలో కలిపి కూడా అఖిల భారత స్థాయిలో శిక్షలు పడిన 90,000 మందిలో 6 శాతానికి కంటె తక్కువ.

1920 లనుండి గోపాలబంధు చౌదరి ఆధ్వర్యంలో బలమైన గాంధేయవాద నాయకత్వం గల ఒరిస్సాలోని తీర ప్రాంతజిల్లాలైన బాలసోర్, కటక్, పూరిలో ఉప్పు సత్యాగ్రహం బలమైన ఉద్యమంగా సాగింది. ప్రత్యేకించి ఒరిస్సా ఉప్పు తయారీ పరిశ్రమపై విధించిన నిషేధపు చట్టాన్ని బాలసోర్ ప్రజలు వ్యతిరేకించారు. (హోం పోలిటికల్ 252/1/1930)

అస్సాంలో కూడా ఆంధ్రాలో మాదిరిగానే శాసనోల్లంఘన 1921 -22 కాలం నాటి ఉద్యమ ఔన్నత్యాన్ని పొందడంలో విఫలమయింది. అందుకు కారణాలు అస్సాం, బెంగాల్ ప్రజల మధ్య విభేదాలు, హిందువులు, ముస్లింల మధ్య విభేదాలు జనసాంద్రత ఎక్కువగా వున్న తూర్పు బెంగాలు నుండి ప్రవాహంగా వచ్చి పడుతున్న ముస్లిం రైతుల వలసలతో పెరుగుతున్న ఉద్రిక్తతలు. ప్రముఖ కాంగ్రెసు నాయకులలో ఒకరైన తరుణ్‌రాం పూకాన్ శాసనోల్లంఘన ఉద్యమ వ్యతిరేకి, యన్.సి బార్దాలోప్తా నిరాసక్తకంగా వుండిపోయాడు. రాజకీయాలలో పాల్గొనడాన్ని నిషేధించిన కన్నింఘమ్ ప్రకటనకు వ్యతిరేకంగా విద్యార్థులు సమ్మె చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో వున్న 15186 మంది విద్యార్థులలో 3117 మంది పాఠశాలల్ని వదిలివచ్చారు. ఉద్యమాన్ని సిల్హెట్ ప్రధాన స్థావరంగా వున్నది. 1930-31లో జరిగిన 2373 అరెస్టులలో 892కి పైగా సిల్హెట్ జిల్లాలోనే జరిగాయి. రిజర్వు ఫారెస్టులో ప్రజల చొరబాటుని నివారించేందుకు అస్సాం రైఫిల్సు దళం 1931 జనవరిలో ఉత్తర కామరూప్ గుండాకవాతు నిర్వహించారు. ఆ ప్రాంతంలోని ఆదిమక బారి గ్రామాల్ని ఆటవీ చట్టాల్ని ఉల్లఘించమని శ్రీమతి చంద్ర ప్రభ సైకియాని రెచ్చగొడుతున్నట్లు రిపోర్టు అందించి కాని అస్సాం కాంగ్రెసు నాయకత్వం అటవీ సత్యాగ్రహం చేపట్టనిరాకరించింది. ఈసారి తోటల కార్మికులతో సంబంధాలేలేవు. ఆంధ్రాలో లాగానే రైతు సభలకు 1931 తరువాత ప్రాధాన్యత లభించింది.

సుభాష్‌బోస్, జె.యం. సేన్‌గుప్తాలు ప్రత్యర్థి గ్రూపులుగా శాసనోల్లంఘన చేపట్టారు. బెంగాల్ కాంగ్రెసు ముఠాలుగా చీలిపోయింది. 1930 శాసనోల్లంఘనోద్యమం అత్యున్నత దశలో వున్నప్పుడు రెండు గ్రూపులు కూడా కలకత్తా కార్పొరేషన్ ఎన్నికలకే వాటి శక్తి యుక్తుల్ని సమయాన్ని వెచ్చించాయి. ముఠా కీచులాటలు, కలకత్తా కులీన నాయకులలో అత్యధికులు గ్రామీణ ప్రజల నుండి వేరుపడిపోవడం 1937 ఎన్నికలలో సాపేక్షికంగా కాంగ్రెసు పరాజయం అన్నీ కలిసి బెంగాల్‌లో కాంగ్రెసు 1930లలో క్షీణించడానికి కారణమయ్యాయి. అయినప్పటికి 1930-31లో అత్యధికంగా అరెస్టు అయినవారు బెంగాలీలు (15000) అధికార అంచనాల ప్రకారం ఎక్కువ హింసాత్మక ఘటనలు జరిగింది బెంగాలులోనే. టెర్రరిస్టు దాడుల్ని మినహాయించి 136) (హోం పొలిటికల్ 14/20/1931).

కాం(గ్రెసు సంస్థ యొక్క సాపేక్షిక బలహీనత (గుజరాత్, ఆంధ్ర) యు.పి, బీహారులలో పోల్చితే బహుశా వైవిధ్య భరితమైన హింసాత్మక ఉద్యమంగా దారితీసి వుండవచ్చు. మిడ్నాపూర్, ఆరామ్‌బాగ్‌లలో లాగా యితర గ్రామీణ ప్రాంతాలలో ఉప్పు, చౌకీదారో పన్ను సమస్యలపై శక్తివంతమైన ఉద్యమాలు అభివృద్ధి చెందాయి. తరువాత ఆ కాలం చరిత్రకారులలాగానే ఉద్యమానికి తొలుత ఊపుని ప్రేరణని కల్పించిన గాంధేయ నిర్మాణాత్మక కార్యకర్తలు కూడా కలకత్తా నాయకుల పట్టణ పక్షపాత వైఖరిని విమర్శించారు. గాంధేయ కేంద్రాలు స్థాపించబడని ప్రాంతాలు (ఉదాహరణకు మిడ్నాపూర్‌కి చెందిన ఘటాల్ సబ్‌డివిజన్, పూర్తి అహింసాయుతంగా వుండిపోయిన సమీపంలోని ఆరాంబాగ్‌కి విరుద్ధంగా) యింకా యితర ప్రాంతాలలో మొదటి శ్రేణి నాయకత్వం తొలగింపబడిన తరువాత రైతుల సమీకరణ తరచుగా పోలీసులతో సమరశీల పోరాటాల రూపం తీసుకొన్నది. మధ్యతరగతి టెర్రరిజం కూడా 1930 ఏప్రిల్ చిట్టగాంగ్ ఆయుధాగారంపై దాడి తరువాత చివరి శక్తివంతమైన దశలోకి ప్రవేశించింది. ఇంకా 1921 లో సి.ఆర్.దాస్ అందించిన సమర్ధవంతమైన కేంద్ర నాయకత్వం యిప్పుడు లేకపోవడం, పారిశ్రామిక కార్మికుల స్తబ్దత, ఝూర్గ్రామ్, రంగపూర్, చిట్టగాంగ్, తిప్పేరా లాంటి బయటి ప్రాంతాల తెగల, పేద రైతుల తిరుగుబాట్లు జరుగకపోవడం అన్నింటినీ మించి ముస్లింలు దూరంగా వుండడం. తొలుత ముస్లింలు కొంత భాగస్వామ్యం వహించాయి. కాని ఢక్కా పట్టణంలో మేలో కిషోర్‌గంజ్ గ్రామాలలో 1930 జూలైలో జరిగిన మతకలహాలను ముస్లిం భాగస్వామ్యం ఆగిపోయింది. రెండుచోట్ల కూడా సామూహిక ఉద్రిక్తతలు. వికృతీకరింపబడడంతో మతతత్వం వ్యక్తమయిందని, సమర్ధవంతమైన నాయకత్వం దీనినే సామ్రాజ్యవాద వ్యతిరేకంగా పోరాడేందుకు సంసిద్ధం చేసి వుండేదని యిటీవల అధ్యయనాలు, స్పష్టం చేస్తున్నాయి. దాడికి దిగినవారు హిందూ వడ్డీ వ్యాపారుల వర్తకుల ఇళ్లు, దుకాణాలు, గిడ్డంగులు లక్ష్యాలుగా పెట్టుకొన్నారు. వారు ధృవపత్రాల్ని (ప్రామిసరీ నోట్లని) లాక్కుపోవడం పట్ల చూపిన ఆసక్తి, గోవధ, మసీదుల ఎదుట వాయిద్యాల మోతపై చూపలేదు. ముస్లిం తాలుకాదార్లు ఇంటిపైదాడితో కిశోర్‌గంజ్ అలజడులు ప్రారంభమయ్యాయి. కార్మిక కర్షకపార్టీ (Workers and Preasents party) శాఖలు వర్గ ప్రాతిపదికన ప్రారంభింపబడిన ఉద్యమం, కమ్యూనిస్టులు అరెస్టు చేయబడిన తరువాత మతపరమైన ముల్లాలవశమయింది. స్వదేశీ ఉద్యమం నాటి నమూనా పునరావృతమయింది. ధరలు ఒక్కసారిగా పడిపోవడంతో గ్రామీణ ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణంలో జమీందారీ వ్యతిరేక వడ్డీ వ్యాపార వ్యతిరేక కార్యక్రమం రూపొందించడంలో బెంగాల్‌లోని జాతీయవాద నాయకత్వం విఫలమయింది. గ్రామీణ గాంధేయవాదులు 1930 –31 పన్నులకు వ్యతిరేకంగా పోరాడలేదు. అలాగే జోతేదారు, పాలికాపులు సంబంధాల కూడా కాంగ్రెసు సిద్ధాంత ఆచరణకు వెలుపలే వుండిపోయాయి) సమస్య కాంగ్రెసు వాదులకు పట్టలేదు.

దాదాపు ఇలాంటి నమూనాయే పంజాబులో చూడవచ్చు. పట్టణ హిందు వర్తకుల పార్టీగా పేరు గాంచిన కాంగ్రెసు యిప్పుడు మతపరంగా ఐక్యపరిచే ఖిలాపత్, గురుద్వారా యజమాన్యాల శుద్ధి లాంటి సమస్యలు లేకపోవటంలో ముస్లింల్ని సిక్కు రైతుల్ని

సమీకరించలేకపోయింది. యూనియనిస్టు పార్టీ ప్రభుత్వానికి విధేయతగా వుంది. అకాలీల, వైభకులని వైవిధ్యం వుంది. తారాసింగ్ కాంగ్రెసుని బలపరిచారు. భరక్‌సింగ్ దూరంగా వుండిపోయాడు. కాని పంజాబుకి సైన్యంతో గల సంబంధాలు ఖుదాయ్‌జిద్మగార్లు తీవ్రమైన సమస్య గల సరిహద్దు ప్రావిన్సు పొరుగున వుండడం, సరిహద్దు రేఖవద్ద టెర్రరిస్టు, మార్క్సిస్టులకు చెందిన నౌజవాన్, భారతసభ కీర్తి కిసాన్ గ్రూపు శక్తుల ఉనికి – లాంటి కారణాలతో బ్రిటిషువారు పంజాబును గురించి ఆందోళనతో ఉన్నారు. వాటి కారణాలతో బ్రిటిషువారు వ్యాపారుల మద్దతు కారణంగా బహిష్కరణ తొలుత జయప్రదమయింది. ప్రధాన వర్తకకేంద్రమయిన అమృత్‌సర్‌లో బ్రిటిష్ వస్త్రాల నెలసరి అమ్మకం జూలైలో 25 లక్షల నుండి 2లక్షలకు పడిపోయింది. కాని సెప్టెంబరు నాటికి అనివార్యంగా దివాలాతీసే పరిస్థితులలో వర్తకులు పట్టుసడిలింది (హోం పొలిటికల్ 18x /1930) అక్టోబర్ 7న భగత్‌సింగ్‌కి ఉరిశిక్ష విధించడంతో పట్టణ యువకుల ఉద్రిక్తత పెరిగింది.

వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోవడంపై పంజాబు గవర్నరు తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేశారు. భూమి శిస్తు పన్నులు చెల్లించవద్దని జమీందారుల్ని వ్యవసాయదారుల్ని అర్థిస్తూ అలజడి సృష్టించేవారు తీరిక లేకుండా వున్నారు (ఇర్విన్ సంకలనం) అక్టోబరులో స్థాపించబడిన అకాలీ నాయకత్వాన గల పంజాబ్ జమీందారీ సభ ఉదాసీనంగా వుండి బ్రిటిషువారిని ఆశ్చర్యపరిచింది. కాని రియాస్తి ప్రజామాదర్ ఫుల్కియన్ ప్రాంతాలలోని సిక్కు రైతులతో పాటియాలా మహారాజా ప్రచారం లేని శాసనోల్లంఘనకు మద్దతు కూడగట్టారు. అంతకంటే ఆసక్తికరమైన అంశం హఠాత్తుగా చెలరేగిన అలజడులు హిస్సార్ జిల్లాలో రైతులపన్ను చెల్లింపు నిరాకరణ ఏప్రిల్‌లో భూస్వామ్యం పంటల్ని బల ప్రయోగంతో స్వాధీనం. సెప్టెంబర్‌లో కాంగ్రాలో అడవిలో పశువుల్ని మేపుకొనే నిబంధనల ఉల్లంఘన. డిసెంబర్‌లో యితర క్రింది కులాల సహకారంతో జాట్లు, సాగించిన సామాజిక బందిపోట్లు వడ్డీ వ్యాపారులు, ధాన్యం, వ్యాపారులపై దాడులు, దోపిడికి గురయిన ఆస్తిపాస్తులు. గ్రామ ప్రజల సానుభూతి చాలావరకు ఇట్లాంటి (Dick Turpins) పై వుంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు... ఇరుపక్షాలలో వున్నది హిందువులు కాకపోతే పత్రికలలో చాలా అతిశయోక్తులువింటాము. (గవర్నర్ లెమిలెన్సీ ఇర్విన్‌కి 1930 డిసెంబరు7).

బీహారులోని శాసనోల్లంఘన బలం, పరిమితులు 1930 జూలై 21 పి.సి.సి రిపోర్టులో స్పష్టంగా వ్యక్తమయ్యాయి. "లాయర్ల నుండి విద్యార్థుల నుండి ఎలాంటి స్పందన లేదు." "ఉద్యమం పూర్తిగా గ్రామాలలో ప్రజల చేతుల్లో వుంది" పెద్ద జమీందారులు పాత జాతీయవాదియైన నూతనంగా నియమింపబడిన రాష్ట్ర నియంత వర్కింగు కమిటీ సభ్యత్వానికి సిఫార్సు చేయబడ్డారు. (ఎ.ఐ.సి.సి.జి/80/1930) అత్యధిక జమీందార్లు విధేయులుగా మిగిలిపోగా గాంధేయ నిర్మాణాత్మకమైన పనిద్వారా కాంగ్రెస్ చిన్న భూస్వాములు, శక్తివంతమైన నిర్మాణబద్ధమైన పునాదిని కాస్త సంపన్నులైన కౌలుదారులతో ఏర్పరచుకొన్నది (బీహార్ లో యిలాంటి వారు పెద్ద సంఖ్యలో వున్నారు)

బొంబాయిలో మధ్య ప్రావెన్స్‌లో చేలరేగిన మతతీవ్రత ఈసారిలేదు. సహాయ నిరాకరణ కాలంలో కంటె పరిస్థితులు చాలా మెరుగుయ్యాయని గవర్నర్ స్టీపెన్సన్ జూలైలో రిపోర్టు చేశారు. (సిమ్లా గవర్నర్ల సదస్సు రిపోర్టు సైక్స్‌పత్రాలతో చేర్చబడింది.) కాని కట్టుదిట్టంగాని ఉప్పు సత్యాగ్రహం (భౌతిక పరిస్థితులు అనుకూలించని) నుండి చాలా శక్తివంతమైన చౌకీదారు పన్ను ఆందోళనవైపు ప్రాధాన్యతని మారడంతో అధికారులు వెంటనే స్వరం మార్చడం ప్రారంభించారు.

జిల్లాలన్నీ చౌకీదారు పన్ను చెల్లించ నిరాకరించడంతో నవంబరు నాటికి దాదాపు 11000 జైలులో నిర్బంధింపబడినారు. విదేశీబట్టల మద్యం అమ్మకాలు నాటకీయంగా పడిపోయాయి. మోంఘీరికి చెందిన బార్హీలాంటి కొన్నిచోట్ల పాలనా యంత్రాంగం కుప్పకూలింది. (కాంగ్రెస్ - రాజ్యం జి. మెక్డోనాల్డ్) కాని చిన్న భూస్వాముల బలమైన సంబంధాలు గల ప్రావిన్సు నాయకత్వం ధరలుపడి పోవడంతో రైతులు నిరాశా నిస్పృహలకు గురువుతున్నపుడు పన్ను చెల్లింపురద్దు సమస్యని చేపట్ట నిరాకరించింది. బీహారులో 1829 నుండి స్వామి సహజనంద ఆధ్వర్యంలో స్వతంత్రంగా అభివృద్ధి చెందుతు వున్న కిసాన్‌సభ ఉద్యమం ఆ మరుసటి సంవత్సరం బహుళవర్ణ జాతీయైక్యతలో ముంచబడడంతో అదృశ్యమయ్యింది. శాసనోల్లంఘన ఉద్యమం 1933-34లో అణగారిన తరువాతనే ఆంధ్రా,అస్సాం నమూనాలో పునరుజ్జీవం పొందుతోంది. 1930 చివర, 1931 ప్రారంభంలో పోలీసు బృందాలపై జరిగిన వరుస దాడులతో బీహారులో కూడా అహింసపై గాంధేయ నిబంధనలు తొలిగిపోయాయి. డిసెంబరులో సరన్ గ్రామంలో చౌకీదారుపన్ను వ్యతిరేక ప్రదర్శన 27 రౌండ్ల కాల్పుల్ని ఎదుర్కొన్నది. ఆ తరువాత నెలలో స్వతంత్రదినాన చేగుసరాయ్‌వద్ద (మోంఘీర్) ఒక గుంపు సబ్ డివిజన్ ఆఫీసరుని గుంటలో పడిపోయేలా వెంటపడితరిమింది. 146 రౌండ్ల పోలీసు కాల్పులతో గుంపు చెదరగొట్టబడింది.

కాని బ్రిటీషు వారు కఠినంగా ఆస్తుల్ని జప్తు చేయడాన్ని అధిగమించి చిన్న భూస్వాములు, కౌలుదారులు ఎక్కువ కాలం దృఢంగా నిలబడలేకపోయారు. బీహార్ కాంగ్రెసు నాయకత్వం కూడా 1931 మార్చి ఒప్పందాన్ని ఆహ్వానించింది.

(congrees and the Ras and Mcdonold)

శాసనోల్లంఘనలోని రెండు దశల నమూనా యు.పిలో స్పష్టంగా కనిపిస్తుంది. 1930 అక్టోబరు జైలు వెలుపలి వున్నప్పటి అనుభవాలతో జవహర్‌లాల్ దీనిపై సంక్షిప్తంగా యిలా వ్యాఖ్యానించారు. నగరాల ప్రజలు, మధ్యతరగతి ప్రజలు హర్తాళ్ళు, ఉరేగింపులతో కాస్త అలసిపోయారు. కాని రైతుల నుండి ఉద్యమంగా కొత్త రకం రావాలి. నిల్వలు అక్కడ అధికంగా వున్నాయి. (స్వీయచరిత్ర పేజీ 232) మేధావుల భాగస్వామ్యం ప్రారంభం నుండి కూడా 1921 కంటె తక్కువ. వర్తకులు చూపిన అత్యుత్సాహం చాలా స్వల్పకాలికమైనది. కాని 1930 నుండి ధరలు విపరీతంగా పడిపోవడంతో గ్రామ ప్రాంతాల నుండి హింస అధికారాన్ని తిరస్కరించే వైఖరి పెరిగింది. పోలీసు ఇన్‌స్పెక్టరు జనరల్ 21 జిల్లాలు పర్యటించిన

తరువాత సెప్టెంబరు 3న పెద్ద ప్టటణకేంద్రం కాన్పూరు పరిస్థితి ఆందోళనకరంగా వుందని గ్రామాలలోని పరిస్థితి ప్రత్యేకంగా జాట్లు అధికంగా గల బులాద్‌షా –మీరట్ ప్రాంతం ప్రమాదకరంగా మారే అవకాశాలున్నాయని రిపోర్టు చేశాడు.

సహాయ నిరాకరణతో పోల్చితే అప్పటిలా గాక ఈసారి ముస్లింల భాగస్వామ్యం చాలా తక్కువ. ఇది పట్టణాలలో ఉద్యమాన్ని మరింత బలహీనపరిచింది. (యు.పి.పట్టణ జనాభాలో ముస్లింలు 37% మొత్తం ప్రావిన్సులో ముస్లిం జనాభా 14.5% అయినప్పటికీ) శాసనోల్లంఘన కేంద్రాల్ని ఎంపిక చేయడంతో ముస్లిం అధికంగా వుండే ప్రాంతాల్ని కాంగ్రెసు వదిలివేసింది. ముస్లిం బట్టల షాపుని పికెటింగ్ చేయడంతో 1931 ఫిబ్రవరిలో బనారస్‌లో పెద్ద ఘర్షణ జరిగింది. కాంగ్రెసు భగత్‌సింగ్ గౌరవార్ధం హర్తాళ్‌కి యిచ్చిన పిలుపు కాన్పూరులో పెద్ద ఎత్తున మతఘర్షణలకు దారితీసింది. దానిలో 290 మంది హతులయ్యారు. రెండు వైపులా పెద్ద ఎత్తున జన సమీకరణల్ని పరోక్షంగా ప్రోత్సహిస్తూ గత సంవత్సరం ధక్కాలో వున్నట్లే పోలీసులు మౌనంగా వుండిపోయారు.

శాసనోల్లంఘన యు.పిలో చాలా ప్రాంతాలలో గ్రామాలకు విస్తరించింది. కాంగ్రెసు సంస్థ గతంలో కంటె విస్తరించింది. క్రమశిక్షణాయుతమయింది. (జ్ఞాన్‌పాండే యు.పి.లో కాంగ్రెసు ఎదుగుదల పేజి 40) 1920 –21 నాటి అవుధ్ కిసాన్ తిరుగుబాటు అనుభవంతో బ్రిటిష్‌వారు కౌలుశిస్తు ఉద్యమాల పట్ల కొంత బెరుకుగా వున్నారు.

బీహారు వలెగాక యు.పి. నాయకత్వం అక్టోబరులో పన్ను చెల్లింపు నిరాకరణకు పిలుపునిచ్చింది. కౌలు చెల్లించవద్దని రైతులకు శిస్తులు చెల్లించవద్దని జమీందారుల్ని అర్థించింది. యు.పి. జమీందారులు బ్రిటిషువారికి విధేయులుగా వుంటూ వచ్చాయి. (1930 ఫిబ్రవరిలో లక్నోలో భూస్వాముల సదస్సు స్వతంత్ర తీర్మానాన్ని నిరసించింది) ఇక పది సంవత్సరాల క్రితం పాక్షిక విజయం సాధించిన పోరాట జ్ఞాపకాలతో ఉన్న రైతులు, గతంలో ఎన్నడూ లేనంతగా ధరలు పడిపోవడంతో నిగ్రహించుకోలేకపోయారు. కాని కాంగ్రెసు సంస్థకి రైతాంగ సమరశీలతకి మధ్య సందిగ్ధతతో కూడిన సంబంధం యు.పిలో స్పష్టంగా కొనసాగిందని ఉద్యమంలోని స్థానిక వ్యత్యాసాలపై జ్ఞాన్‌పాండే చేసిన అధ్యయనం స్పష్టం చేసింది. చాలాకొద్ది మంది జమీందారులు చిన్న భూస్వాములు ధనికరైతులు అధికంగా గల ఆగ్రాలో శ్రీకృష్ణ పాలివాల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ క్రమశిక్షణ వ్యక్తమయింది. బరౌడా, ఖిలాయోటి లాంటి గ్రామాలలో బార్డోలి నమూనా అనగా పన్నుల చెల్లింపు నిరాకరణ, పోలీసు చర్య సందర్భంగా గ్రామాల్ని వదిలివెళ్లడం భూస్వామ్య వ్యతిరేక ఆందోళనని, హింసని నివారించడం – వగైరాలను జయప్రదంగా అనుసరించడం జరిగింది. రాయబరేలిలో పెద్ద తాలూకాదార్లు అధికంగా వున్నారు. కేవలం 1.5 శాతం భూమి మాత్రమే ఆక్రమణ కౌలు రైతుల అధీనంలో వుంది. 1920 –21 కిసాన్ ఆందోళన వారి మనసుల్లో యిప్పటికే పదిలంగా వుంది. క్రింది నుండి ఒత్తిళ్లు పెరిగాయి. స్వరాజ్యంలో కౌళ్లు వుండవని ఒకవేళ వున్నా నామమాత్రంగా వుంటాయని కల్కాప్రసాద్ జూన్ నుండి ప్రచారం చేశారు. కాని 1931 నాటికి కల్కా ప్రసాద్ లాంటివారు

అదుపులో పెట్టబడ్డారు. గాంధీ – ఇర్విన్ ఒప్పందం తరువాత జిల్లాపై కాంగ్రెసు పట్టుబిగిసింది. తీవ్రమైన అణచివేతకు పాల్పడిన కొంతమంది భూస్వాముల హత్యలతో సహా హింసాయుతమైన తిరుగుబాట్లు 1931 మార్చి తరువాత జరిగాయి. కాని ఉద్యమ కాలంలో కాదు. అదే కాంగ్రెస్ సంస్థకి ఆందోళనలకి అంతగా సంబంధం లేని ప్రాంతాలలో జరిగాయి. ఉదాహరణకు అల్హాబాద్‌కి చెందిన కొన్ని తహసీల్ ప్రాంతాలలో ముస్లిం, భూస్వాములు హిందూ కౌలుదారులు వున్న ప్రాంతాలలోకి మత కలహాల ప్రమాదాన్ని గమనంలో పెట్టుకొని కాంగ్రెసు ప్రవేశించలేదు. బారాబంకిలో ఖాదీ లేదు. చరఖాలులేవు, కాని స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు 1931 మధ్య నుండి భూమి భగవంతుడిచ్చిన వరమని అది కేవలం జమీందారులకే చెందదని ప్రచారం చేశాయి. (జ్ఞాన్‌పాండే అధ్యాయాలు 6–7 అలాంటి నినాదానికి 1930 అక్టోబరులో కాంగ్రెసు ఆమోదముద్ర వేయడంతో యు.పిలో కాంగ్రెస్ పన్నుల వ్యతిరేక ఉద్యమాన్ని జయప్రదం చేసింది. కాని అఖిల భారత రాజకీయాలు ఒప్పందం కాలంలో సంయమనం పాటించమని రైతుల్ని అర్థించే విధంగా ఒత్తిడి చేశాయి. రైతుల దృష్టి కోణం నుండి చూస్తే యిది రైతులు కోలుకోలేని దెబ్బ.

ప్రాంతీయ వ్యత్యాసాలున్నప్పటికి 1930 మధ్యకాలం నుండి ఉద్యమ తీవ్రత తగ్గుముఖం పట్టింది. బూర్జువా గ్రూపులతో సంపన్న రైతులతో కలసి చేసే పోరాటాల రూపాలు బలహీనపడ్డాయి. అదే సమయంలో అదుపులో లేని పోరాట రూపాలు (కౌలు రద్దు, తెగల తిరుగుబాట్లు ప్రజాహింస) విస్తృతి పెరిగింది. అలాంటి పరిస్థితిలో అదుపులో వుండే ప్రజల భాగస్వామ్యంపై విశ్వాసం గల గాంధేయ నాయకత్వం అలాగే లాభనష్టాల్ని బేరేజు వేసుకొనే మనస్తత్వం కలిగి రైతులు కోరే సమూలమైన మార్పుల పట్ల భయాన్ని పెంచుకొన్న వాణిజ్య నాయకులు ఏదో రకమైన రాజీ పరిష్కారానికి ప్రతిపాదనలు చేయడం సహజం. లండన్‌లో మొదటి రౌండు టేబులు సమావేశం (1930 నవంబరు –1931 జనవరి) పరిణామాలు రాజీ అవకాశాల్ని కలిగించేలా వున్నాయి.

## రౌండు టేబులు సమావేశం

ఒకవైపు వేలాది మంది భారతీయులు లాఠీల్ని, తూటాల్ని ఎదుర్కొంటున్నారు. ఆస్తుల్ని కోల్పోతున్నారు. జైళ్లలో కుక్కబడుతున్నారు. అదే సమయంలో ప్రజలకు ప్రాతినిధ్యం వహించని వేళ్లమీద లెక్కించతగినంత కొద్దిమంది బహాళపార్టీ బ్రిటిషు ప్రతినిధులతో రాజ్యాంగంపై చర్చించేందుకు లండన్ వెళ్లారు. కాంగ్రెసు దూరంగా వుండిపోయింది. హోమీ మోడి తప్ప యితర ప్రముఖ వాణిజ్య నాయకులలో అత్యధికులు దూరంగా వున్నారు. ముస్లిం రాజకీయ నాయకులు (మహమ్మద్ ఆలి, మహమ్మద్ షంషి, ఆగాఖాన్, ఫజల్‌హక్, జిన్నా, ఫజార్న్‌హుస్సేన్ (తెర వెనుక వుండి ప్రభావితం జేయగల వైస్రాయి కార్యనిర్వాహక సభ్యుడు) హిందూ మహాసభ నాయకులు (మూన్జీ జయకర్) ఉదారవాదులు (సప్రూ, చింతామణి, శ్రీనివాసశాస్త్రి) స్వదేశీ సంస్థాన ప్రతినిధులు చర్చలకు వెళ్లినవారిలో వున్నారు.

భారతదేశంలో ఉప్పొంగిన ప్రజావెల్లువ 1930 మే నాటి సైమన్ కమీషన్ రిపోర్టు కొన్ని అత్యవసర అధికారులు గవర్నర్లుకు రిజర్వుచేస్తూ రాష్ట్రాలలో ద్వంద్వ ప్రభుత్వాల స్థానంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని వాగ్ధానం చేసింది. కేంద్రప్రభుత్వంలో ఎలాంటి మార్పుని సూచించలేదు. అమలుని అసాధ్యం చేసింది. రిపోర్టులో ఎక్కడ కూడా అధినివేశ ప్రతిపత్తి ప్రస్తావన లేకపోవడంతో రిపోర్టు ప్రజల ఆగ్రహాన్ని రెచ్చగొడుతుందని ఇర్విన్ లెడ్జివుడ్‌తో జూన్ 9న అనధికార సంభాషణలో అంగీకరించారు. కేంద్రంలో మార్పు కొరకు ఏదో ఒకరకమైన వాగ్దానం అవసరం. స్వదేశీ సంస్థానాలతో కూడిన సమాఖ్య ఆలోచన బ్రిటీషువారికి దేవునిచే పంపబడిన ఆలోచనగా వచ్చింది. సంస్థానాధీశులచే నామినేట్ చేయించిన ఎక్కువ మంచి సభ్యులు గల ఫెడరల్ అసెంబ్లీ బ్రిటీషు పరిపాలన కనుకూలంగా వుంటుంది. అందుకే 1931 జనవరి 19న సదస్సు ముగింపు సందర్భంగా ప్రధానమంత్రి చట్ట సభకి బాధ్యతవహించే కార్యనిర్వాహక వర్గాన్ని సూత్రరీత్యా బ్రిటిషు ప్రభుత్వం అంగీకరిస్తుంది" అని ప్రకటన చేశారు. ఈ ఆలోచన సంస్థానాధీశుల నుండి ప్రత్యేకించి హైదరాబాద్, మైసూర్ దివానులు (అక్బర్ హైదరీ, మార్జా ఇస్మాయిల్) నుండి వచ్చింది. తొలుత బ్రిటీషు రాజప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ డెరెన్స్‌హెల్. కేయోను హైదరాలీకి చెప్పి ఒప్పించారు. దీనిని మాల్కం హెయిలీ లాంటి బ్రిటిషు రాజకీయునాయుకులు, లేబర్ పార్టీకి చెందిన సెక్రటరీ ఆఫ్ స్టేట్ హెడ్జవుడోబెన్ అందిపుచ్చుకొన్నారు. భారతదేశ సంస్థానాధీశులు బలహీనమైన కేంద్రం పట్ల ఆసక్తిగా వున్నారు. వారి ప్రవేశంతో అసెంబ్లీ ప్రజాస్వామ్య విరుద్దంగా ప్రత్యేకించి ప్రజలు అభినివేశ ప్రతిపత్తి కొరకు ఒత్తిడి చేస్తున్న సమయంలో ప్రజాస్వామ్య విరుద్ధంగా వుండడానికి తోడ్పడుతుంది. హిందూ మెజారిటీ పాలనకు అవకాశాలు ఉండడంతో సంస్థానాధీశులు, ముస్లింరాజకీయవేత్తలు ఆందోళన జెందారు. అంతేగాక బ్రిటిషువారు బాధ్యతాయుత ప్రభుత్వ వాగ్ధానాన్ని రక్షణ, విదేశీ వ్యవహారాలు, విత్త, ఆర్థిక అదుపు లాంటి కీలక రంగాలలో రిజర్వేషన్లు రక్షణలు ప్రవేశపెట్టి మెక్డోనాల్డ్ తన జనవరి 19 ఉపన్యాసంలో స్పష్టంచేసిన విధంగా తమ కనుకూలంగా మార్చుకొన్నారు. వివరాలు రూపొందించడానికి 5 సం॥కాలం పట్టే ఈ పథకం పలు కారణాల రీత్యా ఆమోదం పొందింది. ఇది బ్రిటిషు సార్వభౌమాధికారాన్ని తగ్గిస్తుందని సంస్థానాధీశులు ఆశించారు. కేంద్రం బలహీనంగా వుంటారని ముస్లింలు భావించారు సప్రూ లాంటి ఉదారవాదులు బాధ్యతాయుతమైన కేంద్రం పట్ల ఆకర్షితులయ్యారు. బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఆమోదించి బ్రిటిషు అదుపుని నిలబెట్టుకోవచ్చని బ్రిటిషు రాజకీయవేత్తలు భావించారు.

(R.j.Moove union of Indian unity page 153)

బ్రిటిషు వారికి అనుకూలంగా జరిగిన మరొక పరిణామం సదస్సు యొక్క మైనారిటీ కమీషన్ ఒక ఒప్పందానికి రావడంలోని విఫలమవడం అందుకు ప్రధాన బాధ్యులు సిక్కు ప్రతినిధులతో పాటు హిందూ మహాసభ నాయకులు మూన్జే, జయకర్‌లు. 1927 రాజీ ప్రతిపాదనయైన ముస్లింలకు రిజర్వుడు సీట్లతో ఉమ్మడి నియోజకవర్గాలు ప్రాతిపదిక జిన్నా, షఫీ, ఆగాఖాన్‌లు సప్రూ గ్రూపు ఉదారవాదులతో దాదాపు ఒక అంగీకారానికి రాగలిగారు. కాని 1928 –29 లో లాగానే పంజాబు, బెంగాల్‌లో ముస్లిం రిజర్వేషన్లను మహాసభ

వ్యతిరేకించింది. ఇది రెండు గ్రూపుల మధ్య సయోధ్యపొసగని అంశం. ఇక పంజాబు సీట్లలో 30% తమకు కేటాయించాలని సిక్కులు కోరారు. (వారు జనాభాలో 11 శాతం అప్పటికే 19.1 ప్రాతినిధ్యం కలిగివున్నారు. ఇక పంజాబులో బెంగాలులో ముస్లిం మెజారిటీగా వున్నారు. గనుక వారికి అక్కడ రిజర్వేషన్ల అవసరం లేదన్న మహాసభ వాదనకు మహమ్మద్ ఆలీ సార్వత్రిక ఓటింగు ప్రవేశపెట్టబడలేదు గనుక ఆ రెండు ప్రావిన్సులలో ముస్లింల సంఖ్యారీత్యా కొద్దిగా ఎక్కువ వున్నప్పటికి సంఖ్యరీత్యా పొందే ఆధిక్యత పంజాబుని హిందూ వ్యాపారులు బెంగాల్‌లోని హిందూ జమీందారులు సామాజిక ఆధిక్యతతో సరితూగదని, సముచితరీతిలో అర్థించి ఒప్పించు యత్నించారు. కాని జయకర్, మూన్జీలు ఒక్కఅంగుళం కూడా దిగి రావడానికి సిద్ధపడలేదు. ఆ విధంగా పై స్థాయిలో ఐక్యతా ప్రయత్నాలు విఫలమయ్యాయి.

**గాంధీ - ఇర్విన్ ఒడంబడిక**

ఉదారవాద ప్రతినిధులు, వారి వైఖరి కనుగుణంగానే రౌండు టేబుల్ సదస్సుని గణనీయమైన విజయంగా చెప్పయత్నించారు. లండన్ నుండి తిరిగివచ్చి కాంగ్రెసు నాయకుల్ని (జనవరి 26న విడుదల చేయబడ్డారు.) రాజీకి అంగీకరించవలసిందిగా అర్థించారు. సప్రూ, జయకర్‌లు 1930 సంవత్సరమంతా రాజీకి అంగీకరించవలసిందిగా కోరుతూనే వున్నారు. కాని విజ్ఞప్తులు యరవాడ వద్ద తిరస్కరించబడ్డాయి. గాంధీ యొక్క తొలిస్పందన ఈసారి కూడా ప్రతికూలంగా వుంది. మేక్డొనాల్డ్ ప్రకటన మనకేదోయిస్తుందని నేను నమ్మడం లేదు. గాంధీ జనవరి 31న ప్రకటించారు. ఆయన బహిరంగ ప్రకటనలు గాని ఉత్తర ప్రత్యుత్తరాలు గాని ఫిబ్రవరి 11న వరకు ఒప్పందానికి వచ్చే అవకాశాలపై నిరాశావాదులుగానే వున్నారు. కాని ఫిబ్రవరి 14 (వైస్రాయితో ఇంటర్వ్యూ కోరుతూ గాంధీ లేఖ పంపిన రోజు) నుండి వెనుకంజ వేయడం ప్రారంభం అయింది. ఢిల్లీలో వైస్రాయితో చర్చలలో వెనుకంజ వుంది. ఇర్విన్ ప్రతిపాదించిన ఫెడరేషన్ భారతీయుల బాధ్యత రిజర్వేషన్ల రక్షణలు గాంధీ వెంటనే అంగీకరించారు. మార్చి 5 నాటి ఢిల్లీ ఒడంబడికలో క్లాజు 2 భవిష్యత్ చర్చలకు గల అవకాశాన్ని మొదట రౌండ్ టేబుల్ సదస్సులోని పథకాన్ని ముడిపెట్టింది. విదేశీ వ్యవహారాలు రక్షణ మైనారిటీల స్థితి భారతదేశ ఆర్థికపరమైన అప్పులు వగైరాలకు వర్తించే విధంగా రిజర్వేషన్ల రక్షణలు సూత్రీకరించబడ్డాయి. శాసనోల్లంఘన, ఖైదీల విడుదల చేయబడ్డాయి. కాని భగత్‌సింగ్ ప్రాణాన్ని రక్షించడానికి తగు ప్రయత్నాలు జరుగలేదు.

ఉప్పుపై రాజకీయేతర స్వదేశీ ప్రచారంపై నామమాత్రపు రాయితీలు పొందారు. అయినప్పటికీ సుదీర్ఘమైన చర్చలు జరిపిన తరువాత సైతం పోలీసుల అత్యాచారాలపై విచారణ జరిపించాలని, స్వాధీనం చేసుకొని మూడవపార్టీకి అమ్మిన భూముల్ని తిరిగియిచ్చి వేయాలని గాంధీ స్వయంగా చేసిన డిమాండ్లను వదులుకొన్నారు. చర్చలలో పొందింది తక్కువ, కోల్పోయింది చాలా ఎక్కువ. 1930 సంవత్సరమంతటా కాంగ్రెస్ మాటిమాటికి "సాధించేదాకా పోరాటం" అని చేసిన ప్రకటనలు కరుకుదనం కోల్పోయాయి. ఇది లోకపు తీవ్ర పొలికేకగా కాక కూనిరాగంగా ముగిసింది. (స్వీయ చరిత్ర పేజి 259)

గాంధీ వైఖరిలో మార్పుకు ఉదారవాద నాయకుల (వ్యక్తిగతంగా గౌరవనీయులు కాని ప్రజల మద్దతు లేనివారు) ఒత్తిడి మాత్రమే కారణం కాదు. ఇర్విన్ మాంత్రిక శక్తికి గాంధీ లొంగిపోయాడనడం కూడా హాస్యాస్పదం. మొదటి రౌండ్ టేబుల్ సదస్సులో కేంద్ర, అసెంబ్లీ ఫెడరల్ ప్రభుత్వం దానిలో స్వదేశీ సంస్థానాలకు ప్రముఖ స్థానం కల్పించడం, రిజర్వేషన్ల రక్షణలు పరిష్కరించబడని మరో వివాదం, వగైరాలలో కేంద్రంలో బాధ్యతాయుత ప్రభుత్వ వాగ్దానానికి ఆకర్షితుడయ్యాడనడం కూడా అర్థరహితం. వాణిజ్య వర్గాలు కీలకమైన పాత్ర పోషించాయనడానికి ఆధారాలున్నాయి. మంత్రివర్గం నుండి కొంత వ్యతిరేకత, మాంద్యంచే ప్రభావితమైన లాంక్‌షైర్ నిరసనలు వ్యక్తమైనప్పటికి ఫిబ్రవరి నెల ప్రారంభంలో నూలుబట్టల దిగుమతులపై 5% సర్‌ఛార్జి విధించబడింది. ఈసారి బ్రిటిషేతర దిగుమతులపై అదనపు ఛార్జీలను వసూలు చేయలేదు. రాజకీయ కారణాల రీత్యా సామ్రాజ్యవాద ప్రాధాన్యతని ప్రక్కనపెట్టింది. బొంబాయి గవర్నర్ ఫిబ్రవరి 7న "గాంధేయ అనుచరులు చాలామంది ప్రత్యేకించి వాణిజ్య వర్గానికి చెందినవారు. అతడు హేతుబద్ధమైన వైఖరి చేపట్టకపోతే అతణ్ణి అధిగమించిపోవాలనుకుంటున్నాయి అని వైస్రాయికి రిపోర్టు చేశాడు.

పురుషోత్తమ దాస్ వాణిజ్యపరమైన ఒత్తిడి పెంచేందుకు ఫిబ్రవరి 11న గాంధీని అలహాబాద్‌లో కలవబోతున్నాడని ఇర్విన్ వెడ్జివుడ్‌బెన్‌కి తెలియజేశారు. చర్చల సందర్భంగా పురుషోత్తం రాజ్ ఢిల్లీలో వుండి గుజరాత్ భూస్వాధీనంలో యిమిడి వున్న చివరి అవరోధాన్ని పరిష్కరించడంలో మార్చి 4న సహాయపడ్డాడు.

బిర్లా సన్నిహిత సహచరుడు డి.పి. ఖైతాన్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కలకత్తా సదస్సులో అధ్యక్షోపన్యాసం చేస్తూ "గౌరవప్రదమైన పరిష్కారానికి గల అవకాశాల్ని పరిశీలించే సమయం వచ్చిందని మహాత్మాగాంధీకి, కాంగ్రెస్‌కి చెప్పాం". మాకు శాంతి కావాలి, తేదీలు అలా ఏకీభవించడం గమనార్హం.

## మార్చి - డిసెంబర్ 1931 : పొసగని తాత్కాలిక సంధి

1931 మార్చి నాటికి, పెద్ద ఎత్తున ఎదురుదాడి జరిపి కాంగ్రెస్ రెండవ శాసనోల్లంఘనం చేపట్టడం అనివార్యం చేసిన 1932 జనవరి నాటికి మధ్య జరిగిన ఘటనల క్రమాన్ని ప్రధానంగా గాంధీ – ఇర్విన్ ఒడంబడిక పర్యవసానాలు నిర్ణయించాయి.

కరాచీ కాంగ్రెస్ ప్రారంభానికి ముందు మార్చి 23న భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురుల ఉరితీత సమూలమైన మార్పులు గోరే జాతీయవాద ఆగ్రహావేశాలను పెంచాలి. నవ్ జవాన్ భారత సభ కరాచీ రైల్వే స్టేషన్ వద్ద గాంధీకి వ్యతిరేకంగా ప్రదర్శన నిర్వహించింది. అయినప్పటికి కరాచీ కాంగ్రెస్ సదస్సు గాంధీని విమర్శించలేదు. ఇది వామపక్షవాదుల బలహీనతలనే వ్యక్తం చేసింది. జవహర్‌లాల్ నెహ్రూ అక్టోబర్ నుండి జనవరి వరకు జైలులో వున్న కాలాన్ని వ్యవసాయ కార్యక్రమాన్ని, 1930లలో వామపక్ష జాతీయవాద వ్యూహంలో ప్రధానమైన రాజకీయ నినాదంగా వున్న రాజకీయ అసెంబ్లీని రూపొందించడంలోను నిమగ్నమయ్యాడు. ఢిల్లీ ఒడంబడిక తరువాత కొన్ని రాత్రులు నిద్రపట్టలేదు. తరువాత గాంధీకి సులభంగా లొంగిపోయాడు. కరాచీ కాంగ్రెస్‌లో

ఒడంబడికకి ఆమోదాన్ని కోరే ముఖ్యమైన తీర్మానాన్ని ప్రతిపాదించడానికి అంగీకరించారు. బహుశా మోతీలాల్ మరణం (ఫిబ్రవరి 6) గాంధీపై మానసికంగా ఎక్కువగా ఆధారపడేలా చేసి వుండవచ్చు. అంతేగాక మహాత్ముడితో పోల్చుకుంటే తన పరిమితులు తనకు తెలుసు. ఆ తరువాత 5 సంవత్సరాలకు ప్రచురించిన స్వీయ చరిత్రలో ఢిల్లీ ఒడంబడికపై చర్చ తరువాత 'భారతదేశ రైతాంగ ప్రతినిధి'గా గాంధీపై ప్రశంస వుంది. ఢిల్లీ ఒడంబడికపై యితర విమర్శకులు చేసిన ప్రసంగాలలో కూడా నిరాశా నిస్పృహలు వ్యక్తమయ్యాయి. ఆ తరువాత కాలంలో ప్రముఖ సోషలిస్టు నాయకుడు కానున్న యూసుఫ్ మెహరాలి 'రాజీ రాజకీయాల్ని' , 'మనసు మార్పుని' నిర్ద్వంద్వంగా నిరసించాడు. 'బిర్లాలు, పురుషోత్తందాస్, ఠాకూర్‌దాస్‌లు, వాల్‌చంద్ హీరాచంద్‌ల, హుస్సేన్ భాయ్, లాల్జీల లాంటి యితరుల త్యాగఫలాన్ని పొందేందుకు తీరికలేని ప్రయత్నాలు సాగిస్తున్న వారిపై తీవ్రంగా దాడి చేశాడు. కాని ముగింపు చాలా పేలవంగా వుంది. 'రౌండ్ టేబుల్ సదస్సు విఫలమవుతుంది గనుక గాంధీ మరలా పోరాడటానికి పిలుపివ్వాలి. పోరాటం చేసేవారికి అవకాశం లభిస్తుంది. 'పోరాటం పిలుపు కొరకు మనం ఓపికగా నిరీక్షించాలి. ఇంక్విలాబ్ జిందాబాద్.

కరాచీ సదస్సు ప్రాథమిక హక్కులపై వామపక్ష వాదుల్ని సంతృప్తి పరచడానికని వ్యాఖ్యానించబడే ఆర్థిక విధానంపై తీర్మానాన్ని ఆమోదించింది. దీనిలో ఎం.ఎన్.రాయ్ హస్తముందని అధికారులు కొందరు అనుమానించారు. తీర్మానంలో కొన్ని భాగాలు రష్యా నమూనాలో ప్రభుత్వాన్ని మార్చే విధంగా వున్నాయని అంబాలాల్ సారాభాయ్ ఫిక్కీ సభ్యులకు పంపిన సర్క్యులర్ నోట్‌లో పేర్కొన్నాడు. (వాల్‌చంద్ హీరాచంద్ పత్రాలు ఎఫ్.ఎన్. 8 (ii)

కాని కరాచీ తీర్మానంలోని 20 అంశాలలో సోషలిజం దాదాపు ఏమీ లేదు. 20 అంశాలలో సాధారణ ప్రజాస్వామ్య డిమాండ్లు (పౌర హక్కులు, చట్టపరమైన సమానత, వయోజన ఓటింగ్ హక్కు, ఉచిత ప్రాథమిక విద్య, ప్రభుత్వ విధానంగా మతపరమైన తటస్థత) 1930 నాటి గాంధీ 11 అంశాలలో కొన్ని, కార్మికులకు కొన్ని వాగ్దానాలు బ్రతకడానికి వీలైన వేతనాలు, బలవంతపు చాకిరి రద్దు, కార్మిక సంఘ హక్కులు మొదలగునవి). ముఖ్యమైన పరిశ్రమలు, ఖనిజ వనరులపై ప్రభుత్వ అదుపుకి సంబంధించిన అస్పష్టమైన పదజాలంతో వ్యవసాయ మార్పుకి సంబంధించిన కార్యక్రమంగా అన్నీ కలగాపులగంగా వున్నాయి. భూమి శిస్తు కౌళ్లలో గణనీయమైన తగ్గింపులు వుంటాయని వాగ్దానం చేయబడింది. చాలా కీలకమైన సమస్యయైన గ్రామీణ రుణభారం ప్రస్తావన లేదు. భూస్వామ్య విధానం రద్దు చేయడం గాని, భూపంపకం చేపట్టే ఉద్దేశంగాని లేనేలేవు.

1922 ఫిబ్రవరిలో లాగానే కరాచీ కాంగ్రెస్ గాంధీకి విధేయత ప్రకటించింది. ఇది నాయకుని యొక్క బలహీనతలకు గాక మొత్తం ఉద్యమం యొక్క ప్రాథమిక బలహీనతలకు సూచన. శాసనోల్లంఘన చెల్లాచెదురుగా వున్న అంతర్గత శక్తుల వ్యక్తీకరణగా నిలుస్తుంది. కాని ప్రత్యామ్నాయ నాయకత్వం ఆవిర్భవించలేదు. అలాంటి నాయకత్వం లేకపోవడంతో

గ్రామీణ సమరశీలత ఆకస్మికమైనదిగా చెదురు మదురుగా సమన్వయం చేయబడనిదిగా గ్రామీణ గాంధీల నాయకత్వంలో పరిమితమైన దృక్పథం గలదిగా మిగిలిపోయింది. 1928-29 నుండి కార్మిక సంఘాల నిర్మాణం, సమరశీలత విపరీతంగా క్షీణించాయి. మీరట్ అరెస్టులతో బలహీనపడిన కమ్యూనిస్టులు వామపక్ష పాక్షికవాద దశలో వుండిపోయారు. వారు వామపక్ష జాతీయవాదంపై దృష్టి కేంద్రీకరించారు. 1930 ఏప్రిల్‌లో సామ్రాజ్యవాద వ్యతిరేక లీగు నుంచి నెహ్రూని బహిష్కరించారు. బోసుతో 1931 జూలైలో ఎఐటియుసి కలకత్తా సదస్సులో రెండవ చీలిక తెచ్చేవరకు పోట్లాడారు. శాసనోల్లంఘనకు దూరంగా వుండిపోయారు. వారిలో వారు పోట్లాడుకోవడానికి శక్తినంతా ఉపయోగించారు.

ఒడంబడిక స్పష్టమైన సోషలిస్టు సంబంధాలు గల వారినే గాక యితరులను కూడా నిరుత్సాహపరిచింది. 1928 నాటి బార్డోలి విజయానికి పూర్తిగా భిన్నంగా శిస్తులు పన్నులు తగ్గించబడలేదు. ఖేదాకి చెందిన పటేదార్లు ఒప్పందాన్ని నమ్మకద్రోహంగా పరిగణించారు. పోలీసుల లాఠీల కంటే ఒప్పందం పటేదార్ల నైతిక స్థైర్యంపై దెబ్బతీసింది. (హార్డిమన్, ఖేదా జిల్లాలో రైతు ఆందోళనలు పేజీ 289) బ్రియాన్ స్టుడార్ట్, జ్ఞాన్ పాండేలు కూడా కోస్తా ఆంధ్ర, యుపిలపై అలాంటి నిర్ణయాలకే వచ్చారు. రెండు ప్రాంతాలు పూర్తి స్థాయి శిస్తు పన్నుల నిరాకరణకు 1931 చాలా అనుకూలమైన సంవత్సరం. ఆర్థిక మాంద్యం నెలకొని వుంది. మరొకవైపు ఒడంబడికను గౌరవించేందుకు కాంగ్రెస్ 9 మాసాలుగా రైతుల్ని ఉద్యమానికి దూరంగా వుంచింది. ప్రభుత్వ అణచివేత విధానాల కంటే గాంధీ ఇర్విన్ ఒడంబడిక ఆంధ్ర కోస్తా జిల్లాలలో కాంగ్రెస్ పట్టుని సడలింప చేసింది. (కాంగ్రెస్ రాజ్యంలో స్టుడార్ట్ పేజీ 121-2)

అలాగని గాంధీ ఇర్విన్ ఒడంబడిక పూర్తిగా ప్రతికూల ఫలితాల నిచ్చిందని చెప్పడం కూడా సంక్లిష్టమైన వాస్తవాన్ని అతిగా తగ్గించి చెప్పడమవుతుంది. గాంధీ సాధించిన రాయితీలు జాతీయవాద ప్రయోజనాలు చాలా స్వల్పమే. అయినప్పటికి వైస్రాయి జాతీయ నాయకుణ్ణి సాదరంగా సమానుడిగా పరిగణించి చర్చలు జరపక తప్పలేదు. దీనికి ఆలోచనాపరంగా, భావపరంగా చాలా ప్రాధాన్యత వుంది. జైలు నుండి విడుదలైన ఒక సాధారణ కార్యకర్త తన పట్టణానికి గాని, గ్రామానికి గాని ఒక విజేతలాగా తిరిగి వచ్చాడు. 1922లో నిరాశా నిస్పృహలకు గురయిన కాంగ్రెస్ కార్యకర్త మానసిక స్థితికి యిది పూర్తిగా భిన్నమైనది. బార్డోలి వెనుకంజ తర్వాత కాంగ్రెస్ సంస్థ దాదాపు కుప్పకూలిపోయింది. 1931లో చాలా ప్రాంతాలలో పార్టీ యంత్రాంగం గణనీయంగా విస్తరించింది. ఉదాహరణకు 1931 మే నాటికి యుపిలోని రాయ్‌బరేలి జిల్లాకి 32 కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు, 8040 మంది సభ్యులు, 1308 మంది వలంటీర్లు వున్నారు. 1019 గ్రామాలలో కాంగ్రెస్ జెండాలు ఎగురుతున్నాయి. (జ్ఞాన్‌పాండే పేజి 41) అంతకంటే ప్రాధాన్యత గల అంశం. ఆర్థికపరమైన ఒత్తిళ్ళు, సాధారణ కాంగ్రెస్ కార్యకర్త యొక్క పెరిగిన నైతిక స్థైర్యం, సమూలమైన మార్పులు తెచ్చే కార్యక్రమాల్ని చేపట్టేందుకు కాంగ్రెస్ విముఖత, కాంగ్రెస్ నాయకత్వం పట్ల ఒక మేరకు తొలగిన భ్రమలు అన్నీ కలగలిసి క్రింది నుండి పలురకాల ఒత్తిళ్ళను పెంచాయి. ఒడంబడిక నిష్ప్రయోజనమైనదని తేల్చి చెప్పాయి. పెద్ద ఎత్తున అధికారుల రహస్య ఎదురు దాడి ప్రయత్నాలకు ప్రేరణనిచ్చాయి.

## క్రింది నుండి ఒత్తిళ్ళు

బెంగాల్‌లోని విద్యావంతులైన యువకులకు గాంధేయ అహింసావాదంపై గల భ్రమల్ని ఢిల్లీ ఒడంబడిక తొలగించింది. 1931లో గతంలో ఎన్నడూ లేనంత తీవ్ర స్థాయిలో టెర్రరిజం విజృంభించింది. 9 హత్యలు (ఇద్దరు జిల్లా మేజిస్ట్రేట్లు - ఏప్రిల్‌లో మిడ్నాపూర్‌కి చెందిన పెడ్డీ, డిసెంబర్‌లో తిప్పెరికి చెందిన స్టీవెన్స్)తో సహా 92 హింసాయుత ఘటనలు జరిగాయి. స్టీవెన్స్ యిద్దరు పాఠశాల విద్యార్థినులు - శాంతి, సునీతి చౌదురిలచే హత్య చేయబడ్డాడు. విప్లవోద్యమంలో మహిళలు నూతన స్థాయి భాగస్వామ్యానికి ఈ బాలికలు నాంది పలికారు. టెర్రరిజం కేవలం పట్టణాలకే పరిమితం కాలేదు. మేలో చిట్టగాంగ్‌లోని 52 గ్రామాలు కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించబడ్డాయి. భయాందోళనలకు గురైన బ్రిటిష్ ప్రభుత్వం పరమ కిరాతకమైన అణచివేత చర్యల్ని చేపట్టింది. చిట్టగాంగ్ పట్టణంలో 16-25 వయో పరిమితి గల హిందూ కులీన యువకులపై రాత్రి పూట కర్ఫ్యూ విధించబడింది. సెప్టెంబర్ 16న హిజ్లీ జైలులోని డిటెన్యూల్ని కాల్చి చంపింది. రవీంద్రనాథ్ ఠాకూర్ జాతీయవాద రాజకీయాలకు దూరంగా వున్నప్పటికి, టెర్రరిజం పట్ల ఆయనకు తీవ్రమైన వ్యతిరేకత వున్నప్పటికి ఈ ఘటన తరువాత కలకత్తా నిరసన సభలో ఆయన ప్రసంగించారు. టెర్రరిస్టు సానుభూతిపరుల్ని విచక్షణారహితంగా అరెస్టు చేయడాన్ని అనుమతిస్తూ అక్టోబర్ 29న ఒక ఆర్డినెన్స్ జారీ చేయబడింది. ఈ కాలంలో వాయువ్య సరిహద్దు ప్రావిన్సులో ఖుదాయ్ ఖిద్మగార్ల పెరుగుదల, అది కాంగ్రెస్‌లో 1931 ఆగస్టులో భాగమవడంతో కాంగ్రెస్ మార్చి ఒడంబడికను ఉల్లంఘిస్తున్నదని అధికారుల ఆరోపణలు మొదలయ్యాయి.

ధరలు రికార్డు స్థాయిలో పడి పోవడంతో (యుపిలో టోకు ధరల సూచిక 1901-05లో 100గా తీసుకుంటే 1929లో 218 వుండగా 1930లో 162కి 1931లో 112కి పడిపోయింది. (పాండే పేరు 160) గ్రామీణ అసంతృప్తి పెరిగింది. శిస్తులు, కౌళ్ళు, గ్రామీణ రుణభారం భరించరాని స్థితికి చేరుకొన్నాయి. ఫలితంగా బ్రిటిష్‌వారికి కాంగ్రెస్ అనుసరించి నిర్ణయించిన రాజీ విధానానికి తీవ్రమైన ముప్పు ఏర్పడింది. ఖేదా బార్డోలిలలో జప్తు చేయబడిన పొలాల్ని కొన్నవారు, కొత్తగా నియమింపబడిన గ్రామాధికారులు సాంఘిక బహిష్కరణకు గురయ్యారు. మే నుండి శిస్తు వసూళ్ళు తగ్గిపోయాయి. గుజరాత్ గ్రామీణ పునాది చాలా కీలకమైనది గనుక గాంధీ మార్చి నుండి రెండవ రౌండ్ టేబుల్ సమావేశానికి ఆగస్టు 29న వెళ్ళేవరకు మధ్య గల కాలంలో ఎక్కువ భాగాన్ని ఈ రెండు జిల్లాలలోనే గడిపాడు. గుజరాత్‌లో పరిస్థితులు చక్కబెట్టకపోతే తన లండన్ ప్రయాణాన్ని రద్దు చేసుకుంటానని బెదిరించాడు. విల్లింగ్టన్‌తోను, హోం సభ్యుడు యమర్సన్‌తోను సిమ్లాలలో చర్చలు జరిపి సమస్యలపై విచారణ కమిటీని నియమింపచేశారు.

యుపి గ్రామీణ పరిస్థితి అదుపు చేసేందుకు అనుగుణంగా లేదు. జమిందారులకు, రైతులకు మధ్య కాంగ్రెస్ మధ్యవర్తిత్వం నెరప యత్నించింది. కౌలు తగ్గింపు కొరకు దరఖాస్తుల్ని స్థానిక కాంగ్రెస్ కార్యాలయాలకు పంపించవలసిందిగా రైతుల్ని కోరింది. అలా చేయడం

ప్రభుత్వానికి సమానాంతర సంస్థల్ని నిర్వహించడంలా భావించి అధికారులు వ్యతిరేకించారు. ఆక్రమణదారులు కాని కౌలు రైతులు రూపాయికి 8 అణాలు ఆక్రమణ కౌలు రైతులు రూపాయికి 12 అణాలు చెల్లించవలసిందిగా గాంధీ మే 24న ఒక ప్రకటన చేశాడు. ఈ విజ్ఞప్తి సారాంశం వ్యవసాయంలో సమూలమైన మార్పుల్ని వ్యతిరేకించేదిగా వుంది. జమిందార్లకు 'తాలూకాదార్లకు ఎలాంటి కౌలు చెల్లించనవసరం లేదనే సలహా యిప్పటికే చేరి వుంటే దానిని పాటించవద్దని హెచ్చరిస్తున్నాను.' రైతులు గాంధీ సూచించిన కనిష్ట చెల్లింపుల్ని ఆపివేస్తున్నారని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు పుట్టుకొస్తున్నారని, అందరూ కాంగ్రెస్ పేరు వాడుకుంటున్నారని, వ్యవసాయ రంగంలో సమూలమైన మార్పుల్ని ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఉదాహరణకు రాయబరేలిలో కల్కా ప్రసాద్, అంజనీ కుమార్‌లు కౌలు చెల్లించని రైతుల్ని పొలాల నుండి ఖాళీ చేయించినందుకు నిరసనగా రాజా సియోఘర్ ఇంటి ముందు పికెటింగ్ చేశారు. ఆసక్తికరమైన విషయమేమంటే సియోఘర్ ఖాదీ విద్యాలయాన్ని స్థాపించారు. జవహర్‌లాల్‌కు అత్యంత సన్నిహితుడైన స్థానిక కాంగ్రెస్ నాయకుడు సీతాలా సహాయ్ భార్యని టీచర్‌గా నియమించాడు. (హోం పొలిటికల్ 33/24/1931). కాంగ్రెస్ రెచ్చగొట్టిందని అధికారుల ఆరోపణలు వున్నప్పటికి జవహర్‌లాల్ నెహ్రూతో సహా కాంగ్రెస్ నాయకత్వం యిలాంటి కార్యక్రమాల్ని అడ్డుకొన్నదనడానికి కావలసినన్ని సాక్ష్యాధారాలు వున్నాయి. కల్కా ప్రసాద్ జిల్లా కాంగ్రెస్ నుండి నెట్టి వేయబడ్డాడు. జూన్‌లో జవహర్‌లాల్ పర్యటించిన తరువాత పరిస్థితులు మామూలు స్థితికి వచ్చాయి. చాలా శక్తివంతమైన కాంగ్రెస్ యంత్రాంగంతో జాతీయవాద భూస్వామి సేట్ అచల్‌చంద్ ఆర్థికం సమకూర్చిన గ్రామ సేవా సంఘంతో ఆగ్రా ఒక్క ఘర్షణ మినహాయించి ప్రశాంతంగా వుంది. రాయబరేలితో పాటు వ్యవసాయపరంగా సమూలమైన మార్పులు కోరే ప్రధాన కేంద్రాలు కొద్దిపాటి కాంగ్రెస్ నిర్మాణం గల బారాబంకిలో అలహాబాద్‌లోని మందాన్‌పూర్ తహశీల్‌లోనూ వున్నాయి. ముస్లిం జమిందారులు అధికంగా వుండటం వలన 1930లో జాతీయవాదులు ఈ కేంద్రాల్ని పట్టించుకోలేదు. 1931 డిసెంబర్‌లో రౌండ్ టేబుల్ చర్చలు విఫలమవడంతో యుపి కాంగ్రెస్ కొన్ని జిల్లాలలో కౌలు చెల్లింపు నిరాకరణకు ఆమోదం తెలిపింది. కాని అప్పటికే గవర్నర్ మాల్కొం హెయిలీ అవలంబించిన విధానం రైతాంగ సమరశీలతని చాలావరకు లొంగదీసుకున్నది. అయినప్పటికి యుపి రైతులు కొన్ని యితర ప్రావిన్సులలో రాయితీల కంటే, గత సంవత్సరాలలో సాధించిన వాటికంటే అదనంగా కొన్ని మినహాయింపుల్ని సాధించింది. జాతీయోద్యమం భవిష్యత్ కొరకు వ్యవసాయ సమస్యల ప్రాధాన్యతని కాంగ్రెస్ గుర్తించేలా ఒత్తిడి చేయగలిగింది. 1936 నాటికి యుపి కాంగ్రెస్ నాయకత్వం యితర ప్రావిన్సులలో కాంగ్రెస్ కంటే జమిందారీ విధానం రద్దుని కనీసం సిద్ధాంతపరంగా చాలా ముందుగా ప్రచారం చేయడం ప్రారంభించింది.

ఒడంబడిక జరిగిన మాసాలలో చాలా ప్రాంతాలలో ఉద్యమాలు చేపట్టబడ్డాయి. కాని వీటికి యుపి ఘటనలకు వచ్చిన ప్రాచుర్యం లభించలేదు. కొన్ని స్వదేశీ సంస్థానాలలో నియంతృత్వ వ్యతిరేక, ఫ్యూడల్ వ్యతిరేక ఆందోళనలు ప్రారంభమయ్యాయి. అత్యధికంగా

ముస్లిం ప్రజలు హిందూ వారసత్వ పాలన గల కాశ్మీర్‌లో 1931లో ఘర్షణలు జరిగాయి. వీటికి తరచుగా మతపరమైన స్వభావం ఆపాదించబడేది.

ఈ సంవత్సరాలలోనే శక్తివంతమైన నేషనల్ కాన్ఫరెన్స్ ఉద్యమానికి పునాదులు పడ్డాయి. షేక్ అబ్దుల్లాతో సహా కొంతమంది ముస్లిం పట్టభద్రులు ఆందోళన ప్రారంభించారు. జూలై 17న శ్రీనగర్ జైలుపై పెద్ద మూక దాడి జరిపింది. పోలీసు కాల్పుల్లో 21 మంది హతులయ్యారు. తక్షణ ఫలితంగా మత కలహాలు చెలరేగాయి. 1931 సెప్టెంబర్‌లో చేపట్టిన అణచివేత చర్యలు హిందువులపై గాక పోలీసులపై దాడులకు దారితీసింది. మహారాజాకి సహాయపడేందుకు బ్రిటిష్ మిలటరీ జోక్యం అవసరమయింది. జమ్మూలోని మార్బూరు కోట్లి, రాజౌరి తాలూకాలలో వడ్డీ వ్యాపారులకు వ్యతిరేకంగా దాడులు జరిగాయి. ప్రభుత్వం నవంబర్ 12న కొంతమంది అనధికార సభ్యులతో ఎంక్వయిరీ కమిషన్ నియమించింది. తిరుచునాపల్లి సమీపంలో పుదుక్కోటలో కొన్ని రోజుల పాటు పరిపాలనని ప్రజలు హస్తగతం చేసుకున్నారని 'ఇండియన్ యాన్యువల్ రిజిష్టర్' పేర్కొన్నది. కొత్త పన్నులకు వ్యతిరేకంగా ప్రజలు ఉవ్వెత్తున లేచారు. పోలీసు, మిలటరీని పరాజితుల్ని చేశారు. కోర్టు రికార్డులను తగులబెట్టారు. ఖైదీలను జైలు నుండి విడుదల చేశారు. పెంచిన పన్నుల్ని తగ్గించమని పాలకుడితో బలవంతంగా చెప్పించారు. బీహారులో కాంగ్రెస్ నాయకత్వం జమిందారీ అనుకూల పంథా చేపట్టింది. కాని యదునందన్ శర్మ (ఆ తరువాత సహజానందకు సన్నిహిత సహచరుడయ్యాడు) ఆధ్వర్యంలో గయలో బలమైన కిసాన్ సభ ఉద్యమం ఆవిర్భవించింది. ఉత్కళ్ పి.సి.సి. ఒరిస్సా అంతటా 1931 సెప్టెంబరులో కృషక్ సంఘాల్ని స్థాపించాలని నిర్ణయించింది. గ్రామాలలో కాంగ్రెస్ చేపట్టే కార్యక్రమాలు పూరీలాంటి జిల్లాలలో జమిందారీ కౌలు రైతుల సంబంధాల్ని దెబ్బతీస్తున్నాయని అధికారులు ఆరోపించారు. కోస్తా ఆంధ్రలో కృష్ణాజిల్లాకి చెందిన దుగ్గిరాల గోపాల కృష్ణయ్య లాంటి స్థానిక నాయకుల ఆధ్వర్యంలో పన్నుల వ్యతిరేక ఉద్యమం ఊపందుకొన్నది. ఆయన తెలుగులో రాసిన 'గాంధీ గీతం' వ్యవసాయ జాతీయవాద ఆందోళనలకు విస్తృత ప్రచారమిచ్చింది. జమిందారీ ప్రాంతాలలో – ప్రత్యేకించి నెల్లూరులోని 2117 చ.మైళ్ళ విస్తీర్ణం గల వెంకటగిరి సంస్థానంలోని రైతుల సంఘ నిర్మాణంలోకి తీసుకొని రాబడ్డారు. పశుగ్రాసం, కలపలపై రైతులకు గల సాంప్రదాయక హక్కుల్ని తగ్గిస్తూ విధించబడిన 'పుల్లరి'కి వ్యతిరేకంగా 1931లో అటవీ సత్యాగ్రహం చేపట్టబడింది. దీనికి ఎన్.వి. రామారావు, ఎన్.జి. రంగాలు నాయకత్వం వహించారు. 1931 సెప్టెంబర్లో కృష్ణా, గుంటూరు జిల్లాల్లో వరుసగా భూస్వామ్య వ్యతిరేక దాడులు జరిగాయి. కుల వివక్ష రూపాలు తీవ్రంగా వున్న కేరళలో 1931 నవంబర్‌లో కాంగ్రెస్ నాయకుడు కేలప్పన్ నాయకత్వంలో గురువాయూరు దేవాలయ సత్యాగ్రహం ప్రజల్ని చాలా ప్రభావితం చేసింది. మలబారులోని చాలా ప్రాంతాలలో తిరువాన్కూరు, కొచ్చిన్ సంస్థానాలలో వలంటీర్లు పాదయాత్రలు నిర్వహించారు. శాసనోల్లంఘన ప్రారంభమైనప్పటికి గురువాయూర్‌లో సత్యాగ్రహం 1932 సెప్టెంబర్‌లో విరమించమని గాంధీ ఆదేశాలు జారీ చేసేవరకు కొనసాగింది. గురువాయూర్ సత్యాగ్రహంలో చురుకుగా పాల్గొన్న పాఠశాల ఉపాధ్యాయుడు ఎ.కె. గోపాలన్ ఆ తరువాత కేరళలో చాలా ప్రజాదరణ పొందిన కమ్యూనిస్టు రైతు నాయకుడయ్యాడు.

**అధికారుల వైఖరులు**

ఒడంబడిక జరిగిన నెలలో ఉద్యమంపై ప్రజల ఒత్తిళ్ళు పెరగడం బ్రిటిష్ అధికారులు గమనించారు. దీనికి స్పందనగా ఉద్యమంపై పెద్ద ఎత్తున ఎదురు దాడి జరిపి కోలుకోలేని విధంగా దెబ్బతీయాలనేది బ్రిటిష్ అధికార వర్గాలలో బలపడిన వైఖరి. బ్రిటిష్ వైఖరిలో వచ్చిన మార్పు ఇర్విన్ వారసుడిగా వచ్చిన విల్లింగ్టన్‌కి ఆపాదించడం జరుగుతుందని, కాని దాని మూలాలు మొదటి శాసనోల్లంఘన కాలం నాటి అధికారుల ఆలోచనల లోను, 1931 ఫిబ్రవరి – మార్చిలో వైస్రాయి గాంధీని సమానుడిగా ఆదరించడం పట్ల ఉన్నతాధికార వర్గం యొక్క ప్రతికూల స్పందనలోను వున్నాయని డి.ఎ. తౌ ఒక వ్యాసంలో పేర్కొన్నాడు. సివిల్ సైనిక చట్టాన్ని అమలు జరపడం అంటే 1919లో అమృతసర్‌లో లాగా ప్రత్యక్షంగా సైనికుల్ని రంగంలో దించడానికి బదులుగా సివిల్ అధికారులకు దాదాపు మిలటరీ అధికారాలు కల్పించడం (కాంగ్రెస్ – రాజ్యం అధ్యాయం 5 డి.ఎ. తౌ). ఢిల్లీ ఒడంబడిక విఫలమైతే ఒకే దెబ్బ గట్టి దెబ్బ తీయాలని హోం మెంబరు యమర్సన్ నొక్కి చెప్పాడు. 1932 జనవరికి కొన్ని నెలల ముందే అత్యవసర అధికారాల ఆర్డినెన్స్ ముసాయిదా తయారు చేయబడింది.

లేబరు పార్టీ నాయకుడు రామ్సే మెక్డొనాల్డ్ నాయకత్వంలోని టోరీల ఆధిపత్యం గల జాతీయ ప్రభుత్వం 1931 సెప్టెంబర్‌లో అధికారంలోకి రావడం, ప్రపంచ ఆర్థిక సంక్షోభం తీవ్రమవుతుండగా లాంక్‌షైర్ మరియు బ్రిటిష్ వాణిజ్య వర్గాల ఎదురు దాడి పెరగడం లాంటి బ్రిటిష్ రాజకీయాలలో మితవాద దిశగా జరిగిన మార్పులు – భారతదేశంలోని అధికార వర్గాల వైఖరి కఠినతరం కావడాన్ని ప్రోత్సహించాయి. కొత్త టోరీ సెక్రటరీ ఆఫ్ స్టేట్ శామ్యూల్ హోరే 1931 సెప్టెంబరులో ఆర్థిక స్వయం ప్రతిపత్తి సదస్సుని తిరస్కరిస్తానని బెదిరించాడు. ఆర్థిక సంక్షోభం కారణంగా కస్టమ్స్, ఆదాయపు పన్ను, రైల్వేల నుండి ఆదాయం పడిపోతుండగా తీవ్రమైన ఆర్థిక యిబ్బందులలో వున్న భారతదేశ ప్రభుత్వం ప్రత్తిపై పన్ను 20 నుండి 25 శాతానికి పెంచాలని నిర్ణయించింది. లాంక్‌షైర్ నిరసనలను ప్రక్కనపెట్టి ప్రభుత్వం కొత్త పన్నుల్ని ఆమోదించింది. కాని రూపాయి మారకపు విలువ 1 షి 6 పెన్నీలుగానే వుండాలని ఒత్తిడి చేసింది. రూపాయి విలువలో మార్పు హోం ఛార్జీల లాభాల రూపంలో పంపిన డబ్బు చెల్లింపులలో ప్రతికూల ప్రభావం చూపి వుండేది. లాంక్‌షైర్ పాక్షిక ప్రయోజనాల్ని ఒక మేరకు త్యాగం చేసియైనా మెట్రోపాలిటన్ ఆర్థిక పరిగణనలకు ఎక్కువ ప్రాధాన్యత యివ్వబడింది. రెండవ దఫా రౌండ్ టేబుల్ సదస్సులో (1931 సెప్టెంబర్ – డిసెంబర్) ఆర్థిక రంగంలో విశేషాధికారాల్ని వైస్రాయి అట్టి పెట్టుకోవాలని అధికారులు బ్రిటిష్ వాణిజ్య ప్రతినిధులు ఒత్తిడి చేశారు. ప్రతిపాదించబడిన ఫెడరల్ ప్రభుత్వంలో బాధ్యతాయుత భారత ఆర్థిక మంత్రికి మొత్తం 130 కోట్ల ప్రభుత్వం ఆదాయంలో కేవలం 15 కోట్ల రూపాయల పైనే నిజమైన నియంత్రణ వుంటుందని బిర్లా అంచనా వేశారు. (సప్రూకి బిర్లా 1931 అక్టోబర్ 31, జి.డి. బిర్లా ఇన్ ది షాడో ఆఫ్ మహాత్మా పేజి 46). బెంతాల్ లాంటి బ్రిటిష్ వాణిజ్య ప్రతినిధులు భారతదేశంలోని జాతీయవాద ప్రభుత్వాలు విదేశీ పెట్టుబడుల పట్ల ఎలాంటి

వివక్ష చూపకుండా, వాటి వాణిజ్యపరమైన రక్షణలకు హామీ యివ్వాలని పట్టుబట్టారు. రాజకీయపరంగా బ్రిటన్ కఠిన వైఖరి చేపట్టదలచింది. 'రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి చేపట్టదగిన మొదటి చర్యగా భారతీయులపై ఒత్తిడి తెచ్చి ఒప్పించాలి' హోరే 1931 అక్టోబర్ 2న విల్లింగ్టన్‌కి తెలియజేశారు (ఆర్.జి. మోరే పేజి 232).

ఈ మొత్తం పరిస్థితి గాంధీ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనడాన్ని నిరర్థకం చేసింది. మైనారిటీల సమస్యపై సదస్సులో ప్రతిష్టంభన ఏర్పడింది. ప్రత్యేక నియోజకవర్గాల్ని కోరింది. ఈసారి కేవలం ముస్లింలే కాదు. అణగారిన కులాలు భారతీయ క్రైస్తవులు, ఆంగ్లో ఇండియన్లు, యూరోపియన్లు ప్రత్యేక నియోజక వర్గాల్ని కోరారు. ఈ గ్రూపులన్నీ 'మైనారిటీల ఒడంబడిక'తో నవంబర్ 13 నుండి ఐక్య కార్యాచరణకి సిద్ధమయ్యాయి.

బెంగాల్ ముస్లిం ప్రతినిధుల్ని గాంధీ మచ్చిక చేసుకున్నాడు. 'బెంగాల్‌లో వారి ఆర్థిక పరిస్థితిని మరచిపోయాడు. వారికి యూరోపియన్ సంస్థలలో తగు స్థానాలు కల్పించాలి' అనే వాగ్దానంతో ముస్లింల మద్దతు పొందాడు. మతపరమైన సమస్య పరిష్కరించే షరతుతో రాజ్యాంగంపై చర్చలలో ముందుకు సాగేందుకు గాంధీ ఒంటరి పోరాటం చేశారు. 'పరిష్కారం స్వరాజ్య రాజ్యాంగానికి కిరీటమవుతుంది. పునాది కాదు' అని వాదించాడు. కాంగ్రెస్ డిమాండ్ అయిన స్వరాజ్యానికి మద్దతు యిస్తే ముస్లింల కోర్కెలన్నింటికీ అంగీకరిస్తామని గాంధీ అక్టోబర్ 5న ప్రతిపాదించారు. ముస్లిం ప్రతినిధులు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. గాంధీ ఉదారతని మహాసభ ప్రతినిధులు ఆమోదించలేదు. పంజాబులో ముస్లింల మెజారిటీకి అవకాశం కల్పించే ఎలాంటి ప్రతిపాదననైనా హిందూ మహాసభ, సిక్కు ప్రతినిధులు తేల్చి చెప్పారు. సమాఖ్య సమస్యపై కూడా స్వదేశీ సంస్థానాల ప్రతినిధులు కంఠ స్వరంలో మార్పు వచ్చింది. 1930లో చూపిన ఆసక్తి యిప్పుడు వారికి లేదు. అందుకు కారణాలు స్పష్టమే. కేంద్రంలో తక్షణం మార్పు వస్తుందనే భయం తగ్గిపోయింది. కాంగ్రెస్ ఉద్యమాన్ని విరమించింది. కేంద్రంలో మార్పుల కొరకు చర్చని వాయిదా వేయాలనే బ్రిటిష్ ప్రతిపాదనని సప్రూ, జిన్నా, అంబేద్కర్‌లు వ్యతిరేకించారు. మెక్డొనాల్డ్ తన జనవరి 19 వైఖరి పునరుద్ఘాటనతో సదస్సుని డిసెంబర్ 1న ముగించాడు. రెండు కొత్త ముస్లిం మెజారిటీ ప్రావిన్సుల (వాయువ్య సరిహద్దు రాష్ట్రం, సింధు) ప్రకటన, భారతీయ సంప్రదింపుల కమిటీ, మూడు నిపుణుల కమిటీల (ఓటింగ్‌పై ఆర్థికంపై, రాష్ట్రాలపై) స్థాపన, భారతీయు ఏకాభిప్రాయానికి రాలేకపోతే ఏకపక్షంగా బ్రిటన్ కమ్యూనల్ అవార్డుని ప్రకటించుట – మెక్డొనాల్డ్ అవార్డులోని ముఖ్యాంశాలు :

మొత్తం ఎలాంటి ప్రయోజనం లేని పనయింది. ఆ పరిస్థితుల్లో అనివార్యంగా అలాగే అవుతుంది. ఎందుకంటే ఢిల్లీ చర్చల సందర్భంగా గాంధీ తన పార్టీకి మెజారిటీ ప్రాతినిధ్యాన్ని త్యజించాడు – అది 1929 డిసెంబర్‌లో ఇర్విన్ ప్రతిపాదనని తిరస్కరించడానికి దారితీసింది. అంతేగాక రౌండ్ టేబుల్ సదస్సులో పాక్షిక ప్రయోజనాలు కోరే వారితో సమాన స్థాయిలో పాల్గొనడానికి కాంగ్రెస్ అంగీకరించింది. గాంధీ డిసెంబర్ 28న భారతదేశానికి తిరిగి వచ్చాడు. నెహ్రూ, గఫార్‌ఖాన్ జైలులో వున్నారు. బెంగాల్, యు.పి, వాయవ్య సరిహద్దు

ప్రావిన్సులలో అణచివేత చర్యలకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇంటర్వ్యూ కావాలని గాంధీ చేసిన విజ్ఞప్తిని విల్లింగ్టన్ మొరటుగా తిరస్కరించాడు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకి శాసనోల్లంఘన మరలా చేపట్టడం తప్ప మార్గాంతరం లేకపోయింది. చాలాకాలం వరకు ఉద్యమాలు నడపడానికి వీలుపడని పరిస్థితులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 1932 జనవరి 4న వరుస ఆర్డినెన్సులు (అత్యవసర అధికారాలు, చట్టవిరుద్ధమైన సమావేశాలు, చట్టవిరుద్ధంగా ప్రేరేపించడం, బహిష్కరించుట), అన్ని స్థాయిల్లో కాంగ్రెస్ సంస్థల నిషేధం, నాయకుల, కార్యకర్తల, సానుభూతిపరుల అరెస్టులు, ఆస్తుల్ని జప్తు చేయడం ప్రారంభమయింది. 'ఇది సన్నద్ధం గాని యుద్ధం' అని హోరే ప్రకటించాడు. మొదటి రోజునే ఒక్క బెంగాల్‌లోనే 272కు పైగా సంఘాలు నిషేధించబడ్డాయి.

## 1932-34 రెండవ శాసనోల్లంఘనోద్యమం అణచివేత - ప్రతిఘటన

గతంలో ఎన్నడూ లేనంత తీవ్రస్థాయిలో నిర్బంధాల్ని ఎదుర్కొంటూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జాతీయోద్యమం ఒకటిన్నర సంవత్సరాలు వీరోచితంగా పోరాడింది. తరువాత పరాజయాన్ని అంగీకరించింది. 1932 జనవరి 1933 మార్చి 8 మధ్య గల 15 మాసాల కాలంలో 1,20,000 అరెస్టులు జరిగాయి. 1930 – 31లో జరిగిన 90,000 అరెస్టులతో పోల్చితే ఈ సంఖ్య అంత ఎక్కువేం కాదు. అణచివేత తీవ్రంగా క్రమబద్ధంగా సాగింది గనుక అరెస్టుల సంఖ్య పెరిగింది. ఆ తరువాత అరెస్టులు తగ్గాయి. 1933 ఏప్రిల్ వరకు జరిగిన 74,671 దోష నిర్ధారణలతో 1932 జనవరిలో 14,803 ఫిబ్రవరిలో 17.818 మార్చిలో 6909 ఏప్రిల్‌లో 5254. ఆ తరువాత నెలసరి అరెస్టులు 4000 సంఖ్యని ఎప్పుడూ మించలేదు. 1932 నవంబర్ 6న శాసనోల్లంఘన క్షీణదశలో వుందని విల్లింగ్టన్ రిపోర్టులు పంపారు. (టెంపుల్‌వుడ్ కలెక్షన్స్) ప్రావిన్సుల వారీగా అరెస్టులు జనాభాలో వారి శాతం యివ్వబడింది. బొంబాయి ప్రెసిడెన్సీ (14,101, 0.064%), బీహారు ఒరిస్సా (14,903 , 0.040%), యుపి (14,659, 0.030%), బెంగాల్ (12,791, 0.026%), సి.పి. (4,014 , 0.026%), పంజాబ్‌లో 0.008% మద్రాసులో 0.007% ముస్లింల భాగస్వామ్యం తక్కువగా వున్నప్పటికి వాయవ్య సరిహద్దు ప్రావిన్సులో శిక్షలు పడినవారు దేశం మొత్తం మీద ఎక్కువ (6,053, 0.25%) మహిళలు 3,630, మద్రాసులోని 904 మందిలో 759 మంది యుపిలో 2004 మందిలో 1550 మంది నిరక్షరాస్యులు. 1932లో యుపిలో అరెస్టయినవారిలో 1397 మంది కౌలుదారులు, శ్రామికులు వుండటంతో కాంగ్రెస్ నిజమైన ప్రజా ఉద్యమంగా ఎదిగిందని చెప్పవచ్చు. (హోం పొలిటికల్ ఎఫ్.ఎన్. 3/11/1933, జూడీల్ బ్రౌన్, గాంధీ శాసనోల్లంఘన పేజి 284-86)

1932 – 33లో శాసనోల్లంఘనలో చాలా కార్యక్రమాలు చేపట్టబడ్డాయి. కారణం చాలా అంశాలు చట్టవిరుద్ధమైనవిగా ప్రకటింపబడటం, పౌర హక్కులు పూర్తిగా అణచివేయబడ్డాయి. జనవరి 4 దాడి పథకాలకు తుది రూపం ఇస్తూ విల్లింగ్టన్ తాను 'భారతదేశంలో ముసోలిని' అవుతున్నానని చెప్పుకున్నాడు (హోరేకి రాసిన లేఖలో 1931

డిసెంబర్ 20). చట్ట ఉల్లంఘన రూపాలు, బట్టల, మద్యం షాపుల పికెటింగ్, మార్కెట్లని మూసివేయడం, తెల్లవారి లేక బ్రిటిష్ విధేయ వ్యాపార సంస్థల బహిష్కరణ, ప్రతీకాత్మకంగా కాంగ్రెస్ జెండాలు ఎగురవేయడం, చట్ట విరుద్ధమైన కాంగ్రెస్ సభల్ని బహిరంగంగా జరపడం. (1932 ఏప్రిల్ లో ఢిల్లీలోని చాందినీ చౌక్ క్లాక్ టవర్ వద్ద, మరుసటి సంవత్సరంలో కలకత్తా మైదాన్‌లో జరిపిన విధంగా) ఉప్పు సత్యాగ్రహాలు, చౌకీదారు పన్ను, కౌలు శిస్తులు చెల్లించకపోవడం, అటవీ చట్టాల అతిక్రమణ, చట్టవిరుద్ధంగా కాంగ్రెస్ సంస్థ నిర్వహణ (1932లో ఆగస్టు బొంబాయి సమీపం నుండి రహస్య రేడియో ప్రసారాలు నిర్వహించడం) బాంబుల్ని ప్రయోగించడం చివరి రెండు పద్ధతుల్ని తరువాత గాంధీ చాలా తీవ్రంగా నిరసించారు.

బొంబాయి నగరాన్ని, బెంగాల్‌ని రెండు నల్ల మచ్చలుగా విల్లింగ్టన్ 1932 ఏప్రిల్ 4 లేఖలో వర్ణించారు. 'బొంబాయి నగరం గాంధీయిజాన్ని నిలబెడుతుంది. భారతదేశంలో మరెక్కడా లేని పట్టు కాంగ్రెస్‌కి బొంబాయిలో వుంది.' గవర్నర్ అంచనా (సైక్స్ హోరేకి 1932 మార్చి 6 సైక్స్ కలెక్టర్స్ గుజరాత్ వ్యాపారుల - ప్రత్యేకించి చిన్న వ్యాపారుల భాగస్వామ్యం 1932 అక్టోబర్ వరకు ముల్జీ జెతే ప్రత్తి మార్కెట్‌కి ఆటంకాలు కల్పించింది. వినాశానికి చేరువలో వున్న తెల్లవారి సంస్థల్ని కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్తి వర్తకంపై చేపట్టింది. కాని 1930లో లాగానే మిల్లు కార్మికులు దూరంగా వుండిపోయారు. ముస్లింలు కొన్ని సందర్భాలలో ప్రతికూలంగా వున్నారు. అంతేగాక 1932 మే - జూలై కాలంలో బొంబాయి నగరంలో వరుసగా మత కలహాలు చెలరేగాయి. గ్రామీణ ప్రాంతాలలో 1930 నాటి స్పందన లేదు. కారణం 1931 ఒడంబడిక కాలంలో కాంగ్రెస్ తుపాకుల్ని దించింది. పూర్తి స్థాయి శిస్తు పన్నుల నిరాకరణను వదులుకొన్నది. ఈసారి ఖేదా బార్డోలిలో కూడా ఆటంకాలేర్పడ్డాయి. బ్రిటిష్‌వారు బరోడాపై ఒత్తిడి తెచ్చి సరిహద్దుల్ని మూసి వేయించారు. 1932 ఫిబ్రవరి నాటికి ఖేదాలోని 15 గ్రామాలు మాత్రమే శిస్తులు పన్నులు చెల్లించలేదు. కాని ఖేదాలోని రాస్‌లాంటి గ్రామంలోని పటేదార్లు అప్పటికి 2000 ఎకరాల పొలం కోల్పోయినప్పటికి, వారిలో కొందరిని పోలీసులు బట్టలు విప్పించి కొరడా దెబ్బలు కొట్టించి ఎలక్ట్రికల్ షాక్స్ యిప్పించినప్పటికి 1933లో కూడా శిస్తులు పన్నులు చెల్లించ నిరాకరించారు. కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలలో ప్రత్యేకించి ఉత్తర కనరాలోని అంకోలా సిద్దపూర్ తాలూకాలలో రెండువందలకు పైగా గ్రామాలు శిస్తులు పన్నులు చెల్లించలేదు. మధ్య దక్షిణ భారతదేశంలోని చాలా ప్రాంతాలలో అటవీ సత్యాగ్రహాలు చేపట్టినట్లు ఎఐసిసి రిపోర్టు పేర్కొన్నది. 1932 మే 1న అంకోలాలో 4000 మంది గ్రామస్తులు అప్పుడే కొట్టిన కలపని తాలూకా కేంద్రానికి తీసుకొని వచ్చి వేలానికి పెట్టారు. అదే నెలలో సెంట్రల్ ప్రావిన్సులోని బెతూర్‌లో మన్నూగోండే, చైతూ కోయికులాంటి తెగల నాయకుల ఆధ్వర్యంలో అటవీ సత్యాగ్రహం చేపట్టబడింది. కేరళ పిసిసి 1932 ఆగస్టు - అక్టోబర్‌లలో మలబారులోని కాసర్‌గోడ్‌లో అటవీ సత్యాగ్రహం నిర్వహించినట్లు రిపోర్టు చేసింది (ఎఐసిసి, ఎఫ్-ఎన్ I/1932)

చురుకుగా పికెటింగ్ జరిపిన కొన్ని పట్టణ కేంద్రాలు తమిళనాడులోని మద్రాసు నగరం, మధుర, విరూధ్‌నగర్. 1930తో పోల్చితే శాసనోల్లంఘన మద్రాసు, ఆంధ్రలలో

బలహీనంగా వుంది. 1933లో కోస్తా ఆంధ్రలో శిస్తు పన్నుల నిరాకరణని పునరుద్ధరించే సూచనలు కన్పించడంతో బ్రిటిష్‌వారు చాలా కలవరపడ్డారు. బీహారులోని మోంఘీర్ ముజఫర్‌నగర్ జిల్లాలలో 1932 ఫిబ్రవరిలో 7000 మంది వరకు గల పెద్ద గుంపులు పోలీస్ స్టేషన్లపై దాడులు చేశాయి. 1933 వరకు రెవెన్యూ వసూళ్ళు తగ్గుతూనే వున్నాయి. 1932 మార్చిలో ఎఐసిసి రహస్య ప్రకటన చాలా జిల్లాలలో శిస్తు పన్నుల చెల్లింపులు జరగడం లేదని ప్రకటించినప్పటికి (ఆర్.ఇ. హాకిన్స్ పత్రాలు, కేంబ్రిడ్జి, సౌత్ ఏషియన్ సెంటర్) శాసనోల్లంఘన పట్టణాలకు చెందిన వ్యవహారమయింది. బరౌడా గ్రామం శిస్తు పన్నుల నిరాకరణ మినహాయించి ఆగ్రా జిల్లా ప్రశాంతంగావుంది. రాయబరేలిలో 80 శాతం బకాయి పడ్డ శిస్తులు పన్నులు 1932 జూలై నాటికి – రెండు నెలల ముందుగా వసూలు చేయబడింది. (జి. పాండే పేజీలు 177, 187),

బెంగాల్‌లోని కోస్తా జిల్లాలలో ఉప్పు సత్యాగ్రహం పునరుద్ధరించబడిందని, చాలా జిల్లాలలో చౌకీదారు పన్ను చెల్లింపు నిరాకరణ, యూనియన్ బోర్డు బహిష్కరణ కొనసాగుతున్నాయని, హుగ్లీలోని ఆరాంబాద్ సబ్ డివిజన్‌లోను, తిప్పెరలోని కొన్ని ప్రాంతాలలోను, సిల్హెట్, జల్పాయిగురిలలో పన్ను చెల్లింపు నిరాకరణ జరుగుతుందని ఎఐసిసి ప్రకటన పేర్కొన్నది. తీవ్రమైన మాంద్యం నెలకొని వున్న పరిస్థితులలో కూడా వ్యవసాయరంగంలోని మార్పులు కోరే కార్యక్రమాన్ని స్వాయత్తం చేసుకొనడంలోని కాంగ్రెస్ నాయకత్వం వైఫల్యం వేర్పాటువాద ధోరణులలో ముస్లిం రైతాంగ ఉద్యమాలు అభివృద్ధి చెందడాన్ని ప్రోత్సహించింది. ఈ సంవత్సరాలలో ప్రజా ఉద్యమం బలాన్ని పుంజుకొన్నది. వ్యవసాయ సమస్యల్ని కమ్యూనిస్టు విజ్ఞప్తులతో మిళితం చేసిన మౌలానా భసాని 1932 డిసెంబర్‌లో పెద్ద ఎత్తున ప్రజా సమ్మేళనాన్ని నిర్వహించారు. ప్రజా సమ్మేళనం జమిందారీ విధానం రద్దుని రుణభారం తగ్గింపుని డిమాండ్ చేసింది. టెర్రరిజం కారణంగా బెంగాల్ బ్రిటిష్ వారికి పీడకలగా పరిణమించింది. కొత్త బెంగాల్ గవర్నర్ యాండర్సన్ ఐరిష్ అంతర్యుద్ధపు రోజుల నుండి అణచివేత నిపుణుడిగా ప్రసిద్ధిగాంచినప్పటికి 1932లో టెర్రరిస్టు ఘటనలు అత్యధికంగా (104) జరిగాయి. కాని ఆ తరువాత 1933లో 33కి, 1934లో 17కి తగ్గాయి. మిడ్నాపూర్‌లో మరి యిద్దరు బ్రిటిష్ సంతతికి చెందిన జిల్లా మేజిస్ట్రేట్ హత్య చేయబడ్డారు. గవర్నర్ బాక్సన్‌పై యూనివర్శిటీ స్నాతకోత్సవ సందర్భంగా విద్యార్థిని దాడి చేసింది. 1933 ఫిబ్రవరిలో సూర్యాసేన్ అరెస్టు చేయబడ్డారు. బుక్సా, హిజ్లీ, డియోలిలోని కాన్సంట్రేషన్ క్యాంపులలో 3000 మందికి పైగా నిర్బంధింపబడ్డారు. చిటగాంగ్ ఖైదీలు అండమాన్ దీవులకు తరలించబడ్డారు.

రెండవ శాసనోల్లంఘనోద్యమం కాలంలో రెండు స్వదేశీ సంస్థానాలలో ఉద్యమాలు చెలరేగాయి. కాశ్మీర్‌లో 1932 ఏప్రిల్‌లో సమస్యల ఎంక్వయిరీ కమిషన్ ప్రతిపాదించిన రాయితీలు (ముస్లిం విద్య ప్రోత్సాహానికి చర్యలు, ప్రభుత్వం ఆక్రమించిన ముస్లింల మతపరమైన భవనాలను తిరిగి యిచ్చివేయుట, పశుగ్రాసం పన్నుని పాక్షికంగా నిలిపివేయుట, ప్రభుత్వానికి

అవసరమైన (శ్రామికులకు డబ్బు చెల్లించుట) పెరుగుతున్న ఉద్యమాన్ని ఆపడంలో విఫలమయ్యాయి. 1932 అక్టోబర్‌లో ముస్లిం కాన్ఫరెన్స్ ప్రారంభించబడింది. 6 సంవత్సరాల తరువాత దాని పేరు నేషనల్ కాన్ఫరెన్స్‌గా మార్చబడింది. దాని నాయకుడు – పి.ఎన్. బజాజ్ నాయకత్వంలోని నియంతృత్వ వ్యతిరేక హిందువుల గ్రూపుతో సన్నిహిత సంబంధాలు పెంచుకొనడం ప్రారంభించాడు. రాజస్థాన్‌లోని అల్వార్ స్వదేశీ సంస్థానంలో 1933 ప్రారంభంలో మహరాజా జైసింగ్ సవాయ్ విధించిన వెట్టి చాకిరి పశుగ్రాసం బకాయిలు, వేట కొరకు అడవుల్ని కేటాయించడం – వగైరాలకు వ్యతిరేకంగా ఉద్యమం చెలరేగింది. ఇస్లాంతో సంబంధం గల అర్ధ తెగ రైతు సమాజానికి చెందిన మియోలు పెద్ద స్థాయిలో గెరిల్లా యుద్ధం ప్రారంభించారు. అల్వార్ పరిస్థితులు అధ్వానంగా వున్నట్లు గవర్నర్ విల్లింగ్టన్ 1933 ఫిబ్రవరి 12న ప్రకటించారు. మియోల తిరుగుబాటుని మత కలహాలుగా పొరబడి దానిలో 80 నుండి 90వేల మంది మియోలు దానిలో పాల్గొంటున్నట్లు ఇండియన్ యాన్యువల్ రిజిస్టరు పేర్కొన్నది. పంజాబ్ ముస్లిం నాయకుడు మహమ్మద్ యాసిన్‌ఖాన్ మహారాజా వ్యతిరేక ఉద్యమానికి మతపరమైన (అలాగే బ్రిటిష్ అనుకూలమైన) రంగు పులమ యత్నించాడు. ప్రత్యామ్నాయంగా సయ్యద్ ముతలాగిని ఫరీదాబి, కెం.ఎ. అష్రాఫ్‌ల ఆధ్వర్యంలో చైతన్యయుతమైన సమూలమైన మార్పులు కోరే ధోరణి కూడా అభివృద్ధి చెందుతున్నది. కె.ఎం. అష్రాఫ్ తరువాత కాలంలో భారతదేశంలో తొలి మార్క్సిస్టు చరిత్రకారులలో ఒకరయ్యారు. ప్రజాదరణ కోల్పోయిన మహారాజాని యూరప్‌కి పంపించి, కొన్ని సంవత్సరాల పాటు అల్వార్ పాలనా బాధ్యతలు చేపట్టాలని బ్రిటిష్ పాలకులు నిర్ణయించారు.

1932 సంవత్సరాంతానికి శాసనోల్లంఘనం పరాజయం దిశగా పయనం సాగించింది. గుజరాత్, ఆంధ్ర, యుపిలలో రైతుల భాగస్వామ్యం తగ్గడానికి కారణం బలమైన అణచివేత చర్యలు. అంతేగాని కాంగ్రెస్ పట్ల ప్రజల ఆదరణ తగ్గడం కాదు. 1930–34 కాలంలో కాంగ్రెస్ త్యాగాలు బలిదానాలు, 1934 తరువాత కాంగ్రెస్ ఎన్నికలలో నిర్ణయాత్మక విజయాలు సాధించడానికి తోడ్పడ్డాయి. ఈ సందర్భంగా హార్డిమన్ ఒక అంశాల్ని మన దృష్టికి తెచ్చారు. ఓట్లు వేయడం, ఆందోళనలు చేయడం లాంటిది కాదు. గాంధేయ సత్యాగ్రహాల రోజులు చెల్లిపోయాయి. ఆస్తిపాస్తులు గల రైతులు కాంగ్రెస్‌కి ఓట్లు వేస్తారు కాని వారి భూముల్ని త్యాగం చేయడానికి సిద్ధపడరు. 1931లో రైతులు కోల్పోయిన పొలాల్ని తిరిగి యిప్పించడంలో గాంధీ విఫలమయ్యాడు. కొన్ని ప్రాంతాలలో – ప్రత్యేకించి గుజరాత్‌లో ఆర్థిక మాంద్యం, ఆ తరువాత యుద్ధకాల వ్యాపార విజృంభణతో (ఖేదాలు పొగాకు ధరకు 500 శాతం పెరిగాయి) రైతులు సంపన్నులయ్యారు. ఫలితంగా వారి సమరశీలత తగ్గింది. గ్రామీణ పెట్టుబడిదారీ విధానం 1947కి ముందు చెదురు మదురుగా కొన్ని స్థావరాలలో మాత్రమే అభివృద్ధి చెందింది. రైతుల సమరశీలత దేశంలోని చాలా ప్రాంతాలలో – ప్రత్యేకించి జమిందారీ ప్రాంతాలలో నిలదొక్కుకున్నది. కాని ఈ చైతన్యం 1930 దశాబ్దం మధ్య కాలం నుండి కాంగ్రెస్ వెలుపల – వామపక్షం పట్ల మొగ్గు చూపే కిసాన్ సభల ద్వారా, మతపరమైన సంస్థల ద్వారా వ్యక్తీకరణ రూపాలు సంతరించుకొన్నది.

## వ్యాపార వర్గాల పునస్సమీకరణలు

రైతాంగ ప్రతిస్పందన రాను రాను ప్రభుత్వ వ్యతిరేకత ప్రకటించగా, పట్టణ బూర్జువా వర్గం కూడా శాసనోల్లంఘనోద్యమం పట్ల పరిగణించదగ్గ స్థాయిలో ద్వంద్వ స్వభావాన్ని ప్రదర్శించింది. 1932 వ సంవత్సరం ఆ ప్రాంతం గుజరాత్ వ్యాపారులు మద్దతు కారణంగా బోంబే ఉద్యమం తీవ్రస్థాయికి చేరుకోగా, 1932 వ సంవత్సరం ప్రారంభంలోనే నగరానికి చెందిన జాతీయవాద వర్గం, ఠాకూర్‌దాస్ వ్యతిరేకతని కూడా ఎదుర్కొని ఇండియన్ మర్చంట్ ఛాంబర్‌పై ఆధిపత్యం సాధించిన దరిమిలా తిరిగి శాసనోల్లంఘనోద్యమం ప్రారంభమైనప్పుడు, ఫిక్కీ (FICCI) ఆ సందర్భానికి తగినట్లుగాక తాత్కాలికంగా రాజ్యాంగ చర్చలకి ఎడంగా ఉండిపోయింది. కానీ, 1931 రౌండ్‌టేబుల్ సమావేశ కాలంలో జరిగిన వ్యక్తిగత చర్చలలో జి.డి.బిర్లా అనుసరించిన సర్దుబాటు  వ్యవహార ధోరణి బెంథాల్‌ని ఆశ్చర్యపరిచి, ఆనందింపచేయటం – పరస్పర సహకారానికి ఏ విధంగానూ, తలుపులు పూర్తిగా మాయలేదని 1932 మార్చి 14న హోరేకి త్వరగా హామీనివ్వటానికి అదే విధంగా సభ్య సంఘాల వత్తిడి కారణంగా ఫిక్కీ (FICCI) నాయకులు అయిష్టంగానే, రౌండ్‌టేబుల్ సమావేశాన్ని బహిష్కరించటానికి దారితీసింది. (In the Shadow of Mahatama pp54-5) ప్రజా ఉద్యమం వెనకపట్టు పట్టడంతో, రాజకీయ 'వాస్తవికవాదం'తో పాటుగా సెక్షనల్ ఆర్థిక ప్రయోజనాలు, అంచనాలు కొన్ని వ్యాపార సమూహాల్ని ప్రభుత్వంతో సహకారం వైపుగా నెట్టడంగా జరిగింది.

1932 వేసవి కాలంలో జరిగిన ఒట్టావా ఇంపీరియల్ ఆర్థిక సమావేశంలో తాను ఎగుమతి చేయదలచిన తేయాకు, చర్మాలు మొదలైన ముడి పదార్థాలకి బ్రిటన్ అనుకూల ప్రాధాన్యత నివ్వటానికి, అందుకు బదులుగా ఆ దేశం నుండి దిగుమతి అయ్యే సరుకులుపై సుంకాలు తగ్గించటానికి భారతదేశం ఆమోదం తెలిపినందుకు, ఏదేమైనప్పటికీ, పెద్దగా వ్యతిరేకత వ్యక్తం కాలేదు. దీనిపై జాతీయవాదులు, ప్రజా సమక్షంలో బిర్లా తీవ్ర నిరసన తెలిపినప్పటికీ శాసనసభలో ఈ ఒప్పందం చాలా సునాయాసంగా ఆమోదం పొందింది. 1932 –33 సంవత్సరాలలో బొంబాయి వస్త్ర పరిశ్రమ, బడాసేఠ్‌లు, ముతకవస్త్రాల విషయంలో, అప్పటికే స్పష్టంగా బలహీనపడిన లాంకషైర్ పరిశ్రమ కంటే ముందుకు దూసుకువస్తున్న జపాన్‌ని చూసి భయపడగా, ఈ అంశమే, భారతదేశానికి చెందిన ముడి ప్రత్తిని ఎక్కువ పరిమాణంలో కొనేందుకు  లాంక్‌షైర్ తెలిపే ఆమోదాన్నీ బదులుగా బ్రిటన్ వస్త్రాల దిగుమతికి మరిన్ని అనుకూల ప్రాధాన్యతల్ని కల్పించే ఘోరమైన అపఖ్యాతి పొందిన అక్టోబర్ 1933 ఒప్పందానికి ప్రాతిపదికని ఏర్పరిచింది. అయితే, ఇదే సమయంలో తన వస్తువులపై ఇండియా విధిస్తున్న అధిక దిగుమతి సుంకాలకి ప్రతిచర్యగా జపాన్, భారతదేశం నుండి దిగుమతి చేసుకొనే ముడి ప్రత్తి పరిమాణాన్ని బాగా తగ్గించి వేసింది. జపాన్ వ్యతిరేక సుంకాల్ని కొనసాగించటమంటే, భారత్ తన సరుకు అమ్మకం కోసం ఇండియా మరో దారి వెతుక్కోవాల్సి రావటమే. లాంక్‌షైర్‌కి అనుకూలంగా తక్కువ పన్నులు విధించటం పట్ల జాతీయవాదులు ఆగ్రహం ప్రకటించినట్లుగానే,లాంక్‌షైర్‌కి పోటీగా, నాణ్యమైన వస్త్రాల్ని ఉత్పత్తి

చేస్తున్న అహమ్మదాబాద్ వస్త్ర పారిశ్రామికవేత్తలకి తమకి అవసరమైన పొడుగుపింజ దూది, భారీ పరిమాణంలో బ్రిటన్‌కి తరలివెళ్ళటం ఇష్టంలేదు. అయితే బొంబాయి మిల్లు యాజమానులు,టాటాలు. ఉదా:– ( వీరే, ఈ సంఘటన తరువాత వెనువెంటనే ఉక్కు పరిశ్రమకి సంబంధించి బెల్జియం దేశ పోటీని ఎదుర్కోడానికి బ్రిటిష్ ఉక్కు పరిశ్రమ పెట్టుబడిదారులతో, చేతులు కలిపారు) కలిపి బలమైన పోటీ పక్షంగా 'ఏర్పడగా, రాజకీయంగా కూడా ఠాకూర్‌దాస్, 1932 జూన్ నాటికి 'ఏదో అవగాహనకి రావాలని, అదే ఉద్దేశ్యంతో బిర్లా కూడా 1932 – 34 సంవత్సరాల కాలంలో, ప్రభుత్వానికి, గాంధీజికి ఒక మధ్యవర్తిగా వ్యహరించటం జరిగింది.

అయినప్పటికీ బ్రిటిష్ వారితో భారతీయ వ్యాపార వర్గాల అయోగ్యమైన పూర్తిస్థాయి సహకారానికి, వాస్తవిక ఆర్థిక, రాజకీయ పరిస్థితులు, వత్తిళ్ళు అడ్డుపడ్డాయి. దిగుమతుల్ని ప్రోత్సహిస్తూ, అందుకు అవసరమైన ప్రతి ద్రవ్యోల్బణ ఖజానా ద్రవ్య విధానాల్ని కొనసాగించటానికి ప్రాతిపదికగా ఉండే షిల్లాంగ్ ఆరుడియమ్‌ల నిష్పత్తి (1:6) పద్ధతిని అమలులో ఉంచాలని బ్రిటన్ పట్టుబట్టటమే. వారితో భారతీయ వ్యాపార వర్గాల సహకారానికి ఒక శాశ్వత ఆటంకంగా ఉండిపోయింది. పెట్టుబడిదారీ ప్రపంచంలోని అనేక దేశాలు, ఆర్థికసంక్షోభాన్ని తట్టుకోడానికి భారీ స్థాయిలో ప్రభుత్వ వ్యయం చేస్తుండగా, భారతదేశంలో 'ధృడమైన ఆర్థిక స్థిరత్వం' ఒట్టిపడివాదంగా మిగిలిపోవటమే కాకుండా, రైల్వే, నీటి పారుదల వ్యవస్థలో భారీ కోతలకి పాల్పడటం జరిగింది. సరుకుల ఎగుమతులు ఘోరంగా తగ్గిపోయిన సమయంలో, 1931 నుండి భారీ ప్రమాణాల్లో మొదలై కొనసాగిన బంగారం ఎగుమతుల (స్టరింగ్‌కి బంగారం ప్రమాణంతో లింకు తెగిపోయిన తర్వాత రూపాయి తాలూకు బంగారం విలువ క్షీణముఖం పట్టింది). తాలూకూ ఆదాయం హోమ్ ఛార్జీలు, అప్పుల చెల్లింపులకి గాను ప్రభుత్వానికి బాగా ఉపయోటపడటం జరిగింది. ఏమైనప్పటికీ, ఈ చర్యల్ని భారతీయ వ్యాపార వర్గాలు తీవ్రంగా నిరసించగా, సంక్షోభ పీడత రైతాంగం, ఆర్థిక దురవస్థని తట్టుకోలేక బంగారాన్ని తెగనమ్ముతున్నారని ప్రజాభిప్రాయం వెల్లడైంది. ఇదే సందర్భంలో కాంగ్రెస్ కార్యకర్తలు, బొంబాయిలోని బంగారం ఎగుమతుల దుకాణాలకి ఎదురుగా పికెట్లు నిర్వహించటం జరిగింది. అయితే, పనిలో పనిగా ఠాకూర్‌దాస్, బిర్లా లాంటి కొంతమంది ప్రముఖులు, అ రహస్యంగా, ఈ ... అనైతిక వ్యాపారం ద్వారా లక్షల రూపాయలు సంపాదిస్తున్నారని కూడా, కొన్ని సందర్భాలలో రాడికల్ జాతీయవాదులు అనుమానించటం జరిగింది. ( Illegal Bombay Congress Bulletin ,17 october 1932, Thakundus papers F.N.101) 1921లో బహిరంగంగానే సహాయ నిరాకరణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన లాల్జీ నారన్‌జీ 1932, జనవరి 27న 'వ్యాపార సరళిలో ఆలోచించే గాంధీజీ విధానంలో ఎక్కువ నమ్మకం కలిగి మాపట్ల ప్రభుత్వ అలక్ష్య ధోరణే, పెట్టుబడిదారులమైన మమ్ము, కాంగ్రెస్ లాంటి సోషలిస్టు సంస్థలలో కేవలం పరిమితమూ, తాత్కాలికమూ అయిన ప్రాతిపదికపై పనిచేయడానికి నెట్టివేసిందంటూ, మాట్లాడం జరిగింది. ఒకవేళ, బ్రిటిష్‌వారు, బంగారం ఎగుమతి, నిలిపివేత, భారతీయ పరిశ్రమలకి రక్షణ, కరెన్సీ ఎక్స్ఛైజు, ఆర్థిక విధానాల్లో మార్పులు చేసిన బ్యాంకింగ్, ఇన్సూరెన్సు, షిప్పింగ్‌లపై గుత్తాధిపత్యాన్ని కొంతమేరకు వదలుకున్నట్లయితే, తాము ఇష్టపడని శాసనోల్లంఘనోద్యమాన్ని కాంగ్రెస్ పార్టీ ఉపసంహరించుకుంటుందని, తాము కోరిన వాటిని తమకి ఇచ్చినట్లయితే,

మరీ ముఖ్యంగా మహాత్మాజీ ఉద్యమాన్ని ఉపసంహరించుకుంటాడని, అతను అభిప్రాయపడటం జరిగింది. ( M.r. Jayakar Papers F, N. 456)

అన్నిటినీ మించి, 1932 –34 సంవత్సరకాలంలో బ్రిటిష్ వ్యాపార సమూహాలు మరీ ముఖ్యంగా ల్యాంక్‌షైర్ గ్రూప్ చర్చిల్ నాయకత్వంలోని కరడు కట్టిన మితవాద టోరీ గ్రూప్‌తోమమేకమై సైమన్ చట్రాన్ని మించి ఎటువంటి రాయితీలు భారతీయ వ్యాపార వర్గాలకి ఇవ్వకూడదని మొండిపట్టు పట్టడంతో, వారితో సహకారం దాదాపుగా అసాధ్యమైంది. కేంద్ర పరిధిలో చేయాలనుకుంటున్న ఎటువంటి మార్పులనైనా నిరవధిక వాయిదా వేయాలని, లేదా ప్రత్యామ్నాయంగా 1919 నాటి ద్రవ్య స్వతంత్ర సంప్రదాయాన్ని దాదాపుగా రద్దు పరిచే తీవ్రమైన వ్యాపార, ఆర్థిక రక్షణ కవచాల్ని ఏర్పరచాలని డిమాండ్ చేయటం జరిగింది. వీటికి తోడుగా లాంక్‌షైర్ గ్రూప్ వత్తిడి బ్రిటన్‌కి ఎటువంటి ప్రాధాన్యత నివ్వకుండా, ప్రత్తి దిగుమతిపై ఎక్కువ సుంకాలు విధించే 1932 డిసెంబర్ నాటి, టారిఫ్ బోర్డు సిఫారసుల్ని తొక్కి పట్టడానికి ఉపకరించగా, అదే వరుసలో లీస్ –మోడీ రాయితీల్ని క్రమబద్ధీకరించడానికి 1934 వ సంవత్సరంలో అనేక ప్రయత్నాలు చేయటం జరిగింది. 1935 నాటి ఇండో బ్రిటిష్ సప్లిమెంటరీ ఒప్పందం, ఒట్టావా ఏర్పాటు (ottava arrangement) లో మినహాయించబడిన ప్రత్తి సుంకాల్ని తన పరిధిలోకి తీసుకు రావటంతో  పాటుగా, ద్రవ్యపరంగా అనుకూల అవకాశాలు ఏర్పడిన వెంటనే పన్నుల విధింపులో 25 శాతం కోతకి మార్గాన్ని సుగమం చేసింది. (బసుదేవ్ చటర్జీ, అధ్యాయం6). 1934 నవంబర్ 14న బిర్లాలా లాంక్‌షైర్ ప్రస్తుతం మానవ రక్తాన్ని రుచి చూసింది కాబట్టి మోడీ –లీస్ పాక్ట్‌తో అది సంతృప్తి చెందదని చాలా నాటకీయంగా ఠాకూర్‌దాస్‌ని హెచ్చరించాడు.

సహకారం, సంఘర్షణ అనే రెండు వ్యతిరేక దిశల వైపు రెండు విరుద్ధ గ్రూపులు పని చేయగా, దాని అంతిమ ఫలితంగా, వ్యాపార వైఖరుల్లో పునస్సమీకరణ జరిగి, అది, ప్రజా ఉద్యమాలకి దూరంగానూ, అసెంబ్లీ, మంత్రి వర్గ నిర్మాణాల్లో పాలు పంచుకొనేటట్లుగానూ, కాంగ్రెస్ విధానంలో మార్పు తీసుకురావటం కోసం ప్రయత్నించింది. ఇదే పునస్సమీకరణ, భారతీయ పెట్టుబడిదారీ శ్రేణుల్లో విధేయవాద సన్నిహితులు, జాతీయవాద అనుకూలురుగా ఉన్న చీలికను కూడా అధిగమించేటట్లు చేయగా, ఆ పరిణామం 1930 దశకం తొలి సంవత్సరాలలో చాలా స్పష్టంగా వెల్లడైంది. ఈ పరిణామం, సామాజిక ఆర్థిక చట్రంలో క్రింది వర్గాల నుండి వచ్చిన స్థానిక నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వం సర్దుబాటు చేసుకున్న తీరుకి అనుగుణంగా ఉంటుంది.

**హరిజన ప్రచారం**

1932 సంవత్సరం ద్వితీయార్ధంలో విఫలమైన ప్రతిఘటన నుండి గౌరవప్రదమైన వెనుకంజని గురించి జైలులో ఉన్న గాంధీ ఆలోచనలు ప్రారంభించి వుంటాడు. కాని గాంధీతో ఎలాంటి రాజకీయ చర్చలు జరపరాదని బ్రిటిష్‌వారు మంకుపట్టుతో నిర్ణయం తీసుకొన్నందున

అది కష్టసాధ్యమయింది. అలాంటి సందర్భంలో గాంధీ యొక్క సహజ స్పందన 1922 తరువాతలాగానే గ్రామీణ నిర్మాణాత్మక పనులు చేపట్టడం, అస్పృశ్యులకు ప్రత్యేక నియోజకవర్గాల సృష్టితో 1932 ఆగస్టు మెక్డొనాల్డ్ కమ్యూనల్ అవార్డు గాంధీ దృష్టిని హరిజన సంక్షేమంపై కేంద్రీకరించడానికి తోడ్పడింది. అస్పృశ్యులకు ప్రత్యేక నియోజకవర్గాల సమస్యపై గాంధీ సెప్టెంబర్ 20న ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించాడు. సవర్ణ హిందూ నాయకులు అస్పృశ్య నాయకుల మధ్య (పూనా) ఒప్పందాన్ని కుదర్చగలిగాడు. ఫలితంగా అవార్డు మార్చబడింది. అస్పృశ్యులకు రిజర్వు చేయబడిన సీట్లతో హిందూ నియోజకవర్గాలు అలాగే వుంచబడ్డాయి. కాని మెక్డొనాల్డ్ అవార్డు కంటే అస్పృశ్యులకు ఎక్కువ సీట్లు కేటాయించబడ్డాయి. ఈ పద్ధతి 1947 తరువాత కూడా కొనసాగించబడింది. ఇప్పుడు గాంధీకి హరిజనోద్ధరణ ప్రధాన సమస్య అయింది. ఆయన జైలు నుండి విడుదల కాకముందే అఖిల భారత అస్పృశ్య వ్యతిరేక లీగుని (1932 సెప్టెంబర్) 'హరిజన' వారపత్రిక (1933 జనవరి)ని ప్రారంభించాడు. 1933 నవంబర్ 1934 ఆగస్టు మధ్య కాలంలో 12,500 మైళ్ళ దూరం హరిజన పర్యటన జరిపారు. 1934 జనవరి 15న సంభవించిన భయంకరమైన తుఫాన్‌ని సవర్ణ హిందువుల పాపాలకు భగవంతుడు విధించిన శిక్షగా వర్ణించారు. ఈ ఛాందస ధోరణికి రవీంద్రనాథ్ ఠాగూర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శాసనోల్లంఘన క్రమంగా తెర వెనుకకి జారిపోయింది. 1933 మే నుండి తాత్కాలికంగా నిలిపివేయబడింది. 1933 ఆగస్టు 23న గాంధీ జైలు నుండి విడుదలయిన తరువాత 1934 ఏప్రిల్‌లో ఉద్యమం విరమించబడింది.

గాంధీ యితర కార్యక్రమాలలాగానే హరిజన ప్రచారం లక్ష్యాలలో, ప్రాధాన్యతలలో చాలా అస్పష్టతలు, సందిగ్ధాలు వున్నాయి. హరిజన ప్రచారాన్ని కాంగ్రెస్ యొక్క ప్రధాన లక్ష్యమైన సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం నుండి ప్రమాదకరమైన ప్రక్కదారి పట్టించడంగా నెహ్రూలాంటి జాతీయ నాయకులు భావించారు. ఇదే అభిప్రాయంతో వున్న ప్రభుత్వం గాంధీ జైలు నుండే హరిజన కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశాలు కల్పించింది. అదే సమయంలో కాంగ్రెస్‌లోని సనాతన హిందువులు ఈ వైఖరి పట్ల ప్రతికూలంగా వున్నారు. ఉదాహరణకు 1920 దశాబ్దం మధ్య కాలంలో గాంధీకి అత్యంత సన్నిహితుడుగా వున్న మాలవ్యా యిప్పుడు దూరమవడం మొదలయింది. ముస్లింలకు పంజాబ్‌లో 40%, బెంగాల్‌లో 48.6% (యూరోపియన్ సభ్యులతో సహా, రెండు ప్రావిన్సులలో మెజారిటీలు), సీట్లు యివ్వడంతో పాటు మెక్డొనాల్డ్ అవార్డులోని యితర అంశాలతో సంబంధాన్ని గాంధీ తిరస్కరించడంతో హిందూ మతవాదుల నిరసన తీవ్రతరమయింది. మత ప్రాతిపదికన హిందువుల్ని శాశ్వతంగా మైనారిటీలుగా వుంచే విధంగా జరిగిన పూనా ఒప్పందాన్ని బెంగాల్ సనాతన హిందువులు తీవ్రంగా వ్యతిరేకించారు. కాని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 1934 జూన్‌లో 'తిరస్కారం కాదు – అంగీకారం కాదు' అనే రాజీ సూత్రాన్ని ఆమోదించింది. ఇది మాలవ్యా కాంగ్రెస్ నుండి విడిపోయి కాంగ్రెస్ నేషనలిస్టు పార్టీ స్థాపనకు దారితీసింది. 1934 ఏప్రిల్ జూలైలలో బక్సర్ జాసిద్ అజ్మీరులలో గాంధీ హరిజన సమావేశాలు సనాతనవాదులచే విచ్ఛిన్నం చేయబడ్డాయి. పూనాలో జూన్ 25న గాంధీ కారుపై బాంబు దాడి కూడా జరిగింది. ఆధునీకరణ చేపడుతున్నామని గొప్పలు చెప్పుకొనప్పటికి బ్రిటిష్ ప్రభుత్వ సనాతనవాదుల భావాలకు

దూరంగా వుండాలనే ఆలోచన కూడా లేదు. 1934 ఆగస్టులో లెజిస్లేటివ్ అసెంబ్లీలో దేవాలయ ప్రవేశం బిల్లుని ఓడించడానికి అధికార సభ్యులు తోడ్పడ్డారు.

దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్టి కోణం నుండి చూస్తే గాంధేయవాదులు చేపట్టిన హరిజన సంక్షేమ కార్యక్రమాలు పరోక్షంగా గ్రామీణ సమాజంలోని పూర్తిగా అణచివేయబడిన సెక్షన్లకు సందేశాన్ని వ్యాపింపజేయడంలో తోడ్పడ్డాయి. దేశంలోని వివిధ ప్రాంతాలలో కాంగ్రెస్ పార్టీ పట్ల సంప్రదాయకంగా హరిజనుల విధేయతని అభివృద్ధి పరచడానికి తోడ్పడ్డాయి. స్వాతంత్ర్యానంతరం కూడా పార్టీకి యిది చాలా సహాయపడింది. గాంధీ హరిజన ప్రచారాన్ని పరిమితమైన సంఘ సంస్కరణకి (బావులు, రోడ్లు ప్రత్యేకించి దేవాలయాలు హరిజనులకు తెరవబడి వుండటం, మరికొంత మానవతావాద కృషి) పరిమితం చేశాడు. ఆర్థిక డిమాండ్ల నుండి (హరిజనులలో అత్యధికులు వ్యవసాయ కూలీలైనప్పటికి) వేరుచేశాడు. కుల వ్యవస్థపై దాడి చేయడాన్ని తిరస్కరించారు. సహపంక్తి భోజనాలు, కులాంతర వివాహాలపై జాగ్రత్తల్ని సూచించాడు. వర్ణాశ్రమ ధర్మాన్ని సమర్ధించాడు. ఫలితంగా 'కుల నిర్మూలన తప్ప అస్పృశ్యుని ఏదీ విముక్తి చేయలేదని నిశ్చితాభిప్రాయంతో వున్న అంబేద్కర్ హరిజన వార పత్రికకు సందేశాన్ని పంపించ నిరాకరించాడు. (టెండూల్కర్ వాల్యూం 3 పేజి 236–8) రైతు ఉద్యమాలలో లాగానే గాంధీ హరిజనోద్ధరణ ఉద్యమం క్రింది నుండి సమూలమైన మార్పులు కోరే ఒత్తిళ్ళపై ఆధిపత్యం సాధించ యత్నించింది. తమిళనాడులో 1930 దశాబ్ద ప్రారంభ సంవత్సరాలలో ఇ.వి. రామస్వామి నాయకర్ ఆత్మగౌరవ ఉద్యమం త్వరత్వరగా అభివృద్ధి చెందింది. ప్రభుత్వ విధేయత గల కులీనుల జస్టిస్ పార్టీకి భిన్నంగా ఆత్మగౌరవ ఉద్యమం యొక్క బ్రాహ్మణ వ్యతిరేకత ప్రజాదరణ పొందింది. నాయకర్ 1932లో సోవియట్ పర్యటన తరువాత కోయంబత్తూరులో 'స్టాలిన్ హాల్' నిర్మించాడు. 'కుది అరసు' పత్రిక ప్రారంభించాడు. దానిలో కమ్యూనిస్టు నాయకుడైన సింగారవేలు చెట్టియార్ సోషలిస్టు రచనలను ప్రచురించారు. నాయకర్ సోషలిస్టు తాత్కాలికమైనదైనప్పటికి పి. జీవానందన్ లాంటి కొందరు ఆత్మగౌరవ కార్యకర్తలు తరువాత కమ్యూనిస్టు నాయకులయ్యారు. గాంధీ కేరళలోని మత వ్యతిరేక వైఖరిని ప్రతిఘటించారు. 1930లో గాంధేయవాదియైన టి.కె. మాధవన్ మరణానంతరం యజవా కులసంఘమైన ఎస్.ఎన్.డి.పి. యోగం, సి. కేశవన్, కె. అయ్యప్పన్‌ల వశమయింది. వీరు దేవాలయ ప్రవేశం చాలా చిన్న సమస్యయని, అనావశ్యకమైనదని భావించారు. వీరు స్వయంగా మార్క్సిస్టులు కాకపోయినప్పటికి చాలామందికి ప్రేరణనిచ్చి కమ్యూనిస్టు బాట పట్టించారు. కాని భారతదేశ వామపక్షవాదులు కులానికి, వర్గానికి మధ్య గల సంక్లిష్టమైన అంతర సంబంధాలపై వలసినంత దృష్టి సారించడంలో విఫలమయ్యారు. అందుకే కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కార్యక్రమం ముసాయిదాలో అస్పృశ్యతను ప్రస్తావించనందున గాంధీ 1934 ఆగస్టు 2న నరేంద్రదేవ్‌ని విమర్శించారు.

## తిరిగి కౌన్సిల్ రాజకీయాలకు

బిర్లా హరిజన ప్రచారానికి విరాళాలిచ్చారు. అస్పృశ్య వ్యతిరేక లీగుకి అధ్యక్షత వహించడానికి అంగీకరించారు. కాంగ్రెస్ మరలా చట్టసభల్లో ప్రవేశించడం, అక్కడ

వారికనుకూలంగా ఒత్తిడి తెచ్చే గ్రూపులుగా పనిచేయడం పట్ల వాణిజ్య గ్రూపులు చాలా ఆసక్తిగా (యిప్పుడు శాసనోల్లంఘన విఫలమయింది గనుక) వున్నాయి. ప్రావిన్సులలో పూర్తి బాధ్యతాయుత ప్రభుత్వం అత్యధిక కాంగ్రెస్ నాయకులకు కూడా ఆకర్షణగా కన్పించింది. స్వరాజ్య పార్టీని పునరుద్ధరించి ఎన్నికల రాజకీయాలకు తిరిగి వచ్చే పథకాల్ని గురించి సత్యమూర్తి 1933 అక్టోబర్‌లో అంచనా వేశాడు. 1934 ఏప్రిల్‌లో భూలాభాయ్ దేశాయ్, అన్సార్. బి.సి. రాయ్‌లు అనుసరించారు. కమ్యూనల్ అవార్డు సమస్యపై మాలవారీ – ఆనేల హిందూ మతవాద గ్రూపు చీలికతో పరిస్థితులు క్లిష్టమయ్యాయి. కాని మరలా సాంప్రదాయ రాజకీయాల వైపు మొగ్గు స్పష్టంగా కనిపించింది. గాంధీ 1934 ఏప్రిల్‌లో బిర్లాకి రాసిన లేఖలో కౌన్సిల్ ప్రవేశానికి కట్టుబడి వుండే పార్టీ కాంగ్రెస్‌లో ఎప్పుడూ వుంటుంది. కాంగ్రెస్ పగ్గాలు ఆ గ్రూపు చేతుల్లో వుంటాయి. (మహాత్ముని నీడలో పేజి 138). తమిళనాడులో కౌన్సిల్ ప్రవేశాన్ని బలపరిచే వారిలో 1934లో రాజగోపాలాచారి కూడా వున్నారు. సత్యమూర్తి గతంలో కూడా స్వరాజ్యవాదే. గాంధేయ నిర్మాణాత్మక కార్యకర్తలు, కౌన్సిల్ ప్రవేశాన్ని కోరేవారు కలిసి పెరుగుతున్న వామపక్ష సవాల్‌ని ఎదుర్కొనేందుకు ఉమ్మడి వేదిక మీదకి వచ్చారు. ఈ విధంగా స్పష్టమైన రైట్ కాంగ్రెస్ ఏర్పాటు క్రమంలో వాణిజ్యవేత్తల సలహాలు ఒత్తిళ్ళు ముఖ్యమైన పాత్ర నిర్వహించాయనడానికి కావలసినన్ని సాక్ష్యాధారాలు వున్నాయి. "భూలాభాయ్ దేశాయ్‌తో సంబంధాలు పెట్టుకొని వుండవలసిందిగా కోరుతున్నాను" – 1934 ఏప్రిల్ 12న బిర్లా ఠాకూర్‌దాస్‌కి సలహా యిచ్చాడు. 'స్వరాజ్య పార్టీ ఏర్పాటు విజయవంతమైతే ఎన్నికలలో పోరాడేందుకు నిధులు వసూలు చేయవలసి వుంటుంది. తగిన వ్యక్తులు పంపించబడుతున్నారని నిర్ధారించుకొనేవరకు బాబాయి నుండి విరాళాలు యివ్వవద్దని సలహా యిస్తున్నాను." 1934 ఆగస్టు 3న వల్లభాయ్ రాజాజీ, రాజేంద్రబాబు కమ్యూనిజం, సోషలిజంలతో పోరాడేందుకు సన్నద్ధమయ్యారు. 'ఆరోగ్యకరమైన పెట్టుబడిదారీ విధానానికి ప్రతినిధులమైన మనం సాధ్యమైనంత వరకు గాంధీకి సహాయపడాలి' (ఠాకూర్‌దాస్ పత్రాలు ఎఫ్.ఎన్. 126.42 (VI))

**వామపక్ష ప్రత్యామ్నాయం**

కలిగించిన అంచనాలను నెరవేర్చజాలని శాసనోల్లంఘనాన్ని గురించి యింకా ఆలోచిస్తున్నవారు వామపక్ష ప్రత్యామ్నాయ ఆవిర్భావంతో కలవరపడ్డారు. ప్రపంచ ఘటనలు కూడా గణనీయమైన పాత్ర నిర్వహించాయి. ఒకవైపు ప్రపంచ పెట్టుబడిదారీ విధానం అధికోత్పత్తి సంక్షోభం అనే అసంబద్ధతతో కునారిల్లుతున్నది. అన్ని రకాల మానవ విలువల్ని, ప్రజాస్వామ్య విలువల్ని తుడిచిపెట్టే నాజీయిజాన్ని పెంచి పోషిస్తున్నది. మరోవైపు సోవియట్ యూనియన్ పంచవర్ష ప్రణాళికలతో క్రొంగొత్త నాగరికతను సృష్టిస్తూ ముందుకు పోతున్నది. స్టాలిన్ క్షాళనా కార్యక్రమాలు నాజీ – సోవియట్ ఒప్పందం సోవియట్ ప్రతిష్టని తగ్గించలేకపోయాయి.

1933 మేలో గాంధీ మొదటిసారి శాసనోల్లంఘన విరమించినప్పుడు సుభాస్ బోస్, విఠల్‌భాయ్ పటేల్ యూరప్ నుండి గాంధీ నాయకత్వం పట్ల అసమ్మతి తెలుపుతూ

ఒక ప్రకటన చేశారు. అంతకంటే ముఖ్యమైన అంశమేమంటే సైద్ధాంతికంగా ప్రత్యామ్నాయానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడని భావించబడిన జవహర్‌లాల్ నెహ్రూ అప్పుడు జైలులో వున్నాడు. తరువాత కాలంలో 'గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ' (1934)గా ప్రచురింపబడిన ఆయన తన కుమార్తెకి రాసిన ఉత్తరాలు, 1934–35లో జైలులో వుండి రాసిన జీవిత చరిత్ర – మార్క్సిస్టు సోషలిస్టు ఆలోచనల పట్ల ఆయనకు గల పాక్షిక నిబద్ధతని తెలియజేస్తున్నాయి. నెహ్రూ 1933 జూలై 1934 ఫిబ్రవరి వున్న కాలంలో గాంధీతో ఆయనకు గల సైద్ధాంతిక విభేదాలను స్పష్టం చేస్తూ రాయబడిన లేఖలు వ్యాసాలు 'ఇండియా ఎటువైపు (Whither India)' గ్రంథంగా ప్రచురింపబడింది. ఇవి జాతీయవాద లక్ష్యాలను సమూలమైన మార్పులు కోరే సామాజిక ఆర్థిక కార్యక్రమాలతో మిళితం చేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పాయి. మతవాదాన్ని ఎదుర్కొన్నాయి. (హిందూ మహాసభ 1933 అక్టోబర్ అజ్మీరు సదస్సులో హిందువుల ఆత్మరక్షణ కొరకు యిచ్చే పిలుపుని పెట్టుబడిదారులు భూస్వాములు ఒక వర్గంగా అంతం చేయాలని ప్రచారం చేసే ఏ ఉద్యమాన్నైనా నిరసించే పిలుపుతో మిళితం చేసింది). గాంధీతో పూర్తిగా విభేదించడం నుండి నెహ్రూ వెనక్కి తగ్గాడు. 'సామాజిక ప్రతీప శక్తులకు కాంగ్రెస్‌ని పూర్తిగా వదిలిపెట్టి తాను బయటకు రావలసిని అవసరం' నెహ్రూకి కనిపించలేదు. సోషలిస్టు పార్టీ స్థాపించాలని చేయబడిన ప్రతిపాదనల్ని అంగీకరించలేదు. ఈ ఆలోచనతో గాంధీ కలత చెందలేదు. "ఆయన కమ్యూనిస్టు ఆలోచనలు... ఎవరినీ భయపెట్టవు" (బొంబాయి క్రానికల్ ఇంటర్వ్యూ 1933 సెప్టెంబర్ 18) కాని చాలామంది బ్రిటిష్ అధికారులు నెహ్రూని పెద్ద కమ్యూనిస్టు ప్రచారకుడిగా భావించారు. అందుకే అందరు నాయకులు విడుదల చేయబడినప్పుడు నెహ్రూని జైలుకి పంపించారు.

కాంగ్రెస్‌లో వుంటూ కాంగ్రెస్‌ని వామపక్ష దిశగా నడిపించే ఆలోచన 1933లో నాసిక్ జైలు సమావేశాలలో ప్రస్తావనకు వచ్చింది. ఈ సమావేశాలలో పాల్గొన్నవారిలో జయప్రకాష్ నారాయణ, అచ్యుత్ పట్వర్థన్, యూసుఫ్ మెహరాలి, అశోక్ మెహతా, మినూ మసానిలు వున్నారు. భారతదేశం కొరకు తాత్కాలిక సోషలిస్టు కార్యక్రమాన్ని 1934 ఏప్రిల్‌లో యుపి కాంగ్రెస్ నాయకుడు సంపూర్ణానంద్ తయారు చేశాడు. ఆ తరువాత నెలలో నరేంద్రదేవ్ అధ్యక్షతన జరిగిన పాట్నా సదస్సులో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ స్థాపించబడింది. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కాంగ్రెస్ లోపలే వుండాలని కోరుకొనడం, కాని కాంగ్రెస్ నాయకత్వంతో పూర్తిగా విభేదించడం, కాంగ్రెసేతర వామపక్ష గ్రూపులకు సహకరించడానికి సిద్ధపడటం లాంటి కారణాలతో దానిలో ప్రారంభం నుండి సందిగ్ధతలు చోటుచేసుకున్నాయి. సంస్థాపకుల సిద్ధాంతం అస్పష్టమైన కలగాపులగంగా వున్న జాతీయవాదం నుండి శాస్త్రీయ సోషలిజం వరకు విస్తరించి వుంది. సంఘ సంస్కరణ వాదానికి కాంగ్రెస్ సోషలిస్టు పార్టీకి గల తేడాని నరేంద్రదేవ్ పాట్నా సదస్సులో వివరించాడు. రైట్ కాంగ్రెస్ నాయకులు కొత్త ధోరణిని తీవ్రంగా నిరసించారు. సీతారామయ్య 1934 సెప్టెంబర్ 21న పటేల్‌కి రాసిన లేఖలో ఆ పార్టీ

సంస్థాపకుల్ని క్రింది తరగతి జనంగా వర్ణించాడు. వ్యక్తిగత ఆస్తిని స్వాధీనం చేసుకోవడం, వర్గ పోరాటం ఆవశ్యకతని గురించి అధిక ప్రసంగం, అహింసకి విరుద్ధమని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 1934 జూన్‌లో ఖండించింది. నెహ్రూ ఆ పార్టీ పట్ల సానుభూతి కలిగి వున్నాడు. కాని దానిలో చేరలేదు. గాంధీ నరేంద్రదేవ్‌కి రాసిన లేఖలో (1934 ఆగస్టు 2న) 'మనకు సోషలిజం మంత్రాన్ని యిచ్చిన నెహ్రూ జైలు నుండి బయటికి వచ్చి ఉంటే... హడావిడి చేసి వుండేవారు' అని అభిప్రాయపడ్డాడు. అంతేగాక ఆ లేఖలో గాంధీ 'నేనూ, యింకా వృద్ధతరం నాయకత్వం నుండి వైదొలిగాక సహజంగా ఈ కాంగ్రెస్ ముళ్ళ కిరీటాన్ని ధరించేది నెహ్రూయే'నని జోస్యం చెప్పాడు. ఈ అంశాన్ని వల్లభాయ్ పటేల్ సౌకర్యార్థం మరలా చెప్పాడు. (టెండూల్కర్ వాల్యూం 3, పేజీ 386)

యుపి లాంటి ప్రావిన్సులలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ (సిఎస్‌పి) యొక్క త్వరిత పురోగతి (ప్రావిన్సు కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు 11 మందిలో ఏడుగురు కాంగ్రెస్ సోషలిస్టులని 1934 సెప్టెంబర్‌లో ప్రభుత్వ సమాచారం) ఊహాజనితమైంది. ఈ మద్దతు వివిధ స్థాయిల్లో కాంగ్రెస్ నాయకత్వంతో గల విభేదాల కారణంగా ముఠా తగాదాల గ్రూపుల నుండి లభించిందే. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ సంస్థాపకులలో అత్యధికులు క్రమరాహిత్యమైన రాజకీయ జీవితాలు గడిపినవారే. ఆ తరువాత కూడా నిరంతరాయంగా వామపక్ష రాజకీయాలకు కట్టుబడినవారు కాదు. కాని కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ప్రచారం వ్యవసాయ సంస్కరణ సమస్యలపై పారిశ్రామిక కార్మికులు స్వదేశీ సంస్థానాల భవిష్యత్తు, ప్రజాసమీకరణ పోరాటాలలో గాంధీయేతర విధానాలు లాంటి సమస్యలపై కాంగ్రెస్ శ్రేణుల యొక్క నాయకత్వం ఆలోచనలకు ప్రేరణ యివ్వడంలో తోడ్పడింది. నరేంద్రదేవ్ నాయకత్వంలో 1934 ఆగస్టులో నిర్వహింపబడిన కార్మిక కర్షకుల సాధారణ సమ్మె గాంధీకి చాలా ప్రమాదకారిగా కన్పించింది.

కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కార్యకర్తలు ఆవిర్భవిస్తున్న కిసాన్ సభ ఉద్యమంతో ప్రత్యేకించి ఆంధ్ర బీహారులలో సన్నిహిత సంబంధాలు పెంచుకోగలిగారు. కోస్తా ఆంధ్ర జిల్లాలలో 1933-34లో చాలా రైతు పాదయాత్రలు నిర్వహించబడ్డాయి. 1933 ఏలూరు జమిందారీ రైతు సదస్సు జమిందారీ విధానం రద్దుని డిమాండ్ చేసింది. కాంగ్రెస్ సోషలిస్టు నాయకుడు ఎన్.జి. రంగా రైతులకు శిక్షణ యిప్పించేందుకు నిడుబ్రోలులో రైతు పాఠశాల ప్రారంభించాడు. ప్రభుత్వానికి విధేయతగా వున్న జమిందారీ ఆధిపత్యంలో గల యునైటెడ్ పార్టీ చెట్లు నాటడానికి, బావులు త్రవ్వడానికి సలామి చెల్లించిన తరువాత కమతం మార్పు లాంటి చిన్న సమస్యలపై రాయితీల ద్వారా రైతుల్ని ఆకట్టుకోవడానికి చేసిన ప్రయత్నాలకు ప్రతిగా బీహారు కాంగ్రెస్ నాయకత్వంలోని ఒక సెక్షన్ కిసాన్ సభని పునరుద్ధరించమని 1933లో సహజానందని ప్రోత్సాహించింది. యునైటెడ్ పార్టీ కౌళ్ళ తగ్గింపు ప్రైవేట్ కమతాలు పెంచడానికి భూస్వాముల ప్రయత్నాలు, ఆర్థిక మాంద్యం కాలంలో దీర్ఘకాలిక కౌలు రైతుల్ని తొలగించి వారి స్థానంలో స్వల్పకాలిక వ్యవధితో కౌళ్ళ కివ్వడం లాంటి ముఖ్యమైన సమస్యల జోలికి పోలేదు. ఇలాంటి సమస్యలపై సహజానంద ఉత్తర మధ్య బీహారులలోని రైతుల్ని పెద్ద సంఖ్యలో త్వరగా

సమీకరించగలిగాడు. 1935 నాటికి సహజానంద కిసాన్ సభ సభ్యత్వం 80,000కి పెరిగింది. ఆయన మొదట జమిందారీ విధానం రద్దు లేక స్పష్టమైన వర్గపోరాటం కొరకు యిచ్చే పిలుపుల్ని వ్యతిరేకించాడు. కాని కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ యొక్క నిరంతర ఒత్తిడి సహజానంద ఈ కార్యక్రమాన్ని ఆమోదించడానికి దారితీసింది. బీహారు ప్రొవెన్షియల్ కిసాన్ సభ 1935 హాజీపూర్ సదస్సులో ఈ కార్యక్రమాన్ని ఆమోదించింది. 1930 దశాబ్దం మధ్య, చివరి సంవత్సరాలలో సమూలమైన మార్పులు కోరే జాతీయవాదులు పూర్తి స్థాయి కమ్యూనిస్టు పార్టీ మార్గం పట్టడానికి కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ వారధిగా పనిచేసింది. నిడుబ్రోలులో తాను శిక్షణ యిచ్చిన 2000 మంది రైతు యువకులలో మూడవ వంతుని, ఆంధ్ర సోషలిస్టు పార్టీలో 90% మందిని కమ్యూనిస్టు పార్టీ లాక్కుపోయిందని ఎన్.జి. రంగా వాపోయాడు (రివల్యూషనరీ పెజెంట్స్, పేజీలు 75, 76) కమ్యూనిస్టు పార్టీ 1934 నుండి 1942 వరకు చట్ట విరుద్ధమైన పార్టీగా ప్రకటించబడటంతో కమ్యూనిస్టులు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీని చట్టబద్ధమైన రక్షణగా ఉపయోగించుకున్నారు.

1920 దశాబ్దపు చివరి సంవత్సరాలలోలాగా 1933, 34 సంవత్సరాలు కమ్యూనిస్టు కార్యకలాపాలతో కార్మిక సంఘాలు పునరుజ్జీవనం పొందిన సంవత్సరాలు. 1920 నుండి చూస్తే 1932లో కార్మికుల సమ్మెలు అత్యంత తక్కువగా జరిగాయి. ఆ మరుసటి సంవత్సరం నుండి అవి క్రమంగా పెరగడం ప్రారంభమయింది.

| **సంవత్సరం** | **సమ్మెల సంఖ్య** | **పాల్గొన్న కార్మికుల సంఖ్య** | **కోల్పోయిన పని దినాలు** |
|---|---|---|---|
| 1932 | 118 | 128,099 | 1,922437 |
| 1933 | 146 | 164,938 | 2,168,961 |
| 1934 | 159 | 220,808 | 4,775,599 |

(సి.రెవ్రీ ఇండియన్ ట్రేడ్ యూనియన్ మూమెంట్ (1972) పేజి 183-5)

బ్రిటిష్ జనపనార, భారత ప్రత్తి మిల్లుల యజమానులు కార్మికుల తగ్గింపు క్రమబద్ధీకరణ వేతన కోతల ద్వారా మాంద్యం భారాన్ని కార్మికులపై మోపడానికి ప్రయత్నించారు. ఉదాహరణకు బొంబాయి వస్త్ర కార్మికుల సరాసరి రోజువారీ సంపాదన 1926తో పోల్చితే 1933 డిసెంబర్‌లో 16.94% తగ్గింది. 1934లో కార్మికుల నిజ వేతనాలు కూడా తగ్గడం ప్రారంభమయింది. (రెవ్రీ పేజి 176, బాగ్చీ పేజి 122, 1929, 1931లలో వచ్చిన చీలికల వలన కార్మిక ఉద్యమం బలహీనపడింది. ఎఐటియుసికి మితవాద నేషనల్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్, కమ్యూనిస్టు రెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌లను ప్రత్యర్థులుగా సృష్టించాయి.

జైలు శిక్షలు విధింపబడిన నాయకుల స్థానంలో బొంబాయి నుండి బి.టి. రణదివె, ఎస్.వి. దేశ్‌పాండే, కలకత్తా నుండి అబ్దుల్ హలీం, సోమనాథ్ లాహిరి, రణేన్‌సేన్ లాంటి యువ నాయకులు ముందుకు వచ్చినప్పటికి 1930 దశాబ్దం నాటి వామపక్ష తీవ్రవాదం (Ultra Leftism) పరస్పర శత్రువులుగా భావించే వివిధ గ్రూపులుగా చీలిపోవడం జాతీయవాద ప్రధాన స్రవంతి నుండి ఒంటరవడానికి దారితీసింది. కొమింటర్న్ అసంతృప్తివాదులు ప్రయత్నాలు పరిస్థితులు మరికొంత సంక్లిష్టమయ్యాయి. ఎం.ఎన్. రాయ్, సోమేంద్రనాథ్ ఠాగూర్ వారి స్వంత గ్రూపులను ఏర్పాటు చేశారు. వి.బి. కార్నిక్, మణిబెరా జెన్‌కారా, రజనీ ముఖర్జీలాంటి నాయకుల కార్యకలాపాల ద్వారా రాయిస్టులు కార్మిక రంగంలో గణనీయమైన విజయాలు సాధించారు. బారిస్టర్ నరేంద్ర దత్తా మజుందార్ లేబర్ పార్టీ స్థాపించి కార్మికవర్గ నాయకుడిగా ఎదిగాడు.

1934 తరువాత కమ్యూనిస్టు, కార్మికవర్గ ముఠాల పునరేకీకరణ క్రమం ధోరణులు స్పష్టంగా కనిపించాయి. కమ్యూనిస్టులు రాయిస్టులు 1934లో జౌళి పరిశ్రమలో సాధారణ సమ్మె నిర్వహణకు ప్రయత్నించారు. షోలాపూర్ (ఫిబ్రవరి – మే)లో నాగపూర్ (మే – జూలై)లో పెద్ద సమ్మెలు జరిగాయి. అన్నిటిని మించి ఏప్రిల్ నుండి బొంబాయి సాధారణ సమ్మె ప్రారంభమయింది. కార్మికుల, కమ్యూనిస్టుల సమరశీలత ప్రభుత్వ వర్గాలలో కలిగించిన భయవిహ్వలత 1934లోని అధికార పత్రాలలో వ్యక్తమయింది. విద్రోహకర సంఘాలకు వ్యతిరేకంగా 1908లో చేయబడిన చట్టాన్ని ప్రయోగించి ప్రభుత్వం జూలై 23న భారత కమ్యూనిస్టు పార్టీని నిషేధించింది. కాని 1929లో వలె గాక ఉద్యమాన్ని బలహీనపరచడానికి చేపట్టిన అణచివేత విఫలమయింది. అందుకు కారణం 1930 దశాబ్దం మధ్య సంవత్సరాలలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కాంగ్రెస్ పార్టీలలో పనిచేస్తూ వామపక్ష జాతీయవాదులతో సంబంధాలు పెంచుకొని ఐక్య సంఘటన ఎత్తుగడ ద్వారా వామపక్ష శక్తుల్ని పటిష్టపరచి పురోగమించడం 1935లో ఫాసిస్టు ప్రమాదం నేపథ్యంలో కొమింటర్న్ కాంగ్రెస్‌కి జమిత్రత్ రిపోర్టు ప్రతిపాదించిన ఐక్య సంఘటన దృక్పథం పార్టీ పంథాలో ఈ మార్పుకి కారణం. ఇక్కడ మరొక అంశాన్ని నొక్కి చెప్పవలసి వుంది. శాసనోల్లంఘన పరిణామం కమ్యూనిస్టు ఉద్యమంలోనికి విస్తృత సంబంధాలు గల జాతీయవాద ప్రధాన స్రవంతిలో స్థాయి గల భ్రమలు కోల్పోయిన గాంధేయ జాతీయవాదుల రివల్యూషనరీ టెర్రరిస్టుల కొత్త తరాన్ని తీసుకొని వచ్చింది. ఉదాహరణకు కేరళలో పి. కృష్ణ పిళ్లె, ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్, ఎ.కె. గోపాలన్ లాంటి నాయకులు 1930 దశాబ్దం మధ్యకాలం నాటికి అణచివేతతో ఛిన్నాభిన్నం చేయబడిన కాంగ్రెస్ సంస్థ పునర్నిర్మాణం, స్థానిక కాంగ్రెస్ సోషలిస్టు యూనిట్ నిర్మాణం ఏర్పాటు చేస్తూ, కేరళలో కమ్యూనిస్టు పార్టీకి పునాదులు వేస్తూ – ఆ క్రమంలో భాగంగా స్థానిక త్రివేంద్రం కమ్యూనిస్టు లీగు గ్రూపుని విలీనం చేస్తూ వచ్చారు. బెంగాల్‌లో కూడా డిటెన్షన్ క్యాంపులలోని అండమాన్ దీవులలోని టెర్రరిస్టులు సైద్ధాంతిక చర్చలు జరిపి ఆత్మ విమర్శలు చేసుకొని పెద్ద ఎత్తున మార్క్సిజంలోనికి మారడం ద్వారా జిల్లాలలో కమ్యూనిజం వ్యాప్తి జరిగింది. టెర్రరిజం నుండి భవానిసేన్, హరే కృష్ణ కోనార్ లాంటి స్థాయిగల నాయకులు కమ్యూనిస్టు పార్టీలోకి వచ్చారు. అలాగే చిట్టగాంగ్ ఆయుధాగారంపై దాడి జరిపిన ప్రఖ్యాత విప్లవ గ్రూపులోని అత్యధికులు పార్టీలో చేరారు.

ఆ విధంగా జాతీయోద్యమంలోని కుడి ఎడమల (Right & Left) మధ్య ప్రతిఘటనకి రూపం సిద్ధం చేయబడింది. 1935లో బ్రిటిష్ వారు ప్రవేశపెట్టిన నూతన రాజ్యాంగ నిర్మాణం అటు అవకాశాల్ని, ఇటు ఆపదల్ని ఎంచుకునే గీటురాయిగా పనిచేసింది.

## 1935 - 37 రాజ్యాంగం - కాంగ్రెస్

### 1935 చట్టం

8 సం॥ల క్రితం సైమన్ కమిషన్‌తో ప్రారంభమైన సుదీర్ఘమైన క్రమం 1935 ఆగస్టులో భారత రాజ్యాంగ చట్టంతో ముగిసింది. 1932 నుండి రాజ్యాంగ రూపకల్పనలో భారతీయుల నిజమైన భాగస్వామ్యం దాదాపు ఏమీ లేదు. మూడవది చివరిది అయిన రౌండ్ టేబుల్ సదస్సు 1932 నవంబర్ – డిసెంబర్‌లో నిర్వహించబడింది. కేవలం 46 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. (1931లో 112 మంది పాల్గొన్నారు). బ్రిటిష్ ప్రభుత్వం ఒక శ్వేతపత్రాన్ని (1933 మార్చి) ప్రకటించింది. భారతీయుల్ని సంప్రదించడానికి అవకాశం కల్పిస్తూ పార్లమెంట్ జాయింట్ సెలెక్ట్ కమిటీని నియమించింది. బ్రిటిష్ పార్లమెంట్‌లో తీవ్రమైన చర్చలు జరిగిన మీదట చట్టం రూపకల్పన జరిగింది. 1930–31లో శాసనోల్లంఘన ఒత్తిడి మేరకు యివ్వబడిన రాయితీలు ఈ క్రమంలో తగ్గించబడ్డాయి. ఫలితంగా భారత ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించే అన్ని సెక్షన్లు (ఉదారవాదులు, జిన్నా, కాంగ్రెస్) కూడా ఈ చట్టం మన 1919 చట్టం కంటే అదనంగా ఒనగూడిందేమీ లేదని విమర్శించారు. ఉదాహరణకు చర్చిల్ నాయకత్వాన గల మితవాద టోరీల ఒత్తిడి మేరకు సమాఖ్య స్థాయిలో ప్రత్యక్ష ఎన్నికల స్థానంలో పరోక్ష ఎన్నికలు ప్రవేశపెట్టబడ్డాయి. 'విచక్షణాధికారాలు', 'రిజర్వేషన్లు', 'రక్షణలు' వగైరాలతో ప్రభుత్వం యంత్రాంగం విస్తృతమయింది. పట్టు బిగించింది.

ప్రావిన్సులకు ఈ చట్టం (1935) కొన్ని అదనపు ప్రయోజనాల్ని చేకూర్చింది. ద్వంద్వ ప్రభుత్వం స్థానంలో అన్ని శాఖలలోనూ సూత్ర రీత్యా బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పడుతుంది. ఓటర్ల సంఖ్య 6 1/2 మిలియన్ల నుండి 30 బిలియన్లకు పెంచబడుతుంది. కాని చట్టసభలని సమావేశపరచడం, బిల్లులకు అనుమతి, కొన్ని ప్రత్యేక ప్రాంతాల పాలనా నిర్వహణలాంటి అంశాలపై గవర్నర్లకు విచక్షణాధికారాలు వుంటాయి. ఈ అంశాలపై మంత్రులు సలహాలు యివ్వడానికి కూడా అనర్హులు. వ్యక్తిగతంగా నిర్ణయాలు చేసే హక్కు గవర్నర్లకు వుంటుంది. మైనారిటీల హక్కులు, ఉద్యోగుల ప్రత్యేక హక్కులు, బ్రిటిష్ వ్యాపార ప్రయోజనాలకు వ్యతిరేకంగా వివక్ష నివారణ లాంటి అంశాలపై మంత్రులు సలహాలు యివ్వవచ్చు. కాని గవర్నర్ ఆ సలహాల్ని తిరస్కరించవచ్చు. అంతేగాక 1935 రాజ్యాంగ చట్టంలోని సెక్షన్ 93 క్లాజు ప్రకారం గవర్నర్ ఒక ప్రావిన్సు పాలనా బాధ్యతలు స్వీకరించి నిర్దిష్ట కాల వ్యవధితో సంబంధం లేకుండా కొనసాగించవచ్చు. 50 శాతం మంది సంస్థానాధీశులు అంగీకారం తెలిపితేనే సమాఖ్య ప్రభుత్వం అమలులోకి వస్తుంది. ఎన్నికైన మంత్రులకు కేటాయించబడిన శాఖలు రక్షణల పేరుతో పరిమితం చేయబడతాయి. ఇక విదేశీ వ్యవహారాలు రక్షణ శాఖ

పూర్తిగా వైస్రాయి అదుపులో వుంటాయి. కొత్తగా స్థాపించబడిన రిజర్వు బ్యాంకు, అలాగే రైల్వేలపై అసెంబ్లీ అదుపు వుండదు. రుణ సేవలు, ఐ.సి.ఎస్. జీతాలు రిజర్వుడు అంశాలుగా వుంటాయి. కరెన్సీ మరియు మారకాలపై చట్టం చేయాలంటే ముందుగా వైస్రాయి అనుమతి పొందాలి. ఆర్థికపరమైన అదుపుని చట్టం లండన్ నుండి న్యూఢిల్లీకి మార్చింది. ఈ అంశాల్ని టాంలిన్సన్‌లాంటి ఇటీవలి చరిత్రకారులు నొక్కి చెప్పారు. రాజ్య కార్యదర్శి అధికారాలు వైస్రాయికి బదిలీ చేయబడ్డాయి. కాని ఈ యిరువురూ బ్రిటిష్ ప్రభుత్వం చేత నియమింపబడినవారే. రెండు రకాల సభ్యులున్న కేంద్ర చట్టసభలో సంస్థానాధీశులచే నామినేట్ చేయబడిన సభ్యులు 30% నుండి 40% వరకు వుంటారు. (కౌన్సిల్ ఆఫ్ స్టేట్‌లో 276కి 104 మంది, ఫెడరల్ అసెంబ్లీలో 375 కి 125 మంది సభ్యులు). ఇక ముస్లిం యితర ప్రత్యేక నియోజక వర్గాలకు కూడా కేంద్రంలో ప్రావిన్సులలో మెక్డొనాల్డ్ అవార్డు ప్రకారం తమకు ప్రాతినిధ్యం యివ్వబడుతుంది. చట్టంలోని చాలా ప్రమాదకరమైన అంశం సార్వభౌమాధికారానికి భారతదేశ రాజ్యానికి మధ్య గల సంబంధాలను సార్వభౌమాధికార ప్రతినిధియైన వైస్రాయికి బదిలీ చేయడం. అంటే ఆచరణలో వైస్రాయి బాధ్యతాయుతమైన మంత్రుల ద్వారా గాక బ్రిటిష్ రాజకీయ విభాగం స్థానిక బ్రిటిష్ ప్రతినిధులు, రాజకీయ ఏజెంట్ల ద్వారా పరిపాలన సాగించడమన్న మాట. శాసనోల్లంఘనోద్యమం క్షీణించడం, కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకొనే అవకాశాలు సన్నగిల్లడం. సమాఖ్య ప్రభుత్వానికి అనుకూలంగా బ్రిటిష్ సార్వభౌమాధికార హక్కుల్ని ఏమాత్రం వదులుకోదనే గ్రహింపు లాంటి కారణాలతో 1935 రాజ్యాంగ చట్టం యొక్క సమాఖ్య భాగం పురిటిలోనే సంధి వాతపడ్డది. ముస్లిం రాజకీయ నాయకులు కూడా సమాఖ్య చట్రం ఏక కేంద్రకంగా వుంటుందని, కాబట్టి హిందూ ఆధిపత్య ప్రమాదం వుంటుందని భావించారు. ఇక కాంగ్రెస్‌లోని అన్ని సెక్షన్లు కూడా సమాఖ్య ఒక బూటకమని నిరసించాయి. ప్రతిష్టంభన కారణంగా 1919 విధానం పూర్తిగా నిరవధికంగా కొనసాగడాన్నే కోరుకుంటారు. ఇక్కడ మరొక అంశాన్ని ప్రత్యేకించి ప్రస్తావించవలసి వుంది. ఆరేళ్ళపాటు విస్తృత ప్రచారం యిచ్చిన ఇర్విన్ 1929 నవంబర్ ప్రతిపాదనయైన అధినివేశ ప్రతిపత్తిని 1935 చట్టం ప్రస్తావించనే లేదు. 1936 నుండి జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ గాను, వైస్రాయి గాను వున్న లిన్‌లిత్‌గో చట్టాన్ని గురించి యిలా (ప్రైవేట్‌గా) వ్యాఖ్యానించాడు. “భారతదేశంపై బ్రిటిష్ ప్రభావం కొనసాగించడానికి యిది సరియైన పద్ధతని మేము భావించాలి. దీర్ఘ దృష్టితో భారతదేశాన్ని సామ్రాజ్యానికి అంటిపెట్టుకొని వుండేలా చేసేందుకు మా అంచనాల కంటే ముందు పాలనా బాధ్యతలు అప్పచెప్పేందుకు తొందరపడం” (లిన్‌లిత్‌గో జెట్లాండ్‌కి 1939 డిసెంబర్ 21 : ఆర్.జె. మూరే ‘కాంగ్రెస్ – రాజ్యం’ పేజి 379).

స్వతంత్రానికి ముందు, ఆ తరువాత కూడా మాటిమాటికి పునరావృతమైన కొత్త తరహా రాజకీయాలు 1935, ప్రత్యేకించి 1936 సం॥లలో ఆవిర్భవించాయి. బయటికి వామపక్షాలకు అనుకూల సూచనలు : సోషలిస్టు కమ్యూనిస్టు కార్యకలాపాల పెరుగుదల (1934లో భారత కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించినప్పటికి) అసంఖ్యాకమైన కార్మిక రైతాంగ పోరాటాలకు, వామపక్షాల ఆకాంక్షలకు, కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్లున్న

లక్నో ఫైజపూర్ సదస్సులలో నెహ్రూ యొక్క కాంగ్రెస్ అధ్యక్షోపన్యాసాలు అయినప్పటికి కాంగ్రెస్‌లోని మితవాదులు చాలా తెలివిగా, సమర్థవంతంగా పరిస్థితిని వాటికి కనుకూలంగా మార్చుకొనగలిగారు. అందరూ సంవత్సరాల తరబడి నిరసిస్తున్న రాజ్యాంగ సంస్కరణల పరిధిలో పనిచేసేందుకు 1937 వేసవి నాటికి కాంగ్రెస్ మంత్రివర్గాలు ఏర్పాటు చేయబడ్డాయి.

**శ్రామికులు - కిసాన్ ఉద్యమాలు**

1934 లో అణచివేతని పాక్షికంగా ఎత్తివేయడంతో కార్మిక పోరాటాలకు కొంత అనువైన పరిస్థితి ఏర్పడింది. ఉద్యోగుల సంఖ్య పెరిగింది. (1935లో 14,247 మంది కొత్త కార్మికులకు ఉపాధి లభించింది. మరుసటి సంవత్సరం 54 పని గంటల వారం తిరిగి ప్రవేశపెట్టబడింది). కాని యూరపు, భారతీయ పెట్టుబడిదారులు అంతకు ముందు సంవత్సరాలలో ప్రవేశపెట్టిన వేతనకోతల్ని కొనసాగించాలని ప్రయత్నించడంతో కార్మికులలో అసంతృప్తి గతంలో కంటె పెరిగింది. 1935లో కలకత్తాలోని కేశోరాం ప్రత్తిమిల్లుల్లో, అహమ్మదాబాద్ జౌళి మిల్లుల్లో 1936 డిసెంబరు – 1937 ఫిబ్రవరి కాలంలో బెంగాల్ – నాగపూర్ రైల్వేలో, 1936 లో కలకత్తా జనపనార కాన్పూరు జౌళి మిల్లులో వరుస శ్రామిక వివాదాలు – వీటి ఫలితంగా ఈ రెండు కేంద్రాలలో పెద్ద ఎత్తున సాధారణ సమ్మెలు జరిగాయి.

ఈ కాలంలో 1931 చీలికల్ని జయప్రదంగా అధిగమించడం జరిగింది. 1935 ఏప్రిల్‌లో కమ్యూనిస్టు రెడ్‌ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ తిరిగి ఎఐటియుసిలో విలీనమయింది. అప్పుడు యం.యన్.రాయ్ అనుచరుల, మరికొంతమంది సోషలిస్టుల నియంత్రణలో ఎఐటియుసి వుంది. కొన్ని నెలల తరువాత మితవాద నేషనల్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్‌తో ఐక్యకార్యాచరణకు గల అవకాశాలను పరిశీలించేందుకు జాయింటు లేబరుబోర్డు స్థాపించబడింది. 1936 నాటికి క్రొత్త ప్రధాన కార్యదర్శి పి.సి.జోషి ఆధ్వర్యంలో కమ్యూనిస్టులు ఐక్య సంఘటన ఎత్తుగడ ప్రచారకులయ్యారు. 1935 వేసవిలో ఏడవ కొమింటర్న్ కాంగ్రెస్‌కి డిమిట్రివ్ రూపొందించిన ఐక్య సంఘటన ఎత్తుగడకి భారతదేశ పరిస్థితులకు అన్వయిస్తూ ఆర్.పి.దత్ బెన్‌బ్రాడ్లేలు 1936 మార్చిలో బ్రిటిషు కమ్యూనిస్టు పత్రిక లేబర్ మంత్‌లో ప్రచురించిన వ్యాసం దీనికి ప్రేరణ. ఇది కమ్యూనిష్టులు కాంగ్రెస్‌లో వుంటూ దానిని సామ్రాజ్యవాద వ్యతిరేక వేదికగా మార్చే లక్ష్యంతో పనిచేయాలని పిలుపునిచ్చింది. కార్మిక సంఘాలు, రైతుసంఘాలు కాంగ్రెస్‌కి అనుబంధ సంఘాలుగా పనిచేయాలి. సమూలమైన మార్పులు కోరే కార్యక్రమం ప్రాతిపదికగా ఎన్నికలలో పోటీ చేయాలని, అధికార పదవులు తిరస్కరించాలని నిర్ణయించబడింది. రాజ్యాంగ అసెంబ్లీకి సార్వత్రిక ఓటింగుతో ఎన్నికలు జరగాలి. నెహ్రూ 1930లోనే ఈ డిమాండు సూచించాడు. ఈ వ్యాసం రాయడానికి ముందు దత్ బ్రాడ్లేలు నెహ్రూని లాసేన్‌లో కలిశారు. ఒక నెల తరువాత లక్నో అధ్యక్షోపన్యాసంలో రెండు నిర్దిష్టమైన డిమాండ్లు, సమిష్టి అనుబంధం (Collective afflication) రాజ్యాంగ అసెంబ్లీ పునరుద్ఘాటించబడ్డాయి.

వామపక్ష జాతీయవాదులు, సోషలిస్టులు కమ్యూనిస్టులు మధ్య ఐక్యతా స్ఫూర్తి లక్నో, ఫైజాపూర్ కాంగ్రెస్ సదస్సుల కాలంలో అఖిల భారత కిసాన్‌సభ స్థాపన ద్వారా వ్యక్తమయింది. మొదట దీనికి చొరవ ఆంధ్ర నుండి లభించింది. 1933 –34 నుండి ప్రావిన్సు రైతు సంఘం, జమీందారీ కౌలురైతుల ప్రత్యేక సంఘం, జమీన్ రైతు నాయకుడు యన్.జి.రంగా కిసాన్ ఉద్యమాన్ని మద్రాసు ప్రెసిడెన్సీకి చెందిన యితర మూడు ప్రాంతాలకు విస్తరింపజేయాలని, వ్యవసాయ కార్మికుల్ని ఆకర్షించాలని 1935 నుండి ప్రయత్నిస్తూ వున్నాడు.. 1935 ఏప్రిల్‌లో రంగా జనరల్ సెక్రటరీగా, నంబూద్రిపాద్ జాయింటు సెక్రటరీగా రైతుల శ్రామికుల దక్షిణ భారతదేశ సమాఖ్య ప్రారంభించబడింది. ఈ సమాఖ్య 1935 అక్టోబరు సదస్సులో తక్షణమే అఖిల భారత కిసాన్‌సంస్థ ఏర్పాటుయినట్లు ప్రకటించింది. సోషలిస్టులు 1936 జనవరి మీరట్ సదస్సులో ఈ ఆలోచన చేపట్టారు. బీహారు మొదట అంత ఆసక్తి చూపనప్పటికీ సహజానంద సరస్వతి 1936 ఏప్రిల్‌లో అఖిల భారత కిసాన్ సభ మొదటి సదస్సుకి అధ్యక్షత వహించేందుకు అంగీకరించారు. గాంధేయవాదం పట్ల భ్రమలు కోల్పోయిన గుజరాత్‌కి చెందిన ఇందూలాల్ యాజ్ఞిక్ కిసాన్ బులిటెన్ సంపాదకుడయ్యాడు. కొద్ది పొలం గలిగిన రైతులకు జమీందారులతో వర్తకులతో, వడ్డీ వ్యాపారులతో ప్రభుత్వంతో గల సమస్యలపై కిసాన్‌సభ కేంద్రీకరించింది. 1936 ఆగష్టు కిసాన్ ప్రణాళిక, జమీందారీ విధానం రద్దు, రు 500లకు పైగా వచ్చే ఆదాయంపై ప్రస్తుతం వున్న శిస్తుకి బదులుగా క్రమబద్ధమైన పన్ను, అప్పుల రద్దు–డిమాండ్లు చేసింది. కిసాన్‌సభ రూపొందించిన డిమాండ్లు జాబితా: శిస్తు పన్నులపై 50 శాతం కోత, కౌలుదారులకు ఆ పొలాన్ని చేసుకొనే హక్కు, బేగార్‌రద్దు, అప్పులు, వడ్డీరేటు తగ్గింపు, సాంప్రదాయక అటవీ హక్కుల పునరుద్ధరణ, రైతులలో వర్గ విభేదాల సమస్యలు, భూకమతాలు కలిగిన రైతులకు భూమిలేని శ్రామికులకు మధ్య ఉద్రిక్తతలు – సైద్ధాంతికంగాను ఆచరణలోను కిసాన్‌సభని పట్టివేధిస్తున్నాయి. కాని కిసాన్ ప్రణాళిక సేద్యం చేయబడని ప్రభుత్వ భూముల్ని జమీందారీ భూముల్ని 5 ఎకరాల లోపు గల రైతులకు భూమిలేని వారికి బదిలీ చేయాలని సూచించింది. వారు సహకార సంఘాలుగా ఏర్పడి వ్యవసాయ కార్యకలాపాలు సాగించాలని సూచించింది. కాని భూకమతంపై గరిష్ట పరిమితిని డిమాండు చేయలేదు. కిసాన్ బులిటన్ తొలి సూచికలో వ్యవసాయ కూలీల వేతనాలు రైతులతో చర్చించడం ద్వారా వ్యవసాయ కార్మికుల పని పరిస్థితులలో మెరుగుదల జమీందార్లకు ప్లాంటర్లకు వ్యతిరేకంగా సమ్మె చేసే వారికి సహకరించడం లాంటి అంశాలపై దర్యాప్తు జరగాలన్నాడు.

కిసాన్ సభల తొలినాటి కార్యక్రమాలలో పెద్ద ఎత్తున రైతుయాత్రలు, అఖిల భారత కిసాన్ దినోత్సవం (1936 సెప్టెంబరు1, ఆంధ్రలోని ఒక్క గుంటూరు జిల్లాలోనే 100 గ్రామాలలో గ్రామసభలు నిర్వహించినట్లు వార్తలు వచ్చాయి) అసంఖ్యాకమైన స్థానిక పోరాటాలు వున్నాయి. ఉదాహరణకు బీహారు కిసాన్‌సభ మోంఘీర్ జిల్లాలోని బార్‌హైయటాల్ వద్ద కౌలుదారుల్ని వారి పొలాల నుండి ఖాళీ చేయించి, పొలాల్ని బేకాష్‌గా మార్చడానికి

జమీందారులు చేసిన ప్రయత్నాలకు వ్యతిరేకంగా 1936 నవంబరు నుండి పెద్ద ఉద్యమాన్ని ప్రారంభించింది. అఖిల భారత సదస్సులు ప్రావిన్సుల సంఘాల నిర్మాణానికి మంచి ఊపునిచ్చాయి. ఉదాహరణకు లక్నో నుండి తిరిగి వెళ్తున్న బెంగాల్ ప్రతినిధులు చెల్లా చెల్లా చెదురుగా వున్న చురుకైన కార్యకర్తలతో సంబంధాలు పెట్టుకొనే చొరవ తీసుకొని బెంగాల్ ప్రావిన్సు కిసాన్ సంఘాన్ని నిర్మించేందుకు 1937 మార్చిలో బంకురా జిల్లాలో సదస్సు నిర్వహించారు.

ఫ్యూడలిజం యొక్క బలమైన అణచివేత కేంద్రాలు స్వదేశీ సంస్థానాలలో వున్నాయి. ఇంతకు ముందు మనం గమనించిన విధంగా అక్కడ అనేక స్థానిక రైతాంగ పోరాటాలు చెలరేగాయి. ఇటీవల జరిగిన ఘటనలు, ఆర్థిక మాంద్యం కాలంలో శిస్తులు పెంచడానికి వ్యతిరేకంగా జయపూర్‌కి చెందిన సికార్ తికానా (జాగీర్)లో ఆందోళన జరిగింది. పంజాబులోకి లోహణు వద్ద ఒంటెలపై విధించిన పన్నులకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళన 1935లో కాల్పులకు దారి తీసింది. కాని అఖిల భారత సంస్థానాల ప్రజా సంఘం యిప్పటి వరకు మితవాద కులీన సంఘంగా పనిచేసింది. విజ్ఞప్తులు సేకరించడానికి కరపత్రాలు పంచడానికి పరిమితమయింది. కాంగ్రెస్ యింకా సంస్థానాలలో జోక్యం చేసుకొనని వైఖరికి కట్టుబడివుంది. 1934లో కూడా గాంధీ కాంగ్రెస్ యొక్క నిస్సహాయతని వ్యక్తం చేశారు. సంస్థానాధీశుల్ని పాలితుల ధర్మకర్తలుగా పనిచేసేందుకు ఒప్పించవచ్చునని ఆశాభావం వ్యక్తం చేశాడు. కాంగ్రెస్ అసెంబ్లీ పార్టీ నాయకుడు భూలాభాయ్‌దేశాయ్ 1935లో మైసూర్ సందర్శించిన సందర్భంగా భవిష్యత్ సమాఖ్యలో సంబంధాలను నిర్ణయించుకొనే పూర్తి హక్కు సంస్థానాధీశులకు వుంటుందని హామీ యిచ్చారు. 1936 స్పష్టమైన మార్పుకి ప్రారంభ సంవత్సరం, ఐదవ అఖిల భారత సంస్థాన ప్రజా సదస్సులో నెహ్రూ ప్రసంగిస్తూ కేవలం విజ్ఞప్తులు చేయడం గాక ప్రజలతో సంబంధాలు పెట్టుకోవలసిన అవసరాన్ని గురించి చెప్పాడు. సదస్సు మొదటిసారిగా వ్యవసాయ డిమాండ్ల కార్యక్రమాన్ని రూపొందించింది. భూమి శిస్తులో మూడవ వంతు తగ్గింపు, రుణభారం తగ్గింపు, 'కాశ్మీరుఅల్వార్ సికార్ (జయపూర్) లోహారు విషాదఘటన'ల నేపథ్యంలో రైతు సమస్యలపై విచారణ. తరువాత సంవత్సరం కాంగ్రెస్ మంత్రి వర్గాల ఏర్పాటుతో భారతదేశంలో స్వదేశీ సంస్థానాలలోని అత్యధిక ప్రాంతాలలో రైతాంగ పోరాటాలు వెల్లువెత్తాయి.

**వామపక్ష సాహిత్యం**

1936లో అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (AISF) అభ్యుదయ రచయితల సంఘం స్థాపన విద్యావంతులైన యువకులపై మేధావులపై పెరుగుతున్న వామపక్ష ప్రభావాల్ని వ్యక్తం చేసింది. సహాయ నిరాకరణలా గాక శాసనోల్లంఘనం సాహిత్య ప్రపంచంపై బలమైన ముద్ర వేయలేదు. గాంధేయ నిబంధనలపై భ్రమలు తొలగిపోయేలా చేసింది. ఫలితంగా కొత్త పద్ధతులకై అన్వేషణ ప్రారంభమయింది. ప్రేమ్‌చంద్ చివరిది అత్యంత గొప్ప నవల గోదాన్ (1936)

రైతుల కటువైన కడగండ్లను కళ్లకు కట్టిన నవల. గాంధేయ ఆదర్శవాదాన్ని ఆశావాదాన్ని పట్టించుకొనని నవల రంగభూమి (1925) ఆయన మరణానికి ముందు రాసిన 'మహా జాని సభ్యత' వ్యాసం పెట్టుబడిదారీ లాభాపేక్షని విమర్శిస్తూ సోవియట్ ప్రయోగాన్ని అభినందించింది. ఆంధ్రాలో 1932 లో గోర్కీ 'అమ్మ' నవల అనువాదంతో శ్రామికుల్ని గురించి వాస్తవ నవలలు రాసే క్రమం ప్రారంభమయింది. కవిత్వంలో మొదటిసారిగా మాట్లాడే భాషని ఉపయోగించిన అభ్యుదయ కవి శ్రీశ్రీ. భగత్‌సింగ్ బలిదానంతో ప్రేరితుడై 'మరో ప్రపంచం' (మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం పిలిచింది) గేయాన్ని రాశాడు. బొంబాయి కార్మికోద్యమం మాధోల్కర్ మామా వాడేకర్‌లను ప్రభావితం చేసి జౌళి సమ్మెల కథలు రాయించింది. బెంగాలులో పట్టణ మేధావులు గాంధీ పట్ల ఎప్పుడూ ఆకర్షితులు కాలేదు. రవీంద్రనాథ్ ఠాగూర్ శాసనోల్లంఘనకి దూరంగా వుండిపోయాడు. టెర్రరిజాన్ని వ్యతిరేకించాడు.(చారాధ్య నవల 1934). కలకత్తా నుండి వెలువడిన మాసపత్రిక 'పరిచయ్' (1931లో స్థాపితం) సమకాలీన గాంధేయ జాతీయవాదం పట్ల, అలాగే రైతు ఉద్యమాల పట్ల విముఖత ప్రదర్శించింది. అంతర్జాతీయ పరిణామాల పట్ల, ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్త పోరాటం పట్ల, మార్క్సిస్టు సిద్ధాంతం ఆచరణ పట్ల ఆసక్తి కనపరచింది.

వామపక్షం పట్ల ఆసక్తి గల రచయితలకు అఖిల భారత వేదికను ప్రారంభించేందుకు సజ్జద్ జహీర్ ఆధ్వర్యంలో ఉర్దూ మాట్లాడే మేధావుల బృందం చొరవ తీసుకొన్నది. జహీర్ 1935 లో లండన్‌లో చదువుతూండగానే ఒక ప్రణాళిక రూపొందించాడు. ఆ ప్రణాళికలో ఆకలి, పేదరికం, సామాజిక వెనుకబాటు తనం, రాజకీయ పరాధీనత లాంటి సమస్యలపై కేంద్రీకరించడం ద్వారా కళల్ని ప్రజలకు అత్యంత చేరువలో తీసుకొని రావాలని కోరాడు. 1936లో లక్నోలో జరిగిన అభ్యుదయ రచయితల సంఘం మొదటి సదస్సుకి ప్రేమచంద్ అధ్యక్షత వహించాడు. 1936లో రవీంద్రనాథ్ ప్రజలకు దూరంగా వుండిపోయినందుకు విచారం వ్యక్తం చేస్తూ ఆత్మవిమర్శనాత్మక సందేశం పంపించాడు. అఖిల భారత ఉద్యమంగా అభ్యుదయ రచయితల సంఘం ఉర్దూ ప్రపంచంలో అత్యున్నత శిఖరాలకు చేరుకొన్నది. అభ్యుదయ రచయితల సంఘానికి ఉర్దూ సాహిత్య ప్రముఖులు హజ్రత్ మోహాని ప్రముఖ రాజకీయవేత్త, మంచి గుర్తింపు పొందిన గజల్స్ రచయిత జోష్ మాలిహాబాది షరాఫ్ గోరఖ్ పూరి, కిషన్‌చందర్‌లు ఎనలేని సేవలు చేశారు. సంఘం యొక్క వామపక్ష నిర్వాహకుల ఐక్య సంఘటన వైఖరి కొన్ని సందర్భాలలో సంఘంలో అవకాశవాదులు, పేరు ప్రఖ్యాతలు పట్ల వ్యామోహం గల వారికి స్థానం కల్పించినప్పటికి 1938 వేసవిలో ఫరీదాబాద్ రైతు కవి సమ్మేళనం, బొంబాయి కార్మికులలో కైఫీ అజ్మీ యొక్క 'విప్లవాత్మక ముషాయిరాలు' లాంటి ప్రజలతో సంబంధాలు పెంచుకొనే కొన్ని ఆసక్తికరమైన ప్రయత్నాలు చేశారు.

## లక్నో -ఫైజ్‌పూర్

నెహ్రూ యూరపు నుండి తిరిగి రాగానే కాంగ్రెస్ అధ్యక్షుడయ్యాడు (1929లో లాగానే గాంధీ ఒత్తిడి మేరకు) లక్నో ఫైజ్‌పూర్‌లలో (1936 ఏప్రిల్, డిసెంబరు) అయిన

ఉపన్యాసాలు వినగానే జాతీయోద్యమంపై వామపక్ష ప్రభావం అత్యున్నత స్థాయికి చేరినట్లు అనిపించింది. కాంగ్రెస్‌పై తన సోషలిస్టు ఆలోచనల్ని రుద్దే ఉద్దేశం లేదంటూనే లక్నోలో నెహ్రూ తాను సోషలిజం అనే పదాన్ని 'ప్రపంచ సమస్యల భారతదేశ సమస్యల పరిష్కారానికి ఒకే ఒక్క సాధనం' – అనే అర్థంలో వాడుతున్నానని అస్పష్టమైన మానవతావాద ధోరణిలో గాక శాస్త్రీయమైన ఆర్థికపరమైన అర్థంలోనే వాడుతున్నానని చెప్పాడు. లోపాలున్నప్పటికి సోవియట్ యూనియన్‌ది నూతన నాగరికతగా ప్రశంసించాడు. "స్వతంత్ర భారత దేశం కొరకు శ్రమపడే మనం.. అనివార్యంగా... ఫాసిజం సామ్రాజ్యవాదాలకు వ్యతిరేకంగా బారులు తీరిన ప్రపంచ అభ్యుదయ వైఖరి నవలంబించారు".

రెండు సదస్సుల్లో ఇటలీ జపాన్ దురాక్రమణల్ని ఖండించి అబిసీనియా, చైనా, స్పెయిన్‌లకు మద్దతు తెలిపే తీర్మానాలు ఆమోదించవలసిందిగా నెహ్రూ నచ్చజెప్పాడు. ఈ నూతన అంతర్జాతీయ దృక్పథం నెహ్రూ స్వాతంత్ర్యోద్యమానికి అందించిన కానుక. ఇక దేశీయంగా నెహ్రూ సమూలమైన మార్పులు కోరే కార్యక్రమంపై ఎన్నికలలో పోటీ చేయాలన్నారు. పాలనా బాధ్యతల్ని తిరస్కరించాలన్నాడు సార్వత్రిక ఓటింగు పద్ధతిపై రాజ్యాంగ అసెంబ్లీ ఎన్నికలు జరగాలన్నారు. కాంగ్రెస్ నిజమైన సామ్రాజ్యవాద వ్యతిరేక ఐక్య ప్రజా సంఘటనంగా మార్చబడుతుందని నెహ్రూ ఆశించాడు. అందుకు మొదటి చర్యగా కార్మిక సంఘాలకు కిసాన్ సభలకు కార్పొరేట్ సభ్యత్వాన్ని సూచించాడు. కాంగ్రెస్ సంస్థలోని నియంతృత్వ వైఖరిని గడచిన బొంబాయి సదస్సు (1934 అక్టోబరు)లో గాంధీ ఒత్తిడి మేరకు కాంగ్రెస్ సంస్థలో ప్రవేశపెట్టబడిన నియంతృత్వ వైఖరిని విమర్శించాడు.

నియంతృత్వవైఖరి : ప్రతినిధుల సంఖ్య తగ్గింపు కాంగ్రెసులో ప్రధాన బాధ్యతలు నిర్వహించేవారికి ఖాదీ అర్హత, తనచే నామినేట్ చేయబడిన కాంగ్రెస్ ప్రెసిడెంటుపై వర్కింగు కమిటీలపై గట్టి నియంత్రణ. లక్నో సదస్సు తరువాత నెహ్రూ కార్యవర్గం (వర్కింగు కమిటీ) లో ముగ్గురు సోషలిస్టులకు (జయ ప్రకాష్, నరేంద్రదేవ్, అచ్యుత్ పట్వర్ధన్) అవకాశం కల్పించాడు. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలోని సామాజిక ఆర్థిక అంశాల్ని (1936 ఆగష్టు) ఫైజ్‌పూర్‌లో ఆమోదించిన తాత్కాలిక వ్యవసాయ కార్యక్రమం, ప్రధానంగా కరాచీ తీర్మానాన్ని పునరుద్ఘాటిస్తూ కిసాన్ సభ డిమాండ్లను కొన్నింటిని శిస్తు కౌలు తగ్గింపు, కౌలుకాలపరిమితి స్థిరీకరణ, రుణభారాన్ని తగ్గించుట, వెట్టిచాకిరి రద్దు, అటవీ హక్కుల, రైతు సంఘాల గుర్తింపు – లాంటి మార్పులతో ప్రజాస్వామ్యాన్ని ప్రవేశపెట్టాడు. 1937 ఎన్నికలలో కాంగ్రెస్‌కి నెహ్రూ ప్రధాన ప్రచారకుడయ్యాడు. ఓట్లు రాబట్టే ఆయన జనాకర్షణ శక్తి మూడు దశాబ్దాల పాటు కొనసాగింది.

**బలపడిన మితవాదం - వాణిజ్యవర్గాల ఒత్తిడులు**

1935–37 కాలంలో పురోగమించినట్లు కనిపించిన వామపక్ష వైఖరి కేవలం మాటలకు పరిమితమయిందని, కీలకమైన నిర్ణయాలు చేయలేకపోయిందని నిశితమైన పరిశీలన

స్పష్టం చేస్తుంది. కాంగ్రెస్‌కి వెలుపల వున్న ఉదారవాద, మతవాద, మితవాద గ్రూపులకు జాతీయ పోరాటంలో విజయవంతంగా పోరాడిన ప్రతిష్ట కొరవడడంతో ప్రజల విశ్వాసం పొందలేకపోయారు. కమ్యూనల్ అవార్డు కొంత గందరగోళం సృష్టించినప్పటికి 1934 ఎన్నికలలో మాలవ్యా – ఆనేల కాంగ్రెస్ నేషనలిస్టు పార్టీ ఘోర పరాజయం పాలయింది. యు.పి.లో ఆ పార్టీ పోటీ చేసిన 8 సీట్లలో కాంగ్రెస్ గెలిచింది. 1926 లో యిలాగే చీలిపోయిన గ్రూపు (మాలవ్యా, లజపతిరాయ్ ఆధ్వర్యంలో) స్వరాజ్యవాదులు 6 సీట్లు గెలిచారు. 1937 ఎన్నికల ముందు ఒకే ఒక అఖిల భారత ముస్లిం పార్లమెంటరీ బోర్డు ద్వారా ముస్లింలీగుని పునరుద్ధరించడానికి జిన్నా చేసిన ప్రయత్నాలు అంతగా ఫలించలేదు. పంజాబు బెంగాలులలో వ్యవసాయ ప్రాతిపదికన ఏర్పడిన ప్రాంతీయ పార్టీలు – యూనియనిస్టు పార్టీ కృషిక్ ప్రజాపార్టీలను ఒప్పించడంలో విఫలమయ్యాడు. 1937 ప్రావిన్షియల్ అసెంబ్లీ ఎన్నికలలో ముస్లింలకు రిజర్వు చేయబడిన 482 సీట్లలో కేవలం 109 సీట్లు మాత్రమే ముస్లింలీగు గెలవగలిగింది.

అసెంబ్లీ రాజకీయాల ప్రచారకులకు గాంధేయ నిర్మాణాత్మక కార్యకర్తలకు మధ్య ఒప్పందం కుదరడం వలననూ, 1934 నుండి వాణిజ్య వర్గాల గణనీయమైన ఒత్తిడి ప్రోత్సాహాల కారణంగాను కాంగ్రెస్‌లోని మితవాదపక్షం (Right wing) బలపడడం ఒక ముఖ్యమైన పరిణామం. యుక్తులు, ఒత్తిడిలో కలగలిసిన రాయితీల ద్వారా మితవాదులు ఈ కాలమంతటా జాతీయోద్యమంపై తమ ఆధిపత్యాన్ని పరిరక్షించుకోగలిగారు. శాసనోల్లంఘన పెంచిన ప్రజా చైతన్యం, 5 రెట్లు పెరిగిన ఓటర్ల నేపథ్యంలో సమూలమైన మార్పులు కోరుతున్నట్లుగా చేయబడే అధ్యక్షోపన్యాసాలు కాంగ్రెస్ ప్రకటనలు, ఎన్నికల ఉపన్యాసాలు చేసే అవకాశాలు కాంగ్రెస్‌లోని వామపక్షవాదులకు కల్పించబడ్డాయి.

కాంగ్రెస్‌లోని వామపక్ష వాదులతో – ప్రత్యేకించి వారికి ప్రాతినిధ్యం వహించిన నెహ్రూతో వాణిజ్యవేత్తలు వ్యవహరించిన తీరుకి సంబంధించిన ఆసక్తికరమైన వివరాలు ఠాకూర్‌దాస్ పత్రాలలో లభ్యమవుతాయి. కాంగ్రెస్‌లోని సోషలిస్టులతో కలిసిమెలిసి పనిచేయడం ఆపివేయకపోతే బాహాటంగా పెట్టుబడిదారుల మద్దతుగల క్రొత్తపార్టీ ప్రారంభించాలని 1935 ఆగష్టులో హెచ్.పి.మోడీ చేసిన ప్రతిపాదన ఠాకూర్‌దాస్ బిర్లాల లాంటి ఎత్తుగడలు దూరదృష్టి గల వాణిజ్యవేత్తల ప్రోత్సాహం లభించలేదు. నెహ్రూ లక్నో ఉపన్యాసం బొంబాయికి చెందిన 21 మంది ప్రముఖ పారిశ్రామిక వేత్తల్ని హెచ్.పి. మోడి లాంటి కాంగ్రెసేతరుల్ని, వాల్‌చంద్, హీరాచంద్, ఎ.ఓ ష్రాఫ్ లాంటి వారిని కలవరపరిచింది. వారు 1936 మేలో సోషలిజం ఆస్తిపాస్తులకు, మతానికి వ్యక్తిగత స్వేచ్ఛకి ప్రమాదకరమని, 1936 మేలో సోషలిజాన్ని ఖండిస్తూ ఆగ్రహావేశాలతో ప్రకటన చేశారు. కాని కనీస ఎత్తుగడలు పాటించనందుకు వాల్‌చంద్ ఠాకూర్‌దాస్‌లను బిర్లా మందలించాడు. “ఆస్తి గల వ్యక్తి తాను ఆస్తిహరణకి (దోపిడికి)

వ్యతిరేకిననడం చాలా మొరటుతనం..' అది ఆస్తిని త్యజించిన వారికి వదిలివేయాలి. మనం వారి చేతులకు బలాల్ని చేకూర్చితే మనం ప్రతి ఒక్కరికీ సహాయపడగలం" (వాల్‌చంద్ హీరాచంద్ కి బిర్లా 1936 మే 26, ఠాకూర్‌దాస్ పత్రాలు యఫ్.యన్. 177). బిర్లా లక్నో ఘటనల పట్ల సంతోషంగానే వున్నాడు. మహాత్ముడు తన వాగ్దానాన్ని నిలబెట్టుకొన్నాడు. కొత్త వాగ్దానాలు చేయకుండా చూశారు. జవహర్‌లాల్ ఉపన్యాసం ఒక విధంగా చెత్తబుట్టలో వేయబడింది. జవహర్‌లాల్ ఇంగ్లీషు ప్రజాస్వామ్యవాది నమూనా. తన సిద్ధాంతాన్ని వ్యక్తీకరిస్తాడు. ఆచరణ సాధ్యం కాదని గ్రహిస్తాడు. కాబట్టి దానికై పట్టుబట్టడు. అన్నీ సరియైన దిశలో సజావుగా ముందుకు పోతున్నాయి" (ఠాకూర్‌దాస్‌కి బిర్లా 1936 ఏప్రిల్ 20) ఏప్రిల్ 23 లేఖకు జవాబిస్తూ ఠాకూర్‌దాస్ యిలా రాశాడు. జె యొక్క విశ్వసనీయంపై నాకెలాంటి సందేహం లేదు, జె.ని సరియైన పట్టాలపై వుంచేందుకు ఓపికగా నచ్చజెప్పాల్సి వుంటుంది" కాబట్టి పెట్టుబడిదారుల విభేదాలు కేవలం ఎత్తుగడలే.

కాంగ్రెస్ నాయకత్వంలో ప్రజాపోరాటం యొక్క గాంధేయ రూపాలపై ఆసక్తి లేనివారు, మునిసిపల్ ఎన్నికలే సర్వస్వంగా వాటిలో మునిగి తేలేవారు, భూలాభాయ్ దేశాయ్ లేక బి.సి. రాయ్ లాంటివారు ఎప్పుడూ వుంటారు. కాని 1930 దశాబ్దం మధ్యభాగంలో వచ్చిన మార్పు ఏమిటంటే గ్రామీణ ప్రాంతాలలో నిర్మాణాత్మక కార్యకర్తలుగా, ప్రజా నాయకులుగా గణనీయమైన ప్రతిష్ఠ స్థాయిగల వల్లభాయ్‌పటేల్, రాజేంద్రప్రసాద్, రాజగోపాలాచారి లాంటి నాయకుల వైఖరిలో మార్పు కారణంగా వారికి యింకా బలం, చేకూరింది. యువకుల ఉత్సుకత స్థానంలో మధ్య వయస్కుల అవకాశవాదం ప్రవేశించడం కూడా అందుకు కారణం కావచ్చు. అంతేగాక గాంధేయ ఎత్తుగడల – నిర్మాణాత్మక కార్యక్రమం, శాంతియుత ప్రజా సత్యాగ్రహం విఫలమవుతూ వున్నాయి. ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తే శాసనోల్లంఘనకి, దాదాపు లేనట్లు 1932 తరువాత ఘటనలు తెలియజేశాయి. 1934-35 లో గాంధీ ప్రస్తావించిన అఖిల భారత గ్రామీణ పారిశ్రామిక సంస్థ ఆచరణ రూపం దాల్చలేదు. బీహారు అధికారి దీనిని 1935 డిసెంబరులో 'తడిసిన బాణ సంచా' గా వర్ణించాడు. గాంధీ కూడా దీర్ఘకాల ప్రాతిపదికన గ్రామీణ కార్యక్రమాల్ని గురించి ఆలోచిస్తూ వుండవచ్చు. గాంధీ లాంఛన ప్రాయంగా 1934 సంవత్సరం చివరలో కాంగ్రెస్ నుండి రిటైరయ్యారు. అయిన కార్యదర్శి మహదేవ్‌దేశాయ్ 1936 ఆగష్టు 26న బిర్లాకి యిలా రాశాడు. బాపు అంతకంతకూ గ్రామీణ కార్యక్రమాలలో లీనమవుతున్నాడు. ఆయన తన మనస్సుని కాంగ్రెస్, యితరాల నుండి గ్రామీణ సమస్యల వైపు మరల్చుతున్నాడు (మహాత్ముని నీడలో పేజి 204). వామపక్షాలు మొట్టమొదటిసారిగా వర్గ కారణాల రీత్యా అందరూ ఆమోదించలేని దేశ వ్యాప్త ప్రజా వ్యూహ ప్రత్యామ్నాయాన్ని చూపడం – గాంధీతో సహా అందరినీ కలవరపరిచింది.

లక్నో సదస్సు తరువాత కొన్ని నెలలకు బిర్లా దూరదృష్టి వాస్తవమయింది. నెహ్రూ మరి ముగ్గురు వర్కింగు కమిటీ సభ్యులు మితవాదుల (రైటిస్టుల) చేతుల్లో బందీలయ్యారు.

వారికి తగినన్ని అధికారాలు లేవు. కాంగ్రెస్ పని విధానాన్ని నిష్కర్షగా విమర్శించడానికి సంస్థానపరమైన పదవులు అడ్డుగా నిలిచాయి. నెహ్రూ సోషలిస్టు ఉపన్యాసాల్ని సాకుగా చూపి 1936 జూన్ 29న రాజేంద్రప్రసాద్, రాజగోపాలాచారి, పటేల్, కృపలానీల నాయకత్వంలో ఏడుగురు వర్కింగు కమిటీ సభ్యులు రాజీనామా చేస్తామని బెదిరించారు. వారి నిరసన లేఖ వార్ధాగాంధీ ఆశ్రమం నుండే రాశారు. గాంధీ వివాదాన్ని పరిష్కరించారు. నెహ్రూ లొంగి వచ్చాడు. నెహ్రూ అసహనాన్ని గాంధీ మందలించాడు. 'నీవు యింకా అధికారంలోకి రాలేదు. నిన్ను అధికారంలోకి రప్పించడానికి చేసిన ప్రయత్నమే నీకు పార్టీ బాధ్యతలు అప్పగించడం. పార్టీ బాధ్యతలు నిన్ను అధికారానికి చేరువ చేస్తుంది'. అని మందలిస్తూ గుర్తు చేశాడు (జూలై 8,15, నెహ్రూ బంచ్ ఆఫ్ ఓల్డ్ లెటర్స్, పేజీలు 198, 204) లక్నోలోనే కార్మిక, రైతు సంఘాల భారీ స్థాయి సభ్యత్వ పథకం సోషలిస్టులు వ్యతిరేకించినప్పటికి నీరుగార్చబడింది. దాని స్థానంలో ప్రజా సంబంధాల కమిటీ నియమించబడింది. దానిలో కూడా వామపక్షవాదుల్ని బలహీనపరచడానికి జయప్రకాష్ నారాయణ్‌కి ప్రత్యర్థులుగా రాజేంద్రప్రసాద్ జైరాందాస్ దౌలత్‌రాయ్ నియమించబడ్డారు. ఫైజ్‌పూర్ వద్ద కమిటీ తన నివేదికను తుది రూపం యివ్వలేదు. వ్యవసాయ కార్యక్రమం పి.సి.సిల తాత్సారం చేసే ఎత్తుగడల ద్వారా ఆటంకపరచబడింది. ఫైజాపూర్ ముసాయిదా అఖిల భారత కిసాన్‌సభ యొక్క వ్యవసాయ ప్రణాళికలోని సున్నితమైన అంశాల్ని తగ్గించి దానిని మసకబారేలా చేసింది. (ఉదా: కౌలు శిస్తు రుణభారాలలో 50 శాతం కోత, వడ్డీరేటుపై గరిష్టపరిమితి 6 శాతానికి బదులుగా గణనీయమైన తగ్గింపులు) జమీందారీ విధానం రద్దు, సాగుచేయబడని ప్రభుత్వ భూమి లేక భూస్వామి భూమి పంపకం పూర్తిగా వదిలివేయబడింది. ఎన్నికలలో పోటీ చేసే ఆంధ్ర కాంగ్రెస్ అభ్యర్థులు రైతుల కనీస డిమాండ్లకు మద్దతు తెలిపే ప్రమాణ పత్రంపై సంతకం చేయడం ముందస్తు షరతుగా వుండాలని రంగా ప్రయత్నించగా పటేల్ రంగాపై విరుచుకుపడ్డారు. నెహ్రూ రంగాకి మద్దతు యివ్వడంలో పూర్తిగా విఫలమయ్యారు. మొత్తం సమస్యని పొరపాటు అవగాహనగా త్రోసిపుచ్చి సమస్యని వాపసు తీసుకోవలసిందిగా రంగాకి సలహాయిచ్చారు. (ఇండియన్ మాన్యువల్ రిజిస్టర్ జూలై –డిసెంబరు 1936 పేజి 286) కీలకమైన సమస్య – అధికారంలో పాలు పంచుకొనే విషయంలో మితవాదులు (రైటిస్టులు) సమస్యని లక్నోలో ఫైజ్‌పూర్‌లో మాటిమాటికి వాయిదా వేయడం ద్వారా తమ మార్గాన్ని సుగమం చేసుకొన్నారు. ఎన్నికలలో గెలిచిన తరువాత కాంగ్రెస్ అధ్యక్షుడు మొత్తం వామపక్షం అభ్యంతరాలు వాక్పటిమ గానే మిగిలిపోయాయి. మంత్రివర్గ ఏర్పాటు కొరకు ఒత్తిడి పెరిగింది. మరలా బిర్లా జోస్యం ఫలించింది. "జరిగే ఎన్నికలు వల్లభాయ్ గ్రూపుచే నియంత్రించబడతాయి. లార్డ్ లిన్‌లిత్‌గౌ పరిస్థితిని సరియైన విధంగా అదుపులో పెడితే కాంగ్రెస్ అధికారంలో వచ్చే అవకాశాలు పూర్తిగా వున్నాయి." (ఠాకూర్‌దాస్‌కి బిర్లా 1936 ఏప్రిల్ 20).

## అధ్యాయం - 7

# రాజకీయ ఉద్యమాలు 1937-1945 యుద్ధం

## 1937-39 కాంగ్రెస్ మంత్రి వర్గాలు

### ఎన్నికలు - మంత్రి వర్గ నిర్మాణం

1937 ఎన్నికలలో కాంగ్రెస్ మంచి విజయం సాధించింది. 1585 రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలకు గాను 711 స్థానాల్లో విజయం సాధించింది. 11 రాష్ట్రాల్లో 7 రాష్ట్రాల్లో (మద్రాసు, బీహార్, ఒరిస్సా, సిపి, యుపి) పూర్తి మెజారిటీ సాధించింది. ప్రభుత్వ విధేయత, భూస్వామ్య పునాది గల యుపిలో భయారి నేషనలిస్టు గ్రూపు, మద్రాసులో జస్టిస్ పార్టీ తుడిచిపెట్టబడకుండా ప్రభుత్వం నివారించలేకపోయింది. ముస్లింల ఏకైక ప్రతినిధిగా చెప్పుకొన్న ముస్లిం నియోజకవర్గంలో కాంగ్రెస్ చాలా తక్కువ సీట్లలో విజయం సాధించినప్పటికి (మొత్తం 482 రిజర్వుడు సీట్లలో 58 స్థానాల్లో పోటీ చేసి 26 స్థానాలు గెలుచుకొన్నది) అది కూడా ముస్లింలకు ఏకైక ప్రతినిధినని గొప్పలు చెప్పుకొన్న ముస్లిం లీగు వైఫల్యాన్ని స్పష్టం చేసింది. వాయువ్య సరిహద్దు రాష్ట్రంలో ముస్లిం లీగు ఒక్క స్థానం కూడా గెలవలేకపోయింది. పంజాబ్‌లోని 84 రిజర్వుడు స్థానాల్లో రెండింటిని, సింధులోని 33 స్థానాల్లో మూడింటిని మాత్రమే గెలవగలిగింది. షెడ్యూల్డు కులాల సీట్లలో కూడా కాంగ్రెస్ ఒక్క బొంబాయిలో మినహాయించి అత్యధిక సీట్లు గెలుచుకున్నది. బొంబాయిలో హరిజనులకు రిజర్వు చేయబడిన 15 సీట్లలో 13 సీట్లని అంబేద్కర్ ఇండిపెండెంట్ లేబర్ పార్టీ గెలిచింది.

లక్షలాది భారతీయులకు ప్రత్యేకించి హిందూ మెజారిటీ గల సాధారణ నియోజకవర్గాలలోని ఓటర్లు గాంధీజీ పచ్చ పెట్టెలో ఓటు వేయడం దేశభక్తియుత ఆత్మ త్యాగానికి, ఆర్థిక సామాజిక మార్పుకి ఓటు వేయడంగా భావించారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక, ఫైజ్‌పూర్ వ్యవసాయక కార్యక్రమం వామపక్ష ఆకాంక్షల మేరకు లేనప్పటికి గతంలోని కాంగ్రెస్ ప్రకటన కంటే గణనీయమైన ముందంజగా చెప్పవచ్చు. అదే సమయంలో ఎక్కువ

మందికి ఓటు హక్కు (సార్వత్రిక ఓటు హక్కు కాదు) గల ఎన్నికలు ఎక్కువ ఓట్లు స్థానిక ఆధిపత్య గ్రూపులతో సంబంధాలు, పట్టణాలలో వ్యాపారులు, గ్రామీణ ప్రాంతాలలో భూస్వాముల ఆధిపత్య రైతు గ్రూపులతో సంబంధాలు అవసరమయ్యాయి. పటేల్ నాయకత్వంలోని సెంట్రల్ కాంగ్రెస్ పార్లమెంటరీ బోర్డుకు బిర్లా రు. 5 లక్షల విరాళం యిచ్చారు. బీహార్ పిసిసి వసూలు చేసిన ఎన్నికల నిధి రు. 37000ల లోని రు.27000లు దాల్మియా యిచ్చారు. అలాంటి మొత్తాలు ఎన్నికల ఖర్చులకు చాలవు గనుక (ఒక్కొక్క సీటుకి ఎన్నికల వ్యయం కనీసం రు. 2000లు) అత్యధిక అభ్యర్థులు వారే ఆర్థికాన్ని సమకూర్చుకోవాలి. అంటే ఆచరణలో డబ్బున్న వాళ్ళకి సీట్లు యివ్వడమన్న మాటే. ఉదాహరణకు బీహారులో భూస్వాముల ఒత్తిడి కారణంగా సమరశీల కిసాన్ సభ కార్యకర్తలు ఎన్నికలలో పోటీ చేయలేకపోయారు. తన పార్టీ అభ్యర్థులలో అత్యధికులు భూస్వామ్య వర్గం నుండి వచ్చిన వారేనని కాంగ్రెస్ నాయకుడు ఎ.ఎన్.సిన్హా అంగీకరించారు. (టామిల్సన్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అండ్ ది రాజ్ పేజీ 82-85) మొత్తం కాల వ్యవధిలో ఒక సమయంలో కుడి, ఎడమల నుండి కాంగ్రెస్‌పై పరస్పర విరుద్ధమైన ఒత్తిడులు రావడం కాంగ్రెస్ స్వభావంలో భాగమని చెప్పాలి.

ఎన్నికల విజయాలు బలాన్ని పెంచాయి. మంత్రివర్గాల ఏర్పాటుకై ఒత్తిడి పెరిగింది. 1937 ఎఐసిసి సదస్సు షరతులతో అధికారాన్ని అంగీకరించాలని రాజేంద్రప్రసాద్, పటేల్ ప్రతిపాదించిన తీర్మానాన్ని ఆమోదించింది. షరతు ఏమిటంటే కాంగ్రెసేతర అసెంబ్లీ పార్టీ నాయకుడు సంతృప్తి చెంది గవర్నర్ తన ప్రత్యేక అధికారాల్ని ఉపయోగించడని బాహాటంగా ప్రకటన చేయాలి. అధికారాన్ని తిరస్కరించాలని జయప్రకాష్ ప్రవేశపెట్టిన డిమాండ్ 135-78 తో ఓడింపబడింది. ఇది మితవాద కాంగ్రెస్‌కి (Right Cong) పెద్ద విజయమని వైస్రాయి లిన్ లిత్‌గౌ ప్రైవేట్ సెక్రటరీకి రాసిన లేఖలో బిర్లా ప్రశంసించారు (మహాత్ముని నీడలో పేజి 214). గవర్నర్లు అధికారాలు ఉపయోగించుకొనబడవని హామీ ఇచ్చేందుకు లిన్‌లిత్‌గౌ తిరస్కరించినప్పటికి 1937 జూలై నాటికి గాంధీ ఒక అభిప్రాయానికి వచ్చారు. జవహర్‌లాల్ ద్వారా ఆయనని ఒప్పించడం అంత కష్టం కాలేదు. మహదేవ దేశాయ్ జూలై 16న బిర్లాకి తెలియజేశారు. బ్రిటిష్ వారి హామీలు అంత సంతృప్తికరంగా లేకపోయినప్పటికి గవర్నర్లు ప్రత్యేకాధికారాలు ఉపయోగించుకొనడానికి పరిస్థితులు అనుమతించవనే విశ్వాసం వుంది అనే నెపంతో అంతకు వారం రోజుల క్రితమే వర్కింగ్ కమిటీ అధికారం స్వీకరించడానికి ఆమోదం తెలిపింది.

కాంగ్రెస్ మంత్రివర్గాలు యుపి, బీహార్, ఒరిస్సా, సిపి, బొంబాయి, మద్రాసులలో అధికారం చేపట్టాయి. కొద్ది నెలల తర్వాత 1938 సెప్టెంబర్‌లో వాయువ్య సరిహద్దు రాష్ట్రంలో కూడా అధికారం చేపట్టింది. యుక్తులతో, పార్టీ మార్పిడులతో అస్సాంలో కూడా కాంగ్రెస్ మంత్రివర్గాన్ని ఏర్పరచగలిగింది. కాంగ్రెస్, వామపక్ష అధ్యక్షుడు సుభాస్ బోస్ దీనిలో కీలక పాత్ర పోషించాడు.

దేశంలోని పెద్ద భాగంలో నిన్న పీడితులుగా వున్నవారు ఈ రోజు మంత్రులయ్యారు. వందేమాతరం ఆలాపనతో అసెంబ్లీ సమావేశాలు జరిగాయి. ఏ జాతీయ జెండా కొరకు ఎందరో లాఠీలు, తూటాలు ఎదుర్కొన్నారో ఆ జాతీయ జెండా ప్రభుత్వ భవనాలపై సగర్వంగా ఎగిరింది. కాంగ్రెస్ మంత్రివర్గాలు సామ్రాజ్యవాద వ్యతిరేక సెక్షన్లకు మంచి ప్రేరణ నిచ్చాయి. 1936లో అర్ధ మిలియన్‌గా వున్న కాంగ్రెస్ సభ్యత్వం 1937లో 3.1 మిలియన్లకు 1938 నాటికి 4.5 మిలియన్లకు పెరిగింది. వామపక్షాల పట్ల మొగ్గు చూపే విద్యార్థి కార్మిక రైతు ఉద్యమాలు, సంస్థలు ఆవిర్భవించాయి. అభివృద్ధి చెందాయి. మంత్రి వర్గాల ఏర్పాటు చాలా స్వదేశీ సంస్థానాలలో నియంతృత్వ వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక ప్రజా ఉద్యమాలకు ప్రేరణనిచ్చాయి. మంత్రివర్గాల ఏర్పాటు ఆమోదంపై ప్రతికూలమైన, పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలు కూడా వ్యక్తమయ్యాయి. పూర్ణ స్వరాజ్యానికి కట్టుబడి వుండి 1935 రాజ్యాంగ సంస్కరణల్ని తీవ్రంగా విమర్శించిన పార్టీ ఆ చట్రం మేరకు పనిచేయడం గవర్నర్ల చేతుల్లో విశేషాధికారాలు, పరిమితమైన ఆర్థిక వనరులు, చాలాకాలం నుండి శత్రు వైఖరితో వ్యవహరిస్తూ వచ్చిన సివిల్ పోలీస్ అధికారుల ద్వారా నిర్ణయాలు అమలు జరిపించుకోవలసిన పరిస్థితులు – పరిస్థితులు సంక్లిష్టంగా, వైరుధ్యభరితంగా వున్నాయి. గాంధీ ఒత్తిడి మేరకు వర్కింగ్ కమిటీ మంత్రుల నెలసరి జీతాలపై రు. 500లు గరిష్ట పరిమితులు విధించినప్పటికి – ఒక్కసారిగా అధికారాలు వచ్చి పడతాయని, దానితో పాటు అవకాశవాద ముఠా రాజకీయాలు ప్రవేశించాయి. కొన్ని జిల్లాల్లో స్థానిక సంస్థలకు జరిగిన ఎన్నికలలో పోటీచేయడం తప్ప కాంగ్రెస్ చేసిందేమీ లేదని 1938లో బీహార్‌లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపై ఎఐసిసి పరిశీలకుడు అంగీకరించాడు.

1938 జూలైలో మధ్యప్రదేశ్‌లో ఎన్.బి. ఖారేని డి.పి. మిశ్రా మద్దతుతో రవిశంకర్ శుక్లా ప్రధానమంత్రి పదవి నుండి తొలగించాడు. దీనికి హిందీ మాట్లాడే రాయపూర్, జబల్పూర్‌లకు ఖారే నాయకుడుగా వున్న మరాఠీ జిల్లాలకు మధ్య ఘర్షణగా ప్రాంతీయ రంగు పులమబడింది. కాని విభేదాలకు ముఠా తగాదాలే ముఖ్య కారణం (ఒక సంవత్సరం క్రితం శుక్లాకి వ్యతిరేకంగా మిశ్రా ఖారేకి మద్దతు ఇచ్చాడు). కాని వివిధ ప్రయోజనాలు, కులాలు, మతాలు, వర్గాల మధ్య సమతుల్యత సాధించడం కీలకమైన సమస్య. జాతీయవాద బహుళ వర్గ ఆదర్శాలు గలదైనప్పటికి పాలక పార్టీగా కాంగ్రెస్ పార్టీకి ఒకేసారి హిందువుల్ని, ముస్లిముల్ని, భూస్వాముల్ని, రైతుల్ని, పారిశ్రామికవేత్తల్ని, కార్మికుల్ని సంతృప్తి పరచడం దాదాపు అసాధ్యమయింది. తరచుగా వామపక్ష పదజాలం ముసుగులో క్రమబద్ధంగా మితవాద విధానాల వైపు జరగడం (కుడికి జరగడం) 1937–39 కాలంలో కాంగ్రెస్ మంత్రివర్గాల మొత్తంగా కాంగ్రెస్ అధిష్టాన వర్గం యొక్క విధానమయింది.

## కాంగ్రెస్ ఉద్యోగిస్వామ్యం

కాంగ్రెస్ మితవాద విధానాల వైపు మారడం వలన మంత్రివర్గాలు ఉన్నతాధికార ఉద్యోగి వర్గాలతో ఘర్షణలు లేకుండా మనగలిగాయి. యుపిలో గోవిందవల్లభపంత్, బీహార్‌లో శ్రీకృష్ణ సిన్హా మంత్రివర్గాలు రాజీనామా చేశాయి. రాజకీయ ఖైదీలను వెంటనే విడుదల

చేయడానికి గవర్నర్లు నిరాకరించారు. 1937 జూలైలో అండమాన్ జైలులో నిరాహారదీక్ష చేపట్టిన తరువాత ఖైదీల విడుదల జాతీయ సమస్య అయింది. బెంగాల్ రాష్ట్రంలోని పెద్ద సంఖ్యలో వున్న డిటెన్యూల విషయంలో ఎలాంటి చర్య చేపట్టనందుకు బెంగాల్‌లోని కాంగ్రెసేతర ఫజల్‌హక్ మంత్రివర్గాన్ని కాంగ్రెస్ తీవ్రంగా విమర్శించడం ప్రారంభించింది. హరిపూర్ కాంగ్రెస్ సదస్సు ముందు (ఏదో ఒకటి చేయాలని) కాంగ్రెస్‌లోని వామపక్షవాదుల నోళ్ళు మూయాలంటే ఏదో ఒకటి చేయాలి. అందుకే రాజీనామాలు.

గవర్నర్ల విచక్షణాధికారాల మేరకు విడుదల చేసే ప్రాతిపదికన తక్షణం మొత్తాన్ని విడుదల చేయడానికి బదులుగా గవర్నర్లు విచక్షణాధికారాల మేరకు విడుదల చేసే ప్రాతిపదికన హరిపుర కాంగ్రెస్ సదస్సు ముగిసిన కొద్ది రోజులకే రాజీనామాలు ఉపసంహరించుకోబడ్డాయి.

1932 నుండి సంక్రమించిన ఎమర్జెన్సీ అధికారాలను కాంగ్రెస్ మంత్రివర్గాలు రద్దు చేయడం ప్రారంభించాయి. కాని 1937 అక్టోబర్‌లో రాజగోపాలాచారి విద్రోహకర ఉపన్యాసాల నెపంతో అరెస్టులు ప్రారంభించారు. అన్ని కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో మత ఘర్షణలకు వ్యతిరేకంగా అలాగే వామపక్ష నాయకత్వంలోని కార్మిక కర్షక ఉద్యమాలకు వ్యతిరేకంగా అణచివేత చర్యలు చేపట్టడం సర్వ సాధారణమయ్యాయి. ప్రాణ, ధన రక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే చర్యల్ని 1938 సెప్టెంబర్‌లో ఎఐసిసి పూర్తిగా సమర్ధించింది. పౌర స్వేచ్ఛ పేరుతో హత్యలు, గృహ దహనాలు, దోపిడీలు, వర్గ పోరాటాల్ని ప్రభావం చేయడాన్ని ఖండించింది. శాంతి భద్రతల సంరక్షణ విషయంలో కాంగ్రెస్ మంత్రి వర్గాలకు 1937 ముందు నాటి ప్రభుత్వానికి తేడా లేదన్నారు. సామ్రాజ్యవాద చరిత్రకారుడు హోప్‌లాండ్ (1) కాంగ్రెస్ ప్రభుత్వాలు శాంతి భద్రతల పరిరక్ష పరీక్షలో నెగ్గాయి (ఆర్. హోప్‌లాండ్ భారతదేశంలో రాజకీయ సమస్య రెండవ భాగం పేజీ 135)

## మతవాద సమస్య

హూప్‌లాండ్ కాంగ్రెస్ అధిష్టానం యొక్క నియంతృత్వ వైఖరిని ఖండించారు. కాంగ్రెస్ సమాఖ్య సూత్రాల్ని (Federal Princeple) కించపరిచిందన్నారు. కాంగ్రెస్ మంత్రివర్గాలు హిందూ అనుకూల చర్యలు ముస్లింలు నిర్ణయాత్మకంగా దూరమవడానికి దారితీశాయన్నారు. (భారతదేశంలో రాజ్యాంగ సమస్య పేజీ 99) వాస్తవంగా ముస్లిం లీగ్ విమర్శ కూడా యిదే. ముస్లిం లీగ్ పాట్నా సదస్సులో (1938 డిసెంబర్) జిన్నా (కాంగ్రెస్ ఫాసిజాన్ని ఖండిస్తూ యిదే అంశాన్ని ప్రస్తావించారు. లీగు ప్రతినిధులే గాక యితరుల హోదా 1937–39 కాలంలో కాంగ్రెస్ వైఖరులు, విధానాలు ముస్లింలని దూరం చేశాయంటారు. ఉదాహరణకు ఆజాద్ (తన ఇండియా విన్స్ ఫ్రీడం 1959) అలాగే విభజన సంవత్సరాలపై పెండెరిక్ మూన్స్, హెచ్.వి. హడ్సన్ లాంటి బ్రిటిష్ రచయితలు.

1937 తరువాత లీగు పునరుద్ధరణ యుపిలో కేంద్రీకరింపబడినప్పటి నుండి ఆ రాష్ట్రంలో మిశ్రమ మంత్రి వర్గం ఏర్పాటుకు కాంగ్రెస్ తిరస్కారం నిర్ణయాత్మకమైనదిగా

వ్యాఖ్యానించబడుతుంది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ లీగు సంబంధాలు చాలా స్నేహపూర్వకంగా వున్నాయి. రెండు పార్టీలు చటారీ నేషనల్ అగ్రికల్చరిస్టు పార్టీతో పోట్లాడుతున్నాయి. అఖిల భారత స్థాయిలో కూడా లీగు ఎన్నికల ప్రణాళిక కూడా కాంగ్రెస్‌లాగానే 1935 రాజ్యాంగ చట్టాన్ని విమర్శించింది. లక్నో ఒప్పందం (1916) సూత్రాల ప్రాతిపదిక సహకారాన్ని అర్థించింది. కాని ఎన్నికల తరువాత కాంగ్రెస్ పూర్తి మెజారిటీ సాధించడంలో ఖలీకుజ్జామన్ (లీగు నాయకుడు 1934లో కాంగ్రెస్ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు) ప్రతిపాదించిన మిశ్రమ మంత్రివర్గ ఏర్పాటును తిరస్కరించింది. మంత్రుల ఎంపికపై నెహ్రూ, ఆజాద్‌లతో జరిపిన చర్చలు ముస్లిం లీగు అసెంబ్లీ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయాలని కాంగ్రెస్ పట్టుబట్టడం వలన విఫలమయ్యాయి. 1937 సం॥ము మధ్యలో అలా పట్టుబట్టడం అసాధారణం కాదు. అసమర్ధనీయం కాదు. ఉత్తరప్రదేశ్‌లో లీగు జమిందారులతో సివిల్ మిలిటరీ ఉద్యోగులతో పెనవైచుకుపోయి వుంది (Path Way to Pakisthan À,,l 173). లీగు అఖిల భారత ఎన్నికల మేనిఫెస్టో ప్రైవేట్ ఆస్తి రద్దుకి చెందిన ఎలాంటి ఉద్యమాన్నైనా ఖండించాలి. 1937 అక్టోబర్‌లో లీగు లక్నో సదస్సులో ఖలీగుజ్జామన్ ముస్లిం రైతుల పరిస్థితుల మెరుగుదలను అర్ధిస్తూ భూసంస్కరణల్ని తిరస్కరించారు. నెహ్రూ యింకా నరేంద్రదేవ్, కె.ఎం. అష్రాఫ్ వంటి వారు లీగు పూర్తిగా విలీనం కాకుండా వేరే షరతులలోనైనా ఏర్పాటు చేయబడే ఐక్య సంఘటన (మిశ్రమ మంత్రివర్గం) సామాజిక ఆర్థిక సంస్కరణల్ని అసాధ్యం చేస్తాయని భావించారు. ప్రజా సంబంధాల కార్యక్రమం ద్వారా ముస్లిం లీగులో సాన్నిహిత్యాన్ని పెంచుకోవాలనుకున్నారు. ఆ బాధ్యత అష్రాఫ్‌కి అప్పజెప్పబడింది. అంతేగాక యుపిలో కాంగ్రెస్‌కి పెద్ద మెజారిటీ (228కి 134) వుంది. జామియత్, ఉల్, ఉల్‌మా హింద్ ఆధిపత్యం గల దియోబండ్ ఉలామా మద్దతు ఉంది. ఉత్తర భారతదేశంలో కొద్ది సంవత్సరాల క్రితం పంజాబ్‌లో మాజీ ఖిలాపత్ వాదులచే స్థాపించబడిన అహ్రాత్ పార్టీ మద్దతు వుంది. 1937 మేలో అహ్రార్ సదస్సు జిన్నాని కాలం చెల్లిన రాజకీయవేత్తగా నిరసించింది. రాజ్యాంగాన్ని పరమ పవిత్రంగా ఆరాధించేవాడన్నది. లీగు కొద్దిమంది యోధుల ఖాన్ బహద్దూర్‌ల నవాబుల ముఠా అన్నది.

లక్నో సదస్సు తరువాత లీగు ప్రజల మద్దతు పొందేందుకు నిర్ణయాత్మకమైన విజయవంతమైన ప్రయత్నాలు ప్రారంభించింది. మైనారిటీలకు రక్షణ కల్పించే పూర్తి స్వతంత్రం తన విధానంగా ప్రకటించింది. వర్గ కాఠిన్యాన్ని, మత ఘర్షణల్ని సృష్టిస్తున్నందుకు కాంగ్రెస్‌ని నిరసించింది. కొద్ది నెలల్లో యుపిలో 1,00,000 మంది కొత్త సభ్యుల్ని చేర్చుకున్నది. పంజాబ్, బెంగాల్ ప్రీమియర్లను (ప్రధానుల్ని) యూనియనిస్టు సికిందర్ హయాత్‌ఖాన్ కృషక్ ప్రజా నాయకుడు ఫజుల్ హక్‌ని అనుచరులుగా చేర్చుకోగలిగింది. లీగు పునర్నిర్మాణం యుపి నుండి చేపట్టబడిందని భారత రాజకీయాల విద్యార్థులకు తెలుసు. కాని కాంగ్రెస్ వైఫల్యానికి కారణం సంకీర్ణాన్ని తిరస్కరించడం కాదు. యుపిలోను, దేశంలోని యితర చోట్ల సరియైన సామాజిక ఆర్థిక చర్యల్ని రూపొందించి అమలు జరపకపోవడం కాంగ్రెస్ వైఫల్యం. ముస్లింలతో ప్రజా సంబంధాలు కాగితాలకే పరిమితమయ్యాయి. సెక్యులరిజం సమూలమైన మార్పులతో

సంబంధించిన పదజాలం ముస్లింల్ని తమవైపు తిప్పుకోవడానికి గాక ముస్లిం ప్రయోజనాపరుల్ని కలవరపరచింది.

బెంగాల్‌లో మంత్రి వర్గ నిర్మాణం దాదాపు అలాంటి తక్కువ సమర్ధనీయమైన పరిణామాలకు దారితీసింది. అబ్దుల్ మన్సూర్ అహమ్మద్ షంషుద్దీన్ అహమ్మద్ నౌషధ్ ఆలీలాంటి మార్పులు కోరే నాయకుల ఒత్తిడి మేరకు ఫజుల్ హక్ యొక్క కృషిక్ ప్రజా పార్టీ నష్ట పరిహారం లేకుండా జమిందారీ విధానం రద్దు, తక్షణ కౌలు తగ్గింపు, నిర్బంధ ప్రాథమిక విద్యకి పిలుపిస్తూ 1936 ఏప్రిల్‌లో ఎన్నికల కార్యక్రమాన్ని ఆమోదించింది. ఎన్నికల ముందు జిన్నాతో చర్చలు పాక్షికంగా జమిందారీ రద్దు సమస్యపై విఫలమయ్యాయి. ప్రతిష్టాత్మకమైన పటుఖాలి నియోజకవర్గంతో ఖాజా నజీముద్దీన్‌పై ఫజుల్ హక్ గెలుపులో లీగుకి కృషక్ ప్రజా పార్టీ గట్టి ప్రత్యర్థిగా నిరూపితమయింది. కాని బెంగాల్‌లో కాంగ్రెస్ నాయకత్వం మాట వరుసకి కూడా వ్యవసాయ సంస్కరణల్ని స్వాయత్తం చేసుకోలేదు. అందుకు కారణం యుపిలో వలే గాక జమిందారులతో అత్యధికులు హిందువులు అవుధ్ తాలూకాదార్లతో ముస్లింలు ఎక్కువగా వుండటం కావచ్చు. ఖైదీల్ని వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ పట్టుబట్టింది. కాని ఖైదీల సమస్య గవర్నర్ వీటోకి మంత్రివర్గ రాజీనామాకు దారితీయవచ్చు గనుక మంత్రివర్గ కార్యక్రమంలో ప్రాధాన్యత కౌలు సంస్కరణలకు యివ్వాలని అబుల్ మన్సూర్ అహమ్మద్ వాదించారు. ఫలితంగా కృషిక్ ప్రజా పార్టీలో సంకీర్ణానికి సంబంధించిన చర్చలు విఫలమయ్యాయి. ఆ విధంగా ఫజుల్‌హక్ లీగులో మైత్రి చేసుకునే విధంగా నెట్టివేయబడ్డాడు.

రాష్ట్రాలలో కాంగ్రెస్ పాలన సాగిన 27 నెలల కాలంలో ముస్లిం లీగు పరపూర్ రిపోర్టు (1938 చివర), బీహార్‌పై షరీఫ్ రిపోర్టు (1939 మార్చి) కాంగ్రెస్ పాలనలో ముస్లింల కడగండ్లపై ఫజుల్‌హక్ రిపోర్టు (1939 డిసెంబర్) ప్రాతిపదికన తీవ్రమైన ప్రచారం చేపట్టింది. మత ఘర్షణల్ని నివారించడంలోని వైఫల్యం బక్రీద్ పండగ సందర్భంగా గోవధపై స్థానిక నిషేధాలు ప్రభుత్వ కార్యక్రమాల సందర్భంగా వందేమాతర గీతంలోని విగ్రహారాధనకి చెందిన పాదాల్ని పాడటం ఉర్దూ ప్రాబల్యాన్ని తగ్గించేందుకు హిందీ, హిందూస్తానీ ప్రచారానికి దేవనాగర లిపిని ప్రోత్సహించడం, ఇతర ఆరోపణలు ఇవి. అతిశయాలతో కూడిన ఆరోపణలు. ఆరోపణలపై చీఫ్ జస్టిస్ మారిస్ గయరబ్ విచారణ జరిపిస్తామన్న కాంగ్రెస్ ప్రతిపాదనని లీగు తోసిపుచ్చింది. 1940 మార్చి నాటి పాకిస్తాన్ తీర్మానానికి ముందు లీగు నాయకుల స్పష్టమైన కార్యక్రమంలేని అసంతృప్తి రాజకీయ నాయకులు ప్రత్యేక నియోజకవర్గాల, రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి వాయువ్య సరిహద్దు రాష్ట్రానికి, సింధుకి పూర్తి రాష్ట్ర ప్రతిపత్తి పంజాబ్ బెంగాల్‌లో ముస్లిం రాజకీయ ఆధిపత్యం – పాత డిమాండ్లన్నింటినీ ముస్లిం రాజకీయ ఆధిపత్యం – పాత డిమాండ్లన్నింటినీ బ్రిటిష్ పాలకులు, కాంగ్రెస్ అంగీకరించడం జరిగింది. కాబట్టి 1938మేలో జిన్నా బోస్‌తో జరిగిన చర్చల్లో లీగుని ముస్లింల ఏకైక ప్రతినిధిగా గుర్తించాలని పట్టుబట్టాడు. 1940 దశాబ్దం మధ్య కాలానికి ముందు ఏ మాత్రం సమర్ధనీయంగాని డిమాండ్ యుపి, బొంబాయి, మద్రాసులలో ముస్లిం మైనారిటీలలో లీగు బలమైన పార్టీగా వున్నప్పటికి

బెంగాల్‌లో బలహీనంగా వుంది. వాయువ్య సరిహద్దు రాష్ట్రంలో, పంజాబ్‌లో దాని ఉనికి నామమాత్రమే. సింధులో కూడా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో విఫలమయింది. (అల్లాబక్ష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ మద్దతుతో 1938 మార్చిలో ప్రభుత్వం ఏర్పాటు చేయబడింది). జిన్నా స్థాయిని కాంగ్రెస్ తిరస్కరించింది. మంచి అదృష్టంగా పరిణమించిందని ఖలీకుజ్జామన్ అరమరికలు లేకుండా అంగీకరించారు. "లీగు చేసిన డిమాండ్‌ని కాంగ్రెస్ అంగీకరించి వుంటే అప్పుడు చేయడానికి ఏమీ డిమాండ్లు మిగిలి వుండేవి కావు" (అఖాలీ కుజ్జామన్ పేజీ 192)

ఇక పార్టీ అధిష్టాన వర్గం నియంతృత్వ విధానం అవలంబిస్తున్నదన్న ఆరోపణకు వస్తే ఒక అఖిల భారత పార్టీ నిర్మాణాన్ని పటిష్టపరచుకొనడానికి ప్రయత్నించడాన్ని నిందించలేము. 1937-47 కాలంలో జిన్నా తన శక్తినంతా రాష్ట్రాల ముస్లిం నాయకులపై తన అదుపుని పెంచుకొనేందుకు ప్రయత్నించాడు. కాంగ్రెస్ రాష్ట్రాలలో మత ఘర్షణలు తరచుగా జరిగేవి. అలా అని యితర రాష్ట్రాలలో కంటే ఎక్కువేం కాదు. 1937 అక్టోబర్ 1939 సెప్టెంబర్ మధ్య కాలంలో 8 కాంగ్రెస్ రాష్ట్రాల్లో 60 మత ఘర్షణలు జరిగాయి. అదే కాలంలో మూడు కాంగ్రెసేతర రాష్ట్రాలలో 25 ఘర్షణలు జరిగాయి (కూప్‌లాండ్ పేజీ 131).

వందేమాతర గేయంలోని కొన్ని భాగాలపై ముస్లిం సోదరులు ప్రస్తావించిన అభ్యంతరాలలోని సమంజసత్వాన్ని గుర్తించి 1937 అక్టోబర్‌లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ వందేమాతర గేయంలోని ముగింపు చరణాలను వదిలి వేయాలని తగ్గించాలని నిర్ణయించింది. వార్ధా ప్రాతిపదిక విద్యా విధానం మరీ హైందవీకరించబడిందని లీగు విమర్శించింది. హిందూ మహాసభ పాఠ్యాంశాలలో ఉర్దూకి స్థానం కల్పించినందుకు నిరసించింది. ఇస్లాం వ్యతిరేకమైనవని లీగు నిరసించిన వార్ధా పథకాన్ని రూపొందించడంలోను బొంబాయి పాఠశాలలకు ఉర్దూ పాఠ్య పుస్తకాల రూపకల్పనలోను ప్రముఖంగా పనిచేసిన ముస్లిం మేధావి విద్యావేత్త డాక్టర్ జాకీర్ హుస్సేన్.

'మతవాద పెరుగుదలలోని, ముస్లిం ప్రజలలో కాంగ్రెస్ వ్యతిరేక భావాల పెరుగుదలని అదుపు చేయడంలో మనం విఫలమయ్యాం' నెహ్రూ రాజేంద్రప్రసాద్‌కి 1939 అక్టోబర్ 18న రాసిన లేఖలో అంగీకరించారు (ఉమాకౌర్ పేజి 123) కాంగ్రెస్ పాలనలో వున్న ముస్లిం మెజారిటీ రాష్ట్రం వాయువ్య సరిహద్దు రాష్ట్రంలో హిందూ సిక్కు వర్తకుల్ని, వడ్డీ వ్యాపారుల్ని ఎదుర్కొని ఖాన్ సాహెబ్ ప్రభుత్వం గ్రామీణ రుణ భారాన్ని తగ్గించడంలో విఫలమైనందువలన ముస్లిం రైతుల మద్దతు కోల్పోవడం మొదలయింది. (వాయువ్య సరిహద్దు రాష్ట్ర చట్ట సభ - స్వాతంత్ర్య పోరాటం 1932 - 47 పేజీ 93). ఉత్తమ మధ్య భారతదేశంలోని చాలా ప్రాంతాలలో కాంగ్రెస్ నాయకత్వం యొక్క గ్రామీణ ప్రజాదరణ, హైందవత్వంతో హిందీ భాషతో మమేకం చేయబడింది. ముస్లింలు పట్టణాలు చేరారు. చదువుకొన్నారు. ఉర్దూ భాష ఉన్నత వర్గాలకు చెందిన భాష అయింది. 1930 దశాబ్దం చివరలో కాంగ్రెస్ పై స్థాయి నాయకులు సెక్యులరిజం అవసరాన్ని గుర్తించారు. సెక్యులరిజం క్రింది స్థాయి కార్మిక శక్తుల వరకు ప్రచారం చేయబడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వాలు కూడా అన్నీ అమలు జరపలేదు. ఉదాహరణకు సి.పి. కాంగ్రెస్ కార్యకర్తలు

లీగులో చేరడం లేదు. కాని తరచుగా హిందూ మహాసభలో చురుకుగా పనిచేయడం జరుగుతుందని" ఆజాద్ తన అసంతృప్తిని వెల్లడించాడు. కాని 1938 డిసెంబర్‌లో కాంగ్రెస్‌లో కొనసాగడానికి హిందూ మహాసభ సభ్యత్వం అనర్హతగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రకటించింది. ఈ సంవత్సరాలలో హిందూ మహాసభ బలం పుంజుకుంటూ వుంది. దాని కొత్త అధ్యక్షుడు మహారాష్ట్రకి చెందిన మాజీ రివల్యూషనరీ వి.డి. సావర్కార్ నాగపూర్ సదస్సు (1938 డిసెంబర్)లో యిలా ప్రకటించారు. "మనం హిందువులం మనంతట మనంగా ఒక జాతి హిందూ జాతీయవాదులు, హిందూ మతవాదులుగా పిలిపించుకోవడానికి చింతించనవసరం లేదు. 1931లో పంజాబ్ ముస్లింలతో స్థాపించబడిన ఇనయతుల్లా ఖాన్ మష్రిఖీ యొక్క కాక్సర్లు, కె.బి. హెడ్గేవార్ యొక్క రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లాంటి అర్ధ మిలటరీ మతవాద సంస్థల పెరుగుదల ఈ కాలానికి చెందిన ప్రమాదకరమైన సంకేతాలు. తొలుత తిలక్ అనుచరుడు, ఆ తరువాత మహాసభ నాయకుడు అయిన బి.ఎస్. మాన్జే పోషణలో 1930లో ఆర్.ఎస్.ఎస్. నాగపూర్ స్థావరం నుండి యుపి పంజాబ్, దేశంలోని యితర ప్రాంతాలకు వ్యాపించింది. 1940లో గోల్వాల్కర్ నాయకత్వం చేపట్టేనాటికి రాజీలేని మతవాదానికి కట్టుబడిన క్రమశిక్షణాయుతమైన 1,00,000 మందికి శిక్షణ యివ్వడం జరిగింది.

1930 దశాబ్దం చివరి సంవత్సరాల సమకాలికులకు విభజన దినాల అనుభవాల నుండి పొందిన వెనుక చూపు, మతవాద సమస్యల ప్రాధాన్యతని అతిశయించి చెప్పి వుండవచ్చు. చాలామంది కాంగ్రెస్‌వారు అప్పటికి లీగుని ప్రమాదకరమైనదిగా పరిగణించలేదు. కాంగ్రెస్ మంత్రి వర్గాలను వ్యక్తిగత ప్రయోజనాల కోసం గాంధేయ ఆదర్శాలను అమలు జరిపేందుకు భారత వాణిజ్యవేత్తల సహకారంతో జాతీయ ఆర్థిక పురోగతి సాధించేందుకు అణచివేయబడిన వారి స్థితిగతులను మెరుగుపరిచేందుకు పలు రకాలుగా పరస్పర విరుద్ధమైన పద్ధతులతో ఉపయోగించుకొనే ప్రయత్నాలలో నిమగ్నమైయున్నారు.

## గాంధేయ సంస్కరణలు

శారీరక శ్రమతో చేసే ఉత్పత్తికి, విద్యకి సంబంధం వుండాలని మాతృభాష మాధ్యమంలో విద్యాబోధన జరగాలని, ప్రాతిపదిక విద్య కొరకు గాంధీ చేసిన ప్రతిపాదనలకు 1937 అక్టోబర్‌లో వార్ధా విద్యా సదస్సు ఆమోదం తెలిపింది. కాంగ్రెస్ రాష్ట్రాలలో కొంత ప్రభుత్వ సహాయంలో ఈ పద్ధతులలో పాఠశాలలు స్థాపించబడ్డాయి. నిరాడంబరత, శారీరక మానసిక శ్రమల మధ్య వ్యత్యాసం తగ్గింపు, పాఠశాల ఉత్పత్తుల ద్వారా స్వయం సమృద్ధి ప్రాతిపదిక విద్య లక్ష్యాలు. సాంప్రదాయ పాఠశాలలకు, కళాశాలల విద్యకి ప్రాతిపదిక విద్య ప్రత్యామ్నాయం కాలేకపోయింది. కుటీర పరిశ్రమలతో సంబంధం అవాస్తవమైన ప్రాచీనమైన భావాలతో కూడిన గాంధేయ వేలంవెర్రిగా చాలామంది అభిప్రాయపడ్డారు. ఆర్థికపరమైన భావాలు పెరిగినప్పటికి సంపూర్ణ మద్యనిషేధాన్ని ప్రత్యేకించి బొంబాయి మద్రాసు రాష్ట్రాలలో అమలు జరపమని కాంగ్రెస్ మంత్రివర్గాల్ని అధిష్టానవర్గం ఆదేశించి మద్రాసు దేవాలయ ప్రవేశ చట్టాన్ని చేసింది. హరిజన సంక్షేమం కొరకు దాదాపు చేసిందేమీ లేదు. 1930 దశాబ్దం

చివరికి లీగు వలెనే అంబేద్కర్ కూడా కాంగ్రెస్‌కి తీవ్ర విమర్శకుడయ్యాడు. 1939 అక్టోబర్‌లో కాంగ్రెస్ మంత్రివర్గాలు రాజీనామా చేసిన దినాన్ని విముక్తి దినంగా జరుపుకొనడంతో జిన్నాతో కలిశారు.

## పెట్టుబడిదారులు - కాంగ్రెస్

ఇది ప్రాంతానికి కాలానికి వైరుధ్యాలకు లేక వ్యత్యాసాలకు అతీతమైన క్రమం కాదు. కాంగ్రెస్ అధికారం ఆమోదిస్తుందనే వార్త విని ఉబ్బి తబ్బిబ్బయ్యానని బిర్లా చెప్పుకొన్నాడు. కాంగ్రెస్ పాలిత ప్రాంతంలోని పారిశ్రామికవేత్తలు తొలుత కార్మిక సంఘాల ఒత్తిళ్లకు కాంగ్రెస్ మంత్రివర్గాలు లొంగిపోతాయని ఆందోళన జెందారు. 1937 అక్టోబరులో ఒక కాంగ్రెస్ కార్మికవర్గం అస్పష్టతతో కూడిన ఒక సంక్షేమ కార్యక్రమాన్ని రూపొందించింది. 1937-38 కాలంలో కాన్పూరులో జౌళి పరిశ్రమలలో చాలా సమ్మెలకు నాయకత్వం వహించిన మజ్దూరు సభని గుర్తించాలని యు.పి. మంత్రివర్గం పట్టుబట్టింది. 1937లో యు.పి.లో కాంగ్రెస్ అధికారాన్ని స్వీకరించిన తరువాత ప్రముఖ పారిశ్రామికవేత్తలు - అందరూ హిందువులనుకొంటాను - ఐక్యమై తమ ఆర్థిక ప్రయోజనాల్ని దెబ్బతీసే కాంగ్రెస్‌ని వ్యతిరేకించే జిన్నాకి, ముస్లింలీగుకి యింకా మహాసభకి నిధులు సమకూర్చాలని నిర్ణయించారు. తరువాత వైస్రాయి కార్యనిర్వాహక వర్గంలో చేరిన యు.పి. ప్రముఖుడు జె.పి. శ్రీవాత్సవ వేవల్‌కి చెప్పాడు (వేవల్, వైస్రాయి జర్నల్, 1944 నవంబరు 30 పేజి 402) రెండవ విభేదం ఆర్థిక పరమైన కారణాలతో వచ్చింది. బొంబాయి ప్రభుత్వం 1939 ఫిబ్రవరిలో గాంధేయం 'వేలంవెర్రి'యైన మద్యపాన నిషేదం కలిగించే లోటుని భర్తీ చేసుకొనేందుకు పట్టణ ఆస్తిపన్నుని, బట్టలపై అమ్మకం పన్నుని విధించింది. అట్టావా ఒప్పందం మరియు అనుబంధ భారత బ్రిటిషు ఒప్పందం 1935 రద్దుకై అసెంబ్లీ తీర్మానానికి అంగీకరించి న్యూఢిల్లీ ప్రభుత్వం భారత పెట్టుబడిదారుల్ని సమాధానపరిచే సంకేతాల్ని పంపించింది. అంతేగాక బ్రిటన్‌లో నూతన వాణిజ్యం ఒప్పందం కొరకు జరిగిన చర్చలలో అనధికార సలహాదారులుగా పనిచేసేందుకు బిర్లా, ఠాకూర్‌దాస్, కస్తూరిభాయ్, లాలాభాయ్‌లను ఆహ్వానించింది. చర్చలు 1936 ఆగష్టు నుండి 1939 మార్చి వరకు జరిగాయి. లాంక్‌షైర్ దిగుమతులపై తక్కువ దిగుమతి సుంకాలు విధించడానికి ప్రతిఫలంగా ఎక్కువ భారత ఎగుమతుల్ని బ్రిటన్‌కి అనుమతించడంపై బేరసారాలు జరిగాయి. భారత ఎగుమతి విస్తరణలో భారతదేశ ప్రభుత్వ ప్రయోజనం యిమిడి వుంది. ఇది చెల్లింపుల్ని బయటికి పంపడానికి వీలు కల్పిస్తుంది. ఇక బొంబాయి వస్త్ర పరిశ్రమ దేశీయ మార్కెటుపై పూర్తి అదుపు సాధించింది. కాబట్టి దిగుమతి సుంకాలపై కొన్ని రాయితీల పట్ల సుముఖంగా లేదు (వాసుదేవ ఛటర్జీ ఛాప్టర్ 7)

అలాంటి సమస్యలున్నప్పటికి భారత పెట్టుబడిదార్లకు కాంగ్రెస్ నాయకత్వంలోని నిర్ణయాత్మక సెక్షన్లకు మధ్య దృఢమైన అవగాహన 1938 సంవత్సరం మధ్యకాలం నుండి పెరుగుతూ వచ్చింది,. స్వదేశీ స్టోర్స్ నుండి కొనుగోలు చేయాలని కాంగ్రెస్ మంత్రివర్గాలు చేసిన విధాన నిర్ణయం వ్యాపారులకు లాభాలు తెచ్చిపెట్టింది. కాంగ్రెస్ మంత్రి వర్గాలకు

పెట్టుబడిదారులకు, మధ్య సన్నిహిత సంబంధాలు – ప్రత్యేకించి బొంబాయిలో అభివృద్ధి చెందుతూ వచ్చాయి. ఉదాహరణకు బొంబాయి, స్టీం నేవిగేషన్ కంపెనీని కిల్లిక్ నిక్సన్ నుండి వాల్‌చంద్ హీరాచంద్‌కి స్వాధీనం చేయించడంలో పటేల్ ప్రత్యక్షంగా సహాయపడ్డాడని ఠాకూర్‌దాస్ పత్రాలు స్పష్టం చేస్తున్నాయి. (మార్కొలిజ్ పేజి 222) బట్టలపై దిగుమతి సుంకాల్ని కొనసాగించడం జాతీయవాదులకు ప్రతిష్ఠాత్మక సమస్య అయింది. అనధికార సలహాదారులు కాంగ్రెస్ ఒత్తిడిమేరకు 1938 సెప్టెంబరులో వైదొలిగారు. 1933లో వలె గాక భారతీయ పెట్టుబడిదారులు 11 రాష్ట్రాలకు గాను 8 రాష్ట్రాలలో పాలకపార్టీగా వున్న కాంగ్రెస్‌కి దూరంగా వుండలేకపోయారు. 1939 మార్చి నాటి భారత బ్రిటిషు వాణిజ్య ఒప్పందం భారతదేశం ప్రత్తి ఎగుమతి, భారతదేశంలోకి వస్త్ర దిగుమతుల ప్రాతిపదిక బట్టల దిగుమతి సుంకాల్ని విధించాలని నిర్ణయించింది. ఒప్పందానికి వ్యతిరేకంగా ఓటు చేసేందుకు వాణిజ్య వేత్తలతో సంబంధాలు గల యం.యల్.ఎలు కాంగ్రెస్‌తో కలిశారు. వైస్రాయి సర్టిఫికెట్ ద్వారా ఒప్పందం అమలు జరుపవలసి వచ్చింది.

ఆర్థికపరిణామాలు వాణిజ్య వేత్తల కాంగ్రెస్ వైఖరులలో మార్పులకు దారితీసి సన్నిహితం చేశాయి. భారతీయ సుంకాల గోడల వెనుక పెద్ద పెద్ద బ్రిటిషు (కొన్ని అమెరికా) సంస్థల స్థాపన కలవరపరిచింది. ఉదాహరణకు 1937 నాటికి అతి పెద్ద సబ్బుల తయారు సంస్థగా వున్న గోద్రెజ్‌ని తొలగించి 'లవర్‌బ్రదర్' ఆ స్థానాన్ని ఆక్రమించింది. 'ఇంపీరియల్ టొబాకో' వజీర్ సుల్తాన్‌ని ప్రారంభించింది. కెమికల్స్ ఇంజనీరింగు రబ్బరు రంగాలలోని పరిశ్రమలు భారతీయ ప్రైవేటు కంపెనీలపై ప్రతికూల ప్రభావాన్ని చూపాయని 1938 లోని హరిజన పత్రిక వ్యాసాలు స్పష్టం చేశాయి. 1939 ఏప్రిల్‌లో 'ఫిక్కీ' ఈ సమస్యని చేపట్టింది. అదే నెలలో బొంబాయి కాంగ్రెస్ నాయకుడు యన్.వి.గాడ్గిల్ సెంట్రల్ అసెంబ్లీలో ఈ సమస్యపై ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టాడు. ఈ కాలంలో చక్కెర అధికోత్పత్తి సిమెంటులో సంక్షోభం, జౌళి రంగంలో స్తబ్దతలతో 1937 నుండి ఆర్థికమాంద్యం ఆవరించింది. వినిమయ వస్తూత్పత్తి పరిశ్రమలలో దిగుమతుల ద్వారా పెరుగుదల పరిమితులు అధిగమించబడ్డాయి. గ్రామీణ ప్రాంతాలలో మార్కెట్లు విస్తరించాలంటే భూసంస్కరణలు చేపట్టడం అవసరం. కాని కాంగ్రెస్‌కు భారతీయ బూర్జువాలకు భూసంస్కరణలు ఆమోదయోగ్యం కావు. మధ్యతరహా పెట్టుబడిదారీ వస్తూత్పత్తి అభివృద్ధికి పెద్ద మొత్తాల పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రారంభంలో తక్కువ లాభాలకు సంసిద్ధత అవసరమవుతాయి. కాబట్టి తార్కిక ప్రత్యామ్నాయాలు 'ఇంపీరియల్ లిమిటెడ్ తరహా పెట్టుబడుల్ని ప్రోత్సహించడం (తక్కువ లాభాలార్జించడం పట్ల విదేశీ పెట్టుబడికి ఆసక్తి లేదు) లేక ప్రభుత్వ చొరవ, పెట్టుబడి ప్రణాళికల ద్వారా మౌలిక పరిశ్రమల్ని ప్రోత్సహించే ప్రయత్నాలు చేయడం. పారిశ్రామికాభివృద్ధి ప్రభుత్వ పెట్టుబడులకు సంబంధించినంత వరకు ఫైనాన్స్ సభ్యుడైన గ్రిన్ లాంటి బ్రిటిషు అధికారులు స్వేచ్ఛా వాణిజ్య ధోరుణుల్ని అభిమానించారు. మైసూరు మాజీ దివాన్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 1934 లోనే ప్రభుత్వ ప్రణాళిక కొరకు పిలుపునిచ్చారు. తరువాత పరిణామాలు చాలా స్పష్టంగా వ్యక్తం చేసిన విధంగా అభివృద్ధి చెందుతున్న దేశంలోని దూరదృష్టి గల బూర్జువా సెక్షన్లు మౌలిక పరిశ్రమల అభివృద్ధికి

అవసరమైన ప్రాథమిక సదుపాయాల్ని సమకూర్చి, ఒకస్థాయి వరకు అభివృద్ధిపరిచేందుకు, సోషలిజం అంటే విప్లవ పంథాలో జాతీయాకరణ కానంతవరకు, ప్రభుత్వ నియంత్రణ, ప్రణాళిక, ప్రభుత్వ పెట్టుబడులు అవసరమని అంగీకరించడానికి సిద్ధపడ్డారు.

నెహ్రూ ఆధ్వర్యంలో 1938 అక్టోబరులో జాతీయ ప్రణాళిక కమిటీ ప్రారంభించేందుకు సుభాష్‌బోస్ చూపిన చొరవని వాణిజ్యవేత్తలు స్వాగతించారు. కాంగ్రెస్ పరిశ్రమల మిత్రుల సదస్సు బిర్లా లాలాశ్రీరాం, విశ్వేశ్వరయ్యలను ఆహ్వానించింది. సదస్సు జాతీయ ప్రణాళిక కమిటీని నియమించింది. కమిటీ నియమించిన 29 సబ్ కమిటీలలో వాణిజ్య ప్రతినిధులు ముఖ్యమైన సభ్యులుగా వున్నారు. సోషలిస్టు ప్రణాళిక చట్టం లేక ప్రభుత్వ యాజమాన్యం యొక్క దీర్ఘకాలిక లక్ష్యం, లేక కీలకపరిశ్రమలపై అదుపు – లాంటి పదజాలం భారతీయ పెట్టుబడిదారులకు బాధ కలిగించలేదు. కారణం వారు కాంగ్రెస్ మంత్రివర్గాల సోషలిస్టేతర పనివిధానాన్ని బట్టి కాంగ్రెస్‌ని అంచనా వేసుకొన్నారు. ఆ విధంగా 1938–39లో ఒక నూతన పునరేకీకరణ సంకేతాలు ముందుకు వచ్చాయి. భారతీయ పెట్టుబడిదారులు, పటేల్ రాజాజీ లాంటి గాంధేయ మితవాద నాయకులతో సన్నిహిత సంబంధాలు నిలబెట్టుకొంటూనే, నెహ్రూ యొక్క ఆధునిక పారిశ్రామిక భారతదేశ స్వప్నాన్ని అభిమానించే కాంగ్రెస్‌లోని వామపక్ష సెక్షన్లని కూడా మచ్చిక చేసుకొనడం ప్రారంభించారు. గాంధేయ గ్రామీణ బూర్జువా ఆకాంక్షలకు గ్రామీణ సాదాసీదాతనం, చేతివృత్తుల కంటె ఆధునిక పారిశ్రామిక భారతదేశం అనుగుణమైనది. అంతేగాక నెహ్రూ సోషలిస్టు పోకడలు అదుపులో పెట్టగలిగేవనే సంకేతాలు అప్పటికే అందాయి.

**కాంగ్రెస్ - కార్మికులు**

బూర్జువాలలో స్నేహ బంధాల్ని పెంచుకోవడమంటే సహజంగా కార్మికుల పట్ల గల వైఖరిలో మార్పులు వుంటాయి. మంత్రి వర్గాల ఏర్పాటు కార్మిక సంఘాలకు వాటి సమరశీలతకు పేరునిచ్చింది. 1937తో పోల్చితే 1938లో కార్మిక సంఘాల సభ్యత్వం 50 శాతం పెరిగింది. ఎ.ఐ.టి.యు.సి. మితవాద యన్.యఫ్.టియులు కలవడంతో కార్మిక ఐక్యత బలపడింది. రెండు సంఘాలు నాగపూర్‌లో 1938 ఏప్రిల్‌లో ఉమ్మడి సదస్సు నిర్వహించాయి. ఈ సంవత్సరాలలో పెద్ద పారిశ్రామిక వివాదాలు బెంగాల్ జూట్ మిల్లుల్లో సాధారణ సమ్మె (1937 మార్చి–మే) కాన్పూరు ప్రత్తి మిల్లులో పనిని నిలుపుదల అమృత్‌సర్, అహమ్మదాబాద్ ప్రత్యేకించి మద్రాసు రాష్ట్రంలో (సమ్మెలో పాల్గొన్న కార్మికుల సంఖ్య బొంబాయిలో పాల్గొన్న వారి కంటె ఎక్కువ) లలో జౌళి కార్మికుల సమ్మెలు 1938 లో మార్టిన్ బరకు చెందిన కుల్లీలు, హీరాపూర్ ఐరన్ అండ్ స్టీలు వర్క్సులో సమ్మె, అస్సాంలోని దిగ్బోయ్ ఆయిల్ వర్క్సులో (1939 ఏప్రిల్ అక్టోబరు) 6 నెలల పాటు సాగిన పోరాటం కార్మిక వర్గాన్ని సమీకరించేందుకు కాంగ్రెసు కొన్ని ప్రయత్నాలు చేసినప్పటికి 1937 అక్టోబర్‌లో కలకత్తాలో నెహ్రూ బోస్‌లు పెద్ద కార్మిక ప్రదర్శన నుద్దేశించి ప్రసంగిస్తూ ఐక్యంకండి, సంఘటించండి, కాంగ్రెస్‌తో చేతులు కలపండి అని విజ్ఞప్తి చేయడం, పటేలు, రాజేంద్రప్రసాద్, జె.బి. కృపలానీలు 1938 లో హిందూస్తాన్ మజ్దూర్ సంఘం స్థాపించడం కార్మిక సంఘ ఉద్యమంలోని అత్యధిక భాగం

ఉదారవాద లేక వామపక్ష (అత్యధికంగా కమ్యూనిస్టుల) నాయకత్వం క్రిందవుంది. 1937 అహమ్మదాబాద్ జౌళి సమ్మె కాలంలో పాత గాంధేయ స్థావరంలో కమ్యూనిస్టులు చొచ్చుకుపోయారు. వర్కింగు కమిటీ బెంగాలు జనపనార కార్మికులకు (1937 ఏప్రిల్) సంఘీభావం ప్రకటించింది. బెంగాలులో ఫజులు లోహక్ మంత్రి వర్గం, పంజాబులో సికిందర్ హయత్‌ఖాన్ యూనియనిస్టులు చేపట్టిన అణచివేత చర్యల్ని నిరసించింది. కాని కాంగ్రెసు మంత్రి వర్గాలు అనుసరించి కార్మిక వర్గ అనుకూలవైఖరి పెట్టుబడిదారీ ఒత్తిళ్లకులోనయింది. కాంగ్రెసు రాష్ట్రాలలో తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యం నెలకొన్నదని బిర్లా ఆరోపించాడు. (1937 సెప్టెంబరు 4న మహదేవ దేశాయ్‌కి లేఖ – మహాత్ముని నీడలో పేజీ 227). కాంగ్రెసు పాలిత రాష్ట్రాలైన బొంబాయి, యు.పి.లో ఎలాంటి కార్మిక చట్టాలు లేని స్వదేశీ సంస్థానాలలో పెట్టుబడి తరలింపబడి వుందని బెదిరింపులు వచ్చాయి. కమ్యూనిస్టుల బలమైన స్థావరంలో బూర్జువాలను సంతృప్తి పరచి కార్మికుల్ని అణచివేయాలనే ఆకాంక్ష బొంబాయి వర్తక వివాదచట్టం (1938 నవంబరు) షరతులతో ప్రతిఫలించాయి. దీనిని గవర్నరు అభినందనీయమైనదిగా వర్ణించారు. సెలెక్ట్ కమిటీలో చర్చలు జరపకుండా రెండునెలల్లో హడావిడిగా చేయబడిన ఈ చట్టం నిర్బంధ మధ్యవర్తిత్వాన్ని వద్దంది. చట్ట విరుద్ధమైన సమ్మెలకు 6 నెలలు జైలు శిక్షని విధిస్తుంది. (లాకౌట్‌లో ఎలాంటి జరిమానాలు శిక్షలు లేవు. యాజమాన్యంలో గుర్తింపు పొందని కొత్త కార్మికసంఘాల నమోదుకు సంబంధించిన నియమాలు కఠినతరం చేయబడ్డాయి. అహమ్మదాబాదు గాంధేయ కార్మిక నాయకుల్ని (గుల్జారీ లాల్‌నంద్ నందా, ఖండూ భాయ్‌దేశాయ్ మినహాయించి చాలా కాంగ్రేసేతర పార్టీలతో మొత్తం కార్మిక సంఘ ఉద్యమం మొత్తం ఈ చట్టాన్ని వ్యతిరేకించింది. నవంబర్ 6న బొంబాయిలో నిర్వహించబడిన నిరసన ప్రదర్శనలు 80000 మంది పాల్గొన్నారని ప్రదర్శనల నుద్దేశించి డాంగే, ఇందూలాల్ యాజ్ఞిక్, అంబేద్కర్ ప్రసంగించారు. మరుసటి రోజు రాష్ట్ర మంతటా పాక్షికంగా జయప్రదమైన సాధారణ సమ్మె జరిగింది. బ్రిటిషు యాజమాన్యంలోని అస్సాం ఆయిల్ కంపెనీకి వ్యతిరేకంగా 1939 దిగ్బాయ్ సమ్మె కాలంలో కాంగ్రెస్ సమ్మెకు సానుభూతి ప్రకటించినప్పటికి యన్.సి. బార్డోలోయ్ మంత్రి వర్గం కార్మికులకు అనుకూలంగా ఐ.సి.యన్. అధికారి చేసిన సిఫార్సుల్ని అమలు జరపడంలో విఫలమయింది. అక్టోబరులో కాంగ్రెసు మంత్రివర్గం కొత్తగా ప్రవేశపెట్టిన యుద్ధకాల రక్షణ నియమాన్ని సమ్మెని అణచివేయడానికి స్వేచ్ఛగా ఉపయోగించుకొన్నది. కొత్త కార్మిక సంఘం నమోదు చేసుకోవడంలో విమర్శలున్నప్పటికి మొత్తం మీద బొంబాయి చట్టం మంచిదేనని నెహ్రూ అభిప్రాయపడడం గమనార్హం (మార్కోవిట్స్ పేజి218) కాంగ్రెస్ వామపక్ష అధ్యక్షుడు బోస్ పటేల్‌కి వ్యక్తిగతంగా నిరసన తెలిపినప్పటికీ దానిని ఒక సమస్యగా చేపట్టలేదు. (నెహ్రూ బోస్‌కి 1939 మార్చి 29, ఎ బంచ్ ఆఫ్ ఓల్డ్ లెటర్స్ పేజి 341)

**కాంగ్రెసు -రైతులు**

ప్రధానంగా రైతుల పార్టీగా చెప్పుకొనే కాంగ్రెస్ వ్యవసాయ సంస్కరణలతో చర్యలు చేపట్టవలసి వుంది. చాలా కాంగ్రెసు రాష్ట్రాలలో వడ్డీరేట్లను స్థిరీకరించడం ద్వారా రుణ

భారాన్ని తగ్గించవలసి వుంది. అటవీ సత్యాగ్రహం పాక్షిక విజయాన్ని సాధించింది. బొంబాయిలో పశువుల్ని మేపుకొనేందుకు వసూలు చేసే రుసుం రద్దు చేయబడింది. మద్రాసులో తగ్గించబడింది. కాంగ్రెస్ వ్యవసాయ చట్టం భూస్వాముల పట్ల కఠినంగా వ్యవహరించలేదు. కాంగ్రెసు విధానం పరిస్థితుల్ని యధాతథ స్థితికి కాపాడేదిగా వుంది" అని కూప్‌లాండ్ అభిప్రాయపడ్డారు. (పేజీలు 138,140) సమూలమైన మార్పులు కోరే రెండు ప్రతిపాదనలతో రైతు యాజమాన్యం, జమిందారీ ప్రాంతాలలో 1802 నాటి స్థాయికి కౌలుతగ్గింపు లాంటి ప్రకాశం కమిటీ సిఫార్సులు అటకెక్కించబడ్డాయి. పొరుగున వున్న రైత్వారీ ప్రాంతాలలోని కౌళ్లకు 12 1/2 శాతం పెంచి జమీందారి కౌళ్లను నిర్ణయించాలని చేసిన ఒరిస్సా చట్టానికి గవర్నర్ వీటో ప్రయోగించారు. కాంగ్రెసు దానిని రాజీనామా చేయవలసిన సమస్యగా పరిగణించలేదు. కాంగ్రెసు చట్టం ఫైజ్‌పూర్ సదస్సు యొక్క మితవాద ప్రతిపాదనల్ని గూడా సంతృప్తి పరిచేదిగా లేదు. కాంగ్రెస్ జమిందారీ విధానాన్ని రద్దు చేయాలని 1936, 1937 లో యు.పి. బీహార్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తీర్మానాలు కాంగ్రెస్ అధికారంలో రాగానే విస్మరించబడ్డాయి. 1937 సెప్టెంబరులో జమీందారుల నుండి శాసనోల్లంఘన భయాన్ని ఎదుర్కొన్న బీహారు మంత్రివర్గం కౌలు బిల్లుపై నీళ్లు చల్లింది (మూడు నెలల తరువాత అజాద్, రాజేంద్రప్రసాద్ భూస్వాములతో రహస్య ఒప్పందానికై పాట్నాలో చర్చలు జరిపారు. ఆ తరువాత జరిగిన భూస్వాముల సదస్సులో బీహార్ ప్రభుత్వం చాలా హేయబద్ధమైనదని, ఏ ప్రభుత్వం అనుమతించని విధంగా బీహారులోని జమీందారులు కొన్ని రాయితీలు సాధించుకొన్నారని ఒక ప్రతినిధి ప్రభుత్వాన్ని అభినందించారు. కాంగ్రెసేతర రాష్ట్రాల నమూనా దీనికి భిన్నంగా లేదు. ఫజల్‌హక్ మంత్రి వర్గం కౌలు పెంపుదలని వడ్డీ రేట్లని కొంత అదుపు చేసింది కాని జమీందారీ రద్దు సమస్యని ఫ్లౌడ్ కమిషన్‌కి వదిలివేసింది. నష్టపరిహారం యిచ్చి ప్రభుత్వం స్వాధీనంచేసుకోవాలని (1940) అదీ స్వతంత్రం తరువాత అమలు జరపాలని కమిటికి సిఫార్సు చేసింది. పంజాబులో 1900 భూపరాయికరణ చట్టాన్ని కఠినతరం చేయాలని యూనియనిస్టులు ప్రతిపాదనల్ని హిందూ మహాసభ నాయకులు బ్లాక్‌బిల్స్'గా నిరసించారు. అదిష్ఠానవర్గం జోక్యం చేసుకొనే ముందు స్థానిక కాంగ్రెసు నాయకులు అదే వైఖరి నవలంబించారు.

1937–39 నాటి పరిమిత వ్యవసాయ సంస్కరణలు కూడా రైతు ఉద్యమం ఒత్తిడి కారణంగానే చేపట్టబడ్డాయి. కిసాన్‌సభ సభ్యత్వం 1938 లో అర్థ మిలియన్‌కి పెరిగింది, ఒక్క బీహారు సభ్యత్వం 2,50,000, పంజాబులో 13,000 యు.పి. (60,000) ఆంధ్ర (53,000) బెంగాల్ (34000) అద్భుతమైన కిసాన్ యాత్రలు సాధారణమయ్యాయి. ఉదాహరణకు బీహార్‌లో కాంగ్రెసు మంత్రి వర్గం ఏర్పడిన తరువాత రైతులు నేరుగా బీహార్ అసెంబ్లీలోకి ప్రవేశించి కొంతసేపు అక్కడ సీట్లలో కూర్చున్నారు. సాధారణ ప్రజలు స్వేచ్ఛని క్రమశిక్షణారాహిత్యంగా భావించి గందరగోళ పరుస్తున్నారని జి.డి. బిర్లా ఆందోళన వ్యక్తం చేశారు (మహాత్ముని నీడలో పేజీ 228) అసంఖ్యాకమైన స్థానిక పోరాటాలు చెలరేగాయి. ఉదాహరణలు – బెంగాలులోని బర్ద్వాన్ కాలువనీటి రేట్లకు వ్యతిరేకంగా ఉద్యమం (1937) న, 1937–38లో ఉత్తర మెమెన్‌సింగ్‌లోని గారో కొండల్లో మోనిసింగ్ నాయకత్వంలో హాజాంగ్

తెగల ఉద్యమం (తూర్పు బెంగాల్) కౌలుని పంటలో సగం నుండి నాల్గవవంతుకు తగ్గించగలిగింది. తరువాత కాలంలో కమ్యూనిస్టు నాయకుడైన కావ్యానందశర్మ నాయకత్వంలో బకాష్త్ భూముల పునరుద్ధరణని డిమాండ్ చేస్తూ 1936 నుండి 1939 వరకు సాగిన పోరాటం, కమ్యూనిస్టులు (ప్రధానపాత్ర) వహించిన ఆంధ్రాలోని కృష్ణాజిల్లాలోని కాళీపట్నం, మునగాలల్లో సాగిన జమీందారీ వ్యతిరేక ఉద్యమం (1938–39) 1938–39లో లైలాపూర్ (పంజాబు) సుకూర్ (సింధు)లలో నీటి పన్ను వ్యతిరేక ఆందోళనలు, అమృత్‌సర్ లాహోరులలో శిస్తు పెంపుకి వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమం, ఒరిస్సా కోస్తా జిల్లాల్లో శక్తివంతమైన రైతు ఉద్యమం బీహారులో 1938,39 సంIIలో కౌలువసూళ్లు దాదాపు స్తంభించి పోయాయి. భూస్వాముల కుప్పలకు రక్షణగా సాయుధ పోలీసు దళాలు అవసరమయ్యాయి. సహజానంద సమరశీల నినాదం లగాలేగేకైసే/దండా హమారా జిందాబాద్‌తో గ్రామాలు మార్మోగాయి. సోషలిస్టుల, కమ్యూనిస్టుల విస్తృత వేదికకు ప్రాతినిధ్యం వహించిన ఎ.ఐ.కె.యస్ ప్రతిష్ఠ క్రమంగా పెరిగింది. కాంగ్రెసు మంత్రి వర్గాల పనితీరుపై కాంగ్రెసు సోషలిస్టు పార్టీతో సంబంధాలపై భ్రమలు కోల్పోయిన సహజానంద వామపక్ష విధానాల పట్ల ఆకర్షితుడయ్యారు. సన్యాసి దుస్తులు ధరించినప్పుడు "మతపరమైన దుస్తులు దేశాన్ని చాలాకాలం స్వార్థానికి వినియోగించుకొన్నాయి. యిప్పుడు ఆ దుస్తుల్ని రైతుల పక్షాన వినియోగించుకొంటామని 1937 లోనే సహజానంద చెప్పారు. (హాసర్ పేజీ 85) లీగు, కొందరు కాంగ్రెసు వాదుల తీవ్ర ప్రతిఘటన నెదుర్కొని తూర్పు బెంగాల్‌లోని ముస్లింల కీలక కేంద్రంలో జయప్రదంగా నిర్వహింపబడిన అఖిల భారత కిసాన్‌సభ కొమిల్లా సదస్సు, గాంధీయ వర్గ సహకారాన్ని నిరసించింది. వ్యవసాయ విప్లవం తుది లక్ష్యంగా ప్రకటించింది. జమీందారీ దాడులకు వ్యతిరేకంగా ఆత్మరక్షణకు దండ ప్రయోగాన్ని సహజానంద సమర్థించారు.

పొలం లేని వ్యవసాయ కార్మికులతో ఐక్యత కొరకు తరచుగా పిలుపులిచ్చినప్పటికి కిసాన్‌సభ ప్రధానంగా రైతుల చిన్న రైతుల కౌలుదారుల సంస్థగానే వుండిపోయింది. బీహారు సంఘంలోని వివిధ స్థాయి నాయకత్వ స్థానాల్లో భూమిహారులున్నారు. హరిజన తెగల వ్యవసాయ కార్మికులు లేరు. ఫ్లౌడ్ కమిషన్‌కు బెంగాల్ రాష్ట్ర కిసాన్‌సభ సమర్పించిన విజ్ఞాపన పత్రం జమీందారీ విధానం రద్దుపై కేంద్రీకరించింది. కాని పాలికాపులు ప్రత్యేక డిమాండ్లను ప్రస్తావించడంలో విఫలమయింది. ఆంధ్రలో తొలి కిసాన్ సభ ఉద్యమం (అలాగే కమ్యూనిస్టు ఉద్యమం) కృష్ణా,గోదావరి డెల్లాకు చెందిన సంపన్నులైన కమ్మ రైతాంగంలో పునాది నీటి తీరువాపెంపు సమస్యలపైనే  కేంద్రీకరించాయి.

కాంగ్రెసు మంత్రులు నాయకులు కిసాన్‌సభ సమరశీలతపై అంతకంతకు శత్రు వైఖరి నవలంబించారు. చంపారన్, సరన్, మోంఘీర్‌జిల్లా కాంగ్రెసు కమిటీలు సహజానంద సమావేశాలకు కాంగ్రెసువారు హాజరుకాకూడదని 1937 చివరలో నిషేధం విధించాయి. కాంగ్రెసు పాలిత బీహార్ యు.పి. మద్రాసులలో 144 వ సెక్షన్ విశృంఖలంగా వినియోగింపబడింది. అనివార్య పరిస్థితులలో లాఠీ ప్రయోగం నిషిద్ధం కాదని సహజానంద

చెప్పిన మాటలు అహింసా సిద్ధాంతానికి వ్యతిరేకమని ప్రచారాలు జరిగాయి. కిసాన్‌సభ ఆందోళనలు చేస్తున్న సందర్భంలో 1938 సెప్టెంబరులో ఎ.ఐ.సి.సి వర్గ పోరాటాన్ని నిరసించడం గమనార్హం. ఇవన్నీ కూడా మొదట నెహ్రూ ఆ తరువాత బోస్ కాంగ్రెసు అధ్యక్షులుగా వున్న కాలంలో జరిగాయి. "పొరుగున ఉన్న బీహారు రాష్ట్రంలో కంటె యు.పి.లో వ్యవసాయ ఉద్రిక్తతలు తక్కువగా వుండడానికి కారణం కౌలు చెల్లింపు విషయంలో మంత్రి వర్గానికి నెహ్రూ అందించిన విలువైన మద్దతు" అని హోఫ్‌లాండ్ వ్యాఖ్యానించారు.(పేజీ 127) ఉదాహరణకు కాంగ్రెసు మంత్రివర్గాలు సాఫీగా పనిచేసేందుకు వీలుగా ఎలాంటి ఆటంకాలు కల్పించవద్దని నెహ్రూ అల్హాబాద్ రైతులకు సలహా యిచ్చారు. 1938 సెప్టెంబర్ తీర్మానాన్ని (భులాభాయ్ దేశాయ్ ప్రతిపాదించారు. గాంధీ బలపరిచారు.) కాంగ్రెసు అధ్యక్షుడు బోస్ ఒక సమస్యగా చూడలేదు. తదుపరి సంవత్సరంలో తాను అధ్యక్షుడుగా తిరిగి ఎన్నికయ్యే సమస్యపై మాత్రమే గాంధీతో విభేదించాడు.

## స్వదేశీ సంస్థానాల ప్రజా ఉద్యమం

జాతీయోద్యమం 1937, 1939 మధ్యకాలంలో నియంతృత్వానికి ఫ్యూడల్ దోపిడికి బురుజులుగా వున్న స్వదేశీ సంస్థానాలలో గణనీయమైన పురోగతి సాధించింది. భారతదేశాన్ని విభజించి స్వాధీనంలో వుంచుకొనేందుకు సంస్థానాల్ని కీలకమైన మద్దతుదారులుగా ఉపయోగించుకొనే బ్రిటిష్‌వారి సమాఖ్య పథకాలు బహిర్గతమయ్యాయి. జాతీయోద్యమంలోని చాలా యితర దశలలాగానే నిజమైన చొరవ పై స్థాయి నాయకుల నుండి సంస్థల నుండి గాక క్రింది నుండే వచ్చింది. అఖిల భారత సంస్థానాల ప్రజా సదస్సు (All India States People's Conference) దాని కార్యదర్శి బలవంతరాయ్ మెహతా ఆధ్వర్యంలో కొంత చురుకుగా పనిచేయడం ప్రారంభించింది. కాని యింకా అది పౌర హక్కులు, బాధ్యతాయుత ప్రభుత్వం లాంటి సమస్యలకు సంబంధించి మధ్యతరగతి రాజకీయవేత్తలు అప్పుడప్పుడు సమావేశమయ్యే సంస్థగానే వుంది. రైతుల, తెగల సమస్యలు ఎప్పుడోగాని ప్రస్తావనకు రావు. మొత్తం సంస్థానాలు విలీనం కావాలని డిమాండ్ చేయలేదు. మరీ చిన్న సంస్థానాల్ని పొరుగున వున్న రాష్ట్రాలలో విలీనం చేయమని (1939లో నెహ్రూ అధ్యక్షతన లూధియానా సదస్సు) సలహాలు యిస్తున్నది. కాంగ్రెస్‌లోని మితవాదపక్షం (Right Wing) సంస్థానాలలో జోక్యం చేసుకోని పాత విధానానికి కట్టుబడి వుండేందుకు గట్టిగా ప్రయత్నించింది. గాంధీ ఈ విషయంలో చాలా పట్టుదలగా వున్నాడు. మైసూరులోని ప్రజా పోరాటానికి సంస్థానాల ప్రజలు, బ్రిటిషిండియా ప్రజలు పూర్తి మద్దతు, ప్రోత్సాహం యివ్వాలని 1937 అక్టోబరులో ఎఐసిసి చేసిన తీర్మానం పట్ల గాంధీ బాహాటంగా తన అసంతృప్తి వ్యక్తం చేశాడు. సంపూర్ణ స్వరాజ్య లక్ష్యం స్వదేశీ సంస్థానాలకు, బ్రిటిషిండియాకు వర్తించాలని, కాని ప్రస్తుతానికి సంస్థానాల ప్రజల ఉద్యమాలకు కాంగ్రెస్ నైతిక మద్దతు సానుభూతి మాత్రమే అందజేయగలుగుతుందని సంస్థానాలలో ఉద్యమాలు కాంగ్రెస్ పేరుతో చేపట్టరాదని మొదటిసారిగా రాజీ తీర్మానాన్ని హరిపుర సదస్సు (1938 ఫిబ్రవరి) ప్రకటించింది. కొద్ది నెలల తరువాత సంస్థానాధీశులు ఒక మేరకు పౌర

హక్కుల్ని, స్వతంత్రమైన కోర్టుల్ని అనుమతించి రాజభరణాల్ని తగ్గించుకుంటే చాలా సంతోషిస్తానని గాంధీ సూచించాడు. కాని బాధ్యతాయుత ప్రభుత్వాన్ని డిమాండ్ చేయలేదు. ఇక విలీనం ప్రసక్తే లేదు (ఆర్.ఎల్. హండా, స్వదేశీ సంస్థానాలలో స్వతంత్ర పోరాట చరిత్ర, న్యూఢిల్లీ 1968, పేజీలు 116, 117)

1939 ప్రారంభంలో భారతదేశంలోని స్వదేశీ సంస్థానాలన్నింటిలో ప్రజా ఉద్యమాలు వేగంగా విస్తరిస్తున్న దశలో గాంధీ మొదటిసారిగా తన నియంత్రిత ప్రజా పోరాట పద్ధతిన పోరాటం సాగించాలని నిర్ణయించుకున్నాడు. తన సన్నిహిత సహాయకుడు, వ్యాపారవేత్త జమన్‌లాల్ బజాజ్‌ని జయపూర్‌లో సత్యాగ్రహానికి నాయకత్వం వహించేందుకు అనుమతించాడు. యు.ఎన్. ధేబర్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజా పరిషత్‌చే ప్రారంభించబడిన ఉద్యమంలో వల్లభాయ్ పటేల్‌తో కలిసి జోక్యం చేసుకోవాలనుకున్నారు. ప్రజల వ్యతిరేకతకు గురయిన రాజ్‌కోట దివాన్ వీర్‌వాలా గుత్తాధిపత్యం చెలాయిస్తున్నాడు. ఎన్నిక కాబడిన సలహా మండలిని సమావేశపరచడం ఆపివేశాడు. సంస్థానం ఆదాయంలోని సగభాగాన్ని రాజభరణాల రూపంలో పాలకులు దిగమింగుకున్నారు. గాంధీ రాజ్‌కోటని ఎంపిక చేసుకోవడానికి ప్రత్యేక ప్రాధాన్యత వుంది. అది చిన్న సంస్థానం. దాని చుట్టూ బలమైన గాంధేయ గుజరాత్ స్థావరం వుంది. సంస్థానంలోని సగం ప్రజలు రాజధానిలోనే నివసిస్తున్నారు. అహింసాయుత సత్యాగ్రహాన్ని భగ్నం చేసే వ్యవసాయ పోరాటాలు లేవు. కస్తూరిబా గాంధీ, మణిబేన్ పాటిల్ 1939 ఫిబ్రవరిలో అరెస్టు అయ్యారు. గాంధీ స్వయంగా రాజకోట వెళ్ళి మార్చి 3న నిరాహారదీక్ష ప్రారంభించాడు. కాని రాజకోటలో గాంధీ జోక్యం ఆయన వైఫల్యంగా నిరూపితమయింది. కారణం ఒక దశలో యిచ్చిన రాయితీలను ఉపసంహరించుకోవలసిందిగా వీర్‌వాలాను బ్రిటిష్ రాజకీయ విభాగం పురిగొల్పింది. ప్రతిపాదిత సంస్కరణ కమిటీలో ముస్లింలు అస్పృశ్యులు ఎక్కువ సీట్లు డిమాండ్ చేసేలా ప్రోత్సహించింది. తన నిరాహారదీక్ష ఒత్తిడి తెచ్చే స్వభావం కలిగివుంది కాబట్టి వలసినంత అహింసాయుతంగా లేదని ప్రకటించి గాంధీ 1939 మేలో రాజకీయ వ్యవహారం నుండి వైదొలిగాడు.

ఈ కాలంలో వివిధ సంస్థానాలలోని చాలా ప్రాంతాలలో – ప్రధానంగా మైసూరు ఒరిస్సా సంస్థానాలలో హైదరాబాద్, తిరువాన్కూరులలో (అలాగే రాజపుటానా, పంజాబ్ పాటియాలా సంస్థానం, కాల్నియా, కప్పుర్తలా సర్మూర్‌లలో) ప్రాధాన్యత గల ఉద్యమాలు అభివృద్ధి చెందాయి.

మైసూరు సంస్థానంలో ఉద్యమం గాంధేయ పరిమితుల మేరకు నడిచింది. పట్టణ బ్రాహ్మణ వృత్తిపరమైన గ్రూపుల ప్రాతిపదికన కె.టి. భాష్యంచే స్థాపించబడిన స్టేట్ కాంగ్రెస్, కె.పి. రెడ్డి, హెచ్.సి. దాసప్పన్ నాయకత్వంలోని బ్రాహ్మణేతర రైతుల పీపుల్స్ ఫెడరేషన్‌లో విలీనమయింది. కాంగ్రెస్‌ని చట్టబద్ధమైన సంస్థగా గుర్తించాలని, బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పరచాలని 1937 అక్టోబర్ నుండి చేపట్టిన ఆందోళన కోలార్ జిల్లాలోని విదురాశ్వథనగర్ గ్రామంలో 10వేల మంది గల గుంపుపై జరిగిన కాల్పులు 30 మందిని చంపడంతో 1938

ఏప్రిల్ 11న ఆగిపోయింది. ఆ తరువాత నెలలో దివాన్ మీర్జా ఇస్మాయిల్‌తో పటేల్ జరిపిన చర్చల ఫలితంగా కాంగ్రెస్‌కి చట్టబద్ధత లభించింది. కాని రాజ్యాంగ సంస్కరణలకు సంబంధించిన ఒప్పందాన్ని అమలు జరపకపోవడం 1929 సెప్టెంబర్ నుండి మరొకసారి శాసనోల్లంఘనకు దారితీసింది.

ఒరిస్సాలోని చాలా వెనుకబడిన లోతట్టు సంస్థానాలలో వెట్టిచాకిరి, అటవీ ఉత్పత్తులపై పన్నులు, పండుగల సందర్భంగా బలవంతంగా బహుమతులు రాబట్టుకొనడం లాంటివి రాజకీయ సంస్కరణ కొరకు డిమాండ్ కంటే ముఖ్యమైనవి. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నాయకుడు నవకృష్ణ చౌదరి1938 డిసెంబర్‌లో ధేన్‌కనాల్‌లో సత్యాగ్రహం నిర్వహించారు. నీలగిరి, నయాగరా, తాల్చేర్ రాణ్పూర్‌లలో శక్తివంతమైన ఉద్యమాలు అభివృద్ధి చెందాయి. చాలా హింసాయుత ఘటనలు జరిగాయి. సంస్థానాధీశుని సాయుధ బలగాలను తెగల ప్రజలు విల్లమ్ములతో తిప్పికొట్టారు. తాల్చేర్ నుండి వేలాదిమంది ఒరిస్సాలోని కాంగ్రెస్ పాలిత అంగూర్, కోసలకు వలసపోయారు. 1939 జనవరి 5న రాణ్పూర్‌లోని బ్రిటిష్ రాజకీయ ప్రతినిధి మేజర్ బార్జెల్ గెటే రాజ ప్రసాదం ముందు చేరిన గుంపుపై కాల్పులు జరిపిన తరువాత రాళ్ళతో కొట్టి చంపబడ్డాడు. గాంధీ ఒరిస్సాలోని ఉద్యమాలను విరమింపచేయడానికి చేయగలిగిందంతా చేశాడు. ఫలితంగా ధేన్‌కనాల్, తాల్చేరులలో నామమాత్రమైన రాజకీయ సంస్కరణలు ప్రవేశపెట్టబడ్డాయి. ఫలితంగా ఒరిస్సా గాంధేయులకు (గోపబంధు నాయకత్వంలోని) రాష్ట్రంలోని కిసాన్ సభకి నాయకత్వం వహిస్తున్న సోషలిస్టులు కమ్యూనిస్టులకు మధ్య వివాదాలు పెరిగాయి.

అన్నింటికంటే పెద్ద స్వదేశీ సంస్థానమైన హైదరాబాద్‌లో కొద్దిమంది ముస్లిం కులీనులు 90 శాతం ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారు. 50 శాతం తెలుగు, 25 శాతం మరాఠీ, 11 శాతం కన్నడ మాట్లాడే ప్రజలున్న సంస్థానంలో ఉర్దూ అధికార భాషగా బోధనా మధ్యమంగా చెలామణి చేయుబడుతున్నది. పౌర హక్కులు, రాజకీయ హక్కులు నిరాకరించబడ్డాయి. వెట్టిచాకిరి నిర్బంధ వసూళ్ళు తెలంగాణాలో సర్వసామాన్యం. రాజకీయ చైతన్యం మధ్యతరగతికి చెందిన భాషా ప్రాతికగల సాంస్కృతిక సంఘాలు –తెలంగాణాలో ఆంధ్ర మహాసభ, మరాట్వాడాలో మహారాష్ట్ర పరిషత్ రూపాలలో ప్రారంభమయింది. ఇవి అరకొర రాజకీయ సంస్కరణల కొరకు విజ్ఞాపన పత్రాలు సమర్పించేవి. కాంగ్రెస్ సంస్థానాలలో జోక్యం చేసుకొనని విధానం – ఆర్య సమాజ్ హిందూ మహాసభ లాంటి మతవాద శక్తులకు నైజాం ఇత్తహాద్ ఉల్ ముసల్మాన్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేసే అవకాశం లభించింది. మరొకవైపు హిందూ మహాసభ ఆధ్వర్యంలో గల సంస్థానాలలో బాధ్యతాయుత ప్రభుత్వం నినాదంతో కాంగ్రెస్ జోక్యాన్ని నిరసించింది. (నాగపూర్ సదస్సు 1938 డిసెంబరు) ఆర్యసమాజ నాయకుడు పండిట్ నరేంద్రాజీ హైదరాబాద్ నగరం మరాట్వాడా ప్రాంతంలో (పొరుగున వున్న మరాఠీ మాట్లాడే సి.పి.జిల్లాలు, హిందూ మత వాదులకు బలమైన స్థావరాలు) హిందువులకు ఎక్కువ ఉద్యోగాలు యివ్వాలనే నినాదంతో 1938 అక్టోబరులో హిందూ

సత్యాగ్రహని ప్రారంభించాడు. అదే సమయంలో మరాట్వాడా ప్రాంతానికి చెందిన స్వామి రామానందతీర్థ, గోవిందదాస్ షరాఫ్, తెలంగాణాకి చెందిన రావి నారాయణరెడ్డి, హైదరాబాద్ నగరానికి చెందిన సిరాజుల్ హసాన్ తిర్మిజి లాంటి కొద్దిమంది ముస్లింలు మతాతీతమైన ప్రాతిపదికన స్టేట్ కాంగ్రెస్ స్థాపించారు. తన చట్టాన్ని తానే చేసుకొనే బాధ్యతాయుత ప్రభుత్వాన్ని డిమాండు చేస్తూ స్టేట్ కాంగ్రెస్ 1938 అక్టోబరు 24 నుండి శక్తివంతమైన సత్యాగ్రహం ప్రారంభించింది. 'వందేమాతరం' దేశభక్తి గేయం పాడటాన్ని నిజాం నిషేధించడంలో ఉస్మానియా విద్యార్థులు యూనివర్శిటీలు బలమైన వందేమాతరం ఉద్యమాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ ఉద్యమం హిందూ మతవాద ఆందోళనతో కలిసిపోతుందనే కారణం చూపి గాంధీ ఒత్తిడి మేరకు 1938 డిసెంబరులో విరమించబడింది. 'ఈ నిర్ణయంలోని ఔచిత్యాన్ని మేము అర్థం చేసుకోలేకపోయాం' – తరువాత రామానందతీర్థ వ్యాఖ్యానించాడు. (హైదరాబాద్ స్వతంత్రపోరాట జ్ఞాపకాలు, బొంబాయి 1967, పేజి 107) ఆ తరువాత ఆంధ్ర నుండి వచ్చిన చొరవ చూపిన మెరికల్లాంటి కార్యకర్తలు రావి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కమ్యూనిస్టులలోకి వెళ్లారు. అప్పటికే కోస్తా ఆంధ్రలో వున్న బలమైన ఉద్యమం మార్గదర్శకత్వంలో 1939 లో రహస్యంగా కమ్యూనిష్టు పార్టీ నిజాం, స్టేట్ కమిటీ స్థాపించబడింది. 'ఆంధ్ర మహాసభ' విస్తృతవేదికని ఉపయోగించుకొని కమ్యూనిష్టులు ఆశ్చర్యకరమైన వేగంతో తెలంగాణా గ్రామీణ ప్రాంతాలలోకి చొచ్చుకు పోయారు. 1946 నుండి 1951 వరకు అద్భుతమైన రైతాంగ గెరిల్లా యుద్ధం నిర్వహించగల పార్టీగా అభివృద్ధి పరిచారు.

తిరువాన్కూరు కొచ్చిన్‌లలో కూడా పొరుగున వున్న మలబార్ జిల్లాలో లాగానే జాతీయోద్యమం వామపక్ష నాయకత్వం మార్గదృక్పథంతో నిర్మించబడింది. 1930 దశాబ్దపు మధ్య, చివర సంవత్సరాలలో క్రిష్ణపిళ్లై, ఇ.యం.యస్ నంబూద్రిపాద్, ఎ.కె.గోపాలన్ లాంటి చురుకైన కార్యకర్తలు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీని ఎలా స్థాపించిందీ, కాంగ్రెస్‌ని మొదటిసారిగా నిజమైన ప్రజాసంస్థగా మార్చిందీ, అదే సమయంలో కమ్యూనిజం వైపు ఎలా ముందుకు సాగిందీ – ఎ.కె. గోపాలన్ స్వీయ చరిత్రలో వివరించారు. నంబూద్రిపాద్ కేరళ పి.సి.సి. సెక్రటరీ అయ్యాడు. కేరళ పి.సి.సి 1940 వరకు వామపక్ష వాదుల అదుపులో వుంది. 1938 ఆగష్టులో తిరువాన్కూరు సంస్థాన కాంగ్రెస్ దివాన్ రామస్వామి అయ్యర్ నియంతృత్వానికి వ్యతిరేకంగా బలమైన ఆందోళన ప్రారంభించింది. తీవ్రమైన అణచివేత వున్నప్పటికి (రెండు నెలల్లో 12 కాల్పుల ఘటనలు) విద్యార్థులు పెద్ద సంఖ్యలో సత్యాగ్రహంలో చేరారు. కేరళలోని చాలా ప్రాంతాల నుండి జాతాలు (ఎకె గోపాలన్ నాయకత్వంలోని జాతాతో సహా) తిరువాన్కూరు చేరుకొన్నాయి. ఈ జాతాలు ప్రాంతీయ భాషాపరమైన ఐక్యతకు చాలా తోడ్పడ్డాయి. వీటిలో శ్రామిక వర్గం ముఖ్యమైన పాత్ర నిర్వహించింది. అలెప్పీ కొబ్బరి నార కార్మికులు జీతాల పెంపుదల సంఘ గుర్తింపు కొరకు మాత్రమే గాక రాజకీయ ఖైదీల విడుదల, సార్వత్రిక ఓటింగు హక్కుతో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని డిమాండు చేస్తూ కృష్ణపిళ్లై నాయకత్వంలో 1938 అక్టోబరు నుండి సమ్మె చేశారు. అలెప్పీ కార్మికుల్ని వేరుచేసేందుకు దివాన్ కాంగ్రెస్ సత్యాగ్రహంపై అణచివేత చర్యల్ని ఆపివేయక తప్పలేదు. ఇతర సందర్భాలలో లాగానే గాంధీ,

కాం[గెస్ అధిష్టానవర్గం కొన్ని రాయితీలు పొందిన మీదట సత్యాగ్రహాన్ని ఆపివేయమని సలహాలు యిచ్చి చేతులు దులుపుకొన్నది.

**కాంగ్రెస్‌లో వామపక్షం**

మంత్రివర్గాలలో కాంగ్రెస్ అధిష్టానవర్గంలోకి మెజారిటీలో అంతకంతకు పెరుగుతున్న సాంప్రదాయ వైఖరికి సవాలుగా కార్మిక కర్షక సంఘాల, స్వదేశీ సంస్థానాలలో తిరుగుబాట్లు సమస్యలపై విస్తృతమైన వామపక్ష ప్రత్యామ్నాయం ఆవిర్భవించింది. ఈ కాలంలో వామపక్షంలో సోషలిస్టులు, యం.యన్. రాయ్ అనుచరులు (కార్మిక సంఘాలలో యింకా ముఖ్యులుగానే వున్నారు) కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో పనిచేస్తున్న చట్ట విరుద్ధమైన సి.పి.ఐ చాలా సమర్థవంతులైన ప్రజా నాయకుల్ని (కేరళలో కృష్ణ పిళ్లై, నంబూద్రిపాద్, ఎ.కె. గోపాలన్, తమిళనాడులో జీవానందన్, ఆంధ్రలో సుందరయ్య, పంజాబులో సోహన్‌సింగ్ జోష్) అందించింది. వామపక్షవాదులు ఆ కాలం నాటి యిద్దరు కాంగ్రెస్ అధ్యక్షులు – నెహ్రూ బోస్‌ల నుండి మాటలపరమైన మద్దతు పొందారు. అదే అప్పటికి విలువైనదిగా భావించబడింది. జయప్రకాష్ నారాయణ, మినూ మసానీ యన్. జి.రంగాల లాంటి సోషలిస్టులు తాము నాయకత్వం వహిస్తున్న స్పష్టమైన ఆకారం లేని పార్టీలోనికి అంకిత భావం క్రమశిక్షణ గల కమ్యూనిస్టులు త్వరితంగా చొచ్చుకురావడం పట్ల కలవరపడ్డారు. 1939 –40లో కేరళ యూనిటు మొత్తంగాను, తమిళనాడులో ఆంధ్రలోని అత్యధిక సభ్యులు సి.పి.ఐగా బయటికి వెళ్లడంతో వారి ఆందోళన సహేతుకమైనదని స్పష్టమయింది. అయినప్పటికి 1939 వరకు కొన్ని విధాలుగా 1942 వరకు ఒక మేరకు విస్తృతమైన ఐక్యత పరిరక్షించబడింది. వామపక్షంలోని అన్ని సెక్షన్లు కూడా కాంగ్రెసులో వుండడాన్ని సమర్థించుకొన్నాయి. కొన్ని అంశాలలో అనివార్యంగా రాజీపడినప్పటికీ మంచి ఫలితాలు సాధించినట్లు భావించాయి. కార్మిక సంఘాలలో కిసాన్ సభలలో స్పష్టమైన ఆధిక్యత సాధించడంతో పాటు బెంగాలు లాంటి ప్రాంతాలలోని విద్యార్థులు వామపక్షంలోని ఏదో ఒక సెక్షను వైపు ఆకర్షితులయ్యారు. (టెర్రరిజం అంతరించింది.గాంధేయవాదం ఆకర్షణ కోల్పోయింది) 1937–38 నాటి ఖైదీల విడుదల ప్రచారం ద్వారా ఆ తరువాత ఎన్నికైన విద్యార్థి సంఘాల కొరకు ఉద్యమాల ద్వారా సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రచారంతో మిళితం చేయబడిన వయోజన విద్యా కార్యక్రమాల ద్వారా, స్పెయిన్ చైనాలతో సంఘీభావ ప్రదర్శనల ద్వారా అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ బెంగాల్ శాఖ కలకత్తా నుండి యితర ప్రాంతాల కళాశాలలకు పాఠశాలలకు విస్తరించింది.

కార్మిక సంఘాలు, కిసాన్ సభల పట్ల సానుభూతి వైఖరి చేపట్టమని సంస్థాన ప్రజల ఉద్యమాలకు బాహాటమైన మద్దతు ప్రకటించమని కాంగ్రెస్ నాయకత్వాన్ని ఒప్పించేందుకు వామపక్షం మొత్తంగా గణనీయమైన విజయం సాధించనప్పటికీ ప్రయత్నించింది. ఇక కాంగ్రెస్ వైస్రాయి విశేషాధికారాలు, సంస్థానాల రాజులచే నామినేట్ చేయబడిన సభ్యులతో కూడిన కేంద్ర అసెంబ్లీ ప్రాతిపదికన గల బ్రిటిషు వారి సమాఖ్య పథకాలకు అప్పుడప్పుడు వ్యతిరేకతను

పునరుద్ధాటిస్తూ తాత్కాలికంగా లభించిన మంత్రి వర్గాలతో తృప్తిపడి వామపక్షాలు ప్రతిపాదించిన ప్రజా ఉద్యమాన్ని తిరస్కరించింది.

నెహ్రూ వ్యక్తిగత లేఖలలో కాంగ్రెస్ మంత్రి వర్గాల సాంప్రదాయ పని విధానంపై తీవ్రమైన అనుమానాలను పలుమార్లు వ్యక్తం చేశాడు. అవి విప్లవ ప్రతీఘాతకమైనవి అన్నాడు. ప్రస్తుత ప్రభుత్వాలు పాత ప్రభుత్వాల సాంప్రదాయాల్ని (చిన్న మార్పులతో) కొనసాగిస్తున్నాయన్నాడు (జి.బి. పత్‌కి నెహ్రూ లేఖ 1937 నవంబర్ 25, ఎ బంచ్ ఆఫ్ ఓల్డ్ లెటర్స్ పేజి 263). కాని మాటల కంటె చేతలు ముఖ్యం. మనం చాలాసార్లు గమనించిన విధంగా నెహ్రూ, బోస్ – యిరువురు కూడా కాంగ్రెస్ మితవాదం వైపు కొట్టుకుపోవడాన్ని నిరోధించలేకపోయారు.

కాని అంతర్జాతీయ వ్యవహారాలలో వామపక్షానికి స్పష్టమైన దృక్పథం వుంది. అందుకు నెహ్రూ మద్దతు, నాయకత్వం సమకూర్చారు. అంతర్జాతీయ సమస్యలపై నెహ్రూ చేసిన సంకేతాలు వామపక్షం, దేశీయంగా సరియైన దృక్పథం నిర్దేశించుకోవడానికి తోడ్పడ్డాయి. యుద్ధ మేఘాలు ముసురుకొంటున్న సందర్భంలో అబిసేనియా, స్పెయిన్, ఆస్ట్రియా, జెకోస్లోవెకియా, చైనాలపై ఫాసిస్టు దాడులు జరుగుతున్నప్పుడు ఫాసిస్టుల్ని శాంతింపజేయడానికి 1930 దశాబ్దం చివరలో చాంబర్లేన్ రూపొందించిన బ్రిటిషు విదేశాంగ విధానానికి ఈసారి షరతులు లేని మద్దతు యిచ్చే ప్రసక్తి లేదని జాతీయవాదులు, వామపక్షవాదులు, ఏకాభిప్రాయానికి వచ్చారు. 'న ఎక్‌పై, న ఎక్ భాయీ' (ఒక్క పైసా యివ్వం, ఒక్క మనిషిని పంపించం) – పంజాబులో సోషలిస్టులు, కమ్యూనిస్టులు1938లో యిచ్చిన నినాదం కాని ఈ నినాదానికి అంతగా స్పందన రాలేదు. పంజాబు రైతులు సాపేక్షికంగా సంపన్నులవడానికి కారణం మిలిటరీ విభాగం నుండి వారికి వచ్చే జీతాలు, పెన్షన్లు. దురాక్రమణ దారులకు బ్రిటన్ సహాయం చేస్తున్నది. సోవియట్ యూనియన్‌కి వ్యతిరేకంగా జర్మనీని పురిగొల్పుతున్నది. బ్రిటిషు వ్యతిరేక జాతీయవాదానికి, ఫాసిస్టు వ్యతిరేక అంతర్జాతీయతకు మధ్య వైరుధ్యం లేకుండా పోయింది. కాంగ్రెస్ ఫాసిస్టు దాడిని పలుమార్లు ఖండించింది. మాడ్రిడ్‌కి సౌహార్ధం తెలిపేందుకు 1938 లో నెహ్రూ స్పెయిన్ వెళ్లాడు. సహాయం కొరకు ఛూటే చేసిన విజ్ఞప్తికి స్పందించి కాంగ్రెస్ వైద్యబృందాన్ని చైనాకి పంపించింది. కమ్యూనిస్టు ఎయిత్ రూట్ ఆర్మీ గెరిల్లాలతో కలిసి పనిచేస్తూ వైద్య బృందంలో ఒకరైన డాక్టర్ కొట్నీస్ భారత చైనా మైత్రికి, సామ్రాజ్యవాద వ్యతిరేకత యొక్క ఐక్యతకు స్మృతి చిహ్నంగా అమరుడయ్యారు. రవీంద్రనాథ్ ఠాగూర్ స్పెయిన్ రిపబ్లిక్‌కి మద్దతు యివ్వవలసిందిగా పిలుపునిచ్చారు. చైనాపై జపాన్ దురాక్రమణని ఖండించారు. రానున్న ప్రపంచయుద్ధం, ఫాసిజం వ్యాపింపజేసిన కారు చీకట్లు ఆయన చివరి రచనలలో స్పష్టంగా ప్రతిఫలించాయి.

## త్రిపురి సంక్షోభం

అంతర్జాతీయ పరిస్థితులపై ఒక మేరకు అవగాహన కుదిరినప్పటికి 1939 ప్రారంభంలో త్రిపురి కాంగ్రెస్ సదస్సుకు ముందు బోస్ తిరిగి కాంగ్రెస్ అధ్యక్షుడిగా పోటీ చేయాలని నిర్ణయించుకోవడంతో పరిస్థితులు సంక్షోభ స్థితికి చేరుకొన్నాయి. ప్రతిపాదన తొలుత 8 మంది కాంగ్రెస్ సోషలిస్టు నాయకుల (కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలు గల) నుండి వచ్చినప్పటికి, నిర్దిష్ట కాలవ్యవధిలో స్వరాజ్యం డిమాండుని తన అభ్యర్థిత్వానికి ముడిపెట్టినప్పటికి, సమస్య వ్యక్తిగతమనే భావనని తొలగించడం కష్టం హరిపుర కాంగ్రెస్ తరువాత బోస్‌చే నియమింపబడిన వర్కింగ్ కమిటీలో నెహ్రూ తప్ప ఒక్క వామపక్షవాది కూడా లేడు. కార్మిక కర్షక సమరశీలత పట్ల అధిష్టానవర్గం మంత్రివర్గాలు పెంచుకొన్న ప్రతికూలతని నివారించడానికి లేక తగ్గించడానికి బోస్ చేసిందేమీ లేదు. మూడవ అభ్యర్థి మౌలానా ఆజాద్ తన అభ్యర్థిత్వాన్ని విరమించుకొన్న తరువాత సీతారామయ్యే తన అభ్యర్థిగా గాంధీ బాహాటంగా ప్రకటించాడు. అయినప్పటికి వామపక్ష వాదులంతా బోస్ వెనుక సమీకృతులయ్యారు. 1939 జనవరి 29న 1580 –1377 ఓట్లతో బోస్ ఎన్నికయ్యాడు. బెంగాలు పంజాబులలో బోస్‌కి పెద్ద మెజారిటీ వచ్చింది. కేరళ, కర్నాటక, తమిళనాడు, యు.పి. అస్సాంలలో గణనీయమైన మెజారిటీ వచ్చింది. మహారాష్ట్ర, మహాకోషల్ (సి.పి. హిందుస్తాని)లలో పోటీ నువ్వా –నేనా? అన్నట్లు సాగింది. గుజరాతు,బీహారు ఒరిస్సా ఆంధ్రలలో యించుమించు ఓట్లన్నీ సీతారామయ్యకి పడ్డాయి.

బాహాటమైన నిర్ణయాత్మకమైన పరాజయాన్ని గాంధీ ఆయన సహచర మితవాదులు వామపక్ష అనైక్యతని ఉపయోగించుకొని మెరుగైన ఎత్తుగడలతో విజయంగా మార్చుకోగలిగారు. సీతారామయ్య ఓటమిని గాంధీ 'ఆయన ఓటమి కంటె నా ఓటమి' అని ప్రకటించి సమస్యని వ్యక్తిగత ప్రతిష్టగా మార్చాడు. ఫిబ్రవరి 22న పాత వర్కింగు కమిటీ సభ్యులు 15 మందిలో 13 మంది బోస్ తమని బాహాటంగా విమర్శించాడని రాజీనామా చేశారు. వారిలో నెహ్రూ కూడా వున్నాడు. ఆయన రాజీనామాకు వేరే కారణం చూపాడు. త్రిపురి సదస్సు (మార్చి 8–12) బోస్‌ని తాత్కాలికంగా జబ్బుచే అశక్తుణ్ణి చేసింది. గాంధీ రాజ్‌కోటలో నిరాహారదీక్ష చేపట్టి తాత్కాలికంగా కొన్ని రాయితీలు పొంది తిరిగి వచ్చాడు. మితవాదులు దాడి కొనసాగించారు. గోవిందవల్లభపంత్ పాత వర్కింగు కమిటీపై విశ్వాసాన్ని ప్రకటిస్తూ, గత 20 సంవత్సరాలుగా అనుసరిస్తూ వచ్చిన గాంధేయ విధానాలపై నమ్మకాన్ని పునరుద్ఘాటిస్తూ, 'గాంధీ ఆకాంక్షల మేరకు కొత్త వర్కింగు కమిటీని నామినేట్ చేసుకోవలసిందిగా బోస్‌ని అర్థిస్తూ తీర్మానం ప్రవేశపెట్టాడు. తీర్మానం సబ్జక్ట్సు కమిటీలో 218–133 ఓట్లతోను బహిరంగ సదస్సులో అత్యధిక మెజారిటీతోనూ ఆమోదం పొందింది. తీర్మానానికి నెహ్రూ మద్దతు ఉహించనిది కాదు. కారణాలు: గాంధీపట్ల విధేయత, బోస్‌తో వ్యక్తిగత సంబంధాలు ఎప్పుడూ సరిగాలేకపోవటం. కాని సోషలిస్టులు, రాయిస్టులు, కమ్యూనిస్టులు (బంకీం ముఖర్జీ లాంటి కొందరు బెంగాలీ సభ్యులు మినహాయించి) పూర్తి చీలికని నివారించే – ఆకాంక్షతో పంత్ తీర్మానాన్ని వ్యతిరేకించలేదు. బోస్ 'నిర్దిష్ట కాల వ్యవధి' ఆలోచనని తొలగించి కాంగ్రెస్‌కి

బలాన్ని చేకూర్చడం ద్వారా రాజ్యాంగ అసెంబ్లీని సాధించేందుకు పోరాటం కొరకు సన్నాహాలకు పిలుపునిచ్చే తీర్మానాన్ని జయప్రకాష్ ప్రతిపాదించాడు. నెహ్రూ, భరద్వాజ (కమ్యూనిస్టు) బలపరిచారు.

వామపక్ష వాదుల ఎంపిక కష్టతరమయింది. బోస్ గత రికార్డు కూడా చీలికని తట్టుకొని అన్నిటికి నిలబడగలడనే విశ్వాసం కనిపించేదిగా లేదు. వామపక్ష దృష్టికోణం నుండి చూస్తే త్రిపురి సదస్సుకి ముందు ఆ తరువాత పెరుగుతున్న శ్రామిక వ్యతిరేక రైతు వ్యతిరేక విధానాల్ని సమర్థవంతంగా అడ్డుకొనలేకపోవడం కాంగ్రెస్ మంత్రివర్గాల ప్రాథమిక తప్పిదమని వాదించవచ్చు. ఇది ఐక్య సంఘటన భావన యొక్క ఫలితం. ఆచరణలో కొన్నిసార్లు పైస్థాయి కాంగ్రెస్ నాయకులతో దాదాపు మమేకమయింది. ఉదాహరణకు సి.పి.ఐ జనరల్ సెక్రటరీ పి.సి.జోషి 1939 ఏప్రిల్‌లో పార్టీ పత్రిక 'నేషనల్ ఫ్రంట్'లో 'ఈనాటి అత్యంత గొప్ప వర్గపోరాటం జాతీయ పోరాటం. దానిలో ప్రధాన భాగస్వామి కాంగ్రెస్. రైతుల ఐక్యత పరిరక్షింపబడాలి అన్ని రాశారు.

భారతదేశంలో అత్యంత గొప్ప వ్యక్తి యొక్క విశ్వాసం పొందడంలో విఫలమైతే తన ఎన్నికల విజయం అర్థరహితమని భావిస్తున్నానని బోస్ ఫిబ్రవరి 3న ప్రకటించాడు. త్రిపురి కాంగ్రెస్ తరువాత రెండు నెలల పాటు ఆమోదయోగ్యమైన వర్కింగు కమిటీని నియమించేందుకు ప్రయత్నించారు. తన స్థితిలోని ప్రాథమిక బలహీనత – ప్రత్యేకించి వామపక్షవాదులతో అనైక్యత వున్న సందర్భంలో గాంధీ విసిరిన సవాలు 'నీ కమిటీని ఎంపిక చేసుకొనే స్వేచ్ఛ నీకు వుంది'ని స్వీకరించడంలో విఫలమవడంతో స్పష్టమయింది. బోస్ రాజీనామా చేశారు. గాంధేయవాది రాజేంద్రప్రసాద్ అధ్యక్షుడయ్యాడు. కాంగ్రెసులో వుంటూ తొలుత వివిధ వామపక్ష గ్రూపులతో కలిసి పనిచేయాలన్న ఆలోచనతో బోస్ మే 3న 'ఫార్వర్డు బ్లాకు'ని స్థాపిస్తున్నట్లు ప్రకటించాడు. 1939 జూన్‌లో వామపక్ష వాదుల్ని సంఘటిత పరచేందుకు కమిటీని నియమించారు. దీనికి కమ్యూనిస్టు మద్దతు లభించింది. కాని రాయిస్టులు, జయప్రకాష్ నారాయణ లాంటి సోషలిస్టు నాయకులు కాంగ్రెస్ ఐక్యతకే ప్రాధాన్యత యిచ్చారు. ఫార్వర్డ్ బ్లాకు స్థాపనని విమర్శించారు. ఫలితంగా ఫార్వర్డు బ్లాకు ముక్కలుగా చీలి వున్న వామపక్ష వాదులతో మరొక చీలిక గ్రూపు అయింది. సుభాష్ బెంగాలులో గతంలో కంటె ఎక్కువ ప్రజాదరణ పొందిన నాయకుడయ్యాడు. బీహారు, పంజాబు, బొంబాయి, తమిళనాడులోని కొన్ని ప్రాంతాలు ఆయన పలుకుబడి స్థావరాలుగా వున్నాయి. కాంగ్రెసు అధిష్ఠానవర్గం కాంగ్రెస్ లో ఒక శక్తిగా బోస్‌ని తుడిచిపెట్టాలని నిర్ణయించింది. పి.సి.సి నుండి ముందుగా అనుమతి పొందకుండా శాసనోల్లంఘనని నిషేధిస్తూ ఎఐసిసి చేసిన తీర్మానానికి వ్యతిరేకంగా జూలై 9ని నిరసన దినంగా పాటించాలని బోస్ పిలుపిచ్చాడు. దీనితో బోస్‌పై వెంటనే క్రమశిక్షణా చర్య చేపట్టబడింది. ఎఐసిసి బోస్‌ని ఆగష్టు 11న బెంగాల్ పిసిసి అధ్యక్షపదవి నుండి తొలగించింది. కాంగ్రెస్‌లో 3సం॥ల పాటు ఎలాంటి పదవి చేపట్టరాదని నిషేధం విధించింది. బెంగాల్

కాంగ్రెస్ నిర్వహణకు అజాద్, గాంధేయవాది పి.సి.ఘోష్, ఒకప్పుడు బోస్‌కి ఆర్థికంగా అండదండలందించిన కలకత్తాలోని ఐదుగురు ప్రముఖులలో యిద్దరు (బి.సి.రాయ్, కిరణ్ శంకర్‌రాయ్)తో తాత్కాలిక కమిటీ నియమింపబడింది.

కాంగ్రెస్ నుండి బోస్ వెలివేయబడ్డాడు. ఇక వామపక్ష వాదులతో పూర్తిగా తెగతెంపులు చేసుకొనడం కాంగ్రెస్ అధిష్టాన వర్గానికి తెలివైన పనిగా తోచలేదు. 1939 చివరకు అంతర్గత ఉద్రిక్తతలు, పార్టీ ప్రతిష్టకి నష్టం వాటిల్లడం లాంటి ఫలితాలతో మంత్రి వర్గాల కొనసాగింపు ప్రతికూల ఫలితాలు యిస్తున్నట్లు నిరూపితమయింది. మంత్రివర్గాలు అంతకంతకు కార్మికులు, రైతులు పార్టీలోని వామపక్షవాదుల నుండి దూరమయ్యే సమస్యని ఎదుర్కొన్నాయి. అలాగని భూస్వాముల్ని వాణిజ్య గ్రూపుల్ని సంతృప్తి పరిచాయని కాదు. ఆదాయపు పన్నులో ఎక్కువ భాగం ప్రావిన్సులు పొందలేకపోతే మంత్రివర్గాలు రాజీనామా చేయవలసి వుంటుందని 1939 జూలైలో పటేల్ సూచించాడు. సెప్టెంబరులో యుద్ధం రావడంతో కాంగ్రెస్ మంత్రివర్గాలు తమ పార్టీవారు జరిపే యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలకు వ్యతిరేకంగా యమర్జన్సీ అధికారాలు ఉపయోగించే ప్రమాదం వచ్చి పడింది. 1939 అక్టోబరు 29–30లలో కాంగ్రెస్ మంత్రివర్గాల రాజీనామాలు అనివార్యమయ్యాయి.

## 1939-42 యుద్ధం -భారత రాజకీయాలు

### మొదటిదశ

1939 సెప్టెంబరు 3న జర్మనీపై బ్రిటన్ చేసిన యుద్ధ ప్రకటనలో భారతదేశం సహకరిస్తుందని కనీసం రాష్ట్ర మంత్రివర్గాలతో గాని, ఏ భారతీయ నాయకునితో గాని సంప్రదించకుండా వైస్రాయి ప్రకటించాడు. ఫాసిస్టు దురాక్రమణకు కాంగ్రెస్ బ్రిటన్‌కంటె కూడా ఎక్కువ ప్రతికూలంగా వుంది. కొన్ని కనీస షరతుల్ని ఆమోదిస్తే యుద్ధ ప్రయత్నాలకు పూర్తి సహకారం వుంటుందని చేసిన ప్రతిపాదనల్ని లిన్‌లిత్‌గొ త్రోసి పుచ్చారు. షరతులు: స్వతంత్ర భారతదేశం యొక్క రాజకీయ నిర్మాణాన్ని నిర్ణయించేందుకు యుద్ధానంతరం రాజ్యాంగ అసెంబ్లీ ఏర్పాటుకు వాగ్దానం, కేంద్రంలో నిజమైన బాధ్యతాయుత ప్రభుత్వాన్ని వెంటనే ఏర్పాటు చేయడం. 1939 నాటికి (1941డిసెంబరులో జపాన్ దాడిచేసే వరకు కూడా) యుద్ధం అతిచేరువలో లేదు గనుక భారతదేశంలో ప్రజాభిప్రాయాన్ని యుద్ధానికి అనుకూలంగా కూడ గట్టడానికి అలాంటి షరతులు అవసరమని కాంగ్రెస్ న్యాయబద్ధంగా వాదించింది. అంతేగాక నిరంకుశత్వం దురాక్రమణలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యం జాతుల స్వయ నిర్ణయ సూత్రానికి మధ్య జరుగుతున్న యుద్ధంగా మిత్రదేశాలు చేస్తున్న ప్రచారంలో పసలేదు. 1939 అక్టోబరు 17 నాటి ప్రకటన కేవలం పాత ప్రతిపాదనలైన అస్పష్టమైన సుదూర భవిష్యత్తులో అధినివేశ ప్రతిపత్తి, యుద్ధానంతరం 1935 చట్టాన్ని (ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన రాజ్యాంగ అసెంబ్లీగా కాదు) మార్చేందుకు వివిధ వర్గాల ప్రతినిధులతో చర్చలు జరపడం, ప్రస్తుతానికి భారత రాజకీయవేత్తలు స్వదేశీ సంస్థానాల ప్రతినిధులతో ఎలాంటి పాలనాధికారాలు లేని సంప్రదింపుల

గ్రూపుని నియమించడం –లాంటి వాటిని మరలా చెప్పడం తప్ప కొత్తేమీ లేదు. 'కాంగ్రెస్ వెంట పరుగులు తీయడం' మానుకొని 'ప్రశాంతిగా కాలం గడపడం' తన ఉద్దేశమని వైస్రాయి ప్రైవేటు సంభాషణలో పలుమార్లు చెప్పాడు. (లిన్‌లిత్‌గౌ రాజ్యకార్యదర్శి జెట్లాండ్‌కి 1940 ఫిబ్రవరి3, 13)

లిన్‌లిత్‌గౌ వైఖరి దారి తప్పుడం కాదు. యుద్ధాన్ని అవకాశంగా తీసుకొని తెల్లవారి ఆధిపత్యంలో గల కేంద్రప్రభుత్వంపై యింకా పట్టుబిగించడం, 1937 యింకా అంతకు ముందు నుండి కాంగ్రెస్ పోరాటాల కారణంగా కోల్పోయిన పట్టుని తిరిగి పొందడంగా వున్న బ్రిటిషు విధానంలో భాగం మాత్రమే. యుద్ధం ప్రకటించక ముందే రాష్ట్రాలకు సంబంధించిన అంశాలపై న్యూఢిల్లీకి యమర్జన్సీ అధికారాల్ని కట్టబెడుతూ బ్రిటిషు పార్లమెంటులో 1935 చట్టానికి సవరణ చేయబడింది. యుద్ధం ప్రకటించిన రోజే పౌరహక్కులకు పరిమితులు విధించే భారతరక్షణ ఆర్డినెన్స్ అమలులోకి వచ్చింది.

1940 మే నాటికి కాంగ్రెస్‌ని నిస్సహాయ స్థితికి నెట్టివేసేందుకు ప్రభుత్వం విప్లవ ఉద్యమాలు ఆర్డినెన్స్ ముసాయిదాని తయారు చేసింది. ప్రభుత్వం అసాధారణ అధికారాల్ని చేజిక్కించుకొని బ్రిటన్ నుండి మిత్ర రాజ్యాల నుండి భారతదేశంలో అధికారికంగా సైన్యాన్ని దించగల (ముఖ్యంగా 1942 ప్రారంభం నుండి) స్థితిలో వున్నప్పుడు, జపాన్, జర్మనీలకు సహాయపడే ఉద్యమాన్ని అణచివేయడంలో ప్రపంచవ్యాప్తంగా గల ఉదారవాదుల వామపక్ష వాదుల సానుభూతి వెల్లువెత్తుతున్న తరుణంలో బ్రిటిషు అధికారులలోని ఒక ముఖ్యమైన సెక్షన్ 1931 లో లాగానే కాంగ్రెస్‌తో ఘర్షణకి కాలుదువ్వింది.

జర్మనీ బ్లిట్జ్‌క్రిగ్ పశ్చిమరంగంలో అనూహ్య విజయాలు సాధించింది. బ్రిటిషు సైన్యాల్ని డన్‌కిర్క్ వరకు తుడిచి పెట్టింది. కొద్ది వారాలలోనే ఫ్రాన్స్‌ని కబళించింది. చర్చిల్ 1940 మేలో బ్రిటన్ జాతీయ సంకీర్ణ ప్రభుత్వ ప్రధాని బాధ్యతలు చేపట్టాడు. బ్రిటిషిండియా అభివృద్ధి నిరోధక రాజకీయాలకు విన్‌స్టన్ చర్చిల్ మద్దతు ప్రోత్సాహం లభించాయి. "నేను ప్రధానమంత్రిని అయింది, బ్రిటిషు సామ్రాజ్యాన్ని రద్దు చేయటానికి కాదు" –1942 నవంబరులో చర్చిల్ ప్రకటన అధికార మార్పిడి కాలంలో భారతదేశంలో బ్రిటిషు ప్రయోజనాలకు రక్షణ కల్పించే షరతుపై రానున్న లేబరుపార్టీ ప్రభుత్వం సార్వత్రిక ఓటింగు ప్రాతిపదికపై పూర్తి అధికారాన్ని రాజ్యాంగ అసెంబ్లీకి మార్చడానికి అంగీకరిస్తుందని కార్మిక నాయకులు ఆ తరువాత చర్చిల్ మంత్రివర్గంలో మంత్రులు అయిన అట్లే, క్రిప్సులు 1939 జూన్‌లో నెహ్రూ, కృష్ణ మీనన్‌లకు వాగ్దానం చేశారు. (పి.యన్.గుప్తా, ఇంపీరియలిజం, అండ్ బ్రిటిషు లేబర్ పేజీలు 257–9). 1940 ఆగష్టులో జర్మన్ విమానాలతో బాంబులు కురిపిస్తున్న తరుణంలో యుద్ధానికి భారతదేశం మద్ధతు పొందేందుకు అమెరీ లిన్‌లిత్‌గౌలు కొన్ని రాయితీలకు సిద్ధపడ్డారు. చర్చిల్ ఆ ప్రతిపాదనల్ని ప్రక్కన పెట్టాడు. లిన్‌లిత్‌గౌ ఆగష్టు ప్రతిపాదన (1940 ఆగష్టు 8) కూడా అతడు 1939 అక్టోబరు 17న చేసిన ప్రకటనని దాదాపు పునరుద్ఘాటించడం మాత్రమే. అ నిర్దిష్ట భవిష్యత్తులో అధినివేశ ప్రతిపత్తి, యుద్ధానంతరం రాజ్యాంగ రూపలకల్పనకు కమిటీని

నియమించడం (అదీ బ్రిటిషు పార్లమెంటు ఆమోదానికి లోబడి, సార్వత్రిక ఓటింగు ప్రసక్తి లేదు), మరి కొందరు భారతీయులకు అవకాశం కల్పిస్తూ వెంటనే వైస్రాయి కార్యనిర్వహక వర్గాన్ని విస్తరించుట, యుద్ధ సలహా మండలిని నియమించుట. 1944 జూలైలో వైస్రాయి కార్యనిర్వాహక వర్గంలో భారతీయులకు మెజారిటీ (12 మందిలో 8 మంది, కాని రక్షణ, ఆర్థిక, హోం బాధ్యతలు తెల్లవారికి కేటాయించబడ్డాయి) పూర్తిగా సలహాలిచ్చే బాధ్యతలతో జాతీయ రక్షణ మండలి స్థాపించబడింది. ఆగ్నేయాసియాలో యుద్ధం కలిగించిన విధ్వంసంతో నాటకీయంగా 1942 మార్చి 1 ఏప్రిల్‌లో క్రిప్సు రాయబార సంఘం నియమించబడింది. ఇది కూడా సరిగా పనిచేయకుండా చర్చిల్ లిన్‌లిత్‌గోలు అడ్డుకొన్నారు.

## లీగ్ - పాకిస్తాన్

యుద్ధ కాల సామ్రాజ్యవాద ఎత్తుగడలో ముస్లింలీగు డిమాండ్లని ప్రోత్సహించడం ముఖ్యమైన భాగమయింది. 1939 అక్టోబరు ప్రకటన వివిధ మతాల ప్రతినిధుల్ని సంప్రదించవలసిన అవసరాన్ని ప్రస్తావించింది. భారత జాతీయ జీవితంలోని పెద్ద శక్తివంతమైన గ్రూపుల ఆమోదం పొందని ఎలాంటి ప్రభుత్వానికైనా బ్రిటిషు వారు బాధ్యతల్ని బదిలీచేయరని ఆగష్టు ప్రతిపాదన స్పష్టం చేసింది. ఆచరణలో యిది జిన్నా ముఖ్యమైన డిమాండ్లలో ఒక దానిని అంగీకరించినట్లయింది. భారతీయ ముస్లింలకు లీగుని ఏకైక ప్రతినిధిగా గుర్తించటమే గాక, భవిష్యత్తు రాజ్యాంగ మార్పులపై దానికి ఒక రకమైన వీటో అధికారాన్ని కట్టబెట్టినట్లయింది.

1940 మార్చిలో లాహోరు సదస్సులో ముస్లింలీగు ఆమోదించిన పాకిస్తాన్ నినాదం యొక్క పరిణామంలో బ్రిటిషు వారి ప్రోత్సాహం లేకపోలేదు. ఇక్బాల్ ముస్లింలీగు సదస్సు అధ్యక్షోపన్యాసంలో వాయువ్య ముస్లిం రాజ్యం ఏర్పాటు అవశ్యకతని ప్రస్తావించడం పాకిస్తాన్ నినాదానికి ప్రారంభంగా చెప్పబోతున్నది. కాని ఉర్దూ కవి దేశభక్తుడు అయిన ఇక్బాల్ దేశ విభజనని ఊహించలేదని వాయువ్య భారతదేశంలోని ముస్లిం మెజారిటీ ప్రాంతాలకు బలహీనమైన భారత సమాఖ్యలో స్వయం ప్రతిపత్తి కావాలని డిమాండు చేశాడని ఆయన ఉపన్యసించిన సందర్భం స్పష్టం చేస్తుంది. కేంబ్రిడ్జిలో పంజాబు ముస్లిం విద్యార్థుల చౌదురి రహమత్ ఆలి గ్రూపు మొదట పాకిస్తాన్‌ని ప్రస్తావించారు. రహమత్ ఆలి 1933, 1935 లలో రాసిన కరపత్రాలలో ప్రత్యేక దేశ స్థాయిని డిమాండు చేశారు. అతడు పంజాబు ఆఫ్ఘన్, ప్రావిన్సు, కాశ్మీరు, సింధు, బలూచిస్తాన్‌ల కలయిక నుండి పాకిస్తాన్ అనే పదాన్ని సృష్టించాడు. అప్పుడు దీనిని ఎవరూ అంతగా పట్టించుకోలేదు. రౌండు టేబులు సదస్సుకి హాజరైన లీగు ప్రతినిధులు కూడా దీనిని విద్యార్థుల పగటి కలగానే త్రోసిపుచ్చారు. కాని 1935 చట్టంలోని సమాఖ్యకి చెందిన క్లాజులు ఆచరణరూపం దాల్చే అవకాశాలు కనిపించక పోవడంతో బలమైన హిందూ ఆధిపత్యం గల కేంద్రప్రభుత్వాన్ని ఊహించిన ముస్లింలీగు 1937 తరువాత తనకు సానుకూలమైన వేదిక యొక్క అవసరాన్ని గుర్తించింది. ఫలితంగా 1938-39 కాలంలో చాలా ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు చేసింది. 1939 మార్చిలో వివిధ ప్రతిపాదనల్ని అధ్యయనం చేసేందుకు లీగు ఉపసంఘాల్ని నియమించింది. జఫ్రుల్ హసాన్, హుస్సేన్ ఖాద్రిల అలీఘర్

పథకం పాకిస్తాన్, బెంగాల్, హైదరాబాద్, హిందూస్తాన్ – నాలుగు స్వతంత్ర రాజ్యాలుగా వుండాలని సూచించింది. ఇతర పథకాలు విభజన కోరలేదు. భారత సమాఖ్యలో స్వయంప్రతిపత్తి గల ముస్లిం బ్లాకులను ఏర్పాటు చేయాలని కోరాయి. పంజాబు యూనియనిస్టుపార్టీ అధినేత సికందర్ హయత్ మూడు దశల నిర్మాణం గల స్వయం ప్రతిపత్తి గల ఏడు ప్రాంతాలుగా విభజించాలని, వాటికి వాటి ప్రాంతీయ చట్ట సభలు వుండాలని, రక్షణ విదేశీ వ్యవహారాలు, దిగుమతి ఎగుమతి సుంకాలు, కరెన్సీ– సమాఖ్య బాధ్యతలుగా వుండాలని – ఒక విధంగా 1946 నాటి మంత్రివర్గ రాయబార సంఘం పథకం లాంటి దానిని సూచించాడు. ముస్లింలీగు ఒక్కసారిగా ప్రత్యామ్నాయాలతో ముందుకు రావడానికి బ్రిటిషువారి ప్రోత్సాహం వుంది. 1939 మార్చి 20న రహమతి ఆలి పథకాన్ని రెండు సమాఖ్యలు – ఒకటి వాయువ్యంలో మరొకటి తూర్పున (బెంగాల్, అస్సాంలతో) వుండే విధంగా పునర్నిర్వచించడాన్ని రాజ్యకార్యదర్శి జెట్లాండ్ సానుభూతిగా విన్నారని ఖలీకుజ్జమన్ చెప్పాడు. (పాత్‌వేటు పాకిస్తాన్ పేజీలు 205–07) ఇటీవలనే వెలువరించబడిన లిన్‌లిత్‌గొ జెట్లాండ్ పత్రాలు బ్రిటిషు పాత్రని మరింత స్పష్టం చేశాయి. ఉదాహరణకు ప్రతి అంశాన్ని వ్యతిరేకించే పార్టీకి బ్రిటన్ సానుభూతి లభించదని ముస్లింలు నిర్దిష్టమైన పథకంతో ముందుకు రావాలని లాహోరు సదస్సుకి 6 వారాల ముందు వైస్రాయి జిన్నాకి చెప్పాడు.

సికందర్ ఖాన్‌చే రూపొందింపబడి, (గణనీయమైన మార్పులతో) ఫజుల్ హక్, ఖలీకుజ్జమన్ లచ్ ప్రతిపాదించబడిన 1940 మార్చి 23 ప్రఖ్యాత తీర్మానం భౌగోళికంగా ప్రక్కప్రక్కనే వున్న యూనిట్లు ప్రాంతాలుగా విభజించబడాలని, సంఖ్యారీత్యా ముస్లింలు మెజారిటీగా వాయువ్య,తూర్పు భారతదేశం ప్రాంతాలను స్వతంత్ర రాజ్యాలుగా వుండే గ్రూపుగా చేయాలని, ఆ గ్రూపులోని యూనిట్లు స్వయం ప్రతిపత్తి గలిగి వుండాలని పేర్కొన్నది. తీర్మానంలోని పదజాలం అస్పష్టత సందిగ్ధతలతో కూడి వుంది. పాకిస్తాన్ గాని విభజన గాని స్పష్టంగా పేర్కొనబడలేదు. అతి సాధారణమైన న్యాయబద్ధమైన ముస్లిం డిమాండ్లను అడ్డుకొనేందుకు హిందువుల పత్రికలు రాజకీయవేత్తలు తీర్మానానికి విపరీత వ్యాఖ్యానాలు చేస్తున్నారని 1940 దశాబ్దం ప్రారంభంలో కొందరు ముస్లిం రాజకీయవేత్తలు వాదించారు. యూనియనిస్టు బ్లాకు నాయకుడు సికందర్ హయత్ ఖాన్ 1941 మార్చి 11న పంజాబు అసెంబ్లీలో 'ఇక్కడ ముస్లిం రాజ్యం మరొక చోట హిందూ రాజ్యంగా వుండే పాకిస్తాన్‌ని తాను వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టంగా చెప్పాడు. (వి.పి. మీనన్ భారతదేశంలో అధికార మార్పిడి పేజి 463) కొందరు ముస్లిం నాయకులు పాకిస్తాన్‌ని గురించి అంతగా పట్టించుకోలేదు.జిన్నా కూడా కాంగ్రెస్‌కి లభించే రాజ్యాంగపరమైన రాయితీల్ని అడ్డుకొని ముస్లింలకు అదనపు రాయితీల్ని సాధించేందుకు బేరాసారాల కౌంటరుగా పాకిస్తాన్‌ని ఉపయోగపెట్టుకోవాలని ఆశించి వుండవచ్చు. విద్యావంతులైన ముస్లింలలో ఈ పథకాన్ని ఆమోదించరని సికందరే ఉపన్యాసం స్పష్టం చేసినప్పటికి ఆ నినాదంలోని అస్పష్టత ముస్లిం ప్రజల్ని సమీకరించేలా చేసింది. యూనియనిస్టు పార్టీ పంజాబులో మతపరమైన ఐక్యతకు పిలుపునిచ్చింది. సామూజికంగా రాజకీయంగా యథాతథ స్థితిని కోరింది. బ్రిటిషువారితో మైత్రిని

కొనసాగించింది. సికందర్ వారసుడిగా వచ్చిన జిజార్ హయత్ ఖాన్ లేవల్‌కి ప్రీతి పాత్రుడయ్యాడు. స్వతంత్ర ముస్లిం రాజ్యం సర్వరోగ నివారిణిలా అన్ని సమస్యల్ని పరిష్కరిస్తుందని చెప్పబడడంతో పంజాబు బెంగాలులో సంఖ్యాపరంగా మతవాదం పాకిస్తాన్ నినాదం చుట్టూ అభివృద్ధి చెందింది. భారతదేశంలో రాజ్యాంగపరమైన సంక్షోభాన్ని కొంతకాలం పాటు కొనసాగించడానికి 'పాకిస్తాన్'నినాదం బ్రిటిషువారికి ఉపయోగపడింది. కొన్ని పరిమితులలో జిన్నాని ప్రోత్సహించినప్పటికి జిన్నా డిమాండ్లన్నింటికి లొంగిపోయే ఉద్దేశం బ్రిటిషు వారికి లేదు. సెక్షన్ 93 క్రింద ప్రావిన్సులలో ముస్లిం అనధికార సలహాదారులుండాలన్న డిమాండ్లు, విస్తరించబడిన కార్యనిర్వాహక మండలిలో ఎక్కువ సీట్లు, భవిష్యత్తులో కాంగ్రెసు కార్యనిర్వాహకవర్గంలో చేరాలని నిర్ణయించుకుంటే దానితో సమానమైన సీట్లు – లాంటి లీగు డిమాండ్లు త్రోసిపుచ్చబడ్డాయి. ఫలితంగా జిన్నా ఆగష్టు ప్రతిపాదనని తిరస్కరించాడు.

## కాంగ్రెసులో ధోరణులు

1941 –42 వరకు కాంగ్రెస్ లోపల కలయికలు 1930 దశాబ్దం చివరి నమూనాని అనుసరించాయి. గాంధీ యితర మితవాదుల ఆధిపత్యంలో గల అధిష్టాన వర్గం సంయమనం పాటించమని సలహా యిచ్చింది. బ్రిటిషు వారితో ఏదో రకమైన ఒప్పందానికి రావాలని మాటిమాటికి ప్రయత్నించింది. ఆ తరువాత పరిమితమైన తక్కువ స్థాయి ఉద్యమానికి అయిష్టంగానే అనుమతి యిచ్చింది. వామపక్ష వాదులందరూ సమరశీలమైన యుద్ధ వ్యతిరేక ప్రభుత్వ వ్యతిరేక చర్యలు చేపట్టాలని అర్థించారు. కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ఏదో పెద్ద కార్యక్రమం వుంటుందని అంచనాలతో వున్నారు. కాని కాంగ్రెస్ మంత్రి వర్గాలు రాజీనామా చేయగానే వెంటనే శాసనోల్లంఘన చేపట్టే అవకాశం లేదా గాంధీ ప్రకటించాడు. గాంధీ తన అహింసా సూత్రాలు యుద్ధానికి ప్రత్యక్షంగా మద్దతు యిచ్చేందుకు అనుమతిస్తాయా? అనే సందేహాలు తరచుగా వ్యక్తం చేశాడు. (ఆయన డాన్ క్విక్సోట్ తరహాలో పోలండ్, ఫ్రాన్స్, బ్రిటన్‌లకు కూడా అహింసాయుతంగా ప్రతిఘటించ వలసిందిగా సలహా యిచ్చారు). కాని వర్కింగు కమిటీ బ్రిటిషువారు యుద్ధానంతరం స్వతంత్రం, వెంటనే కేంద్రాలలో జాతీయ ప్రభుత్వం – అనే రెండు అంశాలపై బ్రిటిషువారు రాయితీలు ప్రకటిస్తే యుద్ధ ప్రయత్నాలకు పూర్తిగా మద్దతిస్తామని వర్కింగు కమిటీ చాలాసార్లు స్పష్టం చేసింది.

బ్రిటిషు మొండివైఖరి, వామపక్షవాదం ఒత్తిళ్లు కొంత సమరశీల కార్యాచరణ చేపట్టడం అనివార్యం చేశాయి. రాంఘర్ కాంగ్రెస్ (1940 మార్చి) అవసరమని భావించినప్పుడు శాసనోల్లంఘన చేపట్టాలని నిర్ణయించింది. కాని సమయం ఉద్యమ స్వరూపంపై నిర్ణయం గాంధీకి వదిలి వేయబడ్డాయి. ఆగష్టు ప్రతిపాదన కలిగించిన నిరుత్సాహం తరువాత, గాంధీ శాసనోల్లంఘనకు అంగీకరించారు. చాలా పరిమితమైన పెద్దగా ప్రభావితం చేయలేని రూపాన్ని ఎంపిక చేశాడు. సమస్య వాక్ స్వాతంత్ర్యం – యింకా స్పష్టంగా చెప్పాలంటే బాహాటంగా యుద్ధ వ్యతిరేక ప్రకటనలు చేసేహక్కు, కాంగ్రెస్ కార్యకర్తలు వ్యక్తులుగా (మొదట గాంధీచే

నామినేట్ చేయబడినవారు, మొదట అక్టోబరు 17న వినోభాభావే, అక్టోబరు 31న జవహర్‌లాల్ నెహ్రూ, ఆ తరువాత యితరులు) యుద్ధ వ్యతిరేక ఉపన్యాసాలిచ్చి అరెస్టు కావాలి. ఉద్యమం తీవ్రంగా వున్న 1941 జూన్‌లో దాదాపు 20,000 మంది జైళ్లకు వెళ్లారు. 1941 వసంత కాలానికి అత్యధిక ఖైదీలను విడుదల చేయడంతో ఉద్యమం క్రమంగా క్షీణించింది. గాంధీ చేపట్టిన ఉద్యమాలన్నింటిలోను యిది అత్యంత బలహీనమైనది, ఆ తరువాత ఒక సంవత్సరానికి 1942 ఆగష్టులో చేపట్టిన ఉద్యమంతో పోల్చితే అత్యంత భిన్నమైనది. ఉద్యమ లక్ష్యాలు అంతగా కలవరపరచేవి కావు. భారతీయుల్ని సంప్రదించకుండా ప్రకటించిన యుద్ధానికి కేవలం ప్రతికూలతని నమోదు చేసుకొనేవి మాత్రమే. అదే సమయంలో ఒక్కసారిగా విరుచుకుపడడానికి లిన్‌లిత్‌గౌ కి అవకాశం కల్పించకపోవడం ఉద్యమం యొక్క లక్ష్యం – ఇక తొలుత నెహ్రూకి నాలుగేళ్ల కఠిన కారాగార శిక్ష విధించడం యుద్ధ కాలంలో సంక్రమించిన విశేషాధికారాల్ని ఉపయోగించుకోవాలనే బ్రిటిషు వారి ఆతురతని తెలియజేసింది. 1941 డిసెంబరులో బిర్లాతో జరిపిన సంభాషణలో గాంధీ తన 'ఉద్యమం ద్వారా బ్రిటిషు వారిని వీలైనంత తక్కువగా కలవరపరచడం ఉద్దేశమ'ని స్పష్టం చేశారు. (ఉదాహరణకు క్రిస్మస్ రోజులలో, ఆదివారాలలో, యితర దినాలలో కూడా ఉదయం 9 గంటలకు ముందు, సత్యాగ్రహం ఉండదు). అదే సమయంలో 'యువకుల మనోభావాలు... దురదృష్టవశాత్తు కమ్యూనిజం విజ్ఞప్తుల్ని గురించి ఆందోళన' వ్యక్తం చేశాడు. (ఠాకూర్‌దాస్ పత్రాలు యఫ్. యన్ 177) గతంలో లాగానే సమరశీలమైన ఒత్తిళ్లకు ప్రక్కదారి పట్టించే ఆకాంక్ష గాంధీ ఎత్తుగడలోని మలుపులు మార్పులకు కారణం.

యుద్ధం ఫాసిస్టు వ్యతిరేక యుద్ధమని కాబట్టి షరతులు లేని మద్దతు యివ్వాలని భావించిన యం.యన్. రాయ్ గ్రూపు మినహాయించి మిగిలిన వామపక్షవాదులందరూ 1941 చివరి వరకు యుద్ధానికి వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు చేపట్టాలని పట్టుబట్టారు. బ్రిటన్ యిబ్బందుల్ని భారత దేశానికి అనుకూలంగా మార్చుకోవాలి. – ఇది బోస్ నిశ్చితాభిప్రాయం. రాంఘర్ కాంగ్రెస్ సందర్భంగా బోస్ రాజీ వ్యతిరేక సదస్సు నిర్వహించాడు. ఈ సదస్సు గాంధేయ మితవాదాన్ని తీవ్రంగా నిరసించింది. సోషలిస్టులు సమరశీల ఉత్సుకతతో వున్నారు. 1941 జైలులో వున్న జయప్రకాష్ నారాయణ సాయుధ పోరాట ఆలోచనలు చేశాడు. పి.యస్.పి.లోని మంచి నాయకుల్ని శాఖల్ని సి.పి.ఐ. కైవశం చేసుకొనడం వలన సోషలిస్టుల కమ్యూనిష్టుల మధ్య సంబంధాలు చెడినప్పటికి 1941 చివరివరకు యుద్ధ వైఖరికి సంబంధించి రెండింటి మధ్య ఎలాంటి పెద్ద రాజకీయ విభేదం లేదు. 1939 ఆగష్టు నాటి నాజీ సోవియట్ ఒప్పందం యూరపు కమ్యూనిస్టుల్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. కాని భారత కమ్యూనిష్టులకు అనుకూలంగా పరిణమించింది. బ్రిటన్ యుద్ధానికి జాతీయవాదులు ప్రతికూలంగా వుండడంతో సోవియట్ విధానాలకు అంతర్జాతీయ మద్దతు కూడగట్టడానికి అవకాశం కల్పించింది. 1941 జూన్ 22న హిట్లర్ రష్యాపై దాడిచేసిన తరువాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

కాని తీవ్రతరం చేయబడిన బ్రిటిషు నిర్బంధాన్ని ఎదుర్కొన్ని వామపక్షవాదులు బలమైన ఉద్యమాలు నిర్వహించలేకపోయారు. సుభాష్‌బోస్ 1940 జూలైలో హాల్వెల్ విగ్రహాన్ని తొలగించవలసిందిగా డిమాండు చేస్తూ కలకత్తాలో సత్యాగ్రహం నిర్వహించాడు. బెంగాల్ చివరి స్వతంత్ర ముస్లిం పాలకుడు సిరాజుద్దౌలా ప్రతిష్టతో సంబంధం గల ఉద్యమంలో ఒకప్పుడు ముస్లిం విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. హిందూ ముస్లిం ఐక్యతనలా వుంచి యిప్పుడు ఆ అంశమే పరిమిత ప్రాధాన్యత గలదయింది. బోస్ 1941 జనవరిలో గృహ నిర్బంధం నుండి తప్పించుకొన్నాడు. ఆఫ్ఘనిస్తాన్ రష్యాల గుండా జర్మనీ చేరుకొనడానికి కమ్యూనిస్టుల రహస్య సంబంధాల్ని ఉపయోగించుకొన్నాడు. బోస్ తన దేశభక్తి యుత జీవితంలో చివరి, నాటకీయమైన దశకి చేరుకొన్నాడు. కాని ప్రధానంగా బ్రిటన్ శత్రువుల సహాయంపై ఆధారపడాలనే నిర్ణయం ఒక విధంగా అంతర్గత శక్తుల బలహీనతని ఒప్పుకొన్నట్లయింది. మొదటి ప్రపంచ యుద్ధ కాలం నాటి రివల్యూషనరీ టెర్రరిస్టుల పద్ధతులకు తిరిగి వచ్చినట్లయింది. మైసూరు స్టేట్ కాంగ్రెస్ (సోషలిస్టుల ఆధిపత్యంలో గల కర్నాటక పి.సి.సితో కలిసి) 1939 సెప్టెంబరు నుండి మూడు మాసాలపాటు శక్తివంతమైన సత్యాగ్రహం నిర్వహించింది. గణనీయంగా రైతుల మద్దతు పొందింది. అరెస్టయిన 2801 మందిలో 641 మంది వ్యవసాయదారులు, లాయర్లు 23 మంది (జేమ్స్ మేనర్ ఒక భారత స్వదేశీ సంస్థానంలో రాజకీయ మార్పు, ఢిల్లీ 1977 పేజీ 124) వామపక్షవాదుల ఆధిపత్యంలో వున్న కేరళ పి.సి.సి 1940 సెప్టెంబరు 15 న అణచివేత దినంగా నిర్వహించబడింది. తెల్లిచెరి, మట్టనూర్, మొరాజాలలో పోలీసు కాల్పులు జరిగాయి. 1941 మార్చిలో ఉత్తరమలబారులో రైతు భూస్వామి ఘర్షణ నలుగురు యువరైతుల (దేశ వ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన కయ్యూరు మృతవీరుల) ఉరితీతకి దారితీసింది. ఉత్తరబీహారులోని పూర్ణియాలో దినాజ్‌పూర్ (ఉత్తరబెంగాల్) సబ్‌డివిజను ఠాకూర్‌గావ్‌లో కమ్యూనిష్టుల నాయకత్వంలోని కిసాన్ ఉద్యమాలు నూతన సమరశీలతని సంతరించుకొన్నాయి. మొదటిసారిగా మధ్యతరగతి రైతుల నుండి తెగల, అర్థ తెగల పాలికాపుల (సంతాలులు, రాజ్‌బనీలు) వరకు విస్తరించింది. కాని అలాంటి చెల్లాచెదురుగా వున్న చాలా కొద్ది ప్రాంతాలకు పరిమితమైన సమరశీలత బ్రిటిషు పాలనకు దేశ వ్యాప్తంగా సవాలుగా పరిణమించ లేకపోయింది.

## ఆర్థిక పరిణామాలు

1939 -41 కాలంలో కొన్ని ఆర్థిక కారణాల రీత్యా జాతీయోద్యమం కొంత బలహీనపడింది. జరుగబోయే యుద్ధం ప్రజలలో కొన్ని సెక్షన్లకు లాభాలు తెచ్చిపెట్టింది. దశాబ్దకాలం పాటు మాంద్యం ఆవరించిన తరువాత వ్యవసాయ ఉత్పత్తుల ధరల పెరుగుదల రైతాంగానికి కొంత ఉపశమనం కలిగించింది. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో లాగానే యుద్ధం డిమాండు పారిశ్రామికాభివృద్ధికి ప్రేరణగా పనిచేసింది. దిగుమతులలో కోతలు ఆటోమొబైల్స్ బదులు విమాన పరికరాల ఉత్పత్తి ప్రారంభించడానికి భారత ప్రయత్నాలకు (వాల్‌చంద్, హీరాచంద్, మైసూరుకి చెందిన దివాన్ మీర్జా, ఇస్మాయిల్‌ల) నిరుత్సాహపరచడానికి

బ్రిటిషువారు చేయగలిగిందంతా చేసినప్పటికి దేశీయ ఉత్పత్తులపై ఆధారపడవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. 1939 –1942 కాలంలో ఫ్యాక్టరీలలో ఉపాధి సౌకర్యం 31% పెరిగింది. యుద్ధ ప్రయత్నాలకు తీవ్ర విఘాతం కల్పించి వుండవలసిన శ్రామిక అశాంతి పెద్ద నగరాలలో గణనీయమైన కరువుభత్యాలు అత్యవసర వస్తువుల్ని సబ్సిడీరేట్లకు సరఫరా చేయడం ద్వారా అదుపు చేయబడింది. యుద్ధం ఎక్కడో దూర ప్రాంతాలలో జరుగుతూ వైమానిక బాంబు దాడులతో ఆస్తుల నష్టం కలిగించనంత వరకు, అది భారత వాణిజ్యవేత్తలకు త్వరితంగా అధికలాభాల్ని తెచ్చిపెట్టే సాధనమయింది. బ్రిటిషు వారికి సహకరించవలసిందిగా వాణిజ్యవేత్తలు ముస్లిం తాలూకాదార్లు జమీందార్లు కలప, బొగ్గు యితర చిల్లర వస్తువులు సరఫరా చేసే కాంట్రాక్టర్లు ముస్లింలీగుపై ఒత్తిడి తెచ్చారని ఖలీ కుజ్జమన్ ప్రస్తావించాడు. అలాంటి ఒత్తిడులే కాంగ్రెస్‌పై వచ్చి వుంటాయని భావించడం అసంబద్ధం కాదు.

**యుద్ధం యొక్క నూతన దశ**

1941 సం॥ ద్వితీయార్థంలో వచ్చిన రెండు ప్రపంచ పరిణామాలు భారతదేశ పరిస్థితిని మార్చివేశాయి. రష్యాపై హిట్లర్ దాడి, 1941 డిసెంబరు జపాన్ ఆగ్నేయాసియాపై దాడి జరిపి నాలుగు మాసాలలో బ్రిటిషు సైన్యాల్ని మలయా సింగపూర్ బర్మాల నుండి తుడిచిపెట్టి భారతదేశంలోని బ్రిటిషు సామ్రాజ్యానికి అంతిమ ఘడియలు సమీపించాయని భయం కలిగించడం.

రష్యాపై జర్మనీ దాడి చేయడంతో భారత కమ్యూనిష్టులు బాధాకరమైన సమస్యని ఎదుర్కొంటున్నారు. భారతదేశంలో అణచివేత అభివృద్ధి నిరోధక విధానాలు ఎప్పటిలాగానే కొనసాగుతున్నప్పటికి బ్రిటన్ యిప్పుడు జీవన్మరణ సమస్యతో సతమతమవుతున్న ప్రపంచంలోని ఏకైక సోషలిస్టు రాజ్యానికి మిత్రదేశం. ఆరు నెలల పాటు సాగిన ఊగిసలాట అంతర్గత చర్చల తరువాత ఫాసిస్టు వ్యతిరేక ప్రజా యుద్ధానికి పూర్తి మద్దతుని ప్రకటించి అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో జత కలిసింది. రష్యాపట్ల ఆందోళన సానుభూతి కేవలం కమ్యూనిస్టులకే పరిమితం కాలేదు. 1941 ఆగష్టులో మరణశయ్యపై వున్న రవీంద్రనాథ్ రష్యా వార్తల్ని గురించి అడిగి తెలుసుకొన్నారు. సోవియట్లు మాత్రమే రాక్షసుల్ని నిలవరించగలరని విశ్వాసం ప్రకటించాడు. నెహ్రూ ప్రగాఢమైన అంతర్జాతీయ మరియు ఫాసిస్టు వ్యతిరేక నిబద్ధతతో, బలవంతంగా యుద్ధంలోకి లాగబడిన రష్యా చైనాలపై అభిమానంతో క్రిప్సు రాయబార చర్చలలో యుద్ధానికి భారతీయుల మద్దతుని కూడగట్టి బ్రిటిషు ప్రభుత్వంతో రాజీ కొరకు ప్రయత్నాలు చేశాడు. జపాన్ దురాక్రమణ దారుల్ని ప్రతి ఘటించేందుకు గెరిల్లా యుద్ధ ప్రతిఘటన అవసరాన్ని బాహాటంగా ప్రకటించాడు. అలాంటి ప్రాపంచిక దృక్పథం అత్యధిక భారతీయ దేశభక్తులు, కాంగ్రెస్ మితవాదులు, గాంధేయులు, సోషలిస్టులు, బోస్ అనుచరుల నుండి ఆశించలేదు. 'బ్రిటన్ ఓడిపోనున్నది సమయం చూసి దెబ్బతీయాల'ని అత్యధికులు భావించారు.

**క్రిప్స్ రాయబారం**

యుద్ధం దాదాపు భారతదేశం ముంగిట్లోకి వచ్చిపడింది. (1942 ఫిబ్రవరి 15న సింగపూర్ మార్చి 8న రంగూన్, మార్చి 23న అండమాన్‌దీవులు చేజారాయి) భారతీయ ప్రజాభిప్రాయాన్ని తమ కనుకూలంగా మలచుకొనేందుకు బ్రిటిషువారు కొన్ని సానుకూలమైన చర్యలు చేపట్టక తప్పలేదు. 1941 డిసెంబరులో రూజ్వెల్ట్ వాషింగ్టన్‌లో చర్చిల్‌తో చర్చలు జరుపుతూ భారతదేశంలో రాజకీయ సంస్కరణల సమస్యని ప్రస్తావించారు. సప్రూ, జయకర్ లాంటి భారత ఉదారవాద నాయకులు తక్షణం అధినివేశ ప్రతిపత్తి కల్పించాలని, వైస్రాయి కార్యనిర్వాహక కమిటీని భారత ప్రభుత్వంగా విస్తరించాలని జనవరి 2న విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరిలో చాంగ్‌కైషేక్ భారతదేశ పర్యటన సందర్భంగా 'భారతదేశ స్వాతంత్ర్య ఆకాంక్షల' పట్ల బాహాటంగా సానుభూతి ప్రకటించాడు. ఇవన్నీ బ్రిటన్‌లో గల భారత అనుకూల గ్రూపులు సానుకూలంగా స్పందించడానికి అవకాశాలు కల్పించాయి. క్రిప్స్, అట్లీ లాంటి యుద్ధ కాల మంత్రివర్గంలోని లేబరుపార్టీ సభ్యులు. 1931లో గాంధీ సందర్శన సందర్భంలో అగాతాహేంసన్ అధ్వర్యంలో స్థాపించబడిన భారత అనుకూల గ్రూపుతో1938లో నెహ్రూ స్నేహ సంబంధాల్ని అభివృద్ధిపరచాడు. 1939 డిసెంబరు (కిప్స్) భారతదేశాన్ని సందర్శించాడు. యు.పి.లీగునాయకుడు లియాకత్ ఆలితో సంభాషణలు జరిపిన తరువాత 1938 ఫిల్కిన్స్ సూత్రానికి కొన్ని మార్పులు చేయవలసిన అవసరాన్ని గుర్తించాడు. 'బలహీనమైన సమాఖ్య ఆవిర్భవిస్తుంది... ప్రావిన్సులు కోరుకుంటే వైదొలిగే హక్కుతో' – రెండు సంవత్సరాల తరువాత క్రిప్సు పథకానికి ప్రాతిపదిక కానున్న ప్రావిన్సుల ఎంపిక ఆలోచనకు సంబంధించిన బీజం. (ఆర్.జె. మూరే, చర్చిల్, క్రిప్సు –భారతదేశం 1939 –45, ఆక్స్‌ఫర్డ్ 1979 పేజీ 12).

1942 మార్చి మొదటివారంలో యుద్ధానంతరం స్వయంప్రతిపత్తి స్థాయి విడిపోయే హక్కుతో, ప్రావిన్సుల చట్ట సభలచే ఎన్నుకొనబడిన రాజ్యాంగ నిర్మాణ సంస్థ, ప్రావిన్సులకు దానిలో చేరకుండా వుంటే హక్కుతో, అత్యవసర సమస్యలపై భారత ప్రజలలోని ముఖ్యమైన సెక్షన్ల నాయకుల యొక్క తక్షణ సమర్థవంతమైన భాగస్వామ్యాన్ని పేరా (2) ఆహ్వానించింది. కాని యుద్ధ కాలంలో భారతదేశంపై అదుపు బ్రిటిషు వారికి వుండాలి.

## 1942-1945 క్విట్ ఇండియా - కరువు

## యుద్ధం చివరి దశ

**తిరుగుబాటు మూలాలు**

1942 వేసవిలో గాంధీ సమరశీల పోరాటం సాగించాలని ఉత్సాహంగా వున్నారు. 'భారతదేశాన్ని దేవుడికి వదలివేయండి లేక అరాచకత్వానికి వదిలివేయండి' – అని బ్రిటిష్ వారిని అర్థించాడు. క్రమబద్ధమైన అరాచకత్వం పోవాలి. ఫలితంగా చట్టరాహిత్యం ప్రబలినా సహిస్తాను. (గాంధీ పత్రికలకు మే 16న యిచ్చిన ఇంటర్వ్యూని లిన్‌లిత్‌గౌ అమెరీకి తెలియజేస్తూ,

మాన్సెర్గ్ వాల్యూం పేజి 96) బ్రిటిష్‌వారు వెళ్ళిపోతే 'జపాన్ వారు వారి పథకాల్ని పునః పరిశీలించుకుంటారు' (హరిజన్‌లో వ్యాసం మే 3) ఏమైనప్పటికి భారతీయులు వారి సమస్యల్ని వారు పరిష్కరించుకోవలసి వుంటుంది. అహింస యొక్క అవసరం పునరుద్ధరింపబడుతూనే వుంది. బొంబాయి ఎఐసిసి సదస్సు 1942 ఆగస్టు 8న ప్రఖ్యాత క్విట్ ఇండియా తీర్మానాల్ని ఆమోదించింది. గాంధీ నాయకత్వంలో అహింసాయుత మార్గంలో విస్తృతమైన ప్రజాపోరాటం చేపట్టాలని నిర్ణయించింది. కాంగ్రెస్ నాయకత్వం అరెస్టు చేయబడితే 'స్వాతంత్ర్యాన్ని ఆకాంక్షించే ప్రతి భారతీయుడు తనకు తానే మార్గదర్శి కావాలి...' 'ప్రతి భారతీయుడు స్వేచ్ఛాయుతమైన పౌరునిగా వ్యవహరించాలి. కేవలం జైలుకి పోవడం సరిపోదు' – గాంధీ తన ఆవేశపూరితమైన 'సాధించండి లేక ప్రాణాలర్పించండి' (డు ఆర్ డై) ఉపన్యాసంలో స్పష్టం చేశాడు. 'సాధారణ సమ్మె తప్పనిసరియైన అవసరమైతే నేను వెనుకాడను' – ఆగస్టు 6న ఒక ఇంటర్వ్యూలో గాంధీ చేసిన మరొక అసాధారణ ప్రకటన. కమ్యూనిస్టులు సమ్మెలకు దూరంగా వున్నప్పుడు గాంధీ సమ్మెకి సంసిద్ధత వ్యక్తం చేశాడు. వామపక్ష నాయకత్వంలో కార్మికులు 1928 – 29 లేక 1930 దశాబ్దం చివరిలో 1940 దశాబ్దం ప్రారంభంలో సమరశీల పోరాటాలను గాంధీ వ్యతిరేకించాడు. జూలై 14న జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ కూడా చాలా అసాధారణ మార్పులు కోరుతూ తీర్మానాన్ని ఆమోదించింది. రాజులు, జాగీర్దార్లు, జమిందార్లు ఆస్తిపాస్తులు ధనం గల సంపన్నవర్గాల సంపద అంతా పొలాల్లో ఫ్యాక్టరీలలో యితర చోట్ల పనిచేస్తున్న కార్మికుల శ్రమ నుండి పోగు చేసుకున్నదే కాబట్టి అధికారం కార్మికులకు చెందవలసిందే' (మాన్సెర్గ్ వాల్యూ 2 పేజీ 388)

ఈ మార్పు కాంగ్రెస్‌లోని పాత సంబంధాల్ని తలక్రిందులు చేసింది. క్రిప్సు రాయబారం విఫలమైన తరువాత ఏప్రిల్ 27 నుండి మే 1 వరకు జరిగిన కీలకమైన వర్కింగ్ కమిటీ సమావేశంలో గాంధీ వైఖరిని పటేల్ రాజేంద్రప్రసాద్ కృపలానీ లాంటి మితవాదులు (రైట్ వింగర్స్), సోషలిస్టులు (అచ్యుత్ పట్వర్ధన్ నరేంద్రదేవ్) బలపరిచారు. రాజగోపాలాచారి, భూలాభాయ్ దేశాయ్‌లకు సన్నిహితులుగా వున్నాడు నెహ్రూ. స్వతంత్రం సిద్ధించిన తరువాత ముస్లిం మెజారిటీ రాష్ట్రాలకు ప్లెబిసైట్ ద్వారా విడిపోయే హక్కుని గుర్తిస్తూ ముస్లిం లీగుతో అవగాహన రావడం అవసరమని రాజాజీ 1942 నుండి అర్ధిస్తూ వచ్చాడు. నెహ్రూ గతంలో చాలాసార్లు చేసిన విధంగానే సందేహాల్ని దిగమ్రింగి క్విట్ ఇండియా తీర్మానాన్ని ప్రతిపాదించాడు. ఎఐసిసిలోని కమ్యూనిస్టు సభ్యులు వ్యతిరేకించారు. (భూలాభాయ్ దేశాయ్, రాజాజీ జూలైలో రాజీనామా చేశారు).

క్విట్ ఇండియా కాలంలోనూ ఆ తరువాత 'అలజడులకు కాంగ్రెస్ బాధ్యత' (1943 ఫిబ్రవరి) లాంటి బ్రిటిష్ అధికార పత్రాలు యుద్ధం విషయంలో కాంగ్రెస్ అక్షరాస్యులకు అనుకూలమైన వైఖరి తీసుకొన్నదని ఆరోపించాయి. ప్రపంచవ్యాప్తంగా ఫాసిస్టు వ్యతిరేక ప్రజాభిప్రాయాన్ని తమ కనుకూలంగా మలచుకొని భారతదేశంలోని అతి పెద్ద ప్రజా ఉద్యమాన్ని నిర్దాక్షిణ్యంగా అణచి వేయడాన్ని సమర్ధించుకునేందుకు బ్రిటన్ యిలాంటి ఆరోపణలకు దిగింది.

1930 దశాబ్దంలో కాంగ్రెస్ యొక్క ఫాసిస్టు వ్యతిరేక దృక్పథం యిలాంటి ప్రచారాన్ని పట్టించుకోలేదు. ఒకవైపు బ్రిటిష్‌వారు స్పెయిన్ ఆస్ట్రియా జెకొస్లోవేకియాలను ఫాసిస్టులకు అమ్ముకుంటున్నారు. కాంగ్రెస్ రష్యా చైనాలకు సానుభూతిని మే 1, జూలై 14, ఆగస్టు 8న అలహాబాద్, వార్ధా, బొంబాయి తీర్మానాలలో మిత్ర రాజ్యాలకు మద్దతుని పునరుద్ఘాటించింది. 'రష్యా లేక చైనా పరాజయానికి నేను సాధనం కాదలచుకోలేదు' - గాంధీ తన 'డూ ఆర్ డై' ప్రసంగంలో స్పష్టం చేశాడు. జపాన్‌వారు విముక్తిదారులని భావించే వారితో తన విభేదాన్ని స్పష్టంగా ప్రకటించారు. సోవియట్లు ధ్వంసం చేయబడి హిట్లర్ టోజోలు విజయం సాధించడం భరించరానిదిగా భావించే మైనారిటీకి (నెహ్రూతో సహా) మిత్ర రాజ్యాల ఓటమి సంభవించినప్పటికి భారతదేశ ప్రయోజనాలు పరిరక్షింపబడతాయని భావించిన మెజారిటీ దేశభక్తుల ఆలోచనల మధ్య చాలా వ్యత్యాసం వుంది. అలహాబాద్ వర్కింగ్ కమిటీకి ఏప్రిల్‌లో గాంధీ రూపొందించిన పత్రంలో ఈ వాక్యాలు వున్నాయి. "భారతదేశం స్వేచ్ఛ పొందగానే మొదటి చర్యగా జపాన్‌తో చర్చలు జరుపుతుంది. భారతదేశానికి జపాన్ పట్ల శత్రుత్వం లేదు" నెహ్రూ పట్టుపట్టడంతో ఈ వాక్యాలు తొలగించబడ్డాయి. వర్కింగ్ కమిటీలో నెహ్రూ మాట్లాడుతూ "జపాన్ జర్మనీలు గెలుస్తాయని గాంధీ భావన. ఈ భావనతో అలాంటి నిర్ణయానికి వచ్చి వుంటాడు (అలజడులకు కాంగ్రెస్ బాధ్యత, అనుబంధం-1) స్టాలిన్‌గ్రాడ్ విజృంభించే వరకు అంటే 1942 సం॥ మధ్యకాలం వరకు మిత్రరాజ్యాల పరాజయం దాదాపు ఖరారయినట్లు కన్పించింది.

ఆగస్టు 9 ఉదయాన నాయకులు అరెస్టు చేయబడగానే ప్రజలు నాయకుల అంచనాలకు మించి ఉవ్వెత్తుగా లేచారు. రానున్న ఉద్యమ వివరాలకు సంబంధించి క్విట్ ఇండియా తీర్మానం అస్పష్టంగా వుంది. బ్రిటిష్‌వారు పూర్తి స్థాయి తీవ్ర నిర్బంధ విధానం చేపట్టాలని నిర్ణయించి చర్చలకు అవకాశాన్ని త్రోసిపుచ్చి కయ్యానికి కాలు దువ్వారు. ఆగస్టు 9కి ముందు కాంగ్రెస్ హింసాయుత తిరుగుబాటుకి పథకాలు వేసినట్లు బ్రిటిష్‌వారు నిరూపించలేకపోయారు. ఉదాహరణకు టాటన్‌హాం ఉటంకించిన 1942 జూలై 29 ఆంధ్ర పిసిసి యొక్క రహస్య సర్క్యులర్‌లో కూడా కాంగ్రెస్‌వాదులు 'సంసిద్ధులుగా వుండండి. నిర్మాణబద్ధంకండి. మహాత్ముడు నిర్ణయం తీసుకొనేవరకు ఎలాంటి చర్యలు చేపట్టకండి' అని మాత్రమే వుంది. సర్క్యులర్‌లో ప్రస్తావించిన ఆరు దశల కార్యక్రమంలో ఉప్పు, కోర్టులు, పాఠశాలలు, ప్రభుత్వ సర్వీసుల బహిష్కరణ, విదేశీ బట్టలు, మద్యం షాపుల వద్ద పికెటింగ్, చివరి దశగా పన్నుల నిరాకరణ (జమిందార్లు ఉద్యమంలో చేరకపోతే కౌలు చెల్లింపు నిరాకరణ) లాంటి సాంప్రదాయ గాంధేయ అంశాలే వున్నాయి. కార్మికుల సమ్మెల్ని ప్రస్తావించలేదు. రైళ్ళు ఆపడాన్ని 'ప్రోత్సహించలేదు' , 'నిషేధించనూ లేదు' ఆపితే 'గొలుసులాగి మాత్రమే ఆపాలి' టికెట్టు లేకుండా ప్రయాణాలు, టెలిఫోన్ టెలిగ్రాఫ్ తీగల్ని తెంచడం, ఆగస్టు9 తరువాత దేశంలో చాలా ప్రాంతాలలో సమాచార సాధనాలపై, ప్రభుత్వ చిహ్నాలపై జరిగిన దాడులలాంటి వాటిని ఈ రహస్య పత్రం ప్రస్తావించనే లేదు.

బ్రిటిష్‌వారు రెచ్చగొట్టారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి ఉన్నతాధికార వర్గం 1932 తరహాలో విరుచుకుపడాలని నిర్ణయించింది. రాజీ ప్రయత్నాల్ని తిరస్కరించి ఘర్షణ కోరుకొన్నది కాని బ్రిటిష్‌వారు వారు బేరసారాలాడిన దానికంటే ఎక్కువే పొందారు. కొంత సులభంగా అణచివేయగలిగిన 1932 స్థాయి శాసనోల్లంఘన కంటే ఆగస్టు 9 నుండి చెలరేగిన తిరుగుబాటు 1857 తరువాత ఎన్నడూ జరగనంత తీవ్ర స్థాయిలో జరిగిందని, మిలటరీ రక్షణ కారణాల రీత్యా లోకానికి బహిర్గతం చేయలేదని లిన్‌లిత్‌గౌ ఆగస్టు 31న పేర్కొన్నాడు (చర్చిల్‌కి టెలిగ్రాం వాల్యూం 2 పేజి 853) ఇక్కడ గమనించవలసిన అంశం 1942 ఆగస్టు నాటి ప్రజాస్పందనకు గల కారణాలు. వీటిని గాంధీ గమనించాడు. సైద్ధాంతికంగా ప్రజాయుద్ధ పంథాన్ని చేపట్టిన కమ్యూనిస్టుల కంటే బాగా అవగాహన చేసుకున్నాడు.

ఆగ్నేయాసియాలో ఒక ఆసియా దేశం చేతిలో ఓటమి శ్వేత జాత్యహంభావాన్ని పటాపంచలు చేయడమే గాక భారతదేశ పాలకుల యొక్క జాత్యహంకారాన్ని బట్టబయలు చేసింది. మలయా – సింగపూర్ బర్మాలలో వున్న యూరోపియనులు భయాందోళనలతో అన్ని ప్రయాణ సాధనాల్ని స్వాధీనం చేసుకున్నారు. అక్కడికి వలసపోయిన భారతీయులు అడవులు, పర్వతాల మార్గం గుండా బయటపడవలసి వచ్చింది. ఫలితంగా శ్వేతజాతికి వ్యతిరేకంగా ఆగ్రహావేశాలు పెల్లుబుకాయి. బ్రిటిష్ పాలన అంతం కానున్నదని అంచనాలు, వదంతులు వ్యాపించాయి. ఇవన్నీ 1942 ఆగస్టులో ప్రజాస్పందనకి ప్రేరణలుగా పనిచేశాయి. ఆగస్టు తిరుగుబాటులో ప్రజలు అత్యధికంగా పాల్గొన్న ప్రాంతాలు ఆగ్నేయాసియాకి యితర దేశాలకు వలసలు పోయిన ప్రాంతాలకు చెందిన వారు కావడం యాదృచ్ఛికం కాదు. ఉదాహరణకు అజాగర్ జిల్లాకి 30 లక్షల రూపాయలు వార్షికంగా విదేశీ మనియార్డర్ల రూపంలో వచ్చేవి (ఆర్. హెచ్. నిబ్లెట్, అజాంగర్‌లో కాంగ్రెస్ తిరుగుబాటు, అలహాబాద్ 1957 పేజి 2) బ్రిటిష్‌వారు సహాయపడటంలో దారుణంగా విఫలమైన తరువాత తిరిగి వచ్చిన కాందిశీకులు, బర్మా రంగం నుండి గాయపడిన సైనికుల్ని తరలించిన రైళ్ళు, ప్రజలలో ఆగ్రహావేశాల్ని పెంచాయి. అర్థం లేని విదేశీ యుద్ధం బాధల్ని తెచ్చిపెట్టిందని అత్యధిక భారతీయులు భావించారు. దుర్మార్గ విదేశీ పాలన అంతం కానున్నదని ఆశించారు. యుద్ధ కాలంలో భారతదేశంలో వున్న బ్రిటిష్ అమెరికా ఆస్ట్రేలియా సైనికులలో అత్యధికులు 'ప్రజాయుద్ధం' కొరకు పోరాడుతున్న ఆదర్శవంతులుగా ప్రవర్తించలేదు. జాత్యహంకారం ప్రదర్శించారు. స్త్రీలపై అత్యాచారాలు సాగించారు. యూరప్ సైనికుల చర్యలపై కాంగ్రెస్ నిరసన వ్యక్తం చేసింది. ఈ కాలంలో ధరలు విపరీతంగా పెరిగాయి. (ఉదాహరణకు తూర్పు యుపిలో 1942 ఏప్రిల్ ఆగస్టు మధ్య కాలంలో ఆహార ధాన్యాల ధరలు 60 శాతం పెరిగాయి) సరఫరాలలో ప్రత్యేకించి బియ్యం (బర్మా దిగుమతులు ఆగిపోయాయి) పప్పులలో కొరత ఏర్పడింది. బ్రిటిష్‌వారు యుద్ధకాల ఆర్థిక విధానంలో భాగంగా ఇంగ్లండ్‌లో రేషనింగ్ అమలు జరిపి సరఫరాలను క్రమబద్ధం చేశారు. కాని వలస రాజ్యంగా వున్న భారతదేశంలో బ్లాకు మార్కెటింగ్‌ని, అధిక లాభాల్ని అరికట్టేందుకు తగు చర్యలు చేపట్టలేదు. ఫలితంగా బెంగాల్‌లో

1943లో తీవ్రమైన కరువు వచ్చింది. పెరుగుతున్న ధరలు, తరుగుతున్న సరఫరాలకు తోడు అదే కాలంలో మిత్రరాజ్యాల సైన్యం పెద్ద సంఖ్యలో తరలించబడటంతో ఆహారనిల్వలు సైన్యానికి మళ్ళించబడుతున్నాయనే భయాందోళనలు ప్రజలలో నెలకొన్నాయి. బెంగాల్‌లో నాటు పడవల్ని స్వాధీనం చేసుకొని ధ్వంసం చేయమని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. జపాన్ పూర్తి స్థాయి దాడి జరిపితే బెంగాల్, అస్సాంలను రక్షించగలమనే విశ్వాసాన్ని 1942 సం॥ మధ్య కాలంలో ఇంగ్లీషువారు కోల్పోయారు. తమ రక్షణ రేఖని చోటా నాగపూర్ మైదానానికి మార్చుకునేందుకు సన్నద్ధమయ్యారు. నిజమైన దేశభక్తియుత ప్రజా యుద్ధం చేస్తున్న సోవియట్లు రష్యాలో భూదగ్ధ విధానాన్ని జయప్రదంగా అమలు జరిపింది. తమ పంచవర్ష ప్రణాళిక సాధించిన విజయంగా చెప్పుకునే నేపియర్ ఆనకట్టని పేల్చివేశాయి. కాని బ్రిటిష్‌వారు తమ వలసరాజ్యమైన భారతదేశంలో అలాంటి పద్ధతులు అవలంబించడం ఘోరాపరాధమే గాక రెచ్చగొట్టే చర్య అయింది. బెంగాల్‌లో వర్షాకాలంలో ఇంటి ఇంటికి మధ్య సమాచార సాధనాలుగా పడవలు ఉపయోగపడతాయి. తూర్పు బెంగాల్‌లో ప్రజలకు పడవలు లేకుండా చేయడం శరీరంలోని ముఖ్యావయవాలను ఖండించడం లాంటిదే (హరిజన్‌లో గాంధీ 1942 మే 3)

**అఖిల భారత నమూనా**

కాంగ్రెస్ నాయకుల్ని ఆగస్టు 9 ఉదయాన చేసిన అరెస్టులతో గ్రామీణ ప్రాంతాలలో ఆగ్రహావేశాలు గతంలో ఎన్నడూ లేనంతగా పెల్లుబుకాయి. గత ఉద్యమాలలో లాగానే ప్రముఖ నాయకుల అరెస్టులు యువక సమరశీల శ్రేణుల చొరవని పెంచాయి. క్రింది నుండి వచ్చిన ఒత్తిళ్ళకు ఎక్కువ అవకాశం కల్పించాయి. సమాచార వ్యవస్థపై దాడులు చేసేందుకు కాంగ్రెస్ పథకాలు సిద్ధం చేసుకొందని అమెరీ అపనింద వేశాడు. చాలామంది దీనిని వర్కింగ్ కమిటీ నిర్ణయంగా నమ్మారు. తరువాత దశలో అజ్ఞాతవాసంలో వున్న వివిధ గ్రూపులు (ఎఐసిసి సర్క్యులర్ అత్యధికులు జైళ్ళలో వున్నప్పటికి) ఎఐసిసి పేరుతో సూచనలు, ఆదేశాలు జారీ చేశాయి.

క్విట్ ఇండియా ఉద్యమంలో మూడు ప్రధాన దశలను చూడవచ్చు. మొదటి దశ విస్తృతంగా ప్రజలు పాల్గొన్నది, హింసాయుతమైనది. త్వరగా అణచివేయబడింది. ప్రధానంగా పట్టణాలకు పరిమితమైనది. చాలా నగరాలలో హర్తాళ్ళు, సమ్మెలు నిర్వహించింది. పోలీసులతో, సైన్యంతో ఘర్షణలకు దిగింది. ఈ ఉద్యమానికి ఆగస్టు 9 నుండి 14 వరకు బొంబాయి ప్రధాన కేంద్రం ఆగస్టు 10 నుండి 17 వరకు కలకత్తాలో హర్తాళ్ళు జరిగాయి. ఢిల్లీలో జరిగిన హింసాయుత ఘర్షణలలో చాలా నష్టం వాటిల్లింది. ఆగస్టు 11న సెక్రటేరియట్ వద్ద ఘర్షణల తరువాత రెండు రోజులపాటు పాట్నా నగరంపై ప్రభుత్వ అదుపు లేకుండా పోయింది. ఢిల్లీలో 'కార్మికులు సమ్మె చేస్తుండటంతో ఘర్షణలు చెలరేగాయి (అమెరీకి లిన్‌లిత్‌గొ ఆగస్టు 12) మరుసటి రోజు లక్నో, కాన్పూరు, బొంబాయి, నాగపూర్, అహమ్మదాబాద్‌లలో సమ్మెలు జరిగినట్లు వైస్రాయి ప్రకటించాడు. (మాన్సెర్గ్ వాల్యూం2 పేజీలు 669, 682-3) టాటా

స్టీలు ప్లాంటు ఆగస్టు 20 నుండి 13 రోజుల పాటు మూసివేయబడింది. 'జాతీయ ప్రభుత్వం ఏర్పాటు చేయబడే వరకు పనులు చేపట్టబోము' అనేది కార్మికుల నినాదం (లిన్‌లిత్‌గో అమెరీకి ఆగస్టు 21) అహమ్మదాబాద్ జౌళి కార్మికుల సమ్మె మూడున్నర మాసాల పాటు కొనసాగింది. ఒక జాతీయవాద పత్రికా రచయిత నగరాన్ని భారతదేశం యొక్క స్టాలిన్‌గ్రాడ్‌గా అభివర్ణించాడు (గోవింద్ సహాయ్, 1942 విప్లవం ఢిల్లీ 1947, పేజీ 128). విద్యార్థులు నాయకత్వం వహించిన ఈ మొదటి దశ ఉద్యమంలో పట్టణ మధ్య తరగతి ప్రజలు విరివిగా పాల్గొన్నారు.

ఆగస్టు మధ్య నుండి ఉద్యమం దృష్టి గ్రామీణ ప్రాంతాలపై పడింది. బనారస్, పాట్నా, కటక్ నుండి వచ్చిన సమరశీల విద్యార్థులు సమాచార సంబంధాలను ధ్వంసం చేశారు. తెల్లవారికి వ్యతిరేకంగా గ్రామీణ ప్రాంతాలలో ప్రతిఘటన పెరిగింది. కొన్ని విధాల 1857 తిరుగుబాటుని స్ఫురణకు తెచ్చింది. ఉత్తర పశ్చిమ బీహారు, తూర్పు యుపి, బెంగాల్‌లోని మిడ్నాపూర్ మహారాష్ట్ర, కర్ణాటక, ఒరిస్సాలలోని కొన్ని ప్రాంతాలు ఈ రెండవ దశకి ప్రధాన కేంద్రాలు. చాలా కేంద్రాలలో స్థానిక 'జాతీయ ప్రభుత్వాలు' స్థాపించబడ్డాయి. అవి ఎక్కువ కాలం మనలేకపోయాయి.

తీవ్రమైన అణచివేతతో బలహీనపడిన (57 సైనిక బెటాలియన్లు ప్రయోగింపబడినట్లు భారతదేశ ప్రభుత్వం రాజ్య కార్యదర్శికి సెప్టెంబర్ 12న తెలియజేసింది. మాన్సెర్గ్ వాల్యూ 2, పేజీ 952-3) ఉద్యమం సెప్టెంబర్ చివరి నుండి మూడవ దశకి చేరుకొన్నది. ఈ దశలో విద్యావంతులైన యువకులు సమాచార సాధనాలపైన, పోలీసు సైనిక స్థావరాలపైన టెర్రరిస్టు కార్యకలాపాలు అప్పుడప్పుడు గెరిల్లా దాడులు (ఉత్తర బీహార్ నేపాల్ సరిహద్దులో జయప్రకాష్ నారాయణ నాయకత్వంలో చేపట్టిన కార్యకలాపాల లాంటివి) జరిపారు. రైతాంగ దళాలు పగలు వ్యవసాయం చేసుకుంటూ రాత్రివేళల్లో విధ్వంస కార్యక్రమాలు (కర్ణాటక పద్ధతిలో) చేపట్టారు. కొన్ని స్థావరాలలో రహస్య సమానాంతర జాతీయ ప్రభుత్వాలు (మిడ్నాపూర్‌లో తామేలుక్, మహారాష్ట్రలో సతారా, ఒరిస్సాలో తాల్చేర్) పనిచేశాయి. ఏ స్థాయిలో చూసినా ఆకట్టుకొనేవి, వీరోచితమైనవియైన యిలాంటి కార్యకలాపాలు బ్రిటిష్ పాలనని గాని, మిత్ర రాజ్య యుద్ధ ప్రయత్నాల్ని గాని భయపెట్టలేక పోయాయి. ఉదాహరణకు మిడ్నాపూర్ జిల్లాలో ఎక్కడో విసిరేసినట్లున్న చిన్న జాతీయ ప్రభుత్వాలు కలకత్తాకి ఎలాంటి కలవరపాటు కలిగించలేకపోయాయి. అరకాన్, అస్సాం రంగాలలో సమాచార సాధనాలకు నష్టం కలిగించలేకపోయాయి. అందుకే తామ్‌లుక్ జాతీయ సర్కారు 1944 సెప్టెంబరు వరకు మనగలిగింది.

తిరుగుబాటు విస్తృతిని, ఉద్యమంపై ప్రభుత్వం చేపట్టిన అణచివేత తీవ్రతని ప్రభుత్వ గణాంక వివరాలు ఒక మేరకు తెలియజేస్తాయి. 1943 చివరికి 91,836 మంది అరెస్టు చేయబడ్డారు. అత్యధికంగా బొంబాయి ప్రెసిడెన్సీలో (24,246) యు.పి. (16,796) బీహారు (16,202) అరెస్టు చేయబడ్డారు. 208 పోలీసు ఠాణాలు, 332 రైల్వేస్టేషన్లు, 945 పోస్టాఫీసులు ధ్వంసం చేయబడ్డాయి. 664 బాంబు ప్రేలుడు ఘటనలు జరిగాయి. పోలీసు ఠాణాలపై

దాదులు బీహారులో (మొత్తం 208లో 72) బాంబు ఘటనలు 8 (బొంబాయిలో 447) జరగడం – బొంబాయిలో ప్రజల భాగస్వామ్యం ఎక్కువగా వున్నట్లు టెర్రరిస్టు కార్యకలాపాలు బొంబాయిలో ఎక్కువగా జరిగినట్లు స్పష్టమయింది. పోలీసులు లేక సైన్యం జరిపిన కాల్పులలో 1060 మంది ప్రజలు హతులయ్యారు. తిరుగుబాటును అణచివేసే ప్రయత్నంలో 63 మంది పోలీసులు చనిపోయారు. 216 మంది ప్రజలలో కలసిపోయారు (205 మంది ఒక బీహారులోనే) (హోం పొలిటికల్ 3/52/1943, వై.బి. మాథుర్ క్విట్ ఇండియా ఉద్యమంలో ఉటంకించబడింది. ఢిల్లీ 1979 పేజీలు 190 –92). కాంగ్రెస్ స్వీకరించిన సమాచారం మేరకు ఒక్క గ్రామంలోనే 1943 జనవరి 9న 46 మానభంగాలతో సహా తామ్‌లుక్ సబ్‌డివిజనులో 74 మానభంగాలు జరిగాయని (సతీష్ సామంత్, ఆగష్టు విప్లవం – మిద్నాపూర్‌లో రెండు సంవత్సరాల జాతీయ ప్రభుత్వం, కలకత్తా 1946 పేజీ 40) కరకుగా వ్యవహరించినందుకు తొలగింపబడిన అజాంఘర్ (తూర్పు యు.పి.) డిస్ట్రిక్టు మునిసిఫ్ ఆర్. హెచ్. నిబ్లెట్ తన డైరీలు శ్వేత జాతీయులు సృష్టించిన చాలా భయోత్పాతమైన ఘటనల్ని నమోదు చేసుకొన్నారు. బ్రిటిషు పోలీసులు 'ప్రభుత్వ బందిపోటు' తరహాలో సామూహిక జరిమానాలు విధించారని, పరిపాలనని నిలబెట్టుకోడానికి గ్రామాలకు గ్రామాలు తగులబెట్టారని రాసుకొన్నాడు. పోలీసులు వేటగాళ్లు కాదని, విధ్వంసం వారి బాధ్యతకాదని నచ్చజెప్పడానికి విఫలయత్నం చేశాడు. (ఆర్. హెచ్. నిబ్లెట్ పేజీలు 26,40, 44,49) పోలీసులు నీచాతినీచమైన చిత్రహింసలకు పాల్పడ్డారని పేర్కొన్నాడు. ఇది 1857 హింసాకాండలో పోల్చదగిందని, ప్రజలు మాత్రం నిరాయుధులుగా వుండగా యిప్పటి పోలీసులకు ఆధునిక మిలిటరీ సైన్సు అందించిన వనరులుండడం – ఒకే ఒక్క తేడా అని పేర్కొన్నాడు. ఆగష్టు 15 నాటికి పాట్నా పరిసరాలలో సమాచార సాధనాల్ని ధ్వంసం చేస్తున్న గుంపులపై మెషీన్‌గన్లు ప్రయోగించయని లిన్‌లిత్‌గొ ఆదేశాలు జారీ చేశాడు. బీహార్‌లోని భగత్‌పూర్, మోంఘీర్‌లలో, బెంగాలులోని నాడియా తామ్‌లుక్‌లో ఒరిస్సాలోని తాల్చేరులలో ప్రభుత్వం విమానాల నుండి కాల్పులు జరిపించింది.

**సామాజిక పొందిక**

ఈ తిరుగుబాటులో కార్మికుల పాత్ర చాలా పరిమితం. 'కార్మికులు వైదొలుగుతున్నారు' అని ఆగష్టు 14న లిన్‌లిత్‌గొ రిపోర్టు చేశాడు. బొంబాయిలో కార్మికుల పాత్ర –ప్రత్యేకించి జౌళి కార్మికుల పాత్ర దాదాపు ఏమీ లేదని గోవింద్‌సహాయ్ పేర్కొన్నాడు. (మాన్సెర్గ్ వాల్యూం 2 పేజి 69). కలకత్తా కార్మికులు కూడా ప్రశాంతంగా వున్నారు. ఉద్యమానికి కమ్యూనిష్టుల వ్యతిరేకత కార్మికుల్ని అదుపుచేసి వుండవచ్చు. కమ్యూనిష్టుల ప్రభావం లేని అహమ్మద్‌నగర్ పూనా లాంటి కేంద్రాలలో గాంధేయ ప్రభావం కార్మికులకు పెట్టుబడికి మధ్య సత్సంబంధాలు వుండేలా చేసింది. "కార్మికులు గైరు హాజరుని మిల్లు యాజమానులు నిరసించలేదు.' (గోవింద సహాయ్ పేజి 110). కాంగ్రెస్ నాయకుడు కె.టి. భాష్యం కారినీలిక నాయకుడుగా వున్న బెంగుళూరులో 30,000 మంది కార్మికులతో చిన్న సమ్మెలు జరిగాయి. (జేమ్స్‌మేనర్ పేజి

136–146) వ్యాపార వర్గాల భాగస్వామ్య పరిమితులపై వివరణాత్మక అధ్యయనం జరగలేదు. వర్గ సమస్యలపై జరిగే పోరాటాలకు మిల్లు యాజమానుల నుండి బ్యాంకర్ల నుండి సహాయం పొందడం నిషిద్ధం కాదని సోషలిస్టుల కరపత్రం 'ది ఫ్రీడం ఫ్రంట్' పేర్కొన్నది. 1942 నాటి జాతీయవాద కార్యకలాపాలకు ఉన్నతవర్గ భారతీయ ఉన్నతోద్యోగి వర్గ రహస్య మద్దతు వుండని కథలు ప్రచారంలోకి వచ్చాయి. అలాంటి మద్దతు కారణంగా కార్యకర్తలు ఉషా మెహతా ఆధ్వర్యంలో మూడు నెలలపాటు రహస్య రేడియోస్టేషన్ నిర్వహణ లాంటి కార్యకలాపాలు సమర్థవంతంగా నిర్వహించగలిగారు.

శాసనోల్లంఘన రోజుల్లో లాగా గాక 1942 ఉద్యమంలో మధ్యతరగతి విద్యార్థులు పట్టణ ఘర్షణలలో గాని, తిరుగుబాటుకి రైతుల్ని సన్నద్ధం చేయడంలో గాని ప్రముఖ పాత్ర నిర్వహించారు. కొన్ని ప్రాంతాలలో రైతులు మూకుమ్మడిగా కదిలారు. ఫలితంగా అధికారులు బీహారు ప్రాంతాన్ని (సరన్) నేరపూరిత ప్రాంతంగా గుర్తించారు. విద్యార్థుల్ని బీహారు గ్రామాలలో విస్తృతంగా వున్న నేరస్థుల మిత్రులుగా గుర్తించారు. (బీహారు గవర్నరు స్టూవర్డ్ లిన్‌లిత్‌గౌ కి, 1942 ఆగష్టు 22 మాన్సెర్గ్ వాల్యూం2 పేజి 790) తూర్పు యు.పి. పశ్చిమబీహారు ప్రజలపై జరిపిన గణాంకపరమైన విశ్లేషణ (కాంగ్రెస్ – రాజ్యంలో మేక్స్ హార్‌కోర్ట్‌చ్) యిది చిన్న రైతుల ఉద్యమమని స్పష్టం చేసింది. అరెస్టయిన వారిలో ఉన్నత, మధ్యతరహా కులాలవారు ఎక్కువగా వున్నారు. (1214 మందిపై జరిపిన సర్వేలో 17% బ్రాహ్మణులు, 27.5% రాజపూత్ భూమిహార్‌లు. 7.4% అస్పృశ్యులు, 4.2% తెగలవారు) మరొక 242 మందిపై జరిపిన సర్వేలో 36.5% రైతులు 0.8% జమీందారులు, 3.5% వ్యవసాయ కూలీలు చాలా కొద్దిమందిపై సర్వే జరిపి సాధారణీకరణలు చేయడం ఆశ్చర్యకరమైన తప్పులుండడం (నిబ్లెట్‌ని అజాంఘర్‌కి చెందినవాడుగా గాక బాలియాకి చెందినవారుగా చెప్పడం) లాంటి తప్పిదాలు ఈ విశ్లేషణలో వున్నాయి. కాబట్టి ఈ అంశంపై చాలా పరిశోధన జరగవలసివుంది.

బ్రిటిషు వ్యతిరేక సమరశీలత స్థాయిలో కాంగ్రెస్‌ని నాయకత్వంలోని అన్ని ఉద్యమాల కంటె 1942 ఉద్యమం అధిగమించింది. 1857లో లాగానే అంతర్గత ఉద్రిక్తతల్ని తగ్గించింది. విధేయులుగా వున్న జమీందారులకే కౌలు చెల్లింపు నిరాకరణ పరిమితం చేయాలని 'ఏఐసిసి' లేక 'గాంధీ బాబా' పేరుతో జారీ చేయబడిన సూచనలు మాటిమాటికి స్పష్టం చేశాయి. (అలజడులకు కాంగ్రెస్ బాధ్యత, అనుబంధాలు V,VI,VII,VIII,IX) ప్రైవేటు ఆస్తిపై దాడి జరగకూడదనేది ఈ ఉద్యమం లక్షణం (గోవింద్ సహాయ్ పేజి 96) పట్వారీల నుండి రికార్డుల స్వాధీనం చేసుకొని తగులబెట్టిన ఘటనలు కూడా రెండు మూడు మాత్రమే జరిగాయని అజాంఘర్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ ప్రస్తావించాడు. "జిల్లాలో ప్రైవేటు ఆస్తిపై దాడి ఒక్కటే – అదీ అక్కడ లేని తెల్ల జమీందారు ఎస్టేటుపై మాత్రమే జరిగింది. విత్తనాల గిడ్డంగులు దోచుకోబడలేదు. (నిబ్లెట్ పేజి 29,31). స్వరాజ్యం సాధించబడింది. అనే విశ్వాసం కలిగించిన ప్రేరణతో గుంపులు ఠాణాలను చుట్టుముట్టారు.– నిబ్లెట్ వివరణ స్పష్టం చేస్తుంది (నిబ్లెట్

పేజి13) బ్రిటిషు అణచివేతతో ఆ నమ్మకం చెల్లా చెదురు చేయబడగానే వారి తక్షణావసరాల్ని సాధించే దిశగా నిర్దిష్ట కార్యక్రమాలు లేకపోవడంతో ఉద్యమం క్షీణించింది. అభివృద్ధి పరచబడిన సాంకేతిక పద్ధతుల ద్వారా ఉద్యమాన్ని పునరుద్ధరించడానికి అజ్ఞాతవాసంలో వున్న నాయకుల ప్రయత్నాలు (విప్లవ గొరిల్లా సైన్యం) కొరకు జయప్రకాష్ యిచ్చిన పిలుపు, స్వాతంత్ర్య పోరాట యోధులకు లేక నాసిక్ పోలీసులకు దొరికిన అస్తవ్యస్తతపై విడుదల చేయబడిన కరపత్రం పరిస్థితిని మార్చలేకపోయాయి. మిలిటెంట్లపై స్థానిక పరిస్థితుల నిర్దిష్టమైన సామాజిక ఆర్థిక బాధ్యతల్ని మోపిన తామ్‌లుక్, తాల్చేర్ లేక సతారా లాంటి చోట్ల స్థానిక ప్రభుత్వాలు ఎక్కువ కాలం మనగలిగాయి.

## ప్రాంతీయ వ్యత్యాసాలు

1942 ఉద్యమంపై ప్రాంతీయ అధ్యయనాలు జరగలేదు. కాని ఉద్యమం యొక్క స్వభావం, విస్తృతి, వ్యత్యాసాలలో కొన్ని సాధారణాంశాల్ని గమనించవచ్చు. పంజాబు, కాంగ్రెస్ ప్రాంతమైన వాయివ్య సరిహద్దు ప్రావిన్సు ప్రశాంతంగా వుండిపోయాయి. ఒక్కొక్క ప్రావిన్సులో 2500 అరెస్టులు, పోలీసు కాల్పుల ఘటనలు రెండు జరిగాయి. పంజాబు రాజకీయాలు, హిందూ, ముస్లిం, సిక్కు మత మూసలలో చిక్కుకొన్నాయి. యుద్ధ కాల సైనిక నియామకాలు, పెరుగుతున్న ధాన్యం ధరలతో రైతులు సంపన్న రైతులయ్యారు. వాయువ్య సరిహద్దు రాష్ట్రంలోని కాంగ్రెస్ క్రమంగా ముస్లింల మద్దతు కోల్పోతూ వచ్చింది. ముస్లింలు 1942 నుండి ఉద్యమానికి దూరంగా వుంటూ వచ్చారు. వారు బ్రిటిషు వారికి  అనుకూలంగా గాక, ప్రతికూలంగా గాక తటస్థంగా వున్నారు. ఉద్యమ కాలంలో పెద్ద మత ఘర్షణలు జరగలేదు. కోస్తా ఆంధ్రలోని గుంటూరు, పశ్చిమగోదావరి అలాగే తమిళనాడులోని కోయంబత్తూరు రామ్నాడ్ లాంటి కొన్ని స్థావరాలలో మినహాయించి మద్రాసు ప్రెసిడెన్సీలో ఉద్యమం బలహీనంగా వుంది. తమిళనాడులో బలహీనపడడానికి రాజాజీ వ్యతిరేకత కారణం కావచ్చు. కమ్యూనిస్టుల ప్రతికూలత కారణంగానే కేరళలో ఉద్యమం బలహీనపడి వుండవచ్చు. రహస్య జీవితం గడుపుతున్న కాంగ్రెస్ సోషలిస్టు నాయకులు విజ్ఞప్తులు చేసినప్పటికి స్వదేశీ సంస్థానాలలో ఉద్యమం 1938-39 నాటి కంటె చాలా తక్కువ స్థాయిలో వుండిపోయింది.

పెద్ద సంస్థానాలలో - ముఖ్యంగా మైసూరులో ఉద్యమ ప్రభావం బాగా వుంది. అఖిల భారత స్థాయిలో వలెనే యిక్కడ ఉద్యమం మూడు దశలుగా సాగింది. బెంగుళూరులో ప్రదర్శనలు సమ్మెలు గ్రామ ఉద్యమాలు ప్రత్యేకించి హసాన్‌షిమోగా జిల్లాలల్లో రహస్య విద్యార్థి గ్రూపుల విధ్వంస కార్యకలాపాలు.

బీహారు, తూర్పు యుపి, మిడ్నపూర్, ఒరిస్సా, మహారాష్ట్ర, కర్నాటక - నాలుగు ప్రధాన కేంద్రాలలో ఉద్యమం తిరుగుబాటు స్వభావం దాల్చింది. 1930లలో కిసాన్‌సభకి ప్రధాన స్థావరంగా వున్నప్పటికి, యుద్ధ అనుకూల వైఖరి తీసుకొన్న కమ్యూనిస్టులు, సహజానందల వైపు అత్యధిక కిసాన్‌సభ శ్రేణులు మొగ్గినప్పటికి బీహారులో ఉద్యమం యొక్క

విస్తృతి తీవ్రత ఎక్కువగానే వున్నాయి పాట్నా కొంతకాలం పాటు అన్ని జిల్లాల నుండి వేరు చేయబడింది. ఉత్తర మధ్య బీహారులోని దాదాపు 80 శాతం ఆక్రమించుకోబడ్డాయి. లేక దాదాపు ఖాళీ చేయించబడ్డాయి. తెగల ప్రజల భాగస్వామ్యం గణనీయంగా వుంది. కాంగ్రెస్ సమాచారం మేరకు కాల్పులలో చంపబడినవారు హజారాబాగ్ జిల్లాలో అత్యధికం (1761కి గాను 533 ఆ తరువాత సరన్ -517 భగత్‌పూర్ 447, గోవింద సహాయ పేజీ 135) భోజ్‌పురిమాట్లా పశ్చిమబీహారు నుండి ఉద్యమం ఆర్థికంగా సాంస్కృతికంగా అలాంటి పరిస్థితులు వున్న యుపిలోని బనారస్ డివిజన్‌కి విస్తరించింది. బలియాలో వున్న 10 పోలీసుస్టేషన్లు ఆక్రమించుకోబడ్డాయి. బలియాలో (స్థానిక కాంగ్రెస్ నాయకుడు చిటూపాండే ఆధ్వర్యంలో) పొరుగున వున్న ఘజ్నీపూర్‌లో తాత్కాలిక జాతీయ ప్రభుత్వాలు స్థాపించబడ్డాయి. ఆగష్టు 15-17 లలో అజాంఘర్‌లోని మధుబన్ పోలీసుస్టేషన్ ముట్టడిని నిబ్లిట్ ఆసక్తికరంగా వర్ణించారు -'లాటీలు, బల్లాలతో పోలీసుస్టేషన్ వైపు నడుస్తున్న 5000 మంది యింకా వారిచేతుల్లో నాగటికర్రులు, రంపాలు, పారలు...దూరం నుండి చూస్తుంటే వారి లాటీలు బల్లాలు కదులుతున్న అడవిలా వుంది' (నిబ్లెట్ పేజి 13-18) తూర్పు యు.పి, బీహారులలోకి 16 జిల్లాలలో సాధారణ పరిస్థితులు నెలకొల్పడానికి పెద్ద ఎత్తున దించబడిన పోలీసులు సైన్యానికి చాలావారాలు పట్టింది. చెదురు మదురుగా గొరిల్లా ప్రతిఘటనలు 1944 వరకు కొనసాగాయి. జయప్రకాష్ నారాయణ, రాం మనోహర్ లోహియాల ఆధ్వర్యంలో ఏర్పడిన నేపాల్ సరిహద్దులు గల తాత్కాలిక ప్రభుత్వానికి ఆ ప్రాంతంలో ఏర్పడిన స్థానిక ప్రభుత్వాలకు సంబంధాలు వున్నాయి.

మిడ్నాపూర్‌కి సరిహద్దుగా గల ఒరిస్సాలోని బాలసోర్ జిల్లాలో కాంగ్రెస్ ఉప్పుకొట్లపై దాడి చేసింది. సమాచార సాధనాల్ని ధ్వంసం చేసింది. సెప్టెంబరు 28న ఇరాం వాసుదేవపూర్ పోలీసుస్టేషన్‌పై చేసిన దాడిలో 35 మంది హతులయ్యారు. గురుపాల్ ప్రాంతంలో జాతీయ ప్రభుత్వం కొంతకాలం పాటు పనిచేసింది. 'వారం రోజులలో స్వరాజ్యం వస్తుందని వదంతులు వ్యాపించాయి... స్వరాజ్య ప్రభుత్వంలో పన్నులు చెల్లించనవసరం లేదు. సంపన్నుల బియ్యం పేదలకు అందుబాటులో వుంటాయి' - ఈ రాం వాసుదేవపూర్ కాల్పులపై వెలువడిన అనధికార విచారణ కమిటీ రిపోర్టు పేర్కొన్నది. కటక్ మరొక అలజడి కేంద్రం. ఇక్కడ 'రక్తవాహిని' అనే సంస్థ టెర్రరిస్టు చర్య చేపట్టింది. పెద్ద సంఖ్యలో తెగల ప్రజలు గల కోరిపుట్ ప్రాంతంలో ప్రజలు తిరుగుబాటు చేశారు. జయపూర్ జమీందారీకి వ్యతిరేకంగా కౌలు చెల్లింపు నిరాకరణ చేపట్టారు. రిజర్వుడు ఫారెస్టులపై పోలీసు ఠాణాలపై దాడులు చేశారు. నిరక్షరాస్యుడైన ఒక గ్రామస్థుడు లక్ష్మణ్ నాయక్ నాయకత్వం వహించాడు. ఒక ఫారెస్టు గార్డుని హత్య చేశాడనే నెపంతో నాయక్‌కి ఉరిశిక్ష విధించబడింది. (పాల్. మహతాబ్, ఒరిస్సాలో స్వతంత్ర ఉద్యమం వాల్యూం ।ఐ కటక్ 1957-59 పేజీలు 88-94,68) తాల్చేర్ సంస్థానంలో గొరిల్లా చర్యలు 1943 మే వరకు కొనసాగాయి. రైతు కార్మిక రాజ్యం 400 చ. మైళ్ల ప్రాంతాన్ని తన అధీనంలో వుంచుకొనగలిగింది. 1942 సెప్టెంబరు 7న తాల్చేర్ పట్టణంపై దాడి చేసింది. విమానాల సాయంతో దాడి తిప్పకొట్టబడింది. 1938 సెప్టెంబరులో వెట్టిచాకిరికి అటవీ చట్టాలకు నియంతృత్వపాలనకు వ్యతిరేకంగా పోరాటాలు చేసిన తాల్చేర్‌లో ప్రజల తక్షణ తిరుగుబాటుకి కారణం సంస్థాన ప్రజామండల్ అధ్యక్షుడు పవిత్రమోహన్ ప్రధాన్ హత్య

చేయబడ్డాడని వదంతి వ్యాపించడం (గోవింద సహాయ పేజి 420–22, అఖిల భారత సంస్థానాల ప్రజా సదస్సు పత్రాలు, ఫైల్ నెంబరు 164)

పట్టణాలలో వచ్చిన తిరుగుబాటు అణచివేయబడిన తరువాత బొంబాయి ప్రెసిడెన్సీలోని ఉద్యమం రెండు భిన్న రూపాలలో ముందుకు వచ్చింది. కొద్ది స్థావరాలలో రైతాంగ గొరిల్లా యుద్ధరూపం, ప్రధానంగా విద్యావంతులచే చేపట్టిన ప్రజాదరణ పొందిన టెర్రరిస్టు కార్యకలాపాలు రైతాంగ తిరుగుబాటు ప్రధాన కేంద్రాలు మహారాష్ట్రలో తూర్పు ఖాందేష్, సతారా, గుజరాతులోని బ్రోచ్ జిల్లాకి చెందిన జంబుసర్ సతారా జంబుసర్ ఉద్యమాలను గురించి కాంగ్రెస్ చరిత్రకారుడు గోవింద సహాయ్ యిలా వ్యాఖ్యానించారు. సతారాలో నానాపాటిల్ నాయకత్వంలో గల తిరుగుబాటుని జిల్లాలో గల నేరస్థులు అవకాశంగా తీసుకొన్నారు. జంబూసర్‌లో స్థానిక బందిపోటు మెగ్జీ యితర బందిపోటు దొంగలు జంబుసర్ ఉద్యమానికి సహాయం చేస్తూ మూడు నెలలపాటు మనగలిగిన విముక్తి ప్రాంతాన్ని స్థాపించారు. (సహాయపేజీలు 118, 133). సతారా ప్రతి సర్కార్‌లో భాగస్వామ్యం వహించిన వారితో ఇంటర్వ్యూలు జరిపి రూపొందించిన గెయిల్ ఆమ్‌వెట్ యొక్క యిటీవలి సవివరమైన అధ్యయనం చాలా ఆసక్తికరమైన అంశాల్ని వెల్లడిస్తున్నది. బ్రాహ్మణేతర బహుజన సమాజ సాంప్రదాయం గల సతారా ఉద్యమం ఈ ప్రాంతంలో చాలా బలీయమైనది. 1945 సం॥ మధ్యలో సమానాంతర ప్రభుత్వం అభివృద్ధి చెంది 1945 –46 వరకు కొనసాగింది. గొరిల్లా యుద్ధం కొనసాగించడంతో పాటు ప్రజాకోర్టులను నిర్వహించింది. గాంధేయ పద్ధతిలో నిర్మాణాత్మక కార్యక్రమాలు చేపట్టింది. కొన్ని సందర్భాలలో తాకట్టు పెట్టబడిన పొలాలు పేద రైతులకు తిరిగి యిప్పించడం జరిగింది. మహిళలపై అత్యాచారాలు చేసిన గ్రామపెత్తందారులు శిక్షింపబడ్డారు. 'ఆస్తి సంబంధాల జోలికి మేం పోలేదు' – ఉద్యమంలో పాల్గొన్నవారు చెప్పారు. ఇతర సందర్భాలలో లాగానే 1942లో జాతీయవాద సమరశీలత సమూలమైన మార్పుల్ని అడ్డుకొన్నది. సంపన్నుల అవసరాన్ని పరిరక్షించడానికి ప్రతిసర్కార్ స్థానిక బందిపోట్లపై కఠినచర్యలు చేపట్టింది. బొంబాయి నుండి అరుణ అసఫాలి లాంటి నాయకుల సారథ్యంలో సోషలిస్టుల టెర్రరిస్టు అజ్ఞాతవాస కార్యక్రమాలు నిర్వహించారు. కర్నాటకలో టెలిగ్రాపులైన్లపై 1600, రైల్వేస్టేషన్లపై 26, పోస్టాఫీసులపై 32 దాడులు జరిగాయి. కాని 'ఈసారి పన్ను వ్యతిరేక ప్రచారం జరగలేదు'. (గోవింద సహాయ్ పేజీ 96)

ఖేదా బార్డోలిలో కూడా శిస్తు పన్నుల చెల్లింపు నిరాకరణ ప్రసక్తి లేదు. కాని సంపన్న పటేదార్ల కుటుంబాలకు చెందిన యువకులు టెర్రరిస్టు కార్యక్రమాలు చేపట్టారు. తూర్పు ఆఫ్రికాలో వలస వున్నవారి నుండి వచ్చిపడిన ఆదాయం, పొగాకు పంట అభివృద్ధి, యుద్ధకారణంగా వ్యవసాయ ఉత్పత్తుల ధరలలో విపరీతమైన పెరుగుదల – ఫలితంగా 1928 తరువాత శిస్తులు పన్నులు పెంచబడలేదు. (కాంగ్రెస్ –రాజ్యం పేజి 70) పంజాబు, పశ్చిమ యు.పి, గుజరాతు, తమిళనాడులోని తంజావూరు డెల్టాలాంటి వ్యవసాయాభివృద్ధి సాధించిన

ప్రాంతాలలోని సంపన్న రైతులు 1942 ఉద్యమానికి దూరంగా వుండిపోయారు. వ్యవసాయ ఉత్పత్తులు స్థిరంగా వుండడంగాని తగ్గడం గాని జరిగిన తూర్పు భారతదేశంలో రైతాంగ తిరుగుబాట్లు జరిగాయి.

**తిరుగుబాటు తరువాత**

1942 సంవత్సరాంతానికి బ్రిటిషువారు భారత జాతీయవాద ప్రతిఘటన నెదుర్కొని విజయం సాధించారు. యుద్ధం జరిగిన మిగిలిన రెండురన్నర సంవత్సరాలు దేశం లోపలనుండి ఎలాంటి తీవ్రమైన రాజకీయ సవాలు లేకుండానే గడిచిపోయాయి. అయినప్పటికి సాధించిన విజయం అస్పష్టమైనది, చాలా పరిమితులతో కూడుకున్నది. అది కూడా యుద్ధ పరిస్థితులు విచక్షణారహితమైన బలప్రయోగాన్ని అనుమతించాయి. గనుక సాధ్యపడింది. బ్రిటిషువారు మరలా అలాంటి ప్రతిఘటనకు సిద్ధంగా లేరు. చర్చలతో పరిష్కారాన్ని సాధించాలని 1945లో తీసుకొన్న నిర్ణయం కొత్తగా అధికారానికి వచ్చిన లేబరు ప్రభుత్వం యిచ్చిన బహుమతి కాదు. యుద్ధం తరువాత ప్రపంచాభిప్రాయాన్ని బ్రిటిషు ప్రజల అభిప్రాయాన్ని సైనికుల వైఖరిని గమనంలో పెట్టుకొని బలంతో భారతదేశాన్ని అణచిపెట్టి వుంచడం సాధ్యం కాదని 1944 అక్టోబరు 24న వేవల్ చర్చిల్‌కి రాసిన లేఖలో ప్రస్తావించాడు. యుద్ధం ముగియక ముందే చర్చలు ప్రారంభించడం మంచిది. యుద్ధానంతర పరిస్థితులు ప్రబలమయ్యే నిరుద్యోగం ఆందోళనలకు సారవంతమైన క్షేత్రాన్ని ఏర్పాటు చేస్తాయి. మనం వారి (కాంగ్రెస్) శక్తి యుక్తుల్ని భారతదేశ పరిపాలనా వ్యవహారాల వైపు మరల్చాలి (వేవల్, ది వైస్రాయ్ జర్నల్, ఆక్స్‌ఫర్డ్ 1573 పేజి 97-98). చర్చిల్ మొండివైఖరి ఈ క్రమాన్ని కొంత వెనక్కి నెట్టింది. 1945 తరువాత బ్రిటిషువారు కాంగ్రెస్ నాయకత్వాన్ని యిలానే అనునయించగలిగారు.

కాంగ్రెస్ నాయకుల దృష్టికోణం నుండి చూస్తే జైలుశిక్ష, పరాజయం కొన్ని లాభాల్ని తెచ్చిపెట్టింది. 1944 లో సుభాష్‌బోస్ యొక్క భారత జాతీయ సైన్యం అస్సాం సరిహద్దుల్లో వున్న సమయంలో, ప్రపంచస్థాయిలో మిత్రరాజ్యాలు స్పష్టమైన విజయాలు సాధిస్తున్న సమయంలో జపాన్ యుద్ధానికి అనుకూలంగా గాని వ్యతిరేకంగాని వారి వైఖరిని చెప్పవలసిన అవసరం లేకుండా పోయింది. అంతేగాక సమకాలీన చరిత్ర రచనపై 1946లో డి.డి.కోశాంబి ప్రస్తావించినట్లు అధికారంలో వుండగా కాంగ్రెస్ మంత్రివర్గాల యొక్క అంతంత మాత్రం పనితీరు వలన అంటిన మలినాన్ని జైలు నిర్బంధ జీవితాలు తుడిచివేశాయి. సంస్థకు పూర్తి ప్రజాదరణ లభించింది. 1930 దశాబ్దం చివరి సంవత్సరాలలో బ్రిటిషువారికి యింకా సహకరించాలని కోరుతూ మంత్రులుగా కులీన ధోరణులు అవలంబించిన మంత్రులు, 1942 లో నిజమైన పోరాటాలు చేసిన సోషలిస్టుల లాగానే దేశభక్తియుత ఆత్మత్యాగం ముసుగు ధరించి ముందుకు వచ్చారు' ఇక మితవాదులు సోషలిస్టులు కలిసి కమ్యూనిష్టులపై 'బ్రిటిషువారి మిత్రులు', 'దేశ ద్రోహులు' అనే ముద్రలు వేసి విస్తృతమైన ప్రజాభిప్రాయాన్ని వారికనుకూలంగా మలుచుకోగలిగారు.

క్విట్ ఇండియా అనుభవంతో చర్చల ద్వారా అధికారాన్ని బదిలీచేయాలని బ్రిటిషువారు గుర్తించడం అనేది – జాతీయవాద పక్షం నుండి రాజీకి ప్రాధాన్యత నిచ్చే శక్తులకు బలాన్ని చేకూర్చింది. ఆ విధంగా మితవాద కాంగ్రెస్ (Right congress) కి కొత్త ప్రతిష్టని తెచ్చిపెట్టింది.

వామపక్ష ప్రత్యామ్నాయం బలహీనపరచబడింది. 1942లో బ్రిటిషువారికి వున్న మిలిటరీ వనరుల్ని ఎదుర్కొని విజయం సాధించడం సాధ్యపడదు. కిసాన్‌సభ కార్యకలాపాల ద్వారా నిర్మించుకొన్న రైతాంగ స్థావరాలు దారుణమైన అణచివేతతో సొమ్మసిల్లి పోయాయి. 1945 –46 సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో బీహారు, తూర్పు యు.పి, మహారాష్ట్ర, కర్నాటక, ఒరిస్సా గ్రామీణ ప్రాంతాలు – ఎలాంటి పాత్ర నిర్వహించకపోవడం గమనార్హం. యుద్ధానంతర, స్వతంత్రానంతర సంవత్సరాలలో బెంగాల్ కాంగ్రెస్ రాజకీయాలలో మిడ్నాపూర్ హుగ్లీలకు చెందిన గ్రామీణ గాంధేయవాదుల ప్రక్కకు నెట్టివేయబడ్డారు. 1942 జ్ఞాపకాలు ఆరోపణలు, ప్రత్యారోపణలు – ఒకవైపు సోషలిస్టులకు బోస్ అనుచరులకు మధ్య మరొకవైపు కమ్యూనిష్టులకు మధ్య అడ్డుగోడల్ని లేపాయి.

## యుద్ధం భారతదేశ ఆర్థిక వ్యవస్థ

### కరువు, అమిత లాభాలు

యుద్ధం తాలూకూ ఆర్థిక ప్రభావం, 1945 –47 సంవత్సరాలలో మొత్తం సమాజంలో తీవ్రమైన అసంతృప్తి, అందుకు ప్రతిస్పందనగా, అరుదుగానే అయినా చెదురుగా విప్లవ తరహా అలజడులు, సంఘటనలు చోటు చేసుకున్నప్పటికీ మొత్తంగా చూసినట్లయితే, అది ప్రజాశక్తుల్ని నీరసింపజేసింది. భారతదేశం యుద్ధం తాలూకూ మిలటరీ విధ్వంసానికి గురికనప్పటికీ, (1944 కోహిమా – ఇంఫాల్ సరిహద్దు ప్రాంతం, అరుదుగా వైమానిక దాడుల్ని మినహాయిస్తే.) యుద్ధమంటేనే తీవ్రస్థాయి ద్రవ్యోల్బణం. (1939లో 2300 మిలియన్ల రూపాయలు చలామణిలో ఉండగా, 1945 నాటికి అది 12,100 మిలియన్ల రూపాయల మొత్తానికి చేరింది) విపరీతమైన అవినీతి, వస్తువుల కొరత, బ్లాక్ మార్కెట్ ధరలు కాగా అన్నిటినీ మించి, కరువు తాకిడి వలన ప్రజానీకం విపరీతమైన దురవస్థలపాలైంది. ఆహార సంక్షోభానికి బర్మా, ఆగ్నేయాసియాల నుండి బియ్యం దిగుమతుల సరఫరా నిలిచిపోవటం, విపరీతంగా పెరిగిపోయిన సైన్యావసరాలే ప్రధాన కారణమైనప్పటికీ, అసమర్థ యజమాన్యం, భారీస్థాయిలో ఉద్దేశ్యపూర్వక అవినీతి, అది తీవ్రరూపం దాల్చటానికి దోహదపడ్డాయి. నియంత్రిత వస్తువుల సరఫరా (రేషనింగ్) బాగా ఆలస్యం కావటం మాత్రమే కాకుండా కేవలం కొన్ని నగరాలకే పరిమితమైంది. ఇదే విషయాన్ని వైస్రాయ్ వేవెల్ – 'యూరప్ కరువుకి గురైనప్పుడు, అక్కడి ప్రజానీకాన్ని ఆదుకున్న వైఖరికి, అందుకు భిన్నంగా భారతదేశ ఆహార సమస్యలపట్ల ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య ధోరణికి వ్యతిరేకంగా తన బాధని, అసహనాన్ని బ్రిటన్ ప్రభుత్వంతో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలలో చాలా స్పష్టంగా పేర్కొన్నాడు. (1945 వ సంవత్సరంలో తొలి రోజులలో హాలెండ్‌కి పంపిన

ఆహార సరఫరాల్ని ప్రస్తావిస్తూ, Viceroy's journal,9, ఏప్రిల్ 1945, పేజి 123. 1943 వ సంవత్సరం, ఘోరమైన వేసవి, శరత్కాలంలో లక్షలమంది ప్రజానీకం అన్నం సంగతిదేవుడెరుగు కనీసం గుక్కెడు నీటికోసం, కలకత్తాకి దారికట్టి, ఆ మార్గంలో అసువులు బాయటం జరిగింది. ఒకటిన్నర నుండి మూడు మిలియన్ల వరకూ ప్రజానీకం ప్రధానంగా మానవ కల్పిత కరువుకి బలికావటం జరిగింది. పస్తులు, పోషకాహార లోపం వలన కలరా, మలేరియా, మశూచి లాంటి అంటువ్యాధులు ప్రబలి, 1943 తరువాత సంవత్సరాలలో వార్షిక మరణాల రేటు అసాధారణ స్థాయికి పెరగటం జరిగింది. ప్రత్యక్ష బ్రిటిష్ పరిపాలన 1770లో సంభవించిన కరువుతోనే మొదలై ప్రస్తుతానికి అది ఒక ఘూర విపత్తు స్థాయికి చేరింది. నైరుతి బెంగాల్‌లోని తామ్లుక్ –కాంటై, డైమండ్ ఓడరేవు ప్రాంతం, ఢాకా, ఫరీద్‌పూర్, తిప్పర, నోఖాలి జిల్లాలో కరువుకి బాగా దెబ్బతిన్నాయి. 1943 లో 6,00,000 మంది సన్నకారు రైతులు, తమ భూములు కోల్పోగా పశు సంపద ఆ ఒక్క సంవత్సరంలోనే 20 శాతం తగ్గటంతో, బెంగాల్ సన్నకారు రైతు ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయింది. పరిస్థితులకి తగ్గట్టుగానే బాధితులలో వ్యవసాయ కూలీల పరిస్థితి మరీ అధ్వాన్నం. ఫరీద్‌పూర్ ప్రాంతంలోని ఐదు గ్రామాలలో సాధారణంగా రికార్డు అయిన మరణాలరేటు 15.2% శాతం మేరకి ఉండగా, 1944 లో జరిపిన సర్వేలో, అది 40.3% శాతంగా నమోదై, జనాభాలో దాదాపుగా సగం మంది తుడిచిపెట్టుకుపోయారంటే, పరిస్థితి ఎంత దుర్గతి దారుణంగా ఎందో గుర్తించవచ్చు. (A.k. Sen, Famine Mortality, A study of the Bengal Famine of 1943, In Hobsbawn et. peasants in History)

యుద్ధం, కరువంటేనే కొంతమందికి భారీలాభాలు చేకూరతాయి కాబట్టి, కరువంటేనే కొంతమందికి భారీలాభాలు చేకూరతాయి కాబట్టి, 1914 –18 సంవత్సరాల కాలంలో, భారత బూర్జువా వర్గం ఒక పెద్ద ముందడుగు వేసింది. చాలా కాలం వరకు భారతదేశాన్నుండి అత్యధిక దిగుమతులు చేసుకునే దేశాలలో బ్రిటన్ ఉండగా, 1944 –45 నాటికి, అమెరికా ఆ స్థానాన్ని ఆక్రమించటంతో, భారత్ – బ్రిటన్ ఆర్థిక సంబంధాలలో కూడా పరిగణించదగ్గ మార్పులు చోటు చేసుకోవటం మొదలై ఇదే సందర్భంలో, బ్రిటన్ యుద్ధావసరాలకిగాను, ఆదేశం నుండి చేసుకున్న దిగుమతులకి చేయాల్సిన చెల్లింపులకి బదులుగా, భారతదేశ స్టెర్లింగ్ అప్పుల్ని బ్రిటన్ కొనుగోలు చేయటం ద్వారా వాటిని రద్దు చేసింది. 1945 నాటికి, ఇండియా 1000 మిలియన్ పౌండ్ల స్టర్లింగ్‌ల వ్యాపార మిగులుని కలి ఉన్నప్పటికీ, ఇది మొత్తం కూడా యుద్ధావసరాలకి గాను భారతదేశ భౌతికవనరుల బదలాయింపు ద్వారా చేకూరి, కేవలం ప్రామిసరీ నోటుల రూపంలో ఉన్నప్పటికీ, ఈ అవకాశమే, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, స్వతంత్రభారతదేశ విదేశీ మారకద్రవ్య నిల్వలు పెరగటానికి ప్రధానకారణమైంది. ఈ పరిణామం వలన, ఇప్పటివరకూ భారత్ నుండి బ్రిటన్‌కి జరుగుతున్న 'సంపద తరలింపు' (drain of wealth) హోమ్ ఛార్జీలు అనే సాంప్రదాయక పద్దు రద్దయింది. ఇదే వరుసలో మరో పరిణామం – మొదటి నుండే స్వాతంత్ర్యం వచ్చేవరకూ, బ్రిటన్ భారత్‌లోని దేశీయ, ఆటోమొబైల్, నౌకాయానం, వైమానిక రంగ అభివృద్ధిని అడ్డుకున్నప్పటికీ, యుద్ధావసరాల డిమాండ్, దిగుమతి

– ప్రత్యామ్నాయాల కోసం తప్పనిసరి ప్రయత్నాలు. జౌళి, ఇనుము, ఉక్కు రసాయనిక పరిశ్రమల పురోగమనానికి, కొంతమేరకి ఇంజనీరింగ్, రసాయనిక పరిశ్రమలలో ప్రవేశానికి అవకాశం కల్పించాయి. పారిశ్రామిక పెరుగుదల దాదాపు నెమ్మదిగా... అంటే 1937 వ సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుంటే, 1945 నాటి స్థూల ఉత్పత్తి పెరుగుదల కేవలం 120 స్థాయికి మాత్రమే పెరిగింది. (అయితే ఉక్కు 142.9, రసాయనాలు 134.1, సిమెంట్ 196.5 స్థాయిలకి పెరిగాయి. (Wadia and Merchant p. 360)

వాస్తవానికి, అద్భుతమైన ఈ పెరుగుదల, ఉత్పత్తిలో కాకుండా, ఆహార పదార్థాల వ్యాపారం, షేర్‌మార్కెట్ లావాదేవీలు, బ్లాక్‌మార్కెట్ మరీ ముఖ్యంగా జూద స్వభావం గల సట్టా వ్యాపారాల ద్వారా లభించిన లాభాల వలన జరిగిందన్న విషయాన్ని గుర్తించుకోవాలి. భారతీయ బూర్జువాలు, ప్రత్యేక తరహా బూర్జువాలు. చొరవ లేదా సమర్ధత ద్వారా ఉత్పత్తి పెంచకుండా, కేవలం, ఘోరమైన దురాశ, సట్టా వ్యాపారం ద్వారా పిచ్చి లాభాలు సంపాదించడం ప్రధాన లక్షణంగా గోచరిస్తుంది. (కోశాంబి, పే.14). సాంకేతిక వెనుకబాటుతనం. ఇతర దేశ సహకారం కోసం ఎదురు చూసేటట్లు చేసింది కాని, మారిన ఆర్థిక రాజకీయ పరిస్థితులు దేశానికి అదనపు అనుకూలతల్ని తెచ్చిపెట్టి ఇతర దేశాలతో సహకారానికి సంబంధించిన చర్చల్ని ఇంతకు మునుపటిలా కాకుండా, తక్కువ అసమానతల ప్రాతిపదికపై కొనసాగేటట్లు చేయటం జరిగింది. 1945 వేసవికాలంలో, బిర్లా, టాటాల నాయకత్వంలో వ్యాపార బృందాలు బ్రిటన్‌కి బయలుదేరి, అదే సంవత్సరం బిర్లా, నుఫీల్డ్ (హిందుస్తాన్ మోటార్స్ స్థాపన) మధ్య, టాటా ఇంపీరియల్ కెమికల్స్ మధ్య సహకార సంబంధాల్ని విజయవంతం చేసాయి. ఇదే సమయంలో, బూర్జువా నాయకులు వివిధ ప్రత్యేక రకాల ప్రభుత్వ జోక్యం పట్ల, ప్రభుత్వ అతి నియంత్రణలు లేదా నిర్లక్ష్యం పట్ల అభ్యంతరాలు వ్యక్తం చేస్తూనే, అదే సందర్భంలో, ప్రారంభ దశలో చాలా తక్కువ లాభాలు వచ్చే, విద్యుచ్ఛక్తి, నీటిపారుదల ప్రాజెక్టులు లాంటి భారీ పరిశ్రమల్లో ప్రభుత్వ పెట్టుబడుల్ని ఆహ్వానించడమో లేదా ఇంకా చెప్పాలంటే, దాన్ని అర్ధించటమో జరుగుతూ వచ్చింది. మౌలిక పరిశ్రమల్ని అభివృద్ధి చేయటం ద్వారా, జాతీయ తలసరి ఆదాయం పదిహేను సంవత్సరాలలో రెట్టింపు అవుతుందని భారతదేశ ప్రముఖ పారిశ్రామికవేత్తలు (జె.ఆర్.డిటాటా, జి.డి. బిర్లా, ఠాకూర్‌దాస్, శ్రీరామ్ కస్తూరిభాయి లాల్‌భాయి) తాము రూపొందించిన 'బోంబేప్లాన్' జనవరి 1944లో వివరించటం జరిగింది. ఈ ప్రణాళిక కేవలం లక్ష్యాల ప్రకటన మాత్రమే ప్రభుత్వ నియంత్రణ స్థాయి అనే వివరణ కంటే కొంచెం మిన్నగా ఉండి అభివృద్ధి ప్రయోజనాల దృష్ట్యా స్వేచ్ఛా వాణిజ్య ప్రతిపాదనకి 'తాత్కాలిక విరమణ' చెప్పటంతో బాటు, ఆశ్చర్యకరంగా, 'రష్యన్ ప్రయోగం' గురించి కూడా అనుకూలంగా పలుమార్లు ప్రస్తావించటం జరిగింది. తిరిగి కొశాంబి సమకాలీన విమర్శని ఉదహరించినట్లయితే, గతంలో ప్రజా ఉద్యమాలు చోటు చేసుకున్న సందర్భాలలో, మహాత్ముని ప్రబోధాలలో తమకి అనుకూలమైన ప్రయోజనాలు చేకూర్చే వాటి గురించి గొప్పగానూ, ప్రమాదకరమైన, ఇతర అంశాల్ని వ్యతిరేకాత్మక, తాత్విక అంశాలుగా పేర్కొని తమ తెలివితేటల్ని సమర్థవంతంగా ప్రదర్శించినట్లుగానే, ప్రస్తుతం బూర్జువా వర్గానికి 'నెహ్రూ నాయకత్వం' అవసరమైందని తెలుస్తూ ఉంది. (కొశాంబి, పే.18)

విశాల ప్రజానీకం గతంలో అంతులేని బాధలకి గురియైనప్పుడు వారిపట్ల కనీస మాత్రం ఉదారంగా వ్యవహరించకుండానూ, తిరిగి ప్రజా ఉద్యమం మొదలై అది అదుపు చేయలేని తీవ్రమైన పర్యవసానాలకి దారితీసి తమ ప్రయోజనాలకి నష్టం వాటిల్లగలదని అందుకు సహజంగా విముఖత ప్రదర్శించిన బూర్జువావర్గం, 1945 తరువాత చోటు చేసుకున్న దౌత్యపరమైన రాజీ ఒప్పందంపై తన బలవత్తర ప్రభావాన్ని చూపగలిగింది. ఏమైనప్పటికే, భారతదేశ విషయంలో, దౌత్యపరమైన అధికార బదిలీ, విభజన శక్తులకి ప్రోత్సాహమిచ్చి, అందుకు పరాకాష్ఠగా దేశ విభజనకి దారితీయటం జరిగిందని, 1945–47 సంఘటనలు, కడు విషాదాత్మకంగా నిరూపించాయి.

### లీగు పురోగతి

యుద్ధం ముగియబోతున్న సంవత్సరాలలో కాంగ్రెస్ అణచివేతని అవకాశంగా తీసుకొని లీగు త్వరత్వరగా పురోగమించింది. 1943 నాటికి లీగు మంత్రివర్గాలు అస్సాంలో (1942 ఆగస్టు) సింధు (1942 అక్టోబరు) బెంగాలు (1943 మార్చి) వాయువ్య సరిహద్దు ప్రావిన్సు (1943 మే) స్థాపించబడ్డాయి. లీగు కేంద్ర నాయకత్వం ప్రావిన్సు యూనిట్లపై గట్టి గుట్టు సాధించింది. వలంటరీ దళాల్ని (నేషనల్ గార్డ్స్) ఏర్పాటు చేసింది. జిన్నా ముస్లింల ఏకైక ప్రతినిధిగా గాంధీ నాయకత్వంలోని హిందూ కాంగ్రెస్‌తో సమానస్థాయిలో చర్చలు జరిపే స్థితికి ఎదిగాడు. ఈ పురోగతిలో బ్రిటిషు వారి పాత్ర వుంది. కాంగ్రెస్ యం.యల్.ఎలు నిర్బంధింపబడడం వలన అస్సాంలో సాదుల్లా మంత్రివర్గం, వాయువ్య సరిహద్దు ప్రావిన్సులో ఔరంగజేబ్‌ఖాన్ మంత్రి వర్గం ఏర్పాటు సాధ్యపడ్డాయి.

కాంగ్రెస్ అనుకూలుడైనా సింధు ముస్లిం ప్రీమియర్ ప్రభుత్వం యిచ్చిన బిరుదుల్ని త్యజించినందుకు గవర్నరుచే తొలగించబడ్డాడు. బెంగాలులో యూరోపియన్ యం.యల్.ఎలు నజీముద్దీన్ మంత్రివర్గానికి అండగా నిలిచారు. రెండు పెద్ద ముస్లిం మెజారిటీ ప్రావిన్సులు జిన్నాకి యిబ్బంది కలిగించాయి. కాని 1943 మార్చిలో లీగు కేంద్ర నాయకత్వం ఫజుల్‌హక్ (జిన్నాని తీవ్రంగా విమర్శించి 1941 డిసెంబరులో, హిందూ మహాసభ నాయకుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీతో సంకీర్ణాన్ని ఏర్పాటు చేశారు) ని అఖిల భారత స్థాయిలో సంబంధాలు గల కలకత్తా ముస్లిం వ్యాపారి ఇస్పహానిస్ ఆర్థిక సహకారంతో తొలగించింది. బెంగాల్ ముస్లిం రాజకీయవేత్తల్ని అఖిలభారత ముస్లింలీగు బాటలో నడిపించడానికి చేపట్టిన క్రమం గతంలో కాంగ్రెస్ అధిష్టాన వర్గం బిర్లాలాంటి మార్వాడీల సన్నిహిత సంబంధాలతో బోస్‌ని కాంగ్రెస్ నుండి గెంటివేసిన క్రమంలాంటిదే. 1942 డిసెంబర్‌లో సికందర్ హయాత్‌ఖాన్ మరణం జిన్నా పంజాబులో ప్రవేశించడానికి సహకరించింది. సికందర్ వారసుడు ఖిజర్ హయాత్‌ఖాన్ బలహీనుడైనప్పటికి 1945లో ముస్లిం – జాట్ యూనియనిస్టు సంకీర్ణాన్ని విచ్ఛిన్నం చేసేందుకు లీగు చేసిన ప్రయత్నాల్ని ప్రతిఘటించారు.

బ్రిటిష్‌వారి ప్రోత్సాహం, అసెంబ్లీ ఎత్తుగడలు మాత్రమే గాక ముస్లిం లీగు పురోగమించడానికి యితర కారణాలు వున్నాయి. పలు కారణాల రీత్యా పాకిస్తాన్ నినాదం

భారతీయ ముస్లింలలోని పలు సెక్షన్లను ఆకట్టుకొన్నది. బెంగాల్, పంజాబ్ ముస్లిం రైతులకు పాకిస్తాన్ అంటే హిందూ జమిందారుల నుండి వడ్డీ వ్యాపారులనుండి విముక్తి కల్పించడంగా ప్రచారం చేయబడింది. బెంగాల్ ముస్లిం లీగు సెక్రటరీ అబుల్ హసీం కౌలు రైతులకు చాలా ప్రయోజనాలు కల్పిస్తామని 1943 నవంబర్ నుండి ప్రచారం చేశాడు. పాకిస్తాన్ సువ్యవస్థితమైన హిందూ వ్యాపార గ్రూపుల్ని అడ్డుకొని ముస్లిం వ్యాపార గ్రూపులు ప్రయోజనాలు పొందేలా చేస్తుందని ముస్లిం విద్యావంతులకు ఉద్యోగాలు కల్పిస్తుందని వాగ్దానాలు చేసింది (అమియాబాగ్చి పేజి 432-33) అలాంటి ప్రచారాలు ముస్లింలు చిన్న మైనారిటీలుగా వున్న యు.పి, బొంబాయి లాంటి ప్రావిన్సులలోని వృత్తిదారుల్ని రాజకీయవేత్తల్ని ఆకట్టుకొన్నాయి. సువ్యవస్థితమైన ప్రాంతీయ ఐక్యతా సంబంధాలు దెబ్బతినడం, అమృత్‌సర్ కలకత్తాలను కోల్పోవలసి రావడం కారణాలుగా పాకిస్తాన్ నినాదం పంజాబ్, బెంగాల్‌లో అంత ఆకర్షణీయంగా కన్పించలేదు. అలీగర్, ఢక్కా నవాబు సలీముల్లా కాలం నాటి ఉద్యమాలలాగా ముస్లిం వేర్పాటువాద ఉద్యమం యిప్పుడు తాలూకాదార్ల, జమిందార్ల ఉద్యమం కాదు. ఇస్పాహాని, ఆడంజీ వ్యాపార కుటుంబాలు పత్రికల స్థాపనకు ఆర్థికం సమకూర్చాయి. (1942లో కలకత్తా పత్రిక 'స్టార్ ఆఫ్ ఇండియా', ఢిల్లీ పత్రిక 'డాన్' ప్రచురణ ప్రారంభమయింది). ముస్లిం వాణిజ్య పారిశ్రామిక ఫెడరేషన్ 1945 ఏప్రిల్‌లో జిన్నా ఆశీస్సులతో ప్రారంభించబడింది. యుద్ధం తరువాత ప్రారంభించేందుకు ముస్లిం బ్యాంకులు విమానయాన కంపెనీ పథకాలు సిద్ధమయ్యాయి. భారతీయ బూర్జువాలు ఎప్పుడూ మతపరమైన ఉద్రిక్తతలకు (హిందూ వ్యాపారులలో అత్యధికులు సనాతన సాంప్రదాయవాదులు, పునరుద్ధరణ వాదులు, గోసంరక్షణవాదులు, హిందూ మహాసభతో సంబంధాలు గలవారు) అతీతంగా లేరు. ముస్లింలలో పెద్ద పెట్టుబడిదారులు చాలా తక్కువ. పశ్చిమ పంజాబులో 1947కి ముందు పెద్ద పరిశ్రమలు లేవు. ఆ ప్రాంతంలో వ్యవసాయం అభివృద్ధి చెందడం వలన చిన్న పెట్టుబడిదారులు పెద్ద సంఖ్యలో ముందుకు వస్తున్నారు. వారికి విభజన ఆర్థికపరమైన వరంగా కన్పించింది.

### అజాద్ హింద్

యుద్ధానంతరం, వెనువెంటనే విశాలమైన ప్రజా పునాదిలో, ఉద్వేగ్న చైతన్యాలతో చెలరేగిన సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని సమగ్రంగా వివరించాలనుకునే సందర్భంలో పైన పేర్కొన్న పోరాట శక్తులు నీరసించిపోవటం, ఆ శక్తులు రాజకీయంగా, రాజీ, విభజన ధోరణుల వైపు మొగ్గటం మొదలైన అంశాలు 1942 అనంతరకాల రాజకీయ దృశ్యాన్ని సంపూర్ణంగా చిత్రించలేవని చెప్పవచ్చు. సుభాస్‌బోస్ విదేశాలలో చేసిన రాజకీయ సాహసాలు బ్రిటన్‌కి వ్యతిరేకంగా చేసిన అలుపు ఎరుగని పోరాటానికి అవసరమైన శక్తియుక్తుల్ని, ప్రేరణని ఇచ్చాయి. బోస్ 1941 లో బెర్లిన్‌లో, ఒక భారతీయ సైనిక పటాలాన్ని ఏర్పరిచాడు. కానీ, జర్మనీవారు దాన్ని రష్యాకి వ్యతిరేకంగా ఉపయోగించాలని ప్రయత్నించటంతో, వారితో విభేదాలు ఏర్పడి ఆగ్నేయాసియాకి వెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు. 1943 జూలైలో, ఆయన జర్మనీ నుండి ఒక జలంతర్గామిలో, జపాన్ ఆధీనంలోని సింగపూర్‌కి చేరుకొని, అక్కడే తన సుప్రసిద్ధమైన 'ఢిల్లీ ఛలో' అనే పిలుపునివ్వటమే కాకుండా, అదే సందర్భంలో, 1943 అక్టోబరు 21న అజాద్‌హింద్ ప్రభుత్వాన్ని, భారత జాతీయ సైన్యాన్ని స్థాపించినట్లు పేర్కొన్నాడు. జాతిపిత

గాంధీజీ తో బోస్‌కి ఎన్ని విభేదాలు ఉన్నప్పటికీ, తన రాజకీయ కృషిని ప్రారంభించే ముందు, ఆయన ఆశీస్సులు తీసుకోవటం మరిచిపోలేదు. అదే సందర్భంలో, ముందరికాలపు విప్లవ టెర్రరిస్టు సంప్రదాయపు ఘనతని నొక్కి చెప్పటం కోసమై,1915 నుండి జపాన్ దేశంలో ప్రవాసంలో ఉన్న విప్లవకారుడు, రాస్ బిహారీ బోస్‌కి అజాద్ హింద్ ప్రభుత్వంలో ఒక గౌరవపూర్వక పదవినివ్వటం జరిగింది. జపాన్‌లో అప్పటికే యుద్ధ ఖైదీలుగా ఉన్న 60 వేలమందిలో 20 వేల మంది, అజాద్ హింద్ ఫౌజ్‌లో చేరగా, దానికి కావాల్సిన సైనిక పునాది ఏర్పడి, అదే సందర్భంలో, ఆగ్నేయాసియాలో స్థిరపడిన భారతదేశ వ్యాపార సమూహాల నుండి వలంటీర్లు, ఆర్థిక సహాయమూ అందింది. భారత జాతీయ సైన్యంలో ఆఫీసర్లు, సైనికులగా – ముస్లింలు చాలామంది ఉండటంతో, సంస్థకు గల లౌకిక స్వభావం స్పష్టంగా వెల్లడవటంతోపాటు, నూతన వరవడికి శ్రీకారంగా, ఝాన్సీరాణి పేరుతో ఒక మహిళా రెజిమెంటుని కూడా సైన్య విభాగంగా ఏర్పరచటం జరిగింది. 1944 మార్చి జూన్ నెలల మధ్య భారత జాతీయ సైన్యం, జపాన్ సైన్యంతో కలిసి ఇంఫాల్‌ని కైవసం చేసుకున్నప్పటికీ, చివరికి, ఆ దాడి విఫలమైంది. ఆ మరుసటి సంవత్సరమే, జపాన్ పతనమవటంతో భారత జాతీయసైన్యం సభ్యులు మరలా జైలుపాలవగా, ఆశ్చర్యకరంగా బోస్ అదృశ్యమైపోయాడని, విమాన ప్రమాదంలో మరణించాడని భావించబడగా, కొంతమంది ఇప్పటికీ ఈ సంఘటనని నిజమని నమ్మటం లేదు.

సుభాస్‌బోస్ ఉద్యమజీవితం ఆఖరి దశని అంచనా వెయ్యాలంటే ఉద్యమం సాధించిన సత్వర ఫలితాలు, అంతిమ (ప్రధానంగా మానసికమైన) ప్రభావాన్ని రెండింటిని వేరు చేయాల్సి ఉంటుంది. మిలిటరీ పరంగా చెప్పాలంటే భారత జాతీయ సైన్యం పెద్దగా సాధించిందేమీలేదు. ఒకవేళ అది ఇంకా సమర్థవంతంగా ఉండేదనుకున్నా, అప్పటికే, చాలా ఆలస్యమైపోయింది, ఎందుకంటే 1944 నాటికే అక్షరాజ్యాలు ప్రతిచోటా వెనకపట్టుపట్టాయి. అయితే రహస్యంగా పనిచేస్తున్న ఫార్వర్డ్ బ్లాక్, ఇంఫాల్ – కోహిమా ఆక్రమణకి వెన్నుదన్నుగా ఉండేదనుకున్నా, అప్పటికే దాన్ని అణిచివేయటం జరిగింది. (Secretary of state's Memrandumon or forward Block, 30 August 1945, Marsergh, V&VI P.P 183–88) బ్రిటిష్‌వారు తమ సాంప్రదాయక మూస అవగాహన ప్రకారం భారతదేశ జాతులలో 'బెంగాలీ'ని అతి తక్కువ సైనిక సామర్థ్య ం కలిగిన వ్యక్తిగా చెప్పినప్పటికే, స్వాతంత్ర్యం కోసం దేశభక్తి భావన, ఉత్సాహాలతో యదార్థంగా చేసిన ఒక సైనిక పోరాట ప్రభావాన్ని మనం తక్కువగా అంచనా వెయ్యకూడదు. 1945 నవంబర్‌లో, భారత జాతీయ సైన్యానికి చెందిన కార్యకర్తల్ని బ్రిటిష్‌వారు, న్యాయస్థానాలలో విచారించ పూనుకున్నప్పుడు, దేశ వ్యాప్తంగా ప్రజా ప్రదర్శనలు జరిగాయి. అంతకంటే ముఖ్యమైనదేమంటే, బహుశా భారత జాతీయ సైన్యం పోరాట అనుభవ ప్రభావం, 1945–46 శీతాకాలంలో, బ్రిటిష్ ఇండియా సైన్యంలోని అసంతృప్తి కెరటానికి దన్నుగా ఉండి 1946 ఫిబ్రవరి నావికా తిరుగుబాటుకి దారితీయటమే కాకుండా, దాదాపుగా ఆ ఒక్క చర్యే బ్రిటిష్ వారి సత్వర ఉపసంహరణ నిర్ణయానికి వెనుక బలమైన కారణంగా పేర్కొనవచ్చు.

## కమ్యూనిస్టులు, ప్రజాయుద్ధం

యుద్ధానంతర సామ్రాజ్యవాద వ్యతిరేకపోరాటం, ముందుకు దూసుకు వెళ్ళటానికి మరో ప్రధాన కారణం –1942 –45 మధ్యకాలంలో బోస్, అతని అనుచరులకి పరమ

వ్యతిరేకులుగా ఉన్న కమ్యూనిస్టులు, సంస్థాగతంగా బలపడటమేనన్న విషయం బహు చిత్రమైన విరోధాబాసగా ఉంటుంది. ప్రజా యుద్ధ పంథా భారత కమ్యూనిస్టు పార్టీని నిశ్చయంగా బాగా ఒంటరి దాన్ని చేయటమే కాక, దీనికి తోడు, 1942 ఆగష్టు –సెప్టెంబర్‌లో 'పాకిస్తాన్, జాతుల ఐక్యత' సమస్యపై 'అధికారి థీసిన్' ని ఆమోదించటంతో మరిన్ని ఇబ్బందుల్ని కోరి తెచ్చుకున్నట్లయింది. ఇది భారతదేశం బహుళ భాషల దేశంగా ఉంది కాబట్టి అది బహుళ జాతుల దేశంగా కూడా అవుతుందనే తర్కదూరం కాని ఉద్ఘాటనతో మొదలైంది (పర్యవసానంగా, సోవియట్ యూనియన్‌లో మాదిరిగా 'ఏదైనా ఒక జాతి విడిపోయే హక్కుని గుర్తించి, తద్వారా వాస్తవిక, స్వచ్ఛంద సమాఖ్యగా ఏర్పడటాన్ని ఆమోదించటం)కాని, దానికి విచిత్రమైన కొనసాగింపుగా, సింధీలే, బెలూచీలు, పంజాబీలు (ముస్లింలు) పఠాన్లు లాంటి ముస్లింలు జాతులు అనే విచిత్ర భావనకి దారితీసి, తద్వారా దాదాపుగా భారత జాతీయ కాంగ్రెస్ నాయకత్వం మాదిరే, ముస్లింలీగ్ కూడా, సామ్రాజ్యవాద వ్యతిరేక పాత్ర నిర్వహిస్తుందనే నిర్ధారణతో ముగిసింది. (G. Adhikari 'National Ninty Now peoples Age 8 August 1942) దరిమిలా, కమ్యూనిస్టులు కొంతకాలం, ముస్లింలీగ్‌లో ప్రగతిశీలురు ఎవరా అనే అన్వేషణ, (ఉదాహరణకి అబుల్ హాషెమ్ లాంటి వారు) సాగిస్తూ, అదే క్రమంలో గాంధీ జిన్నా మధ్య ఒప్పందాన్ని ప్రతిపాదిస్తూ, కాంగ్రెస్‌తో సంబంధాలు దెబ్బతిని ఉండటం వలన మరో పెద్ద జాతీయ రాజకీయ శక్తికి బహుశా దగ్గర కాబోయే అవకాశవాద ప్రయత్నంతో పాకిస్తాన్ డిమాండ్‌ని సమర్ధించే ప్రమాదకార సన్నివేశానికి సమీపంగా రావటం జరిగింది. 'ఏమైనప్పటికీ చాలా అరుదైనా, వాస్తవికంగానూ, నిష్పక్షపాతంగానూ చెప్పాలంటే, 1942 లో కమ్యూనిస్టుల మాదిరే ఇతర గ్రూపులు, కొంతమంది వ్యక్తులు దేశభక్తికి దూరంగా ఉన్న యదార్థం. ప్రముఖ గాంధేయవాది, దక్షిణభారతదేశంలో కాంగ్రెస్ మితవాది అయిన రాజగోపాలాచారి, క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించటమే కాక, పాకిస్తాన్ డిమాండ్ పై సంప్రదింపులు జరపాలని డిమాండ్ చేసాడు. గోల్వల్కర్ నాయకత్వంలోని ఆర్.యస్.యస్, ఆగష్టు తిరుగుబాటుకి రహస్యంగా దూరంగా ఉండగా, స్థానిక సంస్థలు, శాసనసభ్యులు, సర్వీసుల్లో ఉండే హిందూ మహాసభసభ్యులు తమ దైనందిన విధులు కొనసాగించాలని 1942 సెప్టెంబర్ 4న సావర్కార్ కోరటం జరిగింది. ఇదే వరుసలో మిద్నపూర్ ఘోరంగా అణిచివేయబడినప్పుడు, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బెంగాల్ మంత్రిగా ఉన్న విషయం గమనార్హం. ఆకస్మాత్తుగా కమ్యూనిస్టులు ప్రభుత్వానికి మద్దతు తెలపడం, జపాన్ వ్యతిరేక గెరిల్లా శిక్షణ కోసం డిమాండ్ చేయడం గురించి చాలామంది అధికారులు, తీవ్రమైన అనుమానాలు వ్యక్తం చేస్తారని ఈ మధ్యనే వెలుగులోకి వచ్చిన డాక్యుమెంట్లు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. పైకి వారు ఫాస్టిసు వ్యతిరేకులు – యుద్ధ అనుకూలురు, అంతర్గతంగా ప్రభుత్వ సామ్రాజ్య వ్యతిరేకత, ఈ ఆలోచనా సరళికి తగ్గట్టుగానే, వారు ఆయుధాలు డిమాండ్ చేయటానికి ఇతర అంశాలకీ సంబంధం ఉంది'. అని వ్యాఖ్యానాలు వెలువడినట్లు తెలుస్తుంది. (Bihar Governor Stawant Linlithgow 6 May 1942 Mansergh Vol II p. 406) పూర్తిగా కమ్యూనిస్టు అధీనంలోని ఎ.ఐ.టియుసి నుండి విడివడి యం.యన్.రాయ్ నాయకత్వంలో ఏర్పాటైన ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్‌కి ప్రభుత్వ సబ్సిడీలు అందాయి. ఆయన వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో సీటు అడిగినా వేవెల్ ఆ అవకాశం ఇవ్వలేదు.

ఘోరమైన తప్పిదాలు జరిగి (సుభాష్‌ని దేశద్రోహి అని నిందించటం లాంటి తప్పులు) ప్రజా సమూహాలలో అపఖ్యాతి పాలైనప్పటికీ, భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రలో 1942 తదనంతర సంవత్సరాలు ఏ విధంగా పరిశీలించినా పూర్తిగా వ్యతిరేకాత్మకమైనవి కావని చెప్పవచ్చు. ఎందుకంటే 1920లలో మొదటిగా ఏర్పడిన కమ్యూనిస్టు గ్రూపులపై ప్రభుత్వ దారుణ అణచివేత, 1934 లో పార్టీపై నిషేదం తరువాత చాలా సంవత్సరాలకి పార్టీ బహిరంగమూ, చట్టబద్ధమూ కావటంతో సంస్థాగతంగా అనేక ప్రయోజనాలు చేకూరాయి. 1942 లో 4 వేలగా ఉన్న సభ్యత్వం 1943 మే నాటికి 15,000, 1946 సంవత్సరం మధ్యకాలం నాటికి 53,000, 1948 ఫిబ్రవరిలో పార్టీ రెండవ మహాసభ నాటికి, 1,00,000 సంఖ్యకి చేరగా, 1942 –44 మధ్య కాలంలో ఎఐటియుసి తన బలాన్ని రెండున్నర లక్షల నుండి ఐదు లక్షలకి అంటే రెండింతలు పెంచుకుంది. (R.P. Dutt India Today p. 353) ఒంటరితనం కార్యకర్తలలో ఒక విధమైన సమరశీల స్వభావాన్ని, ఆత్మత్యాగాన్ని, ఆదర్శవాదాన్ని పెంపొందించగా, మరీముఖ్యంగా బెంగాల్ యూనిట్, కరువు ఉపశమన కృషిని గొప్ప క్రమశిక్షణతోనూ, అంకితభావంతోనూ చేయటం ద్వారా తనకి తాను పునరావాసం కల్పించుకుంది. ఫాసిస్టు వ్యతిరేక ప్రజా యుద్ధ పంథా ప్రజా రాశులకి అర్థం కానప్పటికీ, (మరీ ప్రత్యేకంగా రైతాంగానికి) ప్రపంచ పరిణామాల గురించి అవగాహన ఉన్న మేధావులపై అది గాఢమైన ప్రభావాన్ని చూపిన ఫలితంగా, కలకత్తా మధ్యతరగతి సాంస్కృతిక జీవితంలో అనుకూలమైన మార్పులు చోటు చేసుకున్నాయి. జానపద విజ్ఞానం, ప్రచార సాధనాలు, సాంస్కృతిక రూపాల్ని పార్టీ ప్రచారానికి వినియోగించుకోవటంలో పార్టీ కార్యదర్శి పి.సి.జోషి వినూతన పద్ధతుల్ని ప్రవేశపెట్టడంతో పాటు 1944 –45 సంవత్సరాలలో అప్పటి వరకూ చేసిన కృషికి మకుటాయమౌనంగా, పీపుల్స్ థియేటర్ అసోసియేషన్స్ స్థాపించి, దాని కేంద్ర స్క్వాడ్ దేశవ్యాప్త పర్యటనల ద్వారా బెంగాల్ కరువు పీడిత ప్రజానీకం కోసం విరాళాలు సేకరించటం జరిగింది. థియేటర్ అసోసియేషన్, ఇతర సాంస్కృతిక శాఖలు విభిన్న రంగాలకి చెందిన అనేకమంది మేధావుల్ని ఉదాహరణకి: బలరాజ్ సహానీ, ఖ్వాజా అహ్మద్ అబ్బాస్, కైఫీ అజ్మీ, సలీల్ చౌధురి, శంభుమిత్రా, దేవవ్రత విశ్వాస్, సుచిత్రాముఖర్జీ, సుకాంతా భట్టాచార్జీ మొదలైన వారిని తాము వేదికలపై తీసుకురావటం జరిగింది. వీరే కాకుండా పేర్లు ప్రస్తావించబడని ఇంకా అనేకమంది ప్రముఖులు వివిధ కళారంగాలకి తమ సేవల్ని అందించటం జరిగింది. నవలాకారుడు మానిక్ బంధోపాధ్యాయ కవులు బిష్ణుదే, సమరసేన్, సుభాష్ ముఖర్జీ మొదలైన వారు కమ్యూనిస్టు పార్టీలో చేరటమో లేక సన్నిహితంగా ఉండటమో జరగగా, జ్యోతిరించ మైత్రా 'నవ జీవన, గాన్', బిజోన్ భట్టాచార్జీ నాటకం 'నబన్నా' సాంస్కృతికంగా కొత్త పుంతలు తొక్కటం జరిగింది.

1942 నాటి చేదు అనుభవాలు ప్రభావం అంతగా లేని గ్రామీణ ప్రాంతాలలో కిసాన్‌సభ, కౌలు రైతులు లేదా వ్యవసాయ కూలీ సంఘం లాంటి ఉద్యమ సంస్థలు కేరళ, కోస్తాఆంధ్ర, తెలంగాణ, ఉత్తరబెంగాల్‌లకే పరిమితం కాకుండా, పంజాబ్, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాలకి కూడా విస్తరించటం జరిగింది. కమ్యూనిస్టు పార్టీ ఇప్పటికీ, కాంగ్రెస్ లేదా లీగ్‌లతో పోల్చలేనంత బలహీనంగా ఉన్నప్పటికీ, కొంత న్యాయపరంగా చూసినట్లయితే యుద్ధం ముగిసేనాటికి, దేశంలో అది మూడో అతిపెద్ద పార్టీగా వెలుగులోకి వచ్చిన మాట అవాస్తవం కాదు.

# అధ్యాయం - 8

# స్వాతంత్ర్యం - విభజన 1945 - 1947

**బ్రి**టిష్ పాలన యొక్క చివరి రెండు సంవత్సరాల కాలంలో కలవరపాటు కలిగించే ఘటనలనుండి రెండు ధోరణులు ఉత్పన్నమయ్యాయి.

**మొదటిది:** మత హింసతోపాటు బ్రిటిషు, కాంగ్రెస్, లీగు నాయకుల మధ్య దారి తప్పిన చర్చలు, ఫలితంగా సాధించిన స్వతంత్రం; విషాదకరమైన విభజన.

**రెండవది :** చెదురు మదురుగా స్థానికంగా జరిగిన చాలా సమరశీలమైన ప్రజాపోరాటాలు – భారత జాతీయ సైన్యం (ఐ.యన్.ఎ) విడుదల ఉద్యమం, 1945–46 రాయల్ ఇండియన్ నేవీ తిరుగుబాటు. ఈ కాలమంతటా జరిగిన అసంఖ్యాకమైన సమ్మెలు, బెంగాలులో తెభాగ, తిరువాన్కూరులో పున్నప్ర వాయిలార్ తిరుగుబాటు, హైదరాబాద్‌లో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం. మొదటి అంశంపై అధికార పత్రాల సంకలనాలతోపాటు వి.పి. మీనన్, కేంప్‌బెల్ జాన్సన్, హెచ్.వి.హడ్రాన్. పెండెరెల్ మీనన్, వేవల్స్ పత్రిక, మాక్‌సెర్గ్ గ్రంథాలు, గాంధీ చివరి సంవత్సరాలపై ప్యారేలాల్ సమగ్ర అధ్యయనం, 1945 నుండి సర్దార్ పటేల్ లేఖలు– లాంటి గ్రంథాలలో చాలా చారిత్రక సాహిత్యం లభ్యమవుతుంది. దానికి విరుద్ధంగా ప్రజా ఉద్యమాలపై వాటిలో పాల్గొన్నవారు వ్రాసిన కొద్దిపాటి వివరణలు వున్నాయిగాని ఇప్పటి వరకు క్రమబద్ధమైన చారిత్రక అధ్యయనం జరగలేదు. అయినప్పటికి ఆధునిక భారతదేశ చరిత్ర అంతటా క్రింది నుండి వచ్చిన ఒత్తిదుల్ని అర్థం చేసుకొనకుండా నాయకుల నిర్ణయాలు చర్యలు – బ్రిటిషువారినిగాని భారత నాయకులను గాని అర్థం చేసుకోవడం సాధ్యపడదు. అన్నిటిని మించి ప్రజాపోరాటాలు బ్రిటిషు పాలన కొనసాగింపుని అసాధ్యం చేశాయి. ప్రజలు అతిగా పాల్గొంటున్నారనే భయం కాంగ్రెస్ నాయకుల్ని 'చర్చలు–

రాజీ' మార్గానికి అంటి పెట్టుకొని వుండేలా చేసింది. అవసరమైన మూల్యంగా విభజనని అంగీకరించేలా చేసింది. సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజా ఉద్యమాల పరిమితులు 1947 ఆగస్టు పరిష్కారాన్ని సాధ్యం చేశాయి.

## 1945-46 'అగ్నిపర్వత శిఖరం'

**చర్చలకు పూర్వరంగం :**

అప్పటి కేంద్ర ప్రభుత్వ నిర్మాణంలో కాంగ్రెస్ లీగుల్ని భాగస్వాముల్ని చేసేందుకు బ్రిటిషు ప్రయత్నాలలో, అలాగే పాకిస్తాన్ సమస్యపై ఫలప్రదం కాని గాంధీ జిన్నా చర్చలతో యుద్ధం చివరి నెలల్లో యుద్ధానంతర చర్చలకు పూర్వరంగం సిద్ధం చేయబడింది. అధికారం చేపట్టక ముందు 1943 సెప్టెంబరులో తాత్కాలికంగా– యింకా స్పష్టంగా చెప్పాలంటే ఆరోగ్య కారణాల రీత్యా 1944 మే 5న గాంధీ విడుదల చేయబడిన తరువాత యుద్ధ ప్రయత్నాలలో భారతదేశం యొక్క పూర్తి సహకారాన్ని పొందేందుకు, అంతకంటే ముఖ్యంగా భారతీయుల శక్తియుక్తుల్ని ఆందోళనలకంటే కొంత ప్రయోజనకరమైన దిశగా మరల్చేందుకు కాంగ్రెస్ లీగు మైత్రి ప్రాతిపదికన కేంద్రంలో తాత్కాలిక ప్రభుత్వ స్థాపన అవసరాన్ని గురించి వేవల్ అర్థించాడు. (1944 అక్టోబరు 24న వేవల్ చర్చిల్‌కి వ్రాసిన లేఖ). 1944 జూలై–ఆగస్టులో గాంధీ, వేవల్ ఉత్తర ప్రత్యుత్తరాలు ధృవపరచిన విధంగా వైస్రాయి ప్రతిపాదన కాంగ్రెస్ యొక్క కనీసమైన డిమాండ్లమేరకు కూడా లేదు. కాంగ్రెస్ డిమాండ్లు; అసెంబ్లీకి బాధ్యత వహించే నిజమైన జాతీయ ప్రభుత్వం, యుద్ధ వ్యవహారాలు తాత్కాలికంగా బ్రిటిషువారి ఆధీనంలో వుండడం, యుద్ధానంతరం స్వతంత్రం యిస్తామనే వాగ్దానాన్ని ఎలాంటి సందిగ్ధతకి తావులేకుండా తక్షణమే చేయడం ఏమైనప్పటికి 1942లో క్రిప్సు ప్రతిపాదనలలో లాగానే వేవల్ ప్రతిపాదనలలో ఫలితాలు సాధించే సూచనలు కల్పించి వుంటే ఒక దశలో చర్చిల్ అడ్డుపడివుండేవాడు. 1944 జూలై 5న గాంధీ ఎందుకు చావలేదో తెలుసుకునేందుకు వేవల్‌కి టెలిగ్రాం పంపాడు. భారత వ్యవహారాలలో చర్చిల్ హిట్లర్ తరహా వైఖరిని ప్రదర్శించాడని వేవల్ ప్రైవేటు సంభాషణలలో చాలా సార్లు చెప్పారు. భారత సమస్యని వీలైనంత కాలం పక్కన బెట్టాలని చర్చిల్ 1945లో చెప్పాడు. "అతడు భారత దేశాన్ని పాకిస్తాన్ హిందూస్థాన్, ప్రిన్స్‌స్తాన్‌లుగా విభజించాలని కోరుతున్నట్లున్నది" (వైస్రాయి జర్నల్ పేజీలు 78,79,120)

1944 జూలైలో గాంధీ హిందూ మహాసభ వ్యతిరేకతని అధిగమించి, గత ఏప్రిల్ నాటి రాజగోపాలచారి ఫార్ములా ప్రాతిపదికన చర్చలు జరపాలని ప్రతిపాదించాడు. రాజగోపాలచారి ఫార్ములా; ముస్లింలు పూర్తి మెజార్టీగా వున్న వాయువ్య ఈశాన్య భారతదేశంలోని ఇరుగు పొరుగు జిల్లాలను విభజించేందుకు యుద్ధానంతరం కమిషన్ నియమించుట. కొన్ని ప్రాంతాలలో ప్రత్యేక పాకిస్తాన్ కోరుతున్నారా లేదా తెలుసుకునేందుకు ప్రజాభిప్రాయాన్ని సేకరించుట, విభజన సందర్భంలో రక్షణ రవాణా సమాచారం లాంటి అత్యవసర ఉమ్మడి సర్వీసుల నిర్వహణ. బ్రిటిషు వారికి అధికారాన్ని పూర్తిగా బదిలీ చేసిన తరువాతనే (స్వతంత్రం కొరకు కాంగ్రెస్ చేస్తున్న డిమాండ్లకి లీగు ఆమోదం తెలిపి, మార్పిడి కాలంలోని తాత్కాలిక

ప్రభుత్వానికి సహకరించడంతో) పథకాన్ని అమలు జరుపుట. కాని జిన్నా జూలై 30న కొద్ది సర్దుబాట్లతో మొత్తం ఆరు ప్రావిన్సుల (పంజాబు, సింధు, బలూచిస్తాన్, వాయవ్య సరిహద్దు రాష్ట్రం, బెంగాల్, అస్సాం) విభజన డిమాండ్‌ని పునరుద్ఘాటించాడు. స్వతంత్రం వరకు విభజనని వాయిదా వేయరాదని వాదించాడు. ఉమ్మడి సర్వీసులు అవసరమన్నాడు. ముస్లింల, హిందువుల ఓట్లతో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం అనేది 'ముస్లింలు స్వయం నిర్ణయాధికార హక్కుగల ప్రత్యేకమైన జాతి' అనే మూల సూత్రానికి విరుద్ధమన్నాడు. ఫలితంగా 1944 సెప్టెంబరులో జరిగిన గాంధీ జిన్నా చర్చలు విఫలమయ్యాయి. కాని ఇది సెంట్రల్ అసెంబ్లీలో లీగు కాంగ్రెసుల మధ్య పెరుగుతున్న సహకారాన్ని ఆటంకపరచలేదు. 1945 జనవరిలో కాంగ్రెస్ లీగు అసెంబ్లీ పక్ష నాయకులైన భూలాభాయ్ దేశాయ్, లియాకత్ అలీఖాన్‌ల మధ్య ఒప్పందం కుదిరిందని, ఆ ఒప్పందం మేరకు యుద్ధ కాలపు చర్యగా అప్పటికి వున్న రాజ్యాంగం మేరకు కేంద్రంలో ప్రావిన్సులలో సంకీర్ణ మంత్రి వర్గాల ఏర్పాట్లు జరుగుతాయని బలమైన వదంతులు (తరువాత జిన్నా ఖండించాడు) వ్యాపించాయి. 1945 ప్రారంభంలో లీగు పరిస్థితి బలహీనపడింది. కాంగ్రెస్ యం.ఎల్.ఎ. విడుదల వాయవ్య సరిహద్దు రాష్ట్రంలోని లీగు మంత్రివర్గం స్థానంలో డాక్టర్ ఖాన్ సాహెబ్ నాయకత్వంలో కాంగ్రెస్ మంత్రివర్గం ఏర్పాటు, 1944 మధ్యలో ఖిజార్ హయత్‌ఖాన్ నాయకత్వంలో పంజాబ్ యూనియనిస్టులు బాహాటంగా జిన్నా నుండి విడిపోవడం, 1945 మార్చిలో బెంగాల్‌లో నిజాముద్దీన్ మంత్రివర్గం పడిపోయి ఆ స్థానంలో గవర్నరు పాలన రావడం, సింధు అస్సాంలో కూడా లీగు మంత్రివర్గాలు కాంగ్రెస్ యొక్క ఉపేక్షాంగీకారంతో మనగలగడంలాంటి కారణాలతో 1945 ప్రారంభంలో లీగు పరిస్థితి చాలా బలహీన పడింది. ప్రజల్ని సమీకరించి నిజమైన ప్రజాపోరాటాలు నిర్వహించగల (1946 ఆగస్టు వరకు) స్థితిలో లేదు. ప్రజాపోరాటాలు లీగు విలక్షణత కాదు. తరచుగా లీగు యిచ్చే నినాదం 'లడ్‌కే లేంగే పాకిస్తాన్' (పోరాడి పాకిస్తాన్ సాధిస్తాం) కేవలం మాటలకే పరిమితమయింది.

## సిమ్లా సదస్సు

బ్రిటిషు ఎన్నికలు నెలరోజులలో జరుగనుండగా 1945 జూన్‌లో భారత నాయకులతో చర్చలు జరిపేందుకు చర్చిల్ వేవల్‌కి అనుమతి యిచ్చాడు. వేవల్ జూన్ 14న కాంగ్రెస్ వర్కింగు కమిటీ సభ్యుల విడుదలకు ఆదేశాలు జారీ చేశాడు. వైస్రాయి కమాండర్ – ఇన్–ఛీఫ్ మినహాయించి మిగిలిన వారందరూ భారతీయులు వుండే విధంగా నూతన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఏర్పాటు చేసేందుకు చర్చల్ని ప్రతిపాదించాడు. ప్రతిపాదిత కౌన్సిలులో హిందువులకు ముస్లింలకు సమాన ప్రాతినిధ్యం వుంటుంది. ఎగ్జిక్యూటివ్ ప్రస్తుత రాజ్యాంగం మేరకు పని చేస్తుంది (అంటే అది సెంట్రల్ అసెంబ్లీకి బాధ్యత వహించదు. యుద్ధంలో గెలిచిన తరువాత కొత్త రాజ్యాంగంపై చర్చలుకొరకు తలుపులు తెరచి వుంచబడతాయి. సిమ్లా సదస్సు (1945 జూన్ 25–జూలై–14)లో కాంగ్రెస్ పార్టీ స్థాయిని హిందువుల పార్టీ స్థాయికి తగ్గించే ప్రయత్నం పట్ల కాంగ్రెస్ సహజంగా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఎగ్జిక్యూటివ్‌లో కాంగ్రెస్ ప్రతినిధులుగా అన్ని మతాల వారిని ప్రతిపాదించే హక్కు తనకు వుందని వాదించింది. కాని ముస్లిం

ప్రతినిధులందరినీ ఎంపిక చేసే పరిపూర్ణమైన హక్కు లీగుకి మాత్రమే వుందని, ఎగ్జిక్యూటివ్‌లో మతపరంగా వీటో హక్కు వుండాలని, ముస్లింలచే వ్యతిరేకించబడిన నిర్ణయాలకు మూడింట రెండువంతుల మెజార్టీ వుండాలని జిన్నా చేసిన అసంబద్ధమైన డిమాండ్లతో సదస్సు విఫలమైంది. అప్పుడు వున్న రాజకీయ పరిస్థితులలో మొదటి డిమాండు చాలా అసంబద్ధమైనది. అప్పటికి యింకా పంజాబులో అధికారంలో వుంటూ, లీగులాగా సమస్యల్ని ఇబ్బందుల్ని తెచ్చిపెట్టని యూనియనిస్టుల్ని వదులుకోవడానికి బ్రిటిషువారు సిద్ధంగా లేరు. అయినప్పటికి లీగు యొక్క బుకాయింపుని ప్రశ్నించకుండా అవసరమైతే లీగుని మినహాయించి ఎగ్జిక్యూటివ్ ఏర్పాటుతో ముందుకు పోకుండా, కేవలం లీగు యొక్క ఈ రెండు డిమాండ్ల కారణంగా సదస్సుని రద్దు చేయడమంటే, వేవల్ ఆచరణలో జిన్నా కోరిన వీటోహక్కు యిచ్చినట్లే అయింది.

1945 జూలైలో లేబరు పార్టీ ఘన విజయం సాధించడంతో 1938 నాటి నెహ్రూతో ఫల్కిన్ చర్చలతో సంబంధం వున్న రాజకీయ నాయకులు, అలాగే 1942 నాటి క్రిప్సు ప్రతిపాదనలతో సంబంధం వున్న వారు అధికారంలోకి వచ్చారు. "చాలా పెద్ద మెజార్టీ వచ్చింది. లేబరు పార్టీ తన కాంగ్రెస్ స్నేహితులకు వీలైనంత త్వరలో భారతదేశాన్ని అప్పజెప్పవచ్చు. ఇక మీదట వైస్రాయి తన చేతిని యాక్సలరేటర్ నుండి బ్రేకుల మీదికి మార్చడం అవసరం కావచ్చు" అని వేవల్ ఆందోళన వ్యక్తం చేశాడు. కాని ఆచరణలో రెండు పార్టీల వైఖరులలో తేడా అతి స్వల్పమని త్వరలో గుర్తించారు. ఉదాహరణకు విదేశీ కార్యదర్శి బెవిన్ లాంటి పలువురు లేబరు పార్టీ నాయకులు కూడా వాస్తవంగా సామ్రాజ్య వాదులు భారతదేశం వదలి వెళ్లాలని కోరుకున్నారు. కాని సూచించేందుకు వారి వద్ద ప్రత్యామ్నాయం లేదు. కాని భారత దేశంతోపాటు ప్రపంచ పరిస్థితులు త్వరితంగా మార్పు చెందుతున్నాయి. నాజీ జర్మనీ ధ్వంసం చేయబడింది. 1945 ఆగస్టు నాటి హిరోషిమా ఘటన తరువాత జపాన్ లొంగిపోయింది. తూర్పు యూరపు అంతటా కమ్యూనిస్టుల నాయకత్వంలో లేక వారి భాగస్వామ్యంతో సమూలమైన సామాజిక మార్పులు కోరే పాలక వ్యవస్థలు అధికారంలోకి వస్తున్నాయి. ఫ్రాన్స్ ఇటలీలో అవే పరిస్థితులు వున్నాయి. చైనా విప్లవం అప్రతిహతంగా ముందుకు పోతుంది. ఆగ్నేయాసియా అంతటినీ సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రభంజనం చుట్టు ముట్టింది. ఫ్రెంచి డచ్చి వలసపాలనా యత్నాల్ని వియత్నా, ఇండోనేషియా ప్రతిఘటిస్తున్నాయి. యుద్ధంతో సొమ్మసిల్లిన సైన్యం, ధ్వంసమైన ఆర్థిక వ్యవస్థ గల బ్రిటన్ వెనుకంజ వేయవలసిన పరిస్థితిలో వుంది. లేబరు పార్టీ విజయం ఆ పరిస్థితిని కొంత వేగవంతం చేసింది.

ప్రపంచ వ్యాప్తంగా పరిస్థితులు అలా వున్నప్పటికి అట్లీ మంత్రి వర్గం చేపట్టవలసిందిగా వైస్రాయిని ఆదేశించిన చర్యలు అతి సాధారణమైనవి. రానున్న చలికాలంలో ఎన్నికలు జరపాలని ప్రకటన 1945 ఆగస్టు 21 న చేయబడింది. యుద్ధం ముగిసింది. కేంద్ర అసెంబ్లీకి 1934లోను ప్రావిన్సులలో 1937 లోనూ ఎన్నికలు నిర్వహించబడ్డాయి. కనుక యిప్పుడు ఎన్నికల నిర్వహణ అనివార్యం. అంతేగాక ఆందోళనాకారుల్ని రాజ్యాంగపరమైన కార్యకలాపాలవైపు మరల్చడం అవసరమని యు.టి.గవర్నరు హేలట్ వేవల్‌కి ఆగస్టు 14న సూచించాడు. (మాన్సెర్గ్ వాల్యూం- VI పేజీ 68) ఇంగ్లాండులో చర్చల తరువాత వేవల్

సెప్టెంబర్ 19న పూర్తి స్వయం పరిపాలన వాగ్దానాన్ని పునరుద్ఘాటించారు. (స్వతంత్రం అనే పదం దాటవేయబడింది) ఎన్నికల తరువాత రాజ్యాంగ నిర్మాణ సంస్థ స్థాపన కొరకు యం.యల్.ఎ.లతో స్వదేశీ సంస్థాన ప్రతినిధులతో చర్చలు జరపబడతాయని వాగ్దానం చేయబడినది. (రాజ్యాంగ పరిషత్ సార్వత్రిక ఓటింగు ద్వారా ఏర్పాటు చేయబడడానికి గతంలో ఫిల్కిన్ అంగీకరించి యున్నాడు గనుక ఇది స్పష్టమైన వెనుకడుగు) ప్రధానమైన భారతదేశ పార్టీల మద్దతు గల ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ స్థాపనకు తిరిగి ప్రయత్నాలు చేపట్టబడతాయి. (వైస్రాయి జర్నల్ పేజి 170–171).

## భారత జాతీయ సైన్యం - విచారణ

ప్రజల ఒత్తిడితో 1945–46 నెలల్లో వేవల్స్ జర్నల్ ఎడిటర్ పెరెల్‌మూక్ 'అగ్నిపర్వత శిఖరం'గా వర్ణించిన నెలల్లో బ్రిటిషు విధానంలో నిర్ణయాత్మకమైన మార్పు వచ్చింది. 20,000 భారత జాతీయ సైన్యం ఖైదీలలో వందలాది మందిపై బహిరంగ విచారణ జరపాలని తొలుత బ్రిటిషువారు మూర్ఖంగా నిర్ణయించారు. (సర్వీసు నుండి తొలగించబడడమే గాక 7000 మందికి పైగా విచారణ లేకుండా జైళ్లలో నిర్బంధింపబడ్డారు. (మాన్సెర్గ్ వాల్యూం VI పేజీలు 50–51) ఢిల్లీలోని రెడ్‌ఫోర్టులో మొదటి దఫా విచారణ 1945 నవంబరులో ప్రారంభమయింది. బోనులో ఒక హిందూ, ఒక ముస్లిం, ఒక సిక్కు (పి.కె.సెహగల్, షానవాజ్, గురు బక్స్‌సింగ్) వున్నారు. భూలాభాయ్ దేశాయ్, తేజ్ బహద్దూర్ సప్రూ, జవహర్‌లాల్ నెహ్రూ డిఫెన్స్ లాయర్లుగా హాజరయ్యారు. (జవహర్‌లాల్ 25 సం॥ల తరువాత బారిష్టరు గౌను తొడిగి హాజరయ్యారు) దేశ వ్యాప్తంగా జరుగుతున్న నిరసనలో ముస్లింలీగు కూడా కలిసింది. 'భారత ప్రజల ఆసక్తిని – ఆసక్తి అనే కంటే సానుభూతిని ఇంతగా ఆకట్టుకున్న ఘటన చాలా అరుదుగా జరుగుతుంది.... ఈ తరహా సానుభూతి మతపరమైన ఆటంకాల్ని అధిగమిస్తుంది'– నవంబరు 20న ఇంటిలిజెన్స్ బ్యూరో రిపోర్టు. అదే రోజున రెడ్‌ఫోర్టు ఖైదీల్ని సందర్శించిన జర్నలిస్టు (బి.శివరావు) యిలా రిపోర్టు చేశాడు. "వారిలో హిందూ ముస్లిం భావన అణుమాత్రం కూడా లేదు. రెడ్‌ఫోర్టులో విచారణనెదుర్కొంటున్న వారిలో అత్యధికులు ముస్లింలు. వారిలో కొందరు పాకిస్తాన్ సమస్యని సజీవంగా వుంచుతున్నందుకు జిన్నాపై ఆగ్రహం వ్యక్తం చేశారు" (మాన్సెర్గ్ వాల్యూం–VI ) ఐ.యన్.ఎ. స్ఫూర్తి భారతీయ సైన్యంలోకి వ్యాపించడంపట్ల బ్రిటిషువారు చాలా ఆందోళన చెందారు. విడుదలైన ఐ.యన్.ఎ. ఖైదీలకు లాహోరులో జరిగిన సత్కారానికి యూనిఫారంలో భారతీయ సైనికులు హాజరయ్యారని పంజాబ్ గవర్నరు జనవరిలో రిపోర్టు చేశాడు. (మాన్సెర్గ్ వాల్యూం– VI పేజీ 807) వియత్నాం, ఇండోనేషియాలో ఫ్రెంచి డచ్చి వలస పాలన పునరుద్ధరణ కొరకు భారతసైనిక విభాగాల్ని ఉపయోగించడంతో రెండవ సమస్య ఉత్పన్నమయింది. ప్రజలభావాలపై ముఖ్యంగా పట్టణ ప్రజలభావాలపై అలాగే సైన్యంలోని కొన్ని భాగాలపై దీని ప్రభావం, యుద్ధం తీసుకొని వచ్చిన సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యం యొక్క అద్భుతమైన పురోగతికి స్పష్టమైన సాక్ష్యంగా నిలుస్తుంది. భారత సైన్యంలో అలాంటి చైతన్యం పెరగడంపట్ల వేవల్ కలత చెందాడు. కాని మిత్రరాజ్యాల సుప్రీం కమాండరు 1945 అక్టోబరులో దీనిని

త్రోసిపుచ్చారు. ఈ కాలంలో సాధారణంగా యుద్ధానంతరం వచ్చే నిరుద్యోగం, అధిక ధరల సమస్యలు ఆహార సంక్షోభం, బొంబాయి బెంగాలులలో పాక్షికంగా పంటల వైఫల్యం, మిగులు ప్రావిన్సు అయిన పంజాబ్ నుండి తగినంతగా ఆహార ధాన్యాలు సేకరించకపోవడం లాంటి కారణాలతో తీవ్రతరం చేయబడ్డాయి. అమెరికా దిగుమతులు సందిగ్ధంలో పడ్డాయి. 1946 జనవరి 29న వేవల్ మూడు మిలియన్ టన్నుల కొరత వుంటుందని అంచనా వేశాడు. రేషన్స్‌లో విధించిన కోత తలసరి ఆహార విలువను 1200 కేలరీలకు తగ్గించింది.

1945లో కాంగ్రెస్ 1942 తరహా తిరుగుబాటు చేస్తుందని బ్రిటిష అధికారులు భయపడ్డారు. అలాంటి తిరుగుబాటు వార్తా రవాణా యంత్రాంగంపై దాడులు విస్తృతమైన వ్యవసాయక తిరుగుబాటు, కార్మిక సమస్యలు, సైన్యంలో అవిశ్వాసం, కొంత సైనిక నిపుణతలతో ఐ.ఎన్.ఎ వుండడం – ఈ సారి చాలా ప్రమాదకరంగా పరిణమిస్తుందని భయపడ్డారు. కాంగ్రెస్ నాయకులు (మరీ ముఖ్యంగా నెహ్రూ, తొలుత పటేల్, బీహారు సి.పి., యు.పి. ఇతర ప్రాంతాల నాయకులు) 1942 నాటి మృతవీరుల్ని శ్లాఘిస్తూ అత్యాచారాలకు పాల్పడ్డ అధికారుల్ని కఠినంగా శిక్షించమని డిమాండు చేస్తూ ఐ.యన్.ఎ. ఖైదీల్ని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ హింసని ప్రేరేపిస్తూ చేసిన ఉపన్యాసాల పట్ల వేవల్ తీవ్రమైన అసంతృప్తి వ్యక్తం చేశారు. కాని ఈ పోరాటపు బెదిరింపులు ప్రజల మనోభావాల్ని ఎన్నికల ప్రచారంలో మిళితం చేయడానికి ఉద్దేశించబడిందని బ్రిటిషవారు త్వరలో గుర్తించడం ప్రారంభించారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌కి 1942 ఉద్యమం తురుపు ముక్కల లాంటిది. ఇక ఐ.ఎన్.ఎ. విషయానికి వస్తే దానిని ప్రస్తావించకపోతే దేశంలో తమ పార్టీ పునాదులు కంపిస్తాయని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అది ఐ.యన్.ఎ.కి చెందిన వారిని తప్పక సైన్యం నుండి తొలగిస్తుందని, వారిలో కొందరిపై విచారణ జరుపుతుందని అసఫ్ ఆలి ప్రైవేటు సంభాషణలో వివరించారు. మరొక అంశం కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా తీవ్రమైన ప్రచారం ఈ ప్రచారంలో నెహ్రూ చాలా చురుకైన పాత్ర పోషించాడు. ఫలితంగా కమ్యూనిస్టు సభ్యులు అక్టోబరు 5న రాజీనామా చేశారు. డిసెంబరులో కమ్యూనిస్టు ఎఐసిసి సభ్యులు బహిష్కరింపబడ్డారు. కమ్యూనిస్టులపై దాడులు జరిగాయి. నెహ్రూ ఉపన్యాసం చే రెచ్చగొట్టబడిన కాంగ్రెస్ మూక బొంబాయి పార్టీ ప్రధాన కార్యాలయంపై దాడి చేసింది. యుద్ధ కాలంలో కమ్యూనిస్టులు నిర్వహించిన పాత్ర కారణంగా అలా జరిగిందని చెప్పడం వీలుపడదు. ఎందుకంటే హిందూ మహాసభకి వ్యతిరేకంగా అలాంటి ప్రచారం జరగలేదు. 1942 ఆగస్టులో కొందరు మహాసభ నాయకులు మంత్రి వర్గాలలో వున్నారు. 1942లో 'క్విట్ ఇండియా' 'పాకిస్తాన్' సమస్యలపై కమ్యూనిస్టుల లాంటి వైఖరి చేపట్టిన రాజగోపాలాచారి కాంగ్రెస్ అగ్రనాయకుడుగా కొనసాగుతున్నాడు.

గతంలో కాంగ్రెస్ సమరశీలతని ఆటంకపరచిన శక్తులు మరలా పని చేయడం ప్రారంభించాయి. కాంగ్రెస్ విద్వేష ఉపన్యాసాల పట్ల జి.డి.బిర్లా అంతకంతకు కలత చెందుతున్నాడని సింధు గవర్నరు నవంబరు 17న ఆర్థిక సభ్యుడు రోలాండ్స్, నవంబరు 30న రాజ్య కార్యదర్శి ఫెథిక్‌లారెన్స్ వేరువేరుగా ప్రస్తావించారు. (వైస్రాయి జర్నల్ పేజి

185, మాన్సెర్గ్ వాల్యూం –VI పేజీలు 438,572). కాంగ్రెస్ అధిష్టానవర్గం తరపున బాపు స్థానంలో పటేల్ బిర్లాతో నిరంతర సంబంధాలు చేపట్టాడు. (మహాత్ముని నీడలో పేజి 328). 'ఎన్నికలయ్యే వరకు ప్రజా ఉద్యమాలు వుండబోవని స్పష్టం చేయడం ద్వారా రాజకీయ ఉద్రిక్తతల్ని తగ్గించాలని కాంగ్రెస్ నాయకులు కోరుకుంటున్నట్లుగా ఇటీవల సూచనలు అందాయి'– వేవల్ డిసెంబర్ 5న పెథిక్‌లారెన్స్‌కి సమాచారం పంపాడు. అంతేగాక 'కాంగ్రెస్ వెనుక వున్న బలమైన పెట్టుబడిదారీ వర్గాలు వారి ఆస్తిపాస్తుల్ని గురించి భయపడుతున్నాయి' అని తెలియజేశాడు. ఆ మరుసటి రోజున బిర్లా ఒక లండన్ ఉన్నతాధికారికి ఇలా చెప్పారు. "జవహర్‌లాల్‌తో సహా ఏ రాజకీయ నాయకుడు కూడా ఎలాంటి సంక్షోభాన్ని గాని హింసని గాని కోరుకొనడంలేదు..... ప్రజల అసహనం ప్రస్తుత వాతావరణం ఈ ఘాటైన ఉపన్యాసాలకు కారణం. అప్పుడప్పుడు నాయకులు కూడా నడిపింపబడుతుంటారు. కాని భవిష్యత్తులో అదుపు తప్పిన భాష చాలా తక్కువగా వింటామని ఆశిస్తాను' (మాన్సెర్ వాల్యూం–VI) పేజీలు 602–03,615).

భారత జాతీయసైన్యం సమస్యపై 1945 నవంబరు 21–23 లలో ప్రజా ఉద్యమం ఉవ్వెత్తుగా లేచింది. ఇలాంటి ఉద్యమాలు కలకత్తా నగరంలో తరచుగా దశాబ్దంపాటు కొనసాగాయి. ఇవి ఫ్రెంచి విప్లవం నాటి దినాల్ని స్ఫురణకు తెచ్చేలా సాగాయి. ఐ.యన్.ఎ. ఖైదీలను విడుదల చేయాలని డిమాండు చేస్తూ తొలుత ఫార్వర్డు బ్లాకు ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రదర్శన ప్రారంభమైంది. వారిని డల్హౌసీ స్క్వేర్‌లోనికి అనుమతించకపోవడంతో రాత్రంతా ధరమ్‌తల వీధిలో బైఠాయించారు. కమ్యూనిస్టు విద్యార్థి ఫెడరేషన్ విద్యార్థులు వచ్చి కలిశారు. ఆకుపచ్చ లీగు జెండాతో ఇస్లామియా కాలేజీ విద్యార్థులు కలిశారు. కాని ఇందుకు పూర్తి విరుద్ధంగా సుభాస్‌బోస్ సోదరుడు శరత్‌బోస్ ప్రదర్శకులనుద్దేశించి ప్రసంగించ తిరస్కరించాడు. హింసని ప్రేరేపిస్తున్నారని కమ్యూనిస్టుల్ని నిందించాడు. సామ్రాజ్యవాద వ్యతిరేకతకు ఐక్యతాచిహ్నంగా విద్యార్థులు కాంగ్రెస్ లీగు ఎర్రజెండాలను కలిపి ఎగురవేశారు. ఇద్దరిని (ఒక హిందూ ఒక ముస్లిం) కాల్చి చంపిన మొదటి రౌండు పోలీసు కాల్పుల తరువాత నవంబరు 22,23 తేదీలలో ఉద్యమం నగరమంతటికీ వ్యాప్తిచెందింది. సిక్కు టాక్సీ డ్రైవర్లు కమ్యూనిస్టు నాయకత్వంలోని ట్రాంలైన్ల కార్మికులు చాలా ఫ్యాక్టరీల కార్మికులు సమ్మెలు చేశారు. (కలకత్తా కార్పొరేషన్ ఉద్యోగులు అప్పటికే ఆర్థిక డిమాండ్లతో సమ్మెలో వున్నారు.) కార్లను లారీలను తగులబెట్టారు. రైళ్లకు అవరోధాలు కల్పించారు. వీధులలో బారికేడ్లు నిర్మించారు. 'గుంపులపై కాల్పులు జరిపినప్పుడు ప్రజలు బెదరలేదు. కదలలేదు. కొద్దిగా వెనక్కి తగ్గినా మరలా దాడికి సన్నద్ధమవడానికే అలా చేశారు. (వేవల్‌కి గవర్నరు కేసీ, 1946 జనవరి 2) 14 రౌండ్ల కాల్పుల తరువాత శాంతి భద్రతలు పునరుద్ధరింపబడ్డాయి. కాల్పుల్లో 33 మంది హతులయ్యారు. 200 మంది గాయపడ్డారు. సైనికుల పోలీసుల వాహనాలు 150 ధ్వంసం చేయబడ్డాయి. 70 మంది బ్రిటిషు 37 మంది అమెరికన్ సైనికులు గాయపడ్డారు. ఈ సందర్భంగా వ్యక్తమైన స్పందనలు గమనార్హాలు. పోలీసులతో ఘర్షణపడి శక్తిని వృధా చేసుకొనడాన్ని పటేల్ నవంబర్ 24న బొంబాయి ఎన్నికల సభలు ఖండించాడు. (ఇండియన్

మాన్యువల్ రిజిష్టర్) గాంధీ బెంగాలు గవర్నరుతో స్నేహపూర్వక సంభాషణలు జరిపారు. సెప్టెంబరు ఎ.ఐ.సి.సి. సదస్సులో చాలా మంది సభ్యులు 1942 హింసాయుత పోరాటంలోని ప్రతి అంశాన్ని కీర్తించిన దానికి భిన్నంగా డిసెంబరు 7–11న జరిగిన కార్మిక వర్కింగు కమిటీ అహింసపై విశ్వాసాన్ని పునరుద్ఘాటించింది. బ్రిటిషు వారు కొన్ని రాయితీలు ప్రకటించవలసిన అవసరాన్ని గుర్తించారు. హత్యానేరం మోపబడిన వారిపైన తోటి ఖైదీలపై అమానుషంగా ప్రవర్తించిన ఐయన్ఏ ఖైదీలపై మాత్రమే (మొదట బ్రిటిషు చక్రవర్తిపై యుద్ధానికి దిగారనే ఆరోపణకు బదులుగా) విచారణలు ఎదుర్కొన్నవారికి విధించబడిన శిక్షలు జనవరిలో తగ్గించబడ్డాయి. 1946 ఫిబ్రవరి నాటికి భారత సైనికుల్ని ఇండోచైనా ఇండోనేషియాల నుండి వెనక్కి రప్పించారు. నవంబరు 28న బ్రిటిషు మంత్రివర్గ ఉపసంఘం పార్లమెంటరీ ప్రతినిధి బృందాన్ని పంపించాలని నిర్ణయించింది. 1946 జనవరి 22న భారతీయ నాయకులతో చర్చించేందుకు మంత్రివర్గ రాయబార సంఘాన్ని (Cabinet Mission) పంపించాలనే చాలా ప్రాధాన్యత గల నిర్ణయం తీసుకొనబడింది. ఈ కాలంలో వేవల్ తాత్కాలిక పథకాన్ని తయారు చేయడం ప్రారంభించాడు. ఈ పథకం అణచివేతకు, పూర్తిగా వదలి వెళ్లిపోవడానికి మధ్యే మార్గంగా బ్రిటిషు సైన్యాన్ని అధికారుల్ని వాయవ్య, ఈశాన్య ముస్లిం రాష్ట్రాలకు తరలించి మిగిలిన భారత దేశాన్ని కాంగ్రెస్‌కి అప్పచెప్పాలని సూచించింది. భవిష్యత్తులో కాంగ్రెస్ నాయకత్వంలోని ఎలాంటి తిరుగుబాటునైనా అణచడం అసాధ్యమని బ్రిటిషువారు గుర్తించారని, అలాగే భారతీయ ఉత్తర ఐర్లాండుగా పాకిస్తాన్‌ని రూపొందించాలని ఉన్నతాధికార వర్గాల ఆలోచన అని చెప్పేందుకు ఈ పథకం సాక్ష్యంగా నిలుస్తుంది.

భారతీయ నాయకుల్ని చర్చలకు రప్పించడంలో జయప్రదం కావడానికి ముందు బ్రిటిషువారు 1946 ఫిబ్రవరిలో రెండవ పెద్ద సంక్షోభాన్ని ఎదుర్కొనవలసి వచ్చింది. భారత జాతీయ సైన్యానికి చెందిన అబ్దుల్ రషీద్‌కి 7 సంIIల కఠిన శిక్ష విధించడానికి నిరసనగా ఫిబ్రవరి 11–13లలో కలకత్తాలో ఆందోళన ప్రారంభమయింది. లీగు విద్యార్థి విభాగం సమ్మె పిలుపిచ్చింది. విద్యార్థి ఫెడరేషన్ కలిసింది. నవంబరులో లాగా విద్యార్థులు కార్మికులు ముస్లింలు హిందువుల మధ్య అప్పటికప్పుడు ఐక్యత పెంపొందింది. కమ్యూనిస్టుల నాయకత్వంలోని ఫిబ్రవరి 12 సమ్మె పారిశ్రామిక కలకత్తాని స్తంభింపజేసింది. వెల్లింగ్టన్ స్క్వేరు వద్ద ప్రదర్శకులనుద్దేశించి లీగు నాయకుడు సుహ్రావర్దీ, గాంధేయ కాంగ్రెస్ నాయకుడు సతీష్‌దాస్ గుప్తా, కమ్యూనిస్టు నాయకుడు సోమనాథ్ లాహరి ప్రసంగించారు. రెండు రోజులపాటు వీధి ఘర్షణలు జరిగిన తరువాత పోలీసులు సైన్యం పరిస్థితిని అదుపులోకి తీసుకురాగలిగారు. అధికార అంచనాల మేరకు ఘర్షణలలో 84 మంది హతులయ్యారు. 300 మంది గాయపడ్డారు. (గౌతం ఛటోపాధ్యాయ 'దాదాపు విప్లవం'; యస్.సి. సర్కార్ గౌరవార్థం వ్యాసాలు, న్యూఢిల్లీ 1976) ఈ కాలంలో పెరుగుతున్న ధరలు, జనవరిలో ప్రవేశపెట్టిన రేషన్ కోతల సందర్భంగా అఖిల భారత రైల్వే కార్మిక సంఘాలు, పోస్టలు ఉద్యోగ సంఘాలు, వారితోపాటు ప్రభుత్వ ఉద్యోగులు సమ్మెచేస్తామని బెదిరించారు. కీలకమైన రంగాలలో దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాల అభివృద్ధి భారత కార్మిక ఉద్యమానికి నూతన

జవసత్వాల్ని సమకూర్చింది. 1920,1930 దశాబ్దాలలోని సమ్మెలు పారిశ్రామిక కేంద్రాలకు ప్రధానంగా బొంబాయి కలకత్తాలకు పరిమితమయ్యాయి. కాంగ్రెస్ లీగు నాయకత్వాలు ఆహారధాన్యాల సరఫరాలో కోతని (అజాద్ దీనిని దూరదృష్టి గల చర్యగా మార్చి 13న స్వాగతించాడు. బ్రిటిషువారు సంరక్షకులుగా చర్యలు చేపడుతున్నారు గనుక సమ్మెలు ప్రస్తుతానికి సరియైనవి కావు అని ప్రకటించారు. మాన్సెర్గ్ వాల్యూం -6 పేజీ 1117) అంగీకరించినప్పటికి ఫిబ్రవరి మధ్యలో రేషన్ కేంద్రాలపై దాడులు చేసిన 80,000 మందితో అల్హాబాద్‌లో చేసిన ప్రదర్శన లాంటి ప్రజా వెల్లువని కాంగ్రెస్ లీగులు ఆపలేకపోయాయి.

## రాయల్ ఇండియన్ నేవీ (RIN) తిరుగుబాటు

అన్నిటినీ మించింది, 1946 ఫిబ్రవరి 18-23 కాలంలో బొంబాయిలలో జరిగిన వీరోచితమైన తిరుగుబాటు. చాలా వీరోచితమైన దైనప్పటికి నావికాదళ తిరుగుబాటు స్వాతంత్ర్య పోరాటంలో ఒక విధంగా విస్మరింపబడింది. యుద్ధకాల విస్తరణలో భాగంగా రాజకీయంగా ఎదగని జాతుల నుండి నియమించే పద్ధతిని పక్కనబెట్టి దేశంలోని అన్ని ప్రాంతాలకు చెందిన వారిని రాయల్ ఇండియన్ నేవీలో చేర్చుకొనడం జరిగింది. సామ్రాజ్యం యొక్క చివరి దుర్గమైన నేవీలో కూడా జాతివివక్ష నిరాటంకంగా కొనసాగుతున్నది. విదేశాలలో పని చేయడం వలన సైనికులకు ప్రపంచ పరిణామాలు అవగతమయ్యాయి. ఐ.ఎన్.ఎ. విచారణలు భారతదేశంలో యుద్ధానంతరం ఉప్పొంగిన ప్రజావెల్లువ కారణంగా ప్రత్యేక ప్రాధాన్యతని సంతరించుకొన్నాయి. ఫిబ్రవరి 18న తల్వార విభాగానికి చెందిన శిక్షణ పొందుతున్న సైనికులు సరియైన ఆహారం సరఫరా చేయబడకపోవడం వలననూ, జాతి పరమైన అవమానాలకు వ్యతిరేకంగాను నిరాహారదీక్ష చేపట్టారు. మరుసటి రోజు సమ్మె కేజిల్‌కి తీరాన వున్న ఫోర్ట్ బేరక్స్‌కి, బొంబాయి రేవులోని 22 నౌకలకు విస్తరించింది. తిరుగుబాటు చేసిన నావికులు తెరచాపలపై త్రివర్ణ, నెలవంక, ఎర్రజెండాలు ఎగురవేశారు. తిరుగుబాటుదారులు యం.యస్. ఖాన్ నాయకత్వంలో 'నేవల్ సెంట్రల్ స్ట్రైక్ కమిటీ'ని ఎన్నుకొన్నారు. మంచి ఆహారం, తెల్లవారికి భారతీయులకు సమాన జీతాలు లాంటి సమస్యలతో పాటు ఐ.యన్.ఎ. యితర రాజకీయ ఖైదీల విడుదల, ఇండోనేషియా నుండి భారతీయ సైన్యాన్ని వెనక్కి రప్పించడం లాంటి రాజకీయ నినాదాలతో డిమాండ్ల పత్రాన్ని రూపొందించారు. శాంతియుతమైన సమ్మెకి, నిర్ణయాత్మకమైన తిరుగుబాటుకి మధ్య సరిహద్దురేఖ విషయంలో ఊగిసలాడారు. ఫిబ్రవరి 20 సాయంత్రానికి వారి వారి నౌకలకు బేరక్స్‌కి చేరుకోవాలనే ఆదేశాలను పాటించడానికి సన్నద్ధమయ్యారు. కాని సైనిక వలయంలో చిక్కుకొన్నారు. మరుసటిరోజు కేజిల్ బేరక్సు వద్ద యుద్ధం ప్రారంభమయింది. నౌకల నుండి సరఫరా చేయబడిన ఆయుధాలతో సైనికవలయాన్ని ఛేదించయత్నించారు. అడ్మిరల్ గాడ్‌ఫ్రే ఆదేశాల మేరకు బాంబులు కురిపించే యుద్ధ విమానాలు వారిని చుట్టుముట్టాయి. నావికా దళం మొత్తాన్ని ధ్వంసం చేస్తామని బెదిరించాయి. ఆ సాయంత్రం సౌభ్రాతృత్వం వెల్లి విరిసింది. ప్రజలు గుంపులుగా వచ్చి గేట్‌వే ఆఫ్ ఇండియా వద్ద ఆహార పదార్థాలు సరఫరా చేశారు. నావికుల కవసరమైనవన్నీ తీసుకొనమని షాపు యజమానులు ఆహ్వానించారు. ఫిబ్రవరి 22 నాటికి సమ్మె దేశవ్యాప్తంగా గల నావికాస్థావరాలకు

అలాగే సముద్రాలలో వున్న నౌకలకు వ్యాపించింది. సమ్మె ఉధృతంగా వున్నప్పుడు 78 నౌకలు 20 రేవు స్థావరాలు 20,000 మంది నావికులు పాల్గొన్నారు. కరాచీలో తుపాకీ యుద్ధం తరువాత హిందూస్తాన్' లొంగిపోయింది. కాని హిందూ ముస్లిం యువకులు, కార్మికులు పోలీసులతో సైన్యంతో హింసాత్మక ఘర్షణలతో వారి మద్దతుని చాటుకొన్నారు.

బొంబాయిలోనూ, దేశవ్యాప్తంగానూ ఫిబ్రవరి 22 నాటి ఈ నాటకీయ పరిణామాలపై రెండు విభిన్నమైన వైఖరులు వ్యక్తమయ్యాయి. బొంబాయి కమ్యూనిస్టు పార్టీ సాధారణ సమ్మెకి పిలుపిచ్చింది. అరుణా అసఫాలి, అచ్యుత్ పట్వర్థన్ లాంటి కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. కాని సర్దార్ పటేల్ దీనిని పట్టించుకోకుండా ఎవరి పనులు వారు చేసుకోండని సలహాయిచ్చాడు. బొంబాయి ప్రావిన్సు కాంగ్రెస్ అధ్యక్షుడు యస్.కె.పాటిల్, లీగు అధ్యక్షుడు చంద్రేగల్ మామూలు పరిస్థితులు నెలకొల్పడానికి వలంటీర్లను సమకూర్చుతామన్నారు. కాంగ్రెస్, లీగు వ్యతిరేకించినప్పటికి ఫిబ్రవరి 22న బొంబాయిలలో 3,00,000 మంది కార్మికులు పనిముట్లు క్రింద పడవేశారు. మిల్లులు మూసివేశారు. రోడ్లకు అడ్డంకులు పెడుతున్న గుంపులపై ప్రత్యేకించి కార్మిక జిల్లాలైన పరేల్ డెలిజల్ రోడ్డులపై రెండు రోజులపాటు ఘర్షణలు సాగించారు. బొంబాయిలో సాధారణ పరిస్థితులు నెల కొల్పడానికి రెండు ఆర్మీబెటాలియన్లు అవసరమయ్యాయి. అధికారలెక్కల ప్రకారం 228 మంది సాధారణ పౌరులు హతులయ్యారు. 1046 మంది గాయపడ్డారు. ముగ్గురు పోలీసులు హతులయ్యారు. 91 మంది గాయపడ్డారు. (ఆర్.ఐ.యన్ సమ్మె, బాధితులైన నావికా దళం గ్రూపు ఢిల్లీ, 1954 పేజి 93; మాన్సెర్గ్ వాల్యూం - 6 పేజీలు 1082-31)

పటేల్ జిన్నా తోడ్పాటుతో తిరుగుబాటు చేసిన నావికులకు ఎలాంటి నష్టం జరగకుండా జాతీయ పార్టీలు అడ్డుకొంటాయని హామీయిచ్చి ఫిబ్రవరి 23న లొంగిపొమ్మని నచ్చచెప్పారు. హామీ సమయోచితంగా విస్మరించబడింది. 1946 మార్చి 1న పటేల్ ఆంధ్ర కాంగ్రెస్ నాయకుడు విశ్వనాధానికి ఇలా వ్రాశాడు. ''సైన్యంలో క్రమశిక్షణ ఉల్లంఘించబడకూడదు. స్వతంత్రభారత దేశంలో సైన్యం మనకూ కావాలి (సర్దార్ లేఖలు వాల్యూం - 4 అహమ్మదాబాద్ 1977, పేజి 165). బొంబాయి రమ్మని అరుణ అసఫాలి పంపిన ఆహ్వానాన్ని నెహ్రూ అంగీకరించారు. కాని 'హింసాయుత తిరుగుబాటుని అణచివేయవలసిన అవసరాన్ని వెంటనే గుర్తించాడు'. కాని సైన్యానికి ప్రజలకు మధ్య వున్న ఇనుప గోడని ఆర్.ఐ.యన్.సమ్మె బద్దలుకొట్టిందని నెహ్రూ ఆ తరువాత ప్రశంసించాడు. (మాన్సెర్గ్ వాల్యూం-6 పేజి 1084, 1117, 18) గాంధీ కూడా పటేల్ లాగానే పూర్తిగా ప్రతికూలంగా వున్నాడు. భారత దేశంలో ఒక చెడు సాంప్రదాయాన్ని ప్రవేశపెట్టినందుకు నావికుల సమ్మెని ఖండించాడు. వారికేమైనా సమస్యలు వుంటే శాంతియుతంగా వారి ఉద్యోగాలకు రాజీనామా చేయవలసిందిగా సలహాయిచ్చాడు. అంతేగాక 'హింసాయుత హిందువులు ముస్లింలు యితరులు సమిష్టిగా వ్యవహరించడం అపవిత్రమైనది అని ఆశ్చర్యకరమైన ప్రకటన చేశాడు.

అంతేగాక రాజ్యాంగ వేదిక మీద కంటే హిందూ ముస్లింల్ని ఐక్యపరచడం బారికేడ్ల వద్ద సులభమని బాధాకరమైన దైనప్పటికి నిర్దిష్టమైన అంచనా వేయగలిగారు. (సర్దార్ లేఖలు పేజీలు 162-3) 'హిందువులు ముస్లింల ఐక్యతతో వచ్చే కష్టాల్లో మనం ఏ విధంగానైనా నివారించాలి' అని వేవల్ 1946 మే 30న చేసిన వ్యాఖ్యని ఫిబ్రవరి 22న గాంధీ చేసిన వ్యాఖ్యని ప్రక్క ప్రక్కన పెట్టి పరిశీలించాలనే ఉత్సుకత ఈ సందర్భంగా సహజంగా కలుగుతుంది. (వైస్రాయి జర్నల్ పేజి 485)

1946 ఫిబ్రవరి నావికా తిరుగుబాటులో పాల్గొన్న సైనికులకు అజాద్‌హింద్ ఫౌజు సైనికుల లాగా జాతీయ వీరుల స్థాయి కల్పించబడలేదు. జపాన్ యుద్ధం ఖైదీలుగా (మగ్గడానికి ప్రత్యామ్నాయంగా భారత జాతీయ సైన్యంలో చేరడంకంటే నావికా దళ సైనికులు పెద్ద ప్రమాదాల్ని ఎదుర్కొనడానికి సిద్ధపడ్డారు. నేవల్ సెంట్రల్ స్ట్రైక్ కమిటీ యిచ్చిన తుది సందేశం మన జాతి జీవితంలో మా సమ్మె చారిత్రక ఘటన మొట్టమొదటి సారిగా సైనికుల రక్తం వీధులలో వున్నా సాధారణ ప్రజల రక్తం ఉమ్మడి ప్రయోజనం కొరకు కలిసి ప్రవహించింది. సైనికులుగా వున్న మేము దీని నెప్పుడూ మరచిపోము. మా సోదరసోదరీమణులైన మీరూ మరచిపోరని మీకు తెలుసు. మన దేశ ప్రజలు వర్థిల్లాలి. జైహింద్ (ఆర్‌ఐయన్ సమ్మె పేజి 75)

## 1946 (మార్చి - ఆగస్టు) మంత్రి వర్గరాయబారం

### ఎన్నికలు

కాంగ్రెస్ నాయకులు ప్రజా ప్రతిఘటనల్ని పూర్తిగా త్రోసిపుచ్చి 1945-46 చలికాలంలో వారి శక్తియుక్తుల్ని ఎన్నికలపై కేంద్రీకరించారు. 1937లో లాగానే నెహ్రూ ఎన్నికల ప్రచారనాయకుడు. ప్రధానవక్త. కాని అభ్యర్థుల్ని ఎంపిక చేసే యంత్రాంగం పటేల్ అదుపులో వుంది. సరియైన అభ్యర్థుల్ని ఎంపిక చేయడంలేదని నెహ్రూ తరచుగా అసంతృప్తి వ్యక్తం చేశాడు. కాని పరిస్థితి చక్కదిద్దడానికి ఆయన చేసిందేమీలేదు. 'స్థానిక జగడాలలో తలదూర్చే కాలం ఆసక్తి నాకు లేవు' (నెహ్రూ పటేల్‌కి, 1945 అక్టోబరు 31, దుర్గాదాస్, సర్దారు పటేల్ ఉత్తర ప్రత్యుత్తరాలు వాల్యూం-2 సాధారణ (ముస్లిమేతర) సీట్లలో 57 సీట్లను కైవశం చేసుకొన్నది (1934 లో కేవలం 36 సీట్లనే గెలిచింది). ముస్లిమేతర ఓట్లలో 91.3% పొందింది. బెంగాల్ సింధు పంజాబులలో మినహాయించి అన్ని ప్రావిన్సుల్లో మెజారిటీ సాధించింది. హిందూ మహాసభ తుడిచిపెట్టబడింది. కమ్యూనిస్టులు కూడా ప్రావిన్సులలో చాలా కొద్ది సీట్లు (కార్మిక నియోజక వర్గం నుండి గెలిచిన జ్యోతిబాసుతో సహా బెంగాలులో 3, బొంబాయిలో 2, మద్రాసులో 2) మాత్రమే గెలిచారు. కాని చాలా ప్రావిన్సులలో కమ్యూనిస్టులు కాంగ్రెస్‌కి ప్రధాన ప్రత్యర్థులుగా ఎదిగారు. గట్టిపోటీ యిచ్చినప్పటికి కమ్యూనిస్టుల్ని ఓడించినందుకు పటేల్ ఆంధ్ర కాంగ్రెస్ నాయకుల్ని అభినందించాడు. (పటేల్, ఎ.కాళేశ్వర రావుకి 1946 మార్చి 27) 'కమ్యూనిస్టులు మెజార్టీ సాధిస్తారని మితవాద కాంగ్రెస్ నాయకులు నిరాశతో అంచనాలు వేస్తున్నారు'. ( నైట్ వేవల్‌కి 1946 ఏప్రిల్ 5 మాన్సెర్గ్ వాల్యూం-6 పేజి 152).

లీగు కూడా ముస్లిం సీట్లలో అద్భుత విజయం సాధించింది. కేంద్ర అసెంబ్లీకి రిజర్వు చేయబడిన మొత్తం 30 స్థానాల్ని 86.6 శాతం ముస్లిం ఓట్లు, సాధించి కైవశం చేసుకొన్నది. ప్రావిన్సులలోని 509 ముస్లిం సీట్లలో 442 సీట్లని గెలిచింది. 1937లో వలె గాక ముస్లింలలో ఆధిపత్యంగల పార్టీగా స్పష్టంగా నిరూపించుకొన్నది. పంజాబ్‌లో పెద్ద పురోగతి (175 సీట్లకు గాను 79, గతంలో కేవలం 2 సీట్లు మాత్రమే వున్నాయి. సాధించినప్పటికి కీలకమైన ఆ రాష్ట్రంలో మెజార్టీ సాధించలేకపోయింది. ఖిజార్ హయత్‌ఖాన్ కాంగ్రెస్‌తోను అకాలీలతోను బేరసారాలాడి ఒక సంవత్సరం వరకు అధికారంలో కొనసాగేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. పాకిస్తాన్‌కి అనుకూలమైనవిగా చెప్పబడుతున్న మరి రెండు ప్రావిన్సులలో - వాయవ్య సరిహద్దు రాష్ట్రం, అస్సాంలలో కాంగ్రెస్ మంచి మెజార్టీలు సాధించింది. బెంగాలు సింధులలో ఏర్పాటు చేయబడిన లీగు మంత్రి వర్గాలు అధికార యూరోపియన్ మద్దతుపై ఆధారపడవలసి వచ్చింది.

ఇటీవలి మాసాలలో కలకత్తా బొంబాయి కరాచీ వీధులలో వెల్లువెత్తిన బ్రిటిషు వ్యతిరేక ఐక్యతకు భిన్నంగా ఈ ఎన్నికలలో మితవాద ఓటింగు పెరగడం గమనించవలసిన అంశం. ప్రత్యేక నియోజక వర్గాల తర్కంతోపాటు, చాలా కొద్ది మందికి పరిమితం చేయబడిన ఓటు హక్కు (ప్రావిన్సులలో 10% ప్రజానీకానికి, కేంద్ర అసెంబ్లీకి 1% ప్రజానీకానికి) కూడా ఫలితాల్ని ప్రభావితం చేసి వుండవచ్చు. ఉదాహరణకు వాయవ్యఆ సరిహద్దు రాష్ట్రం గవర్నరు 1946 ఫిబ్రవరిలో వేవల్‌కి యిలా తెలియజేశారు. ముస్లిం అధికారులు బడాఖాన్‌లు భూస్వాములు లీగుకి అనుకూలంగా వున్నప్పటికి ఆర్థిక సంస్కరణల వాగ్దానాల కారణంగా కాంగ్రెస్ పేద ముస్లింల మద్దతు పొందగలుగుతున్నది. కాని ఈ వాగ్దానాలు 1937 తరువాత గాని లేక 1946-47 లో గాని అమలు జరపబడలేదు. (మాన్సెర్గ్ వాల్యూం-6 పేజి 1085) ఈ సందర్భంగా 1930లలో కాంగ్రెస్ ప్రధాన నినాదమైన 'సార్వత్రిక ఓటింగ్ ద్వారా ఎన్నికయ్యే రాజ్యాంగబద్ధమైన అసెంబ్లీని' విస్మరించడం ఘటనల క్రమాన్ని అర్థం చేసుకొనడానికి తోడ్పడుతుంది. భారత రాజకీయ గ్రూపులన్నింటిలో ఒక్క కమ్యూనిస్టులు మాత్రమే సార్వత్రిక ఓటింగు కొరకు గట్టిగా డిమాండు చేశారు. పి.సి. జోషి అధికారం కొరకు తుది యత్నం' అనే కరపత్రంలో భాషా ప్రాతిపదిక ప్రాంతాలు సార్వత్రిక ఓటింగు ద్వారా సర్వసత్తాక రాజ్యాంగ పరిషత్తులకు ఎన్నుకుంటాయని, అలా ఎన్నుకోబడిన పరిషత్తులు అఖిల భారత రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నుకుంటాయని ప్రతి ప్రాంతం లేక జాతికి విడిపోయే హక్కు వుండాలని పేర్కొన్నాడు. బ్రిటిషువారి 'మంచి ఉద్దేశాల' పట్ల కాంగ్రెస్‌కి లీగుకి గల భ్రమల్ని విమర్శించాడు. బ్రిటిషువారికి వ్యతిరేకంగా జరిగే తుది సమరంలో కాంగ్రెస్ లీగు కమ్యూనిస్టుల ఐక్యవేదిక కొరకు పిలుపిచ్చారు. మంత్రివర్గ రాయబార సంఘాన్ని కలిసినప్పుడు పి.సి. జోషి సార్వత్రిక ఓటింగును డిమాండ్ చేశాడు. కాని కాంగ్రెస్ నాయకులు దీనికి విరుద్ధంగా పరిమితమైన ఓటింగు ప్రాతిపదికన ఏర్పడిన ప్రస్తుత ప్రొవిన్షియల్ చట్ట సభలచే రాజ్యాంగ పరిషత్ ఎన్నుకొనబడడానికి అంగీకరించారు. పూర్తి ప్రజాస్వామ్య ఎన్నికల ద్వారా గాని, ప్రభుత్వ అణచివేతని ఎదుర్కొని సాగించిన నిరంతర ప్రజా ఉద్యమాల ద్వారా గాని మెజార్టీ ముస్లింలకు

తాను ప్రాతినిధ్యం వహిస్తున్నానని నిరూపించుకొనకుండానే లీగు పాకిస్తాన్ డిమాండుకి ఆమోదం పొందింది. 1947 తరువాత కాంగ్రెస్ అఖిల భారత ఎన్నికలలో 30 సంవత్సరాలుగా గెలిచింది. సార్వత్రిక ఓటింగ్ పద్ధతిని తూర్పు పాకిస్తాన్‌లో జరిపిన తొలి ఎన్నికలలో (1954లో) లీగు తుడిచి పెట్టబడింది. పశ్చిమ పాకిస్తాన్‌లో కూడా రాజకీయ స్థిరత్వాన్ని సమకూర్చడంలో విఫలమయింది.

## మంత్రి వర్గ రాయబార సంఘం

ముగ్గురు బ్రిటిషు మంత్రివర్గ సభ్యులు భారత రాజ్య కార్యదర్శి పెథిక్ లారెన్స్, క్రిప్సు, అలెగ్జాండర్‌లు వేవల్‌తో కలిసి భారత నాయకులతో రెండు సమస్యలపై తాత్కాలిక ప్రభుత్వం, భారతదేశానికి స్వతంత్రం యిచ్చేందుకు అవసరమైన నూతన రాజ్యాంగం యొక్క విధి విధానాలపై సుదీర్ఘమైన చర్చలు జరిపారు. మార్చి 15న అట్లీ కామన్స్ సభలో భారతదేశానికి త్వరలో పూర్తి స్వతంత్రం యివ్వనున్నట్లు ప్రకటన చేశాడు. 'మైనార్టీల హక్కుల్ని పరిగణనలోకి తీసుకుంటూనే – మెజారిటీ పురోగతిని అడ్డుకొనేందుకు మైనార్టీ వీటో హక్కుని అనుమతించం' అని పేర్కొన్నాడు. (వి.పి. మీనన్, భారతదేశంలో అధికార మార్పిడి పేజి 237). మంత్రివర్గ రాయబార సంఘం కాంగ్రెస్‌తో అతి స్నేహితంగా వుండడం పట్ల వేవల్ ఆందోళన చెందాడు. ఉదాహరణకు క్రిప్సు గాంధీకి మంచినీళ్ల గ్లాసు స్వయంగా తెచ్చియిచ్చాడు. రాయబార సంఘం కాంగ్రెస్ జేబు సంస్థగా పని చేస్తుందని వైస్రాయి జర్నల్ ఆరోపించింది. (వైస్రాయి జర్నల్ పేజీలు 236,324–5) కొన్ని సందర్భాలలో మంత్రివర్గ రాయబార సంఘం కాంగ్రెస్‌వైపు మొగ్గు చూపినట్లు కన్పించినప్పటికి అందుకు లేబరు పార్టీ యొక్క జాతీయ వాద అనుకూల వైఖరి గాని లేక క్రిప్సుకి నెహ్రూతో గల పాత సంబంధాలు గాని కారణాలు కావు. అందుకు కారణం వేవల్ మార్చి 29న వివరించినట్లుగా "ప్రజా ఉద్యమాన్ని గాని విప్లవాన్నిగాని నివారించవలసిన అవసరం. ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించగల శక్తి కాంగ్రెస్‌కి వుంది. దానిని అదుపుచేయగలమనే ధైర్యం మనకు లేదు. (వైస్రాయి జర్నల్ పేజి 232). కాంగ్రెస్ నాయకత్వం అధికారాన్ని అందిపుచ్చుకోవాలనే ఆతురతతో ఏ విధంగానైనా సాధారణ పరిస్థితుల్ని నెలకొల్పాలనే కోరికతో వున్నది. ఎలాంటి పోరాటానికి సుముఖంగా లేదు. కాని ఏప్రిల్‌లో విస్తృతంగా పోలీసు సమ్మెలు జరిగాయి. (మలబారు, అండమాన్స్, డక్కా, బీహారు, ఢిల్లీలలో) వేసవి కాలమంతా రైళ్ల రాకపోకల స్తంభన, జూలైలో పోస్టలు సమ్మె హెచ్చరికలు వెలువడ్డాయి. ఆగస్టు 16 కలకత్తా హత్యాకాండకు మూడు వారాల ముందు జూలై 29న కమ్యూనిస్టుల నాయకత్వంలో పోస్టల్ ఉద్యోగులకు సానుభూతిగా శాంతియుతమైన బంద్ జరిగింది. 1946 సంవత్సరంలోని సమ్మె ఉధృతి గతంలోని అన్ని రికార్డుల్ని అధిగమించింది. 1629 చోట్ల పనులు ఆపివేయబడ్డాయి. 1,941,948 మంది కార్మికులు పాల్గొన్నారు. 12,712,762 పని దినాలు నష్టపోయారు. కార్మికులలో పెరుగుతున్న క్రమశిక్షణారాహిత్యాన్ని, బాధ్యతల పట్ల నిర్లక్ష్య ధోరణిని ఖండిస్తూ ఆగస్టులో వర్కింగు కమిటీ చేసిన తీర్మానం కాంగ్రెస్ అధిష్టాన వర్గం వైఖరిని స్పష్టం చేసింది. కాంగ్రెస్ నాయకత్వం చర్చలలో మంత్రివర్గ నిర్మాణంలో కూరుకుపోయింది. (రైల్వే) కార్మికుల డిమాండ్లలోని హేతురాహిత్యాన్ని, వాటిని అనుమతిస్తే

వచ్చే ప్రమాదాన్ని నెహ్రూ గుర్తించడం వేవల్‌కి ఊరట కలిగించింది. సెప్టెంబరులో తాత్కాలిక ప్రభుత్వంలో మంత్రి అయిన శరత్‌బోస్ ఢిల్లీ విద్యుత్ కార్మికులు సమ్మె చేస్తారనే సూచన అందీ అందగానే సైన్యాన్ని బ్రిటిషు సాంకేతిక నిపుణుల్ని రప్పించాలని పిలుపిచ్చి వైస్రాయిని ఆశ్చర్యచకితుణ్ణి చేశాడు. (వైస్రాయి జర్నల్ పేజీలు 279,352) చివరికి మంత్రి వర్గం రాయబార పథకం తాత్కాలిక ప్రభుత్వం విన్యాసాలు, మతమారణహోమం విభజన మార్గానికి మెట్లయ్యాయి.

జిన్నా పాకిస్తాన్‌కై పట్టుపట్టడంతో తొలివిడత చర్చలు ఆగిపోయాయి. మే 16న మంత్రివర్గ రాయబార సంఘం ఒక పథకాన్ని సూచించింది. ప్రతిష్టంభన తాత్కాలికంగా తొలగిపోయింది. ఇది జిన్నా, పురుగుతొలిచిన పాకిస్తాన్‌కి ఐక్యంగా వుంటే భారతదేశంలో వాయవ్య ఆగ్నేయ రాష్ట్రాలపై ముస్లింలు ఆధిపత్యం చెలాయించగల మూడంచెల నిర్మాణంగల సమాఖ్యకి మధ్య ఎంపిక చేసుకోవలసిన స్థితికి నెట్టింది. ముస్లిమేతరులు పెద్ద సంఖ్యలో (ఉదాహరణ బెంగాలు, అస్సాంలలో 48.3%) వుంటారు గనుక పూర్తి స్థాయి పాకిస్తాన్ అసాధ్యమని మంత్రివర్గ రాయబార సంఘం తేల్చి చెప్పింది. లీగు కోరుతున్న మతపరమైన స్వయం నిర్ణయాధికార సూత్రం హిందూ మెజార్టీ గల పశ్చిమ బెంగాల్ (ముస్లింలు 23.6% గల కలకత్తాతో సహా) విభజన కోరుతుందని, అలాగే సిక్కులు హిందువులు అధిక సంఖ్యలోగల పంజాబ్‌కి చెందిన అంబాలా జలంధర డివిజన్ల విభజన కోరుతుంది. దేశాన్ని విభజించేటట్లయితే తమకు ప్రత్యేక దేశం కావాలని కొందరు సిక్కునాయకులు కోరారు. బెంగాలు పంజాబుల విభజన దృఢంగా నాటుకొని యున్న ప్రాంతీయ సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. చాలా ఆర్థికపరమైన పాలనా పరమైన సమస్యల్ని సృష్టిస్తుంది. విభజించినప్పటికి లీగుని సంతృప్తిపరచడం జరగదు. అందువలన రాజ్యాంగ పరిషత్తుని ఎన్నుకొనే సందర్భంలో ప్రస్తుత ప్రావిన్సుల అసెంబ్లీలకు అలాగే కొనసాగనిస్తూ వాటిని మూడు సెక్షన్లుగా విభజించాలని ఇక విదేశీ వ్యవహారాలు రక్షణ తన అధీనంలో వుంచుకునే కేంద్ర ప్రభుత్వం వుండాలని ప్రత్యామ్నాయం సూచించబడింది. హిందూ మెజార్టీ ప్రావిన్సులు సెక్షన్ 'ఎ'లోను, ముస్లిం మెజార్టీ గల వాయవ్య ఈశాన్య (అస్సాంతో సహా) ప్రావిన్సులు సెక్షన్ 'బి', 'సి'లలో వుంటాయి. ఈ సెక్షన్లకు వాటి స్వంత మధ్యతరహా కార్యనిర్వాహక వర్గాల్ని, చట్ట సభల్ని ఏర్పాటు చేసుకునే హక్కు వుంటుంది.

ఈ దీర్ఘకాలిక పథకానికి రెండు పెద్ద పార్టీల అంగీకారం (జూన్ 6న లీగు జూన్ 24న కాంగ్రెస్ అద్భుతమైన ఘటనగా మౌలానా అజాద్ తరువాత వర్ణించారు. (ఇండియా విన్స్ ఫ్రీడం పేజి 151) పరస్పర విరుద్ధమైన వ్యాఖ్యల ఆధారంగా అంగీకారం కుదిరింది గనుక ఒప్పందానికి తాత్కాలిక స్వభావం వుండక తప్పదు. సెక్షన్లు 'బి' 'సి'లు విడివిడిగా వుంటే పాకిస్తాన్ ఏర్పాటుకి అవకాశం వుంటుంది. గనుక గ్రూపుల విభజన నిర్బంధంగా జరగాలని లీగుకోరింది. అంతేగాక ఈ పథకాన్ని కాంగ్రెస్ తిరస్కరిస్తుందని జిన్నా భావించాడు. అలాంటి సందర్భాలలో కేంద్రంలో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవలసిందిగా బ్రిటిషువారు లీగుని కోరతారని ఆశించాడు. వేవల్ కూడా జిన్నా లాగానే ఆలోచించాడు. కాంగ్రెస్ ఆమోదించబడటంతో జిన్నా, వేవల్ నిరుత్సాహపడ్డారు. (వైస్రాయి జర్నల్ జూన్

25, పేజి 305), నిర్బంధంగా గ్రూపుల విభజన తరచుగా చెప్పబడుతున్న రాష్ట్రాల స్వయం ప్రతిపత్తికి విరుద్ధంగా కాంగ్రెస్ వాదించింది. గ్రూపులుగా విభజించడం మొదట నిర్భంధమైనప్పటికి, రాజ్యాంగానికి తుదిరూపం ఇవ్వబడిన తరువాత, ఆ రాజ్యాంగం ప్రకారం ఎన్నికలు జరుపబడిన తరువాత రాష్ట్రాలకు విడిపోయే స్వేచ్ఛ వుంటుందని మంత్రివర్గ రాయబార సంఘం యిచ్చిన వివరణ కూడా కాంగ్రెస్‌ని సంతృప్తిపరచలేకపోయింది. స్వదేశీ సంస్థానాల నుండి ఎన్నికైన సభ్యులకు ప్రతిపాదిత రాజ్యాంగ పరిషత్తులో ఎలాంటి అవకాశం లేకపోవడాన్ని గురించి కాంగ్రెస్ విమర్శించింది. కాంగ్రెస్ కొత్త అధ్యక్షుడు నెహ్రూ జూలై 10న పత్రికా గోష్ఠిలో తమ పార్టీ రాజ్యాంగ పరిషత్ ఎన్నికలలో పాల్గొంటుందని ప్రకటించాడు. సెక్షన్ 'బి''సి'లలో చేరడానికి వాయవ్య సరిహద్దు రాష్ట్రం అస్సాంలకు అభ్యంతరాలున్నందున 'గ్రూపుల విభజనకు అవకాశం వుండకపోవచ్చు' నన్నాడు. జూన్ 29–30 లలో లీగు దీర్ఘకాలిక పథకానికి అంతకు ముందు తెలిపిన అంగీకారాన్ని ఉపసంహరించుకొన్నది. ప్రత్యేక పాకిస్తాన్ సాధించేందుకు ఆగస్టు 16 నుండి ప్రత్యక్ష చర్య చేపట్టాలని 'ముస్లిం జాతికి' పిలుపిచ్చింది. (మాన్సెర్గ్ వాల్యూం–8 పేజీలు 25–26,139).

ఈ కాలంలో కేంద్రంలో తాత్కాలిక సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకు వేవల్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. తాత్కాలిక ప్రభుత్వంలో ఐదుగురు కాంగ్రెస్ హిందువులు, ఐదురుగు లీగు ముస్లింలు, ఒక సిక్కు, ఒక షెడ్యూల్డు కులం ప్రతినిధి నిష్పత్తిలో బాధ్యులుగా వుండాలని జిన్నా ప్రతిపాదించాడు. అలాంటి వివక్ష సిమ్లా సదస్సు నిర్ణయాల నుండి వెనుకడుగు వేయడంగా పేర్కొంటూ కాంగ్రెస్ తిరస్కరించింది. కాంగ్రెస్ నామినేట్ చేసే సభ్యులలో ముస్లింల్ని హరిజనుల్ని చేర్చే హక్కు వుండాలని కోరింది. సరియైన మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయాలని, అది వైస్రాయి కార్యనిర్వాహక మండలి కొనసాగింపుగా వుండకూడదని డిమాండు చేసింది. ఫలితంగా వేవల్ జూలై 5న కేవలం అధికారులతో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవలసి వచ్చింది. కాని కొద్ది వారాలలోనే తాత్కాలిక ప్రభుత్వంలో లీగు చేరకపోయినప్పటికి కాంగ్రెస్‌ని చేర్చవలసిన అవసరం వుందని వేవల్ పట్టుబట్టాడు. సిమ్లా సదస్సులో వేవల్ వైఖరికి, ఒక నెల క్రితం వరకు గల అతడి ప్రాధాన్యతలకు ఇది పూర్తిగా భిన్నమైన వైఖరి. కాంగ్రెస్ బాధ్యత తీసుకుంటే వారు అరాచకశక్తుల్ని అదుపులోపెట్టడం అవసరమని గుర్తిస్తారు. కమ్యూనిస్టుల్ని అణచివేయవచ్చు. కాంగ్రెస్‌లోని వామపక్షాన్ని లొంగదీయ యత్నించవచ్చు. రాజకీయాలకు వారికి వ్యవధి యివ్వకుండా పాలనా వ్యవహారాలలో వారికి తీరికలేకుండా చేయాలని కోరుకుంటున్నాను' (వేవల్ రాజ్య కార్యదర్శికి 1946 జూలై 31, మాన్సెర్గ్ వాల్యూం–8 పేజి 154). ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టరు ఆగస్టు 9న ఇలాంటి అంశాన్నే ప్రస్తావించాడు. కార్మిక పరిస్థితి అంతకంతకు ప్రమాదకరంగా పరిణమిస్తుంది. కేంద్రంలో భారతీయుల బాధ్యతాయుత ప్రభుత్వాన్ని నెలకొల్పేవరకు దాదాపు చేయగలిగిందేమీ లేదు. కేంద్రంలో బాధ్యతాయుత ప్రభుత్వం స్థాపించబడితే కార్మికులతో యిప్పటికంటే నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తుంది. మరొకసారి కాంగ్రెస్ వలలో చిక్కుకున్నది. దేశంలో విస్తరిస్తున్న అరాచకాన్ని నివారించడానికి కాంగ్రెస్ ప్రభుత్వంలో చేరాలని పటేల్‌కి నమ్మకం కుదిరిందని, ఆయన అభిప్రాయాలకు ఆమోదం లభించకపోతే

వర్కింగు కమిటీ నుండి రాజీనామా చేస్తానని బెదిరింపుకి సిద్ధపడ్డారని ఆగస్టు 5 నాటికి వేవల్‌కి సమాచారం అందింది. సెప్టెంబరు 2న నెహ్రూ నాయకత్వంలో కాంగ్రెస్ ఆధిపత్యంగల తాత్కాలిక ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసింది.

## 1946-47 మతమారణ కాండ ; రైతాంగ తిరుగుబాటు

### కలకత్తా, నౌఖాలీ బీహారు, పంజాబ్ :

1946 ఆగస్టు 16 నుండి గతంలో ఎన్నడూలేనంత తీవ్ర స్థాయిలో భారతదేశమంతటా మతకలహాలు మొదలయ్యాయి. ఆగస్టు 16–19లలో కలకత్తాలో ప్రారంభమయ్యాయి. సెప్టెంబరు 1కి బొంబాయికి చేరాయి. తూర్పు బెంగాలులోని నౌఖాలీకి (అక్టోబరు 10) బీహారుకి (అక్టోబరు 25) యు.పి.లోని గర్ముక్తేశ్వర్‌కి (నవంబరు) వ్యాపించాయి. 1947 మార్చి నుండి పంజాబుని ముంచెత్తాయి. ప్రతిచోట మతపరమైన ఉద్రిక్తతలు రెచ్చగొట్టబడ్డాయి. దొమ్మీల స్వరూపం విస్తృతులలో వ్యత్యాసాలున్నాయి. కలకత్తాలో లీగు మంత్రివర్గం ప్రత్యక్ష చర్య దినాన్ని సెలవు దినంగా ప్రకటించింది. మైదానంలో బహిరంగ సభ తరువాత పెద్దఎత్తున ముస్లిం దాడులు మొదలయ్యాయి. పోలీసులు, సైన్యం జోక్యం చేసుకోకుండా చూస్తానని ముఖ్యమంత్రి సుహ్రావర్థ వాగ్దానం చేశాడు. "చాలా సమయాన్ని లాల్‌బజారు కంట్రోలు రూంలో గడిపారు. తన మతం వారు అనుభవించిన బాధల్ని ఏకరువుపెట్టి రెచ్చగొట్టారు. హిందువులు, ప్రత్యేకించి ముస్లింలు దాడుల్ని ప్రతిఘటించారు. 'కలకత్తా నేర ప్రపంచానికి చెందిన ప్రత్యర్థి గ్రూపుల సైన్యాల మధ్య హత్యాకాండ యధేచ్ఛగా సాగింది.' ఆగస్టు 19 నాటికి కనీసం 4000 మంది చంపబడ్డారు. 10,000 మంది గాయపడ్డారు. వీధులలో కుళ్లి కంపుగొడుతున్న అసంఖ్యాకమైన శవాలను తొలగించడం పెద్ద సమస్య అయింది. గతంలో లాగా దేవాలయాల్ని మసీదుల్ని కూల్చడం మానభంగాలు, ప్రత్యర్థి మతానికి చెందిన వారి ఆస్తిపాస్తుల ధ్వంసం– కలకత్తా దాడుల లక్ష్యాలుగా లేవు. హత్యలే లక్ష్యాలుగా దాడులు జరిగాయి. హిందువులకంటే ముస్లింలు అధిక సంఖ్యలో హతులయ్యారు. హత్యాకాండకు బ్రిటిషువారు బాధ్యత వహించాల్సి ఉంది. 1945 నవంబరు, 1946 ఫిబ్రవరిలో వలెగాక హత్యాకాండ జరిగిన 24 గంటల తరువాత సైన్యాన్ని రప్పించడం జరిగింది. కలకత్తాలో రెండవ దఫా దొమ్మీలు 1947 మార్చి 26, ఏప్రిల్ 1 మధ్య కాలంలో జరిగాయి. ఆ తరువాత అలజడులు కత్తిపోటు ఘటనలు స్వతంత్రం ప్రకటించేవరకు కొనసాగుతూనే వున్నాయి.

బొంబాయి నగరంలో మూకుమ్మడి దాడులు గాక కత్తిపోట్లు సర్వసాధారణమయ్యాయి. ఇలాంటి ఘటనలలో సెప్టెంబరులో 162 మంది హిందువులు 158 మంది ముస్లింలు హతులయ్యారు. అశాంతి నెలకొన్న తూర్పు బెంగాలులోని నౌఖాలీ, తిప్పెర జిల్లాలలో అత్యధిక రైతులు ముస్లింలు. భూస్వాములు వర్తకులు, వృత్తి గ్రూపులలో అత్యధికులు హిందువులు. వాయవ్య నౌఖాలీ, ప్రక్కనే వున్న నైరుతి తిప్పెరలో కలకత్తా దాడులలో జరిగిన హత్యలకు భిన్నంగా ఆస్తులపై దాడులు మానభంగాలు ఎక్కువగా జరిగాయి. కోట్ల రూపాయలలో ఆస్తి

నష్టం జరిగింది. తొలుత జమీందారులు లాయర్లు ఇతర ప్రముఖులపై దాడులు జరిగినట్లు ఫిర్యాదులు అందాయి. "ఆగ్నేయ బెంగాలులో జరిగిన దాడులు ముస్లింలు హిందువులపై చేసినవి కావు. అప్పుడున్న మతపరమైన భావాల్ని అవకాశంగా తీసుకొని అరాచకశక్తులు చేపట్టిన చర్యలు. ప్రాణనష్టం పరిమితమే. కాని పెద్ద ఎత్తున ఆస్తులు ధ్వంసం చేయబడ్డాయి. లీగు పక్షపాతవైఖరి చేపట్టింది. అరెస్టు చేయబడిన 1074 మందిలో 1947 ఏప్రిల్ నాటికి కేవలం 50 మంది మాత్రమే జైళ్లలో వున్నారు. (మాన్సెర్గ్ వాల్యూం–8 పేజీలు 725,745,753; యన్.కె.బోస్; గాంధీతో గడిపిన దినాలు పేజీలు 33,48,302)

అక్టోబరు 25న నౌఖాలీ దినం పాటిస్తున్న సందర్భంగా బీహారులో జరిగిన దాడులు మరొక నమూనాలో జరిగాయి. హిందూ రైతులు పెద్ద ఎత్తున ముస్లింలపై దాడులు చేశారు. నౌఖాలీల కంటె బీభత్సమైన హత్యాకాండ చెలరేగింది. కనీసం 7000 మంది చంపబడ్డారు. దిగ్భ్రాంతికి గురైన నెహ్రూ 'ప్రజలకు పిచ్చి పట్టిందని వ్యాఖ్యానించారు. ఆ ప్రాంతం కాంగ్రెస్‌కి (అలాగే కిసాన్ సభకి) బలమైన స్థావరం. కౌలుదారుల దృష్టిని వ్యవసాయక సమస్యల నుండి పక్కదారి పట్టించేందుకు భూస్వాములు ప్రేరేపించి వుంటారని అనుమానం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో గల పాలనా యంత్రాంగం, చాలా మంది పార్టీ సభ్యులు మతవాదానికి లోబడి పోయారని గమనించాడు. "ఇప్పుడు నేను చూస్తున్న దృశ్యం వారు (లీగు నాయకులు) సూచించిన దానికంటె భయంకరమైనది" నెహ్రూ పటేల్‌కి 1946 నవంబరు 5, దుర్గాదాస్ వాల్యూం–8 పేజి 165) బీహారు ఘటనల వెనువెంటనే యు.పి.లోని గుర్ముక్తేశ్వర్‌లో హత్యాకాండ జరిగింది. అక్కడ హిందూ యాత్రికులు 1000 మంది ముస్లింల్ని ఊచకోత కోశారు. హత్యాకాండ వార్తలతో వాయవ్య సరిహద్దు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రతిష్ఠ పూర్తిగా దెబ్బతిన్నది. 1946 అక్టోబరు మాసాంతంలో నెహ్రూ పర్యటన సందర్భంగా తెగల ప్రజలు నిరసన ప్రదర్శనలు జరిపారు. కీలకమైన మార్దాన్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పరాజయం పొందిన వెంటనే 1947 జనవరిలో హజారాలో ఘర్షణలు చెలరేగాయి.

ఈ లోపల ముస్లింలు హిందువులు సిక్కులు పంజాబులో అత్యంత ఘోరమైన హత్యాకాండకు సన్నద్ధమయ్యారు. 1945 జనవరిలో హర్యానా హిందూ జాట్ నాయకుడు ఛోటూరాం మరణంతో యూనియనిస్టు పార్టీ బలహీనపడింది. ఎన్నికలలో లీగు 79 సీట్లు సాధించినప్పటికి కేవలం 10 సీట్లలో గెలిచిన యూనియనిస్టు పార్టీకి కాంగ్రెస్ సిక్కుల మద్దతు ద్వారా ఖిజాల్ హయత్ ఖాన్ మంత్రివర్గానికి మద్దతు యిచ్చేందుకు బలదేవ్ సింగ్ చేపట్టిన ఎత్తుగడలు ముస్లిం మతవాద పాకిస్తాన్ అనుకూల వైఖరుల్ని రెచ్చగొట్టాయి. 1947 జనవరి నుండి లీగు చేపట్టిన శాసనోల్లంఘనం ఖిజాల్ మంత్రివర్గాన్ని మార్చి 3న కూల్చింది. మరుసటి రోజు కరాచీలో అసెంబ్లీ ఛాంబరు ఎదుట సిక్కులను రెచ్చగొట్టే ప్రదర్శన (తారాసింగ్ కత్తి ఝుళిపిస్తూ 'రాజ్‌కరేగా ఖల్సా' ఖల్సా పరిపాలిస్తుంది. నినాదం యిస్తూ) తరువాత పెద్దఎత్తున లాహోరు, అమృతసర్, ముల్తాన్, అట్టూర్ రావల్పిండి యింకా జిల్లాలలోని పలు గ్రామీణ ప్రాంతాలలో పెద్ద ఎత్తున ఘర్షణలు చెలరేగాయి. ముస్లిం మెజార్టీ గల ఈ ప్రాంతాలలో సిక్కులు, హిందూ వర్తకులు, వడ్డీ వ్యాపారులు లక్ష్యాలుగా దాడులు జరిగాయి. 1947 ఆగస్టు

నాటికి దాదాపు 5000 మంది చంపబడ్డారు. ఇది స్వతంత్రానంతరం సరిహద్దుకి యిరువైపుల విధ్వంసక యుద్ధానికి తెరతీసినట్లయింది. కాందిశీకుల రైళ్లు కొన్ని సార్లు కేవలం శవాల్ని మాత్రమే తీసుకొని వచ్చాయి. పెండెరెల్ మూన్ అంచనా మేరకు 1,80,000 మంది చంపబడ్డారు. పడమర 60,000 మంది తూర్పున 1,20,000 మంది. 1948 మార్చి నాటికి 6 మిలియన్ల ముస్లింలు, 4.5 మిలియన్ల హిందువులు సిక్కులు కాందిశీకులయ్యారు. తూర్పు పంజాబులో 4.7 మిలియన్లు ఎకరాల పొలాల నుండి, పశ్చిమ పంజాబులో 6.7 మిలియన్ల ఎకరాల పొలాల నుండి తరిమివేయబడిన కాందిశీకులు బలవంతాన తరలించబడ్డారు. మొత్తం మీద 'ముస్లింలు ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయారు. హిందువులు సిక్కులు ఎక్కువ ఆస్తులు కోల్పోయారు' ప్రత్యర్థి మతాలు యించుమించు సమానంగా వున్న మధ్య పశ్చిమ పంజాబులో పరస్పరం చంపుకోడానికి ఎక్కువ ప్రాధాన్యత యిచ్చారు. ప్రత్యేకించి పశ్చిమం నుండి రెండు మిలియన్ల మందికి పొలం దక్కుతుందనే లక్ష్యంతో సిక్కులు, ముస్లింల్ని తుడిచి పెట్టారు. (పెండెరెల్ మూన్, డివైడ్ అండ్ క్విట్, ఛాప్టర్-14)

కాంగ్రెస్ ఉద్యమం చేపడితే అణచడానికి బ్రిటిషువారు భారతదేశానికి ఐదు డివిజన్ల సైన్యాన్ని రప్పించడానికి 1946 జూన్ నాటికే పథకాలు సిద్ధం చేస్తూ వున్నారు. (మాన్సెర్గ్ వాల్యూం-8 పేజీలు 13-15). విషాదకరమైన దారుణహత్యాకాండని చూస్తూ మౌనముద్ర వహించారు. సైన్యాన్ని రప్పించలేదు. బ్రిటిషువారి ఉపేక్షాంగీకారానికి లేక అధికార నిర్లక్ష్యానికి రెండు ఉదాహరణలు. దాడుల్ని హింసాకాండని ఆపేందుకు విమానాల నుండి బాంబులు కురిపించవలసిందిగా బీహారు ముస్లింలు కోరిన సందర్భంగా వేవల్ 1946 నవంబరు 9న ఇలా వ్యాఖ్యానం చేశాడు. ముస్లింలు కలవరపాటుతో ప్రస్తావించినప్పటికి ఆకాశం నుండి మెషీనగన్లు ఉద్దేశపూర్వకంగా ఉపయోగించే ఆయుధం కాదు. మేము 1942లో ఎలాంటి సందేహం లేకుండా ప్రయోగించినప్పటికి "(వైస్రాయి జర్నల్ పేజి 374) '1974 మార్చిలో అమృతసర్‌లోని రెండు మెయిన్ బజారులు ధ్వంసం చేయబడ్డాయి. కాని పోలీసుచే ఒక్క తుపాకి గుండు కూడా పేల్చబడలేదు. ఈ అమృతసర్‌లోనే జలియన్‌వాలాబాగ్ హత్యాకాండ జరిగిందని పెండెరెల్ మూన్ సందర్భోచితంగా గుర్తుచేశాడు. (మూన్ పేజీలు 78,80,81).

నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వం మతమారణకాండని నిస్సహాయంగా చూస్తూ వుండిపోయింది. పేరులో మార్పుతప్ప వైస్రాయి కార్యనిర్వాహక వర్గానికి తాత్కాలిక ప్రభుత్వానికి గల తేడా ఏమీలేదు. వేవల్ 1947 మార్చి 19న తన ఆధ్వర్యంలో జరిగిన చివరి మంత్రివర్గ సమావేశంలో ఐ.యన్.టి. ఖైదీల విడుదల సమస్యపై మంత్రుల విజ్ఞప్తిని త్రోసిపుచ్చారు. కాంగ్రెస్ ముస్లింని సమతుల్యం చేసేందుకు లీగు ప్రతిపాదించిన షెడ్యూల్డు కులం అభ్యర్థిని (జోగేన్ మండల్) నియమించే ప్రాతిపదికన ప్రభుత్వంలో చేరమని జిన్నాని వేవల్ అనునయించినప్పుడు సమిష్ఠి లేక 'ఏ రకమైన పని విధానమైనా అసాధ్యమయింది. లీగు ప్రత్యక్ష చర్య కార్యక్రమాన్ని ఉపసంహరించుకొనక పోయినప్పటికి, మంత్రివర్గ రాయబార సంఘం దీర్ఘకాలిక ప్రణాళికను తిరస్కరించినప్పటికి సెక్షన్ మొత్తం యొక్క మెజార్టీ ఓటుచే నిర్ణయాలు చేయబడే విధంగా నిర్బంధ గ్రూపింగు విధానంపై పట్టుబట్టినప్పటికి (అది అస్సాంలో

వాయవ్య సరిహద్దు రాష్ట్రంలో పాకిస్తాన్‌ని వ్యతిరేకంగా వారిని నిస్సహాయమైన మైనార్టీకి నెట్టివేసేదైనప్పటికి) తాత్కాలిక ప్రభుత్వంలో చేరడానికి అనుమతించబడింది. డిసెంబరు 9 నుండి ప్రారంభమయ్యే రాజ్యాంగ పరిషత్‌కి హాజరయ్యేందుకు లీగు నిరాకరించింది. ఫలితంగా రాజ్యాంగ పరిషత్ నెహ్రూచే రూపొందింపబడిన స్వతంత్ర సర్వసత్తాక రిపబ్లిక్ యొక్క సాధారణ లక్ష్యాల తీర్మానం ఆమోదించడానికి పరిమితమైంది. స్వయం ప్రతిపత్తిగా యూనిట్లు, మైనార్టీలకు తగు రక్షణలు, సామాజిక రాజకీయ ఆర్థిక ప్రజాస్వామ్యం కలిగి ఉండడం ప్రాథమిక లక్ష్యాలుగా నెహ్రూ యొక్క 'టీపార్టీ కేబినేట్స్' (వైస్రాయిని కలవబోయే ముందు విధానాల్ని సమన్వయం చేసుకునేందుకు జరిపే సమావేశాలు) లీగు హాజరుకాకపోవడం, 1947 ఫిబ్రవరిలో బడా వాణిజ్యవేత్తలపై (వారిలో అత్యధికులు హిందువులు) అధిక పన్నుల భారాన్ని మోపుతూ పదాడంబరంతో కూడిన బడ్జెటు ఆర్థిక మంత్రి లియాకత్ ఆలీ ప్రవేశపెట్టడం కాంగ్రెస్ దృష్టిలో లీగు యొక్క ఆటంకపరచే స్వభావంగా కన్పించింది. బడ్జెటు కాంగ్రెస్, కాంగ్రెస్‌ని బలపరచే సంపన్న వాణిజ్యవేత్తల మధ్య చీలిక తెచ్చేదిగా వుందని, అంతేగాక బడ్జెటులోని అంశాల్ని కాంగ్రెస్ వ్యతిరేకించలేదని, అందువలన ఈ బడ్జెటు చాలా తెలివైన ఎత్తుగడ అని వేవల్ భావించాడు. (వేవల్ జర్నల్, 1987 ఫిబ్రవరి 28 పేజి 424).

కలకత్తా, నౌఖాలీ, బీహారు, పంజాబు ఘటనలతో చాలా మంది కాంగ్రెస్ నాయకులు యొక్క కాంగ్రెస్ శ్రేణుల యొక్క సెక్యులర్ ఆదర్శాలు కొంత వరకు బెదిరిపోయాయి. బీహారులో ఇంకా ఇతర చోట్ల హిందువుల మతతత్వవాదాన్ని నెహ్రూ నిరశించారు. కలకత్తాలో సుహ్రావర్దీచే రెచ్చగొట్టబడిన నేరప్రపంచ దాదాలను అణచడానికి సకాలంలో సైన్యాన్ని రప్పించనందుకు అజాద్ వేవల్‌ని నిందించాడు. (వేవల్‌తో ఇంటర్వ్యూ 1946 ఆగస్టు 19, మాన్సెర్గ్ వాల్యూం పేజీ 261). నెహ్రూ బీహారు నిరసనలకు ప్రతిస్పందించిన హిందువుల పట్ల పటేల్ సానుభూతి వ్యక్తంచేశాడు. "బీహారు ప్రజలపై మంత్రివర్గంపై లీగు నాయకులు చేసిన హింసాయుతమైన నీచమైన దాడుల్ని మనం బహిర్గంతం చేసే మనం చాలా పొరపాటు చేసిన వారమవుతాం" (రాజేంద్రప్రసాద్‌కి పటేల్ 1946 నవంబర్ 11 దుర్గాదాస్ వాల్యూం -3 పేజి 171)

మతకలహాలతో కేంద్రంలోని కాంగ్రెస్ లీగుల సంకీర్ణం పని చేయలేని స్థితి కారణంగా 1947 ప్రారంభం వరకు చాలా మంది దేనినైతే ఊహించరానిదిగా భావించారో ఆ విభజననే అంగీకరించే దిశగా ఆలోచించడం ప్రారంభించారు. అలాంటివారిలో నెహ్రూ పటేలు కూడా వున్నారు. నిర్బంధ గ్రూపింగు విధానం బెంగాల్ పంజాబులు ముస్లింల ఆధిపత్యంగల 'బి"సి'ల గ్రూపులతో చేర్చబడడం, తరువాత ఆ గ్రూపులలో చేర్చబడిన ప్రాంతాలతో పాకిస్తాన్ ఏర్పడడానికి అవకాశం వుంది గనుక బెంగాలు పంజాబులలోని హిందూ సిక్కు మతవాద గ్రూపులు ఈ శస్త్రచికిత్స (దేశవిభజన) జరగాలని పట్టుబట్టడం ప్రారంభించాయి. ఉదాహరణకు హిందూమహాసభ పశ్చిమబెంగాలులో ప్రత్యేక హిందూ రాష్ట్ర ఏర్పాటు అవకాశాల్ని పరిశీలించేందుకు ఒక కమిటీని నియమించింది. (వి.పి.మీనన్ పేజి 348). 1947 మార్చి 10 నాటికి నెహ్రూ వేవల్‌తో జరిపిన ప్రైవేటు సంభాషణలలో అమలు జరపగలిగితే మంత్రి వర్గ రాయబార సంఘం యొక్క పథకం మంచి పరిష్కారమైనప్పటికి ఒకే ఒక్క నిజమైన

ప్రత్యామ్నాయం పంజాబు బెంగాలుల విభజన అని స్పష్టంచేశారు. (వైస్రాయి జర్నల్ పేజి 426-7). ఒక నెల తరువాత కాంగ్రెస్ ప్రెసిడెంటు కృపలానీ మౌంటుబాటెన్‌తో యుద్ధం చేసే కంటే బెంగాలు పంజాబులను న్యాయమైన పద్ధతిలో విభజించడానికి మీరు అనుమతిస్తే పాకిస్తాన్ వారు పొందడానికి అనుమతిస్తాం." (హెచ్.వి. హడ్రక్, దిగ్రేట్ డివైడ్, లండన్ 1969, పేజి 236).

## మహాత్ముని మహోన్నత ఘడియలు

కాని ఒకరికి మాత్రం ఉన్నతస్థాయి బేరసారాల ద్వారా మత విభజనతో దేశంలోని పెద్ద భాగంపై కాంగ్రెస్ అధికారం పొందడం ఆమోదయోగ్యంగా లేదు. ఆయనను ఊహించరానంత దిగ్భ్రాంతికి గురిచేసింది. గాంధీ 1945 నుండి జరుగుతున్న దారితప్పిన చర్చలలో అంతగా పాల్గొనలేదు. తన వ్యక్తిగత దూత సుధీర్ ఘోష్ ద్వారా కొన్ని సఫలం కాని సూచనలు చేశాడు. భారతదేశంలోని మెజార్టీ మతం వారి ప్రయోజనాల్ని పరిరక్షించేందుకు భారతదేశంలో కొంత కాలంపాటు బ్రిటిషువారు వుండాలని, ప్రధాన మంత్రి పదవి జిన్నాకి యివ్వజూపాలని కాంగ్రెస్ దృష్టిలో చాలా హాస్యాస్పదంగా వుండే సూచన మొదట మంత్రివర్గ రాయబార సంఘానికి ఆ తరువాత మౌంట్‌బాటెన్‌కి చేశాడు. అంతకంతకు కాంగ్రెస్ నాయకత్వం నుండి విడివడి ఒంటరై, చెరగని ధైర్యంతో 77 సం॥ల వృద్ధుడు తన జీవితాశయాలైన మానసిక పరివర్తన, అహింసా సూత్రాల్ని నౌఖాలీలో బీహారులో కలకత్తా ఢిల్లీ మురికివాడల్లో రుజువు చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ప్రతికూల భావాలు గలిగిన ముస్లింల ఆధిపత్యంగల గ్రామాలలో కొద్దిమంది అనుచరులతో నివసించాడు. బీహారు హిందువులు తమ పద్ధతులు మార్చుకోకపోతే ఆమరణ నిరాహారదీక్ష చేపడతానని (1946 నవంబరు 6) హెచ్చరించాడు. 1947 జనవరి నుండి నౌఖాలీ గ్రామవీధుల వెంట చెప్పులు లేకుండా పాదయాత్రలు చేశాడు. కోపంతో వున్న ముస్లింలు తన దారిలో వేసిన చెత్త చెదారాన్ని స్వయంగా శుభ్రం చేశాడు. ప్రతిరోజు ఉదయం తనకత్యంత ప్రీతిపాత్రమైన 'నీ పిలుపుని ఆలకించేవారు లేకపోతే ఒంటరిగా పద ఒంటరిగా పద' అనే రవీంద్రుని గీతంలోని చరణాన్ని మంత్రంలా జపించేవాడు. గాంధీ వ్యక్తిగత గుణగణాలు, నిజమైన గొప్పతనం ఆయన జీవితంలోని చివరి నెలల్లో స్పష్టంగా వ్యక్తమయ్యాయి. స్వతంత్రం రానున్న భారతదేశంలో ఆయన ఏ మాత్రం ఆసక్తి కనపరచినా తనదయ్యే రాజకీయాధికారం పట్ల నిరాసక్తత, అలుపెరుగని మతతత్వ వ్యతిరేకపోరాటం - మత విభజన తరువాత ఒక నెలకు పంజాబు మతమారణకాండ ధ్వంసం చేస్తున్నప్పుడు ఆయన ఒక ముస్లిం నాయకునితో అన్నమాటలు "నా జీవితాన్ని పణంగా పెట్టి పోట్లాడతాను. భారతదేశంలో ముస్లింలు మెలమెల్లగా భయంగా నడవడాన్ని సహించను. వారు ఆత్మగౌరవంతో నడవాలి" (ఖలీకు జమన్, పాత్‌వేటు పాకిస్తాన్ పేజి 404) హిందువులు ముస్లింలు వేర్వేరు జాతులకు చెందినవారనే ఆలోచనని ప్రార్థనా సమావేశంలో నిందాపూర్వకమైన చిరునవ్వుతో ఎలా త్రోసిపుచ్చేవాడో- గాంధీ అనుయాయి కాని ఒక కలకత్తా నివాసి యిప్పటికి స్ఫురణకి తెచ్చుకుంటూ వుంటాడు.

కొన్ని సందర్భాలలో గాంధీ ఉనికి అద్భుతాల్ని సాధించినట్లనిపిస్తుంది. ఘర్షణలతో అతలాకుతలమైన బేలియాఘుడలో తనతోపాటు వుండవలసిందిగా సుహ్రావర్దీని ఒప్పించిన తరువాత ఆగస్టు 15 తరువాత, ఆగస్టు 15 సాయంత్రం కలకత్తాలో శాంతి నెలకొన్నది. మరలా 31న ప్రారంభమైన ఘర్షణలు గాంధీ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షతో ఆగిపోయాయి. పంజాబు ఘటనలకు ప్రతీకారంగా హిందువులు ముస్లింలపై సాగించిన హత్యాకాండతో ఢిల్లీలో ఘర్షణలు మొదలయ్యాయి. 1948 జనవరిలో గాంధీ నిరాహారదీక్షతో ఆగిపోయాయి. ఈ చివరి నిరాహారదీక్ష పాక్షికంగా పటేల్‌లో అంతకంతకు పెరుగుతున్న మతపరమైన వైఖరికి వ్యతిరేకంగా చేపట్టబడింది. (హోం మంత్రి పంజాబు ప్రజల్ని మొత్తాన్ని తరలించాలని ఆలోచనలు ప్రారంభించారు. విభజనకు ముందుగల భారతదేశ ఆర్థిక వనరుల నుండి పాకిస్తాన్‌కి 55 కోట్ల రూపాయలు యివ్వాలనే ఒప్పందాన్ని తిరస్కరించాడు). నీవు నాకు ఒకప్పుడు తెలిసిన సర్దార్‌వి కావు"– గాంధీ నిరాహారదీక్షలో వుండి వాఖ్యానించాడు.ఏ వ్యక్తి అయితే అత్యంత ప్రమాదకరమైన హిందూ నాయకుడుగా ఒక తరం ముస్లింలకు నూరిపోయడం జరిగిందో ఆ వ్యక్తి ఢిల్లీసమీపంలోని ఒక మతపరమైన వేదిక నుండి మాట్లాడేందుకు ఆహ్వానించబడ్డారు. మూడు రోజుల తరువాత మహాత్ముడు హిందూ మతోన్మాది నాథూరాం గాడ్సేచే హత్య చేయబడ్డాడు. వి.డి.సావర్కర్ ప్రేరేపణతో పూనాలో పన్నిన కుట్ర పర్యవసానంగా ఈ హత్య జరిగింది. చాలా హెచ్చరికలున్నప్పటికి, బొంబాయి ఢిల్లీ పోలీసులు కుట్రని భగ్నం చేయడానికి ఎలాంటి ప్రయత్నాలు చేయలేదు.

1946–47 లో గాంధేయ మార్గం వీరోచిత మైనదిగాను, కదిలించేదిగాను వున్నప్పటికి ఏదో ఒక ప్రాంతంలో వ్యక్తిగత ప్రయత్నంగా మిగిలిపోయింది. తాత్కాలిక ప్రభావాన్ని మాత్రమే చూపగలిగాలి. సామ్రాజ్య వాదానికి, సామ్రాజ్యవాదం యొక్క భారతీయ మిత్రులకు వ్యతిరేకంగా చేపట్టిన ఐక్య సమరశీలపోరాట పంథాలోనే నిజమైన ప్రత్యామ్నాయం వుందని వాదించవచ్చు. ఈ గ్రంథంలోనే పలు సందర్భాలలో గమనించిన విధంగా అలాంటి పోరాటాలే బ్రిటిషువారిని భయభ్రాంతుల్ని చేశాయి. మత కలహాలు వలన కొంత అంతరాయం ఏర్పడినప్పటి పోరాటాలకు అవకాశం 1946–47లో కూడా పూర్తిగా మూసుకుపోలేదు. ఆగస్టు ఘర్షణల తరువాత 5 నెలలకు 1947 జనవరి 21న వియత్నాంపై దాడులు చేయడానికి ఫ్రెంచి విమానాలు కలకత్తాలో డండం విమానాశ్రయాన్ని ఉపయోగించుకోడానికి వ్యతిరేకంగా కలకత్తా విద్యార్థులు ప్రదర్శనలు జరిపారు. అదేరోజున కమ్యూనిస్టు నాయకత్వంలో ప్రారంభమై 85 రోజులపాటు సాగి విజయవంతమైన ట్రాంబండ్ల కార్మికుల సమ్మెలో మతపరమైన విభజనలు మచ్చుకైనా పని చేయలేదు. ఆ వెనువెంటనే పోర్టు ఉద్యోగుల, హౌరా ఇంజనీరింగు కార్మికుల సమ్మెలు జరిగాయి. జనవరి ఫిబ్రవరిలలో సమ్మె తరంగాలు ఉవ్వెత్తున లేచాయి. కాన్పూరులో 100000 మంది జౌళికార్మికులు సమ్మెచేశారు. బొగ్గు కార్మికులు బొగ్గు సరఫరా నిలిపివేస్తామని హెచ్చరించారు. ప్రధానంగా కమ్యూనిస్టుల ఆందోళనలతో కోయంబత్తూరు, కరాచి యింకా యితరచోట్ల సమ్మెలు జరిగాయి. (కార్మిక మంత్రి జగజ్జీవన్‌రాంని ఉటంకిస్తూ వేవల్, 1947 జనవరి 14; వైస్రాయి జర్నల్ పేజి 410) ' ప్రతిచోటా సమ్మెలు.... ప్రతి ఒక్కరూ తక్కువ పని

చేసి ఎక్కువ వేతనం కోరుతున్నారు'-గాంధీ సెక్రటరీ ప్యారీలాల్‌కి బిర్లా జనవరి 18న ఫిర్యాదు చేశాడు. (జి.డి.బిర్లా, బాపు పేజి 434).కాని ఈ సమ్మెలన్నీ పూర్తిగా ఆర్థిక డిమాండ్లపై చేయబడిన సమ్మెలు. ప్రభావితం చేయగల దృఢమైన రాజకీయ నాయకత్వం లోపించింది.

1946-47లోని నూతన పరిణామం చాలా ప్రాంతాలలో- ముఖ్యంగా బెంగాలు, కేరళలోని కొన్ని ప్రాంతాలలో, హైదరాబాద్ స్వదేశీ సంస్థానంలోని తెలంగాణాలో వెల్లువెత్తిన తిరుగుబాట్లు ప్రతిచోటా కమ్యూనిస్టు నాయకత్వంలోని కిసాన్ సభ శిస్తులు కౌలు చెల్లించగల రైతాంగంకంటే యింకా క్రిందవున్న పాలికాపుల, వ్యవసాయ కార్మికుల, తెగలలోకి చొచ్చుకుపోయి సమరశీల కార్యాచరణకు సన్నద్ధమయింది.

1945 నుండి శ్యాంరావు, గోదావరి పరులేకర్ లాంటి కమ్యూనిస్టు కార్యకర్తలు బొంబాయి సమీపంలోని థాణా జిల్లాకి చెందిన ఉంబర్‌గావ్ దవాను తాలూకాలలోని తీవ్రమైన దోపిడికి గురయిన అత్యంత వెనుకబడిన వర్లీ తెగల వారితో పాటు నివసించడం ప్రారంభించారు. రుణబానిసత్వం వెట్టిచాకిరి, చెట్లుకొట్టడం నూర్పిళ్లు చేయడం లాంటి పనులకు అతి తక్కువకూలీ లాంటి సమస్యలపై ఫారెస్టు కాంట్రాక్టర్లకు వడ్డీ వ్యాపారులకు; బయటి నుండి వచ్చిన భూస్వాములకు వ్యతిరేకంగా చాలా జయప్రదమైన ఉద్యమాలు నిర్వహించారు.

**తెభాగ**

జోతేదార్ల పొలాలు కౌలుకి తీసుకొని సాగు చేస్తున్న పాలికాపులకు పంటలో సగం, అంతకంటే యింకా తక్కువకు బదులుగా మూడింట రెండు వంతులు యివ్వాలని ఫ్లౌడ్ కమీషన్ చేసిన సిఫార్సుని ప్రజాపోరాటం ద్వారా అమలు జరిపించుకోవాలని బెంగాల్ రాష్ట్ర కిసాన్ సభ 1946 సెప్టెంబరులో పిలుపిచ్చింది. పట్టణ ప్రాంతాలకు చెందిన పలువురు సమరశీల విద్యార్థులతో సహా కమ్యూనిస్టు శ్రేణులు పాలికాపుల్ని (బార్గాదార్లని) చేయడానికి తరలివెళ్లాయి. ఆర్థిక మాంద్యం, కరువు పేద రైతుల్ని పాలికాపుల స్థాయికి దిగజార్చాయి. ఫలితంగా గ్రామీణ ప్రాంతాలలో పాలికాపుల సంఖ్య పెరిగింది. తెభాగ బలమైన స్థావరాలైన చోట్ల గ్రామస్థులలో 60% పాలికాపులున్నారు. ఉద్యమం నవంబరులో నూర్పిళ్ల సమయం నుండి 'నిజ్‌ఖమారే ధన్‌టోలో' ధాన్యాన్ని పాలికాపుల ఇళ్ళకు చేర్చాలి. జోతేదార్ల ఇళ్లకు కాదు - నినాదంతో మొదలయింది. ఉత్తర బెంగాల్- ప్రత్యేకించి దినాజ్‌పూర్ సబ్ డివిజన్‌కి చెందిన ఠాకూర్‌గావ్ యింకా జల్పాయి గురి, గంగపూర్, మాలాల పరిసర ప్రాంతాలు పోరాటా కేంద్రాలయ్యాయి. అంతేగాక మెమెన్ సింగ్ (కిషోర్‌గంజ్) మిడ్నాపూర్ (మాహిసదల్, సుటాహట, నందిగ్రాం), 24 పరగణాలు (కాక్‌ద్వీప్)లలో కూడా తెభాగ స్థావరాలు అభివృద్ధి చెందాయి. 1937-38 లో వారి 'టంకి' (కౌలు ఉత్పత్తి)లో తగ్గింపుని సాధించుకొన్న హజాంగులు యిప్పుడు అధిక ధరల వలన ప్రయోజనం పొందేందుకు దానిని డబ్బు రూపంలోకి మార్చాలని డిమాండ్ చేశారు. కలకత్తా నౌఖాలీలలో మతకలహాలు జరిగినప్పటికి తెభాగ పోరాటంలో ముస్లింలు గణనీయమైన సంఖ్యలో పాల్గొన్నారు. వారి హాజీ మహమ్మద్‌దానేష్, లియాకత్ ఆలి లాంటి నాయకులు ఎదిగారు. జోతేదార్ అణచివేతని ఖండించేందుకు మౌల్వీలు ఖురాన్‌ని

ఉటంకించారు. కాని కిసాన్ సభకి బలమైన స్థావరంగా వున్న తిప్పెరతో సహా ఆగ్నేయ బెంగాల్ ఉద్యమంతో సంబంధం లేకుండా వుండిపోయింది. జోతేదార్లు పోలీసులు ప్రయోగించిన హింసని ఎదుర్కోవలసి వచ్చింది. 'శతాబ్దాలుగా మూగజీవిగా వున్న అతడు (బార్గాదార్) తన సహచరులతో కలిసి పొలాల మధ్య నడుస్తూవుంటే, ప్రతి వ్యక్తీ లాఠీని తుపాకివలె భుజానికి మోపుజేసి–ప్రదర్శన అగ్రభాగాన ఎర్రజెండాతో (స్టేట్స్‌మన్ 1947 మార్చి 19, బెంగాల్‌లో వ్యవసాయక పోరాటం, 1946–47 సునీల్‌సేన్ నుండి ఉటంకించబడింది. పేజి 38) కాని లాఠీలు తుపాకులు కావు. లీగు మంత్రివర్గం బాగ్దాదారు బిల్లుని (1950 వరకు చట్టం చేయలేదు. ఆ తరువాత కూడా అరకొరగా అమలు జరుపబడింది) పడకనబెట్టింది. 1947 ఫిబ్రవరి నుండి అణచివేతను తీవ్రతరం చేసింది. ఉద్యమం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొన్నది. పోలీసులతో ఘర్షణలో బాలూరు ఘాట్‌వద్ద 20 మంది సంతాలులు చంపబడ్డారు. సునీల్‌సేన్ మృతవీరుల సంఖ్య 49 గా పేర్కొన్నారు. కొందరు ఆయుధాలు కోరారు. కాని కమ్యూనిస్టుల వద్ద ఆయుధాలు లేవు. అంతేగాక పూర్తిస్థాయి సాయుధపోరాటం జరిపే అంచనాకూడా లేదు. సామాజికంగా కూడా కొన్ని పరిమితులు ఎదురయ్యాయి. తెగల ప్రజలు (జల్పాయి గురికి చెంది దుయర్స్ ప్రాంతానికి చెందిన టీ తోటల కార్మికులతో సహా) ఎక్కువ సమరశీల పోరాటాల కొరకు ఒత్తిడి చేశారు. కాని మధ్య పేద తరగతికి చెందిన రైతుల మద్ధతు తగ్గింది. జాతీయోద్యమంలో ప్రధాన భాగంగా వుంటూ వచ్చిన ఉత్తర బెంగాల్‌కి చెందిన వృత్తిదారుల గ్రూపుల (చాలా మందికి పొలాలు వున్నాయి. వాటిలో బార్గాదార్లు సేద్యం చేస్తున్నారు) పూర్తిగా ప్రతికూలంగా వున్నాయి. కమ్యూనిస్టు మార్చి 28 సాధారణ సమ్మెకి పథకం వేశారు. ఈ లోపల బెంగాల్ విభజన కొరకు హిందూ మహాసభ చేపట్టిన ప్రచారం బలం పుంజుకున్నది. మార్చి 27 నుండి కలకత్తాలో ఘర్షణలు మొదలయ్యాయి. పట్టణ ప్రాంతాల నుండి లభించే సానుభూతి అవకాశాలు దెబ్బతిన్నాయి.

## పున్నప్ర వాయలార్

తిరువాన్కూరులోని వాయవ్య ప్రాంతానికి చెందిన షేర్తాలై– అలెప్పీ– అంబలపూజ ప్రాంతంలో 1944 నాటికి కమ్యూనిస్టులు కొబ్బరి పీచు కార్మికులలో, మత్స్య కార్మికులలో కల్లుగీత కార్మికులలో, వ్యవసాయ కార్మికులలో బలమైన పునాదిని ఏర్పరచుకున్నారు. చిన్న పట్టణాల పరిశ్రమలకు వ్యవసాయ వృత్తులతో గల సన్నిహిత సంబంధం యితర ప్రాంతాలలో కంటే ఇక్కడ ఎక్కువ కార్మిక కర్షక మైత్రికి దోహదం చేసింది. కొబ్బరిపీచు ఫ్యాక్టరీల కార్మికుల నియామకాలను నియంత్రించడంలోను, తగవులు తీర్చే ప్రజాకోర్టుల్ని స్థాపించుకొనడంలోను, వారి స్వంత రేషన్ షాపుల్ని నడుపుకునే హక్కు సాధించడంలోను (1946 జూలై సమ్మె తరువాత) పట్టు సాధించగలంతగా కార్మిక సంఘాలు బలం పుంజుకొన్నాయి. ఈ లోపల ఆహారధాన్యాల కొరతతో పాటు, 1946 జనవరిలో దివాన్ రామస్వామి అమెరికా తరహా రాజ్యాంగం ప్రకటనతో నూతన రాజకీయ పరిస్థితి సృష్టించబడింది. దివాన్ ప్రకటించిన రాజ్యాంగం ప్రకారం అసెంబ్లీ సార్వత్రిక ఓటింగుతో ఎన్నుకోబడుతుంది. కాని కార్యనిర్వాహక మండలి మాత్రం మహారాజాచే నియమింపబడిన దివాన్ అదుపులో వుంటుంది. బ్రిటిషువారు వెళ్లిపోయిన తరువాత తన

అదుపులో వుండే స్వతంత్ర తిరువాన్కూరు కొరకు దివాన్ పథక రచన ప్రారంభించారు. తన ఉద్దేశాన్ని 1947 జూన్‌లో ప్రకటించారు. పట్టంథాను పిళ్లై లాంటి కాంగ్రెస్ నాయకులు రాజీకి ప్రతికూలంగా లేరు. కాని కమ్యూనిస్టు 'అమెరికా మోడల్–అరేబియన్ కటాలిల్' (అమెరికా మోడల్ని అరేబియాలో తోయండి) నినాదంతో ప్రచారోద్యమం చేపట్టారు. 1946 సెప్టెంబరు నుండి ప్రభుత్వం అలెప్పీ ప్రాంతంలోని కమ్యూనిస్టుల్ని కార్మిక సంఘాల్ని తుడిచి పెట్టడానికి సన్నద్ధమయింది. పోలీసు క్యాంపులు పెట్టింది. పెద్ద ఎత్తున అరెస్టులు చేసింది. జైళ్లలో ఖైదీల్ని చిత్రహింసలకు గురిచేసింది. పీడిత కార్మికులు తలదాచుకునేందుకు క్యాంపులు నిర్వహించబడ్డాయి. వాటికి కొద్దిపాటి మిలిటరీ శిక్షణ పొందిన వాలంటీర్లు కాపలాగా వున్నారు. అలెప్పీ–షెర్తాలై ప్రాంతంలో అక్టోబరు 22 నుండి రాజకీయ సాధారణ సమ్మె మొదలైంది. రెండు రోజుల తరువాత అలెప్పీకి దక్షిణంగా నాలుగు మైళ్ల దూరంలో గల పున్నప్ర పోలీసు క్యాంపుపై పాక్షికంగా జయప్రదమయిన దాడి జరిగింది. కాల్పులు జరుగుతున్నప్పటికి ఒక్కొక్క పోలీసుతో తలపడి ఎదుర్కొనేందుకు వాలంటీర్లు పాకుతూ ముందుకు సాగారు. తొమ్మిది రైఫిళ్లు స్వాధీనం చేసుకొన్నారు. కాని వాటివలన ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. అక్టోబరు 25న మార్షల్ చట్టం ప్రకటించబడింది. వాయలార్ వద్దగల వాలంటీర్ల ప్రధాన కార్యాలయాన్ని సైనికులు చుట్టు ముట్టారు. తుపాకి గుళ్ల వర్షం కురిపించారు. 800 మందికి పైగా వాలంటీర్లు చంపబడ్డారు. హత్యాకాండ దివాన్ కాంగ్రెస్‌లతో మైత్రిని అడ్డుకొన్నది. మరుసటి సంవత్సరం తిరువాన్కూరు సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసేందుకు కాంగ్రెస్ ప్రజా పోరాటంకంటే ఒత్తిడి తెచ్చే ఎత్తుగడల్ని ప్రయోగించింది. శాంతియుతమైన లొంగుబాటుకి ప్రత్యామ్నాయంగా హింసాయుత విప్లవం చెలరేగుతుందని రామస్వామి అయ్యర్ గుర్తించాడు. ఎత్తుగడలు ఫలించాయి. ఈ విధంగా చూస్తే విడిపోయే మార్గానికి అడ్డుపడి తిరువాన్కూరు సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసింది. వున్నప్ర వాయలార్ పోరాటాలు ఇక కమ్యూనిస్టులు కష్టాలకు కడగండ్లకు గురయి తాత్కాలికంగా ఎదురుదెబ్బ తిన్నప్పటికి పున్న ప్రవాయలర్ వారి వీరోచిత ఆత్మ త్యాగానికి ప్రతీకగా నిలిచింది. 1957 నుండి ఏర్పడిన కమ్యూనిస్టు మంత్రివర్గాలు ప్రమాణ స్వీకారానికి ముందు పున్నప్ర – వాయలార్ గ్రామాల్ని సందర్శిస్తుంటాయి. (కె.పి. జార్జి, ఇమ్మోర్టల్ పున్నపై – వాయలార్ న్యూఢిల్లీ 1975, కాంగ్రెస్ అండ్ రాజ్‌లో రాబిన్ జెఫ్రీ వ్యాసం).

**తెలంగాణా**

తెభాగ పున్నప్ర వాయలార్‌లు సాయుధ పోరాటం అంచువరకు వెళ్లి ఆగిపోగా 1946 జూలై నుండి 1951 వరకు జరిగిన తెలంగాణా పోరాటం ఆధునిక భారత దేశ చరిత్రలో అత్యంత పెద్ద రైతాంగ గెరిల్లా యుద్ధంగా చోటు చేసుకున్నది. తెలంగాణా పోరాటం 16000 చ.మైళ్ళకు పైగా విస్తరించిన 3000 గ్రామాలలో గల 3 మిలియన్ల ప్రజల్ని ప్రభావితం చేసింది. అసఫ్ జాహి నిజాముల పాలనలో హైదరాబాద్ మతపరమైన భాషాపరమైన ఆధిక్యతకి (ఉర్దూ మాట్లాడే కొద్ది మంది ముస్లిం పోలీసులు – తెలుగు మరాఠీ కన్నడ భాషలు మాట్లాడే మెజార్టీ హిందువులపై) ప్రతీకగా నిలిచింది. నిజా సంస్థానంలో రాజకీయ పౌర హక్కులు ఏ

మాత్రంలేవు. ప్రత్యేకించి తెలంగాణా ప్రాంతంలో అత్యంత దారుణమైన దోపిడీ రూపాలు అమలులో వున్నాయి. ముస్లింలు పై కులాలకు చెందిన హిందూ దేశ్‌ముఖ్‌లు (భూస్వాములుగా మారిన శిస్తూ వసూలుదార్లు) జాగీరుదార్లు బలవంతంగా వెట్టిచాకిరి చేయించారు. క్రింది కులాలనుండి తెగల రైతుల నుండి రుణ బానిసల నుండి నజరానాలు పిండుకున్నారు. దొరల భూకబ్జాలతో రైతుల స్థితిగతులు మరీ దిగజారాయి. తెభాగ తిరువాన్కూరులోవలె గాక కమ్యూనిస్టుల నాయకత్వంలోని వ్యవసాయ తిరుగుబాటు 1948 సెప్టెంబరులో యూనియన్ సైన్యాలు ప్రవేశించేవరకూ కొనసాగింది. నిజాంకి, అతడి కిరాయి గూండాలకు వ్యతిరేకంగా జరిగిన జాతీయ విముక్తి పోరాటానికి పట్టణ ముస్లిం ప్రజానీకం, కార్మికవర్గంలోని గణనీయమైన భాగం దూరంగా వుండిపోయారు. తెలంగాణ పోరాటానికి సానుకూలమైన అంశం బ్రిటిషిండియాకి భిన్నంగా సంస్థానంలో ఆయుధచట్టం మందకొడిగా అమలుపరచిన తీరు కారణంగా పెద్ద సంఖ్యలో నాటుతుపాకులు, మజిల్‌లోడర్స్ సంస్థానంలో వాడుకలో వున్నాయి. "కాంగ్రెస్‌తో సహా ప్రతి ఒక్కరూ రజాకార్లని, ముస్లిం ఆధిపత్యంగల నిజాం స్వతంత్ర రాజ్యస్థాపనని అడ్డుకోవాలని కోరుకొన్నారు. గనుక 1948 సెప్టెంబరు వరకు ఆయుధాల కొనుగోలుకు పొరుగున వున్న ఆంధ్రా జిల్లాలలో నిధులు బాహాటంగా వసూలు చేయబడ్డాయి." కేవలం మూడు రోజులలో ఒక్క విజయవాడ నుండే రు. 20,000 లు సేకరించబడినట్లు సుందరయ్య పేర్కొన్నారు. (పి.సుందరయ్య, తెలంగాణా సాయుధ పోరాటం– గుణపాఠాలు, కలకత్తా 1972; పేజీలు 2,7,9,40).

యుద్ధ సంవత్సరాలలో కమ్యూనిస్టులు ఆంధ్రమహాసభ ద్వారా యుద్ధకాలపు బలవంతపు వసూళ్లు, రేషన్ సరఫరా, అధిక కౌలు, వెట్టిచాకిరీ సమస్యలపై అనేక స్థానిక పోరాటాల్ని నిర్వహించి తెలంగాణా గ్రామాలలో బలమైన పునాదిని నిర్మించారు. నల్గొండ జిల్లాలోని జనగాం తాలూకా విసునూరు దేశముఖ్ (తెలంగాణాలో అత్యంత పెద్ద కిరాతకమైన జమీందారులలో ఒకడు; 40,000 ఎకరాల పొలం గలిగిన వాడు)చే నియమింపబడిన కిరాయి గూండాలచే రజక మహిళ పొలం పరిరక్షించడానికి ప్రయత్నించిన దొడ్డి కొమరయ్య హత్య చేయబడిన రోజు 1946 జూలై 4 నుండి తెలంగాణా తిరుగుబాటు ప్రారంభమైంది. తొలుత నల్గొండ జిల్లాలోని జనగాం, సూర్యాపేట, హుజూర్‌నగర్ తాలూకాలు ప్రతిఘటనా కేంద్రాలుగా పని చేశాయి.కాని ఉద్యమం త్వరగా పొరుగున వున్న వరంగల్, ఖమ్మం జిల్లాలకు వ్యాపించింది. రైతులు లాఠీలు, వడిశలలు, రాళ్లు, కారాన్ని ఉపయోగిస్తూ గ్రామ సంఘాలుగా సంఘటితమయ్యారు. దారుణమైన అణచివేతను ఎదుర్కొంటూ 1947 ప్రారంభం నుండి సాయుధ గెరిల్లా దళాల నిర్మాణం ప్రారంభమైంది. దళంలో 100 నుండి 120 మంది సభ్యులుండేవారు. అంతేగాక 10,000 గ్రామ రక్షక వాలంటీర్లు 2000 మంది దళ సభ్యులు వున్నారు. 1947 ఆగస్టు 1948 సెప్టెంబరు మధ్య కాలంలో పోరాటం అత్యంత తీవ్ర స్థాయికి చేరింది. సంస్థాన కాంగ్రెస్ నాయకుల (కమ్యూనిస్టు గెరిల్లాల వలెగాక వీరు బ్రిటిషిండియా సరిహద్దులలో ఉండి పని చేశారు) నిజాం వ్యతిరేక నినాదాల్ని కమ్యూనిస్టులు తెలివిగా ఉపయోగించుకున్నారు. రెవెన్యూ అధికారుల రాజీనామాల కొరకు ఇవ్వబడిన పిలుపు రెవెన్యూ

కౌలు రికార్డుల ధ్వంసానికి యివ్వబడిన పిలుపుగా మార్చబడింది. 1948 సెప్టెంబరు పోలీసు చర్య నాటికి కమ్యూనిస్టులు శత్రువులచే చీకటి దొరలుగా గుర్తింపు పొందారు. గెరిల్లాల నియంత్రణలో వున్న గ్రామాలలో వెట్టిచాకిరి నిర్బంధ శ్రమ అదృశ్యమయ్యాయి. వ్యవసాయ కూలిరేట్లు పెంచబడ్డాయి. (ఉద్యమానికి సానుకూలంగా వున్న ధనిక రైతుల నుండి వ్యతిరేకత వ్యక్తమైనప్పటికి). అన్యాయంగా దురాక్రమణకు గురయిన పొలం రైతులకు అప్పగించబడింది. బంజరు భూముల్ని అలాగే మెట్ట 100 ఎకరాలు, మాగాణి 10 ఎకరాల గరిష్ఠ పరిమితికి మించివున్న పొలాల్ని పంచడానికి చర్యలు చేపట్టబడ్డాయి. (ధనిక రైతులు దూరం కాకుండా చూసుకొనడానికి విధించిన గరిష్ఠ పరిమితి కాస్త ఎక్కువైనప్పటికి, తరువాత కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం విధించినదానికంటే చాలా తక్కువ.) సాయుధపోరాట నాయకులలో ముఖ్యుడు సుందరయ్య విముక్త ప్రాంతాలలోని ప్రజల జీవితాన్ని వివరంగా వర్ణించాడు. నీటి పారుదలకు, కలరా వ్యాప్తిచెందకుండా నిరోధకచర్యలు, రైతుల, రైతుల కుటుంబాల వివాదాలలో పరస్పర అంగీకారయోగ్యమైన పరిష్కారాలు, మహిళా సామాజిక స్థాయిలో కొంత అభివృద్ధి, అస్పృశ్యత మూఢనమ్మకాల తగ్గుదల, విప్లవ విలువల్ని బోధించేందుకు జానపద గీతాలు, నాటికల వినియోగం-వగైరాల్ని వివరంగా వర్ణించాడు.

1948 సెప్టెంబర్ తరువాత పరిస్థితి మారింది. పోలీసుచర్య ప్రధానంగా కమ్యూనిస్టుల పురోగతిని అడ్డుకునేందుకు చేపట్టబడింది. మరొక విధంగా న్యూఢిల్లీ-ప్రత్యేకించి పటేల్ నిజాంతో ఒక ఒప్పందానికి వచ్చేందుకు సిద్ధపడ్డారు. భారత ప్రభుత్వం నిజాంపట్ల అంత మెతకగా వ్యవహరించడం పట్ల కాంగ్రెస్ నాయకుడు రామానంద తీర్థ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. (హైదరాబాద్ స్వతంత్ర పోరాటం జ్ఞాపకాలు పేజి 190) రజాకార్ల ఓటమి గెరిల్లాలకు చాలా ఆయుధాల్ని సమకూర్చింది. కాని ఇప్పుడు వారు మంచి ఆయుధాలు గల క్రమశిక్షణాయుతమైన భారత సైన్యాన్ని ఎదుర్కొవలసివచ్చింది. నిజాం వ్యతిరేక పోరాటంలో లాగా నూతన ప్రభుత్వ వ్యతిరేక నినాదం ఎవరినీ ఆకట్టుకొనదు. 1948 తరువాత సాయుధపోరాటాన్ని వ్యవసాయ సంస్కరణల లక్ష్యాలకు పరిమితం చేసి దానిని ఒక దశలో పరిష్కారానికి అవకాశంగా ఉపయోగించుకొని వుంటే బాగుండి వుండేదని కొందరు కమ్యూనిస్టులు అభిప్రాయపడ్డారు. భారత సైన్యం వచ్చిన తరువాత కూడా గెరిల్లా యుద్ధాన్ని కొనసాగించడం తప్పని రావి నారాయణరెడ్డి లాంటి మరి కొందరు నాయకులు వాదించారు. (సుందరయ్య 121-2, 135 రావినారాయణ రెడ్డి, వీరోచిత తెలంగాణా- జ్ఞాపకాలు అనుభవాలు, న్యూఢిల్లీ పేజి 60) కమ్యూనిస్టులు క్రమంగా సంపన్న రైతుల మద్దతు కోల్పోయారు. మిలిటరీ చర్య కమ్యూనిస్టుల్ని నల్గొండ, వరంగల్, ఖమ్మం మైదాన ప్రాంతాల నుండి కృష్ణానదికి దక్షిణాన గల నల్లమల పర్వతాల దట్టమైన అడవులలోకి ఈశాన్యానగల గోదావరి ప్రాంతానికి నెట్టి వేసింది. అక్కడ చెంచు కోయతెగలతో కలిసి క్రొత్త స్థావరాలు ఏర్పాటు చేసుకొన్నారు. కోయలకు చెంచులకు అటవీ అధికారుల నుండి వడ్డీ వ్యాపారుల నుండి రక్షణ కల్పించారు. 1950-51 నాటికి గెరిల్లా చర్యలు విచ్ఛిన్నమయ్యాయి. అంతర్గత రాజకీయ విభేదాలు తలెత్తాయి. బతికి బట్టకట్టడం సమస్య అయింది.

తెలంగాణా పోరాటం విరమించవలసి వచ్చినప్పటికి కమ్యూనిస్టులు కొన్ని సంవత్సరాల వరకు ప్రజల మద్దతు నిలబెట్టుకొనగలిగారు. 1952లో నల్గొండ, వరంగల్‌లలో ప్రతి అసెంబ్లీ సీటుని గెలిచారు. రావి నారాయణరెడ్డిని నెహ్రూ కంటే పెద్ద మెజార్టీతో పార్లమెంటుకి పంపించగలిగారు. తెలంగాణా పోరాటం గణనీయమైన ప్రత్యక్ష పరోక్ష సానుకూల ఫలితాలు సాధించింది. అన్నిటికంటే మిన్నగా పరిస్థితిని యధాతథంగా వుంచే 1947 నవంబరు నాటి పటేల్, వి.పి. మీనన్‌ల రాజీ ప్రయత్నాన్ని నిష్ఫలంచేస్తూ రైతాంగ గెరిల్లాలు భారత దేశంలోని అత్యంత పెద్ద స్వదేశీ సంస్థానంలోని ఫ్యూడల్ నియంతృత్వ పరిపాలనని కూల్చగలిగారు. నిజాం ప్రభుత్వ పతనం తరువాత కొన్ని సంవత్సరాలకు భాషా ప్రాతిపదికన ఆంధ్రప్రదేశ్ ఏర్పడడానికి మార్గాన్ని సుగమం చేసింది. ఈ విధంగా ఈ ప్రాంతంలోని జాతీయోద్యమం మరొక లక్ష్యాన్ని పాటించగల్గింది. రైతులు కొన్ని ప్రయోజనాలు సాధించగలిగారు. వెట్టిచాకిరి పునరుద్ధరించబడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం 1949లో జాగీర్‌దారీ విధానాన్ని (సరియైన నష్టం పరిహారం యిచ్చినప్పటికి) రద్దు చేయవలసివచ్చింది. కనీసం సూత్రరీత్యానైనా భూగరిష్ఠ పరిమితిని ఆమోదించవలసి వచ్చింది. వినోబాభావే భూదానోద్యమం కూడా నల్గొండ నుండి ప్రారంభమవడం ఈ సందర్భంగా గమనించవలసిన అంశం. 1950 దశాబ్దం మధ్య నుండి పాక్షిక ప్రయోజనాలు ఆంధ్రలోని సంపన్న రైతుల్ని రాజకీయంగా కులీన ధోరణులవైపు మొగ్గేలా చేశాయి.

## 1947 స్వతంత్రం- విభజన

సామాజికంగా సమూలమైన మార్పులు కోరే ఉద్యమాలకు తలమానికమైన తెలంగాణా ఉద్యమం సంఘటితమైన సమర్థవంతమైన రాజకీయ ప్రత్యామ్నాయం గల దేశవ్యాప్త ఉద్యమాలను ఐక్యం చేయలేకపోయింది. కాని ఆ ఉద్యమాలు కలిగించిన భయాందోళనలు - విభజన, మతమారణ కాండని మూల్యాలుగా చెల్లించి శాంతియుతంగా అధికారమార్పిడి కొరకు జరిగిన రాజీబేరానికి తోడ్పడ్డాయి. సీనియర్ ఉన్నతాధికార ఉద్యోగిగా, 1947-48లో పటేల్‌కి విశ్వాస పాత్రుడిగా, వేవల్‌కి ఆ తరువాత మౌంట్‌బాటెన్‌కి నమ్మకమైన సలహాదారుడిగా కీలకపాత్ర నిర్వహించిన వి.పి. మీనన్ 1947 సంవత్సర ప్రారంభంలో పైకెగసిన సమ్మె వెల్లువ సందర్భంగా వైస్రాయికి యిలా రిపోర్టు చేశారు. "కాంగ్రెస్ నాయకులు ప్రజాదరణ కోల్పోయన్నారు. కాంగ్రెస్‌లో తీవ్రమైన అంతర్గత సమస్యలున్నాయి. కాంగ్రెస్‌లోని వామపక్షాన్ని చూసి కాంగ్రెస్ భయపడుతుంది. కార్మిక సమస్యల ప్రమాదం చాలా తీవ్రంగా వుంది." ఒక వారం తరువాత వేవల్స్ జర్నల్ కమ్యూనిస్టు ప్రమాదాన్ని గురించి పటేల్‌తో జరిపిన సంభాషణని ప్రచురించింది. "అతడు కమ్యూనిస్టు పార్టీని చట్ట విరుద్ధమైనదిగా ప్రకటిస్తాడనే అభిప్రాయం కలిగింది."- స్వతంత్రం సాధించిన కొద్ది నెలలో హోం మినిష్టర్ ఈ ఆకాంక్షని నెరవేర్చాడు (వైస్రాయి జర్నల్ 1947 జనవరి పేజీలు 408,411). 1947 ఫిబ్రవరిలో రాజ్యాంగ పరిషత్తులో చేరి మంత్రివర్గ పని విధానంలో సహకరించేందుకు లీగు తిరస్కారం, లీగుకి చెందిన మంత్రుల రాజీనామాకై కాంగ్రెస్ డిమాండు, డిమాండ్ ఆమోదించబడకపోతే తమ మంత్రుల రాజీనామా

బెదిరింపు–లాంటి హెచ్చరికల కారణంగా బ్రిటిష ప్రభుత్వం తక్షణమే నాటకీయంగా ముందుకు వచ్చింది. అధికార మార్పిడికి తుది గడువు 1948 జూన్‌గా నిర్ధారిస్తూ అట్లీ ఫిబ్రవరి 21 కామన్స్ సభలో ప్రఖ్యాత ప్రసంగం చేశారు. రాజ్యాంగంపై భారత దేశ రాజకీయ నాయకులు అంగీకారానికి రాకపోయినప్పటికి బ్రిటిషిండియాకి కేంద్ర ప్రభుత్వాన్ని మొత్తంగా ఏదో ఒక రూపంలో యివ్వడంగాని లేక కొన్ని ప్రాంతాలలో అప్పటికి వున్న రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పజెప్పడం ద్వారాగాని, భారత ప్రజల ప్రయోజనాల దృష్ట్యా హేతుబద్ధమైన మరొక విధంగా గాని బ్రిటిషువారు రాజకీయాధికారాన్ని పరిత్యజిస్తారు. బ్రిటిషువారి అధికారాలు, స్వదేశీ సంస్థానాల పట్ల గల బాధ్యతలు అధికార మార్పిడితో అంతమవుతాయి. విభజన సూచన చాలా రాజ్యాలుగా విడగొట్టే సూచన చాలా స్పష్టంగా చేయబడింది. కాంగ్రెస్ మరొక ప్రజా ఉద్యమం చేపట్టడం తప్ప ప్రత్యామ్నాయంలేని పరిస్థితులలో, మత ఘర్షణల కారణంగా ఉద్యమం చేపట్టడం చాలా కష్టమైన పరిస్థితులలో నిర్దిష్టమైన తేదీకి అదీ చాలా దగ్గరలో వున్న తేదీ నాటికి పూర్తి అధికార మార్పిడి ఎర తిరస్కరించడానికి వీలుపడనంత ఆకర్షణీయంగా వుంది. వేవల్ స్థానంలో మౌంటు బాటెన్‌ని నియమిస్తున్నట్లుగా బ్రిటిష ప్రధాన మంత్రి ప్రకటించారు.

## మౌంట్‌బాటన్ పథకం

మౌంట్‌బాటన్ గొప్ప రాజనీతిజ్ఞుడుగా రాజకుటుంబానికి బంధువుగా, మిలిటరీ ముక్కుసూటి తనంతో తనదైన వ్యక్తిత్వం ఎత్తుగడలతో అత్యంత తక్కువ వ్యవధిలో ఉపఖండం సమస్యల్ని పరిష్కరించిన వాడుగా విపరీతమైన ప్రచారం లభించింది. ఇందులో చాలా అతిశయోక్తి వుంది. అతడు వేవల్ లాంటి యితర వైస్రాయిల కంటే త్వరగా నిర్ణయాలు చేయగలిగాడంటే అందుకు కారణం అతడికి బ్రిటిష ప్రభుత్వం ఇతర వైస్రాయిల కంటె ఎక్కువ అధికారాలు యివ్వడం. దీని వెనుక వీలైనంత త్వరలో భారతదేశాన్ని వదలి వెళ్ళాలని బ్రిటిష ప్రభుత్వం చేసిన నిర్ణయం వుంది. కామన్స్ సభలో అట్లీ ప్రకటనపై జరిగిన చర్యలు పాల్గొని క్రిప్స్ ప్రసంగిస్తూ ప్రత్యామ్నాయంగా భారతదేశంలో పెద్ద సంఖ్యలో సైనిక బలగాలను దించి సంవత్సరాల తరబడి అణచివేత చర్యలు చేపట్టవలసి వుంటుందని, 'అందుకు ఈ దేశ (బ్రిటన్) ప్రజలు అంగీకరించరని మనకు తెలుసు. అంతేగాక జాతీయ అంతర్జాతీయ దృష్టికోణం నుండి చూసినా రాజకీయంగా అది అసాధ్యం. భారత దేశంలో వున్న అన్ని పార్టీలు చాలా తీవ్రంగా వ్యతిరేకిస్తాయి' (వి.పి.మీనన్ భారత దేశంలో అధికార మార్పిడి పేజి 346).

వేవల్ తన 1946 సెప్టెంబరు పథకంలో 1948 మార్చి 31 నాటికి పూర్తిగా వైదొలగాలని సూచించాడు. (వైస్రాయి జర్నల్ పేజి 344). 'విభజనతో స్వతంత్రం' సూత్రం మౌంటుబాటన్ బాధ్యతలు స్వీకరించకముందే ఆమోదం పొందింది. అంతేగాక నూతన రాజకీయ నిర్మాణాలపై రాజ్యాంగ పరిషత్ ఆమోదం పొందే అవసరాన్ని నివారిస్తూ, అధినివేశ ప్రతిపత్తి ప్రాతిపదికన తక్షణ అధికార మార్పిడి జరగాలని సూచించింది కూడా మౌంటుబాటన్ కాదు. 1947 జనవరిలో వి.పి.మీనన్ రాజ్య కార్యదర్శికి సూచించారు. అధినివేశ ప్రతిపత్తి శాంతియుతంగా త్వరగా అధికార మార్పిడికి తోడ్పడుతుంది. భారతదేశానికి అనుకూలంగా

బ్రిటన్‌లో పలుకుబడిగల మిత్రుల్ని కూడగడుతుంది. ఉన్నతాధికార వర్గంలో సైన్యంలో ఒక విధమైన కొనసాగింపుని అనుమతిస్తుంది. (మీనన్ పేజీలు 363–4) కాని అధినివేశ ప్రతిపత్తిని అంగీకరించడం అంటే 1929 లాహోరు తీర్మానం నుండి వెనుకంజ వేయడమైనప్పటికి పైన చెప్పిన కారణాల రీత్యా పటేల్ ప్రైవేటు సంభాషణలలో అంగీకరించారు. అధికార మార్పిడిని వేగవంతంగా జరిపించడంలో మౌంటుబాటన్ పాత్ర వుంది. కాని త్వరగా జరిపించడం వలన విభజన వివరాల రూపకల్పనలో చాలా తప్పులు జరిగాయి. పంజాబు హత్యాకాండని నివారించడంలో పూర్తిగా విఫలమయింది. మొత్తం మీద 'భారత వలయాల నుండి మనం వైదొలగిన పద్ధతి ప్రయోజన శూన్యంగా వుంది. పెండెరెల్ మూన్ వ్యాఖ్య ఆమోదయోగ్యగా కనిపిస్తుంది. (డివైడ్ అండ్ క్విట్ పేజీ 283).

మార్చి 24 మే 6 మధ్య కాలంలో వివిధ రాజకీయ నాయకులతో త్వరత్వరగా 133 ఇంటర్వ్యూలు జరిపి మౌంటు బాటన్ మంత్రివర్గ రాయబార సంఘం పథకం ఆమోదయోగ్యం కాదని 'ప్లాన్ బాల్కన్' పేరుతో కొత్త పథకాన్ని రూపొందించాడు. ఈ పథకం ప్రకారం అధికారం ప్రత్యేక ప్రావిన్సులకు (అప్పటికే ఏర్పడి ఉంటే సమాఖ్యకి) బదిలీ చేయబడుతుంది. బెంగాల్, పంజాబ్ అసెంబ్లీలకు విభజన కొరకు ఓటు చేసే హక్కు యివ్వబడుతుంది. ఆ విధంగా ఏర్పడిన యూనిట్లు, స్వదేశీ సంస్థానాలు సార్వభౌమాధికారం రద్దయిన వెంటనే స్వతంత్రం పొందుతాయి. అవి భారత దేశంలో కలవవచ్చు లేక పాకిస్తాన్‌లో కలవవచ్చు. లేక దేనిలో చేరకుండా ప్రత్యేకంగా వుండవచ్చు. ఈ పథకాన్ని గురించి నెహ్రూతో మౌంటుబాటన్ ప్రైవేటు సంభాషణలో తెలియజేసినప్పుడు నెహ్రూ తీవ్రంగా వ్యతిరేకించారు. పథకం త్రోసిపుచ్చబడింది. దీనికి బదులుగా అధినివేశ ప్రతిపత్తి ప్రాతిపదికన రెండు కేంద్ర ప్రభుత్వాలకు ఇండియా పాకిస్తాన్‌లకు అధికారాన్ని బదిలీచేయాలన్న వి.పి.మీనన్, పటేల్ సూచన స్వీకరించబడింది. ఈ ప్రతిపాదన జూన్ 2న కాంగ్రెస్, లీగు సిక్కు నాయకుల ఆమోదం పొందింది. మరుసటి రోజు జూన్ 2న ప్రకటించబడింది. ఇది భారత స్వాతంత్ర్య చట్టానికి ప్రాతిపదిక అయింది. జూలై 18న బ్రిటిషు పార్లమెంటుచేత బ్రిటిషు సింహాసనం చేత ధ్రువపరచబడింది. ఆగస్టు 15న అమలు పరచబడింది. మొదటి పథకాన్ని నెహ్రూకి చూపించినందుకు మౌంటుబాటన్‌కి ఆయన అభిమానులకు ప్రశంసలు లభించాయి. బ్రిటిషు అధికారులు చాలా వారాలుగా పని చేసి రూపొందించిన పథకం నెహ్రూ వ్యతిరేకత కారణంగా త్రోసిపుచ్చడం అనేది చారిత్రిక ప్రాధాన్యతగల అంశం. ఇది కాంగ్రెస్ యొక్క అంతర్గత బలాన్ని తెలియజేస్తుంది. కాని శాంతియుతంగా త్వరగా అధికారాన్ని పొందాలనే ఆకాంక్ష కారణంగా కాంగ్రెస్ నాయకులు ఈ బలాన్ని ఉపయోగించుకోవడంలో విఫలమయ్యారు. భారతదేశాన్ని ముక్కలు చెక్కలుగా చిన్న రాజ్యాలుగా విడగొట్టి ఉత్తర ఐర్లాండు లాంటి సమస్యని సృష్టించేందుకు సామ్రాజ్యవాదులు వేసిన పథకాన్ని నెహ్రూ సరిగా పసిగట్టగలిగారు. బెంగాల్‌లో లీగ్‌కు చెందిన చాలా మంది దూరాన గల పంజాబ్‌చే పాలింపబడడానికి సుముఖంగా లేరు. సుహ్రావర్దీ, అబుల్ హసీంలు ఐక్య స్వతంత్ర బెంగాల్ పథకంతో ముందుకు వచ్చారు. దీనిని పరిశీలించేందుకు శరత్‌బోస్ లాంటి కాంగ్రెస్ నాయకులు సన్నద్ధమయ్యారు. (ముస్లిం మెజార్టీ

రాష్ట్రం అవుతుంది. గనుక హిందూ మతవాదుల నుండి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైనప్పటికి). వాయవ్య సరిహద్దు రాష్ట్రంలో స్వతంత్ర పఠాన్ రాజ్యం డిమాండు ముందుకి వచ్చింది. అబ్దుల్ గఫార్ నాయకత్వంలోని స్థానిక కాంగ్రెస్ నాయకత్వం రాష్ట్రాన్ని పాకిస్తాన్‌లో కలిపే లీగు ప్రయత్నాన్ని ఈ నినాదం అడ్డుకొంటుందని భావించబడింది. హిందూ మెజార్టీ రాష్ట్రాలలో ముస్లిం వ్యతిరేక దొమ్మీలు భారత జాతీయవాదంతో మమేకమయ్యే పాతభావాల్ని బలహీనపరచాయి. జూన్ 3 పథకం రాష్ట్ర అసెంబ్లీలు ఇండియా పాకిస్తాన్‌లలో ఒకదాన్ని ఎంపిక చేసుకోవాలని నిర్బంధించడం ద్వారా ఈ పరిణామాల్ని అడ్డుకొన్నది. 1920 ల నుండి జాతీయోద్యమాన్ని నిరంతరాయంగా బలపరచిన పఠాన్లను 1947లో కాంగ్రెస్ నాయకత్వం వంచిందని చెప్పక తప్పదు. అప్పుడున్న వాయవ్య సరిహద్దు రాష్ట్ర అసెంబ్లీలో కాంగ్రెస్‌కి మెజార్టీ వున్నప్పటికి, రాజ్యాంగ పరిషత్తులో చేరడానికి అనుకూలంగా ఓటువేసినప్పటికి ప్లెబిసైట్ ద్వారా బలవంతంగా రుద్దబడింది. కాంగ్రెస్ అధిష్టానవర్గం నిరసన తెలియజేసింది గాని గట్టిగా పట్టుపట్టలేదు. (ప్లాను బాల్కన్‌పై నెహ్రూ పట్టుపట్టినట్లు) అలాగే సార్వత్రిక ఓటింగు ద్వారా నిర్ణయం జరగాలని ఒత్తిడి చేయలేదు. లేక స్వతంత్ర ఫక్తూనిస్తాన్ ఎంపిక చేసుకునే అవకాశం ఓటర్లకు కల్పించాలని ఒత్తిడి చేయలేదు. అందుకు నిరసనగా వాయవ్య సరిహద్దు రాష్ట్ర కాంగ్రెస్ ప్లెబిసైట్‌ని బహిష్కరించాలని నిర్ణయించింది. పరిమితంగా ఓటుహక్కు అనగా 572,798 (రాష్ట్రంలోని ప్రజలలో 9.52% ప్రజల నిర్ణయంతో) మందికి గల ఓట్లలో 50.99% ఓట్లతో వాయవ్య సరిహద్దు రాష్ట్రం పాకిస్తాన్‌కి దక్కింది. కాంగ్రెస్ నాయకత్వం తనను తన ఉద్యమాన్ని తోడేళ్ల ముందుకు తోసిందని సరిహద్దు గాంధీ ఆందోళన చెందాడు.

## స్వదేశీ సంస్థానాల విలీనం

బ్రిటిషు సార్వభౌమాధికారం రద్దవడంతో స్వదేశీ సంస్థానాల భవిష్యత్తు ఏమిటి? అనేది కీలక సమస్య అయింది. అత్యాశగల పాలకులు లేక వారి దివానులు (హైదరాబాద్, భోపాల్, తిరువాన్కూరు లాంటి) వారి నిరంకుశత్వాన్ని నిలబెట్టే స్వతంత్రని గురించి కలలుగనడం ప్రారంభించారు. అలాంటి ఆశలకు మౌంటుబాటన్ విధానాల్ని అమలు జరిపేవరకు భారత ప్రభుత్వ రాజకీయ విభాగం నుండి గణనీయమైన ప్రోత్సాహం లభించింది. ఈ లోపం స్వదేశీ సంస్థానాల ప్రజా ఉద్యమం వెల్లువ 1946-47లో ప్రారంభమయింది. ప్రతిచోట రాజకీయ హక్కులు. రాజ్యాంగ పరిషత్తులో ఎన్నికైన ప్రజా ప్రతినిధుల ప్రాతినిధ్యాన్ని డిమాండు చేశారు. సంస్థానాల నుండి ఎన్నికయ్యే సభ్యులకు అవకాశం కల్పించనందుకు మంత్రివర్గ రాయబార సంఘాల్ని కాంగ్రెస్ విమర్శించింది. ఉదయపూర్ గ్వాలియర్ అఖిల భారత సంస్థాన ప్రజా సదస్సులు (1945 డిసెంబర్, 1947 ఏప్రిల్, నెహ్రూ అధ్యక్షతన జరిగాయి. రాజ్యాంగ పరిషత్తులో చేరనిరాకరించే సంస్థానాలు ప్రతికూలమైనవిగా భావించబడతాయని నెహ్రూ గ్వాలియర్ సదస్సులో ప్రకటించాడు. కాని ఉపన్యాసాల్ని బెదిరింపుల్ని అలావుంచితే కాంగ్రెస్ నాయకత్వం- యింకా స్పష్టంగా చెప్పాలంటే రాజకీయ విభాగానికి బదులుగా సంస్థానాల బాధ్యతని 1947 జూలైలో చేపట్టిన పటేల్, కార్యదర్శి వి.పి.మీనన్ అనుసరించిన విధానాలు

పార్టీ విధానాలయ్యాయి. సంస్థానాధీశుల నుండి రాయితీల్ని రాబట్టడానికి ప్రజా ఉద్యమాల్ని సాధనంగా ఉపయోగించుకొనడం, అదే సమయంలో వాటిని తమ అధీనంలో వుంచుకొనడం విధానమయింది. (అవసరమైతే హైదరాబాద్‌లో లాగా బలప్రయోగం చేయడం) ఈ విధానం 1946లో కాశ్మీరులో అనుసరించబడింది. ముస్లిం మెజార్టీ గల సంస్థానంలో హిందూ మహారాజా యొక్క నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా 'క్విట్ కాశ్మీర్' ఉద్యమానికి నాయకత్వం వహించిన షేక్ అబ్దుల్లా అరెస్టు చేయబడ్డాడు. తొలుత కాశ్మీరు నాయకునికి మద్దతు యిచ్చేందుకు నెహ్రూ వెళ్లాడు. సంస్థానంలో తన ప్రవేశంపై వున్న నిషేధాన్ని అతిక్రమించినందుకు జూన్ 20న నెహ్రూ అరెస్టు చేయబడ్డాడు. నెహ్రూ తన సలహాని అతిక్రమించాడని పటేల్ వేవల్‌కి చెప్పుకొన్నాడు. (పటేల్‌తో వేవల్ ఇంటర్వ్యూ 1946 జూన్ 27, మాన్సెర్గ్ వాల్యూం- 7 పేజీలు 1068-9). వెంటనే కాశ్మీరు ప్రధాన మంత్రి కాక్‌తో చర్చలు ప్రారంభించాడు. చర్చలు 1947 అక్టోబరులో పాకిస్తాన్ సైనికులు సంస్థానంపై దాడిచేసిన తరువాత మహారాజా భారత దేశంలో విలీనమవడంగా పరిణమించాయి. 'ఇది సంస్థానాల పట్ల ప్రభుత్వ వైఖరిని మార్చుతుంది'- కొత్త సంస్థానాల డిపార్టుమెంటు నిర్వహణకు పటేల్, మీనన్‌ల నియామకాన్ని గురించి వినగానే భోపాల్‌నవాబు ప్రకటించాడు. 1947 జూలై 5న పటేల్ సంస్థానాధీశులకు యిలా హామీ యిచ్చారు. "స్వదేశీ సంస్థానాల వ్యవస్థకు కాంగ్రెస్ శత్రువు కాదు. అంతేగాక సంస్థానాధీశుల యొక్క వారి పాలనలో వున్న ప్రజలయొక్క అభివృద్ధిని సంతృప్తిని సంతోషాన్ని కోరుకుంటుంది' (వి.పి.మీనన్ ది స్టోరీ ఆఫ్ ది ఇంటిగ్రేషన్ ఆఫ్ ది ఇండియన్ స్టేట్స్ పేజి 96).

ఎరలు, ప్రజల ఒత్తిడి భయాన్ని కలిగలిపి భారత సంస్థానాల విలీనం సాధించబడింది. 1947 ఆగస్టు 15 నాటికి కాశ్మీరు, జూనాగడ్, హైదరాబాద్ మినహా అన్ని సంస్థానాలు భారత దేశంలో (బావల్పూర్ లాంటిని పాకిస్తాన్‌లో) విలీనాన్ని అంగీకరించి సంతకాలు చేశాయి. రక్షణ, విదేశీ వ్యవహారాలు, కమ్యూనికేషన్స్ కేంద్రం అధీనంలో వుండడాన్ని ఆమోదించాయి. గతంలో కూడా వారి అధీనంలో లేని వాటిని వదులుకోవడానికి సంస్థానాధీశులు సులభంగా అంగీకరించారు. (ఈ మూడు అంశాలు యిప్పటి వరకు బ్రిటిషు సార్వభౌమాధికారంలో వున్నాయి.) అంతర్గత రాజకీయ నిర్మాణంలో ఎలాంటి మార్పు లేదు. సంస్థానాలలోని అంతర్గత రాజ్యాంగ మార్పుల్ని కొంతకాలంపాటు సంస్థానాలకే (హైదరాబాద్ మైసూరు, తిరువానూరు, కొచ్చిన్) పరిమితం చేయడంతోపాటు సంస్థానాల్ని పొరుగు ప్రావిన్సులతో లేక కథియవాడ్ వింధ్య మధ్యప్రదేశ్ రాజస్థాన్ లేక హిమాచల్‌ప్రదేశ్ లాంటి కొత్త యూనిట్లతో విలీనం చేసే క్లిష్టమైన క్రమం దాదాపు సంవత్సరకాలంలో సాధించబడింది. సంస్థానాధీశులు ఉదారమైన రాజభరణాలతో ప్రలోభపెట్టబడ్డారు. కొందరు గవర్నర్లు రాజప్రముఖులు చేయబడ్డారు. భారతదేశ ఏకీకరణ సర్దార్‌పటేల్ సాధించిన విజయం. కాని యిక్కడ ప్రజల ఒత్తిడి గణనీయమైన పాత్ర వహించిందనే వాస్తవాన్ని విస్మరించరాదు. ఆ విధంగా విలీనంపట్ల అనంగీకారం తెలిపిన సంస్థానాధీశులచే 1947 డిసెంబరులో ఏర్పాటు చేయబడిన తూర్పు సంస్థానాల యూనియన్ నీలగిరి, ధేన్‌కనాల్, తాల్చేర్ లాంటి ఒరిస్సా సంస్థానాలలో చేలరేగిన శక్తివంతమైన ప్రజామండల్

(అలాగే కొన్ని తెగల) ఆందోళనలతో కుప్పకూలింది. పాకిస్తాన్‌లో చేరేందుకు యత్నించిన కథియవాడ్‌లోని ముస్లింపాలకుడిని ప్రజాందోళన పోలీసు చర్యని కలగలిపి లొంగదీయడం జరిగింది. 1930 దశాబ్దం చివరి నుండి మైసూరులో బలంగా వున్న కాంగ్రెస్ 1947 సెప్టెంబరులో 'మైసూరు ఛలో' ఆందోళన చేపట్టి అక్టోబరు 12 నాటికి ప్రజాస్వామ్య దిశలో గణనీయమైన మార్పులు తీసుకొని రాగల్గింది. అమెరికా నమూనా ద్వారా నిరవధికంగా అధికారం చెలాయించాలని కలలుగన్న దివాన్ పి. రామస్వామికి వి.పి.మీనన్ కమ్యూనిస్టు ప్రమాదాన్ని చూపి లొంగదీశాడు. ఇక తెలంగాణా సాయుధ పోరాటం నిజాంని బలహీనపరచింది. మిలిటరీ జోక్యానికి అవకాశం కల్పించింది. "..... మన మొదటి కర్తవ్యం రజాకార్లని నిర్బంధించడం..... తరువాతది, ప్రాధాన్యతలో కాకపోయినా, అన్నిటినీ ఒకేసారి ప్రయత్నించలేము గనుక, కమ్యూనిస్టుల్ని అదుపులోకి తెచ్చుకొని నిర్మూలించడం" (వి.పి.మీనన్, మిలటరీ గవర్నర్ జె.యన్. చౌదరితో సంభాషణ, ది స్టోరీ ఆఫ్ ది ఇంటిగ్రేషన్ ఆఫ్ ఇండియన్ స్టేట్స్ పేజి 362)

బెంగాలు హిందువుల, పంజాబు హిందువుల సిక్కుల రాజకీయ నాయకులు విభజనని చాలా పట్టుదలతో సమర్థించడంతో బ్రిటిషు పాలనలోని చివరి రెండున్నర మాసాల కాలం మౌంట్‌బాటన్ పథకంలోని వివిధ అంశాలకు వేగంగా అమలు జరపడంలో నిమగ్నమైంది. ఈ కాలంలోనే తీవ్రమైన హత్యాకాండకి రంగం సిద్ధమయింది. (ప్రెండెరెల్ మూన్ పేజి 70). ప్రత్యేక సమావేశాలు జరుపుకునే హక్కు యివ్వబడిన పంజాబు బెంగాలు అసెంబ్లీలలోని మైనార్టీ సభ్యులు ఊహించిన విధంగానే విభజనకి అనుకూలంగా ఓటు చేశారు. సింధు అసెంబ్లీ పాకిస్తాన్‌ని ఎంపిక చేసుకున్నది. అస్సాంలోని ముస్లిం మెజార్టీ సిల్హెట్ జిల్లాలోని ప్లెబిసైటు (అప్పటికి వున్న పరిమితమైన ఓటింగు హక్కుతో) లీగుకు అనుకూలంగా వున్నది. భారతీయ పరిస్థితులు భౌగోళిక పరిసరాలు తెలియని బ్రిటిషు లాయరు (రాడ్ క్లిఫ్) ఆధ్వర్యంలోని రెండు కమిషన్లచే హడావిడిగా అతివేగంగా సరిహద్దురేఖలు గీయబడ్డాయి. ఆర్థిక వ్యూహాత్మక పరిగణల్ని మతంతో కలగలిపే ప్రయత్నం చాలా విపరీతాలకు కారణమైంది. పంజాబులోని గురుదాస్‌పూర్ బెంగాలులోని ముర్షిదాబాద్ నాడియాలు (కలకత్తా కూడా) కోల్పోవడాన్ని ముస్లింలు నిరసించారు. లాహోరు కనాల్ కాలనీలు ఖుల్నా చిటగాంగ్ పర్వత ప్రాంతాల విషయంలో హిందువులు సిక్కులు నిరసించారు. అధికారం కొరకు తీస్తున్న పరుగులో కాంగ్రెస్ లీగులు తలమునకలై వుండడంతో నిరసనలు అర్ధమనస్కతతో సాగాయి. నూతన భారతదేశ అధినివేశ రాజ్యానికి గవర్నరు జనరల్‌గా పనిచేయాలని కాంగ్రెస్ చేసిన విజ్ఞప్తిని మౌంట్‌బాటన్ అంగీకరించారు.

### ఆగస్టు 15

భారత ఉపఖండానికి స్వతంత్రం వచ్చింది. స్వతంత్రపోరాట యోధుల కలల మేరకు చాలా మందికి స్వతంత్ర ఫలాలు అందలేదు. భారత దేశంలోని చాలా మంది ముస్లింలకు అలాగే పాకిస్తాన్‌లోని హిందువులకు స్వతంత్రం అంటే ఆకస్మిక హింసా బెదిరింపుకి, ఉపాధి

ఆర్థిక అవకాశాలు పొందడానికి మధ్య బాధాకరమైన ఎంపిక అయింది. దీనికి సంబంధించిన వివిధ మానవ విషాదఘటనలు బలరాజ్ సహానీ చివరి చిత్రమైన 'గరం హవా'లో మనసుల్ని కదలించే విధంగా చిత్రించబడ్డాయి. మరొకవైపు పట్టణాలలోని గ్రామాలలోని సంపన్న గ్రూపులు స్వతంత్ర సాధనని సమూలమైన సామాజిక మార్పుల నుండి విజయవంతంగా విడగొట్టగలిగారు. ఫలితంగా సామ్రాజ్యవాదం తెచ్చిపెట్టిన ఆర్థిక సామాజిక వైరుధ్యాలు పరిష్కరింపబడలేదు. బ్రిటిషువారు వెళ్లిపోయారు. కాని వారు సృష్టించిన ఉన్నతాధికారవర్గం, పోలీసులు అరకొరమార్పులతో కొనసాగారు. వారి నిర్దాక్షిణ్యం అణచివేతలు (కొన్ని సందర్భాలలో ఇంకా తీక్షణంగా) కొనసాగాయి. మహాత్ముని జీవితం చివరి నెలల్లో ఆయన అనుభవించిన ఒంటరితనం క్షోభ కేవలం మతకలహాల వలన మాత్రమే కాదు. హత్య జరగడానికి ముందు '7 లక్షల గ్రామాల్ని దృష్టిలో పెట్టుకుంటే యింకా దేశం సామాజిక నైతిక ఆర్థిక స్వతంత్రం సాధించవలసే వుందని' హెచ్చరించారు. కాంగ్రెస్ 'లంచగొండి తనానికి దారితీసే పట్టణాల్ని సృష్టించింది..... సంస్థలు పేరుకి మాత్రమే ప్రజాస్వామ్యబద్ధమైనవి. అందువలన ఒక రాజకీయ పార్టీగా కాంగ్రెస్‌ని రద్దు చేయాలి. దాని స్థానంలో అంకితభావం ఆత్మత్యాగం గల నిర్మాణాత్మకమైన గ్రామీణ కార్యకర్తలతో లోక్‌సేవక్ సంఘాన్ని స్థాపించాలి'. (యన్.కె.బోస్, మై డేస్ విత్ గాంధీ, కలకత్తా 1953 పేజీలు 305,307). నిబద్ధతగల వామపక్షవాదులలో చాలా మందికి స్వతంత్రం దాదాపు అపహాస్యంగా కన్పించింది. "యుద్ధ నౌకలు (రాయల్ ఇండియన్ నేవీ యొక్క) నౌకాశ్రయంలో నిశ్చలంగా వున్నాయి. మోసంతో నిరాయుధం చేయబడ్డాయి. నౌఖాలీ, బీహారు గర్ముక్తేశ్వర్‌లలో హిందువులు ముస్లింలు చచ్చిన తరువాతనే శాంతి పొందగలరు". ఇంకా ' యువకుల ఆవేశాలు వయస్సు మళ్లిన వారికి పదవీలాలస అయింది.– దేశ భక్తులు అధికార దాహం గల రాజకీయ నాయకులుగా మార్పు చెందడంపై చేసిన సముచిత వ్యాఖ్య (సమర్‌సేన్ యొక్క చివరి రెండు కవితల నుండి)

అయినప్పటికి ఉపఖండంలోని లక్షలాది ప్రజలు సంబరాలు జరుపుకొన్నారు. ఆగస్టు 15 అర్థరాత్రి నెహ్రూ ఉపన్యాసం విని ఉద్రేకభరితులయ్యారు. అప్పటికి చిన్న పిల్లలుగా వున్న వారికి కూడా అది మరపురాని అనుభవం. 1948–51 కాలంలో కమ్యూనిస్టులు జీవితాల్ని పణంగా పెట్టి నేర్చుకొన్న ' యే అజాది జూఠాహై (ఈ స్వతంత్రం ఒక ఫార్సు)' నినాదం ఎవరి హృదయాలను తాకలేదు. భారత స్వతంత్రం వలస రాజ్యాధికార వ్యవస్థ రద్దయిన క్రమానికి ప్రారంభం. కనీసం రాజకీయ స్వతంత్రానికి సంబంధించినంత వరకు ఈ క్రమం అడ్డుకొనడానికి సాధ్యపడింది. బ్రిటన్ లేక అమెరికా కీలుబొమ్మగా గాక నెహ్రూ నాయకత్వంలో భారతదేశం అలీన విధానం సోషలిస్టు దేశాలతో ఆవిర్భవిస్తున్న మూడవ ప్రపంచంతో స్నేహం ప్రాతి పదికన స్వతంత్ర విదేశాంగ విధానం అభివృద్ధి చేసుకొన్నది. 1950 జనవరిలో విస్తృతమైన ప్రజాస్వామ్యబద్ధమైన రాజ్యాంగాన్ని (చాలా పరిమితులున్నప్పటికి) ప్రకటించుకొన్నది. చివరివరకు సార్వత్రిక ఓటింగు హక్కుని దాటవేసిన బ్రిటిషిండియా సంస్థలతో పోల్చితే సార్వత్రిక ఓటింగు హక్కు కల్పించడం పెద్ద ముందుడుగుగా చెప్పుకోవాలి. రాజుల్ని జమీందారుల్ని క్రమంగా వదిలించుకొనడం జరిగింది. భూగరిష్ఠ పరిమితి (సరిగా అమలు జరపనప్పటికి)

విధించబడింది. 1956లో భాషల ప్రాతిపదికన రాష్ట్రాల పునర్విభజన సాధించబడింది. పబ్లిక్ సెక్టారులో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి ద్వారా మౌలిక పరిశ్రమలు స్థాపించబడ్డాయి. మొదటి అర్థ శతాబ్దంపాటు స్తబ్ధతగా వున్న ఆహారధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. 1947 ఆగస్టు కారణంగా ఈ అభివృద్ధి దానంతట అది జరగలేదు. అత్యధికభాగం తీవ్రమైన ప్రజాపోరాటాల ద్వారా సాధించబడింది. కాని స్వతంత్ర సాధన అందుకు ముందు షరతుగా పని చేసింది. వైరుధ్యాలు గతంలో కంటె యింకా స్పష్టంగా వ్యక్తమవుతున్నాయి. ఈ వైరుధ్యాలకు మూలాలు పెట్టుబడిదారీ పంథాలో అభివృద్ధి చెందాలని చేసుకున్న ఎంపికలో వున్నాయి. ఈ పంథాని స్వతంత్ర ఉద్యమంలో ఆధిపత్యం సాధించిన గ్రూపులు నిర్ణయించాయి. స్వతంత్ర ఉద్యమంపై బూర్జువావర్గం నాయకత్వాన్ని సాధించి నిలబెట్టుకొనగల్గింది.

మనం యిప్పటి వరకు పరిశీలించిన ఆరు దశాబ్దాల భారతదేశ చరిత్రని – యిప్పటికీ అసంపూర్ణంగా వుండి పోరాటాల ద్వారా మార్పులు జరిగే సంక్లిష్ట విధానంగా పరిగణించగల్గితే– ఈ పరిశీలన అర్థవంతంగాను ఉపయుక్తంగానూ వుంటుంది. 'చరిత్ర–చరిత్ర యొక్క వైరుధ్యాలు' పై బ్రిటిషు సోషలిస్టు రచయిత అభిప్రాయాలు సరియైన పని చేస్తాయి.

"......... ప్రజలు ఎలా పోరాడి ఓడిపోతారో ఆలోచిస్తే, వారు ఓడిపోయినప్పటికి దేనికొరకు పోరాడారో అది లభిస్తే, అది లభించినప్పుడు అది ఊహించిన (కోరుకున్నదాని) కంటే భిన్నంగా వుంటే, యితరులు వారు కోరుకున్నదాని కొరకు మరొకపేరుతో పోరాడవలసి వుంటుంది". (విలియం మోరిస్ ;ఎ డ్రీం ఆఫ్ జాన్ బాల్ 1887).

భారత చరిత్ర గురించి చాలమంది చాల రకాలుగా రాశారు. అత్యధికులు ఈ చరిత్రను సంపన్న వర్గాలు, వారి ప్రాబల్యాలు, వారి మధ్య సంఘర్షణలు- ఇలా వారి చుట్టూనే తిప్పారు. కాని అసలు చరిత్ర నిర్మాతలయిన ప్రజల పాత్రను వివరించిన వారు అరుదు. అలాంటి అరుదైన చరిత్ర రచయితల్లో సుమిత్ సర్కార్ ఒకరు. ఆయన ఈ చరిత్రను సామ్రాజ్యవాద వ్యతిరేకతను కేంద్రంగా చేసుకొని రచించారు. ఈ గ్రంథం విశిష్టత అదొక్కటే కాదు. ఆయన తాను ఈ పుస్తకరచన చేపట్టిన నాటికి ఉన్న అన్ని పరిశోధనా ఫలితాలను, లోతైన తన పరిశోధనలను జోడించి ఒక చక్కటి పాఠ్యగ్రంథం రూపంలో దీనిని మలిచారు. సివిల్స్, ఇతర పోటీపరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు, చరిత్రను సరైన రీతిలో అవగాహన చేసుకోవాలని కోరుకునే జిజ్ఞాసపరులకు ఇది ఎంతో ఉపయోగపడే గ్రంథం.

**సుమిత్ సర్కార్** ఢిల్లీ విశ్వవిద్యాయలంలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. ప్రస్తుత గ్రంథాలతో పాటు 'స్వదేశీ మువ్‌మెంట్ ఇన్ బెంగాల్ **1903-1908**', 'బిబ్లియోగ్రాఫికల్ సర్వే ఆఫ్ సోషల్ రిఫార్మ్ మువ్‌మెంట్స్', 'పాపులర్ మువ్‌మెంట్స్ అండ్ ది మిడిల్‌క్లాస్ లీడర్ షిప్ ఇన్ లేట్ కలోనియల్ ఇండియా', 'ఎ క్రిటిక్ ఆఫ్ కలోనియల్ ఇండియా', 'రైటింగ్ సోషల్ హిస్టరీ' లాంటి పలు గ్రంథాలను రచించారు.

రు. 150/-

ప్రజాశక్తి బుక్‌హౌస్